శ్రీ రామ చరిత్రము
శ్రీ మద్భాగవతము

కుంభకర్ణ్ణి పరాభవము

894.8271
SWA

శ్రీ రామతీర్థ సేవాశ్రమము
విడుగురాల్ల, గుంటూరు జిల్లా, ఆంధ్ర.

CI

A 3

శ్రీరామచరితమానసము

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10,085

★

శ్రీ కేశవతీర్థ స్వామి :

బాలకాండము
అయోధ్యాకాండము
ఆరణ్యకాండము
కిష్కింధాకాండము

శ్రీ పాటీలు తిమ్మారెడ్డి, కిశోర్, ఎం. ఏ. :

సుందరకాండము
లంకాకాండము
ఉత్తరకాండము

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10085

4

894.8271
SWA

AOUA10UB149

శ్రీరామ జయరామ జయజయరామ

తొలిపలుకులు

శ్రీమహామండలేశ్వర్, భాగవతీవ్యాస్, శ్రీరామశరణ్
శ్రీ కుందుర్తి వేంకటనరసయ్యపాకయాజిగారు
సంపాదకుడు — "మోక్షసాధని"
అధ్యక్షుడు — "శ్రీ సీతారామనామ సంకీర్తన సంఘము" (రిజిష్టర్డు) సాధనశాఖ,
శ్రీరామనామక్షేత్రము, గుంటూరు-2.
సంస్థాపకుడు — 'నామప్రయాగ' బుద్దాం, బాపట్లతాలూకా.

శ్రీరామచంద్రుని లీలలనంతములు. శ్రీతులసీ గోస్వామియు నిట్లే చెప్పెను:-"హరిఅనంతహరి కథాఅనంత"హరి యనంతుడు, హరికథ లనంత ములు. ఆ యనంతలీలలు విలక్షణములును, అప్రాకృతములునయ్యుఁ బ్రాకృతములవలె గోచ రించును. ఆ లీలారహస్యము లా సీతాపతికే తెలియవలయును. కొంతవఱ కాతనిభక్తులకుఁ దెలియును. లీలలు తెలిసినంతనే లాభము లేదు. వానినిఁ గీర్తించుట మహదాభాగ్యము. కేవలము వాగ్రూపమునఁ గీర్తించుటయును జాలదు. తా ననుభవించుటయేకాక యితరులకును శ్రీరామ చంద్రుని దివ్యలీలానుభవమును గావింపవలయు నను సదుద్దేశ్యము కలుగుటయు నొక యదృ ష్టము, మహదాభాగ్యము, మహదాశయము నునై యున్నది. అట్టి యుద్దేశ్యముండి యేమి లాభము? దానినిఁ బొమరజనమును జదివి, విని యానందించులాగున రసవత్తరమగు రచనమును జేయఁగలిగి యుండవలయును. ఇవన్నియును శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్య శ్రీ కేశవ తీర్థస్వామివారికి దక్కినవి. అది వారి అదృ ష్టము. ఈరామచరితమానస తెరుఁగుసేతయందు శ్రీ కేశవతీర్థగోస్వామివారికి శ్రీవారి ఆంతరంగిక కోటిలో గణనీయులును, విజ్ఞులును, విద్వాంసు లును, సదయహృదయులును, భక్తిభావసముల్ల సితహృదయారవిందులునగు (శ్రీ)పాటేలు తిమ్మా రెడ్డి(కిశోర్)గారు సుందరాకాండనుండి చివర వఱకును రచించుటద్వారా తోడ్పడి ధన్యులైరి.

శ్రీరామచంద్రుని కథాగానముచేయని కవి లేడనియే చెప్పవచ్చును. భవభూతి చెప్పినట్లది ఆయనగుణదోషమే.

శ్లో॥ నతత్పురాణం నహి యత్ర రామో
యస్యాంనరామో నచ సంహితాసా
స నేతిహాసో నహి యత్ర రామః
కావ్యం నతత్స్యా న్నహి యత్ర రామః॥

రాముఁడులేని పురాణము పురాణము కాదు. రాముఁడులేని సంహిత సంహితకాదు. రాముఁడు లేని యితిహాస మది ఇతిహాసము కాదు. రాముఁడులేనికావ్యము కావ్యము కాదు.

ఆకల్యాణగుణునిఁ జింతింపని వర్ణింపని జన్మ మదియొకజన్మమా? బ్రహ్మయొక్క ఆజ్ఞవలనఁ బ్రచేతసవంశములోని ప్రాచేతసుఁడు సమస్త కల్పములలోని రామచరిత్రమును తన తప శ్శక్తిచేఁ దెలిసికొని శతకోటిప్రవిస్తరముగా

రచించెను. అనఁగా నూఱుకోట్లశ్లోకములతో రచించెను. అది వేదస్వరూపముగ నే యుండెను.

శ్లో॥ వేదవేద్యోపరేపుంసి జాతేదశరథాత్మజే
వేదఃప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా॥

వేదవేద్యుఁడగు నాభగవంతుఁడు దశరథుని కుమారుఁడగు రామచంద్రుఁడుగా నవతరింపఁగా నాతనిఁదెలుపు వేదము సాక్షాద్రామాయణ స్వరూపముగఁ బ్రాచేతసునివలన రచింపఁబడినది.

ఆప్రాచేతసుఁ డారామాయణమును దీసికొని బ్రహ్మకడకుఁబోయెను. అచ్చట నిండుపేరోలగ మున వాణితోఁగూడి బ్రహ్మకూర్చుండియుండెను. ఆతనికి విద్యాహంకారము జనించెను. ఆతఁడు బ్రహ్మను, "ఈమెయెవరు? సమస్తసృష్టినిఁ జేసినది నీవుకదా! ఈమెను సృజించినదెవరు?" అని అడిగెను.

బ్రహ్మ యిట్లనెను :- "ఈమె నాశరీరమునుండి పుట్టినది. నాకర్థాంగి యైనది."

ప్రాచేతసుఁ డిట్లనెను :- "అనఁగా నామె నీతనూజకదా! శరీరమునఁ బుట్టినది తనూజయే కదా!"

బ్రహ్మ యిట్లనెను :- "అట్లుకాదు. శరీరమునఁ బుట్టినది అర్థాంగి. వీర్యమునఁ బుట్టినది తనూజ".

ప్రాచేతసుఁ డిట్లనెను :- "ఏదో సమాధానమును జెప్పి సరిపుచ్చుచున్నావు. కూఁతురిని భార్యగాఁ జేసికొన్నావు. నీవు సత్యలోకవాసివి. అసత్యమునకు నిలయమైనావు. కామకుఁడవు. దొంగవు. మోసగాఁడవు. ఆత్మహంతవు. భ్రష్టుఁడవు. ఉన్నతస్థానముననుండి యును బతనమైనావు." అని అనేకవిధముల దూషించెను.

అప్పుడు బ్రహ్మ 'నీవేవాక్యములను నహంకారముచేఁ బలికితివో అవన్నియును నీవే కావలయును' అని శపించెను. ఆ శాపవశమున నా ప్రాచేతసుఁడు రత్నాకరుఁ డనుపేర భూమిపై జన్మించి వేదశాస్త్రపురాణము లన్నిటిని జదివియు, నొకనాఁడు సమిధలను, దర్భలను గొని తెచ్చుటకై అడవికిఁబోయి శాపవశమున నొక ఆటవిక స్త్రీసాంగత్యమునకులోనై భ్రష్టుఁడై బ్రహ్మ నాతఁడెట్లు దూషించెనో ఆతఁ డావిధముగ నయ్యెను. అట్లు కల్లు ద్రావుచు, హింస నొనర్చుచు, దొంగిలించుచు, మాంసాహారమొనర్చుచు భ్రష్టుఁడై పోఁగా మహర్షుల సాంగత్యమున వారిచే రామనామమును దలక్రిందుగా నుపదేశమును బొంది నిరంతరము జపించుచుండ నాతనిపైఁ బుట్టలు పెరిగెను. కొన్నాళ్లకాతనికి జ్ఞానోదయముకాఁగా నారదుఁడు భగవదవతార సూచనను నాపుట్టలోఁ గేకవైవఁగా దానిలోనుండి దివ్యతేజస్సుతో వచ్చెను. వల్మీకములోనుండి వచ్చినాఁడు కావున నాతఁడు వాల్మీకి అని పిలువఁబడెను.

కొంతకాలమునకుఁ బ్రాచేతసుఁడు రచించిన 100 కోట్ల శ్లోకములను త్రిలోకవాసులు పంచుకొనఁదలఁచిరి. వీనినిఁ బంచుటకు వైరాగ్యవంతుఁడు కావలసివచ్చెను. అప్పు డందఱును శివుని నాశ్రయించిరి. శివుఁడు ఒక్కొక్కలోకమునకు 33 కోట్ల 33 లక్షల 33 వేల 3 వందల 33 శ్లోకములను బంచెను. ఇప్పటికి 99 కోట్ల 99 లక్షల 99 వేల 999 శ్లోకములు పంచఁబడినవి. ఇంకొక్క శ్లోకము మిగిలెను. దానినిఁ గూడ పంచవలసినదే యనిరి. అనుష్టుప్ శ్లోకము

నకు 32 అక్షరములుండును. ముల్లోకములకును మూఁడుదశాక్షరీమంత్రము లొనర్చి పంచెను. ఇంక రెండక్షరములు కలవు. ఆ రెండక్షరములు ముగ్గురకును జాలవు కావున వానినిఁ బంచిన పరమేశ్వరుఁడు గ్రహించెను. అవియే 'రామ' యను రెండక్షరములు. భూలోకమునకు వచ్చిన ३३३३३३३३३३ శ్లోకములను మరల ఋషులు పంచుకొనిరి. అందులో వాల్మీకికి 24000 శ్లోకములు వచ్చెను. వానితో నాతడు రామాయణమును రచించెను. అట్లే యితర ఋషులును వారివారి పేరులతో వారికివచ్చిన శ్లోకసంఖ్యనుబట్టి వారు వారు రామాయణములను రచించిరి. అట్లే వశిష్ఠుఁడు, విశ్వామిత్రుఁడు, అగస్త్యుఁడు, సుతీక్ష్ణుఁడు, వాల్మీకి, యాజ్ఞవల్క్యుఁడు, భరద్వాజుఁడు, కాకభుశుండి, హనుమంతుఁడు మొదలగువా రెందఱో తమతమ పేరులతో రామాయణమును రచించిరి. అవి కల్పభేదము ననుసరించి క్రొత్తక్రొత్త గాథలతోనుండును. శ్రీతులసీగోస్వామివారు యాజ్ఞవల్క్యరామాయణము ననుసరించిరి.

ఆదికవి వాల్మీకిమహర్షి మొట్టమొదటగాఁ గావ్యముగ శ్రీమద్రామాయణమును రచించెను. దానిలో రామచంద్రుని కల్యాణగుణముల నన్నిటిని రసవత్తరముగఁ జిత్రించెను. మానవుఁడు తనకల్యాణగుణములచే భగవంతుఁ డెట్లు కావచ్చునో నిరూపింపఁబడినది. "రామో విగ్రహవాన్ ధర్మః"అని చెప్పఁబడుటచే శ్రీరాముఁడు మూర్తిభవించిన ధర్మస్వరూపుఁడు.

తులసీరామచరితమానసము

శ్రీమద్వాల్మీకి రామాయణ ముండఁగాఁ దులసీరామాయణమేల కావలసి వచ్చినది? తులసీదాసగోస్వామి యెవరు? ఈప్రశ్నలకు సమాధానము సంహితలలోఁ గలదు. శివుఁడు పార్వతికి శ్రీతులసీగోస్వామిని గుఱించి యిట్లు చెప్పెను.

శ్లో॥ వాల్మీకిస్తులసీదాసః కలౌదేవి! భవిష్యతి!
రామచంద్రకథాందివ్యాంభాషారూపాంకరిష్యతి॥

ఓదేవీ! కలియుగమందు వాల్మీకియే తులసీదాసై పుట్టి దివ్యమగు శ్రీరామచంద్రునికథను ప్రాకృత భాషలో వ్రాయఁగలఁడు.

వాల్మీకి లక్ష్మణుని శాపముచేఁ దులసీదాసుగ జన్మించెను. శ్రీరాముని ఆజ్ఞచే లక్ష్మణుఁడు గర్భవతియగు సీతను వాల్మీకాశ్రమప్రాంతారణ్యమున నొంటిగ దిగవిడిచివచ్చెను. ఆమె వాల్మీకిచేఁ గొనిపోఁబడి, పోషింపఁబడుచుండెను. ఆమెకు లవకుశులను నిద్దరుపుత్రు లుదయించిరి. రమారమి పది సంవత్సరము లైనమీఁదట శ్రీరామచంద్రుఁడు లక్ష్మణునితో నిట్లనెను:- "లక్ష్మణా! మీవదినెను నాఁ డడవిలో దిగవిడిచి వచ్చితివికదా! ఆమె వాల్మీకాశ్రమమునఁగాని, మఱెచ్చటనైనఁగాని బ్రతికియున్నదో లేక చచ్చినదో,సంతానమునుగన్నదో లేదో తెలియకున్నది. కావున నీ వొక్కసారి ఆశ్రమప్రాంతమునకుఁ బోయి సర్వవిషయములను గనుఁగొనిరావలయును." అనఁగా లక్ష్మణుఁడు శ్రీరామాజ్ఞను శిరసావహించి వాల్మీకాశ్రమమునకుఁ బోయెను. లక్ష్మణునకు సీతయనిన భయము. సీత తనమనసునకు వచ్చిన విషయమును నిర్మొగమాటముగ ననును. మారీచసంహారసమయమున లక్ష్మణుని నానావిధముల దూషించినదికదా? ఇప్పుడును, ఆడుదానిని, నిండుచూలాలిని, ఒంటరిగా, క్రూరమృగములుండు ఘోరారణ్యమునఁ బ్రొద్దు

క్రుంకువేళ విడిచివెళ్ళితివే. ఇంతటికఠినాత్ముఁడ వేమిలక్ష్మణా!"యని దూషించు నని యాతనికి భయము. అందువలన నొక వెన్నెల రాత్రిని ప్రొద్దుక్రుంకిన మీఁదట వాల్మీకాశ్రమమునకుఁ బోయెను.

రాఁగానే వాల్మీకిమహర్షి అతిథిసత్కారములు కావించినమీఁదట లక్ష్మణునితో- "లక్ష్మణా! నేను శ్రీమద్రామాయణమును రచించితిని. వినెదవా?" అనఁగా లక్ష్మణుఁడంగీకరించెను. అంతఁ గుశలవులచే వీణెలమీఁద రామాయణగాన మొనరింపఁజేసెను. లక్ష్మణుఁడు రామునివదలి యెన్నఁడు నుండినవాఁడు కాఁడు కావున రామచరిత్రమంతయును దెలియును. కాని తెలియని ఘట్టములు రెండు కలవు. వానినిదెలుపవలయు ననుకొనెను. అం దొకటి సీతాపహరణకాలమున సీతావిలాపమును, రెండవది అశోకవనమున సీతావిలాపమును. ఆ రెండు ఘట్టములను లవకుశులచేఁ బాడించెను. లక్ష్మణునకుఁ జాల జాలియు సిగ్గును వేసెను.

లక్ష్మణుఁడు వాల్మీకితో నిట్లనెను:-"మహా మునీ! మీరు రామాయణమును రసవత్తరముగనే చిత్రించితిరి. మంచిదే కాని శ్రీరామచంద్రమూర్తి సాక్షాత్తుగ సచ్చిదానందపరబ్రహ్మ. రామనామము పతితపావననామము. మీ రామాయణములో శ్రీరామ పరత్వమును గూర్చిన ఘట్టమును, శ్రీరామనామమహిమను గూర్చివర్ణించిన ఘట్టమును జదివింపుఁడు" అనఁగా వాల్మీకి నిరుత్తరుఁడయ్యెను. వాల్మీకి రామాయణమున శ్రీరామపరత్వమును గూర్చియు, శ్రీరామనామమహిమనుగూర్చియుఁ జెప్పినట్టి ఘట్టములులేవు. కొన్నిచోట్ల మాత్ర మతిగూఢముగ మాత్రము కలవు. అందులకు లక్ష్మణుఁడు కోపించి వాల్మీకి నిట్లు శపించెను:-"మునీ! నీవిం తటిగ్రంథమును రచించియును శ్రీరామపరత్వమును బ్రత్యక్షముగ వర్ణింపఁజాలకపోతివి. ఏ నామము తారకనామమో, ప్రణవసదృశమో, అంతేకాదు ప్రణవముకంటె నధికమైనదో అట్టి రామనామమునుగూర్చి నీరామాయణమున నొక్కముక్కైనను జెప్పఁజాలకపోతివి. రాఁబోవునది కలియుగము. అందలిమానవులు రాముఁడు దేవుఁడు కాఁడు, రాజమాత్రుఁడందురు. అట్టివారికి సమాధానముగ మరలఁ గలియుగమునఁ బుట్టి, అందఱకర్థమగు ప్రాకృత భాషలో శ్రీరాముని పరత్వమును గూర్చియు, శ్రీరామనామమహిమనుగూర్చియు, రామాయణచరిత్రలోని సందేహములకు సమాధానము చెప్పుచు, భక్తి చిప్పిలునట్లు రామాయణమును రచింపవలయును." ఈశాపమును వాల్మీకి సహర్షముగస్వీకరించెను. ఆతఁడు కలియుగమున శాలివాహనశకము పదునాల్గవశతాబ్దమున నవతరించి యాజ్ఞవల్క్యరామాయణము ననుసరించి మానసరామాయణమును రచించి ధన్యుఁడయ్యెను. బాగుగాఁ బరామర్శించి చదువుచోఁ దులసీరామాయణమునకు మించిన రామాయణము లేనదవచ్చును. అందువలననే అది ఉత్తరదేశమునఁ బేదవారికుటీరములనుండి రాజసౌధములవఱకు సమానగౌరవముతో నాదరింపఁబడుచున్నది.

శ్రీతులసీరామాయణము అలంకారములకును, ధ్వనులకును, శబ్దప్రయోగములకును, ఉపమానములకును బెట్టినదిపేరు. "ఉపమా కాళిదాసస్య" అనుచుందురు. కాని తులసీదాసు ఉపమానములను బ్రయోగించుటలోఁ గాళి

దానును మించఁగలఁడు. కథను జెప్పునపుడు తన్మయుఁడై రసస్ఫూర్తితోఁ జెప్పును. రామాయణములలో దీనికున్నవ్యాప్తి యింక దేనికిని లేదు. ప్రపంచములోని భాషలన్నిటిలోనికి నిది యనువదింపఁబడినది. కొంతవరకు నాస్తికులని చెప్పఁబడు రష్యావారును, చైనావారునుగూడ దీనిని వారిభాషలోని కనువదించుకొని యానందించుచున్నారు. అట్టియెడ మనయాంధ్రభాషలోని కనువదించుకొనుటయును జాలయవసరమే.

ఈతులసీరామాయణమునుగూర్చి ఆ కాలమునఁ గాశియంతటను విశేషముగఁ జెప్పుకొనసాగిరి. ఆతని సమకాలికులగు పండితులు కొందఱోర్వలేక, ఆకాలమున నతని నవజ్ఞ చేయుటకై దేశభాషాగ్రంథ మెట్లు సమ్మాన్యము కాఁగలదు? సంస్కృతగ్రంథములు సంస్కృతములోని రచనములు శ్రేష్ఠములని ప్రచారముచేయసాగిరి. అట్లు తులసీదాసగోస్వామితోడను వాదప్రతివాదములకు దిగిరి. శ్రీతులసీగోస్వామి పరమభక్తుఁడును సాధువుగనుక వారితో వాదమునకు దిగక "నాగ్రంథము విలువను శ్రీ విశ్వనాథుఁడే నిర్ణయింపవలయును. ఇం కొకరి నిర్ణయమేల" యనెను. సరియేనని ఆపండితులీతని ప్రతినిఁ గొనిపోయి విశ్వేశ్వరాలయమున దానినడుగునఁ బడవైచి పైనసమస్తవేదములను, సంహితలను, పురాణేతిహాసములను, కావ్యాదులను బడవైచి ఆలయమునకుఁ దాళములను వైచిరి. తెల్లవారునప్పటికి అడుగున నుంచఁబడిన శ్రీరామచరితమానసగ్రంథము శివుని శిరస్సున (లింగముమీఁద) నుండెను. అంతఁబండితులు సిగ్గుపడి వెడలిపోయిరి. శ్రీతులసీగోస్వామివారు వ్రాసినప్రతులు మూఁడు. వానినిఁ దగులఁబెట్ట వలయుననియుఁ బ్రయత్నించిరి. కాని హనుమంతుఁడు వారి నాప్రాంతమునకు రాకుండ కావలియుండికాపాడెను.

ఆకాలమున శ్రీతులసీదాసు పురాణకాలక్షేపమొనర్చునపుడు స్వయముగ నాంజనేయుఁడొకవృద్ధుని రూపమున వచ్చి వినుచుండెడువాఁడు. తులసీదాసుని అనుష్ఠానజలముచే బ్రహ్మరాక్షసత్వమునుండి విముక్తినిఁజెందిన వాఁడు హనుమంతుఁడు శ్రవణమునకు వచ్చుచున్నాఁడనుసంగతినిఁ జెప్పి పోఁగా తులసీదాసాతనిగుర్తించి శ్రీరామదర్శన మిప్పింపఁ బ్రార్థించెను. దానికి హనుమంతుఁడు మార్గమును జెప్పి, ఆతని రామాయణము రసవత్తముగ నున్నదని పలికెను. అట్టి మహానుభావునిరామాయణమున కొకరి యోగ్యతాపత్రము లేల?

ఆకాలమునఁ గాశీపట్టణమున నివసించుచుండి, అపరశంకరులని ఖ్యాతినిఁబొంది ప్రేమభక్తిసిద్ధాంతమును జేయుచు హరిభక్తిరసాయనమును, అద్వైతసిద్ధాంతమును స్థాపించుచు నద్వైతసిద్ధిని రచించిన మహాపండితులును, పరమభక్తులును, జ్ఞానులలోశ్రేష్ఠులును, అఖండపండితులునగు శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యమధుసూదన సరస్వతీస్వాములవారియొద్దకు తులసీదాసును ద్వేషించుచుండిన పండితులందఱునుబోయి శ్రీతులసీరామచరితమానసమును గూర్చి వారియభిప్రాయము నడిగిరి. వారు వీరి కవిత్వమును నాక్షేపించెద రని భావించిరి. కాని వారిట్లనిరి.—

శ్లో॥ ఆనందకాననేహ్యస్మిన్ । జంగమస్తులసీతరుః
కవితామంజరీభాతి । రామభ్రమరశోభితమ్॥

ఈయానందవనము (కాశికి ఆనందవనమను పేరు కలదు)లో సావగమగు తులసిచెట్లుకాక జంగమ మగు తులసీవృక్షముకలదు. ఈతులసి కవితా మంజరులతో భాసించుచు రాముఁ డనుతుమ్మె దతో శోభిల్లుచున్నది. దీనికిఁ బండితు లందఱును సిగ్గుపడితులసీదాసునియందు భక్తికలిగియుండిరి. శ్రీమధుసూదనసరస్వతులచేతను బ్రశంసింపఁ బడినగ్రంథమిది.

శ్రీతులసీదాసునిసిద్ధాంతము

గోస్వామి వారిరామాయణమునశ్రీరాముని పరత్వమును, శ్రీరామనామతత్త్వమును, సగుణ నిర్గుణసమన్వయమును జక్కఁగఁగావించెను. ఇందు భక్తికిఁ బ్రాధాన్యముకలదు. తర్వాత జ్ఞానమునకుఁ బ్రాధాన్య మొసంగినారు. ఉత్తర కాండమునందు—

చౌ॥ నరసహస్రమహఁ సునహు పురారీ ।
కోఉ ఏక హోఇధర్మ్మవ్రతచారీ ॥
ధర్మ్మశీల కోటిక మహఁ కోఈ ।
విషయ విముఖ విరాగ రతహోఈ ॥
కోటి విరక్త మధ్య శ్రుతి కహ ఈ
సమ్యక్ గ్యాన సకృత కోఉ లహఈ ॥
గ్యానవంత కోటిక మహఁ కోఉ ।
జీవనముక్త సకృత జగసోఉ ॥
తిన్హసహస్రమహఁ సబ సుఖఖానీ ।
దుర్ల్లభ బ్రహ్మలీన విజ్ఞానీ ॥
ధర్మ్మసీల విరక్త అరుగ్యానీ ।
జీవనముక్త బ్రహ్మపర ప్రానీ ॥
సబతే సో దుర్ల్లభ సురరాయా।
రామ భగతి రత గత మద మాయా॥

ఆంధ్రానువాదము

"వేగురిలో ధర్మ్మవిదుఁ డొక్కఁడుండు;
నట్టిధర్మాత్ములయం దొకకోటి
కేయొక్కఁడో రహియించును విషయ
విముఖుఁడు సుజనుఁడు వీతరాగుండు
వారలు వేగురు వరలినచోట
నలరు నొక్కరుఁడు సమ్యగ్జ్ఞానవిదుఁడు;
తత్సహస్రమ్మునఁ దనరుచునుండుఁ
బరమపావనుఁడు జీవన్ముక్తుఁ డొక్కఁ;
డట్టి జీవన్ముక్తులందునఁగూడ
సౌఖ్యధాములును విజ్ఞానులు సములు
బ్రహ్మనిష్ఠు లతిదుర్ల్లభులు మహాత్మ!
వారియందును రామభద్రునిపాద
కంజాతభక్తి యొక్కనికే లభించు"

చౌ॥ గ్యానహి భగతిహి అంతరకేతా ।
సకల కహహు ప్రభుకృపా నికేతా॥
సుని ఉరగారి వచన సుఖ మానా ।
సాదర బోలేఉ కాగ సుజానా॥
భగతిహి గ్యానహి నహిఁ కఛుభేదా ।
ఉభయహరహిఁ భవ సంభవ ఖేదా॥
నాథ మునీస కహహిఁ కఛు అంతర ।
సావధాన సోఉ సును విహంగబర॥
గ్యాన బిరాగ జోగ విజ్ఞానా ।
ఏ సబ పురుష సునహు హరిజానా॥
పురుష ప్రతాప ప్రబల సబ భాఁతీ ।
అబలా అబల సహజ జడ జాతీ॥
....
....
మాయా భగతి సునహు తుమ్హ దోఉ ।
నారి వర్గ జానఇ సబ కోఉ॥
పుని రఘుపీరహి భగతి పిఆరీ ।
మాయాఖలు నర్తకీ బిచారీ॥

భగతిహి సానుకూల రఘురాయా ।
తాలే తేహి డరపతి అతిమాయా॥

ఆంధ్రానువాదము

"కరుణాబ్ధి! భక్తికి జ్ఞానమ్మునకును
గలభేద మేనెఱుంగఁగ నిచ్చగింతు"—
నని విహంగేశ్వరుఁ డడుగ నాలించి
కాకభుశుండి యఖండాదరమున
"ఖగనాథ! భక్తికి జ్ఞానమ్మునకును
నావంతయును భేద మనునది లేదు:
భవఖేదముల నవి వారించురెండు;
గాని వానినడుమఁ గలవుభేదమ్ము
లని మునులందు రయ్యది వినిపింతు
సావధానుండవై యాలింపవలయు;
వైనతేయా! జ్ఞానవైరాగ్యయోగ
విజ్ఞానముఖ్యముల్ వెసఁ బురుషాళి;
స్వాభావికమ్ముగఁ బ్రబలురు పురుషు;
లంగనల్ నిర్బలు లత్యంతజడులు;
.....
.....
మాయయు భక్తియు మగువలటంచు
నెల్ల రెఱుంగుదు; రిందు సద్భక్తి
యన్నచో రామున కమితప్రేమమ్ము;
కేవల మొ్మొకనర్తకియె మాయ నాథ!
ఆరాఘవుఁడు భక్తికనుకూలుఁ డగుట
చే మాయ యతనిఁ జూచిన వెఱఁగొందు;"

అని యిట్లు భక్తికి ప్రాధాన్య మొసంగెను. భక్తి స్త్రీకావున స్త్రీయగు మాయ నామెను మోహపెట్టఁజాలదు. పైఁగా రామచంద్రునకు భక్తి భార్య, మాయనర్తకి. ఆతనికిభక్తి యనినఁ బ్రేమ కావున నర్తకియగుమాయ ఆమెను జూచిన భయమును జెందును. భక్తి శబ్దమును స్త్రీలింగమే. జ్ఞాన, శీల, ధర్మకర్మాదులు పురుష వాచకములు. పురుషుఁడెట్లు సులభముగ స్త్రీకి వశుఁడగునో అట్లే జ్ఞాన, ధర్మ, కర్మాదులు త్వరలో మాయకు వశమగును.భక్తికి ప్రాధాన్య మిచ్చుటయేగాక మిగిలిన సాధన లన్నిటిని గూర్చి అతివిపులముగఁ జెప్పెను. వినయము, త్యాగము, భక్తి, శీలము మొదలగువానినిఁ బోషించుటకు భరతుని పాత్రను గ్రహించెను. ఈరామాయణమునకుఁ బ్రాణ మయోధ్యా కాండము.

శ్రీమద్రామాయణమునం దనేక సందేహములు కలుగుచుండు స్థలములలో నీతఁడు చక్కగ సమాధానములను గథలలోనే జోడించి చెప్పెను. నిజమున కీరామచరితమానసముగొప్ప సాధనగ్రంథము. సర్వవేదశాస్త్రముల సారము. దీనినిఁ జదివిన తరువాత నాధ్యాత్మిక విషయమును దెలిసికొనుట కిం కొకగ్రంథమును జదువ వలసిన పనియుండదు.

అనువాదములు.

శ్రీతులసీరామాయణము ప్రపంచములోని అన్ని భాషలలోనికి ననువదింపఁబడినది. మన యాంధ్రభాషలోనికి శ్రీభాగవతుల నృసింహ శర్మగారిచేఁ బద్యరూపముగననువదింపఁబడివేఁగు చుక్కగ్రంథమాలలోఁ బ్రకటింపఁబడినది. వివిధ వృత్తములలోఁ జక్కనిధారాశుద్ధిగలిగిన కవిత్వ ముతోఁ బోతనను దలఁపించుచు రచింపఁబడి నది. కాని వారు కొన్నియెడల స్వతంత్రించిరి. అదియు సామాన్యవిద్వాంసుల కందుబాటులో లేదు. వావిళ్ల వారిచే వచనమున నొకటిప్రకటింపఁ బడినది. శ్రీనోముల అప్పారావుగారిచే ననువ దింపఁబడి బాలకాండమువఱకు ప్రచురింపఁబడి నది. ఇంతలోవారు పరమపదించిరి. వారు వ్యాఖ్యానరూపముగ రచించిరి. ఇంకను కొందఱు

గద్యపద్యాను వాదములొనర్చిరి. తులసీదాసెట్లు పామరుల కందుబాటగు భాషలో రచించెనో అట్లే గానముచేసికొనుటకును వీలుగనుండునట్లు ఆదోహాచౌపాయ్ వృత్తములలోనే రచింప వలయు ననునాశ నాకు మిక్కిలిగ నుండెడిది. కాని శ్రీప్రభుదత్తజీబ్రహ్మచారిగారు భాగవత కథాఽనువాదకార్యమును నాకొసంగుటచే నేను దానిని నెఱవేర్పలేకపోతిని. కాని నాకు పూర్వాశ్రమమునఁగడుంగడు మిత్రులును, సౌజన్యనిధులును, వైరాగ్యసంపన్నులును, పూజ్యులును, గురుతుల్యులునగు శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్య కేశవతీర్థస్వామివారు దీనినిఁ దెనిఁగింపఁ బూనుట సంతోషకరమగు విషయము. వారు కైకొనిన వృత్తము చాల చక్కఁగ నున్నది. నేనిట్లు నిర్వహింపఁజాలెడువాఁడనుగాను.

ద్విపద తేలికఁగ సామాన్యవిద్యావంతులును జదివి అరము చేసికొనుటకును, పాడుకొనుట కును వీలుగనుండును. నే నాలోచించినదానిలోఁ దెనుఁగుందనము పోయినది. దోహా, చౌపాయ్‌లు తెలుఁగువృత్తములు కావు. హిందీవృత్తములు. వీరు తెలుఁగుదనమును బోనీయకుండుటకు చక్కని ద్విపదావృత్తమును స్వీకరించినారు. వీరికి నా ధన్యవాదములు.

శ్రీకేశవకిశోరులయనువాదము

ద్విపదలో నైనను బాండిత్యప్రకర్ష చేయ నెంచిన కవి నలుగనిరాళ్ళవంటిపదములను వై చెడువాఁడే. కేవలము సాహిత్యగ్రంథము లకుఁ బాండిత్యప్రకర్ష కాని లీలానుభవ మొన ర్చుటకు వీలుకలుగవలసిన గ్రంథములకు మధుర మగు తేలికభాషయే బాగుండును. శ్రీకేశవ స్వామివారును, పాటీలుతిమ్మారెడ్డి (కిశోర్) గారును దానిని గ్రహించి కడుతేలికపదములలో ననువాదమందు రసమేమియును జెడకుండు నట్లు చక్కఁగ ననువదించినారు. శ్రీకేశవతీర్థస్వామి వారు బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ కాండల ననువదించిరి. అచ్చటనుండి కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి శిష్యులును, శ్రీకేశవతీర్థగోస్వామివారియెడ పరమభక్తితత్పరులును, తద్రూపమున ననన్యులు నగు శ్రీపాటీలు తిమ్మారెడ్డిగారు సుందర, లంకా, ఉత్తరకాండల ననువదించిరి. తిమ్మ అనఁగాఁ గోఁతి, రెడ్డి అనఁగా జేఁడు శబ్దతద్భవము కావున రాజు. అనఁగాఁ గోఁతులకురాజు సుగ్రీవుఁడు. కేశవుఁడు రాముఁడేకదా 'రామ సుగ్రీవయోరైక్యమ్' అన్నట్లు వీరిద్దఱకు భేదము లేదు. బాహ్యరూపములు రెండుగానున్నను ఆత్మలొకటై ఒక్కనోటఁ బలికినట్లుగ ననువాదము చేయఁబడినది. శ్రీకేశవ, కిశోరులొన రించిన అనువాదము నాకాశ్చర్యమును గొలిపినది.

ఇద్దఱును శ్రీమట్టపల్లినృసింహోపాసకులు. లలితకవితాశైలిగల సక్కవులు. ఏయేరసము వచ్చినపు డాయారసస్ఫూర్తిని రచనములందు చక్కఁగ బ్రదర్శించినారు. నేను తులసీరామాయణమును దగ్గఱఁబెట్టుకొని అనువాదమును జదివితిని. అనువాదము పరమాద్భుతముగ నున్నది. బ్రహ్మానందమును జెందితిని. హిందీ అవధభాషలోని భావమేమాత్రమును బోకుండ రచించిరి. దానిని కొంచెముగ గ్రంథవిస్తరము కాకుండునట్లు ప్రదర్శించెదను. మొత్తము మూలమునకు నూటికి నూఱుపాళ్ళు న్యాయ మొనర్చినట్లు ప్రదర్శింపవలయు ననిన మొత్తము గ్రంథమునంతను బ్రదర్శింపవలసివచ్చును. రచన

అట్లున్నది. కాని నా తెలిసినకొలఁది యిచ్చట వారిద్దఱి కవిత్వమును వేఱువేఱుగఁ బ్రదర్శించెదను. ఇద్దరి కవిత్వము సాధారణముగ గుర్తింపఁ జాలనట్లుగ సముముగ నడచినను గొంచెముగఁ బరికించి చూచినచోఁగొలఁదిగ భేదము గోచరింపఁగలదు. శ్రీకేశవతీర్థస్వామివారిరచన నన్నయ భట్టారకులరచనవలె సాగినది. శ్రీతిమ్మారెడ్డిగారి కవిత్వము తిక్కనగారి ఫక్కిలో నడచినది. ఇద్దరి ధారాశుద్ధి చాలబాగున్నది. ముందుగా శ్రీకేశవతీర్థులవారి రచనమును గూర్చి విచారించి తరువాత శ్రీకిశోర్ వారిరచననుగూర్చి విచారింతము. వారిద్దరి కవిత్వమును–వారు స్వయముగ శ్రమపడి వ్రాయుచున్నట్లుగ లేదు. భగవంతుఁడు పలికించుచున్నట్లే యున్నది. వీరిద్దరును వాఙ్మయ ప్రపంచమునను, భక్తసంఘమునను చిరయశస్థానమును నీ రచనద్వారా యేర్పఱచుకొనిరి. శ్రీస్వామివా రేమనుచున్నారో చూడుఁడు

క॥ పలికిన రామాయణమే
పలుకఁగవలె నన్యమేను బలుకఁగనేలా
పలుకుల నమృతము చిలుకఁగఁ
బలికెద శ్రీరామచరిత వరశుభభరితన్॥

రామచరితమానసములోనిపీఠికలో నీచౌపాయ్‌కి ఎంతటికమ్మని పద్యమును గూఢముగ రచించిరో చూడుఁడు–

చౌ॥ సో సుధారి హరి జన జిమిలేహీ ।
దలి దుఖ దోష బిమల జసు దేహీ॥

ఉ॥ఐనను గేశవాంఘ్రిరతులైనబుధుల్ చెడి పోరు;వారలా
మానసమందుఁ గల్గిన భ్రమన్ సవరించి ప్రబుద్ధులౌచు స్వ
జ్ఞానమహాప్రబోధితయశఃస్ఫుటపాండురదిక్తటాహులై
మానితరీతి వెల్గుదురు మాధవసత్కరుణాబలంబుచే॥

ఇది పైదానికి వ్యాఖ్యానరూపముగ నున్నది.

తులసీదాసునికవిత అతిగూఢముగ నుండును. అనేకార్థములు ఒక్కదానిలోనే యిమిడియుండును. ఆతఁడు వాడెడు ప్రతిపదమందును నెంతో అర్థముండును. మచ్చున కొక్కటి చూపి, దానిని శ్రీస్వాములవా రెట్లు నిర్వహించిరో చూతము. శ్రీ తులసీదాసగోస్వామి నామవందనములో రామనామమున కిట్లునమస్కరించిరి.

చౌ॥ వందఉనామరామరఘువరకో।
హేతుకృశాను భాను హిమకరకో॥
విధిహరిహరమయ వేదప్రాణ సో
అగుణఅనూపమ గుణనిధాన సో॥

శ్రీస్వామివారిఅనువాదము

గీ॥ ఎది కృశానుభానులకును హిమకరునకుఁ
గారణంబగు నా రఘుకాంతు 'రామ
నామ'మున కెప్పుడును వందనంబొనర్తుఁ
బరమభక్తిసంపూరితభావమునను॥

క॥ శ్రీరామనామమహా!
నీరజభవవిష్ణురుద్రనిలయము, వేదా
ధారము, నిర్గుణమసమము
చారుసుగుణరత్నములకు సాగర మెన్నన్॥

పైవానిలో హేతుకృశాను, భాను, హిమకర అను శబ్దములలోనే చాల అర్థము కలదు. స్వాములవారు క్రింద వివరణములలోఁ గొంత వివరించిరి. ఇంకను జాలఅర్థము కలదు. ముఖ్యముగ రామనామశబ్దములలోనే కలదు. కృ = క+ఋ—భాను అనుదానిలో భ+ఆ; హిమకర అనుదానిలో హి+మ. ఇట్లు ఋ+ఆ+మ =రామ అయినది. పితృ + ఆజ్ఞ = పిత్రాజ్ఞ అయినట్లు. సరిగానాశబ్దములనే శ్రీస్వామివారు వేయుట గమనింపఁదగినది. అట్టిరహస్యము లను వారు గ్రహించియే అట్లుచేసిరనుట విస్పష్టము.

ఇంకను శ్రీస్వామివారి యనువాదమును జూతము.

చౌ॥ బహురి రామమాయ హి సిరు నావా।
హృదయఁ విచారత శంభు సుజానా॥
అనృత మాడించిన యా రామ చంద్రు
ఘన మాయకును నమస్కారంబు సలిసె॥ 51 పు.

చౌ॥ జిన్హా హరి కథా సునీ నహిఁ కానా
శ్రవణరంధ్ర అహిభవన సమానా॥
నయనన్హి సంత దరస నహిఁ దేఖా।
లోచన మోరపంఖ కర లేఖా॥
రమణీయ హరికథా శ్రవణంబు లేని
శ్రవణరంధ్రంబులు సర్పరంధ్రములు
సాధుసత్పురుషదర్శనము లేనట్టి
కన్నులెంచ, నెమిలికన్నులు గావె॥ 82 పు.

దో॥ భరద్వాజ సును జాహి జబ హోఇ విధాతావాయ్
ధూరి మేరుసమ జనక జమ తాహివ్యాలసమదాయ్॥

"ఓభరద్వాజబుష్యుత్తమా! వినుమ!
ఎంచవిధాత తా నెవ్వరిపైన
ప్రసన్నతఁ గాంచు, నాతనికిలను
గనకాద్రి యొక ధూళికణముగా నౌను;
తండ్రియే యముఁడగుఁ; ద్రాడుపా మగును. 115 పు.

చౌ॥ జో ఆనంద సింధు సుఖరాసీ
సీకర తేఁ త్రైలోక సుపాసీ॥
సో సుఖధామ రామ అసనామా
అఖిలలోక దాయక విశ్రామా॥

"ఆనందవారాశి, అతిసుఖరాశి,
నిజకృపాహ్లాదితనిఖిలలోకుండు,
నీజ్యేష్ఠతనయుఁడు నృపలోకనాథ!
ఆనందధామ మీ యఖిలప్రపంచ
విశ్రామకరమాచు వెలుఁగొందునట్టి
'రామ'నామమున విరాజిల్లఁగలఁడు." 129 పు.

చౌ॥ కహహు నాథ సుందర దోఉ బాలక
మునికుల తిలక కి నృపకుల పాలక!
బ్రహ్మ జో నిగమ నేతి కహి గావా
ఉభయ వేష ధరి కీ సోఇ ఆవా॥
"ఈమనోహరబాలు లెవరు? మునీంద్ర!
మునికులతిలకులో, భూపాలసుతులో!
'నేతినేతి' యటంచు నిగమంబులాడు
ఆపరబ్రహ్మమాయాకృతుల్ గనెనో! 140 పు.

శ్రీస్వామివారనువాదమున గేయముల నెంతచక్కఁగ నడిపిరో గమనింతము.

అహల్యాస్తవము

మైఁనారి అపావన ప్రభుజగపావన
రావన రిపుజన సుఖదాఈ।
రాజీవవిలోచన భవభయమోచన
పాహిపాహి సరనహిఁ ఆఈ।
మునిశ్రాప జో దీన్హా అతిభలకీన్హా
పరమఅనుగ్రహ మైఁ మానా।
దేఖేఉఁ భరిలోచన హరి భవమోచన
ఇహఇలాభ శంకర జానా॥
బినతీ ప్రభు మోరీ మైఁ మతి భోరీనాథ
న మాగఉఁ వర ఆనా।
పదకమల పరాగా రస అనురాగా మమ
మన మధుప కరై పానా॥
జేహిఁ పద సురసరితా పరమపునీతా
ప్రగట భఈ సివసీసధరీ।
సోఈ పదపంకజ జేహి పూజత
అజమమ సిరధరేఉకృపాలహరీ॥

గేయము

జ్ఞానగమ్య, జయజయ రఘునేతా!
రావణారి; బుధజనసుఖదాతా!

నే నపవిత్రస్త్రీని మహాత్మా!
ఐనఁగాచితివి జగత్ప్రభూతా!
శరణుఁగోరితిని భవభయమోచన!
పాహి! పాహి! పంకేరుహలోచన!
నాపతియొసఁగిన శాపము దేవా!
గొప్పవరంబె కృపామయభావా॥
భవమోచన హరి మంగళాకృతిన్
గనులపండువుగఁ గాంచఁగల్గితిన్
శంకరుండు నీసందర్శనమున్
మహాభాగ్యమని యెంచుసతమ్మున్
అజ్ఞురాల నే నోరఘురామా
నా దొక విన్నప మాలకింపుమా
ఇతరవరంబులు గోరను నాథా!
నీపదపద్మరజంబు సర్వదా
పుష్పమరందము మధుపమురీతిన్
సత మాసించెడి సదమలభక్తిన్
నా మతియందునఁ బాదుకొల్పుమా!
జగన్నాథ! తండ్రీ! రఘూత్తమా!
ఎవని పదోద్భవపావనగంగన్
శివుఁడు శీర్షమునఁదాల్చెఁ జెలంగన్
ఎవని పదాబ్జములన్ నిజాత్మలో
పంకజాసనుఁడు పూజసేయునో
ఆనీపాదము లాదయాఝరీ!
నాశిరముననిల్పితివి శ్రీహరీ॥

గేయములు శ్రీతులసీదాసెట్లు నడిపిరో స్వామివారు నట్లేనడిపిరి.

నమామి భక్త వత్సలం । కృపాలు శీల కోమలం ।
భజామి తే పదాంబుజం । అకామినాం స్వధామదం॥
నికామ శ్యామసుందరం । భవాంబు నాథ మందరం
ప్రపుల్ల కంజలోచనం మదాది దోష మోచనం॥

ప్రలంబ బాహు విక్రమం । ప్రభోఽప్రమేయ వైభవం।
నిషంగచాపసాయకం । ధరం త్రిలోక నాయకం॥
దినేశ వంశ మండనం । మహేశ చాప ఖండనం।
మునీంద్ర సంత రంజనం । సురారి బృంద భంజనం॥
మనోజవైరి వందితం । అజాది దేవ సేవితం।
విశుద్ధ బోధ విగ్రహం । సమస్తదూషణాపహం॥
నమామి ఇందిరాపతిం । సుఖాకరం సతాం గతిం।
భజే సశక్తి సానుజం । శచీ పతిప్రియానుజం
త్వదంఘ్రి మూల యే నరాః । భజంతి హీన మత్సరాః
పతంతి నో భవార్ణవే । వితర్క వీచి సంకులే।
వివిక్తవాసినః సదా । భజంతి ముక్తయే ముదా ।
నిరస్య ఇంద్రియాదికం । ప్రయాంతి తే గతిం స్వకం।
తమేక మద్భుతం ప్రభుం । నిరీహమీశ్వరం విభుం ।
జగద్గురుంచ శాశ్వతం । తురీయమేవ కేవలం॥
భజామి భావ వల్లభం । కుయోగినాం సుదుర్లభం ।
స్వభక్త కల్ప పాదపం । సమం సు సేవ్యమన్వహం ।
అనూపరూపభూపతిం । నతోఽహముర్విజాపతిం ।
ప్రసీద మే నమామితే । పదాబ్జ భక్తి దేహి మే॥

గేయము

నమస్స్వభక్తవత్సలా! కృపాలవాల! కోమలా!
అహైతుకాత్మభక్తులన్ స్వధామ మిచ్చి ప్రోచు నీ
పదాబ్జముల్ భజించెదన్ సదామదాత్మలో ప్రభూ!
మనోజ్ఞ శ్యామసుందరా! భవాంబురాశిమందరా!
ప్రఫుల్ల కంజలోచనా! మదాదిదోషమోచనా॥
ప్రలంబ బాహు విక్రమా! ప్రభూ! అమేయవైభవా!
నిషంగ చాప సాయకా! హరీ! త్రిలోకనాయకా!
దినేశ వంశ మండనా । మహేశచాపఖండనా!
ముసీంద్ర నిత్యరంజనా! సురారిబృందభంజనా॥
మనోజవైరి వందితా! అజాది దేవ సేవితా
విశుద్ధ బోధ విగ్రహా! సమస్తదుఃఖతాపహా!
రమాసతీమణీ పతీ! సుఖాకరా! సదాగతీ!

నమ స్సశ క్తిసానుజా। శచీపతీ ప్రియానుజా।
త్వదంఘ్రిమూలమేనరుల్ భజింత్రసూయ వీడియున్
త్వదీయమర్త్య లెప్పుడున్ వితర్క-తుంగ భంగమౌ
భవాబ్ధిఁగూల; రేనరుల్ వివి క్తవాసులై సదా
విము క్తిఁగోరి యింద్రియాదులెల్ల నిగ్రహించి, నిన్
భజింత్రు వారు స్వస్వరూపమైన నిన్నుఁగాంత్రహా॥
ప్రభూ! అఖండ! అద్భుతా! నిరీహ! ఈశ్వరా! విభూ!
జగద్గురూ! సుశాశ్వతా! తురీయరూప! కేవలా!
సుభ క్తి భావవల్ల భా! కుయోగిలోకదుర్ల భా!
స్వభ క్త కల్ప పాదపా! సమ స్తసేవ్య! కొల్తునిన్
అనూపరూప భూపతీ! నమస్సు లిర్విజాపతీ!
అనుగ్రహింపుమా సదా- త్వదంఘ్రిభ క్తిరాఘవా!
సమాదరాత్ములౌచు ఎవ్వరీస్తుతిన్ బఠింతురో
ప్రభూతభ క్తి, ము క్తియున్ ప్రభూ వరించు వారలన్॥

ఈ విధముగనే శ్రీతులసీగోస్వామి సుతీక్ష్ణ స్తవము నెట్లు (426 పుటలో) నడిపిరో వీరును నట్లే నడిపిరి.

ఈ గేయమును దిలకింపుఁడు, కోలకిరాతులు పలికినది.

"చీమలుదూరని చిట్టడవుల్-
కాకులుదూరని కాఱడవుల్
చీఁకటిగుహలును బెనుకనుమల్-
లేవెట మేమెఱుఁగని స్థలముల్
వివిధాటవులకు రఘురాయా!
వేఁటకు నినుగొనిపోదుమయా!
జలజలఁబాఱెడి వాగులను,
గలగలఁబాఱెడి వంకలను
కళకళలాడెడి కొలఁకులను,
మాతోమిముఁగొనిచూపెదము.
నిరతము మీ యడుగుల వదలం.
మేమెల్లను మీ సేవకులం,
ఆజ్ఞాపింపఁగ మము రామా!
సంశయమెందుకు శుభనామా!

శ్రీస్వామివారి ధారాశుద్ధి అనుపమానము.

చౌ॥ సతీఁ సముయి రఘువీరప్రభాఊ
భయజస సివసన కీన్హాదురాఊ॥
కచు న పరీచ్ఛా లీన్హా గోసాఈఁ
కీన్హా ప్రనాము తుమ్హారిహినా ఈఁ॥
జోతుమ కహా సో మృషా నహోఈ
మోరేఁమన ప్రతీతి అతి సోఈ॥
తబ సంకర దేఖేఉ ధరి ధ్యానా
సతీఁ జో కీన్హా చరిత సబు జానా॥

"ఆరఘునాథు మహామహిమంబు
తెలియుటచేత సతీదేవి, హృదిని
భయవశయాచును భవుని చెంగటను
సత్యంబుదాచి యీ చందంబు బలికె :
"శ్రీరాము నేను పరీక్షింపలేదు;
నీవలెమ్రొక్కియు నే వచ్చియుంటి
ఓప్రభూ! నీ మాట లు త్తవియౌనె?
ఏను పూర్ణంబుగా హృదయంబులోన
సంతృప్తిబొందితి సర్వేశ! నాథ!
అని పల్క శంకరుఁ డాలకించియును
సతి యొనరించిన సర్వకార్యమును
దివ్యదృష్టినిలోనఁ దిలకించి.....

ఈక్రింది పం క్తు లెంత చక్కనివో చూడుఁడు—

"శ్రీరామచంద్రుని హృదయంబులోన
సదమలానుగ్రహచంద్రుండు వెలుఁగు
నా రాఘవుఁడు మనోహరహాసములను
విశ్వతాపముదీర్చు వెన్నెలలూలుకు;
నొడిలోనగానేపు, నూయలలోనఁ
గానేపు బాలరాఘవునిఁగౌసల్య
"నాకన్నతండ్రి! ఓ నాముద్దుతనయ!"—
అనుచు లాలించు నత్యంతానుర క్తి.

వీరు కవిత్వమున యతులను వెదకికొని నక్లే
లేదు. సమాసములును నక్లే పడినవి. మచ్చు
నకు కొన్నిటినిఁ గాంచుఁడు—

కం॥ హరిహరముఖ్యామరనుత !
గరుడోరగసిద్ధసాధ్యగణసంసేవ్యా !
హరివరకరాళసుందర !
వరదాయక ! మట్టపల్లివాస నృసింహా॥

"సుస్నేహ శీల విశుద్ధ స్వభావ
హర్షాబ్ధియగురాముఁ డనియె నీరీతి॥"
"ప్రేమానురాగ కీర్తి ప్రతిష్ఠాదు
లెల్లను నాకు నీవే రామచంద్ర !"
"నిత్యవినూతన నిర్మలావిరళ
భక్తి నీయెదలోన భాసించుఁగాక !"
"అవనీంద్రనాథసింహ ద్వారమందు
గుంపులు గుంపులు కూడిరి జనులు.

ఇంకను సరళధారకు దీనినిఁ గనుఁడు—

"శ్రీరామచరణరాజీవాభిముఖత
కనుకూలపడని గృహారామవిత్త
సౌఖ్యసంతతులు నాశంబునుబొందు"

దేశీయపదములను దెలుఁగునుడికారముతో
నెట్లువాడిరో గమనింపుఁడు—

"నన్నుఁగురూపిగా నలువసృష్టించి
పృథివిఁ బరాధీన వృత్తి విధించె
చేసినవారికిఁ జేసికొన్నంత
ఎవరురాజైన నాకేమినష్టంబు॥"
"ఆమె త్రవ్వినగుంటయం దామెపడును
గాక !—దేవుని కృపకలిగినయెడల"
"కల్లకాపట్యంబుఁ గలుగనియట్టి
పిచ్చితల్లివినీవు వినుము నామాట."
"పకపకనవ్వుట బావురుమనుట
పృథుదానగుణముమ బిసినారితనము"

"పచ్చని యీసూర్యవంశంబునందు
చిచ్చెవ్వ రిడినారొ చెప్పుమారామ"

ఇవన్నియు మూలములోని పదములకంటె
ముద్దు లొలుకుచున్నవి.

ఇఁక శ్రీ తిమ్మారెడ్డిగారి కవిత్వము విషయ
మును గూర్చి రెండు మాటలు చెప్పి యీ నా
తొలిపలుకును ముగింతును. పోతన్నకు మల్లన
యెట్లు సరితూగిన కవిత్వమును వ్రాసి సైఁ అని
పించుకున్నాఁడో, నన్నయకు తిక్కనఫక్కి కవి
త్వమునందు కొంచెము తేడా ఉన్నను నెట్లతికి
నదో, శ్రీస్వామివారి కవిత్వమునకు తిమ్మారెడ్డి
గారి కవిత్వ మట్లతికినది. వీరి యనువాదమును
గూర్చి రెండుమాటలు—

దో॥ నామ పాహరూ దివసనిసి, ధ్యానతుహ్మార కపాట్
లోచన నిజపద జంత్రిత, జాహిఁప్రాణకేహిఁబాట్॥

"త్వన్నామమేసదా ద్వారంబుగావ
త్వద్ధ్యాననిష్ఠకవాటంబుగాగ
నిజపదసంబద్ధనేత్రయా నామె
ప్రాణంబు లేరీతి బాయు శ్రీరామ"

చౌ॥ ఏవమస్తు కహి ప్రభురణధీరా
మాఁగా తురత సింధుకరనీరా,
జదపి సఖా తవ ఇచ్ఛా నాహిఁ
మోరదరసు అమోఘ జగమాహీ
అసకహి రామ తిలక తేహి సారా
సుమనవృష్టి నభ భఈ అపారా॥

దో॥ రావన క్రోధ అనల నిజస్వాస సమీర ప్రచార్
జరత విభీషను రాఖేఉ దీన్హేఉ రాజు అఖండ్
జోసంపతి సివ రావన హి దీన్హి దియే దసమాథ్
సోఇ సంపదా విభీషనహి సకుచి దీన్హి రఘునాథ్॥

ఇ దెంతటి కమ్మని యనువాదమో పరికింపుఁడు.

"ఏవమస్తని కోసలేంద్రుఁడు వార్ధి
జలముదెప్పించి యోసఖుఁడ! యెడందఁ
గోరిక నీకు లేకుండునుగాక-
గాదెన్నటికి నమోఘము దర్శనమని
యాతని కపుడె రాజ్యాభిషేకమ్ము
గావించె; నంత యాకసముననుండి
సుమవృష్టి గురిసిరి సుమనోగణమ్ము.
ఆగతి నిజవచనానిలేరితము
రావణక్రోధానలము బారినుండి
రావణావరజుసంరక్షణనేసి
రామభద్రుఁ డఖండరాజ్యము నొసఁగెఁ
బదితల లొసఁగుటవలన రావణున
కేసంపదల శివుఁ డిచ్చె నవెల్ల
నతియుదారత రాముఁ డానిశాచరుని
తమ్ముని కవ్వేళ దత్త మొనర్చె॥"

వీరును యతిప్రాసలకొఱకు తడవుకొనలేదు.

పరశుముద్గరగదా పరిఘమహాసి
భిండివాల త్రిశూల భీకరతోమ
రాది నానాప్రకారాయుధవితతి
హస్తమ్ముల ధరించి———"

వీరును దెలుఁగు నుడికారమును, దేశీయ పదములను జక్కఁగఁ బ్రయోగించిరి.

"———క్రోఁతులు సుట్టి
చపేటసంభావనలిచ్చు———"
"మగసిరిగలవాఁడు మసలకవచ్చి
తొలిఁగింపఁగనుఁడట్లు తొలిఁగించిచేని"

ఇట్లు వీరిద్దరు నీగ్రంథరచనమును జక్కఁగఁ దులసీదాసగోస్వామి హృదయమును లోకమునకు వెల్లడిచేయుచు గావించిరి. శ్రీ కిశోరు గారి గేయానువాదమును సైతము మచ్చునకుఁ జూపించి యీ నా తొలిపలుకులను మలిపలుకులుగ నొనర్తును.

శివాష్టకము

నమామీశ మీశాన నిర్వాణరూపం
విభుంవ్యాపకం బ్రహ్మవేదస్వరూపం
నిజం నిర్గుణం నిర్వికల్పం నిరీహం
చిదానందమాకాశవాసం భజేఽహం
నిరాకారమోంకార మూలం తురీయం
గిరాగ్యానగోతీతమీశం గిరీశం
కరాలం మహాకాలకాలం కృపాలం
గుణాగార సంసారపారం నతోఽహం॥

తుషారాద్రి సంకాశగౌరం గభీరం
మనోభూతకోటిప్రభా శ్రీశరీరం
స్ఫురన్మౌలి కల్లోలినీ చారు గంగా
లసద్భాలబాలేందు కంఠేభుజంగా
చలత్కుండలం భ్రూసునేత్రం విశాలం
ప్రసన్నాననం నీలకంఠం దయాలం॥

మృగాధీశచర్మాంబరం ముండమాలం
ప్రియం శంకరం సర్వనాథం భజామి
ప్రచండం ప్రకృష్టం ప్రగల్భం పరేశం
అఖండం అజంభానుకోటి ప్రకాశం॥

త్రయఃశూల నిర్మూలనం శూలపాణిం
భజేఽహం భవానీపతిం భావగమ్యం
కలాతీత కల్యాణ కల్పాంతకారీ
సదా సజ్జనానంద దాతా పురారీ
చిదానంద సందోహ మోహాపహారీ
ప్రసీదప్రసీద ప్రభో మన్మథారీ॥

నయావద్ ఉమానాథ పాదారవిందం
భజంతీహలోకే పరేవా నరాణాం
నతావత్సుఖం శాంతి సంతాపనాశం
ప్రసీదప్రభో సర్వభూతాధివాసం
నజానామి యోగం జపం నైవపూజాం
నతోఽహం సదా సర్వదా శంభుతుభ్యం

జరాజన్మ దుఃఖౌఘ తాతప్యమానం
ప్రభోపాహి ఆపన్నమామీశ శంభో॥

తెలుఁగుసేత

సతమ్మీశు నీశాను నిర్వాణరూపున్
విభున్ వ్యాపకున్ బ్రహ్మ వేదస్వరూపున్
నిజున్ నిర్గుణున్ నిర్వికల్పున్ నిరీహున్
జిదాకాశు నాకాశవాసున్ భజింతున్॥

నిరాకారు నోంకారమూలున్ దురీయున్
గిరాజ్ఞానగోఽతీతునీశున్ గిరీశున్
గరాళున్ మహాకాలకాలున్ గృపాళున్
గుణాగారు సంసారపారు న్నుతింతున్॥

తుషారాద్రి సంకాశగౌరున్ గభీరున్
మనోభూతకోటి ప్రభాశ్రీ శరీరున్
స్ఫురన్మౌళి కల్లోలినీ చారుగాంగున్
లసద్భాలబాలేందు కంఠేభుజంగున్

చలత్కుండలున్ భూతిసునేత్రున్ విశాలున్
ప్రసన్నాననున్ నీలకంఠున్ దయాళున్
మృగాధీశ చర్మాంబరున్ ముండమాలున్
ప్రియున్ శంకరున్ సర్వనాథున్ భజింతున్

ప్రచండున్ ప్రకృష్టున్ ప్రగల్భున్ పరేశున్
అఖండు న్నజున్ భానుకోటిప్రకాశున్
త్రియఃశూల నిర్మూలనున్ శూలపాణిన్
భజింతున్ భవానీపతిన్ భావగమ్యున్॥

కలాతీత! కల్యాణ! కల్పాంతకారీ!
సదాసజ్జనానందదాతా! పురారీ!
చిదానంద సందోహ! మోహాపహారీ!
ప్రసన్నుండవై కావుమో మన్మథారీ॥

ఉమానాథపాదాబ్జముల్ గొల్వకున్నన్
జరమ్మం దిహమ్మందు సౌఖ్యమ్ము శూన్య
మ్మిఁకన్ శాంతిసంతాపనాశమ్ములున్ లే
వజా! కావవే సర్వభూతాధివాసా!

ఎఱుంగన్ జపమ్మేని యోగమ్ము పూజల్
నుతింతున్ సదా సర్వదాశంభునిన్నున్
జరాజన్మదుఃఖౌఘతాతప్యమానున్
బ్రభూ! ఆపదన్ బాపుమీ గొల్తుశంభూ!

గ్రంథవిస్తరభీతిచే క్లుప్తముగ వ్రాసితిని. సహృదయులు, భక్తులు దీనిలోని విశేషమునే గ్రహింపఁగలరు. ఈగలట్టివారు ఈగఫుసి, మలమున్శ్లేష్మాదులందు వ్రాలినట్లు దోషరాశి మీఁదనే వ్రాలుదురు. బుద్ధిమంతులు తేనెటీఁగలవలె ఈ మహాకవితామకరందమునే గ్రోలి ధన్యులయ్యెదరు. మరల నింకొకసారి యీపద్యమును వ్రాయుదును.

ఐనను శేషవాంఘ్రిరతులైన బుధుల్ చెడిపోరు; వారలా
మానసమందుఁగల్గిన భ్రమఁ సవరించి ప్రబుద్ధులౌదు స్వ
జ్ఞానమహాప్రబోధితయశఃస్ఫుటపాండురదిక్తటాహులై
మానితరీతి వెల్గుదురు మాధవసత్కరుణాబలంబుచే

ఈ రామాయణమును వాడవాడల, పల్లెపల్లెల, పట్టణపట్టణములందును, బురాణరూపమునను, గానరూపమునను వాడుకొని ధన్యులయ్యెదరుగాక! ఈద్విపద బుఱ్ఱకథలోఁ గొన్నియెడల వినియోగింపఁగలదు. ఈకలికాలములో మరల నాతులసీగోస్వామియే శ్రీకేశవగోస్వామియై ఆంధ్రిని బవిత్రమొనర్ప యవతరించి యీ కృతిని వెలయించె ననిపించుచున్నది.

ఆంధ్రులారా! మీరు ధన్యులు. ఇఁక మీ యిష్టము వచ్చినట్లు శ్రీరామభక్తిచే రామనామమును గానమొనర్చుకొని ధన్యులుగండు. శ్రీ స్వామివారి మాటలలోనే శ్రీరామ

చంద్రుని హృదయమున నిల్పుకొని ధన్యులు కండు.

"మరణింపనున్నట్టి మానవుండెట్లో
యమృతంబుపొందిన యట్టుల, మఱియు
నాజన్మమాకట నల్లాడువాఁడు
కల్పవృక్షంబును గాంచినరీతి
నల నరకంబున కరిగెడువాఁడు
హరిపదంబును గాంచినట్టుల మనము
పొందినారము వీరి పుణ్యదర్శనము;
శ్రీరాముశోభ వీక్షించి యద్దాని
జేర్చుఁడీహృదిలోన జెరుగకుండగను!
ఫణిమణిదాల్చినపగిది జిత్తమున
శ్రీరామమూర్తి ధరించుఁడీప్రీతి!"

ఇదియే మా యాశయము.

ఈ మహాగ్రంథ ప్రకాశకులైన శ్రీ కర్వా రపు సూర్యనారాయణశ్రేష్ఠిగారి పుత్రరత్నమగు శ్రీరామకృష్ణమూర్తిగారి వదాన్యత, శ్రీరామ సేవాదీక్ష సర్వాంధ్ర జనాభివందనీయ మైనది. శ్రీరామకృష్ణమూర్తి గారు హిందీ పండితులు నిత్యపారాయణ మొనర్చు భక్తులు. అట్టివారు రసమును గ్రహించి దీని ముద్రణమున కగువ్య యము నొసంగి శ్రీతులసీగోస్వామి మీఁదను శ్రీకేశవగో స్వామివారి మీఁదను వారికిగల సద్భక్తినిఁ బ్రదర్శించుకొనిరి. భగవానుఁడు వారికి చిరాయురారోగ్య భాగ్యములొసంగి, యిట్టి అమూల్యమగు గ్రంథము లితోధికముగఁ బ్రకటించి జన్మను సార్థక మొనర్చుకొనునట్లు జేసి వారికీర్తినిఁ గర్పూరసువాసిత మొనర్చి నల్దిశలఁ బర్విడఁజేయుఁగాక!

నామప్రయోగ,
బుద్ధాం
శోభకృతునామసంవ
త్సరశుద్ధపాడ్యమీ.
మంగళవారము
(26-3-63)

శ్రీరామశరణ్
కుందుర్తివేంకటనరసయ్య
పాకయాజి

"రామచరితమానస" సరస్సుపై విహంగ విలోకనము

శ్రీ పులివర్తి శరభాచారిగారు

గుంటూరుమండల విద్యాశాఖాధికారి.

త్రిదశభాషలో త్రిరత్నములు

ఆధ్యాత్మికవాఙ్మయలోకమును అనుశాసించుచు, ప్రధానముగా హైందవీయపండిత పామరహృదయపూజ లందుకొనుచు, సహస్రాబ్దులుగా, భారతీయజీవనవిధానములపై అత్యంత ప్రభావము కలిగి, త్రిమూర్తిస్థాన మలంకరించిన మహోద్గ్రంథములు, అజ్ఞానగ్రంథివిచ్ఛేదకములు —రామాయణ భారతభాగవతములే. ఇవి అమరభాషలో వెలసి, అజరామరప్రకాశము లతో వెలుగుచు, ఆసేతుశీతాచలము, గల భారతీయుల మనుగడబాటలపై తమ మహిమను ప్రసరింపుచునే ఉన్నవి. వీనిని వాణీగళవిరాజిత ములగు త్రిరత్నము లనియు అనవచ్చును.

ఇందు రామాయణము,తత్కథానాయకుఁడు అగు రఘువంశతిలకుడు అగు శ్రీరామచంద్రుడును పొందిన పూజనీయత, అద్భుతము; అనన్యము, అనంతమునుకూడా.

"చరితం రఘునాథస్య, శతకోటిప్రవిస్తరమ్,
ఏకైక మక్షరం ప్రోక్తం, మహాపాతకనాశనమ్॥

అనికూడా ఈకథ విశ్రుతిని పొందినది. అపారమగు భక్తివిశ్వాసవృత్తినికూడ కల్పించినది. శ్రీరాముడు వేదవేద్యుఁడై అవతారపురుషుడుగా జన్మింపగా, వేదమే వాల్మీకిముఖమున, రామాయణముగా జన్మించె ననియు, అది భువనపావన మనియు, ఈక్రిందిశ్లోకములు చాటుచున్నవి.

"వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా"
"వాల్మీకిగిరిసంభూతా రామసాగరగామినీ
పునాతి భువనం పుణ్యా రామాయణ మహానదీ॥"

ఆదికవి - ఆదికావ్యము

రామచరిత్రమే ప్రథమచ్ఛందఃకావ్య మనియు వల్మీకిసంభవుఁడే, ఆదికవి యనియు, ఆతని రచనము, భారతవాఙ్మయ మందేకాక, విశ్వవాఙ్మయమునకూడా, అద్వితీయస్థానమును కలిగియున్నదనియు, వస్తువాఙ్మనోహరతల రెంటను, దానికదియే సాటియనియు, తత్త్వజ్ఞులు, కళాభిజ్ఞులును దానికి, నీరాజనములు పట్టుచునే ఉన్నారు. అరవిందునివంటి ఆర్ష్యవిద్వత్ యోగీంద్రులేమి, జాకోబీ, కీత్, సర్ మానియర్ విలియమ్సు, వీబర్, మాక్డ్రనాల్డులవంటి పాశ్చాత్యగీర్వాణపండితులేమి, తమ స్తుతిపూజాసుమము లర్పించి, చరితార్థులైరి. కవిశబ్దముకూడా అతనితోడనే పుట్టె ననియు అందురు.

'జాతే జగతి వాల్మీకే, కవిరిత్యభిధాఽభవత్'

వలపు కులుకుల పులుగుజంటపై ములుకు నెక్కుపెట్టిన తులువపై వెడలిన తొలిపలుకులవంటి ఈ తొలిపలుకుల చెలువమునుచూడుడు.

"మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమశ్శాశ్వతీసమాఃయత్క్రౌంచమిథునాదేకంఅవధీఃకామమోహితమ్"
"ఓకిరాతా! నీవు చిరకాలముగా ప్రతిష్ఠ

పొందకుందువుగాక! ఈ పక్షిదంపతులలో, కామ మోహితమైన దానిని చంపితివిసుమా!"

ఇందలి శ్లేషయు, అశేషమగు భాషాసారస్యమును తొణికిసలాడుచున్నది.

మా నిషాద! లక్ష్మీనిలయుడా! ఓ రామా! నీవు రావణమందోదరులను దంపతులలో కాము కుడైన రావణుని చంపుటచే ప్రతిష్ఠను శాశ్వతముగా పొందితివి అను అర్థాంతరముకూడా గర్భితమైయున్నది. తన శోకమే శ్లోకమై, ఒక ఇతిహాసికకావ్యమునకు ప్రేరకమై తదాది, 24000 శ్లోకములుగా, రామచరిత్రను, స్థలకాల పరిధులను దాటిన మహిమతో అందించినది.

"యావత్స్థాస్యంతిగిరయః, సరితశ్చమహీతలే
తావ ద్రామాయణకథా, లోకేషుప్రచరిష్యతి"

అని బ్రహ్మ ఈ కావ్యమున అనంతాయుస్సును ప్రవచించినట్లు బాలకాండలో వాల్మీకి పలికినాడు. 24, వేల శ్లోకములలో ప్రతి వేయి శ్లోకముల ఆదియందును, 24 అక్షరముల గాయత్రీమంత్రమున ఒక్కొక్క అక్షరము అను స్యూతమైనట్లును ప్రాచ్యవ్యాఖ్యాతలు తెలుపుచున్నారు. శ్రీ కృష్ణసూరి, గోవిందరాజ, మహేశ్వరతీర్థ ప్రభృతి, మహామనీషులు, అత్యుత్తమ వ్యాఖ్యాదులు వ్రాసి, దీనిని కొండాడియున్నారు. ఈ కథావస్తువుయొక్క, రామణీయకము, సర్వప్రియత, అనన్యాద్భుతమై, తరువాతి గీర్వాణకవులను ఆకర్షించినది. మురారి, భవభూతి, భోజాదులు, నాటక, చంపూప్రభృతి రూపముల, ఈ పావన వీర కథనే మరల మరల పాడినారు.

"యదిక్షుణ్ణం పూర్వైరితి జహతి రామస్యచరితం
గుణై రేతావద్భిర్జగతి పునరన్యో జయతికః॥

అని మురారిమహాకవి తన, అచంచల నిర్ణయాన్ని ప్రకటించి యున్నాడు. "ఎంద రెన్ని గతులన్ గీర్తించినన్ జెల్లదే" అని తెన్గుకవులును పలికియున్నారు. కాగా, చారిత్రికులు, ఈ గాథలో ప్రక్షిప్తములు కలవనియు, ఆక్షేపణీయములగు ఉదంతములు కలవనియు విమర్శించియున్నారు. చారిత్రిక శిరోమణులు, విమర్శక సింహులు అగు (శ్రీ) కొడాలి లక్ష్మీనారాయణ బి. ఎ. గారు, చరిత్ర కోణమునుండి తమ గ్రంథమున, (శ్రీ)రాముని కాలము, చారిత్రికతల గూర్చి, పరిశోధనాత్మకములగు అనేకవిషయములు, తెల్ల మొనర్చినారు. దాక్షిణాత్యులను వానరులుగా దాసులుగా చేసుకొనుటలోను, శంబుక వాలి వధలు సల్పుటలోను, ఆర్యానార్యాది వైషమ్యము లున్నవనియు, కొందరందురు. మఱికొందరు, మఱి, పలురీతులఁ బల్కిరి. (శ్రీ) ఆవుల గోపాల కృష్ణమూర్తి, M. A., LL. B. వంటి విద్వత్తార్కికులును ఇందలి అభూతకల్పనలు, వర్ణవైషమ్యములు పరిహరింపబడవలెనందురు.

"As is well known, the science of history finds no place in Orthodox Sanskrit learning."

H. G. Rawlinson.

హేతువాదులకు, అనేకములగు అలౌకిక మహిమలు గాని, కేవలము, వ్యక్తి ఆరాధనములు గాని, పారలౌకిక దృశ్యాభివర్ణనలు గాని రుచింపని మాట వాస్తవము. నామ, రూప, భజనల కన్నను, గుణానుశీలనము, భావనాకల్పనల కన్నను, యదార్థ ఘటనల వర్ణనలే ఉపాదేయము లని వారు వాదింతురు. ఇది అవశ్యకమే. మంత్రతంత్రకాండ పెరిగి, సత్యాంశము

లను, మరుగుపరచి, మూఢ విశ్వాసములలో, ముంచివేయు వాఙ్మయమువలన ప్రయోజన మేమి అని ప్రశ్నించు ప్రాజ్ఞుల దృక్కోణము యొక్క ఔచిత్యమును మనము మెచ్చుకొన వలసియే యున్నది. అయితే ఇది ప్రయోజనాత్మకదృష్టి. లోకమున దీని స్థానమును కల్యాణవహమే.

కాగా మానవునిలోని ఇంద్రియభూమి కాగతమైన ఈ వైజ్ఞానిక దృష్టియే, పూర్ణదృష్టి కాజాలదు. అతనిలో రసదృష్టికూడా కలదు. తత్త్వదృష్టి కూడా కలదు. అతనిలో సౌందర్యపిపాసయు, పరసత్యాన్వేషణపరతయు అనాదిగ ఉన్నవి. ఐహికభోగములతోపాటు, ఆముష్మిక రాగములును; క్షణిక జీవన విషయములతోపాటు, శాశ్వతజీవన, ఆనంద తృష్ణయు, హృషీకవేద్యములగు అంశములతోపాటు హృదయ గమ్యములగు విశ్వాసాది, విశిష్ట విషయములును, అతనిని ఆకర్షించియే యున్నవి.

"అతి దీర్ఘే జీవితే కోరమేత"

ఈ అతిదీర్ఘమగు ప్రపంచజీవనవిషయజాలమున ఎవ్వడు రమించును—అని ఒకగోచిపాతధరించి, యమునిప్రశ్నించిన నచికేత బాలకుడేమి;

"యేనాహం నామృతాస్యాం,
కింతేన కుర్యామ్?'.

అని యాజ్ఞవల్క్య డిచ్చిన ధనమును పోద్రోసి అమృతజీవనమే కావలెనని, భర్తనువెన్నంటిన మైత్రేయిఏమి—

'అప్రాప్యబోధిం । బహుకల్పదుర్లభాం,
ఇహాసనాత్ కాయ మతశ్చ నిష్యతే॥"

ప్రపంచభిన్నమైన, అఖండజ్ఞానమును పొందక ఈశరీరముతో పనిఏమి అని రావిచెట్టుక్రింద కూర్చుండిన గౌతమబుద్ధుడేమి,

"రసోవై సః"

అని, కళకును భగవత్ కళకును ఐక్యమును ఉపనిబంధించిన, గైర్వాణికఆలంకారికులేమి—సౌందర్యసతోపాసకులు, ఆధునికద్రష్ట లగు గాంధీ రవీంద్రులేమి,— ఆముష్మికవిభూతుల అనుభూతులవైపునకు పర్వాత్తియుండుట మనము వినియును కనియును ఉన్నాము. భావనలలో కల్పనలును వాక్కులలో శిల్పములును, సత్యమును కాంతారూపసమ్మిత మొనర్చి ఇతోధికముగ ఉపభోగింపఁ జేయును. 'సత్యంవద' అను వేదవాణికన్న, హరిశ్చంద్రకథ బహుప్రజాకోటికి రమణీయతరముకదా! "పితృదేవోభవ" అను అనుశాసనమేమి, "భ్రాతారోమనుజాస్సర్వే" అనుసూక్తియేమి, రామాయణాదికావ్యపఠనల కన్న మనోహరము లనలేము. ఉపనిషత్తులు, శాస్త్రములు ఛాయాచిత్రములుకాగా కావ్యములు, భావరసనిష్పాదనకు, రేఖావిక్రుతులుగల "కార్టూనుల"వంటివని చెప్పవచ్చును. వ్యంగ్య చిత్రకారుల గీతలవలెనే వ్యంగ్య (ధ్వని) రంజితములగు కల్పనలతోకూడిన కవుల వ్రాతలను యథాగ్రాహ్యముగ అర్థము చేసుకొని, అందు అంతర్వ్యాప్తియగు సత్యమును అనుభూతికి తెచ్చుకొనవలెను. శిల్పి నిర్మించిన జడమగుశిలవెనుక ఏమి కవికల్పించిన, పలుకునదేమి, రసాకృతి దాల్చిన, దివ్యరూపమునో. సత్యదృశ్యమునో—మనము గుర్తించి ఆరాధింపవలెను. "దేవతా, దానవు"ల నామరూపము లన్నియు కొన్నిశక్తులకు చిహ్నములై కొన్నిభావములకు రూపములై, కొన్నిరసములకు ప్రతీకములై, సంక్షిప్త

లేఖనములోని గీతలవలె (Short hand)—మన వాడుకలోనికి వచ్చినవి తత్ప్రయోజనపరిమితు లెరింగిన విజ్ఞులు, బాహిరములగు, నామరూప ములు, ఆంతరికసత్యముల నెరుంగుటకు అవలంబ నములుగామాత్రమే గ్రహించి ప్రయోజనము తప్పక పొందుదురు.

ఈ దృష్టితో చూచినచో వాల్మీకియొక్కగాని, అన్య కవిభక్తుల రచనలుగాని, రామ కథను నవరసాలవాలముగా తీర్చి దిద్ది రాముని సర్వప్రియుని చేసినవి. రామాలయముల ఉత్సవ ములు, రామాయణ పారాయణములును, మితములుగాక, అమితములుకూడా అగు స్థాయికి వచ్చినవని తలంచువారును కలరు. సద్విశ్వాసములు, సద్దానములును, సత్పారాయణలు– అంధవిశ్వాసములు, ధన తృష్ణలు, ఆడంబర విడంబనలకు తావలములైన, సన్నివేశములు కూడా, మనకు అందందు పొడకట్టును. అంత మాత్రమున కవిరచనలు త్యాజ్యములు కాజాలవు. అవి ఎప్పటివలెనే ఉపాదేయములే. ఆ రూపములును ఉపాస్యములే. మహాత్మాగాంధీ తన తుదివిశ్వాసమువరకు "రామ" స్మరణతోనే మన కనుల ఎదుటనే, అనన్యసాధ్యములగు కల్యాణశక్తులను ప్రదర్శించి యుండుట మన మెఱుంగుదుము. వినోబాకు సీతా, రామ శబ్దములలో వ్యయపరిశ్రమల ధ్యానమే రేకెత్తుటయును మనకు విదితమే.

"రఘుపతి రాఘవ రాజారాం
సబ్‌కో సమ్మతిదేభగవాన్"

అను మహాత్ముని ప్రతిసాంధ్య ప్రార్థనా కంఠధ్వని మన చెవులలో రింగుమనుచునే ఉన్నది. అయితే ఈ ఉపాస్యదైవమెవరు? ఈ రామనామమున కర్థమేమి? అది పరాత్పరుని మారుపేరే. దాని అనుభూతి మార్గము అహింసయే. సత్యమే అవధి అహింసయే పథము. "సత్యమేవ బ్రహ్మ" అని వాక్కు. ఉపనిషత్కుహరముల ధ్వనించిన వాణియే మహాత్ముని నోటను ప్రతిధ్వనించినది. కాని విద్బ్భక్తిని దర్శింజాలక, దాని వ్యక్తీకృతరూపములగు ధ్వని, కాంతి, క్రియాశక్తులనే చూతుము. అట్లే ఈ సత్యమునకు ధర్మమునకు మూర్తరూపులైన, రామాదుల జీవన సంఘటనలో, సత్యధర్మముల ప్రయోగప్రచారములు కన్పించును. తత్భిన్నశక్తులకును రూపము లున్నవి. సద్రూపమునకు వలెనే అసద్రూపమునకు కల్పన ఇవియును సత్యములే. మన భక్తివిశ్వాసముల మేరకు ఇవియు ఉపకారచణములే. అందుచేతనే మహాత్ముడు

"I do not forbid use of images in prayer; I only prefer the worship of the Formless. This preference is perhaps improper. One thing suits one man; another thing will suit another man and no comparison can be fairly made between the two—" అని యున్నాడు. సాకారమైనరూప ఆరాధనము ప్రారంభభూమికగా, నిరాకారగుణారాధనము పరిణతహృద్వైఖరిగా రెండును ఈశ్వరాభిముఖయాత్రకు తొలిమలి దశలుగా కొందరు పేర్కొని యున్నారు. ప్రాక్ మహాకవు లందరు, ఉత్తమభక్తులు, జ్ఞాను లందరును ఏవంవిధ భిన్నదశలను తమ రచనవచనములలో పాడుకొనిరి. అందు ఆదికావ్యము, అద్భుత నిత్యధర్మభాండారము.

తులసీదాసు

వాల్మీకి తరువాత, వివిధభాషలలో ఆరామాయణము శాఖోపశాఖలుగా, విస్తరించి,

శ్రీరాముని రూపనామములు, ప్రజాహృదయములపై కాణాచులుగ జేసినవి. దక్షిణమున 'కంబర్', ఉత్తరమున, తులసీదాసు, తమతమ భావనల ననుసరించిన కల్పనావైవిధ్యముతో, రామాయణమును బృహత్ కవితాపీయూష కుంభముగా, జ్ఞానహ్రదముగా రూపొందించిరి. అది అంతయు పావనవాఙ్మయస్రవంతిగా జన సామాన్యముయొక్క హృదయముల మాగాణములపై యుగయుగములుగా ప్రవహింప జొచ్చినది. రామాయణమాకందశాఖపై వాల్మీకి కోకిలమువలె, తులసీదాసుకూడా అనన్యసామాన్యమగు ప్రతిభాపుష్టితో జ్ఞానదృష్టితో భక్తి నిష్ఠతో- ఈకావ్యసృష్టి చేసినాడు. తులసీదాసుని ఈ రామాయణమును గద్య పద్యరూపములలో, తెనుగునాట నాటిన కవులు, హిందీ భాషలోని తులసీపరిమళమును తెనుగులకు అందించి, మిగుల సేవచేసినవారైరి.

శ్రీరామచరిత్ మానస్ హిందీప్రేమికోటికి, ఒకమహాప్రియతమ కావ్యము. తులసీదాసుకూడ అట్లే నిరంతరపూజ్యమహాభాగుడు. ప్రయాగ సమీపమున రాజాపురగ్రామమున 1583 సం॥ హులసీ ఆత్మారామదుబేలకు 12 నెలలగర్భము పిమ్మట ప్రభవించి, బాల్యమున 15వ ఏటికే వేద వేదాంగములునేర్చి, యుక్తవయస్సున వివాహమై, భార్యయొక్క ఈపల్కులకు విరక్తి పొందెను.

"లాజ్ నలాగత ఆపుకో దౌర్ ఆయేహుసాథ్,
ధిక్ ధిక్ ఐసే ప్రేమకో,....కహాకహుహుం మైనాథ్
అస్థి చరమ మయ దేహ మమ తామై జైసీప్రీతి
తైసీ జౌ శ్రీరామ మహాహోతనతౌ భవభీతి !"

"ఓనాథా పుట్టింటికి వచ్చిన నావెంటనే ఇట్లు పడివచ్చుటకు నీకు సిగ్గులేదా? అస్థిచర్మమయము ల కాణాచులగు నాశరీరము పై రాగము, రామునిపై ఉన్నచో- నీకు భవభీతి నశించును గదా"

పిమ్మట పరివ్రాట్పుధర్మమున, భక్తకవిసామ్రాట్టయిన ఈమహనీయుని జీవితము, సత్యజ్ఞాన ప్రభావితమైనది. మధుసూదనసరస్వతియును మహాపండితు డీకృతినిచూచి ఇట్లు శ్లాఘించి యున్నాడు.

'ఆనంద కాననే హ్యస్మిన్
జంగమః తులసీతరుః,
కవితా మంజరీ భాతి,
రామ భ్రమర భూషితా'

ఆనందవనమున కదలు తులసీతరువునకు రాముడను తుమ్మెద వ్రాలిన కవితాపుష్పగుచ్ఛము కలదు. శ్లోకములు ఆదియందును పిమ్మట దోహాలు చౌపాయిలుగను ఆమహాకవినుండి భక్తిజ్ఞానయోగాదిధర్మము లన్నియు హిమగిరి ముఖమునుండి వెడలు భాగీరథివలె, ఉత్తుంగ తరంగములు, రసావర్తములు కలిగి అనర్గళ ధారాళముగా ప్రవహించినవి. దీనిని సత్యమ్, శివమ్, సుందరమ్ అని కాశీవిశ్వేశ్వరు డనినట్లును ప్రవాద మున్నది. ఒక శ్రీరామనవమినాడు కృత్యాది గావించి, 2సం॥ 8నెలలలో సాంత మొనర్చెనట. కాలాంతరమున "వినయపత్రిక"ను కూడా రచించెను—మరికొన్ని రచనలును కలవందురు.

ఉత్తరమున—"రామచరిత మానస" సరస్సు

హిందీలో రామచరితమానసము—(1) బాలకాండము. (2) అయోధ్యాకాండము. (3) ఆరణ్యకాండము. (4) కిష్కింధాకాండము. (5)

సుందరకాండము. (6) లంకాకాండము. (7) ఉత్తరకాండము–అని సప్తకాండములు కలిగి యున్నది. ఇందలి అంతర్గతప్రకరణములు విశ్రామములుగా ఉన్నవి. నాకు దొరకిన గోరక్‌పూర్ వారి గీతాప్రెస్సున ప్రకటితమైన హిందీప్రతి పెద్దసైజున లఘువ్యాఖ్యలతోకూడి 1000పుటలు మించియున్నది. దీనినిగూర్చి హనుమాన్ ప్రసాద్‌పోహారాను ఔత్తరాహహిందీవిపశ్చిన్మణులు ఇట్లనినారు.

"శ్రీరామచరితమానస్ యొక్కస్థానము హిందీసాహిత్య మందేకాక, విశ్వసాహిత్య మందును, అపూర్వ మనియు, ఇంతసర్వాంగ సుందరము, ఉత్తమకావ్యలక్షణభరితము, సకల రసాస్పదము, కళాదృష్ట్యా సర్వోన్నతము, ఆదర్శగార్హస్థ్యము, ఆదర్శరాజధర్మము, ఆదర్శ పారివారికజీవనము, ఆదర్శపాతివ్రత్యధర్మము, ఆదర్శభ్రాతృధర్మములు– వీనితోపాటు, భక్తి జ్ఞాన, త్యాగ, వైరాగ్య, సదాచారశిక్షణ, వివరణలు, స్త్రీ పురుష బాల యువ వృద్ధులకు సమోపయోగిత్వములు, సాకారభగవానుని అవతారలీలావిశేషములు, ఓజస్వంతము, రోచకము సరళమగు పదగుంఫనము కలిగిన ఇట్టి గ్రంథమునకు ఈడు, హిందీయందేకాక, ప్రపంచమున ప్రాయశః మరి యేభాషయందును విరచితము కాలేదు."

దీని పావిత్ర్యము, ఉద్దేశములు:

బిమల కథా కర కీన్హా అరంభా
సునత నసాహీ కామమద దంభా॥
రామచరితమానస ఇహి, నామా
సునత శ్రవన పాయిఅ విశ్రామా
మన కరి విషయ అనల బిన జరఈ
హోయి సుఖీ జౌ ఇహి సరపరఈ ౬౭, ౩౯

...ఈనిర్మలకథ, ఆరంభించితిని. దీనిని వినుచో, కామమదదంభములు నాశమగును. మనస్సు అను ఏనుగు విషయమను నిప్పు చెండకు కనలి, రామచరిత మను మానససరోవరములో ప్రవేశించి శాంతిని బడయుగాక" అని తన ఉద్దేశమును ప్రకటించెను.

... ...

త్రిలింగమున కేశవతీర్థము

ఇట్టి పవిత్రమును పృథురూపమునుగల మహాకావ్యమును, తెనుగులకు తేటతెల్లముగ అందించు తలంపు అత్యంతము శ్లాఘనీయము. ఈ మహాసాహిత్యశిల్పసవనమునకు శ్రీశ్రీశ్రీ కేశవతీర్థస్వామివారు పూనుకొనిరి. శ్రీరామతీర్థసేవాశ్రమముద్వారా, రామదర్శనం పత్రికద్వారా, ఆంధ్రమునపాశ్చాత్యలోకమునకు వీరు మిక్కిలి సన్నిహితులై, అధ్యాత్మికక్షేత్రమున ప్రధానకృషి గావించిన మహాభాగులు. శైశవమునుండి, విరాగపథమున అనురాగము కలవారై, పిడుగు రాళ్ళకడ, సేవాశ్రమమునుస్థాపించి, భక్తిజ్ఞానముల సారస్వతమున, త్రిలింగవాసులను మేల్కొల్పి, నిరంతరవరివస్య గావించిన యతితిలకులు. వారిపలుకులలోనే వారిప్రయత్నములను విందుముగాక!

"నరునిలోని సర్వానర్థకమైన అహంభావమును ఉన్మోచనము జేసి, సర్వమంగళకరమైన శివోహం భావమును సుప్రతిష్ఠిత మొనర్చి— నరుని నారాయణునిగా—విశ్వమును విష్ణుమందిరంగా—ప్రకాశింప జేయడానికే శ్రీరామతీర్థసేవాశ్రమ వేదికపైన జనతా జనార్దన ప్రీతికరమైన ఒక బృహత్ జ్ఞానయజ్ఞం వివిధ కర్మాంగములతో నిర్వహింపబడుతున్నది.

'హృదయమును భక్తిమయంగా, బుద్ధిని జ్ఞాన దీప్తంగా, శరీరమును సత్కర్మానుష్ఠాన యుతంగా చేసి—జీవితమును దివ్యీకరించి—మానవుని బ్రహ్మనిర్వాణ శాంతిసామ్రాజ్యానికి పట్టాభిషిక్తుని చేసే—సర్వజనీన ధర్మావతార మూర్తి, నవయుగ జగదాచార్య దేవుడైన శ్రీరామతీర్థస్వామి వారి అనుష్ఠాన వేదాంత సందేశ ప్రసారం—ఈ శ్రీరామతీర్థ సేవాశ్రమ జ్ఞానయజ్ఞమునందు ప్రప్రధాన విషయం."

ఈ ఆశయముల ననుసరించియే.....వారు చిన్నపొత్తములు, పిన్నలకందు బాటులోను, పెద్దవి పెద్దలకును ప్రధానముగా వినియోగపడు లాగున, అనేకపవిత్రగ్రంథములు రచించి ప్రచురించియున్నారు. ఇంకను పెక్కుకృతులు, పాఠక కరకమలములను అలంకరింపనున్నవి. వీరు నృసింహోపాసకులుగా ఉన్నారు. కాని గ్రంథములు, విశ్వజనీనములు, బహుళచ్ఛందస్సులలో బహుళరసాత్మకములై యతివర్యుల విశ్వమతిత్వమునకు దార్కాణలుగా నున్నవని నేను తలంతును. ఇట్లు ఆత్మరంగమున గద్యపద్యరచనల సిద్ధహస్తు లగుటచేతనే, తులసీరామాయణమును, తెనిగింప అధికారము గలవారైరి. వీరు ఇందు నాల్గుకాండలు మంజరీద్విపదలో, విరచించిరి. తక్కిన మూడుకాండలు శ్రీపాటీలు తిమ్మారెడ్డిగారు అనువదించిరి. శ్రీకేశవతీర్థస్వామివారి సహచరులైన వీరును నారదభక్తిసూత్రాది బహు గ్రంథకర్తలు. విద్వాంసులు.

అనువాద విధానము
అందలి మురువు మెరుగులు

అనువాదము సులభసుందరము ధారాళమై పాఠకుని మనస్సును ఆపు నిలుపులు లేకుండా తనతో గొంపోవునదిగా ఉన్నది. మూల రామాయణమునకు తీసిపోని అనర్గళశైలితో తెనుగు నుడికారపు తేనె సోనలతో, పఠితృహృదయమును రంజింప జేయకలిగియున్నది. మూలమునకు సరియగు భావప్రకటనము సాధారణముగ కొంతకష్టమైనను, వీరి రచనములు మాత్రము సుఖావహములుగా సాగిపోయినవి. ఇతరుల కొన్నికొన్ని అనువాదములలో కన్పడు వ్యర్థపదములు ఈ మంజరులలో కన్పడుటలేదు. అటనట అరుదుగా చెలగె పొల్చు పదము లున్నను ఔచిత్యరహితము లనవీలులేదు. మూలమును మించిన మెఱుగులు బహుళత్ర కన్పడుచున్నవి. చూడుడు—

♦తాపస, సమదమ దయానిధానా।
పరమారధపద పరమ సుజానా॥ బా॥ కా॥ (75-9)

తాపస అన్న ఒకమాటను,

'నిరుపమ ఘనతపో నిష్ఠాపరుండు'

అని హాయిగా విస్తరించిరి.

(2) మూ॥ సాదర మజ్జహి సకల త్రివేణీ 1

తెనుగుసేత

ఆత్రివేణీ ప్రసన్నాంబువులందు
ఆదరంబున స్నాన మాచరించెదరు—88 పుట.

(3) హోయి నరహరి దూసర పుని మారా.
జన ప్రహలాద సుజస విస్తారా॥ (౨౩౯)

ఆపయి నారసింహావతారమున
ఆహేమకశిపు 'గర్భాంతరాళమును
నిర్భిన్న మొనరించి నిస్తులశాత
వజ్ర నఖాగ్ర దుర్భర విక్రమమున
పరమభక్తుం డగు ప్రహ్లాదుయశము
దశదిశాక్రాంతమై తనరంగఁజేసె

అని తమకుగల నృసింహభక్తి పెంపున ఆ ఆవేశ పారవశ్యమున 'మారా' చంపెను అన్న క్రియను ఎలా మనోహరముగా విస్తరించిరో- పాఠకులు తెలియగలరు. గర్భాంతరాళమును నిస్తులశాత వజ్రనఖాగ్ర దుర్భరవిక్రమమున నిర్భిన్న మొన రించుట మనకు రూపించిరి.

(4) ఇట్లే "సుభట"అని తులసీదాసువాడగా,
భండనపాండిత్యపై భవాన్వితులు-అని పలికిరి. (88)

(5) జోగ్ లగన గ్రహబార తిధి సకలభయే, అనుకూల
చర అనుచర హర్షజుత రామజనమ సుఖమూలా
(౨౧౨-౨౧౦)

తె. సే. ఆలయోగలగ్న గ్రహానీకవార
తిథు లన్నియును మహాదివ్యమూరీతి,
అనుకూలముగ ఉండె (అనఘచరిత్ర!)
సచరాచరంబగు జగతి హర్షించె
సుఖమూలమగు రామశుభజన్మమునకు-

అని యథానువాదము లలితలలితముగా చేసిరి.

(6) ఏక రామ అవధేశ కుమారా
తిన్హకర చరిత విదితసంసారా
నారి విరహ దుబలహేయు అపారా
భయము రోష వన రావను మారా॥

తెనిగింపు -

ఒక్క శ్రీరాము డయోధ్యేంద్రు తనయుఁ
డాతని చారిత్ర మఖిలప్రసిద్ధ
మాత్మ ప్రియావిరహాకుల భార
సంజాతచండ రోషంబుచే నతడు
రావణు బడగూల్చె రణరంగమందు. 450

తగిన స్వేచ్ఛ గైకొన్న సందర్భములు చూడుడు.

(7) సును ముని మిటి హివిషాద,

అనువాదము -

వినుమి నీఈశంక విడిపోవగలదు.

అయోధ్యాకాండారంభమున తులసీదాసు తన శివస్తుతిలో -

"యస్యాంకేచ విభాతి భూధరసుతా....
భాలే బాల విధుః- అనగా,
.....జటాళినే
ణాంకుడు

అని (శ్రీ) తీర్థులువారు అనువదించిరి. నుదురు నకు బదులు, వానిపై గ్రమ్ముకున్న జడలుకూడ స్ఫురింపఁజేయుటకు ఇట్లు మనోహరముగా భావింపబడినది.

తులసీదాసు రామకథవ్రాయుచు కాండాదిలో శివస్తుతి సల్పుట, వాని జ్ఞానైర్మల్యమునకు నిదర్శనము. "ఏకం సత్ విప్రా బహుధా వదంతి" అన్న సూక్తిని మరచిన శైవవైష్ణవులు పరస్పర నిందలు గావించుకొన్న సందర్భములు మెండు చూడుడు :

"మహాపాపవతాం పుంసాం, పూర్వజన్మసు సువ్రత
విష్ణుస్సర్వాధికోభాతి, నసాక్షాత్ పరమేశ్వరః"

"ఓ సువ్రతా మహాపాపికే విష్ణువు దైవముగా భాసించును - ఇత్యాది". ఇట్టి వానిని పరిహరించుటకు ప్రాచీన శిల్పాచార్యులు హరిహర రూపమును భావించినట్లు, తిక్కన తన భారతరచనలో అట్టి దేవతారూపమును ఆరాధించినట్లు - తులసీదాసు, శివునిచే రామకథ చెప్పించి, తా నావిశ్వనాథుని స్తుతించుట, ఆతని సత్యానుభూతికి తార్కాణ మనవచ్చును. బాలకాండలో వివిధ దేవతా నామ రూపములకు వినతు లర్పించిన విధానము విశిష్టము. అట్లే (శ్రీ) కేశవతీర్థులవారును రామదర్శన పత్రికలో- వివిధ మత ప్రవక్తల సూక్తులను గుదిగ్రుచ్చుచు, తమ ముఖపత్రమున మసీదు, కోవెల, చర్చిల

సమ్మిళితరూపమును ప్రకటించుచుండుట, ఆంధ్ర లోకమునకు విదితమే. సత్యద్రష్ట లందరు ఇట్టి సమన్వయదృష్టినే కల్గియున్నారు. మహాత్ముడేమనెనో చూడుడు.

(a) "I beleive that all the great religions of the world are true more or less. I do not beleive in the exclusive divinity of the Vedas. I beleive the Bible, the Koran, and the Zend Avastha, to be as much divinely inspired as the Vedas... I decline to be bound by any interpretation, however learned it may be, if it is repugnant to reason or moral sense——"

"(a) It is a tragedy that religion for us means to day nothing more than restrictions on food and drink; nothing more than adherence to a sense of superiority and inferiority. Let me tell you that there can not be grosser ignorance than this...no scripture which labels a human being as inferior or untouchable because of his or her birth can command our allegiance; it is a denial of God and Truth which is God." —Mahatma Gandhi.

ఆరణ్యకాండలోని తులసీదాసు పలికిన ఈపలుకులు ప్రశ్నార్హములుకాగా తరువాత శబరితో పల్కినపల్కులు గమనింప దగియున్నవి.

పూజిఅబిప్రశీలగునహీనా; శూద్రనగునగనగ్యాననమేతా॥

* * *

జాతిపాంతి కుల ధర్మబడాఈ, ధనబలపరిజన చతురాఈ
భగతి హీన నరసోహాయికై సాబినుజలవారిదదేఖిఉజైసా।

(శ్రీ) కేశవ తీర్థులవారు, విశ్వజనీనసిద్ధాంతములలో విశ్వాసము కలవారగుట, విశ్వకుటుంబి ధర్మమునకు సన్నిహితు లగుచున్నారు. వీరు తొలిప్రార్థనలలో నరసింహావతారము, గురునుతి, శివనతి, బ్రహ్మాదుల వందనాదులు అన్నియుచేసి, తమ అనువాదకరణమును గూర్చి ఇట్లనిరి.

(9) "కలయండైన నొనర్పనేరని మహాకార్యంబు
గైకొంటి;" ననియు; "పలుకుల
నమృతము చిలుకగ, బలికెద శ్రీరామచరిత
వరశుభభరితన్," అనియు,
"తనదగు రామాయణమును తెనుగున రచియింపజేసి
తేటపడంగా
ననుధర కృతార్థజేసిన, ఘనతులసీదాసు
పాదకంజము లెంతున్"

అనియు, తమ మహాప్రయత్నమున కృతకృత్యులైరి. అనువాద సారళ్యముతోబాటు అనువాద ప్రౌఢిమను గుబాళించు ఈకవితామంజరిని చూడుడు.

(10) కామకోటి ఛబి స్యామ సరీరా
నీలకంజ వారిద గంభీరా
అరుణచరన, నఖజోతీ, కమలదలన్హాబై లేఖను
మోతీ (187-7 పుట)

నీలాబ్జ నిర్మల నీరదశ్యామ
కామ కోటి మనోజ్ఞకాయంబుతోడ
కమల పత్రస్థిత ఘనమూ క్తి కోప
మానారుణాంఘ్రి పద్మద్వయ లలిత
నఖముఖోద్గత మహోన్నత దీప్తితోడ (130 పుట)

అందందు వీరు గేయములుకూడా చొన్పి, పాఠకునికి వైవిధ్యవిశ్రాంతిని చేకూర్చిరి.

(11) రామ సురూప తుమర్హా వచన అగోచర, బుద్ధిపర
అవి గత అకథ అపార నేతి నేతి నితనిగమ
కహా॥ మూ, అయో-126

భవత్స్వరూపము శ్రీరామా
వాక్కుల కందదు శుభనామా!
బుద్ధికి పరము పరంధామా! (అను.298 పుట)

* * *

నేతి నేతి అను రఘురామా

అయోధ్యాకాండలో—

(11 ఎ) జౌ. పితు మాతు కహేఁ వనజానా
తౌ కానన సత అవధ సమానా॥

(మూ-గ్రం-379 పు)

తల్లిదండ్రుల ఆజ్ఞచే వనమునకు వెళ్ళుచో-
వనమే నూఱుఅయోధ్యలవలె సుఖప్రదమని—

ప్రసన్నతాం యానగతాభిషేకతః
తథా నమమ్లే వనవాసదుఃఖతః—

అని, పట్టాభిషేకమును- వనగమనమును- ఈ రెండు సుఖదుఃఖసన్నివేశములలో వికార మొందని రాముని స్థితప్రజ్ఞ- కారాగారము నుండి బయటకు రమ్మన్నప్పుడు- లోనికి పొమ్మన్నప్పుడు- ఒకేమందహాసము చేసిన మహాత్ముని స్థితప్రజ్ఞ-వలె, అద్భుతము. అభిగమ్యము.

* * * *

సీత అపహృతయై ఏడ్చునప్పుడు:—

సీతా కై బిలాప సునిఖారీ
భఏ చరాచర జీవ దుఖారీ

అని, చరాచరములుకూడా దుఃఖించినట్లు తులసీదాసు చెప్పెను. భవభూతి:—

'అపిగ్రావంరుదతి' అపిదళతి వజ్రస్యహృదయం అని వర్ణించినాడు.

శిలాజాలము ఏడ్చినది. వజ్రముల కఠినహృదయములును ద్రవీలిపోయినవి-అని.

అత్రి ధ్యానమున తులసీదాసును అమర వాణిలో 12 శ్లోకములు వ్రాసియున్నాడు. ఆ మారిన ఛందస్సునకు శ్రీ తీర్థులవారి వచఃపయస్సుల చవిచూడుడు.

(12) నమస్స్వభక్తవత్సలా కృపాలవాలకోమలా.
అహైతుకాత్మభక్తులన్ స్వధామమిచ్చిప్రోచు-
"నమామి భక్తవత్సలం, కృపాశీలకోమలం
భజామితే పదాంబుజం, అకామినాం స్వధామదం".
(420 పుట)

ఋతువర్ణనలో బాహ్యప్రకృతిని, మానవుని ఆంతరప్రకృతిని, ఉత్ప్రేక్షించి, తులసీదాసు తన నిశితజ్ఞానదృష్టిని, కవితా సమాత్కృష్ట్యమును వెల్లడించిన తీరు - (475 పుట)

"వరషాబిగత, సరద రితు ఆఈ,
లఛిమన్ దేఖహు పరమ సుహాఈ,
ఫూలోం కాస్ సకలమహి ఛాఈ
జను బరషా కృత ప్రగట బుఢాఈ-(౬౬-౧)

అనువాద సాధుత్వము చూడుడు -

వర్షర్తు విల జరాభర మొందినటుల
తెల్లని పూలను కొల్లగాఁగల్గు
కాశనామక తృణ గణముతోనిండి
యున్న దదే సమస్తోర్వీతలంబు-

ఋష్యమూకాద్రిపై, వాల్మీకి, నగల మాటను పరిశీలించు లక్ష్మణునిచే, త్రికాలసందేశకమగు ఒకమాట చెప్పించి, అన్యస్త్రీల ఆలోకనమును గూర్చి, లలితమగు హెచ్చరిక చేసిన తీరు చూడుడు-

నాభిజానామి కేయూరౌ, నాభిజానామి కంకణౌ,
నూపురౌత్వభిజానామి, నిత్యం పాదాభివందనాత్॥
"ఈదండ కశియములు, ఈమురుగులు నాకు

తెలియవు. నిత్యము పాదవందనముచే, (మా వదినె) అందెలు మాత్రము గుర్తింపగలను. కాని, ఈసన్నివేశము తులసీదాసు పేరొక్కనక, సీత తన వస్త్రశకలమును క్రిందకు బడవేసెనని మాత్రము ఇట్లు చెప్పెను.

(14) రామరామ హా రామ పుకారీ
హమహిదేఖి దీన్హీఉ, పటడారీ
మాగా రామ తురత తేహి, దీన్హా
పట ఉరలాయి సోచ అతికీన్హా॥

రామ రామ అనుచు, ఆపె తనగుడ్డ ముక్కను పడవేసెను. రాముడు కోరగా, అత డది ఇచ్చెను. అది తన మొమ్మ్రీపై పెట్టుకొని, రాముడు దుఃఖించెను.

సుందరకాండలో తులసీదాసుయొక్క రామ వందనము శార్దూలవృత్తములోనుండి సీసము లోనికి మార్చుపట్ల మూలమున లేని మేలి దనము– భాసురకపోలతలో స్ఫురింప చేయుచు "కరుణాలవాలు భాసురకపోలు" అన్న పోతన్న గారి వర్ణనను తలప జేయుచున్నది.

"బ్రహ్మేశంభుఫణీంద్రసేవ్యమనిశం—"

అన్నపాదమును

(14) పద్మభవ, నీలకంధర, పాకశత్రు
శేషముఖ్యసోపర్వాణసేవ్యమాను.

మూలమునకు మెఱుగే అని తోచును.

వాల్మీకి సుందరకాండలో – హనుమత్ దర్శ నము ఆకస్మికముగా పొందిన సీతను – మూర్ఛ పొందినట్లు ఈ క్రిందితీరున వర్ణించెను.

(15) సా తం సమీక్ష్యైవ భృశం వి సంజ్ఞా
గతాసు కల్పేవ బభూవ సీతా॥
(వాల్మీ. రా. సుం-32 స)

తులసీదాసు ఇట్లు వర్ణించెను.

తబ్ హనుమంత, నికట చలి గయయుం,
ఫిరి బైఠీం మన విసమయ భయఊ॥

అనువాదకులును

"ఆమె ఆతని గాంచి ఆశ్చర్య మొంది మఱియొక వంకకు మగిడి కూర్చుండె" అని చక్కని మూలానుసరణ మొనర్చిరి.

హనుమంతుడు రాముని వర్ణించుపట్ల వాల్మీకి:

(16) తేజసాఽదిత్యసంకాశః క్షమయాపృథివీసమః
బృహస్పతి సమోబుద్ధ్యా యశసా వాసవోపమః॥
వాల్మీ. సుం, 35 స॥

రామప్రతాపమును అనువాదకులు వర్ణించిన తీరు.

నిసిచర నికర పతంగ సమ; రఘుపతి బాణ కృశాను;
జననీహృదయధీరధరు; జరే నిసాచరజాను॥

అనువాదము :

నిశిచరగణము లన్నియు శలభములు
పతి అస్త్రవితతివై శ్వానరాభమ్ము
"దితిసుతుల్ భస్మసాత్కృతులాట నిక్క
మీ జాడ .... "

విజయకోలాహలములో ఉన్న సమయమున కూడ, శ్రీరాముని మనస్సు తన తమ్మునిపై పోయెనేగాని, విజేతగా, ఆనందపడ నుద్యుక్తము కాలేదు. పన్నీటి జలకములు, అలంకరణలు క్షుద్రములైనవి.

(17) తం వినా కేకయీపుత్రం భరతం ధర్మచారిణం
స్నానం నాభిమతం స్యాత్మే వస్త్రాభరణాదికం,
తథా॥

అని వాల్మీకి అనగా –

తోర కోస గృహ మోర సబసత్యవచనసునుభ్రాత।
భరత దసా సుమిరత మోహి, నిమిషకల్పసమజాత॥

అను॥ తమ్ముడ కోశ సౌధమ్ములు నావి
యగుట తథ్యమ! కాని యచ్చటి భరతు

దశ అస్మదీయహృదయమ్మునఁ బార
ఋణ మొకకల్పముగతి ప్రవర్తిల్లు -

ఇత్యాదిగా చక్కగా అనువదించిరి. లంకా. ఉత్తరకాండలో -

కాకభుశుండికి భక్తిజ్ఞానముల వివరించు ఘట్టము- బంధుర భావములతో మనోజ్ఞముగా నడచినది.

గ్యాన్, విరాగ జోగ విగ్యానా,
ఏ సబ పురుష సునహు హరి జానా,
పురుషప్రతాప ప్రబలసబభాంతీ
అబలా అబల సహజ జడజాతీ॥ ఉత్తరకాండ.

"వైనతేయా! జ్ఞానవైరాగ్యయోగ
విజ్ఞానముఖ్యముల్ (వెస) పురుషాళి,
ఇంతిని వేఱొక ఇంతి మోహించు
టెరుగుదు మొక్కొ; మహీస్థల మందు-(645 పుట)

అని చక్కని ఉపమానమున తత్తత్త్వమును నుడివి యున్నారు.

(19) హరిభక్తి విడనాడి యన్యసాధనల
భవము దాటగఁ గోరువా డొకనొక
యేనియుఁ గైకోక యీది సాగరము
దాటగఁ దనమదిఁ దలపోయునట్టి
వాడు ....

(644 పుట)

కావున, ఈ అనువాదక శిరోమణులు ఇరువురును ఉత్తరకాండ నవమవిశ్రామమున ఆదిలోఁ జేసిన నృహరిస్తుతి, ఎంతమనోజ్ఞమో అంత మహితమును.

(20) కేశవ యతిరాట్, తిమ్మక
వీశస్తుత్యాంఘ్రి యుగళ! విమలప్రేమా
వేశా! శాబరలక్ష్మీ
కైశిక సంస్కరణ హస్తకమల! నృసింహా!
* * *

ఇట్లు మంజుమంజులశైలిలో, మంజరీద్వీపదలో-తులసీరామాయణ మంతయు, కూర్చి యిచ్చిన శ్రీశ్రీశ్రీ కేశవతీర్థస్వాములవారును శ్రీపాటేలు తిమ్మకవీంద్రులును, ఆంధ్రవాగ్దేవతకు, పరువమ్ము చెడని, వాడని పారిజాతసుమమంజరిని సమర్పించినవా రయిరి. ఈరచనాసారభము, స్థలకాలావిచ్ఛిన్నమైన మహిమతో, వెలయునని నావిశ్వాసము. జయంతితేరససిద్ధాకవీశ్వరాఁ. సముద్రమువంటి ఏవంవిధవిస్తార హిందీకావ్యమును, ఇంత సుందరముగా, తెనిగించిన అనువాదక విద్వత్కవులకు ఆంధ్ర సాహితీ, ముముక్షులోకములు రెండును మిగుల ఋణపడియున్నవి.

గుంటూరువాస్తవ్యులు, శ్రీకర్వారపు రామకృష్ణమూర్తి బి.కాం. (ఆనర్స్) గారు, ఒక్కరై ఈమహాకృతిముద్రణకు కారణభూతులై గృహానామము నకు అన్వర్థముగా యశఃకర్పురక్షోదమును దశదిశల నింపుకొన్నవారైరి. వారివితరణఅసాధారణము. అత్యంతము. అభినందనీయము.

ఇట్టి మహాపావనము మహావిస్తారమగు రామాయణకృతికి నన్ను పీఠిక వ్రాయవలసినదిగా కోరిన శ్రీకేశవతీర్థులవారి అవ్యాజమగు అనురాగమునకు నేను మిగుల చకితుడనైతిని. నన్నేల కోరిరో నాకు బోధపడలేదు, సేతుబంధనమున ఉడుతవలె ఈకార్యము యథాశక్తి గావించితిని. ఆంధ్రపఠిత్రీలోకము, ఈమంజరీరామాయణపఠనమున, కర్తవ్యనిష్ఠాపథమున నడచుగాక అను ఆదర్శము మనమనోగుహలలో ప్రతిధ్వనించుగాక!

యేనాకేనాపిమార్గేణ, లోకస్యారాధనం పరమ్
శంనో అస్తు ద్విపదే శం చతుష్పదే॥

నమశ్శ్రీవిశ్వకర్మణే

2-3-'63

పులివర్తి శరభాచారి

పీఠిక

విద్యావాచస్పతి, కవిసార్వభౌమ, మహోపాధ్యాయ,
సాహిత్యాచార్య, సాహిత్యసామ్రాట్, కవీంద్ర
శ్రీ శివశంకర స్వామివారు

1

(శ్రీ) కేశవతీర్థస్వామివారున్నూ, తిమ్మారెడ్డి గారున్నూ ఆంధ్రములోని కనువదించిన "రామ చరితమానసము" మన అనువాదసాహిత్యము నకు నూతనాలంకారము. ఉభయులును రామ భక్తులు, భాషావిశారదులు, ఆంధ్రకవిత్వమున చేయితిరిగినవారు. అధ్యాత్మచింతన కలిగిన వీరిరువురు తులసీదాసరామాయణము యథా మాతృకముగా సుబోధకముగా కొన్నియెడల కొలది విపులీకరణములతో అనువదించినారు. వీరు ప్రధానగ్రంథమును మంజరీద్విపదలో రచించినారు. ద్విపద ఋగ్వేదమునగూడ "ద్విపదా విరాజ్" అను నామముతో చాల తావుల కానవచ్చును. ఆంధ్రభాషలో వీరశైవకవులు ప్రధానముగాను, తదితరకవివరులు కొంతవరకును తమ కావ్యములలో ద్విపద నవలంబించినారు. కొన్ని ఆంధ్రకావ్యములు సంపూర్ణముగా ద్విపదనాశ్రయించినవి.

ఆధునికకవులు ద్విపదలోని ప్రాసమును విడిచి ఏ పంక్తి కా పంక్తిగా, కొన్నియెడల ప్రాసయతితో నడపినారు. ఈ కవిద్వయము ఆధునిక కవిపుంగవుల మంజరీమార్గమున మధురగతిలో గ్రంథమును నిర్వహించినది.

తులసీదాసకృతరామాయణమునకు రామచరితమానస మని ప్రసిద్ధి. అందు ప్రతికాండము లోని పీఠికారూపముగా దేవతానమస్కారాదికముగా, సంస్కృతవృత్తములు కొన్ని కలవు. వానిని వీరు చక్కగా వృత్తములలోని కనువదించినారు.

రామభక్తికలవారి కెల్లరకు ఈగ్రంథము పఠనయోగ్యము. ఇదివరలో నేను చూచిన అనువాదములలోని కెల్లను ఇది సరళతరముగానున్నది.

2

రామచరితమానసము హిందీభాషలో రచించిన తులసీదాసు ఔత్తరాహబ్రాహ్మణుడు. యమునాతీరమున రాజపురగ్రామమున క్రీ. శ. 15 శతాబ్దిలో జన్మించినాడు.

తండ్రి ఆత్మారాం.

ఆతని బాల్యమునసే జననీజనకులు పరమపదించినారు. వారు రామభక్తులగుటచేతను వారు రామాయణము పఠించుచుండుట చేతను కుమారుడు చిన్నతనములోనే రామభక్తుడై నిరంతర రామనామజపము చేయుచుండెడివాడు. అందుచే అతనికి 'రామబోలా' అను నామము వచ్చినది. కాలక్రమమున తులసీదాసు వివాహితుడై ధర్మపత్ని రత్నావళీదేవియెడ విశేషప్రీతితో నుండెడివాడు. రమారమి 12 సంవత్సరములు గృహస్థధర్మము నెరపినాడు. కొలది

కాల మైనను భార్యను విడిచియుండ జాలని తులసీదాసు ఒకసారి రత్నావళి చెప్పకుండ పుట్టినింటికి పోవగా, బయలుదేరి వర్షమును లెక్కింపక పొంగిన యమునానది నీది దాటి అత్తవారింటికి కష్టముమీద అర్ధరాత్రమున చేరి భార్య నెలుగెత్తి పిలిచినాడు. ఆమె ఆశ్చర్యపడి ఇంతటి ప్రీతి శ్రీరామునియెడ నున్నచో మే లగు నని భర్తను మందలించెను. మనస్సు చివుక్కు మని తులసీదాసు గిరుక్కున వెనుదిరిగి పోయెను. భక్తి ప్రపూరిత మైన ఆతని మనసు పరిపాకము చెంది యుండుటచే తోడనే ఆయనకు గాఢవిరక్తి కలిగినది.

చిత్రకూట, అయోధ్యా, కాశీ, సీతావట ప్రభృతి క్షేత్రములలో విహరించుచు సత్సాంగత్యముచేయుచు పెద్దలకడ శాస్త్రము లభ్యసించుచు తులసీదాసు జ్ఞానాభివృద్ధి చేసుకొనుచుండెను.

అతనికి కవితాశక్తి అంకురించినది. రామభక్తి దృఢమైనది. ఆత డేది రచించినను రామసంబంధ మైనదే.

అయోధ్యలో నివసించుచుండగా తులసీదాసు రామచరితమానసము ప్రారంభించెను. కాని కొలదిమాసములలో కాశికి పోవలసివచ్చెను. అచటనే నివాస మేర్పరచుకొని ఆయన ఒకానొక గోసాయి (గోస్వామి) సంప్రదాయమున దీక్షితు డయ్యెను. అన్యులకు బహుకాలమునకు గాని ఉపలబ్ధము కాని జ్ఞానము ఆయన కొక్కరోజుననే ఉదయించుటచే తత్సంప్రదాయము వారు ఆయననుమఠాధిపతిని చేసినారు. కొలదిదినములలోనే ఆయనకు మఠాధిపత్యముపై విరక్తి కలిగినది. తులసీదాసు మఠమునువదిలి స్వతంత్రముగా జీవనము జేయసాగెను. తులసీదాసు రచించిన గ్రంథము లనేకములు గలవు. అయినను రామచరితమానసము, వినయపత్రిక, గీతావలి మొదలగునవి ముఖ్య మైనవి.

తులసి అధ్యాత్మరామాయణము పండితుల కడ విన్నాడు. రాముడు భగవంతు డను అవతార వాదము అంగీకరించినవారికి సామాన్య రామాయణముకన్న అధ్యాత్మరామాయణమే అధికప్రీతిపాత్రము.

వాల్మీకి రామాయణము కవివాక్యమువలె వినబడును. అంతకన్న భగవద్వాక్యమువలె వినబడినపక్షమున ప్రయోజనమధికము. కావున శివుడు ఉమాదేవికి రామకథ చెప్పినట్లు తులసీదాసు పౌరాణికధోరణి నవలంబించినాడు. అందువలన శ్రోతలకు ప్రమాణబుద్ధి ప్రస్ఫుట మగును.

అంతకు పూర్వమే కొలదిశతాబ్దులనుండి భక్తివాదము భరతభూమిలో ప్రబలినది. జాతి పారతంత్ర్యములో నుండుటచే జనులహృదయము లలో బాధ శమించుటకు ఆర్తత్రాణపరాయణుడగు భగవానుడు భూమిపై క్షత్రియరూపమున నవతరించినట్లు చెప్పెడి కథ హృదయంగమము. క్షత్రియుడు దుర్మార్గుల బారినుండి సజ్జనులను సంరక్షించు ననుసిద్ధాంతము సర్వదేశములలో సర్వకాలములలో వ్యాపించు చున్నది. స్వయముగా బలహీను డయినవానిని బలవంతుడు, అనగా క్షత్రియునివంటివాడు– అందును దేవాంశ సంభూతుడు సంరక్షించునన్న విశ్వాసము సర్వజనహృదయ ప్రీతికరము కావుననే, తులసీరామాయణమందు విశేషముగా భక్తిరసము జాలువారుచుండును.

రామాయణమను పేరు సంతృప్తినొసగకపోవుటచే తులసీదాసు తన గ్రంథమునకు రామచరితమానసము అని నామ ముంచినాడు. మానస

మనగా మానససరోవరము. సరోవరములోనికి దిగుటకు సోపానములు కావలెను. కావున ఇందలి సప్తకాండములకు సప్తసోపానములని కవి సంకేతించినాడు. అంతియేగాక గ్రంథపఠనమున, శ్రవణమునకు విశ్రాంతిఅవసరమగుటచే విరామస్థానములను విశ్రామము లన్నాడు. విశ్రామములకడ ఆగుచో పారాయణము సులభ మగును. విషయము హృదమునకు బాగుగా హత్తుకొనును.

గ్రంథము మొదట కొన్ని సంస్కృతశ్లోకములుండును. అనగా ఏడుకాండములకును ఏడు తావులయందును. గ్రంథాంతమందును సంస్కృత శ్లోకములు కలవు. తులసీదాసు బ్రాహ్మణోత్తముడు, వేదశాస్త్రవిశ్వాసి, గీర్వాణభాషావశంవదుడును అగుటచే ఇట్లు చేసియుండును. ఆయనకు దేవతాభక్తి మెండు కావున వివిధ దేవతలకు, కవులకు, భక్తులకు వందనరూప స్తుతులు నిబంధించినాడు.

సకలనిగమాగమపురాణసమ్మతముగా అన్యత్ర లభించు రామకథను స్వాంతస్సుఖముకొరకు 'భాష'లో రచించుచున్నా నన్నాడు. ఈకాలమున కల హిందీ అనుపేరు ఆకాలమున లేదు. తత్పూర్వము కొన్ని శతాబ్దులనుండి గంగా యమునానదులు ప్రవహించు ప్రదేశములలో వ్యాప్తమైన భాషకు హిందవీ అని పేరుండెను. రామచరితమానసములో తులసీదాసు ఉపయోగించిన భాష అవధీ. దీనినే అవధూతభాష అని కూడ వైయాకరణు లందురు.

వ్రజబోలీ, బైసవాడీ మొదలగు ఉపభాషలన్నిటిని కలిపి హిందవీ అనెడివారు. ఈఉపభాష లన్నియు ప్రాకృతములనుండి ఉత్పన్నమైనవి. పాలీప్రాకృతములనుండి ఔత్తరాహభాషలును అసమీ, ఉత్కల, ఘూర్జర, మహారాష్ట్రభాషలును సముద్భవించినవి. అందుచే సంస్కృతప్రాకృతశబ్దములు, వ్యాకరణరీతులు వీనికి సహజములు. అన్యజాతులతో సంబంధములవలన అన్యభాషాపదములు కొన్ని వీనిలో చేరినవి.

తులసీదాసు తాను ఉపయోగించిన దానిని కేవలము భాష అన్నాడు. కొందరు వైయాకరణులు దీనిని స్వచ్ఛమైన అవధి అన్నారు. పేరు ఏమైనను భాష స్వచ్ఛమై సరళమై ఉన్నతభావములను, లలితభావములను మంజులముగా వర్ణింపగలభాష ఇది.

గ్రంథరచనోద్దేశముకూడ పవిత్రము, ఉదాత్తము, సకలకలికలుషవిధ్వంసక మని పేర్కొన్నాడు. కావున ఈగ్రంథము పవిత్రమైనది అని భావము.

ఈ భాషకు అనువైన ఛందస్సులనే కవి ఉపయోగించినాడు. కేవల సంస్కృతవృత్తములలో ఈ భాష సుఖముగా నడవదు. ప్రతిభాషకును అనువైన పద్యములనే, పదములనే కవివరు లవలంబింతురు. దోహా, సోరఠా, చౌపాయి, హరిగీతికాఛందము మొదలగు వానినే తులసీదాసు ఆశ్రయించి అతి మనోహరముగ గ్రంథమంతయు నడిపినాడు.

ఆధునికకవులు సంస్కృత ఛందస్సును స్వీకరించి రచనలు చేసినారు. కాని అవి హిందీ భాషకు నచ్చలేదు. దాక్షిణాత్యభాషలలోతప్ప తక్కిన వానిలో పదకవిత్వమే ప్రశస్తి గాంచినది. పద్యకవిత ప్రాబల్యము చెందలేదు.

తులసీదాసు తుక్‌బందీ కవిత్వము చెప్పినాడు; అనగా పాదములకు అంత్యనియమముంచినాడు. అది శ్రవణయోగ్యము. ఆధునికు

లనేకులు అతుక్ బందీ(అంత్యనియమ విహీనము) కవి త్వము చెప్పుచున్నారు!

3

ఇక అనువాదము నించుక పరిశీలింప తగును. తులసీదాసు ప్రతికాండములోను తొలుత మంగళాచరణాదిరూపమున గీర్వాణవాణిలో శ్లోకములు రచించినాడు. మొదటిదానిలో 6, రెండవదానిలో 3, మూడవదానిలో 2, నాలుగవదానిలో 2, అయిదవదానిలో 2, ఆరవదానిలో 3, ఏడవదానిలో 3, గ్రంథపరిసమాప్తిలో 2 – మొత్తము 23 కనిపించును. ఆదిలో

వర్ణానా మర్థసంఘానాం
రసానాం ఛందసా మపి
మంగళానాం చ కర్తారౌ
వందే వాణీవినాయకౌ॥
వర్ణసముదాయమున కర్థవర్గమునకు
రసములకు ఛందములకు, భద్రంబులకును
గర్తలైన సరస్వతీగణపతులకు
వందనమొనర్తు భక్తి, బ్రప్రథమమందు.

సీతారామగుణగ్రామ
పుణ్యారణ్యవిహారిణౌ
వన్దే విశుద్ధవిజ్ఞానౌ
కవీశ్వరకపీశ్వరౌ.
భూమిజారామ గుణసంఘ పుణ్యవనుల
నెపుడు దిరుగుకవీశ - కపీశ్వరులకు, !
బరమ విజ్ఞానులకు గూర్తు । వందనముల
నమిత భక్తి సమేతుడ నగుచు నేను.

నానాపురాణ నిగమాగమసమ్మతం యత్
రామాయణే నిగదితం క్వచి దన్యతోపి
స్వాన్తఃసుఖాయ తులసీ రఘునాథగాథా -
భాషానిబన్ధ మతిమంజుల మాతనోతి.

సకల నిగమాగమ పురాణ సమ్మతమును
రామకథ నితర విశేష రంజితముగ
స్వాత్మతృప్తికై దేశీయ భాషలోన
తులసి రచియించుచున్నాడు లలితరీతి.

సోరఠా.

బందఉ గురుపదకంజ, కృపాసింధు నరరూపహరి
మహామోహ తమపుంజ జాసు బచన రవికరనికర.

కరుణావరుణాలయుడును
నరరూపమునందు వెల్గు నారాయణుడున్
వరవాగ్గుతమోహుండగు
గురుశుభపాదాంబుజముల గొల్తును భక్తిన్.

దోహా.

సబ్‌కే ఉర అభిలాష్ అస్, కహకిం మానయ మహేశ
ఆయ అచ్ఛత యువరాజపద, రామ హిందేహిం నరేశ.

సర్వప్రజల కొక్క సంకల్ప మొదవె :
"తన జీవితంబందె దశరథేశ్వరుడు
శ్రీరాము యువరాజు జేయునుగాక"
అని జనులెల్ల నిజాంతరంగముల
ప్రార్థించి రమ్మహేశ్వరుని శంకరుని.

చౌపాయీ.

పురనర భరతప్రీతి మై గాయీ, మతి అనురూప అనూప సుహాయీ, అబ్ ప్రభు చరితసునహు అతి పావన కరతజే వనసుర నర ముని భావన, ఏక చార చుని కుసుమసుహాయో. నిజ కర భూషన రామ బనాయే సీతహి సహిరామే ప్రభు సాదర, బైఠే ఫటికశిలా పర సుందర సురపతి సుతధరి బాయసదేఖా. సర చాహత రఘుపతి బల దేఖా. జిమి పిపీలికా సాగర థాహా, మహా మందమతి పావన చాహా. సీతా చరన చోంచ హతి భాగా. మూఢ మందమతి కారన కాగా. చలా రుధిర రఘునాయక జానా. సీక ధనుష సాయక సంధానా

ద్విపద

సాకేతనగర ప్రజాళికిన్ మరియు
భరతునకున్ రామభద్రునియందు.
రాజిల్లు ననుపమ రమ్యానురక్తి

ఛన్ద.

నిజదాసజ్యోం రఘువంశ భూషణకబహు మనుసుమి
రనకయో
సునిభరత వచనా వినీత అతికపిపులకతనుచరణనయో
రఘువీర నిజముఖ జాసు గుణగణ కహతఅగజగనాథజో
కాహేనహోయి వినీత పరమపునీత సదగుణపాథసో.

అప్పుడు భరతుండు, "హనుమంత చెపుమ
కరుణాబ్ధి తన దాసుగా నెపుడైన
నను స్మరియించునే," నావుడు హనుమ
యాతని నమ్రవాక్యమ్ముల కలరి
పులకితుడై పాదములపయి వ్రాలి
"సకల చరాచరస్వామి శ్రీరాము
డెవని గుణమ్ముల నెపుడు వర్ణించు
నట్టి యీ భరతు డత్యంత వినమ్రు
డతిపునీతుండు గుణాబ్ధి కాకున్నె !"

ఈప్రకారముగా తులసీదాసకృత రామచరిత మానసమును సంపూర్ణముగా ఆంధ్రభాషలోని కనువదించినారు. అనువాదము యథామాత్మక మని చెప్పవచ్చును. కాని కొన్నియెడల వీరు మాత్మకలోని భావమును విపులీకరించి వివరించినారు. ఇందువలన రామచరితమానసములోని తాత్పర్యము సుగమమగును.

ఒకభాషనుండి వేరొకభాషలోనికి మాత్మక ననువదించుట సులభకార్యము కాదు. పద్యానువాదములో కొంత బాధ యున్నది. అయినను వీరు పాఠకసామాన్యమునకు సుబోధ మగునట్లుగా సరళరీతిలో మంజరీద్విపదలో మధుర ముగా గ్రంథము నడిపినారు. ఈ అనువాదము ఎల్లరు చదువదగినది.

తీర్థాశ్రమము
ఒంగోలు
శోభకృత్
శ్రీరామనవమి

శ్రీ శివశంకరస్వామి

నా శక్తి కొలది వర్ణన, మొనర్చితిని,
వినుమిప్పు డారఘువిభుడు, శ్రీరాము
డమరర్షిజనుల కాహ్లాదంబుగూర్ప
గావించినట్టి జగన్నుత మహిత
పరమ పావన వనవాస లీలలను,
ఒకసారి శ్రీరాము డుజ్జ్వల ప్రీతి
అందమౌ పూవుల నన్నిటి గోసి
స్వయముగా మాలికావళి విరచించి
క్ష్మాతనూభవను సింగారించి మిగుల,
ఆమెతో నుపవిష్టు డయ్యె నం దొక్క
రమ్యమౌ స్ఫటిక శిలాతలమందు
అత్తరి నవివేకియగు నింద్ర సుతుడు
వాయసరూపంబు వహియించి వచ్చి
శ్రీరామశక్తి పరీక్షింప దలచె.
లేశమేనియు బుద్ధిలేనట్టి చీమ
వనధిలోతు నెఱుంగ వాంఛించినట్లు.
ఆ మూఢు డామందు డట్లాత్మ లోన
దుష్టభావమునొంది దుర్మదుం డగుచు
కాకవేషము దాల్చి క్ష్మాసుతాచరణ
మును, తన ముక్కు తో బొడిచి తాబోయె.
తదుపరి జానకీ పదరక్తధార
వీక్షించి, శ్రీరఘువీరు డెరింగి
ఒక యిషీకమును నిశోగ్రచాపమున
సంధించి విడిచెను సాయకమటుల
అహ! రఘునాయకు డమిత కృపాబ్ధి.

ఇంతవరకును (శ్రీ) కేశవతీర్థ స్వామివారి అనువాదము.

ఇక తిమ్మారెడ్డిగారి అనువాదము.

సోరఠా

సునహు భాను కులకేతు జాంబవంత కరజోరి కహ,
నాథ నామ తవ సేతు, నరచఢి భవ సాగర తరహి.

జాంబవంతుండు హస్తమ్ములు మోడ్చి
"రవికులాలంకార ! రాఘవ ! వినుము !
త్వన్నామ సేతువు దగ నెక్కువాడు
భవసాగరమ్ము నిర్భయమున దాట.

తులసీదశము

ఉభయభాషాప్రవీణ, వేదాంతపారీణ, కవిశేఖర, విద్యానాథ, కవితామహేశ్వర
శ్రీ మిన్నికంటి గురునాథశర్మగారు.
(రిటైర్డు సీనియర్ తెలుగు పండితులు H. C. H స్కూల్ గుంటూరు.)

రామోనామ బభూవ హుం తదబలా
సీతేతి హుం తాం పితు
ర్వాచా పంచవటీ తటే విహరత
స్తస్యాహర ద్రావణః
నిద్రార్థం జననీకథా మితి హరే
ర్హుంకారత శ్రుణ్వతః
సౌమిత్రే క్వ ధను ర్ధను ర్ధను రితి
వ్యగ్రాగిరః పాంతునః

(కృష్ణకర్ణామృతము)

ఒకనాఁడు ప్రాతఃకాలమున మిత్రులు శ్రీమంచికంటి వేంకటేశ్వరకవిగారు వచ్చి నాతో శ్రీకేశవతీర్థస్వామి వారు వచ్చుచున్నా రనిరి. నే నులికిపడిలేచి గబగబ యెదురుసని సాష్టాంగనమస్కారము లాచరించి తోడ్తెచ్చి సుఖాసీనులంజేసి నేఁడు నేను బవిత్రుఁడనైతి ననుచుండ వారు సుప్రసన్నవిలోకనములువఱపుచు మీరు రచించిన గురుభాగవతము చదివితి. బాగుగా నున్నది. అదిచూచియే దత్తమహిమకొఱకు మా శిష్యునంపితిని. మీ రదియే గాక దానితో భాగవతమహిమగూడ నంపితిరి. నేనును తులసీదాసురామాయణమును ద్విపదలోవ్రాసితి. దానికి మీరు సమీక్షవ్రాయవలె ననిరి. నేను స్వామీ! దృష్టి తగ్గినది. లేనిచో నిట్టి యనుగ్రహమును జూఱలిడుతునా? యంటిని. వారు కానిమ్మ ప్రయత్నించి చూడు. అంతకు రామఁడే యున్నాఁడు. ఎంత వ్రాసినను జాలునని గ్రంథమిచ్చి లేచిరి. అప్పుడు నేను బ్రహ్మవిచారము, గౌరీకల్యాణము హరిహరదత్తస్తుతి యిచ్చి కొంతదూరమంపి సెలవు దీసి కొనివచ్చితి.

గ్రంథముతెఱచిచూడ "శ్రీరామచరితమానస" మని యుండెను. తులసీదాసు హిందీలో నీ పేర వ్రాసెను. తులసీదాసురచించుటచే దానిని మనము తులసీదాసు రామాయణ మనుచున్నాము.

రామునిచరిత మగాధమైనది. మనోహరమైనది. నిర్మలమైనది మున్నగుభావములు స్ఫురించుటకుఁ తులసీదాసిట్లు "రామచరితమానస" మని పేరిడెను. దీనింజూచియే కాఁబోలు నభిజ్ఞానశాకుంతలమునకు శ్రీనివాసాచార్యుల వారు వ్యాఖ్యవ్రాయుచు "కావ్యంనేతృగతాఖండత త్త్వ ద్రసనిరంతరం"—"కావ్యం హి మానసాదికం సరఇవా ధారభూతనాయకగతాఖండత త్త్వచ్ఛృంగారాదిరసనిరంత రమ్" అని వ్రాసెను. తులసీదాసీపేరిడుట కెన్నియో కారణములు వ్రాసెను. "ఉద్దామదురంతదుఃఖగణదావ శిఖాకులచి త్తకుంభికిన్— రామచరిత్రమానససరస్సునసుఖం బొనఁగూర్చు సత్వరం—బామధురాతిశీతలగుణాంబువులం బడిక్రుంకులాడినన్" (36 పుట చూడుడు.) అచట రూప కాలపుట్టకలదు.

రామాయణముల కన్నింటికిని మూలము వాల్మీకిరామాయణము. రామాయణములకే యేమిటి? అసలు కవితాలతాంగికే వాల్మీకి జనకుఁడు. అందువలన నాయన సంస్కృతమున రచించిన రామాయణ మాదికావ్య మైనది. వాల్మీకి దానిని గుశలవులకునేర్పి రాముని సభలో గానము చేయించి ప్రకటించెను. ఆ వాల్మీకిరామాయణమున కెన్ని పిలకలు వుట్టినవో లెక్కలేదు. ఊమాసంహిత, తత్త్వ సంగ్రహరామాయణము, దౌర్వాసరామాయణము, ఆగస్త్య రామాయణము మున్నగున వెన్నియో సంస్కృతమున వెలసినవి. ఆంధ్రమునను భాస్కరరామాయణము, రంగనాథ రామాయణము, మొల్లరామాయణము, గోపీనాథరామాయణము మున్నగా ననేకము వెలసినవి. కథైకదేశముతో రచింపఁబడిన యుత్తరరామాయణాదులుం గలవు. రామకథనాధ్యాత్మికతత్త్వమునకుఁ బ్రాధాన్యమిచ్చి కొందఱు

రచించిరి. ఆవి ఆధ్యాత్మరామాయణము, శంకరానంద స్వామి రచించిన ఆత్మరామాయణము మున్నగునవి. కవి యైనవాఁడెల్ల నంతయో యింతయో రామకథను ముట్టక మానలేదు. కనుకనే కంకంటి పాపరాజు-

"వరుసం దిక్కనయజ్ఞ నిర్వచనకావ్యంబై తగంజేసె ను
త్తరరామాయణ, మందుపైమతి ప్రబంధంబూని నిర్మించుటే
సరసత్వంబని ప్రాజ్ఞులార ! నిరసించంబోకుఁడీ రాఘవే
శ్వరుచారిత్రము లెంద మొన్నిగతులఁ వర్ణించినన్ ప్రాలదే?"

అని తన యుత్తరరామాయణమున నుత్తర మిచ్చెను.

ఏల ప్రతికవియు రామకథను ప్రేమించుట? ఎవఁడీ రాముఁడు? ఇతఁడు మానవుఁడా? దేవుఁడా? ఈమొదలగు ప్రశ్నముల కాదికావ్యమే సమాధానమీయఁదగినది. దేవతలు విష్ణుమూర్తిం దర్శించి "మానుషిం తనుమాస్థాయ రావణంజహిసంయుగే" అని ప్రార్థింపఁగా

సహిదేవైరుదీర్ణస్య- రావణస్యవధార్థిభిః
అర్థితోమానుషేలోకే- జజ్ఞేవిష్ణుస్సనాతనః
(అయో ౧ స. ఆ శ్లో)

అని స్పష్టముగాఁగలదు. విష్ణువు దేవతలప్రార్థనము నాలించి త్రేతాయుగమున నయోధ్యలో దశరథమహారాజునకుఁ బుత్త్రుఁడై జనించెను. త్రేతలోనేలయందురా? "తదే తత్సత్యంమంత్రేషుకర్మాణికవయో యాన్యపశ్యంస్తాని త్రేతాయామ్బహుధాసంతతాని (ముండకోపనిషత్తు 1-2) అనికలదు. కాన విష్ణువు త్రేతాయుగమున నవతరించి వేద విహితకర్మముల నాచరించి లోకమునకు దారిచూపెను. రాముని ప్రవర్తనము నెవ్వరు వంకపెట్టలేరు. అతఁడట్లు చరించెను.

"యద్యదాచరతిశ్రేష్ఠః- తత్తదేవేతరోజనః
సయత్ప్రమాణంకురుతే- లోకస్తదనువర్తతే (గీ.3-21)

అనిగీతయు నుడివెను. "రామాదివత్ప్రవర్తితవ్యం నరావణాదివత్" అన్న సూక్తులు మొలకెత్తినవి. "రామవద్వ్యవహర్తవ్యం నరావణవిలాసవత్" అని వాసిష్ఠము.

"సర్వాగమానామాచారః ప్రథమంపరికల్పితః
ఆచారఃప్రభవోధర్మః ధర్మస్యప్రభురచ్యుతః" (విష్ణు)

కాన రామాయణమాచారములఁ బ్రతిష్ఠించి ధర్మము నెలకొల్పును. రామాయణమందు సతీపతిసుతాది ధర్మములు నన్నదమ్ములధర్మములు రాజసేవకధర్మములు మున్నగు సర్వధర్మములుగలవు.

మఱియు దేవాలయాదులు విగ్రహారాధనాదులు నారద మహర్షిచే నాయుగమందే నెలకొల్పఁబడినవి.

"మతిమచ్ఛ్రేష్ఠులె యెల్లవారు? ధరలో మందాధికారిప్రజా
తతిపూజాదులఁ బూరుషార్థములఁ జెందంగాదె త్రేతాభవ
త్ప్రతిమల్ సృష్టములయ్యె సర్వులఁదరింపం జేయనాఁ
గాదె? వై
వతనాథప్రముఖామరార్చితపదాబ్జా! నారసింహప్రభూ!
(హరిహరద త్స్తుతి)

ఇక శ్రీరాముడు నయోధ్యలో నేలవసించెనో చూడఁగా ఛాందోగ్యోపనిషత్తు 8-5-3 లో "....తదప రాజితాపూర్బ్రహ్మణఃప్రభువిమితం హిరణ్మయం" అని కలదు. అపరాజితాపుర మయోధ్యయని వ్యాఖ్యాతలు వ్రాసిరి. సగుణబ్రహ్మ సత్యలోకమందలి యయోధ్యలో నుండ విష్ణువుమాత్ర మయోధ్యలోనుండఁడా? వసిష్ఠుఁడు రామయనునామ మేలపెట్టెనో? ఊహాసంహితలో నిట్లున్నది.

"రా శబ్దోచ్చారణే జాతే- వక్త్రాత్పాపం విగచ్ఛతి
మకారశ్రవణే జాతే- భస్మీభావం గమిష్యతి".

రా శబ్ద మచ్చరింపఁగా నోటినుండి పాపములు బయటికి వచ్చును. మా శబ్దము నుచ్చరింపఁగాఁ దచ్ఛ్రవణమున నా పాపములు భస్మీపటలమగును రామనామమందింతమహిమ కలదు. ఈరహస్య మంతర్దృష్టిగల కవ్యృషులు గ్రహించి రామకథ నిచ్చవచ్చినట్లు మార్చికూర్చి గ్రంథములు రచింప సాగిరి. శ్రీ తులసీదాసులు నట్లేచేసిరి. ఈ చేయుట—

"యదత్రానుచితం కించి- న్నాయకస్యరసస్యవా
విరుద్ధం తత్పరిత్యాజ్య- మన్యథావా ప్రకల్పయేత్"

అను నాలంకారికుల యనుశాసనము నాలించిగాదునుఁడీ తామేదో నమ్మినధర్మమును ప్రతిపాదింపఁ దమకోర్కిఁ దీర్చుకొన నట్లు మార్పులుచేసిరి. ఇంతమాత్రముచే నవాల్మీకీయమని నిరసింపరాదు. అసలు వైవిధ్యమునందేకత్వమును జూచుటలోనే గొప్పతనము నానందము నున్నది.

145 పుట చూడుఁడు. "ఆపయి మునిచరణాబ్జంబులొత్త। గడఁగిరారామ లక్ష్మణులతిభక్తి" ఆవల మని

యాజ్ఞ బొందివచ్చి రాముఁడు శయనింప "రామాను జుండంత రాముపాదముల। మెల్లమెల్లఁగనొత్తె మృదుల హస్తములు" పెద్దలనెట్లుసేవింపవలయునో యిటఁజూపఁ బడినది. ఆంతటితోఁ దృప్తిపడి యూరకుందుమా? ఇది యగాధమైన మానససరస్సుగదా. ఈ రేవులో దిగిమా తము. రాముఁడు విశ్వామిత్రునిసేవించెననునది భగవం తుఁడు భక్తులసేవించుననుటను, లక్ష్మణసేవరాముఁడు గ్రహించెననునది భక్తులసేవను భగవంతుఁడుగ్రహించి యనుగ్రహించుననుటను సూచించును. భక్తులతో భగ వంతుఁ డిట్లు మెలగుట యాయనకొక క్రీడ, ఒకలీల.

జనకోద్యానవనములో ధనుర్భంగమునకుఁ బూర్వమే సీతారాముల సమావేశము పరస్పరసంవీక్షణము వర్ణింపఁ బడినది. ఆ ఘట్టమెంతయు మనోహరముగా నున్నది. అది సంస్కృతనాటకానుసరణ మేయగుఁగాక. ఐననేమి? మనోహరసన్నివేశములం జూఅవిడువవచ్చునా? అది జీవ బ్రహ్మల పరస్పరసహజప్రణయానుభూతి. కవులు స్త్రీ ముఖమును జంద్రునితోఁ బోల్తురు. ఆ విషయముం దులసి యిచటఁ జమత్కరించెను. చూడుడు 150 పుట. చంద్రోదయముకాఁగా రాముఁడుచూచి "చంద్రబిం బంబు – జానకీ ముఖముతో సరిపోలఁగలదె" ఏలసరిపోల దనఁ గారణములఁ జెప్పుచున్నాఁడు. "శశిగాంచు వృద్ధి క్షయముల। విరహిణీజనులకు వేదనగూర్చుఁ। బర్వసంధులఁ బట్టువడు రాహువునకుఁ। గూర్చును శోకంబు కోకంబులకును। పంకజద్రోహంబు; పాయకసేయు" ఇన్ని యవ గుణములుగల చంద్రుఁడు సీతముఖమునకు సరిగాఁడని నిర సించును। కవులపై నీదాడి రామునిదా? తులసిదా? మరి అట్టిదిగదా సీతాలక్ష్మి ముఖాబ్జవిలాసము। సీత "రామాను రక్తిలోఁ బ్రాణంబులైన నర్పింపఁగా నిశ్చయంబును బూనె" (162 పు) ఈ విషయమెఱిఁగియే రాముఁడు శివధనుర్భంగమునకుఁ బూనెను. ఓహో! ఇటు చూడుఁడు. అపుడు లక్ష్మణుఁడు "బ్రహ్మాండభాండ। మంఘ్రిపంకజమున నదిమిపట్టియును।అష్టదిగ్గజకమఠాహివ రాహ।వరులార! మీర లీవసుధాస్థలంబు। గట్టిగాఁబట్టుఁడీ కదలకుండఁ గను। శ్రీరామచంద్రుండు శివునిధనుస్సు-ఖం డింప" నున్నాఁడనును. అనుటగాదు ఆజ్ఞాపించును. ఇందలి భావ రసమతిమనోజ్ఞము. ఇఁక నిటుచూడుడు. టక టక శబ్దము వినవచ్చుచున్నది. రాముఁడు పెండ్లికి గుఱ్ఱము నెక్కివచ్చుచున్నాఁడు. అది గుఱ్ఱమా? శుద్ధసాత్త్వికమాయయా? ఆ యశ్వరత్న మతిసుందర మైనదని వర్ణింపఁ బడినది. శుద్ధము సుందరముగానుండదా? అది "తన వయో బలరూప సుగుణగతులతో సర్వజగంబు విమోహ" పఱచుచున్నదఁట ఈగతు "లాస్కందితము—ధారితకము—రేచితము—వల్గితము—ప్లుతము" నను పంచధారలే గాదు. పంచజ్ఞానేంద్రియ గతులును. అవియే మోహము గల్గించునవి. మఱియు దాని మువ్వలపట్టెడ కళ్ళెము "నరయఁగా సర్వ–నరసురములను మనస్సుభ్రమించె" మాయికములై నపదార్థములే సర్వవ్యాపార హేతుభూతములగుచున్నవి. తులసి యంతటితో వదలలేదా ఘట్టమును. వదలినచోఁ దనభావ మసమగ్రమై పాఠకున కందకపోవును కాన "ప్రభుచిత్తసమ్మగ్న భావంబుతోడ" హయమరుగు చున్నదనెను. తులసియాంతర్యమును దొంగిచూచితిరా? వినుఁడు. ఈశ్వరుఁడు శుద్ధసాత్త్విక మాయనధిష్ఠించి నాఁడు. మాయతోఁగూడినఁగాని వివాహము–భార్య–సంసారము–సృష్టి యేర్పడదు. ఇందొకచిత్ర మున్నది. మలినసత్త్వప్రధానమైన యవిద్య జీవునకు బంధహే తువగును. శుద్ధసత్త్వ ప్రధానమైనమాయ యీశ్వ రునకు బంధహేతువు గాక లోఁబడి యుండును. అతఁడు చెప్పినట్లునడచుకొనును. కావుననే హయము రాముఁడుచెప్పినట్లునడచుకొనుచున్నదనెను. ఈ మాయ రామునిజూచుటకు ముక్కంటి చతురాననుఁడు షణ్ముఖుఁడుమున్నగువారికిఁ గన్నులుచాలలేదఁట. సహస్రాక్షు నకుమాత్రము చాలినవనియితరు లనుకొనుచున్నారు. అత-డేమనుకొనుచున్నాఁడో మనకుఁ దెలియదు.

సరే–ఆవల వివాహములు జరిగినవి. "ఇష్టాన్నమితరే జనాః" అందురుగదా. మనము బువ్వాబంతివిందునకుఁ బోదమురండు. అదిగో బువ్వాబంతి (203 పుట) అద్రి కుమారి, సీతకుబువ్వాముద్దను బెట్టుమని రామునికిఁ జెప్పి నది. శారద, రామునకుముద్దఁబెట్టుమనిసీతకుఁ జెప్పినది. అట్టితఱి "తనపాణిమణిని సీతాదేవిచూచి—సౌందర్య నిధి రామచంద్రబింబమును — విరహభయోద్వేగవివ శాత్మయగుచు- నిజభుజవల్లిని నేత్రపద్మముల - గదలింప వెఱగంది కదలాడుటాపె" చూచితిరా సొగసు. సీత

రాముని ప్రతిబింబమును దనహస్తభూషారత్నమునంజూచి నది. ఇచ్చ జేయికదల్చినచ్చగాని, నెప్పవాల్చినచ్చగాని రామప్రతిబింబము కన్పింపదుగా. అట్టి విరహము సంభవించునేమోయని భయపడి కదలుటయే మానినదట. ఆప్రేమాతిశయము. ఆయేకాగ్రత. ఆపారవశ్యము చూడుడు. రాముడెదుటనున్నాడన్న విషయమునే సీత మఱచినది. ఆహా! ఏమిదివ్యకల్పనామాధుర్యము!"ఆవిలాస వినోదహర్షానురక్తి-లభివర్ణనము సేయనలవియా" మనకు?

అల్లదిగో దూరమందున్నదికైక. ఆమెంజూతమా? (243 పు) "క్రౌచ్యదేవతచేతి ఖడ్గంబురీతి- ఎదుటనిల్చిన కైకనీక్షించెరాజు-ఆకేకయాత్మజయనుఖడ్గమునకు-ఎంచగా జెడుబుద్ధియే పిడియోను-అలనిష్ఠురత్వమే యద్దానిపదును- ఇలగూనిమంథరయే సానరాయి - తత్కరాళకఠోరతర కరవాల- మీక్షించి యానృపుడిదియథార్థముగ-నాప్రాణ ముల దీయునా? యేమియనుచు" దశరథుడనుకొనును. ఇది రూపకల్పనమా? రూపకకల్పనమా? కత్తి ప్రాణము దీయునట్లు కైకతీసినదిగా, ఆవలిమందిరమునజూడుడు. సీత తన్నడవికిందోడ్కొనిపోవలసినదని రామునితో జెప్పునపుడు వాల్మీకి సీతచేనిట్లనిపించును.

కిం త్వామన్యత్తవై దేహాః- పితామేమిథిలాధిపః
రామ! జామాతరంప్రాప్య- స్త్రీయంపురుషవిగ్రహం
(అయో 30-3)

వాల్మీకిసీత యట్టిది. కాని తులసీదాసు సీతయో అడవులలో నిన్ను బూజించుచు నీరూపముచూచి యానందించుకొనుచునుందుననును. ఇట్లేగ్రంథము ప్రశాంతగంభీరముగా నడచును. తులసీదాసు ప్రగాఢభక్తి- కల్పనాశక్తి పదపదమున స్ఫురించుచుండును.

భరతునిభక్తి నందఱెఱుగుదురు. ఎఱుగుదురుగాని దానినెట్లు చెప్పవలయునో యది తులసి యెఱిగిన ట్లితరులెఱుగరు. చూడుడు 342పుట. అరణ్యములకేగినరాముం దోడ్తెచ్చుటకు భరతుడరుగుచున్నాడు. ఎట్లు? కాలి నడకను. "పరమవిశ్వాసులౌ భటులదిచూచి ప్రభు! దయ చేసి యీయశ్వంబధిష్ఠింపుడు"అని యెన్నియో విధముల బతిమాలు భటులంజూచి భరతుడనుచున్నాడు. "పద చారులై రామభద్రులు చనగ- రథగజవాజివర్గములు నాకేల? - వాహనయానమా? భావించిచూడ- దలమోపి ధరణి పాదములు పైకెత్తి- పయనంబుచేయుట భావ్యమా నాకు!!, చూచితిరా భరతునిభక్తి. భరతునిసేవాధర్మము. తలతోనడిచిపోవలసినవాడను.కాళ్లతో నడుచుచున్నాను. అందుకే సిగ్గుగానుండ నింక వాహనమెక్కుమనుచున్నారా? "అధికధర్మంబుల నతికఠోరంబు-సేవకధర్మంబు చింతించు నెడల" సేవాధర్మము నిర్వహించుట మిక్కిలి కష్టము సుడీయని భరతుడు ప్రత్యుత్తర మిచ్చి నెత్తికిగొడుగు కాళ్ళకు చెప్పులు లేకుండ నాయెండలలో నాయడవులలో నరిగెను. కాననే లక్ష్మణునిభక్తికంటె భరతుని భక్తిమిన్నయని పెద్దలనమ్మకము.

తులసికి రూపకాలంకారమన్న మిక్కిలి మక్కువ. సపరివారముగా వచ్చిన భరతునకు భరద్వాజుడు తనతపో మహిమచే సర్వవిధభోగములను గల్పించెను. అందఱుననుభవించిరిగాని భరతుడనుభవింపలేదు- "ఆభరద్వాజమహా మునియాజ్ఞ-యనునొక్క క్రీడాపరాయణుండైన- బాలుడాశ్రమమను పంజరమందు-సౌఖ్యాళియనియెడి జక్కవ పెంటి- భరతుం డనెడి చక్రవాకమున్ రెంటి- నారాత్రి బంధించెనైననాజంట- తెలవాఱుదనుకను గలియకనిలిచె (349) అని చమత్కారముగా నుడివెను.

చక్రవాకములకు రాత్రులందుడగ్గులగన్పింపవు. సరోవరములోడ దామరదాపునడ బెంటియుడ బోతును రెండు నించుకయెడముగా నుండియు గుర్తించుకొనలేక యానిశాంతము విరహబాధనొందుచుండునని కవులు వర్ణింతురు. ఆవిషయ మిచటడ తులసి వైరాగ్యరూపముగచిత్రించినాడు. ఇదియేకాదు. తనకావ్యమం దేదేని వైలక్షణ్యముంజూపుటకే యితడు ప్రయత్నించు చుండును.

కవులు స్త్రీల యవయవముల నుపమాద్రవ్యములతోడ బోల్తురు. కాని జగన్మాతయగు సీతయొక్కయవయవముల వర్ణించుటలో తులసి చమత్కరించుచున్నాడు (447 పు) రాముడు సీతంబాసి విలపించుచు "దాడిమ కుంద సౌదామిన్యాదులు శరత్క మలశరదిందుబింబాదులు పట్టరాని సంతోషముతో నున్నవి. ఈశత్రువర్గవిజృంభణమీవు సహింతువా? ప్రియా! సీతా! సరగరమ్మ" అని పిలుచును. అవి సీతకు శత్రువు లెట్లైనవో? అవి యెందుకు సంతోషించుచున్నవో చదువరికేమి తెలియును? ఆ వివరణము శ్రీతీర్థస్వాములు పుటయడుగుననిచ్చిరి. వీరిట్లే

యందందు గ్రంథగ్రంథుల భేదించి పుటయడుగున నర్థా దులు వ్రాసిరి. పాఠకుల కవి మిక్కిలి యుపయోగించును. తులసి వాలినిగూడ భక్తుడుగాఁ జిత్రించె.

వాలి సుగ్రీవునిపైకిఁ బోవుచున్నపుడు తార 'నాథా! సుగ్రీవునకు రామలక్ష్మణులసాహాయ్యమున్నదిసుమా యనఁ గనే వాలి "పిచ్చిదానా! సమదర్శనుఁడు రఘుస్వామి యాతండు. నను సంహరించుచో నాకేమికొదవ" నాకు దివ్యపదమువచ్చు ననును. ఆ స్థిరభక్తి వాలికిఁ జివరదాఁక ఁ గలదు. బాణముచేగూలినవాలి ప్రత్యక్షమైనరాముని "వీక్షించి వీక్షించి విరతినిగనక-శ్రీపాదములపైని జిత్తంబు నిలిపి-యితఁడు పరంధాముఁడేయనితెలిసి- తన జన్మ ధన్యత్వమును గనెననుచు" సంతోషించి యొక్కింతతడవాగి స్వామీ! ధర్మరక్షణార్థ మవతరించిన నీవు నన్నేలచంపితివి? సుగ్రీవుఁడు మిత్రుఁడా? నేనుశత్రుఁడనా? యన రాముఁడి ట్లనె. సుగ్రీవభార్యాపహరణపాప మొనర్చితివి. తత్పాపపరిహారార్థమునిన్ను చంపితినన వాలి "అంత్యకాలమునఁద్వదాశ్రయ మొందఁగలిగిన నాకుఁ బాప మెక్కడిదిస్వామీ!" అనఁగనే రాముఁడుదయగలిఁగి వాలి శిరమునిమిరి 'నీశరీరంబిచే నిత్యంబొనర్తు' ననఁగనే వాలి వలదువలదు నేతినేతీతివాక్యముల నిగమము లెవనిఁబ్రస్తుతించునో యట్టి పరబ్రహ్మమునాకుఁ బ్రత్యక్షముకాఁగాఁ దుచ్ఛవరముఁగోరుదునా? "ఏ నెట్టి జన్మలనెత్తినఁగాని-నీపాదభక్తితో నెగడవరమి"మ్మని ప్రార్థించును. ఇట్లు వాలిని మహాభక్తాగ్రేసరునిగాఁ దులసిచిత్రించెను. ఇట్లీ గ్రంథమొకక్రొత్తదనమును సంతరించుకొనుచు భక్తి వాహినియై ప్రవహించినది.

ఉత్తరకాండమునఁ దులసికి వాల్మీకికి సంబంధము లేదు. వాల్మీకియుత్తరకాండము రామహితులైన రావణాదులవృత్తాంతముతోను రామభక్తులైన హనుమదాదుల వృత్తాంతములతోను రామపుత్రులైనకుశలవాదులవృత్తాంతములతోను మొత్తముమీఁద సీతారాములవృత్తాంతములతోను నిండియుండును. తులసి యుత్తరకాండమున ధర్మోపదేశములకై భుశుండోపాఖ్యానమునుప్రవాసెను. యోగవాసిష్ఠమునిర్వాణప్రకరణపూర్వార్థమందు 14 వ సర్గమునఁ జెప్పఁబడినఁ గాకభుశుండుఁ డితఁడే. అయితే వాసిష్ఠ భుశుండుఁడు పరమజ్ఞాని. తులసివానినిరామభక్తుఁడుగా మార్చెను.

రామాయణమున శృంగారాదినవరసములు నున్నవన్నచో సూర్యునియందుఁ గాంతులున్నవన్నట్లుండును. వివిధసన్నివేశములుగల యింతబృహత్కథలో వలదన్నను రసములు వానికవేవచ్చి చేరుచుండును. ఇందుఁ దొమ్మిది రసములేయేమి? పదియవభక్తిరసమునుగలదు. భక్తిరసమా? ఏలకాదు? భగవంతుఁ డాలంబనవిభావముగా, గగుర్పాటు కన్నీరు మున్నగునవి యనుభావములుగా, హర్షాదులు సంచారులుగా, భగవదనురాగరూపమగుతిరీ స్థాయిగా భక్తిరసముండుననఁగనే, "భక్త్యైర్దేవాదివిషయ రతిర్వేన భావాంతర్గతయారసత్వానుపపత్తేః" భక్తి దేవాది విషయకమగురీతి కాన భావమనఁబడును. రసమనఁ బడదు. అని రసగంగాధరమునఁ బండితరాయ జగన్నాథుఁడు శంఖమూఁదెను. అది విని మధుసూదనసరస్వతీ స్వాములవారు"భగవద్భక్తిరసాయనము"నమహోగ్రుఁడై లేచెను. "శోకక్రోధభయాదీనాం-సాక్షాత్సుఖవిరోధినాం రసత్వమభ్యుపగతం తథానుభవమాత్రతః" సాక్షాత్సుఖ విరోధులైన శోకక్రోధభయాదులకే యనుభవించుచున్నా ముగదాయని రసత్వమంగీకరింపఁబడినది. "ఇహానుభవ సిద్ధేపి- సహస్రగుణితోరసః- జడేనైవతయాకస్మా- దకస్మాదపలప్యతే" ఇతరరసములకంటె వేయిరెట్లధికముగా భక్తిరస మనుభవింపఁబడుచుండ నోయిజడుఁడా! భక్తిని రసము గాదనెదవేమయ్యా "రతిర్దేవాదివిషయా వ్యభిచారీతథాంజితః భావఃప్రోక్తో, రసోనేతి, యదుక్తం రసకోవిదైః - దేవాంతరేషుజీవత్వాత్ - పరానందాభ్రకాశనాత్ - తదోజ్యం; పరమానందరూపే న పరమాత్మని"రసకోవిదులు దేవాదివిషయకరతిని భావకోటిలోఁ జేర్చిరనెదరా పోనిండు. ఇతరదేవతలు జీవులే కాన వారియందలి భక్తి, పరమానందమును గల్గింపమిచే దానిని భావమన్ననునుఁడు. కాని పరమానందస్వరూపుఁడైన శ్రీకృష్ణపరమాత్మయందలి భక్తిని రసమని తీఱవలసినదే. ఆ భక్తివలన బ్రహ్మానందముగలుగును. "పరిపూర్ణరసా, క్షుద్రరసేభ్యోభగవద్రతిఃి, ఖద్యోతేభ్యఇవాదిత్యప్రభేవబలవత్తరా" శృంగారాది నీచరసములకంటె భగవద్రతిపరిపూర్ణరసము గలది. మిణుఁగురు పురువుల

కాంతికంటె సూర్యకాంతిమిన్న గాదా? అని మధుసూదన సరస్వతి భక్తిరసమనియుద్ఘోషించెను కాన నీరామాయణ మునఁ బదియవభక్తిరసమునుగలదు. భక్తిరసముకాదు. భావమందురా? అట్లైన మతీయుమంచిది. ఏలందురా? తులసి హాస్యరౌద్రాదిసర్వరసములందును భక్తిభావమును జొనిపెను. భక్తిభావములేని రసమే యిందులేదు. పేరే దైననేమి? భక్తియున్నమాకదేచాలును. ఈ రామచరిత మానసము భక్తిరసముద్రము, భక్తిభావ భాండా గారము. తులసీదాసు మహాభక్తుఁడు. ఆ భక్తిలోమునిఁగి తన్మయుఁడై యితరముచూడక వ్రాయుచుండును. తులసి మాటిమాటికి రాముని బరతత్త్వముగాఁ బ్రతిపాదించు చుండును.

తులసి కిది మానససరస్సు. మనకో రత్నాకరము. ఇందలి రత్నములఁ గ్రహింపలేము. గ్రహించి వెలకట్ట లేము. మనకుఁ బోతనభాగవతమెట్టిదో యా త్తరాహులకు తులసీరామాయణ మట్టిది. దాక్షిణాత్యులకు కంబరామా యణమట్టిది. పోతనవంటివాఁడు తులసి. ఇతఁడు రామ కథను వ్రాసినను శివునిద్వేషింపఁడు పైఁగా నాకు రామ భక్తినిమ్మని శివునిబ్రార్థించును. గ్రంథమున శివకేశవాభేద మును మాటిమాటికిఁ జెప్పుచుండును. ఇదియేకద సత్యసా క్షాత్కారమొందిన మహాపురుషుని లక్షణము.

చిత్రవిచిత్రభగవల్లీలావిలాసమయము, భక్తిజ్ఞానకర్మ యోగసమన్వయాత్మకము, రామపరతత్త్వప్రవచనాత్మక మగు శ్రీరామచరితమానసమునుజక్కఁగా శ్రీకేశవతీర్థ స్వాములవారును శ్రీవారిసహచరులగు శ్రీపాటీలు తిమ్మా రెడ్డిగారును తెనుఁగున ననువదించిరి. గ్రంథమునంతయు మంజరీద్విపదలోవ్రాసిరి. ఎడనెడ మత్తకోకిల– మంగళ మహాశ్రీ ప్రముఖవృత్తములుంగలవు. గానముచేయుటకు వీలుగా గేయములుంగలవు. స్వాములవారు పిడుగురాళ్ళ గ్రామమందలిస్వాశ్రమమున శిష్యులంగూడి నామసంకీర్త నముచేయుచున్నప్పు డాభక్తిపారవశ్యము, నాగానమాధు ర్యము నాకంఠస్వారస్యమును విని కని యానందింపవలసి నదేగాని కాగితముపైవ్రాయుటెట్లు? స్వాములవారు నర సింహోపాసకులు. గాఢనియమముతో గట్టిపట్టుదలతో మంత్రసిద్ధింబొందిరి. కాననే యీకృతిని వ్రాసితనయిష్ట దైవమగు మట్టపల్లినరసింహస్వామి కంకితమిచ్చిరి. "నా నృషిఃకురుతేకావ్యమ్" అని కలదుగదా. మఱియు వీరు "ఫలచతుష్కప్రదాయియై వెలయుచున్న రఘుకులో త్తంసుకీర్తివర్ణన మొనర్తు" ననిరి. నిజమే. భామ హుఁడును. "ధర్మార్థకామమోక్షేషు– వైచక్షణ్యంకళా సుచ– కరోతికీర్తింప్రీతించ – సాధుకావ్యనిబంధనమ్" అని కావ్యప్రయోజనమును నుడివెను.

"లౌకికానాం హి సాధూనాం - అర్థంవాగనువర్తతే ఋషీణాంపునరాద్యానాం వాచమర్థోనుధావతి"

అన్న భవభూతివాక్య మెఱిఁగియుండియు ఋషికల్పుఁ డైన స్వామికవిత్వము మధురమైనది మృదులమైనది సుందర మైనది సాలంకారమైనది నిర్దుష్టమైనదియనఁజాల? ఋషి కృతమైన యీకావ్యము పాఠప్రవచనాదు లూనర్చువారిం దరింపఁజేయును. తత్త్వసంగ్రహరామాయణమున "సంసా రతాపయుక్తానాం జంతూనాంహతచేతసాం శ్రీమద్రా మాయణాఖ్యానపీయూషంభేషజంస్మృతమ్" (ఉత్తర కాండ 21 స-22 శ్లో.) అనికలదు. కేశవుఁడే రాముఁడు రాముఁడే కేశవుఁడునని తలంచికొని నేనీతులసీదళముతో యథాశక్తిపూజాక్రమము నడపుట కవకాశమిచ్చిన శ్రీకేశవతీర్థస్వాములవారి కాత్మప్రదక్షిణనమస్కారము సమర్పించుచున్నాను.

శ్రీతిమ్మారెడ్డిగారు శ్రీస్వామివారి ఆదేశానుసారము సుందరకాండము- లంకాకాండము, ఉత్తరకాండము కాండత్రయము పూరించిరి. అంకంపల్లిగ్రామనివాసియగు శ్రీపాటీలు తిమ్మారెడ్డిగారు హిందీసంస్కృతాంధ్రాంగ్ల ములఁ జక్కని పాండితి గలవారు. విద్యకుఁదగిన వినయ ముంగలదు. కనుకనే తనపేరును బ్రకటించుకొనక కిళో రుఁడ నని గద్యమున వ్రాసికొనెను. ఈ కవికిశోరున కుద్గ్రంథరచనకుండవలసిన మధురకవిత, ధారావేగము భావావేశము దీక్షాదార్ఢ్యము భాషాపాటవము కలదు. కావున సకాలమునకుఁ గాండత్రయము రచించి స్వాముల వారి కర్పించి ధన్యులైరి. శ్రీరామునకు హనుమానునివలె శ్రీమద్రామాయణరచనాధ్వరమున శ్రీకేశవస్వాములవారికి శ్రీతిమ్మారెడ్డి తోడ్పడి చరితార్థులైరి.

శ్రీస్వాములవారు కొంతరచనాభారము నెక్కడనో దత్తమండలమందున్న యాతిమ్మారెడ్డిగారిపై నేలపెట్టిరో? ఎందుకుఁ బెట్టిరో? అదియే జనన్యంతరసౌహృదమో ఆ

తిమ్మారెడ్డి సుకృతమేమో యెవ్వరికిఁ దెలియును?"పుణ్యైర్యశోలభ్యతే" కానిచో స్వామితో సహాసనాసీనతా భాగ్య మందఱకు లభించునా?

రంగనాథరామాయణము తరువాత సీరామాయణమే ద్విపదలో వెలసినది.ఇదియు మంజరీద్విపద, దీనిం బాటగా స్త్రీలుసైతము పాడుకొనుటకు వీలుండును. ఎంత లేలికగా వ్రాయఁదలఁచుకొన్నను వృత్తములలో దీర్ఘసమాసములు ననావశ్యకవిశేషణములు కఠినపదములు తప్పనిసరిగాఁ బడుచుండును. ద్విపదకట్టి బాధ యుండదు. ఈగ్రంథము సులభశైలిలో మధురముగా వ్రాయఁబడి ముచ్చటగా నున్నది.

ఆంధ్రభాగవతప్రపంచమునకీ మహాకృతి ప్రదానమొన ర్చినందుల కీ గ్రంథకర్త లెంతయు వంద్యులు.

లోకములోనందఱకు ధనముండదు. ఎవరికేని ధనమున్న దానగుణముండదు.ఎవరికేని ధనము దానగుణమునున్న దాన పాత్రము లభింపదు. ఎవరికేని ధనము- దానము- పాత్రము లభించినఁ బుణ్యములభించుఁగాని కీర్తి లభింపదు. ఇప్పుడు మన శ్రీకర్వారపు రామకృష్ణమూర్తిగారికన్నియు లభించి నవి. వారికి ధనదానగుణములా? సమృద్ధములు. ప్రతిగృహీ తయా- శ్రీకేశవతీర్థస్వాములు. ద్రవ్యవినియోగమా- పవి త్రమైన శ్రీమద్రామాయణముద్రణకార్యమునకు- ధనమా దశస్థానము శతస్థానముదాటి సహస్రస్థానము నందు కొన్నది. ఇఁక శ్రీరామకృష్ణ మూర్తిగారి పుణ్యమును గొలుచుటకు మానికలున్నవా? దృష్టముగాని పుణ్యము నట్లుంచుఁడు కీర్తియెంతటిది? సూర్యచంద్రు లున్నంత వఱకు రామచరితమానసముండును అది యున్నంతవఱకు రామకృష్ణమూర్తి పేరుండును. ఓ రామకృష్ణమూర్తీ! నీవు టవుఁ హైస్కూలులోఁ జదువుకొనుచున్నప్పుడే తోడి విద్యార్థులకు సాయముచేయుచుండఁ జూచి నీకు శుభో దర్కమున్నదని భావించితి. అది నేఁడు కన్నులారఁ జూచితి. నీ జన్మముధన్యమైనది.

"శ్రీరామప్రాతిపదిక- మవశేనాపిసంగృణఁ
ముక్తింప్రాప్నోతిమనుజఃకింపునర్బుద్ధిపూర్వకమ్".

గుంటూరు
ది 2-4-1963
శోభకృచ్ఛైత్ర
శుద్ధ నవమి

బుధవిధేయుఁడు
మిన్నికంటి గురునాథ శర్మ

శ్రీ హయగ్రీవాయనమః

పండిత అభిప్రాయములు

విద్యాలంకార, సాహిత్యరత్న, మహోపాధ్యాయ, శతావధాని, కవిశేఖర
శ్రీ పళ్లె పూర్ణ ప్రజ్ఞాచార్యులు.

పూజ్యశ్రీ కేశవతీర్థస్వామి, మాన్యశ్రీ పాటీలు తిమ్మా రెడ్డి మహోదయుల సన్నిధికి.

మహాశయులారా! తాము హిందీభాషనుండి యనువ దించి దయతోఁబంపిన భవదీయంబగు శ్రీరామచరిత మానస మను మహాగ్రంథంబున నందందుఁ గొన్ని ఘట్టం బులఁ జదివి మహానందము ననుభవించితిని. మీరు 'స్వయం తీర్ణఃపరాంస్తారయతి, అన్న సూక్తి కుదాహరణభూతు లైనందులకు మి మ్మెంతయు నభినందించుచున్నాను.

గీ॥ ధీరవరులార! మంజరీద్విపద మీరు
సంతరించిన శ్రీరామచరితమాన
సం బను పవిత్రదివ్యకోశంబుఁ గంటి
మేను పులకించెఁ గవులార! మీకు శుభము.

గీ॥ నాకుభవునోట రామాయణంబు వేర
వెడలె వేదంబె భూషగా వేల్పుబాస,
కాంధ్రి కనువాద మొనరించి యద్ది భాస్క-
రాదులాంధ్రుల జోహారు లందుకొనిరి.

ఆ॥ వె॥ సత్కవిత్వ మనెడు శాఖికి జానకీ
పతికథాప్రశంసఫల మటండ్రు
కలిగె మీకు నట్టి ఫలమిష్టదేవత
కర్పణంబుసేత యతిశయంబు.

భవదీయుఁడు,
పల్లె పూర్ణప్రజ్ఞాచార్యులు
గుంటూరు.

మ॥ తులసీదాసు రఘూత్తమాంఘ్రియుగభ
క్తుం, డాదికావ్యంబు పెం
పలరంగాఁ జవి చూచి వ్రాసె నిజనా
మాంకంబుగా హింది ని
స్తులమా రామచరిత్రమానసము, వం
ద్యుల్ మీర లీకబ్బమున్
దెలుఁగుం జేసితి రిష్టుఁడౌ నృహరికెం
తే భక్తి నర్పించుచున్.

శ్రీ పశర్లపాటి వాసుదేవశాస్త్రిగారు,
గుత్తికొండ.

తే॥గీ॥ అక్షిగోచరులగునట్లు లాంధ్రరామ
చరితమానసమందుఁగేశవయతీంద్ర
పూజ్యపాదుల కవితావిభూతులెసఁగె-
రసము లూలుకుచు సుకవులారా! యనంగ.

క॥ తులసీ రామాయణమున
విలసిల్లు నయోధ్యకాండ విషయములెల్లన్
దిలకించి, కనుల బాష్పము
లూలికించితి, భరతు భక్తి యోగసమీక్షన్.

సీ॥ చిఱునవ్వు వెన్నెలల్ చిల్కరించుచునున్న
శ్యామ సుందర రామచంద్రమూర్తి,
మహితపాతివ్రత్య మహిమఁజూపుచునున్న
తరుణీమతల్లి సీతమ్మతల్లి,
భక్తిరసామృత పాథోధినోలాడు
పరమపావనకీర్తి భరతమూర్తి,
సౌభ్రాత్రసుప్రశస్తతఁజాటు నా సుమి
త్రా గర్భశుక్తిము క్తాఫలములు,

సువాంజలి

'జాతీయ మహాకవి'
శ్రీ మంచికంటి వేంకటేశ్వరరావు

శ్రీకరుణాకరా! సుగుణశేఖర! కేశవతీర్థ ధీరచం
ద్రా! కనగం ద్వదీయ కవితా మృతధారలుపొంగి, నారసిం
హాకృతి మట్టపల్లి కుధరాగ్రమునన్ వెలుగొందుస్వామికిం
పై-కరమార నర్పితము నయ్యెఁ దరించితివయ్య! స్వామిజీ!

పరువొప్పం గవి కర్షకప్రతతిచే భాషావనీభాగముల్
త్వరగా సత్కృషిచేయజేసి, కరుణావర్షంబువర్షించి, భా
స్వరమూరీతిని నవ్యకావ్య ఫలముల్ పండించిహర్షించుధీ
వర! ఆంధ్రావని మీ కిటుల్ ఋణపడెన్ భాషా
పరిపంచంబులో.

తాను శిష్యులుగూడి యుద్యద్విధాన
వ్రాసె రామాయణము మున్ను భాస్కరుండు
అటులె మీరు తిమ్మారెడ్డి నాదరమున
గలసి రామాయణము వ్రాయగంటి రనఘ!

నన్నయ తిక్కనల్ బలె గనంబడనేర్చితి రొక్కచోట-పో
తన్నయు నారయార్యవలె దర్శనమిత్తు రొకొక్కచోట-మీ
తెన్నులు సుప్రకాశములు-దివ్యమహత్వకవిత్వరీతులం
గ్రన్నన బొంచికాంచి పులకల్ గనజొచ్చెధరిత్రిస్వామిజీ!

హత్తుకొనంగ భక్తి హృదయమ్మునఁ బూర్వపుఁబోత
నార్యుడే
యిత్తఱిఁ గ్రమ్మరన్ భువిజనించెనటంచు జనుల్
తలంప-మీ
చిత్తముదీర-రామకథ జేసితిరార్య! ప్రశస్తభావసం
పత్తియు, వృత్తమున్నడుపు ప్రజ్ఞయు మీదగునొమ్మ
స్వామిజీ!

సీసకందములకు శ్రీనాథతిక్కనల్
వృత్తములకు పోతనేప్రసిద్ధు
లంద్రు కవులుగాని- అన్నివృత్తాలు మీ
వశ్యమాయెనయ్య! స్వామివర్య!

ద్విపద కావ్యాలుద్రావి ప్రతిష్ఠ గన్న
వారిలో నగ్రతాంబూల మందుకొంటి
రనఘ! మీ శక్తి వర్ణింపనౌనె నాకు
స్వామికేశవతీర్థ! నా ప్రణతులివిగో!

శ్రీకర్పూరపువారి మానససరశ్శ్రీవేగ నుప్పొంగి, దీ
క్షాకాంక్షల్ చెలరేగి ముద్రణకు వేడ్కన్ద్రవ్యమర్పింపగా
శ్రీకారంబును జుట్టి రామకథపూర్తింజేసియున్ సద్యశః
ప్రాకట్యంబున పిడ్గురాల పురిసంభాసిల్లెదో స్వామిజీ!

నవమాధుర్య పదప్రతానములతో- నానార్థసంపత్తితో
స్తవనీయోత్పల చంపకప్రతతితో-శార్దూల మత్తేభ సం
ఘవినూత్న ప్రమదంబుతో గదలి మీ కావ్యాంగనా
రత్న మీ
భువనంబుల్ జెయివెట్ట శాశ్వత యశంబుం బొందునో
స్వామిజీ!

గుంటూరు
15-5-'63 } —మంచికంటి వేంకటేశ్వరరావు.

బాలకాండము - ప్రథమ ముద్రణమును గూర్చిన

పండితాభిప్రాయములు

అవధానిశిరోమణి, విద్యావారిధి, మహామహోపాధ్యాయ

మధ్వశ్రీ కాశీ కృష్ణాచార్యులుగారు

(ఆంధ్ర ప్రభుత్వాస్థాన కవీశ్వరులు)

శ్రీ గోస్వామి తులసీదాస విరచిత రామాయణము హిందీ వాఙ్మయమణిమాలకు నాయకమణి యగుట భారత దేశ భాషా తత్వజ్ఞులకు సువిదితచరమె. ఔత్తరాహ లాబాలగోపాల మందలి యభంగాదులఁ గర్ణరసాయన ముగ యథాశక్తి గానముసేయుచుఁ, దా మానందించుటె గాక విదేశీయశ్రోతలగూడ నానంద పఱచుచుందురు. కవితాచమత్కృతిగాని, భావగాంభీర్యాదులుగాని, కథా వాక్యార్థ వివృతిగాని యంతగ బోధపడని స్త్రీ పురుష లకుఁగూడ వాల్మీకీయ శ్రీమద్రామాయణ మెట్లో యట్ల తులసీదాస రామాయణముగూడ శ్రోతల కాప్యాయన మొనఁగూర్చు ననునది స్వానుభవ వినిశ్చిత సిద్ధాంత మగుటఁ దద్రచనా వైశిష్ట్య మనన్యాదృశ మన్ననందతిశ యోక్తి, సుంతయు లేదు. హిందీ భాషాప్రవేశ మంతగ లేకపోవుటచే మూలగ్రంథ నైజరసా స్వాదము గావించు భాగ్యము నాకు లేకపోయెఁగదా యని విచారపడుచు, నే పుణ్యాత్ముఁడేని దాని నాంధ్రమున సరస పరివర్తనము గావించినఁ బఠించి యానందింతునుగదా యని తలపోయు చుందును. గద్యమయముగనో, పద్యమయముగనో యెవరో వ్రాసిన ట్లిటీవల వింటినేగాని దాని నిప్పటికిని గన కుంటిని.

కాని, యాంధ్రదేశమున నందును గుంటూరు మండల మునఁ బుట్టిపెరిగి బాల్యమునఁ లౌకిక విద్యనేగాక పార లౌకిక విద్యనుగూడఁ జక్కగ నభ్యసించి, వైరాగ్యభక్తి విజ్ఞానముల నలవఱచుకొనిన శ్రీ కేశవతీర్థ స్వామివారు కొలఁది దినములక్రిందఁ దా మాంధ్రమున ద్విపద చ్ఛంద స్సున విరచించిన "శ్రీరామ చరితమానసము"న (తులసీ దాస రామాయణమున) బాలకాండమును నా కందఁజేసి నా స్వప్నమును యథార్థపఱచి మహానందమును గూర్చిరి.

శ్రీ స్వామివారు తమ గ్రంథ పీఠిక యందలి ప్రథమ సోపాన పూర్వభాగమున సముచితముగ 353 పద్యము లలోఁ బ్రపంచించిన యనేకాంశములు తమ లోకానుభవ శాస్త్రానుభవములనేగాక తమ దేవగురు బ్రాహ్మణ భక్తిప్రపత్తి విశేషములనుగూడ నాదర్శీకరించుచున్నవి. ఇకఁ బ్రథమ సోపానా పరభాగమునఁ బరివర్తన మారం భించి తమ కవితాస్రవంతిని నిరాఘాటధారతోఁ బ్రవ హింపజేసిరి. సరళాంధ్రభాషలో వెలయించుటచే నిధి హృద్యమై బాలురకును బఠనక్షమమై యున్నది. ఇది పరివర్తన మయ్యును స్వతంత్రరచనను మించియుండుట వీరి సాహిత్యాతిశయమును దెలుపును. వీరిట్లె తక్కుకాండ ముల నెల్లఁ త్వరలో నాంధ్రీకరించి, శ్రీ తులసీదాస రామాయణమును సాంతముగ నాంధ్ర మహాజనులకందించి, తదభినందన పాత్రమగునట్లు తదిష్ట దైవమగు శ్రీ మట్టపల్లి నరసింహస్వామినే నేనుగూడా బహుధా ప్రార్థించు చున్నాఁడ.

విబుధ విధేయుఁడు,

కాశీ కృష్ణాచార్య.

దర్శనాచార్య, మహోపాధ్యాయ, సాహిత్యాచార్య, శాస్త్రవిశారద, లాక్షణికశిరోమణి, విద్యా, భాషాప్రవీణ

శ్రీ జమ్ములమడక మాధవరామశర్మగారు

ఆంధ్ర విశ్వవిద్యాలయము అకడమిక్ కౌన్సిలు సభ్యుడు.

శ్రీ గోస్వామి తులసీదాసు ఉత్తరప్రదేశమున విశిష్ట గోస్వామి. శ్రీ తులసీస్వామి పలుకు పలువురిలో పలుకు దనము సంపాదించినది. సంస్కృతము పట్టని హిందీముఖు లందరు మానసమున రామచరితమానసము పట్టిరి. సంస్కృ తముఖు లయిన వారు కూడ మానసము విడిచి "మానసము"

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయము, తిరుపతి.

".....తమ రచన శ్రద్ధావ్యుత్పత్తుల బలమును ప్రతిపంక్తియందును ప్రకటించుచున్నది, ధార స్వతంత్రమై గంభీరముగా సాగినది..... ఈ మహాగ్రంథమును తెలుగువారి కందించి తాముచేసిన లోక కల్యాణ కైంకర్యము గొప్పదనుటకు సంశయములేదు.

రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ.

శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు

ఆల్ ఇండియా రేడియో, విజయవాడ.

".....గంగవలె ప్రసన్నమైన స్వచ్ఛమైన శైలి. గ్రంథము చదువుటకు చేతబట్టినది మొదలు మనస్సు కథా సుధా సాగరమున ఓలలాడు చున్నట్లు లుండును. మరి, అనువాద గుణమునకు ఒకటే ప్రమాణము—మూలమును అపేక్షింపకుండ అర్థము సుబోధమగుట. ఆ గుణవిశేషము మీ అనువాదములో నిండుకొని యున్నది. ఇట్టి మీ రచనకు ఒరుల యభిప్రాయములేల?

—పింగళి లక్ష్మీకాంతం.

శ్రీ మంచికంటి వేంకటేశ్వరరావుగారు

జాతీయ మహాకవి, సంతగుడిపాడు.

శ్రీ కేశవతీర్థాహ్వయ !
మీ కవితం గన్న 'తులసి' మీరై ఆంధ్ర
శ్రీ కాంతి వృద్ధిజేయుట
కై కూర్మి జనించెనని మదాత్మదలంతుఁ. ౧

లలిత మృదుమధుర సత్పద
ములు సముచిత నవ్య భావములును మనోజ్ఞ
బులునగు శయ్యారీతులు
కలిగియు మీ రచన నెగడుగద యతివర్యా! ౨

పట్టిరి. ఆబాల మాస్వైరిణ మాగోస్వామి తులసీ గోరసము స్వరసముగా నచట ప్రసరించినది. తెలుగు నాట 'హిందీ' మాటలు వినబడక పూర్వము నుండియు "వ్రజ"రీతి కలయది భావవ్రజమున కందినది. గేయమధురమై తులసీమానసము ఆంధ్ర సహృదయ హృదయములం దాధ్యాత్మిక ముద్ర చూపినది. ఆంధ్రు లధ్యాత్మరామాయణ గవీ రస సరసులు. గేయకీర్తనధర్మమున అధ్యాత్మ రామాయణ కీర్తన సాహితీ మధుర మధు రసధారల నందరి కంఠమున పోత పోసి, శ్రుతుల బట్టించి, మానసము పూరించి, హృదయసాగరము చేర్చినారు. పోతరాజులు త్యాగరాజులు రామచరితము తమ చరితము కాగా లోకకంఠముతో పాత్యగేయమధురముగా గోక్షీరములు పోసినారు. ఆంధ్ర హృదయ మట్లు అధ్యాత్మ సంభృతము. కాని సర్వముఖముగా నొకటి గేయము కాలేదు. కర్మ వశలోకమంతగా భక్తిపరవశము కాదు. అది నిమిత్తముగా ఆపద మాశిర మాంధ్రుల కొక్కటి లేదు. ఉత్తరప్రదేశుల కదియున్నది. అది తులసీ శ్రీగీతము. ఊగిన తల పట్టక తల గల వారి తలలూపి తులసి వాఙ్మయమానసతీర్థ మయినది. అతిమంజుల భాషానిబంధము తులసి.

శ్రీ కేశవతీర్థులు మానస తులసీ తీర్థమును గేయ పాత్య మధురముగా కవితాశంఖమున సమాకర్షించినారు. అ సమస్తమంజుల మయిన తులసి మానసము కేశవతీర్థ తీర్థమున నవ్యస్తమధుర మయినది. ఇది యాంధ్రీరీతి ప్రాభవ పరిపాక శయ్యా పద్య. తులసీకవి తులసి నిత్యపారాయణ మొనర్తురు. ఈ తీర్థమానస తీర్థము నిత్య మవతరణము పొందవలెను. అప్పు డందరు "స్వాంతస్సుఖ"మున కని సంభావింపగలరు. ఉత్తరప్రదేశ సాహితీప్రియులు మానసము దర్శనీకరించి విశ్వకోశముగా భావించిరి. దర్శన దర్శనులు శ్రీ కేశవతీర్థులు ఈ శ్రీరామచరితమానస మాధారముగా నట్టి భావ సంభావనమునకై శ్రీకారము చుట్టినారు. ఆత్మయాగములో జీవులు హవీరూపులై శివే తరము క్షయింప జేసికొని స్వాత్మరససంవేదనము పొందుట కిది సమయము. ఇది సమయావతారము. అస్తు.

జమ్ములమడక మాధవరామ శర్మ.

క్రొత్తకథఁ గ్రొత్తభావాలు గూర్చి కావ్య
మల్లుటే కష్టమైయుండు నంతకన్న
నితర భాషానువాద మెంతేనిగష్ట
మైననేమి—కృతార్థుండ వైతి వనఘ!

ద్విపద కావ్య ప్రపంచాన స్థిరయశస్సు
నందుకొనె రంగనాథ రామాయణంబు
దాని తరువాత బేరొక్కనం దగిన కావ్య
మాంధ్రలోన మీ గ్రంథమే యగును స్వామి!

శ్రీరామతీర్థ శిష్యుడ
వై, రాముని భక్త వరుడవై, యతిమణివై
శ్రీరామాయణ రచనా
వారిధి దరియించి కీర్తిబడసితి వార్యా!

శ్రీ మట్టపల్లి నృసింహమంత్రోపాస
నా బలోన్నతి ననంతముగబొంది
ఆంధ్రాంగిలేయ భాషాబ్ధులఁ గాలించి
కమనీయ సుగుణరత్నముల నంది
ఐహిక భోగంబులన్నిటి ద్యజియించి
అతి పవిత్రంపు సంన్యాసమొంది
అల రామతీర్థ సేవాశ్రమంబును పిద్దు
రాలలో స్థాపించి ప్రతిభగాంచి

రామదర్శనమను పత్రికాముఖమున
భక్తివైరాగ్య విజ్ఞాన భావములను
బాగవెదజల్లి మురియు సంపాదకుడవు
అనఘ! కేశవతీర్థ! జోహారు లివిగో!

సంతగుడిపాడు,
3-12'57.

ఇట్లు విధేయుడు,
మంచికంటి వేంకటేశ్వరరావు.

పూజ్యపాదశ్రీశ్రీశ్రీనిర్వికల్పానందస్వామివారు
అధ్యక్షులు : శ్రీరామకృష్ణమఠము - రాజమండ్రి.

వాల్మీకి కలము పట్టిననాటినుండి తులసీదాసు "రామ చరిత్ర మానసము" వ్రాయువరకు శ్రీరామగుణ వర్ణనము దేశభాషలోనే జరుగుచుండెను. దేశభాషలో పండితులు

అర్థమును వివరించుచు, జనసామాన్యమునకు బోధపరచు చుండిరి. "ఈ ద్రావిడ ప్రాణాయామ" మేల?—ఎవరికి వారే సూటిగ ఆ శ్రీరామచరిత్రమును చదువుకొని ఆనం
3 దింపరాదా? అను ఊహ తులసీదాసుకు తట్టెను. తట్టు టేమి, కార్యరూపముదాల్చటేమి, ఆపరవాల్మీకియని ప్రశంసల నందుకొనుటేమి — వెనువెంటనే జరిగెను. శ్రీరామకృప నాటినుండి నేటివరకు హిందీభాషయును, తదనుబంధభాషలును వాడుకలోనున్న ప్రాంతమంతయు
ర కోట్లకొలదిగ తులసీరామాయణ ప్రతులతో నిండిపోయి నది. ఆ దేశప్రజలలో ముఖ్యముగ సాయంవేళల తులసీ రామాయణ శ్రవణ పఠనముల నొనర్పని వ్యక్తులరుదనియే చెప్పనగును. ఒకరు పఠించుచుండ పదుగురుప్రోగై విను
ళ చుందురు. అట్లు జరుగుటకు వీలులేని ప్రాంతమునన్న సాధారణ వ్యక్తులుగూడ, తులసిచెట్టుకు తీర్థముపోసి, శ్రావ్యస్వరముననో, లేక అశ్రావ్య స్వరముననో రామాయణ గానమొనర్చి, మరియొకపని చూచుకొందురు.

ఎవరు ఈ తులసీదాసు? అక్బరుచక్రవర్తికి సమకాలికుడగు ఒక వ్యక్తి. తార్కీయ పురుషార్థసేవలో భార్యయగు మమతాదేవివిూద మమత్వము తప్ప, మరియొక మమతలేని కాముకుడు. అతని లౌల్యమును దూషించి వైరాగ్యభావమును కలుగజేసిన ప్రథమగురువు ఈ మమతాదేవియే. మహాత్ములు తాత్కాలికముగ అసత్పథ ప్రవృత్తులైనను, ఒకింత ప్రరోచనయున్నయెడల, దివ్యదీప్తుల ప్రజ్వరిల్లుదురు.

తులసీదాసుని రామభక్తి ఒకఎత్తు, అతని గురుభక్తి ఒకఎత్తు. ఆచార్యభక్తి లేనివానికి దైవభక్తి అబ్బదని నిరూపించెడి జీవితము.

మమతాదేవిని త్యజించినపిదప తాను గురుకరణ మొనర్చుకొనిన శ్రీమదాంజనేయులప్రతి అతడు చూపిన దాస భావము విస్మయావహము. భక్తసులభుడగు శ్రీరాముడు కూడ ఎన్నియో పర్యాయములు తులసీదాసుని వంచించి, తద్ద్వారా దర్శనాకాంక్షను ప్రగాఢమొనర్చి తుదకు సాక్షాద్దర్శన మొసంగెను.

ఆ యీ కథ లన్నియును నేటికిని లోకుల నోళ్ళలో నలుగుచునే యున్నవి. వీటిలోని ఒక వృత్తాంతము :

రామదర్శన మెట్లు లభించునని ఊదర పెట్టగా, గురువు చిత్రకూట పర్వతమున లభింపగలదు. అటకు బొమ్మని తులసీదాసునకు ఆజ్ఞయొసగెను. అట్లేయని తులసీదాసు ఆ ప్రాంతమునకు బోయి తపమాచరించుచుండెను. ఒక రోజున మధ్యరాత్రి మేలొ్కనిచూడగా, సమీపారణ్య పర్వతములు వెలుగుతోడను జనుల కోలాహలముతోడను నిండియున్నట్లు తోచెను. అదేమో చూతమని ఏగగా: అక్కడ రామ లీలాభినయము - నాటకము - జరుగుచుండెను. తనివార దానినిచూచి తెల్లవారుజామున మరల వచ్చి శయనించెను. ఒకింత వేళయగుసరికి లేచి, తను చూచివచ్చిన వృత్తాంతమును ఊరివారికి చెప్పగా : కీకారణ్యమున నాధి నాటకమేమి? మీరు చూచుటయేమి? తనకు ఒకింత భ్రాంతికలిగి యుండవచ్చును- అని వారనిరి. దానితో తులసీదాసునకుసర్వము విదితమయ్యెను.అయ్యో! సాక్షాత్తు భగవద్దర్శనము లభించినను, నాటకమను భ్రాంతికిలోనై, భగవత్సేవా సపర్యాదుల నొనర్పనైతినే యని వాపోవ దొడంగెను.

* * * *

నాకు తెలిసినంతవరకు నేటికి తులసీదాస రామాయణమునకు నాల్గు అనువాదములు తెలుగున వెలసినవి. మూడు పద్యానువాదములు, ఒక వచనానువాదము. లొగడ వేగుచుక్క గ్రంథ మూలాధారమున భాగవతుల లక్ష్మీనృసింహ శర్మగారును (బరంపురం), ఇటీవల మైలవరపు సూర్యనారాయణమూర్తి (కృష్ణపాలెం, ఎర్నగూడెం. పో. పశ్చిమగోదావరి) గారును, పద్యానువాదములను, వావిళ్ళవారు వచనానువాదమును వెలువరించియుండిరి వీనిపైన చెప్పిన పద్యానువాదములు బాలకాండతోనే నిలచిపోయినవో లేక, సంపూర్ణముగ ముద్రింపబడినవో తెలియుట లేదు.

శ్రీ నోముల అప్పారావు గారును వారి శిష్యగణమును ఇటీవల ఈ తులసీదాస రామాయణమును ఆంధ్రదేశము నందలి వివిధ పట్టణములలో గాన వ్యాఖ్యానముల సల్పుచు, ప్రసిద్ధిని తెచ్చి పెట్టుచున్నారు. ఈ ఉద్యమము అట్లే నడుచుచుండును గాక!

ఇది అట్లుండ : శ్రీ కేశవతీర్థస్వామి వారు ప్రస్తుతము మూడవ పద్యానువాదమును ఆంధ్రావళికి అర్పించుచున్నారు.

ఇందులోని విశేషమేమన, గ్రంథమంతయును మంజరీ ద్విపదలో గేయానుకూలముగ నడిపింపబడినది. వృత్తకావ్యములకు వచ్చినంత ప్రసిద్ధి, తెలుగున ద్విపదకావ్యములకు రాలేదు. కనుక, ఎంతమటుకు జనరంజకమగునో కాలమే తెల్పవలసియున్నది.

అయినను : భక్తులకు నిత్యపారాయణా యోగ్యమగుచు "కొంగునగట్టిన బంగారు మూటవలె" వారికి ఆనందకరమగుచు, విలసిల్లగలదు.

పరాభక్తిని, అద్వైతజ్ఞానమును ఒకేపుడిసిటపట్టిన మహనీయుడు తులసీదాసు గోస్వామి. ఆవేశపూరితమైన భక్తి తాత్కాలికోద్రేకానందములను కలుగజేసినను, వెనువెంటనే మనస్సును శూన్యమొనర్చి, శుష్కమొనర్చును. అట్లే అద్వైతజ్ఞాన మనబడు దానినొంటిగ అభ్యసింపబూనిన, మనస్సును శుష్కతమ మొనర్చును.

కనుక ఈరెంటిని ఒకేవ్యక్తి ఏక కాలమున సాధనగ అవలంబించి, ఒకదానిలోటును మరొకదాని శక్తితో పూరింపవలసియున్నది.

ఈభావన కనుకూలముగనే ఆమూలచూడముగ తులసీదాసు జ్ఞానభక్తి రసభావ పర్యాయముగ తన రామాయణమును నడిపించి నాడు. భక్తులకు దశరథరాజకుమారుడుగతోచు పుంసాంమోహనుడే, మరల అపారగంభీర పరబ్రహ్మము.

ఉద్రేక పూరితమగుభజనలతో ఆంధ్రదేశ వాతావరణము నిండిపోవుచున్నది. వీనిని కొంచెము అదుపులో పెట్టవలసిన అగత్యము కలదు. ఈ ఆశయమును ఈ నవానుకృతి సాధించినచో, నాకంటె సంతోషించువారు మరియొకరుండరు.

అనువాదకులగు శ్రీ కేశవతీర్థులుకూడ జ్ఞాన - భక్తి తీర్థులగుట వలన, ఈ అనువాదము సుందరతరమైనదని వేరుగ చెప్పనక్కరలేదు.

సర్వులు - సర్వులనుటకు జంకు కలుగుచున్నది - ఈ పీయూషమును కాంక్షించెడి అధికారిక పుణ్యపురుషులగ్రాహిగ దీనిని గ్రోలి తృప్తినందెదరు గాక!

రాజమండ్రి,
10-1-'57.

ఇట్లు,
స్వామి నిర్వికల్పానంద.

శ్రీ శ్రీ దాసశేషస్వామివారు

సంపాదకులు : "శ్రీ భక్తిసంజీవని"

దాసకుటి, అంగలకుదురు.

"... పరమ పవిత్రమగు రామకథ. అందును శ్రీరామానుగ్రహమున వ్రాయఁబడినది. వ్రాసిన వారా పరమయోగివర్యులు. 'రాఘవేశ్వరు చారిత్రము నెవ్వ రేవిధమునన్ వర్ణించినం గ్రాలదే' యను పూర్వకవి సూక్తి ననుసంధించి 'రామ చరిత మానసము' నెల్లవా రాదరమునఁబఠించి కృతార్థు లయ్యెదరు.

అంగలకుదురు,
18-1-'57.

దాసశేషుఁడు.

శ్రీ నోరి నరసింహశాస్త్రిగారు బి.ఏ., బి.యల్.,

సాహితీ సమితి, రేపల్లె.

తులసీదాస గోస్వామి రామాయణమును రామచరిత మానసము అనుపేర ఏడు కాండములుగా 'భాషా' కావ్యముగా రచించెను. ఉత్తర హిందూస్థానములో దీనిని వాల్మీకి రామాయణమువలెనే పూజ్యభావముతో నారాధించుచు ఋష్యాది న్యాసములతోడను అంగన్యాసకర న్యాసములతోడను ధ్యానపూజాపురస్సరముగను పారాయణ మొనర్చుచున్నారు. నేడు హిందీభాషయని ప్రసిద్ధికెక్కిన భాషలో అంతర్గతమగు 'అవధి' అను ఉపభాషలో ఈ గ్రంథము రచింపబడినది. తులసీదాసు దానిని 'భాష' యను నామముతోడనే వ్యవహరించెను.

ఇందులో కాండము లనునవి పెద్ద విభాగములు. వాల్మీకమునందువలెనే యిందును ఉత్తరకాండముతో కలసి ఏడు కాండములున్నవి. యుద్ధకాండకు లంకాకాండమను పేరుమార్పేకాని తక్కిన కాండనామములు అన్నియు సమానమే. ఈ కాండములనే ప్రథమ సోపానము, ద్వితీయ సోపానము ఇత్యాదిగా సప్తసోపానములుకూడ కవి నిర్దేశించెను. ఈ కావ్యము మానససరోవరముగా భావించినందున కవి యీ కాండములనే సోపానములుగా పేర్కొనెను. ఈ విభాగములేకాక పారాయణమున కనుకూలముగా కాండము మధ్య విశ్రామములను ఉపవిభాగములును కలవు.

ఇట్టి రామాయణము లింతవఱకు వెలువడలేదు. ఇంత విశేషప్రచార మున్నగ్రంథ మింకొకటి లేదు. ఇది విద్వాంసులనేకాక విద్యాగంధము లేని పామరులనుగూడ ఆకర్షించినది. నిరక్షరాస్యులుగూడ రామచరితమానస భాగములను కంఠస్థము చేయుచుందురు.

దీనిలో అడుగడుగునను కవి - రామభక్తి ద్యోతమానమగుచుండును. కాని అది యితర దైవములను ద్వేషించు రామభక్తి కాదు. శివుని భజించువారేకాని శ్రీరాముని స్వరూపము తెలిసికొనలేరని మాటిమాటికి నొక్కి చెప్పబడుచుండును. అందుచే హరిభక్తులకే కాక, హర భక్తులకును ఈ గ్రంథము ఆదరపాత్ర మగుచున్నది. ఇందులో శ్రీరామ కథ శివుడు పార్వతి కుపదేశించినట్లే ఉన్నది.

సంస్కృతములో విశ్వామిత్రప్రణీత మను ప్రతీతిగల అధ్యాత్మరామాయణము ననుసరించి దీనిని వ్రాసెనని కొందరందురు. అధ్యాత్మరామాయణము మిక్కిలి చిన్న గ్రంథము. ఇది అంతకంటె ఎన్నో రెట్లు పెద్దది. అధ్యాత్మ రామాయణము నందలి 'శ్రీరామ హృదయము' దానికి ప్రాణతుల్యమైనది. దాని కందులో నెంతయో ప్రాధాన్యమున్నది. అందలి 'శ్రీరామ హృదయము' తులసీదాసుకు హృదయస్థమై యుండెననుట కెట్టి సందేహమును లేదు. కాని దాని కథ ననుసరించి యిది వ్రాసెననుటకు వీలు లేదు. అవతారికా భాగములోని -

'సీతారామగుణగ్రామ పుణ్యారణ్యవిహారిణౌ ।
వందే విశుద్ధవిజ్ఞానౌ కవీశ్వర కపీశ్వరౌ'॥

అను ప్రసిద్ధశ్లోకములోని కవీశ్వరుడు వాల్మీకియే యనుటకు సందేహము లేదు. అందుచే వాల్మీకినే కవి యనుసరింప నుద్దేశించెననుట నిశ్చయము. కాని యీ కథ ఎన్నియో భాగములతో వాల్మీకి కథతోగూడ కలియక భేదించుచున్నది. వర్ణనాదులలో నైనను ఇతడు వాల్మీకి ననుసరింపలేదు. అందుచే నిది సంపూర్ణముగా స్వతంత్ర గ్రంథము!

2

తులసీదాసు జీవితము సరిగా ఎట్టిదో తెలియరాదు. ఈ కాలపు జనులు నమ్మటకు సమ్మతింపని అద్భుత

సన్నివేశములతో ఆతని జీవితగాథ చెప్పుచున్నారు.

ఆతడు సరయూ నదీతీరమున అయోధ్యకు సమీపమున ఒక చిన్న గ్రామములో జన్మించెను. తండ్రి పేరు ఆత్మారామ దూబే. దూబే అనగా ద్వివేది కావున నాతనిది వేదవిప్రకుటుంబము. అతడు జన్మించినది అభుక్త మూలమని ప్రసిద్ధిగల మూలానక్షత్ర ప్రథమ పాదమట. అందుకుతోడు ఆతనికి పుట్టినప్పుడే రెండు దంతములుండెనట. తల్లి యాతడు పుట్టినప్పుడే మరణించెనట. అట్టి దుష్టనక్షత్రమున జన్మించినందున తండ్రి యా పసిబిడ్డను దూరమున వదలిపెట్టెను. ఎవరో దాది ఆ పిల్లవానిని తెచ్చి సాకుచుండగా కొన్నాళ్ళకు అదియు కాలధర్మము నొందెను. ఆ పిమ్మట నరహరిదాసు అను గోస్వామి ఆతని తనకడనుంచుకొని పెంచి విద్యాబుద్ధులు గరపెను.

కొంతకాలమునకు తులసీదాసుకు తన జన్మస్థానమునకు పోవలెనని వ్యామోహము కలిగి, వెళ్ళి సరయూ నదీతీరమున కుటీరమొకటి నిర్మించుకొని అందు నివసించుచుండెను. అప్పుడాతని కొక గృహస్థు తన కుమార్తెనిచ్చి వివాహము చేసెను. ఆ పిల్ల పేరు 'రత్నావళి' యనియు 'తులసి' యనియు రెండువిధముల జెప్పెదరు. వివాహమైనదాది ఆతడామెను మోహాంధుడై ప్రేమించుచు యితర ప్రపంచము సమస్తము మరచియుండెను. భార్య నెన్నడు పుట్టినింటికైన పోనిచ్చెడువాడు కాడు.

అతడు భార్యనువదలి క్షణమైన నుండనోర్వకుండెడువాడు. ఐనను ఒక నాడతడు తప్పనిసరియై పాదుపా సన్నిధికి వెళ్ళవలసివచ్చినది. అక్కడినుండి యాతడు తిరిగియింటికి వచ్చునప్పటికి భార్య నామె బంధువులు పుట్టింటికి తీసుకొనిపోయి యుండిరి.

భార్యనుచూడక క్షణము నిలువలేక తులసీదాసు అప్పటికే ప్రొద్దుపోయినను లక్ష్యముచేయక వెంటనే మామగారి గ్రామమునకు బయలుదేరెను. చీకటిరాత్రి. దారిలో పెద్ద ఏరు పారుచున్నది. నీటిలో తేలిపోవుచున్న శవమునాధారముచేసికొని అతడా ప్రవాహము దాటెను. మామగారి యింటికి పోగా తలుపులువేసి యుండెను. గ్రాడువలె వ్రేలాడుచున్న నాగుబామును పట్టుకొని ఆతడు గోడదాటి భార్యను చేరికొనెను. భార్య యాతని నక్కడ నట్టి నిశీథవేళ నాస్థితిలో చూచి ఆశ్చర్యపడి, 'నామీద మీకున్న మమకారములో అల్పాంశమైనను శ్రీరామచంద్రునిపై నున్నచో భవతారకమై యుండునుగదా!" అని పలికినదట.

'కామిగాక మోక్షకామిగాడు' అను కవివాక్యము తులసీదాసు విషయమున సార్థకమైనది. ఆ మాటలు విన్నంతనే తులసీదాసు హృదయములో ఆకస్మికముగా పరివర్తనము కలిగెను. భార్య వాక్యములే ఆతడుపదేశముగా గ్రహించి సంసారమువదలి కాశిలో మణికర్ణికా ఘట్టము చేరి రామనామజప మారంభించెను.

ఆతడు నిత్యము తానుచేయు జపము అక్కడగల ఒక వేపచెట్టు మూలమున నర్పించెడువాడట. కొంత కాలమునకు ఆ చెట్టు నాశ్రయించియుండిన బ్రహ్మరక్కసున్ను ఆ జపార్పణఫలముచే తన రక్షోరూపమువదలి తులసీదాసును వర మేమైన కోరుకొమ్మనెను. తులసీదాసు తనకు శ్రీరామచంద్రదర్శనము కలుగునట్లు ప్రసాదింపుమని వేడెను. అది తనశక్తికిమించినదనియు అందుకు దారి చూపగల వ్యక్తిని చూపింపగలనని యిట్లనెను:

"వరాహఘట్టములో నిత్యము శ్రీమద్రామాయణ కాలక్షేపము జరుగుచుండును. వృద్ధబ్రాహ్మణుడొకడు ఆ కాలక్షేపమునకు ముందేవచ్చి దూరముగా కూర్చుండి కాలక్షేపము పూర్తియైనపిమ్మటగాని విడిచివెళ్ళడు. ఆ రూపముతో వచ్చు వ్యక్తి హనుమంతుడు. నీ వాతనికి వందనమొనర్చి ఆశ్రయింపుము. ఆతడు తాను హనుమంతుడను కాననును. అయిన వదలక సేవించినచో ఆతడు నీకు శ్రీరామదర్శనము అనుగ్రహింపగలడు."

బ్రహ్మరక్కసు చెప్పినవిధముగా తులసీదాసు వృద్ధబ్రాహ్మణరూపమున నున్న హనుమంతుని దర్శించి ఆశ్రయించి ఆతని యుపదేశమున చిత్రకూటమున కొంతకాలము తపస్సుచేసెను. అక్కడ నాతనియొద్ద కొకనాడు రామలక్ష్మణులు రాజకుమారుల రూపములతో వచ్చి దర్శనమిచ్చిరి. కాని యాతడు వారల గుర్తింపలేదు.

తులసీదాసు తుదకు సరయూ నదీతీరమునేచేరి తపస్సుచేసికొనుచు పరమపదించెను.

3

తులసీదాసు చరిత్రము మొత్తముమీద పై విధముగా, కొన్ని కొన్ని మార్పులతో ప్రసిద్ధిచెందినది. అందలి ఘట్ట ముల బాహ్యాచారిత్రక సత్యముతో మనకంత నిమిత్తము లేదు. కేవల మట్టి చారిత్రక సత్యము తరుచుగా, పేలవమై నిర్జీవముగా నుండును. ఈ చరిత్రలో మహాభక్తుని చరిత్ర చిత్రింపబడినది. అందులో సామాన్యచారిత్రక సత్యము కంటె ఉదాత్తమగు సత్యము నిక్షేపింపబడినది. అది తెలిసినచే గాని రామభక్తాగ్రణులలో తులసీదాసుకు ఎట్టి ఉన్నత స్థానమున్నదో మనము గ్రహింపలేము. వాల్మీకి మహర్షియే ఈ కలికాలములో లోకోద్ధరణమునకు తులసీ దాసుగా అవతారము నొంది భాషా కావ్యముగా శ్రీరామ చరిత మానసము రచించె నను ప్రతీతికలదు.

తులసీదాసుపేర మరికొన్ని రచనలు కూడ కలవు. వానిలో "వినయపత్రిక" వలన అతనికి మహాకవి యను ప్రసిద్ధి కలిగింది. "రామచరితమానసము" వలన తులసీ దాసుకు మహాకవులలో మహాభక్తుడను విఖ్యాతియు ప్రాప్తించినది.

4

మూలగ్రంథములో చౌపాయి, దోహా, సోరఠా, ఛందస్సు— అను నాలుగు విధముల ఛందములు ముఖ్య ముగా కలవు. ఆ భాషలో ఛందస్సు అనునది ప్రత్యేక చ్ఛందోవిభాగమని ఆంధ్రులు గమనింపవలెను. ఆఛందస్సు లనునవి అన్నియు ఒకే విధమైనవి కాక రకరకముల ఉన్నవి. ఏమైనను తులసీదాసు వాడినవన్నియు మాత్రా చ్ఛందములే.

వరుసగా నాలుగు చౌపాయిలు చెప్పి వెంటనే ఒక దోహా చేర్పుట తులసీదాసుకు అభ్యాసము. కాని దోహా బదులు సోరఠా చెప్పుటయు చౌపాయిల సంఖ్య పెంచు టయు మధ్య ఛందస్సులు చేర్చుటయు మొదలగు కూర్పు మార్పు లెన్నో అతడు చేసెను. ఇవి యన్నియు గాక కాండాదులందు తులసీదాసు, సంస్కృత విద్వాంసుడు కనుక, సంస్కృతభాషలో ధ్యానశ్లోకములు ఉంచి, ఆ పిమ్మట కథాఘట్టములు 'అవధి' లో ప్రారంభించును.

ఈవిధముగా చౌపాయిలు, దోహాలు, సోరఠాలు, ఛందస్సులు మధ్య మధ్య చేర్చుచు సందర్భానుకూలము గను రసానుకూలముగను మార్పులు చేయుచు వచ్చుటచే పెద్ద గ్రంథమైనను విసుగుపుట్టింపకుండునట్లు తులసీదాసు రచన కావించినాడు. కాండాదులయందలి ధ్యానశ్లోకము లతో ఆర్షత్వమును సిద్ధించినది.

5

శ్రీరామచరితమానసమును బహు కాలము క్రిందట భాగవతుల నృసింహశర్మ ఆంధ్రములో స్వేచ్ఛానువాద మొనర్చిరి. వారి కవిత్వము ప్రౌఢము. కందము ముఖ్య ముగా ఆయన చేతులలో గంగా ప్రవాహమువలె నడచి నది. ఐనను అట్టి స్వేచ్ఛానువాదము కాక యథామాత్రక మైన అనువాదము కావలెనని ఆంధ్రలోకములో కాంక్ష కలిగినది. అట్టి ప్రయత్నములు ప్రస్తుతము కొన్ని జరిగినవి.

వానిలో నొకటి శ్రీ మైలవరపు సూర్యనారాయణ మూర్తి 'ఆంధ్ర తులసీరామాయణము' అందులో బాల కాండము ఈమధ్యనే ప్రకటితమైనది. శ్రీ సూర్యనారా యణమూర్తి రామభక్తుల కుటుంబములో జన్మించినవాడు. స్వయముగా రామభక్తుడు. ఆయన మూల గ్రంథమువలె నది నిర్వచనముగా రచించెను. కాని ప్రాచీనాంధ్ర కవుల మార్గమున శార్దూలాది సమవృత్తములు నాలుగు, కందము, సీసము, గీతములు ప్రధానముగా నుండునట్లు రచించిరి. అందుచేత మూలము వలెనే ఛందస్సుల మార్పువల్ల అదియు విసుగు కలిగింపదు. ఐనను మూలము మాత్రాచ్ఛందస్సు లలో నుండు పదకవిత్వము గనుక పాడుట కనువుగా నుండును. ఆ ఘణితి దానిలో లేదు. అందుచేత ఆగ్రంథము మార్గకవిత్వము దారిన నడచిన దనవచ్చును.

6

శ్రీ కేశవతీర్థస్వామివారు ఈ గ్రంథమును 'శ్రీరామ చరితమానసము' అను పేరుతోడనే రచించినారు. ఇందులో అవతారికాభాగముకాక కథా భాగమునుండి అంతయు ఎక్కువభాగము మంజరీద్విపదలో చెప్పిరి. ద్విపదయు గణబద్ధమగుటచే మాత్రాచ్ఛందస్సు కాదు. ఐనను పూర్వకాలము నుండియు స్త్రీలపాటలలో ఆంధ్ర దేశమున విశేషప్రచారము కన్నందున, ద్విపదయు గేయమై పదకవిత్వమునకు సన్నిహితముగా నుండును.

ఛందోభేదములతో చేసిన రచనలో కన్పింపని విసుగు ద్విపదరచనలో ఉండక తప్పదు. అది తగ్గించుటకే పల్నాటి వీరచరిత్రములో మంజరీద్విపద గ్రహింపబడినది. ఇంతేకాక భావము పాదాంతములో తెగనీయక పాద మధ్యమునకు సాగనిచ్చుట మొదలగు కూర్పు నేర్పులవల్ల మన ప్రాచీన కవులు ఆ విసుగు రానీయకుండ చాలవరకు వారింపగలిగిరి. అదేమార్గము యీ గ్రంథములో గూడ అవలంబింపబడినది. అదియునుగాక అక్కడక్కడ సకృత్తుగానైనను, ముఖ్యముగా స్తోత్రములుచేయు సందర్భములలో, ఇందులో మాత్రాచ్ఛందస్సులున్న గేయములు కూర్పబడినవి. అందుచే ద్విపద కావ్యములలో ప్రకృతి సిద్ధముగానున్న విసుగు ఇందులో లేదు. మూలగ్రంథములో, కాండాదులలో, సంస్కృత శ్లోకము లున్నట్లే శ్రీ స్వామివారు యిందులో ప్రతి విశ్రామాదియందును కృతిభర్తయగు మట్టపల్లి నృసింహ సంబోధనము కందపద్యములలో కూర్చినారు.

శ్రీ స్వాములవారు ఈ గ్రంథరచన యందు సమస్త విషయములలో దేశికపద్ధతులే అవలంబించిరి. యతిమైత్రి విషయములో పూర్వకవులు అక్కడక్కడను, నేటి కవులు విరివిగాను అవలంబించిన స్వాతంత్ర్య మంతయు చూపినారు. యతి నియమము శబ్దాలంకారము వంటిదను మా మిత్రుల నిశ్చయము, వీరును పాటించినట్లే. సకృత్తుగా ప్రాసయతియు వీ రంగీకరించిరి.

భాషావిషయములో గూడ దేశికవుల పద్ధతులే అవలంబింపబడి ప్రసన్నతకు భావగాంభీర్యమునకు ఇందులో ప్రాధాన్యమీయబడినది. ఇదియే మూలగ్రంథపద్ధతియు నగుటచే సముచితమైనది. భాషాంతరీకరణము చేయువారు మూలగ్రంథము ప్రదర్శించుటే ప్రధానాశయముగా పెట్టుకొనవలె గదా! ఆ విషయములో యీ గ్రంథము కృతార్థమైనది.

తులసీదాసు తన గ్రంథారంభమునకు కారణము ఈ విధముగా నిర్దేశించెను.

'నానాపురాణ నిగమాగమ సమ్మతం యత్
రామాయణే నిగదితం క్వచి దన్యతోపి
స్వాంతఃసుఖాయ తులసీ రఘునాథగాథా
భాషానిబంధ మతిమంజుల మాతనోతి.'

ఇందులో స్వాంతఃసుఖము కొరకు అనునది ముఖ్యముగా మనము గమనింపదగినది. పాశ్చాత్యకవులు కొందరు అనునట్లును, నేటివారు కొందరు వారి ననుకరించి అనుచున్నట్లును, 'నాకొరకే నేను కావ్యము చెప్పుచున్నాను. ఇతరుల కొరకు కాదు!' అను నభిప్రాయముతో కాదు, తులసీదాసు పలికినది. ఈ అంతస్సుఖము సర్వజనసామాన్యమైనది. అందుచే, నది తులసీదాసు ఉపాధికి పరిమితమైనదికాక; మానవకోటియందును విశ్వమంతటను అంతర్యామిరూపమున ఏకముగానున్న పరమాత్మసుఖము నుద్దేశించియే తులసి ఈ కావ్య మారంభించెను. అందువలననే అది మంజులము!

ప్రతి కాండము చివరను గద్య మిట్లుండును:

"ఇతి శ్రీమద్రామచరితమానసే సకల కలికలుష విధ్వంసనే (ప్రథమః) సోపానః సమాప్తః."

ఈ గద్యములవలన గ్రంథరచనము కలికలుష విధ్వంసనమునకు ఉద్దేశింపబడినట్లును విస్పష్టమగుచున్నది.

శ్రీ కేశవతీర్థస్వాములవారు బహుకాలముగా సంసారబంధములు వదలి అధ్యాత్మజీవితమునకు ఆత్మాంకిత మొనర్చుకొని పిడుగురాళ్ళలో రామతీర్థాశ్రమములో పవిత్రజీవన మొనర్చుచున్నారు. ఈ గ్రంథమును వారి యిష్టదైవమగు మట్టపల్లి నరసింహస్వామికి అంకిత మొనర్చినారు. అట్టివారు యీ గ్రంథము రచించుటచే తులసీదాసగోస్వామి ఆశించిన స్వాంతస్సుఖము కలికలుషవిధ్వంసనము సఫలమగుననుట నిశ్చయము.

కంకంటి పాపరాజు అన్నట్లుగా,—

"శ్రీ రాఘవేశ్వరు చారిత్రము లెంద మొన్ని
గతులఁ వర్ణించినం గ్రాలదే!"

రేపల్లె,
19-1-'57.

నోరి నరసింహశాస్త్రి.

శ్రీ కోన వేంకటరాయశర్మగారు
ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి.

హృదయంగమమైన కావ్యపరిశీలనము, మధురమైన సంగీత శ్రవణము, సజీవ శిల్పసౌందర్యము,— హృదయ

మునకు హత్తుకొనును. కావ్యకళాదుల నాస్వాదించుటకు హృదయ మవసరము. సహృదయునకే రసాస్వాదనము సమర్థమై యున్నది. రసానుభూతికి హృదయ మవసరము. మానవ హృదయము సుస్నిగ్ధము, అతి కోమలము, నగుటఁ బ్రతివాని హృదయమునఁ గొలఁదిగనో గొప్పగనో భావము లుప్పతిల్లుటయు, ఆభావములు మనోహర కావ్య శ్రవణ మునను, మధురమైన సంగీత శ్రవణమునను, సజీవ శిల్ప సౌందర్య సందర్శనమునను,—అభివ్యక్తములై సంస్కృ తికిఁ బ్రాతిపదిక వైచుచుండుననియుఁ,— దెలియం దగి యున్నది.

సహృదయరంజక మైన రసోత్పత్తి కావ్యమున కవ సర మనియు, స్థాయి భావ మందికొన్న యా రసోత్పత్తి యొక్క స్థితి యుపస్థితమై యుండుననియుఁ, గావ్య పఠ నమునఁ దత్థ్సాయి ప్రస్ఫుట మగు ననియు,—నభినవ గుప్తాది యాలంకారికుల యభిప్రాయము. కావుననే కాళిదాస మహాకవి—

"రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్,
పర్యుత్సుకీ భవతి య త్సుఖితోఽపి జంతుః
త చ్చేతసా స్మరతి నూన మబోధ పూర్వం,
భావస్థిరాణి జననాంతర సౌహృదాని."—

అని వాక్రుచ్చి మన హృదయములలో రసమున కాధార మైన స్థాయి భావము వాసనారూపమున నుండుటవలన దేశ – కాలపరిమాణములను, బరిమాణములను,–దూరీక రించు నని విస్పష్ట మొనర్చినాడు.

ఆస్వాదన శక్తి యెల్లఱకు సమముగ నుండఁజాలదు సౌహార్ద్రత రాసిక్యతఁ జెంది రసము ప్రతీయమాన మగును. సంస్కారము ననుసరించి రసజ్ఞత కలుగును. అట్టివాఁడే రసాస్వాదనకు నర్హుఁడును, రసాస్వాదన తత్పరుఁడును. విద్వత్తుకలవాఁడు కవిత యందలి తీరు తియ్యముల, మెళుకువలఁ బోకడల, నందచందముల, గ్రహింపఁగలఁడు. ఆనందింపఁగలఁడు. జన్మించిన ప్రతి వానియందును ప్రాతిభాసికమైన జ్ఞానలేశ (Intention) ముండుచుండును. కాని యా జ్ఞాన లేశము అల్పసంఖ్యా కుల యండె విజృంభించి వారిని విజ్ఞాన ఖనులుగను, కళో పాసకులుగను, నొనర్చుటను గనుచున్నారము. అట్టి వారిలో మన శ్రీ కేశవ తీర్థ లొకరు.

మోక్షకాములు ప్రత్యహము నృత్యనాటకాదుల వీక్షించుచుండినఁ జాలునను "సంగీతరత్నాకర" కారు నభిప్రాయము ననుసరించి పరమాత్మునందు మనస్సుంచిన సాధకుఁడు మోక్షప్రాప్తికయి యవిరళ కృషి సాఁగించు ననియు, నీ సాధనలో నృత్య నాటకములవలనఁ గలుగు రసోత్పత్తి తోడ్పడుననియుఁ, బెక్కురు లలితకళల (Fine Arts) ద్వారమునఁ బరబ్రహ్మ ప్రాప్తికిఁ గృషి యొనర్చి రనియు, నందు సూరదాసు — తులసీదాసు— త్యాగరాజాదులు సచ్చిదానంద సిద్ధియె తగు ధ్యేయ ముగఁ బాటించి రనియు, నందువలన సర్వకళలకు– సర్వశాస్త్రములకుఁ — ప్రాణపదమైనది రస మనియు, రసమె సర్వశాస్త్రముల సారమనియుఁ, — దెలియు చున్నది.

కావుననే "రసోవైసః" అను శ్రుతియు రమణీయత కంతకును రసమే ప్రాణమని యవగత మొనర్చుచున్నది. ఈ పరమరహస్యమును హృద్గత మొనర్చుకొని తత్సాధ నకుఁ బూనిక వహించుట సంస్కృతివిశేష మనక తప్పదు. అట్టి సంస్కృతి - ప్రభావముగల తులసీదాసు గానముఁ జేసిన రామాయణ గాథను మన శ్రీ కేశవ తీర్థులు గేయరూపమునఁ దెలిఁగించి మన యెల్లఱకుఁ సాహితీ భిక్ష నిడుటయేగాక, సంస్కృతి భిక్షను గూడ నొసంగినందుల కెంతయు నభివంద్యులు.

రామాయణ గాథ "పాఠ్యే గేయే చ మధుర" మ్మనియు, "అహో గీతస్య మాధుర్యం శ్లోకానాం చ విశేషతః" అనియుఁ, గొనియాడఁ బడినది. మాధుర్యము కావ్యమున నగపించవలసిన ముఖ్యగుణమనియు, "చిర నిర్వృత్త మప్యేతత్ ప్రత్యక్ష మివ దర్శిత" మ్మను నట్లు కావ్యగుణమును మహర్షులు ప్రస్తుతించి రనియుఁ, —దెలియఁ గలము.

"ఉదార వృత్తార్థ పదైఃమనోరమైఃతతస్స రామస్య చకార కీర్తిమాన్,సమాక్షరైఃశ్లోకశతైర్యశస్వినోయశస్కరం కావ్య ముదారధీర్మునిః."

అని బాలకాండమున నుదారవృత్తము, నుదారపదము, నుదారార్థము సమాక్షరములు వినుతింపఁబడినవి. ఇట నౌదార్య గుణముఁ జెప్పఁబడినది. తర్వాతి శ్లోకమున

సమాన సంధియోగము, సమమధురోపనతార్థ వాక్య బద్ధము, నని పల్కుచు మాధుర్య సమతలఁ జెప్పినాఁడు వాల్మీకి. విచిత్రపదముల తోడను విచిత్రార్థములతోడను రామాయణము రచింపఁబడినదఁట ! శ్రావ్యత – సుభగత – మధురత – ప్రశంసింపఁ బడినవి.

సర్వ దేవతా స్వరూపుడు రాముఁడు. ఆ మహాత్ముని ఇచ్ఛాశక్తియెసీత, వీరిర్వుర కవినాభావ సంబంధము. ఈ విషయ మెరింగించు నదియే వారి చరిత్ర. వారిర్వురు లోకమున ధర్మము నిలుపఁదలఁచి యనుభవించిన యనుభవముల నగపఱచునదియె రామాయణగాథ. ప్రకృతి పురుషులగు సీతారాములు ధర్మ సంస్థాపనమునకయి యే రీతిఁ బ్రవర్తించిరో కనుగొని యనుసరించి తరించుట విధి యీటను "తపసా లబ్ధ చక్షుషమ్" అను వాక్యముం బట్టి జ్ఞానదృష్టితోఁ బ్రవర్తించి తులసీదాసాదులు భక్తిపుంభావగరిమతో జ్ఞాననిధి సేకరించి ధన్యులయిరి.

మూలప్రకృతి యగు సీతతోఁగూడి నిర్లిప్తుఁడు భగవంతుఁడు నగు శ్రీరాముఁడు ఏకార్యమైనను జేయఁగలఁడని "శివశక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం" అన్న శ్రీ శంకర భగవత్పూజ్యపాదుల వచనము తెలుపుచున్నది. సర్వ ధర్మమునకు మనోదార్ఢ్యము ముఖ్యము గదా! ఆ మనోదార్ఢ్యము యోగాభ్యాస కతం బున లభింపఁగలదు. యోగాభ్యాస ఫలమే ధ్యానము. "నహి ధ్యానేన సదృశం పవిత్ర మిహ విద్యతే" అని యార్షేయ స్మృతి. (ర వ అధ్యాయము) అతీతానాగత జ్ఞానము, పరుల హృత్పద్మముల నిక్షిప్తమైయున్న భావము, ఇవి యోగము నభ్యసించినఁ గలుగునని—

"శబ్దార్థప్రత్యయానా మితరేతరాధ్యాసాత్సంకర స్తత్ప్రవిభాగ సంయమా త్సర్వభూత బుత జ్ఞానమ్"-॥
"సంస్కార సాక్షాత్కరణా త్పూర్వజాతి జ్ఞానమ్ ।
ప్రత్యయస్య పరచిత్త జ్ఞానమ్" —॥

అను పాతంజల యోగశాస్త్రమందలి వాక్యము లెఱుంగఁ జేయుచున్నవి. ఈదృష్టి యోగాభ్యాసము లేకుండ లభింపఁ జాలదు. కావున నే యీ పరమగోప్యము నవగాహ మొనర్చికొని మన శ్రీ కేశవతీర్థులు మట్టపల్లి శ్రీనృసింహ దేవు కుఱంగుట ధ్యానయోగము నవలంబించి యతీత శక్తులఁ బడసి తులసీదాస విరచిత రామచరిత మానసమును దెలుఁగున గేయరూపమున ననువదించి యుభయతారకు లయిగని తెలుపుటకు సంతోషమగుచున్నది.

ఈ యవకాశమును దెలుఁగువాండ్రు వినియోగించి కొని తరింత్రుగావుత మని కోరు—

బాపట్ల,
6-1-'57.

భగవద్భక్త పాదరేణువు
కోన వేంకటరాయశర్మ
(ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి)

పూజ్యపాద శ్రీ శ్రీ శ్రీ
రామకృష్ణానందస్వామివారు 'గీతావాణి'
సంపాదకులు: శ్రీ భూమానందాశ్రమం,-గండిక్షేత్రం

మర్యాదా పురుషోత్తముడు శ్రీరాముడని, లీలా పురుషోత్తముడు శ్రీకృష్ణుడని, ప్రాజ్ఞపురుషుల నిరూఢవాణి. ఈ పేర్లకు సరిసాటిగా పలుకుబడి సంపాదించిన పేర్లు మరి ప్రపంచంలోలేవు. ఇవి మర్త్య మానవుల పేర్లుగావు. అచ్యుత పరమాత్ముని దివ్యనామాలు.

ఒకేమాట ఒకేబాణం ఒకేభార్య ఒకేసంతానం– ఇది శ్రీరాముని జీవితంలోని ఉజ్జ్వలఆదర్శం. "ద్విశ్శరం నాభిసంధత్తే– రామోద్విర్నాభిభాషతే"– అంటూ వాల్మీకి శోకిల రామగుణ మధురగానం చేసింది. ఒక జన్మలో తృప్తిలేక మరీ తానే తులసీదాసై వాల్మీకిమహర్షే శ్రీరామ కథాగానం చేశాడని విజ్ఞజనోక్తి. ఒక తులసీదాసేమిటి– రామకథాగానం చేసిన చేస్తూన్న చేయబోయే మహా కవులందరు వాల్మీక్యంశసంభూతులేనని నా అవధారణ.

రామాయణాలు శతకోటి అంటారు. శతకోటి-కావచ్చు అనంతకోటికావచ్చు. ఎందరెన్నివిధాల రచించినా వచించినా అది యెప్పటికప్పుడు సరిక్రొత్తది. రామాయణం నిత్యజీవితగ్రంథం;నిత్యనూతనగ్రంథం. స్వతంత్రభారతదేశానికి భారత రామాయణాలు రాష్ట్రీయ గ్రంథాలు; జాతీయ గ్రంథాలు. మహాభారతము మేఘ గంభీరమని అనిపించుకొంటే శ్రీ మద్రామాయణము వీణా మధురమని పేరుకు వచ్చింది. అందులోను– పోతనభాగవతం వ్యాసభాగవ

తాన్ని మరిపించినట్లు, తులసీ రామాయణం వాల్మీకి రామాయణాన్ని మించిపోయింది. ఉత్తర హిందూస్తానంలో తులసీ రామాయణానికి వున్నప్రశస్తి వాల్మీకి రామాయణానికి లేదు.

భక్త విజయంలో శ్రీ తులసీదాసుకొక ఉన్నతస్థానం వుంది. ఆభక్తమహాకవి వ్రాసిన రామాయణంపేరు శ్రీరామచరిత మానసం, అది తనఫక్కిలో తాను విశిష్టమైన గ్రంథం. ఇది ఎవరి మెప్పుకొరకో వ్రాసిన రచనకాదు. "స్వాంతస్సుఖాయ" ఆత్మ సంతృప్తికొరకు ఆత్మానందంకొరకు వ్రాయబడింది. ఇది భక్తిరసానికి తఱుగని వూట. దట్టదరిద్రుడు మొదలు ఆగర్భ శ్రీమంతునివరకు, నిరక్షర కుక్షి మొదలుకొని ప్రకాండ విద్వాంసునివరకు శ్రీమానసరామాయణం యొక్క కీర్తి రాజ్యం వ్యాపించింది. అది లోకుల నాలుకనే ఆకులుగా వ్రాయబడిన వరకవిత్వం. కొద్ది మాటలలో గొప్పభావాలను స్ఫురింపజేసేనేర్పు, ఉపమారూపకాలంకారాలపై ఆయనకుండే అధికారం అపారం. నేడు భారతావనికి హిందీ రాష్ట్రభాష. ఉత్తమ సత్సాహిత్యమైన ఆ హిందీ గ్రంథాన్ని తెలుగులో ఆవిష్కరించి పూజ్యపాద శ్రీ కేశవతీర్థస్వామివారు అద్భుతమైన కృషిచేశారు. సంస్కృత భాగవతచ్ఛాయలు తులసీరామాయణంపై పడినవని విబుధులకు తెలుసు. ఆ మర్యాద ననుసరించి శ్రీ స్వామివారు పోతనామాత్యుని జాడలలో తన కమ్మని కవిత్వం నడిపారు. మచ్చుకు, ఆంధ్ర భాగవతాదిలో శ్రీ పోతన్న 'శ్రీ కైవల్యపదంబు జేరుటకునై చింతించెదన్' అని ప్రారంభిస్తే, అక్షరశః అట్లే శ్రీ స్వామివారు 'శ్రీ కైవల్యపదంబు జేరుటకునై సేవించెద" అని ప్రారంభించారు. "దీనిం దెనింగించి నాజనంబున్ సఫలంబుజేసెద పునర్జన్మంబు లేకుండగ"— అని కృష్ణకథను వర్ణించి పోతనకవి జన్మ రాహిత్య పదవిని సంపాదిస్తే, మన స్వామివారు "రామస్వామి కథన్ పచింతును పునర్జన్మంబు లేకుండగన్"—అని రఘురామ చరితమును వచించి పునర్జన్మభీతి నెడబాసినారు. శ్రీ స్వామివారు యిష్టదైవాన్ని స్మరిస్తూ వ్రాసినపద్యాలు పోతనగారిని తలపించి మరిపిస్తూన్నవి.

శా॥ శ్రీకైవల్యపదంబు జేరుటకునై సేవించెదన్ భక్తహృ
చ్ఛోకధ్వాంత విభంగమంగళమహాశుంభన్నఖద్యోతులన్।

శ్రీకాంతామర మానిచిత్తనళినీ శృంగారభృంగంబులన్
శ్రీకృష్ణాతట మట్టపల్లి వనలక్ష్మీ నారసింహాంఘ్రులన్॥

మ॥ తతగర్వాంధనిశాచరాధిపసభా స్తంభాంతరాళోద్భవున్
ధృతినిర్భిన్న సురారిగర్భ రుధిరోద్దీప్తాంత్రమాలాగళున్।
నతమానీశ్వరదేవతానికరనానాస్తోత్రకోలాహలున్
శ్రితరక్షాచణు మట్టపల్లి నృహరిన్ సేవింతు నశ్రాంతమున్॥

ఉ॥ శాంతము దివ్యసుందరము శంఖసుదర్శన పద్మ సద్గదా
క్రాంత పరాక్రమక్రమవిరాజితరమ్యచతుర్భుజంబు శ్రీ।
మంతము శేషభోగఫణిమండితమౌ నరసింహరూపమున్
స్వాంతములో భజించెదను శాశ్వతనిర్మలభక్తిసిద్ధికై॥

ఉ॥ ఆ కవితారసాలశిఖరాసనమందున రామరామవాక్
శ్రీ కమనీయమాధురులు చింద 'గుహాకుహు' మంచుబాడి తృ।
ప్తాకుల జీవకోటికి మహామృతదానముచేసినట్టి వా
ల్మీకి పికంబు నెంచెద సమృద్ధకవిత్వపటుత్వసిద్ధికై॥

మధురమైన శైలితో – మనోజ్ఞమైన శయ్యతో అనువాదము పోతనధారవలె విపులీకృతమై నడిచింది. మచ్చుకు—

మూలం—నీలసరోరుహశ్యామ—తరుణఅరుణ వారిజనయన।
కరఉసోమమ ఉరధామ—సదాఛీర సాగరసయన॥

అనువాదం—

ఉ॥ నీలసరోరుహోపమవినీలతనుండు నవారుణాబ్జ శో
భాలయసత్కృపారసమయామలకోమలసుందరాత్ముడా
పాలసముద్రమందు మణిభాసితపన్నగతల్పశాయియై
క్రాలు రమాధినాథుడు స్థిరంబుగ నాహృదిలోన నిల్చుతన్॥

మూలం—బందఉ సంతసమానచిత—హిత అనహిత నహి
కోఇ।
అంజలిగత సుభసుమన—జిమి సమసుగంధ
కరదోఇ॥

అనువాదం—

ఉ॥ కోసినచేతికిన్ దనను గోయని చేతికి నొక్కరీతిగా
దోసిలిలోని పుష్ప మతితుష్టి వెలుంగ సుగంధమీయదే,
ఆసరణిన్ హితాహితుల నందఱి నొక్కటిగాగఁ
జూచుచున్
భాసిలు సజ్జనావళికి భక్తిని వందన మాచరించెదన్॥

తెసిగింపు మూలానుసారియై "నామూలం లిఖ్యతే" అనిన మల్లినాథీ ప్రతిజ్ఞను అనుకూలంగా వుంది.

మూలం—ఆకరచారి లాఖచౌరాసీ—జాతిజీవ జలథల నభ
వాసీ,
సీయరామమయ సబజగజానీ—కరఉ ప్రనామ జోరి
జుగపానీ॥

అనువాదం—

కం॥ జలమున స్థలమున నభమున
జెలగు జతుర్విధములైన జీవంబులకున్
సలిపెద జోహారులు నే
నల సీతారామరూపు లను భావమునన్॥

శ్రీకేశవతీర్థ స్వాములవారు యిదివరకొక రామకథను వ్రాసి తృప్తిలేక మరో రామకథను వ్రాస్తున్నారు. వారి యిష్టదైవమగు శ్రీశ్రీ మట్టపల్లి నృసింహస్వామివారు వారిచే మరెన్ని రామకథలను వ్రాయింపగల్గుదురో యెవరి కెఱుక?

వచనరచనల నొకసారి చదివితే మరీ మరీ చదవాలనే యిష్టం పొడమదు. పద్యరచనలలా కాదు. పదేపదే చదివినా రసం ఊప్పతిల్లుతూనే వుంటుంది. ఆ దృష్టితో పద్యరచనలకు ప్రతిష్ఠ యెక్కువ. వాటికి సార్వకాలీన గౌరవం వుంటుంది. పద్యాలు కొరకరాని కొయ్యలై వుంటే నేటి సమయానికి పనికిరావు. ఈనాటి మానవుడు ఆయాసరహితమైన ఆనందాన్ని కోర్తున్నాడు. ఆదృష్ట్యా ఆబాలగోపాలం సులువుగా చదివి ఆనందించే తీరున మీదటి గ్రంథమంతా మంజరీ ద్విపదలో వ్రాశారు. ద్విపదను హాయిగా చదువుకోవచ్చు; ఉల్లాసంగా పాడుకోవచ్చుకూడ. క్లిష్టంగాక మరీ పేలవమూగాక వ్యర్థపూరణల పొంతకుబోక మూలానుసారియై అనువాదం సాగింది. కవి ధన్యుడు; ప్రకాశకులు ధన్యులు; పాఠకులు ధన్యులు. అచిరకాలంలో గ్రంథం ఆ సాంతం ముగిసి ఆంధ్ర భక్తలోక సమాదరణ పాత్రం కాగలదని ఆశిస్తూన్నాను.

గండిక్షేత్రం,
1-2-57.

శ్రీరామకృష్ణానంద

శ్రీరామ శ్శరణం మమ.

శబ్దార్థకల్పతర్వాది గ్రంథపరిష్కర్తలు, బహుగ్రంథ రచయితలు పూజ్యపాద శ్రీ శ్రీ శ్రీ

శుద్ధ చైతన్య స్వాములవారు

సుహృద్వర్యుడు శ్రీకేశవతీర్థస్వామి స(సు)హృదయుడు, తపస్వి, నృసింహబ్రహ్మోపాసకుడు, అతివర్ణాశ్రమి; ఏకాకిగా నుండియు పెక్కు మహాకార్యములు సాధించిన సాధించుచున్న సాధింపనున్న దిట్ట; ఆదర్శపరివ్రాట్టు.

తులసీదాసు ధర్మక్షేత్రములైన అయోధ్యయందు సరయూతీరమునను, కాశియందు గంగాతీరమునను శ్రీరామచరితమానస-రచన గావించెను. వీరును శ్రీరామతీర్థసేవాశ్రమమునను, శ్రీమట్టపల్లి నృసింహక్షేత్రమున కృష్ణానదీతీరమునను ఈశ్రీమదాంధ్ర తులసీరామాయణ (బాలకాండ) రచన గావించినారు. (శేషించినది రచించుచున్నారు.) గ్రంథము-చాలభాగము పఠించుట తటస్థించినది. సహజపాండిత్యుని పోతనామాత్యుని కవితవలె ఏతత్కవితయు స్వాభావికి, రసమయి.

స్వయము రామాయణము-ఏకైకమక్షరము మహాపాతకనాశనము; అదియుగాక దివ్యక్షేత్రములలో తపోజీవితము గడుపుచు వ్రాయబడినందున ఈరామాయణము-ప్రత్యక్షరము తపోనిక్షిప్తమై అతిశయపావనముగా ఉన్నది. అచ్చు-అక్షరములు ముత్తెములు గూర్చినట్లు రామణీయకముతో గనవచ్చుచున్నవి. అన్నివిధముల గ్రంథము చదువనుత్సుకతను గలిగించుచున్నది.

పెద్దల రూపమున పిన్నలుందురు. పిన్నల రూపమున పెద్దలుందురు. పెద్దతనము (గొప్ప) బుద్ధికి సంబంధించినదే కాని వయస్సునకు సంబంధించినది గాదు. వజ్రమణి చిన్నదైననుమహార్ఘము గదా! శ్రీ కర్పూరపు రామకృష్ణ

మూర్తిగారు పిన్నలలలోపెద్ద. "శ్రద్ధా-భక్తి-ధ్యానయోగాదవేహి" "త్యాగేనైకే అమృతత్వ మానశుః" అను శ్రుత్యుక్తలక్షణములు వీరియందు సువ్యక్తములగుచున్నవి. వీరి (గుంటూరున గల కర్రూపరపువారి) జీవితము ఎంత మంచిది! సుజనులారా! వీరి జీవితము నాదర్శప్రాయముగా దీసికొని ధన్యజీవనులరగుడు. వీరీ గ్రంథమును పరమాదార్యముతో ఇటుల ప్రకాశింపజేసి మహోపకృతము నార్జించినారు.

తులసీదాసు-జన్మ (జీవితము) రామనామోచ్చారణతో ఉపక్రమింపబడి రామనామోచ్చారణతోనే ఉపసంహారము గావింపబడినది. మధ్యజీవితమునైతము- రామబ్రహ్మాభ్యాసముతో — రామభక్తితో — తపస్సుతో — రామాయణరచనతో — విరాజిల్లినది. తులసీదాసు తన రామాయణమున ముముక్షురహస్యముల నన్నింటిని బోధించెను. వీరు మనకు ముఖ్యముగా నేర్పునది పర - "నామ ప్రేమ—రామప్రేమ" రామనామము ఎంత పావనము! రామతత్వము ఎంత గంభీరము!

శ్రీరామ జయరామ జయజయ రామ

గుంటూరు. శుద్ధ చైతన్యస్వామి.

"గీతావాణి" మాసపత్రిక సమీక్ష:

(శ్రీ) మదాంధ్ర తులసీరామాయణము
బాలకాండము (ద్విపదకావ్యము)

హిందీభాషలో తులసీదాసు రామాయణమును రచించెను. దానిపేరు రామచరితమానసము. ఆ గ్రంథము ప్రపంచవిఖ్యాతి నొందినది. ఉత్తరహిందూస్థానమున దీనికిదే సాటి.

ఆ మహాగ్రంథమును పూజ్యులగు శ్రీకేశవతీర్థస్వాముల వారు మంజరీ ద్విపదలో అనువదించుచున్నారు. ఏడు కాండలలో యిది మొదటిదగు బాలకాండము. సర్వాంగ సుందరముగ అచ్చైచ్చి ఆంధ్రభాషలో అవతరించినది. దీనిలోని శ్రీ స్వామివారి పీఠిక అమూల్యవస్తు సంపన్నమై వున్నది. కూలంకషప్రజ్ఞా ధురంధరులగు పలువురు పండితులు పెద్దలూసగిన అభిప్రాయములు రచనలిందు సమకూర్పబడినవి. అవి అవశ్యపఠనీయ సారవస్తు సంకలితములు. తులసీదాసుని సంక్షిప్త జీవితవర్ణనమును కలదు. ఈ గ్రంథముద్రణమునకు వలయుధనమును భూరివిరాళముగ తమతండ్రి పేరనొసగి జ్ఞానయజ్ఞము నొనర్చిన గుంటూరు వాస్తవ్యులు శ్రీకర్రూపరపు రామకృష్ణమూర్తిగారు ఒకేసారి దేవ ఋషి పితృఋణములను తీర్చుకొన్నారు ధన్యోస్మ. గ్రంథమును తగినట్లు ఆదరించి ముందటి కాండములనుకూడ వెంటవెంట వెల్వరుపజాలు ఉత్సాహోత్సాహములను గ్రంథ ప్రకాశకులకు కల్గించుబాధ్యత ఆంధ్ర ప్రజానీకమ్మునై నున్నది.

అన్నివిధముల ఉపాదేయమైన గ్రంథము.

Dr. K. Satchidananda Murty,
M. A., Ph. D., Visarad, Sahitya Ratna,
Head of the Philosophy Dept.
Andhra University.

"——Now there is no need for me to praise your delightful translation of Tulasidas. His Ramacharita manas is a classic famous all over the world. Except "Valmiki's Ramayana no other book can excel it. you are a master of Telugu and a writer with the gift for the happy phrase and the right idiom. No wonder your translation is simply beautiful. I am glad like Srinatha and Somanatha, you have adopted idigenous metre-dwipada. May your book be read in every Telugu home. Namaste.

Waltair
10-9-57

Yours Sincerely
(Sd) Satchidananda Murty.

"సాహిత్యరత్న" శ్రీ అయాచితుల హనుమచ్ఛాస్త్రి
యం. ఏ. (ట్రిబుల్) గారు, కేంద్ర ప్రభుత్వ హిందీ
భాషోపన్యాసకులు, మద్రాసు-6."

" ....మీ యనువాదము సంయతవచోనిగుంఫనమున సొంపులు పోవుచున్నది. మీరు కేవలము తపస్వులేగాక వాఙ్మయతపస్వులరై, ఆంధ్ర పాదపీఠమున పవిత్రమైన తులసీదళము నుంచుట, నామె నోచిన నోముగా భావింతును. భవదాశీర్వాదములమైన మాదృశులకు మీ 'ఆంధ్రతుల సిని' కన్నుల కద్దికొని కర్ణాలంకృతముగా నొనరించుట కంటె నొండు కర్తవ్య మేమి కలదు?....."

వినీతుడు,

(అ) హనుమచ్ఛాస్త్రి.

The Call Divine, Bombay.

"Translated from Hindi into Telugu poetry by Sri Swami Kesava Thirtha, this valuable Volume is indeed a brilliant success in its expression of solemn ideas and ideals as in Sri Rama's life. The Swamiji has undoubtedly laid the Andhra Pradesh into a deep debt of gratitude unto him. The publication is really very sacred". 1-9-57

"శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రిక సమీక్ష:

శ్రీరామచరిత మానసము, శ్రీమదాంధ్ర
తులసీరామాయణము

(ద్విపదకావ్యము – బాలకాండము)

'శ్రుత్వా రామకథానాదం శిరః కస్య న కమ్పతే'
'రామకథను విని తల ఊపనివాడెవడు' అన్నారు పెద్దలు. రామాయణాలలో విశ్వోపజీవ్యమైన రామాయణం శ్రీవాల్మీకులది. దేశభాషలలోకూడ రామకథకుగల ప్రాధాన్యం అనితరసాధారణం. రామభక్తాగ్రేసరుడు తులసీదాసగోస్వామి. అతని విశిష్టరామకథానుభూతి 'శ్రీరామచరిత మానసం' అను పేర హిందీలో వెలసింది. దానిని ఆంధ్రీకరించి ఆంధ్రులకు అందజేసే మహోపకారం శ్రీకేశవతీర్థస్వాములు నెరవేర్చారు. వీరు తమ అనువాదంలో అననురూప వ్యర్థ పాదపూరణాల ప్రసక్తి లేకుండునట్లుగా ద్విపదచందమును ఆశ్రయించడం మిక్కిలి ఉచితంగా ఉంది. కవితాధార నిరర్గళము సరళము మధురము. మూలగ్రంథస్వారస్యాన్ని అన్యూనాతిరిక్తంగా చూఅలిచ్చే అనువాదం ఇది అంటే అతిశయోక్తికాదు.

1-10-57

గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా రేడియో, విజయవాడ.

"....ప్రస్తుతాను వాదకులు తులసీదాసుని భావ భాషా సౌకుమార్యాన్ని బాగా ఆర్థంచేసుకొని అనువదించారని చెప్పటానికి వారు తెలుగులో ద్విపదను ఆశ్రయించటమే పరమప్రమాణం.

ద్విపద రచన ఆద్యంతం మహాప్రవాహంగా నడిపారు శ్రీకేశవతీర్థస్వామివారు. ద్విపదగానానికి తగివుంటుందని వేరుగా చెప్పనవసరంలేదు ...అనువాదంలో భావ విషయకంగా మూల గ్రంథకర్తకు అన్యాయం జరగలేదు—"

21-9-57

H. H. Sri Swami Omkarji Maharaj
Sri Santhi Ashramam, **Totapalli Hills.**

Beloved and Blessed
KESAVA TIRTHAJI MAHARAJ
Om Namo Narayan.

My loving Image of the Adorable Light, Greetings of Peace and love!

Your translation of the Hindi Tulsi-ramayana is a MASTER-PIECE. I feel it is the lifework of your selfless life of dedication. It is a great boon to the

TELUGU knowing people.

The all wise God has chosen KESEVA to render the greatest service to the ANDHRA public.

The coloured pictures, the get up of the Volume also are very good. Above all, the flow of your simple language is sweet and inspiring.

May God's Richest Blessings ever be on our Kesava Tirthaji and may he bless him to produce many more such volumes and may his consecrated life continue to be a blessing for the good of the world.

This is the prayer of your brother.

Swami Omkar.

శ్రీ మైలవరపు సూర్యనారాయణమూర్తిగారు,

కృష్ణపాలెం,

(శ్రీమదాంధ్ర పద్య తులసీ రామాయణ కృతికర్త)

పూజ్యశ్రీ కేశవతీర్థస్వామివారి సన్నిధికి– నమశ్శతము లర్పించి వ్రాసికొన్న విన్నపము — తమరు తమ సెక్రటరీ గారి ద్వారా అత్యంత దయతో పంపించిన తమ రామ చరిత మానసము బాలకాండము అందినది. ఎంతయు కృత జ్ఞుడను. సర్వాంగ సుందరమైన తమ గ్రంథాకృతి అత్యంత మనోహరము. శోభాసంపన్నమైన తమ వాగ్విలాసమున కనుగుణముగా నున్నది.

విధేయుడు,

మైలవరపు సూర్యనారాయణమూర్తి

శ్రీతల్లాప్రగడ ప్రకాశరాయడుగారు, యం. ఏ.

ధర్మజ్యోతి సంపాదకులు, రాజమండ్రి.

శ్రీ స్వామివారికి అనేక నమస్కారములు.

తమ ముద్దులు మూటగట్టు శ్రీరామ చరిత మానసము (బాలకాండము) చేరినది. కృతజ్ఞుడను .... "రసోవైసః" రసస్వరూపుడగు పరబ్రహ్మమును పొంది ఆనందితుడగు మానవుని హృదయమునుండి వెలువడు ప్రవంతినే నిజమైన సాహిత్యము, సారస్వతము అనందగును. అతడే కవి — మనీషి - మీవయస్సెంతో నాకు తెలియదు. కాని (వయస్సుతో పని యేమి?) మీరు ధన్యులు. భగవానుడు మీ పవిత్ర జీవితమునుండి బయలు వెడలించిన ఈ దివ్యధార చిరంజీవియగును గాక !

త. ప్రకాశరాయడు.

శ్రీపశర్లపాటివాసుదేవశాస్త్రిగారు గుత్తికొండ.

హరిః ఓమ్ - అని నిర్గుణ బ్రహ్మలోనుంచి శబ్దబ్రహ్మ సగుణాత్మకమై ప్రణవపూర్వకంగా వేదరూపంతో బయ ల్దేరి సృష్టినీ సృష్టిచిత్రాలనూ సృష్టిధర్మాలనూ ప్రదర్శిస్తూ తన అంతిమభాగంలో పరమాత్మయొక్క పూర్ణావస్థితిని గూర్చి ప్రబోధిస్తూ ఓమ్. తత్. సత్. అని ప్రణవనినాదం చేస్తూ నిర్గుణాత్మలోనే లీనమై పోతున్నది. స్వతస్సంస్కృ తినిపొంది శబ్దబ్రహ్మమైన వేదం సంస్కృతభాషా స్వరూ పంతో నేవున్నది.

యోగులు అనంతమైన చిదానందాత్మయందు రమిస్తుం టారు. కాబట్టి ఆపరబ్రహ్మవస్తువు రామశబ్ద వాచ్యమైంది. రామశబ్దవాచ్యమై వేదవేద్యమైన పరతత్వం దశ రథాపత్యమైన రాముడై అవతరింపగానే ప్రాచేతసుడైన వాల్మీకివల్ల వేదం రామాయణ స్వరూపంతో వెలసింది. వాల్మీకి గిరి సంభూతమై, రామసాగరంలోనికి ప్రవహి స్తూండే రామాయణ పుణ్యస్రవంతి, మూడు లోకాలనూ పునీతం చేస్తున్నది.

లాక్షణికులచేత నిర్దేశింపబడినమహాకావ్య లక్షణాలల్లో ఒకటైనా బీరుపోకుండా వర్ణింపబడిన మహాకావ్యం శ్రీమద్రామాయణం. సమతా మాధుర్యాలతో కలిసియున్న ఉదాత్త సుప్రసన్న మధురభావ పరంపరలతో నిండుకొని యున్న, ఉదారవృత్తార్థ పదజాలంతో పెనగొనియున్న, వాచ్యవ్యంగ్య మర్యాదలతో నలమికొనియున్న శ్రీమ ద్రామాయణ మహాకావ్యంలో, శ్రీరామ పరత్వాన్ని గూర్చియు శ్రీరామనామ మహిమనుగూర్చియు, చెప్పిన

ఘట్టాలు లేవనుమాట, అవిచారితరమణీయం. సకల కల్యాణ గుణసంపూర్ణుడైన శ్రీరామచంద్ర భగవానుని, శౌర్యధైర్య స్థైర్య గంభీర్య సౌందర్య మాధుర్య చాతుర్యాదార్యాది శుభగుణాల నన్నిటినీ పేరొక్కన్న కవి బ్రహ్మ వాల్మీకి. శ్రీరామ పరత్వాన్నిగూర్చియూ, సందర్భానుసారంగా నిగూఢంగా వర్ణించాడు. ఐతే, అది రసిక శిఖామణులగు పండితులకు గోచరమవుతుంది కాని, సామాన్యులకు గోచరం కాకపోవచ్చును. ఆకొరత తీర్చడం కోసమే, కవితాశాఖపై నిల్చి, శ్రీరామ రామ రామ, యని మధురమధురంగా కూజితం చేసిన వాల్మీకి కోకిలం, కలికాలం వచ్చేసరికి భారతదేశంలో, ఉత్తర హిందూస్థానంలో, అవతరించి, తిరిగి, మఱియొక రామాయణాన్ని సృష్టించింది. ఆ రామాయణమే (శ్రీరామచరిత మానసం) అని వ్యవహరింపబడుతున్నది.

ఈ మహాగ్రంథకర్త : తులసీదాస గోస్వామి. తులసీదాస మహాశయునిచే రచింపబడిన దగుటవల్ల, తులసీరామాయణం, అనే పేరుకూడా దీనికి సార్థకమైంది. వ్యాస వాల్మీకి ప్రోక్తాలైన భారత భాగవత రామాయణాల మాదిరిగా శ్రీరామచరిత మానసంగూడా, మన హిందూ దేశంలో మాత్రమేకాక రష్యా మొదలైన యితర దేశాలలోకూడా మిక్కిలి వ్యాప్తిచెంది, ఆ యా భాషలలో అనువాదం చేయబడ్డది.

లీలాశుక, జయదేవ, నారాయణ తీర్థులమాదిరి మహా పండితాగ్రణియై మహా కవిశేఖరుడై, !మహాభక్తశిఖామణియైన మహానుభావుడు శ్రీ తులసీదాస గోస్వామి. ఈమహాపురుషుని జీవితచరిత్రనుగూర్చి, కుందుర్తి వేంకట నరసయ్యగారు మొదలైన ప్రతిభావంతులు చక్కగా వక్కాణించారు. శ్రీ కేశవతీర్థ మహాశయులు (మహాభక్త తులసీదాసు) అను శీర్షికతో శ్రీ తులసీదాస గోస్వామి ఉదయించడం మొదలుకొని, విదేహముక్తులైనంతవరకూ గల పవిత్ర చరిత్రను, విపులంగా మనోజ్ఞంగా చిత్రించారు.

శ్రీమన్నారాయణుని చతుర్థ లీలావతారమైన లక్ష్మీనృసింహస్వామివారికి ప్రహ్లాదుని వంటి ఏకాన్తభక్తులు మన కేశవతీర్థ స్వామివారు.

అజ్ఞానాంధకార బంధురమైయున్న లోకానికి లోక బాంధవుడై విజ్ఞానకిరణ ప్రసారం చేసి, సకల జీవులకూ గమ్యస్థానమై పునరావృత్తిరహితమైన మోక్షానికి దారి జూపించిన శ్రీ రామతీర్థ పూజ్యపాదులకు ప్రియశిష్యులు మన కేశవతీర్థస్వామివారు.

శ్రీమదాంధ్ర భాగవత రచనా ప్రారంభములోనే పాఠకులకు శ్రీ కైవల్యపదాన్ని చూపించిన బమ్మెర పోతనామాత్యునివలె శ్రీమదాంధ్ర తులసీ రామాయణ రచనా ప్రారంభంలోనే పాఠకులకు శ్రీ కైవల్యపదాన్ని చూపించి భాగవత శిఖామణియైన పోతనామాత్యుని దలపించిన సహజ పాండిత్యుడు మన కేశవతీర్థస్వామివారు.

తులసీదాస గోస్వామి కృతమైన, శ్రీరామ చరిత మానసం, హిందీ భాషాంతర్గతమైన (అవధి) యను ఉపభాషలో రచింపబడిన ఉత్తమ గ్రంథం. దీనిని మన కేశవ తీర్థ స్వామివారు యథామూలంగా ఆంధ్రీకరించారు. దీని ప్రాశస్త్యాన్ని గూర్చి ఉభయ భాషావిదులైన పండితులు పలువురు తమ తమ అభిప్రాయాలిచ్చియున్నారు. బొత్తిగా హిందీభాషాపరిచయం లేని నేను అంతకంటే యెక్కువగా చెప్పదగినదేమీ లేదు. ఐనా, శ్రీ కేశవతీర్థ పరివర్తిత శ్రీరామ చరిత మానస సరోవరతరంగ మాలికా డోలికాందోళనా నందపారవశ్యాన్ని చెందిన నా అంతరాత్మ "క ఉత్తమశ్లోక గుణానువాదాత్, పుమాన్ విరజ్యేత వినాపశుఘ్నాత్" అన్న భాగవతోక్తిని జ్ఞప్తికి తెచ్చుకొని యిలా నాతో చెప్పిస్తున్నది. కైవల్యపథాన్ని కోరి, కైవల్యపదాధ్యక్షుడైన మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామికి అంకిత మీయబడినదీ శ్రీరామ చరిత మానసం. కావున ఆరంభంలో తన యిష్టదైవమైన నరహరిని ఐదు పద్యాలతో స్తుతించారు గ్రంథకర్త. భవరోగశాంతిని జేకూర్చు సిద్ధౌషధ రసగుటిక లీ ఐదు పద్యాలు. అంతట గ్రంథారంభంలో చేయదగిన గురుదేవతా ప్రార్థనలలో యెనిమిది పద్యాలు మనోహరంగా సాగినవి.

తొమ్మిదవ పద్యం :—

ఉ॥ అంబుద నీలదేహుని, శరాసన బాణకృపాణధారు, ఫుల్లాంబుజ నేత్రునిన్, ధృతజటాంచితు, లక్ష్మణ జానకీ సమేతంబుగ దండకాటవి పథంబుల నేగెడు రామచంద్రు స్వాంతంబున సంస్మరించెద సతంబును నిశ్చలభక్తి నిష్ఠతో.

అని, తాను రచింపబూనిన రామాయణానికి కథానాయకుడైన రామచంద్రుణ్ణి సంస్మరించారు కవిస్వాములు.

కృత్యాదిలో యెవరైనా సామాన్యంగా కల్యాణ రామున్నో, పట్టాభిరామున్నో స్తుతిస్తారు. రాజ్యభ్రష్టుడై జడలుదాల్చి లక్ష్మణ జానకీ సమేతంగా భైరాగివేషంతో అడవుల్లో తిరుగబోతున్న వనవాసరామున్ని సంస్మరిస్తా డేమిటని కొంచెం నక్కింది నా మనస్సు. వెంటనే అంత రాత్మ బుద్ధిచెప్పింది మనస్సుకు. లౌకికానందాన్ని కోరే వారు కల్యాణరామున్ని, పట్టాభిరామున్నీ స్మరిస్తారు. అ లౌకిక బ్రహ్మానందాన్ని కోరేవారికి వనవాస రాముడే స్మర్తవ్యుడు. వనవాసరామున్ని స్మరిస్తే ఉభయానందాలూ చేకూరుతవి. ఎందువల్లనంటే; వనవాసరాముని ముఖ ముకురంలో బ్రహ్మతేజస్సూ, క్షత్రియతేజస్సూ, రెండూ ప్రతిఫలిస్తూ దాగిలిమూత లాడుతుంటాయి. అలౌకిక బ్రహ్మానందాన్ని కోరి పుణ్యనదీ తీరాలలో ప్రకృతి సౌందర్య విలసితాలైన అకృత్రిమ వనాలలో తపోమయ జీవితాన్ని గడిపేవారంతా, వనవాసరామున్నే సంస్మ రిస్తుంటారు. కృష్ణానదీతీరంలో మట్టపల్లి లక్ష్మీనృసింహ క్షేత్రంలోబహుకాలం నుంచీ తపోమయ జీవితాన్ని గడు పుతూ క్షణభంగురాలైన లౌకిక సుఖాలను కోరకశాశ్వత బ్రహ్మానంద సుఖాన్ని కోరుతూ లోకానుగ్రహార్థంగా రచింపబడినదీ ఆంధ్రతులసీరామాయణం. కనుకనే కృత్యా దిలో వనవాస రామచంద్రమూర్తిని సంస్మరించాడు శ్రీ కేశవతీర్థ స్వామివారు.

తరువాత, హనుమదాది భక్తులను, పోతనాది మహాకవు లను, సుగ్రీవాది రామసేవకులను, ప్రార్థించి క్రమంగా భాగవతంలో పోతన్నగారిలాగా, మన స్వామివారు కూడా యిలా ప్రతిజ్ఞ చేశారు.

క॥ పలికిన రామాయణమే
పలుకగవలె నన్యమేను పలుకగనేలా
పలుకుల నమృతము చిలుకగ
బలికెద శ్రీరామచరిత వరశుభ భరితన్.

ప్రాచీనాంధ్ర కావ్యకర్తల పద్ధతి ననుసరించి మట్టపల్లి లక్ష్మీనృసింహ స్వామివారికి షష్ట్యంతాలతో కృతిసమ ర్పణ జరిగింది. అక్కడినుంచి ఆంధ్రీకృతమైన శ్రీరామ చరిత మానసంలోని బాలకాండకు సంబంధించిన ప్రథమ సోపానం, మంగళా చరణంతో ప్రారంభమయింది.

ఈ ప్రథమ సోపానంలోని ప్రథమ విశ్రామం 353 పద్యాలతో ముగిసింది. ఈ పద్యాలన్నీ సానదీరిన జాతి రత్నాలు. తరువాత ద్వితీయ విశ్రామంనుండి మంజులమైన మంజరీ ద్విపద వృత్తంతో కథ ప్రారంభమయింది. పిల్ల వాడు మొదలు గొల్లవాడువరకూ సులువుగా అర్థం చేసు కుంటూ తమ యిష్టం వచ్చినట్లు పాడుకోడానికి అనువుగా వుండేలాగా వాడుకభాషలో చక్కగా నడిచింది ఆంధ్ర తులసీరామాయణం. శబ్ద మాధుర్యం, భావ సౌందర్యం, చక్కగా పోషింపబడ్డది. మధ్యమధ్యనా స్తోత్రాలూ, విశిష్ట సందేశాలూ, మాత్రాచ్ఛందస్సులున్న గేయాలుగా రచింపబడి పాఠకులకు భక్తిపారవశ్యాన్ని కలిగిస్తున్నవి. ఈ యనువాదం స్వతంత్ర రచననుగూడా మించి మృదుల మృదులంగా, మధురమధురంగా, మంజుల మంజులంగా కొనసాగి. అనువాద మనిపించడంలేదు.

(కవి ఋషి. కవి జగద్గత సత్యసాక్షాత్కృతిచేత కలిగిన అనుభవ తరంగాలను రమ్యవాఙ్మయ రూపంలో ప్రక టించ గలుగుతాడు. విశ్వగర్భిత సత్యసూత్రాలను సము చిత రసవాఙ్మయంతో కవి వ్యాఖ్యానించ వలసియున్నది అతని సామగ్రి అంతా సార్వకాలిక సత్య సందేశ నిరూ పణకే. అతనిభాష, అంతర్గత భావమును సమర్థవంతగా సేవిస్తుంటుంది. అతని భాష భావసౌందర్యమును కప్పి పుచ్చక ప్రజ్వలితం చేస్తుంటుంది) అని మన కేశవతీర్థ స్వామివారు బాలకాండలోని ప్రప్రథమ శిష్టికయైన (వినతి)లో ప్రస్తావించారు.

పై వాక్యములోని యర్థమును తమ రామాయణ రచ నలో సమన్వయింపజేసి "ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోను ధావతి" అన్న భవభూతి వాక్యాన్ని స్మరింప జేసిన మహర్షి శ్రీ కేశవతీర్థ పూజ్యపాదులు.

శ్రీ పాటీలు తిమ్మారెడ్డి కిషోర్‌గారు, బి. ఎ.
భారతీసదనము అంకంపల్లి

బ్రహ్మశ్రీ కేశవతీర్థస్వామిగారి సన్నిధికి,
పూజ్య మహోదయా! సప్రేమసాదర ప్రణామములు.
మీరు పంపిన "రామచరిత మానస బాలకాండ" మందినది. అందినతోడనే విప్పిచూచితిని. ఇక నాధారా

శుద్ధి నన్ను గ్రంథాంతముదాక లాగికొని పోయినది.

I

హిందీ సాహిత్యమున సూరదాస తులసీదాసులదే యగ్ర స్థానము. 'సూర సూర తులసీ శశీ ఉడుగన కేశవదాస్' అన్న నానుడి యందువల్లనే వచ్చినది. అందును తులసీదాసు గారి రామచరిత మానసము నందొ త్తరాహుల కెనలేని గౌరవము. అది వారి కావ్యము, పురాణ గ్రంథము, నిత్య పారాయణ గ్రంథము. మధుసూదన సరస్వతి వంటివారు 'ఆనంద కాననే హ్యస్మిన్ జంగమస్తులసీతరుః' అని వీరిని ప్రస్తుతించి యున్నారు. కేశవదాస దేవకవి ప్రముఖుల కవిత్వమువలె వీరి కవిత కఠినము కాదు. సరళము, స్వచ్ఛము, వారివలె వీరు వివిధములగు సంస్కృత వృత్త ముల దడువక జాతీయములగు దోహా చౌపాయీల చేతనే గ్రంథమెల్ల నిర్వహించియున్నారు. వీరి భావములతి విచిత్ర ములు. రాముడు హసించుట మాయారూపమట. 'మాయా హాస బాహు దిగపాలా-లంకా కాండము' కావునసే కేశవదాసువంటి కవులు వీరి భావముల ననుకరించి యున్నారు. ఇట్లనుట కేశవదాసాదులను కించపరచుట కాదు. తులసీదాసుల వారియెడ వారికిగల గౌరవము చూపుట మాత్రమే.

జబతే రామ వ్యాహి ఘర ఆయే।
నిత నవ మంగల మోద బధాయే॥ —తులసీదాసు
రఘుపతి పూరణ చంద దేఖి దేఖి సబ సుఖ మఢ్ఢై।
దినమానే ఆనంద తా దిన తే తేహి పుర బఢ్ఢై॥ —
కేశవదాసు

ఆగే రామ లఖన పుని పాఛే।
మునిబర బేష బనే అతి పాఛే॥
ఉభయ బీచ సియ సోహతి కైసీ॥
బ్రహ్మ జీవ బిచ మాయా జైసీ॥ —తులసీదాసు.
రామ ఆగే చలే మధ్య సీతా చలీ।
బంధు పాఛే భయే సోభ సోభై భలీ॥
దేఖి దేహీ సభై కోటిధా కై భనో।
జీవ జీవేశ కే బీచ మాయా మనో॥ —కేశవదాసు.

ఇట్టి యుదాహరణ లెన్నియైన చూపవచ్చును.

ఇట్టి రామచరిత మానసకర్త ధన్యుడు. నిజముగా తనయొక్క స్వభావ గుణములనే యాతడు తన 'వైరాగ్య సందీపని'లో సాధులక్షణములని వేరొక్కన్నాడు కాబోలు.

ఈతని రామచరిత మానసమునకీవరకే యాంధ్రాను వాదములు పెక్కులు వచ్చియున్నను శ్రీ కేశవతీర్థస్వా ములవారు మరల తమ యను వాదమును వెలయించినారు. ఇది గ్రంథము గొప్పదనమునకు నిదర్శనము. గీతకు వచనా నువాదముల మాట యటుంచి పద్యానువాదములే దాదాపు 25 వరకు గలవు. కాళిదాసుని యభిజ్ఞాన శాకుంతలమును పదుగురాంధ్రీకరించిరి. భవభూతి యుత్తర రామచరిత్ర మును 6గురు తెనుగులోనికి తెచ్చిరి. బూరుగు కడ కేగిన తుమ్మెద యాశా భంగము నొందును గాని, దశదిశా వ్యాప్తమగు సౌరభ సముదాయముచే గణనకెక్కిన శత పత్రమెన్ని చంచరీకములు తన్నాశ్రయించినను మకరంద దానముచే వానినన్నింటిని పరితృప్తముల గావింపదా?

II

ఇక స్వాములవారి యనువాదము — ధారా శుద్ధితో వ్యర్థ పదాడంబరము లేక అన్వయ కాఠిన్యమునకు దూరమై చక్కని ద్రాక్షా పాకమున బడినది. అనువాద మయ్యును మూలమును దలపించుచున్నది. ఉదాహరణ మునకు :—

(1) శివుని పంపున దన్ను పరీక్షింప వచ్చిన ఋషులతో పార్వతీదేవి పలికిన యీ క్రింది వాక్య లతిపునీతభావ పరిపూర్ణములు :—

మహాదేవ అవగున భవన బిష్ణు సకల గునధామ।
జేహి కర మను రమ జాహి సన తేహి తేహి సన కామ॥

అనువాదము :—

ఆ మహా దేవుడు హరుడు విశ్వేశు
డవగుణ భవనుడే యగుగాక విష్ణు
వఖిల సద్గుణ ధాము డగుగాక ఎవరి
కెవరిపై సంప్రీతి యెసగునో వారె
వారికిం గూర్తురు పరమ సంతసము.

(2) రామలక్ష్మణులను గాంచిన జనకుడు ప్రేమముగ్ధుడై పోవును. ప్రేమార్ద్రమగు గద్గద గంభీర వాణిచే విశ్వా మిత్రునితో నిట్లనును.

కహహు నాథ సుందర దోవు బాలక ।
మునికుల తిలక కి నృపకుల పాలక ॥
బ్రహ్మ జో నిగమ నేతి కహ గావా ।
ఉభయ భేష ధరి కీ సోయిఆవా॥
సహజ బిరాగ స్వరూప మన మోరా ।
థకిత హోత జిమి చంద చకోరా ॥

అనువాదము :—

ఈ మనోహర బాలు రెవరు మునీంద్ర
మునికుల తిలకులా? భూపాల సుతుల
నేతి నేతి యటంచు నిగమంబు లాడు
ఆ పరబ్రహ్మ మా యాకృతి గనెన ?
సహజ విరాగ మత్యాన్వంతంబు నేడు
వీరల దర్శించి వివశత్వ మొందె
నల చకోరము చంద్రు నరసిన రీతి.

(3) తల్లియానతిని గౌరీపూజ కుద్యానమున కేగిన సీతతో చెలులు శ్రీరాముని చెలువము వర్ణింపరానిదని చెప్పుదురు. ఈఘట్టమునే ఇతర కవులయినచో రాముని చెలువ మకథనీయమని చెప్పుదురు. అట్లు కానిచో శారదా వాగీశులైనను శేషమహేశులైనను వర్ణింప జాలరనియో, భాష తూగదనియో, అలంకారములు చాలవయినవో, ఉపమలు ప్రాతవనియో లేదా మరేదో చెప్పి సరిపుచ్చి యుందురు. కాని తులసీదాసుగారి హృదయమతి గంభీరము. వారి భావనాపరాకాష్ఠ నిచట చూడగలము. వారను చున్నారు గదా :— చెలు లిట్లనిరట :-

'గిరా అనయన నయన బిను బానీ'।

వీరి యీ భావ శబలత నాకెంత తన్మయత గలిగించినదో నాకొక్కనికే యెరుక ! ఇది గదా కవిత్వ మనిపించినది. దీనిని స్వామి గారెట్లనువదించిరో యని చూచితిని.

'కన్నులు లేవయ్యె గన వాక్కులకును
వర్ణింప గనులకా వాక్కులు లేవు'

అని సరళము, స్ఫుటమునగు వీరి యనువాదము చూచి మిగుల పారవశ్యము చెందితిని.

III

ఇక స్వాములవారు స్వీకరించిన ఛందస్సు మంజరీ

ద్విపద, ఆంధ్ర సాహిత్యమున సంస్కృత వృత్తములకే ప్రచార మధికము. ప్రాచీనాంధ్ర కవులందరును సంస్కృతమున వైశారద్యము గడించి యాంధ్ర కవిత్వమును కేవలము గీర్వాణ ప్రభావమునకు లోబరచిరి. దేశీయ వృత్తములగు ద్విపద, మంజరి, అక్కరలు గీతములలో వచ్చిన కావ్యములతి స్వల్పములు. ఐనను వానికి గౌరవమునులేదు. "ద్విపద కావ్యము — ముదికాంత – దిడ్డికాంత" యను హాస్యోక్తి నిరతము వానిని వెన్నాడుచునే యున్నది. పల్నాటి వీరచరిత్రము సయితము శ్రీనాథుని దనియు, శ్రీనాథుడిట్టి హీనమగు మంజరీ ద్విపదలో రచనము సాగించునా యనియు వాద ప్రతివాదములకు చోటిచ్చినది. ఇట్లున్న దాంధ్రసాహిత్యమున ద్విపద మంజరులస్థితి. ఐనను గోన బుద్ధారెడ్డి గౌరవ ప్రముఖులగు కవులు ద్విపదనే వరియించి తమ యఖండ పాండిత్యమును లోకమునకు ప్రకటించిరి.

మూలకర్త తన రామచరిత మానసమును జాతీయములగు దోహాచౌపాయీలలో నడపుట చూచిన స్వాములవారు తమ యనువాదమునుగూడ దేశీయమగు మంజరీ ద్విపదలో నడపి యనువాదము నందు దెనుగు దనము నిలుపదలచుకొన్నారు. అంతేకాక భావప్రకటనకు చట్రములవలె బిగించి పెట్టిన వృత్తముల కంటె ద్విపద గీతాదుల యందే సౌలభ్య మెక్కువ.

IV

వసంతకాలమును వర్ణించు ఈక్రింది పంక్తులు గనుడు.

"కుసుమిత బహు వృక్ష కుంజ పుంజముల
పంక్తులు కన్నుల పండువు సేసె
అఖిలవనోప వనావళుల్ సకల
వివిధ కాసార వాపీ తటాకములు
సర్వదిశాతతి సంక్షోభ జెంద
ప్రకృతి యెల్లను రాగరంజితంబయ్యె
శవము లందును కామ చలనంబు కలిగె
విమలసువాసనల్ విరజిమ్మి కొనుచు
వీచెను చల్లని పిల్లవాయువులు
కలహంస శుకపికకల నినాదములు
రేగెదిశల్ పుల్కరించి పోవగను."

సున్నితములగు పదములతో దీర్ఘసంస్కృత సమాసా డంబరత లేక యెంత మనోహరముగ నున్నవి. ఇట్టిది స్వాములవారి శైలి. ధారాశుద్ధితో మూలకర్త భావము లను పిపీలిక యంతవట్టు గాని పోనీక అన్వయ కాఠిన్యము రానీక జాతీయత చెడనీక కాకతీయ శైలిలో సాగిన వీరి యనువాదము మూలమును దలపించుచు చూడచూడ చవు లూరించు చున్నది.

వీరు సైతము 'శ్రీ కైవల్య పదంబు జేరుటకునై' మట్టపల్లి నరహరిని సేవించు చున్నారట. ఆశయము పవి త్రము. ఈ పద్యము పోతన్నను భాగవతమును స్మరణ తెచ్చుచున్నది. పోతన వలెనే వీరును :—

పలికిన రామాయణమే
పలుకగ వలె నన్యమేను పలుకగ నేలా
పలుకుల నమృతము చిలుకగ
బలికెద శ్రీరామ చరిత వరశుభ భరితన్.

అని పలికి, పలికిన యట్లే పలుకుల నమృతము చిలికించి రామచరిత మానసము నాంధ్ర హృదయముల కందించి ధన్యులైనారు. బాలకాండమతో బాటు తక్కిన యారు కాండముల కెదురుచూచు యాంధ్ర పాఠకులకు వానిని త్వరలో నందించి రామాయణ పఠనముచే వారిని సైతము స్వాములవారు ధన్యులను గావింతురు గాక !

ఓం తత్సత్

జగద్విఖ్యాతి గాంచిన రామచరిత మానసమునకు గాని దాని యనువాదములకుగాని పరిచయములు సమీక్షలు వ్రాయ బూనుకొనుట తమ యవివేకము చాటుకొనుట.

భానుడచ్చటనుండె పరికింపుడనుచు
పంజులు పదివేలు పట్టగ వలెనె ?

ఐనను మీ యంతటి వారడిగినపుడు కించిజ్ఞుడను కిశో రుడనగు నే నింతకన్న వ్రాయగలిగిన దేమున్నది. విజ్ఞేషు కిం బహునా। శేషము భగవత్కృప.

భారతీసదనము,
అంకాంబాపురము,
హేవళంబి ఆషాఢ శు॥ ౯ } భవదీయుడు
కుమార కిశోరుడు

తులసీకృత శ్రీరామచరితమానస ప్రశంసలు

పరమోత్తమ భక్తి శాస్త్రము

తులసీదాస్ అద్భుత విశ్వాసవంతుడు. ఆయన విశ్వాసం హిందువులకు రామాయణము వంటి అమూల్య గ్రంథమును శాశ్వతముగ ప్రసాదించింది. ఈ రామాయణం సాహిత్య శిరోమణి; కాని దీని సాహిత్య ప్రతిభ దీని భక్తితేజము యొక్క సౌందర్యం ముందు వెలవెల పోయింది. విశ్వాస బుద్ధిరంగములు వేరైనవి. విశ్వాసము (భక్తి) ఆత్మికమైన అంతర్దృష్టికి దారితీస్తుంది. అందుచేత అది ఆత్మ పావిత్ర్యానికి నైజంగా కారణమై యున్నది. బుద్ధి ప్రపంచ జ్ఞాన వికాసానికి సహాయపడుతుంది. కాని ఈ ప్రపంచ జ్ఞానమునకు, ఆత్మ పావిత్ర్యానికి కార్యకారణసంబంధం లేదు. మహామేధాశాలురు నైతిక హీనులుగా ఉండుట కూడా మనం చూడగలం. కాని విశ్వాసము (భక్తి) అవి నీతి రెండూ ఒకేచోట ఉండలేవు. పైవిషయాలను బట్టి ఒక శిశువు మహోన్నత విశ్వాసమును అభివృద్ధిపరచుకో గలిగినా, బుద్ధిబలంలో అల్పుడుగా నుండవచ్చునని పాఠకుడు గ్రహించగలడు. ఈ దైవవిశ్వాసాన్ని మానవుడు ఎట్లు పొందగలడు? దీనికి సమాధానం గీతలో, 'రామచరితమానసం' లో కనబడుతుంది ..... నేను తులసీదాసు – రామాయణమును భక్తిసిద్ధాంతమునందు అత్యుత్తమ గ్రంథంగా యెంచుతున్నాను.

— M. K. గాంధీ.

శాశ్వతానంద శాంతి మూలము

గోస్వామి తులసీదాసకృతమైన మానస రామాయణము ప్రపంచ సాహిత్యమునందు ఆ జాతిగ్రంథములలో అద్వితీయమైనది. అది బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య - శూద్రులనే చతుర్వర్ణములకు, బ్రహ్మచర్య - గృహస్థ - వానప్రస్థ - సంన్యాసములనే నాలుగాశ్రమాలకు చెందినవారందరికి శ్రుతి - స్మృతి - ప్రభోధసారములు తెలిపే శాస్త్రము. ప్రయాగలో పావనమైన త్రివేణి వలె అందు జ్ఞాన భక్తి వైరాగ్య సమన్వయ వాహిని నిరంతరం ప్రవహిస్తుంటుంది. అది అగణిత మానవకోట్ల జీవితముయొక్క ఇహపర పరమార్థ సర్వస్వమై యున్నది. కోటానుకోట్ల భక్తులు జ్ఞాన భక్తి వైరాగ్యామృతమును దాని నుండి హృదయతృప్తిగా పానము చేశారు. ఈ సృష్టియొక్క అంత్యము వరకు ఇంకా కోటానుకోట్లమంది ఈ గ్రంథము నుండి అద్వ్యానందశాంతులను పొందుచుండగలరు.

ప్రపంచం ఈ అసమాన గ్రంథ ప్రతిభలను ఇంకా పూర్ణముగా గ్రహించి యుండలేదు. అయితే నా అభిప్రాయం ఏమిటనగా భవిష్యత్కాలంలో ఈ గ్రంథం యొక్క ఘనత అధికాధికంగా గ్రాహ్యమైన కొద్దీ దీని అనువాదాలు ప్రపంచముయొక్క అనేక భాషల్లో అవతరించగలవు. ఈ కృతి సర్వమానవజాతికి శాశ్వతానంద శాంతిమూలమై యున్నది. గోస్వామి తులసీదాసుల మానస రామాయణమును గానీ, వినయ - పత్రికను గానీ పఠించే వారైనా, వినేవారైనా ధన్యులు. ఈ గ్రంథమును చౌకైన అందమైన విధానంలో ప్రచురించి నిరుపేదకుకూడా అందుబాట్లోకి తెచ్చి ప్రజలకు అమూల్యమైన సేవచేసేవారు ఇంకా ధన్యులు. చౌకైన, మిక్కిలి అందముగా ముద్రింపబడిన మానస రామాయణ ప్రచురణలు బహుజనులకు అందవలెనని, దాని పవిత్ర బోధలచేత అసంఖ్యాకజనులు ఉపకృతిని పొందవలెనని నా ప్రార్థన. రామాయణ ప్రవచనములు కొన్ని పట్టణాలల్లో, గ్రామాలలో ఇప్పటికీ జరుగుతున్నవి. అట్టి ప్రవచనములు లేనిచోట వానిని తప్పక ఏర్పాటు చేయాలె. దాని పావన ప్రబోధములు గోజుగోజుకూ అధికాధికంగా వ్యాప్తం చెయ్యాలె.

—మదనమోహనమాలవ్య.

సమస్త తాత్త్వికగ్రంథముల సారము

రామచరిత మానసమును రచించి తులసీదాసు ప్రపంచమునకు పరమోన్నతమైన సేవ చేశాడు. సంస్కృతంలో రచింపబడిన శాస్త్రములు, తాత్త్విక గ్రంథములు జన సామాన్యమునకు తెరువరాని పేటిక లైనవి. కారణం, ఎక్కువమందికి ఆ భాషాపరిచయం లేకపోవడమే. వానిని

పఠించే అవకాశం కొలదిమంది పండితులకు మాత్రమే ఉండేది. ప్రజలు ఆక్కడక్కడ పురాణగోష్ఠులలోవానిని వినేవారు. అలాంటి వినికిడి విజ్ఞానమే సామాన్యజనతకు లభిస్తుండేది. ఇట్టి అవసర సమయంలో తులసీదాస్ ఆగ మించి సమస్త ఆధ్యాత్మిక వైదాంతిక వాఙ్మయమును తరచి దివ్యనవనీతమును హిందీ భాషలో ప్రజలముం దుంచాడు. మానసరచన ఉదయించిన నాటినుండి ఎంత మంది అసంఖ్యాకులైన స్త్రీ పురుషాదులు దానినుండి ఆధ్యాత్మిక ప్రయోజనమును పొందినారో, ఇంకనూ పొంద నున్నారో నిర్వచింపలేము. అందుచేత గడచిన మూడు శతాబ్దములనుంచి ఉత్తర భారత ప్రజలకు సమస్తశాస్త్ర తాత్త్విక గ్రంథముల అవసరమును ఈ మానస గ్రంథమే తీర్చింది అనడంలో అతిశయోక్తి లేదు. ఉత్తర భారతంలో రామాయణ పారాయణం అలవాటు. ఉదయం నిత్య కాలకృత్యములు తీర్చిన తరువాత, రాత్రివేళ ప్రజలు ఒంటిగాగాని, సామూహికంగాగాని దానిని పఠిస్తారు. వందలాది వేలాది గ్రామీణులు నిరక్షరాస్యులైకూడా సామూహికంగా, వినడంచేత, ఉచ్చరించడంచేత రామా యణగీతాలు అనేకం కంఠపాఠంగా నేర్చుకున్నారు. వాండ్లు ఆయా సమయాలలో వానిని పునశ్చరణం చేస్తుం టారు. తులసీదాసు వాక్కులలో భక్తుని వాక్కులకు మాత్రం ఉండే ఒక విలక్షణ మాధుర్యం ఉన్నది. ఈనా టికీ ప్రేమ భక్తి గౌరవాలతో ఈ రామాయణం పఠింప బడుటకు కారణ మిదే. ఇందుచేతనే అసంఖ్యాకులైన స్త్రీ పురుషాదులు సంసార సాగరతరణంలో ఈ కృతినుండి సహాయాన్ని పొందుతూ ఉండడం. కేవల భక్తి రసోద్వేగ హృదయంతో తులసీదాసు మానసం రచించాడు. ఈ కృతిలోని ఈగుణంచేతనే దానిలోని పదములు అలాంటి అద్వితీయశక్తిని కలిగి ఉన్నవి. భక్తులు కానివారికికూడా ఈ గ్రంథం ప్రపంచం లోని ఉత్తమతమ మహాకావ్యములతో సరితూగగలిగిన కవితా సౌందర్యము, మాధుర్యము గంభీర మనఃప్రకృతుల సమ్మేళనము, మహోన్నత కళాకౌశలము, కలిగినదై కన బడుతుంది. కవితాసౌందర్యమును మాత్రమే ఆనందించే వారు దానిని పఠించి ఆనందించగలరు. ఈ మహాకృతిని కేవల కావ్యదృష్టితో పఠించేవారుసైతము కాలగమ నంలో కొంతవరకైనా భక్తిభావంలో మునుగకుండా ఉండలేరనికూడా నేను విశ్వశిస్తాను. అలాంటప్పుడు భక్తిభావంతో గౌరవంతో దానిని గురించి పఠించేవారి సంగతి వేరే చెప్పనవసరంలేదు. ఒక ఇంగ్లీషురచయిత (ఎడిసన్) ఒక వ్యాసంలో, తాత్త్వికగ్రంథాలయంనుండి పరమోత్తమ తాత్త్విక సత్యాలను ఏరికూర్చి సర్వజనులకు వీథులలో వెదజల్లివేయుట తన ఆశయమని ప్రకటించాడు. అతని వ్యాసాలద్వారా ఈ ఆకాంక్ష ఫలించిందో లేదో తెలియదు. కానీ, తులసీదాసు మత తాత్త్విక పరమోన్నత విషయాలను మధురమైన, గంభీరమైన, స్వచ్ఛమైన భాషలో వీథులయందేగాక ప్రతి గ్రామంలో ప్రతి గృహంలో ఏమీ తెలియని మూఢుడుకూడా తరించేలాగు వెదజల్లిన విషయం నిర్వివాదసత్యం.

—రాజేంద్రప్రసాద్.

భారతీయ భాషలయందు గల గ్రంథము లన్నిటికంటెను సర్వోత్తమ గ్రంథము:

"నేను తులసీరామాయణము నతిశ్రద్ధగా కనీసము మూడు పర్యాయములు పఠించి యుంటిని, ఆ గ్రంథ మని నను, గ్రంథకర్త యనినను నాకుగల గౌరవప్రేమ లపా రము. తులసీదాసు గొప్పభక్తుడు. భక్తి-జ్ఞానతత్త్వ సమన్వయలక్షణము లాయన యందు గాననగును. ఆయన ఋషిజీవనవిధానము, అతివిశాలమగు పరమత సహనదృష్టి ఆయనకుగల సృష్టిరహస్యానుభవము, మామూలు పాఠకుని గూడ ఆకర్షించి, సమ్మోహితుని జేయగలుగుచున్నవి. తులసీ రామాయణము భారతీయ భాషలయందుగల గ్రంథములన్నింటిలోను సర్వోత్తమమైనది. కొన్నిసందర్భ ములలో వాల్మీకి రామాయణమును గూడ మించినదని తెల్పుటకు సాహసించుచున్నాను. కనుకనే హిందీ మాతృభాషగాగల భారతీయులకిది యొక అనర్ఘరత్నమై ప్రకాశించుచున్నది. తులసీరామాయణ పరిచయమన, మానవునకవసరమగు యావజ్జీవిత సమస్యాపరిచయ మహా దాభాగ్యమేనని తెలియునది".

—హీరేంద్రనాథ దత్త.

తులసీదాసు పద్య రచనలలోని గాన సౌందర్యము:

గోస్వామి తులసీదాసు నామము మరాఠీయులందరికిని పరిచయమైనదే. మహారాష్ట్ర భక్తవరేణ్యులయం దాయనది అతిగౌరవస్థానము. ఆశ్చర్యకరమగు మార్పులతో కూడిన ఆయన జీవితమును హరిదాసు లెందరో కాలక్షేపము జేయుటయును, ఆయన దోహాలను వినిన వారందరును ముగ్ధులగుటయును అనుభవములోని విషయమే. జబ్బల్ పుర నివాసియగు జమ్‌దార్ అను పండితుడు చాలకాలము క్రిందట తులసీరామాయణమును మరాఠీభాషలోని కనువదించెను. అది పండిత పామరప్రశంసలను చూరగొన్నది.

తులసీదాసు ఉపమా - రూపకాలంకారములను ప్రయోగించుట యందు సిద్ధహస్తుడు. హిందీ భాషాపరిచయము లేని మామూలు మరాఠీవ్యక్తికికూడ, విస్పష్టార్థకములగు ఆయన దోహాలు సహజ గంభీరజలధారలవంటివి అందలి గేయముల మాధుర్యము ముగ్ధులను గావించును.

—యన్. సి. కేల్కారు.

ఇహపరములనుగురించి తెల్పు అమూల్య గ్రంథరాజము

"పదునేడు సంవత్సరాల క్రితము శ్రీ తులసీరామాయణమును నేను జైలులో పఠించితిని. అందలి విషయములు న న్నెన్నో విధముల ఆకర్షించినవి. నా మనస్సును, ఆత్మను సంతృప్తిగావించి, అభ్యుదయమునొనరించు విషయములం దనేక మున్నవి. ఇహ పర సమ్యములకుచక్కని పరిష్కార సమన్వయమును జూపించిన అత్యుత్తమగ్రంథములలో శ్రీ తులసీదాసు రామాయణ మొకటి."

—జైరాందాస్ దౌలత్‌రామ్.

శ్రీమద్రామాయణ లోకహితత్వము:

"శ్రీమద్రామాయణముకంటె ప్రజాహిత మగుగ్రంథము మరొకటి లేదు. ధనిక—దరిద్రులచేత సమానముగ గౌరవింపబడుచున్న గ్రంథరాజ మిది. శతాబ్దములక్రిందట రచింపబడినను, యీనాటికిని యావత్ప్రపంచసారస్వత రంగమునందు దానియందుగల నూత నాకర్షణాలు అద్వితీయము. శ్రీమద్రామాయణమును బాల్యమాది పఠించి, అందలి అపూర్వభావసంఘటనామాధుర్యాదులచే పరవశులుగానివారు భారతదేశమునం దుండరు."

—శ్యామప్రసాదముఖర్జీ.

తులసీరామాయణములోని ఆధ్యాత్మిక పరివర్తనము:

"భారతీయ రాష్ట్రాంగము లన్నింటికిని అయోధ్య రాజ్యమాదర్శప్రాయమైనదై యుండెను. ఆధునిక భారతీయ రాజ్యాంగమునకుకూడ ఆదర్శప్రాయముగ నుండదగిన దది. శ్రీరాముడు గొప్ప పరిపాలకుడు. హైందవుల కాదర్శమూర్తియేగాక అతి గౌరవనీయుడగు ఆరాధ్యదేవత. సక్రమ పరిపాలనగల రాజ్యము రామరాజ్యముగ పరిగణింపబడుట లోకవిదితము. హితవాక్కు—ప్రియవాక్కు—మధువాక్కు — యీ మూడున్ను ఆయనయందు మూర్తీభవించినవి. కేవల సత్యసంధత, ధర్మనిరతి మాత్రమే చాలవు. సత్యధర్మములనిమిత్తము పలుకువచనములు వీలైనంతవరకు మధురముగను, ఉత్సాహకరముగను ఉండి, ప్రత్యర్థులనుగూడ సంస్కరించునట్లుండవలెను. అతిప్రధానమగు తులసీరామాయణ ప్రచారము కంటె ఆధ్యాత్మిక జీవితాభివృద్ధికి దోడ్పడు సేవావిధానము వేరొకటి ఉండబోదు."

—భోగరాజు పట్టాభిసీతారామయ్య.

శ్రీమద్రామయణము సర్వోత్తమ మానవత్వ చరిత్ర:

"శ్రీమద్రామాయణము సర్వోత్తమ మానవజీవిత పరిణామవిధానము. ఆ చరిత్రయందు మంచిచెడుగులకు మధ్య

జరిగిన సంఘటనలు న న్నెంతో ఆకర్షించుచుండును. కాన దానిని నేను సర్వదా పఠించుచుందును.

—మహారాజాధిరాజ, సర్ విజయచంద్
మెహతాబ్ బహద్దూర్, బరద్వాన్.

శ్రీమద్రామయణములోని అమరబోధలు:

"సంస్కృతమునందు వాల్మీకియును, హిందీయందు తులసీదాసును, ఆచంద్రతారార్కమగు శ్రీమద్రామాయణ మహాకావ్యమును రచించి అమరజీవులైరి. శ్రీమద్రామాయణ మంతయు ఉన్నతజీవితప్రేరిత మగు పరవశ గ్రంథము. శ్రీరామచంద్రమూర్తియొక్క పితృవాక్యపరిపాలనాదీక్ష, పాలితులయం దాయనకుగల ప్రేమాతిశయములు, పతిధర్మచారిణి సీతయం దాయనకుగల ఆసక్తి, లక్ష్మణభరతాదులయందాయనజూపినభ్రాతృవాత్సల్యము, శాంతాదేవియొక్క వివేకము, హనుమంతుని భక్తి—యావత్కాల మానవాభివృద్ధి కవసరమగు యిట్టి ఉత్తమ ప్రబోధము లిం కెన్నియో అం దున్నవి.

—సి. వై. చింతామణి.

సమకాలిక - మధ్యకాలిక - కవుల అభినుతులు

హిందూ ముస్లిములకు ఏకైక పూజ్యగ్రంథము

పావనమైన రామచరితమానసము భక్తులకు కేవల ప్రాణమై యున్నది. ఇది హిందువులకు వేదము, ముస్లిము లకు పావనమైన ఖూరాను వంటిది.

—అబ్దుల్ రహీమ్‌ఖాన్-ఇ-ఖానా.

అసమాన మహానందస్థానము

తులసీదాసరచితమైన రామచరితము కామధేనువులాగా సమస్తవాంఛాసిద్ధి కలిగిస్తుంది. అది చతుర్విధ పురుషార్థ ములకు ఖని. అసమాన మహానందస్థానము. దాని సాన్ని ధ్యమాత్రంచేతనే హృదయం హర్షిస్తుంది. ఇది పుణ్య పురుష హృదయభృంగాలకు మనోజ్ఞమైన తులసీదళ మాలగా ప్రకాశిస్తున్నది. సంసారసాగరమును తరించ గోరే మానవులకు వారధిగా ఉపకరిస్తున్నదని 'తోసా' నిర్వచిస్తున్నాడు.

—తోసా.

తులసీదాసు రామాయణ గానం చేయకపోతే?

వేదసిద్ధాంతాలను పరిశీలించి, పురాణాలను గాలించి, జ్ఞానికీ, అజ్ఞానికీ ఉండే భేదం ఎవరు చూపగలరు? కలి కాలంలో పుట్టిన, విభ్రాంతజీవులందరూ కపటులు, వక్ర వర్తనులు, క్రూరులు అయిఉన్నందున పావన రామనామ మును పలికేవాడేలేడు. తులసీదాసు రామాయణ గానం చేయకపోయినట్లైతే మన శిలాహృదయంలో ప్రేమబీజ మును ఎవరూ నాటజాలరని, ఎవరూ మనలను ఈ అపార శాస్త్రసముద్రమును తరింపచేయలేరని నమ్మవలసినదిగా బెనీ కవి చెపుతున్నాడు.

— బెనీ.

అమృతంకంటే మధురం

గోస్వామి తులసీదాసకావ్యం కల్పవృక్షంవైన పండిన చతుర్విధపురుషార్థ ఫలంవలె యున్నది. అంతేకాదు. కామధేనువు యొక్క పొదుగునుండి ప్రవహించే దుగ్ధస్ర వంతి వలె ప్రియమై యున్నది. ఇంకొకవిధంగా చెప్పా లంటే ఈ కవి తన విశాల వక్షముపైన తనకంఠం చుట్టూ ఉజ్జ్వల చింతామణుల మాలను ధరించి నట్లున్నది. అది కాక, భగవత్కథా ప్రసంగము చేత ఈ కవీశ్వరుని మధురకృతి ముక్తాత్ములను కూడా ప్రహ్లాదపరుస్తున్నది; రసఖాన్ కవిని సంతోషపరుస్తున్నది. ఇది చక్కెరను హసిస్తున్నది. కలకండను గేలిచేస్తున్నది. ఇక్షుఖండమును న్యూనపరుస్తున్నది. అమృతమును సైతము లజ్జితం చేస్తు న్నట్లు కనపడుతున్నది.

—రసఖాన్.

70(a)



మహాభక్త తులసీదాసు

(జీవితకథ)

రచన : శ్రీ కేశవతీర్థస్వామి

భారతదేశ చరిత్రలో ఒకానొక ఆపత్సమయంలో ప్రపంచకల్యాణమూర్తియైన, భాగవత శిఖామణియైన తులసీదాసు ఉదయించాడు. అధర్మసంకులమైన భరతధాత్రికి ఆ మహాపురుషుడు సత్కర్మానుష్ఠాన భక్తిజ్ఞాన మహోపదేశాలతో సముత్తేజమును కలిగించాడు. తన రామాయణ కావ్యగానంతో ప్రజాహృదయాలను రామమందిరాలుగా మార్చి ధర్మస్థాపనం చేశాడు.

(శ్రీ) తులసీదాసగోస్వామి భారతవర్షము నందు ప్రయాగకు సమీపమందుగల 'బాందా' మండలంలోని 'రాజపూర్' అనే గ్రామంలో విక్రమశక 1554 (క్రీ. శ. 1497) సంవత్సరం శ్రావణశుద్ధ (8) సప్తమినాడు ఒక సద్బ్రాహ్మణ కుటుంబమున జన్మించాడు. ఈయన పరాశర గోత్రజుడు. తండ్రిపేరు ఆత్మారామ శుక్లదుబే. తల్లిపేరు హులసీబాయి. తులసీదాసుయొక్క బాల్యనామం, 'తులారాముడు' లేక 'రాంబోలా.'

తులసీదాసు మాతృగర్భంలో పండ్రెండు నెలలు ఉండినపిదప జన్మించాడు. జన్మకాలమందే అతనికి ముప్పదిరెండు దంతచిహ్నాలు కూడా ఉన్నవి. అయిదేండ్లు బాలుడుగా అతడు కనబడినాడని, ఏడువ లేదని, ఆ శిశుధ్వనిలో రామనామం వినబడిందని ప్రతీతి. ఈ విపరీతములచేత,అభుక్త మూలానక్షత్రమందు జన్మించడంచేత, తల్లిదండ్రులకూ ఆజన్మించిన శిశువుకూఅది మరణయోగమని తండ్రి భయపడ్డాడు. ఆత్మారాముడు ఈ బాలునిగూర్చి తెలిసిన దుర్శకునములు ఆతని భార్యయైన హులసీబాయికి అపార దుఃఖమును కలిగించాయి. ఆశిశువుకు అరిష్టం కలుగుతుందనే భయంతో విధిలేక తలిదండ్రులు దశమినాడు రాత్రి, ఆ బాలుని 'చునియా' అనే దాసికిచ్చి మేనమామగారింటికి పంపివేశారు. మరునాడే తులసీ తల్లిదండ్రులు ఈ అసారప్రపంచమును పరిత్యజించారు. ఒక అయిదున్నర సంవత్సరాల అనంతరం తులసీ మేనమామా, పెంపుడు తల్లియైన "చునియా" దైవవశాత్తు మరణించారు. ఆ పిదప తులసీ అనాథుడై దిక్కులేని వాడైనాడు. ఒక బ్రాహ్మణసాధ్వి అనుదినం అతనికి ఆహార పానీయములిచ్చి రక్షింపసాగింది. జగజ్జననిదుర్గే ఈ విధంగా ఆ బాలుని రక్షింపసాగింది.

కొన్నాళ్ళకు (శ్రీ) శివప్రేరణచేత రామశైలమందున్న అనంతానందుల ప్రియశిష్యుడైన శ్రీ నరహరిదాసస్వామి యీ బాలుని కటాక్షించి తన ఆశ్రమానికి తీసుకవెళ్ళారు. ఆతనికి 'రాంబోలా' అని పేరు పెట్టబడింది. స్వామివారతణ్ణి అయోధ్యకు తీసుకపోయి వి. శ. 1561 (క్రీ.శ. 1504) సంవత్సరం మాఘ శుద్ధ పంచమీ శుక్రవారంనాడు యజ్ఞోపవీత సంస్కారం చేశారు. ఆ పిమ్మట నరహరిస్వాములవారు రాంబోలాకు రామమంత్రోపదేశం చేశారు. అయోధ్యలోనేఉండి అతనికి విద్యాబుద్ధులుగరప

నారంభించారు. రాంబోలా బహు సూక్ష్మబుద్ధి గావడంచేత, గురుముఖనిర్గత విషయాల నతడు వినీవినకముందే గ్రహింపసాగాడు. అక్కడనుండి కొంతకాలానికి గురుశిష్యు లిద్దరూ సూకరక్షేత్ర మును (Modern Soron) చేరుకున్నారు. అక్కడ గురువుగారు తులసీదాసుకు రామచరితమును వినిపించారు. ఆ పిదప కొన్నాళ్ళ తులసీదాసు గుర్వాజ్ఞానుసారం కాశీకి వెళ్ళివచ్చారు. అక్కడాయన కాశీలో పండిత శేషసనాతనుడనే మహా విద్వాంసునివద్ద పదిహేను సంవత్సరాలు వేద వేదాంగాలను అభ్యసించాడు. ఆ పిదప గురువుల వద్ద అనుజ్ఞ పొంది తులసీ స్వగ్రామానికి నిర్గమించాడు. అక్కడాయనకు తన బంధువులందరూ గతించినారన్న విషయం విదితమైంది. తలిదండ్రులకు భక్తితో శ్రాద్ధాదికృత్యములుచేసి తులసీ అక్కడే నివాస మేర్పరచుకొని, భగవత్కథాప్రవచనాదులతో ప్రజలను సేవింపసాగాడు.

తులసీ యొక్క రూపగుణశీలాదులను చూచి సంతోషపడి భారద్వాజసగోత్రుడైన దీనబంధు పాఠకుడనే బ్రాహ్మణోత్తముడు సుందరీమణియైన తన కుమార్తె నిచ్చి విక్రమశకం 1583 (క్రీ. శ. 1526) సం॥ జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి గురువారం నాడు వివాహం చేశాడు. తులసీ నూతన వధువుతో సుఖంగా ఉన్నాడు. అతనికి భార్య అంటే అపారానురాగం. ఆమెలేనిది ఒక్క క్షణమైనా గడుపలేడు. ఒకనాడాతడు ఏదో పనిమీద వెళ్ళి యింట్లోలేని సమయంలో, తన పుట్టింటి నుంచి వచ్చిన ఒక విషాదవార్తచేత, తన భర్త యింటికి రాకముందే సోదరునితోకలసి పుట్టింటికి వెళ్ళింది. తులసీదాసు గృహానికి వచ్చి, భార్య వియోగ భారాన్ని భరింపలేక ఆ రాత్రే, కటికచీకటిలో భయంకరారణ్యంలోబడి, నడిచి నడిచి దారిలోని ఒక నదిని శవాన్నే తెప్పగా చేసికొని అతిక్రమించి అత్తగారిల్లు చేరాడు. ఆ అర్ధరాత్రి గోడనుండి వ్రేలాడుతున్న ఒక సర్పమును ఆధారంగా పట్టుకొని గృహాభ్యంతరంలో అతడు చేరుకున్నాడు. తనపైనగల ప్రణయాతిశయంచేత ఘోర సాహసాన్ని చేసివచ్చిన భర్తను ఆ సాధ్వీమణి చూచింది. అతని అమానుషత్వానికి జాలిపొందింది. "ఓ ప్రియా! మీరింతగా ఈ దేహాన్ని గదా ప్రేమించింది. ఇది నీచమైన చర్మం. ఎముకలు, మాంసము! నిన్న రాజపూర్‌లో ఈ శరీరం ఉన్నది; నేడీ గృహంలో ఉన్నది. అదే మాదిరి ఇవ్వాళ్ళిది యింటిలో, రేపు మంటిలో. దీనికి స్థిరత్వమున్నదా? ఇది మరణశీలమైంది, అశాశ్వతం. ఇది రేపు పిడికెడు బూదిగా మారుతుంది. ఎంతమంది మహాసుందరులు శ్మశాన గర్భంలో అదృశ్యులైనారో ఆలోచించండి. ఈ దేహంలోన ఆ పరంజ్యోతి, ఆ రామచంద్రుడు, ఆ పరమాత్మ ప్రకాశిస్తుండబట్టే ఈ అసార శరీరానికి ఇంత శోభ. ఆ సౌందర్యమూలమే నిజంగా సర్వాకర్షణలకు మూలం. ఆ రాముని ప్రేమించాలె. ఈ నిస్సార దేహంపైన ఉంచే ప్రేమ ఆ రామునిపైన ఉంచుకున్నట్లయితే జీవితం చరితార్థమవుతుంది. తుచ్ఛవిషయ సుఖాలలో దుఃఖమే మిగులుతుంది. ఆ ఆనంద స్వరూపుడైన (శ్రీ)రామునిపైన భక్తే జీవిత శాంతికిమూలం." అని ఆమె అన్నది. ఆమె బోధ ఆయన హృదయంలో వెలుగులుఁజిమ్మింది. పూర్వము తన గురువు నరహరిస్వామి చేసిన రామకథాప్రవచనం, రామనామ మహిమ. జీవితపరమార్థ సందేశం తెరలు చీల్చుకొని

హృదయాకాశంలో మెరశాయి. అతడు భార్యకు నమస్కరించి చివాలున వెనుకకు దిరిగి ఆ అంధకారంలో నిర్గమించాడు. ఆ అంధకారారణ్యం అతనికి శ్రీరాముని శ్యామసుందర స్వరూపంగా తోచింది. సాధ్వీమణియైన భార్య పిలిచినకొద్దీ, వెన్నాడినకొద్దీ, తులసీ చిక్కకుండా పరమవిరాగియై అధిగమించాడు. తులసీ పూర్వసుకృతం పరిపక్వమైంది. భార్య పిలుపు ఆయనకు వినబడలేదు. సత్యముయొక్క–రాముని యొక్క – ఆహ్వానం ఆయన చెవులలో గింగురు మన్నది.

తులసీదాస్ పోయి పోయి, ప్రయాగ చేరుకున్నాడు. అక్కడ గృహస్థవేషమును పరిత్యజించి సాధు వేషమును పరిగ్రహించాడు. తులసీదాస్ అనే నామమును ధరించాడు. ఆయనలో విరక్తి దీపింప సాగింది. జగన్నాథము, రామేశ్వరము, ద్వారక, బదరికాశ్రమము మొదలైన భారత పుణ్యక్షేత్రాలను సందర్శించుకుంటూ యాత్రలలో, తపస్సులో తులసి పదునాల్గు సంవత్సరాలు గడిపాడు. మానస సరోవర తీరంలో ఆమహాత్మునకు 'కాకభుశుండి' యొక్క సందర్శనమైనది.

ఆయన కాశీ సమీపారణ్యంలో కుటీరమును కల్పించుకొని రామమంత్రపురశ్చరణం చేసుకుంటూ తదేక రామదర్శనలాలసుడై యున్నాడు. ప్రతిదినం అనుష్ఠానానంతరం జపతీర్థమును సమీపంలోని ఒక చెట్టు మొదటిలో ఆయన పోస్తుండేవాడు. ఒకనాడొక బ్రహ్మరాక్షసుడు ఆ చెట్టు మొదటిలో తులసీదాసుకు గోచరించి, "ఓమహాత్మా! నా పూర్వపాపంచేత నా కీ దుష్టరూపం వచ్చింది. నీ రామమంత్ర పూతజలంచేత నా కీ నాడు ఈ పైశాచికరూప విముక్తి కలిగింది. నీ మహోపకృతికిగాను ఏదైనా నానుండి సహాయమును కోరుకో" అని అర్థించాడు. ఆయన "నాకు శ్రీరామసాక్షాత్కారం కావలె" అన్నాడు. ఆ బ్రహ్మరాక్షసుడు "అయ్యా! కాశీకి వెళ్ళు. అక్కడ ఫలానా దేవాలయంలో నిత్యమూ శ్రీమద్రామాయణ శ్రవణం జరుగుతుంటుంది. అక్కడ అందరికంటే ముందుగావచ్చి ఒక శతవృద్ధుడు శ్రవణానంతరం అందరికంటే వెనుక వెళ్ళుతుంటాడు. పురాణ శ్రవణంలో ఒక మూల చీకటిలో కూర్చుండి పరవశుడై ఆనందబాష్పాలు కారుస్తుంటాడు. ఆయన హనుమంతుడే. ఆ మహాత్ముని ఆశ్రయించు. నీ వాంఛాసిద్ధి అవుతుంది" అన్నాడు.

తులసీదాసు ఆ విధంగానే వెళ్ళి, ఆ వృద్ధుని సందర్శించాడు. తులసీదాసుయొక్క వినమ్రతకూ, రామభక్తికి ప్రసన్నుడై హనుమానుడు దర్శనమిచ్చి "వత్సా! నీవు చిత్రకూట పర్వతానికి వెళ్ళి రామనామజపంచేసుకో. తపస్సు చేసికో. అక్కడ నీకు రామదర్శనం అవుతుంది".—అని అభయదానం చేశాడు. అట్లే తులసీదాసు చిత్రకూటారణ్యములో "రామఘాట్" వద్ద పర్ణశాలను ఏర్పరచుకొని, రామదర్శనాపేక్షతో జపతపధ్యానాదులు చేసికొంటూ ఉన్నాడు. ఒకనాడు ఆయనకు ఆ అడవిలో రామదర్శనం కలిగింది. కానీ ఆయన గుర్తించ లేదు. ఇద్దరు పరమసుందరాకారులైన రాజపుత్రులు అశ్వారూఢులై ఆయనకు గోచరించారు. వారి దివ్యాకృతులకు ప్రముగ్ధులైనా రాజకుమారు లనుకొని విరక్తుడైన ఆయన వారిని పలుకరించ లేదు. తరువాత హనుమంతుని వలన ఈ రహస్యం తెలిసినపిదప పశ్చాత్తపించాడు. మరియొకనాడు ఆ అడవిలో ఒక

చోట ఒక నాటక ప్రదర్శనదృశ్యం కనబడింది. జనులుచూస్తూ ఉన్నారు. రామాయణ నాటక ప్రదర్శనమది. ఆ నాటకమంతా తులసీదాసు చూచి ఆశ్చర్యానికి వచ్చాడు. మరునాడా నాటకాన్ని గూర్చి ఆ ప్రాంతీయులకు చెప్పినప్పుడు, అట్టి నాటకం ఏమీ జరిగియుండనందున, అది సాక్షాత్ శ్రీరామలీలాసందర్శన మని ఎఱిగిన పిదప ఆయన ఆశ్చర్యవిచారములను పొందాడు. మరియొకనాడు, తులసీదాస్ అనుష్ఠానంలో ఉన్న సమయంలో ఇరువురు ఆటవికులు తులసీ కుటీరంలోనికి అడుగకుండా పోయి, మడి తీర్థమును తాగిపోవడం చూచి, తులసి వారిని నిందించాడు. మౌనంగా వా రిద్దరూ వెళ్ళారు. ఎన్నాళ్ళకు శ్రీరామదర్శనం కాలేదని పరితాప పడుతున్న తులసి ముందు హనుమంతుడు ప్రత్యక్షమై, "ఇటీవల ఇరువురు నీ ఆశ్రమం లోనికి వచ్చి నీ తీర్థోదకం స్వీకరించి పోలేదా?" అని అడిగాడు. "స్వామీ! వచ్చారు. ఇద్దరు శూద్రులు, మడితీర్థమును అడగకుండా తాకి త్రాగినందుకు వారిని దూషించాను. వారు మౌనంగా వెళ్ళినపిదప లోన ఏదో విచారం కలిగింది" అని తులసీ నివేదించాడు. "ఓయీ! వారు శ్రీరామలక్ష్మణులే. రామదర్శనానికి భేదదృష్టి పోవాలె సర్వం రామమయ మనే విశ్వప్రేమ కలుగాలె"—అని హనుమానుడు ప్రబోధించాడు. తులసీదాసు తన అజ్ఞానానికి ఎంతో దుఃఖపడసాగాడు. "సరే, రేపు నీకు శ్రీరామసాక్షాత్కృతి లభిస్తుంది. విచారపడకు" మని హనుమంతు డదృశ్యుడైనాడు.

వి.శ. 1607 (క్రీ.శ. 1550) సంవత్సరం మాఘీ అమావాస్య బుధవారం నాడు, తులసీదాసు నిత్యార్చనకు మంచిగంధమును సానపై తీస్తు న్నాడు. "మాకు కొంచెం గంధం యిస్తావా?" అని వెనుకనుండి శబ్దం వినబడినది. వెనుకకు దిరిగేసరికి ఇరువురు తేజోమయులైన సుందరులైన బాలురు తులసీదాసుకు గోచరించారు. తులసీదాసు ఈతడవకూడా విభ్రాంతుడు కాకుండా, హనుమానుడు సమీపతరుశాఖపై ఒక చిలుకరూపంలో కూర్చుండి తులసీదాసుకు అర్థమయ్యేలాగు, "చిత్రకూటమునొక్క రామ ఘాట్ వద్ద సజ్జన సమూహమున్నది. ఓ తులసీ దాస్! చందనము నూరి శ్రీరాముని తిలక ముతో అలంకరించు" మని గానం చేశాడని ప్రతీతి. తులసీదాసు శ్రీరామలక్ష్మణు లని గ్రహించి ఆనంద పరవశుడైనాడు. శ్రీరామ లక్ష్మణులు ఆ మహాభక్తుని ముందు దివ్య మంగళ స్వరూపములతో సాక్షాత్కరించారు. భక్తితన్మయుడై పాదములందు వ్రాలిన తులసీ దాసునిచూచి శిరస్సుపై నిమురుచూ శ్రీరామ భగవానుడు, చందనము స్వయముగా తాను పూసికొని, తులసీదాసు శిరస్సునకూడా పూసి, మందహాసరోచిస్సులతో అదృశ్యుడైనాడు. ఆనాటినుంచి ఆయనకు సమస్తవిశ్వంలో రామ పరబ్రహ్మమే కనబడింది. జీవన్ముక్తుడైనాడు. జగత్కల్యాణ గంగ ఆయనలోనుంచి ప్రవహింపసాగింది.

ఆయనకు సమస్తం రామమయమే. ఒకనాడాయన అరణ్యంలో వున్నాడు. ఒక వేటకాడు ఒకలేడిని విల్లుఎక్కుపెట్టి చంపనున్నాడు. తులసి చూచాడు. పరుగిడిపోయి వేటగానిముందు నిలచి, "రామా! ఈ సీతాదేవిని అనుగ్రహించు. అమ్మను శంకించవద్దు" అని ప్రార్థించాడు. ఆయనకు ప్రకృతంతా సీతారామ మయమే. ఆ కిరాతుడు ఆ ఋషిప్రేమకు

స్తబ్ధుడై, పశ్చాత్తాపపడి లేడిని వదలివేశాడు. ఒకనాడు ఒకడు, అడవిలో ఒకచెట్టును నరకబోతున్నాడు. తులసిచూచి పరుగిడి, "ఆగొడ్డలి దెబ్బలు నా హృదయంమీద పడుతున్నవి. అది రామాపచారం" అని పరితపించాడు. ఆతని విశాలప్రేమ రామప్రేమ నిర్దోషం, నిరుపమానం, నిత్యమైంది.

ఆ పిదప వి. శ. 1628 (క్రీ.శ. 1571) సం॥లో తులసీదాసు అయోధ్యకు నిర్గమించాడు. అక్కడే వి. శ. 1631 సం॥లో (క్రీ. శ. 1574) శ్రీ శంకర హనుమదాదేశానుసారం, శ్రీరామ నవమినాడు శ్రీరామచరితమానస మనే హిందీ రామాయణ కావ్యాన్ని, స్వ-పరతారకంగా రచింప ప్రారంభించాడు. అరణ్యకాండవరకు అక్కడ రచించి, పిమ్మట తులసీదాసు కాశీ క్షేత్రమును చేరుకొని అక్కడ తన రామాయణ రచనమును ఏడు కాండలూ వి. శ. 1633 మార్గశీర్ష శుక్లపక్షమున రామకల్యాణంనాటికి పూర్తిచేశాడు. ఏతద్రామాయణ సంపూర్తికి 2 సం॥ల 7 మాసముల 26 దినాలు పట్టినది. రామాయణం పూర్తిఅయినపిదప, శ్రీ శివ హనుమానులు దర్శనమిచ్చి, ఆద్యంతం ఆకర్ణించి పరమానందభరితులై "ఈ రామాయణం జగత్ప్రసిద్ధి వహిస్తుంది. నీ జన్మచరితార్థమైంది" అని దీవించారు. కాశీక్షేత్రంలో తులసీదాసు రామాయణ గంగను సర్వులకు అందింపసాగాడు. శ్రీ గోస్వామి తులసీదాస్ లోలార్క-ఖండ సమీపంలో అసీఘట్టంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. దీనికి సమీపమందలి గంగాఘట్టమును ఇప్పటికీ "తులసీఘాట్" అని పిలుస్తుంటారు. దగ్గరలో ఒక హనుమదాలయ మున్నది. అది తులసీదాస నిర్మితం.

తులసీదాసు కాశీక్షేత్రంలో ప్రజలకు తన రామాయణమును వినిపిస్తూ, రామార్చనలో తన జీవితాన్ని గడుపసాగాడు. అతని కీర్తి దశ దిశాక్రాంతమైంది. అక్బర్ మంత్రి సత్తముడైన తోడర్‌మల్లు, అంబర్ ప్రభువైన (A. D. 1618) రాజా మానసింహుడు, ఆయన సోదరుడు జగత్సింహుడు మొదలైన మహారాజులుసైతం తులసీదాసు దర్శనానికి వస్తుండేవాండ్లు. ఆయన రామచరితమానస మధురగానం భారతవర్షానికి నవవసంతమును సృజించింది. ఆయనభక్తి, జ్ఞాన వైరాగ్యములు విశ్వప్రేమ, ధర్మనిష్ఠ ప్రజాదరపాత్రమైనవి. ఆయన జీవితమహోన్నతిని తెలిపే గాథలు అనేకం ప్రజల్లో సంవ్యాప్తమై ఉన్నవి.

ఒకనాడు తులసీదాసమఠంలో ఒక అర్ధరాత్రి ఆయన కడకు అనేక మంది శ్రీమంతులు వస్తూవుండడంచేత ధనాశకల్గి కొందరు దొంగలు పడ్డారు. ఆ దొంగలు కొన్నివస్తువులను అపహరించి వెలువడుతున్న సమయంలో, వారికి ఏవైపు చూచినా, ద్వారద్వారంలో శ్యామల కాంచనవర్ణసుందరులైన, అధిజ్య శరచాపధరులైన రాజకుమారు లిద్దరు గోచరించారు. వారి బాణపరంపరలకు అలసి, వారు కేకలు వేస్తూ వచ్చి తులసీదాస్ కాళ్ళపైబడ్డారు. వారు శ్రీరామలక్ష్మణులే అని తెలుసుకొని తులసి ఆ చోరుల అదృష్టానికి పరవశుడై వారిని నుతించాడు. ఆ చోరులు తులసి శిష్యులైనారు. తన పైగల రాముని వాత్సల్యానికి ప్రముగ్ధుడై, తులసి రామునికి పరిశ్రమ కల్గించిన సంపద ఎందుకని బీదలకు పంచిపెట్టాడు.

ఆయన విశ్వప్రేమ, నామవిశ్వాసం అమోఘమైంది. ఒకనాడొక హంతకుడు పరుగిడుకుంటూ వచ్చి, మఠంముందునిలిచి, పశ్చాత్తాపభారంతో,

"నాకు శ్రీరామభక్తిభిక్ష పెట్టు. నేను బిక్షు కుణ్ణి." అని ఆక్రందింపసాగాడు. తులసీదాసు అతనిని లోపలికి ఆహ్వానించి, రామనివేదితమైన అన్నమును భుజింపజేసి ఆతడు పాపవిముక్తుడైనాడని తెలిపి శ్రీరామనామప్రభావమును కీర్తింపసాగాడు. ఆ హంతకుడు ఆత్మశాంతి వహించాడు. ఈ వార్త కాశీలో వ్యాపించింది. పండితులిది గర్హించారు. తులసీ నామ ప్రభావమును నిర్వచించాడు. పండితులు సంశయించి, నిరూపణమును కోరారు. విశ్వనాథాలయ మందలినంది తులసీకృత శ్రీరామ ప్రార్థనపై, ఆ హంతకుని చేతినుండి ఆహారమును స్వీకరించినదని ప్రసిద్ధి. పండితులు తులసియొక్క మహిమకు ఆశ్చర్యపడినారు. సంస్కృత పండితుడైకూడా తులసీదాసు ప్రాకృతభాషలో రామాయణమును రచించడమును పండితులు అధిక్షేపించారు. "మట్టికుండలో అమృతాన్నిబోస్తే, ఛీ! మట్టికుండని త్రాగక మానుతారా? బంగారు కుండలో విషమును బోస్తే, ఆహా! బంగారు కుండని ఎవరైనా త్రాగుతారా?" అని తులసి ప్రత్యుత్తరమిచ్చి "రామచరిత్ర" ఏభాషలో నున్నా ఫరవాలేదు. కావలసినది నిర్మలభక్తి" అని పండితులను సంతోషపరచాడు. బహుజనులను, సముద్ధరించడానికై ఆయన ప్రాకృతభాషను స్వీకరించాడు. ఆయన కోరింది స్వపాండిత్య ప్రకటన గాదు! శ్రీరామ మహిమా ప్రకటన!

శ్రీరామనామమును మూడహోరాత్రాలు జపించి తులసీదాస్ ఒక మృతుని పునర్జీవితుని జేశాడనికూడా ప్రతీతి. ఏ దెట్లున్నా ఆ మహాపురుషుడు అంతకంటే గొప్పపనేచేశాడు. సంసారగ్రసితులైన శవప్రాయులను, శివప్రాయులుగా చేశాడు! జనులు చెప్పుకొనే తులసీదాసు యొక్క మహిమాభివర్ణనలను విని ఢిల్లీ పాలకుడైన జహంగీరు పాదుషా తులసి నొకనాడు రప్పించి ఏదైనా మహిమచూపించమని కోరాడట. నిరాడంబరుడు, భక్తశిఖామణియైన తులసి "రామనామ స్మరణతప్ప నా కే మహిమా లేదు" అని చెప్పినప్పుడు పాదుషా కుపితుడై ఆతనిని చెరసాలలో ఉంచినాడు. ఇంకేమున్నది! ఆ సాయంత్రమునకల్లా నేలయినట్లు ఢిల్లీనగరమంతా, ముఖ్యంగా రాజప్రాసాదమంతా కోటానుకోట్ల వానర బలగంతో నిండి పోయింది. ఆ కల్లోలానికి సర్వులూ తత్తరపడి, తులసీదాసు గారికి పాదుషాచేసిన అపచారమునకు ఫలితమేనని ఉద్ఘోషించారు. పాదుషా పశ్చాత్తాపపడి, తులసీదాసుని విడిపించి, శరణాగతిపొంది తులసీప్రేమకు పాత్రుడైనాడు. ఇట్లనేకం తులసీదాసుని అమోఘ ప్రభావాన్ని తెలిపే గాథలు ప్రజానీకంలో వ్యవహరింపబడుతున్నవి.

శ్రీరామచరితమానసము, వినయపత్రిక, గీతావళి, దోహావళి, కవితావళి, రామాజ్ఞా, పార్వతీమంగళ్, రామలాలనహఛూ, జానకీమంగళ్, బరవైయ్యా రామాయణ్, వైరాగ్యసందీపని, కృష్ణగీతావళి మొదలైనవి తులసీదాస కృతులు.

తులసీదాసునకు శ్రీరామ స్వరూపం, శ్రీరామనామం పరమ ప్రీతికరమైంది. ఆయన రామరూపంలో సర్వరూపములు విలీనమైపోగలవు. ఆయన రామనామం సర్వ భగవన్నామములకు మూల శబ్దం. ఆయనకు గల ఇష్ట దేవతాప్రీతి ఎంతగాఢమైందో చూడండి.

తులసీదాస్ ఒకసారి బృందావనయాత్ర చేసి

అందు మదనగోపాలదేవుని దర్శించి యిట్లు ప్రార్థించాడు. "ఓ ప్రభూ! ఈనాడు నీవుపూనిన రమణీయరూపమును నే నే విధంగా వర్ణించ గలను? అది వర్ణనాతీతం. కానీ, నీవు ఆ పిల్లన గ్రోవిని వదలి, బాణకోదండములను ధరించిన ప్పుడే తులసి నీకు నమస్కరిస్తాడు." భగవానుడు తులసీదాసుయొక్క రామరూపాసక్తికి ప్రమ గ్ధుడై, ఆయనకు రామరూపంలో సాక్షాత్కరించాడు.

భక్త తులసీదాసు తన జీవితంచేత, సర్వాదర్శలక్షణ లక్షితమైన తన మహారామాయణ కృతి చేత భారత ప్రపంచమును ప్రబుద్ధపరచి, వి. శ. 1680 సం॥లో (1623 A. D.) శ్రావణ బ॥ తదియ శనివారం నాడు కాశీలో అశీ ఘట్టము నందు నూట ఇరవై ఆరో యేట, దేహమును పరిత్యజించి శ్రీరామబ్రహ్మైక్యమును పొందాడు.

నామసంకీర్తనచేస్తున్న మహాజనులమధ్య అపరవాల్మీకియైన మహాసంత తులసీదాసు "నేను శ్రీరామ ప్రభావమును గానంచేశాను. నే నిప్పుడు మౌనం వహింపబోతున్నాను. ఇప్పుడు మీరు తులసీదళమును తులసి యొక్క నోటిలో ఉంచండి." అని పలికి రామనామస్మరణతో విదేహాముక్తి పొందాడు. శ్రీ తులసీ గోస్వామివారి అమరస్వరూపం శ్రీరామచరిత మానసంలో మనకు సర్వదా సాక్షాత్కరిస్తుంటుంది!

ఓం! ఓం!! ఓం !!!

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

ఓమ్

పరమహంస పరివ్రాజకాచార్య

శ్రీమత్కేశవతీర్థస్వామివారు

రచన : శ్రీ రాజశేఖరుని లక్ష్మీపతిరావుభాగవతార్

భారతవర్ష ప్రాగ్గిరి శిఖరమున ఉదయించు బ్రహ్మజ్ఞాన సూర్యతేజః పుంజములు విశ్వదిజ్మండలమును సముజ్జ్వల శోభామయము జేయుట ప్రకృతిసిద్ధవిషయము. ఆ పరంజ్యోతిర్మండల కిరణస్పర్శచే విశ్వమానవహృదయపద్మములు వికసించును. అజ్ఞానతమస్సులు వ్రీలి స్వస్వరూప జ్ఞాన విరహజీవ చక్రవాకములు అద్వైతసుఖమునుభవించును. శాంతి షట్పదగీతారవములు దిశల పులకింపజేయును. సమస్త విశ్వమండలమున ప్రత్యేకమైన రంగనాథుని లీలారంగభూమి భారతదేశము. అది జగద్గురుపీఠము. దాని ధర్మ శిక్షణచేతనే ప్రపంచమానవకోటి జాగరితమై కృతార్థత్వమును పొందుచుండును. భారత వర్షము భగవదవతారమూర్తులకు పుట్టిల్లు. ఈశ్వరదూతల కిది కేంద్రస్థానము. ప్రతి అవసర సమయమున పరమేశ్వరుడిందు మహాపురుష రూపములతో ప్రకటీకృతుడై ధర్మసంస్థాపనము చేయుచుండును.

అట్టి పరమపావనమైన ఆర్యావర్తమున విశిష్టస్థాన మలంకరించిన ఆంధ్రదేశమున నేడు మన మధ్య నవతరించి బ్రహ్మజ్ఞానతేజః పుంజముల ప్రసరింపుచున్న ఒకదివ్యజ్యోతి శ్రీమద్భగవత్పాద కేశవతీర్థ స్వామివారు. శ్రీవారు భక్తిజ్ఞాన కర్మయోగ వాహినులకు కూడలిస్థానము. సర్వమత సామరస్యమునకు ఆటపట్టు, సేవాయోగమునకు – విశ్వప్రేమకు – విహారరంగము; ధర్మవీరత్వమునకు మూర్తీభావము. బ్రహ్మానంద శ్రీకి నిత్యనిలయము.

కథాశేషులైన శ్రీమదన్నపూర్ణాదేవీ జానకీ రామామాత్యపుణ్యదంపతులు శ్రీస్వామివారి జననీజనకులు. ఈ దివ్యమిథునమునకు శ్రీకేశవ తీర్థస్వామివారు ప్రథమపుత్రులుగా శ్రీపింగళ నామసంవత్సర నిజభాద్రపద బహుళ అష్టమీ సోమవారము, సూర్యోదయాది ౧౧–౫ విఘుడియలకు, పునర్వసునక్షత్రము ప్రథమపాదమున (8–10–1917) జన్మించిరి. గుంటూరుమండలములో వీరభాగవతక్షేత్రమని ప్రసిద్ధికెక్కిన చరిత్రాత్మక భూమియగు పల్నాడునందు జానపాడు అను గ్రామము స్వామివారి జన్మస్థానము. ఇది వారి మాతామహస్థానము. ఈ గ్రామమునకు రెండుమైళ్ళదూరమందేగల పిడుగురాల అను గ్రామము శ్రీ స్వామివారి స్వగ్రామము. ఇందే శ్రీవారి కేంద్రాశ్రమముగూడ నేడు భాసించుచున్నది. కీర్తిశేషు లగు జానకిరామయామాత్యులు పిడుగురాల గ్రామాధికారియై యుండిరి. వారు ఆరువేలనియోగిబ్రాహ్మణులు. హరితస గోత్రజులు. యజుశ్శాఖాధ్యాయులు. ఆపస్తంబసూత్రులు. వారి గృహనామము దండమురాజువారు.

భగవంతుని మాతృత్వభాగ్యమును అనుభ

వింపగలకారణజన్ములైన శ్రీకేశవతీర్థస్వామివారు మూడేడుల- అతిశైశవమందే తన మాతృదేవతను కోలుపోయిరి. శ్రీస్వామివారు ధ్రువప్రహ్లాదులవలె ఆజన్మభక్తులు. ప్రహ్లాదునివలె శ్రీవారు బాల్యక్రీడలందుగూడ భగవద్భక్తిని ప్రదర్శింపసాగిరి. స్వామి బాల్యక్రీడలలో అర్చనభక్తి ప్రముఖమైనది. నేటికిని వారియం దీభక్తి ఉన్నతరూపమున గోచరింపగలదు.

గుళ్లు గోపురముల కట్టుటయు, దేవతావిగ్రహముల చిత్రించుటయు, అర్చకుల ననుకరించి పూజార్చనాదుల జేయుటయు, తోటిబాలురగూడి హరిభజనాదుల జేయుటయు, ఇత్యాదులే శ్రీకేశవదేవుని బాల్యక్రీడలు. ఆయన దివ్యలక్షణముల జూచి వృద్ధజనులు ఈతడు విష్ణ్వంశసంభూతుడని పలికిరి. తన మాతామహుడును, పరమభాగవతోత్తముడును అగు శ్రీకేశవరాజుగారి నామధేయమునే తండ్రిగారు శ్రీస్వామివారికి మొదట పెట్టుకొనియుండిరి. ఆ భక్తకేశవరాజుగారే మఱల అవతరించిరని ఇప్పటికిని కొందఱు శతవృద్ధులు పలుకుచుందురు. కేశవరాజు లేక కేశవరావు అని స్వామివారి ప్రథమ (పూర్వ) నామము.

స్వామివారు బాల్యమందే భగవత్స్తోత్రములనల్లుచుండువారు. వారు పోతనామాత్యులవలె సహజ కవీశ్వరులు. బాలకేశవుని హృదయము సాక్షాత్ ధ్రువ ప్రహ్లాదుల హృదయమే. జపతపధ్యాన సంకీర్తనాదులు, భగవత్కథాశ్రవణ పూజార్చనాదులు, భగవద్రూపానురాగాదులు, పరమదయాగుణ త్యాగసౌశీల్యాదులు, విరాగము, భక్తి, శ్రీస్వామివారి సహజగుణములు. ధ్రువ ప్రహ్లాదులకువలెనే ముఖ్యముగ శ్రీస్వామివారి బాల్యాది పూర్వదశలు లౌకిక దుఃఖపరంపరలకు ఆలవాలము లైనవి. బాల్యమందే స్వామి రహస్యముగ శ్రీరామచంద్ర దేశికులను తపస్వి చెంత భగవన్మంత్రోపదేశ మొందిరి. ప్రహ్లాదావతారమూర్తిగాకపోయిన, బహువిధ వ్యతిరేకవాతావరణములమధ్య, బాల్యదశయందే వారి కంతటిభక్తి, భగవన్మంత్రాపేక్ష ఎవరు చెప్పిన కల్గును? భక్తులు కనబడిన ఆబాలుడు భక్తిపరవశుడగువాడు. భగవద్రూపములు కనబడిన ఆబాలుడు ప్రముగ్ధుడగువాడు. చెట్టో, పుట్టో, కొండయో కనపడిన ఆబాలుని హృదయము తపోదీక్షకు తపించిపోయెడిది. ఆర్తుడు కనపడినచో ఆకుమూరుని స్వాంతము ద్రవించిపోయెడిది. హరికథాగుణ శ్రవణకీర్తనాదులకు ఆ బాలభక్తుడు ఆకృష్టుడగువాడు. విష్ణుభక్తుడగు ఆబాలునకు విషయరక్తి రుచింపదయ్యెను. లక్ష్మీనృసింహానుగ్రహపాత్రుడు కానున్న బాలకేశవస్వామికి ఇహసుఖములలో స్థానము దొరుకలేదు. అది శ్రీమన్నారాయణుని అహేతుకాపార ప్రేమయొక్క ఉద్యోగమేనని శ్రీస్వామివారి అభిప్రాయము. నిజమే ఆ త్రోపుడు లేకపోయినచో, స్వామి యెట్లు ఆ శ్రీహరియొక్క యొడిలో పడగలరు? స్వామి బాల్యచరిత్రము ధ్రువచరిత్రమును పోలియున్నది.

శ్రీ స్వామివారు శ్రీ రామతీర్థస్వామివారివలెనే గృహస్థజీవనమందు గూడ పరమభక్తి జ్ఞాన వైరాగ్యజీవనమును గడిపిరి. వారి గృహస్థజీవనమందలి పావిత్ర్యమునకు ప్రముగ్ధులైన వారిమిత్రులు వారి నివాసమును బుద్ధాశ్రమమని పేర్కొనెడివారు. పరార్థమై స్వసుఖపరిత్యాగము చేయుట శ్రీ కేశవస్వామికి సహజగుణము. గృహజీవనమున శ్రీ స్వామివారొక తరుణరాజర్షియై వెలుగొందెను. నాటివారి

హృదయము బుద్ధదేవుని కమండలు వని ఒక సుహృత్కవి వర్ణించినాడు. తాపసిక ప్రవృత్తి యందు వారికి ఎక్కువ ప్రీతి. బాల్యదశ యందును, గృహజీవనమందును, (శ్రీ) స్వామి వారు ధ్రువగౌరాంగ రామతీర్థాదులవలె పర్వతారణ్యసీమల కెప్పుడు ఎగిరిపోయి, భగవదాలింగనములో కరగిపోవుదమా యనియే పరితపించెడి వారు. గృహవాతావరణముల తఱచు చీల్చుకొని ఆ యువకుడు, మట్టపల్లిక్షేత్రము, బెల్లంకొండ మొదలైన విజనభూములకు నిర్గమించి కొన్నిదినములు గడపుట గూడ జరిగినది. గౌరాంగ రామతీర్థులకువలె, కొలదికాల మిట్లు గార్హస్థ్యజీవితము గడపిరి. ఇంతలో కేశవసతీమణి పరమపదించినది. కేశవసింహ శాబకము గృహపంజరమున బద్ధమై కాలము గడుపజన్మింపలేదుగదా! గౌరాంగ రామతీర్థాదుల వలె గృహపంజరమును బ్రద్దలుచేసికొని, (శ్రీ) నృసింహ తన్మయత్వమున ఆనందారణ్య గర్భములందు స్వేచ్ఛావిహారము చేయవలసిన తరుణ మాసన్నమైనది.

ఏకాంతప్రదేశములు కేశవుని ఆహ్వానించినవి. చైతన్యదేవునకు బృందావనజగన్నాథక్షేత్రములవలె, (శ్రీ) కేశవస్వామికి మట్టపల్లి, వేదాద్రిక్షేత్రములు పరమాభిమానతీర్థములు. ఆదిశంకరులకువలె (శ్రీ) కేశవస్వాములకు (శ్రీ) నృసింహభగవానుడు ఉపాస్యదైవము. సర్వదేవతలు. సర్వస్వమూ వారికి ఆ నృసింహభగవానుడే.

కృష్ణామండలమున, కృష్ణాతీరమున గల ప్రాచీనక్షేత్రరాజ మగు వేదాద్రినృసింహక్షేత్రమున మొదట కేశవస్వామివారు కొన్నాళ్ళు తప మాచరించిరి. అచట స్వామికి శ్రీనృసింహ బ్రహ్మదర్శనము లభించినది. అచ్చటి స్వామి తపోజీవితవిశేషములు బహురమ్యము లైనవి. కొన్నిదినములు (శ్రీ) పద్మపాదుల తపోభూమి యగు అహోబిల మందుకూడ (శ్రీ) స్వామివారు వసించిరి.

(శ్రీ) స్వామివారి ఉపాస్యదేవుడు నృకేసరి. వారి యిష్టగురుదేవుడు వేదాంతకేసరియైన (శ్రీ) రామతీర్థ స్వామివారు వినిర్మల భక్తి విశ్వాస ప్రభావములచే (శ్రీ) స్వామివారు (శ్రీ) రామతీర్థభగవానుని హృదయములో విలీనతపొంది తదేకస్వరూపులైరి. (శ్రీ) స్వామివైఖరి (శ్రీ) రామతీర్థాంశ సంభూతు లనిపించుచుండును.

(శ్రీ) కేశవతీర్థస్వామివారు, గృహజీవనమునందే నరసరావుపేటలో తమ తాత్కాలిక వసతిగృహమునకే (శ్రీ) రామతీర్థ సేవాశ్రమమని పేరిడి, రామతీర్థ మహోద్యమమునకు గణపతిపూజ చేసియుండిరి. తదుపరి కొలదికాలమునకు జానపాడునకును తదుపరి జన్మగ్రామమగు పిడుగురాలకును ఆశ్రమవిలాసమును మార్పు చేయుట జరిగినది.

(శ్రీ) రామతీర్థసేవాశ్రమమును (శ్రీ) కేశవతీర్థ స్వామివారు 1941 సంవత్సరమున సంస్థాపించిరి.

1944 సంవత్సరమున కేశవుడు ఈశ్వరప్రేరితుడై (శ్రీ) కాళహస్తిక్షేత్రరాజమున కేగి (శ్రీ)శంకరజయంతినాడు పావన సువర్ణముఖరీతీరమునగల (శ్రీ)కాళహస్తీశ్వరాలయ గర్భమున (శ్రీ)శంకరాచార్య రామతీర్థ రమణమహర్షులవలె జగద్గురుడగు పరమశివ సన్నిధానమున విద్వత్ సన్న్యాసమును స్వీకరించి (శ్రీ)కేశవతీర్థస్వామియై ప్రకాశించెను. తదుపరి వారు

రమణమహర్షి మొదలగు దివ్యపురుషుల సందర్శించి స్వాశ్రమమున కేతెంచిరి.

అనంతరము కేశవ పరమహంస వైరాగ్యోద్దీప్త హృదయముతో చివాలున ఎగిరి మట్టపల్లి కృష్ణాకూలమున వ్రాలినది. శ్రీస్వామి ప్రహ్లాద మూర్తియై అట తన తండ్రియగు శ్రీ నృసింహ భగవానుని అంకపీఠ మలంకరించి తపోనిమగ్నులైరి. కృష్ణాప్రవాహ మాతరుణ తపస్వికి శ్రీనృసింహ కరుణాప్రవాహముగా గోచరించినది. గుహాగర్భము లా యువఋషికి శ్రీనృసింహ కరాళ సుందర వక్త్రములుగా కనబడినవి. అరణ్యవృక్ష నికుంజపుంజము లా కుమారయోగికి శ్రీనృసింహసటాచ్ఛటలుగా దోచినవి. భూమ్యాకాశము లా సత్పురుషునకు శ్రీ నృసింహుని తెరువబడిన దవుడలుగా కనబడినవి. పర్వతపంక్తులందలి దంష్ట్రిపంక్తులైనవి. పెళపెళలాడు ఉరుములలో స్వామికి శ్రీనృసింహస్వామి వారి ప్రచండ గర్జనలు వినబడినవి, తళతళలాడు మెఱుపులలో వారికి శ్రీనృసింహదేవుని దంష్ట్రికా ప్రభలు తోచినవి. పనవిహంగ కోలాహలములలో ఆ భాగవతమణికి లక్ష్మీనృసింహుల పరస్పరరహస్య ప్రసంగములు వినబడినవి. ఉదయ సంధ్యారుణాకాశమున ఆదివ్యుకు రాఁకుసరక్త గంధారుణ రంజితమైన శ్రీనృసింహవక్షస్థలము గోచరించినది. శ్రీకేశవతీర్థస్వామివారిట్లు విశ్వమున వీరనృసింహ సాక్షాత్కారమును పొంది ప్రహ్లాదస్వరూపులై ప్రకాశించిరి. శ్రీస్వామి వారి నృసింహబ్రహ్మసాక్షాత్కార తన్మయానంద కిరణలేఖలను మనము వారి "నృసింహోపాసనం" "శ్రీనృసింహాశ్రయం" "శ్రీనృసింహ భజనము" ఇత్యాది స్తోత్రగ్రంథాళిలోనను తదితర రచనలలోనను దర్శింపగలము. శ్రీనృసింహ బ్రహ్మ సాక్షాత్కారానందరసగంగ శ్రీకేశవ పరమహంసదేవునిలో ఉప్పొంగి మహాకర్మరూపమున పరివహింపసాగినది.

ఇట్లు శ్రీనృసింహచైతన్యముతో శ్రీకేశవతీర్థ స్వామివారు తమ ధార్మికమహోద్యమమునకు ఉపక్రమించిరి. కేవల శ్రీనృసింహకృపాబలమున స్వయంకృషితో స్వగ్రామమగు పిడుగురాలయందు శ్రీరామతీర్థ సేవాశ్రమ ప్రార్థనామందిరము లేక శ్రీనృసింహ పంచాయతన పూజామందిరము అనుపేర శ్రీరామతీర్థసేవాశ్రమ ప్రధాన కార్యాలయమును, సుస్థిరనిర్మాణ రూపమున సంస్థాపించిరి. ఈ కేంద్రాశ్రమమునకు ఉపాంగములుగ – పిడుగురాల గ్రామమునకు సమీపమున, గ్రామమునకు వెలుపల ఏకాంత ధ్యానాది సాధనములకు నందిగ్రామ—శ్రీరామతీర్థ సేవాశ్రమము, శ్రీభోలాశంకర మందిరము అను వానినికూడ స్వయంకృషితో సుస్థిర నిర్మాణ రూపమున సంస్థాపించిరి; నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ తాలూకా, మట్టపల్లి క్షేత్రమున కృష్ణాతీరారణ్యమున–శ్రీస్వామివారి కది ప్రధానతపస్థాన మగుట–ఏకాంత తపస్సాధనాదులకు శ్రీరామతీర్థ ధ్యానవిహారము అను పేర ఒక ఆశ్రమమును ఏకైక నిష్ఠతో పరిశ్రమించి సుస్థిర నిర్మాణరూపమున సంస్థాపించిరి. ఈ ఆశ్రమ మందిరాదులన్నియు పిడుగురాల శ్రీరామతీర్థ సేవాశ్రమ విరాడ్రూపములోని అంగములే. ఇంతేకాక—ఐకాంతిక పరికృతి ప్రియులైన శ్రీకేశవతీర్థస్వామివారు, సత్తెనపల్లి తాలూకాలో, కృష్ణానదీకూలమున (ఇట కృష్ణ ఉత్తరవాహిని) గల 'కేతవర' మను ప్రాచీన నృసింహ క్షేత్రమున శ్రీనృసింహాలయ సింహద్వారోపరిభాగమున, తాము తపస్సు చేసికొనుటకుగాను,

"ప్రహ్లాదమందిరము" అను పేర ఒక చిన్నమంది రమును ఏర్పాటుజేసిరి. మఱియును, పిడుగురాల శివారు—'చంద్రులపాలెము' అను కుగ్రామమున (ఇది నందిగ్రామ రామతీర్థసేవాశ్రమ సమీప మున గలదు. ఈ గ్రామమునకు శ్రీస్వామివా రిడినపేరు నందిగ్రామము) శ్రీ సీతారామమంది రమునుగూడ శ్రీస్వామివారు పునర్నిర్మాణము చేయించియుండిరి. సత్తెనపల్లిలో వాల్మీకాశ్రమ మునుకూడ శ్రీరామతీర్థసేవాశ్రమోపశాఖగా ఏర్పాటుగావించిరి. భక్తిజ్ఞానకర్మయోగములకు సమన్వయమూర్తియు, శ్రీరామభక్తాగ్రేసరు డునూ అయిన భరతుడు శ్రీస్వామివారికి ఆదర్శ మూర్తి. అందుచేతనే శ్రీస్వామివారు చంద్రుల పాలెము అను కుగ్రామమునకు నందిగ్రామ మనియు, తత్సమీపమునగల శ్రీరామతీర్థసేవా శ్రమమునకు "నందిగ్రామాశ్రమము లేక భరతా శ్రమము" అని పేరిడిరి. ఇటుల శ్రీకేశవతీర్థ స్వాములవారు, విశ్వకల్యాణమునకై, ప్రచండ దీక్షతో పరిశ్రమించి ఆంధ్రజనతా మధ్యమున శ్రీ రామతీర్థ సేవాశ్రమమును ఉపాంగయుక్త ముగ సుస్థిరనిర్మాణాత్మకముగ సంస్థాపించి, ఏత దాశ్రమసంబంధ సర్వతంత్ర స్వతంత్రాధిపతు లుగా, అనుష్ఠాన వేదాన్తమహోద్యమమును, పలువిధానముల విజయవంతముగ సాగించు చున్నారు. పిడుగురాలగ్రామమందు గల శ్రీరామ తీర్థసేవాశ్రమప్రార్థనామందిరము అను శ్రీనృసింహా పంచాయతన పూజామందిరము శ్రీకేశవతీర్థ స్వామివారి దేవతార్చనమునకు అంకితముచేయ బడినది. ఈదేవతార్చనము శ్రీవారు తమ పూర్వాశ్రమమునుండియు, అర్చించుకొనుచుం డిన మహాసాలగ్రామాదులతో, దేవతాపుణ్య మూర్తులతో భాసించుచున్నది. ఈ ప్రధాన కేంద్రమున — దేవతార్చనమందిరము 1-2 ప్రార్థన లేక సంకీర్తనశాల 3. రామతీర్థగ్రంథా లయము 4. రామదర్శన పత్రికాకార్యాలయము 5. గ్రంథప్రచురణశాఖ 6. (మందిరపై భాగ మున) శ్రీరామతీర్థవిహారము ఇత్యాది శాఖలు కలవు.

శ్రీరామతీర్థభగవానుడు ప్రాచ్యపాశ్చాత్య ఖండములం దొసగిన ఆంగ్లభాషలోని వేదాం తోపన్యాస సంపుటము లన్నింటిని, శ్రీరామతీర్థ ప్రచురణ మూలసంస్థయగు 'శ్రీరామతీర్థప్రతిష్ఠా నము' —సారనాథ్-(పూర్వనామము 'శ్రీరామ తీర్థ పబ్లికేషన్ లీగ్'—లక్నో) అనుదాని అధి పతుల అనుమతిపొంది, 'శ్రీకేశవతీర్థస్వామివారు, ఓజస్వంతమగు తెలుగుభాషలోనికి అనువదించి, సమగ్రముగ ప్రకటించినారు. మఱియును శ్రీరామతీర్థ జీవితమును, ఏతత్సంబంధములైన తదితర గ్రంథములను, అనేక ధార్మిక గ్రంథము లను, అద్భుతరసోపేతముగ రచించి ప్రకటించి నారు. కొన్ని గ్రంథములను ఇతరులచేత రచింప జేసికూడ, స్వకీయముగ ప్రకటించినారు. శ్రీరామ భక్తులగు కర్పూరపు శ్రీరామకృష్ణమూర్తిగారి ప్రేరణచే హిందీభాషలోని, శ్రీతులసీదాస గోస్వామికృత "శ్రీరామచరితమానస"మును యథాతథముగ పరమరమ్యమగు తెనుగు భాషలో ద్విపదకావ్యముగా అనువదించినారు. శ్రీస్వామివారి రచనావైదగ్ధ్యమును చూచి, పరమభక్తులగు "శ్రీరామశరణ్" కుందుర్తి వేంకటనరసయ్యగారు, "శ్రీ కేశవతీర్థస్వామి ఆంధ్రుల తరింపజేయ నవతరించిన సాక్షాత్ గోస్వామి తులసీదాసులవా" రని ప్రశంసించి యున్నారు. శ్రీరామతీర్థుని అనుష్ఠానవేదాంత సందేశ ప్రసారమునకై స్వామివారు అవకాశము

చిక్కినప్పుడెల్ల మహోపన్యాసముల, ధర్మ ప్రసంగముల జేయుటేగాక, "రామదర్శనము" అను మాసపత్రికను పదునాలుగు సంవత్సరముల నుండి అకుంఠిత ధర్మదీక్షతో ప్రచండ పరిశ్రమతో, నడుపుచున్నాడు. వైదిక పూజార్చనాది సత్కర్మలతో, బహుళసేవా విధానములతో, ధర్మప్రసంగములతో ఆధ్యాత్మిక గ్రంథ పత్రికా ప్రచురణాదులతో జనతా జనార్దనప్రీతికరమైన ఒక బృహత్ జ్ఞానయజ్ఞమును, శ్రీ కేశవ తీర్థస్వామివారు శ్రీరామతీర్థసేవాశ్రమ వేదికపైన దీర్ఘకాలమునుండి నిర్విరామముగ సాగించుచున్నారు. శ్రీనృసింహప్రేరితులగు శ్రీస్వామివారి మహోన్నతోద్యమము దినదినప్రవర్ధమానమై నరనారాయణ ప్రీతిని, జగచ్ఛాంతిని కలిగించుచున్నది.

శ్రీ కేశవతీర్థస్వామివారి మహోపన్యాసములలో శ్రీవివేకానందుని సింహనాదమును మనము వినగలము. శ్రీస్వామివారి బ్రహ్మతన్మయత్వరక్తిమలో మనము శ్రీరామతీర్థస్వామివారి దివ్యపారవశ్యమును దర్శింపగలము. స్వామి కన్నీళ్ళలో బుద్ధస్వామి హృదయ స్వరూపమును మనము సాక్షాత్కరించుకొనగలము. ఆభాగవతోత్తముని హృదయ స్పందనములో శ్రీప్రహ్లాద చైతన్యాది మహాభక్తుల నృత్యతాళధ్వనుల మనము వినగలము. ఆయతివర్యుని హృదయమున సనకసనందన సనత్కుమార నారద వ్యాస శుకాది సనాతన ఋషుల దివ్యకంఠములను గుర్తుపట్టగలము. శ్రీవారి హృదయము విశ్వమహర్షులందరును కూడిన ఒక బ్రహ్మలోకము! ఒక కైలాసము! ఒక వైకుంఠము! ఒక స్వర్గము!

తమ ధార్మికోద్యమ నిర్వహణమునందు శ్రీస్వామిచూపు వీరయోగము రాజర్షి మహారాణా ప్రతాపసింహుని కనులకు గట్టుచుండును. రామసేవా రణరంగమునందు అసహాయశూరుడై ఏకైకవీరుడై స్వామి సలుపు పోరాటము అద్భుతమైనది. అది స్మరణీయమైనది.

ప్రథమపర్యాయము శ్రీ కేశవస్వామివారిని చూడగనే పూజ్యపాద పేరంటపల్లి బాలానంద స్వామివారు అన్నమాటలివి. "ఓహో! నీవు శ్రీరామతీర్థుని అనుగ్రహస్వరూపమవు. (Oh! you are the grace of Rama!) శ్రీరామతీర్థ ప్రతిష్ఠాన అధ్యక్షులు. శ్రీరామతీర్థ సమకాలికులగు మహాత్మా శ్రీ శాంతి ప్రకాశ్ జీ, "కేశవతీర్థస్వామి రూపములో (శ్రీ) రామతీర్థస్వామివారు తెలుగు దేశము సేవించుచున్నారు"అని తెలిపినారు. శ్రీ శాంతాశ్రమ స్థాపనాచార్యులైన (శ్రీ)మదోంకార స్వాములవారు, "శ్రీ కేశవతీర్థస్వాముల రూపముతో మానవసేవ చేయుచున్న శ్రీ రామతీర్థులకు ధన్యవాదములు" — అని పేర్కొనినారు. గీతావాణి పత్రికాసంపాదకులు "శ్రీ కేశవతీర్థస్వామివారు ఆంధ్రులపాలిటి (శ్రీ)రామతీర్థులు" అని అభివచించినారు. పూజ్యపాదులైన శ్రీరామకృష్ణానంద స్వాములవారు "మన మోహన రూపముతో మధుర మధుర శీలముతో మై అంచులలో పొంగి తొణికిసలాడే బ్రహ్మతేజస్సుతో శ్రీ కేశవతీర్థ స్వామివారు వైదిక ఋషి త్యాగానికి నవ్యనాగరిక సంస్కరణము (New Edition) గా నాకు తోస్తారు" అని నిర్వచించిరి "నాటి వివేకానందుడే శ్రీ కేశవతీర్థస్వామివారు" అని ఒక సుహృదయుడు అన్నారు. "ఆధ్యాత్మిక వీరుడు, రామదూత అగు శ్రీ కేశవతీర్థులు..." అని ఆచార్య శ్రీ కె. సచ్చిదానంద

మూర్తిగారు ప్రస్తుతించినారు.

"సుహృదయుడు కేశవతీర్థస్వామి. స (సు) హృదయుడు– తపస్వి – నృసింహ బ్రహ్మోపాసకుడు– అతివర్ణాశ్రమి– ఏకాకిగానుండియు పెక్కు– మహాకార్యముల సాధించిన, సాధించుచున్న, సాధింపనున్న దిట్ట– ఆదర్శ పరివ్రాట్టు..." అని పూజ్యపాద శ్రీశుద్ధ చైతన్య పరివ్రాజకులు పలికియున్నారు. అనేకమంది మహాపురుషులు, సజ్జనులు, శ్రీ కేశవతీర్థ స్వాములనుగూర్చి తెలిపిన హృత్పూర్వక ప్రశంసలు అనేకమున్నవి.

శ్రీరామతీర్థ స్వరూపులైన శ్రీకేశవతీర్థ స్వామివారి దివ్యజీవన సందేశము మహాజన హితంకరమైనది. శాంతిదాయకమైనది. మానవ హృదయములోని దైవచైతన్యమును ప్రబుద్ధమొనర్చి మానవుని మాధవునిగాచేయుటయే, ప్రపంచమును స్వర్గముగాజేయుటయే, శ్రీస్వామివారి అనుష్ఠానవేదాన్తమహోద్యమ లక్ష్యము ఈయువతపస్వియొక్క సర్వజనీన ధర్మసందేశముచే, జీవిత దుఃఖపరిష్కృతి, నిర్వాణసుఖము లభింపగలదు. నేడు త్రిలింగక్షేత్రమున మన మధ్య వెలుగుచున్న శ్రీకేశవతీర్థ పరంజ్యోతికివే మా జోహారులు!

ఓం తత్ సత్

84(a)

పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీమత్కేశవతీర్థ స్వామివారు

84 (b)

శ్రీ

జయజయ శ్రీనారసింహ

శ్రీమద్రామాయణోపదేశమాల

రచన : శ్రీ కేశవతీర్థస్వామి

బాలకాండ

1

రావణాసురుని దౌర్జన్యములు భరింపలేక దేవతాముని జనులందరూ జగదీశ్వరుడైన శ్రీమన్నారాయణుని శరణుగోరి పరిరక్షింప ప్రార్థించారు. భగవానుడు వారిప్రార్థన లాలించి, వారికి అభయప్రదాన మిచ్చి, పృథ్వీపై శ్రీరామచంద్రుడై అవతరించి దుష్టశిక్షణ శిష్టరక్షణ చేసి విశ్వశాంతి చేకూర్చాడు. పరివర్తనాశీలమైన ప్రపంచంలో ధర్మగ్లాని ఏర్పడి సంస్కరణావశ్యకత కలిగినప్పుడు, విశ్వజీవప్రార్థనఫలితంగా విశ్వశక్తిసాగరంలోనుంచి దివ్యావతార మహాతరంగ మొకటి లేచి, ప్రపంచకలుష ప్రక్షాళనం చేసి శాంతి చేకూరుస్తుంటుంది. ఇది రంగనాథుడైన పరమేశ్వరుని మహాలీల.

2

శ్రీవసిష్ఠాచార్యోపదేశానుసారం ఋష్యశృంగమునీశ్వరుని ఆధ్వర్యంతో కౌసల్యాదశరథులు పుత్రకామేష్టి చేశారు. అందు అగ్నిదేవుడు ప్రత్యక్షమై వారికి దివ్యపాయసమును ప్రసాదించాడు. కౌసల్య, సుమిత్ర, కైకేయి—ఆ దివ్యపాయసమును భక్షించి శ్రీరామలక్ష్మణ శత్రుఘ్నభరతులను—భగవదవతారమూర్తులను కన్నారు. ఎవరు నిజదేశికాదేశానుసారం, శాస్త్రోక్తరీతి, నిష్కామకర్మాచరణం చేస్తారో, వారికి వైరాగ్యాగ్నిసాక్షాత్కృతి కలిగి, తద్ద్వారా వినిర్మలపాయసం లభిస్తుంది. ఆ దివ్యభక్తిపాయసప్రాప్తి చేత భగవద్దర్శనం లభించి తీరుతుంది.

3

కౌసల్యాదశరథులుపుత్రకామేష్టిచేసి, సాక్షాద్భగవదవతారమూర్తిని పుత్రునిగా గన్నారు. పుత్రకామేష్టిచేత సుపుత్రులుదయిస్తారని శాస్త్రవాక్కు. పుత్రకామేష్టి అంటే ఏమిటి? పుత్రకామమును ఇష్టిగా—అంటే—యజ్ఞంగా—మార్చుకోవడమే పుత్రకామేష్టి. దంపతుల ఐక్యత దేహభావప్రేరితంకాక దైవభావప్రేరితం కావడమే—పుత్రకామేష్టియొక్క ఆంతర్యం. అట్టి పుత్రకామేష్టిచేత, దంపతులకు సుపుత్రోదయమవుతుంది.

4

వైకుంఠనిలయుడైన భగవానుడు. కౌసల్యాదశరథులమహాభక్తికి వశుడై వారికి పుత్రుడై సృష్టీరంగంపై అవతరించాడు. అనన్యరూపమైన భక్తిమహిమ అలాంటిది విశ్వజనకుడైన పరమేశ్వరుడు, కౌసల్యాదశరథులకు ముద్దుబిడ్డడైనాడు. విశ్వగర్భుడైన పరమాత్మ కౌసల్యాగర్భంలో ఇమిడాడు. ఆమెయొడిలో లాలితుడైనాడు. జ్ఞానం పరమేశ్వరుని స్థానమునకు తాను

వెళ్ళేవిధానం భక్తియో, పరమేశ్వరుని తన స్థానమునకే రప్పించుకొనే విధానం. భక్తి అఖండశక్తివంతమైంది. జ్ఞానం తనను భగవంతునిగా చేస్తుంది. భక్తి భగవంతుని తనకింకరునిగా చేస్తుంది. అందుకనే అబలయైన కౌసల్య– వేద శాస్త్రాదులకు, మహాబ్రహ్మవేత్తలకు చిక్కని, పరమాత్మను, తనపసిపాపగా చేసికొని, ఆడించింది. నారదాచార్యులవారు– భక్తిస్వతంత్రమైనది– స్వయంప్రకాశవంతమైనది అని ప్రవచించారు.

5

కౌసల్యాదేవి ప్రసూతిగృహంలో, శంఖచక్రగదాపాణియైన శ్రీహరిని సందర్శించి ఆరూపంతో కాక, మానవశిశురూపంతో తనకు సాక్షాత్కరించి తనసన్నిధిలో నుండు మని ప్రార్థించింది. అట్లే భగవంతుడు బాలరాముడై సాక్షాత్కరించి, ఆమెసేవలను పొంది సంతోషమును గూర్చాడు. సమాధిగోచరుడైన నిర్గుణబ్రహ్మమును, భాగవతోత్తములు సగుణాకృతిలో సందర్శించి సేవించడానికి ఎక్కువగా అభిలషిస్తారు. మానవకోటిలో మాధవుని సందర్శించి సేవించి సంతృప్తివహిస్తారు.

6

విశ్వామిత్రమహర్షి యజ్ఞంచేస్తున్నప్పుడు మారీచసుబాహు లనేరాక్షసులు యజ్ఞాగ్ని కుండములపై మాంసాస్థిరక్తవర్షాలుకురిపించి యజ్ఞాగ్నులను ఆర్పి, అపవిత్రపరచి, యజ్ఞ భంగంచేసేవారు. మనం నిస్స్వార్థమైన, త్యాగమయమైన, భగవత్ప్రీతికరమైన, జీవనయజ్ఞం సాగించడానికి పూనినప్పుడు, మనహృదయకుండం లోని ఆ త్యాగాగ్నిజ్వాలలను, ఉన్నతభావజ్వాలలను, అంతర్బాహ్యారంగములనుండి ఆసురీ శక్తులు స్వార్థభావాలనే–శరీరభావములనే–మాంసాస్థిరక్తవర్షధారలను కురిపించి, ఆర్పి, అపవిత్రపరచడానికి ఉద్యమిస్తాయి. జీవనయజ్ఞం అంతర్బాహ్యాదుష్టశక్తులనుండి భగ్నంకాకుండా విశ్వామిత్రునివలె మనం జ్ఞానవైరాగ్యస్వరూప రామలక్ష్మణులను సమాశ్రయించడం అత్యవసరం.

7

విశ్వామిత్రుడు యాగరక్షణకు శ్రీరామలక్ష్మణులను తీసికొనిపోయేదారిలో తాటకి ఎదురౌతుంది, విశ్వామిత్రుడు, శ్రీరాముని చే ముందు దానిని సంహరింపచేస్తాడు. స్త్రీయైన అది అబల గాదు, సబల అనే విషయమును తెలుసుకొని శ్రీరాముడు దానిని సంహరిస్తాడు. విశ్వామిత్రుడు శ్రీరామున కంతట యాగరక్షణకు అవసరమైన బలాతిబలమహావిద్యలను ప్రసాదిస్తాడు. జీవనయజ్ఞప్రారంభమార్గంలో ఎవరికైనాసరే, దౌర్బల్య మనే మహాబలవంతమైన తాటక ఎదురవుతుంది. దానిబంధువులే యజ్ఞవిధ్వంసక దుష్టశక్తులన్నీ, దౌర్బల్యం చూడడానికి స్త్రీరూపంలో ఉంటుంది. కానీ అది అబలగాదు. అతిబల ఏముందిలే అని దానిని వదలకూడదు. అన్ని ఘోరపాపాలకు, దౌర్బల్యమే మూలం. దౌర్బల్యభావాన్ని ముందు దండించడం సాధకులకు అత్యవసరం. వివేకబలంతో దానిని ముందు సంహరించాలె ఆపైన వివేకం విజ్ఞానంగా పటిష్ఠమై జీవనయజ్ఞసంపూర్ణ పరిరక్షణకు సమర్థమవుతుంది.

8

శ్రీరామలక్ష్మణరక్షితమై విశ్వామిత్రయజ్ఞం

నిర్విఘ్నంగా కొనసాగింది. ఎప్పుడైనాసరే జ్ఞానముచేత, శ్రద్ధచేత, చోదితమైనజీవితం విజయశ్రీలకు ఆలవాలమవుతుంది. భగవత్ప్రీతికరమై భాసిస్తుంది. ఆజీవనయజ్ఞమును, ఆసురీ భావవిఘ్నశక్తులు భంగంచేయలేవు.

9

తపస్వినియైన అహల్య భర్తృరూపంలో వచ్చిన ఇంద్రునిచేత వంచితయై, వివశయై, తన పాతివ్రత్యాన్ని పావిత్ర్యాన్ని కోల్పోయి, భర్తృశాపమునొంది, శిలారూపమును ధరించి, శ్రీరామదేవుని పాదస్పర్శతో, పునీతమై స్వస్వరూపమునుపొంది ధన్యురాలైంది. మనస్సు ఇంద్రియవికారవశమై యోగమునుండి జారి భోగమునకు వశమైనప్పుడు, అది అపవిత్రమై, జ్ఞానచైతన్యమును కోల్పోయి అజ్ఞానజడావస్థలో పడిపోతుంది. కానీ, పూర్వపుణ్యవశాత్తు, భగవదవతారమూర్తులైన మహాత్ముల పాదస్పర్శతగిలినప్పుడు, తిరిగి ప్రబుద్ధమై స్వస్వరూపజ్ఞానచైతన్యమును పొంది శాంతిస్తుంది.

10

సీతాదేవి అనేకమందిరాజులున్నా, శ్రీరామునే వరించి ఆయనయందే బద్ధానురాగిణి అవుతుంది. శ్రీరాముడు శివధనుర్భంగంచేసి ఆమెను వివాహమాడుతాడు. జీవుడు లౌకిక దృశ్యాలకు విభ్రాంతుడుకాక, విరక్తుడై పరమాత్మనే పతిగా వరించి ప్రేమించినప్పుడు, దుర్భరభవబంధ ధనువును భగ్నంచేసి పరమాత్మ వానిని స్వీకరిస్తాడు. బ్రహ్మైక్యానందశ్రీ ఆజీవి పొందుతాడు.

11

శివధనువును సీతాస్వయంవరమండపంలో బాణాసురరావణాసురులు ఎత్తడానికికూడ అసమర్థులై అపహాసపాత్రులైనారు. శివధనుర్భంగం శ్రీరాముడుమాత్రమే చేయకలిగాడు. ఓ మనస్సా! భవబంధధనుర్భంగంచేయగలిగినవాడు, నీకు ప్రాణనాథుడు కాదగినవాడు, ఆపరమేశ్వరుడొక్కడే సుమా! ఆతనిని ప్రేమించు. వరించు! భవబంధవిమోచనం కలిగి, భగవద్బ్రహ్మానందసిద్ధి కలుగుతుంది.

12

అన్యులకు కైవసంచెయ్యక, భవధనుర్భంగపరాక్రముడైన శ్రీరామునకే పాదాలు కడిగి, తనప్రియతనూజయైన జానకీదేవి నిచ్చి జనకరాజర్షి వివాహంచేసి కృతార్థుడైనాడు. ఆహా! తనమనస్సును ప్రాపంచిక విషయకైవశంచేయక, సంసారభంగసమర్థుడైన పరమాత్మకు అంకితంచేయగలవా డెంతధన్యుడు!

13

యజ్ఞభూమిని బంగారునాగలితో జనకరాజర్షి దున్నుతున్నప్పుడు, ఆనాగటిచాలులో సీతాలక్ష్మి లభించింది. నిష్కామకర్మానుష్ఠానమనే యజ్ఞభూమిలో, వినిర్మలబుద్ధి అనే సీతాలక్ష్మి మనకూ లభించితీరుతుంది. ఆ శుద్ధబుద్ధి అనే సీతాదేవి పరమాత్మనే నాథునిగా వరించి, తద్బ్రహ్మైక్యానందశ్రీని సర్వదా అనుభవిస్తుంది.

14

క్షత్రియభీకరుడైన పరశురాముడు, శ్రీరాముని సామాన్యక్షత్రియునిగా దలచి, ఎదిరించి,

కుంఠిత తేజుడై, తుదకు శ్రీరాముని ప్రభావమును గ్రహించి, శరణుపొంది, శాంతివహించాడు. విషయపాండితీబలం గల మనస్సు, తాను లోగడ గ్రహించిన, జయించిన, అన్నివిషయములవంటిదే పరమాత్మ యని విభ్రాంతిపడి, గర్వంతో జగత్కారణమైన పరమాత్మతత్త్వమునుగూడా గ్రహించడానికి ఉద్యమించి సంరంభంచేస్తుంది. కానీ దానిఎగురుడు అక్కడ చాలదు. తనకు ఆలోచనాశక్తి నిచ్చిన– ఆమూలశక్తిని– అది అందుకోజాల నని గ్రహించి తుదకు నిరహంభావమును వహించి పరమేశ్వరశరణాగతి పొంది శాంతిస్తుంది.

15

సీతారామకళ్యాణమహోత్సవం సమస్తవిశ్వకళ్యాణదాయకమై సర్వప్రపంచసంతోషకరమై ప్రకాశించింది. ఆ ఆనందం వర్ణనాతీతం. జీవబ్రహ్మైక్యసిద్ధిచేత– జీవితం అద్భుతశుభానందమయమై ప్రకాశిస్తుంది.

16

సీతాసమేత శ్రీరాముడు, ఊర్మిళాయుత లక్ష్మణుడు, మాండవీసంయుక్తభరతుడు, శ్రుతకీర్తిశోభితశత్రుఘ్నుడు – శ్రీమదయోధ్యానగరంలో ప్రవేశించగానే– ఆబాలగోపాలం ఆనందసముద్రంలో తేలియాడింది. భక్తియుక్తమైన జ్ఞానయోగము, జ్ఞానరసయుతమైన భక్తియోగము, నిష్కామభావసందీపితమైన కర్మయోగము, సునిశ్చలత్వ సంశోభితమైన రాజయోగము– వెలుగొందిన-చోటు అయోధ్యవలె సచ్చిదానందమందిరమై సందీపిస్తుంది.

అయోధ్యాకాండ

17

వార్ధక్యంలో దశరథుడు శ్రీరాముని అయోధ్యకు అభిషిక్తుని చేద్దా మనుకొన్నాడు. ఆయన కోరిక ఫలించలేదు. కైక అడ్డుతగిలింది. విఫలమనోరథుడై దశరథుడు, శరీరమును వదలవలసి వచ్చింది. నీ వెప్పుడో హృదయసింహాసనంపైన భగవంతుని ఎక్కించా లనుకుంటున్నావు! ఎప్పుడు, ఏవిఘ్నశక్తులు అడ్డుతగులతాయో ఎవరు చెప్పగలరు? త్వరపడు– జీవితం చంచలం! క్షణభంగురం! సమస్తసంతాపసంకులం! నీ హృదయసామ్రాజ్యానికి భగవంతుని నేడే అధిపతిగా చేసి జీవన్ముక్తుడవుగా! శాంతిపొందు!

18

కైకేయి, దుర్మతియైన మంథరయొక్క కుబోధలచేత శ్రీరాముని అడవులకు పంపి, తనకూ ఇతరులకూ దుఃఖమును కలుగజేసింది. దుర్జనసాంగత్యంచేత, తనకూ ఇతరులకూ అపకారం కలిగేలాగు మనం అజ్ఞానంలో పడిపోతాము. సత్యమును సంత్యజించి సౌఖ్యపడాలనుకుంటాము. దైవమును వదలి ద్రవ్యమోహంలో పడి, చెడిపోతాము.

19

గూని మంథరకు శ్రీరామునిపై అకారణ ద్వేషం కలిగింది. వక్రబుద్ధులకు భగవద్భాగవత ద్వేషం సహజంకదా!

20

శ్రీరామవియోగంకంటే మృత్యువు శ్రేయస్కర మని దశరథుడు శరీరమును వదిలాడు.

భగవద్వియోగమును నిజమైనభక్తుడు క్షణమైనా, దశరథునివలె భరింపలేడు.

21

కాంచనాశక్తిచేత కైక, సత్యస్వరూపుడైన శ్రీరాముని పరిత్యజించి, కడకు పశ్చాత్తపించవలసివచ్చింది. అర్థవ్యామోహం సర్వానర్థదాయకం. అది హరికి దూరంచేసి ఆర్తిపాలు చేస్తుంది.

22

సీతాదేవి శ్రీరామునితోగూడిన వనవాసమును, వైకుంఠవాసంగా తలచింది. శ్రీరాముని తోగూడని, భవనవాసాన్ని వనవాసంగా ఎంచింది. బ్రహ్మైక్యజ్ఞానవిహీనులమైనప్పుడు సుఖాలన్నీ మనకు దుఃఖాలుగా మారుతాయి. బ్రహ్మైక్యజ్ఞానసంపన్నులమైనప్పుడు దుఃఖాలన్నీ మనకు సుఖాలుగా మారుతాయి. బ్రహ్మవేత్తలీరహస్యమును ఉద్ఘోషిస్తున్నారు. నిత్యసత్యానందస్థానము— స్వస్వరూపబ్రహ్మమే ఏతద్బ్రహ్మసంయోగమే నిజమైనభోగం. ఏతద్బ్రహ్మవియోగమే నిజమైనరోగం.

23

లక్ష్మణుడు సర్వధర్ములపరిత్యజించి కేవల రామకైంకర్యధర్మమునే వరించి రామానుగ్రహపాత్రుడైనాడు. కేవలాత్మనిష్ఠులైన ప్రపత్తియోగనిష్ఠులైన— భక్తులు, తదేకభగవచ్ఛరణ్యులై ఆనందిస్తారు. సర్వధర్ములను సర్వేశ్వరసేవలోనే వారు దర్శిస్తారు.

24

గుహుడు బోయవాడు. చేపలకంపుకొట్టు తున్న దేహంగలవాడు. విద్యావిహీనుడు. అనాగరికుడు. అయితేనేం? మహామహులైన మహర్షులకు లభించని శ్రీరాముని ఆలింగనశ్రీని పొందాడు. ఆహా! నిర్మలభక్తే శ్రీరామునకు కావలసింది. కుల జాతి మతాధిక్యతలు, ధనధాన్యబాహ్యవిద్యాప్రకర్షలు— ఇలాంటి వేవీ భగవంతుడు పరిగణింపడు. నిర్మలభక్తి! వినిర్మలభక్తి!— ఒక్కటే ఆయనకు కావలసింది!

25

గుహుడు ఏతపస్సులు చేయలేదు. ఏవేదాధ్యయనాదులు చేయలేదు. ఏతీర్థాలు సేవించలేదు. ఏయోగాభ్యాసాలు చేయలేదు. అయినా దేవదుర్లభుడైన శ్రీరామునిఅనుగ్రహానికి పాత్రుడైనాడు. శ్రీ వసిష్ఠవామదేవాది మహారామభక్తశ్రేణిలో అనిపాదునకు ఒకదివ్యస్థానం లభించింది. కారణం? తనస్వధర్మమును తాను సక్రమముగా ఆచరించడమే! తనమనస్సు నతడు శ్రీరామాంకితంచేశాడు. తనశరీరము నతడు శ్రీరామాంకితంచేశాడు. తనపని నతడు రామాంకితంచేశాడు. ఇదే గుహునివిజయానికి కారణం. తన నావికవృత్తి నతడు నారాయణ సేవగా నిర్వహించి తరించాడు. ఏనాడు మనం, మనజీవనకర్మలను శ్రీరామప్రీత్యర్థంగా గడుపగలుగుతామో ఆనాడు మనం అతిసులభంగా అతిసహజంగా శ్రీరామానుగ్రహపాత్రులమౌతాము. స్వధర్మమును, సర్వేశ్వరప్రీతికరంగా నిర్వర్తించడమే సత్యమైన జీవనసంస్కృతి.

26

అప్రయత్నంగా లభించిన అయోధ్యాసామ్రాజ్యాన్ని భరతుడు తృణప్రాయంగా విసర్జించాడు.

శ్రీరాముని పాదసేవనే మహాశ్రీగా తలచాడు. నిజమైన భక్తుడు, భరతునివలె ప్రబలమైన కాంచనవాంఛను జయిస్తాడు. సమస్తసుఖాలను భక్తుడు భగవంతునియందే సందర్శిస్తాడు. ఆతనికి బ్రహ్మ సత్యం, జగన్మిథ్య.

27

శ్రీరామునికొరకై భరతుడు తనతల్లియైన కైకను పరిత్యజించాడు. సర్వధర్ములూ సర్వేశ్వరసేవాధర్మమునకు అనుకూలపడడానికే. భగవంతునిచేర్చేమహాధర్మానికి వ్యతిరేకించినప్పుడు ఏవైనా త్యాజ్యములే.

28

భగవదాజ్ఞను శిరసావహించినవాడే భాగవతశ్రేష్ఠుడు. ప్రార్థనలందుగలశ్రద్ధను పనిలోకూడా ప్రకటించగల్గినవాడే యదార్థహరికింకరుడు. అందుకనే భరతుని శ్రీరాముడు తన నిజమైన ప్రముఖభక్తునిగా స్వీకరించాడు.

29

భరతుడు భగవదాదేశానుసారం ప్రజాపాలనం చేయవలసివచ్చింది. బహువిధబాధ్యతలమధ్య, వివిధరాజభోగములమధ్య భరతుడు, తనరామధ్యాననిష్ఠను, తనవిరాగమును వదలక అచంచలంగా నిలుపుకొన్నాడు. నీవు ఏకర్మరంగంలో ఉన్నా భరతునివలె, దైవభక్తి, అంతర్ముఖత వదలకు! వదలకు!

30

భరతుడు శ్రీరామునిపాదుకలకు పట్టాభిషేకంచేశాడు. అంటే రామునినడకను— ధర్మవర్తనమును— గౌరవించాడన్నమాట. ఎవడు భగవద్ధర్మమును - గౌరవిస్తాడో అతడు భగవంతుని నిజంగా గౌరవించినవాడే. ధర్మమును అగౌరవించినవాడు దైవమును అగౌరవించినవాడే. ఈశ్వరునిఅడుగుజాడల్లో నడిచినప్పుడే మనం నిజమైనఈశ్వరకింకరులం.

31

భరతుడు భాగవతప్రపంచమునందు ఆచార్యస్థానమలంకరించిన మహాపురుషుడు. శ్రీరామాదేశమును - భగవదాజ్ఞను - ధర్మభారమును- నిస్సంకోచంగా, నిస్స్వార్థంగా భరించాడుకనుక ఆయన భరతుడయ్యాడు. అత్యంతకష్టమైనా ఈశ్వరాజ్ఞాభార నిర్వహణంచేయగలధర్మనిష్ఠుడే దైవసేవకుడు.

32

చిత్రకూటగిరివద్ద శ్రీరాముడు పరలోకగతుడైన దశరథునకు ఇంగుదీఫలాలతో పైతృక క్రియలు చేస్తాడు. నిరాడంబరకర్మతో పితృదేవతాసంతృప్తికలిగించడానికి ఆయన అద్భుత శ్రద్ధే కారణం. నిర్జీవములై, దుర్భరభారవంతములై, భక్తిశ్రద్ధల కోల్పోయిన నేటి మనపితృక్రియలలో శ్రీరాముని పితృభక్తిని మనం సంస్మరించవలసియున్నది.

33

బహుదుఃఖపరంపరలమధ్య శ్రీరాముడు తన ధర్మనిష్ఠను వదలలేదు. ఏతద్ధర్మనిష్ఠను కాపాడినవాడే తనఆంతరంగికసేవకుడన్నాడు. ధర్మారాధనం కేవలదైవారాధనమే! ధర్మాపరాధం దైవాపరాధమే! ధర్మనిష్ఠుడే దైవానుగ్రహపాత్రుడు- అన్న మహాసందేశమును మనం సర్వదా గుర్తుంచుకోవాలె.

34

సీతాదేవిని అగౌరవించిన కాకాసురుడు పడినబాధ మీ కందరికీ తెలుసు. భగవత్ప్రియమైనధర్మదేవతను అగౌరవించినవాడు దైవక్రోధానికి గురిఅవుతాడు. వానిని ఒకగడ్డిపోచ కూడా బ్రహ్మాస్త్రమై వేటాడుతుంది.

ఆరణ్యకాండ

35

భక్తులపైన భగవంతునకు పరమప్రేమ! సర్వసంగపరిత్యాగులై తననే శరణుపొంది, అనన్యభక్తితో ధ్యానిస్తున్న మహర్షులకోసం భగవంతుడు వైకుంఠమును వదిలాడు. అయోధ్యను పరిత్యజించాడు. పాదచారియై ఋషులను వెదక్కుంటూ ఘోరారణ్యాలలో ప్రవేశించాడు. అంతేనా, తనరూపమును 'ధ్యానిస్తూ తదేకనిష్ఠులైయున్న మునులయందలిప్రేమచేత, భగవంతుడగురాముడు మునివేషమునుకూడా ధరించాడు. భగవద్భాగవతసంబంధమాధుర్యం అనిర్వచనీయమైంది. అతిమనోహరమైంది.

36

బ్రహ్మాదిదేవతలకుసైతం అగోచరుడైన పరమాత్మ, దండకారణ్యమహర్షుల ఆశ్రమద్వారద్వారమున ప్రత్యక్షమై, ఆతాపసోత్తములను స్వయంగా అర్చించి ఆనందించాడు. తనను సేవించే భక్తులను సేవించడమే భగవంతునిపని.

37

జీవితం ఒకదండకారణ్యం. అందులో ఎన్నెన్నో సంకులాలు. జీవితదండకారణ్యంలో ఎవరు ఆత్మనిష్ఠులై, అనన్యశరణాగతులై, హరిసేవానిమగ్నులై నిలుస్తారో, ఆ సత్యనిష్ఠులైన, వారిని కాపాడడానికి భగవంతుడైన శ్రీరాముడు ప్రక్కన నిలిచితీరుతాడు.

38

పరమసాత్త్వికమూర్తులైన ధర్మాచరణపరాయణులైన మహర్షిజనులను పీడిస్తున్నదుర్మదాసురశక్తులను నిర్జించడానికి భయానకమైన పంచవటిని శ్రీరాముడు నివాసంగా చేసికొన్నాడు. ఇతరులయొక్క దుఃఖమును నివారించడంలోనే మహాత్ములు స్వసుఖమును సందర్శిస్తారు. పరకష్ట నివృత్తికి సత్పురుషులు తాము కష్టాలను వరిస్తారు!

39

భగవదర్పితజీవనులైన దండకారణ్యఋషిజనులు తమప్రాణములనైనా పరిత్యాగంచేశారుగాని, తమఅహింసానిష్ఠను, తమభగవద్విశ్వాసధృతిని పరిత్యజించలేదు. రాక్షసులు తమ దౌర్జన్యచర్యలను నిరోధించగలశక్తి ఆపిచ్చిబాగుల మునులకు లేదని తలచారు. కాలగమనంలో ఆ ఋషులలోని దివ్యశక్తి శ్రీరఘువీరరూపమును ధరించి విజృంభించి ఆసురీశక్తులను వినాశనంచేసింది. ఆపదలలో మనం ఆస్తికత్వమును నిలబెట్టుకొన్నప్పుడు, అఖండదైవబల విలాసమును మనం చూడగలం.

40

శూర్పణఖ తనరాక్షసీప్రవృత్తిని దాచుకొని పైకి మంచిఅందగత్తెవలె వేషంవేసికొని సీతను ద్వేషిస్తూ శ్రీరామప్రణయమును ఆశించింది. అప్పు డేమి జరిగింది? దాని ముక్కుచెవులు కోయబడినవి. అది అవమానమును, అపరిమిత

మైన భాధను భరింపవలసివచ్చింది. దాని వికార రూపం బైటపడకతప్పలేదు. ధర్మదేవతను ద్వేషిస్తూ, తన అవగుణప్రకృతిని దాచుకొని దంభప్రవృత్తితో, బ్రహ్మపదవిని అభిలషించిన అజ్ఞుడు అవమానితుడు, శిక్షితుడు కాకతప్పదు.

41

శూర్పణఖచే ప్రేరితులైన పదునాలుగువేల మంది ఖరదూషణ త్రిశిరాది రాక్షసులు శ్రీరామునిచే సంహరింపబడ్డారు. దుష్టబుద్ధికి వశమైన దౌర్జన్యశక్తులన్నీ నశించితీరుతాయి.

42

రావణుడు కామవశుడై సీతాపహరణానికి ఉద్యమించాడు. మారీచుడు సీతాపహరణం నీప్రాణాపహరణానికే అని రావణునకు హిత వాక్యాలు చెప్పాడు. రావణుడు వినలేదు. చివరకు రావణమారీచు లిద్దరూ సీతాపహరణానికి తలపడి గతించారుకదా! అర్థవైరాగ్యంగల మనస్సు ఇంద్రియాధ్యత్వమును నిగ్రహించలేదు. చివర కదికూడా ఇంద్రియోన్మాదమునకు వంత పాట పాడి కీడుపొందుతుంది.

43

పంచవటిలో సీతాదేవి మాయలేడిని చూచి భ్రమిస్తుంది. అదేకదా రామవియోగానికి నాంది. ఏనాడు భక్తుడవైననీవు ప్రపంచదృశ్య వ్యామోహితుడవౌతావో, ఇక నీవు ఆనాటి నుంచి భగవంతునకు దూరమవుతావు. తిరిగి ఆయనను నీవు కలియడానికి ఒకమహాసంగ్రామం కావాలె. అందుకే జాగ్రత్త వహించు! విషయ ప్రపంచవ్యామోహితుడవు కాకు! కామ్యదృష్టి వదలివెయ్యి!

44

సీతాదేవిని రావణుడు సాధువేషంతో అపహరించడానికి వచ్చాడు. చెడు నిన్ను గెలువ లేనప్పుడు మంచివేషంవేసికొని వస్తుంది. జాగ్రత్త! చెడు కామరూపశక్తికలది. దాని నుండి తప్పించుకొనడానికి గాఢవివేకం ఉండాలె. ప్రచండ స్థైర్యం ఉండాలె.

45

సీతారోదనధ్వని విని దేవతలు, గొప్పగొప్ప శక్తివంతులందరూ రావణునిపరాక్రమానికిజంకి, అపజయభీతిచేత, వానిని ఎదిరింపలేక మౌనం వహించారు. జటాయువు శతవృద్ధుడు ముదుసలిగ్రద్ద. సీతార్తధ్వని వినేసరికి అత డూరకుండ లేకపోయాడు. తన వార్ధక్యదశను, తన అశక్తతను, శత్రువుయొక్కశక్తిసామర్థ్యాలను జయాపజయభావాలను, ఆతడు విస్మరించాడు. దేహభావానికి అతడు అతీతుడైనాడు. అతని ఆదర్శం ఒకే ఒక రామసేవ! ఎగిరి రణరంగంలో దుమికాడు. నిష్కామకర్మయోగులవిధాన మిట్లుంటుంది. తమవిధ్యుక్తకర్మలో, నిష్కామకర్మయోగులు ఈరకంగా దేహపంజరమున కతీతులై నిలుస్తారు. దేహవాసనాతీతమైన వారి సత్కర్మనిష్ఠ ఆత్మనిష్ఠే.

46

జటాయువు రావణునితో పోరి కూలుతాడు. మరణవేదనాసమయంలో కూడా ఆధర్మవీరుడు తనకు దుర్మరణం కలిగిం దని చింతాకంతైనా చింతపడలేదు. రామసేవలో మరణించగలిగినందుకు పరమసంతృప్తి వహించాడు. కర్మయోగముయొక్క సిద్ధావస్థ యిదే. ఇది మహత్తర విముక్తిస్థితే.

47

జటాయువు శ్రీరామసేవలో శరీరపరిత్యాగం చేశాడు. అతడు విజనదండకారణ్యగర్భంలో గతించాడు. అతనికచట నా అనే బంధువులు లేరు. కానీ జగన్నాథుడైన శ్రీరాముడే వచ్చి, మహాభక్తిప్రపత్తులతో, స్వయంగా తనచేజేతుల ఆజటాయువునకు దహనసంస్కారాది అంత్యక్రియ లన్నీ నిర్వర్తించి, తన సాయుజ్యమును ప్రసాదించాడు. శ్రీరాముని కుమారునిగా గన్న దశరథులవారికైనా ఈజటాయువుయొక్క మహాభాగ్యం లభించలేదు. నా అనేవారు అతనికి లేకపోయినా, భగవత్సేవే తనసర్వస్వ మని నమ్ముకొన్న ఆజటాయువునకు, పరమాత్మేవచ్చి పరిచర్యచేశాడు. ఈఅదృష్టం ఎవరికి లభిస్తుంది? దత్తుకొడుకులచేతులలో తమకు మోక్షమున్న దనుకొని, భగవత్సేవావకాశాలను చేజేతుల విడనాడుకొని, పృథ్వీలోనే నరకాన్ని సృష్టించు కొనే అవివేకులు ఈవిషయాన్ని మననంచేసి కోవడం అత్యవసరం.

48

జటాయువు మాంసభక్షణచేసే ఒకనీచమైన ముసలిగ్రద్ద. అయితేనేం? శ్రీరామభక్తిచేత-శ్రీరామసేవచేత- అన్యాలభ్యమైన హరిపదవిని అలంకరించింది. ఏకులంలో పుట్టినా, ఏస్థితిలో ఉన్నా, తనకు ఈశ్వరు డిచ్చిన శక్తిలేశమును భగవదంకితంచేయడంచేత జీవుడు తరించి తీరు తాడు. జటాయువు తన శౌర్యమును రామాంకితంచేసి తరించాడు. అతనిస్వధర్మనిర్వహణం అతణ్ణి సముద్ధరించింది.

49

సీతాదేవిని అపహరించి తీసికొనివెళ్లుతున్న త్రిలోకభయంకర బలుడైనరావణుడు, తత్తర పడుతూ దుర్బలుడై, రథాన్నికూడా తోలలేక పోయాడు. చీకటి పెద్దవాండ్లకుకూడా ఏదోభీతిని కలిగిస్తుంది. పగటివేళ, చిన్నపిల్లలకుకూడా ఏదో ధైర్యం చేకూరుస్తుంది. అదేమాదిరి, పాపకార్యం బలవంతులనుకూడా దుర్బలపరుస్తుంది. నిస్తేజులను చేస్తుంది. పుణ్యకర్మ దుర్బలులకుగూడా తేజో బలశక్తులను ప్రదానం చేస్తుంది.

50

సీతావియోగదుఃఖితుడైన శ్రీరాముని కన్నీళ్ళతో దండకారణ్యగర్భాలన్నీ తడిసిపోయినవి. భగవంతుని భాగవతప్రణయం ఎట్టిదో చూడండి!

51

లోకవాసనగల స్వార్థదృష్టిగలవాని ప్రేమాలింగనం కబంధుని ఆలింగనం లాంటిది. ఆ ఆలింగనంలో మృత్యువున్నది. ఓయీ! స్వార్థవ్యామోహవిషయవాసనా కబంధబాహుబంధాలను, శ్రీరామలక్ష్మణులవలె జ్ఞానవైరాగ్యఖడ్గాలతో విచ్ఛేదించి, విముక్తిశాంతిని అనుభవించు!

52

రాక్షసుడైనకబంధునకు మనకువలె, తల మెడపైన ఉండదు. హృదయ ముండవలసిన చోట, ఒకపెద్దబిలంవంటి నోరొక్కటి వానికి ఉంటుంది. శతయోజనదీర్ఘ బాహువులు చాచి ఉంచి, ఆకబంధుడు ఆచేతులలో చిక్కిన జీవకోటినంతా ఒక్కసారి అమాంతం మ్రింగివేస్తుంటాడు. ఎంత విచిత్రహింసావ్యూహం! స్వార్థపరుడు, పరపీడకుడు, దురాశాంధుడు, కబంధుని ప్రతిరూప మని మనం గ్రహించవచ్చు. కబంధు

నకు మంచిచెడుగులు, పుణ్యపాపాలు, ఉచితానుచితాలు దయాదాక్షిణ్యాలు– ఆలోచించే తల ఉండనేఉండదు. వానికి ఉండేది ఒక్క మూతబడని పెద్దనోరు మాత్రమే. ఆనోరు ఎక్కడ ఉంటుంది? హృదయస్థానంలో ఉంటుంది. అంటే వానికి ప్రేమ, దయ, సానుభూతి, పాపభీతి, సున్న అన్నమాట. హృదయమే లేదు. హృదయస్థానములో ఉండేది – ఆకలి! ఆకలి! అంతా మ్రింగాలి! మ్రింగాలి! – అనే పెద్దనోరొక్కటే! ఇక వానిదురాశాబాహువులు దీర్ఘాతి దీర్ఘాలు. అంతా నాకే అని వానిదురాశ. ఎప్పుడో వానిదురాశాబాహువులు భగవంతుని చేత తెగిపడేకాలం వచ్చితీరుతుంది. అందుకని మనం కబంధులం కాకూడదు. భక్తిసింధువులం కావాలె! విశ్వబాంధవులం కావాలె!

53

రావణాదిరాక్షసులు అద్భుతకామరూపశక్తులను, విచిత్రసిద్ధులను ప్రదర్శించారు. జ్ఞానశూన్యులైన ఆరాక్షసుల విచిత్రశక్తులు అపహాసపాత్రములై వారిచావుకు దారితీశాయి. క్షుద్రసిద్ధులు, క్షుద్రశక్తులు అపాయకరములైనవి. గణింపదగినమహాసిద్ధి – భక్తిసిద్ధి – జ్ఞానసిద్ధి. ఆసిద్ధికి దారితీయని సిద్ధులన్నీ జీవిత పథంలో మాయాపిశాచి త్రవ్విన లోతైన గోతులే సుమా!

54

కేవలం వాయుభక్షణతో ఉండకలిగినా, భక్తిలేనివాడు పాముకంటె హీనుడే. ఆకాశగమనం చేయగలిగినా, భక్తిలేనివాడు పక్షికంటె అల్పుడే. నిముషానికి ఒకరూపం మార్చగలిగినా, భక్తిలేనివాడు ఊసరవెల్లికన్నా తక్కువే. ఎంతఅందమున్నా. భక్తిలేనివాడు, జింక, చిలుక మొదలైన అందమైనపశువుల కంటె, పక్షులకంటె క్షుద్రుడే. భగవద్భక్తిసిద్ధి లేనివాడు, ఎన్నిఅద్భుతసిద్ధులు గడించినా వాడు తృణంకంటె హీనహీనుడే! రావణాది రాక్షసులు అద్భుతశక్తులు గడించినా భక్తి శక్తిని గడించలేకపోయారు. అందుచేత వాండ్లు దుర్గతిని పొందారు.

55

మతంగమహర్షిని ఆశ్రయించి శ్రీరామ మంత్రస్మరణలో నిమగ్నయై, శబరి ఆటవిక స్త్రీయైనా, ఏచదువూసంధ్యలు రాకపోయినా, శ్రీరామసందర్శనశ్రీని పొందింది. ఆమెఆటవిక సపర్యలకు శ్రీరామభగవానుడు ప్రముగ్ధుడైనాడు. మహాత్ములసమాశ్రయణం, మంత్రజపం, ఎంతశక్తివంతములైనవి!

56

శబరి గుర్వాచనానుసారం సుదీర్ఘకాలం భగవద్దర్శనానికివేచి, తపస్సుచేసింది. ఆమెవాంఛ ఫలించింది. రామదర్శనమైంది. రామాగమనము నకు ఆమె ఎంతోదీర్ఘ కాలం వేచియుండవలసి వచ్చినా, నిరాశచెందలేదు. శ్రద్ధ వదలలేదు. సఫలమనోరథ అయింది. మనకు గురువచన విశ్వాస మున్నదా? పట్టుమని పదినిమిషాలు జపం చేయగలమా? కానీ భగవద్దర్శనం కాలేదని శుష్కపరితపన అపారం! ఇది నిష్ప్రయోజనం. శబరీమాతకుగలగురువిశ్వాసం శ్రద్ధ, ఓర్పు, నిరంతరహరినామస్మరణ – మనకు కావాలె. అప్పుడే రామదర్శనం!

57

భగవంతునకు కావలసినది కులం కాదు—

గుణం! గోవిందప్రీతికరమైంది గుణమే! మతం గుడు, శబరి,- ఇలాంటివారు తక్కువకులస్థు లని ఎంచబడేవారిలోనే జన్మించారు. కానీ, వారు భగవత్సాక్షాత్కృతి పొందగలిగారు. శ్రీరాముడు బోయవాడైనగుహుని కౌగలించుకొని సమాదరించాడు. శబరి ఆతిథ్యాన్ని స్వీకరించాడు. జటాయువునకు సపర్యలుచేశాడు. పశుపక్ష్మి మృగాదులనుగూడా శ్రీరాముడు అనుగ్రహించాడు. శ్రీరామునివిశాలప్రేమసామ్రాజ్యంలో- గుణవంతులందరికీ స్థానమున్నది. శ్రీరామానుగ్రహపాత్రులంకాదలచినమనం, రామదాసులమైనమనం, శ్రీరామునిహృదయమునుగ్రహించి సంస్కృతహృదయులం కావాలె. కులజాతిమత విభేదములను విస్మరించాలె.

58

శ్రీరామచంద్రుడు సీతాదేవికై మహానైవేద్యసమర్పణచేశాడు. నివేదించాడు. భగవంతుని భక్తవాత్సల్యస్వభావమున కిది మహానిదర్శనం.

59

రాక్షససంకులితమైనదండకారణ్యం సీతారామలక్ష్మణుల పాదస్పర్శచేత ప్రపూతమై ప్రశాంతివహించింది. వివిధదుఃఖసంకులమైనజీవిత దండకారణ్యం, భక్తిజ్ఞానకర్మయోగనిష్ఠలచేత ప్రపూతమై ప్రశాంతమై భాసిస్తుంది.

కిష్కింధాకాండము

60

వాలిభయంచేత సుగ్రీవుడు ఋష్యమూక పర్వత మెక్కి కూర్చున్నాడు. మతంగముని శాపంచేత ఋష్యమూకగిరి వారికి చేరరానిది. రాముడు తానుగా వచ్చి సుగ్రీవునకు అభయప్రదానం చేశాడు. సుగ్రీవునివలె, సంసారభయనివృత్తికి వైరాగ్యఋష్యమూకగిరిని అధిరోహించినప్పుడు భగవంతుడు మనకడకు వచ్చి, అభయప్రదానం చేస్తాడు.

61

తారబోధలు వాలికి తలకెక్కలేదు. సుగ్రీవునితో యుద్ధానికి తలపడ్డాడు. మదోద్రేకపరులకు మంచిబోధలు మతి కెక్కవుకదా!

62

వాలిసుగ్రీవులలోని భేదమును మొదట గుర్తింపలేక రాముడు బాణం విడువలేదు. సుగ్రీవుడు వాలిచే మొదట దెబ్బలు తినవలసి వచ్చింది. తదుపరి, రెండవసారి పోయినప్పుడు, శ్రీరాముడు బాణము విడిచి వాలిని సంహరించాడు. భగవానుడైనశ్రీరాముడు వెనుక సుగ్రీవున కండగా ఉన్నా డని విన్నా గర్వము వదలక వచ్చినవాలి ఒకరకంగా నాస్తికుడు. శ్రీరామభగవానుడు తనవెనుక అండగా ఉన్నా డని తెలిసికూడా, ఏమో సహాయంజరుగుతుందో జరుగదో అనే సంశయముతో - ధైన్యంతో - పోరికి దిగిన సుగ్రీవుడుకూడా ఇంకొకరకంగా నాస్తికుడు. ఉభయులలో నాస్తికత సమానంగా ఉన్నందున- ఈయుభయులలోని తేడాను శ్రీరాముడు చూడజాలక బాణం వేయలేదు. సంశయరూపకమైన అహంకృతి నశించి, పూర్ణశరణాగతిభావం ఉదయించిన పిదప సుగ్రీవుని శ్రీరాముడు గుర్తించి, అతని పక్షంలో, వెనుకనుండి వాలిపై బాణంవదలి సంహరించాడు. గర్వధైన్యములు రెండూ అహంకృతియొక్క - నాస్తికతయొక్క -

చిహ్నలే. గర్వ్వైదైన్యహీనులమై, నిస్సంశయులమై ఈశ్వరశరణ్యుల మైనప్పుడే, అకించనుల మైనప్పుడే హరికృపాసిద్ధి కలుగుతుంది.

63

మృగమును మృగయాధర్మ్మానుసారమే శ్రీరాముడు చెట్టుమాటుననిలిచి వేటాడి సంహరించాడు. తనపాశవిక దుశ్చర్యలకు తగిన మరణమును వాలి పొందాడు. వానియోగ్యత శ్రీరాము డెదురొడ్డి పోరదగింది కాదు. వాలియొక్క-మృగప్రవృత్తులు శ్రీరాముని మృగయునిగా (వేటగానిగా) సాక్షాత్కరించుకొన్నవి. వాలి మృగధర్మ్మమును వరించాడుగనుక, భగవానుడు ఆతనియెడ మృగయుడై వేటాడవలసి వచ్చింది. వాలి బ్రతికియున్నతనతమ్ముని భార్యను తనభార్యగా చేసికొన్నాడు, కాళ్ళమీద పడి వేడుకొన్నా వానిసర్వస్వమును హరించి సోదర ప్రేమ రవ్వంతకూడా లేకుండా, దురుద్దేశంతో వానిని తరిమి వేశాడు. తనను ఎదిరించేవాడు ఉండరా దని ఆతడు భావించాడు. అతనిపశు కర్మ్మకు ఫలితంగా ధర్మ్మం రామరూపంతో, తగిన ఫలమును ప్రసాదించింది. మృగదృష్టితో వాలి, ధర్మ్మదేవతను చాటుకు నెట్టాడు. ధర్మ్మదేవత అతనిని మాటుబెట్టి మసిచేసింది. మనకర్మ్మకు తగిన ఫలితమునే అదృశ్యుడైన పరమేశ్వరుడు ప్రసాదిస్తుంటాడు.

64

వాలిని శ్రీరాముడు చెట్టుమాటున నిలిచి సంహరించాడు — అన్నవిషయంలోని మహా సందేశం — భగవానుడు దుర్బలులవెనుక దుఃఖితులవెనుక, దీనులవెనుక, అండయై ఉంటా డని ఆ అదృశ్యదైవశక్తిని అహంకారాంధులు గుర్తింపలేక విజ్రుంభించి, తుదకు హతులౌతా రని ఆ అకుంఠితదైవశక్తి అదృశ్యమానమైనా, సర్వసాక్షియై జీవులకర్మ్మఫలాలను పరిసాదిస్తుందనీ-మనము గ్రహించవలసియున్నది.

విశ్వమును- ప్రకృతిని- వ్యక్తంగా శాస్త్రాలలో వర్ణించడం మనం వింటాము. గీతలో విశ్వప్రకృతి అశ్వత్థంగా పోల్చబడింది. విశ్వాధిష్ఠానశక్తి- ప్రకృతిమూలశక్తి - పరమాత్మ - ఇంద్రియాతీతుడై అగోచరుడైయుంటాడు. నరత్వమున కధిగమించని వానరుడు (అజ్ఞుడు) విశ్వవ్యక్తపుమాటున ఉన్న విశ్వసంచాలకధర్మ్మశక్తిని- శ్రీరాముని- దర్శించలేడు. ధర్మ్మశరఘాతం తనగుండెలో తగిలినప్పుడు రోదిస్తాడు.

65

శ్రీరాముని ముఖతః ధర్మ్మసందేశమును విన్నపిదప, వాలియొక్క-అజ్ఞానం వ్రీలిపోయింది. సుగ్రీవుని రక్షించడంద్వారా అతనిపై జూపిన అనుగ్రహమును, తనను శిక్షించడంద్వారా తనకు అహంకారకర్పరవిముక్తిని కల్పించి తనపై చూపిన అనుగ్రహమును, వాలి గ్రహించి, ఆనందబాష్పాలుకారుస్తూ, ముకుళితహస్తుడై అంత్యసమయంలో, శ్రీరామునిదివ్యమంగళాకృతిలోని మహాధర్మ్మతేజమును సందర్శిస్తూ కైవల్యపదమధిష్ఠించాడు. భగవంతునినిగ్రహానుగ్రహలీలలు రెండూ జీవసముద్ధరణానికే!

66

సుగ్రీవుడు శ్రీరామపద్మసమాశ్రయణంచేతనే తనభీతిని పోగొట్టుకున్నాడు. ఇష్టకామ్యార్థసిద్ధిని పొందాడు. భగవదాశ్రయంచేతనే అభయసిద్ధి కలుగుతుంది. అఖిలకామ్యసిద్ధి లభిస్తుంది. ఇహపరసుఖాలకు ఈశ్వరభజనమే శరణ్యం!

67

భార్యాభాగ్యవిహీనుడై భయపీడితుడై యున్నప్పుడు సుగ్రీవుడు శ్రీరాముని శరణుపొంది భయరహితుడైనాడు. కామకాంచనసుఖములు లభించగానే కనులు మూతబడి రామకార్యమును విస్మరించాడు. కామకాంచనసుఖాలు, సత్యదృష్టిని, దైవభక్తిని మరిపిస్తాయి. కష్టములలో భగవంతుని దలచి, సుఖాలలో మరవకూడదు. సర్వకాలసర్వావస్థలలో భగవంతుని సంస్మరించడమే భక్తునిలక్షణం.

68

శ్రీరామచంద్రుని సీతాన్వేషణకార్యంలో కోతులు కొండముచ్చులు, పశుపక్ష్యాదులు సహాయంచేయ తలపడినవి. ధర్మపథంలో నడిచే మహాత్ములకు, సత్యాన్వేషణపరులకు, సమస్త భూతములూ తోడ్పడతాయి.

69

అఖిలవానరులలో ఆంజనేయునకు శ్రీరాముడు ముద్రిక నిచ్చి సీతాన్వేషణచేయమన్నాడు. ఆంజనేయునకు అధికబాధ్యతను ఆరూపకంగా రాముడు విధించాడు. దానికి ఆంజనేయుడు ఆనందించాడేగాని, ఆక్రందించలేదు. నీకు నీగురువు, లేక భగవంతుడుఒకకఠిన కార్యభారము నిచ్చినప్పుడు విసుకొక్కని వికలుడవుకావద్దు. భగవంతునకు నీపైన గల విశిష్టప్రేమకు, నీఅదృష్టానికి ఆనందపడి, దైవసేవాకార్యమును హనుమంతునివలె నిర్వహించి, నీ భక్తిశ్రద్ధలను ప్రకటించు!

70

ఆరుమాసాలలో సీతాదేవియొక్కవార్త తేలేక తిరిగివచ్చినచో తే, మరణశిక్ష యని వానరులకు సుగ్రీవుడు ఆజ్ఞనిచ్చాడు. దారిలో వానరులకు భయానకవ్యతిరేకపరిస్థితులు ఎదురైనవి. కానీ వారు వెనుకంజవేయక, చివరకు మరణానికికూడా సంసిద్ధులైనారు. పరమేశ్వరునియొక్కసేవలో సునిష్ఠగలవానరులకు, ప్రారంభభయానకపరిస్థితులన్నీ చక్కబడి మార్గం కనబడింది. హృత్పూర్వకమైనభగవద్విశ్వాసంతో ముందంజవేస్తే, దైవకృప మనకు అత్యంతసన్నిహితమై మార్గంచూపించితీరుతుంది. వ్యతిరేకవాతావరణమంతా అనుకూలవాతావరణంగా మారుతుంది.

71

శ్రీరామభక్తులైనవానరులసంపాతికి తిరిగి రెక్కలు వచ్చాయి. పరమభాగవతులసందర్శనసాంగత్యసద్బోధలచేత– బ్రహ్మాకాశవిహారము చేయడానికి మనకు భక్తిజ్ఞానము లనేపక్షములు రెండు తప్పక లభిస్తాయి.

72

శ్రీరామభక్తిసముద్రిక్తుడైన హనుమాన్ మహావీరుడు. సముద్రమును అవలీలగా ఉల్లంఘింప నుద్యుక్తుడైనాడు. భక్తితన్మయుడైనవానిని ఈసంసారసముద్రం భయపెట్టలేదు.

సుందరకాండ

73

ఆంజనేయుడు సీతాదర్శనార్థమై సముద్రలంఘనంచేసేటప్పుడు, మధ్య అనేక ఆటంకాలు వచ్చాయి. రామభక్తిసంజనితమైన మహాధైర్యంతో ఆతడు వాటి నన్నిటినీ ఎదుర్కొని నిరుత్సాహపడక లంకాతీరమును చేరుకొన్నాడు.

మనఆదర్శతీరమును చేరేముందు మధ్య వచ్చే సంఘర్షణలకు మనం నిరుత్సాహపడకూడదు. సజీవమైన విశ్వాసంతో, అకుంఠితవై రాగ్య బలంతో, ముందుకుపోవాలె. అప్పుడే మనం ధర్మవీరులం! దైవభక్తులం! అప్పుడే మనం గమ్యమును చేరుకోగలం!

74

ఒకొక్కచోట హనుమానుడు మహా సూక్ష్మరూపుడై, ఒకొక్కచోట మహాస్థూల రూపుడై, రాక్షసమాయాజాలములను అతిక్రమించాడు. 'దాసోహం'— అనే సూక్ష్మరూప భక్తితోగాని, 'శివోహం' అనే గంభీరరూప జ్ఞానంతోగానీ మాయను మనం అతిక్రమించగలం. మాయ అనేవల ఇంక చిన్నదికాలేనంత చిన్నవాడై మాయను దాటడం 'దాసోహం' దృష్టి. మాయ అనే వల ఇంక పెద్దదికాలేనంత పెద్దవాడై మాయను చించి అధిగమించడం 'శివోహం' దృష్టి.

75

హనుమంతుడు లంకలో మొదట ఎంత గాలించి వెదకినా సీతామాత కనపడలేదు. ఇంక సీతామాత కనపడకపోతే తనప్రాణములను ఇక్కడే త్యజిస్తా నని- మహోన్నత ఆత్మార్పణ దృష్టికి ఆతడు అధిగమించినతక్షణమే – దాపున గల అశోకవనంలోనే జగజ్జననీదర్శనమైంది. సంపూర్ణమైన ఆత్మార్పణస్థితికి, నిరహంకార స్థితికి సమగ్రశరణాగతికి, దేహాతీతదశకు అధిగమించినప్పుడే మనకు కార్యసిద్ధికలుగుతుంది.

76

సీతాదేవికి, శ్రీరామప్రణయమును వదల మనీ, రావణుని పేక్షించు మనీ, నయాన భయాన, తర్జనభర్జనలతో అశోకవనంలో రాక్ష సస్త్రీలు ప్రబోధిస్తారు. ఆ కుబోధలను తృణీకరించి, ప్రాణంపోయినా శ్రీరామప్రేమను తాను వదలలే నని సీతామాత నిర్వచించింది. రాక్షస శక్తులా మెరామప్రణయమును చలింపచేయలేక పోయినవి. లోకవాసనలు, ప్రాపంచికభావాలు, విషయతృష్ణలు, కుజనప్రేరణలు, నిన్ను అదే మాదిరి ఊపివేస్తాయి. ఓయీ! భయపడకు ఈశ్వరప్రణయనిష్ఠుడవై నిలువు! తుదకు శాంతి లభిస్తుంది.

77

రామవియోగశోకమును మరవడానికి విరహిణీజనప్రియమైన అశోకవనంలో సీతాదేవి ఉంచబడింది. కానీ ఆమెకా అశోకవనం శోకవనంగానే తోచింది. భగవద్విరహవేదనలోఉన్న విరక్తజనులకు విషయసుఖాయతమైన లోక మొక యమలోకంగానే తోస్తుంది.

78

సీతాదేవికి అశోకవనంలో హనుమద్దర్శనము, శ్రీరాముద్రిక లభించినవి. తుదకు రామదర్శనం లభిస్తుంది. బ్రహ్మసాక్షాత్కృతికి ముందు అనేక సగుణరూపసాక్షాత్కారాలు మనకు లభించి సముత్సాహాన్ని కలిగిస్తాయి.

79

సీతారామానుగ్రహంచేత లంకలో హనుమంతుని, అగ్ని దహించలేక పోయింది. శీతలగంధంగా సుఖప్రదమైంది. భగవదనుగ్రహకవచధారిని, తాపత్రయాగ్నులు చుట్టుముట్టలేవు.

80

లంకలో ఒక్కవిభీషణుని ఇల్లు తగులబడక నిలిచింది. అంతేకదా– సంసార దుఃఖదావానల దందహితుడుకానివాడు– బ్రహ్మనిష్ఠు డొక్కడే! ఆత్మనిష్ఠు డొక్కడే!

81

మహావీరహనుమానుడు ఇంద్రజిత్తు యొక్క బ్రహ్మాస్త్రానికి ఎంతసేపు కట్టుబడ్డాడు? మరు క్షణంలో అతడు అద్భుతవిజృంభణంచేసి లంకను దహించాడు. జ్ఞానబలసంపన్నులైన మహాత్ములు లోకబంధాల్లో ఎంతసేపు కట్టుబడతారు? క్షణంలో వానిని తునాతునకలుచేసి అజ్ఞాన రాక్షసలోకాన్ని భస్మీపటలంచేస్తారు.

82

రావణుడు ఆంజనేయునితోక కాలుద్దా మని నిప్పుమట్టించాడు. కానీ లంకే బూదిఅయింది. మూర్ఖులు పరులకు కీడుకలిగిద్దా మనుకొంటారు. కానీ స్వనాశనమే ప్రాప్తిస్తుంది.

83

హనుమానునిచేతిలో అనేకులు రాక్షస వీరులు గతించినా, లంకంతా భస్మీపటలమైనా, రావణుడు రామమహిమను గ్రహింపక ఇంకా ఇంకా క్రోధోన్మత్తుడైనాడు. మూఢమానవులు ఎంతెంత దుఃఖాలకు గురిఅవుతున్నా, విషయ సంసారమమతను, అహంభావమును, విడువరు.

84

లంకసాంతము జ్వాలామయమైంది. అయినా రావణునిహృదయంలోమాత్రం జ్ఞానజ్వాల వెలు గలేదు; చీకటి పోలేదు. కన్నుల ఎదుట కన బడేదంతా నశిస్తున్నా, బ్రహ్మసత్యం, జగన్మిథ్య అన్న జ్ఞానం దుర్మదాంధులకు కలుగదు.

85

హనుమదాచార్యుడు, రావణునకు అనేక ధర్మోపదేశాలతో శ్రీరామప్రభావమును నిర్వ చించాడు. కానీ రావణుడు వినక ధిక్కరించాడు. మందమతులు, మూర్ఖావేశపరులూ అయిన తనరాక్షసమిత్రులమాటలు వానికి హితముగా తోచాయి. ఆహా! ఉద్ధరించేమహాత్ముల మాటలు మనకు నచ్చవు. ఆత్మనాశనముగూర్చే లౌకికుల ఇచ్చకాలే రుచిస్తాయి.

86

హనుమంతుడు సముద్రాన్ని దాటి, సీతను దర్శించి, లంకాదహనంచేసి, తిరిగివచ్చి వానరు లకు శుభవిశేషమును తెల్పి అందరకు ఆనంద మును చేకూర్చాడు. మోహసముద్రమును దాటి, అహంభావమును దగ్ధంచేసి, జ్ఞానసీతా సాక్షాత్కార మొందిన మహాపురుషుడే తోటి ప్రజలకు తాత్త్వికరహస్యములు వెల్లడించి, సత్యానందమును కలిగించగలడు.

యుద్ధకాండ

87

కోతులను కొండముచ్చులను శ్రీరాముడు మహాసేనగా నడిపించాడు. అల్పులను బలహీను లను, అనంతబలో త్తేజితులైన మహాఘనులనుగా చేయడంలోనే మహాత్ములగొప్పతనం ఉన్నది.

88

అల్పవానరములు శ్రీరాముని పక్షంలో

నిలచి, దేవతాపూజ్యస్థాన మలంకరించినవి. ఎవరు అల్పులైనా సత్యమును అనుసరిస్తారో. ధర్మమును ఆరాధిస్తారో, వారే ఘనులు. ఘనులైనా సత్యమును అనుసరించనివాండ్లు అల్పులే.

89

దర్భశయనుడై యున్నవీర రాఘవుని ప్రభావమును సముద్రుడు గుర్తించలేదు. విల్లెక్కుబెట్టినపిదప గడగడలాడిపోయాడు. ఉదాసీనులైనమహాత్ములను మందులు గుర్తించలేరు.

90

రఘువీరుని ధనుష్టంకృతికి సముద్రుని అహంకృతి వ్రీలిపోయింది. రామశరణాగతి పొందాడు. బ్రహ్మవేత్తలముందు, భవసముద్రపుపొంగు సాగదు.

91

శ్రీరామనిర్మితమైన సేతువుపై అల్పవానరములుకూడా అవలీలగా నడిచి, సముద్రోల్లంఘనం చేసినవి. మహాత్ములధర్మోపదేశసేతువుపై నడిస్తే సామాన్యులు సైతం అవలీలగా భవసాగరాన్ని తరించగలుగుతారు.

92

రావణుడు అనేకసాధ్వీమతల్లులను అపహరించి చెరబట్టాడు. చివరకు జగన్మాత యైన సీతనుగూడా అపహరించి చెరబట్టాడు. అంతటితో వానిపాపం పక్వమైంది. వాని కింక అంత్యకాలం సమీపించింది. ఆతడు సోదరుడైన ధర్మమూర్తియైన విభీషణునికూడా అగౌరవించాడు. తనను అగౌరవించినందుకు విభీషణుడు రావణుని పరిత్యజించలేదు. ధర్మమును న్యూనపరిచినందుకే విభీషణుడు రావణుని పరిత్యజించాడు. భగవద్ధర్మమునకు వ్యతిరేకించినప్పుడు ఏదైనా త్యాజ్యమే

93

విభీషణుడు శత్రుసోదరుడు; రాక్షసుడు; అపరిచయుడు, అయినా ప్రపన్నజనప్రసన్నుడైన శ్రీరాముడు నిస్సంకోచంగా అతనికి శరణిచ్చి అభయప్రదానం చేశాడు. ప్రపత్తియోగసులభుడు భగవంతుడు.

94

రావణుడు తనకు అన్నయైనా, ధర్మప్రభోధాలు వినినందున, విభీషణుడు అతనిని త్యజించి శ్రీరాముని చేరుకున్నాడు. ధర్మపథగాములే నిజమైనబంధువులు, ధర్మపథవ్యతిరేకులు బంధువులైనా శత్రువులే.

95

శుకసారణులు రావణులు రావణునకు రామసైన్యపరాక్రమాదులను అభివర్ణించి తెలిపారు. అయినా రావణునకు సత్యం గోచరించలేదు. అంతరాంతరాల్లో సత్యతత్వం ధ్వనిస్తూఉన్నా మూర్ఖావేశపరాయణులు మహాబధిరులై దాన్ని వినిపించుకోరు; కుమార్గాన్ని వదలలేరు.

96

రావణునిపుత్రమిత్రపరివారమంతా, ఘోరఘోరంగా సాగిపోతున్న రామరావణసంగ్రామంలో కూలిపోవడం జరిగింది. అయినా రావణాసురునకు జ్ఞానోదయంకాలేదు. అహహా! కన్నులముందు అణువణువులో ప్రపంచము యొక్కనశ్వరత గోచరిస్తున్నా బ్రహ్మసత్యత్వమును అజ్ఞులు గుర్తింపలేరు.

97

రామరావణసంగ్రామం జరుగుచున్నకాలంలో మాయారచితమైన రామశిర స్సాకటి తెచ్చి, రాక్షసస్త్రీలు సీతాదేవికి చూపి, "ఇదిగో! వెట్టిబాగులజానకీ! ఖండింపబడిన నీరాముని శిరస్సు!" అని ఆమెను భయపెడతారు. కానీ ఆమె రాముడు నిత్యసత్యస్వరూపుడు-అనంతుడు- అని తెలిసికొని అధైర్యపడక, విశ్వాసమును వదలక, తుదకు శ్రీరాముని కలుసుకోగలిగింది. మాయాసంఘటనలు చూచి, కలి విభ్రాంతులు చూచి, మనం సత్యమైనపరమేశ్వరునియందు, ధర్మమునందు అపవిశ్వాసులం కాకూడదు. సత్యం అకుంఠిత మని అజేయ మని తుదకు తెలిసికోగలం!

98

సుగ్రీవాంగదహనుమజ్జాంబవదాదివానరులు శ్రీరామకృపాబలంతో రాక్షససైన్యములను నుగ్గునుగ్గుచేసి అనల్పామోఘపరాక్రమమును ప్రకటించి, మహావీరులుగా యశోవంతులైనారు. భగవదుపాసనాబలసంపన్నులు— అల్పులైనా సశే అద్భుతకార్యములను సాధించి జగత్కీర్తులు కాగలుగుతారు.

99

రాక్షసులు మహాబలవంతులైకూడ రణరంగంలో వానరులచేత హతులైనారు. భగవద్బలవిహీనులు, ఎంత భౌతికబలోపేతులైనా నశించి తీరుతారు.

100

పరమపురుషుడైనరాముని శత్రువుగా, ప్రకృతియైనసీతను కామ్యవస్తువుగా రావణుడు ఉపాసించాడు. ఇట్లు ఏదోఒకరకంగా— వామాచారమార్గంలోనైనా— వాడు సీతారామోపాసన చేయడంచేతనే అజేయశక్తిసంపన్నుడై మరణించడం కష్టమైంది. నాస్తికులయొక్కవిజయాలలోనిరహస్యం ఏదోఒకరకంగా వాండ్లు వక్రమార్గంలోనైనా భగవత్తత్త్వముతో సంబంధము కలిగియుండడమే.

101

ప్రకృతి భోగవస్తువు కాదు. పరమేశ్వరస్వరూపిణియైనప్రకృతిని భోగింపదలచినవాడు ఆపదలకు గురి అవుతాడు. ప్రకృతిమాతయైన సీతాదేవిని, ఆరాధించక కామించి రావణుడు కాలవశుడైనాడు.

102

శ్రీరామకోదండనిర్గతమహాశరపరంపరలచేత రావణునిపదిశిరస్సులు నేలబడినవి. ఏరావణుని పాదపీఠంవద్ద ఒకప్పుడు దేవేంద్రాదిదిక్పతులకిరీటమణులుప్రకాశించినవో, ఆరావణునిశిరస్సుల నిప్పుడు గ్రద్దలు కాళ్ళతో తన్నుతున్నవి. ప్రాపంచికసంపదయొక్క, బలముయొక్క క్షణభంగురత ఎట్టిదో గ్రహించండి!

103

రావణునిసంహరించి, లంకారాజ్యమునకు శ్రీరాముడు విభీషణుని పట్టాభిషిక్తునిచేశాడు. అధర్మాన్ని అణచి, ధర్మమును భగవానుడు సముద్ధరిస్తుంటాడు.

104

మహాపతివ్రత అని తెలిసికూడా సీతామాతల్లిని శ్రీరామచంద్రుడు అగ్నిప్రవేశం చేయిం

చాడు. సంకల్పమాత్రంచేతనే రావణాదులను సంహరింపగలిగికూడా సుగ్రీవాంగదహనుమజ్జాంబవదాదులతోడ్పాటుతో యుద్ధక్రీడచేశాడు. ఇదంతా దేనికి? తనభక్తకోటియొక్కప్రతిభాసంపత్తులను ప్రదర్శింపజేసి వాండ్లకు చిరయశస్థానం ప్రసాదించడానికే! భగవంతునిఅనంతఅగాధఅనిర్వచనీయలీలావిలాసములు మహాద్భుతాలు!

105

యుద్ధవిజయానంతరం విభీషణుడు శ్రీరామచంద్రుని నగరంలోనికితీసికొనిపోయి దివ్యాభిషేక పూజాసత్కారాదులుచేయ దలచాడు, కానీ, భరతసంయోగంలోమాత్రమే తనకు విశ్రాంతిలభిస్తుంది. అని రాఘవస్వామి నిర్ణయించి సపరివారంగా అయోధ్యకు పుష్పకవిమానంలో పయనించాడు. భగవంతునిభక్తవాత్సల్యం అటువంటిది!

106

భరతరామసమాగమం జరిగింది. ఇరువురులో భవనవాసి ఎవరో వనవాసి యెవ్వరో— భరతుడెవ్వరో రాము డెవ్వరో— జనులు గుర్తించలేకపోయారు. అవును భగవద్భాగవతోత్తముల మధ్య భేదమును ఎవరు కనుగొనగలుగుతారు?

107

శ్రీరామచంద్రుడు అయోధ్యాసింహాసనమును అలంకరించాడు. మూడులోకములలోని సర్వజీవకోటులు అఖండసంతోషశాంతిశ్రీలననుభవించాయి. హృదయపీఠంపైన సచ్చిదానందస్వరూప పరమాత్మ ప్రకాశించినప్పుడు, జీవితం మహానందశాంతిశ్రీలతో వెలుగొందితీరుతుంది!

108

శ్రీరామపంచాయతనమును హృదయంలో ప్రతిష్ఠించుకొని సురమునిజనులందరూ పరమానందసంభరితులైనారు. జ్ఞాన, భక్తి, వైరాగ్య, కర్మ, యోగస్వరూపమైన శ్రీరామపంచాయతనమును సర్వదా మనహృదయంలో ప్రతిష్ఠించుకొని శ్రీరామానుగ్రహపాత్రులమై మనంకూడా సర్వశుభశ్రేయస్థేయములపొంది పరమానందసంభరితులమౌతాముగాక!

శ్రీసీతాలక్ష్మణభరతశత్రుఘ్నహనుమత్పరివారసమేత శ్రీరామచంద్రపరబ్రహ్మార్పణమస్తు!

ఓం! ఓం!! ఓం!!!



కీ॥ శే॥ శ్రీ కర్ప్పూరపు సీతమ్మ సూర్యనారాయణ పుణ్యదంపతులు

[వీరి పవిత్ర సంస్మరణార్థము శ్రీరామచరితమానసము ప్రకటితము]

102(b)

జయజయ శ్రీనారసింహ

శ్రీ రామతీర్థ సేవాశ్రమ మహోద్యమం

శ్రీ రా మ చ రి త మా న సా వ త ర ణం :

నరునిలోని సర్వానర్థకమైన జీవాహంభావమును ఉన్మోచనముచేసి సర్వమంగళకర మైన శివోహంభావమును సుప్రతిష్ఠితమొనర్చి—నరుని నారాయణునిగా— విశ్వమును విష్ణుమందిరంగా— ప్రకాశింపచేయడానికే శ్రీరామతీర్థసేవాశ్రమ వేదికపై జనతాజనార్దనప్రీతికరమైన ఒకబృహత్ జ్ఞానయజ్ఞం వివిధకర్మాంగములతో నిర్వహింపబడుతున్నది.

హృదయమును భక్తిమయంగా, బుద్ధిని జ్ఞానదీప్తంగా, శరీరమును సత్కర్మానుష్ఠానయుతంగా జేసి— జీవితమును దివ్యీకరించి— మానవుని బ్రహ్మనిర్వాణశాంతిసామ్రాజ్యమునకు పట్టాభిషిక్తుని జేసే—సార్వజనికధర్మావతారమూర్తి, నవయుగ జగదాచార్యవరేణ్యుడైన శ్రీరామతీర్థస్వామి వారి అనుష్ఠానవేదాంతసందేశప్రసారం—శ్రీరామతీర్థసేవాశ్రమజ్ఞానయజ్ఞమునందు ప్రప్రధానవిషయం. ఏతన్మహాయజ్ఞము నవవిధభక్తిసాధనసంయుతమై దీపిస్తుంటుంది.

ఈ "శ్రీరామచరితమానసము" (శ్రీమద్రామాయణము) అన్న పరిచురణ శ్రీరామతీర్థసేవాశ్రమజ్ఞానాగ్నికుండమునుంచి లేచిన ఒకమహాజ్వాల. ఈదివ్యజ్వాల సమస్తకలికిల్బిషవిధ్వంసకం. సమస్తకల్యాణసంధాయకం.

శ్రీమద్రామాయణం, భారతీయసంస్కృతికి ఒకమహాదర్పణం. జగదారాధనీయధర్మములకు క్షీరసాగరం. ఔపనిషదప్రబోధమనే నిర్గుణతత్వమునకు సగుణస్వరూపం. జీవేశ్వరులసంబంధబాంధవ్యద్వైతముల చిత్రించిన విశ్వకావ్యం. విషయదాస్యమునుండి విముక్తి కలిగించి, ధర్మైక్యానందస్వాతంత్ర్యమును జీవకోటిచే అనుభవింపజేయడమే భారతీయవేదశాస్త్రపురాణేతిహాసా లన్నిటియొక్క పరమాశయం. శ్రీమద్రామాయణం సర్వశ్రుతిస్మృతిసారం. రామాయణగాథలు, బోధలు, వికలరూపంలోనైనా సరే— ఎంతవరకైతే ప్రజలలో మెదలుతుంటాయో అంతదనుక అధార్మికములైన ఆసురీశక్తులకు సంపూర్ణ విజయం ప్రజలపై లభించదు.

రామాయణం ఇహపరసుఖసంధాయకమైంది. అర్థపరమార్థసమన్వయాత్మకమైనది. చతుర్విధపురుషార్థప్రదమైనది. అది స్వర్గభూతలాలకు ముడివేస్తుంది. విశ్వమును వైకుంఠంగా మారుస్తుంది. నరుని నారాయణునిగా చేస్తుంది. మానవకోటిలోని రాక్షసవికారములను నిర్జించి రామరాజ్యసంస్థాపనం చేస్తుంది.

శ్రీరాముడు సర్వధర్మస్వరూపుడు. మహాధర్మమూర్తి. ఆమహాధర్మదేవతయొక్క పరిభావమును, ఆ ధర్మదేవతను ఆరాధించిన పుణ్యజీవులు పొందే విజయానందశ్రీలను, ఆ ధర్మదేవతను వ్యతిరేకించిన మూర్ఖజీవులు పొందే, ఘోరాపజయదుఃఖాలను వ్యాఖ్యానిస్తూ, సత్యజీవనసంస్కృతిని తెలుపుతూ సాగిన వేద

భాష్యం శ్రీమద్రామాయణం. పృథ్వీరంగముపై శ్రీరంగనాథుడు సర్వకల్యాణసంధాయకమైన రామాయణ మనే ఒకనిత్యప్రబోధనాటికను రమ్యరమ్యంగా ప్రదర్శించాడు.

రామాయణం ఒకసమతాలోకం. అక్కడ వసిష్ఠవామదేవాదిబ్రాహ్మణులు, దశరథజనకాదిక్షత్రియులు, గుహాదిగ్రామికులు, కౌసల్యాహల్యాశబరీత్రిజటాదిసాధ్వీమణులు, సుగ్రీవాంగదహనుమజ్జటాయు ముఖ్యపశుపక్ష్యాదులు. విభీషణాదిరాక్షసులు– చేజేతులు పట్టుకొని విహరిస్తుంటారు. ఈ అద్వైతస్వర్గమే– ఈప్రేమసామ్రాజ్యమే– ఈసమతాప్రపంచమే–ఈరామరాజ్యమే– సర్వాకాంక్ష్యం. రామరాజ్యంలో ధర్మపథంలో నడిచే కోతులు కొండముచ్చులకు కూడా, పశుపక్ష్యాదులకుకూడా సమున్నతస్థానమున్నది. రామరాజ్యమున అధర్మంలో నడిస్తే దేవతలకైనా స్థానం దొరకదు. సత్యసూత్రబద్ధములైన జీవపుష్పములన్నీ భగవద్రామగళాలంకృతములై భాసిస్తాయి.

రామాయణప్రపంచంలోని ఆ ఆదర్శమాతలు, ఆ ఆదర్శపితలు, ఆ ఆదర్శపుత్రులు, ఆ ఆదర్శసోదరులు, ఆ ఆదర్శసతీమణులు, ఆ ఆదర్శమంత్రులు, ఆఆదర్శవీరులు, ఆ ఆదర్శభృత్యులు, ఆ ఆదర్శప్రజలు, ఆ ఆదర్శభక్తులు,– త్యాగాగ్నివిస్ఫులింగములై మనకు సాక్షాత్కరిస్తారు. ఆ రామప్రపంచం– ఆ ధార్మికతేజోలోకం– ఆ రామరాజ్యం– లభించినప్పుడు ఇంకొక వైకుంఠం ఎవరికి కావాలె?

మానవజీవనధ్యేయమంతా పరమాత్మరతికే. రామపదకైంకర్యనిరతియే నిజమైన జీవనం. అర్థకామములు ధర్మమోక్షముల ఎల్లలలో నియమితాలు కావాలె. అదే జీవితకళ. రామాయణ గురుకులంలో మనకీ సత్యజీవనకళాభ్యసనం లభిస్తుంది. సత్యానందస్థానం రామపరబ్రహ్మమే కామకాంచనదురాసక్తులను విడనాడడంచేత, వైరాగ్యంచేత రామరతి లభిస్తుంది. భరతుడు కాంచనవిజయంచేసి రామానుగ్రహపాత్రుడైనాడు. సీతాదేవి కామవిజయంచేసి రామైక్యసిద్ధి పొందినది. కాంచనాసక్తివల్ల కైకేయి, కామాసక్తివల్ల రావణుడు రామునకు దూరులై దుర్గతిని పొందారు. శివభక్తుడు కానివాడు విష్ణ్వనుగ్రహపాత్రుడు కాలేడని శ్రీతులసీదాసులవారంటారు. వైరాగ్యస్వరూప శివుని ఆరాధించకుండా సర్వవ్యాపకానందరూపవిష్ణ్వనుగ్రహం ఎవరికైనా నిజంగా ఎట్లు లభిస్తుంది? విభిన్నరంగాలలో ఉండికూడా, తమతమస్వధర్మకర్మలను రామాంకితంచేసి ధర్మదేవాంకితంచేసి– జీవితమును రామకైంకర్యంగా మార్చుకొని – ధన్యతగన్న ఆదర్శజీవనులను రామాయణతిరువీథులలో మనం సందర్శించగలం. ఈ సత్యసాకేతవాసులైన దివ్యజనుల సందర్శనసాంగత్యసేవాభాగ్యంచేత, మనం మన శవజీవితమును శివజీవితంగా చేసికోగలం. మనం ఏజాతికి ఏకులానికి, ఏమతానికి ఏస్థితికి, ఏగతికి, ఏకాలానికి, చెందినా, ధర్మాంకితజీవనంచేత శ్రీరామాలింగనంలో సుఖించగలం. రామునకు కావలసింది ధర్మనిరతి! సత్యధర్మస్వరూపుడైనరాముని ప్రేమించి, ఆయన ననుసరించినవానికి అభయశాంతిప్రదానము, సత్యధర్మస్వరూపుడైన రామునితో భేదించినవానికి పుంఖాను పుంఖబాధాశరపరంపరలూ తప్పవు! ఇదే వివిధస్వరరాగాలాపములతో నినదించిన రామాయణగీతం.

కేవల సచ్చిదానందపరబ్రహ్మము, జగదుద్ధర

ణానికి నరరూపమున శ్రీరాముడై అవతరించి నట్లు, శ్రీమద్వాల్మీకిమహర్షి ప్రోక్తరామాయణం పండితపామరజనోద్ధరణానికి ఒకానొక ఆవశ్యకసమయంలో, శ్రీతులసీదాసగోస్వామి ముఖతః - శ్రీరామచరితమానస - భాషా కావ్యంగా అవతరించింది. శ్రీ తులసీకృత శ్రీరామచరితమానసమహాకావ్యం శ్రీరామ తత్త్వ మహాభాష్యం! సమస్తవేదశాస్త్రపురా ణేతిహాసాంతర్గత మహోపదేశసమాహారం!

బాల్యమాదిగా మాకు శ్రీమద్రామాయణ మునందు మహాప్రీతి. నిజానికి రామాయణప్రీతి లేనివారెవ రుంటారు? ఏదైనా ఋషిప్రోక్త రామాయణమును ఆంధ్రీకరించా లని మాకొక గాఢాభిలాష ఉండేది. పూజ్యశ్రీ శుద్ధచైతన్య స్వాములవా రొకసారి, తులసీరామాయణం మహాభక్తిరసమయమని తెలిపి దానిని ఆంధ్రీ కరింప ప్రేరేపించారు. తదుపరి శ్రీ కర్ప్వారపు రామకృష్ణమూర్తిగారు తులసీరామాయణ మును యథాతథంగా, మూలప్రతిబింబంగా, ప్రమాణప్రాయంగా సులభసుందరంగా, అనువ దించవలసినదిగా ఒకనాడు ప్రసంగవశమున ప్రేరణచేశారు. ఉభయులప్రేరణ రామలక్ష్మ ణులప్రేరణవలె మాకు తోచింది. భక్తి శాస్త్ర మైన,సర్వయోగసమన్వయాత్మకమైన సర్వశ్రుతి స్మృతిసారమైన, కలిమలహరమైన, శ్రీతులసీదాస భగవానుని హిందీ, "రామచరితమానస" కృతిని, శ్రీమట్టపల్లి లక్ష్మీనృసింహాంకితంగా మంజరీద్విపదకావ్యంగా ఆంధ్రీకరింప నుద్యమిం చాము. హిందీ మూలానువాదమునకు గోరఖ్‌పూర్ గీతాప్రెస్సువారి ఆంగ్లానువాద మును. ఆధారంగా తీసికొన్నాము. ఇంతవరకు వచ్చిన వివిధానువాదములనుగూడా సమీక్షిం చాము. మూలకృతియందలి శాబ్దిక సౌకుమా ర్యము భావసౌందర్యము ఉక్తివైచిత్ర్యము, స్వచ్ఛత, గాంభీర్యము, భక్తిరసమాధురి- మొద లైన సర్వశోభావిశేషాలను సమగ్రంగా ప్రతి బింబింపచేయడానికి ఈశ్వరదత్తమైనశక్తిని వినియోగించాము. మూలసౌందర్యమును సర్వ విధాల ప్రతిబింబితం చేయడానికి ప్రధానంగా మంజరీద్విపదచందస్సులో అనుకృతి నడుప బడింది. బాలకాండలోని అవతారిక పద్యాలలో రచించాము. అక్కడక్కడగలస్తోత్రాదులు గేయ ములుగా వ్రాశాము. ఇదిగేయపాఠ్యమధురమై, పండితపామరరంజకమై, ప్రకాశించవలె నని మా ఆశయం. ఈ బృహద్రామాయణరచనాధ్వ రంలో, సుందరయుద్ధోత్తరకాండలు అనువదించి సమర్పించడంద్వారా ఆత్మీయులు శ్రీపాటీలు తిమ్మారెడ్డి, కిశోర్ యం. ఏ. గారు ఎంతో తోడ్పడ్డారు. బ్ర॥ శ్రీ॥ చతుర్వేదుల అమరేశ్వర శాస్త్రిగారు, శ్రీ పశర్ల పాటి వాసుదేవశాస్త్రి గారు, శ్రీ వావిలాల సోమయాజులుగారు, శ్రీ మంచికంటి వేంకటేశ్వరరావుగారు ఈగ్రంథ పరిష్కరణ కార్యాదులలో అనల్పసేవచేశారు. పూజ్యశ్రీ శుద్ధచైతన్యస్వాములవారు, పూజ్యశ్రీ తపస్యానందస్వాములవారు - తమసలహాలతో సర్వవిధాల ఉపకరించారు. మహాపండితు లనే కులు కోరినంతనే పీఠికాదులు, అభిప్రాయాదులు పంపి ఈరామాయణావతరణయజ్ఞానికి మహో త్తేజం కలిగించారు. శ్రీ వెల్‌కంప్రెస్ (ప్రైవేట్ లిమిటెడ్, గుంటూరు) వారు, ఈ ఉద్గ్రంథ మును సకాలంలో సౌందర్యవంతంగా, సక్ర మంగా. ముద్రణచేసి, సంతృప్తిగూర్చారు. ఆంత రంగికభక్తులనేకులు తమతమవిధానాలలో రామ సేవలో పాల్గొన్నారు. వారందరకు కృతజ్ఞులం.

భగవాను డందరకు సర్వశుభశ్రేయఃప్రదుడగు గాక! మహావదాన్య స్వరూపులు శ్రీరామ చరితమానసాంకితమానసులు, అగు శ్రీ కర్వా రపు రామకృష్ణమూర్తి బి. కాం. (ఆనర్సు)గారు అనువాదానికి మమ్ము ప్రేరణంచేయడమేగాక, సప్తకాండములను స్వయంగా ఒక్కరే సాత్విక త్యాగదృష్టితో తమపితృపాదులగు శ్రీ కర్వా రపు సూర్యనారాయణగారి స్మృతిచిహ్నముగ ముద్రణచేయించి, గ్రంథాలను ఆశ్రమానికి సమర్పించి, శ్రీరామకైంకర్యమొనర్చి, జనతా జనార్దనప్రీతి కల్గించారు. శ్రీరామచరితమానస ప్రకాశకులై, ఆంధ్రప్రపంచమునకు అమోఘు సేవచేసిన శ్రీరామకృష్ణమూర్తిగారిని, సకుటుం బముగ, సపరివారముగ, శ్రీరామభగవానుడు అనుగ్రహించుగాక! ఈశ్వరప్రేరితమైన ఈరచన నరనరసింహప్రీతికరమై ప్రకాశిస్తుందిగాక!

ఈ రామచరితమానసం మానవకోటిలోని మాధవతేజమును జాగరితంచేయడంలో మహోన్నతసాధనంగా ఉపకరిస్తుంది గాక! ఈ మహాకృతిలోని దివ్యోన్నతవిషయాలను వివరించడానికి ఒకవిపులవ్యాఖ్యానంకూడా అవసరం. శ్రీరామానుగ్రహం అనుకూలిస్తే, ఉత్తరోత్తర, విపులవ్యాఖ్యానంకూడా విరచించి ప్రకటిస్తాము.

మన రామాయణావతరణయజ్ఞం మంగళాంతమైంది. ఇంక అవబృధస్నానం చేద్దాము. ఇదిగో శ్రీరామచరితమానస సరస్సు! ఋత్విక్కులార! మహాజనులార! లేలెండి!

ఓంతత్ సత్.

శ్రీరామతీర్థసేవాశ్రమం,
పిడుగురాల, 24-6-1963

శ్రీ కేశవతీర్థ స్వామి.



శ్రీరామచరిత మానసావతరణ మహాయజ్ఞ నిర్వాహకులు :

శ్రీ కర్ప్వారపు సీతమ్మ రామకృష్ణమూర్తి పుణ్యదంపతులు

106(b)

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీ రా మా ను గ్ర హ సం సి ద్ధి ర స్తు

శ్రీరామచరణరాజీవసద్భక్తః
పరమపావనధర్మభావసంయుక్తః
పృథుయజ్ఞశీలపవిత్రచరిత్రః
కర్పూరసద్వంశకంధిశాంకః
సుగుణసీతాంబికాసూర్యనారాయ
ణశ్రేష్ఠితనయః పుణ్యస్థిరనిలయ!
శ్రీవేంకటప్పయ్యశ్రేష్ఠివతంస-
వేంకటనారాయణాంకితనామ-
సజ్జనసోదరాః సౌజన్యమూర్తిః
మహితసీతాసతీమానసవర్తిః
శ్రీ రామకృష్ణమూర్తిః ఘనకీర్తిః
జనతాజనార్దనసంప్రీతికొఱకు-
భవదీయపితృభక్తిఁబ్రకటించుకొఱకు-
కేశవతిమ్మకవీశకృతాంధ్ర
తులసిరామాయణలలితకావ్యంబు
ఘనముగ ముద్రణఁగావించి భక్తి
రామకైంకర్యంబు రాజితరీతిఁ
గావించి ధన్యతఁగాంచితి వనఘ!
సర్వాంధ్రలోకంబు సంతరియించు
దివ్యాధ్వరముఁజేసి దేదీప్యమాన
గురుయశఃకాంతి దిక్కుల నింపినావు!
సకుటుంబముగ రామచంద్రునిగృపకుఁ
బాత్రుడవై సర్వభద్రంబు లొంది
సచ్చిదానందంబు సర్వదా కలిగి
వర్ధిల్లుదువుగాక! వసుధ, పుణ్యాత్మ!

ఓం! ఓం!! ఓం!!!

శ్రీ కేశవతీర్థస్వామి

శ్రీ కర్ప్ూరపు సీతమ్మ శ్రీరామకృష్ణమూర్తి దివ్యదంపతుల పుణ్యగర్భమున
జన్మించి, నవ్వులపువ్వులను నలుదిశల వెదజిమ్ముచు నవజీవనక్రీడ
సలిపి, చిన్నతనముననే శ్రీసాకేతలోకమున కేగిన చిట్టితల్లి—

శ్రీ యుగంధరలక్ష్మి

స్మృతిచిహ్నముగ శ్రీరామచరితమానసము ప్రకటితము.

(91801

జయజయ శ్రీనారసింహ

శ్రీ రా మ చ రి త మా న స ము

వి ష య సూ చి క :

బాలకాండము

		పుట
1	తీర్థీయప్రార్థనాదికము	1
2	కృతిసమర్పణము	5
3	మంగళాచరణము	6
4	సజ్జనవందనము	8
5	దుర్జనవందనము	10
6	సజ్జనదుర్జనవందనము	11
7	కవివందనము	19
8	అయోధ్యాదివందనము	22
9	శ్రీరామనామప్రభావము	24
10	శ్రీరాముని ఔదార్యము	30
11	శ్రీరామచరితమానసమాహాత్మ్యము	32
12	శ్రీమానససరోవరస్వరూపము	35
13	శ్రీరామచరితమానసస్వరూపము	37
14	సరయూనదీస్వరూపము	41
15	ప్రయాగక్షేత్రము : యాజ్ఞవల్క్య భరద్వాజమహర్షుల సంవాదము	44
16	శ్రీసతీదేవిమోహవృత్తాంతము	46
17	శ్రీరామప్రభావప్రకటనము– సతీదేవిపశ్చాత్తాపము	49
18	శివుఁడు సతీదేవిని బరిత్యజించుట– సతీవిషాదము	50
19	సతీశరీరపరిత్యాగము– దక్షయజ్ఞధ్వంసనము	53
20	పార్వతీజననతపశ్చర్యాదివృత్తాంతము	55
21	సప్తమహర్షులు పార్వతీదేవిలోని శివప్రణయమును బరీక్షించుట	61
22	మన్మథవిజృంభణము	64
23	మన్మథదహనము	66
24	రతీవిలాపము : శివానుగ్రహము	67
25	పార్వతీశివకల్యాణమునకు దేవతలప్రార్థన	67
26	శివపార్వతీపరిణయము	69
27	పార్వతీశివుల సంవాదము	79
28	శ్రీరామావతారకారణములు	87
29	నారదునిగర్వము : శ్రీహరిమాయా ప్రభావము	89
30	నారదుఁడు శివదూతలను, శ్రీహరిని శపించుట	94
31	శ్రీస్వాయంభువమనురాజర్షిచరిత్రము	97
32	ప్రతాపభానుచరిత్రము	104
33	రావణకుంభకర్ణాదిరాక్షసుల జన్మతపశ్చర్యాదివృత్తాంతము	115
34	రావణాదుల దౌర్జన్యములు	117
35	భూదేవి దేవతలతో మొఱపెట్టుకొనుట	121
36	బ్రహ్మదేవకృత– శ్రీహరిస్తవము	122
37	శ్రీమన్నారాయణుని యభయ ప్రదానము	123
38	శ్రీదశరథమహారాజచరిత్ర– పుత్రకామేష్టి	124

పుట

39 శ్రీరామజననము-బాల్యలీలలు 125
40 యజ్ఞరక్షణార్థము విశ్వామిత్రమహర్షి రామలక్ష్మణులను దనవెంటఁదీసికొని పోవుట 133
41 విశ్వామిత్రయజ్ఞసంరక్షణము 136
42 అహల్యాశాపవిమోచనము 136
43 అహల్యాకృత-శ్రీరామస్తవము 137
44 శ్రీరామలక్ష్మణులను సందర్శించి జనక మహారాజు ప్రేమపరవశుఁడగుట 139
45 శ్రీరామలక్ష్మణులు జనకపురమును జూడనేగుట 141
46 జనకోద్యానవనములో సీతారాముల పరస్పరసంవీక్షణము 145
47 సీతాకృతగౌరీస్తవము 149
48 శ్రీరామలక్ష్మణుల పరస్పర సంభాషణము 151
49 విశ్వామిత్రమహర్షి రామలక్ష్మణులతో ధనుర్యజ్ఞశాల కేగుట 153
50 సీతాదేవి స్వయంవరసభామండపము ప్రవేశించుట 156
51 రాజుల యపజయము 158
52 జనకుని నిరాశాప్రకటనము 159
53 లక్ష్మణుని యుగ్రహము-ప్రతిజ్ఞ 159
54 శ్రీరాముడు శివధనుర్భంగముచేయుట 160
55 సీత, శ్రీరాముని గళమున జయమాల గీలించుట 164
56 పరశురామాగమనము-శ్రీరామ విజయము 167
57 పరశురామకృతరామస్తవము 176
58 జనకరాజు దశరథునకు శుభలేఖ నంపుట, మిథిలాపురశృంగారము 177

పుట

59 జనకదూతలు శుభలేఖ నిచ్చుట-దశరథుని మహానందవిశేషము 178
60 దశరథమహారాజు సపరివారముగ మిథిలానగరమునకుఁ దరలుట 182
61 జనకాదులు దశరథాదులకు స్వాగత మొసఁగుట 185
62 రామలక్ష్మణులు తండ్రిని గలియుట 187
63 సీతారామకల్యాణమహోత్సవము 190
64 లక్ష్మణభరతశత్రుఘ్నులవివాహములు 194
65 దశరథాదులు సపరివారముగ నయోధ్యకుఁ దరలుట 201
66 జనకరాజర్షికృత శ్రీరామస్తవము 210
67 రామాదులు అయోధ్యాపురప్రవేశ మహోత్సవము 214
68 విశ్వామిత్రమహర్షి వీడ్కోలు 218
69 రామాయణశ్రవణ, పఠనమాహాత్మ్యము 221

అయోధ్యాకాండము

70 కథాప్రారంభము 226
71 దశరథుఁడు శ్రీరాముని యువరాజ్య పట్టాభిషిక్తుం జేయఁదలపెట్టుట 226
72 వసిష్ఠమహర్షి శ్రీరాముని యువ రాజ్యాభిషిక్తుం జేయనంగీకరించుట 227
73 దశరథుడు మంత్రులకు అభిషేక సంభారంబుల సమకూర్ప నాజ్ఞాపించుట 228
74 దశరథుఁడు వసిష్ఠమహర్షిని శ్రీరాము నొద్దకు పంపుట 229
75 శ్రీరామపట్టాభిషేకమును విఘ్న మొనర్పుమని దేవతలు సరస్వతిని ప్రార్థించుట 231

పుట

76 మంథర శ్రీరామపట్టాభిషేకమును విఘ్న మొనర్పఁ దలఁచుట 233
77 కైతవోక్తులచే మంథరకై కేయి బుద్ధిని ద్రిప్పుట 234
78 కై కేయి మంథరకపటోక్తులను విశ్వసించుట 235
79 మంథర కైకకు భరతపట్టాభిషేకము, రామవనవాసము ననుఁ రెండువరములు కోరుకొమ్మని ప్రబోధించుట 238
80 కై కేయి కోపగృహమున శయనించుట 238
81 శ్రీరాముఁడు తనబాల్యమిత్రుల నాదరించి పంపుట 239
82 కోపగృహమునన్నున్న కైకను దశరథుఁ డనునయించుట 240
83 కైక కోరినవరము లిత్తునని దశరథుఁడు శపథముచేయుట 242
84 కై కేయి భరతపట్టాభిషేకము శ్రీరామ వనవాసము ననురెండు వరములు కోరుట 242
85 దశరథుఁడు భరతపట్టాభిషేకంబు నంగీకరించి శ్రీరామవనవాసము సమంజసము కాదని కైకనర్థించుట 244
86 శ్రీరామవనవాసమున కంగీకరింపనిచో మరణింతునని కైక నిష్ఠురోక్తు లాడుట 245
87 కై కేయిగృహము నందున్న దశరథుని కడకు పౌరులు సుమంత్రుని బంపుట 248
88 సుమంత్రుఁడు కై కేయి గృహము నకు శ్రీరాముఁ దోడ్కొనివచ్చుట 249
89 కైక దశరథుని వైకల్యకారణము శ్రీరామునికిఁ దెల్పుట 249

పుట

90 శ్రీరాముఁడు కౌసల్యసన్నిధి కరుగుట 255
91 శ్రీరాముఁడు వనవాసమున కాజ్ఞ యిమ్మని కౌసల్యను గోరుట 257
92 శ్రీరామసహచరుఁడగు సుమంత్ర కుమారుఁడు జరిగిన వృత్తాంతముఁ గౌసల్యకు విన్నవించుట 257
93 శ్రీరాముఁడు సీతకు వనవాస కష్టములఁ బేర్కొనుట 261
94 సీత తన్ను వనమునకుఁ గొనిపొమ్మని కోరుట 263
95 శ్రీరాముఁడు సీతను తనవెంటఁ గొనిపోవ సమ్మతించుట 264
96 వ్యాకులచిత్తుఁడై నిల్చున్న లక్ష్మణుని శ్రీరాముఁ డోదార్చుట 266
97 శ్రీరాముఁడు లక్ష్మణుని దనవెంటఁ గొనిపోవ సమ్మతించుట 267
98 శ్రీరాముఁడు వసిష్ఠాదులకు నమస్కరించి సీతాలక్ష్మణులతో వనప్రయాణ మొనర్చుట 271
99 సీతారామలక్ష్మణులు రథము నారోహించి తమసానదీతీరమున కేగి విడియుట 272
100 సీతారామలక్ష్మణులు గంగాతీరమున విడియుట 275
101 గుహుఁడు సీతారామలక్ష్మణులకడ కేతెంచుట 275
102 శ్రీరామలక్ష్మణులు మట్టిపాలతో జడలుదాల్చుట 278
103 సుమంత్రుఁడు రథమును మఱల్చు కొని యయోధ్య కేగుట 281

పుట

104 నావికుఁడు సీతారామలక్ష్మణులను గంగదాటించుట 281
105 సీతారాములు గంగనుఁబ్రార్థించుట 284
106 గంగ సీతను బ్రశంసించి దీవించుట 285
107 శ్రీరాముఁడు గుహుని దనవెంటఁ గొనిపోవ నంగీకరించుట 285
108 శ్రీరాముఁడు సీతాలక్ష్మణగుహులతో బ్రయాగకుఁ జేరుట 285
109 శ్రీరాముఁడు త్రివేణీస్నాన మొనర్చి భరద్వాజాశ్రమంబుఁ జేరుట 286
110 సీతారామలక్ష్మణులు గుహునితో వాల్మీకాశ్రమంబు ప్రవేశించుట 295
111 శ్రీవాల్మీకిమహర్షికృతశ్రీరామస్తవము 298
112 వాల్మీకి శ్రీరామసంవాదము 299
113 వాల్మీకి శ్రీరామునితో జిత్రకూటాద్రి నివాసయోగ్యంబని వక్కాణించుట 301
114 కోలకిరాతవేషధారులగు వేల్పులుతృణ పర్ణాత్మకములగు రెండుశాలలు నిర్మించుట 302
115 శ్రీరాముఁడు సీతాలక్ష్మణసమేతుఁడై పర్ణశాలలో నివసించుట 302
116 కోలకిరాకృతశ్రీరామస్తవము 303
117 కౌసల్యగృహమునందు శ్రీరామ వియోగదుఃఖితుఁడైయున్న దశరథుని సుమంత్రుఁడు చూచుట 310
118 రామవియోగార్తుఁడగు దశరథుని గూర్చి సుమంత్రుఁడు దుఃఖోపశమ నోక్తులు పలుకుట 311
119 సుమంత్రుఁడు దశరథునితో శ్రీరామ వనప్రయాణవృత్తాంతంబుఁ జెప్పుట 311

పుట

120 కౌసల్యాదశరథునితో ధైర్యవాక్యములు పలుకుట 313
121 అంధతపస్విశాపమును దశరథుఁడు కౌసల్యకుఁ జెప్పి రాముని స్మరించుచు స్వర్గమునలంకరించుట 314
122 దశరథకళేబరమును తైలద్రోణియందు భద్రపఱచుట 315
123 భరతాగమనము 316
124 భరతుఁడు కైకేయిని బిత్రుమరణ కారణం బడుగుట 317
125 శ్రీరామవనవాసవార్త విని భరతుఁడు మూర్ఛిల్లుట 317
126 భరతుఁడు కైకపై గోపించినిందించుట 318
127 శత్రుఘ్నుఁడు మంథరమూఁపుపైఁ దన్నుట 319
128 భరతుఁడు దశరథునికి దహనాదిక్రియ లొనర్చుట 322
129 భరతుఁడు శ్రీరాముని దోడ్తెచ్చుటకుఁ బ్రయాణసన్నాహం బొనర్చుట 330
130 భరతుఁడు సపరివారముగఁ శ్రీరాముని కడకు బయనించుట 332
131 భరతుఁడు సపరివారముగ శృంగిబేర పురము నొద్దకు జేరుట 333
132 గుహుఁడు భరతురాకనుగూర్చి వితర్కించుట 333
133 గుహుఁడు తనసైనికులకు భరతునిపై దండెత్త నాజ్ఞాపించుట 333
134 గుహుఁడు కానుకలుగొని భరతుని చెంతకేగుట 335
135 భరతుఁడు గుహుని సత్కరించుట 336
136 రామనామమహిమానువర్ణనము 336

పుట

137 భరతుఁడు భరద్వాజాశ్రమమునకుఁ బోవుట 344
138 దేవేంద్రుఁడు రామభరతసమాగమమునకంతరాయముగల్పింపబృహస్పతినిఁ బ్రార్థించుట 350
139 బృహస్పతి శ్రీరామప్రభావమునుగ్గడించి దేవేందు్ర బుద్ధిని మఱిల్చుట 350
140 భరతుఁడు సపరివారముగ యమునానదిని దర్శించుట 351
141 చిత్రకూటసందర్శనము 354
142 జానకీస్వప్నవృత్తాంతము 355
143 శ్రీరాముఁడు భరతాగమనంబు నాకర్ణించితనలోఁదానువితర్కించుకొనుట 356
144 లక్ష్మణుఁడు శ్రీరాముని తోఁ భరతునిఁ గూర్చి పరుషోక్తులాడుట 356
145 అశరీరవాణి 358
146 శ్రీరాముఁడు భరతభక్తిప్రాశస్త్యమునుగ్గడించుట 358
147 భరతుని సీతారామాశ్రమవన ప్రవేశము 360
148 సీతారామాశ్రమవనవర్ణనము 360
149 తాపసివేషధారులైయున్న సీతారామలక్ష్మణులను భరతుఁడు సందర్శించుట 363
150 శ్రీరామలక్ష్మణభరతశత్రుఘ్నులపరస్పరానురాగప్రదర్శనము 363
151 శ్రీరాముఁడు మృతుఁడైన తండ్రి కౌర్ధ్వదైహికక్రియ లొనర్చుట 368
152 మహాసభలో వసిష్ఠమహాముని ప్రసంగించుట 371
153 వసిష్ఠమహాముని పరితపించుచున్నభరతునోదార్చుట 377
154 శ్రీరాముఁడు భరతు నోదార్చుట 377
155 జనకరాజేంద్రుని దూతలు వచ్చి జనకరాజేంద్రు నాగమనంబుఁ దెల్పుట 380
156 శ్రీరామచంద్రుఁడు జనకరాజర్షికి స్వాగత మొసఁగుట 383
157 జనకపత్నియగు సునయన మొదలగు వారిని గౌసల్య సత్కరించుట 387
158 సునయన కౌసల్య నోదార్చుట 388
159 సునయన కౌసల్య యనుమతిఁగొని సీతాదేవినిఁదమబసకుఁ గొనిపోవుట 389
160 జనకమహారాజు భరతునిగూర్చి పరిశంసించుట 391
161 శ్రీరామభరతసంవాదము 400
162 భరతుఁ డయోధ్య కేగుటకు శ్రీరామునిఁ బెలవుగోరుట 405
163 భరతునభిప్రాయంబెఱింగి శ్రీరాముఁడు తనపాదుక లిచ్చుట 407
164 భరతశత్రుఘ్నులు శ్రీరామాజ్ఞఁ గైకొని అయోధ్యకుఁ బయనించుట 408
165 శ్రీరామపాదుకాపట్టాభిషేకము 411
166 భరతుఁడు నందిగ్రామముననివసించుట 411
167 భరతకథాశ్రవణఫలశ్రుతి 413

అరణ్యకాండము

168 కథాప్రారంభము 417
169 కాకరూపుఁడగు జయంతుఁడు సీతాపాదమును బొడిచి పీడించుట 418
170 శ్రీరాముఁడు కాకముపై బ్రహ్మాస్త్రము నభిమంత్రించి విడుచుట 418
171 సీతారామలక్ష్మణు లత్రిమున్యాశ్రమమున కేగుట 419

		పుట
172	అత్రిమహర్షికృత శ్రీరామ స్తవము	420
173	అనసూయ సీతాదేవికిఁ బతివ్రతా ధర్మములు బోధించుట	420
174	విరాధవధ	423
175	సీతారామలక్ష్మణులు శరభంగా శ్రమమున కేగుట	423
176	శ్రీరాముఁ డసురనిర్మూలన మొనర్తు ననిప్రతిజ్ఞఁ జేయుట	424
177	సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణాశ్ర మమునకుఁ జేరుట	425
178	సుతీక్ష్ణకృత శ్రీరామ స్తవము	426
179	సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణునితో గలసి అగస్త్యాశ్రమమునకుఁ బోవుట	427
180	శ్రీరామగీత	430
181	శూర్పణఖ రామలక్ష్మణుల వద్దకు వచ్చుట	432
182	లక్ష్మణుఁడు శూర్పణఖ ముక్కు చెవులు గోయుట	433
183	ఖరదూషణాదులు యుద్ధసన్నద్ధులై రామునికడకు వచ్చుట	433
184	శూర్పణఖ రావణాసురునికడ కేగి తనపరాభమునుఁ దెలుపుట	438
185	రావణుని విచారము	439
186	రావణాసురుఁడు మారీచుని యొద్ద కేతెంచుట	440
187	శ్రీరామునితో వైరమువలదని మారీచుఁడు రావణునికి హితోపదేశము చేయుట	440
188	మారీచుండు మాయామృగరూపము ధరించి పంచవటీప్రాంతమున సంచరించుట	442
189	సీత మాయామృగమును వధించి తెమ్మని శ్రీరాము నర్థించుట	442
190	శ్రీరాముఁడు మాయమృగరూపధారి యగు మారీచునివధించుట	442
191	సీత సౌమిత్రిని శ్రీరాముకడ కేగు మని ప్రేరేపించుట	443
192	రావణుఁడు యతివేషమున పర్ణశాల కేతెంచుట	443
193	రావణుఁడు సీతనపహరించుట	444
194	జటాయువు రావణాసురు నెదుర్కొనుట	444
195	రావణుఁడు జానకిని అశోకవనమున నుంచుట	445
196	శ్రీరాముఁడు సీతావిరహితమగు పర్ణశాలంజూచి కలవరపడుట	445
197	శ్రీరాముఁడు పరితపించుచు సీత నన్వేషించుట	446
198	రామలక్ష్మణులు నెత్తుటఁ దోగియున్న జటాయువుం గనుట	447
199	జటాయు మోక్షము	448
200	జటాయుకృత శ్రీరామ స్తవము	449
201	శ్రీరాముఁడు జటాయువున కంత్య క్రియ లొనర్చుట	449
202	కబంధసంహారము	450
203	శ్రీరాముఁడు కబంధునికి బ్రాహ్మణ సేవాప్రాశస్త్యంబుఁ దెల్పుట	450
204	శ్రీరామలక్ష్మణులు శబర్యాశ్రమము జేరుట	450
205	శ్రీరాముఁడు శబరి సమర్పించిన పండ్లారగించుట	451

పుట

206 శ్రీరాముఁడు శబరికి నవధా భక్తి తత్వ ముపదేశించుట 451
207 శబరీమోక్షము 452
208 పంపాసరోవరాభివర్ణనము 454
209 నారదమహర్షి శ్రీరామదర్శనార్థము వచ్చుట 455
210 శ్రీరాముఁడు నారదమునికి భక్తలక్షణంబులు సెప్పుట 457

కిష్కింధాకాండము

211 కథాప్రారంభము 463
212 సుగ్రీవుఁడు రామలక్ష్మణులకడ కాంజనేయునిఁ బంపుట 464
213 శ్రీరామాంజనేయుల సంభాషణము 464
214 రామసుగ్రీవుల మైత్రి 466
215 సుగ్రీవుఁడు శ్రీరామునకు స్వీయ చరితముఁ జెప్పుట 466
216 శ్రీరాముఁడు సుగ్రీవునకు మిత్ర భావంబు బోధించుట 468
217 సుగ్రీవుఁడు శ్రీరామపరాక్రమముఁ బరీక్షించుట 468
218 వాలిసుగ్రీవుల యుద్ధము 470
219 శ్రీరాముఁడు వాలిని వధించుట 470
220 వాలి శ్రీరాముని స్తుతించుట 471
221 వాలికి మోక్షప్రాప్తి 471
222 భర్తృవియోగదుఃఖితయగు తారను శ్రీరాముఁ డోదార్చుట 472
223 వర్షర్తువర్ణనము 474
224 శరద్ఋతువర్ణనము 475

పుట

225 సుగ్రీవు నాజ్ఞచే హనుమంతుఁడు వివిధప్రదేశములందున్న వానరుల కొఱకు దూతలను బంపుట 477
226 లక్ష్మణుఁడు వానరులను భయపెట్టుట 477
227 సుగ్రీవునిపంపున హనుమంతుఁడు తారతోఁ నేగి సౌమిత్రిని గొని తెచ్చుట 477
228 సుగ్రీవుఁడు శ్రీరామునిఁ బ్రసన్నుని జేసికొనుట 478
229 శ్రీరాముఁడు సుగ్రీవు నాదరించుట 478
230 నలుదిక్కులనుండి వానరసైన్యము లరుదెంచుట 478
231 సుగ్రీవాజ్ఞ 478
232 సుగ్రీవుఁడు హనుమంతాదుల దక్షిణ దిశ కంపుట 479
233 హనుమత్ప్రముఖులగు వానరులు గుహలోఁ బ్రవేశించి స్వయంప్రభను దర్శించుట 481
234 స్వయంప్రభ శ్రీరాముని దర్శించి బదరికాశ్రమమున కేగుట 481
235 అంగదుఁడు సీతాదర్శననిరాశుఁడై పరితపించుట 482
236 జాంబవంతుఁ డంగదునకు శ్రీరాము మహిమ నుగ్గడించుట 482
237 సంపాతి యను గృధ్రనాయకుఁడు వానరులను సమీపించుట 483
238 సంపాతి వానరులను జటాయు వృత్తాంత మడుగుట 483
239 సంపాతి వానరులకుఁ దనవృత్తాంతము వినిపించుట 484

పుట

240 సంపాతి వానరులకు జానకీవృత్తాంతముఁ దెల్పుట 484
241 సముద్రతరణసమాలోచనము 485
242 జాంబవంతుఁడు హనుమంతుని సముద్ర తరణమునకుఁ బురిగొల్పుట 485
243 హనుమంతుఁడు సముద్రతరణమునకు సముత్సాహుఁడై విజృంభించుట 485

సుందరకాండము

కథాప్రారంభము

244 హనుమంతుఁడు సముద్రోల్లంఘన మొనర్చుట 490
245 లంకానగరవర ణము 492
246 హనుమంతుఁడు లంకిణిని నిర్జించుట 492
247 హనుమంతుని లంకాప్రవేశము : సీతాన్వేషణము 493
248 హనుమద్విభీషణసమాగమము 493
249 హనుమంతుఁ డశోకవనమున సీతను దర్శించుట 494
250 రావణుఁడు సీతయొద్దఁ బ్రలాపించుట 495
251 త్రిజటాస్వప్నవృత్తాంతము 496
252 సీతాత్రిజటల సంభాషణము 496
253 సీతాహనుమత్సంవాదము 496
254 అశోకవనవిధ్వంసము, అక్షయాది రాక్షసహననము 500
255 ఇంద్రజిత్తుచే హనుమ బంధింపంబడుట 500
256 హనుమదాగ్నివణసంవాదము 501
257 లంకాదహనము 503
258 హనుమంతుఁడు మఱలి శ్రీరాముని కడకేగ సీతా దేవికడ సెలవొందుట 504

పుట

259 హనుమంతుఁ డంగదాదులఁ గూడుట, వానరులు మధువనమున విహరించుట 505
260 సుగ్రీవవానరసమాగమము 505
261 శ్రీరామహనుమత్ప్రసంగము 506
262 శ్రీరాముఁడు వానరసేనతో సముద్ర తీరముఁ జేరుట 507
263 మందోదరీరావణసంవాదము 509
264 విభీషణుఁడు హితబోధచేసి రావణునిచేఁ బరాభవింపఁబడుట 509
265 విభీషణుఁడు శ్రీరాము శరణుఁ జొచ్చుట 511
266 శ్రీరాముఁడు విభీషణు ననుగ్ర హించుట 513
267 సముద్రతరణసమాలోచనము, దర్భశయనము 515
268 రావణుని దూతలగు శుకాదులను మన్నించి లక్ష్మణుఁడు రావణునకు సందేశ మంపుట, శుకశాపవి మోచనము 515
269 శ్రీరాముని ఆగ్రహము, సముద్రుని శరణాగతి 518
270 శ్రీరామసంకీర్తనప్రభావము 519

లంకాకాండము

271 కథాప్రారంభము, సేతునిర్మాణము 524
272 శ్రీరామేశ్వరప్రతిష్ఠ 524
273 శ్రీరాముఁడు సేనతో సముద్రముదాటి సువేలాద్రిపై విడియుట 525
274 శ్రీరామాగమనవార్త విని రావణుఁడు విభ్రాంతుఁ డగుట 526

పుట

275 మందోదరి రావణునకు హితము సెప్పుట 526
276 రావణప్రహస్తసంవాదము 527
277 శ్రీరాముఁడు చంద్రోదయము నభివర్ణించుట 529
278 శ్రీరాముఁ డొక్క-బాణముచే రావణుని కిరీటచత్రములు నేలఁ గూల్చుట 530
279 మందోదరి తిరిగి రావణునకు హితము సెప్పి శ్రీరామప్రభావమునుగ్గడించుట 530
280 అంగదరాయబారము 532
281 మందోదరి మఱియొకసారి రావణునకు హితము సెప్పుట 539
282 శ్రీరామాంగదసంభాషణము 540
283 రామరావణసంగ్రామారంభము 541
284 మాల్యవంతుఁడు రావణునకు హితోపదేశ మొనర్చుట 544
285 పునర్యుద్ధప్రారంభము 546
286 ఇంద్రజిల్లక్ష్మణయుద్ధము 547
287 లక్ష్మణమూర్ఛ 548
288 హనుమంతుఁడు సంజీవనికై వెడలుట 548
289 రావణకాలనేముల సంవాదము 548
290 కాలనేమివధ 549
291 భరతశరాహతిచే హనుమంతుఁడు మూర్ఛిల్లుట 550
292 హనుమద్భరత సంవాదము 550
293 శ్రీరాముని విచారము 551
294 హనుమంతుఁడు సంజీవని దెచ్చుట, లక్ష్మణుఁడు మూర్ఛ దేరుట 552
295 రావణుఁడు కుంభకర్ణుని నిద్ర లేపుట– కుంభకర్ణుని హితోపదేశము 550

పుట

296 విభీషణ కుంభకర్ణ సంవాదము 554
297 కుంభకర్ణుఁడు యుద్ధ మొనరించి నిహతుఁడై మోక్షము నొందుట 554
298 మేఘనాదుని యుద్ధము – శ్రీరాముఁడు లీలార్థము నాగపాశబద్ధుఁడగుట 558
299 మేఘనాదుని యజ్ఞము నంగదాదులు భంగ మొనర్చుట, మేఘనాదుని యుద్ధము 559
300 లక్ష్మణుఁడు మేఘనాదుని సంహరించుట 560
301 రావణుఁడు రణమున కేగుట 562
302 శ్రీరాముని విజయరథము 563
303 వానరదైత్యసంగ్రామము 564
304 లక్ష్మణరావణ సంగ్రామము 564
305 రావణుని యజ్ఞమును వానరులు భంగముసేయుట 565
306 రామరావణ సంగ్రామము 566
307 ఇంద్రుఁడు శ్రీరామునకు రథము నంపుట 567
308 విభీషణునిపై రావణుఁడు శక్తిని ప్రయోగింప శ్రీరాముఁ డెదిరించి మూర్ఛిలుట, విభీషణరావణసంగ్రామము 569
309 హనుమద్రావణ యుద్ధము – రావణుని మాయాప్రయోగము 570
310 శ్రీరాముఁడు రావణుని మాయను హరించుట 571
311 ప్రచండయుద్ధమున రావణుఁడు మూర్ఛిల్లుట 571
312 సీతాత్రిజటల సంవాదము 573
313 శ్రీరామరావణుల అంతిమసంగ్రామము 574
314 రావణసంహారము 575

		పుట
315	మందోదరి మొదలగు రాణులు విల పించుట – రావణుని అంత్యక్రియలు	576
316	విభీషణ పట్టాభిషేకము	577
317	హనుమంతుఁడు సీతామాతకడకు శుభవర్తమానము దెచ్చుట – సీతా దేవి రామసన్నిధికి వచ్చుట	578
318	అగ్నిపరీక్ష	579
319	అగ్ని దేవుఁడు సీతాదేవిని శ్రీరాముని కొప్పగించుట	579
320	బ్రహ్మాది దేవతలు శ్రీరాముని స్తుతించుట	580
321	దశరథుఁడు (శ్రీ)రాముని దర్శించి సత్య లోకమున కేగుట	581
322	రామాజ్ఞానుసార మింద్రుఁడు మృత వానరుల పునరుజ్జీవింప జేయుట	581
323	శివకృత శ్రీరామ స్తవము	582
324	విభీషణవినతి	582
325	శ్రీరాముఁడు భరతసమాగమమున కై వేగిరపడుట	583
326	విభీషణుఁడు వానరులను సత్కరించుట	583
327	కొందఱు వానరులు (శ్రీ)రాముని యాజ్ఞానుసారమునిజనివాసముల కేగుట	583
328	సుగ్రీవాంగద హనుమదాది వానర వీరులతో సీతారామలక్ష్మణులు పుష్పక విమానారూఢులై అయో ధ్యకు దరలుట	584
329	ఫలశ్రుతి	585

ఉత్తరకాండము

330	కథాప్రారంభము	589
331	(శ్రీ)రామవిరహార్తుఁడగు భరతునకు శుభశకునములగుట, భరతహాను మత్సమాగమము	590
332	అయోధ్యకు శ్రీరామాగమనము	591
333	శ్రీరామభరతసమాగమము	592
334	శ్రీరామసంయోగమునకుఁ బౌరజనుల మహోత్సాహము	593
335	(శ్రీ)రామపట్టాభిషేకమహోత్సవము	594
336	వేదములు శ్రీరాముని స్తుతించుట	596
337	శివుఁడు శ్రీరాముని స్తోత్రించుట	597
338	శ్రీరామాభిషేక కథాశ్రవణఫలము	598
339	(శ్రీ)రాముఁడు వానరముఖ్యులను సత్కరించి వీడ్కొల్పుట	599
340	రామరాజ్యాభివర్ణనము	601
341	(శ్రీ)రామలక్ష్మణ భరత శత్రుఘ్నులకు పుత్రోదయ మగుట	602
342	(శ్రీ)రామపాలితమైన అయోధ్యాపురి శోభ	602
343	సనకసనందాదులు (శ్రీ)రామదర్శ నార్థము వచ్చుట	605
344	సనకాదికృత (శ్రీ)రామ స్తవము	606
345	(శ్రీ)రాముఁడు సోదరులకు సజ్జన దుర్జన లక్షణముల నెఱింగించుట	606
346	(శ్రీ)రామగీత	609
347	(శ్రీ)రామవసిష్ఠ సంవాదము	610
348	ససోదరుఁడై (శ్రీ)రాముఁడు చూతవన మునకు విహారార్థ మేగుట	611
349	నారదకృత రామకీర్తనము	612
350	శివపార్వతీ సంవాదము	613
351	శివుఁడు పార్వతికి కాకభుశుండి వృత్తాంతము దెల్పుట	614

పుట

352 గరుడుఁడు మోహాధీనుఁడై శివుని
పనుపునఁ గాకభుశుండి నాశ్రయించి
రామకథ వినుట 615

353 కాకభుశుండి గరుడునకు హరిమాయా
ప్రభావము నెఱిగించుట 621

354 కాకభుశుండి తనపూర్వజన్మకథలను
దెల్పుట 622

355 కాకభుశుండి గరుడునకు కలియుగ
ప్రభావము నెఱింగించుట 633

356 కాకభుశుండి యొకజన్మమున గురు
ధిక్కార మొనరించి శివశాపగ్రస్తుఁ
డగుట 637

357 రుద్రాష్టకము 638

పుట

358 గురువు కాకభుశుండిని క్షమింప శివుని
ప్రార్థించుట 639

359 గురుప్రార్థితుఁడై శివుఁడు కాకభుశుండి
ననుగ్రహించుట 639

360 కాకభుండియొక్క తదనంతరకథ 640

361 లోమశమహర్షి కాకభుశుండిని
కాకజన్మమునందుమని శపించి పిదప
ననుగ్రహించుట 641

362 కాకభుశుండి భక్తిజ్ఞానములయొక్క
అభేదమును, భేదమునునిర్వచించుట 645

363 గరుడుఁడు కాకభుశుండిని యేడు
ప్రశ్నలడుగుట, కాకభుశుండి సమా
ధానములు 650

364 భక్తిప్రభావము 655

శ్రీ మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామివారు

122

ఓం

శ్రీ మట్టపల్లి లక్ష్మీ నృసింహ పరబ్రహ్మణే నమః

శ్రీరామచరితమానసము

తీర్థీయ ప్రార్థనాదికము

శ్రీకైవల్యపదంబు జేరుటకునై
సేవించెదన్ భక్త హృ
చ్ఛోకధ్వాంతవిభంగమంగళమహా
ఝంభన్నఖజ్యోతులన్,
శ్రీకాంతా మరమౌనిచిత్తనళినీ
శృంగారభృంగంబులన్.
శ్రీకృష్ణాతట మట్టపల్లి వనల
క్ష్మీనారసింహాంఘ్రులన్.

శా. శ్రీ దైత్యేంద్రకుమారరక్షణకళా
శ్రీభాసమానంబు, ని
ష్ఖేదబ్రహ్మపదానురక్తమునిసం
సేవ్యంబు, సర్వస్థమున్,
వేదారణ్య విహారమున్, బరమగం
భీరంబు, దివ్యంబు, బ్ర
హ్లాదస్వాంతగుహాహితంబు, నరసిం
హబ్రహ్మము న్గొల్చెదన్.

మ. తతగర్వాంధనికాచరాధిపసభా
స్తంభాంతరాళోద్భవున్,
దితిభూనాయక గర్భగోళరుధిరో
ద్దీప్తాంత్రమాలాచయున్,
నతమౌనీశ్వరదేవతానికరనా
నాస్తోత్రకోలాహలున్,
శ్రితరక్షాచణు, మట్టపల్లినృహరిన్
సేవింతు నశ్రాంతమున్.

శా. శ్రీవైకుంఠు, ననంతు, నచ్యుతు, జగ
చ్ఛ్రేయఃప్రదాబ్జేక్షణున్,
దేవాధీశ్వరు, నద్వితీయమహిమున్,
దీనార్తిసంహారకున్,
భావాతీతుని, దైత్యనందనమహా
భక్తిప్రముగ్ధాత్ము, వి
శ్వావాసున్, హరి, మట్టపల్లినరసిం
హస్వామి నర్చించెదన్.

ఉ. శాంతము, దివ్యసుందరము,
శంఖ రథాంగగదాంబుసంభవా
క్రాంతపరాక్రమక్రమవి
రాజితరమ్యచతుర్భుజంబు, శ్రీ
మంతము, శేషభోగమణి
మండితమౌ నరసింహరూపమున్
స్వాంతములో భజించెదను
శాశ్వతనిర్మలభక్తిసిద్ధికై,

చ. మనుజసమూహజీవితము
మాఱు నధర్మకలిప్రభావదు
ర్దనుజనిరంకుశప్రళయ
తాండవవిప్లపదగ్ధదండకా
వనముగ, జ్ఞానవాక్యశర
వర్షముచే ధరఁ గాచినట్టి య
మ్మునివరరామతీర్థగురు
పుంగవుశ్రీచరణంబు లెంచెదన్.

కం. నారాయణమంత్రంబును
గారుణ్యముతోడ నాకుఁ గడుబాల్యమునం
గోరఁగ నిచ్చినదివ్యుని,
ధీరుని శ్రీరామచంద్రదేశికుఁ దలఁతున్.

కం. నరునకు నారాయణునటు
గురువును, హితుఁడౌచు నాకుఁగూర్చుచు మేలున్
వఱలెడు చైతన్యయతుల
చరణములకు సల్పుచుంటి సాష్టాంగనతుల్.

కం. గంగాభంగతరంగిత
పింగళపృథుజటిలుఁ, జంద్రవిలసితమౌళిన్,
మంగళకరు, హరు, జితజని
భంగుని, శ్రీకాళహస్తివాసుని దలఁతున్.

చ. హృదయపుఁ బానవట్టమున
నీశ్వరు నిల్పి సునిశ్చలంబుగా,
సదమలభక్తిబాష్పకణ
జాలముతో నభిషిక్తుఁజేసి, నా
మదియను నేకబిల్వ మిడి
మానక నర్చనఁజేయువాఁడ, నీ
బ్రిదు కను భవ్యభవ్యశివ
రాత్రిని జాగరణంబొనర్చుచున్.

ఉ. వేదసముద్భవామిత ప
విత్రముఖుండు, చరాచరప్రపం
చోదయకార్యనిర్వహణుఁ
డుజ్జ్వల దివ్యకృపాంబురాశి, దా
మోదరనాభినీరజస
ముద్గతభాగ్యవిరాజమానుఁ డ
త్యాదరదృష్టి నా కిడుత
మద్భుతవేదచయప్రబోధమున్.

ఉ. శ్రీగిరిజాకుమారుని, న
శేషమునీంద్ర మనఃప్రచారునిన్,
రాగవిదూరునిన్, స్వజన
రంజను, విఘ్నసమూహభంజనున్
నాగవిభూషణున్, గలుష
నాశను, శ్రీప్రణవైకరూపు, స
ర్వాగమవర్ణితాధిపు, గ
ణాధిపు నెంతు నభీష్టసిద్ధికై.

ఉ. ఆ కవితారసాలశిఖ
రాసనమందున రామరామవాక్
శ్రీ కమనీయమాధురులు
చిందఁ'గుహాకుహూ' గీతిఁ బాడి,తృ
ష్ణాకులజీవకోటికి మ
హామృతదానము చేసినట్టి వా
ల్మీకిపికంబు నెంచెద స
మృద్ధకవిత్వ పటుత్వసిద్ధికై.

ఉ. అంబుదనీలదేహుని, శ
రాసనబాణకృపాణపాణి, పు
ల్లాంబుజనేత్రునిన్, ధృతజ
టాంచితు, లక్ష్మణజానకీసమే

తంబుగ దండకావనప
థంబుల నేగెడు రామచంద్రు స్వాం
తంబున సంస్మరించెద స
తంబును నిశ్చలభ క్తినిష్ఠతో.

చ. అతులవిరాగపర్వతము
నందలి, జ్ఞానమహావనంబులో
సతతము రామనామమధు
సారముఁ ద్రావుచుఁ దాండవించు మా
రుతికి, బృహత్ప్రభావునకు,
రూక్షపరాక్రమమూ ర్తి కే నమ
స్కృతులను జేసెదన్ ననుఁ
దరింపఁగఁజేయ భవాబ్ధిమగ్ననిన్

ఉ. నాదుమనంబులోన స్మర
ణం బొనరింతును భ క్తి పొంగఁ బ్ర
హ్లాదుని నారదున్ ధ్రువుని,
వ్యాసుని శౌనకు శ్రీశుకున్ నరున్
స్వాదుగుణాఢ్యులన్ మహిత
సంయములౌ సనకాదిమౌనులన్
భేదవిహీనమై వెలుఁగు
విష్ణురతి న్గనఁ గాంక్షసేయుచున్.

కం. పంచమవేదం బనుచుఁ ప్ర
పంచంబున యశముఁగన్న భారతకావ్యం
బంచితముగఁ దెనుఁగునఁ రచి
యించిన కవిమణుల నాత్మ నెంతును భ క్తిన్.

చ. ఘనరచనాసరస్సులము
ఖంబున నీశ్వరభ క్తివాహినుల్
పనిచి తెనుంగుగడ్డపయిఁ
బాఱఁగఁజేసియు జ్ఞానసంపదల్
మన కిడినట్టి పోతనను,
మానితుఁడౌ మన త్యాగయన్, మహా
త్ముని మన గోపనన్, మఱియు
ధూర్జటిముఖ్యుల సంస్మరించెదన్.

కం. తమతమ యుదాత్తరచనల
నమితంబగు మేలుఁగూర్చి యఖిలప్రజకున్
బ్రమద మొసంగిన సత్కవి
సముదాయమునకు నొనర్తు సాష్టాంగనతుల్.

మ. కలయండైన నొనర్ప నేరని మహా
కార్యంబుఁ గైకొంటి, శ్రీ
తులసీదాసులు వ్రాసినట్టి భువన
స్తుత్యప్రశస్తప్రభో
జ్జ్వలరామాయణ మాంధ్రభాషను రచిం
పన్బూనితి న్నేఁడు, నే
నల లక్ష్మీనరసింహపాదయుగళ
ధ్యానైకధైర్యుండనై.

శా. సుగ్రీవాంగదజాంబవంతులు, మహా
శూరుల్, దయావార్ధు, ల
త్యుగ్రాఖండపరాక్రమక్షుభితదై
త్యుల్, రామసేవాక్రియా
వ్యగ్రుల్ తోడ్పడరా, యి దేరిపని, ఆ
హా! వా రిదే నాదు జి
హ్వాగ్రంబందున నిల్చినారు; భయ మే
లా రామకార్యంబులో?

గీ. అమ్మ! ఐంకారమయి! జగదంబ! వాణి!
పార్వతీరమారూపిణీ! పరమశ క్తి!
రమ్ము రావమ్మ భారతీ! రయముగాను
కేశవునిహృద్విపంచికఁగేలఁ గొనుమ!
రామగాథాసుధాధుని కేమి కొదవ!

కం. పలికిన రామాయణమే
పలుకఁగవలె నన్య మేను బలుకఁగ నేలా?
పలుకుల నమృతము చిలుకఁగఁ
బలికెద శ్రీరామచరిత వరశుభభరితన్.

శా. శ్రీమంతం బగు మట్టపల్లివనిలో
శ్రీకృష్ణవేణీతటిన్
నీమంబొప్పఁగ నారసింహుని హృదిన్
నిత్యంబు ధ్యానించుచున్,
భూమానందములోనఁ దేలుచు జగ
త్పూజ్యంబుగా వెల్గు శ్రీ
రామస్వామికథన్ రచింతును బున
ర్జన్మంబు లేకుండగఁన్.

కం. కొలిచెద శంకరుపదములఁ
బలికెద యతిరాజపరమభవ్యయశంబున్,
దలఁతును మధ్వాచార్యుల,
గలిమలసముదాయ మడచి కాచుటకొఱకై,

గీ. రామమోహనరాయల, రామకృష్ణ,
నసమయశు వివేకానందయతివరేణ్యు,
ఆ దయానందు, గాంధీమహాత్ము నెంతు
నంజలి ఘటించియు ననుగ్రహార్థి నగచు.

కం. భరతవసుంధరయందునుఁ
బరదేశములందు జనులఁ బా గొనరింపన్
గరుణ జనించినఋషిగణ
చరణములకు శిరము వంచి సలిపెద నతులన్.

కం. తనదగు రామాయణమును
దెనుఁగున రచియింపఁజేసి తేటపడంగా
నను ధరఁ గృతార్థుఁ జేసిన
ఘనతులసీదాసు పాదకంజము లెంతున్.

కృతిసమర్పణము

★

కం. శ్రీ భూ నీళా విభునకు
శోభాజితకోటికోటిసుమబాణునకున్,
వైభవనిధికిన్, నీరజ
నాభునకున్, మట్టపల్లి నరసింహునకున్.

కం. పద్మాసనునకుఁ, బద్మా
సద్మునకున్, దివ్యశంఖచక్రోరుగదా
పద్మునకుఁ, బాద్మనుతునకుఁ,
బద్మచ్ఛత్రునకు, మట్టపలి నరహరికిన్.

కం. అభయప్రదునకుఁ, గృష్ణా
శుభతీర్థజలాభిషిక్తసుభగపదునకున్.
ద్రిభువనవిభునకు, స్తంభ
ప్రభవునకున్, మహితమట్టపలి నరహరికిన్.

కం. అర్భకచుంబనదానవ
గర్భోద్గతరక్తపానఘనజిహ్వునకున్,
దుర్భరకరుణాశౌర్యా
విర్భూతికి, మట్టపల్లి వీరనృహరికిన్.

కం. రాక్షసవక్షోభేదన
దక్షోద్యద్రూక్షతీక్ష్ణతమనఖరునకున్,
రాక్షసడింభకరక్షా
దీక్షితునకు మట్టపల్లితీర్థ నృహరికిన్.

కం. అనుపమనిజగర్జాహత
దనుజాధిపఘోరఘోరదోర్జన్యునకున్,
మునిసురనరగణలోకా
వనునకు శ్రీమట్టపల్లి వననరహరికిన్.

కం. కేశవయతీశహృదయా
ధీశునకున్, భూతపంచకేశునకు, హృషీ
కేశునకున్, గేశవునకు,
శ్రీశునకున్ మట్టపల్లి శ్రీనరహరికిన్.

కం. ఎవనిని స్వాత్మగ నెఱుఁగుట
భవహార్ధిని దాఁటుచుండుఁ బరమర్షిగణం:
బెవఁ డగుఁ గర్తయు, భోక్తయు,
భవహరుఁ డగునట్టి మట్టపలినరహరికిన్.

కం. అంకిత మొనర్చినాఁడను
శంకను విడి దీని రామచంద్రుచరిత్రన్;
సంకటములు తొలఁగ నృసిం
హాంకముపైఁ గూరుచుండి యానందింపన్.

శ్రీరామచరితమానసము

బాలకాండము

ప్రథమ సోపానము

ప్రథమవిశ్రామము

మంగళాచరణము

గీ. వర్ణసముదాయమున, కర్థవర్గమునకు,
రసములకు, ఛందములకు, భద్రంబులకును
గర్తలైన సరస్వతీగణపతులకు
వందన మొనర్తు భక్తిఁ బ్రప్రథమమందు. 1

గీ. స్వాంతమున నీశ్వరుని సిద్ధజనములైన
నెవరు లేక కనంజాల రించుకేని
నట్టి శ్రద్ధాస్వరూపిణి యైనయుమకు,
భూరివిశ్వాసరూపశంభునకు నతులు. 2

గీ. ఎవనియాశ్రయ మొంది వక్రేందుఁడైన
సర్వవంద్యతఁ గనె, నట్టి జ్ఞానమయుఁడు,
నిత్యుఁడును, శివరూపుఁడై నెగడుగురుని
పాదముల కొనరించెద వందనముల, 3

గీ. భూమిజారామగుణసంఘపుణ్యవనుల
నెపుడుఁ దిరుగుకవీశ-కపీశ్వరులకుఁ
బరమవిజ్ఞానులకుఁ గూర్తు వందనముల
నమితభక్తిసమేతుఁడ నగుచు నేను, 4

కం. సృష్టిస్థితిలయకారిణి!
కష్టాంతకి! అఖిలదివ్యకల్యాణకరీ!
సాష్టాంగనతులు చేసెద
శిష్టావని! రామపత్ని! సీతామాతా! 5

ఉ. ఎవ్వనిమాయకు స్వశము
లీ త్రిజగంబులు దేవతాచయం
బెవ్వనియందు భ్రాంతి జగ
మెల్లను దృశ్యమొ, త్రాటఁబా మటుల్;
ఎవ్వనిపాదనావ యొక
డే శరణంబొ భవాబ్ధి దాఁటఁగా
న వ్వరమూలకారణము,
నాహరి, నీఖని, రాముఁ గొల్చెదన్. 6

గీ. సకలనిగమాగమపురాణసమ్మతమును
రామకథ నితరవిశేషరంజితముగ
స్వాత్మతృప్తికై * దేశీయభాషలోనఁ
దులసి రచియించుచున్నాఁడు లలితరీతి. 7

చ. ఎవని స్మరింపఁ గార్యతతి
యెల్లను దప్పక సిద్ధిఁగాంచునో,
ఎవఁడు గణాధినాయకుఁడొ,
యెవ్వఁడు సుందరసింధురాననుం,

---

* హిందీభాష

శ్రీ గురువందనము

కం. కరుణావరుణాలయుఁడును
నరరూపమునందు వెల్గు నారాయణుఁడున్
వరవాగ్ఘ్రతమోహాం డగు
గురుశుభపాదాంబుజములఁ గొల్తును భ క్తిన్. 12

గీ. సురుచిరంబు, సుగంధము; సుందరమ్ము,
ప్రేమరసరంజితం బయి వెలుఁగుచున్న
శ్రీగురూ త్తమపాదపరాగమునకు
వందనము సల్పుచున్నాఁడ భ క్తితోడ. 13

గీ. శ్రీగురూ త్తమపాదపరాగ, మమృత
మూలికాచారు చూర్ణము, పుణ్యతమము;
అది సమ స్తసంసారరోగాళిఁ బాపి
యమరసుఖముఁ బ్రసాదించు నద్భుతముగ. 14

గీ. పుణ్యకృత్య మనియెడిశంభునిశరీర
మందు విలసిల్లునిర్మల మగువిభూతి,
మంజులసుమంగళానందమాత గాదె
శ్రీగురూ త్తమపాదపరాగకణము ! 15

గీ. మనుజమానసచారుదర్పణమలంబు
హరణ మొనరించు సద్గురుచరణధూళి
తద్ఘనపరాగతిలకసంధారణంబు
సకలసద్గుణమణుల వశ్యంబొనర్చు. 16

కం. గురుపదనఖమణికాంతుల
స్మరియించు నెవండు వానిమానససీమన్
బరమాత్మదృష్టి కలుగును
దరమా గురుమహిమ నెన్న ధాతకునైనన్? 17

కం. గురుపదనఖమణిసుప్రభ
తఱుఁగనియజ్ఞానతమము ధ్వంసము సేయున్
డెవఁ డురుబుద్ధిరాశి యగు,
నెవ్వఁడు మంగళసద్గుణాబ్ధి, యా
శివసుతుఁడౌ వినాయకుని
శ్రీకృప నాకు లభించుఁగావుతన్ ! 8

చ. పలుకులు రానిమూఁగ ఘన
వక్తగ మాఱును, బిచ్చుకుంటు తాఁ
జలమున దుర్గమోగ్రగిరి
సంఘము దాఁటు, నెవానిసత్కృపా
బలమున నాజనార్దనుఁ డ
పారకృపారససాగరుండు, దు
ష్కలిమలహారి, శ్రీహరి, ప్ర
సన్నతఁ జూపునుగాక నాయెడన్. 9

ఉ. నీలసరోరుహోపమ వి
నీలతనుండు, నవారుణాబ్జశో
భాలయసత్కృపారసమ
యామలకోమలసుందరాక్షుఁ, డా
పాలసముద్రమందు మణి
భాసితపన్నగతల్పశాయియై
క్రాలురమాధినాథుఁడు, స్థి
రంబుగ నా మదిలోన నిల్చుతన్. 10

శా. కుందేందూపమదివ్యదేహుఁడు, నిజ
క్రోధాగ్నికీలావళీ
సందగ్ధాత్మభవుండు, దీనజనర
క్షాదక్షుఁ, డత్యద్భుతా
నందామందమహానటుండు, గిరిజా
నాథుండు, శంభుండు నా
యందు న్గూర్చునుగాక సంతతము ది
వ్యానుగ్రహశ్రీతతుల్. 11

గురుపదనఖసందీపిత
వరహృదయుఁడె భాగ్యశాలి ప్రజలందెల్లన్. 18

కం. శ్రీగురుపదనఖమణిరుచి
బాగుగ వికసింపజేయుఁ బ్రజ్ఞాదృష్టిన్
బోఁగొటును భవగాఢని
శాగతదోషముల దారుణానర్థతతిన్. 19

గీ. మహితరామకథామణుల్ మౌక్తికములు
వ్యక్తముగఁ గొన్ని, కొన్ని యవ్యక్తముగను
వెలుగుచున్నవి, అవి యున్నస్థలముఁ దెలియు
భవ్యగురుపాదనఖమణిప్రభలవలన. 20

గీ, అరయసాధకులును సిద్ధు లక్షులందు
నలఁది సిద్ధాంజనము పర్వతాటవులను
క్ష్మాతలంబునఁ బెన్నిధుల్ గాంచినట్లు
హరికథాతతి గురుకృప నరయఁగలము. 21

కం. గురుపదరజ మనుమంజుల
కరఘనసిద్ధాంజనంబు కన్నుల సోఁకన్
బరుగిడు దృగ్దోషంబులు,
నిరుపమ మగుజ్ఞానదృష్టి నెగడు సతంబున్. 22

ఉ. అట్టి గురూత్తమాంఘ్రియుగ
శాబ్జపరాగమహాంజనంబు చే
పట్టి, వివేకనేత్రమును
బాగొనరింపఁ వినిర్మలంబుగాఁ
బుట్టుకచావులు న్గలుగు
భూరిభవాంబుధి దాఁటఁజేసియున్
గట్టును జేర్చు రామకథ
గానమొనర్తు మనోహరంబుగన్. 23

సజ్జనవందనము

కం. మొదటనె నమస్కరించెద
సదమలభూసురులపాదసారసములకున్
విదళిత మోహగుణోదిత
హృదయాంతస్సంశయములకేఁగడు భక్తిన్. 24

గీ. సకలగుణఖని యైనసజ్జనసమాజ
మునకు నేను సాష్టాంగవందనము సేతు
మనసులో భక్తి పొంగఁగా మధురనమ్ర
మంజులాలాపములతోడ మహితరీతి. 25

కం. ధరఁ గార్వాసచరిత్రము
తెఱఁగున శ్రీసాధుచరిత ధృతశుభగుణమౌ,
విరసము, విశదము, గుణమగు
వరఫల మహ ! రెంటియందుఁ బ్రభవించుఁగదా!

కం. ధృతిమెయిఁగష్టము లోరిచి
యితరులచిద్రములఁ గప్పి యిలఁ గార్వాసం
బతులితకీర్తిని గాంచెను;
సతతంబును విబుధు లల్లె సన్నుతపాత్రుల్. 27

చ. ఘనతరరామభక్తి యను
గంగయు, బ్రహ్మవిచారబోధనం
బనెడిసరస్వతీనదియు,
న వ్యిధివర్గములున్ నిషేధముల్
తనరెడి కర్మయోగసుక
థాతతియన్ గలిదోషబృందభం
జనరవిపుత్రియున్ వెలుఁగు
సజ్జనసంఘమహాప్రయాగలో. 28

గీ. అబ్బుధసమాజ మనెడి ప్రయాగయందు
విమలహరిహరకథనత్రివేణి తనరు

శ్రవణమాత్రంబుచే నది జనుల కిచ్చు
సకలమోదశుభంబుల సంతతంబు. 29

గీ. ఆబుధజనసమాజప్రయాగలోన
నిశ్చలాఖండనిజధర్మనిష్ఠ యనెడి
యక్షయవటంబు వెలుఁగొందు ననవరతము
దానిపరివార మెల్ల సత్కర్మవితతి. 30

గీ, సజ్జనసమాజతీర్థరాజంబు తెలియ
నన్ని దేశంబులందున, నన్నికాల
ములను, నందఱకు లభించు సులభముగను
ఆచరమున సేవింపఁ గ్లేశాఁ బాపు. 31

గీ. అకథనీయ మలౌకిక మాప్రయాగ
వెంటనే ఫల మొసఁగుచు వెలుఁగుచుండు
సాధుసత్సంగతీర్థరాజప్రభావ
మఖిలలోకప్రసిద్ధమై యతిశయిల్లు. 32

చ. అహహ ! ప్రసన్నచిత్తుఁడయి,
ఆబుధబృందమహాప్రయాగలో
మహిమ నెవండు తా వినియు,
మానసమందు గ్రహించి, దానిలో
మహిత మహానురాగమున
మానక క్రుంకునో, వాని కింక నీ
యిహమునఁనే నిజంబు లభి
యించుఁ *జతుష్పురుషార్థసౌఖ్యముల్.

గీ. సాధుబృందప్రయాగ మజ్జనము సేయ
ఫలము తత్క్షణమే పొందఁగలము మనము
కాకి కోకిల యౌను, బకంబుగూడ
రాజహంసగ మాఱు విరాజితముగ. 34

కం. ఇది విని వింతను గనకుఁడు
విదితము సత్సంగమహిమ విశ్వములో, నా
రదవాల్మీకిఘటోద్భవు-
లిది స్వయముగఁ జెప్పినార లెల్లరు దెలియన్. 35

గీ. జలచరావనీచర నభశ్చరము లనఁగ
జడములనఁ జేతనములన జగతిలోనఁ
గల వనేకంబులౌ జీవగణము లౌర!
వానిలో నెయ్యదైన, నేపగిదినైన,
నెప్పుడైనను, నెక్కడనైన- సుమతి,
కీర్తి, సుగతి, విభూతి, సద్వర్తనంబు
తాల్చియుండిన నదియు సత్సంగమహిమ!
అట్టి సుగుణముల్ పొంద మార్గాంతరములు
లోకమున లేవు, వేదాలలోన లేవు. 36

కం. కలుగదు వివేక మెప్పుడు
సలుపక సత్సంగ, మట్టి సత్సంగంబో
సులభముగా లభియించునె?
అల రామునికరుణ లేక యవనీస్థలిలోన్. 37

గీ. ఘనతరానందశుభవృక్షమునకు మూల
మరయ సజ్జనసాంగత్య మౌను, మఱియు
దానిపుష్పముల్ ధర్మసాధనము లెల్ల
ఫలము సుజ్ఞానసిద్ధియై పరిఢవిల్లు. 38

కం, పరుసము సోఁకిన నినుమును
వఱలెడుబంగార మైనపగిదిగ శఠుఁడున్
ధరణిని సత్సంగముచే
నిరుపమపుణ్యాత్ముఁ డగుచు నెగడునుగాదే! 39

---

* చతుర్విధపురుషార్థములు = ధర్మార్థకామమోక్షములు.

గీ. విధివశంబున బుధుఁ డొకవేళఁ దాను
దుష్టసాంగత్యమందున దూరియున్న
సర్పఫణమందుఁ గలమణిచందముగను
నిజగుణానుసారంబుగానే చరించు.

దుర్జనవందనము

గీ. వందనముఁ జేసెదను సుహృద్భావ మొప్ప
దుష్టజనబృందమునకుఁ దద్దూర్తజనము
లే ప్రయోజనమును లేకయే యొనర్చుఁ
గుడి నెడమగను, మంచిని జెడుగ నౌర! 44

గీ. పరులహితమును జెఱచుటే వారి లాభ
మన్యనాశమే వారల కఖిలసుఖము,
పరులు బ్రదుకుటే వారికి వగను గూర్చు
శతులత త్త్వంబు నరయ నాశ్చర్య మొదవు. 45

గీ. హరిహరకథేందురాహుగ్రహంబు, లట్లె
అన్యజనదుఃఖకరణసహస్రబాహు,
లన్యదోషదర్శనసహస్రాక్షు లగుచు
మహిని జరియించుచుంద్రు దుర్మార్గజనులు. 46

కం. ఘృతమున నీఁగలు పడియును
ఘృతమెల్లం జెఱచి, యసువులే విడిచెడు న
ట్లితరుల హితమును జెఱచి కు
మతులును వడిఁ దాముగూడ మరణింత్రుగదా! 47

గీ. పరులఁ దపియింపఁ జేయఁగా వహ్నిసములు
దండధరతుల్య లెపుడుఁ గ్రోధంబునందు,
బహుళపాపావగుణసంఘభాగ్యగరిమ
నల కుబేరులు దుర్జనుల్ తలఁచునెడల. 48

కం. కుజనులు కేతువులట్టులఁ
బ్రజలహితముఁ బాడుసేయఁ బ్రభవింతు రిలన్,
నిజము నెఱుంగరు వా ర
క్కజముగ నిద్రను మునింగి ఘటకర్ణువలెన్. 49

గీ. విధివశంబున బుధుఁ డొకవేళఁ దాను
దుష్టసాంగత్యమందున దూరియున్న
సర్పఫణమందుఁ గలమణిచందముగను
నిజగుణానుసారంబుగానే చరించు.

చ. హరివిధిరుద్రులున్, గవిజ
నావళి, పండితు లైనవారలున్
వరసుజనప్రభావమును
బల్కఁగ సంశయ మొందుచుండఁగా
నరుఁడను నేను బల్కఁగల
నా? పురవీథుల నాకుఁగూరలన్
దిరుగుచు నమ్ముఁవాఁ డెటులఁ
దెల్పు మణిప్రతిభావిశేషముల్? 41

ఉ. కోసినచేతికిన్, దనను
గోయనిచేతికి నొక్కరీతిగా
దోసిలిలోనిపుష్ప మతి
తుష్టి వెలుంగ సుగంధ మీయదే!
ఆ సరణిన్ హితాహితుల
నందఱ నొక్కటిగాఁగఁ జూచుచున్
భాసిలు సజ్జనావళికి
భక్తిని వందన మాచరించెదన్. 42

మ. సరళాత్ముల్ సకలోపకారులగు శ్రీ
సాధుస్వభావాఢ్యులన్
బరమస్నేహ మెఱింగి మ్రొక్కితిని భా
స్వద్భక్తితో; వారు స
త్వరమే యీ పసిబాలువిన్నపము
వాత్సల్యంబుతో నంది సుం
దరరామాంఘ్రిసరోజభక్తి నిడి నన్
ధన్యాత్మునిం జేయఁగన్. 43

చ. పడి వడగండ్లు సస్యమును
బా డొనరించియుఁ దాము నాపయిన్
మడిసినరీతి, దుర్జనులు మానక
యన్యులకార్యసంతతిం
జెడునటు సేయుచున్ భువిఁ ద్య
జింతురు స్వీయశరీరముల్; గడుం
గడు ధృతిఁ బూని, యా కుజన
కాండము నెంచి, నమస్కరించెదన్. 50

గీ. పరులదోషంబులను గ్రోధభావ మొప్ప
వేయి ముఖములతోడను విసుఁగు వీడి
వర్ణనము సేయుదుర్జనవ్రాతమునకు
శేషసమముగ భావించి చేతు నతులు. 51

చ. పృథువు సహస్రకర్ణముల
విష్ణుకథావళి నాలకించె నా
పథమున దుష్టు లింకఁ బది
వందలవేలచెవుల్ ధరించియుం
బ్రథితమహానురాగమునఁ
బాయక వింద్రు పరాఘుగాథలన్
బృథుసములంచు వారలకు
నే నొనరించెద వందనంబులన్, 52

గీ. అనవగతసురాసక్తి వజ్రాయుధంబు
వేయికన్నులు దేవతావిభున కుండు
అనవరతసురాసక్తి వజ్రాతికఠిన
భాషణంబులు; పరజనదోషలేశ
దర్శనచణసహస్రనేత్రములు గల్గి
సంచరించెడి యట్టిదుర్జనుల నెల్ల
నింద్రతుల్యులుగా మది నెంచుకొనియు
మరల మరల నే నిపుడు నమస్కరింతు. 53

గీ. అల యుదాసీనశత్రుమిత్రాదులందు
నెవరికైనను గానిండు, హితము కలుగ
ననుచు వినినంతఁ దహతహలాడుచుంద్రు
ఖలులు; వారల సహజమార్గంబు లెఱిఁగి
చేతులను రెండు జోడించి చేతు నతులు. 54

గీ. ఏను నాధర్మముగ నమస్కృతులఁ జేతు
వారు విడువరు వారిస్వభావములను
బ్రేమతోఁ గాకి నెన్నాళ్లఁ బెంచుకొనిన
మాంసభక్షణ సేయుట మానఁగలదెఁ 55

సజ్జనదుర్జనవందనము

ఉ. మ్రొక్కెద సజ్జనంబులకు
మ్రొక్కెద దుష్టుల కొక్కరీతిగా
నిక్కము నెంచి చూడ వగ
నే కలిగించెద రిర్వు; రందులో
నొక్కటి భేద మున్నయది;
యొక్కనిఁ బాసినఁ బ్రాణహానియౌ,
నొక్కని డాసిన న్గలుగు
నుగ్రతరవ్యధ; భేద మింతియే! 56

గీ. అరయ సజ్జనదుర్జను లంద ఱొక్క
జగతిలోననే పుట్టుట; సారసంబు
జలగ పుట్టును రెండు కాసారమందె
కాని గుణముల భేదముఁ గాంచఁగలము. 57

కం. సాధులు సుధతోఁ దుల్యా. ల
సాధులు సురతోడ సములు, శశ్వద్విద్వా
గాధాంబుధిలో నుభయుల
వేధసుఁడు జనింపఁజేసెఁ బృథుచిత్రముగన్. 58

కం. తమతమసత్కార్యంబుల
సుమతులు సత్కీర్తి జగతి శోభిలఁజేయం
దమతమదుష్కార్యంబులఁ
గుమతులు దుష్కీర్తి నింపుకొందురు ధాత్రిన్. 59

చ. అరయ సుధాసుధాకరసు
రాపగలున్ బుధు లున్నరీతిగా
గరళరసాగ్నిపుణ్యశుభ
* కర్మవినాశనదీకిరాతకుల్
ధరఁ గల, రిందు వీరిగుణ
ధర్మము లెల్ల రెఱింగియుందు, రె
వ్వరి కెది నచ్చునో యదియె
వారికి మంచిది యౌచుఁ దోఁచెడిన్. 60

చ. విమలుఁడు మంచినే కొనును,
వీడక నీచుఁడు చెడ్డదానినే
ప్రమదముతోడఁ గైకొనును,
వారల కియ్యది నైజమైన నా
యమృతము మృత్యువారణగు
ణార్థతఁ గీర్తిని గాంచుచుండఁ, బా
ణముల హరించుటందె గణ
నంబున కెక్కు విషంబు చూడుఁడీ! 61

కం. ఖలజనపాపపుగాథల
నల సజ్జనసుగుణకథల నరయ నపారం
బులును నగాధంబులునౌ
జలధులవలె నున్న వౌర జగతీస్థలిలో. 62

గీ. వేని గ్రహియించి వేనిని విడువవలెనొ;
కనుఁగొనంగనుశక్యము గాదటంచు
గుణములును దోషములు కొన్ని కొన్ని మాత్ర
మిచట వర్ణింపఁబడినవి యెల్ల రెఱుఁగ. 63

గీ. మంచి సెడ్డల నెల్ల బ్రహ్మయె సృజించెఁ,
గాని వానిగుణాగుణగణము తఱచి
మంచి సెడ్డల విభజించి మనకుఁ దెలిపె
విశ్వవిజ్ఞానఖని యగువేదచయము 64

గీ. బ్రహ్మదేవసంసృష్టప్రపంచ మెల్ల
మంచి సెడ్డలతో మేళవించి యున్న
దనుచు, ఘోషించుచుండె నీ యవనిలోన
నఖిలవేదపురాణేతిహాససమితి. 65

గీ. ఎంచ సుఖమును దుఃఖము, మంచి చెడుగు,
భవ్యుఁడును బాపజనుఁడును, బగలు రాత్రి,
మఱి సుజాతి కుజాతియు, సురలు దైత్య,
లున్నతియుఁ బతనము, సుధయును విషంబు,
జీవనము మృత్యు, వీశుఁడు జీవుఁ డనియు,
బ్రహ్మమును మాయ, సిరి లేమి, రాజు పేద,
కాశి మగధయు, గంగయుఁ గర్మనాశ,
మఱియు మరుభూమి మాళవధరణితలము,
బ్రాహ్మణుండు కసాయి, స్వర్గము నరకము,
ఘనవిరాగము రాగము-లనుచుఁ గనఁగ
నిట్లు గల వెన్నియో బ్రహ్మసృష్టియందు;
వీనిగుణదోషములనెల్ల విభజనంబు
సలిపెఁ బరిశుద్ధముగ వేదశాస్త్రసమితి. 66

ఉ. ఈసచరాచరం బయిన
సృష్టి నహో! గుణదోషయుక్తమై
భాసిలఁగా రచించె విధి;
పాలను నీళ్ళను హంస తా విడం
దీసినరీతి, సజ్జనులు
ధీరత సద్గుణముల్ గ్రహించియుం,
ద్రోసెద రావలన్ సకల
దోషములా త్తవివేకశక్తితో. 67

* కర్మ వినాశనది = బీహారులోని యొకనది; అందు స్నానము చేసిన సమస్త పుణ్యకర్మములు నశించునని ప్రతీతి.

గీ. అహహ! హంసకు గలిగిన యా వివేక
మెపుడు కలిగించునో విధి యపుడె మనసు
దోషములనెల్ల నావలఁ ద్రోసివైచి
గుణములందున లగ్నమై గణనకెక్కు. 68

గీ. కాలకర్మస్వభావప్రగాఢబలము
వలన బుధుఁడును బ్రకృతికి వశ్యఁ డగుచు
మంచితనమును దాను ద్యజించివైచుఁ
బ్రకృతిశక్తిని వర్ణింప వశము గాదు. 69

ఉ. ఐనను గేశవాంఘ్రిరతు
లైన బుధుల్ చెడిపోరు; హార లా
మానసమందుఁ గల్గినభ్ర
మన్ సవరించి ప్రబుద్ధు లౌచు స్వ
జ్ఞానమహాప్రబోధితయ
శఃస్ఫుటపాండురదిక్కటాహులై
మానితరీతి వెల్గుదురు
మాధవసత్కరుణాబలంబుచే. 70

కం. ఖల్ఁడును సత్సంగముచే
సలిపిన నేదేని మంచి శాశ్వతరీతిన్
నిలువదు సద్బుద్ధి, యతని
మలినగుణము పోక మాటిమాటికిఁ బొడుచున్. 71

ఉ. వంచకు లైనవారు గుణ
వంతులవేషము లూని, యట్టివే
షాంచితశక్తిచే జగతి
నర్చితు లైనను దాగఁజాల దా
వంచన; కాలనేమియును,
బంక్తిశిరుండును, రాహుముఖ్యుల
ట్లెంచఁగ నెన్నినాళ్ళ నటి
యింపగఁ గల్గిరి దంభరూపులై? 72

చ. ధరణిని నీచవేషములఁ
దాల్చి చరించియు సాధుపూరుషుల్
నిరుపమపూజనీయు లయి
నిల్తురు మానవహృత్స్థలంబులం
దరయఁగ జాంబవద్ధనుమ
దాదులు వానరరూపు లయ్యు, బం
ధురజగదేకపూజ్యచరి
తుల్ మహితాత్ములుగా వెలుంగరే? 73

కం. కుజనులసంగతి హానియు
సుజనులసంగంబు సకలశుభములఁగూర్చున్
నిజ మిది వేదోక్తంబయి
త్రిజగములఁ బ్రసిద్ధిఁగన్నదే తలపోయన్. 74

కం. కనుఁ డాధూళిని, నయ్యది
యనిలములోఁ గలసి లేచు నాకసమునకున్
గనుఁ డది జలమునఁ గలిసినఁ
జనిచని పెనురొంపిఁ జేరు క్ష్మాస్థలి నౌరా! 75

గీ. సాధుసదనంబులను శుకశారికములు
'రామ' యని పల్లుచుండును రమ్యరీతి;
నీచగృహములలో నవే నిలిచి, వచ్చి
పోవువారలఁ దెగఁ దిట్టిపోయుచుండు. 76

గీ. అరయఁ బొగ, కుసంగతి మసి యనఁగఁదనరు
నదియె సత్సంగమహిమచే నందమగు సి
రాగఁ దోడ్పడును బురాణరచనమునకు,
నదియె యుదకాగ్నివాయువులందుఁగలసి
వారిదంబయి భువికి జీవన మొసంగు. 77

చ. గ్రహతతి, యౌషధాళి, యుద
కంబులు, వాయువు, శస్త్రముల్ శుభా
వహములఁగాఁ జెలంగు ధర
పైన సుసంగతిచే; నవే వ్యధా

వహములు నౌచు మాఱును వి
పత్కరఘోరకుసంగశక్తిచే
మహితవివేకమానసులు
మాత్ర మెఱుంగుదు రీరహస్యమున్, 78

గీ. కృష్ణశుక్లపక్షంబు లీ క్షితిని రెండు
సరిసమానంబు లౌచును జరగుచున్నఁ
గృష్ణపక్షము తమముచేఁ గీర్తిఁబాయ
శుక్లపక్షము శశిచేత శోభఁ జెందె. 79

ఉ, ఈసచరాచరోరుజగ
మ్మెల్లను రామమయంబు గాన సం
భాసురసర్వభూతచయ
పాదసరోరుహకోటి కెప్పుడున్
జేసెదవందనంబులను
జేతులు రెంటిని మోడ్చి వర్షధా
రాసమపారవశ్యసుఖ
రంజనబాష్పము లొప్పఁ గన్నులన్. 80

మ. హరిరూపాళిగ నెంచి భక్తిమయదీ
వ్యచ్చిత్త మొప్పారఁగా
పరదేవాసురయక్షపక్షీగణస
ర్పప్రేతగంధర్వకి
న్నరకింపూరుషమర్త్యముఖ్యమగు నా
నాజీవసంఘాళికిం
గరుణాదృష్టుల నన్నుఁ జూడ నతులన్
గావింతు నేకాత్మతన్. 81

కం. జలమున స్థలమున నభమునఁ
జెలఁగుఁజతుర్విధములైన *జీవంబులకున్
సలిపెద జోహారులు నే
నల సీతారామరూపు లనుభావమునన్, 82

కం. సీతారామమయం బగు
భూతావళి యెల్ల నన్నుఁ బూర్ణప్రేమన్
నా తప్పులఁ గనకుండఁగ
నాతతకరుణార్ద్రదృష్టి నరయఁగ వలయున్. 83

ఉ, నాదగు బుద్ధిశక్తిపయి
నా కవలంబము లేదు; కావునన్
మీదయఁ జూప నే నిపుడు
మిక్కిలి వేఁడుచునుంటి; నల్ప మీ
నాదగు బుద్ధిశక్తి, రఘు
నాథచరిత్ర మగాధ; మెట్లు సీ
తాదయితప్రభూతచరి
తంబును వర్ణనసేయఁగల్గెదన్? 84

చ, కనఁబడ దెంతమాత్రము జ
గంబున నొక్క యుపాయమేని నా
మన నొక పేదవాఁడు, మఱి
మామకవాంఛయొ రాజుఁబోలెడిన్
దనియఁగ వాంఛ యేమొ యమృ
తంబును బొందఁగనుండఁ జల్లయై
నను లభియింపదయ్యెఁగద;
నామతి కొద్దిది, కోర్కె పెద్దదే! 85

కం. నాదగు ననుచితకార్యము
సాదులు క్షమయింపఁగలరు సంతస మొప్పన్,
నాదగు శిశుభాషణముల
నాదరమున వినఁగ వారి కంజలి సేతున్. 86

కం. వచ్చియు రానియుఁ బలుకుల
మచ్చికతో బాలుఁ డాడ మాతాపితరుల్
ముచ్చటపడి మానసమున
నచ్చపుఁబ్రేమంబు పొంగ నాలింత్రు గదా! 87

---

* అండజములు, స్వేదజములు, జరాయుజములు, ఉద్భిజ్జములు.

కం. క్రూరులు కుటిలులు దుష్టవి
చారులు పరదోషకార్యసంతతనిందా
పారగు లగు దుర్జనులో
యారయకే పరిహసింతు రా శిశువాక్కుల్. 88

చ. కన రసవంతమైన నటు
గాక రసప్రభ లేక యుండినన్
దనదుకవిత్వ మెవ్వఁడు ము
దంబున మంచిగ నెంచఁబో డహా!
విని పరకావ్యముల్ హృదయ
పీఠిని సంతస మందఁగల్గు స
జ్జనవరు లెంద ఱుందురు వి
శాలజగంబునఁ? గోటి కొక్కఁడే! 89

చ. ధరణిని స్వప్రవాహములఁ
దామె ముదంబునఁ బొంగు నాసరో
వరములు వాహినీచయము
వంటినరు ల్గల రెంద ఱెందఱో
అరసియుఁ బూర్ణచంద్రుని మ
హాద్భుతమోదముతోడఁ బొంగుసా
గరమును బోలుభవ్యుల జ
గంబున లెక్కిడవచ్చు వ్రేళ్ళపై. 90

చ. నను బరిహాసమాడఁ గుజ
నంబులు, నాకు హితంబె కల్గెడిన్
ఘనమధు వొల్కఁ గూయుకల
కంఠము కాకికిఁగిట్టఁబోదు; హిం
సను గని కొంగ నవ్వుకొనుఁ,
జాతకము న్గని కప్ప వెక్కిరిం
చును, వరవాక్కులన్వఅలు
సూరుల గేలియొనర్తు మూఢులున్. 91

గీ రామపాదాబ్జసద్భక్తిరహితకవుల
కెల్ల నాదుకవిత్వ మొకించుకంతఁ
గలుగఁజేయు వినోదసుఖంబు నెడఁద
నిద్ది దేశభాషాకృతి; యిదియుఁగాక
నాదు బుద్ధియు సాధారణంబు గానఁ
బరిహసించుట న్యాయ్యమే పరులు నన్ను. 92

చ. ఎవనికి రామపాదజల
జేచ్ఛ, సుబుద్ధియుఁ గల్గ లేదొ, యా
యవగుణుఁ డీచరిత్రము న
నాదరదృష్టిఁ దృణీకరించు, దా
నెవఁ డిల విఘ్నశంకరుల
నెప్పుడుఁ గొల్చుఁ గుతర్కి గాక యా
ప్రవిమలభావుఁడే కనును
రామకథామధురానుభూతులన్. 93

ఉ. కాను గవీశ్వరుడన్, మతియుఁ
గాను మహావచనప్రవీణుఁడన్,
నే నెటువంటిసత్కళల
నేరను, నేర ననేకవిద్యలం
బైనను రామభక్తిమయ
మై వెలుఁగొందుట నీచరిత్రమున్
మానక సజ్జనుల్ వినియు
మంజులరీతి నొనర్తు సన్నుతుల్. 94

ఉ. ఏ కవితాసులక్షణము
లించుక నేర నటంచు రూఢిగా
మీకు లిఖించి కాగితము
మీఁద నొసంగెద, నే గుణంబులున్
నా కృతియందుఁ గల్గ, వయి
నన్ గని యొక్కజగత్ప్రసిద్ధకో
వికరసద్గుణంబు మహి
తాత్ములు శ్రద్ధగ విందు రీకథన్. 95

ఉ. నాదు కృతి న్వెలుంగు రఘు
నాథుని మంజుల దివ్యనామ మా
వేదపురాణసారము, ప
విత్రతమంబు, శుభాలయంబు, ని
ష్ఖేదము పార్వతీవృషభ
కేతనహృజ్జపమంత్రరాజ మీ
మేదిని - నందుచే నిది య
మేయజనాదరపాత్ర మయ్యెడిఁ. 96

ఉ. పున్నమచందుఁబోలు ముఖ
మున్, బహుభూషలు గల్గి, బొట్టు లే
కున్న నెలంత శోభిలుచు
నుండదు; సత్కవు లే రచింపనీ
ఎన్ని యలంకృతుల్ రసము
లెంతటిపాండితి భావజాల మం
దున్నను రామనామసుధ
యుండనికావ్యము హేయహేయమేఁ 97

చ. ఇలఁ గుకవుల్ రచించిన, మ
హెట్టి కవిత్వపటుత్వమాధురుల్
గలుగకయున్న, సజ్జనులు
కాంత్రు మహాదరదీప్తభావులై
సలలితరామనామవిల
సత్కృతినిన్; సదసద్వివేకసం
కలితబుధుల్ మధువ్రతని
కాయమువోలె గ్రహింత్రు సారమేఁ 98

నా కృతియందు రామనర
నాథుప్రతాపము వ్యక్త మౌటచే
నా కొకగట్టి ధైర్యము మ
నంబున నున్నది పర్వతంబటుల్. 99

ఉ. ధూమముగూడఁ దా నగరు
తోడను గూడి సుగంధపూర్ణమౌ
మామకకావ్య మాపగిది
మానితరూపము లేనిదైన నా
రాముని విశ్వమంగళక
రంబగు సత్కథ గల్గియుంటచే
నీమహి వన్నెకెక్కునని
యెంచుచునుంటిని నేను రూఢిగా. 100

కం. మలయసుసంగతి దారువు
నిలలోఁ గడుఁ బ్రీతిఁజూచు నెల్లజనం బా
యలఘురఘూత్తమకీర్తిని
గలిసిన యీకృతికి జగతిఁ గడు ముద మొందున్.

ఉ. వంకరగా గమించునది
భవ్యజలంబుల సాధుసేవ్యమౌ,
శంకరుమేన నంటిన శ్మ
శానపుబూది బుధుల్ నుతింత్రు; ని
శ్శంకగ నా కవిత్వ మిల
సారవిహీనము, వక్ర, మైన రా
మాంకిత మౌటచేత సుజ
నాదరపాత్ర మెయ్యె వెలిందెడిన్. 102

ఉ నల్లనిదైన ధేనువు గు
ణప్రదశక్తిని గూడి యెంతయో
తెల్లఁగనుండు క్షీరములఁ
దీసియుఁ ద్రాగుదు రెల్ల మర్త్యు; ల

ఱెల్లెడ గ్రామ్యవాక్యముల
కీకృతి తావలమైన, రామభూ
వల్లభుదివ్యకీ ర్తి విని
పాడియు సజ్జను లుల్లసిల్లరే! 103

మ. మణిమాణిక్యసుమౌ క్తికంబులు స్వజ
న్మస్థానరంగంబులౌ
ఫణిధాత్రీధరకుంభికుంభములపై
భాసిల్లఁబో వంతగా,
గణుతి న్గాంచు నృపాలశీర్షరమణీ
కాయంబులం; దా విధిన్
బ్రణుతి న్గాంచును సత్కవీశ్వకృతి శుం
భద్రీతి వేఱొక్కచో. 104

చ. హృదిని గవీశ్వరుండు స్మరి
యింపఁగ భక్తిని బ్రహ్మదేవుశ్రీ
సదనమునుండి పర్విడుచు
శారద వచ్చును; దద్భ్రమం బె టా
ముదితకు వేఱుమార్గములఁ
బోవును రామకథామనస్సర
స్సదమలదివ్యతీర్థమున
స్నాన మొనర్చినఁగాక తృప్తిమై? 105

చ. వరకవిపండితో త్తములు
బాగుగ దీని నెఱింగియే భయం
కరకలిదోషహారి హరి
గాన మొనర్తురు భక్తితోడ; దు
ర్నరగుణవర్ణనల్ సలిపి
నం, దన నె త్తిని బాదుకొంచు, దు
ర్భరపరితాపసంకలిత
భావ యగు న్గద వాణి యక్కటా! 106

గీ. హృదయమే సముద్రము, బుద్ధియే రహించు
ముత్తెపుంజిప్ప, శారద పుణ్యచరిత
స్వాతికా త్తె యటంచును బలుకుచుంద్రు
బుధజనావళు లెల్ల నీ పుడమియందు, 107

గీ. అందు శ్రేష్ఠవిచారణ మనెడిజలము
బాగుగాఁ గురియంగను ప్రభవమొందు
ఘనకవిత్వముక్తామణి యనుపమాన
కాంతిపటలమ్ములను వెలిఁగ్రక్కుకొనుచు. 108

ఉ. ఆ కవితాసుమౌ క్తికము
నందున యు క్త్యభిధానసూచికన్
ప్రాకటరీతి రంధ్ర మిడి
రామకథాతిమనోజ్ఞసూత్రమున్
శ్రీకరలీలఁ గూర్చియును
స్వీయవినిర్మలహృత్స్థలుల్ బుధా
నీక మలంకరించి పుర
ణించు శుభం బగుప్రేమశోభతో. 109

ఉ. భీకరమౌ కలి న్బడియు
వేసియు హంసలవంటివేషముల్
కాకులకార్యముల్ సలుపు
కల్మషచిత్తుల సంఘమందునన్
ప్రాకటవేదమార్గమును
బాసియు దుష్పథగాము లైనపా
పాకరమ ర్త్యులందు నిజ
మాడఁగ నేనె ప్రధానగణ్యుడన్. 110

చ. కలిమలవారిధుల్ కపట
కాయులు వంచకు లౌచు రామదా
సుల మని పైకిఁ జెప్పుచును
జూడఁగ దుర్గుణకామకాంచనం

బులకును దాసులౌ నరులు
భూరివిపచ్చయకారు లైనదు
ష్టులనడుమన్ భువి న్మొదటి
చోటున నేనె గణింపఁజెల్లెదన్. 111

గీ. ఏను నా దుర్గుణములన్ని యెంచి చెప్ప
నదియె బ్రహ్మాండమంతగా నగును; వాని
నెల్లఁ బూర్ణముగా వచియింపఁజాలఁ
గొంచె మాడితి మీరె యూహించుకొనుఁడు. 112

ఉ. ఏను బహుప్రకారముల
నింతగఁ జేసినవిన్నపంబుచే
నేనరులైన నీకృతిని
నెంచరు దోషము లంచు నెంతుఁ; గా
కేనరులైన నావినతి
నెంచక నా కృతి నేవగించుచో
ఈ నను మించుమూర్ఖులని
యే తలపోసెద వారి నందఱిన్, 113

మ. కవినా కా; నిఁక వాక్ప్రమత్కృతి గనం
గా రాదు నాలోన నే
లవమున్; నాకును దోఁచురీతి మతి ను
ల్లాసంబు రేకెత్త నే
నెవియో రామగుణాభివర్ణనల నొ
క్కిం తేని గావింతు దు
ర్భవసమ్మగ్నమనస్కఁ డేడనొ; బృహ
ద్రామాయణం బేడనో; 114

ఉ. ప్రాకటరీతి మేరుగిరి
రాజమునే యెగురంగఁ గొట్టు శౌ
ర్యాకరమారుతంబుకడ
నా నిలుచుండుట దూదిపింజ? వా
ల్మీకిమునీంద్రముఖ్యులకె
మించిన రామచరిత్రరాజమా!
యీ కడు నల్పబుద్ధికి గ్ర
హింపఁగ శక్యమె పూర్ణరీతిగన్? 115

కం. రాముమహోన్నత ఘనతను
నా మనమునఁ దలఁచినంత నాకు భయం బౌ
రామకథారచనం బే
నేమాదిరిఁ జేయఁగలనొ? యెఱుఁగను బుద్ధిన్.

ఉ. శారద, శేషుఁడున్, శివుఁడు,
సారససంభవముఖ్య లైనబృం
దారకకోటులున్, మఱియుఁ
దన్నిగమాగమసత్పురాణముల్
శ్రీరఘురామతత్త్వముగు
టించి సమగ్రముగా నెఱుంగకే
వారక "నేతి నేతి" యని
పల్కుచు గానము సేయుచుండవే! 117

ఉ. రాముగభీరసచ్చరిత
వ్రాయఁగఁ, బల్క నశక్య మంచు నీ
భూమి నెవం డెఱుంగఁడు? ప్ర
భుప్రణయంబు నణంప లేక శ్రీ
రామగుణాభివర్ణనము
రవ్వయుఁ జేయక యెవ్వ రాగి? రా
రామకథాత్యగాధజల
రాశిని దాకి తరింతు నే నిదే. 118

కం. భగవన్మహిమం బెవరును
జగమునఁ దుదిముట్టఁ బలుకఁ జాలరు; కానన్
దగఁ దమమార్గంబులతో
భగవత్కీర్తనము సేయఁ బలికెను శ్రుతులున్.

గీ. అద్వితీయుఁ డనీహుఁడై యభవుఁ డగుచు
నామరూపరహితపరంధాముఁ డగుచు
సచ్చిదానందరూపుఁడు, సర్వమయుఁడు,
విశ్వరూపుఁడై వెలుఁగొందువిభుఁడె ధరణి
నవతరించి యనేకకార్యముల సలిపె. 120

కం. కేవలభక్తహితార్థము
శ్రీవిభుఁ డీ ధరణియందుఁ జేసెను లీలల్;
సేవకబృందంబులపై
నావిభునకుఁ గలుగుకరుణ యసదృశ మహహా! 121

చ. హరికి నిజాశ్రితుం డనిన
నత్యధికం బగుప్రీతి, వానిపై
గరుణకు మేర లేదు, కనఁ
గా నతఁ డెవ్వనిపైన సత్కృపన్
బఱపునొ యట్టి భక్తుని గృ
పారసమంజులదృష్టితో సతం
బరయును గాని కోపమున
కగ్గ మొనర్పఁ డటెంత చిత్రమో! 122

కం. ఇట్టివి హరిగుణతతులని
గుట్టెఱిఁగినపండితాళి గోవిందకథా
ఘటంబులఁ గీర్తించును
బుట్టుక సఫలంబు గాఁగఁ బుణ్యోక్తులచేన్. 123

ఉ. పారము ముట్ట నీశ్వరుప్ర
భావము వర్ణన సేయలేము త
ద్వారిధిలోని యే కణముఁ
బానము సేసినఁగాని దుర్లభా
పారఫలంబు గల్గునని
పాయనిధైర్య మెద న్వహించి, నే
నా రఘునాథపాదశర
ణాగతిఁ బొంది రచింతు నీకృతిన్. 124

చ. మొదటి మునీశ్వరుల్ పరమ
పుణ్యనిధానహరిస్తవంబు స
మ్మోదమునఁ బాడి; రాసరణిఁ
బోవుటయే సుగమంబు నా కగున్
నదిపయి ధర్మదృష్టి నర
నాథుఁడు వంతెనఁ గట్టఁజేయఁ, జి
న్నది యగుచీమకూడను ఘ
నశ్రమ మొందక యొడ్డుజేరదే! 125

కం. తలఁచియు నేనీరీతిగ
బలమును జేకూర్చికొనియు భావములోనన్
దలఁపడినాఁడ వెలార్చఁగ
సలలిత మగురామచంద్రచరితామృతమున్. 126

కవివందనము

ఉ. ఆదరబుద్ధితో హరిగు
ణాద్భుతకీర్తన చేసి నిత్యస
మ్మోదముఁగూర్చి జీవభవ
మోహభయాకులబుద్ధి బాపు వ్యా
సాదికవీంద్రుల న్దలఁతు
నంజలిబద్ధుఁడ నౌచు భక్తితో
నాదుమనోరథంబుఁ గరు
ణన్ సఫలం బొనరింపఁ గోరుచున్.

కం. కలిలోఁ బుట్టియు రాముని
సలలితగుణవర్ణనముల సంస్కృతమందున్
సలిపిన కవివర్యుల కే
సలిపెద నతిభక్తితోడ సాష్టాంగనతుల్. 128

చ. హరిచరితామృతంబును మ
హాత్ములు ప్రాకృతసత్కవీశ్వరుల్
వఱల రచించి రెందఱొ ఱు
భంకరలీలను దేశభాషలం;
దరిగినకాలమందుఁ గల
యట్టికవీంద్రుల, నేఁటిధీరులన్,
ధర నిఁకఁ బుట్టనున్న కవి
తల్లజుల న్వినుతించి మ్రొక్కెదన్. 129

ఉ. మీరు ప్రసన్నులై ధరణి
మీఁదను నాకృతి సాధులోకస
త్కారము పొందునట్లు వర
దాన మొసంగుఁడు బుద్ధిశాలులో
వారు సమాదరింపని ప్ర
బంధము వ్రాయుటఁ జూడఁగా నెదో
యూరక బాలకుల్ సలుపు
చుండు నిరర్థకకేళియే కదా! 130

కం. కీరితి కవితయు సంపద
వారక యెల్లఱకు గంగవలె హితమైనన్
ధారుణి నుత్తమము లనుచు
సూరిజనులు చేయుచుంద్రు స్తుతిజాలములన్. 131

గీ. రామచంద్రుయశ స్సతిరమ్య; మకట!
నా కవితయో కురూపిణి; నాదు చిత్త
మిట్టి యసమంజసత్వంబు నెంచి భయముఁ
జెందుచున్నది కృతిని రచింత మనిన. 132

గీ. భవ్యకవులార! మీ దయవలన నాకు
నలఘుకార్యము సైతము సులభ మగును
నారచీరపైనను బట్టుదారములను
గుట్టుచో నది శోభతోఁ గూడుకొనదె? 133

కం. సరళము, విమలము, హరిగుణ
భరితంబే కవిత, దేని బాగుగ వినిలో
నరిజనులైనను మెత్తురొ,
అరసెద రాకవితఁ జతురు లాదృతమతులై. 134

ఉ. అట్టికవిత్వ మన్నవిమ
లాత్మలబుద్ధికె చిక్కు! లేదు నా
కట్టి మనోబలంబు; మఱి
యందులకే కవివర్యులార! నేఁ
బెట్టి నమస్కృతుల్ తిరిగి
వేఁడుచునుంటిని మిమ్ము, నేను జే
పట్టినరామకావ్యమును
బల్కెడిశక్తి ననుగ్రహింపరే! 135

ఉ. ఓ యమలాత్మ లైనవిబు
ధోత్తములార! కవీంద్రులార! రా
మాయణమానసాంతరవి
హారమహోత్సకహంసలార! రా
మాయణమందు నాకుఁ గల
యాశను నాదగుబాలనప్రభా
వాయతచిత్తము న్గని ద
యార్ద్రమనస్కులు గాఁగవేఁడెదన్, 136

ఉ. ఈ కలుషోగ్రలోకమున
నెల్లెడలన్ ఘనదుఃఖవహ్నికీ
లాకులమాలికాశతము
నార్పఁగ రామకథామృతంబు నా
హా ! కురిపించినటి కరు
ణాంబుధి, యాదికవీంద్రుఁడైన వా
ల్మీకిమునీంద్రుపాదముల
మించినభక్తిని నే భజించెదన్. 137

గీ. సఖరమౌచు సుకోమలచారుగుణము
దూషణసమేత మౌచు నిర్దోష మహహా !
ప్రథితమునిరాజవాల్మీకిరచితమైన
అఖిలసంపూజనీయ రామాయణంబు! 138

గీ. జననమరణాతిఘోరసంసారజలధిఁ
దాఁటఁజేసెడినావలై దాశరథుల
నిర్మలయశంబు సతము వర్ణించునట్టి
నాల్గు వేదంబులకు నేను నతు లొనర్తు. 139

కం. బుధులను, గోశశిసుధలన్,
అధము లన న్బరఁగు మద్యహాలహలములన్
విధిగ భవాబ్ధి సృజించిన
విధిని యథావిధిగ నేను ప్రీతి భజింతున్. 140

కం. సురభూసురవిబుధులకును
వఱలెడుగ్రహరాశిపాదపద్మంబులకుం
గరములు జోడించెద నేఁ
గరుణను మత్కార్యసిద్ధిఁ గలిగించుటకై. 141

ఉ. వాణికి గంగకు న్నలుపు
వాఁడ నమస్కృతు లేకభక్తి న
మ్మానిను లిద్దఱున్ మహిత
మంజులభవ్యచరిత్ర లెంచ: గం
గానది స్నానపానములఁ
గల్మషరాశి నణంచు; వాణి మౌ
ఢ్యానల మెల్ల నార్చు; వి ని
నంతనె, యూరక పల్కినంతనే; 142

కం. నిరతశుభప్రదు లజ్జ్వల
పరమకృపానిధులు దీనబాంధవు లస్మ
ద్గురువులు మాతాపితరులు
గిరితనయాశంకరులకుఁ గేలు మొగుడ్తున్. 143

కం. రామునిభక్తులు, ప్రభువులు,
ప్రేముడి సఖులైన శాంకరీపరమేశుల్,
స్వాములు నాకు నిజంబుగఁ
బ్రేమను సల్పెదరు హితము వీడక సతమున్, 144

మ. ధర దుర్గాశివదేవదివ్యకృప ను
ద్యచ్ఛక్తి భాసించె శా
బరమంత్రంబు లహా! నిరర్థపదముల్
భ్రష్టప్రలాపంబు: లా
గిరిజాశంకరు లండ నిల్చియును నా
ఖేదమ్ముఁ బోనాడి ని
ర్భరమోదాఖిలభద్రమూల మొనరిం
పన్ లేరె మత్కావ్యమున్ ? 145

ఉ. ఈవిధిఁ బార్వతీశివుల
నెంచియు, వారియనుగ్రహంబుచే
భావము ధైర్యపూర్ణమయి
భాసిల రామకథన్ రచింతు; మ
త్కావనకావ్య మా శివకృ
పామహిమంబున శోభఁజెందుఁ; దా
రావృతచంద్రదీప్తనిశ
యట్లు మహాజనతాభిరామమై. 146

చ. ఎవ రిల సావధానముగ
నీరఘురామకథ న్గ్రహించియున్
శ్రవణమొనర్తురో చదువఁ
జాలెదరో, యనురాగమొప్ప, వా
రవనిఁ గలిప్రచండకలు
షావళిఁ బాసి శుభంబు లొందియున్
భవహరరామచంద్రపద
భాగ్యముఁ గాంతురు శాశ్వతంబుగన్.

గీ. పార్వతీమహాదేవులపరమకరుణ
స్వప్నమందైన నాయందు వఱలులేని
నాదు దేశీయకృతిలో గుణంబు లెల్ల
సత్యమగుగాక! సతతంబు క్ష్మాతలమున. 148

అయోధ్యాదివందనము

గీ. అమితపావన మగు నయోధ్యాపురికిని
సకల కలికాలపాపముల్ సమయఁజేయు
భవ్యసరయూనదికిఁ జేతు వందనములు
భక్తిభావాశ్రువులు జాలువాఱుచుండ. 149

గీ. శ్రీరఘూత్తము ఘనమమకారభాగ్య
మునకు నోచిన సాకేతపురములోని
సకలనారీనరావళిచరణములకు
భక్తి గదురఁ బునఃపునఃప్రణతు లిడెద. 150

కం. సీతను నిందించిన నరు
పాతకములనెల్లఁ బాపి వాత్సల్యముతో
నాతనిశోక మణంచియు
నాతతనిజలోక మొసఁగె నారాముఁ డహా! 151

ఉ. చేసెద వందనంబులను
జేతులు రెంటిని బైకినెత్తి నే
నాసకలప్రపంచహితుఁ
డాఖలమేఘసమీరుఁ డాజగ
ద్భాసురరామచంద్రభగ
వానుఁడు తా నుదయించినట్టి శ్రీ
కోసలజానుపూర్వదిశ
కున్ భువనైకయశఃప్రభావకున్. 152

గీ. పుణ్యములప్రోవు మంగళములకు రాశి
యనుచు రాజీసమేతుఁడై యతిశయిల్లు
దశరథేంద్రున కేను వందనముఁజేతుఁ
దన తనూజుకింకరుఁడని దయఁదలంప. 153

కం. మహిమకు నవధు లనందగు
మహితాత్ములు రామచంద్రుమాతాపితరుల్
మహి వారి సృజించి పితా
మహుఁడును ఘనుఁడయ్యె దేవమధ్యమునందున్.

ఉ. శ్రీరఘురాముపాదరత
చిత్తుఁడు నిక్కపుభక్తుఁ, డాతఁ డా
హా! రఘువీర ఘోరవిర
హాకులభారతృణీకృతాత్మకా
రీరకమోహుఁడై పరిహ
రించెను బ్రాణచయంబు; నమ్మహో
దారగుణాబ్ధియౌ దశర
థప్రభు నెంచి సభక్తి మ్రొక్కెదన్, 155

చ. అనుపమయోగభోగముల
యందున దాఁచి నిగూఢపద్ధతిం
దన దగురామచంద్రపద
తత్పరభక్తిని; రామచంద్రద

ర్శన మయినంత బెల్లుబుక
సాధువిలోక్యగభీరభక్తుడై
ఘనపరివారయుక్తుడయి
క్రాలు విదేహున కేను మ్రొక్కెదన్,

చ. నిరుపమసత్తపోవ్రత వి
నిర్మలధర్మపథాతినిష్ఠుడున్
వరరఘురామచంద్రపద
పంకజలుబ్ధమధువ్రతాత్ముడౌ
భరతుని మంగళాంఘ్రులను
భావమున న్మనుముందు కొల్చెదం
దరుగనిభక్తి నిచ్చి తన
దాసునిగా నను స్వీకరింపగన్. 157

ఉ. రామవిశుద్ధభద్రకరి
రమ్యయశోధ్వజదండ మౌచు నీ
భూమి జరించినట్టి బహు
పుణ్యసులక్షణుడై నలక్ష్మణ
స్వామివరేణ్యశీతలసు
భక్తసుఖప్రదసుందరాంఘ్రులన్
నా మదిలోన నిల్పి భజ
నంబొనరింతు నితాంతభక్తితో. 158

చ. తనదుసహస్రశీర్షముల
ధాత్రి భరించెడుశేషమూర్తి ల
క్ష్మణుడయి భూభయం బణచి
కాచెను సంకులసాధులోక; మా
గుణనిధి, సత్కృపాజలధి,
కోమలభావుడు, రాముసోదరుం
డనవరతంబు నాయెడ ద
యామతితోడ బ్రసన్నుడయ్యెడున్.

గీ. చండశౌర్యుడు, సచ్ఛీలసాగరుండు,
సతతభరతాంఘ్రియుగ్మానుసారి యైన
పూజ్యశత్రుఘ్ననడుగుదమ్ములకు నేను
వందనము సేయుచున్నాడ భక్తితోడ. 160

ఉ. కేవలరామచంద్రముఖ
కీర్తితకీర్తి, ఖలాసురాటవీ
పావకమూర్తి, జ్ఞానఘన
వారిధి, మారుతి, చాపయుక్తసీ
తావరదీప్తహృత్స్థలుడు,
దారుణసంగరరంగపండితుం
డై వెలుగొందు శ్రీహనుమ
నంజలిబద్ధుడనై నుతించెదన్. 161

ఉ. న్యూనశరీరము ల్లలిగి
యున్నను, శ్రీరఘురామసన్నిధి
శ్రీని గడించుకొన్నకపి
శేఖరజాంబవదంగదాదిస
ద్వానరవీరసైన్యముల
భవ్యమనోజ్ఞపదాబ్జకోటికిన్,
దానవరాడ్విభీషణు ప
దంబుల కే నొనరింతు బూజలన్. 162

కం. జగమున నిష్కామముగా
జగదీశ్వరుడై న రామచంద్రుని సేవం
దగ నొనరించినభక్తుల
ఖగమృగసురమర్త్యదైత్యగణముల గొలుతున్.

కం. మునివరు, లఖండభక్తులు,
ననుపమవిజ్ఞానరాసు, లద్భుతకరుణా
ధును లగుశుకసనకసనం
దననారదమునులయడుగుదమ్ములఁ గొలుతున్.

చ. అమ్మిథిలేంద్రుకూర్మితన
యామణి, యీపదునాల్గు భూరిలో
కమ్ములఁ గన్నతల్లి, రఘు
కాంతునిపట్టపురాణి, యైన సీ-
తమ్మపదాంబుజమ్ములకుఁ
దద్దయు భక్తిని మ్రొక్కిచుంటి, మా
యమ్మ-కృపామహత్త్వము మ
దాత్మను శుద్ధ మొనర్పకుండునే! 165

ఉ. విచ్చిన తమ్మిఱేకులటు
వెల్లెడి కన్నులవాఁడు, దుష్టుల
వ్రచ్చు ధనుశ్శరంబులఁ గ
రంబులఁదాల్చినవాఁడు, కూల్చి యా
పచ్చయముల్, సుఖం
బొసఁగువాఁ డగురామునిసర్వశక్తిభా-
స్వచ్చరణారవిందముల
భక్తి భజించెద నేఁద్రిశుద్ధిగన్. 166

గీ. పైకిఁజూడఁగ భిన్నులవలెనె తోఁచి
కాంచ వాగర్థజలవీచికలుగ నుండి
వాస్తవంబున నేకమై వఱలు నట్టి
యార్తజనబాంధవులు, కరుణాబ్ధు లైన
జానకీరాములకు నమస్కార మిడెద. 167

శ్రీరామనామప్రభావము

గీ. *ఎది కృశానుభానులకును హిమకరునకుఁ
గారణం బగు నారఘుకాంతు 'రామ
నామ' మున కెప్పుడును వందనం బొనర్తుఁ
బరమభక్తిసంపూరితభావమునను. 168

కం, ♦ శ్రీరామనామ మహహా!
నీరజభవవిష్ణురుద్రనిలయము, వేదా
ధారము, నిర్గుణ, మసమము,
చారుసుగుణరత్నములకు సాగర మెన్నన్. 169

కం. శ్రీరామమహామంత్రము
గౌరీపతి జపముసేయుఁ గాశికయం; దా
తారకమంత్రమె మృతులకుఁ
గారణమై మోక్ష మీయ ఘనత వహించెన్. 170

కం. వరరామమంత్రమహిమం
బెఱుఁగును గణనాథుఁ; డాతఁ డీయాక్రియలన్
స్థిరముగఁ దొలిపూజలు గొను
టరయమె శ్రీరామమంత్రమందలిమహిమన్. 171

కం. తెలియును బ్రథమకవీంద్రుం
డలఘుశ్రీరామనామమందలిమహిమన్

---

* అకారాది క్షకారాంతములగు నేఁబదివర్ణములకు నధిష్ఠానదేవతలు కలరనియు, 'ర'కార మగ్నిబీజమనియు, 'అ'కారము సూర్యబీజ మనియు, 'మ' కారము చంద్రబీజ మనియు మంత్రశాస్త్రము నిర్వచించును. అజ్ఞాన మను నంధకారమును బాఱఁద్రోలునది జ్ఞానప్రకాశము. ఆ ప్రకాశమున కధిష్ఠానదేవతలు సూర్యచంద్రాగ్నులు. వారికి బీజములు 'ర' కార 'అ' కార 'మ' కారములు. అందుచే నామూఁడు వర్ణములతోఁ గూడిన రామనామ మగ్నిసూర్యచంద్రులకు హేతువని వచింపఁబడినది.

♦ అగ్ని శివరూపము; సూర్యుఁడు విష్ణురూపము; చంద్రుఁడు బ్రహ్మరూపమని పురాణప్రసిద్ధి. అందుచేత రామనామము త్రిమూర్త్యాత్మకము. అది రకార అకార మకారాత్మకమై ప్రణవమునకు మఱియొకరూపమని తత్త్వవేత్తలనుడి. అందుచేఁ దారకము ప్రణవసహితముగ లేదు. ప్రణవము వేదముల కాద్యవర్ణ మైనందునఁ బ్రణవస్వరూపమైన రామనామము వేదముల కాధారమైనది; త్రిగుణాతీతజ్ఞానమే రామస్వరూపము; గావున నిర్గుణము; అది యజ్ఞానహరణము; ఆనందసంధాయకత్వాదిగుణములు కలది; గాన రామనామము సర్వసుగుణరత్నసాగరము.

దలక్రిందుగ నా మంత్రము
బలికియు వాల్మీకి లోకపావనుఁ డయ్యెన్. 172

గీ. 'రామ' యనునామము సహస్రనామతుల్య
మని యెఱింగి యుమాదేవి హరునివలన
భక్తితో నిత్యమును దనభర్తతోడ
భవ్య మగు రామనామజపంబు సేయు. 173

గీ. పార్వతీహృదయంబున భాసురమగు
రామనామానురక్తి హర్షమును బెంచ
శంకరుఁడు తనమేని భూషణ మొనర్చె
శ్రీవిభూషణ మగు నుమాదేవి నహహ! 174

కం. శ్రీరామ మంత్రమహిమను
గౌరీపతి యెఱుఁగు బాగుగాఁ; గావుననే
ఘోరవిషానల మౌరా!
మాఱెను దివ్యామృతముగ మంగళకరమై. 175

గీ. రామపదపద్మభక్తి వర్షర్తు; వమల
భక్తులో వరిమొక్కలవంటివారు;
'రామ' యనునట్టి రెండు వర్ణంబు లెన్నఁ
దగును శ్రావణ- భాద్రపదంబులుగను, 176

గీ. 'రామ' యనునట్టి రెండక్షరంబు లహహ!
మధుర మంజులములు; వర్ణమాల కవ్వి
నేత్రములు రెండు నౌచును నెగడుచుండు;
పరమభక్తుల కవియె జీవనము లగును! 177

కం. సులభము, సుఖదము, స్మరణము
సలుపఁగ నెల్లరకు రామసన్మంత్ర మహా!
కలిగెడు నిహపరసుఖములు
సలలిత మగు రామనామసంస్మరణమునన్. 178

కం. పలుకఁగ, వినఁగ, స్మరింపఁగ
సలలితమధురములు 'రా' 'మ' సద్వర్ణంబుల్
తులసికి రాఘవసోమి
త్రులవలెఁ బ్రియమైన వివ్వి స్తోత్రము సేయన్.

గీ. 'రామ' యను వర్ణములను వేర్వఱుచి వర్ణ
నమ్ము సేయ వేర్వేఱు సుఖమ్ము లొదవుఁ;
గాని యా వర్ణములు రెండుగాక యొకటె;
జీవుఁడును బ్రహ్మ మేకమై చెలఁగురీతి
నవ్వి యేకమై యద్వయహర్ష మొసఁగు. 180

కం. నరనారాయణులట్టుల
వఱలెడు నా 'రామ' నామవర్ణద్వయమే
పరిపాలించుచు జగములఁ
గరుణను నిజభక్తకోటిఁ గాచు సతంబున్. 181

కం. భగవద్భక్తిసతీమణి
కగు కర్ణవిభూషణంబు; లాదిత్యేందుల్
తగ మేలొనఁగూర్చుటలో
జగముల; కా 'రామ' యనెడిసద్వర్ణంబుల్. 182

గీ. మోక్షసుధకు మాధుర్యసమ్మోదములుగ
వసుధ కాదికచ్ఛపభోగిపతు లనంగ
నతిశయిల్లుచున్నడి; 'రామ' యను ప్రసిద్ధ
పతితపావనమై యున్న వర్ణయుగము. 183

గీ. భక్తమానససుందరపద్మములకు
భ్రమరరాజ మీ రామమంత్రంబు సతము;
జిహ్వఁ యను యశోదను సంతసింపఁజేయు
రామకృష్ణు లీ 'ర' 'మ' వర్ణములు రెండు. 184

గీ. సర్వవర్ణంబులకును 'రా' ఛత్రముగను
మకుటమణిగా 'మ' కారము మఱి వెలుంగ

రామచంద్రునిపావననామ మఖిల
దివ్యమంత్రరాజంబయి తేజరిల్లు. 185

కం. ఎఱిఁగిన నామము నామియు
నిరువురు సమ మైనవారలే; ప్రభుభటుల
ట్లిరువురు పరస్పరప్రియు;
లరయుఁడు నామప్రభావ మద్భుత మహహా! 186

ఉ. శ్రీధరునామరూపములు
రెండును జింతన సేయ నీశ్వరో
పాధులు; రెండునున్ విజిత
వాక్కు, లనాదులు, శుద్ధబుద్ధిసం
సాధనయోగ్యమైన; వప
చారము సేయుట యౌను రెంట భే
దాధమదృష్టి గొప్ప దొక
టౌ,మఱియొక్కటి న్యూన మన్నచో.187

గీ. రెంటిలోఁ గల గుణములరీతి విన్న
ధీరు లగుసజ్జనులె మదిఁ దెలియఁ గలరు;
అరయ రూపము నామవశ్యముగఁ దోఁచు
నెఱుఁగకయె పేరు, రూపము నెఱుఁగలేము. 188

కం. కరమున రత్నం బుండియు
నెఱుఁగక యద్దానినామ మెఱుగంగలమా?
గురుతరవస్తువిశేషము;
నరయుఁడు నామంబులోనియద్భుతమహిమన్.189

ఉ. రూపము నెంచకుండఁగనె
రూఢిగ నామము సంస్మరింప, నా
రూపము కానవచ్చు నెద
రూఢిగ దివ్యసుఖంబు గల్గు; నా
శ్రీపతినామరూపగతిఁ
జెప్ప నశక్యము; వానితత్త్వమున్
లోపల సంగ్రహించిన న
లుప్తమహాసుఖ మబ్బితీరెడిన్. 190

గీ. సగుణనిర్గుణములమధ్య సాక్షి యగుచు
నరయ నుభయప్రబోధక మగు ద్విభాషి
యగుచు నామము వెలుఁగొందు ననవరతము;
దానిమహిమము వర్ణింపఁ దరము గాదు! 191

కం. తులసి వచించెడి దేమన
వెలుపల లోపలను నీకు వెలుఁ గవసరమా?
నిలుపుము జిహ్వాగేహా
మలహర మగు రామనామమణిదీపంబున్. 192

చ. పరమవిరాగదృష్టిని బ్ర
పంచమునెల్లఁ బరిత్యజించియున్
నిరతనివృత్తు లైనమహా
నీయులు యోగులు రామనామసం
స్మరణము సేయుచున్ సతత
జాగృతి గల్గియుఁ గాంతు రాత్మ న
క్షర, మగుణంబు, నిస్తుల మ
చర్చ్యమునై మను బ్రహ్మసౌఖ్యమున్.

గీ. పరమగూఢమౌ పరతత్త్వ మెఱుఁగఁ గోరు
వార లీ రామనామజపంబుఁ జేసి
యయ్యనన్యక్రియాప్య మత్యధికమైన
బ్రహ్మతత్త్వానుభూతిని బడయఁ గలరు. 194

కం. సిద్ధులఁ గోరెడివారలు
శ్రద్ధగ శ్రీరామనామజప మొనరింపన్
సిద్ధిలు నణిమాది నిఖిల
సిద్ధులు; సకలార్థసమితి చేకురు నెపుడున్. 195

కం. పడియును దుఃఖాగ్నులలో
నిడుములఁ బడుచున్న మర్త్య లేర్పడఁజేయన్
పిడువక నామజపంబును
గడచియుఁ గష్టాంబురాశిఁ గాంతురు సుఖముల్.

చ. అరయఁ *జతుర్విధప్రభుప
దాంబుజభక్తులు పూజ్యులుర్వి, ని
ర్ధరితు, లుదారు, లీ నలుగు
రున్ హరినామసమాశ్రితాత్ములై
వఱలెద; రందు, జ్ఞాని యగు
భక్తునిమీఁదనె ప్రీతి యెక్కు-డా
హరికిఁ; ననన్యభావసహ
జాద్భుతభక్తియె శ్రేష్ఠ మన్నిఁటన్. 197

గీ. నాల్గుయుగములలోనను నాల్గుశ్రుతుల
నామమహిమంబు కాంచె ఘనప్రసిద్ధి;
కాని కలిలో విశేషము; కలియుగమున
నామజపమే శరణ్య మన్యంబు గాదు. 198

కం. కామవిహీనులు, నాత్మా
రామామలపరమభక్తిరసలీనులు, ని
ష్కా-ములు సైతము గారే
నామసుధాహ్రదసుమీన నమ్యమనస్కా-ల్. 199

గీ. నిర్గుణసగుణములు రెండు, నిరుపమంబు
లకథనము, లగాధమ్ము, లనాదులైన
యా పరబ్రహ్మరూపంబు లవును; నాకు
నామ మీ రెంటికంటె ఘనముగఁ దోఁచు. 200

ఉ. ఎందులకన్నచో సగుణ
మేనియు నిర్గుణమేని రెండు గో
విందునినామవశ్యములు;
విజ్ఞులు నా నుడి ప్రౌఢవాక్కు-గా
డెందమున న్దలంపరుసుఁ
డీ! యనుభూతినిఁ బ్రీతినిన్ రుచిం
బొంది వచించుచుంటినిఁబ్ర
పూజ్యము, శ్రేష్ఠము నామమేసుమా. 201

కం. అగుణము దారుగతాగ్నిగ,
సగుణము బహిరంగవహ్నిచందము వెలుఁగుం
దగ నీ రెండును దుర్లభ
మగునవియే గాని సులభ మైనవిగావే: 202

ఉ. కాని, ముకుందనామజప
కార్యముచే, గుణయు-క్తనిర్గుణ
జ్ఞానయుగంబు లభ్య మగు;
సత్య మెఱింగియె మీకు నిర్గుణం
బైనటువంటి బ్రహ్మమును
నా సగుణుం డగురాము మీఱి మే
లైనది రామనామము సు
మా: యని నేను వచింతు రూఢిగా. 203

గీ. అఖిలవస్తుసంవ్యాపక, మద్వయంబు,
సత్య, మవినాశకంబు, విజ్ఞానఘనము,
మఱియు నానందరాశి బ్రహ్మంబు గనఁగ
నద్ది సర్వజీవాత్మల యందుఁ గలదు. 204

గీ, అట్టి యవికార మగుబ్రహ్మ మాత్మలోనఁ
గలిగియును జీవకోటి దుఃఖమును విడదు;
కాని నామనిరూపణ కార్యమునను,
జపముచేతను బ్రహ్మదర్శనము గలుగు
సులభముగ; వ్రీలి నశియించు శోకతమము. 205

గీ. నిర్గుణబ్రహ్మమును మించి నెగడుచున్న
నామమహిమ వచించితి; నామ మింక
సగుణ మగు బ్రహ్మమునకంటెఁ జాల నధిక
మని వచింతును; నేను గాంచినవిధాన. 206

---

* చతుర్విధభక్తులు: 1 ఆర్తులు 2 అర్థార్థులు 3 జిజ్ఞాసువులు 4 జ్ఞానులు

ఉ. రాముఁడు భక్తసంఘముల
రక్షణ సేయ మనుష్యమాత్రుఁడై
బాములకోర్చి సాధుజన
బాధలఁ బాపెను; గాని నామమో!
యీమహిలో జపింప శ్రమి
యింపకయే సులభంబుగా మహో
ద్దామముదంబు, మంగళక
దంబము, భక్తుల కిచ్చి కాచెడిన్. 207

కం. రాముం డొక్క యహల్యను
బ్రేమను తా నుద్ధరించెఁ బృథ్విని; కానీ
నామమొ! కోట్లకొలందిగఁ
బామర దుర్జన కుమతులఁ బాగొనరించెన్. 208

కం. మునిహితమునకై రాముఁడు
తునిమెను దాటకను సేనతోడ సుబాహున్;
గనఁగా నామమొ: యగణిత
జనదుఃఖము లుగ్రపాపచయములు దునిమెన్. 209

కం. రాముఁడు స్వయముగ విఱిచెను
భీమంబగు శివధనుస్సు; విజయంబొప్పన్
నామప్రతాపమాత్రము—
చే మడియును భవభయంబు చిత్రముగాఁగన్. 210

కం. రాముఁడు దండకవన మభి
రామముగాఁ జేసెఁ బాదరాజీవములన్
నామమొ! కోట్లకొలందిగఁ
బామరజన మానసముల భవ్య మొనర్చెన్. 211

కం. రాముఁడు దైత్యగణంబుల
భూమిని దా సంహరించె; భుజబలదీప్తిన్
నామమొ! స్మరణముచేతనె
భీమంబగు సకలకలుషబృందముఁ గూల్చెన్. 212

కం. రాముఁడు జటాయు శబరీ
నామకసద్భక్తవరుల, నమ్మినవారిం
బ్రేమను సద్గతి కంపెను;
నామమొ! యమితోగ్రదుర్మనస్కులఁ గాచెన్. 213

కం. కపిపతిరాక్షసపతులకుఁ
గృపతో నిర్వ్యరకు శరణ మిచ్చెను రాముం;
డుపమింపంగను నామమొ!
కృపతో నిర్ధనుల నెందఱినొ రక్షించెన్. 214

కం. సేతువుఁ గట్టఁగ రాముఁడు
కోతుల భల్లూకములను గూర్చి శ్రమించెం
బ్రీతిని నామముఁ దలఁచినఁ
బాతకభవవార్ధి యింకు బహుచిత్రముగన్. 215

ఉ. రాముఁడు రావణాదుల దు
ర్దంబునఁ గూల్చి యయోధ్య కేగియుం
బ్రేమ దలిర్ప నేలి జన
బృందముల న్సుఖపెట్టె; రాము శ్రీ
నామము మోహశత్రువుల
నాశమొనర్చి రణంబు లేకయే
క్షేమముఁ గూర్చి భక్తులకుఁ
జింత లణంచును శాశ్వతంబుగా 216

చ. కన సగుణంబు నిర్గుణము
గాఁదగు బ్రహ్మముకంటె నామమే
తనరును శ్రేష్ఠ మౌచు; వర
దాతల కయ్యది దాత; గానఁ గై
కొనెను శివుండు దివ్యశత
కోటిసువిస్తరరామగాథలో
ఘనమగు రామనామము న
ఖండమహాద్భుతశక్తిదీప్తమున్. 217

కం. నామప్రసాదముననే
ఆ మహితుం డైనశంభుఁ డమృతుం డయ్యెన్
నామమహ త్త్వమె కాదా
కామారి శివత్వ మొందఁ గారణ మయ్యెన్. 218

కం. శ్రీశుకసనకప్రముఖ ము
నీశులు సుజ్ఞానసిద్ధ పృథుతరయోగుల్
శ్రీశునినామముచే నవి
నాశం బగు బ్రహ్మపదమునన్ మన లేదా? 219

కం. భగవన్నామమహ త్త్వము
భగవంతుఁడు నారదుండు బాగుగ నెఱుఁగున్;
జగతీప్రియహరిహరులకుఁ
దగ నాతం డిష్టుఁడయ్యెఁ దన్నామముచే. 220

కం. మేదిని భగవన్నామము
నాదరమున నాత్మలోన ననయం బా ప్ర
హ్లాదుఁడు స్మరియించుటచేఁ
గాదా? సద్భ క్తగణశిఖామణి యయ్యెన్. 221

కం. తన పినతల్లి దురుక్తుల
మనమున ఖేదంబుఁజెంది మహిలో ధ్రువుఁడున్
వని హరినామజపంబునఁ
గనఁడే? సుస్థిరసుపూజ్యఘనతరపదమున్. 222

కం. శ్రీరాము భవ్యనామము
మారుతి జపియించుచుంట మదిలోఁ బడసెన్
శ్రీరాముని తనవశమున
నేరుపుతో నుంచఁగలుగు నిరుపమశ క్తిన్. 223

ఉ. ఎంచ నజామిళుండును, గ
జేంద్రుఁడు, వేశ్యయు, హీనులైన, వా
రెంచి ముకుందనామము త
రించిరి; ఎంతని నామశ క్తి వ
ర్ణించెద? నే; నపారమగు
రీతిగ వెల్గెడి రామనామది
వ్యాంచితసద్గుణంబుల న
హా! వచియింపఁగ లేఁడు రాముఁడున్.

కం. తలఁచియు నామము మాత్రెను
దులసిగ భంగ్యాకువంటి తులసీదా; నీ
కలిలో భగవన్నామం
బల కల్పక మఖిలమంగళాలయ మహహా! 225

గీ. నాలుగుయుగంబులను మూఁడుకాలములను
మూఁడులోకంబులను నామమును జపించి
భూతకోటులు దుఃఖవిముక్తిఁ గాంచు;
నామమాహాత్మ్య మేరి కెన్నంగఁ దరము! 226

గీ. సర్వవేదపురాణసజ్జనమతంబు
"అఖిలపుణ్యఫలంబుగా నమల మైన
రామపాదసరోరుహప్రేమ కలుగు"-
ననెడి విషయమే బాగుగా నరయునెడల! 227

కం. అల కృతయుగమున ధ్యానము
సలిపియుఁ, ద్రేతాయుగాన సలిపి మఖంబుల్,
వెలయఁగ ద్వాపరమునఁ బూ
జలు సల్పి, ముకుందుఁ గనిరి సజ్జను లెల్లన్. 228

కం. కలుషావాలము, కేవల
మలినాకర మైనకలిని మానవచిత్తం
బులు, పాపసముద్రములో
మెలఁగెడిమత్స్యంబు లౌర! మేదినిలోనన్. 229

కం. అలఘుభయంకర మగు నీ
కలిలో నామంబె కల్పకద్రుమ మాహా!
తలఁచినమాత్రముచే నది
తొలఁగించు సమస్తలోకదుఃఖాకులతన్. 230

కం. కలిలోఁ గోరెక్కలఁ దీర్పఁగ,
నెలమిని పరమందు శాంతి, హిత మొనరింపన్,
దలిదండ్రులవలెఁ గావఁగ
నిలలో, శ్రీరామనామమే శరణంబౌ। 231

కం. నిలువదు కర్మయు, భక్తియు,
నిలువదు జ్ఞానంబు; కలుషనికరంబౌ నీ
కలియుగమందు శరణ్యము
సలలిత మగు రామనామసంస్మరణంబే। 232

కం. ఖలగుణకపటాంబుధియగు
కలియుగ మను కాలనేమిఁ గడతేర్ప, మహా
బలుఁడును, బుద్ధివిశాలుం-
డలఘుం డగుహనుమ యగును హరినామ మిలన్.

కం. కలియుగహిరణ్యకశిపుని
ఖలునిం జెండాడి జాపకజనప్రహ్లా
దులఁ గాచునృసింహుం డీ
యిలలో శ్రీరామనామ మెన్నఁగ నహహా। 234

కం. కుమతినొ, సుమతినొ, మఱియున్
బ్రముదముననొ, క్రోధపూర్ణభావముతోనో
అమలము నామముఁ దలఁచిన
నమితము లగుశుభము లొదవు నఖిలస్థలులన్.235

శ్రీరాముని ఔదార్యము

ఉ. అట్టి శుభంకరం బయిన యా
రఘురామునినామ మేను చే
పట్టి, స్మరించి, రామపద
పద్మములన్ దల వాల్చి, మ్రొక్కియున్

గట్టులు లేని రామగుణ
కంధిని వర్ణనసేతు రామస
మ్రాఁటి మదీయదోషముల
మంజులదృష్టిని సంస్కరించెడిన్. 236

కం. తనయుఁడు ధూళిని బ్రుంగఁగఁ
గని కైకొను మాత వానిఁ గరుణామతితోఁ
దనప్రియ భక్తుల కెపుడును
ఘనమగు హరికరుణ హానిఁగలిగింప దహా। 237

ఉ. రాముఁడు సత్ప్రభుం డగుచు
రాజిలు; నే నొకసేవకుండఁ; గా
నీ మదిలోన నా యమిత
నీచగుణంబులఁ జూడఁబోక, నా
స్వామి స్వకీయమౌ ఘనకృ
పానిధి య న్నిరుదంబుఁజూచియే
క్షేమముఁ గూర్చె నాకు; హరి
కేవల మా కరుణాబ్ధియే సుమా। 238

కం. ఘనుఁడగు నుత్తమనరపతి
వినినంతనె విన్నపంబు వినతజనప్రే
మను గుర్తించునటంచును
వినవచ్చును లోకమందు, వేదములందున్. 239

గీ. వివిధజనములు తమతమ వివిధగతులఁ
బ్రస్తుతింపఁగ వినియు సద్వర్తనుండు,
విష్ణుఁ, డీశ్వరాంశజుఁడైన విభుఁడు వారి
వారికి న్దగురీతి సత్కార మొసఁగు. 240

మ. ఇది సామాన్యనృపాలపద్ధతి; యయో
ధ్యేంద్రుండు చాతుర్యధీ
సదనుం డించుక, ప్రేమమాత్రముననే,
సంతృప్తుఁడై కాచెడిన్;

వెదకఁ ధాత్రిని నన్నుఁబోలు శఠుఁడున్,
భీష్మాఘచిత్తుండు, దు
ర్మదుఁ డెందు న్గనవచ్చు? రాముని
కృపామాహాత్మ్యము న్గాంచుఁడీ! 241

చ. పరమదయాళు వౌట రము
వల్లభుఁ డౌర! మహానురాగముఁ
బఱపును దుష్టసేవకుల
పైనను సైతము; నీటియందునం
బరువగురాళ్ళుఁ దేల్చెఁ; గపి
భల్లుకకోట్లను స్వీయమంత్రులై
వఱలఁగఁ జేసె; రాముని కృ
పాగుణ మెంత విశాలమైనదో! 242

గీ. రామచంద్రునివంటి సత్ప్రభున కీలను
తులసిఁ బోలిన భృత్యుండు కలఁడనియెడి
సామెత జనులలోనఁ బ్రచార మగుత
మిట్టి నింద రాఘవుఁడు సహింపఁగలఁడు. 243

గీ. నాదు ఘనసాహసంబును, నాదు ఘోర
దోషమును, నాదు భీకరదురితములను
వినియు నరకంబు సైతము విసుఁగుఁ జెంది
ముఖము ముకుళించుకొని, ముక్కుమూసికొనును.

గీ నాదుచరితంబు దలఁపఁగా నాకు భయము
కలుగుచున్న; దియ్యది స్వయంకల్పితంబె;
స్వప్నమందైన శ్రీరామచంద్రమూర్తి
నిఱపలేదు స్వదృష్టి నా కలుషములను, 245

గీ. నాదు ప్రభువైన రాముఁడు నన్నుఁ గూర్చి
వినియుఁ, జూచి, విచారించి విమలదృష్టి
నాదు భక్తిబుద్ధులఁ దెగనాడఁడయ్యె
సరిగదా! ప్రేమతోడ ప్రశంసచేసె. 246

గీ. పలుకులను జెడుగున్నను భావమందు
మంచి యుండఁ గావలయును మహితరీతి;
భక్తహృదయాలలోఁ గల భావమెఱిఁగి
సంతసించును శ్రీరామచంద్రమూర్తి. 247

చ. తన పదకింకరుల్ సలుపు
తప్పులు నిల్వఁగలేవు సత్కృపా
ధుని యగు రాముచిత్తమున;
దోషముల న్గనకుండ రాఘవుల్
తన పదభక్తులందుఁగల
తల్లవలేశపు మంచినే అహా!
మనమున సంస్మరింత్రు పలు
మాఱు లఖండకృపాప్రపూర్ణులై. 248

ఉ. ఏవిధమైన దోషము స
హింపక తా నొకవ్యాధునట్లు సీ
తావిభుఁ డుగ్రమూర్తి యయి
ధాత్రినిఁ గూల్చెనొ వాలిఁ గోలతో
నా విధమైన దోషమునె
యా కపిసంఘవరేణ్యుఁ డైన సు
గ్రీవుఁడు సేయ నోర్చె నహ!
కేవలకింకరపక్షపాతియై. 249

ఉ. ఆపనినే విభీషణుఁడు
నాచరణం బొనరించెఁ; గాని సీ
తాపతి స్వప్నమందయిన
దానిఁ దలంపక సత్కరించె నెం
తో పరమానురక్తి భర
తున్ మహితాత్మునిఁ గూడువేళ; నా
హా! పలికె న్సభాస్థలిని
నాతని శీలమునే కృపామతిన్. 250

కం. రాముఁడు వృషిముదిగువను,
నా మర్కటకోటి కొమ్మలందునఁ దిరుగున్
రాముఁడు తనతో సమముగఁ
బ్రేమను గపికోటిఁ జేసె వీక్షించుఁ డహో! 251

కం. తులసీదాసుఁడు జగతికిఁ
దెలుపున దేమనఁగ, రామదేవునితోడ
దులఁదూగు శీలజలనిధి
కలుగఁడు ముల్లోకములను గాలించిననేన్. 252

కం. రామా! నీ సౌశీల్యము
ప్రేమను సర్వులకు శుభము శ్రీల నొసఁగు సు;
మ్మీమాటయె నిజమైనను
క్షేమమె, యీ తులసి కొదవు స్థిరతరరీతిన్. 253

కం. నా గుణదోషము లీ విధి
బాగుగ వివరించి, యెల్లవారికి భక్తిన్
సాగిలి, రచియించెద ననుఁ
రాగముతోఁ గలివిభంగరామాయణమున్. 254

శ్రీరామచరితమానసమాహాత్మ్యము

ఉ. ఈయతిరమ్యమౌ రఘుకు
లేశ్వరదివ్యచరిత్ర మాదిలోఁ
బ్రేయసిఁజైన పార్వతికిఁ
బ్రీతి శివుండు వచించె దాని నా
ప్యాయముగా వచించె హరి
భక్తవరుం డధికారి యౌటచే
వాయసరూపమౌని యగు
పావనకాకభుశుండి కాపయిఁ, 255

గీ. ఈ మహోన్నతమైన శ్రీరామచరిత
భక్త కాకభుశుండిచే భవ్యలీల
యాజ్ఞవల్క్యమహాముని యాలకించి
దాని వినిపించెఁ దా భరద్వాజమునికి. 256

మ. అరయఁ వక్తయు, శ్రోత యిర్వురును దీ
వ్యత్తుల్యసంశీలు; రా
హరిలీలావిదు; లాత్మనిష్ఠులును; స
మ్యగ్దర్శనుల్; పావనుల్;
కరపద్మామలకంబు వారి కెపుడుం
గాలత్రయాఖ్యానముల్
ధర నీ సంఘటనంబు కేవలము సీ
తానాథుకారుణ్యమే! 257

చ. మఱియు మహానుభావులు, ర
మాధవులీలల డెందమందుఁ దా
మెఱిఁగినభక్తు లెందఱొ య
నేకవిధంబుల రాముగాథలం
దఱుగక చెప్పుచుందురు; స
దా వినుచుందురు; శ్రద్ధ గల్గియుం
గొఱవడకుండఁగాఁ దెలిసి
కొంచు సుఖించుచు నుందు రాత్మలన్.

గీ. మరల నా కథ నేను నా గురువరేణ్యు
చేత వింటిని సూకరక్షేత్రమందుఁ
గాని బాలుఁడనౌట నజ్ఞానవశతఁ
దెలియలేనైతి నాకథ తెల్లముగను. 259

ఉ. రామకథాప్రవక్తలును,
రామకథాశ్రవణైకశీలు, రు
ద్దామవివేకవార్ధు లయి
తాము వెలుంగుచునుందు; రే నహో

పామరుఁడన్; మహోగ్రకలి
పాపముఖగ్రసితుండ; మూఢుఁడన్
ఛీ! మతిలేని యట్టి జడ
జీవుఁడ రామకథన్ గ్రహింతునే? 260

ఉ. ఐనను నా గురూత్తముఁ డ
నంతదయాన్వితుఁడా చరిత్రమున్
మానక బోధసేయఁగను
మాటికి మాటికిఁ దత్కథార్థవి
జ్ఞానము కొంచె మబ్బినది;
స్వాత్మ ముదం బొనఁగూర్చురీతిగా
దాని రచించెదన్ గురుప
దంబుల నెంచుచు దేశభాషలో. 261

ఉ. పాయక నాకుఁగల్గిన ల
వంబు వివేకబలంబు తోడుగా,
నాయెదలోన నిల్చి రఘు
నాథుఁడు ప్రేరణ సేయురీతిగా,
నా యవివేకసంశయమ
ణంపఁగఁ గల్గినభవ్యమైన రా
మాయణమున్ భయంకరభ
వార్ణవతారకమున్ రచించెదన్. 262

గీ. పండితశ్రమాపహము, సర్వప్రపంచ
రంజకము, కలికలుషవిభంజకంబు,
దురితకలిసర్పఘనవిషహరణభరణి,
జ్ఞానపావకారణి రామచంద్రు చరిత. 263

గీ. కలియుగాఖిల కామదకామధేను,
వఖిలసజ్జనసంజీవనౌషధంబు,
భూతలసుధాతరంగిణి, భూతసంఘ
భయవిభంజని, భ్రమభేకపన్నగంబు
నఖిల పావన మైనరామాయణంబు। 264

ఉ. ఆ యమకింకరాళిముఖ
మందున వే మసిపూఁత బూయఁగా
శ్రీయమునాప్రవంతియగు;
జీవుల ముక్తులఁజేయఁ గాశి నా
రాయణు ప్రీతికిన్ దులసి
యౌ; నిల నీ తులసీహితా ప్తి కె
ప్డేయెడ మాతయౌ *'హులసి'
యే యగు రామకథామృతం బహా। 266

చ. హరునకుఁ బ్రీతికూర్చుపని
యందున నర్మద; సర్వసిద్ధులున్
సిరులును సౌఖ్యముల్ పడయఁ
జెన్నగు బెన్నిధి; సద్గుణంబులన్
సురలకు మాతయౌ నదితి;
సుందరమౌ రఘురామభ క్తి సా
గరమున కెల్లవంటిది జ
గంబున రామకథామృతం బహా। 267

ఉ. శ్రీకరమైన రామనృప
శేఖరదివ్యకథామృతంబె మం
దాకిని; దానిచెంత స్తిమి
తంబుగ నిల్చెడి చారుచి త్తమే

* 'హులసి' శ్రీ తులసీదాసుని తల్లి.

ప్రాకటచిత్రకూటగిరి;
భక్తియె సుందరమౌ నరణ్య; మిం
దే కడుఁ బ్రీతితోడఁ జరి
యింతురు భూతనయారఘూద్వహుల్.

ఉ. రామచరిత్రరాజ మతి
రమ్యతమం బయి వెల్గుచుండు చిం
తామణి; సాధుబుద్ధి వని
తామణికిన్ శుభపూర్ణశోభ; శ్రీ
రామునిసద్గుణంబులు ని
రంతరవిశ్వహితంకరంబులై
ధామముల, న్వియుక్తిధన
ధర్మములన్ దయచేసి కాచెడిన్. 269

ఉ. జ్ఞానవిరాగయోగముల
సత్కృప నిచ్చెడు సద్గురుండు; న
జ్ఞానభవోగ్రరోగహర
ణం బొనరించెడి దేవవైద్యుఁ; డ
మ్మానితరామభక్తి నిడ
మాతయుఁ దండ్రి; సమస్తసద్వ్రతా
న్యూనసుధర్మనిష్ఠల క
హో! ఘనబీజము రామగాథయౌ; 270

ఉ. పాపము లుగ్రతాపములు
పాపును; భూపరలోకసౌఖ్యముల్
ప్రాపిలఁజేయు నెల్లరకుఁ;
భవ్యవిచారనృపాత్మమంత్రియై
ప్రాపు నొసంగు; లోభగుణ
వార్ధికిఁ గుంభజుఁడై వెలుంగు; సీ
తాపతిదివ్యసద్గుణక
దంబచరిత్ర మహాద్భుతంబుగన్. 271

చ. హరిభటచిత్తకాననము
లందలి కామము క్రోధమ న్భయం
కరకలికాలదోషగజ
కాండము నొంచెడి మేటిసింగమై
హరునకుఁ బూజ్యుఁడౌ నతిథి
యై ప్రళయోగ్రదరిద్రవహ్నిసం
హరణము సేయు మేఘమయి
యద్భుతరామచరిత్ర వెల్గెడిన్! 272

గీ. విషయసర్పవిషంబుల విఱుగఁజేయు
గరుడమంత్రము; శ్రీరామచరిత మహహ!
ఫలమందునఁగల చెడువ్రాతఁ దుడిచి
వేయుఁ నవలీల భవ్యరామాయణంబు. 273

గీ ఘోరమోహాంధకారవిదూరకారి
సూర్యకిరణంబు, శ్రీరఘువర్యుచరిత
భక్తు లనువరిమొక్కలఁ బ్రదుకఁజేయు
వర్షదబ్దంబు శ్రీరామభద్రుచరిత. 274

గీ. అభిమతార్థంబు లిచ్చుకల్పాగమంబు
హరిహరులసేవకు సులభమైన దగుచుఁ
బరమసుఖదాయకం బయి పరిఢవిల్లు
నఖిలపావన మైనరామాయణంబు. 275

గీ సత్కవీశ్వరశరదృతుసమయమందు
మానసం బను నాకాశమండలమున
వెలుఁగు తారకాగణమనఁజెలఁగు; భక్త
జీవనాధారమగు రామదేవుచరిత. 276

గీ. పుణ్యసర్వస్వఫలమహాభోగసమము;
విశ్వకల్యాణఘనకార్యవిబుధసమము;
భక్తమానసమానసపరమహంస
రమ్యపావనగంగాతరంగమాల;
అఖిలపూజిత మైన రామాయణంబు! 277

గీ. ధరఁ గుమార్గకుశీలకుతర్కకపట
దంభకలహపాషండమతంబు లనెడి
కఠినకలిదోషకాష్ఠముల్ గాల్చివేయు
చండదావాగ్ని; శ్రీరామచంద్రుచరిత. 278

గీ. రామచంద్రునికథ యనురమ్యమైన
పండువెన్నెల యెల్లరభావములకు
సంతసంబును గూర్చు; సజ్జనచకోర
కుముదములమాటఁ జెప్పఁగాఁ గోరు దేల? 279

శ్రీమానససరోవరస్వరూపము

కం. పూర్వము పార్వతి యేవిధి
సర్వేశుని బ్రశ్నచేసె? సత్కృపతో నా
శర్వుం డేమని నుడివెనొ?
సర్వము కథనంబు సేతు సజ్జనులారా! 280

గీ. ఈ కథను మున్ను మీ రెన్నఁడేని వినని
వార లాశ్చర్యపడవచ్చు; ధీరమతులు
వింతపడ రీ యలౌకికవిమలకథకు
జగతిలో నపారము రామచంద్రుచరిత
మనెడి విశ్వాస మతిగాఢ మగుచు వెలుఁగ. 281

ఉ. ఈ యవనిఁ రఘూత్తముఁ డ
నేకవిధంబులుగా జనించె, రా
మాయణ మెంచిచూడ నహ
హా! శతకోటిసువిస్తరంబు; నా
రాయణురమ్యలీలల మ
హామునివర్య లనేకరీతులన్
వ్రాయుట కల్పభేదములఁ
బట్టియె; సంశయ మొందఁబోకుఁడీ! 282

ఉ. రాముఁ డనంతుఁ డా విమల
రామగుణాబ్ధి యనంత, మట్టులే
స్వామికథావిశేషతతి
సైత మనంతము; గావునన్ బుధ
స్తోమము, సద్విచారపర
సూరినికాయము వింతఁజెంద దీ
రామకథార్థజాలబహు
రమ్యవిశేషము లాలకించియున్. 283

గీ. ఈవిధము సంశయంబుల నెల్లఁ దోలి
గురుపదరజంబుఁ దాల్చియు శిరమునందుఁ
గథ రచించుటలోఁ జెడుల్ గలుగకుండ
మరల జోహారొనర్తు నందఱకు నేను. 284

గీ. పరమభక్తితో శివదేవుచరణములకు
శిరము వంచి నమస్కృతుల్ చేసి నేను
రామచంద్రమహాగుణరమ్యచరిత
వర్ణనము సేయుచున్నాఁడ భక్తితోడ. 285

గీ. హరిపదాంబుజములపైన శిరము నుంచి
* విక్రమార్కశకంబున వెలయుచుండ
భువినిఁ బదునాఱువందల ముప్పదొకట
వఱుసవత్సరమున దీని వ్రాయుచుంటి. 286

ఉ. మించినచైత్రమందు, నవ
మీతిథి మంగళవార మేను లో
నెంచు నయోధ్యలోన నుద
యించెను మత్కృతి; రామమూర్తి జ

* క్రీ. వూ. 1574 సం.

న్మించిన యాదినాన ధర
ణి స్థలతీర్థము లెల్ల గూడి యే
తెంచు నయోధ్య కంచు విను
తించును వేదము లద్భుతంబుగన్. 287

చ. నరసురదైత్యపక్షిగణ
నాగమునీశ్వరు లయ్యయోధ్యకుం
బరుగున వచ్చి నాడు రఘు
వల్లభు సేవల జేసికొంద్రు; సం
బరమున సజ్జనుల్ కలసి
పాడుచు రామునిదివ్యకీర్తనల్
పర్వగ నొనర్చుచుందు రతి
పావనజన్మదినోత్సవంబులన్. 288

ఉ. మానక నాడు సజనులు
మంగళమౌ సరయూనదీజల
స్నానము చేసి తీరగత
సైకతశయ్యల శ్యామసుందర
ధ్యానము, రామమంత్రజప
మద్భుతభక్తిని జేయుచుందు ర
మ్మానితశుభ్రహృజ్జలజ
మధ్యమునందు మనోహరంబుగన్. 289

ఉ. శ్రీసరయూనదిన్ గనిన,
బ్రీతి, స్పృశించిన, దత్పవిత్రసం
భాసురవారి గ్రుంకినను,
బానముచేసిన, బాపసంఘముల్
వాసియు ధన్యలౌదు రని
పల్క సతంబును వేదశాస్త్రముల్
శ్రీ సరయూనదీమహిమ
జెప్పగ నేర్చునె వాణిసైతమున్; 290

ఉ. తాపవిదూరమై, పరమ
ధామదమై, త్రిజగత్ప్రసిద్ధమై,
పాపవిభంగమై, పరమ
పావనమై వెల్గొందు, నీయయో
ధ్యాపురి బ్రాణముల్ విడుచు
నల్పపు జీవియు నిక్క మెంచ నా
హా! పడిపోదు సంసరణ
మం డిక్కపైన, విముక్తినే గనున్. 291

ఉ. ఆశ్రితరక్షకంబు, సక
లాద్భుతసిద్ధిదమున్, సమస్తశో
భాశ్రయమున్, నిరంతరశు
భాలయ మైన యయోధ్యలోన నా
హా! శ్రవణైకమాత్రనిహ
తాఖిలకామమదోగ్రదంభమై
విశ్రుతి గాంచినట్టి రఘు
వీరుచరిత్రము వ్రాయబూనితిన్. 292

గీ. 'రామచరితమానస' మను నామధేయ
మున విరాజిల్లు నీకథ; పుడమి దీని
పేరు వినినంత శాంతి లభించు నెదకు,
శోకసంతప్త మానవలోకమునకు. 293

ఉ. భీమకఠోరదుర్విషయ
బృందవికీర్ణవనంబులోని యు
ద్దామమదురంతదుఃఖగణ
చావశిఖాకులచిత్తకుంభికిన్
రామచరిత్రమానసస
రస్సు సుఖం బొనగూర్చు, సత్వరం
బా మధురాతిశీతలగు
ణాంబువుల న్బడి క్రుంకులాడినన్. 294

శ్రీరామచరితమానసస్వరూపము

ఉ. శ్రీమునిలోకరంజనము
శ్రీరఘురామచరిత్ర మా శివ
స్వామి రచించె; నీ పరమ
పావనశోభనమై వెలుంగు శ్రీ
రామచరిత్రమానసస
ర స్సిలఁ గూల్చు ద్రిదోషదుఃఖదు
ర్దామదరిద్రతాకలివి
ధానభయంకరపాపరాసులన్. 295

గీ. శంభు డీరామకథ సల్పి సరసరీతి
మానసంబున నిడుకొని మంచిసమయ
మొదవినంతనె వినిపించె నుమకుఁ; గాన
'రామచరితమానస' మని రమ్యమైన
పేఁరిడెను దీని కీశుండు ప్రీతితోడ. 296

గీ. పరమసుఖదంబు మహితశోభాయమాన
మైన శ్రీరామచరితము నందముగను
పలుకుచున్నాఁడ సజ్జనవర్యులార!
చేరి వినరయ్య యేకాగ్రచిత్తు లగుచు. 297

గీ. ఎట్టి దీ రామచరిత్ర, మే విధముగ
నిద్ది రచియింపఁబడియెనో, యెందుచేతఁ
బ్రచలితం బయ్యె నిద్ది ప్రపంచమందు,
సర్వము వచింతు గౌరీశు సంస్మరించి. 298

ఉ. ఆ మదనోగ్రగర్వహరుఁ
డౌ శివదేవుకృపఁ మనస్సు కాఁ
గా మలదూర, మీ తులసి
క్ష్మాస్థలిఁ దా కవి యయ్యె, భవ్యమౌ
'రామచరిత్రమానస'వి
రాజితసత్కృతి; కేను శక్తిమై
ప్రేమ రచింతు దీనిఁ గృప
వెల్గ బుధుల్ నెరసుల్ క్షమించుఁడీ. 299

ఉ. సుమతియె భూమి యౌను; హృది
చూడఁగ లోతగు మూలమట్ట; మా
గమచయసత్పురాణములు
కంధులు; సత్కవికోటి మేఘముల్;
విమలగభీరతజ్జలద
బృందకముల్ కురియున్ మనోజ్ఞముల్
సుమధురమంగళంబు లగు
సుందరరామయశోజలంబులన్. 300

గీ. సాధుసత్కవిమేఘరాజములనుండి
బహుసమృద్ధిగ వర్షింపఁబడిన యట్టి
సగుణలీలాళి యీ మహాజలములోని
సకలమలహార మైన స్వచ్ఛత్వగుణము. 301

గీ. హరిపదాంబుజయుగ్మమ్మునందుఁ గలుగు
వర్ణనాతీత మగు ప్రేమభక్తిరసమె
అలఘు రామయశోరూపజలములోని
స్వాదుగుణమును మిక్కిలి చల్లఁదనము. 302

గీ. అట్టి రామయశోరూప మైనజలము
పుణ్యకర్మ లనెడి వరిమొక్కలకును
తతహితంకరమై రామదాసులకును
జీవనాధారమై విలసిల్లుచుండు. 303

ఉ. ఆ యతిపావనంబును, ఋ
ష్యాలయమున్, మహనీయ మైన రా
మాయణవర్షవారి శ్రవ
ణాంచితమార్గమునుండి మెల్లఁగాఁ

బోయి, సుబుద్ధినాఁబడెడి
భూమిపయిం బడి జాలువాఱి, యా
హా! యమలాత్మలో నిలుచు
నచ్చపుఁ దేనియ లూరఁజేయుచున్. 304

గీ. ఈ మహాకథయందున నెసఁగు నట్టి
నాల్గు దివ్యసంవాదముల్ నాల్గుదిశల
రామచరితమానస మను రమ్యతరము
పరమపావన మగు సరోవరములోని
బహుమనోజ్ఞ ఘట్టంబులై భాసురిల్లు. 305

గీ. సప్తకాండము లీ మహాసరసిలోని
చారుసోపానపంక్తులు; జ్ఞానదృష్టిఁ
గనినచో వీని బుద్ధి వికాస మొందు;
నిర్గుణము దుఃఖదూరమై నెగడుచున్న
రామమహిమాభివర్ణన, మీ మనోజ్ఞ
మానససరోవరజలములోని లోతు! 306

గీ. జానకీరామచంద్రభాస్వద్యశంబె
ఆ మహాసరస్సునఁగల యమృతజలము,
కనఁగ, నుపమానములు, నలంకారసమితి,
ఆ సరోవరవీచీవిలాస మగును. 307

గీ. ఇందలి మనోజ్ఞ పద్యంబు లందమైన
తామరాకులౌ, నీ కవిత్వంబులోని
యుక్తులే మనోహరమైన మౌక్తికములఁ
గన్న ముత్తెపుఁజిప్పలై క్రాలుచుండు. 308

గీ. ఇందుఁగలుగు ఛందస్సులే యందమైన
వివిధవర్ణోత్పలంబులై వెలుఁగుచుండు
భాసురార్థసమున్నతభావజాల
మధురభాష లా విమలపద్మములఁజెలఁగు
ఘనపరాగమరందసుగంధము లగు. 309

ఉ. ఇమ్మహనీయమౌ సరసి
నెల్లపుడున్ విహరించు పుణ్యభృం
గమ్ములు, సుందరంబు లయి
క్రాలెడి జ్ఞానవిరాగసద్వివే
రమ్ము లనంగ నొప్పెడి మ
రాళగణంబులు, వ్యంగ్యముల్ ధ్వనుల్
కమ్మని పాకభేదములుఁ
గా మను సుందరమీనసంఘముల్. 310

గీ. అమలధర్మార్థ కామమోక్షములు నాల్గు
జ్ఞానవిజ్ఞానఘనసద్విచారములును
జపతపోఽరాగయోగప్రసంగకోటి
నవరసంబు లీరామమానససరస్సు
నందుఁ గల చారుజలచరబృంద మగును. 311

గీ. సతతసత్కార్యనిష్ఠలౌ సాధుజనుల,
రామనామముం, గీర్తించుటే మనోజ్ఞ
మైన యీ సరోవరసీమయందు వెలయు
వింతవింతల జలపక్షిబృంద మగును. 312

గీ. సాధుసజ్జనబృందముల్ సలుపుసభలె
యీ సరస్సునకున్ జుట్టు నెసఁగుచున్న
మంచిమామిడితోఁపులు; మహితమైన
శ్రద్ధయే యతిరమ్యవసంతఋతువు. 313

చ. అమలినభక్తిమార్గవివి
ధాత్తనిరూపణముల్, దయాక్షమా
దమములు కుంజపుంజములు;
దద్దయుభాసిలుచుండునట్టి సం
యమనియమంబు లందుఁ గుసు
మావళి; జ్ఞానము సత్ఫలంబు; నా
యమృతముకుందపాదరతి
యందలిస్వాదురసంబు కాంచఁగన్. 314

ఉ. రామచరిత్రమానసస
రస్తుటసజ్జనబృందసత్సభా
రామములోన హాయిగ ని
రంతరమున్ విహరింపుచుండు నా
నామహనీయసత్కథల
నన్ జెలువొందెడి చిత్రచిత్రవ
ర్ణామలపక్షిసంఘములు,
రమ్యములౌ శుకముల్, పికంబులున్.315

చ. పులకలు చుట్టుప్రక్కలఁ బ్ర
మోదవనోపవనంబు; లాత్మలోఁ
గలిగినపారవశ్యపుసు
ఖంబు విహంగవిహార మౌను; ని
ర్మల మగుచిత్తమందు వన
మాలి; యతండు సతంబు శ్రద్ధతోఁ
జిలుకును నేత్రపాత్రముల
చేతను ప్రేమరసాంబుధారలన్. 316

ఉ. ఏనరు లీ రఘూత్తముని
యిద్ధచరిత్రము సావధానులై
పూనికతోఁ బఠించెదరొ,
పొల్పుగ వారు సమర్థులైన యీ
మానసరక్షకుల్; వినెడి
మానవు లందఱు నీ సరోవర
స్థానమహాధికారిసుర
సంఘము లౌదురు చింత సేయఁగా. 317

ఉ. రామచరిత్రమానసస
రస్సును జేర వభాగ్యదుర్జన
స్తోమబకాళి; దుర్విషయ
జుష్టనరాధమవాయసాళి; యం
దా మలపూర్ణలౌకికక
థార్థవిషక్రిమిభేకమండలం
బేమియుఁ గానరాదుగద,
యేపని వానికిఁ దత్సరస్సుతో ? 318

ఉ. కాముకకాకఘూకబక
కాండము లెప్పుడు, దివ్యమైన యీ
రామచరిత్రమానసస
రంబును జేరఁగ నిచ్చగింప, వె
న్నో మది నొంచుకష్టతతు
లుండును మార్గములోన, జ్ఞానకీ
రామకటాక్షవీక్షణము
రానిదె యియ్యది దుర్గమం బహా ! 319

ఉ. దారుణదుష్టసంగములె
తప్పుడు త్రోవలు; తత్ఖలోక్తులే
క్రూరము లైనవ్యాఘ్రహరి
కోటు, లుదగ్రభుజంగసంఘముల్;
భారగృహక్రియాకులవి
పచ్చయలౌకికబంధనంబులే
వారక యడ్డమై నిలుచు
పర్వతపంక్తిసుమా తలంపగన్. 320

చ. ఖలజనసంఘమార్గమునఁ
గామవిమోహమదాభిమానసం
కులవిషమాటవుల్ గలవు;
ఘోరకుతర్కనదీనదంబులుం
గలవు, భయానకంబులు న
గాధము లౌచు; మఱిట్టి మార్గముల్
తలఁచిన గుండియల్ పగులు;
రాఘవుసత్కృప లేకపోదుమా ! 321

చ. వఱలెడిశ్రద్ధనాఁబరఁగు
బత్తెము లెవ్వరియొద్ద లేవొ, స
త్పురుషసహాయ మే జనులు
పొందక గర్వము నూతఁ గొందు, రే
నరులకు దూర మౌను రఘు
నాథకటాక్షము, వారి, కా సరో
వరము సతం బగమ్య మగు;
భవ్యులకే యది ప్రాప్తమౌసుమా! 322

ఉ. ఎట్టులొ యెవ్వఁడేని శ్రమి
యించియు వెళ్లునొ వెళ్ళినంతనే
గట్టిగ వానిఁ బట్టికొను
గాఢతరాహితశీతలజ్వరం;
బట్టె జనించు మౌఢ్య మను
నద్భుతమౌ చలి వానిలో; నిఁకన్
దట్టుకొనంగ లేక, తన
దారిని బట్టు నతం డభాగ్యుఁడై. 323

ఉ. వాఁడటు మానసాంబువుల
పానము స్నానము చేయకుండ, లోఁ
గూడిన స్వాభిమానమునఁ
గొంపకుఁ జేరియు, నెల్లవారితో,
"పాడుసరస్సు, ఏ సుఖము
వచ్చు" నటంచు, నెవేవొ నిందలే
యాడును గాని, చెప్పఁడు ర
వంత, యిసీ! తనమందభాగ్యము∈. 324

మానసదివ్యతోయముల
మజ్జన భాగ్యముఁ బొందియున్ * త్రితా
పానలఘోరకీలికల
కాహుతి గాక ప్రశాంతిఁ గాంచెడిన్. 325

ఉ. రాముని నీరజాంఘ్రులఁ ది
రం బగుభక్తి వెలుంగు వార, లీ
రామచరిత్రమానసస
రస్సును వీడఁగఁజాల; రన్నలా
రా! మతిలోన నీ సరసి
యందున స్నానము సేయఁగోరుచోఁ,
బ్రేమను సాధుసంగ మొన
రింపుఁడు; ముం దిది ముఖ్య మన్నిటన్,

ఉ. ఈ విధమైన మానసము
నీక్షణఁజేసియు మానసాక్షితో
నా విమలాంబుమజ్జనము
నందుటచేఁ గవిచిత్త మంతయుం
బావనతన్ గనెన్, హృదయ
భాండము మోదముతోడ నిండె; స
द्भావమహానురాగసుఖ
వార్ధులు పొంగులువాఱ సాఁగెడిన్. 327

గీ. అచటనుండియు సుందర మైన కవిత
యనుమహానది ప్రవహించు; నందులోన
స్వచ్ఛ మగు రామచంద్రయశఃప్రభావ
జలము నిండియు శుభముల నొలుకుచుండు. 328

ఉ. ఏనరుసత్కటాక్షమున
నీక్షణ సేయునొ రామచంద్రుఁడ
వ్వానికి విఘ్నసంఘములు
వ్యాప్తముగా, వతఁడే ధరిత్రి నీ

* త్రితాపములు = ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆదిభౌతికములు.

సరయూనదీస్వరూపము

చ. ఇదె సరయూనదీప్రవర
మియ్యదె సర్వశుభాలవాల; మీ
నదికిని లోక వేద మత
నామముల న్దనరున్ దరీద్వయం;
బిది కలిదోషవృక్షతృణ
బృందముల న్మొదలంట గూల్చు; నీ
సదమలమానసాత్మభవ
సర్వజగజ్జనపూతయై మనున్. 329

ఉ. *మూఢురకాల శ్రోతలస
మూహము లీ నదియొడ్డులండె ఆ
డాడను గల్గు గ్రామనగ
రాళిపురంబు లవున్; బుధోత్తముల్
కూడుసభాస్థలంబె వెలు
గొందునయోధ్య; తదీయశోభ నె
వ్వాడు నుతింపగల్గును శు
భంబులమూలము, నిస్సమం బహా! 330

గీ. చారురఘురామచంద్రయశఃప్రభావ
మనెడిసరయూనదీమణి, సానుజోగ్ర
రామరణరంగకేళీవిరాజితయశ
మనెడి శోణామహానది యరుగుదెంచి
కలియు శ్రీరామభక్తిగంగాస్రవంతి. 331

గీ. విమలవైరాగ్యకోణ, వివేకసరయు
వనెడి యీరెండు నదులమధ్యమున వెలుగు
భక్తమందాకినీనది; పరగ నివ్వి
త్రివిధతాపములను సంహరించి, రాము
స్వస్వరూపమహాంబుధి సంగమించు. 332

గీ. రామచరితమానసమున బ్రభవమైన
రామచంద్రగుణాభివర్ణన మనంగ
వెలుగుసరయూనదీమణి కలిసె రామ
భక్తి యనుగంగలో; నది రక్తితోడ
వినెడి సుజనులబుద్ధి బవిత్రపఱచు;
దీనగల చిత్రమౌ నుపాఖ్యానసమితి
తన్నదీతటవనమహోద్యానవనులు;
మఱియు నీసరయూనదీమహిమ వినుడు! 333

గీ. పార్వతీపరమేశవివాహసమయ
పరిజనంబు లిందలి జలచరగణంబు
రామజన్మోత్సవమున సంరంభతతులు
సుడులు, వీచికామాలలసోయగములు! 334

గీ. బాలలీలావిలాసముల్ భాసమాన
బహుళవర్ణవిస్ఫారితపద్మచయము;
దశరథేంద్రరాజ్ఞీజనధర్మకృతులు
భృంగసంఘములు జలవిహంగతతులు! 335

గీ. చారుసీతాస్వయంవరచరిత మెల్ల
నీ నదీమణిశోభయై యెసగుచుండు
బహుపటుప్రశ్న లిందు నావలుగ జెలగు;
బృథువివేకోత్తరములు నావికజనంబు. 336

చ. శ్రవణమొనర్చి, చేసెడి ప
రస్పరరామకథాప్రసంగముల్
ప్రవిమల మా నదీతటము
పైగ జనుపాంథులపంక్తులౌను; భా

---

* మూఢురకములశ్రోతలు : ముక్తులు, ముముక్షువులు, విషయాసక్తులు.

ర్గవుకృధ ఘోరధార; రఘు
రామునిశ్రేష్ఠమనోజ్ఞవాణి యం
దవును సుబద్ధఘట్టము; ని
జాత్మవిచారణసల్పి చూచినన్. 337

ఉ. సానుజు డైన రామనృప
చంద్రువివాహమహోత్సవం బహా!
యీనదిలోని సౌఖ్యదస
మృద్ధశుభప్రద మైనవెల్లవౌ;
వీనుల నాలకించి రఘు
వీరుకథల్, పులకీకృతాంగులౌ
మానవు, లీ నదీమణిని
మానక క్రుంకెడిపుణ్యపూరుషుల్. 338

గీ. భూరిరామాభిషేకసంభారసమితి
పర్వకాలసమాగతభాసమాన
తన్నదీతటత్థైర్థికతండ; మచట
గైకదుర్బుద్ధియే భయంకరవిపత్తు
బొందఁజేసిన జాఱుడుబురద యగును. 339

గీ. భరితచారిత్ర మగణితోత్పాతహారి
తన్నదీకూలకృతతపో2ధ్వరజపాళి
కలిమలఖలావగుణబృందకథనశతము,
జలకలుషకాకబకగణంబుఱుగఁ దోఁచు. 340

గీ. ఈమహారామకీర్తినదీమతల్లి
ఆఱు ఋతువులయందును, నతులరీతి
శోభిలుచునుండు నత్యంత సుందరముగ;
బరమపావన మగుచును భాసురిల్లు. 341

గీ. అద్రినందినీశివులకల్యాణచరిత
మంజులాహ్లాదరూపహేమంతఋతువు;
రామజన్మోత్సవానందరమ్యచరిత
చిత్తసంప్రీతికరమైన శిశిరఋతువు. 342

గీ. రామచంద్రవైవాహికరమ్యచరిత
సర్వశుభదసమ్మోదవసంతఋతువు;
రామచంద్రునిదండకారణ్యయాత్ర
భీష్మదుస్సహోదగ్రమౌ గ్రీష్మఋతువు;
వనపథకథల్ ఖరాతపవాయుచయము. 343

గీ. భయదదైత్యసంహారము వర్షఋతువు;
అది నిలింపసస్యముల కాహ్లాద మొసఁగు;
విమలరామరాజ్యానందవినయమహిమ
ధవళమంజులసుఖశరత్కాల మగును. 344

గీ. వరపతివ్రతామణిగను బరిఢవిల్లు
జానకీదేవిచరిత మీజలములోని
పరమశుద్ధతానుపమపావనగుణమ్ము;
భరతుశీల మిందున్నయవర్ణనీయ
సార్వకాలికశీతలచారుగుణము. 345

గీ. రామచంద్రసోదరులపరస్పరావ
లోకనాలింగనేష్టభాషాకలాప
భాస్వదనురాగహాససౌభ్రాత్రము లను
స్వాదురససుగంధంబు లీ వారి నెసఁగు. 346

గీ. అస్మదార్తియు, వినయదైన్యంబు, లీ ప్ర
సన్నమంజులనిర్మలజలములోని
చులకఁదనమయి నిరతంబు వెలుఁగుచుండు;
ఈ మహోదకమహిమమ్ము నెన్నఁ దరమె? 347

ఉ. ఈ యమలాంబుపూరము ల
హీనము, లద్భుతముల్, వినంగనే
పాయక మేలు సేయు, నెడఁ
బాపు భయంకరతృష్ణ: నావలం
ద్రోయు మనోమలంబుఁ, గలి
దోషవిపచ్ఛయదుష్ఫలంబులన్;
మాయఁగఁజేయు దుర్భర స
మ స్తపురాకృతపాపతాపముల్. 348

ఉ. కూలును బాపతాపభయ
ఘోరరుజాదిసమ స్తదోషముల్;
వ్రీలును జండసంసరణ
భీషణదుఃఖపరంపరావళుల్;
తూలును గామరోషమద
దుష్టవిమోహముఖారిసంచయం;
బీ లలితోదకంబులను
నేర్పడఁ జేసిన స్నానపానముల్. 349

చ. కలుగును జ్ఞానతేజ, మెదఁ
గల్గును దివ్యవిరాగభావముల్,
గలుగును సద్గుణవ్రజము,
గల్గును సర్వసుఖానుభోగముల్,
గలుగును రామచంద్రపద
కంజసమాహితశుద్ధభ క్తి, యీ
సలిలములందు భ క్తిమెయి
సల్పినచో నిల స్నానపానముల్. 350

గీ. ఈ మహాతీర్థమహిమంబు నెన్నఁ దరమె!
సంతసంబున కిది సంతసంబుఁగూర్చు,
వీనిలోఁ గ్రుంకఁజాలని భీరజనులె
కఠినకలికరాళాంతరగ్రస్తు లకట! 351

ఉ. ఏలొకొ మానవుల్ రఘుకు
లేంద్రుయశస్సరయూళుభాంబువుల్
గ్రోలి సుఖింపకే భయద
ఘోరకలిభ్రమితాత్ములై మహా
బీలదురంతదుర్విషయ
బృందమరుస్థలిఁ గూల వట్టిదౌ
నేల, మరీచికల్ గనియు
నీరని యాల్గు కురంగముల్ వలెన్. 352

గీ. శ క్తికొలఁదిగ నీ మహాజలగుణంబు
దలఁచి తనబుద్ధియందు స్నాతక మొనర్చి
శాంకరీశంకరులను సంస్మరణ చేసి
పలుకుచున్నాఁడు కవి రమ్యభవ్యకథను. 353

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరామచరితమానసము

బాలకాండము

ద్వితీయవిశ్రామము

శ్రీనారదమౌనీశ్వర
గానామృతపారవశ్యకలితహృదబ్జా ।
దీనజనావనరంహా ।
శ్రీనాయక । మట్టపల్లి శ్రీనరసింహా ।

ప్రయాగక్షేత్రము

యాజ్ఞవల్క్య భరద్వాజమహర్షుల సంవాదము

ఛందస్సు : మంజరీద్వపద

శ్రీరామపాదరాజీవము లెపుడు
స్వాత్మ భజించుభక్తాగ్రగణ్యుండు,
శమదమకారుణ్యసద్గుణాకరుఁడు,
నిరుపమఘనతపోనిష్ఠాపరుండు,
పారమార్థికమార్గపరమసమర్థుఁ
డగుభరద్వాజమహర్షి వసించు
శ్రీప్రయాగక్షేత్రశేఖరమందు.
మాఘమాసమునందు మకరసంక్రమణ
పర్వకాలంబున బహుజనుల్ వచ్చి
సేవింత్రు భక్తి నాక్షేత్రరాజమును.
నరసురాసురులుఁ గిన్నరముఖ్యు లెల్ల
రా త్రివేణీప్రసన్నాంబువులందు
నాదరంబున స్నాన మాచరించెదరు.
పావనమాధవపాదపద్మములఁ
బూజించి భక్తిసంపూరితు లగుచు
నక్షయవటవృక్ష మంత స్పృశించి
హర్షపులకితాంగు లౌచుందు రచట.
తత్క్షేత్రమున భరద్వాజాశ్రమంబు
పరమపావనమయి భాసిల్లుచుండు;
దాని మహారమ్యతకు మౌనివరులె
సమ్మోహపడుచుంద్రు స్వాంతంబులందు.
ఆ తీర్థరాజమునందుఁ గ్రుంకుటకు
వచ్చు మునీశ్వరపరమర్షు లెల్ల
ఒటఁ గూడుచుండెద రానందముగను.
ప్రత్యూషమున నెల్లవారలు లేచి
స్నానాదికృత్యముల్ సలిపి సద్భక్తి,
నా యాశ్రమమున సమావిష్టులగుచు
హరిదివ్యసుగుణమహాప్రసంగముల
సలుపుచుందురు పరస్పరము సంప్రీతి.
భాషింతు రచ్చట బ్రహ్మతత్త్వమును,
తద్ధర్మవిధులను, తత్త్వభాగముల,
భక్తిని, జ్ఞానంబు, వైరాగ్యనియతి-

ఈవిధంబుగను మునీశ్వరు లెల్ల
రా మాఘమాసపర్యంత మచ్చోట
స్నానాదు లొనరించి సద్భక్తితోడ
నాపయిఁ దమతమయాశ్రమంబులకుఁ
బోలేక పోలేక పోవుచుండెదరు.
ఏఁటేఁట నుత్సవం బిట్టులే జరుగు.
మఱి యొకానొక మాఘమాసమం దిట్లు
సకలమునీంద్రులు స్నానముల్ సలిపి
యెవరిచోట్లకు వార లేగి; రా తఱిని
తన యాశ్రమమునకుఁ దరలుచున్నట్టి
పరమవిజ్ఞానసంభరితుఁడై వెలుఁగు
యాజ్ఞవల్క్యమునీంద్రు నంఘ్రులఁబట్టి
పయన మాపియు భరద్వాజమహర్షి
భక్తితో నామునిపాదపద్మములఁ
బ్రక్షాళనముచేసి, పరమపవిత్ర
మగు నాసనంబున నాసీనుఁ జేసి,
బహుపూజఁ గావించి, ప్రస్తుతించియును
మృదుమధురంబుగా నీ రీతిఁ బలికె;
"నాథ! ఓ మునినాథ! నామతిలోన
నొక పెద్దసంశయం బున్నది దేవ!
సకలవేదరహస్యజాలము నీకు
హస్తంబులో నున్న యామలకంబు;
నా సంశయమును విన్నప మొనరింప
భయమును లజ్జయుఁ బడుచుంటి లోనఁ;
గాని, యీ యోగ్యావకాశంబు పోవఁ
దిరిగి లభించునే? దేవా! మహాత్మ!
స్వాంతంబులోఁ గల సందియంబులను
దనగురుసన్నిధి దాఁచిన యాతఁ
డమలవివేకంబు నందలేఁ డనెడి
వేదశాస్త్రపురాణవిబుధవాక్యముల
నాత్మ విచారించి యార్యవరేణ్య!
నా సందియంబు విన్నప మొనరింతు:
నీ సేవకునిపైనఁ గృపఁజూపి స్వామి!
యస్మదజ్ఞానంబు హరియింపు మార్య!
ఉపనిషత్తులు, *జయ, ముత్తమజనులు
ప్రభు! రామనామప్రభావంబు తలఁపఁ
బారశూన్యం బని పలుకుట వింటి.
అవినాశి, గుణరాశి, యానందవనధి,
జ్ఞానమూర్తి, శివుండు, శంభుఁ, డెల్లపుడు
శ్రీరామనామంబుఁ జింతించు నాత్మ.
జగతిలోఁ గల నాల్గుజాతులజీవు
లం దేదియైన నహా! కాశి యందుఁ
బ్రాణముల్ బాసినఁ బరగతిఁ గాంచు
నా రామనామమాహాత్మ్యంబుచేత.
ఘనరామనామమే కద? మునిరాయ!
కాశికాపురియందుఁ గాయముల్ విడుచు
జీవుల కెల్లను శ్రీసాంబశివుఁడు
దివ్యమౌ కృప నుపదేశించుచుండు –
ఎవ్వఁ డీశ్రీరాముఁ డెఱిఁగింపుమయ్య!
ఓ దయావనధి! బుష్యోత్తమా! నాకు;
ఒక్క– శ్రీరాముఁ డయోధ్యేంద్రుతనయుఁ
డాతనిచారిత్ర మఖిలప్రసిద్ధ–
మాత్మప్రియావిరహాకులభార
సంజాతచండరోషంబుచే నతఁడు
రావణుఁ బడఁగూల్చె రణరంగ మందు.
ఈ రామునామమా? యింకొక్క– రాము
నామమా? త్రిపురారి నాగభూషణుఁడు
సతతంబు స్వాత్మలో జపమొనరించు?
సర్వజ్ఞుఁడవు! నీవు సత్యధాముఁడవు!
బాగుగా యోజించి భాషింపు మయ్య!

---

* జయము = పురాణేతిహాసములు.

నాదువిభ్రాంతి వినాశంబు నొంద
విస్తరింపుము సర్వవృత్తాంత" మనఁగ
యాజ్ఞవల్క్యమునీంద్రుఁ డనియె నీరీతి
ముఖమునఁ జిఱునవ్వు మొలకలెత్తంగ.
"ఆరఘునాథు మహాప్రభావంబు
నీ వెఱుంగుదువు మునీశ్వరా! లోన;
కన మనోవాక్కాయకర్మల నీవు
శ్రీరామపాదరాజీవభక్తుఁడవు
తెలిసె నీ చతురత ధీర! మునీంద్ర!
రామచంద్రనిగూఢరమ్యగుణాళిఁ
జెవులార వినఁగఁ గాంక్షించి నీ విట్టు
లజ్ఞుఁడో మానవుఁ డడుగుచందమునఁ
బ్రశ్నించితివి భరద్వాజమునీంద్ర!
రమణీయమైన శ్రీరామాయణంబు
నాదరంబున వినుమయ్య! వచింతు;
అజ్ఞాన మను మహిపాసురుఁ జెండు
చండకాళిక రామచంద్ర చరిత్ర;
సుజనచకోరపక్షులు గ్రోలుచుండు
సాంద్రచంద్రిక రామచంద్రచరిత్ర.
ఈ వన్న సంశయమే యొకసారి
మను భవానీదేవి పురహరు నడుగ
ఆ మహాదేవుఁ డత్యాదరం బొప్ప
విస్తరించెను రామవృత్తంబు నెల్ల.
పార్వతీశంభుసంవాదంబు నీకు
నే నెఱిఁగినరీతి నిపుడు వచింతు.
ఈ మహాసంవాద మేకాలమందు-
ఎందుకు-జరిగెనో యే వివరింతు
వినుము నీ యాశంక విడిపోవఁ గలదు.

శ్రీసతీదేవిమోహవృత్తాంతము

మున్ను త్రేతాయుగంబున నొకసారి
శంభుఁ డేగెను కుంభసంభవుఁ జూడ
త్రిభువనమాత సతీదేవి తోడ
ఆ వచ్చియుండిన హరుఁగాంచి ఋషియు
అఖిలేశ్వరుం డని యాత్మలో నెఱిఁగి
భక్తితో నర్చించి ప్రస్తుతించియును
రమణీయపావనరామాయణమును
గడు మధురంబుగా గానంబుచేసె.
ఆ మహేశుఁడు పరమానందఁ మొంది
ఆకర్ణనము చేసె నా రామకథను.
అంత నా మునిపతి హరిభక్తిఁగూర్చి
విశదీకరింపఁగా వేఁడుకొనంగఁ
గని యగస్త్యుని నధికారిఁగా నెంచి,
భక్తియోగరహస్యబహువిశేషములఁ
బ్రవచించె శంకరస్వామి తెల్లముగ.
కూర్మి నావిధి రామగుణగాథ లెల్లఁ
బలుకుచు వినుచు నా పరమశివుండు-
కైలాసపతి- కొంతకాలంబు గడపె.
ఆపయి శివుఁ డగస్త్యర్షివరేణ్యు
వీడ్కొని, దక్షుజాన్వితుఁ డౌచు వెడలె
మహనీయకైలాసమందిరంబునకు;
ఆ సమయంబునం దవనీస్థలాన
భూభారభంజనంబును జేయ శౌరి
అమలమా రఘువంశ మం దుద్భవించె.
నిజపిత్రవచనంబు నిర్వహించుటకు
రాజ్యంబు వదలి విరక్తిభావమున
దండకనామకోద్దండవనాన
ఆ యవినాశి శ్రీహరి, జనార్దనుఁడు
తాపసవేషంబు ధరియించుకొనియు
సంచరించుచు నుండె సంయమివర్య!
చనుచు శంకరుఁ డంత స్వాంతంబులోన
ఇటులఁ జింతించె మునీ! భరద్వాజ!
"శ్రీహరి నెటుల దర్శింతు నీ తఱిని?
అతిగోప్యముగ హరి యవతార మొందె;

ఇపుడు నే నేగి లక్ష్మీశు దర్శింప
హరి యతం డని జగ మంతట న్దెలియు"-
ఈరీతి శర్వుఁడు హృదయాంతరమున
అమితసంక్షోభంబు నందఁగాసాగె.
ఈ యాకులత సతి యెఱుఁగ దేమియును
హరిని దర్శించిన యతిరహస్యంబు
బయలౌ నటంచును భయమందె శివుఁడు;
శ్రీరామదర్శన ప్రేమాతిశయత
నిటలాక్షు పావననేత్రాంచలముల
ఉజ్జ్వలాశ్రువులు పెల్లుబుకఁగాఁ దొడఁగె.
రాక్షసాధిపుఁడగు రావణుం డవని
మనుజునిచేతిలో మరణించు ననుచుఁ
దీర్చి యాబ్రహ్మ విధించుటఁ జేసి,
ఆ వాక్యముల సత్య మా నటుఁ జేయ
నారాయణుఁడు పుట్టినాఁడు ధరిత్రి:
శ్రీహరి నిపుడు దర్శింపనియెడల
సతతము నాకు విచారంబు కలుగు-"
నని శంకరుఁడు చింత నందఁగాఁ దొడఁగె,
కాని చింతఁ నణంపఁ గలయుపాయంబు
కానరాదాయె నే కరణిఁ జూచినను;
ఈవిధిఁ జింతలో నీశుండు మునిఁగె.
ఆ సమయాననే యా రావణుండు
దశకంఠుఁ డనెడియుద్దండదానవుఁడు
మౌఢ్యముతో రామమహిమంబుఁ గనక
మాయలేడిగఁ బంపి మారీచు, నీచు,
న వ్వి దేహాత్మజ నపహరింపంగ—
శ్రీరామచంద్రుఁడు చెండి మారీచు,
మఱలి యే తెంచె లక్ష్మణునితోఁగూడి;
పంచవటీశూన్యపర్ణ శాలాంత
రాళంబుఁ గాంచిన రామనేత్రములు
ఘనశోకబాష్పసంకలితంబు లయ్యె.
విరహాకులుండయి విలపించె వనిని
నరుఁడట్లు శ్రీరఘునాయకుం డప్పుడు.
శ్రీరామలక్ష్మణుల్ సీతఁ గాంచుటకుఁ
గలయంగ వెదకిరి కాననం బెల్ల.
ఆ సహోదరుల దుఃఖాశ్రువర్ష ముల
ఘనదండకారణ్యగర్భంబు లెల్ల.
తడిసిపోయెను భరద్వాజమునీంద్ర!
ఓహో! వియోగసంయోగముల్ లేని
అద్వయుం డాహరి యఖిలాంతరాత్మ
ప్రకటించె విరహసంభవశోకవహ్ని.
ఆ రఘూత్తములీల లతివిచిత్రములు;
పరమసుజ్ఞానులౌ వారలే వాని
నాత్మలో గ్రహియింతు రనఘుచరిత్ర!
మందబుద్ధులు మూఢమానసు లెపుడు
హృదయంబులో వాని నెఱుఁగఁగాలేరు.
ఆ సమయంబున హరుఁడు, శంభుండు
శ్రీరామచంద్రు దర్శించి డెందమున
ఘనవిశేషానందకలితుఁడై పోయె,
శ్రీరామసౌందర్యసింధువు నందు
విశ్వనాథునికనుల్ విందారగించె.
సమయంబుఁ కాదని శంభుండు తలఁచి
పై కేమి హరిఁగూర్చి ప్రకటింపలేదు;
"జయ సచ్చిదానంద! జయ జగత్పూత!"
అని పాడుకొనుచు నయ్యహిభూషణుండు
పయనంబుఁ జేసెను పడతితోఁ దాను.
పలుసారు లాకృపావాసుఁడౌ శివుని
తను వెల్ల పులకీకృతంబయి వెలిఁగె;
అమ్మహాసతినున్న యాత్మేశు శివుని
సతి కాంచి లో నిట్లు సందేహ మొందె:
"శంకరుం డెన్నఁగా జగదీశ్వరుండు,
జగదేకవంద్యుండు, సర్వజ్ఞుఁ, డఖిల
నరసురమునిలోకనతపాదపద్ముఁ—
డా రాజసుతుఁ గాంచి యత్యంతభక్తి

సచ్చిదానందుండు, సర్వేశ్వరుండు,
హరి, పరంధాముఁ డటంచు నుతించె!
తద్రాజపుత్రు సౌందర్యంబుఁ గాంచి
తన హృదయంబులోఁ దన్మయం బొందె;
ఆ ప్రేమపారవశ్యానందజలధి
భూతేశు నెడఁద నుప్పొంగఁగాఁ దొడఁగె
నిప్పటికిని భరియింపరానిదిగ!
ఆ పరబ్రహ్మ మ య్యఖిలమయంబు,
అజ, మఖండం, బనీహం, బభేదంబు,
అఖిలవేదాఽగ్రాహ్య మై భాసురిల్లు—
అది మానవాకార మందఁగాఁగలదె?
సురహితార్థంబు వసుంధరయందు
నరరూపమును దాల్చు నారాయణుండు,
సర్వజ్ఞుఁడైనట్టి శంకరునట్లు.
ఆ జ్ఞానధాముఁ డాహరి, శ్రీవిభుండు,
ఆ దైత్యసంహారి, యాశౌరి, విష్ణు,
వజ్రునిరీతిగా నడవిలో నెటుల
ఆత్మకాంతాన్వేషణార్థమై తిరుగు?
శంభువాక్యములు మృషల్ గావు చూడ;
హరుఁడు సర్వజ్ఞుఁ డన్నట్టి యా సత్య
మెల్లవా రెఱిఁగినదే విశ్వమందు."
అటుల విచారించు నా సతీదేవి
భావపంకేజ మపారసందేహ
సంఘాతములచేత సంకులమయ్యె.
ఏవిధంబున నామె హృదయాంతరంబు
స్వస్థతఁబొందియు శాంతింపదయ్యె.
ఆ భవానీదేవి స్వాత్మసంశయముఁ
బ్రకటింపకున్నను బలువిప్పి పైకి,
సర్వాంతరాత్మ యా శంభుండు, హరుఁడు,
సర్వవృత్తాతంబు స్వాత్మలో నెఱిఁగి
సతితోడఁ బలికె నీ సరణి నత్తఱిని.
"స్త్రీస్వభావం బిది! చెలి! యిటు గనుము!

సంశయింపకు మిట్లు స్వాత్మలో నెప్పు
డా రఘువీరుఁడే, ఆరామవిభుఁడె
నాయిష్టదైవము నారాయణుండు!
ఆతనిఁగూర్చియే యీ యుగస్త్రీర్చి
గానంబుఁ గావించెఁ గడుభక్తితోడ;
ఆ నాఁడు ఋషితోడ నానందమొప్ప
ఆ రామభక్తినే యతివ! చెప్పితిని.
ఎప్పుడు ధీరమునీశ్వరు లెల్ల
సేవించుచుందు రా శ్రీరామదేవు.
రఘువంశరత్నమై రాజితరీతి
భక్తహితార్థమై ప్రభవించినట్టి
ఆ రామభగవానుఁ డన్యుఁడా? కాంచ
ఆ పరబ్రహ్మ, మా యఖిలమయుండు,
నిజతంత్రనిరతుండు, నిఖిలేశ్వరుండు,
మాయాధిపతి; ధీరమానిమోగీంద్ర
సిద్ధజనంబు లా శ్రీవిభు, రాము,
విమలచిత్తంబుల విడువక యెపుడు
ధ్యానం బొనర్చుచు నలరుచుండెదరు.
వేదశాస్త్రపురాణబృందంబు లెల్ల
"నేతి నేతి" యటంచు నిరత మారాముఁ
గీర్తించుచుండును గేవలభక్తి!"
ఈరీతి శంకరుఁ డెన్నియోసారు
లుపదేశ మొనరించె నుమకు సత్కృపను;
కాని యాసతికి హృత్కంజమం దవ్వి
సంతృప్తిఁ గూర్పఁగాఁ జాలక పోయె.
అపుడు మహేశుఁ డియ్యది రామచంద్రు
మాయాబలంబని మతిలోన నెఱిఁగి
చిఱునవ్వు లొలయఁగాఁ జెప్పె నీరీతి :
"అంత సందియము నీ కాత్మలో నున్న
ఏల నీ వేగి పరీక్షించుకొనవు?
అరిగియుఁ దిరిగి నీ వరుదెంచుదనుక
ఈ వటచ్ఛాయలో నేను వసింతు.

నీ వివేకవిచారనిరతిని జూపి
త్వన్మోహజనితవిభ్రాంతి తొలంగు
నట్లు వర్తింపుమా" యన సతీదేవి
భవునాజ్ఞఁ బొందియుఁ బయనమై పోయె
శ్రీరాముమహిమ పరీక్షించువిధముఁ
జింతించెఁ బెల్లుగా శ్రీసతీదేవి.
శ్రీశంకరుం డంతఁ జిత్తంబులోన,
"అక్కటా! దనుజ కశుభంబె కల్గు"
నని నిశ్చయించి యిట్లనుకొనసాగె;
"ఏను బోధించితి నెంతయో కాని
ఆమె సందేహంబు; ద్యజియింపదయ్యె.
విధి మహావిపరీతవిధముగా నుండె;
ఆమెకుఁ బ్రాప్తించు నశుభంబె దాన;
ఇంతకుఁ గనఁగఁ రామేచ్ఛయే జరుగు!
ఏల వృథాతర్క మింతగా" ననుచు
హరినామజపమును హరుఁ డాత్మలోన
నొనరింపసాఁగె మహోజ్జ్వలభక్తి;
ఆనందధాముఁడౌ నారామచంద్రు
చేరువ కరిగె నా శ్రీసతీదేవి.
మటిమటి యా సతీమాత చింతించి,
తాల్చియుఁ దుదకు సీతాస్వరూపంబు
నా రామనరపాలుఁ డరుదెంచుచున్న
దారిలో నిలుచుండెఁ దాపసాధీశ!

శ్రీరామప్రభావప్రకటనము—
సతీదేవి పశ్చాత్తాపము

ఆ యుమాకృతవేష మరసి లక్ష్మణుఁడు
ఘనవిభ్రమాశ్చర్యకలితాత్ముఁడయ్యె.
ఐన శ్రీరాముమహాప్రభావమును
తెలియఁజాలినయట్టి ధీరాత్ముఁడగుట
కనుచుండె మౌనియై గంభీరముగను.
ఆ సర్వసాక్షి, యా యఖిలాంతరాత్మ.

ఆ దేవతాపతి, ఆ రామవిభుఁడు,
తత్క్షణంబే సతి తాల్చియున్నట్టి
కపటవేషం బెల్ల గ్రహియించినాఁడు!
స్మరణమాత్రమున నజ్ఞానంబుఁ బాపు
సాక్షాత్పరేశుండు, సర్వజ్ఞుఁడైన
ఆ రాముపైననే యా సతీదేవి
తనమోహమును జూపెఁ దాపసచంద్ర!
భామాస్వభావప్రభావంబుఁ గనుము!
స్వఘనమాయాప్రభావంబును గాంచి
ముఖమండలంబున ముసిరి వెలుంగు
చిఱునవ్వు వెన్నెలల్ చిందులు ద్రొక్కఁ
దనతండ్రిపే రంతఁ దా వచియించి
చేతులు జోడించి చేసి వందనము
మృదుమధురంబుగా నీరీతిఁ బలికె:
"ఓ సతి! ఓ యుమా! ఓ జగన్మాత!
వృషభధ్వజుం డెట? ఏకాకినివిగ
ఈ యరణ్యంబులో నీ వేల తిరుగ?"
అని పల్కఁ శ్రీరాము నతిమృదుగూఢ
వచనంబులను విని భావంబులోన
నమితసంకోచంబు నా సతి పొంది
భయసంకులాత్యంతభారాత్మ యగుచు
ఆ మహేశునిచెంత కరుగఁగా సాగె.
"నా నాథు వచనముల్ నమ్మలేనైతి
నా యవజ్ఞత రఘునాథుపై నిడితి
ఈశుతోఁ నే నిప్పు డేమి చెప్పెదను?"
సతి యిట్లు చింతింపసాగెఁ జిత్తమున.
ఆమె స్వాంతమున ఘోరాకుల మొదవె.
అపు డామె హృదయాంతరార్తిని గాంచి
శ్రీరాముఁ డొక్కింత స్వీయమైనట్టి
దివ్యప్రభావంబుఁ దెలియఁ జూపించె:
సతి మార్గమందునఁ జనుచుండఁ గాంచె
నొక మహాదృశ్యంబు యోగివరేణ్య;

జానకీలక్ష్మణసంయుతుం డగుచు
ఆ సతీదేవికి నభిముఖంబుగను
ఆ రామభగవానుఁ డరుదెంచుచుండె.
వెనుకకున్ దిరిగియు వీక్షింప నామె,
ఆ పూర్వభాగమునందు సైతంబు
జానకీలక్ష్మణసంయుతుం డగుచు
ఆ రామభగవానుఁ డరుదెంచుచుండె.
అమితసుందరమంగళాకార మొప్ప
ఏవైపుఁ గనుఁగొన్న నీశ్వరి కపుడు
సిద్ధమునీశసంసేవితుం డగుచు
దివ్యసింహాసనాధిష్ఠితుం డైన
ఆ రామచంద్రుఁడే యగపడుచుండె!
ఒకదానికన్న మఱొక్కటి మించి
వెలుఁగొందుచున్నట్టి విధివిష్ణురుద్ర
గణములు కనవచ్చె గణనలేనన్ని.
వివిధవేషంబుల వెలుఁగు దేవతలు
నతులు గావించుచు నానావిధాల
శ్రీరామచంద్రుని సేవించుచుండ్రి;
తమతమ పతులకుఁ దగినవేషములఁ
దాల్చి యనూన సౌందర్యంబు లొప్ప
బహుసతీభారతీపద్మావతులను
గాంచె సతీదేవి కడువింతఁ గొలుప.
తమతమ సతులతోఁ దనరెడు సురలు
భూరిచరాచరభూతజాలములు
శ్రీరాము నెటఁగన్న సేవించుచుండి;
రా రాము సేవించునఖిలదేవతలు–
వివిధవేషంబుల వెలుఁగొందుచున్న–
నా రాము శుభరూప మవికల్పముగను
గానవచ్చెను దివ్యకాంతు లీనుచును.
బహురామచంద్రుల బహుమహీసుతలఁ
గాంచె సతీదేవి; కాని రూపంబు
లేకరీతిగ నుండె నేమార్పు లేక;

ఆ రాముఁడే మఱి యీ లక్ష్మణుండె
ఆ సీతయే యెట నరసిన న్గాని
యణువంత యైన మార్పునునది లేక
కానరాఁగా సతి కడుభీతి నొందె.
కంపంబు నొంద హృత్కంజ మంతయును
దనువును మఱచె నా దక్షతనూజ;
ముకుళితనేత్రయై పోవుమార్గమున
నొక ప్రక్క కొదిగియు నుపవిష్ట యయ్యె.
స్మృతిఁదెచ్చుకొని కొంతసేపటి కామె
నలుదిక్కులను జూడ నయనముల్ తెఱచి
అడవిగా కిం కేమి యగపడదయ్యె!
శ్రీరామపాదరాజీవంబులకును
ప్రణతు లర్పించుచుఁ బలుమాఱుభక్తి
కైలాసపతి యుండుకడ కేగె నంబ.
తనుఁ జేరవచ్చిన దక్షజ న్గాంచి
నవ్వువెన్నెల లాననంబుపై వెలుఁగఁ
గుశలంబు లడిగియుఁ గూర్మిపొంగార,
"శ్రీరాము నెట్లు పరీక్షించినావొ,
ఉన్నయథార్థ మో యుమ! తెల్పు" మనియె.

శివుఁడు సతీదేవినిఁ బరిత్యజించుట - సతీవిషాదము

ఆ రఘునాథుమహోమహిమంబు
తెలియుటచేత సతీదేవి, మదిని
భయవశ యాచును భవునిచెంగటను
సత్యంబు దాచి యీ చందానఁ బలికె;
"శ్రీరాము నేను బరీక్షింప లేదు;
నీవలె మ్రొక్కియు నే వచ్చియుంటి!
ఓ ప్రభూ! నీ మాట లుత్తవి యౌనె?
ఏను బూర్ణంబుగా హృదయంబులోన
సంతృప్తిఁ బొందితి సర్వేశ! నాథ!"
అనిపల్క శంకరుఁ డాలకించియును

సతి యొనరించిన సర్వకార్యమును
దివ్యదృష్టిని లోనఁ దిలకించి, సతిని
అనృత మాడించిన యా రామచంద్రు
ఘనమాయకును నమస్కారంబు సలిపె.
"ఈశ్వరుసంకల్ప మేరీతిఁ గలదో
ఆరీతి జరుగక యా గ దేదియును."
అనుచు సుజ్ఞానియౌ హరుఁ డెంచె మదిని.
దక్షకుమారి సీతాస్వరూపమును
బూనినవిషయంబు పురహరునాత్మ
అతివిషాదముఁ గూర్చె నయ్య! మునీంద్ర!
"ఇంక సతిపైఁ బ్రీతి యేనుజూపినను
భక్తిపథం బెడ బాయుఁ లోకమున;
అటుల నేఁ జేసిన నవినీతి యగును.
పరమపావని సతిన్ వదలుద మన్న,
ఆమెపై రక్తిచే నఘము ఘటిల్లు"
అని తలంచియు శివుఁ డాంతర్యమందుఁ
దనయెద నధికసంతాప ముండిననుఁ
బైకొక్క మాటయుఁ బ్రకటింపఁడయ్యె-
అంతట శంకరుం డతిభక్తి తోడ
శ్రీరామపాదరాజీవంబులకును
శిరమువంచియు నమస్కృతులు గావించి
హృదిని రాముని స్మరియించినంతటనె-
ఎందాక సతి ధరియించు నా దేహ
మందాక నామెపై *ననురక్తి యొప్ప
దను నొక్క సంకల్ప మాత్మలోఁ గలిగె.
శంకరుం డట్లుండ శపథంబుఁబూనె.
ఆ ధీరమతి యైన హరుఁ డట్లు తలఁచి
రఘువీరపాదనిర్మగ్నచిత్తమునఁ
గైలాసశిఖరికి గమియింపఁసాగె
అటు లాశివుం డొక్క యడుగు వేయఁగనె

"జయ మహేశా! జయ శర్వ! విశ్వేశ!
బహుదృఢభక్తిసంభరిత! సర్వేశ!
నీకన్న నెవ్వరీనిఖిలలోకముల
సలుపఁగాఁగల రిట్టి శపథంబు శంభు!
రామభక్తా! సమర్థా! మహాదేవ!"
అనుచు నిర్ఘోషించె నాకాశవాణి.
ఆవాణి నాలించి యా సతీదేవి
ఆంతర్యమందు విహ్వలతనుబొంది
గద్గదస్వనమొప్పఁ గంఠంబునందుఁ
బలికె నీరీతిగాఁ బరశివుతోడ:
"ఓ కృపాళూ! ప్రభూ! ఓ సత్యధామ!
ఓ దీనవత్సలా! ఓ మహాదేవ!
దేవ! నీ వేమి ప్రతిజ్ఞఁ జేసితివి?"
అని యనేకవిధాల నా యుమాదేవి
ప్రశ్నింపఁ ద్రిపురారి బదులాడఁడయ్యె
నొకమాటయేని ఋష్యుత్తమా! వినుమ.
సరజ్ఞుఁ, డీశుండు, సర్వం బెఱింగె
నని యా సతీమణి యాత్మ గ్రహించి
శంకరవంచన సలుపంగఁ దాను
యత్నించినందుకై యతిఖేద మొందె.
స్త్రీస్వభావము చింతసేయఁగా జడము,
అజ్ఞానయుత, మని యామె యెఱింగె,
పాలలోఁ గలసినపానీయములును
పాలటు లమ్మగాఁ బడును ధరిత్రి:
ప్రేమైకతాశక్తి వీక్షించు మనఘ!
ఆ క్షీరనీరంబులం దొక్క చుక్క
కపటపుఁ బులుసును గలిపినయెడల
విడివడు నీరముల్, విడియును రుచియు.
తాను జేసినపనిఁ దలఁచి యా యంబ
అమితంబుగా హృదయంబులో వగచె.

---

* 'అనురక్తి'యన నిక్కడ భార్యాదృష్టితోఁగూడిన ప్రేమ.

ఆ మెలోఁ గలిగినయాఁందోళనంబు
వర్ణ నాతీత మపారమై యుండె.
"కరుణాసముద్రుండు గావున శివుఁడు
తనయపరాధంబు దయఁబూని మిగుల
ప్రకటింపఁడయ్యెను బహిరంగరీతి"
అని యా సతీదేవి యాత్మఁ జింతించె.
శివునిపైఖరిఁ జూచి చిత్తంబులోన
దనపైని రాగమ్ము త్యజియించెఁ ననుచుఁ
దర్కించుకొని యామె తల్లడపడియె.
తనదోష మెఱిఁగి యా దక్షకుమారి
పల్లెత్తి యొకమాట పలుకఁగా వెఱచె.
ఆ మెస్వాంతంబు మహాకులపరతఁ
జండాగ్నికుండంబు చందమై పోయె.
ఆ సతీదేవి శోకాకులాక్షులను
గని వృషధ్వజుఁడు సత్కారుణ్య మొప్పఁ
శోకంబు మఱపించుసుందరకథలఁ
బలుకఁగా సాఁగెను బహుమనోజ్ఞముగ.
విశ్వనాథుం డటుల్ వివిధేతిహాస
కథనంబొనర్చుఁ గైలాస మరిగె.
అటఁ జేరి శ్రీశంభుఁ డాత్మలోఁ దనదు
శపథంబుఁ దలఁచి తత్క్షణాద్రిశృంగమున
వటవృక్షతలమునఁ బద్మాసనమున
ఆసీనుఁడై నిజాత్మానందమందు
నిర్వికల్పసమాధి నిష్ఠలో మునిఁగె.
అతివిచారాక్రాంతయై సతీదేవి
వసియించెఁ గైలాసపర్వతాగ్రమున;
ఆ మెచిత్తములోనియాఁందోళనంబు
నెవ రెఱుంగుదురు ? మునీశ్వరా ! ప్రాజ్ఞ !
ఒక్కదినం బొక్కయుగముగా నయ్యె
నక్కటా ! దుఃఖభారాహతి సతికి
నిత్యనవ్యం బయి నిరుపమం బగుచు
ఆసతీచిత్తశోకాగ్ని వెలిఁగె.

ఆ మహాఘోరదుఃఖాంబుధి నెప్పుడు
తరియింపఁగల నని దక్షకుమారి
పలువిధంబుల లోనఁ బరితాప మొందె.
"ఆ రఘుపతిని నే నవమానపఱచి
శంకరువాక్కు లసత్యంబు లనుచు
అక్కటా ! తలఁచితి నజ్ఞానవశత!
విధి నాకుఁ దగినట్టి విధముగాఁ జేసె;
ఏను జేసినకర్మమే యిప్పు డిట్టి
శిక్ష విధించెను జింతింపు మనుచు.
ఓ భగవంతుఁడా! ఓ పరమేశ!
హరవియోగముఁ గూర్చి యాపైన నన్నుఁ
బ్రతుకఁ జేయుట ధాత్రిఁ బాడియా నీకు?"
అని దుఃఖపడసాగె నా సతీదేవి.
ఆ శోకమును వాక్కు లందుకోలేవు,
ఆ సునిశ్చలచిత్త యగుసతీదేవి
హృత్పద్మమందున శ్రీరామదేవు
స్మరియించి ప్రార్థన సలిపె నీరీతి:
"హే రామచంద్ర! లోకేశ్వరా! శౌరి!
దీనవత్సలుఁడనుదివ్యమూ బిరుదు
నీకున్నయది; యది నిజమైన యెడల,
ఆర్తిసంహరణుండ వని నిన్ను శ్రుతులు
నిరతంబు గానంబు నెఱపినయెడల,
శ్రీరామ నీ కిదే చేసి జోహారు
ఈ శరీరము శీఘ్రమే విడిపోవఁ
బ్రార్థించుచుంటిని భావంబులోన.
శివచరణాంబుజస్నేహ మీ హృదిని
ఒక్కింతయేని నాకుండినయెడలఁ,
ద్రికరణశుద్ధిగా శ్రీరామ! నేను
సత్యవ్రతంబును సలిపినయెడల,
ఓ సర్వదర్శకా! ఓ ప్రభూ! రామ!
నా ప్రార్థనము విని, నా శరీరమును
బహుశీఘ్రముగ నెడఁబాసియు నేను

దుస్సహ మీ బాధఁ దొలఁగుపూర్ణమును
నాకుఁ జూపింపు మనాథశరణ్య!
ఈ రీతి దక్షజ యెంతయో నగచె.
ఆమె దారుణదుఃఖ మకథనీయంబు
ఎనుబదియేడువే లేఁడు లి ట్లొగ
అవినాశి, శంభుండు, హరుఁడు, శంకరుఁడు,
ఘనసమాధిని వీడి కన్నులు దెఱచి
రామనామం బనురాగంబుతోడ
జపియించుకొనసాగె జపమాలఁ బట్టి.
విడిచె సమాధిని విశ్వేశుఁ డనుచు
ఎఱిఁగి దక్షకుమారి యేగి సన్నిధికి
శ్రీశంభుపాదరాజీవంబులందు
భక్తితో సాష్టాంగపడి నతిఁజేయ
శంకరుం డామెను సత్కృపతోడ
ఎదురుగాఁ గూర్చుండ నిచ్చి యాసనము,
మధురసమంజులమాధవకథల
వినిపింపఁగా సాగె వ్రీల శోకంబు.
ఆ కాలమందె పద్మాసనుం డజుఁడు,
దక్షుఁడే యన్నిట దక్షుం డటంచు
వఱలు ప్రజాపతిపదవి నొసంగె.
ఆ యున్నతం బగునధికార మొంది
దక్షుండు గర్వసంస్తంభితుం డయ్యె!
పెద్దదౌ పదవి లభించినపిదప
గర్వ మూననిజీవి కానరాఁ డవని.

సతీశరీరపరిత్యాగము - దక్షయజ్ఞధ్వంసనము

అంత దక్షుండు మహర్షు లందఱిని
ఆహ్వాన మొనరించి యజ్ఞం బొకండు
సలుపగాఁ దొడఁగె నుజ్జ్వలవైభవముగ.
యజ్ఞహవిర్భాగులౌ సుర లెల్ల
అతిగౌరవముగ నాహ్వానింపఁబడిరి.
నాగగంధర్వకిన్నరసిద్ధముఖ్య
సకలదేవతలు నిజప్రియాసహితు
లై చనుచుండిరి యజ్ఞంబుఁజూడ.
తద్బ్రహ్మహరిశివుల్ తప్ప నా వేళ
అఖిలబృందారకు లాకాశవీథి
నరుగుచుండిరి విమానావళి నెక్కి.
వ్యోమమార్గంబునఁ బోవుచున్నట్టి
మహితాతిరుచిరవిమానపంక్తులను
శ్రీసతీదేవి వీక్షించె నయ్యెడను.
సురసుందరీగణసుమధురగాన
రవములు మునిజనశ్రవణంబులందు
బలవంతమునఁ జొచ్చి వారిధ్యానములఁ
జెఱుపఁదొడంగె విచిత్రరీతిగను.
అంత సతీదేవి హరునిఁ గాంచియును
గగనకోలాహలకారణం బడుగ,
అఖిలవృత్తాంతంబు హరుఁడు వచించె.
తనతండ్రి చేయు నధ్వరవార్త వినియు
దక్షకుమారి సంతసమొందె హృదిని.
'శ్రీమహేశుఁడు నాకు సెలవిచ్చెనేని
వెళ్ళి కొన్నాళ్ళు నా పితృగృహం బందు
వసియింతు' ననియామె భావమం దెంచె.
తనపతిచేఁ బరిత్యక్తయై యామె
అతిదుర్భరాకులం బాత్మలో నొందె;
ఐనను స్వీయమహాపరాధంబు
నెఱిఁగియుండుటచేత నిది యే మటంచుఁ
బల్లెత్తి యొకమాటఁ బలుకలేదయ్యె.
ఎట్టకేలకు సతి యీరీతిఁ బలికె
పరమమనోహరవాణి వెలుంగ
భయసంశయప్రేమభావంబు లొప్ప:
"నాతండ్రిగృహమున నాథ! లోకేశ!
జరుగుచున్నది మహోసవనకార్యంబు,
హే కృపాయతన! విశ్వేశ్వరా! కృపను
సెలవొసంగిన నేను శీఘ్రంబె పోయి

ఆ సవనోత్సవం బరసి వచ్చెదను."
ఆ మాట లాలించి హరుఁడిట్లు పలికె.
"మంచి దే నీ యభిమతము; స్వాంతమున
అదె నాకుఁగూడ మోదావహం బగును.
అయినను విపరీత మాలింపు మిపుడు
మనల నాహ్వానింప మానె నీతండ్రి.
నినుఁదక్క దక్షుండు నీదు చెల్లెండ్ర
నందఱఁ బ్రేమ నాహ్వానంబుఁ జేసె.
మనయం దసూయచే మానెను బిలువ;
నినుఁగూడఁ బిలువఁడు నిర్ప్రేముఁ డగుచు.
మనవ ర్తనంబును మది మెచ్చ కతఁడు
మును బ్రహ్మసభలోనఁ బూనె ద్వేషమును.
ఇందుచేత నె యతం డిప్పటికైన
మనల నిందించుట మానఁ బోఁడయ్యె.
పిలువకుండఁగ నీవు వెడల, భవాని!
నీ సుశీలమునకు నీ స్నేహమునకు
నీ గౌరవమునకు నిజము కొఱంత.
పిలువకుండఁగఁ గూడ విహితునింటికిని
విభుమందిరమునకుఁ బితృగృహంబునకు
ఆచార్యు నెలవున కరుగఁగాఁవచ్చు—
దీనియం దెట్టి సందేహంబు లేదు.
ఐనను నీవన నాత్మలోఁ బడని
వానియింటికిఁ బోవ భావ్యంబు కాదు—"
అని యనేకవిధాల నా శంకరుండు
హితముఁ జెప్పినఁగాని యిసుమంత సతికి
హృదిని జ్ఞానం బుదయింపక పోయె
బలవంత మగువిధివశముచే ననఘ!
"పిలువకుండఁగ నీవు పితృగృహంబునకు
అరిగినచో సతీ! యశుభంబె కలుగు"
అనియు నింకొక్కపర్యాయంబు శివుఁడు
తెలియఁగా ననె నుమా దేవితోఁ గరుణ.
పలుసార్లు బోధించి పరమేశుఁ డటుల,
ఎఱిఁగియు లాభ మొక్కింత లేఁదనుచుఁ,
దనముఖ్యగణములఁ దగఁ దో డొసంగి
సతి నంపెఁ దుదకు దక్షుఁగృహంబునకును.
అంత భవాని ప్రియంబొప్పఁ జేరెఁ
దనతండ్రి యైనట్టి దక్షునింటికిని;
అట నా సతిని నొక్కరైనను గాని
పలుకరింపఁగ లేదు పల్లు విప్పియును
దద్దక్షుభయముచేఁ దాపసచంద్ర!
ఒక తల్లి మాత్రమే యుమను వీక్షించి
యాదరించెను బ్రేమ మణఁచుకోలేక.
చెల్లెండ్రు నెదురేగి చిఱునవ్వు లొప్ప
స్వాగతం బొసఁగిరి సంతోషమునను.
దక్షప్రజాపతి తనపుత్రి యనెడి
వాత్సల్యమేనియు వదలి వైచియును
అడుగఁడాయెను క్షేమమా? యనికూడ!
ఆ సతీదేవిని నరసెనో లేదో
దక్షప్రజాపతి తను వెల్ల నపుడు
క్రోధాగ్నికీలికాకుండ మైపోయె.
అక్కటా! సతి యంత నరిగి లోపలికి
యజ్ఞశాలను గాంచ, నందు నెచ్చటను
హరహావిర్భాగంబు లగపడవయ్యె.
అప్పు డామెకుఁ జిత్తమం దర్థమయ్యె
హరుహితోక్తులలోనియాథార్థ్య మెల్ల.
ఆత్మేశ్వరునకు నా యజ్ఞంబులోనఁ
గలిగినయవమానకార్యంబుచేత
ఈశ్వరీహృది దహియింపఁగాఁ దొడఁగె.
పూర్వశోకముకన్న భూరికఠోర
శోక మా సతి పొంది స్రుక్కఁగా సాగె.
ఈ ప్రపంచంబున నెన్నెన్నో వగలు
కలవందు మించు దుఃఖం బేది యున్నఁ
దనబంధువులు నిరాదరము సూపుటయె!
అందుచే నా సతి యతిదుఃఖ మొందె.

తనతల్లి వచ్చి యెంతగ బుజ్జగించి
యోదార్చిననుగాని యుమ తనలోని
శంకరఘోరాపచారసంజనిత
దుర్భరపరితాపదుర్వారవహ్ని
నార్పుకొనంగ లేదాయె మునీంద్ర!
అంతట సతి దుఃఖ మాపుకో లేక
చరచర నా యజ్ఞ శాలలో నిలిచి,
ఆ మహాసభ నెల్లనరసి తీక్ష్ణముగఁ,
ననియె నీరీతి రోషావిష్ట యగుచు;
"ఓ సభాసదులార! ఓ ఘనులార!
ఓ మునీశ్వరులార! ఓ విజ్ఞులార!
శ్రీశివనిందను జేసిన యట్టి
శ్రీశివనిందను జెవుల విన్నట్టి
మీరెల్లఁ దప్పక మీ పాపఫలము
ననుభవించెద రిదే యనుభవించెదరు.
మాతండ్రిసైతము మదిఁ బూర్ణముగను
బరితాపపడుఁ దన పాపకృత్యమున.
హరిహరులను, సజ్జనాళిని, ఖలులు
నిందించుటను విన్న-నియతి యే మనఁగ;
చేతనైనఁ వాని జిహ్వానుఁ జీల్చి
వేయఁగా వలయును వేగంబె; లేదొ
తన రెండు చెవుల హస్తముల మూసికొని
పరుగెత్తిపోవుట పరఁగు ధర్మ్యముగ.
త్రిపురారి యా మహాదేవుండు, శివుఁడు,
జగదాత్మ, జగదేకజనకుండు, విభుఁడు,
సకలోపకారి నా శంభు శంకరుని
మందుఁడై నిందించె మాతండ్రి యిప్ప-
డా దక్షశుక్రజ మైన దీ తనువు!
ఆ చంద్రశేఖరు, నా వృషధ్వజుని,
నా హృదయంబులోన ప్రతిష్ఠించి
యీ శరీరం బిప్పుడే త్యజించెదను!-"
అని పల్కి యోగాగ్ని యం దామె తనువు
దగ్ధంబొనర్చెను తత్క్షణంబండె-
ఆ మహాయజ్ఞసభాంతరాళంబు
నందుండి యొక్కపర్యాయంబు లేచె
అతిభయోపేతహాహాకారరవళి.
అటుల యజ్ఞంబున నా సతీదేవి
తనువు వీడుట విని తచ్ఛివగణము
సవనవిధ్వంసమ్ము సలుపఁదొడంగ,
భృగుమహాముని కాచెఁ గృపను యజ్ఞమును.
ఈ వార్త వినియు మహేశుఁ డుగ్రతను
వీరభద్రుని బంప, వేగ నా ఘనుఁడు
యజ్ఞవిధ్వంసన మాచరించియును
దగువిధంబున దేవతలను శిక్షించె
శివవిరోధంబునఁ జెందు దుర్గతిని
దక్షుండు పొందినతక్కథ యెల్ల
అఖిలప్రపంచవిఖ్యాతమై యుంటఁ
జెప్పితి నేను సంక్షిప్తపద్ధతిని.

శ్రీపార్వతీజననతపశ్చర్యాదివృత్తాంతము

సతి మరణించుచు జన్మజన్మముల
శ్రీశివపాదసంసేవయే తనకు
సిద్ధించుఁగాకని శ్రీహరింగూర్చి
ప్రార్థించినందునఁ బార్వతి యగుచు
ఆ హిమాచలునింట నావిర్భవించె!
ఏనాఁడు పార్వతి హిమవంతునింట
నావిర్భవంబొందె నానాఁటినుండి
అఖిలసిద్ధులు సంపదావళి కెల్ల
నావాసమయ్యె హిమాలయనగము
అటనట నొదవె ఋష్యాశ్రమగణము.
సముచితసుందరస్థానంబు లొసఁగి
శ్రీహిమాచలుఁ డాదరించె మానులను!
సర్వదా సుమఫలసహితంబులైన
నానావిధంబులౌ నవ్యవృక్షములు,

బహువిధమణిగణ భాసురఖనులు,
భాసించె నా రమ్యపర్వతమందు.
నిర్మలోదకములు నిండె వాహినుల,
ఖగమృగమధుపసంఘములు సుఖించె.
ఆ హిమాలయగిరి నధివసియించు
సకలజీవంబులు సహజవైరముల
విడిచి పరస్పరప్రేమతో మెలఁగె.
ఆ పార్వతీదేవి యవతరించుటను-
శ్రీరామభక్తిచేఁ జెలువొందు నట్టి
భక్తోత్తముని ముఖపద్మంబువోలె
ఆ హిమాలయగిరి యతిశోభ నొందె.
నిత్యనూతనశుభనిలయుఁడై చెలఁగు
ఆ హిమవంతు బ్రహ్మాది దేవతలు
ధన్యుం డటంచుఁ గీర్తన సేయుచుండ్రి.
ఈ వార్తనెల్లఁ దా నెఱిఁగి దేవర్షి
ఆ హిమాచలుని శుభాలయంబునకుఁ
గౌతూహలం బొప్పఁగా నిర్గమించె.
ఆ వచ్చినట్టి మహామునీశ్వరున
కత్యాదరంబున నద్రివల్లభుఁడు
స్వాగతంబొసఁగియు భక్తి దీపింపఁ
బ్రక్షాళనముఁ జేసి పాదపద్మముల,
ఉన్న తాసనమున నుపవిష్టుఁజేసి,
భార్యాయుతంబుగాఁ బదముల వ్రాలి
తన్ననిపాదతీర్థంబుఁ గైకొనియు,
స్వీయాలయమునఁ బ్రోక్షించె; నా పిదపఁ
దన మహాదృష్టంబు దనరఁగాఁ దెలిపి
ఆత్మపుత్రికను ప్రియంబొప్పఁ బిలిచి
తన్నారదాంఘ్రిపద్మంబుల వ్రేల
సాష్టాంగనతులను సలుపఁగాఁజేసి
ఈరీతిఁ బలికెనుహిమవంతుఁడనఘ!
ఓ నారదాచార్య! ఓ మునివర్య!
దేవా! త్రికాలవేదివి సర్వ మాత్మ
నెఱిఁగిన ఘనుఁడ వీ వెల్లెడ నిరుగు
పరమపావన పరివ్రాజకమణివి;
తగ విచారించి తథాగతవర్య?
అస్మదాత్మజకు శుభాశుభంబులను
దెలుపఁగాఁ గరుణఁ బ్రార్థించుచున్నాఁడ!"
అను మాటలను విని యా నారదర్షి
ముఖమునఁ జిఱునవ్వు మోసులెత్తంగ,
మృదుగూఢవాణితో నీరీతిఁ బలికె:
"ఓ హిమాచల! వినుమోయి తెల్పెదను
నిఖిలసద్గుణనిధి నీ తనూజాత
సహజసౌందర్యవిజ్ఞానసౌశీల్య;
'శ్రీభవానీదేవి, శ్రీయుమామాత,
యంబిక' యనియెడు నమలనామములఁ
బిలువంగఁబడు నీదు ప్రియపుత్రి యనఘ!
సకలసల్లక్షణసంపన్న యగుచు
ఈ బాల నిరతభర్తృప్రేమఁ గాంచు;
సర్వదా యీ గౌరి సౌభాగ్య మొంది
తల్లిదండ్రులకు సద్యశ మొనఁగూర్చు;
అఖిలజగత్పూజ్య యీచు వెలుంగు
నీమె సేవింపఁ గా దేది దుర్లభము;
ఈమెనామము స్మరియించుమాత్రమున
ఈ ప్రపంచంబున నెల్ల భామినులు
ఖడ్గధారావ్రతకల్ప మైనట్టి
వరసతీధర్మంబు వహియింపఁగలరు.
ఇవి గౌరిసుగుణంబు లిఁక రెండు మూఁడు
కల వవగుణములు చెప్పెద వేర్వ్య;
అభిమానవిరహితుం డగుణుండు, మఱియుఁ
గన, తలిదండ్రులు గలుగనివాఁడు,
ఛిన్నసంశయుఁ, డుదాసీనచిత్తుండు,
జటిలుండు, యోగి, నిష్కామి, నగ్నుండు,
అల యమంగళవేషుఁ డగు నీమెభర్త;
ఈమెహస్తముఁ జూడ నిది కానవచ్చు."

అను నారదునిపల్కు లాలకించియును
సత్యంబు లనియెంచి సర్వాల త్తరిని
కడుదుఃఖ మొందిరి; కాని శ్రీగౌరి
అతిహర్ష ముం జెందె నంతరంగమున.
ఈ భేద మా ఋషి యెఱుఁగకపోయె!
పైకందఱును నొక్కపగిదిగా నున్న
కలదు భేదంబు లోఁగలుగు భావముల;
ఆ మేనకా దేవి, కా గిరిపతికి,
శ్రీగౌరికిని, ఆమె చెలిక త్తెలకును,
అందఱి కొకరీతి నా సమయమున
తనువులు పులకీకృతంబులై పోయెఁ
గనుల బాష్పంబులు కారఁగాఁదొడఁగె.
'దేవర్షి నారదు దివ్యవాక్యములు
తప్ప వేనాఁడు యథార్థంబు లగును'-
అని యుమ లోన నాహ్లాదంబుఁ జెందె.
ఆ పార్వతీహృదయాంతరాళమున
శ్రీ శివచరణరాజీవానుర క్తి
మొలక లె త్తెను; మహామునీ! భరద్వాజ!
ఐనను సందేహమందెఁ జి త్తమున
శంకరప్రా ప్తి దుష్కరమంచు గౌరి.
తన శివప్రీతి వ్య క్తంబు సేయుటకు
సమయంబు కాదని స్వాంతమం దామె
తన మహోద్యోగంబుఁ దాచి, యణంచి,
చెలిక త్తెయొడిలోనఁ జేరి కూర్చుండె.
తాపసో త్తముమాట తప్ప దటంచు
హిమవంతుఁ డతని గేహినియును, సకియ-
లతిశోకవిహ్వలు లై రి స్వాంతముల.
తదుపరి యెట్టులో తచ్ఛైలవిభుఁడు
చెదరినధై ర్యంబుఁ జేరఁగాఁదీసి
"ఇపు డేమిసేయుటో యెఱిఁగింపు స్వామి!"
అనిన నా మునిపతి యనియె నీరీతి :
"వినుమోయి హిమవంత! విధిఁదాఁటఁదర మె

నరసురాసురమునినాగుల కైన?
అయిన నే నొకయుపాయంబు వచింతు
నీశ్వరకృపయున్న నిది ఘటియించు.
నేను దెల్పినరీతి నే గిరిపుత్రి
కటువంటిపతి వచ్చు నది తప్పఁబోదు.
పార్వతీవిభుఁడగువాని కున్నట్టి
అవగుణంబులు శివు నందున నుండె
నని నేను నిస్సంశయముగఁ జెప్పెదను.
శివకరగ్రహణంబుఁ జేసినన్ గౌరి,
దోషంబు లన్ని నిర్దోషంబు లగును.
హరి శేషపర్యంక మందు నిద్రించు,
నైన నయ్యది దోష మందురా బుధులు?
ఆ విధంబుగ నె సూర్యాగ్ని దేవతలు
సర్వంబు దహనంబు సలుపుచుండినను
అది దోష మని యెవ్వ రాడఁ గాఁబోరు.
శుద్ధోదకంబు, లశుద్ధోదకములు
వచ్చియు గంగలోపల మేళవించు-
ఆ సురాపగ నెవ్వ రైనను గాని
అపవిత్ర యని యెంతురా? హిమవంత!
పూషాగ్ని గంగలఁబోలు సమర్థు
లకుఁ జెడులంటఁజాలవు శైలరాజ!
ఏజ్ఞాని నని యెంచి హృది నహంకృతిని
నజ్ఞుండు ఘనులఁదా ననుకరించినను,
ఒక కల్పపర్యంతమో లేక సతమొ
వాఁ డుగ్రనరకసంవాసంబు సేయు:
దేహబద్ధుండు తా దేవుతో సముఁడె?
గంగోదకముఁ దెచ్చి కలిపి మద్యమున
త్రాగుఁడన్నను బుధుల్ త్రాగఁగాఁగలరె?
కాని యా సురఁ దెచ్చి, గంగలోఁ గలుప
అప్పు డా సురసైత మతిపూత మగును.
జీవేశ్వరులమధ్యఁ జెలఁగుభేదంబు.
నీ రీతి మనము గ్రహింపఁగా వలయు.

ఆత్మ యా పరమాత్మయం దైక్యమైన,
జీవుఁడు దేవుఁడై చెలఁగును; కాని
యందాక నుండు నాయంతరం బనఘ!
సహజసమర్థుండు, శంభుశంకరుఁడు.
ఆతఁడు భగవంతుఁ డాత్మలోఁ దెలియ.
అతనిని గౌరి పెండ్లాడినయెడల
నఖిలవిధంబుల నతిశుభం బగును;
ఆ మహేశ్వరుఁడు దురారాధ్యుఁడైన—
సలిపినఁ దపము ప్రసన్నుఁడౌ నతఁడు.
నీ పుత్రి తపమును నిర్వహింపంగ
త్రిపురారి, యా మహాదేవుఁ డీశ్వరుఁడు,
విధిప్రాఁతనేఁ దుడ్చివేయఁగాఁగలఁడు.
ఘనవరు లెందఱో కలరు లోకమున
కాని నీతనయకుఁ గడుఁ దగువరుఁడు
శివునికన్నను లేఁడు చింతసేయఁగను.
వరదాత, ప్రణతార్తిభంజనుం, డజుఁడు,
పరమకృపావార్ధి, భక్తరంజనుఁడు,
శ్రీమహాదేవుఁడు, శివుఁడు, శంకరుఁడు!
కోట్లకొలందిగా గొప్పయోగముల
జపము లెన్నెన్నియో సలిపినఁ గాని,
శ్రీశివారాధన చేయక, సచివ!
ఏనాఁడు సిద్ధింప విష్టకార్యములు”
అని పల్కి శ్రీహరిధ్యానచిత్తమున
నగసుతన్ దీవించి నాదరమూని,
“వదలుమా భయ మెల్లఁ బర్వతనాథ!
అఖిలంబు కల్యాణ మగు” నని పల్కి
బ్రహ్మలోకమునకుఁ బయనంబుఁ జేసె.
ఇఁక ననంతరకథావృత్తంబు వినుము:
ప్రియుని మేనక యొంటరిగ నుంటఁ జూచి
యింపుపెంపారఁ దా నీరీతిఁ బలికె,
“ఓనాథ! నారదయోగివాక్యములు
నా మది కవగాహనంబు కాలేదు.

మన తనూజకుఁ దగు మంచివరుండు,
కులగోత్రములు సాధుగుణవృత్తులున్న
వాఁడు, లభింప వివాహం బొనర్పుఁ—
డటులఁ గాకున్నఁ గల్యాణమే వలదు
కన్యగానే మన గౌరి యుండెడిని.
నా గౌరి నాదుప్రాణములతో సమము;
మనపార్వతికిఁ గూర్చుమను వల్పమైన
సహజజడుం డని సర్వులు నిన్ను
నిందింతురో నాథ! నిక్కంబు గాను.
కూర్మి వివాహంబుఁ గుదిరించునప్పు
డీ విషయంబు నీ హృదినుంచు మెప్పు
డాపయి ననుతాప మందకుండఁగను.
అని మేనకాదేవి యాత్మేశుచరణ
పద్మంబులందున ప్రాలి దుఃఖించె.
అంతఁ బర్వతపతి యనురాగ మొప్ప
నీగీతి మేనక నీక్షించి పలికె:
“చంద్రునిలో నగ్ని జన్మింపవచ్చు
కాని నారదుమాట కల్ల గా దెపుడు
ప్రియురాల! నీ చింత విడువు మంతయును
భగవంతు నెంచుము భావంబులోన.
ఎవ్వఁడు పార్వతిన్ సృష్టించె నతఁడె
ఆమె కొసంగుఁ గల్యాణంబు సకియ!
నీ సుతపైఁ బ్రేమ నీకున్న యెడల,
శివసమాగమమును సిద్ధింపఁజేయు
తప మొనరింప నీ తనయను బంపు
మిదె వగ యోయెడి యేకైకపథము,
దేవర్షి వర్యుల దివ్యవాక్యములు
పూర్ణార్థగర్భితంబులు, సహేతువులు.
ఆ వృషకేతనుం డా మహాశివుఁడు
సకలసద్గుణనిధి సౌందర్యమూర్తి!
ఇంక శంకింపకు మీసత్య మెఱిఁగి.
అన్నిట శంకరుం డకళంకుఁ డబల!”

అనుపతివాక్యంబు లాలించి మేన,
హర్షంబు జెందియు నాత్మలో, లేచి
గౌరిచెంతకుఁ బోయెఁ గడుఁ బ్రేమతోడ,
ఆమె యుమాదేవి నరసి నంతటనె
ఆమెకన్నులలోన నశ్రు లుప్పొంగె;
ఆమేనకాదేవి యత్యాదరమున
కూర్మిపుత్రిక నెత్తుకొనియు ముద్దాడి
యొడియందున న్గూరుచుండఁగాఁ జేసి
పలుసార్లు కౌఁగిటఁ బరఁగ హత్తించె.
ఉజ్వలితానురాగోద్వేగవశత
నామె గద్గదకంఠ యయ్యె; నత్తఱిని
ఆగె నాలుక మాటలాడ లేకుండ.
ఆతీరు గాంచియు నా జగన్మాత,
ఆభవానీదేవి, అంబ, సర్వజ్ఞ,
మాతృసుఖప్రదమధురాతిమృదుల
వాక్యముల్ దనర యీ పగది వచించె;
"స్వప్న మొక్కటి నాకు వచ్చె నోమాత!
వరసుందరుఁడు గౌరవర్ణుఁడౌ నొక్క
బ్రాహ్మణో త్తముఁ డిట్లు పలికె నాతోడ:
ఓ శైలసుత! నారదోక్తుల నీవు
సత్యంబు లనెడివిశ్వాసంబుఁ బొంది
తప మొనరింపుము తప్పక వెళ్ళి;
నీవు తపశ్చర్య నిర్వహించుటయె
తగ సమ్మతము నీదు తలిదండ్రులకును.
తపము సుఖంబిచ్చుఁ: దప మొనరింప
[illegible]కోషంబులు తూలి నశించు;
[illegible]బలముచేఁ గాదె విధాత
[illegible] బెల్ల సృష్టించుచుండు;
[illegible]బలముచేఁ గాదె శ్రీ విష్ణు
[illegible]ంబులఁ గాచు నెల్లవేళలను
[illegible]తపోబలముచేఁ గాదె మహేశుఁ
[illegible]లలోకముల లయం బొందఁ జేయు.

ఘనతపోబలముచేఁగాదె శేషుండు
తనఫణామండలి ధరణి న్భరించు,
అఖిలసృష్టికిఁ దపం బాధారభూత
మిది యెఱింగియు భవానీ! నీవు పొమ్ము
తప మొనరింపుము ధన్యతఁ గనుము."
అని చెప్ప, మేనక యూలకించియును
విస్మయం బొందియు విభుఁ బిలిపించి
స్వప్నవృత్తాంతంబు సర్వంబుఁ దెలిపె.
తాపంబుఁబొందెడితల్లిదండ్రులకు
వేయి వచించి యొప్పించియుఁ దుదకు
తరలె నుమాదేవి తప మొనరింప
హర్షసంకలితహృదంబుజ యగుచు
పార్వతీప్రియపరివారంబు, లామె
తల్లిదండ్రులును, స్వాంతంబులం దెంతో
భయసంభ్రమంబులఁ బడసాగి రపుడు
వేదశిరుం డను విజ్ఞుఁడౌ మౌని
వచ్చి యోదార్చెను వారల నెల్ల
పార్వతీమహితప్రభావంబు విసియు
వా రంద ఱప్పుడు స్వస్థతఁ గనిరి.
ప్రాణేశ్వరుం డైనపరమేశుదివ్య
చరణాంబుజంబుల సంధించి, హృదిని
అంబ, యుమాదేవి యడవుల కేగి
మొదలుపెట్టెను ఘోరముగఁ దపశ్చర్య.
ఆమె తనూలత యతికోమలంబు
భరియింపఁ గలదె తపఃక్లేశములను?
అయినను బార్వతి యఖిలభోగములఁ
బతిపాదభక్తి సంభరితాత్మ యగుచు
వర్జించె నహా! తృణప్రాయంబులుగను.
ఆమెకు హరచరణానురాగంబు
నిత్యనవ్యంబయి నెగడఁగాఁ దొడఁగె.
శివపదధ్యాననిష్ఠితచిత్త యగుచుఁ
దనువునే మఱచెను దపమున న్గౌరి.

ఒక్క వేయేడు లాయుమ కాననమున
కందమూలఫలాలఁ గడుపు నింపుచును,
శాకముల్ దిను చొక శతవత్సరములు.
జలవాయుభక్షణ సలిపి కొన్నాళ్ళు,
మఱి కొన్ని దినములు పరమతీవ్రముగ
కఠినోపవాసదీక్షారతితోడ,
ఆ పయి నొకవేయి యబ్దంబు లడవిఁ
బండి రాలినబిల్వపత్రముల్ దినుచు,
భూమిపైఁ బడి, యెండిపోయినయట్టి
ఆబిల్వపత్రంబు లైనను దుదకుఁ
గైకొనకుండఁగాఁ గడు ఘోరఘోర
తప మొనరించె నుద్యద్భక్తి మీఱి.
ఆ నాఁటినుండియే యీమె "కపర్ణ"
అనునామ మొదవె మహర్షివరేణ్య!
ఆమెతనూలత యత్యుగ్ర మైన
తపముచే శుష్కించె; ధాత వీక్షించి
అంతరిక్షమునుండి యపు డనె నిట్లు
గంభీరమేఘసంఘాతరావమున:
"వినుమమ్మ ఓ శైలవిభుతనూజాత!
నీ వాంఛ సిద్ధించె నీ వింక జనని!
ఆపు మీ దుస్సహం బైన తపంబు;
అచిరకాలములోన నా త్రిపురారి
నీ ప్రాణవిభుఁ డగుఁ నిక్కంబు దేవి!
ము న్నెందఱో ధీరమునులు, జ్ఞానులును,
కలరు లోకంబునఁ గాని భవాని!
ఒక్క రేనియు నిట్టి యుగ్రతపంబు
సలుపలే దెన్నఁడు జగమందు గౌరి!
ఈ బ్రహ్మవరవాణి యెపుడు సత్యంబు;
సతతాతిపూతమై సంభాసురిల్లు
నని విశ్వసింపు మంబా! హృదయమున.
నీ తండ్రివచ్చును నినుఁ గొనిపోవ;
త్యాగంబుఁజేసి నీ హఠమెల్లనపుడు
నిర్గమింపు మపర్ణ! నీ గృహంబునకు.
ఇదిగాక సప్తర్షు లిటకు వచ్చెదరు;
నా మాటలకుఁ బ్రమాణం బదే యంబ!"
అను బ్రహ్మవాక్యంబు లాలించి, గిరిజ
హర్షాన్వితస్వాంత యయ్యె నూసీంద్ర!
పరమసుందరమైన పార్వతీచరిత
మీ రీతిఁ బలికితి నిపు డింక వినుము
పరశివుచరిత నో వరమౌనిచంద్ర!
ఏనాఁడు సతి దేహ మెడఁబాసి చనెనో
ఆనాఁటినుండి యాహరుని మానసము
పరమవై రాగ్యసంభరితమై పోయె.
సతతంబు రఘునాథసదమలనామ
జప మొనరించుచు సర్వంబు మఱచు;
అటనట కేగి మహాభక్తివశత
రామునిగుణముల శ్రవణం బొనర్చు.
ఆసచ్చిదానందుఁ, డాసుఖధాముఁ,
డా మోహమదకామహరుఁడు, శివుండు
హరి, జగదభిరాము నాత్మలో నిలిపి
సంచరింపఁగ సాగె సకలధరిత్రి.
మునినికాయముల కా పురహరస్వామి
ఒక్కచోఁ జేయు జ్ఞానోపదేశంబు;
ఇంకొక్కచోట సీతేశగుణాళి
వర్ణించు భక్తి సంభరితాత్ముఁ డగుచు.
నిఖిలజ్ఞుఁడును మహానిష్కాముఁడైన
శివభగవానునిచిత్తపద్మమును
భక్తవియోగము వ్యాకులపఱచెఁ
గడుదీర్ఘకాలంబు గడచె నీరీతి.
శ్రీరామపాదరాజీవసద్భక్తి
ఈశ్వరు పావనహృదయపద్మమున
నిత్యనవ్యం బయి నెగడఁదొడంగె;
ఆశంకరునిదీక్ష నాయతిప్రేమ,
నామహోన్నతభక్తి నరసి హర్షించి

ఘనకృతజ్ఞుఁడు, మహాకారుణ్యరాశి,
సద్రూపలావణ్యసౌశీల్యవనధి,
అమిత తేజుం డగునారామవిభుఁడు
పరశివుముందటఁ బ్రత్యక్ష మయ్యె,
"ఇట్టి మహావ్రతం బెవరు నీకన్నఁ
జేయఁగాఁగల రయ్య శివ! పరమేశ!"
అని యనేకవిధాల హరుఁ బ్రస్తుతించి
తెలిపెను శ్రీపార్వతీజన్మకథను.
అతులకృపానిధిఁ యగుట రాఘవుఁడు
పార్వతీపరమపావనచర్య లెల్ల
విస్తరించి, వచించె ప్రేమ పెంపార:
"శివ! నీకు నాపైనఁ జిత్తంబులోనఁ
బ్రేమ దీపించుచో వినుము నావినతి:
ఆ శైలజను బెండ్లియాడుమా పోయి;
ఈవు నా కీవరం బీయగాఁవలయు."
అనఁగ శివుం డిట్లు లనె రాముతోడ
"అధిప! నా కియ్యది యనుచితం బైనఁ
బ్రభువాక్యముల దాఁట భావ్యంబు గాదు.
నాథ! నీయాజ్ఞను నాశిరంబందుఁ
దాల్చుటయే మహాధర్మంబు నాకు.
తల్లి దండ్రులమాట, తన యొజ్జమాట,
ప్రభువుమాటల శంక వదలివైచియును
దలఁ దాల్చవలయును దప్పనిసరిగ;
ఆ నుడుల్ శుభముల కాలవాలములు.
అధిప! శ్రీరామ! నా కన్నివిధాల
పరమహితంబును బరఁగ నొనర్చు
నా స్వామి వీవె; ఓనాథ! నీయాజ్ఞ
శిరమునన్ ధరియింతు శ్రీరామచంద్ర!"
భక్తివివేకముల్ భవ్యధర్మంబు
భాసిల్లు శంకరువాక్యముల్ వినియు
శ్రీరాఘవుఁడు సంతసించె స్వాంతమున.
"నీదీక్ష నెఱవేఱు; నేను చెప్పినది
నీ వింక శంకరా! నెఱవేర్పు" మనుచు
కృషఁ బల్క రాముఁ డదృశ్యుఁడై పోయె.
కాని శంకరునిహృత్కంజాంతరమున
శ్రీరామరూపంబు చెదరక నిలచె.
సప్తమహర్షు లా సమయంబునందె
ఆ శివుసన్నిధి కరుదెంచి రపుడు;
వారితో హరభగవానుఁ డీరీతి
అతిమంజులంబుగా నసియె మౌనీంద్ర!
"పార్వతికడ కేగి పరమర్షులార!
ఆమెకుఁగలప్రేమ నటఁ బరీక్షించి
ఆపయి హిమవంతు నటకుఁ బంపించి
ఆమెను గృహమున కంపుఁడీ మీరు.
తీర్పుఁడీ యీ మెసందేహంబు లెల్ల."

సప్తమహర్షులు పార్వతీదేవిలోని
శివప్రణయమును బరీక్షించుట

అంత నాసప్తమహర్షు లేగియును
దనువు దాల్చిన మహాతపముచందముగ
భాసిల్లు చున్నట్టిపార్వతి న్గాంచి
"ఓ శైలపుత్రి; ఈ యుగ్రమౌ తపము
చేయఁ గారణ మేమి? చెప్పుమా గౌరి!
ఈ తపం బెవరికై? యెందుకై? చెపుమ
సత్యమర్మంబు దాచఁగ నేల? బాల"
అన విని యీగౌరి యనియె నీపగిది:
"నా యాశయంబు విన్నప మొనరింప
ఆత్మలోఁ గడుల్లజ్జ నందుచున్నాను.
నా జడత్వము విన్న నవ్వరా మీరు;
ఐనను నా బుద్ధి హఠముఁ దాల్చియును
మాఅదాయెను మహామౌనీంద్రులార!
అది నీటిపై గోడ నహా! కట్టఁదలఁచె!
నారదసద్బోధ నమ్మియు నేను
పఱుముల్ లేకయే పై కెగురంగ

యత్నించుచుంటిఁ బేరాసను బూని
కనుఁడు నా యజ్ఞత ఘనబుషులార!
ఆసదాశివునిఁ బెండ్లాడ నెంచితిని."
ఆమాటలను విని యాస ప్తబుషులు
హసితముఖాబ్జులై యని రీవిధముగ:
"భూరిశైలమునకుఁ బుట్టె నీ తనువు
తండ్రిపోలిక నీకుఁ దప్పక వచ్చు!
నారదుబోధలు నమ్మి యెవ్వండు
నిజగృహంబులలోన నిలిచిరో చెపుమ!
ఆనారదునిబోధ లాలించి నట్టి
ఆదక్షనందను లడవుల కేగి
యింటిముఖంబుఁ దా మెఱిఁగిరా తిరిగి?
ఆనారదుఁడెకదా, ఆ చిత్రకేతు
సంసార మెల్ల నాశం బొనరించె;
ఆనారదునిచేత నాహేమకశిపుఁ
డేగతిఁ బొందెనో యెఱుఁగవా? గౌరి!
నారదుమాటల నమ్మినయట్టి
వా రెవ్వరైనను బర్వతతనయ!
ఇండ్లు వాకిండ్లఁ దా మెడఁబాసి తుదకు
సన్న్యాసు లౌదురు సత్యంబుగాను,
ఆతఁడు హృదయమం దత్యంతకపటి;
పైకి ధరించెను భక్తవేషమును,
దనవలెఁ జేయు నందఱని నారదుఁడు.
ఆనారదునిబోధలా-నమ్మి నీవు
భవు, నుదాసీనస్వభావు, నిర్గుణుని,
నిర్లజ్జుని, కువేషు, నిష్కలున్, మతియు
అనికేతనుని, సర్పహారభూషణుని,
ఆకపాలిని, గటా! యూదిగంబరుని,
బెండ్లాడుటకు మహాప్రీతి నొందెదవు?
అట్టివానిని బెండ్లి యాడియు నీవు
అకట! ఏ ఘనసుఖం బనుభవించెదవు?
ఆ వంచకునియన్యతాలాపములనె
ఆత్మ నమ్మితి వమాయకురాల! బాల!
తనస్నేహితులు బలాత్కారంబు సేయ
శ్రీసతీదేవిని శివుఁడు పెండ్లాడ
ఆపయి వదలివేయంగ నిర్దయను
బాప, మా యిల్లాలు ప్రాణముల్ విడిచె.
ఇంకేమి-శివుఁ డింక నే చింత లేక
ఎచటనో భిక్షు మూడిండ్లఁ గావించి
హాయిగా నిద్రించు ననవరతంబు.
అహ! సహజైకాకు లగు విరాగులను
ఏకన్యలైన దా మిాక్షింపఁబోరు.
ఇప్పుడైనను మాదు హితవాక్కు వినుము
నీసరిజోడుగా నెగడు సద్వరుని
బాల! విచారించి వచ్చినా మిపుడు;
అతిసుందరుడు, శౌరి, అతిసుఖదుండు,
పరమసుశీలుండు, వరవేదవినుత
చిరయశోలీలావిశేషుం, డనింద్యుఁ
డఖిలసద్గుణరాశి, హరి, శ్రీవిభుండు,
వైకుంఠవాసుఁ, డా వరుఁడు కుమారి!
కూర్తుము నీకట్టి గొప్ప దౌమనువు"
అన విని నవ్వుచు ననియె భవాని
"మీరు తెల్పినరీతి మేదినిలోన
ఈశరీరము గిరికే యుదయించె.
ఈదేహమును ద్యజియింతునేకాని
నా హఠంబును విడనాడఁగాఁ జాల.
పాషాణమందునఁ బ్రభవించినట్టి
హేమంబు నగ్నిలో నెంత గాల్చినను
వన్నెఁ బాయదుకదా భవ్యాత్ములార!
నారదమునివాక్కు నమ్మోద సతము.
నేను వసించెడి నిలయంబు బహుళ
జనపూర్ణమైన, నిర్జనమైన సరియె
నే భయపడను మునీశ్వరులార!
తన గురుదేవుబోధల నమ్మినట్టి

వ్యక్తికిఁ దుదకు స్వప్నంబులోనైనఁ
గలుగదు సౌఖ్యంబు, కలుగదు సిద్ధి.
ఆ మహాదేవుఁడు, హరుఁడు, విశ్వేశుఁ
డవగుణభవనుఁడే యగుఁగాక; విష్ణు
వఖిలసద్గుణధాముఁ డగుఁగాక; ఎవరి
కెవరిపై సంప్రీతి యెసఁగునో వారె
వారికిం గూర్తురు పరమహర్షంబు.
మొదటనే మీ రిది బోధించియున్న
ఓ మునీశ్వరులార! ఓ ఘనులార!
మీవచనంబుల మిక్కిలి ప్రీతి
నే భక్తి శిరసా వహించి యుండెదను.
కాని నే నిప్పు డా కైలాసవిభున,
కాశివదేవున, కామహేశునకు,
నా జీవితం బర్పణంబు చేసితిని.
ఆశివదేవు గుణాగుణావళిని
ఏల నా కిఁకపైన నెంచుకార్యంబు?
అంతగా నిటు వివాహంబులఁ జేయఁ
గౌతూహలము మీకుఁ గలిగిన, జగతి
గలరు వధూవరుల్ గణనకు మించి.
వారికిం గూర్పఁగా వచ్చును మీరు
అలసట నెఱుఁగక యత్యుత్సుకమున.
దశకోటిజన్మముల్ దాల్చినన్ నేను
శివునివివాహంబుఁ జేసికోవలయు;
కానిచో నుందును గన్యగానైన.
ఏకవందసార్లు ఋష్యుత్తములార!
శివుఁడె వచ్చియు నాకుఁ జెప్పనుగాక
ఆ నారదోక్తి ననాదరించెదనె?
నతిఁ జేతు మీ పాదనళినంబులకును;
తడవయ్యె నిండ్లకు దయతోడఁ జనుఁడు."
అని పల్కె నాజగదంబయా గౌరి.
ఆ మునీశ్వరులు, మహాజ్ఞానధనులు
పార్వతీదేవిసద్భక్తి వీక్షించి,

"జయజయ జగదంబ! జయము భవాని!
పరమాత్మ శంభుఁ; డంబా! మాయ వీవు;
తల్లిదండ్రులు మీరె తతవిశ్వమునకు!"
అనుచు సంకీర్తించి యామెయంఘ్రులకు
శిరము వంచియు నమస్కృతులఁ గావించి
అధిగమించిరి మహాహర్ష నిర్భరతఁ
బులకరింపఁగఁ దనువులు పలుసార్లు
అల్లిగి సప్తర్షు లాహిమవంతుఁ
బార్శ్వతి చెంతకుఁ బంపఁగా నతఁడు
వివిధవిఘ్నంబుల వినతులఁ జేసి
ఆమెను దోడ్తెచ్చె నాలయంబునకు.
అంత నాసప్తమహర్షు లేగియును
ఆయుమాచారిత్ర మా భవుతోడఁ
దెలుపఁగా నా శివదేవుండు మిగుల
అద్రిజాప్రణయప్రహర్షాత్మఁ డయ్యె;
సప్తర్షు లేగిరి సంతోషపడుచు.
సర్వజ్ఞుఁడైన యా శంకరుం డంత
భావంబు నేకాగ్రఫలచి ప్రగాఢ
రఘునాయకధ్యానరతియందు మునిఁగె-
ఆ కాలమందె యీ యవని వసించె
తారకుం డను ఘోరదానవాధిపుఁడు.
అసమానభుజబలుం, డతిశౌర్యరాశి,
చండతేజుఁడు; వాఁడు సర్వలోకముల,
అఖిలలోకేశుల, నందఱ గెలిచె,
ఆ తారకాసురుం డఖిల దేవతల
భాగ్యసుఖంబులఁ బడి కొల్లఁగొట్టె,
అతఁ డజరామరుం డయి యుంటచేత
ఎవ్వరు వాని జయింపలే రైరి.
వానితో దేవతల్ పలుసార్లు పోరి
అపజయంబులఁ బొంది రఖిలయుద్ధముల.
అన్య మేగతి లేక యఖిలదేవతలు
నిర్గమించి విరించినిలయంబునకును

బ్రహ్మతోఁ దమవగల్ వచియించుకొనిరి.
సర్వనిలింపవిచారచారిత్ర
మెల్ల విధాత గ్రహించె స్వాంతమున.
బ్రహ్మదేవుం డిట్లు పలికె ధైర్యమును:
"శంకరవీర్యసంజనితునిచేత
మాత్రమే వాఁ డిల మరణంబుఁ బొందు.
ఎఱుఁగుఁ డీశున కుదయించిన వాఁడె
తారకాసురుని యుద్ధంబునఁ గూల్చు.
చేయఁగావలయు నేఁ జెప్పినరీతి
ఈశ్వరకృప యున్న నిద్ధి సిద్ధించు.
దక్షయజ్ఞములోనఁ దనువుఁ ద్యజించి
ఆహిమాచలునిదివ్యాలయంబందు
పార్వతిగా సతి ప్రాదుర్భవించి
శివకరగ్రహణంబు సేయఁగాఁ దలఁచి
సలిపిన దమితప్రచండతపంబు;
సర్వంబు త్యజియించి శంకరుం డుండె
నిర్వికల్పసమాధినిష్ఠలో మునిఁగి.
అది యసమంజసం బైనను వినుఁడు
నేఁ జెప్పుచున్నట్టి నిర్ణయం బొకటి:
కాముని మీ రింకఁ గలిసియు వాని
హరుసన్నిధికి బంపి యాశివదేవు
చిత్తంబుఁ జలియింపఁ జేయగాఁ వలయు.
ఆపయి మన మెల్ల హరు నీశు డాసి,—
పాదపద్మంబుల వ్రాలి, ప్రార్థించి
శైలపుత్రిని బెండ్లి సలుపుకొనంగ
ఎటులైన నొప్పింత మిదియె మార్గంబు
దేవతల్ దుఃఖముల్ తీర్చుకొనంగ".
ఆమాటలను విని యమరు లెల్లరును
బాగు బా గనుచు సంబర మొంది రపుడు.
దేవత లెల్లఁ బ్రార్థింపఁగా భక్తి,
పంచబాణుఁడు, ఋషధ్వజుఁడు, మన్మథుఁడు
ప్రత్యక్షమయ్యె; నాపయి సురావళులు
తమభూరిశోక మాతనితోడఁ దెలుప
నాదుఃఖసందర్భ మంతయు వినియు
స్వాత్మలోఁ గొంత విచారంబు సలిపి
ముఖమునఁ జిఱునవ్వు మొలకలెత్తంగఁ
బలికె నీ విధముగఁ బంచబాణుండు:
"శివవిరోధముచేతఁ జేఁటె నా కొదవు.
ఐనను మీ పని ననుర క్తిఁ జేతు.
పరహితాచరణమే పరమమౌ ధర్మ
మని పల్కుచున్నవి యఖిలవేదములు.
పరహితాచరణతత్పరతనుత్కృష్ట
నిజదేహు లగువారి నిరతంబు బుధులు
తగఁ బ్రశంసింత్రు బృందారకులార!"
అని పల్కి మదనుఁ డాయమరుల కెల్ల
శిరము వంచియు నమస్కృతులను జేసి,
ప్రసవశరాసనపాణియై వెడలె
ననుచరుల్ తనవెంట నరుగుదేరఁగను.
అటులఁ బోవుచుఁ గాముఁ డాంతర్యమందు,
"శివునితో వైరముచే నాకుఁ జావు
తప్ప" దటంచును దలఁచె మునీంద్ర!

మన్మథవిజృంభణము

అంత మన్మథుఁడు స్వీయప్రభావంబుఁ
బ్రకటించి సర్వప్రపంచంబు నొంచె.
అపుడు మీనధ్వజుం డాగ్రహింపఁగనె
అఖిలవేదముల మర్యాద లెల్లెడల
నొక్కక్షణంబులో నట్టూతలూఁగె.
బ్రహ్మచర్యవ్రతబహుళసంయమము,
లాధైర్యధర్మంబు, లాసదాచార
జ్ఞానవిజ్ఞానముల్, జపతపోయోగ
వరవిరాగములన, బరగుచున్నట్టి
అఖలవివేకసైన్యావళి యెల్ల
అతిహఠాజ్జనితభయాకులత్వమునఁ

బాటిపోయెను భరద్వాజమునీంద్ర!
పాత్ర వివేకము బంధుయుక్తముగ;
వాని మహావీరభటు లెల్ల బెదరి
వెన్నఁ జూపి రుదగ్రవిధురరంగమున.
ఆసమయంబున నాభటు లెల్ల
సద్గ్రింథపర్వతచయకందరములఁ
బాటియు, డాగిరి ప్రాణసుస్థితికి.
కల్లోలపడియె లోకంబెల్ల నపుడు.
"ఇంకేమి జరుగునో యీశ్వరా! ముందు?
ఏ శక్తి రక్షించు నిఁక మమ్మఁ దేవ!
ఆగ్రహంబును బూని యీరతివిభుఁడు
ప్రసవబాణాసనపాణియై నిలువ
అతని జయించెడి యీ రెండుతలల
ఘను డెవ్వఁ డుండు జగత్త్రయమందు?"
అని ప్రతివ్యక్తియు ననుకొనసాగె.
భూరిచరాచరభూతజాలములు
సర్వనారీనరుల్ జగతి నెల్లెడల
ఆత్మీయసహజమర్యాదల వదలి
పరిపూర్ణముగఁ గామవశ్యాత్ములైరి.
ఆక్రమించెను గాముఁ డఖిలచిత్తముల.
వృక్షశాఖలు లతావిసరమ్మ్ము నరసి
కడుభ్రీతితో వంగెఁ గౌగిలించుటకు;
పరుగులెత్తె నదీప్రవాహముల్ పొంగి
సంగమింపఁగ మహాసాగరవిభుని.
ఘనసరోవరతటాకంబులు కలిసెఁ
బ్రణయభావోన్మత్తపారవశ్యమున.
జడములే యీరీతి సంచరింపఁగను
చేతనంబులమాటఁ జెప్పఁగావలెనె?
క్ష్మాతలి న్దిరిగెడుజంతుజాలములు,
ఆకాశయాస్యద్విహంగసంఘములు,
జలముల నసియించు సర్వజీవములు,
సమయమర్యాద విసర్జించి మించి
మదనపాదములకుం బానిసలయ్యె.
అఖిలప్రపంచంబు వ్యాకులంబయ్యె
కామాంధకారంబు క్రమ్మ గాఢముగ,
రేయింబవలు విస్మరించి భేదమును
సంచరించెను భ్రీతిఁ జక్రవాకములు.
నరసురాసురులు, కిన్నరనాగములును,
భ్రేతభూతపిశాచబేతాళములును,
నిరతంబు కాముబానిసవృత్తిఁ గనిరి.
సిద్ధవిరక్తఋషిమహామునులును,
యోగముల్ వదలి కామోపభోగములఁ
బడి తేలసాగిరి పరమమునీంద్ర!
పరమయోగీంద్రులు భవ్యతాపసులె
పరిపూర్ణముగఁ గామవశ్యులుగాఁగఁ
బామరుల న్గూర్చి పలికెడి దేమి?
సచరాచరం బగుసర్వవిశ్వమును
బ్రహ్మమయంబుగాఁ బరికించునట్టి
సజ్జను లెల్లరు సర్వవిశ్వంబుఁ
గామమయంబుగాఁ గనుచుండి రపుడు.
అఖిలలోకంబుల నబలలు కనిరి
పురుషమయంబుగాఁ; బురుషులు కనిరి
అబలామయంబుగాఁ: నఖిలలోకమును.
కామకృతాద్భుతకౌతుకక్రీడ
ఘటికాద్వయంబె యీకరణి వర్తించె
బ్రహ్మాండమున భరద్వాజమునీంద్ర!
ధీరుఁడై నిలిచిన స్థిరచిత్తుఁ డొక్కఁ
డేనియు లేడయ్యె నెల్లలోకమున.
అపహరించెను గాముఁ డందఱిమతుల
రఘువీరుఁడెవ్వరి రక్షించె వారె
మారున కోడక మనఁగల్గి రహహా!
శివునంట మదనుఁడు చేరెడుదనుక
ఒకరెండుగడియ లత్యుద్ధృతలీలఁ
జరిగె మన్మథవిలాసక్రియాకేళి.

శివు, మహా దేవు వీక్షించినంతటనె
కాముని తనువు ప్రకంపించిపోయె;
సర్వప్రపంచంబు స్వస్థతఁ గాంచె.
మద్యప్రమత్తతం బొసినపిదప
తెలివొందు మనుజుని తీరుగా సకల
జీవజాలము శాంతిఁ జెందెను తిరిగి–
ఆ రుద్రభగవాను, నా దురాధర్షు,
నా దుర్గమును, శివు నరసినంతటనె
ఆ మన్మథుని గుండియలు ఝుల్లు మనియె.
సిగ్గుచే నాతఁడు శిరము వంచియును
నిస్తబ్ధుఁడై అట్టె నిలిచెఁ బొమ్మటుల–
సిద్ధమై చావుకుఁ జివర కాతండు
పన్ని భావములోనఁ బన్నాగ మొకటి
ప్రకటించెఁ దా ఋతురాజ మైనట్టి
సకలసౌందర్యవసంతకాలమును.
కుసుమితబహువృక్షకుంజపుంజముల
పంక్తులు కన్నులపండువు సేసె
అఖిలవనోపవనావళుల్, సకల
వివిధకాసారవాపీతటాకములు,
సర్వదిశాతతి సంశోభఁ జెందె–
ప్రకృతియెల్లను రాగరంజితం బయ్యె;
శవములందును గామచలనంబు కలిగె–
కామసంజనితవికారభావంబు
చచ్చినవారిలో సైతము రేగె;
వర్ణనాతీత మా వనిసోయగంబు,
విమలసువాసనల్ విరజిమ్మికొనుచు
వీచెను జల్లని పిల్లవాయువులు–
కామాగ్నికినిఁ దోడుగా నరణ్యమున.
సదమలకాసార జలతరంగముల
వివిధపద్మంబులు వికసించి వెలిఁగె–
ఆపద్మపంక్తుల నతిమంజులముగ
భృంగసంగీతముల్ వినఁబడఁదొడఁగె–
కలహంసశుకపికకలనినాదములు
రేగె దిశల్ పుల్కరించిపోవఁగను–
అమరకన్యలు పాడి, రాడి రయ్యెడను–
తనసేనతోడను దరలి మన్మథుఁడు
అగణితవ్యూహంబు లన్నియుఁ బన్నె;
కాని శ్రీశివునిప్రగాఢసమాధి
భంగము కాదయ్యె; ప్రసవాస్త్రిఁ డంత
ఆగ్రహావేశతామ్రాక్షుఁడై నిలిచె.

మన్మథదహనము

శివుని సమాధిని జెఱుపఁగాఁ దలఁచి
ఒక మనోహరరసాలోర్వీజశాఖ
నీక్షించి దానిపై కెక్కి మన్మథుఁడు
పంచబాణంబులఁ బట్టి, చాపమునఁ
జేర్చియు, నారిని జెవిదాక లాగెఁ
జురచురఁ బరశివున్ జూచు చుగ్రతను.
ఆవాడిబాణంబు లైదు మన్మథుఁడు
గుఱిఁజూచి శివదేవు గుండెపై వదలె.
భవుఁడు సమాధివిభగ్నంబు గాఁగఁ
బొందె బాహ్యజ్ఞానమును భరద్వాజ!
అమితసంక్షుభితాత్ముఁడై శంకరుండు
కన్నులఁ దెఱచియుఁ గాంచె నల్దెసలు:
మామిడాకులగుంపుమాటున దాగి
పంచబాణుఁడు కాననచ్చె నంతటను;
రుద్రుండు పొందెను రూక్షకోపమును;
విశ్వమెల్లను బ్రకంపించె నాతఁటిని.
విప్పి భాలాక్షుంబు; వీక్షింప శివుఁడు
కాలి భస్మంబయ్యెఁ గాముండు త్రుటిని:
బ్రహ్మాండగహ్వారభాగంబునుండి
పుట్టె హాహాకారభూరిరావములు!
బృందారకులు మహాభీతిని గనిరి,
దానవుల్ మిగుల సంతసమును గనిరి.

మదనలీలల నెల్ల మనములోఁ దలఁచి
భోగులు వగచిరి భోరుమటంచు;
యోగులు, సాధకు లుల్లాసపడిరి
కాముండు చావ సకంటకు లగుచు.

రతీవిలాపము — శివానుగ్రహము

నిఖిలయోగీశులు నిర్భయులైరి;
ఆత్మేశుగతి విని యారతీదేవి
భూమిపైఁ బడిపోయి మూర్ఛను జెందె.
వడిలేచి యేడ్చుచుఁ, బరితాపపడుచు
ఆరతీదేవి శ్రీహరుచెంత కేగి
అతిభక్తి వెలుగొంద నాంతర్యమందు
వివిధవిధంబుల వినతులు చేసి
చేతులు జోడించి శివుముండు నిలిచె.
ఆదిక్కు లేనట్టి యబలను గాంచి
ఆమహేశుఁడు, శివుం, డా కృపాజలధి,
ఈరీతిఁ బలికెను గృపవహియించి;
"ఇటనుండి యోరతీ! యీనీదుభర్త
మనుఁగా 'కనంగ' నామంబును దాల్చి,
తనువు లేకున్న నీతండు సర్వాలను
బాలించు; నీవు నీభర్తను దిరిగి
కలియుఁగాఁ గల్గుమార్గంబును వినుము:
భూతలభారంబుఁ బోఁగొట్టుకొఱకు
కృష్ణపరబ్రహ్మ మీ వసుంధరను
యదువంశమందున నావిర్భవించు.
తిరిగి యాశ్రీకృష్ణ దేవపుత్రుఁడుగ
బ్రద్యుమ్నుఁ డనఁ బుట్టు పంచాస్త్రుఁ డవని.
నా వాక్కు తప్ప దేనాఁడు చింతిలకు"—
మన విని యారతి యరిగె మోదమున.
ఆపయి కథ వినుమా! భరద్వాజ!
ఆ సమాచారంబు నంతయు వినియు
బ్రహ్మాదిసుర లెల్ల వైకుంఠపురికిఁ
జేరియుఁ, గలిసి యా శ్రీవిష్ణుదేవు,
నా కృపాలయుఁడైన హరుపాలి కరిగి
పరిపరివిధములఁ బ్రస్తుతింపఁగను
చంద్రశేఖరుఁడు ప్రసన్నత నొందె.
ఆకృపావారాశి, యావృషధ్వజుఁడు
పలికె నీపగిది. దేవతలార! యిప్పు
డిటకు మీ రందఱు నేతెంచినట్టి
కారణంబును తెల్పఁగాఁ గోరుచుంటి"
అన విని యా బ్రహ్మ యనియె నీరీతి:
"ఈశ! అంతర్యామి వీవు సర్వమున;
అయినను భక్తినశాత్ముఁడ నగుచు
ఒక విన్నపము సేయుచుంటిని స్వామి!

పార్వతీశివకల్యాణమునకు దేవతలప్రార్థన

"అఖిలామరులహృదయాంతరంగమున
ఒక మహాసంకల్ప మున్నది నాథ!
కన్నులపండువుగా వార లెల్ల
భవదీయదివ్యవివాహంబుఁ జూడ
నుత్సాహపడుచుండి రో విశ్వనాథ!
మన్మథమదభంగ! మహితశుభాంగ!
ఈవివాహోత్సవ మెంతయో మేము,
కన్నులారఁగఁ జూడగలభాగ్య మిమ్ము.
కామునిఁ గాల్చియుఁ గరుణతో రతికి
వర మొసంగితివి కృపాజలరాశి!
ఇది ప్రశంసాపాత్ర మెల్ల లోకముల
సేవకజనముల శిక్షించి పిదప
సుప్రభువులు కృపన్ జూపుచుండెదరు
వారలసహజస్వభావ మయ్యదియె.
పార్వతి సల్పె నపారతపస్సు;
కరుణతో నామెను గైకొను మయ్య!"
విధి యిట్లు సలిపెడు వినతిని వినియు,
ఆ రామువాక్యంబు లాత్మ స్మరించి

భృంగిచే శివునాజ్ఞ విని శివగణము
వచ్చియు శివపాదపంకజంబులకు
శిరముల వంచియుఁ జేసెను నతులు.
వారల బహువిధవాహనంబులను
వివిధవేషంబుల వీక్షింప హరుని
ఆననంబునఁ గ్రమ్మె హాసచంద్రికలు
ఆశివగణములయాకృతుల్ వినుము:
ముఖవిహీనులు, బహుముఖభయంకరులు,
కరపాదహీనవికారవిగ్రహులు,
బహుమహాసంఖ్యకపాదహస్తులును,
నేత్రహీనులు, బహునేత్రసంయుతులు,
అతిపుష్టదేహులు, నతిశుష్కదేహు,
లతిబలిష్ఠాంగు, లత్యంతదుర్బలులు,
విమలతాయుతు, లపవిత్రవర్తనులు.
ఇట్లనేకవిధాల నీశ్వరుగణము
చిత్రరీతిగను భాసించె మునీంద్ర!
అతిభయంకరభూషణావళి న్దాల్చి.
ఉగ్రారుణోష్ణసద్యోరుధిరముల
భయదవిశాలకపాలపాత్రికలఁ
ద్రాగుచుండిరి వారు దారుణలీల.
శునకముఖంబులు చూడఁ గొందఱికి
గార్దభముఖములు కనఁగఁ గొందఱికి
సూకరముఖములు చూడఁ గొందఱికి
కనఁగఁ గొందఱికి సృగాలముఖంబు
లొప్పార శివగణం బుండె మునీంద్ర!
అహ! వారివేషంబు లగణనీయములు.
ప్రేత భూత పిశాచ బేతాళశాకి
నీ ఢాకినీ యోగినీమహాగణము
వర్ణన కందనిపగిదిగా నుండె.
ఆభూతగణములు హరునిముందటను
ఉత్కటపారవశ్యోన్మత్తు లగుచుఁ
బాటలు పాడుచు బహువిచిత్రముగ

నతివిపరీతఘోరాకృతు లౌచుఁ
దాండవించిరి భరద్వాజమునీంద్ర!
ఆపెండ్లికొమరున కన్నువై నరీతి
సరిపోయె నాపెండ్లిజనములసంచు.
వారిదారినిఁ గన్నవా రెల్ల మిగుల
వివిధవినోదసంభృతచిత్తు లైరి.
ఇట్లుండ హిమవంతుఁ డింపొప్పు నటులఁ
బెండ్లిపందిరి వైచెఁ బృథువిచిత్రముగ.
దానిని వర్ణింపఁ దర మేరి కౌను!
పెద్దది చిన్నద నేభేదంబు లేక
జగతిలోఁ గలసర్వశైలసంఘముల
సర్వనదీనదసాగరంబులను
హ్రదముల వనముల నన్నిటిన్ బ్రీతి
నాహ్వాన మొనరించె నాహిమాచలుఁడు.
వారెల్లఁ గామరూపప్రభావమునఁ
దాల్చియు మహితసుందరరూపములను
భార్యామణులతోడ, భటరాజితోడ
నేగిరి హిమవంతుగృహరాజమునకు.
స్నేహరసాంచితచిత్తులై వారు
పాడిరి మంగళభవ్యగీతముల.
ప్రప్రథమమై హిమవఁతుఁడు పురిని
నవ్యశోభాయమానంబు లైనట్టి
విడిది గృహంబుల విరచింపఁ జేసె.
ఎవరికిఁ దగినట్టియిండ్లలో వారు
విడిసిరి సంతోషవిభవంబు లొప్ప.
ఆపురశోభ నహా! కనునెడల
వెల వెలఁ బోవుచు విధికౌశలంబు.
ఆపుర సౌందర్య మరసినయెడల
ఆబ్రహ్మనిపుణత యల్పమై తోఁచు.
అఖిలవనోపవనావళుల్, నదులు
సర్వకూపతటాకసంఘంబు లెల్ల
వర్ణనాతీతశోభాయమానములు.

బహుశుభతోరణపంక్తులతోడ
మహితదీవ్యత్కేతుమండలితోడ
ప్రతిమందిరంబు సంభాసురం బయ్యె.
పురిలోనివనితలు పురుషు లందఱును
సౌందర్యజలధులు చాతుర్యయుతులు
వారినిఁ గన్నచో భ్రాంతు లయ్యెదరు
మునులు సైతము మహాముని! భరద్వాజ!
జగదంబ పార్వతి జన్మించినట్టి
యాపురి వర్ణన కందఁగాఁబోదు.
బహువృద్ధిసిద్ధిసంపచ్ఛుభావళులు
అభివృద్ధి నొందుచు నఖిలకాలముల
నిత్యనూతనశోభ నింపుచు నుండె.
పెండ్లివారలు సమీపించిరి నగర
మనువార్త తెలియంగ నాపురంబందుఁ
గలకలధ్వానముల్ గగనంబు నంటె;
ఆ మహాపురశోభ యధికమై వెలిఁగె.
పర్వతనాయకుపరివార మంత
భూరిభూషణవస్త్రభూషిత మగుచు
నానామహితవాహనంబుల నెక్కి
పెండ్లివారలను సంప్రీతిఁ దెచ్చుటకు
నెదురుగా నేగెఁబో, యింపు సొంపొప్ప.
అమరసేనను గాంచి యాత్మలో వారు
హర్షంబుఁ గాంచిరి; హరిని దర్శించి
ఇంకను గడుఁబులకాంకితు లైరి
అ[illegible]రాన హరసమాజమును
[illegible]రి ఘనవాహనంబు
[illegible]కుండ
[illegible]యును.

పరుగిడి యిండ్లలోపల దూరి; రపుడు
తమతమ బాలుర తలిదండ్రు లడుగ
భయకంపితాంగులై బాలు రిట్లనిరి:
"ఏమి చెప్పుదు మింక నిసుమంతయైన
వారల వర్ణింప వశ మేరి కౌను!
వింతయ్యె, వారలు పెండ్లిజనంబొ,
యమభటులో తెలియంగ రాదయ్యె,
వరుఁ డెన్నఁగా వెఱ్ఱిబాగులవాఁడు.
ఎక్కి- నాతఁడు ముసలెద్దు-మూపునను.
ఘనభూషణంబులుగా గళమందు,
వ్యాళకపాలమాలావళి న్దాల్చి,
పూసెను దనువెల్ల బూది దట్టముగ.
ఆబూది యలమినయట్టి దేహంబు,
పుట్టెలదండలు, భుజగమాలికలు,
ఆదిగంబరరూప, మాపెనుజడలు,
ఆపెండ్లికొమరుని యాకృతిం గనిన
భయము జనించును భావంబు లందు.
ప్రేతభూతపిశాచబేతాళగణము
యోగినీబృందము లుగ్రరాక్షసులు
ఆపెండ్లి కొమరునియనుచరగణము.
ఆపెండ్లి వారల నరసినపిదప
ప్రాణముల్ విడువక బ్రతికెడివాఁడు
బహుపుణ్యశాలి ప్రపంచమం దెల్ల
గౌరీవివాహంబు కనఁజాలు నతఁడె"
ఇంటింట బాలకు లీరీతిఁ బలుక
శిశుగణంబులు మహాశివుసమాజమును
జూచి భయం బొందు సొదల నెఱింగి
తల్లి దండ్రులు నవ్వి, తమ బిడ్డలకును
"భయ మేల మీకని" బహువిధంబులుగ
ధైర్యంబుఁ జెప్పి రెంతయు బుజ్జగించి,
ఎదురుకో లొనరించు బృందంబు వెడలి
[illegible]ండ్లికుమారుని బృందము న్దెచ్చి

మానిత రమణీయమందిరంబులను
విడియఁ జేసెను మహావిభవంబుతోడ.
అంతట మేనక యరుదెంచి యటకు
బహుశుభహారతుల్ వరున కొసంగె
ఆమెతో వచ్చినయంగనామణులు
పాడిరి మంగళ ప్రథితగీతముల.
కాంచనకలశంబు కరమునఁ గొనియు
వరున కర్ఘ్యం బిచ్చి స్వాగతం బడుగఁ
మిగుల సంతసమున మేనక వెడలె.
రుద్రునిభీషణరూపంబుఁ గాంచి
ముత్తైదువలు భీతిఁబొంది డెందములఁ
బాఱియు నిండ్లలోపల దూరి రంత
విశ్వేశ్వరుఁడు సొచ్చె విడిదిగృహంబు.
మేనక హృదిలోన మిగుల దుఃఖించి
గౌరినిఁ బిలిపించి కడుఁబ్రీతితోడ
యొడిలోనఁ జేర్చి కూర్చుండఁగాఁ జేసె;
నీలోత్పలోపమనేత్రాంచలముల
బాష్పధారలు పొంగి వరదలై పాఱ
ఈరీతి మిగుల తపింపఁగా సాగె;
"ఇంత చక్కగ నిన్ను సృష్టించి బ్రహ్మ
వెఱ్ఱివానిని నీకు విభునిగాఁ గూర్చె.
అధికమందుఁడు సుమా ఆవిధి చూడ!
ఇంతటి సౌందర్య మిచ్చియు నీకు
వెఱ్ఱిబాగులవాని విభుఁజేసె బ్రహ్మ
ఎంత చోద్యం బిది యెన్నఁగా నకట!
సురవృక్ష మందున సొంపుగా నుండ
వలసినఘనమైనఫల మక్కటకట!
గచ్చచెట్టునఁ గాంచఁగా నయ్యె నేఁడు.
ని న్నెత్తుకొని నేను నిమిషమాత్రమునఁ
బర్వతాగ్రమునుండి పడుదు ధరిత్రి.
అగ్నిలో దుమికెద నబ్ధిఁ గూలెదను,
నాయిల్లు నిలిచినన్ నాశ మొందినను
అఖిలజగంబున నపకీర్తిఁ గన్న,
ఊపి రీబొందిలో నుండెడిదనుక
పార్వతీ! ఆ వెఱ్ఱివానికి నిన్ను
నేఁ బెండ్లిచేయను నిక్క మీమాట."
అక్కడఁ జేరినయబల లెల్లరును
ఆ మేనకాదేవియూవేగ మరసి
తామును మిగుల ఖేదంబును గనిరి.
పుత్రికావాత్సల్యమును సంస్మరించి
పెల్లుగా మేనక విలపించె నిట్లు;
"ఆ నారదునకు నే నపకార మేమి
సలిపితి? నాతఁ డీచందంబుగాను
బాగుగా బోధించి పార్వతి నకట!
వెఱ్ఱిబాగులవానిఁ బెండ్లాడు కొఱకుఁ
జండతపంబును సలుపఁగాఁ జేసె.
అహ! యథార్థంబున కా నారదర్షి
మోహమాయాగుణములు లేనివాఁడు
పుత్రమిత్రకళత్రభూధనగేహ
సర్వశూన్యుండు నసంగి సన్న్యాసి;
ఇందుకే నారదుఁ డితరులయిండ్లఁ
బాడొనరింపఁగాఁ బాల్పడుచుండు,
మతిలోన లజ్జాభిమానభయంబు
లతనికి లేవు సుంతైనను గాని,
ప్రసవవేదనలు గొడ్రాలి కే మెఱుక?
ఈరీతి తలి యడలెత్తఁగాఁ గాంచి
పృథువివేకోపేతమృదులవాక్యముల
ఆ భవానీదేవి యనియె నీ రీతి:
"విధివిధానంబు తప్పింపఁ[illegible]
ఇది యెఱింగియును[illegible]
విధియందు[illegible]
బరు[illegible]

అపకీర్తి నొందుట యవనిలో నీవు!
నీపైఁ గళంకంబు నిలుపుకో వలదు
ఈజాలి విడువుము హృదయంబులోన
సమయంబు గాదు విచారింప నిపుడు
చూడఁగాఁ బ్రారబ్ధసుఖదుఃఖములను
ఏ నెట కేగిననేని నాతల్లి;
అనుభవింపక తప్పునా? తప్ప దెపుడు."
ఈరీతి నుమ వచియించినయట్టి
మధురవినీతకోమలవాక్యములను
అబలామణులు విని వ్యాకులపడిరి,
విధిని దూషించిరి వేయివిధాల,
అశ్రువుల్ జాఱి నేత్రాంచలంబులను.
ఈవార్త నాలించి హిమవంతుఁ డంత
సప్తర్షినారదసహితుఁడై వచ్చెఁ
దనమందిరమునకుఁ దాపసవర్య!
ఆనారదాచార్యుఁ డరుదెంచి యటుల
శ్రీగౌరిపూర్వచారిత్రంబు నెల్లఁ
దెలిపియు వారికి ధృతినిఁ జేకూర్చె.
దేవర్షి మేనకాదేవితో నిట్లు
పార్వతీచరితంబు పలికె మునీంద్ర!
"ఏఁ బల్కుచున్నట్టి ఋజువాక్యములను
వినుమమ్మ మేనకా! విశదంబుగాను,
నీపుత్రి యెవరని నీ వెంచినావు?
సాక్షాద్భవాని యీజగదంబ సుమ్మి,
అభవ, యనాది, దివ్యానంతశక్తి,
నిరతశివార్ధాంగనిలయ యీగౌరి.
విశ్వసృష్టిస్థితివిలయకారిణియుఁ,
బ్రేమవిలాసశరీరధారిణియు,
నగుచు భాసిల్లెడి యంబ నీతనయ;
మున్ని మె దక్షునిపుత్రిక యీచుఁ
బుట్టె 'సతీ'నామమును బూని ధాత్రిఁ
బరమసౌందర్యప్రభారాశి యగుచు;

ఆజన్మమందును హరునిఁ బెండ్లాడె;
ఆమహాకథ జగ మంతట న్నెలియు.
శివునితోఁ గూడియు శ్రీసతీదేవి
కైలాస మేగు చొకానొకనాఁడు,
రఘుకులకమలసూర్యస్వామి యైన
శ్రీరామచంద్రు దర్శించి డెందమున
విభ్రాంత యీచును వినక శివోక్తి
సీతాస్వరూపంబు స్వీకరించుటను
అపరాధంబు నరసి శంకరుఁడు
ఆమెపైఁ బ్రీతిని ద్యాగంబుఁ జేసె;
తదనంతరము సతి తండ్రి యొనర్చు
యజ్ఞంబుఁ జూడఁగా నరిగె; నచ్చోట
ఆత్మదేహమును యోగాగ్ని దహించె;
మీ యింటఁ దిరిగి జన్మించెఁ దా నిపుడు.
ఆత్మేశ్వరుం డైనహరునికై గౌరి
ఉగ్రతపశ్చర్య నొనరించె ననఘ.
ఇది యెఱింగియు సంశయింపకు మింక—
ఈశ్వరప్రియ యీమె యెల్లకాలముల"—
అను నారదుని వాక్కు- లాలించి నంత
నందఱి హృదిలోని వ్యథ వ్రీలిపోయె—
పట్టణంబునఁగల ప్రతిగృహంబునకు,
క్షణములోఁ బ్రాఁకె నీసంవాదవార్త.
మేనకాహిమవత్సమిథున మంతటను
సంతోషమొందుచు సరగున లేచి
అమలగౌరీచరణాంబుజంబులకు
భక్తితో సలిపెను వందనశతము.
పట్టణవాసు లాబాలగోపాల
మత్యంతహర్షాత్ము లైరి మునీంద్ర!
హిమవన్మహాపురం బెల్లను నిండె
మంగళగీతికామంజులధ్వనులు.
బహువిధకాంచనపాత్రంబు లొప్పె
నందఱిహస్తంబులందు డంబముగ.

పాకశాస్త్రములోనిపద్ధతి వెలయఁ
బంచభక్ష్యాంచితపక్వాన్నములను
షడ్రసంబులతోడఁ జక్కనిరీతి
వడ్డనఁ జేసిరి పంక్తులు దీర్చి.
అల జగజ్జననియౌ నాయన్నపూర్ణ,
ఉమ, భవానీ దేవి యుదయించినట్టి
భవనంబునందున వడ్డింపఁ బడిన
బహువిధభోజనవస్తుజాలముల
వర్ణింప నెవ్వరివశమౌ మునీంద్ర!
బ్రహ్మవిష్ణ్వాది దేవతల నందఱిని
హిమవంతుఁ డసదృశాదృతిని వీక్షించె;
వివిధపంక్తుల నుపవిష్టులై రంత;
నిపుణపాకజ్ఞులు నేర్పు మీఱంగ
వడ్డనఁ జేసిరి బహుపదార్థముల;
బృందారకులు భుజియించుటఁ గాంచి
పరిహాసవాక్కులఁ బలుకఁ దొడంగి
రతిమృదులంబుగా నంగనామణులు.
సౌందర్యవతులు సుశ్రావ్యకంఠములఁ
బరిహాసవాక్కులఁ బలికిరి, మిగుల
వ్యంగ్యోక్తు లాడిరి వరుసలకొలఁది;
ఆవాక్కులను విను చాదేవవరులు
పరమవినోదసంభరితాత్మ లగుచు
విందారగించిరి విశ్రాంతిగాను.
అతివిలంబన మయ్యె నాకార్యమునకు.
ఆవిందులోని మహానంద మెన్నఁ
గోటిముఖంబులకును వశ మౌనె?
భోజనకార్యంబు ముగిసినపిదపఁ
గరముఖంబులను బ్రక్షాళించుకొనఁగ
జలములఁ బోసిరి సకలపాత్రముల.
అంతఁ దాంబూలంబు లందఱి కొసఁగఁ
దమవిడుదులకునుఁ దరలిరి వారు.
అప్పుడు సప్తమహామునుల్ వచ్చి

క్రమమైన లగ్నకాలము సమీపించె
నని తెల్ప హిమవంతుఁ డాపయిఁ దాను
సుముహూర్త మే తెంచఁ జూచి, సంప్రీతి
నందఱు దయసేయుఁ డని కబు రంపె
నిఖిలబృందారకనికరంబునకును
అటుల హిమాచలుఁ డత్యాదరమున
నఖిలనిలింపుల కాహ్వాన మంపి
ఉచితాసనంబుల నొసఁగె నందఱికి.
వేదిక, వేదోక్తవిధి వేయఁబడియె
సుభగసుమంగళసుమధుగీతికల
గానంబు సేయఁగాఁ గడఁగి రంగనలు.
ఆమహాశుభవేదికాగ్రంబునందు
బ్రహ్మదేవునిచేత రచిత మైనట్టి
వర్ణనాతీతమై భాసిల్లుచున్న
ఒక దివ్యపీఠంబు నుంచి రాయెడను.
వినమితశీర్షుఁడై విప్రవర్యులకు
శ్రీరఘునాథు స్మరించి డెందమున
శివుఁడు సింహాసనాసీనుఁడై వెలిఁగె.
అంత మునీశ్వరు లాయుమకొఱకు
వర్తమానముఁ బంప, బర్హతసుతను
లలితసుభూషణాలంకృతంజేసి
దివ్యసఖీమణుల్ తెచ్చి రాసుభగ
మహితకల్యాణసుమంటపంబునకు.
ఆమెయందముఁ గాంచి యఖిలదేవతలు
ఆశ్చర్యచకితముగ్ధాత్ములై రనఘ!
ఆమెశృంగారము నహహా! లోకమున
ఏకవీశుఁడు వచియింపఁగాఁగలుగు?
ఆమె జగన్మాత హరురాణి యనుచు
నెల్ల బృందారకు లెఱిఁగి పార్వతికిఁ
బ్రణతు లొనర్చిరి భావంబులందు.
సౌందర్యపరిపూర్ణసంస్థాన మైన
యాభవానీదేవి నహహా! పూర్ణముగ

వర్ణించునే కోటివదనంబు లైన?
ఆజగన్మాత మహాశోభ నెన్నఁ
జేతఁగా దల కోటిజిహ్వాల కైన!
వేదముల్, శేషుండు, విధిరాణి యైన
వర్ణింప సంశయపడుచుందు రెపుడు;
అయిన-చో జడమతి యైనయీ "తులసి"
ఏరీతిఁ దా వచియింపఁగాఁగలఁడు?
అభవానీమాత, యతిరూపరాశి
శ్రీసదాశివుఁడు వేంచేసి యున్నట్టి
భవ్యమంటపమధ్యభాగంబుఁ జేరె
హరపాదపద్మభృంగాయతహృదయ
యైన, నాగౌరి లజ్జాతిశేకమున,
విభుపాదపద్మముల్ వీక్షింప వెఱచె.
అభవానీశంభు, లంతట మునులు
చెప్పినరీతిగా శ్రీగణనాథు
మును ముందు భ క్తితో

[illegible]
[illegible] ఱ్ఱ క్రొవ్విండి
[illegible] డుళ్ళ వళ్ళిలో
[illegible] డ్డ ఱ్ఱొండ చిఁ
[illegible] ఱ్ఱ ఱ్ఱొడి ఱ్ఱ ళ్ళొజ "ఁ
[illegible] ఱ్ఱ ఱ్ఱ యాశంకరునకు
'[illegible] ఱ్ఱడు ధన్యుఁడయ్యె.
[illegible]డు శివుఁ డాయుమాదేవి
[illegible] దనపాణిఁ బట్టినంతటనె,
సకలసురాధిపుల్ సంతోషపడిరి.
వేదమంత్రంబుల విమలర్షివర్యు
లుచ్చరించిరి మధురోచ్చైస్స్వరముల-
"జయ జయ జయ జయ శంకరా! అనుచు

సలిపిరి దేవతల్ జయజయధ్వనుల!
భూరివాద్యవిశేషములు భోరుకలఁగెఁ,
గురిసెను దివినుండి కుసుమవర్షములు.
గౌరీహరులదివ్యకల్యాణ మిట్లు
జరిగెను వైభవసంయుతంబుగను.
సంతోషమున నిండె సకలజగత్తు.
దాసదాసీజనతతరథతురగ
గజగోగణంబులు ఘనరత్నమణులు,
బహువిధరమణీయవస్తుజాలములు,
బండ్లకొలందిగా బహుధాన్యసమితి,
కాంచనపాత్రలు కట్నం బొసంగెఁ
బార్వతీశివులకుఁ బర్వతేంద్రుండు.
వర్ణన కందని పగిది మునీంద్ర!
అలున కీరీతి నాహిమాచలుఁడు
[illegible] కట్నముల్ భక్తితో నొసఁగి
[illegible]లు ముకుళించి కడు భక్తితోడ
[illegible]తిగాఁ బల్కె నీశ్వరుఁ గాంచి :
"ని కేమి నే నియ్య నేర్తు విశ్వేశ!
పూర్ణకాముఁడ వీవు పురహరా! శంభు!"
అని భక్తి పొంగ మాట్లాడఁగా లేక
శ్రీశివచరణరాజీవయుగ్మమును
గట్టిగాఁ బట్టెను గరపల్లవముల.
ఆకృపాసాగరుఁ డైనశివుండు
మామగారిని సర్వమార్గంబులందు
సంతోషపఱచెను స్వాదుభావమున.
మిక్కిలి ప్రేమతో మేనకాదేవి
పట్టియు శివుపాదపద్మద్వయంబు
పలికె నీరీతిగాఁ బరమమునీంద్ర!
"నాథ! యీ పార్వతి నాప్రాణతుల్య
ఈమెను నైకొను మిల్లాలు గాఁగ
ఈమెదోషంబుల నెల్ల క్షమింపు-
మీవర మీయవే ఈశ! లోకేశ!"

అ త్తగారిని శంభుఁ డజుఁడు శంకరుఁడు
ఓదార్చెఁ దా నెన్ని యో విధానములఁ.
శంక రాంఘ్రులకును సలిపి వందనము
అంత మేనక చేరె నంతిపురంబు.
అంతట మేనక యాత్మపుత్రికను
శ్రీయుమా దేవిని జేరి సంప్రీతి
నొడియందుఁ జేర్చి కూర్చుండఁగాఁ జేసి
ఈరీతి నుతమితహితవాక్కు లాడెఁ:
"సర్వదా శంకరచరణపూజనము
మానక సేయుమా మంగళగౌరి!
ఇదియె సతీధర్మ మెఱుఁగుమా తనయ!
పతియె దైవ మ్మగున్ బడఁతుల కరయ!
విభు మించి దైవము వేఱేరు లేరు"
అనుమాటలను బల్కు నంత మేనకకుఁ
గండ్లలో గిఱ్ఱునఁ గ్రమ్మె నీరములు.
కూర్మిపుత్రిని హత్తుకొనె వక్షమునకు-
"ఇంతుల సృష్టించె నేల నాబ్రహ్మ?
పరతంత్రజీవనుల్ స్వప్నమందైన
సౌఖ్య మెట్టుల నొందఁ జాలుదు రకట!"
అని ప్రేమవికలితస్వాంతయై యామె
సమయంబు గాకుంట స్థైర్యంబుఁ బూనె.
ఆమేనకాదేవి యతిప్రీతితోడ
ప్రియసుతన్ పలుసార్లు బిగి కౌఁగిలించి
బాలపాదంబులఁ బట్టి మార్చిల్లె.
ఆమె మహాప్రేమ యలవియే పలుక?
స్త్రీలయందఱికిడ సెలవొంది గౌరి
పరుగెత్తి తనతల్లివక్షంబు మరల
వెసఁ గౌఁగిలించెను ప్రేమోత్కటతను.
మాత్రాజ్ఞ నొందియు మఱియొక్క సారి
పయనంబుఁ జేసె భవాని శ్రీగౌరి,
సముచితాశీస్సుల సర్వు లొసంగ.

అశ్రుపూర్ణాక్షుల నాయద్రితనయ
మరలను మరలఁ దా మాతను గనఁగ
వెనుకకున్ దిరిగెను ప్రేమభావమున.
ఆమెసఖీమణు లామె నాశివుని
సన్నిధికి న్గొని చనిరి మునీంద్ర!
సంతృప్తిపఱచి యాచకజనంబులను,
శంకరుం డద్రిజాసంయుక్తుఁ డగుచు
నిర్గమింపఁగ సాఁగె నిజవాసమునకు.
సర్వామరులు ప్రహృష్టస్వాంతు లగుచుఁ
గురిపింప సాఁగిరి కుసుమవర్ష ములఁ,
నమరదుందుభులు వియత్తునన్ మ్రోఁగె
బహుమనోహరముగఁ బరమమునీంద్ర!
పరమేశు సాఁగనంపంగ సంప్రీతి
శివదేవు ననుగమించెను హిమాచలుఁడు.
పలువిధంబుల హిమవంతు శంకరుఁడు
పరితోషపఱచియుఁ బంపె నింటికిని.
వెంటనే యాయద్రివిభుఁ డింటి కేగి
సకలశైలంబుల సరసులఁ బిలిచి
ఆదరదానక్రియావినయముల
నతిగౌరవాతిశయంబులతోడ
సత్కార మొనరించి సదమలప్రీతి
నందఱి వీడ్కొల్పె. నా యనంతరము
శివుఁడు కైలాసంబుఁ జేరినపిదపఁ
దమతమ లోకముల్ తారుకుం జనిరి
సకలబృందారకసంయము లనఘ!
పార్వతీశివులు విశ్వంబున కెల్ల
తలిదండ్రు లౌచును దనరుచున్నారు.
వారిశృంగారదివ్యక్రియావళిని
ఏరీతి వర్ణింతు నే భరద్వాజ!
వివిధభోగవిలాసవిభవాల, దేవ
గణసంయుతంబుగాఁ గైలాసమందు
వసియించి రాదివ్యభవ్యదంపతులు;

నిత్యనూతనసుఖనీరధి న్దేలి
రద్రిజాశంకరు లనుదినం బచట.
కడచిపోయెను దీర్ఘ కాల మిూరీతి.
అంతట వారికి నావిర్భవించె
షణ్ముఖుం డనునొక్క సత్పు త్త్రికుండు;
ఆకుమారస్వామి యాహవంబందుఁ
దారకదైత్యవధన్ వేగఁజేసె.
ఆషణ్ముఖస్వామి యమలచారిత్ర
ఆగమనిగమమహాపురాణముల
నఖిలలోకములఁ బ్రఖ్యాతి వహించె.
షణ్ముఖదేవునిజన్మకర్మములు
అత్యంతబలపౌరుషాదులు జగతిఁ
గడుఁ బ్రసిద్ధంబులై గణన కెక్కుటను,

ఆశివతనయునియమలచారిత్ర
చెప్పితి నిటుల సంక్షిప్తపద్ధతిని.
పార్వతీశివుల వివాహచారిత్ర
పలికినవారలు. పాడిన వారు,
ఆత్మీయశుభకృతు లందు– వివాహ
కార్యాదులందునఁ–గాంతురు సుఖము
సర్వదా యోమునిచంద్రమా! వినుము.
గౌరీశ్వరులమహాగంభీరచరిత
వార్ధిచందముగ నపారమై వెలుఁగు.
తత్పార మఖిలవేదములుసైతమ్ము
సాంతమ్ముఁ దెలియంగఁ జాల వనంగ
ఈనాఁడు తులసిదా సీమందబుద్ధి
ఏవిధంబున వచియింపఁగాఁగలఁడు?

శ్రీరామచరితమానసము

బాలకాండము

తృతీయవిశ్రామము

కాంచనకశిపుహృదంత్రస
మంచితమాలాభిరామ! హారిసుదీర్ఘో
దంచితకేసరభాసుర!
పంచాననవంద్య! మట్టపల్లినృసింహా!

సరసమంజుల మైనశంభుచారిత్ర
శ్రవణం బొనర్చి భరద్వాజమౌని
పరమసంతోషసంభరితాత్ముఁ డయ్యె.
హరికథాశ్రవణమహాకుతూహలము
అతనిలో నుప్పొంగె నద్భుతరీతి.
కన్నుల బాష్పముల్ కారఁగా సాఁగెఁ
దనువెల్ల రోమాంచితంబై వెలింగెఁ
బ్రేమభావావేశవివశతచేత
మాట్లాడఁగా నసమర్థుఁ డైపోయె.
ఆమహాజ్ఞానియౌ యాజ్ఞవల్క్యర్షి
ఆమునిదశఁ గాంచి హర్షితుం డయ్యె.
"ధన్యము నీజన్మ తాపసాధీశ!
పార్వతీపతి నీకుఁ బ్రాణతుల్యుండు.
భవపాదపంకజభక్తిహీనుండు
కలనైన శ్రీరాముకరుణార్హుఁ డగునె?
విశ్వనాథపదారవిందంబులందు
నిర్మలం బగుభక్తి నిలిపి యుండుటయె
రామభక్తునియథార్థపులక్షణంబు.
రాఘవాఁఘ్రివ్రతరాజితుఁ డైన
వా రెవ్వరుందు రాభవునకు మించి?
అనఘచరిత్రయౌ నాసతీదేవి
వంటి సతీమణి న్వాదలివైచియును,
జండనిశ్చలమహాశపథం బొనర్చి
ఆదర్శరామపాదాంబుజభక్తిఁ
బ్రకటించు నెవ్వాఁడు పరశివున్ మించి?
శ్రీరామునకు మహాప్రియుఁ డైనవాఁడు
ఈశునికన్న నిం కెవ్వఁ డున్నాఁడు?
మున్మందు శంకరుపుణ్యచారిత్ర
పలికితి నేను; నీభావంబు దెలిసె.
అఖిలవికారశూన్యామలరామ
పదదాసుఁడవు భరద్వాజ! మౌనీంద్ర!
నీగుణశీలముల్ నే నెఱింగితిని
శ్రీరామలీలలఁ జెప్పెద వినుము.
నీతోడఁ గలియుట నే నీదినమునఁ
బొందినసంతోషమును బల్కఁజాల.
అత్యపారము మునీశా! రామచరిత;
శతకోటిశేషులు సైతము రామ
ఘనగుణజాలముల్ గణియింపఁగలరె?
ఐన నాకోదండపాణి, వాక్పతిని
ఆజగన్నాథు మదాత్మలో నిలిపి,
నేను విన్నకొలంది నీకు వచింతు.—
కనినచో శారద కట్టిబొమ్మగను
అఖిలాంతరాత్ముఁడౌ నారామవిభుఁడె
అలబొమ్మ నాడించు నాసూత్రధారి.

శ్రీరాఘవుఁడు కటాక్షించినయెడల
కవిహృదయాంతరంగంబున నిలిచి
శారద నాట్యంబు సలుపు మునీంద్ర!
అమితకృపాంబుధి యీచు వెలుంగు
ఆరఘునాథపాదాంబుజంబులకు
ప్రణతులర్పించి యీపయిని వర్ణింతుఁ
దద్రామసుగుణకథావిశేషముల.

పార్వతీశివుల సంవాదము

పరమరమ్యం బగుపర్వతశ్రేష్ఠ
మెన్నఁగాఁ గైలాసమే, దాని పైన
శ్రీశివాశివులు వసింతు రెల్లపుడు.
సిద్ధతపోధనశ్రేష్ఠయోగీంద్ర
మునిసురకిన్నరుల్, పుణ్యాత్మ లెల్ల
ఆమహాకైలాస మందు వసించి
ఆనందకంధియీ హరు; మహాశివుని,
సేవించుచుందురు స్థిరతరభక్తి.
హరిహరవిముఖులౌ నల్పమానసులు
ధర్మమం దాసక్తి దవులని వారు
స్వప్నమం దైన నచ్చటి కేగ లేరు.
ఆమహాగిరిశిఖరాగ్రభాగమునఁ
గడు విశాలంబును, ఘుననిత్యనవ్య
సార్వకాలికమహాసౌందర్యయుక్త
మొకమహావటవృక్ష ముండె మునీంద్ర!
మందశీతలగంధమారుతోపేత
మై దానినీడ మహాసుఖ మిచ్చు.
వేదగానముతోడ వెలయుశంకరుని
విశ్రమస్థల మదే వినుభరద్వాజ!
హరుఁ డొకానొకసారి యీవటవిటపి
మూలంబుఁ జేరి ప్రముదితాత్ముఁ డయ్యె
దానిమనోజ్ఞసౌందర్యంబుఁ గాంచి.
ఆకృపాళుఁడు శివుఁ డట నేలపైన
స్వయముగా నొక పులిచర్మంబుఁ బఱచి
అందు ముదంబున నాసీనుఁడయ్యె.
భవ్యకుం దేందుధావళ్యాతిగౌర
వర్ణశరీరంబు భాసిల్లు చుండ,
ఆజానుదీర్ఘ బాహాంచితుం డౌచుఁ,
బావనవల్కలపరిధానుఁ డగుచు
విలసిల్లుచుండెను విశ్వేశ్వరుండు.
తరుణారుణాబ్జపదంబులు తనరె
భక్తహృత్తిమిరవిభంగనఖాగ్ర
దివ్యద్యుతులతోడఁ దేజరిల్లుచును.
పన్నగంబులు దాల్చి భస్మంబు నలఁది
విజితశరచ్చంద్రవిమలముఖాబ్జుఁ
డై త్రిపురారిమహాదేవుఁ డుండె.
గంగాతరంగశృంగారసంభరిత
పృథుజటామకుటసంభృతశీర్ష మొప్ప
సారసపత్రవిశాలనేత్రములు
గరళబంధురనీలకంఠంబుతోడ
బాలేందుభూషితఫాలంబుతోడ
నిజమహాలావణ్యనిధి యీచుఁ దోఁచె
పరమేశ్వరుం డగుపరమశివుండు.
శాంతరసాకృతిచందంబు శివుఁడు
కామారి శర్వుండు కనవచ్చుచుండె.
ఇదె మంచి తరుణమం చెఱిఁగి భవాని
శంభుసన్నిధి కేఁగ, శంకరప్రభువు
ప్రియురాలు గనుక సంప్రీతిఁ జూపించి
తనవామభాగసుస్థలమునం దామె
నాసీనఁ గావించె నహా! భరద్వాజ!
పార్వతి సంతోషభరితాత్మ యగుచు
హరపార్శ్వభాగమం దాసీన యగుచుఁ
దనపూర్వజన్మవృత్తంబు స్మరించె.
వెనుకటికన్నను విభునిడెందమున
ఘనతరప్రేమంబు కలదని యెఱిఁగి

చిఱునవ్వు లొలుకఁగా శ్రీమహాదేవి
పలికె నీరీతిగా భవ్యవాక్యములు:
ఆశైలనందిని యఖిలలోకముల
కుపకారకర మైనయు త్తమకథను
శివునిచేఁ బలికింపఁ జి త్తమం దెంచె.
"నానాథ! ఓవిశ్వనాథ! పురారి!
ఈశ! నీ మహిమ మీయెల్లలోకముల
విదితమై యున్నది, ప్రియ! మహాదేవ!
సర్వచరాచర జంతుజాలములు
నాగనరామరుల్, నాథ! యెల్లరును
భవదంఘ్రిపద్మముల్ భ క్తి సేవింత్రు.
సర్వసమర్థ! ఓసర్వజ్ఞ! నాథ!
సకలకళాగుణసదనా! మహేశ!
పరమయోగజ్ఞానవైరాగ్యనిలయ!
భ క్తకల్పద్రుమా! పావననామ!
ఓసుఖరాశి! లోకోన్నత! నీకు
నాయందునన్ గరుణాదృష్టి యున్న
నీపదదాసిని నే నని స్వామి!
గ్రహియింతువేనియుఁ గరుణతో నాథ!
తద్రఘునాథకథావిశేషములఁ
బలికి నామూఢ్యముఁ బాపఁ బ్రార్థింతు.
కల్పవృక్షు మె యండగాఁ గలవాఁడు
దారిద్ర్యదుఃఖంబు తాఁ జెంద నేల?
ఇది విచారించి యర్ధేందువిభూష!
మచ్చి త్తగతవిభ్రమంబుల నెల్లఁ
బాఱఁదోలుము ప్రభూ! పరమదయాళు!
పరమార్థవాదులౌ పరమర్షి జనులు
రాము ననాది, పరబ్రహ్మ మండ్రు.
ఆదిశేషుఁడు, వాణి, యఖిలవేదములు.
సకలశాస్త్రపురాణసంఘంబు లెల్ల
రఘుపతి స్తో ర్తించి ప్రబలుటన్ గనమె?
ఓ యనంగారాతి! ఓవిశ్వసుగతి!

ఈవును భ క్తితో నెల్లవేళలను
'రామ రామ' యటంచుఁ బ్రబల మౌభ క్తి
జపియించుచున్నావు స్వాంతంబులోన-
ఆరాముఁ డెవ్వరు? ఆ యయోధ్యేశ
పుత్రుఁడేనా, లేకపోయినయెడల
అజము, నిర్గుణ, మింద్రియాతీత మైన
ఆబ్రహ్మమా? తెల్పుమా, ప్రాణనాథ!
పార్థివపుత్రుఁడు బ్రహ్మ మె ట్లగును?
బ్రహ్మమే యైనచో, భార్యావియోగ
బాధాహతాత్ముఁ డేపగిదిగా నౌను?
చర్యలు చూడ నీచందంబు దోఁచె
వింటిని మహిమలు వేఱు విధాన;
అత్యంతవిభ్రాంత మయ్యె నాబుద్ధి.
అల, యనీహంబును వ్యాపకం బఖిల
శక్తిమయం బగు సదమలబ్రహ్మ
మిం కొకం డున్నచో నెఱిఁగింపు దాని.
నాయవజ్ఞత్వంబునకు క్షమియించి
నాయవివేక మణంచుమా నాథ!
బాగుగా రామప్రభావంబుఁ గంటిఁ
గాని, నీతో, మదిఁ గలసందియంబు
పలుకనైతిని, మహాభయసంకులతను.
కాని నాబుద్ధి సకల్మషం బగుట
రామప్రభావంబు గ్రహియింప నైతి.
తద్భ్రాంతి కే నహా! తగినట్టి ఫలము
అనుభవించితి నాథ! అయిన నిప్పటికి
సంశయం బున్నది స్వాత్మలో దేవ!
చేతులు జోడించి చేతుఁ బ్రార్థనము
ననుఁ గటాక్షింపు మనాథశరణ్య!
మును నీవు పలుసార్లు బోధించినావు
కాని నా కర్థము కాలేదు నాథ!
ఆగ్రహింపకుము నా యజ్ఞత్వమునకు.
పూర్వపు విభ్రాంతి పోయిన దిపుడు

రామమహాకథాశ్రవణాభిలాష
నాలోనఁ గలిగె నీనాఁడు దేవేశ!
భుజగేంద్రహారవిభూషిత దేహ!
పరమపావన మీచు భాసిల్లుచున్న
శ్రీరామగుణకథాబృందంబు కృపను
ప్రవచింపుమా! నాకుఁ బరశివా! దేవ!
అస్మచ్చిరంబును నవనిఁ దాఁకించి
నీపాదపద్మముల్ నియతిఁ బూజించి
చేతులు జోడించి చేతుఁ బ్రార్థనము:
శ్రుతిమతసారవిశుద్ధగంభీర
రఘువరమహిమంబు ప్రవచింపు మీశ!
ఈమహీత త్వంబు నేను వినంగ
నబలను గాన ననర్హా నే యైన
నేను ద్రిశుద్ధిగా నీదాసి నీశ!
ఆర్తులౌ వా రెవ్వ రైనను గాని
కనుపింప, సాధుపుంగవులు, వారలకు
అతిగూఢత త్వమే యైన, బోధింత్రు.
ఆర్తురాలను గాన నధికృత నైతి
నత్యంత మగు నా ర్తి నడుగుచున్నాను
న న్గటాక్షించియు నాథ! విశ్వేశ!
రఘునాథకథ నాకుఁ బ్రవచింపు మిపుడు.
బాగుగా నాత్మలోపల విచారించి
పరమేశ! నిర్గుణబ్రహ్మం బదేల
సగుణరూపము దాల్చు సదయుండవగుచుఁ
బ్రప్రథమంబునఁ బలుకు, మాపిదపఁ
దద్రామచంద్రావతారచారిత్ర
వచియింపు, మాపయి వర్ణింపు మీశ!
పావన శ్రీరామ బాల్యలీలలను.
పిదప నారాముఁ డేవిధముగాఁ దాను
సీతను బెండ్లాడె, శ్రీరాఘవుండు
ఏదోషమునఁ ద్యజియించె రాజ్యమ్ము—
నింపు పెంపర వచియింపుమా స్వామి!

వనవాసిరఘువరాపారకార్యములఁ
గూడ నాపయి వినఁ గోర్కి శ్రీకంఠ!
తదనంతరంబు నాథా! రాఘవుండు
ఎట్లు రావణుఁ గూల్చె నెఱిఁగించి, పిదప
రాజ్యాభిషిక్తుఁడై ప్రాభవం బెసఁగ
శ్రీరామచంద్రుఁడు చేసినయట్టి
లెక్కింప రానియాలీలల నెల్ల
దెలుపుమా! సుఖశీల! తేట తెల్లముగ.
పలుకు మాపయిని గృపాధామ! శర్వ!
రఘువంశమణి యెట్లు ప్రజలతోఁ గూడి
వైకుంఠ మరిగె నాపరమచిత్రమును.
జ్ఞానధాములు మునీశ్వరు లెల్ల హృదిని
ఏమహాసత్యంబు నీక్షించి, యందు
మగ్నులై యుందురో మఱవక నిరత—
మాత త్వ మెఱిఁగింపుమా! ప్రాణనాథ!
పిదప వచింపుమా వి స్తరరీతి
భక్తిని గూర్చిన బహుశాస్త్రసంగత్తుల
నవ్యవిజ్ఞాననానావిశేషముల
వైరాగ్యసంబంధిబహువిషయముల.
విమలవిజ్ఞానవివేకస్వరూప!
అగణితరామరహస్యత త్త్వముల
విశదీకరింపుమా విశ్వేశ! నాకు.
మఱచి నే నడుగనిమహితార్థములను
సైతము విడకు మీశ్వర! కృపాసాంద్ర!
ఈజగద్గురుఁడ వీవే యని శర్వ!
నిగమముల్ వచియించు నిస్సంశయముగ.
పరమగుహ్యం బగుపరమార్థ త్త్వ
మితరపామరజీవు లే మెఱుంగుదురు?"
పార్వతి యీరీతిఁ బలికినయట్టి
సహజసుఖాకరసదమలప్రశ్న
లన్నియు విని శివుం డానంద మొందె.
శ్రీరామచంద్రుచారిత్ర మాశివుని

మదిలోన మెఱసెను మహితపద్ధతిని.
భ క్తి భావానందపారవశ్యమునఁ
దను వెల్లఁ బులకీకృతం బయి పోవ
నశ్రుపూర్ణ ము లయ్యె నాశివుకనులు.
ఆతనిహృద్దర్పణాంతరమందు
శ్రీరామమంగళాకృతి గాన వచ్చె.
ఆపరమానందుఁ డైన శ్రీశివుఁడు
అత్యంతసుఖవార్ధియందున మునిఁగె.
ఒక గంటకాల మాయోగీశ్వరేశుఁ
డగుమహా దేవుండు ధ్యానసమాధి
మునిఁగి, బాహ్యజ్ఞానమును బొంది, పిదపఁ
గన్నులు తెఱచియుఁ గడు సంతసమున
శ్రీరాముచరితంబు చెప్పె నీ రీతి:
"రజ్జువిజ్ఞానంబు ప్రా ప్తింపకున్న
సర్పవిభ్రాంతియే సంభవ మగును.
రామత త్త్వజ్ఞానరాహిత్యమునను
సత్య మైనదియు నసత్యమై తోఁచు.
నిద్ర మేల్కాంచిన నిమిషమాత్రమున
స్వప్నవిభ్రమ మెల్ల సమసినరీతి
ఆరామ నెఱిఁగిన నాక్షణంబందె
దృశ్యమానం బగునీజగం బెల్ల
మిథ్య యై పోవు సుమా! గిరిపుత్రి!
ఎవనినామము జపియించుటచేత
అఖిలసిద్ధులు కల్గు నతిసులభముగ
ఆబాలరామున కభినతిఁ జేతు.
మంగళనిలయుఁ డమంగళహారి
ఆదశరథునిసౌధాంతర్విహారి
కరుణార్ద్రచిత్తుఁ డౌఁ గాక! నాపైన."
ఈప్రకారమ్ము మహేశుండు శివుఁడు
శ్రీరామునకు నమస్కృతులఁ గావించి
మధురసం బొలుకఁగం బలికె నీరీతి:
"ధన్యధన్యవు నీవు ధరణీధ్రతనయ!
ఉమ! నిన్నుఁ బోలు మహోపకారిణులు
వే రెందు లే రహా! వీక్షింప, నీవు
ఘనజగత్పావన గంగవిధాన
మూఁడు లోకములఁ బ్రపూత మొనర్చు
రామకథార్థముల్ ప్రవచింపు మనుచు
నర్థించినావు న న్నతిభ క్తితోడ.
రఘువీరు శ్రీపాదరాజీవములను
సంపూర్ణభ క్తి నీ స్వాత్మలోఁ గలదు;
ఈవు జగద్ధితదృష్టితో నిటుల
ప్రశ్నించినావు పర్వతరాజతనయ!
పార్వతీ! రామకృపావిశేషమున
స్వప్నమంద్రైన నీస్వాంతంబులోన
శోకమోహభ్రమల్ చొరలేవు సుమ్ము.
ఇది నాదృఢాశయ మిందీవరాక్షి!
పరు లెల్ల వినియు లాభంబుఁ గాంచుటకు
వెనుకటిఁ ప్రశ్న లే వేసితి వీవు.
రమణీయహరికథాశ్రవణంబు లేని
శ్రవణరంధ్రంబులు సర్పరంధ్రములు.
సాధుసత్పురుషదర్శనము లేనట్టి
కన్ను లెంచ, నెమిలి కన్నులు గావె.
గురుహరిపదములకున్ ప్రొక్కనట్టి
తలకాయ, చేదు గాఁదగుసొఱకాయ.
హరిపాదయుగభ క్తి యాత్మలో లేని
జీవుఁడు నిజముగా జీవచ్ఛవంబు
రామసద్గుణగానరతి లేనియట్టి
జిహ్వాలు, కప్పలజిహ్వాలే యగును.
హరిచరిత్రము విని హర్షింపనట్టి
గుండె, యాపెనుఱాతి గుండుతో సమము.
అమరహితంబును, నసురభీకరము,
రామదేవునిశుభరమణీయలీల-
వినుము గౌరీ! భ క్తి వెలుఁగొందఁ జాల.
కామధేనువురీతిగా, రామచరిత

తనను సేవించెడిధన్యజీవులకు
సర్వసౌఖ్యములు ప్రసాదించు బాల!
సాధుసజ్జనసమాజంబులయందు
వివిధబృందారకవిమలలోకముల
నెవ్వఁ డీవిషయంబు నెఱిఁగియు లోన
శ్రవణం బొనర్పఁడు రామాయణంబు?
సంశయగణపక్షిచయముల న్దోలు
రమణీయకరతాళరవము లై చెలఁగు
శ్రీరామదివ్యచారిత్రంబు గౌరి!
కలియుగపాపవృక్షంబు ఖండించు
శితకుఠారవరంబు శ్రీరామచరిత!
అట్టిరామాయణం బొబ్బడ్డబుద్ధి,
వినుము హిమాచలప్రియతనూజాత!
ఆదివ్యరామనామావళీసుగుణ
గాథానతరణసత్కార్యంబు లెన్న
నగణనీయము లని యఖిలవేదములు
ఘోషించుచున్నవి క్ష్మోణీంద్రతనయ:
అల, రామదేవుఁ డనంతుఁడై నట్లు
ఆరామగాథామహాయశోగుణము
లహ! యనంతములు, ప్రియా! గణియింప.
ఐనను, నేను నీయనురక్తిఁ గాంచి,
ఏను నాబుద్ధి గ్రహించినరీతి
నీ కవి వచియింతు నేఁ, డుమా! వినుము.
సహజసుఖప్రదసన్మానీయ
ములు, నీదు ప్రశ్నలు బుధసమ్మతములు
నాకును వినఁగ నానందంబు కలిగె.
ఐన భవాని! నీ వజ్ఞానవశతఁ
బలికియుండిన యొక్క వాక్యంబు నాకు
నిసుఁ డంతయును రుచియింపకపోయె:
నిగమముల్ నుతిసేయు నెగడు రాముండు
మునులు ధ్యానించు రాముఁడు వే ఱటంచు
భావించి నా; విది పరమహేయంబు.

భయదమోహపిశాచవశ్యు లౌ వారు,
పాషండు లచ్యుతపదపరాఙ్ముఖులు
విమలసత్యాసత్యవిజ్ఞానశూన్యు
లగు నరాధము లిట్టి యవిమృష్టవాక్కు-
లందురు విందు రోయచలేంద్రతనయ!
అజ్ఞు, లకోవిదు, లంధు లౌ వారు,
మందభాగ్యులును గల్మషపరిచ్ఛన్న
హృదయులు, లంపటుల్, హీనమానసులు
కపటులు, కుటిలసంకలితమానసులు,
కలనైన సాధుసాంగత్యంబుఁ గనని
వారు, లాభాలాభభావనారహిత
మానసులే, వేదమార్గవిరుద్ధ
సంభాషణంబుల సలుపు చుండెదరు.
వారిహృన్మకురముల్ బహుమలాత్తములు,
చూడ వారికిఁ గనుల్ శూన్యంబు లాయె;
ఆదీను లేరీతి నరయఁగాఁ గలరు
శ్రీరామసుందరాకృతి? సఖి! బాల!
సగుణంబుఁగూర్చిన జ్ఞానమా లేదు;
నిర్గుణజ్ఞానమో నిలువ దొకింత;
కల్పితోన్మత్తవాక్యము లనేకములు
వారలు సర్వదా వదరుచుండెదరు;
మాధవాకథనీయమాయకు లొంగి
లోకచక్రారంబులోఁ దగులొ్కొనియు
వార లెప్పుడు పరిభ్రమణంబుఁ జేతు
రెంత చెప్పిన వారి కేమి లాభంబు!
పైత్యప్రకోపాస్తభావులౌ వారు,
పిచ్చివారలు, భూతవివశులౌ వారు,
మద్యంబుఁ ద్రావినమందు, లెప్పుడును
సముచితరీతిఁ బ్రసంగింపఁబోరు.
ఆమోహమద్యపానావేశవివశ
వాక్యజాలమ్ము లెవ్వఁడు చెవి దూర్చు?
అని విచారించియు నాత్మలో నీవు

అఖిలసంశయపరిత్యాగం బొనర్చి
భజియింపుమా రామపాదపద్మముల.
భ్రమ యను నంధకారం బణఁగింప,
సూర్యకిరణమ్ములై శోభిల్లుచుండు
మదాక్యముల వినుమా! శైలతనయ!
సగుణనిర్గుణముల సందు భేదంబు
నరయ లే దనుచు మహర్షిజనంబు
వేదశాస్త్రపురాణబృందముల్ పలుకు.
అగుణం, బరూపంబు, నల యదృశ్యంబు,
అజము, పరం బౌచు నలరు బ్రహ్మంబె—
భాగవతప్రేమభరముచేఁ దాల్చు
సగుణస్వరూపంబు సాధ్వీలలామ!
అగుణంబు సగుణ మెట్లగు నందువేని
జలము హిమం బగు చందమే యగును.
భ్రమతమఃపటలంబుఁ బాపఁగా నెవని
పావననామంబు భాస్కరుం డగునొ,
అతనిని విభ్రాంతి యంటఁగాఁ గలదె?
అల సచ్చిదానందుఁ డైనశ్రీరామ
పూపోగ్రమండలంబున నుండఁ బోదు
మోహతమోలేశమును, శైలతనయ!
సహజమహాప్రకాశస్వరూపుండు
ఆరామభగవానుఁ డాతనిలోన
జ్ఞానోదయం బనుసంగతి లేదు.
మోహవివేకముల్, మోదఖేదములు,
గర్వాపహాసములు, చూడఁగా నిజంబునకు
జీవధర్మంబులు చెలియా! అపర్ణ!
రాముఁడు, వ్యాపకబ్రహ్మంబు, పరమ
సుఖరూపుఁడును, పరేశుఁడు, సనాతనుఁడు,
ఇది ప్రపంచం బెల్ల నెఱుఁగును గౌరి!

పురుషుం డనంగను భువనంబులందు
విఖ్యాతిఁ గాంచియు వెలుఁగొందువాఁడు,
అమలతేజోనిధి, యఖిలరూపకుఁడు,
జీవజగద్భర్త శ్రీరఘువంశ
రత్నమై రాజిల్లురామచంద్రుండు
నాస్వామి”—యని విశ్వనాథుండు శివుఁడు
రామదేవునిపాదరాజీవములకు
శిరము వంచియు నమస్కృతిని గావించె.
“అజ్ఞులు తమదోష మరయఁగా లేరు
ఆజడప్రాణులు నంతతోఁ బోక
ఆమోహా మీశ్వరునందు వైచెదరు.
మేఘముల్ కప్పిన మిన్నును గాంచి
ఆమేఘములచేత నర్కతేజంబు
పాసిన దందురు వక్రచింతనులు.
వ్రేలితోఁ గన్నొత్తి వీక్షించునెడల
గానుపించును రెండుగాఁ జందమామ.
ధూళిని, దమమును, ధూమజాలంబు,
నాకాశమందున నరసినరీతి
అల రామునకు మోహ మంటఁగట్టెదరు.
* విషయంబు లింద్రియబృందంబు, సురలు,
జీవుఁడు– తమతమ చేతనత్వముల
నొకదానినుండి యింకొకటి పొందు.
కాని యన్నిటినిఁ బ్రకాశింపఁ జేయు
పరమప్రకాశకపరమాత్మ, అరయ
నాయనాది యనంతు డాయయోధ్యేశ
రఘురామచంద్రపరబ్రహ్మ మూను!
సర్వజగన్మూలచైతన్య మతఁడె!
ఆరామవిభుఁడు మాయాధీశ్వరుండు
జ్ఞాన, సద్గుణగణసదనుండు చెలియ!

---

* విషయము లింద్రియములచేత, ఇంద్రియము లధిష్ఠానదేవతలచేత, ఆయాయింద్రియాధిష్ఠానదేవతలు చిదాత్మ చేతఁ జైతన్యమును బొందుచున్నవి.

జడమయం బగు ప్రపంచంబు సైతంబు
రామసత్యత్వకారణముచేఁ, గనఁగ
భాసించు సత్యంబువలె, మాయచేత.
కాకిచిప్పలు వెండిగా నెంచఁబడును.
మరుమరీచికలోన మసలునే నీరు ?
తద్దృశ్యములు సర్వదా యసత్యములె.
ఈభ్రమఁ బాయఁగా నెవ్వరివశము !
ఈరీతిగాఁ బరమేశునియందుఁ
బడయుచుందురు జగద్భ్రాంతిని సకియ !
జగమెల్ల గనఁగ నసత్యమే యైన
ఘనతరదుఃఖంబు కలిగించుచుండె.
కలలోనఁ దనతల ఖండింపఁబడిన
నతఁడు మేల్కొనుదాక నాబాధ విడదు.
ఆకృపాసాగరుం డైనశ్రీరాము
దయచేతమాత్రమే తద్భ్రమ వ్రీలు.
ఆరామదేవుఁ డాద్యంతశూన్యుండు;
తగ విచారించి వేదంబులు రాము
నీరీతి వర్ణించె నిందీవరాక్షి !
"పదములు లేకయే పయనించు నతఁడు,
కర్ణముల్ లేక యాకర్ణించు నతఁడు,
కరములు లేకయే కార్యముల్ సేయు,
ముఖము లేకయె సర్వమున్ రుచిఁజూచు,
వాక్కు లేకయె సదా భాషించు మిగులఁ,
దనువు లేకుండనే తాకు నన్నిటిని,
గన్నులు లేకయే కాంచు నన్నిటిని,
నాసిక యుండకున్నను నిఖిలంబు
నాఘ్రాణ మొనరించు నత్యద్భుతముగ.
అతనివిధానంబు లత్యలౌకికము
లాతనిమహిమంబు లకథనీయములు.
వేదముల్ విబుధు లీవిధముగా నెవని
వినుతింతు, రెవ్వని విమలర్షిగణము
లాత్మలో ధ్యానింప నాశించు, నతఁడు–

దశరథసుతుఁ డయోధ్యాధీశ్వరుండు–
ఆశ్రితహితకరుం డారామచంద్ర
భగవానుఁడే సుమా–పార్వతీ! వినుమ.
కాశీపురంబునఁ గాయముల్ విడుచు
జీవుల కే ముక్తి చేకూర్చుచుంట
నారామనామమహాబలంబునఁ నె.
సర్వచరాచరస్వామి, సర్వాత్మ,
యగు రఘువర్యుఁడే యస్మత్ప్రభుండు.
చివరకు వివశదుఃస్థితిలోన నైన
మనుజు లారామనామం బెంచునెడల
జన్మజన్మాఘసంచయములు, దూది
పింజలై కాలి వేవే భస్మ మగును.
ఎవరు భక్తిని స్మరియింతురో రాము,
వారు గోష్పాదమువలె సులభముగ
సంసారవార్ధిని సంతరించెదరు.
రాముఁడు పరమాత్మ రాజీవనేత్రి!
'రాముఁడు పొందె విభ్రమ' మన్న నీదు
మాట లత్యంతసమ్మతములు గావు.
ఇట్టిసంశయ మెప్పు డెదలోనఁ గల్గు
నాక్షణంబున వానియందలిజ్ఞాన
వైరాగ్యసద్గుణభావంబు లెల్ల
నిలువక యోభవానీ! నశియించు."
అని శివుఁ డాడుమోహాంతకసూక్త
లాలించినంతట నాయద్రితనయ
సకలకుతర్కంబు సమయింపఁ గలిగె.
ఆపార్వతీహృదయాంతరాళమున
శ్రీరామపాదరాజీవంబులందు
భక్తివిశ్వాసముల్ ప్రభవించె, నామె
ఘోరసందేహంబు కూలె సాంతముగ
పలుసార్లు తనపతిపాదముల్ పట్టి
యంజలి ఘటియించి యతిభక్తితోడఁ
బ్రేమరసప్లుతవిమలవాక్యముల

నీరీతిగాఁ బల్కె నీశునితోడ:
"అతిశరత్కాలసూర్యాతపతుల్య
మైన నామోహంబు హర! శివా! నీదు
చంద్రికాసమసత్ప్రసంగంబు చేత
శాంతించెఁ, దీరె నాసందేహ మెల్ల.
ఓదయాళూ! ప్రభూ! ఓమహాదేవ!
రామస్వరూపంబు గ్రహియించుకొంటి.
నాథ! నీ కృపచేత నావ్యథ తీరె-
స్వామి! నీ చరణప్రసాదంబుచేత
శాంతి లభించెను స్వాంతంబు నందు.
నాథ! నీ దాసిఁగా ను న్నించుకొనుము.
ఏను నైజంబుగా నింతి నజ్ఞాను
రాలను, జడ నైనఁ బ్రాణేశ! నీవు
నాయందున ప్రబసన్నతఁ బూని యున్నఁ
బ్రథమమం దడిగినప్రశ్నంబునకును
బ్రత్యుత్తరం బిమ్ము. పరశివా! నాథ!
రాముఁ డనంతపరబ్రహ్మ మనియు
చిన్మయాకారుఁడు, శ్రీనిరంజనుఁడు,
వాసుదేవుం డని భావమం దిపుడు
నే గ్రహించితిని బ్రాణేశ! విశ్వేశ!
ఆరామునఁ డేల నరాకృతిఁ దాల్చె?
వృషకేతనా! దీని వివరింప వినతి."
అని గౌరి పలికిన నమితవినీత
వాక్యముల్ విని, యామె పరమప్రపూత
రామకథార్థానురాగసమేత-
అని యెఱింగియు శివుం డాశంకరుండు
పరమదయాబ్ధి సర్వజ్ఞుండు, భవుఁడు
కామారి, యానందకలితాత్మునఁ డౌచు
గౌరిని బ్రీతి దొల్కఁగఁ బ్రశంసించి
రామాయణం బిట్లు ప్రవచింప సాఁగె.

శ్రీరామచరితమానసము

బాల కాండము

చతుర్థవిశ్రామము

గ్రక్కదల నుక్కుకంబము
వ్రక్కలు గావించి పుట్టి భయదార్భటితో
రక్కసిరాయనిఁ జీల్చిన
చక్కని శ్రీ మట్టపల్లి చండనృసింహా!

శ్రీ రామావతారకారణములు

"వినుము భవాని! పవిత్ర మై వెలుఁగు
రమణీయమంగళ 'రామచరిత్ర
మానస' కథను నిర్మలమానసమున.
కాకభుశుండి యీకథ నెల్లఁ బ్రీతి
మహనీయుఁ డగుగరుత్మంతునితోడఁ
బ్రవచించె మున్ను పర్వతరాజతనయ!
ఈమహాసంవాద మెటు ప్రవర్తి లెనో
తదుపరి వినిపింతుఁ దరుణీలలామ!
పరమసుందరము నిష్పాప మై వెలుఁగు
తద్రామదివ్యావతారచారిత్ర
శ్రవణం బొనర్పుమా ప్రప్రథమమున.
హరిగుణ, నామ, కథార్థ, రూపంబు
లత్యపారంబులు, నగణనీయములు.
శక్తికొలందిని శ్రవణింపఁజేతు
నో యుమా! ఆదరం బొప్పఁగా వినుమ!
నిగమాగమంబులు నేర్పుకొలంది
బహుళమనోజ్ఞ పావనము లై నట్టి
శ్రీహరిలీలలఁ జేసె సన్నుతిని.

ఘనహరియవతారకారణంబులను
'ఇద మిత్థ'మని చెప్ప నెవరివశంబు?
ఓ బుద్ధిశాలినీ! ఓ గౌరి! వినుము!
ఏమనోవాక్కుల కెపు డందఁ బోఁడు
శ్రీరాముఁ డిది నాదుసిద్ధాంతమగును.
ఐనను నా కర్థ మైనరీతిగను,
సజ్జనమునివేదశాస్త్రపురాణ
జాలముల్ తమతమశక్తి కొలంది
తెలిపినరీతిగాఁ, దెలిపెద నీకు.
ఎపుడు ధర్మగ్లాని యేర్పడుచుండు,
నెప్పు డధర్మవిజృంభణం బొఁదవు,
నెపు డహంభావసంభృతు లై ఘఘోర
రాక్షసాధములు ధరన్ జెలరేగి
వర్ణింప రానట్టి పాపకృత్యముల
సలిపెద రాకష్టసమయంబులందు;
ఎపుడు గోబ్రాహ్మణబృందారకాళి
భూదేవి దుఃఖంబుఁ బొందునో యపుడు.
నారాయణుఁడు కరుణాపరాయణుఁడు
వివిధరూపము లొంది పృథ్వీస్థలానఁ,
దొలఁగించు సజ్జనదుఃఖభారముల
సంహార మొనరించి చండరాక్షసుల;
సకలదేవతలందు శాంతి స్థాపించు;
తన నిశ్వసనము లై తనరుచున్నట్టి
వేదమర్యాదలఁ బృథ్వి రక్షించు;

నిజయశం బెల్లెడ నిండఁగాఁ జేయు;
రామావతరణకారణ మిదే దేవి!
భగవంతులీలాప్రభావసంతతుల
భాగవతో త్తముల్ పాడి, కీ ర్తించి
సంసారనార్తిని సంతరించెదరు.
తనభ క్తరక్షణార్థమె, జనార్దనుఁడు
తనువు ధరించును ధాత్రిపై గౌరి!
రామావతారకారణముల నెన్న
బహుళంబు లౌచును భాసిలుచుండు.
ఆకారణంబుల నరసినయెడల
నొకదానికన్న నిం కొకటి చిత్రంబు—
ఆకారణంబుల యం దేను నీకు
నొక్కండొ రెండింటినో వచించెదను—
పార్వతీ! సుమతీ! భవానీ! అపర్ణ!
శ్రవణంబు సేయుము సావధానముగ:
శ్రీహరికిన్ గడుఁ బ్రియు లైన యట్టి
వైకుంఠమందిరద్వారపాలకుల
జయవిజయులఁ బ్రపంచం బెల్లఁ దెలియు.
సనకాదిభూసుర శాపంబుచేత
నాసహోదరు లిద్ద ఱత్యుగ్రధూ ర్త
తామసాసుర దేహధారు లై రవనిఁ
గనకాక్షుఁ డన హేమకశిపుఁ డనంగ.
అమరేంద్రగర్వాపహారు లటంచు
వారలు జగతిలోపలఁ బేరు గనిరి.
వారిద్దఱును జగత్ప్రఖ్యాతసమర
వీరనరేణ్యు లై విజయంబుఁ గనిరి.
వారిలో హేమాక్షుఁ బడఁ గూల్చికొఱకు
హరి ధరించెను వరాహావతారమును.
ఆపయి నారసింహావతారమున
నాహేమకశిపుగర్భాంతరాళమును
నిర్భిన్న మొనరించి నిస్తులశాత
వజ్రనఖాగ్రదుర్భరవిక్రమమునఁ
బరమభ క్తుం డగుప్రహ్లాదుయశము
దశదిశాక్రాంత మై తనరంగఁ జేసె.
ఈసహోదరు లిద్దఱే ధరన్ దిరిగి
పృథుబలిష్ఠులు మహావీరు లైనట్టి
రావణకుంభకర్ణసమాఖ్యు లౌచు
ధరణి జన్మించి; రాదానవాధిపులు
భండనపాండిత్యవై భవాన్వితులు.
గీర్వాణులనుగూడ గెలిచి రుద్ధతిని
అఖిలప్రపంచవిఖ్యాత మౌ నట్లు.
ఆహేమకశిపు హేమాక్షు లిర్వ్వురును
సర్వేశ్వరునిచేతఁ జంపఁగాఁ బడియు,
మూఁడు జన్మంబులఁ బొందున ట్లున్న
బ్రాహ్మణఘోరశాపప్రకారముగ
ముక్తిని వారలు పొంద లే రైరి.
అందుచే నొక సమయంబున శౌరి
ఆభ క్తవత్సలుఁ డవతార మొందె;
ఆజన్మమందున నదితికశ్యపులు
హరికిని దలిదండ్రు లై రి ధరిత్రి.
అదితి కౌసల్యగా, నల కశ్యపుండు
దశరథుం డనుపేర ధరణిలో మనిరి.
ఒక కల్పమునఁ బురుషో త్తముఁ డిటుల
నవతార మొందియు నవనీస్థలమునఁ
బావనలీలల వ ర్తించినాఁడు.
ఇంకొక కల్పమం దెల్ల దేవతలు
దానవుం డగు జలంధరుతోడఁ బోరి
యపజయం బొంది దుఃఖాక్రాంతు లై రి.
వారిదుఃఖంబును బరశివుం డరసి
సలిపె నపారమా సంగ్రామకేళి.
కాని మహాబలకలితుఁ డైనట్టి
ఆదానవుఁడు కూలఁడాయెను బోర.
అతులపతివ్రత యౌదైత్యభార్య;
ఆమెసతీత్వమహాశ క్తిచేతఁ

ద్రిపురారిచేఁ గూడఁ దెగఁడయ్యె వాఁడు.
ఒక యుక్తిచేఁ బురుషో త్తముఁ డపుడు
ఆమె సువ్రతభంగ మాచరించియును
దేవకార్యమును సాధించె; నాపయిన
నీయుక్తి నెల్లఁ దా నెఱిఁగి యాకాంత
ఆగ్రహ మొంది యాహరిని శపించె.
కాతుకనిధియు సత్కారుణ్యవనధి
భగవానుఁ డామెశాపంబు గ్రహించె.
ఆవలికల్పమం దాజలంధరుఁడె
రావణుం డనఁ బునర్భవమును బొందె.
సంగ్రామమున వాని సంహరించియును
శ్రీరాముఁ డతని కిచ్చెను సత్పదంబు.
ఒక జన్మమందున నుర్వీస్థలమున
రాముఁడు నరశరీరముఁ దాల్చినట్టి
కారణం బిది సుమా కాంచినయెడల.
"ఓ భరద్వాజబుషుత్తమా! వినుము:
ప్రత్యవతారశుభంకరకథను
బలువిధంబులఁ గవుల్ పాడుకొన్నారు.
మఱి యొకానొకసారి మౌని నారదుఁడు
సారసనాభుని శపియించినాఁడు.
ఒక కల్పమున ముకుందోదయంబునకుఁ
గారణం బిది యయ్యె క్ష్మారంగమందు."
అన గౌరి యీమాట లాలించినంతఁ
జకితయై యిట్లనె శంకరు న్గాంచి,—
"అల నారదుండు విష్ణ్వంఘ్రిభక్తుండు,
జ్ఞానిగదా, అట్టి సంయమీశ్వరుఁడు
ఏతఱి శపియించె? నిందిరావిభుఁడు
ఏకీడు చేసెనో యెఱిఁగింపు మీశ!
మునినారదుం డట్లు మోహితుం డౌటఁ
జిత్రమయ్యెను నాకు శివ! త్రిపురారి!"
చిఱునవ్వు నవ్వుచు శివుఁ డంతఁ బలికె :
"జ్ఞానియే కాని, యజ్ఞాని కానిమ్ము

శ్రీరామవిభుఁడు వాంఛించినరీతిఁ
బ్రతిజీవి సమయమ్ము వచ్చినతఱిని
మార్పు చెందును; హరిమాయ చిత్రంబు!"
యాజ్ఞవల్క్యుం డిట్టు లనియె నంతటను:
"శ్రీరామగుణగాథ చెప్పుచున్నాఁడ
వినుము భరద్వాజ! ప్రీతి వెలుంగ."

మానమదంబుల మదిలోన విడిచి
భవవిభంజనరామభజనంబె సతము
చేయుమా హృదిఁ, దులసీదాస! నీవు.

నారదునిగర్వము :
శ్రీహరిమాయా ప్రభావము

ఆహిమాలయపర్వతావళియందుఁ
గల దతిపావనకందరం బొకటి.
ఆగుహాప్రాంతమునం దంద మైన
గంగామహానది కలకలఁ బాఱు.
పరమపావనము, శోభావంత మైన
ఆయాశ్రమస్థల మరసి దేవర్షి
పరమసంతోషసంభరితాత్మఁ డయ్యె.
ఆవెండికొండను, ఆదివ్యగంగ,
నావనభాగంబు లరసి నంతటనె
ఆనారదునిహృదయాంతరాళమునఁ
బొంగె శ్రీపతిపాదాంభోజానురక్తి.
అతఁడు హరిధ్యానమందుఁ గూర్చుండె
"నొక్క తావున నిల్వకుందువుగాక—"
అనెడిదటునిశాప మయ్యె నిష్ఫలము.
సహజవినిర్మలస్వాంతుఁడై యుంట
దేవతాముని సమాధినిమగ్నుఁ డయ్యె.
ఆమునిస్థితిఁ గాంచి యమరేంద్రుఁ డంత
భీతిల్లి కామునిఁ బిలిపించి యతని
మహితరీతిగను సన్మానంబు చేసి
పలికె నీవిధముగాఁ "బంచాస్త్ర! సచివ!

నీవు నా కొఱకుఁగా నేఁడు పోవలయు
ననుచరయుక్తుండ వై" యన నపుడు
జలచరధ్వజుఁడు హర్ష ంబును బొంది
పయనంబుఁ గావించెఁ బరమమునీంద్ర!
అహ! నిజపదవిని నా దేవమౌని
యాక్రమించు నటంచు నమరేంద్రుభయము.
కామలోలుఁడు, లోభి, కాంచి యందఱిని
గపటకాకము వోలెఁ గడు భీతిఁ జెందు.
ఎండిపోయిన వట్టి యెముకను నోటఁ
గఱచియున్ జడశునకంబు పోవుచును
మృగరాజమును గాంచి, యిది తనయెముక
కాఁజేయు నని భయకలితమై పాఱు—
ఈవిధంబుగ నె దేవేంద్రుఁడు గూడ
సిగ్గును విడిచినచింతఁ గావించె.
నారఁగాశ్రమము, మన్మథుఁ డంతఁ జేరి
లలితవసంతకాలము ప్రకటించె
నిజమాయచేత; మునిధ్యేయ! అపుడు
రంగురంగులపూలు రమణీయముగను
వివిధవృక్షములందు విరియఁ బూచినవి.
కోయిలల్ పాడెను 'కూహూ' యటంచు.
భృంగసంగీతముల్ వినఁబడసాఁగె.
వీఁచెను జల్లని పిల్ల తెమ్మెరలు
విమలసువాసనల్ విరఁజిమ్మికొనుచుఁ
గామాగ్నికిని దోడుగా నరణ్యమునఁ
గడు నవయౌవనాకారశోభితలు
నిఖిలమన్మథకళానిపుణ లై వెలుఁగు
రంభాదు లత్యంతరమణీయలీలఁ
బాటలు పాడిరి పలు తెఱంగులను;
పూలబంతులఁ జేతఁ బూని కుల్కుచును
ఆడిరి బహుళవిన్యాసంబు లొప్ప.
ఆసహాయావళి నరసి మన్మథుఁడు
హర్ష ంబు నెంది నిజాంతర్యమందుఁ
బలు పన్నుగడలను బన్ని జృంభించె.
కాని కాముని పరాక్రమమథాటి యెల్ల
మొక్కవోయెను దేవమునివర్యుముందు.
పాపాత్ముఁ డగుమనోభవుఁ డంతఁ దాను
బ్రాణభీతిని జెందె భావంబు లోన.
కన, రమాపతికృపాకవచరక్షితుని
భంగం బొనర్చెడుబలశాలి యెవఁడు?
ప్రసవాస్త్రుఁ డంతట భయమును బొంది
తనపరాభవమును దా నొప్పుకొనియు
శ్రీనారదాంఘ్రిరాజీవంబులందు
సానుచరుం డయి సాష్టాంగపడియుఁ
దనతప్పు సైఁప బ్రార్థనముఁ గావించె.
నారదమౌనిమనంబులో నపుడు
ఆగ్రహం బుదయింప దయ్యె సుంతయును.
ఆముని కాముని నతిప్రియోక్తులను
బరితోషపఱుఁపఁగాఁ, బంచబాణుండు
మునిపదాబ్జములకు ప్రమోదమ్రతను
సానుచరుం డయి చనె సెల వొంది.
ఇంద్రసభాస్థలి కేగి మన్మథుఁడు
స్వీయకృత్యంబులఁ జెప్పి యాపయిని
మునివర్యసౌశీల్యమును నివేదింప,
నాకథ నాలించి యచటి వా రెల్ల
రాశ్చర్య మొందియు నమరమునీంద్రుఁ
గడుఁ బ్రశంసించియు ఘనభక్తితోడ
నతులు గావించిరి నారాయణునకు.
తదనంతరము నారదర్షివర్యుండు
శ్రీశివదేవు దర్శింపఁగా నరిగె.
ఏను మన్మథుని జయించినా ననెడి
యభిమాన ముదయింప నాత్మ నారదుఁడు
శంకరుతోఁ గాము చర్యలఁ దెలిపె.
అత్యంతప్రియుఁ డౌట నానారదునకు
నామహాదేవుఁడు హరుఁడు శ్రీశివుఁడు

హితవాక్యములఁ బల్కె నీరీతిఁ బ్రీతి:
"నాకుఁ జెప్పినరీతి నారదా! నీవు
హరితోడఁ దెలుపకుమా - ఎన్నఁడైన.
ఈప్రసంగం బెన్నఁడేని వచ్చినను
గుప్తంబుగా నిల్పుకొనుము లోపలనె.
పలుసార్లు ని న్నిదే బతిమాలుచుంటి."
క్షేమదాయక మైనశివునిహితోక్తి
నారదుహృదయంబున న్నాటదయ్యె—
ఆపయి జరిగిన నతికౌతుకమును
ఓ భరద్వాజబుష్యోత్తమా! వినుము—
అహ! బలీయము కదా హరియిచ్ఛ! సచివ!
జరుగు రామేచ్ఛయే సర్వకాలముల,
నన్యథా జరుగ దహా! దాని కెపుడు;
శివువాక్కులను ముని చెవిఁ బెట్టకుండ
బ్రహ్మలోకమునకుఁ బయనంబు చేసె.
సన్నుతగానవిశారదుం డైన
నాగదముని యొకనాఁడు, హస్తమున
వరమనోహగవీణ వాయించుకొనుచుఁ
బాడుచు హరిగుణభజనకీర్తనల—
వేదాంతరూపుఁ డై వెలుఁగొందుఘనుఁడు.
శ్రీనివాసుం డున్నక్షీరసాగరముఁ
జేర, శ్రియఃపతిచిత్తంబునందు
నతిహర్షితుం డయి యాదరం బొప్ప
నెదురేగి స్వాగతం బిచ్చియుఁ దెచ్చి
యాత్మీయసింహపీఠాగ్రభాగమునఁ
గూర్చుండఁగాఁ జేసెఁ గూర్మి యుప్పొంగ.
ఆచరాచరపతి యైన కేశవుఁడు
చిఱునవ్వు ముఖమునఁ జెంగలింపంగ
"బహుదినంబులకు నీభాగ్యంబు కలిగె
మా, కహా! నారదమౌనీంద్ర!" అనియె.
శివుఁడు వద్దని మున్ను చెప్పి యుండినను,
బూసఁ గ్రుచ్చినరీతిఁ బుష్పాస్త్రచర్య

లన్నియు హరితోడ నమరర్షి తెలిపె—
అమితప్రచండ మహా! రామమాయ!
ఈలోకమున దాని కెవరు లోఁబడరు?
ముసిముసినగవులు మోమునైఁ జెలఁగ
మృదువచనంబుల శ్రీశుఁ డిట్లనియె:
'తాపసోత్తమ! నిన్నుఁ దలఁచుమాత్రమున
మద, మోహ, కామాభిమానంబు లుడుగు.
మునినాథ! నారదా! మోహంబు - జ్ఞాన
వైరాగ్యములు లేనివారల గెలుచు,
బ్రహ్మచర్యవ్రతరతుఁడవు, మఱియు
నతిధీరచిత్తుండ వరయఁగా నీవు
కామపీడితుఁడవు కాఁజాల వెపుడు."
అన విని నారదుం డభిమాని యగుచు
"పరమాత్మ! యిది నీకృపావిశేషంబె"
అని వచించెను బరమాత్మతోఁ బైకి.
హరి కరుణానిధి యాత్మఁ జింతించి,
యానారదునిహృదయాంతరాళమునఁ
బెనుగర్వవృక్షంబు పెఱుగుటఁ గాంచి,
"వేగమే దానిని బెఱికి వైచెదను;
అస్మదాశ్రితహిత మాచరించుటయె
నాదీక్ష; గాన నీనారదమౌని—
కురుహితంబును గూర్చునొకయుక్తి పన్ని
కౌతుకం బొనరింపఁగల" నని తలఁచె.
శ్రీహరిపాదరాజీవంబులందు
శిరము వంచియు నమస్కృతులఁ గావించి
ఏగె నారదుఁడు, మునీశ్వరా! వినుము.
ఆమునిహృది వృద్ధి యయ్యె నహంబు.
శ్రీపతి తనమాయఁ బ్రేరణచేసె
దానికథోరకృత్యము లింక వినుము.
మాధవుమాయచే మార్గమధ్యమున
శతయోజనాతివిస్తార మైనట్టి
ఘనపురం బొక్కటి కల్పింపఁ బడియె.

తత్పురరచనావిధాననిపుణత
వైకుంఠమును మించి భాసించుచుండె.
ఆనగరంబులో నధివసియించు
స్త్రీపురుషాళి వీక్షించినయెడల
ఆరతీమన్మథు లవనిపై నిట్లు
బహుళరూపంబులఁ బ్రభవించినట్లు
తలఁపు కల్గును భరద్వాజమౌనీంద్ర!
ఆపురం బేలెడియధిపునామంబు
"శీలనిధి" యనంగఁ జెలువొందుచుండె.
బహుళాశ్వగజసైన్యభాసమానుండు
పరఁగ శతేంద్రవైభవవిలాసుండు
సుందరరూపతేజోబలనీతి
నిలయుఁ డాఘున 'శీలనిధి' నృపాలుండు.
'విశ్వమోహిని' యనుపేర వెలుంగు
నారాజసుతసుందరాకార మరసి
మిగుల మోహించు లక్ష్మీదేవి యైన,
ఆబాల యఖిలగుణాలయ యైన
హరిమాయయే సుమా! ఆమెసోయగము
వర్ణింప నెవ్వరివశమా మునీంద్ర!
ఆరాజతనయాస్వయంవరం బపుడు
జరుగనుండెను రాజసౌధాంతరమున.
అందుచే వచ్చిరి యుగణితనృపులు.
కౌతుకభావసంకలితదేవర్షి
ఆపట్టణంబున కరుగుదెంచియును,
ఎఱిఁగెఁ బౌరులచేత నెల్ల వార్తలను.
ఆరీతి వృత్తాంత మంతయు వినియు
నాముని చనియె నృపాలయంబునకు.
నృపుఁ డంత మౌని నర్చించి సంప్రీతి
నుచితాసనంబున నుపవిష్టుఁజేసె.
ఆరాజు తనపుత్రి నటకు రావించి
చూపి నారదమునీశున కిట్లు పలికె:
"నాథ! విచారించి నాకూర్మిసుతకు
సర్వశుభాశుభసంగతుల్ దెలుపఁ
బ్రార్థించుచున్నాడఁ, బరమమునీంద్ర!"
ఆరాజపుత్రిక నరసినంతటనె
నారదమౌని, మనంబులోఁ దనదు
వైరాగ్యమున కెల్ల స్వస్తి చెప్పియును
తెప్ప వాల్పక చూచె నృపతనూభవను.
ఆమె సులక్షణా లన్నింటిఁ గనఁగ
నామునిమతి విభ్రమాయత్త మయ్యె.
హర్షంబుఁ జెందెను నాత్మలో నతఁడు.
ఆసులక్షణముల నన్నింటి నపుడు
ప్రకటింపకయె దాచి భావంబునందుఁ
దా నిట్లు లెంతయో తలఁచె నారదుఁడు:
"ఈబాలికామణి యెవని వరించు
నాతఁ డజేయుఁడై, యమరుఁడై మనును.
ఈశీలనిధిసుత యెవనిఁ బెండ్లాడు
నతఁడు చరాచరాధిపుండగును."
ఈసులక్షణముల నెల్లఁ బరించి,
వానిని బహిరంగపఱుపక దాఁచి,
వేగ నేమేమొ కల్పించి వచించి,
శుభలక్షణములు నీసుత కున్న వనుచు
నృపుతోడ సూచించి, యేగె నారదుఁడు
తనలోనఁ దా నిట్లు తలపోసికొనుచు:
"ఏ నెట్టి యత్నంబు నిపు డొనరింప
నృపతనూజాత వరింపఁగాఁ గలదు?
జపతపంబులు సేయు సమయంబు లేదు,
దైవమా! ఆబాల నేవిధానమున
నే వివాహం బొడనేర్తునో యెఱుఁగ!
ఏను వాంఛించున దీసమయమున
నమితశోభాయమానాకార మొకటె;
అది యున్న నన్గాంచి, యారాజతనయ
మత్కంఠమున జయమాలఁ గీలించు.
సౌందర్యదానంబు సలుపఁగా నాకు,

శ్రీహరి న్నేను బ్రార్థింతును, గాని-
అక్కటా! క్షీరాబ్ధి కరుగుద మన్నఁ
గాలవిలంబము కాఁగల, ద్దైన
హరికన్న లేఁడు నా కాత్మహితుండు.
అత్యవసర మగు నట్టియాతఁడిని
హరి నాకుఁ దగిన సాహాయ్యం బొనర్చు."
అని నారదుండు నిజాత్మఁ జింతించి
బహువిధవినయసంభావన లొప్పఁ
బ్రార్థించె శ్రీహరిపాదపద్మముల.
కౌతుకప్రియుఁ డహా! కారుణ్యవనధి
హరి, మునిముందుఁ బ్రత్యక్షమై నిలిచె.
ఆదృశ్యమును గాంచ నానారదునకుఁ
గన్నులవిం దయ్యెఁ, గలిగె సంతుష్టి.
తనకోర్కె సిద్ధించుఁ దప్పక యనుచు
ధైర్యంబు కలిగె స్వాంతంబులో; నంత
అత్యార్తి గదురఁగా హరితోడ నతఁడు
వినిపించి జరిగినవృత్తాంత మెల్ల
నిట్లు ప్రార్థించెను, "కృపఁబూను మీశ!
నాకు సాహాయ్యం బొనర్పుమా; నాకు
నరూప మొసఁగుమా నేఁడు లోకేశ!
వే ఱొకరీతి లభింప దాకన్య.
త్వరగ నావాంఛ దీర్పంగఁ బ్రార్థ్యము,
నీపాదదాసుండ నేఁ బ్రభూ! శౌరి!"
తనదుమాయాబలధాటిని గాంచి
దీనదయాళుఁ డాదేవదేవుండు
తనలోనఁ నే, మునీ! తా నవ్వుకొనియు
నీరీతిఁ బలికె నాబుషిని గాంచియును:
"వినుము, నారద! నీకు విహిత మైనదియె
కావింతు నానుడుల్ కల్లఁగా వెపుడు.
ఓమునీ! నారదయోగీశ! వినుము!
అల రోగపీడితుఁ డైనమానవుఁడు
తినరానివస్తువుల్ తిన నెంచునెడల
వైద్యుండు సమ్మతింపఁడుగదా? యటులె
నీ కేది హితమనూనో నే నది సేతు."
అనియు నంతర్హితుం డాయెను జక్రి.
మాయావశుం డయి మాఢ్యముఁ బూని
హరిగభీరో క్తులయుం దర్థ మాత్మఁ
దెలియఁ జాలక పోయె దేవర్షి యహహా!
అంత నాత్రముతోడ నాబుషిరాజు
తత్స్వయంవరసభాస్థలమును జేరె.
తమపరివారయు క్తంబుగా వచ్చి
దేశ దేశములపృథ్వీనాథు లెల్ల
బహువిధభూషణభాసురు లగుచు
నుచితాసనమ్ముల నుపవిష్టు లైరి.
"అహ! నాదు సౌందర్య మరసినపిదప
ఆరాకుమారి పెండ్లాడ దిం కెవనిఁ
దప్పకుండఁగ నన్నె తా వరియించు"
అని పొంగుచుండె నాయమర్షి లోన.
మునిహితం బొనరింపఁ బూని కృపాబ్ధి,
ఆతనికి న్దెలియుంగ రాకుండఁ
గడు వికారం బగు కపిరూపుఁ గూర్చె.
ఎఱుఁగ రీసంగతి నితరు లెవ్వరును;
అంద ఘాతఁడు నారదాచార్యుఁ డనుచుఁ
గడు భక్తితో నమస్కారంబు లిడిరి.
ఆనారదునికంటి కతఁడు శ్రీవిష్ణు
సుందరాకృతిగను జూపట్టు చుండె.
రాజుల కతఁడు నారదుఁడుగాఁ దోచె.
రాజకన్యకకు మాత్రము, నారదుండు
పండుకోఁతిగఁ గానవచ్చె మునీంద్ర!
ఈశ్వరుకింకరు లిర్వు ర త్తటిని-
దత్స్వయంవర సభాస్థలి నుంట జరిగె.
ఎల్ల రహస్యంబు నెఱిఁగి యాభటులు
విప్రవేషంబుల వేసి యే తెంచి
రాకౌతుకక్రీడ నరయ నచ్చటకు.

నిజరూపగర్వంబు నిండ నారదుఁడు
క్ష్మోణీధవులమధ్యఁ గూర్చుండియుండె.
ఆప్రక్కనే బ్రాహ్మణాకృతు లూని
రుద్రకింకరు లిర్వురును గూరుచుండ్రి.
బ్రాహ్మణాకృతు లూని వా రుంటచేత
వారి నోరుల్ గుర్తు పట్టలే రైరి.
విని వినిపించనివిధముగా వారు,
"ఇంత సుందరరూప మిచ్చె నీతనికి
నిందిరాపతి కృప; నితనిఁ గాంచియును
దప్పక రాపుత్రి తబ్బిబ్బుఁ జెంది
ఈతఁడు * హరి యని యెంచి వరించు-"
అని పరిహాసంబు లాడి రాయెడను.
మన్మథవశ్యుఁడై మౌనీశ్వరుండు
మోహాప్రమత్తత మునిఁగె మునీంద్ర!
అతనితీరును జూచి యాశివభటులు
నవ్వుచు ముసిముసి నవ్వుల మర్మ
పరిహాసవాక్కులఁ బలుకుచుండినను
భ్రాంతాత్ముఁడై యుంట పాప మామాని
పట్టించుకొనఁడయ్యె వారిహాస్యముల.
ఆయతిశోచనీయాకృతియొక్క-
రాజనందినికి మాత్రమె కాన వచ్చె;
ఆరాజపుత్రిక యామునీశ్వరుని
కోతిముఖంబును, ఘోరరూపమును
గనుఁగొని క్రోధసంకలితాత్మ యయ్యె.
ప్రియసఖీజనములు వెనువెంట రాఁగ
రాసుత నడచె మరాళంబు వోలె.
కలుగఁగా జయమాల కరపంకజముల
అఖిలరాడ్పుత్రుల నరయు చాబాల
యెయ్యారముగఁ బోవుచుండె నచ్చోట.
మ్రింగుచు గుటకలు మిగుల గర్వమున
నుండె నారదమని యుపవిష్టుఁ డగుచు.
ఆతని వైపున కారాజతనయ
క్రేఁగంటనైన వీక్షింపక పోయె.
పాపము! నారదస్వామి, పేరాస
నిక్కినిక్కియుఁ జూచు నృపసుత వైపు.
అది చూచి హరభటుల్ హాసియించుచుండి
రాకృపానిలయుఁ డౌహరి సైత మచట
భూవల్ల భునిరూపమున వచ్చియుండె.
ఆరాజనందిని హరిమెడలోన
జయమాల వైచెను సంతోష మొప్ప.
శ్రీనివాసుం డామేఁ జేకొని వెడలె
నవనీపతులు నిరాశాత్ములు గాఁగ.
మోహాంధుఁ డౌటచే ముని నారదుండు
అమితవైకల్యంబునందెఁ జిత్తమున.
మాలలో ముడి వీడి మణి జాఱినట్లు
నారదమూని మనంబులో వగచె.
హరభటుల్ నవ్వుచు "అద్దంబులోన
నరయుమా నీ ముఖం" బని వచియించి
పరుగిడి రటనుండి భయమును జెంది.
ఆపయి ముని నీట నరసెను ముఖము-
అంతు లే దాతనియాగ్రహంబునకు.
అంత నానారదుఁ డతిభీష్మరీతి
శంకరభటులను శపియించె నిటుల :

నారదుఁడు శివదూతలను, శ్రీహరిని
శపించుట

"కపటఘోరాఘసంకలితాత్ములార!
దనుజులై పుట్టుఁడీ ధాత్రిలో మీరు.
నన్నుఁ గాంచియు మీరు నవ్వినదాని
కనుభవింపుఁడు తగినట్టిఫలంబు.

---

* హరి - అనఁగా నొక యర్థము కోఁతి- మఱొకయర్థము విష్ణువు.

ఇఁకఁ జేతనైన ముసీశుల న్గూచి
యెగతాళి సేయుఁడీ హీనాత్ములార !"
మరలఁ దా నారదమాసీశ్వరుండు
నిజముఖంబును గన నీటిలోపలను
దనపూర్వతనువు యథారీతిఁ దోఁచె.
ఐన నాతనిహృదయాంతరాళంబు
శాంతింప దయ్యెను, జండకోపమున
నాతనియధరంబు లదరఁగాఁ దొడఁగె.
కమలావిభుం డున్నకడకు నారదుఁడు
వెను వెంటనే బయల్వెడలెఁ గ్రోధమున.
"నగుబాటుఁ గూర్చెను నాకు లోకమున
ఆహారిన్ శపియింతు నటుగాక యున్న
వానిద్వారముముండె ప్రాణముల్ విడుతు"
నని నారదుండు నిజాత్మలోఁ దలఁచె.
పోవుచుండఁగ మార్గమున నారదునకు,
రాజకన్యారమారమణీయుతముగ
నాదనుజారి శ్రీహరి కాన వచ్చె.
అప్పు డాసురపతి యతిమంజులముగ
నీరీతిఁ బలికె: "ముసీశ్వరా ! ఏల
వికలుఁడ వై నీవు వెడలుచున్నాఁడ ?
వెటకు నీ వేగుట యెఱిఁగింపు మనఘ !"
ఆమాటలను వినినంత నారదుని
తను వెల్లఁ గ్రోధసంతప్త మై పోయె.
మాయావశుం డయి మతి పోయియుంట
నాతఁ డీరీతిగా ననె హరిఁ గాంచి:
"పరులసంపదఁ జూచి భావంబులోన
నీ ర్ష్యాఁ జాలవు; నిక్కంబు చూడ
నీర్ష్యయుఁ గాపట్య మెక్కువ నీకు.
క్షీరసముద్రంబు చిలికెడితఱిని
బాప మాశివు వెట్టివానిఁగాఁ జేసి
బృందారకులచేతఁ బ్రేరణచేసి
అకట ! త్రాగించితి వతనిచే విషము.
దనుజావళికిని మద్యంబు నొసంగి
హాలాహలంబును హరున కొసంగి
ఘనరమా దేవిని, గౌస్తుభమణినిఁ
గొంటివి; సర్వదా కుటిలచిత్తుఁడవు
స్వార్థసాధకుఁడ వై వర్తింతు; వెపుడు
నిను నమ్మఁగా రాదు నీరజనాభ !
పరమస్వతంత్రప్రవర్తన గల్గి
పెద్దవు నీకు నీవే యూటచేత
నీయిచ్చవచ్చిననియతిఁ జేసెదవు.
మంచివానిని నీవు మందునిఁ జేసి
మందునిఁ జేతువు మంచివానిగను.
కాని చిత్తమునందుఁ గలుగవు నీకు
ఖేదమోదంబులు; కేశవా! దానఁ
బ్రతిజీని నీరీతి వంచించుచుంట
నలవాటుపడితి వీయపకారములకు.
నిర్భయత్వంబున నీవు నీపనుల
నిర్వహింతువుగదా ! నేర్పు మీఱంగ.
శుభకర్మమేని యశుభకర్మమేని
నీ మార్గమున కడ్డు నిలువఁగా లేదు.
నిన్ను శిక్షింపఁగా నేర రెవ్వరును.
నీ యాట లిటు సాఁగ నేఁడు గర్వించి
యగ్నితోఁ జెల్లాట లాడినా, విపుడు
పొందుము తత్ఫలంబును దప్పకుండ.
కేశవా ! నను మోసగించినయట్టి
నృపరూపమును ధరియింపుము నీవు.
ఇదె నాదుశాప మోయీ ! నీవు నన్నుఁ
గోతిని జేసి; తాకోఁతులే నీకు
సాయంబు మిత్రులై సలుపును గాక!
నా కపకారం బొనర్చినరీతి,
ఓహరీ ! భార్యావియోగదుఃఖమును
నీవును బొందుట నిక్కమూఁ గాక !"
ఇటు నారదుఁడు శపియించె శ్రీహరిని.

హరిమాయావిముక్తి, నారదపశ్చాత్తాపము

సంతోషమునను దచ్ఛాపవాక్యమును
శిరమున ధరియించి, శ్రీరమానాథుఁ
డాకృపాళువు హరి యమ్మునీశ్వరుని
బహువిధానంబులఁ బ్రార్థనఁ జేసి
ఘనబలాకర్షణాకలిత మై నట్టి
తనమాయఁ దొలఁగించెఁ దాపసిపైన.
హరి మాయఁదొలఁగించినంతనే యచట
రమ యదృశ్యం బయ్యె, రాపుత్రి లేదు.
అతిభీతచిత్తుఁ డై యామునియంత
హరిపాదములఁ బట్టి యనియె నీరీతి:
"ప్రణతార్తిహరణ! మాం పాహి మాం పాహి!
స్వామీ! దయాళు! నా శాపం బసత్య
మగుఁగాక"- యని పల్క- "అది నాదువాంఛ-"
అని పల్కె- దీనదయాళుఁ డాశౌరి.
"అనరానిపలుకుల నంటిని నిన్ను,
ఈపాపములఁబాయు టేరీతి నాథ?"
అని పరితాపంబు నందె నారదుఁడు.
అన విని శ్రీహరి యనియె నీపగిది
"అరిగియు నూఱుపర్యాయంబు లీవు
శంకరనామంబు జపియించుకొనుము.
సత్వరంబుగ నీకు శాంతి లభించు.
హరసమానుం డగునాత్మప్రియుండు
నా కెవ్వఁడున్ లేఁడు నారదా! దీని
భ్రమ నైన మఱువకు భావమం దెపుడు.
శ్రీశివానుగ్రహసిద్ధి లేకుండ
విమలమద్భక్తి లభింప దేనాఁడు.
దీనిని మతిలోన స్థిరముగా నిలిపి,
సంచరింపుము నీవు సకలవిశ్వమున-
ఇఁక మాయ నిను స్పృశియింపఁ బో దెపుడు."
ఇటుల నోదార్చి మునీశు నారదుని
దనుజారి శౌరి యంతర్ధాన మొందె.
శ్రీరామకీర్తనఁ జేయుచున్ భక్తి
సత్యలోకమునకుఁ జనియె నారదుఁడు.
విగతమోహుం డయి వెడలుచున్నట్టి
మునినారదునిఁగాంచి పురహారభటులు
పరమసంతోషసంభరితాత్మ లైరి.
వా రంతఁ గడు భయపడుచు స్వాంతమున
నారదమునిపాదనలినముల్ పట్టి
అత్యార్తులై యిట్టు లనిరి, "మునీంద్ర!
కామారిభటులము; కాము విప్రులము.
చండాపరాధంబు సలిపియు మేము
భూరితత్ఫలమును బొందితి మిపుడు.
ఓకృపాళూ! శాప ముడుపుము కరుణ."
అనఁగ నా దీనదయాపరుం డయిన
శ్రీనారదర్షి వచించె నీరీతి:
"ఉభయులు పోయి, మీ రుర్వీస్థలమునఁ
బుట్టుఁడీ రాక్షసపుంగవు లగుచు.
ప్రబలవైభవమహాబలము, తేజమును
గలిగి మీ రిర్వురు క్రాలఁగాఁగలరు;
భుజబలంబున మీరు భువనముల్ గెలువ,
నరరూపమును దాల్చు నారాయణుండు.
హరిచేత రణరంగమందునఁగూలి
ముక్తిఁగాంతురు, మీరు పుట్టరు తిరిగి."
నారదాంఘ్రుల వందనం బొనరించి
రుద్రునిభటు లిద్దఱును నిర్గమించి
కాలాంతరమున రాక్షసవీరు లౌచు
జన్మ మొందిరి ధరాచక్రంబులోన.
ఒక కల్పమునఁ బురుషోత్తముఁ డవని
నరుఁ డౌట కిది కారణంబుగా నుండె.
సురరంజనంబును, సుజనరక్షణము,
క్ష్మాభారహరణ మామాధవవ్రతము.
హరి తాల్చి యిట్లనేకావతారముల

సుందరాద్భుతమహాసుఖదలీలలను
బహుళంబుగా సల్పెఁ బర్వతతనయ!
ప్రతికల్పమందునఁబరమాత్మ పుట్టి
రమణీయవివిధకార్యంబు లొనర్చు.
ప్రతికాలమున మునీశ్వరులు తత్కథలఁ
బరమప్రపూతప్రబంధరూపముల
గానంబుఁగావించి కడు ధన్యులైరి.
తన్మహాద్భుతవివిధప్రసంగముల
విని, బుద్ధిశాలులు వింతను గనరు.
ఆయనంతుం డగు హరిచందముగనె
హరికథావళియు ననంతమే సుమ్ము.
పరిపరివిధములఁ బండితు లవ్వి
పాడియు వినియు సంబరపడుచుందు
రారామచంద్రుదివ్యాద్భుతకథల
సంపూర్ణ ముగఁ బాడ సరిపోవుచుండుఁ
గనఁగఁ గోట్లకొలంది కల్పంబులైన-
జ్ఞాను లౌమునులనుసైత మోహోహో!
పురుషోత్తమునిమాయ మోహింపఁజేయు
నని తెల్ప నీ యుపాఖ్యానంబు నేను
నీకుఁ జెప్పితి భవానీ! గిరితనయ!
లక్ష్మీవిభుండు లీలావినోదుండు,
ప్రణతహితుండు, సేవాసులభుండు,
నఖిలసంతాపాపహారి, యాశౌరి.
సురనరమునులకు జూడ నందఁజాని
ఆహరిప్రబలమాయ జయింపఁగలుగు
నిది చిత్తమందు గ్రహించియు సర్వ,
లామహామాయకు నధిపతి యైన
నారాయణుని భజనము సేయవలెను.
అజుఁడును, నిర్గుణుం, డలరూపరహితుఁ
డైన బ్రహ్మము కోసలాధీశ్వరుఁడుగఁ
బుట్టినకారణంబును మఱియొకటి
శ్రవణం బొనర్పుమా శైలకుమారి!

ఆమహాచిత్రకథార్థజాలముల
విస్తరించుచునుంటి వినుము సంప్రీతి.
తాపసవేషంబు దా ధరియించి
యనుజునితోడ మహారణ్యమందుఁ
దిరుగుచున్నట్టి యేదివ్యుని మున్ను
కన్నులారఁగ నీవు కాంచఁగల్గితివో
నీపు సతీరూపిణివిగ నున్నప్పు
డెవరిచర్యకు భ్రమియింప నిప్పటికి
నాభ్రమచ్ఛాయ నిన్ననుగమించెడిదో?
ఆరామచంద్రమహాచరిత్రమును
వినుము భవాని! నీ విభ్రాంతి వ్రీలు.
ఆయవతారమునందుఁ గేశవుఁడు
చేసినలీలావిశేషంబు లేను
సకియ! వచింతును శక్తికొలంది"—
అనుశంకరునివాక్కు లాలించినంత
ఓభరద్వాజబుష్యోత్తమా! గౌరి
వికసితానన యగుచుఁ బ్రేమ పొంగార
వెలిఁ గ్రక్కుఁ జిఱునవ్వు వెన్నెలకాంతి.
ఆవృషకేతనుం డగుసాంబశివుఁడు
శ్రీహరి యవతరించినకారణంబు
ప్రవచింప సాఁగె నీపగిది మునీంద్ర!
కలిమలహరణదక్షుం బైనయట్టి
మంగళకర మతిమంజులం బైన
శ్రీరామకథను నచింతును వినుము
సావధానుండవై సంయమివర్య!

శ్రీస్వాయంభువమనురాజర్షిచరిత్రము

మహిని స్వాయంభువమనుచక్రవర్తి
యతనిసతీమణి యగుశతరూప
ప్రజలయం డెల్లను బ్రథమదంపతులు
నఖిలసృష్టిని వార లసమాను లెన్నఁ
దద్దంపతులమహాధర్మశీలంబు

లహ! యమోఘుంబు లత్యంతదివ్యములు.
వారల నైతికభవ్యలక్ష్యములఁ
గీర్తించు నెప్పటికిని వేదచయము.
శ్రీమనుచక్రవర్తికిఁ బ్రియపుత్రుఁ
డుత్తానపాదమహీపాలకుఁడై
డాతనిపుత్రుఁడే హరిభక్తుఁడైన
ధ్రువకుమారుఁడు మహాద్భుతచరిత్రుండు.
శ్రీమనువల్లభ రెండవతనయుఁ
డల ప్రియవ్రతనాముఁ డామహితాత్ము
వేదపురాణముల్ వినుతించుచుండు.
ఆమనువున కొక్క యాత్మజ కలదు
దేవహూతి యనంగ దివ్యనామమున.
ఆమె కర్దమముని కర్ధాంగి యయ్యె-
నాసతీమణిగర్భమందు ధరించె
నఖిలసమర్థుండు, నాదిదేవుండు,
ఘనకృపాళుం డగుకపిలు, మహాత్ము;
ఆదీనవత్సలుఁ డాభగవంతుఁ
డగుకపిలుండు సాంఖ్యముఁ బ్రకటించెఁ
దత్త్వవిచారవైదగ్ధ్యంబు వెలుఁగ.
ఆమనుభూపతి యఖిలవిధాల
సర్వేశ్వరాజ్ఞానుసారము, ధరణిఁ
బరిపాలనముసేసె బహుకాల మనఘ!
"నరు దశలందున నాల్గవదైన
ముదుసలితనమును బొందియున్నాఁడ,
నింకను గృహమునందే పాదుకొంటి.
విషయవిరాగంబు, వీక్షింప నాకు
నమరలే దిప్పటి కైనఁ జిత్తమున—"
ననుచు విచారించె నాత్మలో మనువు.
ఈశ్వరభక్తివిహీనమై ధరణిఁ
దనజీవితంబు వృథా యయ్యె ననుచు
నామహారాజు మహాకులుం డయ్యె.
ఆత్మపుత్రునకు రాజ్యంబు నొసంగి
భార్యాసమేతుఁడై పార్థివోత్తముఁడు
వనమున కేగెను వైరాగ్య మెప్ప.
నఖిలతీర్థంబుల నగ్రగణ్యంబు,
నమితపుణ్యము, నైమిశారణ్య మెన్న
సాధకజనులకు సంసిద్ధిదంబు.
ఘనమునీశ్వరసిద్ధగణము లచ్చటను
వసియించుచుండును బాయక యెప్పు
డాకారణమున మహారాజు మనువు
నైమిశారణ్యమునకుఁ బయనించె.
ఆపుణ్యదంపతు లతిధీరు లగుచు,
భూరిభక్తిజ్ఞానములు రూపు గన్న
గతి నేగుచుండిరి గహనమార్గముల
చని చని వార లాచందంబుగాను
దివ్యమౌ గోమతీతీరంబుఁ జేరి
తన్నదీనిర్మలోదకములలోన
స్నానంబుఁ జేసిరి సంతోషపడుచు.
సుజ్ఞాను లగుమునీశులు, సిద్ధజనులు,
రాజర్షి ధర్మధురంధరుం డనుచుఁ
జూడ వచ్చిరి మనుక్ష్మోణీ ద్రమణిని.
ఆదంపతులను మహర్షిగణంబు
లచ్చటచ్చటఁ గలయఖిలతీర్థముల
సుందరస్థలములఁ జూపించుకొఱకుఁ
దోడ్కొని చనిరి యెంతో యాదరమున.
శుష్కించె వారల సుందరాంగములు.
వారు ధరించియు వల్కలంబులను
మునిసంఘమున నిత్యమును జేరుకొనియు
వివిధపురాణముల్ వినిరి మునీంద్ర!
తదుపరి వారలు తత్కాననమున
వాసుదేవునిపాదపంకజంబులను
సంధించి హృదయాంబుజంబున భక్తి
మతి ద్వాదశాక్షరీమంత్రరాజమును
జపము సేసిరి సునిశ్చలనిష్ఠతోడ.

కందమూలముల భక్షణచేసికొనుచు
నాసచ్చిదానంద మగుపరబ్రహ్మ
మును భక్తితో ధ్యానమును జేసి రనఘ!
తదుపరి వారలు తత్కందమూల
ఫలములనైతము వదలి యూపిదప
నహ! కేవలాంబుపానాధారు లగుచు
శ్రీహరిప్రీతికై చేసిరి తపము.
"అగుణుం, డఖండుఁ, డనంతుం, డనాది
యై యెవ్వఁ డెప్పుడు నెసఁగుచు నుండుఁ,
బరమాత్మవాఁ డెవ్వానిని ధ్యానింత్రు,
'నేతి నేతి' యటంచు నిగమగణంబు
లెవ్వానిమహిమంబు లెపుడుఁ గీర్తించు,
నెవఁడు నిజానందుఁ, డెవ్వండు తనరు
నిరుపాధికుఁడును, నిరుపముఁ డగుచుఁ,
దగ నిజైకాంశమాత్రంబున నెవ్వఁ
డగణితవిధివిష్ణుహరుల సృజించు,
నాపరబ్రహ్మంబు నరయు టేనాఁడు?"
అనుచు వారలు డెందమందున నిత్య
మఖిలషింపఁగసాఁగి రతితీవ్రముగను.
"ఆపరబ్రహ్మ మయ్యాశ్రితభక్త
పరతంత్రుఁ డౌటచే వారలకొఱకు
లీలార్థతనువు దాల్చియును గీర్తించు—
ననువేదవాక్యంబు లగునేని నిజము
స్వీయ మానభిలాష సిద్ధించు"ననుచు
షట్సహస్రాబ్దముల్ జలముల నొనియు,
సప్తసహస్రవర్షంబులు వాయు-
భక్షణచేసిరి వా రిద్ద ఱనఘ!
దశసహస్రాబ్దముల్ తదాయువేనిఁ
గైకొనకే యొంటికాలిపై నిలిచి
సలిపిరి వారు ప్రచండతపంబు.
ఆయపారతపంబు నరసి విరించి
హరిహరులే పలుసారు లట కేగుదెంచి
"వరము కోరు మటంచు" పలు తెఱంగులను
భ్రమపెట్టఁజూచి రారాజర్షిమణిని.
కాని యాదంపతుల్ కడు ధీరు లగుచుఁ
జలియింపకే తపశ్చర్యలో నుండి;
రస్థిమాత్రశరీరు లైనను వారి
హృదిలోనఁ జింత యొక్కింతయు లేదు.
సర్వజ్ఞుఁ డైనయాసర్వేశ్వరుండు
"తాపసు లైన తద్రాజదంపతులు
నిజపదదాసులు, నిశ్చలచిత్తు,
లహ! యనన్యశరణ్యు" లనియు గ్రహించె.
ఆకసమందుండి యాసమయమునఁ
బరమగంభీరకృపాయుతవాణి
"కోరుమా వరమును, గోరుమా వరము"
అని విన వచ్చె నత్యద్భుతలీల.
మృతుల కేనియుఁ బునర్జీవం బొసంగు
నట్టుల మధురమై యావాణి యుండె.
శ్రవణరంధ్రముల నాశబ్దంబు సొచ్చి
వారలహృదయగర్భంబునఁ జేరెఁ;
దత్క్షణంబున వారితనువులు వెలిఁగెఁ
దతహృష్టపుష్టసుందరములు నగుచు
నిప్పుడే వచ్చిరా యిలు వీడి యనఁగ.
శ్రవణంబులకు సుధాసమ మైన యట్టి
యాదివ్యవాక్యంబు లాలించినంత
నా రాజమిథునపుణ్యాంగఁబు లెల్లఁ
బులకప్రకంపితంబులుగా వెలింగె.
మనువు సాష్టాంగనమస్కృతుల్ సలిపి
భక్తిసముద్రిక్తభావుఁడై యిట్లు
ప్రార్థించె నాభగవంతు నత్తఱిని:
"వినుము నాప్రార్థన విశ్వాధినాథ!
ఓభక్తసురతరూ! ఓ నిజపాద-
సేవకసురగవీ! శ్రీవిధివిష్ణు-
భవవందితామలపదపద్మరేణు!

సకలచరాచరేశ్వర! సర్వసుఖద!
ప్రణతా ర్తపాల! సేవాకార్యసులభ!
ఓ యనాథశరణ్య! ఓ దేవదేవ!
ఈశ్వరా! మాయెడఁ గృప గలదేని
ఈవరం బొసఁగుమా యిపుడు సర్వేశ!
ఏరూప మాశివు హృది వెలుఁగొందు,
నెద్దాని మానీంద్రు లీక్షించుచుందు,
రేదివ్య మగురూప మెపుడు 'భుశుండి'
మానససత్సరోమధ్యమునందు
పరమహంసగను సంభాసించుచుండు,
వినుతించు దేనిని వేదచయంబు–
గుణయుతంబుగను, నిర్గుణముగా నిరత,
మాదివ్యరూపు మాయఱుల కిపుడు
కనుపింపఁ జేయుము కరుణవహించి.
ప్రణతా ర్తిమోచనా! పాహి! మాం పాహి!"

నృపదంపతులు పల్కు– మృదులవినీత
భ క్తిరసప్లుతభవ్యవాక్యములు
భగవంతునకుఁ గూర్చెఁ బరమప్రియంబు.
పరమకృపానిధి భ క్తవత్సలుఁడు
వాసుదేవుఁడు భగవంతుఁ డీశ్వరుఁడు
వారికి ట్లెదుటను ప్రత్యక్ష మయ్యె.
నీలసరోరుహనీలమాణిక్య
నీలనీరదసాంద్రనీల దేహుండు,
స్వీయసౌందర్యలజ్జితకోటికోటి–
బహువిధాలంకృతపంచ బాణుండు,
ఘనశరత్కా–లరాకాచంద్రబింబ–
సమమహాసౌందర్యసదనాననుండు
చారుకపోలలసచ్చుబుకుండు,
ప్రథితశంఖోపమరమణీయకంఠుఁ,
డరుణాధరుండు, మహోక్షనీయ–
రదనసునాసికారాజమానుండు,
నమలేందుకిరణప్రహాసభాసురుఁడు,

నిర్మలనవఫుల్లనీరజాతుండు,
సకలమనోహరచారువీక్షణుఁడు,
విదితమన్మథచాపభృకుటీతటుండు,
తిలకరేఖాసముద్దీప్తఫాలుండు
మకరకుండలభాసమానకర్ణుండు,
మణిమయుమకుటాతిమహితశీర్షుండు
కోమలాళిసమానకుటిలకుంతలుఁడు,
శ్రీవత్సకౌస్తుభశృంగారరుచిర
వనమాలికాశోభివక్షఃస్థలుండు,
మణిహారభూషణమండితగ్రీవుఁ,
డతిరమ్యపరిపుష్టహరికంధరుండు,
సుందరభవ్యయజ్ఞోపవీతుండు,
భద్రేభవరతుండ బాహుదండుండు,
కంకణ కేయూరకలితభుజుండు,
కటితటశోభితఘుననిషంగుండు,
దారుణ బాణకోదండహస్తుండు,
విజితవిద్యుల్ల తావిభవప్రకాశ
విమలమనోహరపీతాంబరుండు,
నుజ్జ్వలత్రివళీయుతోదరస్థలుఁడు,
వరయమునాజలావ ర్తసౌందర్య
హరమనోహరనాభుఁ డసమతేజుండు,
మునిచి త్తమధుపసమ్మోహనాత్యంత
పావనరమణీయపాదాంబుజుండు,
రామచంద్రుఁడు శౌరి ప్రత్యక్షమయ్యె.
వరదుఁడౌ రామునివామభాగమున
భ ర్తనుకూల, శోభావారిరాశి,
యాజగన్మోహనమా నయ్యాదిశ క్తి
సీతామహా దేవి చెలువొందుచుండె.
రామునివామపార్శ్వంబున వెలుఁగు
నాసీతయొక్క దివ్యాంశంబునుండి
యఖిలసద్గుణనిధు లొచు వెలుంగు
బహుళలక్ష్మీశివాభారతీసాధ్వ

లవతరించుచు నుండు రగణితంబుగను.
లలితమా భ్రుకుటీవిలాసమాత్రమున
జగతీత్రయంబును జన్మింపఁ జేయు
సౌందర్యరసమహాసాగరం బైన
శ్రీహరిమంగళాకృతి, శతరూప-
మనుమహారాజులు మహితసంప్రీతిఁ
గనుఁగొప్ప వాల్పక కనసాఁగి రపుడు.
ఆయనుపమరూప మమితాదరమున
నెంత చూచినను సంతృప్తివారలకుఁ
గలుగక పోయె హృత్కంజంబులందు;
నానందపారవశ్యంబున వారు
తనువుల మఱచియు ధాత్రిపై వ్రాలి
సాష్టాంగపడి హరిచరణాబ్జములను
గట్టిగాఁ బట్టిరి కరకంజములను.
ఆదయావనధి శ్రీహరి హృషీకేశుఁ
డంతట వారిశీర్షాగ్రభాగములఁ
దనకరాంబుజమునఁ దాఁకి వత్సలత
వారలఁ బైకి లేవఁగ నెత్తె నోహో!
అప్పు డాకరుణాబ్ధి యనియె నీరీతి:
"మీ తపోనిష్ఠకు మెచ్చితి నేను;
నా మహాదానగుణంబు గ్రహించి
యడుగుడు మీ కిష్ట మైనవరంబు."
ప్రభువాక్కులను విని పార్థివోత్తముఁడు,
హృదయాంతరంబున ధృతిఁ గూర్చికొనియుఁ
బాణిపల్లవముల భక్తి జోడించి
మృదువచనంబుల నీరీతిఁ బలికెఁ:
"నాథ! నీ శుభపాదనలినముల్ గంటి,
నస్మదభీష్టంబు లన్ని ఫలించె
నైనను నొక వాంఛ యాత్మలోఁ దనరు—
నది సుగమంబును, నగమము నాథ!
అందుకే వచియింప ననుమానపడెద.
అది ప్రసాదింప నీ కతిసుగమంబె,
యైన నీయల్పున కది యగమంబు
పరమదరిద్రుఁ డేపగిదిగాఁ దాను
గల్పవృక్షంబును గాంచియు దాని
ఘనశక్తి నెఱుఁగనికారణంబునఁ నె
యమితధనంబును నడుగ శంకించు,
ఆరీతి నాహృదయంబు శంకించు
నఖిలాంతరాత్మలయం దున్ననీకు
నా వాంఛ తెలియదా నాథా! ముకుంద!
దేవ! నా వాంఛను దీర్పఁ బ్రార్థింతు"—
నన విని హరి యిట్లు లనియె, "ఓరాజ!
సంశయంబును వీడి స్వాంతంబులోన,
నడుగుము నీ యిష్ట మైనవరంబు.
నీ కిచ్యురానిది నృప! లేదు, లేదు."
అన విని మను విట్టు లనె హరితోడ:
"దాతృశిరోమణీ! త్రాతా! కృపాబ్ధి!
నాథ! నా కోర్కి విన్నప మొనరింతు:
నినుఁబోలుపుత్రుని నేను వాంఛింతు.
నే నేది దాఁచెద నీ యొద్ద నాథ!"
అతనిప్రీతిని జూచి, యతనియమూల్య
వాక్యముల్ విని, కృపావనధి యిట్లనియె—
"అట్లుతే యగుఁగాక! అవనీంద్రమౌళి!
నాతోఁ సమానుండు నా కెట దొరకు?
నీకుఁ బుత్రుండను నేనె కాఁగలను."
అని పల్కి, యంత నారాయణప్రభువు,
ముకుళితహస్త యై ముందు నిల్చున్న
శతరూప నరసి, యాచందానఁ బలికెఁ:
"దేవి! ఓశతరూప! ధృతగుణరాశి!
అడుగుము నీ యిష్ట మైనవరంబు."
అన విని శతరూప యనియె నీపగిది:
"ఓకృపాసాగరా! ఓ జగన్నాథ!
ఇప్పుడు చతురుఁడౌ నృపతి యేవరము
కోరెనో, యది నాకుఁ గూడఁ బ్రియంబు.

ప్రభు! అది వాంఛింప రానివరంబె
ఐనను, భ క్తహితా! నీవు దాని
సదయుండ వౌచుఁ బ్రసాదించినావు.
సారసభవముఖ్యజనకుండ వీవె,
అఖిలజగంబుల నధివసియించు
బ్రహ్మంబ వల జగత్స్వామివి నీవె
యనియు నే సంశయం బందుచునుంటిఁ—
గాని నీ వచనముల్ కల్లగా వెప్పు
డాశ్రితభ క్తగమ్యస్థాన! నాథ!
భక్తానుభూతదివ్యానందరూప!
ఆనిత్యసుఖమును, ఆమహాగతిని
ఆమహాభ క్తిని, ఆభవదీయ
పాదాంబుజద్వయపరమానుర క్తి
నావిచేకవిభూతి, నామహాస్థితిని
దేవదేవా! ప్రసాదింపవే నాకు."
శ్రీశతరూప వచించినయట్టి
తన్మృదుగూఢసుందరవరవాక్కు—
లాలించి యాకరుణాబ్ధి కేశవుఁడు
మృదువచనంబుల నీరీతిఁ బలికెఁ:
"నీవు నీ మనములో నెంచిన దెల్ల
నే నొసంగితి జననీ! శతరూప!
ఈ వింక మది సంశయింపఁగా వలదు.
అమ్మ! మదీయదివ్యానుగ్రహమున
నీ యలౌకిక మైననిర్మలజ్ఞాన
మెప్పుడు వెలుఁగు, లయింపక మాత!"
అంతట మనువు నారాయణాంఘ్రులకు
వందనం బొనరించి పలికె నీరీతి:
"ఇంకొక్క వినతి, లోకేశ! నేఁజేతు
నొకనికిఁ దనతనయునియందుఁ బోలె
నీ పదరతి నాకు నిలుచునుగాక.
ఎవఁడైన నాథ! లోకేశ్వరా! నన్నుఁ,
గడు మూఢుఁడని పిల్చుఁగాక! చింతిలను.
మణి లేక సర్పంబు మననిచందమునఁ
జేఁప నీటిని వీడి జీవింపనట్లు
నా జీవితంబును నాథ! నీ పైన
నాధారపడుఁగాక! యనవతరంబు."
అని వరం బడిగియు నామనురాజు
పట్టుకొనెన్ ప్రభుపాదపద్మముల
నంత గృపానిధి హరి యిట్లు లనియె;
"అట్టులే యగుఁగాక! అవనీశ! యిప్పు
డస్మదాజ్ఞను శిరమందు ధరించి
యింద్రలోకంబున కేగియు నిలుఁడు.
ఆయింద్రలోకమునం దీవు నిలిచి
యమితసుఖంబుల ననుభవించియును
గొంతకాలమునకుఁ గోసలేశుఁడుగ
జన్మింపఁగలిగె, దో జనక! నే నపుడు
నీకుఁ బుత్రుఁడుగ జన్మింపఁగాఁ గలను.
జగతి మదిచ్ఛానుసారము నేను
నరరూపమును దాల్చి, నరనాథ! నీదు
గృహమునందున నుదయింపఁగా నుంటి.
నఖిలాంశయుతముగా, న ట్లుదయించి
భ క్తసుఖప్రద భవ్యలీలలను
నిర్వహించెదను క్షోణీరంగమందు.
ఆమహాలీలల సాదరబుద్ధి
వినినధన్యులు భవాబ్ధిని దాఁటఁ గలరు
మమతామదత్యక్తమానసు లగుచు.
ఈవిశ్వ మెల్ల సృజించు నాయొక్క—
యాదిశక్తియె సుమా, అనఘ! యీ మాయ;
ఈమె సైతము జనియించు భూస్థలిని.
నీ వాంఛ నీరీతి నెఱవేర్పఁ జూతు—
నీ నా ప్రతిజ్ఞ భూమీశవతంస!
సత్యము! సత్యము! సత్య" మటంచుఁ
బలికియు మఱిమఱి, పరమకృపాబ్ధి
శ్రీభగవానుఁ డదృశ్యుఁడై పోయె.

భక్తవత్సలుఁ డైనపరమేశుదివ్య తనువుల నటఁ బరిత్యాగంబుఁ జేసి
మంగళాకారంబు మదిలోన నిలిపి, యమరావతినిఁ జేరి రందు వసింప.
యాదంపతులు నైమిశాశ్రమంబందు ఈమహనీయపుణ్యేతిహాసంబు
మతికొంతకాలము మనియు శాంతముగ, వృషకేతనుఁడు వచియించెఁ బార్వతికి.
నవసానకాలంబె యరుదెంచినంతఁ రామావతారకారణము నింకొకటి
గడు ననాయాసముగా వారు స్వీయ ఓ భరద్వాజబుష్యోత్తమా! వినుము.

శ్రీరామచరితమానసము

బాలకాండము

పంచమవిశ్రామము

చంచలభీషణకేసర
సంచయసంచలితదైత్యచక్రాఁ చక్రో
దంచితశంఖగదాధరఁ
పంచాననానాదఁ మట్టపల్లి నృసింహాఁ

ప్రతాపభానుచరిత్రము

పార్వతీదేవితోఁ బరమేశ్వరుండు
ప్రవచించినట్టి పురాణప్రపూత
కమనీయచరిత మాకర్ణింపు మనఘు!
ఓ భరద్వాజబుష్యోత్తమా! యిపుడు
విశ్వవిఖ్యాతి నుర్వీస్థలమందు
దీపించుఁ గేకయదేశంబు, తొల్లి
సత్యకేతుం డనుక్ష్మానాయకుండు
బాగుగా నాభూమిఁ బాలించుచుండె-
ధర్మధురంధరత్వంబును గలిగి
నీతినిధానుండు, నిస్తులశీల
శౌర్యతేజోబలశాలియై మించి.
సర్వగుణాకరుల్ సమరాతిధీరు
లైనయిర్వ్వురు పుత్రు లతనికిఁ గలరు.
అందు జ్యేష్ఠుఁడు ప్రతాపార్కాభిధుండు,
అరిమర్దనాహ్వాయుం డల చిన్నవాఁడు.
నిస్తులభుజబలనిధియు సంగ్రామ
సుస్థిరుం డారాజసుతుఁడు మునీంద్ర!
ఆ యన్నదమ్ము లత్యైకమత్యమున
నిర్దుష్ట మగుప్రీతి నెగడుచుండెదరు.
తనజ్యేష్ఠసుతుఁడౌ ప్రతాపభానునకుఁ
బట్టంబుఁగట్టియుఁ బార్థివోత్తముఁడు
హరిని గొల్వ్ఁగ నరణ్యంబున కరిగె.
తా గద్దె నెక్కఁ బ్రతాపభానుండు
ఈవార్త దేశమం దెల్ల మూలలను
ప్రకటింపగాఁ బడెఁ బ్రథితపద్ధతిని.
ఆతఁడు వేదధర్మానుసారముగఁ
బాలించెఁ బ్రజలను బరమానురక్తి-
ఆతనిపుణ్యరాజ్యంబునం దప్పు
డఘులేశమేనియు నగపడ దయ్యె.
అల ధర్మరుచినాముఁ డాతనిమంత్రి,
యిం కొక శుక్రుఁడే, పృథుబుద్ధిశాలి,
రాజభక్తిని గల్గి రాజిల్లుచుండు.
మహితవివేకి యీ మంత్రితోఁ గూడి,
తతబలశాలి యీతమ్మునితోడ
ధాత్రీశుఁ డైనప్రతాపభానుండు
తను వొంది నట్టి ప్రతాపమేయనఁగ
బుంజీభవించినభూరిసంగ్రామ
ధీరత్వ మనఁగఁ బ్రదీపించుచుండె.
బహుళాతిచతురంగబలయుతుం డాతఁ
డాతనిసేనలో నగణనీయముగ
యుద్ధనిర్భయు లగుయోధులు గలరు
తనసేన గని ప్రముదం బొందె రాజు.

జృంభించె విజయభేరీనినాదములు.
అఖిలభూదిగ్విజయం బొనరింపఁ
జండసైన్యంబుల సమకూర్చి, వెడలె
నొక మంచి దినమున నుర్వీధవుండు
రణభేరు లలమహోగ్రంబుగా మ్రోయ.
ఇట నట జరిగె ననేకాహవంబు
లఖిలభూపతులు పాదాక్రాంతు లైరి
ఘనప్రతాపార్కవిక్రమమున కోడి.
నిజభుజబలమున నృపమౌళిచంద్రుఁ
డేడుద్వీపముల జయించి యాపిదప
క్ష్మాధీశగణముచేఁ గప్పమ్ములు గొనియె.
సర్వానసుంధరాచక్రంబు నేలె
ఘనుఁడౌ ప్రతాపుఁ డేకచ్ఛత్రపతిగ.
ఇట్లానృపాలకుం డెల్లభూతలము
నిజభుజశక్తిచే నిర్జించి చేరెఁ
దనరాజధాని నుద్యద్వైభవమున.
అల చతుర్విధపురుషార్థార్జనంబు
సమయోచితంబుగా సలిపె నానృపతి.
ధర్మప్రభావప్రతాపభానుండు
పరిపాలనము సేయు వసుధాస్థలంబు
కామధేనువుగాఁ బ్రకాశింప సాఁగె;
సర్వదుఃఖముల విసర్జించి ప్రజలు
సుఖ మొంది; రెల్లరు సురుచిర ధర్మ
శీలము ల్గలిగి భాసించి రెంతయును.
ఆధర్మరుచిమంత్రి హరిపాదరతుఁడు
అవనీంద్రుహిత మెంచి యాయమాత్యుండు
నృపనీతి బోధించు నిస్తులప్రీతి
గురుసురసజ్జనక్ష్మోణీసురులను
బితృదేవతలను సేవించు సతంబు
తద్రాజమౌళి ప్రతాపభానుండు.
వేదశాస్త్రంబుల విధియింపఁ బడిన
విభుధర్మముల నెల్లఁ బ్రీతియు, ముదము

నిండఁగా నారాజు నెఱవేర్చె ననఘ!
ప్రతిదినం బాతఁడు బహుదానపటలి
నొనరించుచుండు మహోన్నతరీతి,
వేదశాస్త్రపురాణబృందముల్ వినును.
అఖిలతీర్థంబుల నాచక్రవర్తి
ప్రథితవాపీకూపవరతటాకములఁ
బ్రసవవాటికలను రమ్యోపవనుల,
బ్రాహ్మణగృహముల, బహుచిత్రశిల్ప
దేవాలయములఁ బ్రతిష్ఠించె ధరణి.
వేదశాస్త్రపురాణబృందంబులందుఁ
బృథ్వీతలేశుఁ డేయేయజ్ఞములను
జేయఁగా వలెనని చెప్పఁగాఁ బడియె
నాయజ్ఞముల నన్ని యానృపాలుండు
ఒక్కొక్కఁ డొనరించె నొకవేయిసారు
లైన, నాతనిలో ఫలాపేక్ష లేదు.
పరమసుజ్ఞానియుఁ బ్రథితవివేకి
తద్రాజమౌళి ప్రతాపభానుండు.
తనుమనోవాక్కులఁ దద్ధీరనృపతి
యేధర్మకృతి నిర్వహించిన న్గాని
యావాసుదేవున కర్పించుచుండు.
ఒకదినంబందు నాయుర్వీధవుండు
మృగయార్థ్యపరివారబృందంబుతోడ
నశ్వారాజంబుపై నాసీనుఁ డగుచు
భూరివింధ్యారణ్యభూములం జొచ్చి
బహుమృగగణములఁ బరిమార్పఁ దొడఁగె.
ఆకాన నట్లు వేఁటాడుచుండఁగను
గాంచెను నృపుఁ డొక ఘనవరాహమును.
రాజబింబమ్మును గ్రసియించుచున్న
రాహువు డాగె నరణ్యమం దనఁగఁ
గానఁగా వచ్చె నా ఘనవరాహంబు.
పోల్చఁ జంద్రుఁడు రాహుముఖమునకన్న
గడుఁ బెద్దయైనను గ్రౌర్యంబుచేత

వదలఁడు రాహువు వదనస్థశశిని.
అటులఁ బోల్చఁగ వచ్చు నావరాహోగ్ర
వదనగహ్వారదంష్ట్రిపంక్తులతీరు.
అద్దానిఘనతను వతిబలిష్ఠంబు;
అశ్వారింఖాధ్వని నది వినినంత
ఘోరతరంబుగా ఘుర్ఘురించుచును
రెండు చెవుల్ నిక్కఁరించి వీక్షించెఁ
జకితనేత్రంబుల; క్ష్మాపతి యంత
నీలాద్రిశిఖరసన్నిభభూరికిటిని
గనియు నశ్వమును వేగంబుగాఁ దోలె
"ఎటకుఁ బోయెదవు నీ వింకఁ జావకయె,
ఆగు మిదే కూల్తు" నని దానివైపు.
అధికాశ్వారావము నాలించినంత
వాయువేగమున నాపంది పర్వెత్త,
వెంటనే నరపతి వింట నారాచ
మెక్కఁడె; నంతట నీక్షించి ఘోణి
చెట్లచాటున నక్కఁ జిత్రంబు దోఁప
గుఱిఁ జూచి పలుమాఱు క్ష్మోణీధవుండు
విడిచెను బాణముల్ విక్రమం బొప్పఁ,
గాని వరాహము, కడుకౌశలమునఁ
దద్బాణముల నెల్లఁ దప్పించుకొనియె.
ఒకసారి దాగుచు నొకసారి యుఱికి,
చిక్కినట్లుగ నిల్చి, చిక్కక పాఱి
పఱుఁగిడుచుండె నా వనవరాహంబు.
వెన్నంటె దానిని విభుఁడు రోషమున
నారీతిఁ బఱుగెత్తి యావరాహంబు
తురగగజాదులు దూర రానట్టి
యతిసాంద్రమౌ నొక యడవిలోఁ జొచ్చె.
అడవిలో, నేకాకి యైనను గాని
పలు పరిశ్రమములఁ బడసినఁ గాని
వేటలోఁ దమకంబు విడఁడయ్యె రాజు.
ఆరాజు చూపించు నాపట్టుదలను
గనుఁగొని యాపంది కడు వేగ నొక్క-
యతిగభీరాద్రిగుహాస్థలిఁ జొచ్చెఁ
దక్కందరంబునఁ దాఁ బ్రవేశింప
దారి లేకుండుట ధారుణీధవుఁడు
చెండె నిరాశను జిత్తంబులోన;
అదిగాక రాజు మహారణ్యమందు
పాపము, సరి యైనపథమును దప్పె.
రాజును గుఱ్ఱి మరణ్యాంబులోనఁ
గడు డస్సి పోయి, యూఁకలిబాధచేత
దాహముచేఁ గడుఁ దల్లడం బంది
యేఱైనఁ జెఱువైన నెందేనిఁ గనఁగ
వెదకియు వెదకియు వేసారి రకట!
ఆవనిఁ దిరుగుచు నవనీశుఁ డటుల
నరసె నొకానొక యాశ్రమస్థలము.
ఆయాశ్రమంబున నధివసియించెఁ
గపటర్షి వేషి యా క్ష్మాపాలుఁ డొకఁడు.
ఆతనిరాజ్యంబు నంతయు మున్ను
ధాత్రీంద్రుఁ డైనప్రతాపభానుండు
ఆక్రమించుటచేత నారాజు పోఁ
దనసేనలను బరిత్యాగంబుఁ జేసి
పాఱిపోయెను భరద్వాజమునీంద్ర!
ధాత్రీంద్రుఁ డైనప్రతాపభానునకు
నది మంచికాలం బటంచును, దనకుఁ
జెడుకాల మనియును జిత్తమం దెఱిఁగి
యతిదుఃఖ మొందియు నాత్మలో నతఁడు
స్వీయగృహంబును జేర లజ్జించె.
అభిమానవశుఁ డౌచు నానృపాలుండు
తద్వీరుఁ డైనప్రతాపార్కుతోడ
సంధి నొనర్పఁగాఁ జాలక పోయె.
తనకోప మెల్లను దనఁడెందమందె
యణఁచియు, నాభూపుఁ డాకాననలోనఁ
దాపసిరూపంబు ధరియించుకొనియుఁ

గాఁపురం బుండె బికారిచందమున.
ఆతనిచెంతకే యాప్రతాపుండు
దారి తప్పుటఁ జేరెఁ దత్కాననమున.
ఆయేగుదెంచినయాగంతుకుండు
తనవైరి యైనప్రతాపభానుండె-
అని వెంటనే చిత్తమందు గ్రహించెఁ
గపటతాపసి యైనకౌశాలకుండు.
దప్పిచే డస్సి ప్రతాపభానుండు
పరిపంథిన్యపు, గుర్తుపట్టక పోయె;
ఆమంచివేషంబు నరసి ప్రతాపుఁ
డాతఁ డెవ్వండొ మహాముని యనుచుఁ
దలఁచి గుఱ్ఱము డిగ్గి దండంబు పెట్టె.
అతిచతురుం డగునాచక్రవర్తి
తనపేరు మాత్రము దాఁ దెల్పలేదు.
భూపతి దాహంబు పొందుటఁ గాంచి
కపటర్షి చూపెను గాసార మొకటి
దానిలో రాజును దత్తురంగంబు
సంతోషపడుచును స్నానంబు సలిపి
వ్రాగిరి కడుపారఁ దజ్జలంబులను.
శ్రమమెల్లఁ దీర నాసార్వభౌమునకుఁ
బ్రాణముల్ స్వస్థతఁ గనియె. నా పిదప
నాముని యానృపునాశ్రమంబునకు
మరలఁ దోడ్కొని పోయి మాన్యతతోడ
నది యస్తమయకాల మాటను గాంచి
యాసనం బొసఁగి యిట్లనె మృదులముగ;
"ఎవరు నీవు కుమార? ఎంతయో నీవు
తరుణుండ వమితసౌందర్యయుక్తుండ
వైనను బ్రాణభయంబును వీడి
యీకాననయందున నేకాకి వగుచు
సంచరించు టదేల? సచివ! నీయందు
ఘనసార్వభౌమలక్షణములఁ గాంచఁ
గఱఁగె నాచిత్తము కడుదయచేత."

"తాపసవర్య! ప్రతాపభానుండు
అనురాజు కలఁడు, నేనాన్యపాలునకు
మంత్రిని, వేఁటలో మార్గంబుఁ దప్పి
నా మహాదృష్టమున న్మహాభాగ!
చనుదెంచితిని భవత్సన్నిధి కేను.
మీ దర్శనము నాకు మిగులదుర్లభము.
భవదీయదర్శనభాగ్యంబుచేత
నేదోశుభము లభియింపఁగానుండె
నని తలంచుచునుంటి నాత్మ, మహాత్మ!"
అని రాజు పలుక ని ట్లనియె నామౌని:
"చీఁకటిపడినది, చేరఁగా నీదు
పట్టణం బుండె డెబ్బది యోజనముల
దవ్వునఁ గాన వత్సా! యేగ లేవు-
విను మిది ఘోరగంభీరమౌరాత్రి,
దట్ట మైనది కాన, దారియుఁ లేదు;
ఈరాత్రి విశ్రాంతి నిటఁ బొంది, జేపు
ప్రొద్దుననే నీవు పోవచ్చు సచివ!"
భవితవ్య మేదియో, పరఁగ నద్దాని
కనుకూలవిషయంబు లరుదెంచు ముందె.
విధి వచ్చి కలియు; నావిధము గాదేని
వానినే చేర్చు నాభవితవ్యమునకు.
"సరియె మంచిది మునీశా!" అని రాజు
మునియాజ్ఞ తనశిరమున ధరియించి,
గుహాముందు బంధించి గుఱ్ఱంబు నతఁడు
వచ్చి కూర్చుండెఁ దాపసిప్రముఖులఁ; నంత,
నృపుఁ డాకుయోగి ననేకరీతులను
బ్రస్తుతి సల్పి మదాభాగ్యం బటంచు
నతనిపాదంబుల కభివందనంబు
చేసి యీరీతి వచించె నత్యంత
మృదులప్రియోక్తులు మెఱయుచుండఁగను:
"తండ్రిఁగా నిన్ను నాథా! యెంచి నేను
దమతోడ భాషింప ధైర్య మూనితిని.

నీ కుమారునిగను నీ సేవకునిగ
న న్నెంచి యోమునినాయకా! నాకు,
భవదీయనామంబు బహుదయతోడ
వివరింపఁగా నిన్ను వేఁడుచున్నాఁడ."
నృపతి యామునిని గ్రహింప లేకున్న
నాతఁడు మాత్రము స్వాత్మలో నృపుని
బాగుగా గు ర్తించెఁ బరమమునీంద్ర!
నృపతియో పరిశుద్ధహృదయుండు, మౌని
యన్ననో బహుకపటాత్ముఁ డం దెన్నఁ
బగఁ బూనియున్నట్టి పరమశాత్రవుఁడు;
ఆపైన ఋత్రియుం; డాతనియందు
రాజర క్తముగదా ప్రవహించుచుంట!
అందుచే నెట్టైన నాతఁడు తనదు
గార్యంబు నెఱవేర్పఁగా నెంచె లోన
నల కుయు క్తిని బన్నియైనను సరియె.
రాజసౌఖ్యముల నరాతినృపుండు
తలఁచి చి త్తమున ఖేదంబును బొందె.
ఆవమునందలియగ్ని చందమున
నా శత్రునృపుహృదయాంతరాళమునఁ
బ్రజ్వరిల్లె నసూయ భగభగ మనుచు.
తత్పీతాపార్క-భూధవుసరళో క్తు
లాలించి యతనిపై నాత్మలోఁ గలుగు
వైరంబుఁ దలపోసి, భావంబులోనఁ
గడు సంతసించె నాకపటతపస్వి.
కపటకుయు క్తులు గలిగి గర్భమునఁ
బైకి మె త్తగ నున్నవాక్యంబు లొప్పఁ
బలికె నాముని యిట్లు పార్థివుతోడ:
"ఇల్లు వాఁకిలి ధనం బేమియు లేదు
కావున, నిపుడు, బికారి నా పేరు."
రా జిట్టు లనె, "మహారాజ! ఓ యనఘ!
నీ వంటి విజ్ఞాననిధు, లభిమాన
శూన్యు, లెన్నండును జూపక వెలికి
దాచుచుందురు నిజత త్త్వ మెల్ల పుడు;
సర్వవిధంబుల సామర్థ్య మున్న,
గోచిపాత ధరించుకొందురు వారు;
విబుధసంఘంబులు వేదజాలంబు
లందులకే గదా! ఆయకించనుల
శ్రీహరి మిక్కి-లి పే?మించు నంచు
ఘోషించుచున్నవి గొప్పగా ననఘ!
తలఁ దాచఁ గొంప, చేత న్గవ్వ లేక
వెలుఁగొందు మీవంటి భిక్షులన్ గనియె
సాగసభవభవుల్ సైతము లోన
'ఓహో! వీరలసౌఖ్య మున్నదా మనకు?'—
అని సంశయప్రపూర్ణాత్ము లౌచుందు?.
ఈ వెవ్వరైన నేమీ మహాభాగ!
నీ పాదయుగళికి నే మొ?క్కు-చుంటి.
స్వామి! నాపైఁ గృపాపరుఁడవు గమ్ము."
శ్లోనాయకునిసహజ పే?మఁ జూచి
వానివిశేషవిశ్వాసంబు నరసి,
యామునిభూపాలు నఖిలవిధాలఁ
గడు వశీభూతునిఁ గావించుకొనియు,
నధికానురాగమే యగపడునటులఁ
బలికె నీరీతిగాఁ బార్థివుతోడ:
"హృదయపూర్వకముగ నేఁ జెప్పుచుంటి
వినుము మహీశ! యీ విపినగర్భమున
బహుకాలమందుండి వసియించుచుంటి.
ఇప్పటివఱ కిట కెవరు రాైరి
యేనైనఁ గనిపించి యెఱుఁగ నెవ్వరికి.
తప మనుకానను దహియించునట్టి
యనలంబు లోకమాన్యత, మహారాజ!"
మూర్ఖులే కా దల బుద్ధిమంతులును
వీక్షించి పైపై సువేషంబు లార!
వంచింపఁ బడెదరు భ్రాంతాత్ము లగుచు.
పరమసుందర మైనబర్హిని గాంచుఁ;

డద్దానిపాటలో నమృతంబు చిందు—
నైనఁ బొమలు దానియాహార మనుచుఁ
బ్రవచించుచున్నాఁడు బొగుగాఁ దులసి.
కపటర్షి యీరీతిగాఁ బల్కసాఁగె:
"ఇందుకే నే నిట్టు లీపర్ణపంచమున
సలుపుచుంటిని రహస్యపుజీవనమ్ము.
ఈశుండుదప్ప నా కితరప్రయోజ
నం బేమి కలుగు? నా నారాయణుండు
ఆజగన్నాయకుఁ డంతయు నెఱుఁగు
నేఁ జెప్పకుండఁగనే ప్రియా! సచివ!
ఈప్రపంచక్రీడ నేమి సిద్ధించు?
సుమతివి నీ వతిశుచి వౌటచేత
నా కతిప్రియుఁడవై నావు చూడఁగనె.
నీకును నాయందు నిర్మలప్రీతి
విశ్వాస మొదవెను బ్రియతమా! వత్స!
నీకడ నేదైన నే దాఁచు నెడలఁ
బరమపాతివ్య మాపాదించు నాకు."
ఈరీతిఁ దాపసి యెంతెంత దాను
వైరాగ్యమును గూర్చి ప్రవచింప సాఁగె
నంతంత రాజున కాత్మలోఁ గలిగె
మునిపైన విశ్వాసము, మునివతంస!
త్రికరణశుద్ధి ధాత్రీపతి తనకు
వశుఁడయ్యె ననియు భావంబులో నెఱిఁగి
తద్బకధ్వానియా తపసి యిట్లనియె:
"ధర వీనిపే 'కేకతనువు' కుమార!"
అన విని నరనాథుఁ డాపయిఁ బలికె
శిరము వంచియు నమస్కృతిఁ జేసి మునికి:
"నీముఖ్యభృత్యుఁడ నే నని తెలిసి
దానియర్థంబును దయతోడ నాకుఁ
దెలుపఁగా మిగులఁ బ్రార్థించుచున్నాఁడ."
"సృష్ట్యాదిలో జనియించియున్నాఁడ
నప్పటినుండియు నన్యదేహంబు
నే నెప్పుడును ధరియింపకుండుటను—
నా 'కేకతను' వనునామంబు గలిగె—
వింత నొందకు మిది విని నీవు పుత్ర!
తపముచే సాధింపఁ దగని దే ముండు?
తపముచే జగతి విధాత సృష్టించుఁ
దపముచే హరి జగత్త్రాణంబు సేయు,
నాతపంబునఁ గసంహారంబు సేయు
జగముల నెల్లను సాంబశివుండు.
తపముచే నరుఁడు పొందంగ రానట్టి
దేదియు లేదహో! యీప్రపంచమున."
ఆమాటలను వినినంత భూవిభుఁడు
పరమానురాగసంభరితాత్మఁ డయ్యె.
ఆ సమయంబున నా కపటర్షి
కడుపురాతనపుణ్యకథల వచించెఁ
గర్మధర్మానేకఘనచరిత్రముల
విపులవై రాగ్యవివేకసంబంధ
విషయంబు లెన్నెన్నొ వివరించి చెప్పె.
విలయసృష్టిస్థితివిషయంబు లైన
యమితవిచిత్రకథావళు లెన్నో
యాపయి ముని చెప్పె నాన్నృపాలునకు.
ఈప్రసంగమ్ముల నెల్లను వినియు
భూపతి పూర్తిగా మునివలన్బడియుఁ,
దననిజనామ మాతనితోడఁ దెలిపె.
తదనంతరం బిట్లు తాపసి పలికె:
"ఈ వెవ్వరో నే గ్రహించితి మున్నె.
నృపమణీ! నాతోడనే యబద్ధంబు
పలికితి; వైనఁ గోపంబు నేఁ జెంద-
ఈ నీదుచర్యకు నే మెచ్చుచుంటి.
నృపస త్తమా! రాజనీతి యే మనఁగ
నన్ని కాలంబులయందున రాజు
తన పేరుఁ దెలుపఁగాఁ దగ దితరులకు.
నీ దగు ఘన రాజనీతిచాతుర్య

మరసి నీపైఁ బ్రీతి నందితి నిపుడు"
త్వన్నామ మధిప! ప్రతాపభానుండు
సత్యకేతునృపుండు జనకుండు నీకు.
గురుకటాక్షంబుచే క్ష్మోణీతలేంద్ర!
యెల్ల విషయముల నెఱుఁగుదు లోనఁ,
గాని నా కది మంచికాదని యెఱిఁగి
బహిరంగపఱుపను భావంబులోన
విదితమై యున్నట్టి విషయంబు లెల్ల.
కని, నీదుసహజనిష్కపటగుణంబుఁ,
బ్రీతి స్నిగ్ధతీతిని, నృపనీతిగరిమ-
నీపైనఁ గడుప్రేమ నే నొందినాఁడ.
అందుచే నేను నీ వడిగినంతట నె
నా కథ చెప్పితి నరనాథ! యిపుడు.
నేను ప్రసన్నుండ నీయెడ నైతి.
సంశయింపకుము రాజా! మనసార
నడుగుము నీ యిష్ట మైనకోరికను."
అన విని భూవిభుం డాహ్లాదపడుచు
నామునిపాదంబు లతిభక్తిఁ బట్టి
వివిధవిధంబుల వినయంబుఁ జూపి
యనియె నీ రీతిఁ, "గృపాబ్ధీ! మునీంద్ర!
భవదీయదర్శనభాగ్యమాత్రమున
నఖ చతుర్విధపురుషార్థముల్ నాకుఁ
గరగతంబయ్యెను, గాని నా ప్రభుఁడ
వింతగా నాపయిఁ గృపఁ జల్లుచుంట
నన్యదుస్సాధ మైనట్టివరంబు
ప్రార్థించి దుఃఖంబు పాయఁగాఁ గలను.
మచ్ఛరీరము జరామరణదుఃఖములఁ
బొందకుండును గాక!; పోర నన్నెవరు
గెలువకుందురుగాక!; కేవలం బేను
క్ష్మాతలం బెల్ల నేకచ్ఛత్రపతిగ
వందకల్పంబులు పాలింతుఁగాక!;
శత్రుహీనుండనై శాంతింతుఁగాక!"

పలికెఁ దాపసి యంతఁ బ్రభునితో నిటుల:
"అట్టులే యగుఁగాక యవనీశ! కాని,
యొక్క కష్టం బున్న దోవత్స! వినుము.
నీ పాదములముందు నిజము మృత్యువును
మోకరిల్లును, గాని భూపరిపాల!
బ్రాహ్మణజనముతో వచ్చును బాధ.
బ్రాహ్మణుల్ ఘనతపోబలదీప్తు లెపుడు
వారలకోప మవార్య మేరికిని.
క్ష్మాసురుల్ నీ వశంకరు లైనయెడల,
ఆబ్రహ్మహరిమహేశాదులుఁ గూడ
భవదీయవశు లౌచు వర్తింపఁగలరు.
బలమున లొంగరు బ్రాహ్మణు లెప్పు
డీసత్యమును జేతు లెత్తియు నేను
వచియించెదను, ధరాపాలక! వినుము.
విప్రశాపంబుఁ దప్పించుకొంటేని
నిఁక నీవు నిజముగా మృత్యుంజయుఁడవె!"
ఈమాటలను విని నృపుఁడు హర్షించి
పలికె నీపగిదిఁ దాపసిని వీక్షించి.
"ఓ నాథ! నాకు మృత్యువు కల్గఁబోదు-
త్పాదాబ్జమునఁ గృపాధామ! నాకు
సర్వదా కల్యాణసంతతి గలుగు."
అనఁ గపటర్షి "తథాస్తు"ని, లోనఁ
గుటిలభావంబున క్ష్మాధీశుతోడ
నీరీతిఁ బలికెను: "పృథ్వీశ! వినుము,
వనములో నీ విటు పథమునఁ దప్పటయు,
నీతోడ నిచ్చట నేఁ గలియుటయు,
నీవు చెప్పితివేని నెవరితోనైన
నాతప్పు నాది కా దని యెంచుకొనుము.
ఇంత ని న్వారించు నెందుల కనిన
నెవరితో నైన నీ వీవిషయంబు
చెప్పినచో గొప్పచేటు నీ కొదవు;
ఈప్రసంగం బెప్పుడేనిఁ గానిమ్ము

మూఁడవచెవియందుఁ బోయి చేరినదొ,
ఏను సత్యము వచియించుచున్నాఁడ
నిఁక నీకు నాశనమే తటస్థించు
నోయి ప్రతాపభానూ! వినుమిదియె-
ఈ రహస్యంబు నీ వెవరితో నైనఁ
దెలిపినన్, లేకున్న ద్విజుఁ డెవ్వఁడేని
శాపంబుఁ బెట్టినం జచ్చెద వీవు.
హరిహరు లేకమై యాగ్రహించినను
మతియొక రీతిగా మరణింప వీవు."
అన విని రా జిట్టు లనియె నంతటను
దపసిపాదములు హస్తంబులఁ బట్టి:
"నిజమే, మహాప్రభూ! నీ వన్నమాట.
విప్రుండు, గురువు, శపింప నెవ్వండు
రక్షింపఁ గలుగును బ్రవచింపు మనఘ!?
బ్రహ్మ శపియించినన్ వానిని గురువు
రక్షించుటకు సమర్థత గల్గియుండు
నింక నాగురు వాగ్రహించినయెడల
వానిని రక్షించువారలు లేరు.
నీ యుపదేశమున్ నేఁ దప్పినెడల
నేను నశింతు మునీంద్ర! కానిమ్ము.
అతిఘోరమైనట్టి యావిప్రశాప
భయ మొక్కటే నాదుభావంబుఁ గలఁచె.
బ్రాహ్మణుల్ నా కెట్లు వశ్యులై యుందు!?
రిదికూడ దయతోడ నెఱిఁగింపు మనఘ!
దీనదయాపరా! దేవ! నీ కన్న
నాప్తులు లేరు మహాత్మ! మాం పాహి!"
అన విని ముని యిట్టు లనియె, "నృపాల!
వినుము లోకంబున వివిధయత్నములు
కల వవి యన్నియుఁ గష్టసాధ్యమ్ము,
లదిగాక యవి సంశయములకు నెలవు-
లొక సులభోపాయ మున్నది, రాజ!
కాని యందును నొక కష్టంబు కలుగు-
నస్మదధీనమై యాయు క్కి యుండె.
ఈపట్టణమునకు నేను వచ్చుటకు
నవకాశ ముండ; దీయవనిలో నేను
పుట్టినదాదిగాఁ బోలే దెవారి
గృహమునకు న్మతి యేపురంబునకు.
నేను రానైతినా, నీకు ముప్పొదవు
నందుచే నేను నాయాత్మలో నిపుడు
సందిగ్ధదశ నుంటి క్ష్మాపరిపాల!"
నృపుఁ డడి యాలించి యీరీతిఁ బలికె
మృదువచనంబుల ఋషిని వీక్షించి:
"ఒకనీతి కలదు ప్రభూ! వేదములను-
ఘనులు, స్వల్పులపైనఁ గరుణఁ జూపెదరు.
పర్వతంబులు, శిరోభాగంబులందుఁ
దృణజాలములను వహించు సంతతము.
పెనుసముద్రం బల ఫేనంబుఁ దాల్చుఁ
దనతరంగోపరిస్థలమునం దెపుడు.
ధరణి, భూళికణాలఁ దాల్చు మూర్ధమున-"
అని నచించియు భూపుఁ డాకపటర్షి
పదములఁ బట్టి యాపగిదిగాఁ బలికె:
"స్వామి! నాపైఁ గటాక్షముఁ జూపవయ్య!
దీనదయాపర! దివ్యచిత్తుఁడవు,
సజ్జనుండవు గాన సరగ న న్గావ
నీక్లేశమును భరియింపఁగా వలయు."
పూర్తిగా వశుఁ డయ్యె భూమీశుఁడనుచు
గ్రహియించి లోన నాకపటప్రవీణుఁ
డైనతపస్వి యి ట్లనియె నాపిదప:
"సత్య మాడుచునుంటి క్ష్మానాథ! వినుము.
నాకు దుస్సాధ్య మైనది లేదు జగతి.
వాఙ్మనఃక్రియ లెల్లఁ బరికింప నీవు
మద్భక్తుఁ డవు గాన మానవనాథ!
నీ వాంఛ నెఱవేర్తు నిక్కంబుగాను.
యోగతపోమంత్రయుక్తిశక్తులను

గు ప్తంబుగా నుంచుకొన్ననే గాని
యవి పని చేయ వోయవనీశచంద్ర!
స్వయముగా నేను నీసౌధంబునందు
సర్వభోజ్యముల రుచ్యముగ వండెదను;
వడ్డింపవలయును వానిని నీవ.
ఒరులు న న్నర్తింపకుండఁగా వలయు;
నట్లైనచో - నెవ్వ రాపదార్థముల
భుజియింత్రు - వారు - సంపూర్ణంబుగాను
నీ వశవర్తులై నిలువఁగాఁ జూతు;
రదిగాక, ఆ తిన్నయట్టిబ్రాహ్మణుల
యిండ్లలోపలభుజియించువారలును
వశ్యు లౌదురు నీకుఁ బార్థివా! నిజము
వెళ్ళి యీపని నెఱవేర్పుమీ త్వరగ
నీవ్రతంబును బూను మేకవత్సరము.
బంధుయుక్తులఁ గ్రొత్తవారల నరసి
అనుదినం బొక్క- సహస్రభూసురుల
నాహ్వానపఱపుమా యవనీశమూళి!
నీ వ్రతాంతముదాక నిత్యంబు నేనె
పాకకార్యముల నిర్వర్తింప నేర్తు
నీవిధంబుగను భూమీశ్వరా! కొలఁది
కష్టము పడినచో శ్రమాసురు లెల్ల
వశ్యు లౌదురు నీకు వసుధాతలేంద్ర!
ధారుణీసురులు ప్రత్యామ్నాయముగను
అల హోమ యజ్ఞ సేవాదులఁ జేయ
దేవతల్ గూడ సంతృప్తులై దాన,
నవలీల నీకు వశ్యాత్మ లయ్యెదరు.
ఇంకొక గుర్తు నీ కేఁ జెప్పుచుంటి-
ఈవేష మూనియు నే రాను, రాజ!
యస్మదీయాతిమాయాప్రభావమున
నేను హరించియు నీపురోహితుని,
నా తపోబలముచే నావలె వానిఁ
గావించి యిట నుంచఁగలను వత్సరము.

నీ పురోహితురూపు నే ధరించియును
నీ కార్య మెల్లను నెఱవేర్ప్ఁ జూతు
నర్ధరాత్రము దాఁకె నవనీశ! యింక
నీ శయ్యాఁజేరియు నిద్రించు మిపుడు.
మూఁడవదినమున, భూనాథ! మనము
కలిసికొందము, నాదు ఘనతపశ్శక్తి
నీవు మేల్కొనులోననే నేను నిన్ను
నీ గుట్టును గూడ నేర్పు మీఱంగఁ
జేర్చెద నీ సౌధసీమకు వత్స!
నీకుఁ జెప్పినరూపు నేను ధరించి
వచ్చెద నేను భూపాలవతంస!
ఏకాంతమునకు ని న్నేను రావించి
యీవిషయంబుల నెల్ల వచింతు
నీవు న న్నపుడు గ్రహింపఁగాఁగలవు."
మునిమాటలను విని భూనాయకుండు
తనశయ్యాఁ జేరె నిద్రను జెందుకొఱకు.
నాకపటర్షి నిజాసనంబందుఁ
బోయికూర్చుండెను, భూమీంద్రుఁ డంత
నలసిపోవుటఁ జేసి యతిశీఘ్రముగను
గాఢనిద్రను జెందెఁ; గాని సంకుపిత
మానసుం డైనయీమౌని కేరీతి
నిద్దుర వచ్చు మునీ! భరద్వాజ!
అంతటఁ జనుదెంచె నామునికడకుఁ
గాలకేతుం డను ఘనరాక్షసుండు.
ఈతఁడే సూకరాకృతిఁ బూని నృపుని
దారి తప్పించిన దానవాధముఁడు.
కపటర్షి కాతఁడు గడుప్రాణహితుఁడు,
కపటతంత్రములందు ఘనదక్షుఁ డతఁడు.
మహి వాని కొక వందమంది నందనులు,
పదిమంది తమ్ములు; వా రంద అమిత
దుష్టులు సంగ్రామదుర్జేయబలులు
బృందారకకదంబపీడనపరులు.

విప్రసజ్జనసురవిసరంబు లెల్ల
శోక మొందుటఁ గాంచి క్ష్మోణీవిభుండు
మున్నె వారల నెల్లఁ బోరునఁ గూల్చె.
వెనుకటి యాపగ విడువ కాఖలుఁడు
కపటర్షితోడను గలసి, శత్రువును
నశియింపఁజేయఁ బన్నాగంబు పన్నె.
విధిబలం బట్లుంటఁ బృథ్వీతలేశుఁ
డెఱుఁగఁ డించుక లోన నీవిషయంబు!
శౌర్యాన్వితుం డైనశతు ల్వొక్కండు
నిలిచిపోయిన సరే నిర్లక్ష్యదృష్టి
పనికి రా దెప్పుడు; భయదరాక్షసుఁడు
రాహువున కొక్క శిరంబెకా మిగిలె-
నినహిమాంశుల నది యిప్పటివఱకు
బాధించుశక్తిని వహియించియుండె.
కపటర్షి మిత్రుని గాంచి హర్షంబు
నొంది ప్రత్యుత్థాన మొనరించి, వాని
నొక సుఖాసనమున నుపవిష్టుఁజేసి
మిత్రునిరాకకు మిగులఁ బొంగుచును
వినిపించె జరిగినవృత్తాంత మెల్ల.
దైత్యుఁడుగూడ మోదంబును జెంది
యీరీతిఁ బలికె నాన్యపమునితోడ:
"వినుము భూపాల! నా విహితవాక్యముల
నీవు పాలించుట, నీ శత్రు వింక
సర్వనాశన మూను సత్యంబు నమ్ము
మిఁక దుఃఖమును వీడి నృప! నిద్ర పొమ్ము.
భగవంతుఁ డతిచిత్రపద్ధతి దనర
మందు లేకుండనే మాన్చె రోగమును.
నీ పరిపంథిని నే నింక మూల
నాశనం బొనరించి నాల్గవనాఁడు
వచ్చి ని న్గలిసెదఁ బారివా! కనుము."
అని వేగఁ గపటర్షి నతితోషపఱచి
యత్యంతరోషియై యామహాకపటి

చనియె నాగిరిగుహాస్థలమును విడిచి.
క్షణమాత్రమున వాఁడు శయ్య నిద్రించు
నాప్రతాపార్కు-ని, నతనిగుఱ్ఱమ్ము,
నతనియంతఃపురంబందునఁ జేర్చె.
నిద్రించుచున్న రాజ్ఞీశయ్యయందుఁ
జేర్చెను నృపుని విచిత్రరీతిగను;
కట్టి వై చెను దురంగము నశ్వశాల.
రాజపురోహితుఁ రాక్షసుఁ డంత
హరియించి తనదుమాయాశక్తిచేత
వానిమనస్సును బాడొనరించి
యొక పెద్ద గిరిగుహ నుంచె గుప్తముగ.
ఆపయి నాదైత్యుఁ డాపురోహితుని
యాకృతి ధరియించి యతనియనూప
శయ్యాతలంబందు శయనించె ననఘ!
తెలవారుముందు పృథ్వీశుండు లేచి
తనమందిరంబునఁ గా నుంట మిగుల
నాశ్చర్య మందె నిజాంతర్యమందు.
ఇది మానిమాహాత్మ్యమే యని యెంచి
రాణి మేల్కొనకుండ రాజంతఁ దనదు
శయ్య నుండియు లేచి, సత్వరంబొప్ప
నశ్వంబుపై నెక్కి యడవుల కేగె
నే వ్యక్తి కంటిలో నేనియుఁ బడక.
ఆపయి మట్టమధ్యాహ్న మైనంతఁ
దిరిగి తా వచ్చె ధాత్రీపతి పురికి.
ప్రతిగేహమున శుభధ్వను లుత్సవములు
జరిగెను హర్ష వశంబుచే నపుడు
రాజు పురోహితబ్రాహ్మణుఁ గాంచి
వ్రతము జ్ఞప్తికి రాఁగ భావంబులోన
సంతోష మొందెను సంయమివర్య!
మూఁడుదినంబులు మూఁడుయుగాలు
గా రాజునకుఁ దోఁచెఁ, గడుభారములుగ.
కపటర్షి పాదలగ్నం బయ్యె నృపుని

మానసం బెల్లను మానివరేణ్య!
అనుకొన్నసమయము నందున సరిగ
నే తెంచియును బురోహితుఁడు రాజునకు
సర్వవృత్తాంతంబు జ్ఞప్తికిఁ దెచ్చె.
ఆపురోహితురూపమందునఁ దనదు
గురుని గు ర్తించియు క్ష్మోణీధవుండు
బహుతోషమును బొందె భావంబునందు.
భ్రమవశంబున ధరాపతిమానసంబు
పూర్ణమా మాంద్యంబుఁ బొందె మునీంద్ర!
ధారుణీశుండు ప్రతాపభానుండు.
వెంటనే యొకవేయి విప్రవర్యులను
ఘనకుటుంబయుతంబుగాఁ బిలిపించె.
షడ్రసంబులతోడఁ జక్కఁగా నొప్పు
తతచతుర్విధపదార్థములను వండి
యాపురోహితుఁడు మాయామయంబైన
విందును గూర్చెను. వివిధంబులైన
యగణితరమ్యపాత్రావళితోడ
వివిధమృగంబులపిశితంబు వండి
యందులోఁ గలిపె బ్రాహ్మణమాంస మతఁడు.
వచ్చినబ్రాహ్మణప్రవరు లెల్లరును
విందారగింపఁగాఁ బిలువంగఁ బడిరి.
పాదపద్మంబుల భక్తితోఁ గడిగి
రాజు బ్రాహ్మణుల గౌరవ మొప్పుచుండ
నుపవిష్టులంజేసె నుచితాసనముల.
అంత మహీధవుఁ డాహారవస్తు
జాలంబు వడ్డించుసమయమునందె
కాలకేతునిచేతఁ గల్పితం బగుచు
నాకాశమందుండి యద్భుతరీతి
వినవచ్చె శబ్ద మీవిధముగా నధిప!
"లే లెండు ద్విజులార! లే లెండు లెండు!
అరుగుఁడీ మీ మీగృహంబుల కింక
నీయన్నమును భుజియింపఁగావలవ
దిది తిన్నఁ గలుగు మీ కెంతయో హాని;
క్ష్మాసురమాంసంబు కల దిందుఁ గలిసి."
ఆకాశవాణిని నాత్మలో నమ్మి
ముం దున్నభోజనంబుల నెల్ల వీడి
రయమున లేచిరి బ్రాహ్మణు లెల్ల.
పృథ్వీవిభుం డంత వికలుఁడై పోయె,
ఆతనిమనము మోహాంధత్వ మొందె-
విధివశుఁడై ధరావిభుఁ డంత నకట!
పల్లెత్తి యొకమాట పలుక లేఁడయ్యె.
ఆగ్రహపరవశులై ధరామరులు
మంచిసెడ్డలచింత మాని చిత్తమున
నీరీతిఁ బలికిరి నృపుని వీక్షించి:
"మూర్ఖనృపాధమా! పోయి నీ వింకఁ
బరివారయుతుఁడవై పరఁగి దైతేయ
వంశంబునందునఁ బ్రభవింపు మోరి!
క్షత్రియాధమ! నీవు క్ష్మాసురావళిని
సకుటుంబముగను నాశన మొనరింప
సమకట్టినావె, భోజన మని పిల్చి!?
మా ధర్మమును గాచె మాధవుం డిప్పు
డీవును నీవారలే చెడఁగలరు;
ఏకసంవత్సర మేగుఁగోపలనె
నీవు నశింతువు నిజముగా రాజ!
నీ వంశమందున నీకు నీ ర్ష్యాడువ
నొక్కఁడేనియుఁ దుద కుండఁబోఁ డవని."
ఆశాపమును విని యవనీశ్వరుండు
భయవికలుం డయ్యెఁ బరమమునీంద్ర!
అంత వియద్భాగమందుండి మరల
వినవచ్చె వాణి యావిధి నందఱికిని:
"పావను లైనయో బ్రాహ్మణులార!
చక్కఁగా మీరు విచారింపకుండ
నృపున కొసంగితి రీశాప మకట!
నిర్దోషి యీరాజు నిజ మెంచిచూడ."

ఆవాణి విని విప్రు లాశ్చర్యపడిరి.
పాకశాలకు రాజు పఱుగిడి చూడ,
పాచకుం డట లేఁడు, పాకముల్ లేవు.
కడువిచారంబుతో క్ష్మాతలేశ్వరుఁడు
తిరిగి వచ్చియును భూదేవులతోడ
వృత్తాంత మెల్లను విశదీకరించి
సాష్టాంగపడియెను క్ష్మాస్థలిపైన
నమితభయాకులుం డగుచు మునీంద్ర!
"నీవు నిర్దోషివే నృప! యైనఁ గాని
తప్ప దెన్నఁడు భవితవ్యంబు రాజ!
అవనీసురులశాప మతిఘోరమైన
దది యన్యథాకాద" టంచు బ్రాహ్మణులు
నృపతి నోదార్చిరి; యీవార్త నెల్లఁ
బౌరు లెల్లరు విని బహువిచారించి,
'హింసను సృష్టింప నాత్మలోఁ దలఁచి
చివరకుఁ గాకిగాఁ జేసినాఁ' డనుచు
విధిని నిందించిరి వివిధరీతులను.
అసలుపురోహితు నంత రాక్షసుఁడు
వానిగృహంబులో వదలివైచియును
వినిపించెఁ దపసికి వృత్తాంత మెల్ల.
ఆఖలుం డంతట నఖిలదిక్కులకుఁ
బంపించె లేఖలు పరభూపతులకు.
శాత్రవనృపు లెల్ల సైన్యముల్ గొనుచు
యుద్ధభేరులు మ్రోయ నుద్భటలీల
ముట్టడించిరి ప్రతాపునిపట్టణమును.
ప్రతిదినం బచ్చటఁ బలు తెఱంగులుగ
జరిగె యుద్ధములు ప్రచండ మౌరీతి.
ఆప్రతాపునియోధు లంద ఱుగ్రముగఁ
బోరి హోరాహోరి పోలిసి; రంతటను
దమ్మునితోడఁ బ్రతాపభానుఁడును
యుద్ధరంగంబున నొరిగె; ధరిత్రి
నహ! సత్యకేతుధరాధీశ మూళి

వంశ మంతయును నిర్వంశ మైపోయెఁ
దిరుగులేనిది కదా ద్విజశాప మెపుడు!
ఈరీతి శత్రు జయించి, యుద్ధమున,
నగరప్రవేశం బొనర్చి దుర్గమున
నిజపతాకంబును నిలిపి శీఘ్రను
రాజు లెల్లరు తమరాజధానులకు
విజయకీర్తులతోడ వెడలి రంతటను-
ఓభరద్వాజబుష్యుత్తమా! వినుమ!
ఎంచ విధాత తా నెవ్వరిపైన
నప్రసన్నతఁ గాంచు, నాతని కిలను
గనకాద్రి యొక ధూళికణముగా నౌను;
తండ్రియే యముఁ డగుఁ; ద్రాడు పా మగును.

రావణకుంభకర్ణాదిరాక్షసుల జన్మతపశ్చర్యాదివృత్తాంతము

ఓభరద్వాజబుష్యుత్తమా! వినుము
కాలాంతరమున నీక్ష్మానాథుఁ డతని
సంతతివారు, రాక్షసజన్మ లైరి.
తత్ప్రతాపార్కుఁడే ధారుణీస్థలిని
బదిశిరంబులు నిరువది బాహు లొప్ప
రావణనాముఁడై ప్రభవించె; నతఁడు
విశ్వభయంకరవీరాగ్రణీ.
ఆతనితమ్ముఁడౌ నరిమర్దనుండు
ఘనబలుం డగుకుంభకర్ణుఁడై పుట్టె.
ఆప్రతాపునిమంత్రియౌ ధర్మరుచియె
విష్ణుభక్తుండును విజ్ఞానవనధి
యగురావణునికనిష్ఠానుజుం డైన
యవ్విభీషణుఁడుగా నావిర్భవించె.
వడిగ నృపాత్మజుల్ పరిజనం బెల్ల
రతిఘోరరాక్షసులై పుట్టి రవని.
కామరూపులు ఖలుల్ కపటమానసులు
పృథుభయంకరు లవివేకవార్ధిధులు,

సతతనిర్దయులు హింసాపరాయణులు,
నమితపాపాత్ము లాయసురు లెల్లరును.
వర్ణనాతీతసర్వప్రపంచాతి
సంతాపకారు లాచండదానవులు.
అనుపమానపవిత్ర మమలమై వెలుఁగు
వరపుల స్త్యబ్రహ్మవంశంబులోనఁ
బ్రభవించినను, వారు బ్రాహ్మణశాప
మందుటన్ ఘోరపాపాత్ములై మనిరి.
ఆసోదరత్రయ మడవుల కేగి
పలుక శక్యము గాని బహువిధభీష్మ
తపములు సేసిరి తాపసచంద్ర!
కని వారితపములఁ గంజాతగర్భుఁ
డరుదెంచి చేరువ కగ్రజుఁ గాంచి
"వరమును గోరుమా వత్సా!" యనంగ
దశశిరుం డంత విధాతృపాదములఁ
బట్టియు వినయసంభాసితుం డగుచుఁ
బలికె నీరీతిగా బ్రహ్మను గాంచి:
"నా విన్నపము జగన్నాయకా! వినుము:
నరవానరులు తప్ప న న్నెవరైనఁ
జంపఁజాలనిరీతి సద్వర మిమ్ము."
అనఁ "దథాస్త"ని పంకజాసనుం డేను
వర మొసంగితిమి రావణునకు దేవి!
కంజాసనుం డంత ఘటకర్ణుఁ జేరి
వానిగంభీరరూపంబును జూచి
విస్మయం బొంది యీవిధముగాఁ దలఁచె:
"అనుదిన మీఖలుం డాహార మార!
కై కొన్న సర్వలోకములు నశించు."
అని లోనఁ దలఁచి యీయబ్జాసనుండు
శ్రీశారదాంబను ప్రేరణ చేయ
నామె యాతనిహృదయము మార్చివేసె
నాకారణంబున నాదానవేంద్రుఁ
డాఱుమాసములపర్యంతంబు నిద్రఁ
జెందునట్లుగను గాంక్షించె వరంబు.
విధి యంతఁ దుదకు విభీషణుఁ జేరి
"వరమును గోరుమా వత్స!" యనంగ
"మాధవపాదనిర్మలభక్తి నాకు
దయసేయు" మని విధాతను గోరె నతఁడు.
వారల కారీతి వరముల నొసఁగి
నిర్గమించెను బ్రహ్మ, నీరజాసనుఁడు.
ఆదానవులు కడు నానందపడుచుఁ
దమమందిరములకుఁ దా మేగి రపుడు.
మందోదరీనామ్ని, మయదైత్యతనయ,
పరమసుందరి, మహాభవ్యసౌశీల్య;
ఆమెను దెచ్చి మయాసురుం డంత
దశకంఠున కిడి యుద్వాహంబుఁ జేసెఁ-
గాఁగలఁ డతఁడు రాక్షసచక్రవర్తి
యనుచు గ్రహించి నిజాంతర్యామందు.
అట్టిసతీమణి నారావణుండు
పొందినందుల కతిమోదంబుఁ జెంది
తనతమ్ములకుఁ గూడఁ దదనంతరంబు
పెండ్లికార్యములఁ గావించె సంప్రీతి.
అంబుధిమధ్యమం దలరారుచున్న
శ్రీత్రికుటాచలశృంగభాగమున
బ్రహ్మచే స్వయముగా రచితమైనట్టి
యొక మహోన్నతదుర్గ ముండె మునీంద్ర!
మయదానవుఁడు దాని మరల నిర్మించె
మణిమయకాంచనమందిరావళులు
గణనకు మించి ప్రకాశించురీతి.
నాగలోకముగ గణ్యతఁ గాంచినట్టి
భోగవతీనామపురమును మించి,
అల యింద్రునకు వాసమై విరాజిల్లు
నమరావతిని మించి, యాపురరాజ
మతిరమణీయమై యలరారె; నదియె
ఖ్యాతి వహించె లంకాపురం బనఁగ

మూఁడులోకములందు మునిలోకనాథ!
ఆనగరంబున కన్ని వైపులను
ఘనతరాగాధమౌ కందకం బగుచు
వెలుఁగొందుచుండే గంభీరసాగరము.
కాంచననవరత్నఖచితంబు లైన
దృఢదుర్గకుడ్యముల్ దీపించుచుండు.
వానిసౌందర్యంబు వర్ణింప వశమె!
శ్రీహరి యెవనిఁ బ్రేరేపించు నవని
నసురేశుఁ డౌట కాయాకల్పములను-
వీరుఁ డాత్రైలోక్య భీకరుండైన
శూరుఁడే నిజసైన్యశోభితుం డగుచు
నందు వసించు నయ్యా! భరద్వాజ!

రావణాదులదౌర్జన్యములు

అమితబలోపేతు లగుదైత్యభటులు
వసియించుచుండి రాపట్టణమందు.
వారలనెల్ల దేవతలు యుద్ధమున
సంహరించిరి బాహుశౌర్యంబు మెఱయ.
ఇంద్రునియాజ్ఞ చే నిప్పు డాపురిని
బదికోట్లు యక్షేశుభటు లాక్రమించి
కాఁపురం బుండిరి కాపాడుకొనుచు.
ఈవార్త దశకంఠుఁ డెట్టులో వినియు
నడిపించి తనదుసైన్యంబుల నెల్లఁ
బోయి, లంకాదుర్గమును ముట్టడించె.
ఆపంక్తికంఠుభయంకరసైన్య
గణమహాబలమును గని యక్షభటులు
పాఱిపోయిరి ప్రాణభయమును జెంది.
అంతట రావణుం డాపుర మెల్లఁ
గలయ వీక్షించియుఁ గడు ముదం బొందె
నతనియాందోళన మంతయుఁ దీఱె.
సహజసుందరమును, శాత్రవాభేద్య
మై యుంట లంకామహానగరమును
రాజధానిగఁ జేసి రావణబ్రహ్మ
యాయాభటులయోగ్యతానుసారముగఁ
దగునివాసములఁ బ్రదానంబుఁ జేసి
దనుజుల కెల్ల సంతస మొనఁగూర్చె.
దశకంఠుఁ డొకసారి ధనదునిపైన
దండయాత్రను జేసి తద్యక్షలోక
నాథపుష్పకవిమానంబును గొనియు
స్వపురంబునకుఁ దెచ్చె జయచిహ్నముగను.
మఱియొకసారి యాపంక్తికంధరుఁడు
కైతుకార్థంబుగాఁ గైలాసగిరిని
బైకెత్తి నిజభుజబలముఁ దలంచి
కడు సంతసమున లంకాపురిఁ జేరె.
వానిసుఖంబును వానిసంపదలు
తనయులు, సేన, బాంధవసమూహాములు
విజయప్రతాపముల్, పృథుబాహుబలము,
బుద్ధిశక్తియు, యశంబును, దినదినము-
అధికంబుగా లాభ మందినకొలఁది
యధికలోభము కల్గునట్లుగా-మిగుల
నభివృద్ధి నొందె నాహా! భరద్వాజ!
అప్రతివీరమహాబలుఁడైన
కుంభకర్ణుఁడు వానికూరిమితమ్ముఁ
డొక్కపర్యాయమే యుదరంబునిండ
నాతఁడు భుజియించి యాఱుమాసంబు
లొక్క రీతిగ నిద్ర నొందు గాథముగ;
ఆఱుమాసముల యనంతరం బతఁడు
నిద్రమేల్కొను నంత నిఖిలలోకములు
గడగడ వణకును, కడు భయంబొంది.
ఇంక నిత్యమ్ము భుజించిన వాఁడు
సర్వవిశ్వంబు నాశనమయి పోదె!
సమరమందున వానిశౌర్యధైర్యములు
వర్ణింప నెవ్వరివశము గా దనఘ!
అతనితో సము లగునట్టి బలాఢ్యు

లగణితంబుగఁ గల రాలంకలోన.
దశకంధరునిజ్యేష్ఠతనయుఁ డైనట్టి
మేఘనాదుం డెన్న మేటివీరుండు.
అఖిలప్రపంచయోధాగ్రణులందు
నాతని కెదురుగా నాహవంబందు
నిలుచుండఁ గలిగిన నేర్పతి లేఁడు.
ప్రతిదినంబును సురపట్టణంబందు
వానిఁ గూర్చిన భయభ్రాంతులు రేఁగు.
కుముఖుం డకంపనకులిశారదులును
దుష్టాతికాయుండు ధూమకేతుండు
మొదలైన రాక్షసుల్ మొనగాండ్రు గలరు;
ఒకొక్కఁడే విశ్వ మోడించివేయఁ
జాలినయట్టిప్రచండసాహసుఁడు.
ఆమహారాక్షసు లందఱుగూడఁ
గామరూపులును, రాక్షసమాయలందు
నాతితేఱినవార, లఖిలవిధాల.
అల దయాధర్మంబు లనునవి స్వప్న
మంటైన వారలయందున లేవు–
దశకంఠుఁ డొకనాఁడు తనసభాస్థలిని
సింహాసనమున నాసీనుఁడై కనియె
నగణితభటులను నాత్మనందనులఁ,
బౌత్రుల, బాంధవపరివారజనుల,
నత్యపారనిశాచరానీకములను.
అటుల సైన్యమ్ముల నరసి రావణుఁడు
సహజాభిమాని యీచందానఁ బలికెఁ
గ్రోధమదోద్రేకఘూర్ణితుం డగుచు:
"ఓమహారాక్షసయూథంబులార!
మచ్చత్రుతతి దేవమండలి యెల్ల.
వారు ముఖాముఖి వచ్చి నిల్చుండి
యుద్ధమొనర్పఁగా నోపరు, సబల
పరిపంథిఁ గాంచినఁ బాఱిపోయెదరు.
వారినిఁ బడఁగూల్చుపథమును వెదుక
నొక్కఁ డే కనవచ్చుచుండెను వినుఁడు:
భూదేవతాజనభోజనంబులను,
యజ్ఞహోమముల, శ్రాద్ధాదికృత్యములఁ,
దదితర మైనసత్కార్యంబు లెల్ల,
వెడలి, నిరోధించివేయుఁడు మీరు.
మలమలమలమల మాడి యూఁకటను
క్షీణత్వ మొంది కృశించి యీయమరు
లప్రయత్నమ్ముగా నరుగుదెంచియును–
నాకు లొంగియు శరణంబు కాంక్షింతు;
రప్పుడు వారల నందఱఁబట్టి
సంహారకార్యము సలుపుటో, లేక
నా యాజ్ఞ చొప్పున నడువంగఁజేసి
వదలుటో – చూచెద, భటవర్యులార!"
అని యంత రావణుం డామేఘనాదుఁ
బురికొల్పి పౌరుషమును రెచ్చఁగొట్టి
హెచ్చరించె మునీంద్ర! యీచందమునను:
"దేవతల్ సంగ్రామధీరాతిబలులు,
దురభిమానులు, వారి దోర్బలమొప్ప
యుద్ధరంగంబున నోడించి యిటకు
బంధించి నీవు తేవలయుఁ గుమార!"
నా విని యామేఘనాదుఁ డంతటను
బీఠిక నుండి యుద్యోగ్నుఁడై లేచి
తండ్రియాజ్ఞను దనతలపైనిఁ దాల్చె.
ఈరీతి రావణుఁ డెల్లవీరులకుఁ
దగు నాజ్ఞ గావించి తానుసైతమును
విజయయాత్రకుఁ బయలెడలె నుగ్రముగ
ఘనగదాదండంబు కరమునఁ బెలయ.
దండయాత్రను జేయ దశకంధరుండు
వెడలినంతనె ప్రకంపించె భూతలము.
వానికఠోరదుర్భరగర్జనముల
దిగఁజాఱె దేవతాస్త్రీలగర్భములు.
కార్యంబు దీపింప రావణాసురుఁడు

దండెత్తివచ్చు వార్తను విని నంత
దేవత లెల్లరు దిగ్భ్రాంతు లగుచుఁ
బఱుగెత్తి మేరుపర్వతగుహాలందు
దాగిరి, యో భరద్వాజమునీంద్ర!
దశకంధరుం డంత దశదిశాధీశ
వాసంబులకుఁ బోయి పరికించి నంత
శూన్యంబులై యవి చూపట్టె – మున్నె
తద్దిశాధీశులు దరలియుండుటను.
మాటిమాటికి వాఁడు మండు చుగ్రముగ
సింహనాదంబులు సేయుచు, సురల
సంగ్రామ మొనరింప సైఁగొట్టి పిలిచెఁ;
బరిహాసవాక్యముల్ సలికి నిందించె.
మహితరణోన్మాదమత్తుఁడై యతఁడు
తన నెదిరింపఁగాఁ దగు ప్రతివీరుఁ
బరికింపఁ దిరిగె సర్వప్రపంచంబుఁ,
గాని యొక్కండైనఁ గానరాఁడయ్యె.
భానుచంద్రాగ్నులు, వరుణవాయువులు
ధనదుండు, కాలము, దండధరుండు,
నితరాధికారులౌ బృందారకులును,
నరసురకిన్నరనాగసిద్ధులును
నతనికి 'దాసోఽహ' మనిరి మునీంద్ర!
ఘనబ్రహ్మసృష్టిలోఁ గలదేహధారు
లందఱు వశవర్తులై రావణునకుఁ
దమతమప్రాణముల్ దక్కించుకొనిరి.
గడగడలాడుచుఁ గడుభీతితోడఁ
బాలించి రెల్లరు వానియాజ్ఞలను.
సర్వదా రావణుచరణంబులకును
వినమితు లౌచు జీవించి రెల్లరును.
నిజభుజబలమున నిఖిలవిశ్వమును
దనవశం బొనరించె దశకంధరుండు.
లోకమం దెటనైన లొంగక నిలిచి
స్వాతంత్ర్యమున నుండఁ జాలిన వాఁడు
వాని పాలనమునఁ బరికింప లేఁడు.
రాజాధిరాజౌచు రావణాసురుఁడు
పాలించె నిజమంత్రపద్ధతి జగతి.
తనభుజశక్తి నందఱిని జయించి
నరసురయక్షకిన్నరసుకింపురుష
నాగగంధర్వకన్యకల నెందఱినో
మానితసుందరీమణులఁ బెండ్లాడె
నాదశకంధరుం డరమర లేక.
ఆదశకంఠుఁ డేమనిచెప్పు, దాని
చెప్పి చెప్పక ముందె చేయు శీఘ్రముగ
మేటి బల్లిదుఁ డగుమేఘనాదుండు.
ప్రప్రథమంబున రావణాసురుని
యాజ్ఞను గైకొన్న యాసురయోధు
లే మొనరించిరో యిప్పుడు వినుము:
భయదరూపులు మహాపాపాత్ము లైన
దైత్య లెల్లరు దేవతాబృందములను
సంతాపపెట్టఁగా సాగి రుద్ధతిని.
సంచరించుచు నిశాసమయంబులందుఁ
గడు నుపద్రవములఁ గావించి రెన్నో.
స్వీయమాయాశక్తిచేత నాఖలులు
బహువిధరూపముల్ వహియించి రనఘ!
అన్నివిధంబుల నానిశాచరులు
వేదవిరోధులై విహరించి రెపుడు;
ధర్మనిర్మూలనతత్పరు లైరి,
తమశక్తికొలఁదిగాఁ దాపసచంద్ర!
వారికి గోవైన బ్రాహ్మణుం డైనఁ
గంటిలోఁ బడిన యాగ్రామసీమలను
నగరంబులను దహనముఁ జేసి రకట!
ఘనసదాచారముల్ గానరావయ్యె;
దేవతాబ్రాహ్మణదేశికభక్తి
మటుమాయ మయ్యెను మానివర్యా!
లేదు శ్రీహరిభక్తి; లే వెందు యజ్ఞ

దానతపోజ్ఞానధర్మకార్యములు;
వేదపురాణముల్ వినుటలు లేవు
స్వప్నమందును భరద్వాజమానీంద్ర!
జపతపోయోగయజ్ఞక్రియావళులు,
వైరాగ్య మను నుడుల్ పడినవో చెవుల-
నచటికి రావణుం డాక్షణంబందె
వెడలును వానిని విరతి గావింప;
నిట్టి కార్యంబుల నించు కాతండు
సాగనీయండు; నాశ మ్మొనరించు.

ధర్మప్రశంసయే తగనివిధాన
నఖిలజగంబు భ్రష్టాచార మయ్యె.
పరగ వేదపురాణపఠనంబుసేయు
వారల నాతఁడు బహుబాధపెట్టుఁ;
బంపించె ఘోరప్రవాసములకును.
ఆ నిశాచరుల భయంకరాధర్మ
కృత్యముల్ వర్ణింప నెవ్వరితరము?
అమితహింసాప్రియు లైనట్టివారి
పాపకృత్యములకుఁ బరిమితి లేదు.

శ్రీరామచరితమానసము

బాలకాండము

షష్ఠవిశ్రామము

శ్రావణమేఘశరీరా!
పావనకృష్ణాతటస్థవనసంచారా!
శ్రీవనజాసనముఖసం
భావితశుభరూప! మట్టపల్లి నృసింహా!

జూదరుల్ దుర్జనుల్ చోరజనంబు
పరదార పరధన వాంఛా క్తచిత్తు
లమితంబుగా వృద్ధి యైరి యెల్లెడల.
తల్లిదండ్రుల దేవతల భ క్తిఁ జూడ
మానిరి ప్రజలు; దుర్మదచిత్తు లగుచుఁ
బొందసాగిరి సాధువులచేత సేవ.
ఇట్టి కార్యంబుల నెవరు చేసెదరో!-
ఆప్రాణు లెల్లరు నసురులే దేవి!

భూదేవి దేవతలతో మొఱపెట్టుకొనుట

పరమధర్మగ్లాని వసుధ వీక్షించి
యతిభీతి నొందియు నాకులపడియె.
"పర్వతవాహినీవార్ధిసమూహ
భారంబు నాకొక భారంబు గాదు,
ఒక లోకకంటకు నురుభారమునకు
సమము గా దీభారచయము నా కకట!"
అనుచు భూదేవి నిజాత్మఁ జింతించె.
మహితధర్మము తాఱుమాఱౌటఁ గనియు
నాపంక్తివదను భయంబుచే ధరణి,
పలు విప్పి యొకమాటఁ బలుక లేదయ్య.

హృదయంబులో విచారించి మిక్కిలిగ
నామె గోరూపిణియై నిర్గమించె
సురమునుల్ దాగినచోటున కనఘు!
కన్నుల బాష్పముల్ కాల్వలై పాఱి
వారికిఁ దనమనోవ్యథ వినిపించె.
కాని వారలయం దొకానొకఁడేని
ఆమెకొకింత సాహాయ్యంబు సేయఁ
జాలక పోయెను సంయమివర్య!
గంధర్వాసురమునిగణము లన్నియును
గాంచనగర్భలోకమునకుఁ జనియె.
పాపము! భూదేవి వారితోఁ గూడి
గోరూపమును దాల్చుకొని నిర్గమించె
నమిత వైకల్యభయా ర్తచి త్తమున;
అఖిలంబు గ్రహియించి యంబుజాసనుఁడు
భూదేవిదుఃఖంబు పోఁగొట్టుటకును
దగినసామర్థ్యంబు తనకు లే దనుచు
హృదయాంతరంబున నెఱిఁగి యిట్లనియె:
"ఎవ్వని సేవింతు రెప్పుడు మీర
లాయవినాశి యీ నాపరమాత్మ
నన్నును, మిము, రక్షణముసేయువాఁడు.
ధైర్యంబు పూనుమా ధాత్రీమతల్లి!
సంస్మరింపుము హరిచరణపద్మముల.
ఎఱుఁగుఁ గింకరదుఃఖ మీశ్వరుం; డతఁడు
భవదీయఘోరవిపత్తు భంజించు."

అన నట సభఁజేసి యాసుర లెల్ల,
"శ్రీపతి నెచట దర్శింపఁగాఁ గలము?"
అని విచారణచేసి రతిగాఢముగను:
"బాధలెల్లను విన్నపం బొనరింప
వైకుంఠనగరికిఁ బయనింత" మనుచు
వారిలో నొకఁడు సభాస్థలిఁ దెలిపె;
ఇంకొక్కఁ "డట్లుకా; దీశ్వరుం డెపుడు
క్షీరాబ్ధిలోన వసించుఁగా" యనియె.
హృదిలోన భక్తి సంప్రీతి వెలుంగు-
వానికి సర్వదా ప్రత్యక్ష మౌను
సర్వేశుఁ డెప్పుడు స్వాత్మపీఠమున.
ఓ గౌరి! నేను నాఁ డుంటి నాసభను.
ఈ రీతిఁ బలికితి నే నొక్కమాట
నవసరసమయమునందు భవాని!
"సర్వత్ర సమముగా సర్వేశ్వరుండు
వాసుదేవుఁడు శౌరి వ్యాపించియుండుఁ;
బ్రేమచేతనె హరి వీక్షితుం డగును.
దేశకాలంబుల దిశల నెందైనఁ
బ్రభువు లేనిస్థలంబు పలుకుఁ డేదైన?
అఖిలజగన్మయుండై వెలుఁగొందు
చేమియు లేనట్టియేకాకి యగుచుఁ
బరమవిరాగియై పరఁగుచున్నాఁడు.
కాష్ఠముల్ రెంటిని గలిపి మథింప
వెలువడునగ్ని; యావిధి భక్తిచేత
శ్రీహరిదర్శనశ్రీ లభియించు"
ననెడి నావాక్యంబు లందఱుఁ గూడ
సమ్మతించిరి. పద్మసంభవుం డపుడు
"మంచివాక్యంబులు మంచివాక్యంబు"
లని నచియించెఁ దా నానందపడుచు.
నా వాక్యముల విని నలినసంభవుఁడు
పరమసంతోషసంభరితాత్మఁ డయ్యె;
ఆతనితనువు రోమాంచితం బయ్యెఁ;
గన్నుల బాష్పముల్ గారఁగాఁ బొడఁగె.
సావధానత పొంది స్వాంతమం దంత
ధీరాత్మఁ డగుబ్రహ్మదేవుఁడు భక్తిఁ
గరములు ముడిచి యాకరణిఁ బ్రార్థించె:

బ్రహ్మదేవకృత-శ్రీహరిస్తవము

గేయము

జయ సురనాయక ! జనసుఖదాయక !
ప్రణతపాల ! భగవంతా !
జయ గోద్విజహిత ! జయ దనుజాహిత !
జయ లక్ష్మీప్రియకాంతా !
జయ ధరణీసురచయపరిరక్షణ !
జయ మహితాద్భుతకార్యచణా !
నీలీలలమర్మంబుల నెఱుఁగఁగ
నేరికైనఁబ్రభు ! వశ మౌనా?
సహజకృపాళూ ! దీనదయాళూ !
నీకృపఁ జూపుము మాపైన.

జయ అవినాశీ ! హృదయనివాసీ !
వ్యాపక ! పరమానందా !
జయ అజ్ఞాత ! అతీత ! సుచరితా !
మాయారహిత ! ముకుందా !
విగతమోహులును విరాగమతులగు
మౌనీశ్వరు లతిప్రీతిన్
దివానిశలు నిను ధ్యానము సేయుచు
వినుతింతురు నికీర్తిన్.
జయము జయము గోవింద ! జనార్దన !
జయము సచ్చిదానందా !

త్రివిధసృష్టి నేతోడు నెఱుంగక
సృష్టించిన అఘదూరా !
మఱవకు మము నీ భక్తియుఁ బూజయు
మతి నెఱుఁగనివారమురా !

ుయభంజన ! మునిహృద్రంజన !
దళితక్షితాపద్బృందా !
రణఋద్ధిగఁ జతురతలను విడి
శరణంటిమి గోవిందా!

ుద, వేదములును, శేషాహి, య
శేషఋషీశ్వరులున్
ుఁగరు నిను; దీనప్రియుండవని
కీర్తించును వేదములున్ !
ాయెడఁ గరుణారసహృదయుండవు
గమ్మ హరీ ! పరమేశా !
వవారిధిమందర ! గుణమందిర !
బహువిధసుందర ! సుఖవాసా !
కలామరమునిసిద్ధులు పరమభ
యాకులతన్ దనుజారీ !
నీపదకంజయుగమ్మునకున్ నతి
సేయుచుండి రోశారీ !

ున్నారాయణునియభయప్రదానము

ురావళియార్తి నెఱింగి
ించి వారిస్నేహాలాపవితతి
శభాగంబునం దుండి యపుడు
చ్చె నొక్క గంభీర మావాణి
లార్తిసందేహహారకం బగుచు:
మునిసిద్ధసురోత్తములార!
ం మొందకుఁడు మీరు భయ మొంద వలదు.
మీకొఱకుఁ బృథ్వీరంగమందు
వేష మూన నున్నాఁడను నేను.
వార్యవంత నూ నర్క-వంశమున
సమేతుండ నౌచును నేను
ుజావతారంబు మహినిఁ దాల్చెదను.
తికశ్యపులు మహోతపశ్చర్య

సలుపఁగా మున్ను ప్రసాదించినాఁడ
వారి కొకానొక వరము; భూతలిని
సాకేతపురమున జన్మంబుఁ గాంచె
నదితి శ్రీకౌసల్య యనెడినామమున;;
తత్కశ్యపబ్రహ్మ దశరథేంద్రుఁడుగ.
వారిగృహంబునఁ బ్రభవింతు నేను
రఘుకులతిలకమై రాజితరీతి
నల సోదరచతుష్టయస్వరూపమున.
నారదమునివచనంబుల నెల్ల
సత్యంబుగా నేను సలిపెడివాఁడఁ
బరమశక్తిని గూడి ప్రభవించువాఁడ.
తెగువ నే నిట్లు ధాత్రీభార మెల్ల
హరియింపఁగల నమరావళులార!
ఇఁక నిర్భయులు గండు హృదయంబులందు."
ఆకాశభాగంబునందుండి యిటులఁ
బలికినపరమేశువాణిని వినియు
సకలదేవత లాత్మ శాంతిని గనిరి.
ఆపయి భూదేవి నబ్జసంభూతుఁ
డోదార్చె దైవాభయోక్తులఁ దెలిపి.
అంతట భూదేవి యాత్మలోఁ గలుగు
సకలభయంబు విసర్జించివైచి
స్వస్థతఁ బొందెను స్వాంతంబులోన.
"వానరరూపముల్ వహియించి మీర
లుర్వీస్థలంబున నుద్భవించియును
శ్రీహరిపాదముల్ సేవింపుఁ" డనుచు
నాదేశ మొసఁగియు నమరుల కంత
నిర్గమించె విరించి నిజలోకమునకు.
అవనీసమేతులై యఖిలదేవతలు
తమనివాసంబులఁ దగఁ జేరుకొనిరి.
వా రెల్ల విశ్రాంతభావులై రనఘ!
అజునియాజ్ఞకు సురల్ హర్షాత్ము లగుచుఁ
గార్యంబు నెఱవేర్పఁ గడఁగి రెల్లరును.

కాలంబు పోనీయకయె శీఘ్రముగను
వనచరరూపులై వారెల్ల భువినిఁ
బ్రభవించి రయ్య భరద్వాజమౌని!
వారిబలప్రతాపంబుల నెన్న
ననుపమానంబు, లాయగచరు లెల్ల
వీరాధివీరులు వివిధరంగముల.
ఆవానరులయాయుధావళు లచల
వృక్షనఖంబులు విబుధవరేణ్య!
ఆధీరమతులైన యగచరవరులు
శ్రీహరికొఱకు నిరీక్షించుకొనుచు
నతిబలిష్ఠంబులై యలరారుచుండు
పలుబృందములుగ విభాగింపఁబడియుఁ
బర్వతారణ్యగర్భంబులయందుఁ
దమయిష్ట మైనట్టితావులలోన
వసియించి రోభరద్వాజమునీంద్ర!
అతిరుచిరం బగునట్టియీచరిత
భాషించితిని వినుపైకథ నింక:

శ్రీ దశరథమహారాజచరిత్ర, పుత్రకామేష్టి

వేదంబులందున విదితమై వెలుఁగు
దశరథుం డనుపేరుఁ దాల్చిననృపతి
యిల నయోధ్యాపురం బేలుచు నుండె
రఘువంశరత్నమై రాజితరీతి.
ఆమహారాజు గుణాబ్ధియు, జ్ఞాని,
రాజితధర్మధురంధరుం; డతఁడు
శార్ఙ్గిని హృదిఁ గొల్చుసద్భక్తవరుఁడు.
కౌసల్య మొదలైనకాంత లందఱును
దివ్యవర్తనలు పతివ్రతామణులు
హరిపదకమలంబులందున సతము
గాఢమౌ భక్తిని గలిగినవారు.
ఒక్కదినంబున నుర్వీధవుండు
తనయులు లేకుంటఁ దనస్వాంతమందుఁ
జింతను బొందియు స్వీయదేశికుని
సన్నిధి కేగి, యాసంయమీశ్వరుని
పాదపద్మంబులపైనను వ్రాలి,
బహుళవిధంబులఁ బ్రార్థనల్ సలిపి
తనకష్టసుఖములఁ దగ వినిపించె.
విని వసిష్ఠర్షియుఁ బ్రేమ వెలుంగ
పలువితముల నానృపాలు నోదార్చి
యీరీతిఁ బలికెఁ దాఁ గృప పొంగిపొరల
"ధీరతఁ బూని పృథ్వీనాథమౌళి!
ఓపిక పట్టుమా యొక్కింత; నీకుఁ
ద్రిభువనవిదితులై దీపించువారు
భక్తభయంబులఁ బాపెడివారు
పుత్రులు నలుగురు పుట్టఁగాఁగలరు."
అంత వసిష్ఠమహర్షివర్యుండు
శృంగిమహర్షి రావింపఁగాఁ జేసి
భూపతిచేతను బుత్రకామేష్టి
యను నొక శుభకర మైనయజ్ఞమును
సలుపఁగాఁ జేసె; నాసవనంబునందు
భక్తియుక్తముగఁ దాపసలోకనాథుఁ
డాహుతు లగ్నిలో నర్పించినంత
నగ్నిదేవుండు ప్రత్యక్షమై పలికెఁ
బాయసాన్నముఁ బూని పాణిపద్మమున:
"నీకై వసిష్ఠమునీశుండు స్వాంత
మందు సంకల్పించి నట్టికార్యంబు
తప్పక సిద్ధించు దశరథరాజ!
ఈపాయసంబును నృప! స్వీకరించి
విభజింపుమా యథావిహితపద్ధతిని—"
అని పల్కి యగ్ని యాయజ్ఞసభ్యాళి
కాపయిఁజేసెడి దంతయుఁ దెలిపి
యంతర్హితుండయ్యె; నంతట భూపుఁ
డమితసంతోషంబునందున మునిఁగె.
హృదయంబులోఁ బొంగులెత్తుహర్షంబు

నాపఁజాలకపోయె నతఁడు! ముసీంద్ర!
వెంటనే దశరథపృథ్వీవిభుండు
ప్రియసతీమణుల రావింపఁగాఁ బంపె.
కౌసల్యమొదలైన కాంత లంతటను
వచ్చినఁగనుఁగొని పార్థివో త్తంసు
డాపాయసంబున నర్ధభాగంబుఁ
గౌసల్య కొసఁగెను ఘనతరప్రీతి.
శిష్టార్ధభాగంబు చేసి రెండుగను-
ఒకటి కేకయసుత కొసఁగి, రెండవది
రెండుభాగము లొనరించియుఁ దిరిగి
యొకటిఁ గౌసల్య, కిం కొకటిఁ గై కేయి
కీయఁబో, వారు సంతృప్తి వహింప;
నారెండు భాగంబు లాపయి నృపుఁడు
మిగులఁ బ్రేమమున సుమిత్ర కొసంగె.
ఇద్దాన నారాణు లెల్లరు గారి!
గర్భముల్ దాల్చి యఖండసంతోష
సంభరితాత్మలై స్వాస్థ్యంబు గనిరి.
కౌసల్యపావనగర్భగోళమున
శ్రీహరి, తాఁ బ్రవేశించె నేనాఁడు-
ఆనాఁటినుండియు నఖిలలోకములు
సుఖసంపదలతోడ శోభిల్లఁదొడఁగె,
శోభాసుశీలతేజోనిధు లైన
రాణు లందఱుఁ గూడ రాజసౌధమున
వెలుఁగొంద సాగిరి విమలతేజమున.
కాల మిట్లొగె సుఖంబు దీపింప.
ప్రభు వింక జగతిపైఁ బ్రభవించునట్టి
దివ్యమా సమయ మేతెంచె; నంతటను-

శ్రీరామజననము-బాల్యలీలలు

ఆల యోగలగ్నగ్రహానీకవార
తిథు లన్నియును మహాదివ్య మౌరీతి
ననుకూలముగ నుండె; ననఘుచరిత్ర!
సచరాచరం బగుజగతి హర్షించె
సుఖమూల మగు రామశుభజన్మమునకు.
మంగళం బగుచైత్రమాస మేతెంచె
నల శుక్లపక్షమునందున, నవమి,
శ్రీహరిప్రియ మభిజిత్కాలమందు
మార్తాండుఁ డాకాశమధ్యమం దుండ
శీతోష్ణములు రెండు చెలఁగె సామ్యమున.
సకలప్రపంచవిశ్రమకాల మద్ది.
మందశీతలగంధమారుతం బవుడు
వీచుచుండెను; దేవబృందంబు లెల్ల
హర్షించుచుండె నిజాంతరంగముల.
సంతోషపడుచుండ్రి సాధుసజ్జనులు.
వనము లెల్లను బుష్పభరితంబు లయ్యె,
భాసించె మణులతోఁ బర్వతవ్రజము.
లమృతధారలు పాఱె నఖిలవాహినుల.
శ్రీరామదేవుఁ డీక్షితి నుద్ధరింప
నవతరించెడికాల మాసన్న మయ్యె
నని గ్రహించెను బ్రహ్మ; యఖిలదేవతలు
తఱలివచ్చిరి తమతమవిమానముల.
సదమలాకాశంబు సంకులం బయ్యె.
సురయూథములచేతఁ జుట్టఁగాఁబడియు.
హరిగుణగణముల నతిమంజులముగ
గానంబుసేయుచు గంధర్వగణము
సుందరకరముల సుమవర్షములను
వర్షించె నానందపారవశ్యమున.
ఆకాశమండల మంతయు దేవ
దుందుభిస్వనములతోఁ మాఱుమ్రోగె.
సురనాగమునివరుల్ సుస్థిరప్రీతిఁ
బ్రస్తుతుల్ సలిపియు బహువిధానముల
సముచితసేవల సలిపి రత్తఱిని.
ఆజగత్త్రయవాసుఁ డాజగత్ప్రభుఁడు
సకలప్రపంచవిశ్రాముఁ డీభువిని

బ్రకటితుండైన, దేవత లెల్ల హరిని
సన్నుతు లొనరించి సదమలభ క్తి
నిర్మించిరి నిజనిజవాసములకు.
ఆదీనవత్సలుఁ డాకృపాళుండు
శ్రీకోసలాత్మజాప్రియకారి శౌరి
ప్రత్యక్షమయ్యె భరద్వాజమాని!
ఎవనిమహోద్భ తాకృతి విచారించి
మునులచి త్తములు ప్రముగ్ధంబు లగునొ
ఆదివ్య మగురూప మామాతృదేవిఁ
బరమసంతోషసంభరితాత్మఁ జేసె.
నయనాభిరామఘనశ్యామతనుఁడు,
శంఖచక్రగదాబ్జసందీప్యమాన
వరచతుర్భుజుఁడు, దీవ్యద్రత్న హార
మహితభూషణవనమాలికాధరుఁడు,
సంఫుల్ల పద్మవిశాలనేత్రుండు,
నఖిలశోభాసింధు వైనఖరారిఁ
గనుఁగొని కౌసల్య కరముల మోడ్చి
యీరీతిఁ దా వచియించె, "నో దేవ!
ఆదిమధ్యాంతశూన్యా! యెట్లు నిన్ను
సంస్తోత్ర మొనరింపఁ జాలెద నేను!
మాయాగుణజ్ఞానమానంబులకును
నీ వతీతుండవై నిలుతు వటంచు
వేదపురాణముల్ వేనోళ్ళఁ జాటు.
కారుణ్యగుణసుఖఘనసాగరుండు,
నఖిలసద్గుణనిధి యని వేదవిబుధ
చయము లేపరమేశు సన్నుతింజేయు
నారమావిభుఁడు భక్తానుర క్తుండు
హరి, మద్ధితార్థ మీయవతార మొందె.
భవదీయతనువున భాసిల్లుచుండు
ప్రతిరోమరోమకూపంబునందుండి
మాయామయమ్మౌ బ్రహ్మాండసంచయము
ప్రభవించు నని శ్రుతుల్ ప్రవచించుచుండె.

ఆనీవు నాదుగర్భాంతరాళమున
నహ! వసించితి; వీమహాద్భుతచరిత
ధీరమానసులబుద్ధినిగూడ మిగుల
సంచలింపఁగఁజేయు స్వామీ! ముకుంద!"
జనని యీరీతి విజ్ఞానోక్తు లాడఁ
జిఱునవ్వు నవ్వెను శ్రీరమావిభుఁడు.
మహితసల్లీలాసమర్థుఁ డాశౌరి
తనయందుఁ బుత్రవాత్సల్య మేర్పఱుప
నతిమంజులం బగునామెపూర్వంపు
జన్మగాథను దెల్పి సంతోషపఱచె.
ఆమెచి త్తం బెల్ల నంత మా ర్పొందె,
నీరీతిఁ దిరిగి వచించె నాజనని:
"ఈయమానుషరూప మింకఁ ద్యజించి
యమితప్రియంబు నా యాత్మకుఁ గూర్పు
శైశవలీలల సలుపు మోస్వామి!
అట్టిలీలలచే మదాత్మకుఁ గలుగు
నానంద మతిహితం బత్యద్భుతంబు!"
ఆమాటలను విని యాజనార్దనుఁడు
సుజ్ఞానరూపుఁ డాసురవారనాథుఁ
డిల నొక్క బాలుఁడై యేడ్వఁగాసాఁగె.
ఈదివ్యచారిత్ర మెవరు పాడెదరో?
వారలు శ్రీహరిపద మధిష్ఠించి
భవకూపమందునఁ బడ రెన్నటికిని!
అఖిలమాయాతీతుఁ డగు పరమాత్మ
బ్రాహ్మణగోసుర భక్తహితంబు
సలుపఁగా నెంచియు శ్లోకలంబందు
ధరియించె మనుజావతార మీరీతి
స్వేచ్ఛావినిర్మితవిమలాంగుఁ డగుచు.
పరమప్రియంబగువాణితో వెలుఁగు
శిశురోదనము తమచెవులందు సోఁక
సంభ్రమ మొప్పఁగా సర్వరాజ్ఞులును
బరుగెత్తి చేరిరి ప్రసవగేహమును

దాసీగణంబు లుదారమోదమున
నటునిటుఁ బరుఁగిడి రంతఃపురమున
నానందమగ్నులై రఖిలపౌరులును.
పుత్రజన్మవిశేషమును వినినంత
నాత్మ బ్రహ్మానందమంతటిసుఖము
పొందెను దశరథభూమీశ్వరుండు.
మనమునందునఁ బరమప్రేమ నిండఁ
బులకితదేహుఁడై భూవల్లభుండు
చలమునఁ దెలివిని సమకూర్చుకొనుచు
లేవఁగా నుంకించి లేవలేఁడయ్యె
"వినినమాత్రముననే విభునినామంబు
సకలశుభంబుల సమకూరఁజేయు
నాజగన్నాయకుం డావిర్భవించె
నాగృహమందున నా భాగ్య మేమి!"
యని తలపోసియు నామహారాజు
పరమసంతోషసంభరితాత్మఁ డయ్యె;
వాయిదకాంద్ర సత్వరము రావించి
యెల్ల వాద్యముల మ్రోయింపఁగాఁ బనిచె,
గురువసిష్ఠమునీంద్రుఁగూడ రావించె.
ఆమహాముని భూసురాన్వితుం డగుచు
వచ్చి చేరెను నృపద్వారదేశమును.
అంతట వారెల్ల రరిగి సౌధమున
నగణితగుణనిధి, యతిరూపరాశి
యనుపమానుం డగు వాబాలుఁ గనిరి.
సలిపి నాందీముఖశ్రాద్ధకర్మముల
జాతకర్మంబుల శాస్త్రానుసరణి
దశరథేంద్రుండు ప్రదానంబు సేసె
హాటకధేనువస్త్రాంచితమణుల
బ్రాహ్మణులకు భరద్వాజమానీంద్ర!;
ధ్వజములతోడఁ బతాకలతోడఁ
దోరణబృందంబుతోడను నిండె
నాయయోధ్యాపుర మంతయు నాఁడు
వర్ణనాతీత మాపట్టణశోభ!
ఆకాశమండలమందుండి పురిని
గుసుమవర్షంబులు కురియఁగా సాఁగె.
నఖిలజీవులును బ్రహ్మానందమందు
మునిఁగిపోయెను మహాముని! భరద్వాజ!
సహజశృంగారంబు సందీప్తిఁ గాంచ
గుంపులు గుంపులు గూడియు స్త్రీలు
పరుగిడుచుండిరి పరవశత్వమున.
కనకకుంభముల మంగళవస్తుజాల
భరితంబు లైనట్టి పళ్ళెరంబులను
కరముల ధరియించి, కడు శ్రావ్యముగను
పాటలు పాడు చావనిత లందఱును
భూపునంతఃపురంబున కేగుదెంచి,
హారతుల్ వెలిఁగించి, యానందపడుచు
దృష్టినోషంబుల దిగఁదీసివైచి,
బాలునిశ్రీపాదపంకజంబులకుఁ
బలుసార్లు సాష్టాంగపడిరి మునీంద్ర!
వందిమాగధసూతభటగాయకులును
బొడిరి రఘునాథుపావనయశము.
సర్వులుఁ దమతమసర్వసంపదల
దానంబు సేసిరి; తద్దానములను
గొనినట్టి వారలుఁ గూడను వాని
నుంచుకోరైరి బుష్యోత్తమా! వినుము.
మృగమదకుంకుమశ్రీగంధములను
బురదగా మాఱెను బురవీథు లెల్ల.
సౌందర్యకందమే జగతీతలాన
నవతరించుటఁజేసి యఖిలగేహముల
శుభవాద్యములు మ్రోయఁజొచ్చె నెల్లెడల.
అఖిలనారీనరు లానందజలధి
మునిఁగి తేలుచునుండ్రి మునిలోకనాథ!
ఆకేకయాత్మజ కాసుమిత్రకును
జననంబు నొందిరి చక్కనిసుతులు.

ఆసుఖసంపద లాసమయంబు
నాజనగణముల నభివర్ణనంబు
సలుపఁగా వశమౌనె శారద కైన
నావేయితలలున్నయహీపతికైన.
అయ్యయోధ్యానగరాధిరాజంబు
శోభాయమానమై చూపట్టె - నపుడు
ప్రభుదర్శనము సేయ రాత్రి యే తెంచి
తనపతి యైనట్టి తరణినిఁ గాంచి
సంకోచపడుచును స్వాంతంబులోన
నట నిల్చియుండె సంధ్యారూపమందు
నను నటుల్ గనిపించె; నాసమయమునఁ
గ్రమ్మిన సందెచీఁకటులట్లు దోఁచె
నగరుధూపముల మేఘావళు లెల్ల.
కనఁగఁ బై కెగఁ జిమ్మఁగాఁ బడినట్టి
బుక్కాయి భర్గుండపొడు లాకసమున
నరుణసంధ్యారాగమై వెలుఁగొందె.
మందిరాగ్రంబుల మణిసమూహములు
తారకాకోటివిధంబున నుండె;
క్ష్మానాథసౌధాగ్రకలశంబు దోఁచె
విమలమంజులచంద్రబింబంబు ఓలె.
అతిమృదులంబులై యలరారుచున్న
రాజమందిరవేదరావముల్ చెలఁగె-
సాంధ్యకాలోచితశ్రావ్యవిహంగ
సంగీతకలకలస్వనములువోలె.
ఈకౌతుకముఁగాంచి యినుఁడు మైమఱచె
నేకమాసం బిట్లు లేగె సూర్యునకుఁ
దెలియకుండఁగ నె సతీ! శైలతనయ!
ఆదినం బొకమాస మయ్యె నీమర్మ
మెవ్వ రెఱుంగ రొకించుకేనియును.
నిల్చుండె రథ మాపి నింగి సూర్యుండు
నింక నిశీథిని యెట్లుండఁగలదు?
ఎవ్వ రెఱుంగలే దీరహస్యమును
జివరకు సూర్యుండు శ్రీరామచంద్రు
గుణగాన మొనరించుకొనుచు గమించె.
ఆమహోత్సవరీతి నానందముగను
సురమునినాగులు చూచి కండ్లారఁ
దమమహాభాగ్యంబుఁ దా మెంచుకొనుచు
నిర్గమించిరి నిజనిలయంబులకును.
అతిదృఢవిశ్వాస మాత్మలోఁగలుగు
దాన వీ వౌటచే ధరణీధ్రతనయ!
ఏను గావించినయింకొక్క పనినిఁ
దెలుపుచునుంటిని దేవిరో! వినుమ.
ఎఱుఁగనిరీతిగా నితరు లెవ్వారును
నరరూపములఁ దాల్చినార మానాఁడు
నేను, గాకభుశుండి; యిరువుర మప్పు
డాయయోధ్యాపురమం దుంటి మహహా!
పరమసంతోషంబు, భావంబులోనఁ
బ్రేమసుఖంబు భరింపఁగా లేక
తనువుల మఱచియుఁ దన్మయత్వమున
విహరించితిమి మేము వీథుల వెంట.
ఆరామకృప కెవ్వఁ డర్హుఁడౌ నతఁడె
మా శుభచర్యను మదిలో గ్రహించు.
ఆసమయంబున నవనీశ్వరుండు
సర్వులవాంఛల సఫలం బొనర్చె.
గజరథతురగగోగణముల మఱియుఁ
గాంచనరత్నసంఘంబుల, వివిధ
చీనిచీనాంబరశ్రేణుల, నృపతి
దానంబొనర్చె నౌదార్యంబు వెలుఁగ.
సర్వులు హృదిలోన సంతృప్తి గాంచి,
"వర తులసీదాసు- ప్రభువు లైనట్టి
దశరథభూనాథుతనయు లందఱును
నవనిఁ జిరంజీవు లౌదురుగాక?-"
అనుచు దీవించిరి యానందపడుచు.
ఇటులఁ గొన్నిదినంబు లేగె నెవ్వరికిఁ
దెలియకుండ భ్రమించె దివములు నిశలు.

నామకరణము లొనర్పంగఁ దగిన
సమయ మేతెంచుట సొగ్గాధీశుఁ డెఱిఁగి,
జ్ఞానియైన వసిష్ఠసంయమీంద్రునకు
వర్తమానముఁ బంప, వచ్చె నామౌని;
ఆబుషివర్యపాదాంబుజంబులకుఁ
బూజఁ గావించియు భూపాలమౌళి,
"తాము విచారించి తగిననామముల
ధరియింపఁ జేయుఁడీ తనయుల" కనినఁ
బలికె నీరీతి నాబ్రహ్మర్షివరుఁడు:
"అగణితానుపమంబు లైనవి వీరి
నామధేయంబులు నరనాథ! ఐన
నన్మదాత్మకుఁ దోఁచినట్టి విధాన
నామకరణము లొనర్చెద నేను.
ఆనందవారాశి, అతిసుఖరాశి,
నిజకృపాహ్లాదితనిఖిలలోకుండు,
నీజ్యేష్ఠతనయుఁడు నృపలోకనాథ!
ఆనందధామ మీయఖిలప్రపంచ
విశ్రామకర మీచు వెలుఁగొందునట్టి
'రామ' నామమున విరాజిల్లఁ గలఁడు.
నృపశేఖరా! నీదురెండవసుతుఁడు
భువనంబు భరియించి పోషించుఁగాన
భరతనామంబున భాసిల్లఁ గలుగు.
ఎవ్వని లో స్మరియించినంతటనె
యరివినాశం బగు నతఁడు శత్రుఘ్నుఁ
డని వేదములలోన నభినుతుం డగును.
సకలసల్లక్షణసదనుఁడౌ వాఁడు
శ్రీరామునకుఁ గడుఁ బ్రియమైనవాఁడు
నఖిలలోకాధారుఁ డైనసౌమిత్రి
ధరియించు లక్ష్మణోదారనామమును."
చక్కఁగా లోన విచారణచేసి
యే, వసిష్ఠాచార్యుఁ డీప్రకారముగ
నామకరణము లొనర్చి యిట్లనియె:

"నరనాథ! నీదగునలువురు సుతులు
వేదతత్త్వాకృతుల్; వీరలలోన
శ్రీరామచంద్రుఁడు శివునిపాణింబు.
మునులధనంబును భువనజీవులకు
సర్వస్వ మైయున్నసారసాక్షుండు
బాలకేళీసుఖపారవశ్యమున
నిప్పు డున్నాఁడు నీయింట నరేంద్ర!"
పిన్ననాఁటను గోలెఁ బ్రీతి లక్ష్మణుఁడు
శ్రీరామచంద్రునిఁ జిత్తంబులోన
నాత్మాధిపతి, హితుఁ డంచు నెఱిఁగి
రామాంఘ్రిరాజీవరతుఁ డౌచు నుండె.
భరతశత్రుఘ్నులు ప్రభుభటులట్లు
లొండొరుల్ ప్రీతితో నుండి రెంతయును.
శ్యామలగౌరవర్ణాంగు లైయున్న
రామలక్ష్మణుల సత్ప్రథితసౌందర్య
మును గాంచి మాతలు మోదంబుఁ జెంది
దృష్టిదోషము పోవఁ దృణమును ద్రెంపి
పాఱవేయుచునుండ్రు పరమర్షివర్య!
ఆనలుగురు బాలు రతిశీలరూప
గుణధాము; లైననుగూడ శ్రీరాముఁ
డందఱికన్న నత్యధిక మైనట్టి
సుఖసాగరుం డయి శోభించుచుండె.
శ్రీరామచంద్రునిహృదయంబులోన
సదమలానుగ్రహచంద్రుండు వెలుఁగు.
ఆరాఘవుఁడు మనోహరహాసములను
విశ్వతాపము దీర్చు వెన్నెల లొలుకు.
ఒడిలోనఁ గొంతసే పూయలలోనఁ
గొంతసే పటె ముద్దుకొడుకుఁ గౌసల్య,
"నాకన్నతండ్రి! ఓ నాముద్దుకుట్టి"
అనుచు లాలించు నత్యంతానురక్తి.
ఆజగద్వ్యాపకుఁ, డానిరంజనుఁడు,
ఆనిర్గుణుఁడు, భవుఁ డానిష్క్రియుండు,

నగుపరబ్రహ్మ మహా! చిత్రరీతిఁ
గౌసల్యాపాణిపంకజయుగ్మమందు
నాటలాడుచు నుండె నర్భకుం డగుచు
నామె భక్తిప్రేమ లందునఁజిక్కఁ.
నీలాబ్జనిర్మలనీరదశ్యామ
కామకోటిమనోజ్ఞ కాయంబుతోడఁ,
గమలపత్రస్థితఘనమా క్తికోప
మానారుణాంఘ్రిపద్మద్వయలలిత
నఖముఖోద్గతమహోన్నతదీ ప్తితోడఁ,
అంకుశకులిశధ్వజాది రేఖా త్త
మహనీయపాదపద్మంబులతోడ,
మునిజనమానసమోహనశ్రావ్య
పాదాబ్జనూపురధ్వానంబుతోడ,
గమనీయకింకిణీకటితటితోడ,
ఉజ్జ్వలత్రివళీయుతోదరభాగ
నిరుపమానాన్యదుర్జేయగంభీర
పృథుమహాగాధనాభిస్థలితోడ,
భూరిభూషణమహాభుజములతోడ,
వ్యాఘ్రనఖాంధ్యభూషాతివిభ్రాజి
మహితమనోహరమణిహారయు క్త
కమ్రశంఖోపమకంఠంబుతోడ
ధాత్రీసురాంఘ్రిముద్రాశోభితాతి
రమణీయపీవరోరఃస్థలితోడ,
సుందరశుభకరచుబుకంబుతోడ,
అగణితమదనశోభాలయానంద
భవ్యభవ్యాననపద్మంబుతోడ,
నరుణాధరద్వయ మందముల్ చిలుకఁ
జిగురులపైనఁ గ్వచిత్తుగా మొలచి
తనరెడిరెండేసిదంతాలతోడ,
సంపెంగ మొగ్గకు సరిదీటువచ్చు
ముద్దులు గుల్కెడి ముక్కుతోడుతను,
కస్తూరికాతిలకంబుతో వెలయు
వర్ణనాతీతమాఫాలంబుతోడ,
రమ్యస్వరూపకర్ణంబులతోడ,
లావణ్యమయకపోలంబులతోడ,
అత్యంతమధురంబు లై మొద్దులొల్కు
వచ్చియు రానట్టి పలుకులతోడ,
జన్మించుటాదిగా సవరింపఁబడక
తల్లి చే బహుళవిధానంబులందు
రమ్యరమ్యంబుగా రచిత మైనట్టి
మృదువక్రకుంతలబృందంబుతోడ,
సొంపైన పచ్చనిచొక్కాయితోడ,
మోకాళ్ళపైనను మోచేతులందుఁ
బ్రాఁకుచుఁ బోయెడు బాలరాఘవుఁడు
సమ్మోహపఱచు నా స్వాంతంబు నెల్ల.
ఆబాలరామదివ్యాకారశోభ
నాశ్రుతు లైన, సర్వాధీశుఁ డైన
వర్ణింపఁజాలరు పర్వాతతనయ!
కలనైన దానినిఁ గాంచినవారె
ఇది చిత్తమందు గ్రహింపఁగాఁ గలరు.
ఆనందమయుఁడు, మాయారహితాత్ము,
డల మనోవాక్కుల కఖలేంద్రియముల
కందక వెలుఁగుచున్నట్టి యాశౌరి
ఆరాజమిథునమహాప్రేమవశత
భవ్యంబు లైనట్టి బాలలీలలను
సలిపినాఁ డోగౌరి! సకియ! అపర్ణ!
జగతికి జననియు జనకుఁ డైనట్టి
ఆరామభగవానుఁ డాప్రకారముగ
నాయయోధ్యాఁగల ప్రజావళి నెల్ల
నానందసంభరితాత్ములఁ జేసె.
రఘునాథపాదాబ్జరతులకే యట్టి
పరమసుఖంబు భవాని! ప్రాప్తించు.
రఘుపతివిముఖుఁడు శ్రమ లెన్ని పడిన

భవబంధము క్తిని బడయఁగా లేఁడు.
సచరాచరప్రపంచం బెల్ల గనఁగ
నేమాయచేఁ జిక్కియిడుములఁబడునో-
ఆమాయసైత మహా! వానిముందు
భయముచే గడగడ వణకు; శ్రీరాము
లావణ్యభృకుటీవిలాసమాత్రమున
నామాయ మఱియు నాట్యం బొనరించు-
నట్టిజగన్నాథుఁ ద్యజియించిన మన
మెవ్వని భజియింతు మింక భవాని?
తమచతురత్వంబుఁ ద్యాగంబొనర్చి
త్రికరణశుద్ధి నేధీరులు తనను
భజనం బొనర్తురో వారలయందు
శ్రీరఘురాముఁడు కృపఁ జూసఁగలఁడు.
ఈ ప్రకారము జగదీశుండు శౌరి
లావణ్యబాలలీలావిలాసముల
సకలపౌరావళి సంతోషపఱచె.
ఆబాలరాముని నాజనయిత్రి
ఆడించు కరములయం దెత్తికొనియు,
నొకసారి నూయల నుంచియు నూపు,
నాప్రేమలో మగ్న యైనకౌసల్య
మఱచె దివానిశల్ మానసమందు.
పుత్రవాత్సల్యసంపూరిత యగుచు
నాబాలరామలీలావళు లెల్లఁ
దగఁ బాటఁ బాడు నాతల్లి కౌసల్య.
కౌసల్య యొకనాఁడు కన్నకుమారు
జలకమాడించి భూషణములఁ దొడిగి
ఊయలయందుఁ బరుండఁగాఁ బెట్టి-
బుజ్జిపాపను నిద్రపుచ్చినపిదపఁ
దనయిష్టకులదేవతను సమర్చింప
స్నానంబొనర్చె నాసాధ్వీమతల్లి.
ఆపయి నిజదేవతార్చనఁ జేసి,
నైవేద్య మొసఁగి, యనంతరం బామె
పాకగేహమునకు వచ్చియుఁ దిరిగి
పూజాగృహమునకుఁ బోయి వీక్షింప-
నైవేద్య మిడినయన్నంబును బ్రీతి
భక్షించుచుండెను బాలరాముండు.
భయపడి యామాత పరుగిడి పోయి
యూయలలోఁ జూడ, నూయలయందు
నిద్రించుచుండెను నిసుఁగు రాఘవుఁడు.
తిరిగి యాకౌసల్య దేవమందిరముఁ
గనుఁగొన, నెప్పటికరణి యందుండె
బాలుఁడౌ రాముఁడు బహువిచిత్రముగ.
ఆమె కంపించె భయభ్రాంత యగుచు-
ధీరత్వమెల్ల గతింపఁ జిత్తమున.
ఒకని దేవళమున నొకని నూయెలను
బాలకద్వయము నప్పడఁతి వీక్షించె.
"నా మతి భ్రమియించెనా?, లేక యిద్ది
చిత్రమా మాయావిశేషదృశ్యంబొ?"-
అనుచుఁ జింతించె నిజాత్మఁ గౌసల్య.
తనతల్లియాకులత్వంబు వీక్షించి
శ్రీరామచంద్రుఁడు చిఱునవ్వు నవ్వె.
మాత కంతటఁ జూపెఁ బరమాత్మ తనదు
విమలాద్భుతాఖండవిశ్వరూపమును:
ప్రతిరోమరోమకూపంబున నుండె
బ్రహ్మాండకోటులు పర్వతతనయ!
అగణితరవిచంద్రహరచతురాస్య
బహుగిరివాహినీవార్ధిభూవలయ
వనకాలకర్మలఁ, బ్రకృతిగుణాల,
జ్ఞానస్వభావాల, సంఖ్యకు మించు
నింతకు మున్ను తా నెన్నఁడు వినని
బహువిషయముల నావనిత దర్శించె.
ఆపయిఁ గౌసల్య యఖిలవిధాల
మహితబలిష్ఠమా మాయను గాంచి,
యతిభీతచిత్తయై హస్తాబ్జయుగము

నొగి మోడ్చికొని నిలుచుండె నోగారి!
ఆవిశ్వరూపమునం దామె మఱియు
నరసెను మాయచే నాడింపఁబడెడి
జీవుని, నాబద్ధజీవుని మరల
బంధముక్తుని జేయు భక్తితత్త్వమును.
ఇవియెల్లఁ గాంచి యాయింతి కౌసల్య
పులకింపఁ దనువెల్ల, ముఖమండలమున
వచనంబు లాగఁగాఁ బరశవ యూచు
ముకుళించుకొని నేత్రముల, భక్తి గదుర
వినతమస్తక యయ్యె విభుపదాబ్జముల;
నపు డాఖరారి శ్రీహరి రామవిభుఁడు
తనతల్లి విస్మయత్వముఁ గాంచి, మరల
శిశురూపమును యథాస్థితిగ ధరించె.
ఆమాత నుతిసేయ నసమర్థ యయ్యె.
"ఆజగత్పితఁ బరమాత్మనా! నేను
కొమరునిగా నెంచుకొనుట" యటంచు
నామహారాజ్ఞి భయాకుల యయ్యె;
అప్పు డాశ్రీహరి యామాత నరసి
పలుపలువిధముల స్వస్థఁ గావించి,
"అమ్మ! నీ వీరహస్యము సుంత యిపుడు
బహిరంగపఱచఁగా వల దెందునేని"-
అని వచియించె నోయచలేంద్రతనయ!
అంతటఁ గౌసల్య యంజలి పూని
పలుమాఱుఁ బ్రార్థించెఁ- "బరమేశ! నీదు
ఘనమాయ నాపైనఁ గ్రమ్మింప" కనుచు.
ఈధరాస్థలిపైన నీవిధానమునఁ
బ్రకటించి బహువిధ బాలలీలలను
హరి, దాసజనుల మహానందపఱచె.
కొంతకాలమున కాకూర్మిసోదరులు
సర్వులు గడచిరి శైశవదశను.
పరిజనగణము సంబర మొంద నంత
నాచార్యుఁ డరుదెంచి యాకుమారులకుఁ
జూడాకరణకర్మ సొంపొప్పఁ జేసె.
భూరిదక్షిణల విప్రులు పొంది రప్పు
డాకుమారచతుష్టయంబు ధరిత్రిఁ
బరమమనోహరాపారచర్యలను
సలుపుచుఁ దిరిగెను సాకేతపురిని.
ఆమనోవాక్కాయ లందుకో లేని
ప్రభు వహా! దశరథప్రాసాదమందు
విహరించె బాలునివిధముగా గౌరి!
భోజనం బొనరింపఁబోవుచు రాజు
పిలిచినఁ దనతోడిపిల్లల విడిచి
పోఁడయ్యె నాబాలమూర్తి రాఘవుఁడు.
అంతటఁ గౌసల్య యరుగఁ బిల్చుటకుఁ
బ్రభు వహా! చిక్కక పరువెత్తుచుండె.
'నేతి నేతి' యటంచు నిగమంబు లెవని
సన్నుతించుచు నుండు; సాంబశివుండు
సైత మేకేశవు సాంతంబు గనఁడొ-
ఆపరమేశ్వరు నాజనయిత్రి
బలమునఁ బట్టఁగాఁ బరువెత్తె-నప్పు
డట ధూళిధూసరితాంగుఁడై వచ్చి
నట్టిబాలునిఁ గాంచి యవనీశ్వరుండు
పకపక నవ్వుచుఁ బై కెత్తుకొనియె.
ఆబాలరాఘవుఁ డన్నము న్దినఁగఁ
గూర్చుండి యుండినఁ గూడఁ జిత్తంబు
చలియించుచుండెను: సమయ మొక్కింత
దొరకినచో నింక దొరకక లేచి
పకపక నవ్వుచుఁ బరుగిడుచుండు-
పెదవులసందునఁ బెరుగన్న మొప్పు.
అతిసరళంబు సుఖాస్పదం బైన
బాలరామునికథ భారతీదేవి,
శేషుండు, శ్రీసాంబశివుఁడు, వేదములు
గానంబు చేసి రాకథలయం దెవరు
విముఖులో వారలు విధిచేత మిగుల

వంచితు లోభరద్వాజమునీంద్ర!
అంత నాసోదరు లందఱుగూడఁ
గౌమారదశ నొందఁ గాంచి గురుండు,
తల్లిదండ్రులును, శాస్త్రము పల్కినట్లు
లుపనయనంబుల నొనరించి రంత.
శ్రీరఘుపతి గురుగృహమున కేగి
యల్పకాలమ్మున నన్ని విద్యలను
ఆతితేజునుజుమీ అరయఁగా నెవని
సహజనిశ్వసనముల్ సకలవేదంబు
లాహరికొకొక్కొ విద్యార్జనశ్రమము?
ఇది యెంత కౌతుకం బెంచి చూడంగ!
విద్యావినమ్రతావిమలసౌశీల్య
నిపుణులై వారలు నృపలీల లెల్ల
జగతిఁ గ్రీడించిరి సంయమివర్య!
బాణధనుష్పాణిభాసురు లైన
ఆసహోదరుల మహాశోభ నరసి
సచరాచరప్రపంచము మోహ మొందె.
ఆసోదరులు నల్వు రానగరమున
వీథులయందున విహరించుచుండ
నచ్చటిజను లెల్ల నరయుచు వారిఁ
గదలక నిలుచుంద్రు కాయముల్ మఱచి.
ఆయయోధ్యానగరావాసి యైన
ఆ బాలగోపాల మఖిలజనంబు
రాముఁ గృపాళునిఁ బ్రాణాధికముగఁ
దలఁచి ప్రేమించె నాత్మను సంతతంబు.
నిజసోదరసుసఖాన్వితుఁడౌచు రాముఁ
డనుదినంబును మృగయావినోదంబు
సలుపఁగా నేగును సాంద్రాటవులకు.
సముచితాలోచనాస్వాంతంబుతోడఁ
బావనం బైనట్టిపథమును విడక
వేటఁ గావించి తా వేసినయట్టి
క్రూరమృగంబులఁ గొని తెచ్చి చూపు
నవనీశునకు రాముఁ డనుదినం; బటులఁ
దద్రామబాణహతప్రాణు లైన
మృగము లెల్లను స్వర్గ మేగె మునీంద్ర!
ఆరామచంద్రుఁడు ననుజులతోడ,
సఖులతోఁ గలసి భోజనమొనరించుఁ;
దల్లిదండ్రులయాజ్ఞ దాఁటక నడచు;
సర్వదా పౌరులు సంతోషపడెడు
పద్ధతియందె కృపామూర్తి యగుచు
వర్తించు నారామభద్రుండు మిగుల.
సంప్రీతి గదురగా స్వాంతంబునందు
వేదపురాణముల్ వినును; దదీయ
దివ్యార్థములను బోధించుఁ దమ్ములకు.
ఉదయమే లేచి, రఘూద్వహస్వామి
భక్తిఁ బ్రాచార్యపాదవందనము
సలిపియు, వారియాజ్ఞను బొంది, పిదపఁ
బట్టణకార్యతత్పరుఁడౌచు నుండు,
ఆరాముధర్మచర్యలను వీక్షించి
హర్షించుచుండెఁ దా నాత్మలో నృపతి.
ఆయఖిలవ్యాపి యాయద్వితీయుఁ
డాయనీహుం డజుఁ డానిర్గుణుండు
ఆనామరూపశూన్యబ్రహ్మ మహహా!
భక్తహితార్థమై బహువిధానుపమ
చిత్రలీలల నొనర్చెను భరద్వాజ!

యజ్ఞరక్షణార్థము విశ్వామిత్రమహర్షి
రామలక్ష్మణులను దనవెంటఁ దీసికొనిపోవుట

ఆపయికథ శ్రద్ధ నాలింపు మింక:
జ్ఞానఘనుండు విశ్వామిత్రమౌని
వర్యుం డొకానొక పావనాటవిని
నివసించు చటమహా నియమంబు దనర
జపయజ్ఞ యోగముల్ సలుపుచునుండె;
కాని యామునిపతి కడుభీతిఁ జెందె-

భయదమారీచసుబాహులనియెడి
రాక్షసాధముల దౌర్జన్యంబులకును.
యజ్ఞంబుఁ గనుగొన్న నానిశాచరులు
చని, యుపద్రవముల సలిపి, యామునికి
దుఃఖంబు కలిగింపఁదొడఁగి రెంతయును.
హరిచేతఁ దప్పఁ దా మన్యులవలనఁ
బొపపుదానవుల్ వధియింపఁబడఁగ
టంచును దలపోసె నాగాధిపుత్రుఁ;
డంత నామునిపతి యాత్మ నిట్లించె:
"అవనీమహాభారహరణంబు సేయ
నాహరి యవతార మందియే యుండె
నిది మూలకంబుగా నే నేగి వాని
శ్రీపాదములను దర్శింతును గాక!
తగురీతిఁ బ్రార్థించి తత్సహోదరుల
నిర్వురఁ గొనితెత్తు నిటకు సంప్రీతి,
జ్ఞానవైరాగ్యముల్ సకలగుణంబు
లెవ్వానియందున నెపుడు వసించు
నాజగన్నాథుఁ గండ్లార వీక్షింతు"-
నని బహువిధచింత లాత్మఁ గావించు
చరిగి యయోధ్యకు నంత నవ్వాని
సరయూజలంబుల స్నానంబుఁజేసి
దశరథభూనాథుదర్బారుఁ జేరె.
ఆలించియామునియాగమనంబు
భూదేవతాబృందములఁగూడి, నృపతి
ఎదురేగి, స్వాగతం బిచ్చి, పాదముల
దండప్రణామముల్ తా నొనరించి,
మహితరీతిగను సన్మానంబుఁ జేసి,
ఆమునివర్యు నిజాసనాసీనుఁ
గావింపఁగాఁజేసి, కడిగి పాదముల
ఘనపూజఁ గావించి, కడుభక్తిఁ బలికె-
ఈనాఁడు నిజ మెంచునెడల నీనన్నుఁ
బోలినధన్యుఁ డీపుడమి లేఁ డొకఁడు

అని వచియించి మహారాజు పిదప
సంతృప్తిపఱచె నాసంయమీశ్వరుని
వివిధరుచ్యాన్నముల్ పెట్టించి ప్రీతి.
రాజు చేసినసపర్యల నెల్లఁ జూచి
యతిహర్ష మందె మహర్షి స్వాంతమున.
అంతట నృపమౌళి యాత్మనందనుల
నలుగుర నామునినాథుపాదములఁ
జేర్చి నమస్కృతుల్ సేయఁగాఁ జేసె.
శ్రీరామచంద్రు వీక్షించినంతటనె
తాపసి మఱచెను దనతనుస్మృతిని;
ఆరామముఖశోభ నరసి యామాని
అల పూర్ణశశిఁ గన్న యట్టిచకోర
మటుల బ్రహ్మానందమందున మునిఁగె.
అంతట రాజు నిజాత్మ హర్షించి
యీవిధంబుగ వచియించె; "మునీంద్ర!
ఇంతకు మున్నెన్నఁ డిట్టిసత్కృపను
నా పైనఁ జూప రీనాఁడు సూపితిరి.
ఏకారణమున మీ రేతెంచినారు?
తమయాజ్ఞ నెఱవేర్తుఁ దత్క్షణ మందె."
అనిన విశ్వామిత్రుఁ డనియె నీరీతి:
"అవనీశ! దశరథా! అసురబృందములు
నను బాధపెట్టుచున్నవి యందుచేత
అధిప! ని న్నొక్కటి యడుగ వచ్చితిని:
అనుజుఁ డౌలక్ష్మణుఁ డనుగమింపంగ
రాము నంపఁగవలె రాజ! నా వెంట;
ఆనిశాచరులవధానంతరంబు
నాకు స్వాస్థ్యము గల్గు నరలోకనాథ!
హర్షచిత్తమున నీ యాత్మనందనుల
నా వెంటఁ బంపు మీనాఁడు, నీలోని
మోహంబు నజ్ఞానమును ద్యజియించి.
ధర్మసద్యశము ప్రాప్తంబగు దీన
నతిశుభం బొదవు నీ యాత్మజులకును.

అత్యప్రియంబు లీయూలాపములను
విన్నంత దశరథోర్వీనాథునెడఁద
నడలెత్తె నతని ముఖాబ్జంబు వాడె;
నీరీతిఁ బలికె మునీంద్రుతో నతఁడు:
"ముదుసలితనమున మునిరాయ! నాకుఁ
బుట్టి రీనలుగురు పుత్రులు; స్వామి!
ఈవిషయమ్ము మీ రెంచ కీరీతి
నడిగినారలు. మహాత్మా! విప్రవర్య!
అడుగుఁడు భూగోధనాగారసమితి
నడుగుఁడు సర్వస్వ మానందపడుచు
నీక్షణంబందె మీ కే సమర్పింతుఁ;
బ్రాణికోటికిఁ దనుప్రాణాలకన్న
నధికప్రియంబైన వరయ లే, వవియుఁ
దత్క్షణమే నేను ద్యజియింపఁగలను.
నా సుతు లందఱు నాకుఁ బ్రాణమ్ము
లందులో రాముని నణుమాత్రమైన
విడనాడి నేను జీవింపలే ననఘ!
అతిఘోరతరకథోరాత్మ లైనట్టి
ఆనిశాచరు లేడ? అతిసుకుమారు
లైననామద్దుల యాత్మజు లేడ?"
అని నృపశేఖరుఁ డాడినయట్టి
ప్రేమరసప్లుతప్రియవాక్యపటలి
నాలించి తనహృదయమున హర్షించె
జ్ఞానఘనుండు విశ్వామిత్రమౌని.
అంత వసిష్ఠమహర్షి బోధింపఁ
బరిపరివిధముల భావంబులోన
నృపుఁడు సందేహానివృత్తిని బొంది,
యత్యాదరంబున నాత్మనందనుల
రామలక్ష్మణులను రావింపఁ జేసి,
గుండెకు హత్తించుకొని ప్రేమ పొంగ,
మంచిబుద్ధులు బహుమార్గాలఁ దెలిపి,
గాధేయుఁ గాంచి యీకరణి వచించె:

"నాథ! యీయిరుగారు నాదుప్రాణమ్ము
లిఁకఁ బైనఁ దండ్రి మీ రే వీరి కనఘ!
ఇంకొక్క దిక్కు లే దీ బాలకులకు."
బహువిధాశీస్సులఁ బై గురిపించి
యొప్పగించెను ఋషి కుర్వీశుఁ డంత
రామలక్ష్మణుల గారాబంపుసుతుల.
ఆపయి వారు మాత్రాలయంబులకుఁ
జని, యంఘ్రులకు నమస్కారముల్ సలిపి,
వారియాజ్ఞ లఁబొంది పయనించి వనికి-
ఆయిరువురు వీరు లానరసింహు
లాకృపాసాగరు లామతిధీరు
లావిశ్వకారణు లామహామహులు
రామలక్ష్మణులు ధీరస్వాంతు లగుచు
మునిభయంబును బాపఁబోయిరి గారి!
అరుణమనోజ్ఞనేత్రాంబుజాతములు,
బహువిశాలాంచితవక్షస్థలంబు,
వరకరికరదీర్ఘ బాహుదండములు,
చారునీలాంబుజసాంద్రతమాల
సమమహాకోమలశ్యామలాంగంబు,
పీతపటపరిదీపితకటిస్థలము,
ఘనధనుర్బాణసంకలితహస్తములుఁ
గలిగి రాఘవుఁడు ప్రకాశించుచుండె.
శ్యామలగౌరాంగులై సొంపు గులుకు
నారామలక్ష్మణు లనుమహానిధులఁ
బొందె విశ్వామిత్రమునిశేఖరుండు!
"అహ! ఈశ్వరుండు బ్రాహ్మణహితకరుఁడు.
అందుకే భగవానుఁ డాతనిజనకు
వదలి నాకొఱకయి వచ్చుచునుండె-"
ననుచు విశ్వామిత్రుఁ డాత్మఁద లంచె.
మౌని యు ల్లెగుచు మార్గమధ్యమునఁ
దాటక యను ఘోరదానవి న్జూపె.
వారి ప్రసంగశబ్దము వినినంత

నాఘోరరాక్షసి యాగ్రహం బొప్పఁ
బరుగిడి వచ్చెను వారలపైకి;
ఒక్కబాణమున నాయుగ్రరాక్షసిని
సంహరించియు రామచంద్రుండు శౌరి
అది దీనురాలని యాత్మ నెఱింగి
తనపదం బొసఁగెను దాక్షిణ్య మొప్ప.
అంత గాధేయమహర్షిపుంగవుఁడు
తనహృదీశుండు విద్యానిధి యంచుఁ
జిత్తంబులో నెంచి, శ్రీరాఘవునకు
క్షుత్పిపాసలు లేక శోభించురీతి
నసమాన దేహబలాధిక్యములను
ఘనతేజ మొనఁగూర్పఁ గలిగినయట్టి
విద్య నొసంగె సంప్రీతి వెలుంగ.
తదనంతరంబు తత్తాపసవర్యుఁ
డఖిలాస్త్రశస్త్రవిద్యారహస్యముల
నన్ని సమర్పించి, యాజగత్ప్రభుని
స్వీయాశ్రమంబునఁ జేర్చి, భుజింపఁ
గందమూలఫలాలఁ గడుభక్తి నొసఁగెఁ-
నాతఁడే తనహితుం డనుచు గ్రహించి.

విశ్వామిత్రయజ్ఞసంరక్షణము

ఉదయకాలమున రఘూత్తమస్వామి
మునిని గనుంగొని, "పోయి, మహాత్మ!
యజ్ఞంబు సలుపుమా! యతినిర్భయముగ"
నన మును లెల్లరు నగ్నికుండముల
హోమంబు లొనరించుచుండి రామభము
రాముఁడే స్వయముగా రక్షించుచుండె.
ఈసమాచారంబు నెల్ల నాలించి
యల మునిద్రోహి దురాగ్రహోదగ్రుఁ
డైన మారీచనీచాసురుం డంతఁ
దనసైన్యములఁ గొని దండెత్తివచ్చె.
కొన లేనిబాణంబుఁ గొని రాఘవుండు
వదలఁగా వాఁ డల వార్ధి కావలను
శతయోజనంబులు చని మూర్ఛఁబడియె.
నాపయిశ్రీరాముఁ డగ్నిబాణమున
ఆసుబాహునిప్రాణహరణం బొనర్చె.
తక్కినరాక్షసతండంబు నెల్ల
నాలక్ష్మణుండు సంహారం బొనర్చె.
ఇటుల దైత్యుల వధియించి యానాఁడు
బ్రాహ్మణభయము నివారించె శౌరి.
అఖిలదేవమునీంద్రు లానందపడుచు
సంస్తుతించిరి రామచంద్రు, మునీంద్ర!
మఱి కొన్ని దినము లామానులమధ్య
శ్రీరఘుస్వామి వసించి సత్కృపను
విప్రులపైనఁ జూపించె, నా ద్విజులు
ఆరామవిభుఁ డెన్న నఖిలజ్ఞుఁడైన
భక్తివశంబుచే బహుళపురాణ
వివులకథావళి వినిపించి రనఘ!

అహల్యాశాపవిమోచనము

అంతట గాధేయుఁ డాదరమొప్ప
శ్రీరాముముఖము వీక్షించి సంప్రీతి,
"ఓ ప్రభూ! మన మొకానొకకార్య మరయఁ
బోవుద" మన రఘుపుంగవుం డలరి
యలధనుర్యజ్ఞంబు నరయఁ దలంచి
యనుగమించె మునీంద్రు ననుజునితోడ.
ఖగమృగజీవముల్ కన నొక్కటైన
వసియింపకుండఁగా బోవురు మనెడి
యాశ్రమం బొకటి వా ఱరసిరి మార్గ
మధ్యంబునందున మానివరేణ్య!
అప్పు డయ్యాశ్రమమం దున్నయొక్క-
శిలను గనుంగొని శ్రీరామవిభుఁడు,
దానివిశేషంబుఁ దాపసి నడుగ
నద్దానికథ నెల్ల నాముని పలికెఁ:

"ఘనశాపవశమున గౌతమపత్ని
యీశిలాకృతి ధరియించి యిచ్చోట
రామ! నీ పాదాబ్జరజము నాశించి
యోర్పుతో వీక్షించుచున్న దీవేళ
నీమెను గరుణింపవే రఘువీర!"
అఖిలదుఃఖంబుల హరణం బొనర్చు
పావనశ్రీరామపాదాంబుజములు
సోకినమాత్రానఁ జోద్యంబు గదుర
నమలతపఃపుంజమై యాయహల్య
వ్యక్త యయ్యెను. భరద్వాజమునీంద్ర!
దాసజనాహ్లాదదాయకుం డైన
యారఘునాయకు నరసి, యహల్య
ముకుళించి కరములు, ముందు నిల్చుండె.
అతిభక్తివశతచే నవశాత్మ యగుచుఁ
బులకీకృతాంగయై ముఖమునందుండి
మాటలు వెడల కామానిని నిలిచె.
అతిభాగ్యశాలిని యా నాయహల్య
పట్టెను శ్రీరామపాదపద్మముల
బాష్పముల్ కన్నుల వరదలు గట్ట.
స్మృతి తెచ్చుకొని, కొంతసేపటి కామె
ఆతఁడు హరి యని యాత్మలో నెఱిఁగె.
ప్రభు రఘునాథు కృపావిశేషమున
నాయహల్యాదేవి హరిభక్తి పొంది
అతివినిర్మలవాణి యలరారుచుండ
శ్రీరాము నిటులఁ బ్రార్థింపఁగాఁ దొడఁగె:

అహల్యాకృత - శ్రీరామస్తవము

గేయము

"జ్ఞానగమ్య, జయజయ రఘునేతా!
రావణారి! బుధజనసుఖదాతా!
నే నపవిత్ర స్త్రీని మహాత్మా!
ఐనఁ గాచితివి జగత్ప్రభూతా!
శరణుఁ గోరితిని భవభయమోచన!
పాహి! పాహి! పంకేరుహలోచన!
నాపతి యొసఁగిన శాపము దేవా!
గొప్ప వరంబె కృపామయభావా!
భవమోచనహరిమంగళాకృతిన్
గనులపండువుగఁ గాంచఁగల్గితిన్
శంకరుండు నీ సందర్శనమున్
మహాభాగ్య మని యెంచు సతమ్మున,
అజ్ఞురాల నే నోరఘురామా!
నా దొకవిన్నప మాలకింపుమా!
ఇతరవరంబులు గోరను నాథా!
నీ పదపద్మరజంబు సర్వదా
పుష్పమరందము మధుపము రీతిన్
సత మాసించెడి సదమలభక్తిన్-
నా మతియందునఁ బాదుకొల్పుమా!
జగన్నాథ! తండ్రీ! రఘూత్తమా!
ఎవనిపదోద్భవ పావన గంగన్
శివుఁడు శీర్షమునఁ దాల్చెఁ జెలంగన్.
ఎవనిపదాబ్జములన్ నిజాత్మలో
పంకజాసనుఁడు పూజ సేయునో
ఆనీపాదము లాదయాఝరీ!
నా శిరమున నిల్పితివి శ్రీహరీ!"

అని గౌతమాంగన హరిని శ్రీరాము
సంస్తోత్ర మొనరించి సద్భక్తితోడ
శ్రీరామపాదరాజీవంబులందుఁ
బలుమాఱు ప్రాలియుఁ బ్రణతు లొనర్చి
స్వాత్మప్రియంబైన వరమును బొంది
యారామచంద్రునియాజ్ఞ గైకొనియు
నానందసంభరితాంతరంగమున
నాథునిలోకమునకు నిర్గమించె.

గేయము

అట్టి యహేతుక కరుణానిలయుం
డార్తబాంధవుం డాశ్రీరాముఁడు,
కపటకలహములు పరిత్యజింపుము
మూఢతులసి, శ్రీహరిని భజింపుము.

శ్రీరామచరితమానసము

బాలకాండము

సప్తమవిశ్రామము

ఛత్రీభూతఫణీంద్రాః
ధాత్రీశోకాపహారః ధర్మాధ్యక్షః
శాత్రవభీకరః భవతా
పత్రయహరః మట్టపల్లివాసః నృసింహాః

సంయమివర్యు విశ్వామిత్రుఁ గూడి
శ్రీరామలక్ష్మణుల్ చేరిరి లోక
పావనగంగాప్రవాహతీరమును.
ఆసురవాహిని యవనీస్థలంబు
చేరినకథ నెల్లఁ జెప్పె గాధేయుఁ
డంతట శ్రీరాముఁ డఖిలర్షిగణము
స్నానాదికృత్యముల్ సలిపిరి; పిదప
విప్రులు పడసిరి వివిధదానముల.
మునిబృందములఁ గూడి మోదంబుతోడఁ
బయనమై శ్రీరామభద్రుండు వేగఁ
దద్విదేహులరాజధానియై వెలుఁగు
మిథిలాపురంబు సమీపించె ననఘ!
రాముఁ డాపట్టణరమ్యతఁ గాంచి
యనుజునితోడ మహాహర్ష మొందె.
మణిమయసోపానమహితంబు లైన
యమృతోపమానశుభ్రాంబుసంపూర్ణ
వాపీసుకూపప్రవాహకాసార
ఘనతటాకంబులు గనిపించె నెన్నో.
మంజుగుంజన్మధుమత్తభృంగములు
మధురకూజితరాగమయవిహంగములు
బహువర్ణ వికసితపంకజాతములు
సర్వదా సుఖము నొసంగుచు వీచు
మందశీతలగంధమలయమారుతము
వారల నాహ్లాదపఱచె గాఢముగ.
ఆనగరంబున కన్నివైపులను
విపులవిహంగసంభృతములై చెలఁగి
ఫలపుష్పపల్లవభరితంబు లైన
వరవాటికోద్యానవనము లొప్పారె.
వర్ణనాతీత మాపట్టణశోభ—
యందలి ప్రత్యణు వాశ్చర్యపఱచు.
విమలసుందరరాజవీథి వెలుంగు
బ్రహ్మ స్వయంబుగా రచియించె ననఁగ
మణిమయబహుచిత్రమహితసౌధములు.
ధనదసమానులై తనరుచున్నట్టి
వరవణిగ్జనులు వ్యాపారశాలాళి
నఖిలవస్తువులతో నలరారుచుండ్రి.
మహితమనోహరమార్గకూటములు
సుందర వీథులు శోభిల్లుచుండె
నమితసుగంధి జలార్ద్రంబు లగుచు
మందిరావళు లెల్ల మంగళమయము
లామందిరంబులయందు వెలుంగు
చిత్రముల్ రతిపతిచే వ్రాయఁబడిన
పగిదిగా నాశ్చర్యపఱచు నెల్లరను.
పురమునం దున్నస్త్రీపురుషు లందఱును

సుందరుల్, భ క్తులు, శుచిగలవారు,
సద్ధర్మశీలురు, జ్ఞానభాసురులు,
సద్గుణవంతులు, సంయమివర్య!
నిరుపమానం బౌచు నెగడుచునుండె
జనకభూపతి యుండుసౌధరాజంబు;
అతనిసంపదఁ గాంచి యమరులుఁ గూడ
నాశ్చర్యమందెద రాత్మలయందు.
ఆమహోదుర్గకుడ్యంబు సైతంబు
మనసు నాశ్చర్యనిమగ్నం బొనర్ప్ప;
నఖిలప్రపంచంబునందలిశోభ
దానిలోఁ గూడినదా! యనిపించు
వివిధవర్ణంబుల వెలుఁగొందుచున్న
బహుమణిమయభర్మపటము లందందుఁ
దనరారుధవళసౌధంబులం దుండె.
వానిలో సీత నివాసంబు సేయు
సుందరమందిరశోభ వర్ణింప
వశమానె! ఓ భరద్వాజమునీంద్ర!
అందంబు లొలుకు సింహద్వారములను
వజ్రకవాటముల్ భాసిల్లుచుండె;
నమ్మహాద్వారసీమాంగణమందు
సామంతనరపాలసంఘంబు లఖిల
వందిమాగధనటభట్టారకజన
మనయంబు కిటకిటలాడు క్రిక్కి ఱిసి.
హయగజరథసంకులాకరంబులుగఁ
గ్రాలు విశాలాశ్వగజశాల లచట.
బహుశూరజనమంత్రివరచమూపతులు
తనరారుచుండి రాధాత్రీంద్రమణికి.
వారల సదనముల్ వఱలు నృపాలు
మందిరంబునకు సమానంబు లగుచు.
ఆపుర బాహ్యమునందు రాజిల్లు
దివ్యసరస్సరి త్తీర దేశముల
నిట నట విడిసి రనేకభూపతులు.

అన్నివిధంబుల నతియోగ్యమైన
యసమానశోభతో నలరారు నొక్క-
చూతవనమ్మునుఁ జూచి కౌశికుఁడు,
"సుజ్ఞాని! రఘువీర! చూడు మీవనము
బాగుగా నున్నది వసియింత మిండె"
అనఁ గృపాలయుఁ డైనయారామవిభుఁడు
"స్వామి! మంచి" దటంచుఁ బలికి, యచ్చోట
విడిసెను మునిజనబృందయుక్తముగ.

శ్రీరామలక్ష్మణులను సందర్శించి
జనకమహారాజు ప్రేమపరవశుఁ డగుట

"వచ్చె విశ్వామిత్రవరముని" యనెడు
వార్త విదేహభూపాలునిఁ జేరె.
జనకభూపతి యంత సదమలసచివ-
భటగణభూసురవరగురుజ్ఞాతి-
జనులతోఁగూడి యాసంయమీశ్వరుని
దర్శింప నేగె సంతసము దీపింప.
అచ్చేగి జనకమహారాజమౌళి
నూనీంద్రుపాదపద్మంబులయందు
శిరము నుంచియు నమస్కృతిని గావింప
మునిపతి దీవించె ముదితాత్మఁ డగుచు.
పిదప భూపతి విప్రబృందంబులకును
వందనంబులు చేసి భక్తి వెలుంగఁ
దనమహాభాగ్యంబుఁ దలఁచి యుప్పొంగె.
పలుసార్లు కుశలముల్ ప్రశ్నించి నృపునిఁ
గూర్చుండ నియమించెఁ గుశికనందనుఁడుఁ
అంతలో నుద్యాన మరయంగఁ జనిన
శ్రీరామలక్ష్మణుల్ చేరి రచ్చటకు.
శ్యామలగౌరాంగు లతిసుకుమారు
లఖిలమోహనరూపు లఖిలపర్వంచ
హృచ్చోరు లాబాలు రిద్దఱుఁగూడ.
శ్రీరఘుస్వామి వేంచేసినంతటనె

యందఱు నిలుచుండి రప్రయత్నముగ.
అంత విశ్వామిత్రుఁ డాదర మొప్ప
రామచంద్రుని దనప్రక్క భాగమునఁ
గూర్చుండఁగాఁ జేసికొనియెఁ జే చాచి.
ఆయన్నదమ్ముల నందఱుఁ జూచి
పరమసంతోషసంభరితాత్ము లైరి.
వారికన్గవల బాష్పములు జాల్వాఱె
దనువులు రోమాంచితంబు లై పోయె;
మధురమనోహరమంజులం బైన
యారామచంద్రుదివ్యాకృతిఁ జూచి
యావిదేహనృపాలుఁ డయ్యె విదేహుఁ
డతివిశేషంబుగా నానందవశత.
ప్రేమనిమగ్నుఁ డై నృపతి తెల్వొంది,
స్థైర్యంబు నెలకొల్పి స్వాంతంబునందు
మునిపాదపంకజముల కంత మ్రొక్కి
గద్గదకంఠుఁ డై గంభీరఫణితి
నీరీతిఁ దా వచియించె నత్తఱిని:
"ఈమనోహరబాలు రెవరు? మునీంద్ర!
మునికులతిలకులో, భూపాలసుతులో,
'నేతి నేతి' యటంచు నిగమంబు లాడు
ఆపరబ్రహ్మ మీయాకృతుల్ గనెనో!
సహజవిరాగి మత్స్వాంతంబు నేఁడు
వీరల దర్శించి వివశత్వ మొందె—
నల చకోరము చంద్రు నరసినరీతి.
అందుచే నేనిటు లడుగుచున్నాఁడ
నాకడ దాచక నాథ! గాధేయ!
సత్యంబుఁ దెలుపుమా! సంయమివర్య!
ఈకుమారులను నే నీక్షింపఁ గానె
అత్యనురాగమ్ము నంది నామనసు,
త్యజియించె బ్రహ్మలీనానంద మహహా!"
అన విని ముని నవ్వు చనియె నీరీతి:

"సమ్మతవాక్యముల్ జనక! పల్కితివి.
నీదువాక్యమ్ము లనృతములు గావు.
రాజ! లోకమున సర్వప్రాణికోటి
ఈబాలకులను దా మెపుడు ప్రేమించు"—
అన విని యావాక్కు లానందపడుచుఁ
దనలోన రాముఁడు దా నవ్వుకొనియె.
"రఘుకులమణిదశరథసుతుల్ వీరు;
నృపతి వీరలను మద్ధితమున కంపె.
ఈరామలక్ష్మణు లీసహోదరులు
వరరూపసౌశీల్యబలధాము లధిప!
తత జగత్త్రయవిదితంబుగా వీరు
సంగ్రామమున నిశాచరుల జయించి
నా యజ్ఞమును గాచినారు నరేంద్ర!"
అనుమునివాక్యంబు లాలించి నృపతి,
"భవదీయసత్పాదపద్ముల్ గనఁగఁ
బూర్వమం దెంతటి పుణ్యంబు నేను
సలిపినానో గదా! సంయమివర్య!
శ్యామల గౌరవర్ణాంగు లైనట్టి
యీసహోదరు లిద్ద ఱెంతయుఁ జూడ
నానందమునకె మహానంద మొసఁగు
చున్నవా రార! యెంతో గాఢమైనఁ
వీరిపరస్పరప్రేమతత్త్వంబు
వర్ణనాతీతము, పరమమంజులము.
నాథ! కృపామతి నానుడుల్ వినుము.
అనఘు జీనబ్రహ్మలట్టుల వీరు
సహజసుస్నేహభాస్వరులని పలికి
పరమసంతోష సంభరితాత్ముఁ డగుచుఁ
బ్రభునిరూపంబును బలుమాఱు చూచి
తనువెల్లఁ బులకింపఁ దన్మయుం డయ్యె.
జనకుఁ డంతట మునీశ్వరుఁ బ్రశంసించి
మునిపాదముల శిరమ్మును మోకరించి
వారల నందఱుఁ బరమసంప్రీతి

నిజనగరంబులోనికిఁ గొని తెచ్చి
సర్వకాలంబుల సౌఖ్యదం బైన
యందమా మందిరమం దుండఁ జేసె.
ఆపయి నృపతి మహర్షి కౌశికుని
నర్చించి, సేవించి యఖిలవిధాల,
నమ్మునివర్యునియాజ్ఞఁ గై కొనియు
నిర్గమించెను నిజనిలయంబుఁ జేర.

శ్రీరామలక్ష్మణులు జనకపురమును జూడనేగుట

శ్రీరాముఁ డంతట ఋషులతోఁ గూడి
భోజనకార్యంబుఁ బూర్తి గావించి
కొంత విశ్రాంతిఁ గైకొని యంత లేచి
తమ్మునిచెంగటఁ దాఁ గూరుచుండె
నొక్క యామంబు ప్రొద్దుండె నప్పటికి.
జనకునినగరంబుఁ జని చూచి రాఁగ
సౌమిత్రిహృది విశేషప్రీతి కలిగె;
కాని; రామునకును గౌశికమునికి
భయపడి తనలోనివాంఛను దాచె,
ముసిముసినగవులు మొగమునఁ జెలఁగ.
తమ్మునిహృదిలోనఁ దాగినవాంఛ
నెల్ల గ్రహించియు నినకుల విభుఁడు,
భక్తవాత్సల్య సంభరితాత్మఁ డయ్యె.
గుర్వాజ్ఞ నంతఁ గైకొనఁగఁ దలంచి
చిఱునవ్వు ముఖమునఁ జెంగలింపంగఁ
బరమవినమ్రతాభయభక్తు లొప్పఁ
బలికె నీరీతి విశ్వామిత్రుతోడ;
"స్వామి! లక్ష్మణునకు జనకుపురంబుఁ
గాంచఁ గోరిక పుట్టుఁ గానీ మహాత్మ!
తమకుఁ జెప్పుటకు స్వాంతంబునం దతఁడు
భయము సంకోచంబు పడుచున్న వాఁడు.
ఆజ్ఞ నొసంగిన యనుజునిఁ గొనియుఁ
బట్టణంబును జూపి త్వరితంబుగానె
తిరిగి యే తెంతుము. దేవ! ఆచార్య!"
అన మునివరుఁ డిట్టు లనియె సంప్రీతి:
"నీతిమార్గమ్మునే నీ వాదరింతు
వనునది వింతగా దరయ శ్రీరామ!
ధర్మసేతువునకుఁ ద్రాతపు నీవు
ప్రేమరసంబున వివశుండ వగుచు
నాయనా! దాసజనంబుల కీవు
సదమలసుఖముఁ బ్రసాదింతు వోయి!
ఓసుఖనిధులార! ఓభ్రాతలార!
పోయి మీ రుభయులుఁ బురి జూచి రండు.
భవదీయసుందరవదనముల్ చూపి
సఫలం బొనర్పుఁడీ! సకలనేత్రముల."
అంత మునీంద్రపాదాంబుజంబులకు
నతిభక్తి నతిఁజేసి యాసహోదరులు,
అఖిలప్రపంచనేత్రానందదాత
లారామలక్ష్మణు లరిగిరి పురికి.
వారలయమితశోభను జూచినంత
వెంటనంటెను బాలబృందంబు లెల్ల
లోచనచిత్తముల్ లోభంబు నొంద.
పీతాంబరంబులు వెలయంగఁ గట్టి
నడికట్లు గట్టి విన్నాణంబు దనర
మూఫులఁ దూణీరములను ధరించి
ఘనశరచాపముల్ కరముల నుండఁ
గమనీయసుశ్యామగౌరవర్ణముల
నాసహోదరు లిద్ద ఱలరారుచుండ్రి.
ఆదేహశోభల కనువైన రీతి
నలఁదఁగాఁబడియెను హరిచందనంబు;
సింహకంఠములు, విస్తీర్ణబాహువులు
గజమణిమాలికాగళదేశములును,
విమలారుణాబ్జశోభితలోచనములు
నిఖలతాపంబుల నిహతం బొనర్చు

పూర్ణచంద్రసమానముఖసరోజములు,
హృదయాపహారకశృంగారరుచిర
కాంచనకుండలకర్ణ యుగ్మములు
కార్ముకసుందరాకారంబు లైన
భృకుటీయుగంబులు వెలుఁగొందుచుండ
సౌందర్యపున్ ముద్రచందంబు మెఱయు
తిలక రేఖలతోఁ బ్రదీపించుచున్న
లలితవిశాలలలాటముల్ గలిగి
యారామలక్ష్మణు లలరారుచుండ్రి.
మేచకకుంచితమృదుకేశయుక్త
సుభగశిరంబుల సొంపులు గులుకు
మిసిమికుళ్ళాయలు మెఱయుచునుండె;
నాసహోదరు లిర్వు రాహా! మునీంద్ర!
అఖిలలోకమనోహరాద్భుతాకృతులు
వారలప్రత్యంగభాగంబుగూడ
నుచితవిధంబున నుండె శోభిలుచు.
నగరంబుఁ గాంచ నా నరపతిసుతులు
వచ్చినా రనియెడువార్త నాలించి
పరుగిడి వచ్చిరి పౌరు లెల్లరును
దమతమపనులను ద్యాగం బొనర్చి
నిష్ఠదరిద్రులు నిధులఁ గన్నట్లు.
ఆసోదరుల సహజాద్భుతశోభఁ
గాంచి యాజనులు సుఖస్వాంతు లైరి
తమ లోచనములు సార్థక్యము నైంద.
సౌధసీమల గవాక్షంబులందుండి
యువతీమణులు చూచుచుండి రాత్రమున
రామరూపం బనురాగంబుతోడ.
అపుడు వా రొండొరు లనుకొని రిట్లు :
"జితకోటిమన్మథశృంగారుఁ డైన్న
నారాజపుత్రుఁ డహా! చూడు సకియ !
నరసురాసురమునినాగులలోన
నిట్టి శోభారాశి నెందునుఁ వినము.

నాలుగు భుజములు నారాయణునకు
నాలుగు ముఖము లానలువకుఁ గనఁగ
నాత్రిపురారికో యైదు ముఖంబు
లతివికటాకృతు; లందుచేఁ జెలియ!
ఈతని కెనయైనశృంగారమూర్తి
సురలం దొకండైనఁ జూడఁగా లేఁడు.
అతికిశోరవయస్కు లానందనిధులు
శ్యామలగౌరవర్ణాంగసంయుక్తు
లీసోదరులు మహాశృంగారసదను
లహా! వీరి ప్రత్యంగమందునఁ గూడ
నవకోటికోటిమన్మథులసోయగము
పరిహరింపఁగఁ బడవలయు నిక్కముగ
అట్టి సౌందర్యంబు నరసి యే దేహి
విభ్రమ మొందదు ప్రియ! వచియింపు"
మన నొకానొక తె ప్రేమాంచితరీతి
మృదువాణి గదురఁగా నిట్లు వచించె;
"ఏఁజెప్పెడిది వినవే! మిత్రురాల!
మంజుమరాళ యుగ్మం బటు లున్న
యీనృపబాలకు లిద్దఱుఁ గూడ
దశరథరాజేంద్రుతనయులు; వీరె
కౌశికమానిమఖంబు రక్షించి
రణరంగమున ఘోరరాక్షసావళిని
సంహరించినయట్టిశౌర్యవార్నిధులు;
ఆశ్రావణాంబుదశ్యామలాంగుండు
ఆనవనవసుందరాబ్జలోచనుఁడు
ఆధనుర్బాణసమాయతపాణి
భయదమారీచసుబాహురాక్షసుల
మదవిముక్తినిజేసె మహితశౌర్యమున;
ఆతఁడే కౌసల్య కాత్మనందనుఁడు.
ఆసుఖధామునియమలనామంబు
శ్రీరాముఁ డందురు చెలియ! విన్నా వె!
ఆగౌరవర్ణాంగుఁ డతికిశోరుండు

శరచాపములను హస్తంబులఁ దాల్చి
శ్రీరాము వెను వెంటఁ జెలఁగెడి యాతఁ
డారాముచినతమ్ముఁ డాతనిపేరు
లక్ష్మణుఁ డందు రాలావణ్యరాశి
యల సుమిత్రా దేవియాత్మనందనుఁడు.
ఈరామలక్ష్మణు లిద్దఱుఁగూడ
విప్రకార్యము నెఱవేర్చి యాపిదప
మునివధూశాపంబు పోఁజేసి, కాచి,
వచ్చి రిచ్చటకుఁ జూపక్రతు వరయ"—
అన విని హర్షించి రఖిలాంగనలును.
శ్రీరామచంద్రునిశృంగార మరసి
యి ట్లొక్క సతి వచియించె సంప్రీతి:
"జానకీదేవికి సరితూగునట్టి
వరుఁ డీతఁడే సుమా పాగ్గివుఁ డితని
దర్శించెనా, యింకఁ దనశపథంబు
నావలఁ దోర్చి నిరాటంకముగను
సీత నీతని కిచ్చి చేయును బెండ్లి."
అన విని మఱియొకయంగన పలికె:
"వీరలసంగతి విభునకుఁ దెలిసె;
వచ్చి యాతఁడు మునీశ్వరయుక్తముగను
వీరి సన్మానించెఁ బ్రీతి వెలుంగ;
కాని, ప్రియా! మన క్ష్మానాయకుండు
తనశపథంబును ద్యజియింపఁ డయ్యె;
విధివశ్యుఁడౌచుఁ బృథ్వీనాథమౌళి
యజ్ఞానమును వీడఁడయ్యెఁ దా నకట!"
అన విని మఱియొక్క యతివ వచించె:
"ఆబ్రహ్మ మంచివాఁ డైనచో—నిప్పు
డెంచిన రీతిగా నెవరికిఁ దగిన
ఫలము వారల కిచ్చుపద్ధతి యున్నఁ
దప్పక యీతఁడే ధారుణీసుతకు
వరుఁడు గాఁగలఁ డని పలికెద నేను;
దీనిఁ గూర్చి సందేహంబు లేదు.

ఇట్టిదా సంయోగమే విధివశత
జరిగిన-చో నింక సర్వమానవులు
పరమకృతార్థతఁ బడయఁగాఁ గలరు.
ఇట్టి కూటమి లభియించిన యెడల
నితఁడు తప్పక వచ్చు నిచటకు మరల—
నని మానసము కడు నాత్రమొందెడిని.
అటు గానిచో సఖి! అన్యథా యితని
మనము దర్శించుట మటి వట్టిమాట,
ఉరుపురాకృతపుణ్య ముండినఁగాని
ఈయదృష్టము లభియింపదు మనకు".
ఇంకొకస్త్రీ వచియించె నీరీతి:
"బాగుగా నోసఖి! పలికితి వరయ
నీవివాహం బతిహిత మందఁబోకును".
ఇంకొక్కస్త్రీ వచియించె నీషణితి:
"హరచాప మెన్నఁగా నమితకఠోర
మీనీలబాలుఁడా మృదులశరీరుఁ,
డఖిలంబు ముడివడు నట్లు లే దకట!"
ఈమాట లాలించి యింకొక్క వనిత
యీరీతి వచియించె మృదులోక్తి లొప్ప:
"ఓసఖి! జను లాడుచుండ నే వింటి
మైకిఁ జూడఁగఁ బిన్న బాలుఁడై యున్న
నరయ నీతండు మహాప్రభావుండు.
అమితపాపము చేసినట్టి యహల్య
యీరామచంద్రపాదాబ్జరజంబు
సోకి తరించెను జోద్యంబు మీఱ;
నందుచే నీతఁ డేయరమర లేక
శివధనుర్భంగము చేసియే తీరు,
తనబాహుదర్ప మెంతయును దీపింప
సీతను దా సృష్టిచేసినబ్రహ్మ,
యీశ్యామలాంగు సృజించి ముందుగనె
వరునిగా నామె కేర్పాటు గావించె".
ఈ మాటలను విని యెల్లస్త్రీ లపుడు

సంతోషపడుచును స్వాదుకంఠముల
"శుభమస్తు శుభమస్తు శుభమస్తు"—అనిరి:
హర్షాతిరేకమునంది డెందముల
సుముఖసులోచనసుందరస్త్రీలు
గుంపులు గుంపులు కూడి పైనుండి
కురిపింప సాగిరి కుసుమవర్షముల;
నేవంకఁ జనిన నానృపసహోదరులు
అట నట నహ! పరమానంద మొదవె.
శ్రీరామలక్ష్మణుల్ చేరిరి పిదప
ఘనధనుర్యజ్ఞరంగస్థల మున్న
పట్టణప్రాగ్దిశాభాగ మచ్చోటఁ
బరమవిశాలశోభాసమస్థలిని
ఘనతరాలంకారకలితమౌ నొక్క—
విమలవేదిక యుండె; వేదిక చుట్టు
నాలుగువైపుల నరపతు లుండఁ
గాంచనపృథుపీఠికలు వేయఁ బడియె.
వానికి వెనుకపార్శ్వమున దాపునను
మండలాకారసమంచితం బగుచు
నున్నతాసనపంక్తి యుండెను జుట్టు
ముం దున్నయాసనపుంజమ్ము కన్న
నివి కొంచె మెక్కు—వ యెత్తుగా నుండె
సర్వవిధంబుల సౌందర్య మొప్ప.
వీనిపై బ్రజ లుపవిష్టు లయ్యెదరు.
వీనికి దాపున వెనుకభాగమున
నతివిశాలంబులై యందంబు లొలుకు
వివిధవర్ణాంచితవిభవంబు లైన
ధవళాసనంబులు దనరారుచుండె.
తమతమకులయోగ్యతల కనువుగను
స్త్రీ లీప్రదేశమందే కూరుచుండి
యట ధనుర్యాగంబు నరయుచుండెదరు.
మధుమధురంబులౌ మాటలతోడఁ
బురి బాలకుల ప్రేమ పొంగ వారలకుఁ
జూపించి రచ్చటిచోద్యంబు లెల్ల;
ఆసోదరులమనోహరగాత్రములను
స్పృశియించి ప్రేమచే వివశతఁ గనిరి.
తనువులు పులకింపఁ దత్సహోదరుల
సుందరాకారముల్ చూచియుఁ జూచి
యతిహర్షమును బొంది రాబాలు లెల్ల
బాలు లెల్లరు ప్రేమవశ్యులై యుంట
మతి నెఱింగియును రామప్రభువర్యుఁ
డాబాలకులు చూపు నాయాస్థలంబు
లెల్ల వీక్షించెఁ దా నెంతయో ప్రీతి.
ఆత్మాభిరుచులకు ననుగుణరీతి
నాబాలకులు సూపునట్టితావులకు
ననుగమించిరి వారి నాసహోదరులు
స్నేహానురాగముచేత మునీంద్ర!
మృదుమధురాంచితామృతవాక్కు—లర
నచ్చటి రచనంబు లన్నియుఁ జూపెఁ
దమ్మున కా రామధాత్రీవిభుండు.
ఎవ్వానియాజ్ఞ వహించి యామాయ
లవనిమేషమునఁ జలంబు దీపింప
బ్రహ్మాండకోటులఁ బ్రభవింపఁ జేయు
నాదీనవత్సలుఁ డహ! భక్తివశతఁ
గార్ముకయజ్ఞరంగస్థలిఁ జూచె
నాశ్చర్యచకితుఁడై యనఘా! మునీంద్ర!
కౌతుకంబుల నెల్లఁ గనుఁగొని పిదప
నారామలక్ష్మణు లాచార్యకడకుఁ
బయలు దేరిరి, వారి భావంబునందుఁ
గాలవిలంబము కలఁచఁగా సాగె.
భయమును భయపెట్టుపరమేశుఁ డిట్లు
భజనప్రభావంబు ప్రకటించుచుండె!
చల్లని తీయని సల్లాపములను
బుడుతల నెల్లను బుజ్జగించియును
అతికష్టమున సెలవంది వీడ్కొనిరి

యారామలక్ష్మణు లాచార్యుఁ జేర.
భయభ క్తి నమ్రసద్భావంబు లొప్ప
వా రిద్దఱును గురుపదముల కెఱఁగి
యాయనయాజ్ఞయైనంతఁ గూర్చుండ్రి.
అంత సాయంకాల మైన మునీంద్రుఁ
డాజ్ఞ నొసంగ సంధ్యావందనంబు
సలిపిరి వారలు శ్రద్ధ దీపింప.
ఋషి యాపయిని బురాణేతిహాసములఁ
గథల వచించెను గమనీయముగను-
అట్టులఁ గడచెను యామముల్ రెండు
రమణీయమైన యారాత్రికాలమున.
సంయమీంద్రుం డంత శయ్యపైఁ జేరె.
నాపయి మునిచరణాబ్జంబు లొత్తఁ
గడఁగి రారామలక్ష్మణు లతిభక్తి.
ఉన్నతబహుజపయోగముల్ సలుపు
వైరాగ్యజలధు లెవ్వరిపాదపద్మ
సందర్శనముసేయ సంతపించెదరో,
ఆకవల్ గురునిపాదాంబుజాతముల
భక్తివశ్యాత్ములై పట్టి రోహోహో!
పలుమాఱుఁ జా లని పలుకఁగా నూని
యప్పుడు మాత్రమే యారఘువరుఁడు
శయ్యపైఁ జేరెను శయనించుకొఱకు.
రామానుజుం డంత రాముపాదముల
హత్తించుకొని హృదయాగ్రభాగమున
భయభక్తు లొప్పఁగాఁ బరమమోదమున
మెల్ల మెల్లఁగ నొత్తె మృదులహస్తముల.
"ఇఁక జాలు, శయనింపుమీ, వత్స!" యనుచుఁ
బలుమాఱు రాముఁడు పలికినపిదప
సౌమిత్రి శయనించె స్వాంతంబు నందు
సంధించుకొని రామచరణాంబుజముల.
కుక్కుటధ్వని కర్ణకుహరాల సోఁకఁ
దెలవాఱుచుండఁగాఁ దెలిసి లక్ష్మణుఁడు

నిద్ర మేల్కాంచెను నిత్యపద్ధతిని.
అల జగన్నాయకుం డఖిలజ్ఞుఁ డైన
శ్రీరాముఁడును జాగుసేయక లేచె
గురువరేణ్యుఁడు మేలుకొనుటకు ముందె.

జనకోద్యానవనములో సీతారాములపరస్పర
సంవీక్షణము

అంత శౌచక్రియ లన్ని యొనర్చి
స్నానసంధ్యాద్యనుష్ఠానముల్ దీర్చి
యారామలక్ష్మణు లరుగుదెంచియును
మ్రొక్కిరి మునిపాదముల కతిభక్తి.
సమయం బెఱిఁగియు స్వాంతంబులోన
గుర్వాజ్ఞఁ బొంది యాకూర్మిసోదరులు
పోయిరి పూజకై పూలు దెచ్చుటకు.
వారు రాజోద్యానవనమును గాంచి
రాపుష్పవనశోభ నరసి మోహించి
సర్వదా నిలుచు వసంత మచ్చోట.
బహువర్ణ రమణీయ భాసురవల్లు
లల్లిబిల్లిగను వ్రేలాడుచున్నట్టి
వివిధమనోహరవిటపరాజముల
వరనవపల్ల వఫలసుమశ్రీల,
సురలోకవృక్షముల్ చూచి లజ్జించు.
చాతకపికకీర చారుచకోర
విహగకూజితములు వినవచ్చుచుండె.
ఆడుచుండెను నెమి ళ్ళిందంబు లొలుక
ఆవనమధ్యమునందు శోభిల్లు
మణిమయసోపానమహితవిచిత్ర
మగు నొక్క యతిమనోహరసరోవరము;
అందున వెలుఁగొందు నమలజలంబు
బహువర్ణసుందరపంకజయుతము
జలవిహంగధ్వానసంకులాంతరము
మధుపానమత్తాళిమండలాయతము

ఆతటాకవరంబు నాపుష్పవనముఁ
గాంచి శ్రీరామలక్ష్మణు లుల్లసిలిరి.
రాముని సైతము రంజింపఁ జేసె
నత్యంతరమ్య మాయారామ మహహ!
ఆవనమెల్లఁ దా మరసి సోదరులు
మాలిసమూహసమ్మతిని గైకొనియు
నతిముదం బొంది నిజాంతరంగములఁ
బుష్పదళంబులఁ బ్రో గిడుచుండ
నప్పుడే సీతయు నావనంబునకుఁ
దనతల్లి పంపఁగాఁ దరలి యే తెంచె
శ్రీగిరిజాపూజ చేయుటకొఱకు.
సౌందర్యవతులు విజ్ఞానసందీప్త
లైన సఖీజను లామెతో వచ్చి
పాటలు పాడిరి వర్షింప మధువు.
ఆసరోవరమున కతిసమీపమునఁ
గలదు గౌరీదేవిఘనమందిరంబు.
వర్ణనాతీతశోభారాశి యైన
యాపావనాలయ-మచటి కే తెంచి
చూచువారల మనస్సులఁ గట్టివేయు.
కొలనిలో సకియలఁ గూడి యాసీత
స్నానంబు గావించి సంతోషపడుచు
గౌరీనికేతనగర్భంబుఁ జొచ్చి
కడు భక్తితోడ దుర్గాపూజఁ జేసి
తన కనురూపసుందరుఁ డైనవరుని
దయసేయు మనుచుఁ బ్రార్థన మొనరించె.
సీతతో వచ్చినచెలికత్తె లందు
నొకసఖి విడి యేగె నుద్యాన మరయ.
ఆమెదృష్టిపథంబునందునఁ బడిరి
శ్రీరామలక్ష్మణుల్ శృంగారనిధులు.
ప్రేమభావోద్వేగవివశత్వ మొంది
సీతను జేరె నాచెలి వచ్చి మరల.
తనువెల్లఁ బులకింపఁ దన్మయత్వమున
నేత్రయుగ్మంబున నిండ బాష్పములు
వచ్చినయాసఖీ వైఖరిఁ జూచి
"కారణం బేమి నీఘనహర్ష మునకు?"
అని మృదువాణితో నడిగి రందఱును.
అన విని యూచెలి యనియె నీరీతి;
"సుకుమారులును సర్వశోభాప్రపూర్ణ
లిరువురు రాసుతు లే తెంచినారు
చెలులార! యీవనసీమఁ జూచుటకు.
ఒకఁడు శ్యామాంగుఁ డింకొకఁడు గౌరాంగుఁ-
డౌర! వర్ణింప నా కలవి యెట్లగును?
కన్నులు లేవయ్యెఁ గన వాక్కులకును,
వర్ణింపఁ గనులకో వాక్కులు లేవు-"
అనుమాటలను విని యాజ్ఞానవతులు
జానకీసఖు లెల్ల సంతోషపడిరి.
అంత సీతాహృదయాంతరంగమునఁ
గ్రాలుమహోత్కంఠఁ గని వారిలోన
నొకతె యిట్లనియెఁ దా, "నో చెలులార!
నేను విన్నట్టి యానృపతనూభవులు
వా రిరువ్వురై యుండ్రు; వారలు నిన్న
మునితోడ నే తెంచి పురములో నున్న
సకలప్రజావళి సమ్మోహపఱచి
తమదివ్యరూపసౌందర్యంబుచేత
స్వీయవశ్యాత్మలఁ జేసికొన్నార
లని వింటి నేను ప్రియాత్మీయులార!
అక్కడ నిక్కడ నఖిలత్ర జనులు
వర్ణించుచున్నారు వారిసోయగమె.
దర్శనయోగ్యులై తనరెడివారిఁ
దప్పక మన మేగి దర్శింత" మనఁగ
నాసఖీవచనంబు లాసీత కమిత
సంతోషమును గూర్చె స్వాంతంబులోన.
ఆజానకీలోచనాంబుజద్వంద్వ
మారాసుతులఁ జూడ నారాట మొందె.

తత్ప్రియసఖి ముందు దారి చూపింప
ననుగమించెను సీత యమితప్రపూత;
ఆమె రామప్రణయము సనాతనము–
అని యెవ్వ రెఱుఁగ రహో! భరద్వాజ!
జనకనందిని సీత స్వాంతరంగమున
నారదోక్తుల స్మరణం బొనరించి
పావనప్రణయసంభరితాత్మ యగుచుఁ,
జకితలోచనముల సకలదిక్తటుల
నరసెను భీతమృగార్భకం బటుల.
శ్రుతిసుతాకంకణకింకిణీజాల
నూపురమంజుధ్వనుల, నాలకించి
శ్రీరామచంద్రుఁడు స్వీయసోదరుని
గనుగొని, "ఓయి లక్ష్మణ! వినుమోయి!
అఖిలజగజ్జయం బందఁ గాంక్షించి
యిదె రణభేరి మ్రోయించుఁ బుష్పాస్త్రుఁ
డని తోఁచుచుండె నా" కని వచియించి,
ఆమంజులధ్వని యరుదెంచుదిక్కు–
నీక్షించెఁ బ్రేమతో నింకొకసారి.
జనకాత్మజాముఖచంద్రబింబమును
రామలోచనచకోరములు వీక్షించి
యానందపారవశ్యంబును బొందె.
ఆప్రభుచారునేత్రాంబుజాతములు
నిశ్చంచలము లయ్యె "నిమి" లజ్జ నొంది
వదలె దృగంచలభాగంబు లనఁగ.
ధరణిజాసౌందర్యదర్శనానంద
నిర్భరత్వంబున నిలిచె రాఘవుఁడు
వచనంబు లాగ దిగ్భ్రాంతుఁడై పోయి.
నిజరచనామహానిపుణత్వ మెల్ల
నిటుల రూ పొందించె నిల బ్రహ్మ యనుచుఁ
దనలోన రాముఁడు దా నెంచుకొనియె.
"సౌందర్యమున కీమె సౌందర్య మిచ్చు,
శోభాగృహోజ్జ్వలజ్యోతి యీసీత.
వరకవు లెల్లరు వాడినయట్టి
సరోపమానముల్ చవిని బాసినవి.
ప్రాఁతగిల్లినవి; విశ్వంబులో నింక
దేనితోఁ బోల్తు వి దేహపుత్రికను!?"
ఇటుల సీతాశోభ హృది నెంచుకొనుచుఁ
దనపరిస్థితి లోనఁ దలపోసి ప్రభుఁడు
సమయానుకూలవచస్సులు దనర
ననుజునితోడ నిట్లనె శుద్ధమతిని:
"ఆమెయే జనకధరాధీశుతనయ
ఆమెనిమిత్తమే యీధనుర్మఖము.
సలుప గౌరీపూజ సఖులతోఁగూడి
వచ్చి యీకన్యక వనసీమ నెల్లఁ
దనప్రకాశంబుచేఁ దనరఁ జేసెడిని.
ఆమెయలౌకిక మగుశోభఁ గాంచి
సహజవినీతమత్వాంతంబు నేఁడు
తమ్ముఁడా! సంక్షుభితం బాయె నోయి!
ఈవిషయంబుల కెల్లఁ గారణము
నెఱుఁగు విధాతయే, యీతరుణమున
నదరుచున్నవి దక్షిణాంగముల్ నాకు;
శుభసూచనం బిది చూడ సౌమిత్రి!
రఘువంశజులు కుమార్గసమానసులు
కా రెన్నఁ డిది వారిఘనన్నై జగుణము.
స్వప్నమం దైనను బరకాంత లందు
నా మతి చొర లే దనంగలనేను–
కలనఁ దా వెనుజూపకయె నిల్చినట్టి
పరకాంతపై మోహపడుట లేనట్టి
యాచకజనముల నలరించునట్టి
పుణ్యాత్మ లరయ నీపుడమిలో నరుదు."
ఆరామభగవానుఁ డనుజునితోడ
నీరీతిగా వచియించెడితఱిని
ధరణిజారూపలుబ్ధం బైనరాము
మానసమధుప మామానినీగత్న

భవ్యముఖాబ్జశోభామరందమును
ద్రాగుచునుండెఁ దాఁ దనివి దీరకయె.
నృపతనూభవు లెట కేగిరో యనుచుఁ
జింతించుకొనుచును జిత్తంబులోనఁ
జకితయై వీక్షించె జానకి దిశలు.
ఎందెందు నాబాలమృగనేత్ర చూచె
సితకమలావళీశ్రేణు లందందు
వర్షించి నట్లు ప్రభాసించె; నంత
నామెకుఁ జూపించె నాసఖీజనము
శ్యామలగౌరవర్ణాంగులై వెలుఁగు
నృపకిశోరుల, లతాగృహపూర్వదిశను.
ఆదివ్యరూపంబు లరయఁగా నామె
లోచనమ్ముల నిండె లోభగుణంబు.
ఎన్నఁడో కోలుపోయినతననిధినిఁ
గనుగొన్నరీతి నాకనులు హర్షించె.
శ్రీరామమంగళాకృతిని వీక్షించి
యాకనుల్ నైశ్చల్య మందె నత్తఱిని
గనుఱెప్పలును వ్రాలకయె నిల్చిపోయె.
ఘనశరత్కాలరాకాచంద్రుఁ గన్న
యల చకోరముచంద మాధరాజాత
యధికానురాగిణి యై తనుస్మృతినిఁ
బాయఁగా సాగెను బరవశత్వమున.
శ్రీరాము నామె నక్షిద్వారమునను
గైకొని హృదయపంకజమందు నిలిపి,
వదలి పోకుండ ఱెప్పలకవాటముల
మూసివై చెను జ్ఞానబుద్ధి దీపింప.
అత్తఱి సీత ప్రేమాధీన యగుట
నెఱిఁగి సఖీజనబృంద మెద్దియును
బలుక సంకోచించె భావంబునందు.
ఆసమయంబున నాయన్నదమ్ము
లొక లతాగృహమునందుండి వెల్వడిరి–
అల మేఘపటలంబులందు వెల్వడియు
వెలిఁగెడి విమలేందుబింబయుగ్మముగ.
అమితశోభాకరు లావీరు లిర్వు
రలరారుచుండిరి యల నీలపీత
జలజాభదేహులై సంయమివర్య!
శిరముల శృంగారశిఖిపించములును
బ్రసవగుచ్ఛంబులు భాసిల్లుచుండె.
తిలక రేఖలు సముద్దీపించుచుండ,
నందంబు లొలుక శ్రమాంబుబిందువులు
ప్రజ్వరిల్లుచునుండె ఫాలభాగములు.
ఘనతరశ్రీకారకర్ణ యుగ్మములఁ
గమనీయకుండలకాంతులు సెలఁగ
విండులఁ బోలినభృకుటులతోడఁ
గుటిలంబులై యున్నకుంతలంబులును
నవసరోరుహలోచనంబులతోడ
సుందరం బైనట్టిచుబుకంబుతోడ
శృంగార మొలుకు నాసికతోడ, నమిత
లావణ్యయుతకపోలములతోఁ జెలఁగు
నారాజపుత్రులహాసవిలాస
ములు చిత్తములను బ్రముగ్ధ మ్మొనర్చె.
వారలముఖశోభవర్ణనాతీత
మది కోటిమదనులనైన జయించు.
వరమణిమాలికావక్షముల్ దనరఁ
గమనీయరవకంబుకంఠంబు లొప్పఁ
గామేభకరబలఘనభుజద్వయము
లమర నాసోదరు లలరారుచుండ్రి.
ప్రసవపాత్ర ధరించి వామహస్తమున
వరలునాశ్యామలవర్ణుఁ డైనట్టి
నృపకిశోరుం డతిశృంగారరాశి!
హరికటిస్థలుని, బీతాంబరధరుని,
వరరూపశీలనివాసు, నాసూర్య
వంశభూషణు, రామభద్రునిఁ జూచి
తమ్ముఁ దా మఱచిరి తత్సఖీజనులు.

స్మృతి నొంది యొక చెలి సీతను దాకి
"తరువాత గౌరిని ధ్యానించుకొనుమ
యిపు డేల చూడ వానృపకుమారులను?"
అని వచియింపఁగా నాధరాతనయ
బిడియంబుతోఁ గనుల్ విప్పి వీక్షించె
శ్రీరఘుసింహులఁ జెలువొప్ప నెదుట.
ఆపాదమస్తక మారామశోభ
వీక్షించి జానకి పితృశపథంబు
స్మరియించి మిక్కిలి సంక్షోభ మొందె.
అనురాగపరవశ యగుట నాసీతఁ
దెలిసి యాసఖులు భీతిల్లి యంతటను
"ఆలస్య మైనది" యని రేకరీతి.
"ఈవేళకే రేపు నేతెంత" మనుచుఁ
దనలోన నొక చెలి తా నవ్వుకొనియె.
సీత కీనర్మోక్తి సిగ్గు కల్గించె.
అప్పటికే చాల నాలస్య మగుటఁ
దల్లి భయంబు డెందంబునఁ బొంది
గృహమున కేగఁగా నెంచి యాసీత
చెదరినధైర్యంబు చేరఁగాఁ దీసి
శ్రీరామచంద్రుని హృది నిల్పుకొనియుఁ
దనజనకాధీనతను స్మరించుచును
మఱలెను దా నుండుమందిరంబునకు.
జింకనో పక్షినో చెట్టునో కనెడి
మిషతోడ జానకి మిగులఁ బ్రేమమునఁ
బలుమాఱు వెనుకకుఁ బక్కకుఁ దిరిగి
శ్రీరఘువీరునిశృంగారరూప—
మీక్షించె మఱిమఱి తృప్తిని గనక.
ఆమెరామప్రేమ, మణుమాత్ర మైనఁ
దరుగక యొక సముద్రంబయి పొంగె.
హరచాపకాఠిన్య మాత్మఁ దలంచి
సంక్షోభ మొందుచు జానకి తరలె
నాశ్యామలాకృతి యాత్మ వెల్గొంద.
ఆజనకాత్మజ యాసుఖస్నేహ
సౌందర్యగుణఖని చనుట వీక్షించి
రాముఁడు తనయంతరంగపత్రమునఁ
బరమానురాగరూపం బయి వెల్లు
నతిరమ్యసుస్నిగ్ధ మగు సిరాతోడ
సీతాస్వరూపంబు చిత్రించుకొనియె.
అంత గృహంబున కరుగుచు సీత
యరిగి భవానీశుభాలయంబునకు
నామెపాదంబుల కతిభక్తి మ్రొక్కి-
యంజలి ఘటియించి ప్రార్థించె నిట్లు:

సీతాకృత గౌరీస్తవము

గేయము

జయ జయ గిరివరరాజకిశోరీ!
జయ మహేశముఖచంద్రచకోరీ!
జయ గజవదనషడాననమాతా!
జగజ్జనని! విద్యుత్తనూలతా!
జయము ఆదిమధ్యాంతవిహీనా!
నిగమాతీతప్రభావనిధానా!
భవభవవిభవపరాభవకారిణీ!
విశ్వవిమోహిని! స్వేచ్ఛాచారిణీ!
పతివ్రతాజనగణశిరోమణీ!
నీమహామహిమ నెల్ల భవానీ!
సహస్రశారద లాదిశేషులే
వర్ణనసేయ సమర్థు లౌదురే!
సేవాసులభ! చతుర్విధఫలదా!
శివ! పురారిసఖి! శ్రీవరప్రదా!
సురనరమునిజను లెవరే గానీ!
నీపదపూజ సుఖింత్రు భవానీ!
నిఖిలహృదయమందిరనివాసినీ!
నాదువాంఛ నీ కెఱుక పావనీ!
నీకడఁ బైకి వచింపట యేలా?
నిఖిలజ్ఞవు అంబా; శివ! బాలా!"

అని వచించుచు విదేహోత్మజ భక్తి
గౌరీపదంబుల గట్టిగాఁ బట్టె.
ఆమెభక్తికి వినయంబున కంత
గిరిరాజసుత వశీకృత యయ్యె, నపుడు
విగ్రహగళమున ప్రేలాడుమాల
జాఱగా, మూర్తి హాసం బొనరించె.
సాదరంబునఁ దత్ప్రసాదితమాల
సీతామహాదేవి శిరమునఁ దాల్చె.
అంతట గౌరి మహాహర్ష మొప్పఁ
బలికె నీరీతిగా వాత్సల్య మొప్ప;
"అవనిజా! నాదు సత్యాశీస్సు వినుము.
నీమనోఽభీష్టంబు నెఱవేఱఁ గలదు.
సర్వదా నారదస్వామివాక్యములు
శ్లోచవంతంబులు సత్యవంతములు.
నీహృది యెవనిపై నిలిచె నావరుఁడు
నీ ప్రాణనాథుఁ డౌ నిజము కుమారి!
నీవు ప్రేమించునానీలాభ్రవర్ణుఁ
డానై జసుందరుఁ డైనవరుండె
నీ ప్రాణపతి యగు నిక్కంబు సీత!
పరమకృపాబ్ధి సర్వజ్ఞుఁ డాప్రభువు
నీదుశీలంబును నీప్రేమ నెఱుఁగు"
శ్రీగౌరి యిట్లు వచించునాశీస్సు
లాకర్ణనముఁ జేసి యాసీత, సకియ
లాహ్లాదమొందిరి యంతరంగముల.
అంతటఁ బలుసాఱు లంబ నర్చించి
మఱలె నింటికి సీత మది సంతసిలుచు.
అనుకూలముగ నుంట నాగౌరికరుణ
వర్ణింప లేనంతపరమహర్ష మును
స్వాంతమందునఁ బొందె నాధరాతనయ.
ఆమెవామాంగంబు లదరఁగా సాఁగె
భాసురమంగళఫలసూచకముగ.
ఎంచుచు జానకీశృంగార మాత్మ

నాసహోదరు లిర్వు రాపయిఁ జనిరి
తమగురూత్తమునన్నిధానంబుఁ జేర-
సరళస్వభావుండు స్వచ్ఛాత్ముఁ డైన
శ్రీరాముఁ డంతఁ గౌశికమునిపతికి
వినిపించె జరిగినవిషయంబు నెల.
అంతట మునివర్యుఁ డాతెచ్చినట్టి
పుష్పముల్ గైకొని పూజ నొనర్చి,
ఆయన్నదమ్ముల నాశీర్వదించె
"ఫలియించుఁగాక మీవాంఛ"—లటంచు
అన విని హృదిలోన నానందపడిరి
శ్రీరామలక్ష్మణుల్, ఋషిభరద్వాజ!
భోజనకార్యంబు పూర్తియైనంతఁ
బరమవిజ్ఞాని విశ్వామిత్రమౌని
ప్రవచింపఁ దొడగెఁ బురాణసత్కథల.
ఆరీతి గతియించె నాదినం బంత.
గురువర్యునాజ్ఞఁ గైకొని సహోదరులు
సంధ్యాక్రియలఁ జేయఁ జని రింతలోనఁ
జంద్రుండు ప్రాచీదిశాసీమఁ బొడిచె,
భూమిజాముఖపద్మమును దలఁపింపఁ
జేయుచు, రామునిచిత్తముప్పొంగ.
అంతట రాఘవుఁ డంతరంగమున
శశిబింబ మరసి విచారింపసాగె:
"ఈహిమకరబింబ మెంచి చూడంగ
జానకీముఖముతో సరిపోల లేదు.
ప్రభవించె సింధుగర్భంబున మఱియు
ననుజన్ముఁడా. చూడ—హాలాహలంబు;
దివసకాలంబునఁ దేజంబుఁ బాయు
సకళంక మదిగాక చంద్రబింబంబు;
జానకీముఖముతో సరిపోలఁ గలదె?
ఇదిగాక శశి గాంచు వృద్ధిక్షయముల
విరహిణీజనులకు వేదనఁ గూర్చు;
పర్వసంధులఁ బట్టువడు రాహువునకుఁ

గూర్చును శోకంబు కోకంబులకును;
బంకజద్రోహంబు పాయక సేయు.
ఓ శశీ! నీలోన నున్నవి చూడ
నవగుణములు గణనాతీతముగను.
ఆవిదేహకుమారి యాననంబునకు
నినుఁ బోల్చి చూచుట నిఖిలవిధాల
ననుచితం బైనమహాదోష మగును."
రఘుకులపతి యైనరాముఁ డీరీతి
రాజబింబంబుఁ బురస్కరించుకొని
జానకీముఖశోభ సన్నుతి సేసి
చాలఁ జీకటిపడ్డసంగతి తెలిసి
గురుసన్నిధికిఁ జేరుకొనియు, నమ్మౌని
పాదాంబుజములకుఁ బ్రణతు లర్పించి
యాజ్ఞను గైకొని యరిగెఁ బరుండఁ.

శ్రీరామలక్ష్మణులపరస్పరసంభాషణము

ఆరాత్రి యరుగ నహర్ముఖమందు
మేల్కాంచి రఘుపతి మిగుల సంప్రీతిఁ
దమ్మునితో నీవిధంబుగాఁ బలికెఁ:
"అంబుజకోకలోకానంద మొసఁగు
నరుణోదయం బయ్యె నరయుమా వత్స!"
అన విని జోడించి హస్తాంబుజముల
లలితలక్షణుఁ డైనలక్ష్మణస్వామి
ప్రభురామచంద్రప్రభావసూచనము
చెసెడిమృదువాణి చెలఁగ నిట్లనియెఁ:
"అరుణోదయం బయ్యె నాకారణమున
వాడెను గముదముల్, పాసెను గాంతి
తారకాగణము, నాథా! యవ్విధాన
నీరాక నీక్షించి నిఖిలభూపతులు
వెలవెలఁ బోయిరి వీరవరేణ్య!
నక్షత్రగణము లున్నను గోల్లకొలఁది
యంధకారము పోవనటుల నా స్వామి!
యెల్లనృపాలకు లేకమై యున్న
శివధనుర్భంగము చేయఁగా లేరు.
కమలజగద్భృంగఘనవిహంగములు
హర్షించునటుల నిశావసానమున.
హరధనుర్భంగ మైనంత హర్షింత్రు
భవదీయపాదాబ్జభక్తు లెల్లరును.
ఓహోహో, అదె సూర్యుఁ డుదయించినాఁడు!
తమము నశించె యత్నంబు లేకుండఁ
గనపడకుండ నక్షత్రముల్ డాగె,
వెలుఁగులు గ్రమ్మెను విశ్వరంగమున.
ఆరవి తనయుదయవ్యాజమునను
ప్రభు! నీ మహాప్రతాపముఁ బ్రకటించె.
సకలభూపాలకసంఘంబులకును,
భవదీయభుజబలప్రభఁ బ్రకటింప
నల ధనుర్భంగకార్యంబు ఘటించు!"
అనెడితమ్మునివాక్కు లాలించి యలరి
చిఱునవ్వు నవ్వెను శ్రీరామవిభుఁడు.
సహజపూతాత్ముఁ డాస్వామి యంతటను,
నిత్యశౌచక్రియల్ నెఱవేర్చుకొనియె.
స్నానసంధ్యాద్యనుష్ఠానముల్ దీర్చి
యిరువురు సోదరు లేగి మునీంద్రు
చరణాంబుజంబులసన్నిధి, సుభగ
శిరముల వంచియుఁ జేసిరి నతులు.
ఇట్లుండ జనకభూమీంద్రుండు తనదు
ఆచార్యుఁ డైనశతానందమునిని
రావించియును సత్వరంబుగాఁ బంపెఁ
గౌశికమునివర్యకడకు; నాపిదప
నాశతానంద్రమహర్షి యే తెంచి
జనకునివినతి విశ్వామిత్రమౌని
కెఱిఁ గింప నాతఁడు హృదిఁ బొంగి పిలిచె
రామలక్ష్మణులను రాజితగుణుల.

ఆశ తానందపాదారవిందముల
వందనంబు లొనర్చి వచ్చి రాఘవుఁడు
గురువర్యసన్నిధిఁ గూర్చుండ నంత,
"నాయనా! శ్రీరామ! నరపతిజనకుఁ

డాప్యాయముగ మనకై పంపె లెమ్ము.
భవ్యసీతాస్వయంవర మేగి చూత
మెవని విధాత జయింపగాఁ జేయు
నది గూడ వీక్షింత" మనె గాధిసుతుఁడు.

శ్రీరామచరితమానసము

బాలకాండము

అష్టమవిశ్రామము

శ్రీమాచిరెడ్డివరదా ।
మామకధనబంధుమిత్రమాతృపితృగురూ ।
రామ । త్రివిక్రమ । కేశవ ।
వామన । హరి । మట్టపల్లివాస । నృసింహా ।

విశ్వామిత్రమహర్షి రామలక్ష్మణులతో
ధనుర్యజ్ఞశాల కేగుట

సౌమిత్రి యిట్లనె, "స్వామీ! మునీంద్ర!
త్వత్కృపాపాత్రుఁడే వహియించు జయము."
ఆవరవాక్కుల నాలించి నంత
నఖిలమునీశ్వరుల్ హర్షితు లైరి.
ఆనందకందళితాత్ములై వార
లాలక్ష్మణునకు శుభాశీస్సు లిడిరి.
సకలమునీశ్వరసంయుతుం డగుచుఁ
గరుణాళు వైనయాకాకుత్స్థనాథుఁ
డాధనుర్మఖశాల నరయఁగా వెడలె.
ఆసహోదరు లిద్ద ఱారంగభూమిఁ
జేరినా రనువార్త చెవిఁబడినంత
స్త్రీలును, బురుషులు, చిన్నలు, పెద్ద
లాబాలగోపాల మందఱుఁగూడ
గృహకార్యముల వీడి యేగఁదొడంగి
రాయజ్ఞశాల కయ్యవసరమందు.
బహుజనబృందముల్ వచ్చుటఁ గాంచి
జనకుఁడు విశ్వాససంయుతు లైన
భటులను రావించి పలికె నీరీతి:
"సత్వరమే పోయి జనుల కందఱకు
నుచితాసనంబుల నొసఁగుఁ" డనంగ
మృదువినీతోక్తిసంభృతు లౌచు భృత్య
లధికులు, మధ్యము, లల్పులుగూడ
సర్వులు మనముల సంతోషపడఁగ
సముచితాసనము లొసంగి రాతఱిని.
శ్రీరామలక్ష్మణుల్ శృంగారనిధులు
సద్గుణసాగరుల్ సౌశీల్యఖనులు,
వీరవరేణ్యులు విమలసౌందర్య
కలితసుశ్యామలగౌరశరీరు
లే తెంచి రటకు మునీ! భరద్వాజ!
ఆసహోదరు లిద్ద ఱారాజసభను
దారకామండలోద్భాసితపూర్ణ
చంద్రబింబద్వయసామ్యులు నగుచు
భాసిల్లుచుండిరి; ప్రతిపూరుషుఁడును
భావానుసారము పరికించె నప్పు
డారామవిభువిగ్రహంబు మునీంద్ర!
ధర వీరరస మిట్లు తనువు ధరించె
నని తలంచిరి రాము నరసి డెందముల
భండనపాండితీభాసితభుజులు.
కుటిలస్వభావు లౌక్షోణీంద్రు లెల్ల
రతిభయానకమూర్తి యని రాముఁ జూచి
గడగడ వణఁకిరి కడు భయం బొంది.

మాయచే రాజులమాడ్కి వేషముల
ధరియించి కూర్చున్న దానవు ల్గనిరి
ప్రత్యక్షకాలునిపగిది రాఘవుని
అఖిలపురావాసు లాసహోదరుల
నయనసుఖప్రదుల్ నరకులాభరణు
లనుచు వీక్షించిరి యానందపడుచు.
హర్ష సంభరితాంతరాత్మలై కాంత
లాత్మాభిరుచులకు ననుగుణ్యముగను
శ్రీరామచంద్రు వీక్షించి చిత్తముల
"ఈవిధానంబుగా శృంగారరస మె
పరమాసమానరూపంబు ధరించె"—
ననుచుఁ దలంచి రోయనఘా! మునీంద్ర!
వేత్త లాశ్రీరామవిభుఁ గనుఁగొనిరి
బహుముఖకరనేత్రభాసురం బైన
యావిరాడ్పురుషునియద్భుతాకృతిగ.
జనకబాంధవుల కాస్వామి కాన్పించె
నాత్మబాంధవుఁడుగా నాసమయమున.
అల రాణియును విదేహావనీధవుఁడు
కన్నబిడ్డగ రాముఁ గనిరి డెందమున
వాగతీతప్రేమభావంబు నిండ.
యోగుల కారాముఁ డుండె సాక్షాత్తు
శాంతంబు, శుద్ధము, సహజప్రకాశ
మగుపరతత్త్వమే యరుదెంచినటుల.
హరిభక్తు లగువార లాసహోదరుల
నఖిలసుఖప్రదాయకులై వెలుంగు
నిష్టదైవములుగా నీక్షించి రపుడు.
ఇఁక జానకీదేవి యెట్టిస్నేహమున
నెట్టిమోదంబున నీక్షించె రాము
నయ్యది యకథనీయం బయి తనరు;
నామె లోఁ బొందినయనుభూతి నామె
పలుక లేనంతగాఁ బరవశ యయ్యె.
కవి యెట్లు వర్ణింపఁ గలుగు నాస్థితిని?

ఈప్రకారంబుగా నెల్లరుఁగూడ
నాత్మీయబుద్ధికి ననుకూలరీతి
నవలోకనముఁజేసి రాకాసలేయు.
ఆరీతి నాకోసలాధీశసుతులు
శ్యామలగౌరరమ్యాంగశోభితులు,
నఖిలప్రపంచాళి లపహరించుచును
రాజసమాజవిరాజితు లైరి.
ఆరామలక్ష్మణు లాసహోదరులు
సహజమనోహరచారువిగ్రహులు.
వారితో సరిపోల్చి వర్ణింత మనినఁ
గోటిపుష్పాస్త్రులు గూడఁ దక్కువయె.
అల శరచ్చంద్రుని నపహాసపఱచు
వారిసుందరముఖపంకజాతములు;
వారలసంఫుల్ల పద్మనేత్రములు
నుత్తేజ మొనరించుచుండె భావముల.
ఆరాజసుతులశోభావలోకములు
మారునిమదిఁగూడఁ బరవశపఱచె;
వారిమనోజ్ఞత వర్ణింప వశమె.
కల కపోలంబులు, కల్లోలమకర
మణికుండలద్వయమహితకర్ణములు.
లావణ్యచుబుకముల్, లలితాధరములు,
మృదువాక్యరత్నంబు లెసఁగెడివారి
దరహాసరుచులు సుధాకరకిరణ
జాలంబులను గేలి సలుపుచు నుండె.
వికటభ్రుకుటి, సొంపు వెలయునాసికయు,
బహువిశాలం బగుఫాలభాగమునఁ
దిలక రేఖలుఁ గడు దీపించుచుండ,
నళిబృందములఁ బరిహాసంబు సేయు
కచములతోడ సంకలితులై వారు
పూవులు మొగ్గలు బొమ్మ లందముగ
నటనటఁ గుట్టినయట్టి సొంపైన
పచ్చనిటోపీల భవ్యశీర్షముల

ధరియించియుండిరి తాపసచంద్ర!
కలకంబుకంఠభాగముల వారలకుఁ
దనరుఁ ద్రిరేఖలు త్రైలోక్యదివ్య
శృంగారగరిమకు నెల్ల లనంగ.
మత్తేభమణిగణమాలికామణులు
తులసికాదామసందోహముల్ వారి
యురముల వ్రేలాడుచుండె నందముగ.
ఘనవృషభస్కంధకలితు లుదగ్ర
బలవిరాజితదీర్ఘ బాహు లౌవారు,
సింహంబు లట్లు నిల్చిరి సభాస్థలిని.
కటితటతూణీరకలితులై పరమ
రమణీయపీతాంబరముల ధరించి
దక్షిణకరమునఁ దాల్చి శరంబు,
దారుణ మైనకోదండంబు, మఱియు
నుజ్జ్వలపీతయజ్ఞోపవీతంబు
వామభుజంబున వహియించి, యహహా!
ఆపాదమస్తకాత్యంతసుందరులు
నమితశృంగారరసాకృతు లగుచు
శ్రీరామలక్ష్మణుల్ చెలువొంది రపుడు.
వారినిఁ జూచినవా రెల్ల నపుడు
పరమసంతోషసంభరితాత్ము లైరి;
ప్రజలెల్లఁ గనుఁగొప్ప వాల్పకే ప్రీతి
నేకదృష్టిని వారి నీక్షించుచుండి
రాయన్నదమ్ముల నరసియు జనకుఁ
డాత్మయందునఁ గడు హర్షంబుఁ జెంది,
తత్క్షణమే పోయి తాపసోత్తముని
పాదపద్మంబులఁ బట్టియు మ్రొక్కిఁ
వినిపించి తనకథావృత్త మాపయిని
ఘనధనుర్భఙ్గరంగస్థలం బెల్లఁ
గలయఁ జూపించెను గౌరవం బొప్ప.
ఆరామలక్ష్మణు లరిగి రెందెందు
నందందుఁ గలజను లందఱుగూడ
నాశ్చర్యచకితులై యురసిరి వారి.
తమతమముఖమునే తద్రామవిభుఁడు
కాంచుచున్నట్లుగాఁ గని రెల్లజనులు.
కాని యం దుండినఘనరహస్యమ్ము
నెఱుఁగఁ జాలక పోయి రెవ్వరుగూడ.
అంత విశ్వామిత్రుఁ డరసి రంగంబు
"నెంతయో తగియుండె నేర్పాటు లెల్ల"
నని జనకునితోడ ననఁగ, నానృపతి
యతిముదితాత్ముఁడై యానందపడియు,
అటఁగల సకలోన్నతాసనశ్రేణి
యందు నన్నిటికన్న నన్నివిధాల
సౌందర్య విశదవిశాలమౌ నొక్క-
యున్నతపీఠిఁ గూర్చుండఁగాఁ జేసె
ఋషిసమేతముగ నానృపసహోదరుల.
పున్నమచంద్రుండు పొడిచినంతటనె
కాంతిని బొయునక్షత్రంబు లటుల
రఘురామచంద్రుదర్శన మయినంత
వెలవెలఁబోయిరి పృథ్వీంద్రు లెల్ల.
"తప్పక రాముఁడు ధనువును విఱుచు;
కాక-యీఘనశివకార్ముకం బతఁడు
విఱువ లేకున్నను బృథ్వీకుమారి
యతనికే కీలించు నాజయమాల"
అని నిశ్చయించి నిజాంతరంగముల
నృపులు పరస్పరం బిట్లు లనుకొనిరి:
"సోదరులార! యిచ్చో విచారించి
మనయశఃపౌరుషామరబలతేజ
ములఁ గిదే వచియించి పూర్తిగా స్వస్థి
యింటిదారిని బట్టుటే హిత మౌను."
అన నవివేకగర్వాంధు లైనట్టి
నరపతుల్ కొందఱు నవ్వి యిట్లనిరి:
"శివధనుర్భంగము చేసినప్పటికి
సీతను రాముఁడు చేపట్ట లేఁడు.

అట్టిచో విలు వంచు టనునది లేక
సీత నెవ్వాఁడు పెండ్లి చేసికోఁ గలఁడు?
కాలుఁడే యెదురౌనుగాక యుద్ధమున
సీతకై వాని నిర్జింపఁగాఁ గలము."
అని పల్కఁగ్రోవ్యుక్త లాలకించియును,
ధర్మశీలుఁడు జనార్దనభక్తు లైన
నరపతుల్ కొందఱు నవ్వి యిట్లనిరి:
"గర్వాంధు లైనయీశ్వోతలేశ్వరుల
కాశ లన్నియు నడుగంటుఁ దథ్యముగ
సీతను బెండ్లాడు శ్రీరామవిభుఁడు;
రణధీరు లగుదశరథరాజసుతుల
యుద్ధములో నెవ్వ రోడింపఁ గలరు?
ఇటు వృథాలాపంబు లేల వచించి
ప్రాణంబు లూరక పాయుట మీరు?
భావితమాధుర్యవస్తుజాలమున
నాఁకలి దీర దత్యంతపవిత్ర
మైన మీ హితవాక్కు లాలింపుఁ డిపుడు:
ఆసీత జగదంబ యని లోన నెఱిఁగి
యల జగత్పిత రాముఁ డని గ్రహియించి
యీతనిశోభఁ గండ్లారఁగాఁ గనుఁడు.
సుందరుల్, సుఖదులు, సుగుణాలవాలు
లైనయీరాఘవు లనవరతంబు
శివునిడెందమున వసించుచుండెదరు.
అతిసమీపములోని యమృతాబ్ధి విడిచి
యెండమావులకుఁ బర్వెత్తియు వెట్టి
నేల మీరలు గతియించుట చెపుఁడు?
ఇంక మీ యిష్ట మేదేనిఁ గానిండు.
మీ జన్మమాత్రము మహిఁ దరియించె-,
నని పల్కు విజ్ఞాను లగుధరావిభులు
వీక్షింప సాగిరి ప్రేమ దీపింప
నా యనుపమసుందరాకార; మప్పు
డాకాశమందుండి యమరగణంబు
లాదివ్యదృశ్యంబు నగయు చుప్పొంగి
కురియుఁగాఁ జేయుచుఁ గుసుమవర్ష ములు
పాటలు పాడెను వర్షింప మధువు.

సీతాదేవి స్వయంవరసభామండపము ప్రవేశించుట

అయ్యది తగుసమయం బని యెఱిఁగి
జనకుఁడు కబురంప జానకికొఱకు
సౌందర్యచాతుర్యసదన లైనట్టి
ప్రియసఖీజను లెల్ల వెంటఁ దోడ్తెచ్చి
రాసీత నుచితమర్యాద దీపింప.
శ్రీజానకీశోభ చెప్పఁగా వశమె!
అది వర్ణనాతీత మద్భుతాద్భుతము!
జగదంబ సౌందర్యసద్గుణరాశి
తద్ధరాజాత సీతామాత యహహా!
ప్రాకృతనార్యంగ బాంధవత్వమున
నఖిలోపమానంబు లల్పంబు లయ్యె.
ఆయుపమానసహాయంబుతోడ
వసుధాతనూజను వర్ణింపఁబూని
కుకవి నామంబును క్ష్మోణిలోఁ బొంది
యపయశంబును బొందు నవసరం బేల?
ఒకవేళఁ బ్రాకృతయువతులతోడ
జానకీదేవిని సరిపోల్ప మనిన
జగతిలో నామెతో సమ లెందుఁ గలరు?
వట్టిమాటలమారి భారతీదేవి,
యీభవానీదేవి యర్ధాంగయుక్త,
యీరతీదేవి యనంగభర్తృకగ-
నతిదుఃఖితాత్మయై యంగలార్చెడిని.
ఇంక వై దేహితో నిందిరాదేవి
సరిపోలునందుమా, సరిపోల దెపుడు;
ప్రియసోదరులు మద్యవిషము లారమకు.
సౌందర్య మను క్షీరసాగరమందు

రమ్యత యనెడికూర్మంబును నిలిపి
శోభయే పూన రజ్జుస్వరూపమును,
మహితశృంగారమే మందరంబుగను
పంచాస్త్రుఁడే నిజపాణిపద్మముల
స్వయముగాఁ జిలికినసమయమ్మునందుఁ
బూర్ణశోభానందమూలమై వెలుఁగు
నొక లక్ష్మి యందులో నుదయింపఁ గలుగు—
నపుడును సీతతో నారమాసతిని
సరిపోల్చుటకుఁ గవి సంకోచపడును.
చతురసఖీమణుల్ జనకపుత్రికను
బాటలు పాడుచు వర్షింప మధువు
తెచ్చి రారంగప్రదేశాని, కామె
యావనాయతకటి నలరారు చుండె
బహుసుందరఁ బగుపట్టుపుట్టంబు.
ఆ జగజ్జననిమహాదివ్యశోభ
యతులిత మైన దాహా! భరద్వాజ!
సర్వభూషణములు సముచితస్థాన
ముల నలంకృతములై పొలుపొందుచుండె;
కడు శ్రద్ధతోడ శృంగారించి రామె
ప్రత్యంగమును జెలుల్ పరమాద్భుతముగ.
శ్రీజనకాత్మజ, సీత, భూజాత
యారంగభూమిలో నడుగిడి నంత
నామె రూపముఁ జూచి వ్యామోహ మంది
రఖిలనారీనరు లాత్మలలోన.
అమరవధ్యేయులు హర్షితు లగుచు
ప్రమోయఁజేసిరి దుందుభుల నాకసమున.
గీతముల్ పాడుచుఁ గిన్నరాంగనలు
కురిపించి రవనిపైఁ గుసుమవర్షముల.
సారసపాణుల జయమాలఁ దాల్చి
త్వరితనేత్రముల సీతాదేవి చూచె
సకలభూపాలకసంఘుంబు నపుడు.
చకితాత్మయై రామచంద్రునికోస
మాసీత చూడఁగా నఖిలభూపతులు
భ్రాంతినిఁ జెందిరి భావంబులందు.
అంత సీతాదేవి యరసె మునీంద్రు
ప్రక్కఁగూర్చున్న శ్రీరామలక్ష్మణుల.
ఆమెచూపులు వారియందున వ్రాలె
లుబ్ధంబు లౌచుఁ గోల్పోయిననిధినిఁ
గాంచిన తెఱఁగున ఘనమునిరాయ!
గురుజనబహురాజకూటంబుఁ గాంచి
సహజలజ్జాన్వితస్వాంతయై సీత
శ్రీరఘువీరుని హృదిని గ్రహించి
చెలులవైపునకు దృష్టిని మఱలించె.
శ్రీరామురూపంబు సీత శృంగార
మఖిలనారీనరు లరయు చేకముగ
తెప్పపాటుల విస్మరించియు నెల్ల
రాత్మలోఁ దహతహలాడిరి గాని
వెఱఁగును జెందియు వెలికి వచింప-
విధినిఁ బ్రార్థించి రీవిధి స్వాంతమందు:
"జనకునిజడతను సత్వరం బీవు
పోఁగొట్టి మాదుసద్బుద్ధి నాతనికి
దయసేయుమా విధాతా! కరుణించి,
అప్పుడు వెనుక ముం దాడక నృపతి
తనప్రతిజ్ఞను బరిత్యాగంబుఁ జేసి
శ్రీరామవిభునకు సీత నొసంగి
భవ్యకల్యాణోత్సవం బొనరించు;
నతనిఁ బ్రశంసించు నఖిలలోకంబు
సర్వ్వ లీబుద్ధికి సంతసించెదరు.
అటుగాక యాతఁడు హఠ మూనునేనిఁ
జివరకుఁ దాపంబుఁ జెందుట నిజము.
జానకీదేవి కాశ్యామసుందరుఁడె
యోగ్యవరుం డని యుద్ధృతభావ
నానిమగ్నులుగ నున్నారు సర్వులును."

వందిజనులు జనకునిప్రతిజ్ఞను బ్రకటించుట

పిదప వందిజనంబుఁ బిలిపింప జనకుఁ
డరుదెంచి రట బిరుదావళు లెల
నుచ్చైశ్స్వరంబున నుచ్చరించుచును.
అప్పుడు జనకరా జావందిజనుల,
"పోయి మీ రీరంగభూమి నంతటను
జాటుఁడు నా ప్రతిజ్ఞావాక్యములను"—
అని వచియింపఁగా నావందిజనులు
బయలుదేరిరి తమపని నిర్వహింప;
వారిడెందమున లవంబైనఁ గాని
యుత్సాహ మనునది యుండక పోయె.
అంతట వందిజనావళి యిట్లు
వరవాక్కు లొప్పఁగాఁ బలికి రాసభను:
"వినుఁ డో హరోధారుణీవిభులార! మేము
చేతులు పైకెత్తి చెప్పుచున్నాము:
శ్రీ శ్రీవిదేహధాత్రీవల్లభుండు
సలిపిన శపథంబు, సర్వులు వినుఁడు!—
రాజేంద్రభుజబలరాహు వీథనువు,
దీనికాఠిన్యంబు దీనిభారంబు
నెల్ల రెఱింగినదే నృపులార!
రావణబాణాదిరాక్షసభటులు
సైత మీశంకరచాపంబుఁ జూచి
చల్లఁగా నిండ్లకు జాఱుకొన్నారు.
ఈరాజబృందమం దెవఁడీకఠోర
పురహరకోదండమును భంగపఱచు—
వైదేహి యతనినే వరియింపఁ గలదు
నిర్విచారముగ నానిమిసంబునందుఁ
ద్రిభువనజయముతో దీపించు నతఁడు."

రాజులయపజయము

ఆప్రతిజ్ఞను విన నఖిలభూపతుల
కభిలాష జనియించె నంతరంగముల,
బలగర్వితావనీపతులచిత్తముల
నతిరోష ముదయించె, నంతట వారు
బిట్టుగా నడుములు బిగియించికొనుచుఁ
బౌరుష మూని, చివాలున లేచి
వినమితశిరు లౌచుఁ బ్రియదేవతలకుఁ,
బోయి యాశంకరుభూరిచాపమును
గ్రోధవీక్షణములఁ గొఱికొఱఁ జూచి,
దానిని ధీరతఁ జాఁకి పైకెత్తఁ
దమబలం బెల్లను ధారపోసినను—
అది లేవదాయె రవ్వంతమాత్రమును.
వీసమైనను లో వివేక మున్నట్టి
నృపతులుమాత్ర మెట్లోనిఁ గానిండు
చాపము చెంతకుఁ జనైనె లేదు;
మూర్ఖమానసు లైనభూపతు లెల్లఁ
జాపము నెత్తఁగా సతమతపడియు,
బ్రతివీరభటబాహుబలమును మింగి
యంతకంతకును భారాధికం బౌచు
నది పైకి లేవక యచలమై యుంట
నలసి కూర్చుండి రత్యాకులపడుచు.
అంతటఁ బదివేలయవనీశు లొక్క—
సారిగా లేచి రా చాపంబు నెత్త,
సర్వాయత్నములు నిష్ఫల మయ్యెఁ గాని
పరమసతీమణిస్వాంత మెప్పుడును
గాముకవాక్కులఁ గదలనిరీతిఁ
జలియింపదాయె నాశంభుకార్ముకము.
ఆసక్తి విడనిసన్న్యాసిచందమున
నపహాస్య మొంది రాయవనీశు లెల్ల.
తమకీర్తివిజయప్రతాపాతిశయము
లన్నియుఁ గోల్పోయి యావింటిముందు
మఱలె నా రాజసమాజంబు లెల్ల.
అలసి, హతాశులై యాకులపడుచు
నరిగి యానరపతు లాత్మీయబృంద

మందునఁ గూర్చుండి రణఁగియు మణఁగి.

జనకునినిరాశాప్రకటనము

అంత నాన్నృపతుల నరసి యాజనకుఁ
డాకులుఁ డౌచు నిట్లనియె రోషమున:
"నా ప్రతిజ్ఞను విని నానాప్రదేశ
నరపతుల్ వచ్చియున్నార లిచ్చటకు.
ధృతనరరూపులౌ దేవదానవులు
పృథురణధీరులౌ వీరవరేణ్య
లెందఱో నేఁ డిట కేతెంచినారు.
అల మనోహరకన్య, యద్భుతజయము,
రమణీయ మగుకీర్తి ప్రాప్తించుమీకుఁ
గాని యీశివువింటిఁ గయి నెత్తి, వంచి,
యీబహూకృతుల గ్రహించుసమర్థ
నిప్పటికిని బ్రహ్మ సృష్టించనట్లు
కనిపించుచున్నది క్ష్మానాథులార!
ఈలాభ మాసింప కెవ్వఁడు నిలుచు?
చాపంబు నెక్కిడఁ జాలరై రెవరు.
వింటి నెక్కిడుటయు విఱుచు టట్లుండ-
నావగిం జంతయు నవనిపై దాని
సంచలింపఁగఁ జేయఁ జాలినవార
లొకరైన మీలోన నున్నట్లు లేదు.
ఈపృథ్వి వీరవిహీన మైనటుల
నే నిశ్చయించుట కెవ్వరుఁ-గూడ
బలసంయుతుల మని భావించువారు-
తగదు క్రోధింపఁగా ధరణీశులార!
ఆశల వదలి గృహాలకుఁ జనుఁడు,
వై దేహి కిలను వివాహకార్యంబు
లిఖితమందున నుంచ లేదేమొ బ్రహ్మ.
నా ప్రతిజ్ఞను విడనాడిన యెడల
నా సర్వసుకృతముల్ నశియింపఁ గలవు.
నా ప్రియపుత్రి కన్యగ నుండవలయు
నిపు డేమి సేయుట? ఈప్రపంచమున
వీరులే లే రనువిషయ మే నాత్మ
నెఱిఁగియే యుండిన నీశపథంబుఁ
బలికియుఁ బరిహాసపాత్రుఁడఁ గాను."
అని పల్కు జనకోక్తు లాలకించియును
సకలనారీనరుల్ జానకి న్గాంచి
వ్యాకుల మొందిరి స్వాంతరంగమున.

లక్ష్మణునియాగ్రహము - ప్రతిజ్ఞ

అప్పుడు లక్ష్మణుం డాగ్రహంబొందఁ,
గుటిలంబు లయ్యె భ్రూకుటు లుగ్రరీతి
నధరంబు లదరఁగా నక్షియుగ్మమునఁ
గణకణ క్రోధాగ్నికణములు కురిసె.
జనకుని వాక్యముల్ స్వాంతంబులోన
బాణంబులట్లుల బాధించెఁ గాని
రఘువీరుభయముచేఁ బ్రత్యుత్తరంబు
సౌమిత్రి వచియింపఁ జాలక పోయె.
చివర కాతఁడు లేచి శ్రీరామచంద్రు
చరణపద్మముల శీర్షము వంచి ప్రమొక్కి
పలికెఁ బ్రమాణపూర్వకవాక్కు లిట్లు:
"ఒకఁడైన రఘువంశ్యుఁ డుండినచోట
ననుచితవాక్యంబు లాడఁగా రాదు.
రఘుకులమణిరామరాజేంద్రు నెదుట
వెలుఁగొందుచుండుట విదితమై యుండి
సాహసంబును బూని జనకభూమీశుఁ
డనుచితవాక్యంబు లనియె నీరీతి."
అని వచియించియు నగ్రజుపైపు
మఱలి యీరీతి లక్ష్మణుఁడు వచించె:
"సూర్యకులాంబుజసూర్యుఁడా! వినుమ
ఏ డంబమున వచియించుట లేదు
హృత్పూర్వకంబుగానే తెల్పుచుంటి;
నీ యాజ్ఞ యైనచో నేను శ్రీరామ!

బంతిచందమున నీబ్రహ్మాండ మెత్తి
వ్రక్కలు సేతు మృద్భాండంబురీతి.
భవదీయ మగుప్రతాపప్రభావమున
భగవానుఁడా! మేరుపర్వతం బేను
త్రుంచెద ముల్లంగిమొంపచందమున.
నా కీపురాణపినాకమా లెక్క?
ఈవిషయంబు గ్రహించి యోనాథ!
ఆజ్ఞ నొసంగియు, నాపయి నీవు
కాంచుమా నాశూరకార్యంబు స్వామి!
కమలనాళముఁ బోలెఁ గార్ముకం బెత్తి
యెక్కిడి, దాని వహించి హస్తమున
యోజనశతదూర మురికెద నేను.
భవదీయ మగుప్రతాపప్రభావమున
ఛత్రాకదండము చందాన దాని
విఱుతుఁ బుటుక్కున విశ్వాధినాథ!
ఇటుసేయ లేకున్న, నిదియె నీపాద
సన్నిధిలోఁ బ్రతిజ్ఞను జేయుచుంటి–
నిఁక ధనుర్బాణంబు లెపుడు ధరింప."
ఇటుల లక్ష్మణుఁ డాగ్రహించి వచింపఁ
గుంభిని వణఁకె, దిక్కుంభులు సొరిగె;
సకలసభాసదుల్ సర్వభూపతులు
ఘనభయభ్రాంతసంకలితాత్మ లైరి.
సీత స్వాంతంబునఁ జెందె హర్షమును
జనకభూవిభుఁడు లజ్జాయుతుం డయ్యె.
ఆచార్యుఁడును, రాముఁ, డఖిలర్షివరులు
సమ్మోద మొందిరి స్వాంతరంగములఁ
బలుసార్లు—తనువులపైఁ బుల్కలొదవ.
సంజ్ఞఁ గావించి లక్ష్మణుని వారించి
రాముఁ డంతటఁ బ్రేమ రాజిల్లుచుండఁ
జెంగటఁ గూర్చుండఁ జేసె; నాపిదప
నయ్యది శుభసమయం బని యెఱిఁగి
అత్యనురాగమయాలాపములను

బలికె నీరీతి విశ్వామిత్రమౌని:
"తెమ్మోయి శ్రీరామ! లేచి నీ విపుడు
భవునిచాపంబును భజియింపు మోయి!
జనకరాజేంద్రువిచారభారమును
బాఱద్రోలుము రామభద్రా! కుమార!"
అనుగురువాక్యంబు లాలించి, రాముఁ
డామునిచరణంబులుం దుంచి శిరము,
వందనం బొనరించె భక్తి వెలుంగ.
ఆరామహృదయపద్మాంతరాళమున
మోదఖేదంబులు పొడసూప లేదు.
సింహశాబకమును సిగ్గొందఁ జేయు
శౌర్యధైర్యంబులు సందీప్తి నొంద
సహజశోభను రామచంద్రుండు నిలిచె.

శ్రీరాముఁడు శివధనుర్భంగము చేయుట

ఉన్నతాసన మనునుదయాద్రినుండి
రఘువీర బాలసూర్యస్వామి పొడిచె
వికసించె సజ్జనబృందపద్మములు
సంతోష మొందె లోచనభృంగసమితి.
అరినృపాశానిశి యంతంబుఁ జెందె
రాజప్రలాపతారల కాంతి తరిగె.
అభిమానయుతనృపాలావళీకుముద
కోటులు ముకుళించుకొని పోయె, సకల
కపటరాజోలూకగణములు నక్క.
మునిదేవతాకోకములు శోకములను
వదలి వర్షించెను ప్రసవవర్షముల
భక్తిసంభరితసేవాచిహ్నముగను.
అంత రాముఁడు సహజానురాగమున
గురుదేవుపదములకు న్నతిఁ జేసి
యఖిలమునీశులయాజ్ఞఁ గైకొనియె.
అఖిలజగత్స్వామి యారామవిభుఁడు
సహజశోభ వెలుంగ సభను గమించె

గురుమ త్తమంజులకుంజర మటుల.
ఆరీతి శ్రీరాముఁ డరుగుచునుండ
సర్వనారీనరుల్ సంతోష మొంది
పులకసమూహప్రపూర్ణాంగు లైరి.
తమతమపితృదేవతల, దేవతలను
దమపూర్వసుకృతాళిఁ దలఁచుచు జనులు
ప్రార్థించి రీరీతి భక్తి వెలుంగ;
"మా పూర్వపుణ్య మేమాత్ర ముండినను
ఓస్వామి! ఓప్రభూ! ఓగణనాథ!
శ్రీరామచంద్రుఁడు శివశరాసనము
మృదుమృణాళముఁ ద్రుంచు రీతిగా నేఁడు
భంజించుఁగాక! మా ప్రార్థనం బిదియె."
శ్రీరామచంద్రు వీక్షించుచుఁ బ్రీతిఁ
జెలిక త్తెలను దనచెంతకుఁ బిలిచి
జానకితల్లి యీచందానఁ బలికె
స్నేహవశ్యంబునఁ జింతతో నిండి:
"ఎల్ల బాంధవులును హితమిత్రజనులు
కాత్తుకం బక్కటా! కాఁతు రే గాని-
యొకరైన గురువుతో నోమునిరాయ!
పసిబాలుఁడైన యీపార్థివసుతున
కాపని నొసఁగుట యనుచిత మనరు:
రావణబాణాదిరాక్షసుల్ గూడ
నావిల్లుఁ దాఁకకే యరుగుట నెఱిఁగి
దంభంబు లాడినధరణీశు లెల్ల
శృంగభంగంబును జెందుటఁ దెలిసి
పాప మీనరపాలబాలునిచేత
నాధను స్సుంచు టత్యాశ్చర్యకరము.
బాలమరాళంబు వహియింపఁ గలదె
తతమందరాద్రిని దనమూపునందు?
భూపతిమతి చెడిపోయిన దకట!
ప్రియులార! యెఱుఁగము విధివిధానమును!"
అని పల్క, విని యిట్లు లనియె నం దొక్క-

చతురసఖీమణి స్వాదువాక్యముల:
"సుజ్ఞానరాజ్ఞి! తేజోనిధానులను
లఘువుగా నెంచఁ జెల్లదు చూచునెడల
కుంభసంభవుఁ డేడ? కూపార మేడ?
చోద్య మాతఁడు వార్ధి శోషిల్లఁ జేసి
నిజయశంబున నింపె నిఖిలజగంబు.
చూడఁగాఁ జిన్నది సూర్యమండలము,
అది యుదయించిన యాక్షణంబందె
త్రిభువనతమ మెల్ల వ్రీలి నశించు.
అరయఁగా, మంత్ర మత్యంతసూక్ష్మంబె
యది బ్రహ్మవిష్ణురుద్రాదిదేవతలఁ
దనవశవర్తులఁ దాఁ జేసికొనును.
అంకుశం బెంతది! - యది వంచఁగలదు
భువి, మత్తగజరాజమును మహారాజ్ఞి!
పుష్పాస్త్రములఁ జేతఁ బూనుమన్మథుఁడు
నిజవశంబులఁజేసె నిఖిలలోకముల.
ఈవిషయముల గ్రహించి యో దేవి!
వదలుమా సంశయభావజాలములఁ
దప్పక రాముఁడు ధనువు భంజించు"—
అను సఖీవాక్యంబు లాలించి రాణి
ధైర్యంబు పూనె వ్యథాభరం బుడిగె
నామెరామప్రీతి యధికమై వెలిఁగె.
ఆరామ మై దేహి యరసి, స్వాంతమున
భయ మొంది నిఖిలదేవతలకు మ్రొక్కి-
యాకులమానసయై యాత్మలోన
నిట్లు. ప్రార్థించె ను మేశుల భక్తి:
"హే! పార్వతీపరమేశ్వరులార!
సరగ నాయందుఁ బ్రసన్నులు గండు
నే మిమ్ము నమ్మియు నియతిఁ గొల్చితిని.
నాఁయందుఁ గరుణామనస్కులై మీరు!
తగ్గింప రారె కోదండభారమును.
దయ, వినాయక! వరదాయకా! దేవ!

ఈనాఁటి జయసిద్ధికే విఘ్ననాథ!
నీ పూజ చేసితి నిత్యంబు నేను
పలుమాఱు నేఁజేయుప్రార్థన వినియు
నత్యల్ప మొనరింపుమా చాపభరము."
శ్రీరఘువీరు వీక్షించి వీక్షించి
చిత్తంబులో ధృతి చేకూర్చుకొనియు
జానకి ప్రార్థించె సకలదేవతల.
ఆమెకన్నవను బ్రేమాశ్రువుల్ నిండెఁ
దనువెల్లఁ బులకీకృతంబయి వెలిఁగె.
కన్నులవిందుగా భూజాత సీత
శ్రీరాముశోభ వీక్షించెను, గాని
తనతండ్రిశపథంబుఁ దలఁచినంతటనె
యామెమానస మెల్ల నతిబాధ నొందఁ
దనలోనఁ దా నిట్లు తలపోయఁ దొడఁగె:
"అక్కటా! నాతండ్రి యంతరంగమున
మంచి చెడ్డల చింత మానిపైచియును
దారుణశపథంబు తలఁచియున్నాఁడు.
మంత్రులు భయపడి మాతండ్రి కిపుడు
హితబోధ సేయ రొక్కింత కేనియును.
విబుధసమాజ మీవిధముగా నుంట
కడు శోచనీయముగాఁ గానిపించు.
కులిశాతికఠిన మాకోదండ మేడ?
ఆకోమలశ్యామలాంగుఁడై వెలుఁగు
నృపకిశోరుం డేడ? యింక నే నెటుల
ధృతి పూనఁగల పరమేశ్వరా! యిపుడు?
వరశిరీషప్రసవంబు వజ్రమును
భేదింపఁ గలుగునా? వెఱ్ఱివా రైరి
సకలమహాసభాజనము లీతఱిని.
హేశంభుచాపమా! యిప్పుడు నిన్ను
శరణంబుఁ గోరితి. సాదరం బొప్ప
సభ్యుల కొసఁగి నీజడత, రాఘవుని
దృష్టిసోఁకినయంతఁ దేలిక యగుమ!"

సీత యీరీతిగాఁ జిత్తంబులోన
నతిపరితాపంబు నందె నాయమకు
నొక్క క్షణం బొక్క యుగశతం బయ్యె.
ఒకసారి రాము నింకొకసారి నేల
వైపున కాసీత పరికించుచుంట
నాయమలోలాక్షు లలరారుచుండె—
మనసిజమీనయుగ్మం బరుదెంచి
చంద్రమండలమనుజులడోలలోనఁ
గ్రీడించుచుండినరీతి మునీంద్ర!
లావణ్యాయుత మగులజ్జానిధి
నామెముఖాంబుజమందునఁ జిక్క
వాగ్భృంగములు బయల్వడఁజాల వయ్యె.
ఆమె కన్గొలుకుల నశ్రువుల్ నిలిచెఁ
గడుఁ గృపణుని యింటఁ గాంచనం బటుల.
అంతట సీత పెల్లారాటవడుచుఁ
దనభీరుగుణమును దలఁచి లజ్జించి,
హృదిలోన ధృతిబూని యిట్లు తలంచె:
"ఏను సత్యవ్రతనేని త్రిశుచిగ
నిర్మలరామాంఘ్రినీరజంబులను
నా చిత్త మెపుడు మగ్నం బగునేని
అఖిలాత్మవాసియౌ నాపరమాత్మ,
తద్రామునకు సదా దాసిగాఁ జేసి
నా కొనఁగూర్చు ధన్యత్వంబు నిజము.
ఎవనిపై సత్ప్రేమ మెపుడు దీపించు
నతనితో సంయోగ మగు నేరికైన
నిందు సందేహ మొక్కింతయు లేదు."
ఆమె రాముని జూచి యంతరంగమున
రామానురక్తిలోఁ బ్రౌఢంబులైన
నర్పింపఁగా నిశ్చయంబును బూనె.
ఈవిషయంబెల్ల నెఱిఁగి రాముండు,
పరమకృపాబ్ధి, సర్వజ్ఞుండు, ప్రభువు
సీతను వీక్షించి, శివువిల్లుఁ జూచె—

గరుడుఁ డల్వాహిని గాంచినపగిది.
రఘువంశమణి యైనరామచంద్రుండు
శివునిచాపమును వీక్షించుటఁ జూచి
తనువెల్ల బులకీకృతంబయి వెలుఁగఁ
బలికె లక్ష్మణుఁ డిట్లు బ్రహ్మాండభాండ
మంఘ్రిపంకజమున నదిమి పట్టియును:
"అష్టదిగ్గజకమఠాహివరాహ
వరులార! మీర లీవసుధాస్థలంబు
గట్టిగాఁ బట్టుఁడీ కదలకుండఁగను.
శ్రీరామచంద్రుఁడు శివునిధనుస్సు
ఖండింప నున్నాఁడు గావున మీరు
నా యాజ్ఞ వినియు సన్నద్ధులై నిలుఁడు."
అంతలో రాముఁడు హరకార్ముకంబు
చెంతకుఁజేర, వీక్షించుచున్నట్టి
సకలనారీనరుల్ స్మరియించి రాత్మ
నారామునకు సహాయంబు సేయుటకు
సురలను, దమతమసుకృతసంఘముల.
సర్వజనాజ్ఞానసంశయావళులు
మందభూపదురభిమానగుణంబు
భార్గవరాముగర్వప్రకటనము,
నమరమునీంద్రభయాందోళనములు
సీతామహాదేవిచింతాకులతయు
జనకరాజేందు్రపశ్చాత్తాపభరము,
దారుణరాజ్ఞీవ్యథాదావవహ్ని—
మొదలైన భారసమూహంబు లెల్ల
హరచాపఘననొకయందునఁ జేరె.
అవి యెల్ల నెవనిసాహాయ్యంబుతోడ
రాఘవబాహుపరాక్రమాపార
వారాశిఁ దాటఁగా వలయునో యట్టి
చుక్కాని పట్టెడుశూరుండు లేఁడు.
శ్రీరాముఁ డంత వీక్షించెను మొదట
సభ్యుల నందఱి, సర్వజనంబు
లిఖితచిత్రములవలె నున్నూచుచుండి
రంత నాకరుణాబ్ధియరసియు సీత
నతిశోకసంకులితాత్మఁగా నెఱిఁగె.
క్షణ మొక్క కల్పంబుగాఁ గానుపింప
నుగ్రాకులాత్మయై యున్నవై దేహి
నరసె నాసూర్యకులాభరణంబు.
"తృషితుఁడై, నీటికై మృతి నొంద నొకఁడు
తదనంతరంబు సుధాతటాకంబు
లభియించినను దాన లాభ మే ముండు?
సర్వసస్యం బెండి చచ్చినపిదప
వర్షంబు గురిసిన ఫల మేమి కలుగు?
సమయంబు తప్పఁ, బశ్చాత్తాప మేల?
అనుచుఁ జింతించి నిజాత్మ రాఘవుఁడు
వీక్షించి జనకునిప్రియతనూజాత
నామెయనన్యమహాభక్తి నెఱిఁగి
పులకితాంగుండయ్యె, మునిలోకనాథ!
అంత నాతఁడు తనయాంతర్యమందు
గురువందనము చేసికొని భక్తితోడ
హరచాప మెత్తఁ దా నతిలాఘవమున
నాకాశమున మండలాకృతి దోఁప.
ఎప్పు డాతఁడు ధను వెత్తి యానారిఁ
దగిలింప వంచెనో దాని నెవ్వార
లెఱుఁగరు; వంచి యెక్కిడినట్టివిల్లు
చేఁదాల్చి యుండిన శ్రీరాముఁ గనిరి.
క్షణములో శ్రీరామచంద్రుండు విఱిచె
హరునిచాపమును మధ్యకు రెండుఁగాఁగ.
తద్ఘోరతరమహోద్దండస్వనంబు
బ్రహ్మాండభాండగర్భములందు నిండె.
ఆఘోరఘోరమహాభీలరావ
మఖిలప్రపంచగహ్వరములఁ దాఁకె—
మార్తాండహయములు మార్గంబు తప్పె
నష్టదిగ్గజములు నదరి ఘూర్ణిల్లె

సర్వావసుంధరాచక్రంబు వణఁకె.
కుండలీశక్రోడకూర్మముల్ కదలె.
నమరదానవమునుల్ హస్తయుగ్మములఁ
జెవి రంధ్రములపైనఁ జేర్చి యాధ్వనికిఁ
గారణం బేమని కళవళపడిరి;
కాని రాముఁడు గార్ముకముఁ ద్రుంచు నెటఁగి
జయజయధ్వానముల్ సలిపి లెల్లరును.
హరచాప మనునావయందునఁ జేరి
రఘురామబాహుపరాక్రమాంబుధిని
దతమోహవశముచేఁ దరియింపఁ దలఁచు
సంఘ మానావతో స్తైతంబు మునిఁగె.
వితిగిన యారెండు వింటితుండెములు
నవనిపైఁ బడ వేయ నారామవిభుఁడు,
సర్వులుఁ గనుఁగొని సంతోషపడిరి.
పావనప్రేమాంబుభరిత మైనట్టి
కౌశికమునిరూపఘనపయోరాశి
రామసుందరరూపరాకేందుఁ జూచి
పులకవీచికల నుప్పొంగె నాతఱిని
దుందుభుల్ నభమునందునఁ బెల్లు ప్రమోదె
నాడిరి పాడిరి యమరకన్యకలు.
బ్రహ్మాదిసురసిద్ధవరమునీశ్వరులు
శ్రీరామవిభుఁ బ్రశంసించి, సంప్రీతి
బహుళవర్ణ ప్రసవంబులఁ జల్లు
చాశీర్వదించిరి యానందపడుచు.
కిన్నరుల్ తీయని గీతముల్ పాడి
రల జయధ్వనులు బ్రహ్మాండంబు నిండెఁ
దద్ధనుర్భంగనాదమును ద్రుంగియును.
ఎచ్చోటఁ జూచిన నెల్ల జనంబు
పరమసంతోషసంభరితాత్మ లగుచు
శంకరదుర్భరచాపంబుఁ ద్రుంచె
శ్రీరాముఁ డని ప్రశంసించుచే గలిగె.
వందిమాగధసూతభటసమూహములు
వినిపింపసాగిరి బిరుదావళులను.
గజహయమణిధనఘనవస్త్రములను
జనులెల్ల దానముల్ సలిపిరి దేవుఁ
డాబాలవీరుని నాశీర్వదింప.
తాళముల్, రమ్యమృదంగశంఖములు,
సన్నాయి, భేరులు, చక్కనిడోళ్ళు,
ఘనదుందుభులు, బహుకమనీయవివిధ
వాద్యముల్ ప్రమోదె శుభంబు దీపింప.
ప్రతివీథి యువతులు రమ్యకంఠముల
భద్రగీతంబులఁ బాడి; గత్యంత
సంతోష మొందెను జనకునిరాణి
తనసఖీగణసహితంబుగాఁ, గనఁగ
వాన లే కెండెడివరిచేని పైన
వర్షంబు గురిసినపగిది మునీంద్ర!
జనకభూపతి నిర్వీచారతఁ బొంది
యంబువులం దీది యలసినవాఁడు
తీరంబుఁ జేరిన స్థితిని సుఖించె.
నృపతుల ముఖశోభ హీనతఁ జెందె
దివసమందున దీపదీప్తివిధాన.
స్వాతివర్షమునకుఁ జాతకి పొందు
తత్సుఖంబునకె సీతాదేవిముదము
పోల్చఁగా వచ్చును మునిలోకనాథ!
కుముదాప్తుఁగాంచుచకోరకిశోర
మటుల లక్ష్మణుఁడు నిజాలోకనములఁ
నారామచంద్రునియందున నిలిపె.

సీత, శ్రీరామునిగళమున జయమాలఁ
గీలించుట

అంత శతానందునాజ్ఞానుసరణి
సీత తా నడచెను శ్రీరాముపైపు.
శుభగీతములు పాడుచును వచ్చుచున్న
చతురసుందరు లైనసఖులతోఁ గూడి

యమితశృంగారమయాంగంబు లొప్పఁ
గదలెను జనకభూకాంతకుమారి
రమణీయ బాలమరాళంబురీతి.
అల ఛవులందు మహోఛవిరీతిఁ
జెలులమధ్యమున భాసించె నాసీత
వరవిశ్వవిజయశ్రీభామహాదీప్త
జయమాల కరనీరజముల ధరించి.
తనువున బిడియంబు తనరఁగా నామె
భావము పరవశభరితమై యుండె.
ఆమె నిగూఢరామానురాగంబు
పరుల కగ్రాహ్యమై భాసిల్లుచుండె.
చేరువ కేగియు శ్రీరామచంద్రు
సౌందర్య మరసి యాజానకీదేవి
నిలిచెఁ జిత్రమువోలె నిశ్చల యగుచు.
చతురత గలిగినసకియ యత్తఱిని
నామెపరిస్థితి నాత్మ గ్రహించి
"శృంగారమయమైన యీజయమాల
వరునకు వేయుమా వసుధజా!" యనుచుఁ
బ్రోత్సాహపఱుపఁగా భూతనూజాత
జయమాల రెండు హస్తములఁ బైకెత్తెఁ-
గాని దానిని రాముగళమున వేయఁ
బ్రేమాతిశయముచే వివశత్వ మొందె.
ఆమె పైకెత్తిన హస్తయుగ్మంబు,
నాళసంయుత మైననలినయుగ్మంబు
జయమాలఁ గొనియును జంద్రబింబమును
భయముతో వీక్షించుపగిదిగాఁ దోఁచె.
ఆమనోహరదృశ్య మరసి యాసఖులు
పాడసాగిరి యొకపాట తీయగను.
హస్తదీప్తం బగునాజయమాల
సీత, రాముని కంఠసీమఁ దగిల్చె
నురముపై ప్రేలాడుచుండ సొంపుగను.
శ్రీరామునురమున ప్రేలాడుచున్న
జయమాలఁ గనుగొని సకలదేవతలు
పుడమిపైఁ గురిసిరి పుష్పవర్షములు.
కమలబాంధవుఁ గన్న కలువలరీతి
భూపాలు రెల్లరు ముకుళించుకొనిరి.
నగరంబునందున నభమున నిండె
బహువిధమంగళవాద్యరావములు
భయపడ ఖలులు, సంబర మొంద బుధులు.
కిన్నరనరనాగగీర్వాణమునులు
జయజయజయశుభస్వనములతోడ
నాశీస్సు లిడిరి మహానందపడుచు.
ఆడుచుఁ బాడుచు నమరకన్యకలు
కురిసిరి మఱిమఱి కుసుమాంజలులను.
విప్రులు పాడిరి వేదమంత్రములఁ
బలికిరి బిరుదులు వందిగణంబు.
"రాముఁడు శివధనుర్భంగంబుఁ జేసి
సీతను ప్రీతిమైఁ జేపట్టె"ననెడి
సంతోషవార్తలు సంవ్యాప్తి నొందెఁ
దత్స్వర్గమర్త్యపాతాళంబులందు.
నగరిలోఁ గలసర్వనాదీనరులును
ఆవధూవరులకు హారతు లిడిరి.
తమ కున్నశక్తిని దలపోయకుండ
వెదఁజల్లిరెచిరి విత్తమర్థులకు.
సౌందర్యమును, శోభ చక్కఁగా రెండు
నరరూపములను మానవలోకమందుఁ
గలసినరీతిగాఁ గనవచ్చె నపుడు
జానకీరాములజంట మునీంద్ర!
"జానకీ! ప్రభుపాదసారసంబులను
బట్టుకొమ్మని" చెలుల్ పలికిరి గాని
సీత మిక్కిలి భీతిఁ జెందెఁ జిత్తమున
శ్రీరామచరణరాజీవముల్ తాఁక.
గౌతమునతి గన్నగతినిఁ దలంచి
జానకి శ్రీరామచరణపద్మములఁ

దనకరంబులతోడఁ దాఁకక పోయె.
ఆ మెయలౌకికం బౌప్రేమ నెఱిఁగి
తనలోన రఘుమణి తా నవ్వుకొనియె.
అప్పుడు కొంద ఱాయవనిజ నరసి
యీ మెను గైకొన నభిలాషపడిరి.
ఆక్రూరు లాపాపు లామూర్ఖచిత్తు
లమితరుష్టాత్ములై యాసనావళుల
నొక రొక్కరుగ వీడి యుద్ధతి శేఁగి
సంగ్రామ మొనరింప సన్నద్ధు లగుచు
డంబముల్ పలుకఁ దొడంగి రాతఱిని.
ఆమంద భాగ్యులయం దొక్కఁ డిటులఁ
దమదంబునఁ బ్రల్లదంబులు గూసె:
"చెఱఁగొని పోదము సీత నుద్ధతిని
బంధింత మీరాజ బాలు రిర్వురను.
ధనువును విఱిచినంతనె ఫల మేమి?
ఆయువు హరకంఠమం దుండుదనుక
నీరాజనందిని నెవఁడు పెండ్లాడు?
జనకుఁడు వీరికి సాయమా నెడల
ముగ్గురఁగూడను బోరఁ గెల్చెదము."
ఆమాటలను విని యని రీ విధాన
సాధుభూపాలు రాశఠులను గాంచి:
"మహిని నీరాజసమాజంబుఁ జేర
లజ్జయే మిక్కిలి లజ్జ వహించు.
త్వద్బలవీర్యప్రతాపయశంబు
లాపినాకముతోడ నన్నియుఁ గలిసి
వికలమై పోయె, నావీరత్వమేన
భవదీయ మగుప్రగల్భములయందలిది?
క్రొత్తశూరత్వమా కొని తెచ్చుకొనిరి?
ఈబుద్ధిచేతనే యీశుండు మీదు
ముఖములపై మసిపూసి యున్నాఁడు.
ఈర్ష్యామదక్రోధవృత్తుల విడిచి
కన్నులవిందుగాఁ గనుఁడు శ్రీరాముఁ;
బ్రబలాగ్ని లక్ష్మణస్వామిరోషంబు
నందున శలభంబులై కాలవలదు.
గరుడునిబలిఁ గాకి కాంక్షించినటులఁ,
గుందేలు హరిభక్తిఁ గోరినరీతి,
ముక్కోపి తా సౌఖ్యమును గోరినటుల,
శంకరవిద్రోహి సర్వసంపదలఁ
బడయఁ గాంక్షించిన పగిది, లోకమునఁ
గడులోభి, లోలుండు, కలకీర్తి నొంద
నాత్మలో నెంతయు నాశించినటులఁ,
గామి, తా నిష్కళంకతఁ గోరి నటుల,
హరిపదవిముఖుండు స్వాంతర్యమందుఁ
బరమగతిన్ జెంద వాంఛించినటుల,
మేదినీపతులార! మీ యభిలాష
యంతయు వ్యర్థంబు హాస్యాస్పదంబు!"
ఆనృపసంరంభ మంతయు వినియు
సీత భయం బందఁ జెలికత్తె లంత
నామెను గొంపోయి రల రాణికడకు.
అపుడు రాముఁడు శాంతి యలరఁ జిత్తమున
జానకీప్రేమఁ బ్రశంసించుకొనుచు
దేశికోత్తమసన్నిధికిఁ జేర నరిగె.
జనకు నర్ధాంగియు, జానకీదేవి
యాందోళనాభరితాత్మలై, "అకట!
ఏమి యెనర్చునో యీశ్వరుం డింక?"
నని తలపోసిరి యనఘా! మునీంద్ర!
ఆదంభరాజోక్తు లాలించినంత
నటు నిటు చూచియు, నాలక్ష్మణుండు
రాముభయాన మార్పులుక లేఁడయ్యె.
అరుణరంజితనయనాంబుజాతములఁ
గుటిలభ్రుకుటితోడఁ గొఱకొఱఁ జూచె
రాజసంఘముల నారామానుజుండు
బహుమత్త గజములపై దూఁక నెంచు
కొదమసింగమువోలెఁ గ్రోధంబుతోడ.

ఆగోల వీక్షించి యంగనాజనము
లాకులపడి తిట్టి రాదుష్టనృపుల.

పరశురామాగమనము - శ్రీరామవిజయము

ఆసమయంబున నరుదెంచె నటకు
శివధనుర్భంగవిశేషంబు దెలిసి
భృగుకులకమలరవిస్వామి యైన
పరశురాముండు దుర్వారశౌర్యాబ్ధి;
యతనిఁ జూచినయంత నఖిలభూపతులు
పెద్దడేగను గన్న పిచ్చుకలట్లు
క్రుంగిపోయిరి భయాకులితాత్మ లగుచు.
ఆభృగురాము గౌరాంగమం దెల్ల
బావనభస్మ మొప్పారుచునుండె.
బహువిశాలం బగు ఫాలరంగమున
భవ్యత్రిపుండ్రముల్ భాసిల్లుచుండె.
మస్తకంబున జటామండలి దనర
నానానశశిబింబ మాగ్రహవశత
నరుణరంజిత మయి యలరారుచుండఁ-
గుటిలభ్రకుటితోడఁ గ్రోధాగ్నికీలి
కాజ్వలన్నేత్రయుగ్మంబు వెలుంగు
నాముసీశ్వరుని నై జాలోకనములఁ
బ్రకటితం బగుచుగడె రౌద్రరసంబు.
వృషభరాట్స్కంధముల్ వెడదవక్షంబు.
భాసురవరదీర్ఘ బాహుదండములు
విమలమూ యజ్ఞోపవీతంబు వెలుఁగ
జపమాలికయు మృగచర్మంబుఁ దాల్చి
కటి ముని వసనంబుఁ గట్టి, శోభిల్లు
మూపునఁ దూణీరములు రెండు దాల్చి
శరకార్ముకములు హస్తమున ధరించి
గురుభుజంబున గండ్రగొడ్డలిఁ బూని
భార్గవరాముండు భాసించుచుండె.
శాంతమునీశవేషంబుతో నున్న
నాతనికఠినకార్యము లెన్నొ కలవు.
అతనియుగ్రచరిత్ర మకథనీయంబు.
సాక్షాత్తు వీరరసంబె యారీతి
మునిరూపమున వచ్చె భూపతు లున్న
సభ కనిపించెను సంయమివర్య!
ఆభృగునాథునియాకృతిఁ జూచి
భయవికలాత్ములై పార్థివు లెల్ల
దిగ్గున లేచియు దీనతతోడఁ
దమతండ్రిపేరుతోఁ దమపేరు చెప్పి
దండప్రణామముల్ తా మొనరించి;
రాసమయంబున నాభృగురాము
సహజకటాక్షవీక్షణములచేతఁ
జూడఁగాఁ బడినట్టి క్షోణీశుఁ డైన
భావంబులోఁ దనప్రాణంబు లైదు
నెగిరిపోయినరీతి నెంచె; నంతటను
వచ్చి యాజనకభూపాలవరుండు
శిరము వంచియు నమస్కృతులఁ గావించి
సీతను రావించి చేయించెఁ బ్రణతి.
ఆముని యాయమ నాశీర్వదింప
హర్షించి చెలికత్తె లంత యుక్తిగను
జేర్చి రాసీతను స్త్రీసమాజమున.
అపుడు విశ్వామిత్రుఁ డరుదెంచి కలిసి
యాభృగురాముని యంఘ్రిపద్మముల
రామలక్ష్మణులచేఁ బ్రణతిఁ జేయించె—
"దశరథభూనాథుతనయులు వీరు,
రామలక్ష్మణనామరాజితు" లనుచు.
కాంచి యాచక్రనికవల, భార్గవుఁడు
నాశీర్వదించె మహామునీ! వినుమ!
ఆమాత్రమదహరణాపారపరమ
పావనరామరూపంబుపై నిలిచె

నాభృగురాముని యవలోకనములు.

అంత నాముని సభ నంతవీక్షించి
యఖిల మెఱింగియు నజ్ఞానిపగిది
"ఎందు కీజను లెల యేఁ తెంచి రిటకు?"
అని ప్రశ్నఁ గావించె, నంగమం దెల్ల
వ్యాపింపఁ గోపదావానలశిఖలు.
జనకుఁ డంతట సమస్తక్ష్మాధిపతులు
దేనికి వచ్చిరో తెలుపుచు సర్వ
విషయమ్ము వివరింప - విని భార్గవుండు
చుట్టు వీక్షింపఁగాఁ జూపట్టె నచట
క్ష్మాస్థలిఁ బడియున్న చాపఖండములు.
అప్పు డాభృగురాముఁ డతిరోష మొప్ప
బలికెఁ గఠోర మౌవాక్యంబు లిటుల:
"ఓమూర్ఖ! జనక! యీ యుర్వీస్థలాన
నెవ్వఁ డీకార్ముక మిట్లు భంజించె?
వెంటనే వానిఁ జూపింపుము నాకుఁ
జూపింపకున్న చోఁ జూడు మీదినము
నీదురాజ్యం బెల్ల నీటఁ గల్పెదను."
అని పల్క- నాలించి యతిభయవశత
జనకుఁడు మాఁటాడఁ జాలక పోయె.
కుటిలరాజులు లోనఁ గులుకుచు నుండ్రి.
మునిసురనాగులు పురజనావళులు
సంశయపూర్ణులై సంత్రాసపడిరి.
జనకునియర్ధాంగి, జానకీమాత
"అక్కటా! విధి గూర్చె ననుకోనిచెడును"
అని విచారించె మహాకులపడుచు.
భార్గవరామస్వభావంబు వినిన
సీతకుఁ దోఁచెను జింతాభరాన
నొక్కయర్ధక్షణం బొక్క కల్పముగ.
సభయులై యున్నట్టి జనులను గాంచి
జనకకుమారి విచారం బెఱింగి
శ్రీరఘువీరుఁ డీ రీతిగాఁ బలికె:
కాని యీరామహృత్కంజాంతరమున
మోదఖేదంబులు పొడసూపకుండె.

శ్రీరామచరితమానసము

బాలకాండము

నవమవిశ్రామము

దరహసితవదనమండల!
పరిహసితానంగకోటిభాసురరూపా!
వరనిశితసునఖశిఖరా!
వరదా! హరిః మట్టపల్లివాస! నృసింహా!

"నాథ! శ్రీశివునిపినాకభంజనము
చేసినవాఁడు మీసేవకుం డొక్కఁ
డేమిటో భవదాజ్ఞ? ఏల నాతోడ
వచియింప రది మహాభాగ!" యనంగ
నాక్రుద్ధమాని యత్యధికరౌద్రమున
శ్రీరాముతోడ వచించె నీపగది:
"సేవ చేసినవాఁడు సేవకుం డగును
శత్రుకృత్యంబును సలిపినవాఁడు
భండనం బొనరింప వలయును, రామ!
వినుము, శంకరువిల్లు విఱిచినవాఁడు
కార్తవీర్యునివంటిఘనశాత్రవుండు.
ఈరాజమండలి నింక నాతండు
వదలియు వేఱొట బాగు, కాకున్న
సంహతులగుదురు! సర్వరాజులును."
అనుమునివాక్యంబు లాలించి నవ్వి
పరశురాముని కింత భయపడ కనియె
నీరీతి లక్ష్మణుం డెదురుగా నిలిచి:
"నాచిన్నతనమున, నాథ! యెన్నెన్నొ
విఱిచితిఁ జినచిన్నవిల్లులఁ ,గాని
యపుడు నీ వింతగా నాగ్రహపడవ
దేల యీవింటిపైఁ బ్రీతి నీ కింత?"
అన భృగుముఖ్యుఁ డిట్లనె నుగ్రుఁ డౌచు:
"ఓరీ! నృపార్భకా! యుగ్ర మైనట్టి
మృత్యుకరాళమం దీ వుండికూడ
స్వేచ్ఛను బూని వచించుచున్నాఁడ
వఖిలప్రపంచవిఖ్యాత మైనట్టి
హరమహాధనువుతోనా యూర! నీవు,
సరిపోల్చెదవు క్షుద్రచాపంబు లెల్ల?"
అన నవ్వి లక్ష్మణుం డనియె నీరీతి:
"ఆలింపుమా దేవ! యఖిలచాపములు
సమములే యని నేను స్వాంతమం దెంతుఁ
బ్రాఁత దీవిల్లును భంజనసేయ
నేలాభ మొదవు? మఱేనష్ట ముండు?
ఇది క్రొత్తవి ల్లని యెంచి శ్రీరాముఁ
డించుక తాకఁగానే ముక్క లయ్యె.
ఇందు రాఘవునిత ప్పేమియు లేదె
యీయకారణకోప మేల? మునీశ!"
అనువాక్కు లాలించి యాభార్గవుండు
తనభుజమందున ధగధగ మెఱయు
గండ్రగొడ్డలివైపుఁ గని, యిట్లు లనియె:
"ఓమూర్ఖడింభకా! యుర్వి నీ వెపుడు
నా స్వభావంబు విన్నావొకో లేనొ?
పసివాఁడ వని నిన్నుఁ బరిమార్ప లేదు.

ఏను కేవలము మునీశుండ ననుచుఁ
దలఁచితి వేమొ స్వాంతమున నో జడుఁడ!
బ్రహ్మచారిని నేను బాల్యమాఁడిగను
బాలకా! యమితకోపస్వభావుఁడను.
క్షత్రియవంశనాశకుఁడ నే ననెడి
విషయంబు విదితము విశ్వ మంతటను.
భుజబలంబున నేను భూమినంతయును
క్షత్రియరహితంబుగాఁ జేసి, దాని
ధారుణీసురులకు దాన మిచ్చితిని
పలుసార్లు; చూడు మీపరశు వియ్యదియె
ఆకార్తవీర్యసహస్రబాహువుల
నఱకె ముక్కలుగాఁగ నరపాలబాల!
నీ తల్లిదండ్రుల నృపబాల! యేల
యేడిపించెదవు? నా యీమహోద్దండ
పరశువు తఱిగె గర్భస్థపిండములఁ.”
అన, లక్ష్మణుఁడు నవ్వు చనియె మృదూక్తి:
“ఓహో! మునీశుండు యోధవర్యుండ
నే నని తన్నుఁ దా నెంచుచున్నాఁడు
ఉప్పని యూదియు నుర్వీధరంబు
నెగురంగఁ గొట్టఁగా నెంచున ట్లితఁడు
మాటిమాటికి వడిం బరశువు చూపుఁ;
దర్జనిఁ జూపినంతనె వాడిపోవ
నిచట గుమ్మడిపిందె లేమియు లేవు.
భవదీయకార్ముకబాణకుఠార
ములు చూచి నంతట మునివరా! నేను
నభిమానసహితవాక్యంబు లాడితిని.
భృగుసుతుండ వటంచు నెఱిఁగితి నిప్పు
డరసితి నీదగుయజ్ఞోపవీత
మందుచే నా కోప మణఁచి చిత్తమున
నీ వేమి యనిన సహించుచున్నాఁడ.
గోభూసురామరగోవిందభక్త
జనులపై మా వంశసంభవు లెపుడు
శౌర్యంబు చూపింప సమ్మతపడరు.
ఇం దెవ్వరిని వధియించినఁ గాని,
పాపంబు వచ్చును; వారలచేత
నపజయం బొందుట నపకీర్తి వచ్చు;
నీవు కొట్టినఁ గాని యేము నీ పాద
పద్మంబులందున ప్రాలఁగా వలయు.
కోట్ల పిడ్డులకు నెక్కుడు తీక్ష్ణహార!
ఈ వాడువాక్కు మునీశ్వరా! దాన
బరువుచేటులు ధనుర్బాణకుఠార
ములు; నీ మహాయుధములఁ గాంచి నేను
ననుచితవాక్యంబు లాడినయెడల
నోమహామునిధీర! యోర్మి క్షమింపు”-
మన విని రుష్టుఁడై యనియె నీరీతి
భృగువంశమణి తా గభీరకంఠమున:
“కౌశికమాని! యాకర్ణింపు మితఁడు
మందుండు కుటిలుఁడు మత్తచిత్తుండు,
కాలవశ్యుఁడు, కులఘాతకుఁ; డితఁడు
ఘనసూర్యకులశశి న్గల కళంకంబు,
పెనునిరంకుశుఁ డవివేకి నిర్భయుఁడు.
ఈమరుక్షణమందె యీడింభకుండు
కాలకరాళసంగ్రస్తుఁడై పోవు
నెలుఁ గెత్తి యే వచియించుచున్నాఁడ
నానుండి తప్పు సుంతయు లేదు – నీవ
యీతని రక్షింప నెంచినయెడల
వారింపు మీతనిఁ ద్వరగ బోధింపు
మస్మత్ప్రతాపబలాతిరోషముల.”
అనవిని లక్ష్మణుం డనియె నీ రీతి:
“ఓ మునినాథ! నీ వుండ నిం కెవరు
భవదీయసత్కీర్తి వర్ణింపఁ గలరు?
నీ ప్రతాపంబును నీవె నీ నోట
నెన్నో విధాల ననేకపర్యాయ
ములు చెప్పుకొంటివి మునిలోకవర్య!

ఇంకను నీకు సంతృప్తి లేకున్న
నింకను చెప్పకో మ్మా వంతెకాని
భవదీయకోపంబు ప్రతినిరోధించు
కొని వ్యథనొందగా పనిలేదు స్వామి!
వీరవ్రతుండవై వెలుఁగొందు ఘనుఁడ
వతిధీరచిత్తుండ వక్షోభితుఁడవె–
యన్యుల నిందింప ననుచితం బనఘ!
సమరాంగణంబున శౌర్యశక్తులను
శూరవరేణ్యులు చూపింపఁ గలరు–
కాని యాత్మస్తోత్రకథకులు కారు.
యుద్ధరంగమున ముందుండ శాత్రవుఁడు
స్వప్రతాపప్రగల్భము లాడుకొనుట
పిఱికివారలపని వీరు లట్లనరు.
మృత్యువు నీ యాజ్ఞ నిమిడి యున్నట్లు
మాటిమాటికి నన్ను మడియఁ జేయంగ
నాహ్వాన మొనరింతు”–వన నాకఠోర
వచనంబు లాలించి పరశురాముండు
ఘోరమౌ తనగండ్రగొడ్డలిఁ దీసి
కరమునఁ దాల్చి యాకరణి వచించె:
“ఇంక నిందింపరా దెవ్వరు నన్ను
నీకటుభాషణుఁ డీ బాలకుండు
వధకు యోగ్యుం డేను పసివాఁ డటంచు
నెంతయో వేచితి–నిపుఁ డిదే యితఁడు
సత్యంబుగాఁ దెగి చావ నున్నాఁడు.”
అనగఁ గౌశికముని యనియె: “క్షమింపు
మీతనియపరాధ మీవు మునీంద్ర!
బాలురగుణదోషవర్గంబు లాత్మఁ
బాటింప రెప్పుడు పరమసాధువులు.”
అన విని భార్గవుఁ డనియె నీరీతి:
“ఈనాకుఠారము పృథునిశాతంబు;
కరుణ యెఱుంగనికడు క్రోధి నేను,
ఇచట నా ముందటనే నిలుచుండె
నన్మద్గురుద్రోహి, యపరాధి; యీతఁ
డౌర! నా చెంత మారాడుచుండినను
నినుఁ జూచి కౌశికా! నిజముగా నోర్మి
నాగినాఁడను వీనియాయువుల గొనక.
కానిచో వీని నీగండ్రగొడ్డంట
ఖండఖండంబులుగాఁ జేసి వైచి
శ్రమలేక నా గురుస్వామిఋణంబుఁ
దీర్చెడివాఁడ, గాధేయమునీంద్ర!”
“ఆకుపచ్చగ ముని కఖిలంబుఁ దోఁచు:
కాంచి భార్గవుఁ డయుఃఖండంబు, తాను
ఖండంబుగా నెంచెఁ గాని యిప్పటికి
సత్యంబు నేర కజ్ఞానమం దుండె–”
నని నవ్వుకొనియె నిజాత్మ గాధిజుఁడు.
అంతట లక్ష్మణుం డనియె నీరీతి:
“నఖిలప్రపంచవిఖ్యాత మైనట్టి
భవదీయకీర్తి నెవ్వరు మునినాథ!
తెలియనివారు ధాత్రీరంగమందు?
ఇలఁ దలిదండ్రులఋణ మెల్ల నీవు
సంపూర్ణముగఁ దీర్పఁ జాలితి వనఘ!
ఇఁకఁ దీర్ప వలసిన దెల్ల నీవలన
గురువుఋణం బొండె కుంభినిఁ గలదు!
అదె నీదు మతిని మహోకులపఱచు
నాఋణం బిపుడు మా యందున నీవు
వై చినపగిదిగా భావించుచుంటి.
కాలంబు మిక్కిలి గడచుటచేత
నధికమయ్యెను వడ్డి, యందుచే నిపుడు
వ్యవహారి రప్పింప వలసిన దిటకు
నాఋణం బేను స్వయంబుగాఁ దీర్తు.”

---

* ఖండ మనఁగా నొక యర్థము ఖర్జము, మరియొక యర్థము పటికబెల్లము.

ఆకటువచనంబు లాలించి మౌని
తనకుఠారమును హ స్తమున ధరించె,
హా హాకృతులఁ జేసి రఖిలజనంబు.
"పలుమాఱు నా కీవు పరశువుఁ జూపి
బెదరించుచున్నావు భృగువరా! కాని,
యవనీసురుఁడ వని యాత్మలోఁ దలఁచి
యోక్షత్రియద్రోహి! యోర్మిఁ బూనితిని.
ఘనతరయోధాగ్రగణ్యుల నీవు
కదనమం దెన్నఁడుఁ గలియఁగా లేదు.
నీ చిన్నయింటిలోనే ధరాదేవ!
వీరుఁడవుగ నీవు పెరిగి యున్నావు!"
అని పల్క లక్ష్మణుం, డఖిలజనంబు
"లనుచితం బిట్లాడు" టని చెప్పుకొనిరి.
అంతట రఘుపతి యనుజు వారించె
సంజ్ఞ గావించియు సంయమివర్య!
అపుడు లక్ష్మణవచనాహుతిజ్వలిత
భృగువరక్రోధాగ్ని వీక్షించి పలికె
నంబుసమోక్తుల నారాఘవుండు:
"నాథ! బాలుని కరుణన్ గనవయ్య!
యేమి యెఱుంగని యీపసివాని
పైన నీ కోపంబుఁ బఱపఁగా వలదు.
ఇతఁడు నీ శక్తిఁ దా నెఱిఁగినయెడల
నిటు పల్కలేఁడు ని న్నెదిరించి స్వామి!
బాలురు పరిహాసవాక్కులు పలుక
గురువును దలి దండ్రి కూర్మి హర్షింత్రు.
కావున వీనినిఁ గరుణింపు మెఱిఁగి
నేరనిశిశువుగా నీ సేవకునిగ.
సముఁడవు సౌశీల్యసదనుండ వీవు
ధీరమౌనివి జ్ఞానతేజుండ వీవు!"
అని రామవచనంబు లాలించి లోన
భృగుపతి శాంతించె నిసుమంత హృదిని;
కాని తాఁ బోక లక్ష్మణమూర్తి నవ్వె
మరలఁ దా నేదో నెమ్మదిగ వచించి.
ఆనవ్వుఁ గాంచియు నాభృగురాముఁ
డాపాదమస్తకవ్యాప్తాగ్రహాగ్ని
చండభయంకరజ్వాలుఁడై పలికెఁ:
"ఓరామ! నీ తమ్ముఁ డుగ్రపాపాత్ముఁ
డాతఁడు గౌరవర్ణాంగుఁడే యైన
నాత్మ నల్లని దోయి, యరయ నాతనికిఁ
గాలకూటవిషంబె కలదు ముఖాన
దల్లి పా లీతఁడు త్రాగ లేఁ దెపుడు.
కపటస్వభావుండు గావున నితఁడు
నినుఁ గూడ లక్ష్మింప నేరక పోఁగ
మృత్యుతుల్యునిగ గ్రహింపఁడు నన్ను."
అన విని లక్ష్మణుం డనియె నవ్వుచును:
"ఓమునివల్ల భా! యోభృగురామ!
కోపంబు పాపంబుఁ గూర్ప మూలంబు.
ఆకోపమునకు వశ్యాత్మలై జనము
లనుచితకార్యంబు లాచరించెదరు
ప్రతికూలు రౌచు విశ్వంబున కెల్ల.
వరమునీ! నేను నీ పాదదాసుఁడను
వదలి కోపంబు కృప న్జూడు నన్ను.
భగ్నచాపమ్ము కోపమున సంధిలునె?
త్వత్పాదములు బాధపడుచుండు నింకఁ
దాముఁ గూర్చుండఁ బ్రార్థన సేయువాఁడ.
ఈభగ్నచాపమం దెక్కుడు ప్రీతి
కలదేని మీ కిది కలిపియు నతుకు
మార్గంబుఁ జూతు సమర్థు రావించి."
అనులక్ష్మణుని వాక్కు లాలించి జనకుఁ
"డూరకుండుము వత్స! యుచితమా యిట్టి
యధికప్రసంగము" లనియె భీతిలుచు.
పౌరనారీనరుల్ భయమును బొంది
వణఁకిరి యశ్వత్థపత్రంబులటుల.
"నిజముగా రెండవనృపకుమారుండు

కడు దుడు" కని వారు కళవళమొంది;
రాలక్ష్మణుని నిర్భయాలాపసమితి
నాలించినంతట నాభృగునాథు
తనువెల్ల మండెఁ గ్రోధజ్వాలచేత
నాతనిబలము నీ రైపోయె నంత
దయఁ బూనినట్టిచందంబుగా నిటుల
శ్రీరాముతోడ వచించె నాతండు:
"ఓరామ! నీదుసహోదరుం డగుట,
వదలితి నీబాలుఁ బ్రాణాలతోడ,
సుందరదేహంబుఁ జూడఁగా, లోనఁ
గడు భావపంకంబు గలిగినయితఁడు
భయదవిషద్రవభరితమై నట్టి
కాంచనకుంభంబుకరణి నున్నాఁడు."
మరల దీనికిని లక్ష్మణుఁడు నవ్వంగ
రాముఁ డాయనుజు నాగ్రహదృష్టిఁ జూచె—
నందుచే నతఁడు వామాలాపములను
సర్వంబు విడనాడి శాంతిగాఁ బోయి
గురుసమీపంబునఁ గూర్చుండె; నంత
శ్రీరామచంద్రుండు చేతులు మోడ్చి
పృథువినీతాంచితమృదుశీతలోక్తి
లొప్పఁగా నిట్లనె: "నో భృగునాథ!
పరికింపుమా నాదుప్రార్థనం బనఘ!
సహజసుజ్ఞానభాస్వన్మతి వీవు
బాలునివాక్యముల్ పాటింప వలదు.
బాలకునకు మధుపంబున కెంచ
నేకస్వభావంబె యిలలోన నుండు
సజ్జనుల్ వారిదోషంబులఁ గనరు.
అదిగాక యీబాలుఁ డపరాధి కాఁడు.
నీ కపరాధంబు నేను చేసినది.
అందుచే నో మహాత్మా! నన్ను నేఁడు
భవదీయపావనపాదసేవకునిఁ
గృపఁ జూతురో, ఆగ్రహింతురో, లేక
వధియింతురో, లేక బంధింపఁగలరో,
ఏది యైనను సరియే భవదీయ
చిత్తానుసారంబు సేయుమా స్వామి!
ఏ యుపాయమున మాఁనీంద్రలోకేశ!
భవదాగ్రహము శాంతిపడు, సత్వరముగఁ
దెలుపుమా యట్లు వర్తించెద నేను."
అన విని మునిపతి యనియె నీరీతిఁ:
"ఓరామ! నీదుసహోదరుం డటులఁ
గనుచుండ నెగతాళిగా నన్ను-నింక
నీనామహాగ్రహ మెట్లు శాంతించు?
నా కుఠారంబునఁ ఠాటిగా వాని
కంఠంబు వ్రేటునన్ ఖండింపకుండు
నందాక, నా యాగ్రహంబు నిష్ఫలము.
అస్మత్కుఠారభయంకరచర్య
లాలించి శత్రురాజాంగనానిచయ
గర్భముల్ జాఱు, నా ఘనఘోరపరశు
వే చెంతనుండఁగా నీరాజసుతుఁడు
మచ్ఛాత్రవుం డిట్లు మనియుంట నేనె
యరయఁగా వలసెఁగదా! యీదినాన,
నా గుండె మండుచున్నది క్రోధవశతఁ
గాని నా బాహువు కదల లేకుండె.
నృపఘాతి యైనట్టియీకుఠారంబె
యిపుడు కుంఠిత మయ్యె, నే మొనరింతు?
విధి నాకు మాఱెను విపరీతరీతి:
నస్మత్స్వభావంబు సందుచే మాఱెఁ
గానిచో నా మదిఁ గలిగెనే కరుణ
యెన్నఁ డైనను గాని యిసుమంత? నేఁడు
దారుణవ్యధ నాకు, దయచేతఁ గలిగె."
అన విని సౌమిత్రి హాసంబు వెలుఁగ
వంచి శిరంబు నీపగిది వచించె:
"భవదీయ మైనకృపామారుతంబు
త్వద్రూపమునకును దగినట్టు లుండె.

భవదీయవాక్కులు భాసిల్లుచుండె
వృథోపదుతపుష్పవిసరంబు లటుల.
దయచేతనే భవత్తను వెల్ల నిట్లు
దహియింపఁబడుచుండఁ దాపసవర్య!
ఇఁక గ్రోధ మెద నుదయించిన వేళ
నెట్లుండు? మి మ్మిశుఁడే కాఁవవలయు—"
అన విని భార్గవుం డనియె నీరీతి:
"అరయము జనక! యీయజ్ఞాని యిట్లు
యమపురంబున నుండ హఠమునఁ గోరు.
ఏల నా కన్నులయెదుట నీమూర్ఖు
నుంతువు తొలఁగింపకుండఁగా నీవు?
చూడ నీతఁడు నృపసూనుఁడే గాని,
పరమదుర్ధర్షుఁడు పార్థివా! జనక!"
అన విని లక్ష్మణుం "డట్లైన నీవు
కన్నులు మూసినఁ గనరాకపోవు
నఖిలప్రపంచంబు" నని తనలోనఁ
దా ననుకొనియె మందస్మితుం డగుచు.
ఆపయి భృగురాముఁ డాగ్రహోదగ్ర
హృదయుఁడై శ్రీరాము నీక్షించి పలికె:
"భవునిచాపంబును భగ్నం బొనర్చి
శఠ! నాకు బోధలు సలుపుచున్నావె?
నీదు సమ్మతిచేతనే నీదుతమ్ముఁ
డాడుచున్నాఁడు దురాలాపములను.
కరములు జోడించి కపటనమ్రతను
బ్రకటించుచున్నావు పైకి నీ వెటుల.
సంతోషపఱుపుము సంగ్రామమందు
అటుకాద విడుము రామాభిధేయమును.
త్యజియించి నీ చమత్కారంబు లెల్ల
భూర్జటిద్రోహి! నాతోఁ బోరు మిప్పు
డటుగాదొ నిన్ను నీ యనుజునితోడ
నంతకుపురమున కంపఁగాఁ గలను."
అని భృగువిభుఁడు మహోగ్రహవశతఁ
బరశువు పైకెత్త భయదరీతిగను,
శ్రీరామచంద్రుండు శిరమును వంచి
తనచిత్తమందునఁ దా నవ్వుకొనియె:
"అపరాధి లక్ష్మణుం డైయుండఁ దపసి
క్రౌర్యము నాపైనఁ గలిగియున్నాఁడు.
అరయ నమ్రతయు నాయాసమయములఁ
గడు దోషమును గూర్చఁగలుగు, సర్వులను
వందనం బొనరించుతు వక్రమర్త్యునకు;
రాహువు వక్రేందు గ్రసియింప లేఁడు."
అని తలంచియు రాముఁ డనియె నీరీతి:
"మునినాయకా! రోషమును వీడు, మనఘ!
కలదు గొడ్డలి నీదుకరభాగ మండె.
నా శీర్ష మున్నది నాథ! నీ ముండె—
యేను నీ భటుఁడనం చెఱిఁగి యో స్వామి!
భవదాగ్రహము తీరుపని చేసికొనుము.
ప్రభువును భటుఁడు పరస్పరం బెటుల
సమరంబు సాఁగింపఁ జాలెద రయ్య!
విప్రోత్తమా! నాథ! విడుము రోషమును.
వీక్షించి నీ యోధవేషంబు, భ్రమసి
పలికె నీబాలుఁడు పరుషవాక్యముల
నది వానియపరాధ మరయఁగాఁ గాదు.
పరశుధనుర్బాణపాణివై యుంట
నీబాలకుఁడు యోధుఁ డేమో యటంచు
నుద్రేకపడియెఁ దా నో మునిరాయ!
నీ పేరు వినియున్న నినుఁ జూడ కుంట
నాత్మవంశస్వభావానుసారముగ
నొసఁగెను నీకుఁ బ్రత్యుత్తరంబులను.
తాము మునీశుచందము వచ్చియున్న
స్వామి! నీ పాదరజంబు లీశిశువు
తప్పక శిరమందుఁ దాల్చెడివాఁడె.
నిన్ను నేరనివాని నేరంబు, నాథ!
క్షమియింపఁ బ్రార్థన సలుపుచున్నాఁడ.

విప్రునిహృదిలోన విస్తారకరుణ
వెలయంగ వలయును, భృగుకులనాథ!
నాకును నీకును నాథ! పోలిక యే?
చరణంబులకును శీర్ష ంబున కేమి
సామ్యమో తెలుపుము స్వామీ! మహాత్మ!
నా కొక్క లఘురామనామమే యుండఁ
బరశురాముఁ డనంగఁ బరగెడుపెద్ద
నామధేయము నీది నాథా! మునీంద్ర!
నా వింటి కేకగుణంబు దీపింప
నీ విల్లు పటుతంతునిబిడంబు లైన
తొమ్మిది గుణములతోడ భాసించు:
నన్ని విధంబుల నల్వుఁడ నేను
అందుచే విప్రోత్తమా! క్షమియింపు
మస్మదీయంబులౌ నపరాధములను.
ఓమునినాయకా! యోవిప్రవర్య!"
అని మాటిమాటికి నారామవిభుఁడు
పేర్కొన్నఁ గాని యాభృగువల్ల భుండు
పరుషతతోడ నీపగిది వచించె:
"నీవును గపటివి నీ తమ్ముడటులె
నీవు బ్రాహ్మణమాత్రునిగ నన్నుఁ దలఁతు
వే నెట్టి విప్రుండ నెఱిఁగింతు వినుము:
చాపమే స్రువము, నాశరము లాహుతులు;
అస్మదీయాగ్రహ మతిఘోరవహ్ని,
చతురంగబలములు సమిధలగణము
బహుళమహీధవుల్ పశుసమూహంబు
లీకుఠారముతోడనే వాని నెల
ఖండఖండమ్ములుగా నొనరించి
బలి సమర్పించితి వసుధ నే నిటుల
సమరయజ్ఞంబుల సలిపితిఁ గోటి—
సంగ్రామగర్జనజపములతోడ.
అస్మత్ప్రభావంబు నాత్మలో నీకు
విదితంబుఁగాకయే విప్రమాత్రునిగఁ
దలపోసి న న్నిట్టితగనివాక్యములఁ
బలుకుచున్నాఁడవు; భవునిచాపమును
భంజించినది మొదల్ భావంబులోన
గర్వంబు మితిమీఱి కనుల కెక్కినది.
ఈజగం బెల్ల జయించినరీతి
నీ వహంకృతి పూని నిక్కుచున్నావు."
అన విని శ్రీరాముఁ డనియె నీపగిది:
"పరగ విచారించి పలుకు మునీంద్ర!
నా స్వల్పదోషంబునకు మహారోష
పడుచుంటి వీప్రాతఁవఱిచినధనుస్సు
స్పృశియించినంతనే విఱిగి రెం డయ్యె
నే గర్వ మొంద నిం దే మున్న దనఘ?
వినుము సత్యంబును భృగువంశనాథ!:
నీ వనురీతిగా నే నిల నిన్ను
విప్రుండ వని గౌరవింపనియెడల,
భయముచే నేఁ దల వంచఁగాఁ దగిన
య వ్వీరుఁ డెవ్వఁ డీయఖిలలోకమున?
దేవదానవధరాధిపులును, వివిధ
భటు లెవ్వ రైనను స్వామి! నాతోడ
సరిసములౌ బలశాలులే గాని
యధికబలోపేతు లైనను గాని
యెదిరించి నిలుచుచో నేను తప్పకయె
సంగ్రామ మొనరింతు సంతోషముగను.
కాలుఁడే వచ్చినఁ గాని భీతిలను.
క్షత్రియతను బొంది క్ష్మామండలమున
భండనం బొనరింప భయఁపడువాఁడు
వంశదుర్జాతుండు పరమనీచుండు—
నిజనైజవిషయంబు నేఁ జెప్పుచుంటి
వంశప్రశంసకై పలుకుట లేదు:
రఘువంశసంభవుల్ రణరంగమందు
యమునకుఁ గూడ భయం బొందఁబోరు.
ఎవ్వఁడు నీకడ నెద భీతిఁ జెందు

నాతఁడు నిర్భయుం డటువంటి దనఘు!
బ్రాహ్మణవంశప్రభావ మెంచఁగను."
ప్రియముగా నిటుపల్కు శ్రీరామచంద్రు
మృదుగూఢవాక్కుల నెల్ల విన్నంతఁ
బరశురాముని మతి ప్రజ్ఞాన మొందె:
"శ్రీరామ! నీ విదే శ్రీరమానాథు
వింటిని గొని యెక్కు పెట్టుమా నాదు
సర్వసందేహముల్ సమసిపోఁగలవు."
అని పల్కు నంతనే యంభార్గవుండు,
దానియంతట నదే తచ్చరాసనము
శ్రీరామచంద్రునిచేతిలో నిలిచె
నాచిత్రమును గని యాశ్చర్యపడియె
భావంబునందునఁ బరశురాముండు.
అంత నాభృగురాముఁ డారామమహిమ
హృదయంబులోన గ్రహించి పూర్ణముగఁ
బులకితప్రచలితపూర్ణాంగుఁ డగుచు
భక్తిభావోద్వేగపరవశుం డగుచు
నంజలి ఘటియించి యత్యంతభక్తి
శ్రీరాము నిటులఁ గీర్తింపఁగాఁ దొడఁగె:

పరశురామకృతరామస్తవము

గేయము

జయ రఘువంశవనజవనభానూ!
దనుజకులగహనదహనకృశానూ!
జయ సురభూసురగోహితకారీ!
జయ మదమోహాగ్రిహభవహారీ!
వినయశీల! కరుణాగుణసాగర!
జయము వచనరచనామితచతురా!
సేవకసుఖద! సుభగసర్వాంగా!
జయ శోభాజితబహుళానంగా!
ఒకముఖమున నెటు సేతును ప్రశంస?
జయ శివమానసమానసహంసా!

అంటిని తెలియక యత్యనుచితములు
ఉభయులు మన్నింపుఁడు క్షమాలయులు!
జయ జయ జయ జయ రఘుకులకేతూ!
జయ జయ జయ జయ నిజసుఖహేతూ!"
అని వచియించియు నాభృగుస్వామి
వనమున కేగెఁ దపం బొనరింప.
అంతటఁ గుటిలధరాధీశు లెల్ల
రతిభయ మొందిరి; యాభీరు లెల్లఁ
జల్లగాఁ బాఱిరి సకలదిక్కులకు.
పొంగుచు దుందుభుల్ మ్రోయించుకొనుచు
దేవతల్ శ్రీరామదేవునిపైనఁ
గురియంగ సాఁగిరి కుసుమవర్షములు.
పురనరనారీసమూహంబు లెల్లఁ
బరమసంతోషసంభరితంబు లయ్యె
వారలమోహసంభవమైనబాధ
సర్వమదృశ్యమై చనియె మునీంద్ర!
మ్రోసె మంగళవాద్యములు సర్వజనులు
చారుమంగళవస్తుసంచయంబులను
వెదఁజల్ల సాఁగిరి విరివి నెల్లెడల.
సుముఖసునేత్రలా సుందరీజనము
గుంపులు గుంపులై కోకిలధ్వనులఁ
బాటలు పాడిరి వర్షింప మధువు.
నిష్ఠదరిద్రుండు నిధి నొందినట్లు
లావిదేహుఁడు వర్ణనాతీతమైన
యానందమును బొందె నాంతర్యమందు.
సీతామహాదేవి చింతను విడిచి
కుముదాప్తుఁగనినచకోరకుమారి
వలెఁ బరమానందభరితాత్మ యయ్యె.
జనకరా జంత విశ్వామిత్రమునికిఁ
బ్రణతులు గావించి పలికె నీపగది:
"నీ ప్రసాదము చేతనే మహారాజ!

ముక్కంటిధనువు రాముఁడు తుంచినాఁడు.
ఈసహోదరు లిద్ద ఱీనాఁడు నన్నుఁ
గృతకృత్యునిగఁ జేసి రింక నే నిపుడు
చేయంగఁదగినది చెప్పుమా స్వామి!"
అన విని మునివర్యుఁ డనియె నీరీతి:
"వినుము నరేంద్రా! ప్రవీణా! ధనుస్సు
నందు వైవాహికం బాధారపడియె,
విల్లు భగ్నం బయ్యెఁ బెండ్లియు నయ్యె
నిది సురనరనాగు లెల్లరి కెఱుక.
అరిగి నీ వింక వంశాచారరీతి
గురువర బ్రాహ్మణకులవృద్ధజనుల
సంప్రదించియు వేదశాస్త్రప్రపద్ధతిని
నొనరింపుమా వివాహోత్సవక్రతుల.
అరిగి, దూతల నయోధ్యాపురి కంపి
రాజేంద్రు దశరథు రప్పింపు మిటకు"

జనకరాజు దశరథునకు శుభలేఖ నంపుట,
మిథిలాపురశృంగారము

అన "మంచి దట్లే దయాబ్ధీ! మునీంద్ర"
అని పల్కి ముదితుఁడై యాజనఁకుండు
రావించి దూతల రయమొప్ప నటులఁ
దక్షణం బంపెను దశరథుకడకు.
ఆపయి సకలమహాజనావళినిఁ
బిలిపింప వారెల్లఁ బ్రీతితో వచ్చి
వినమితశీర్షులై పృథ్వీంద్రుముందుఁ
బరగిరి భక్తి సంభ్రమము దీపింప.
"రాజవీథులను మార్గంబుల నెల్ల
మందిరంబుల దేవమందిరంబులను
నగరమం దెల్లెడ నాల్గుదిక్కులను
వడిగ శృంగారింపవలయు"నటంచు
రాజాజ్ఞ వచ్చెను. ప్రజ లుల్లసిలుచుఁ
దమ నివాసములకుఁ దరలి రందఱును.

తదనంతరము రాజు తనసేవకులను
బిలిచి యాజ్ఞాపించె, "విరచింపవలయుఁ
దగుశ్రద్ధతోఁ విచిత్రములై వెలుంగు
మండపంబులను సమంచితరీతి."
నృపునాజ్ఞ శిరసా వహించి వా రంత
నానందసంభరితాత్ములై పోయి
మహితవితాననిర్మాణప్రవీణ
శిల్పిగణంబులఁ జేర్చి రాపనికి.
ఆశిల్పు లంత బ్రహ్మకు నతిఁ జేసి
పనిని బ్రారంభించి బహుసుందరముగఁ
గనకరంభా స్తంభగణము రచింప.
వరమరకతమణిపత్రఫలాలఁ
బద్మరాగప్రసవముల భాసించు
నతివిచిత్రం బగు నాసృష్టి నెల్లఁ
గాంచి విరించి దిగ్భ్రాంతిని బొందె.
వరమరకతమయవంశీగణంబు
సరళమై పర సంచయములతోడ
నిజమైనవిగనె కాన్పింపఁ దొడంగె.
తనరెడి బంగారుతమలపాకులను
దీర్ఘఁగాబడినట్టితీఁగెలు చూడ
నచ్చ మా యసలైన వనిపించుచుండె.
ఆ పత్రములతోరణావళిఁ గూర్చి
రందందు రుచిరముక్తాలహారముల.
మాణిక్యమరకతమణివజ్రనిచయ
వైడూర్యములతోడఁ బద్మగుచ్ఛముల
శిల్పులు చేసిరి శృంగార మొప్ప.
పవనసంచలనసంబంధంబుచేత
నమృతనాదముల రుచు మ్మను రొదల్ సేయు
వివిధవర్ణ విహంగభృంగసంఘముల
నిర్మించి రాశిల్పనిపుణు లందందు.
బహుశుభద్రవ్యముల్ పాణులఁ దాల్చి
నిలుచున్నవిధమున నిర్మించి రందు

స్తంభంబులను దేవతావిగ్రహముల.
బహువిధసహజశోభనరూపములను
సింధురమణిమయశృంగారయుక్త
రంగవల్లికల నేర్పుచిరి ధరణి.
ఇంద్రనీలంబుల నింపుగాఁ జెక్కి-
లావణ్యచూతపల్లవము లొనర్చి
కాంచనమయపుష్పగణములఁ జేసి
మరకతమణులతో మంజులరీతి
ఫలగుచ్ఛములఁ జేసి పట్టుదారముల
వ్రేలాడఁ జేసిరి వింతరీతిగను.
ఆశిల్పి లింక నత్యద్భుతరుచిర
వరతోరణముల నేర్పుచి రెల్లెడల
నవి మనోభవునిపాశావళిరీతిఁ
గానవచ్చుచునుండెఁ గడు మనోజ్ఞముగ.
గణనకు మించు మంగళకలశముల
వరమనోహరఘనధ్వజపతాకములఁ
బటచామరముల స్థాపనచేసి రచట.
ఆవిచిత్రవితాన మగణితరమ్య
మణిమయదీపికామండితం బగుచు
వర్ణనాతీతమై భాసిల్లుచుండె.
ఆవధూమణి జగదంబ వై దేహి
వసియింపవలసినవరమండపమును
వర్ణింపఁ గలిగినభావనాశక్తి
యేకవికే నుండు నే మునిరాయ!
సద్గుణసౌశీల్యసౌందర్యశాంతి
సాగరుం డగురామచంద్రుండు తరలి
పెండ్లి కుమారుఁడై వేంచేయునట్టి
యావితానము త్రిలోకాతిసుందరము.
ఆపురిలో గలయఖిలగృహాల
జనకమందిరశోభ సందర్శితంబు.
ఆమిథిలాపురి నరయఁ గాన్పించెఁ
బదునాల్గు భువనముల్ పరమాల్పములుగ;

నా నగరములోనియమితసామాన్య
గృహములో రాజిల్లుశ్రీని వీక్షించి
యమరేంద్రుఁడైన మోహాక్రాంతుఁ డగును.
వసుధ, మాయాంగనావరవేష మూని
శ్రీమహాలక్ష్మి వసించుచున్నట్టి
యాపురశోభఁ, దా మభినుతియింప
శారదాశేషులే సంశయపడిరి.

జనకదూతలు శుభలేఖ నిచ్చుట; దశరథుని మహానంద విశేషము

జనకునిదూతలు సత్వర మపుడు
చనిరి పావనరామజన్మస్థలమున
కారమ్యపురిఁ గాంచి హర్షితు లైరి.
అవనీంద్రసౌధసింహద్వారమందు
వర్తమానంబు లోపలి కంప నప్పు
డాలించి దూతలయాగమనంబు
దశరథభూపతి తనదు సన్నిధికి
రావించె వారిని రయముగా, నపుడు
ప్రణతు లర్పించియు వార లాపయిన
లేఖ నొసంగఁగా, లేచెను దానె
స్వయముగా దాని హస్తమునఁ గైకొనఁగ
సంతోషపడుచును స్వాంతరంగమున.
ఆలేఖ పఠియించినంత రాజునకు
నానందబాష్పంబు లక్షుల నుబికెఁ
దనువెల్ల రోమాంచితం బయిపోయె
నాహ్లాదమున నిండె నాతనియెడద.
శ్రీరామలక్ష్మణుల్ హృది వెలుఁగొందఁ
గరమున శుభలేఖ గ్రాలఁగా నట్టె
స్తబ్ధుఁడై పోయెను ధర్మనాయకుండు;
మంచియో, చెడో, నోట మాట రాదయ్యె—
నంతట ధృతిఁబూని యవనీశ్వరుండు
పఠియింప లేఖ సభాసదు లెల్ల

రాశుభవార్తకు హర్షంబు గనిరి.
ఆటలాడెడిచోట నావార్త వినియు
భరతుఁడు నిజహితభ్రాతలఁ గూడి
యరుదెంచి యచటికి, నతివినమ్రతయుఁ
బ్రేమభావంబు దీపింప నిట్లడిగె:
"జనక! ఆలేఖ యెచ్చటనుండి వచ్చె?
ప్రాణప్రియులు నాదుభ్రాత లిద్దఱును
నాయనా! క్షేమమేనా? వార లిప్పు
డేదేశమునఁ జరియించుచున్నారు?"
అని పల్కఁ భరతుగాఢానురాగోక్తు
లాలించి నరపతి యా శుభలేఖ
తిరిగి యింకొకసారి తీసి పఠించె.
ఆలేఖ వినినంత నాభ్రాత లిర్వు
రానందపులకితు లైరి, వారలకుఁ
దనువెల్లఁ బరవశత్వమున నుప్పొంగె.
భరతునిపావనప్రణయంబుఁ గాంచి
యఖిలసభ్యులు విశేషానంద మొంది
రంతట దూతల నవనీశ్వరుండు
చేరువఁ గూర్చుండఁ జేసి యిట్లనియె
మధురమనోహరమంజువాక్యముల:
"చెప్పుఁడు బాగుగా స్నేహితులార!
భద్రమా యచట మాబాలు రిద్దఱును?
ఆబాలకులను స్వయంబుగా మీరు
బాగుగాఁ గంటిరా? వారలలోన
నొకఁడు శ్యామాంగుఁ డింకొకఁడు గౌరాంగుఁ,
డుగ్రచాపనిషంగు, లుభయులుగూడ
నవకిశోరులు, మునినాథుఁ గౌశికుని
వెనుకొనియుందు రేవేళ వీడకయె.
ఇట్టిబాలకుల గ్రహించితి రొకొ్క?
అయినచో వచియింపుఁ డాబాలకుల స్వ
భావంబుఁ గూర్చిన వాని నే వైన"—
అని ప్రేమవివశుఁడై యవనీధవుండు
పలుమాఱు దూతలఁ బ్రశ్నఁ గావించె.
"ముని వారలను గొనిపోవుట మొదలు
వారియోగక్షేమవార్త లీనాఁడె
వినఁ గల్గితిని నేను వీనులారంగ
నెటుల విదేహేంద్రుఁ డెఱిఁగె వారలను
దెలుపుఁడు మీరలు తేట తెల్లముగ."
పృథ్వీశుఁ డిట్లనుప్రియవాక్యములకుఁ
దన్నిథిలేంద్రుదూతలు నవ్వుకొనిరి.
పృథ్వీశమకుటమణీ! వినుమయ్య!
విశ్వభూషణు లౌచు వెలుఁగొందుచున్న
రామలక్ష్మణులను రాజేంద్ర! నీవు,
తనయులుగాఁ గన్న ధన్యధన్యుఁడవు,
నినుఁబోలు ధన్యు లెందేని నున్నారె?
త్వత్పుత్రులను గూర్చి ప్రశ్నింప నేల?
పురుషసింహులు, సర్వభువనదీపకులు,
వారియశఃప్రతాపంబులముందు
శశి పంకిలుఁడు, రవి చల్లఁగాఁ దోఁచు.
వా రెట్లు గ్రహియింపఁబడి రని నీవె
యట్టివారలఁ గూర్చి యడిగెద వధిప!
భాస్కరుఁ గాంచ దీపంబు గావలెనె?
సీతాస్వయంవరశ్రీసమయమున
నటఁ జేరుకొని రనేకావనీనాథు
లొకని కంటె నొకండు యోధానుయోధు
లైన నేమాయె వా రందఱిలోన
నొకఁడైన శివువిల్లు నొక్కింతయేనిఁ
గదలించుటకుఁ జేతఁగాక కూర్చుండ్రి
సకలవీరులు పరాజయ మొంది రనఘ!
మల్లోకములలోన భుజపౌరుషమున
గర్వించుచున్నట్టిఘనులబలంబు
లణగఁ ద్రొక్కఁగఁబడె నావింటిచేత.
మేరువు నెత్తెడిమేటిబలుండు
బాణాసురుఁడు గూడఁ బగులఁగా గుండె

శివువిల్లునకుఁ బ్రదక్షిణ మాచరించి
చల్లఁగా జాఱెను సభను వీడొక్కఁచు.
కౌతుకార్థంబుగాఁ గైలాసగిరినిఁ
బెకెత్తి నట్టి రావణుఁడుసైతంబు
సభలోఁ బరాభవసహితుఁడై పోయె.
ఆసమయాన, మహామహీపాల!
రఘువంశమణి యైనరామచంద్రుండు
అణువంతయైనఁ బ్రయాసంబు లేక
గజ మెట్లు ప్రతెంపు పంకజనాళ మట్లు
శివునిచాపమును భంజించె నాసభను.
ఈవార్త నాలించి భృగుకులాధీశుఁ
డమితరోషంబుతో నట కేగుదెంచి
యతిగ విజృంభించె హద్దులమీఱి.
కాని శ్రీరామునిఘనబలం బరసి
స్వీయపినాక మర్పించి యాతనికిఁ
గడు వినయంబుతోఁ గానకు నడ్జనియె.
రామునిపగిది నోరాజ! లక్ష్మణుఁడు
నతులబలుండయి యలరుట గాక
తేజోనిధానుఁ డాధీరవరేణ్యుఁ
జూచినమాత్రాన క్షోణీశగణము
కొదమసింగముఁ గన్నకుంజరగణము
పగిదిగా గడగడ వణఁకె నాకులత.
భవదీయనందనద్వ్యయమును మేము
కంటిమి రాజ! మా కన్నవ లిప్పు
డెవ్వనిఁ జూడఁగా నెంచ వించుకయు."
ప్రేమప్రతాపముల్ వీరరసంబు
తొణికిసలాడునాదూతల యొక్క
వచనరచనకు సభాసదుఁ లెల్లఁ
గడుఁ బ్రియం బొందిరి; శ్రీనాయకుండు
నఖిలసభాసదు లనురాగవశత
వారిపైఁ గట్నముల్ వర్షించి రఘుడు.
కాని దూతలు వానిఁ గైకొనకుండఁ
తగ మూసికొని చెవుల్ తమకరాంగుళుల
"నిది యవినీతి సుమా" యని, రఘుడు
వారల ధర్మస్వభావంబు నెంచి
సర్వ లానందరసస్యాంతు లైరి.
అంతట లేచి ధరాధీశ్వరుండు
శ్రీవసిష్ఠమహర్షి చెంతకుఁ బోయి
వచ్చినశుభలేఖ భక్తి నొసంగి
దూతలఁ దగుప్రీతితోడ రావించి
వినిపించె గురునకు వృత్తాంత మెల్ల.
ఆవార్త విని వసిష్ఠాచార్యవర్యుఁ
డతిహర్ష మొందుచు ననియె నీరీతి:
"పుణ్యపూరుషులకుఁ బుడమి యంతయును
సుఖభరితం బగు క్షోణీతలేశ!
కామన లేకున్నఁ గాని సంద్రమున
బరుగిడి నదు లన్ని పడినచందమున
సుఖసంపదలు వచ్చు సుస్థిరధర్మ
శీలునికడ కయాచితరీతి నవియె.
దేశికబ్రాహ్మణధేనుదేవతల
సేవించెదవు నీవు స్థిరతరభక్తి.
నీదు పట్టపురాణి నిస్తులచరిత
దేవి కౌసల్య, ధాత్రీనాథమౌళి!
ఈజగంబందు నీ కెనయగు నతఁడు
సుకృతాత్ముఁ డెట మున్ను జూపట్ట లేదు;
ఇప్పుడు లేఁడు, ముం దిఁక నుండఁ బోఁడు.
రామునివంటిపుత్రకుఁ గంటి, బళిరె!
యధిప! నీ కంఱెఁ బుణ్యాత్ముఁ డెవండు!
నరనాథమౌళి! నీ నలుగురు సుతులు
రణవీరవరులు, నక్రమత్స్యభూషణులు
ధర్మవ్రతులు, గుణధాములు రాజ!
సర్వకాలంబుల సకలవిశ్వమున
నిజముగాఁ గల్యాణనిలయుండ వీవు.
భేరీనినాదసంభృతముగా నింక

జరుపుము కల్యాణసన్నాహములను.
తరలగా వలయు సత్వరమే"—యనంగ
గురువాక్యముల విని క్షోణీధవుండు
శిరము వంచియు నమస్కృతిని గావించి.
"చిత్తము. మంచిది శ్రీగురునాథ!"
అని వచియించియు, నానంద మొప్పఁ
దగునివాసముల దూతల కియ్యఁ జేసి
యంతటఁ జేరె నిజాంతఃపురంబు.
రాణివాసస్త్రీల రా జంతఁ బిలిచి
చదివి విన్పించెను జనకుపత్రికను.
ఆశుభసందేశ మందఱు వినియుఁ
బరమసంతోషసంభరితాత్మ లైరి.
ఇంకను దా విన్నయితరవార్తలను
దెలిపె వారలకు ధాత్రీనాయకుండు.
వారిదసంఘరావంబును వినిన
బర్హిణంబులవలె రాణు లెల్ల
ప్రేమప్రఫుల్ల లై వివశాత్మ లైరి.
సదమలగురువృద్ధజనసతీమణులు
ప్రహ్లాద మొంది దేవతలఁ బ్రార్థించి
రాశీస్సు లిడుటకై; యాసమయమున
నలుగురు తల్లు లానందవారాశిఁ
బడి తేలియాడిరి పరవశత్వమున.
అమితప్రియం బగునాశుభలేఖ
రాణులుఁ గొనియుఁ బరస్పరం బెదల
హత్తించుకొనిరి చల్లారఁ దాపంబు
రామలక్ష్మణయశోరమ్యకార్యములఁ
బలుమాఱు లమ్మహాప్రభువు వర్ణించి,
"ఇది యెల్ల మునికృపయే" యని పలికి
ద్వారముల్ గడచియుఁ దా నిర్గమించె.
అంత మువ్వురురాణు లవనీసురులను
రావించి యానందరాజిత లగుచుఁ
ధనియఁగాఁ గురిసిరి దానవర్షముల.
దీవించి తృప్తి భూదేవతాగణము
లేగెను దమతమయిండ్లకాపిదప.
పిలిచి యాచకులను ప్రేమతో వారు
బహువిధబహుమానవస్తుసంఘముల
నిచ్చిరి పెల్లుగా నిష్టమైనటుల.
"దశరథరాజేంద్రుతనయు లందఱును
మహిఁ జిరజీవులై మనెదరుగాక!"
అని సల్పుకొనుచు జయధ్వానములను
బహువిధవస్త్రముల్ బాగుగాఁ గొనియు
వెడలిరి యాచకబృందంబు లెల్ల.
సంతోషసంరంభజయజయధ్వనులు
భోరుకొల్పెడి దుందుభులఘోష లొప్పె.
ఈవార్త ప్రాఁకఁగా నెల్లెడం బురినిఁ
బ్రతిగృహంబున నుత్సవంబు దీపించె.
జానకీరఘువీరచారువివాహ
వార్తను విని హర్షభరితంబు లయ్యెఁ
బదునాల్గుభువనముల్ పరమమునీంద్ర!
విని యీమహాశుభవిషయంబు, జనము
లనురాగవశులయి యఖిలవీథులను
సదనంబులను మఱి సందుగొందులను
గడిగి రంతట నలంకారంబుఁ జేయ.
పరమమంగళము పావనమై వెలుంగు
రామచంద్రునిజన్మరంగమై నట్టి
ఆయయోధ్యాపురి నఖిలకాలముల
రమణీయమైనదై రంజిల్లుచున్నఁ,
బ్రేమస్వరూపునిప్రేమచే జనులు
లావణ్యమంగళాలంకారమయముఁ
జేసి రాపట్టణ శ్రీయుట్టిపడఁగ
ధ్వజపతాకములతోఁ బటచారుచామ
రములతోఁ బరమచిత్రముగ మార్గములు
కనులపండువుగ శృంగారింపఁబడియె.
కమనీయకాంచనకలశాలతోడ

మణీజాలతోరణమండలితోడ
వరహరిద్రాదూర్వభవ్యాక్షతాతి
మంజులనవపుష్పమాలలతోడ
నిఖిలమంగళకరనిజభవనములఁ
గడు నేర్పుతోడ సింగారించుకొనిరి
యాయయోధ్యాపురియందలిజనులు.
* రసచతుష్టయమయరమ్యజలంబు
తద్ధీథులను సేచితం బయ్యె మిగుల.
సదనముఖద్వారచతురస్రభూము
లందనూ ముగ్గుల కాలవాలములు.
మెఱపుఁదీగెలుఁవోలె మెఱయుచు మిగులఁ
బూర్ణేందుఁ బోలినముఖములతోడ
హరిణశాబకనయనాబ్జముల్ గలిగి
రతిగర్వాహారకరమ్యరూపముల
షోడశాలంకారశోభిత లగుచు
వెలుఁగుభామామణుల్ బృందబృందముగ
నట నిటఁ గూడి మహానందపడుచు
సొంపుగాఁ బాడిరి శుభగీతములను
గలకంఠగణము తత్కలరావములకు
సిగ్గును జెందగాఁ జిత్తంబులోన!
నృపసౌధ మెట్లు వర్ణింపశక్యంబు?
అచటివితానంబు లఖిలవిశ్వమును
సమ్మోహ మొందింపఁజాలి వెల్గొందు.
బహుళమనోజ్ఞశుభద్రవ్యములును
భాసిల్లె; మార్మ్రోగె వాద్యసంఘములు.
వందిగణం బొకవైపు పఠింప
బిరుదావళుల నెల్ల, వేఱొకచోట
విప్రులు చేసిరి వేదగానముల.
అంగనాసందోహ మానంద మొంది
సొంపుగాఁ బాడిరి శుభగీతములను

శ్రీరాము పేరును శ్రీసీత పేరుఁ
బలుమాఱు పలుకుచుఁ బరమమోదమున.
ఏదిక్కుఁ గాంచిన బృహదుత్సవంబె!
దానిని భరియింపఁ దద్భవనంబు
కడుఁజిన్నదౌటచే గట్టులు మీఱి
యామహోత్సాహ మయ్యఖిలదిక్కులకుఁ
బొర్లి పాఱినరీతిఁ బొడసూపుచుండె.
మనదేవతాశిరోమణి రామభూపుఁ
డవతరించినయట్టి యాదశరథుని
భవనమహాశోభ వర్ణనసేయ
నే కవివశము మునీ! భరద్వాజ?

దశరథమహారాజు సపరివారముగ
మిథిలానగరమునకుఁ దరలుట

పార్థివుం డంతట భరతునిఁ బిలిచి,
"అరిగి నీ విప్పుడు హయగజరథము
లాయత్తపఱుపుమా యతిరయంబుగను
రామకల్యాణకార్యమునకుఁ దరల"
అని వచియింపఁగా నాసహోదరులు
భరతశత్రుఘ్నులు పరవశులైరి.
సర్వుల రావించి సాహిణీవరుల
భరతుఁ డాజ్ఞాపింప, వారు సమ్మోద
పడి లేచి రాజ్ఞలఁ ద్వరగ నొనర్ప.
లలితపల్యాణంబులను బూన్చినట్టి
రంగురంగుల సత్తురంగరాజములు
భాసిల్లుచుండెను పంక్తులు దీరి.
అవి యన్నియునుఁ గడు నందంబు గలవి
యతిచంచలంబుగా నడుగువేయునవి.
తప్తలోహమునఁ బాదముల రవ్వంత
మోపని రీతిగా భూమిపై నవ్వి

---

* రసచతుష్టయమయరమ్యజలంబు = మంచిగంధము, కుంకుమపువ్వు (కేసరి) కస్తూరి, కర్పూరము కలసిన పనీ

పాదంబు లిడకయే పరుగెత్తుచుండు.
పలుకశక్యముగాని బహుళజాతులకుఁ
జెందిన వాయశ్వ శేఖరావళులు
వాయువేగము మించి పరుగిడు నెగసి.
మహితులౌ భరతసమానవయస్కు—
లగువీరనృపసుతు లాయశ్వములను
రుచిరంబుగా నధిరోహించి రప్పు
డారాజనందను లందఱుగూడ
సౌందర్యయుతులు భూషణకోటిధరులు
కరధృతచాపులు, కటితూణధరులు.
ఆసుందరులు నవయౌవనోత్సాహు
లాతితేటిన శూరు లందఱుఁగూడ
ప్రతివీరునకు నిరుప్రక్క—లం దుండె
నసికళానిపుణపదాతిద్వయంబు.
బిరుదు లూనినరణవీరు లందఱును
ముం దేగి యూఁగిరి పురబాహ్యమందు.
చతురాశ్వికులు తమజవనాశ్వములను
నానావిధంబుల నడిపించిరెదల
దనియుచు భేరీమృదంగరావముల.
రథసారథులు తమరథముల నెల్ల
ధ్వజపతాకల మణివరభూషణములఁ
గడుఁ జిత్రరీతి శృంగారించుకొనిరి.
రమణీయబహుచామరంబులతోడ
శబ్దించుకింకిణీజాలంబుతోడ
రాజిల్లుచున్నతద్రథపంక్తు లెల్ల
సూర్యమహారథశోభన్ హరించె.
శ్యామకర్ణంబుల నలరాఁగుచున్న
యగణితహయముల నారథంబులకుఁ
గట్టిరి సారథుల్ కడురమ్యముగను.
సుందరాలంకారశోభిత మైన
యాయశ్వబృందంబు నరసినయెడల
మునులు సైతంబును మోహింపఁగలరు.

నీటిపై సైతము నేలపైఁ బోవు
సరణి నా యశ్వముల్ చన సమర్థములు.
వారిలో మునుఁగవు వానిరింఖాళి—
యంత మహావేగ మాయశ్వములది.
అస్త్రశస్త్రంబుల నన్నిటితోడ
నాయత్తపఱిచి రథావళి నెల్ల
రథికుల నంత సారథులు రమ్మనిరి.
అందఱు రథములయం దెక్కి వచ్చి
చేరిరి పుర బాహ్యసీమ నత్తఱిని.
ఏకార్యనియతిలో నెవ్వఁ డేగినను
శుభశకునంబులు చూపట్టె నపుడు.
కరివరంబులపైనఁ గట్టఁగాఁ బడియె
భాసిల్లుచున్నయంబారీలు; వరుస
వర్ణనాతీతశోభాసమేతములు.
రవళితఘంటాభిరామంబు లగుచుఁ
జనుచున్నమత్తగజంబులు దోఁచె
శ్రావణసుభగగర్జామేఘములుగ.
ఇతరవాహనము లనేకముల్ వెడలె
నలరమ్యశిబికాసుఖాసనాదులును.
బయలుదేరిరి వానిపై విప్రవర్య
లఖిలవేదోక్తమంత్రాకృతు లనఁగ.
వందిమాగధసూతవైతాళికులును
బయలుదేరిరి తగువాహనంబులను.
ఖరము లుష్ట్రంబులు ఘనబహుజాతి
వృషభరాజంబులు వెడలె మాపులను
వివిధాగణితవస్తుబృందంబు లొప్ప.
కావళ్ళతో భటగణకోటి సాఁగె.
వారు మోసెడిబహువస్తుజాలముల
రకముల నెవఁడు వర్ణనసేయఁగలఁడు?
నిఖలసేవకకోటి నిజనిజబృంద
సన్నాహములతోడ సాఁగె నయ్యెడను
నిండె సర్వులలోన నిర్భరసుఖము

పులకరించె శరీరములు సర్వులకును.
"రామలక్ష్మణుల నారఘువీరయుగము
నెపుడు గండ్లారఁగా నీక్షింపఁగలమె?"
అని చెప్పుకొనుచుండి రందఱుఁగూడ.
గజఘీంకృతులు ఘంటికాఘోరరవళి
రథగతిధ్వనులు తురంగహేషలును
నిఖిలదిక్కులయందు నిండి జృంభించె.
మించె భేరీధ్వనుల్ మేఘగర్జలను.
ఎవనిమాటలు వానికే వినఁబడవె
యితరులమాట లిం కెటు వినవచ్చు?
అనసీతలేకు సింహద్వారసీమ
నొక్క పాషాణంబు నుంచినయెడలఁ
బెసఁ బిండి యైపోవువిధముగా నుండె
జనమహాసంకులసంరంభలీల.
స్త్రీలు సౌధంబులఁజేరి చూచుచును
సొంపుగా నొసఁగిరి శుభహారతులను
మంజులమంగళమధురగీతములఁ
బాడిరి వర్ణింప వలను గానట్టి
యానందపారవశ్యంబున మునిఁగి.
అంత సుమంత్రుఁ డర్కాశ్వరాజముల
సైత మోడించునశ్వంబులఁ బూన్చి
భాసిల్లు స్యందనద్వయమును దెచ్చి
నృపశిరోమణిముందు నిలుచుండఁ బెట్టె.
వానిమహాశోభ వర్ణనసేయ
శారదాదేవియుఁ జాల, దం దొకటి
రాజోపకరణవిరాజమానంబు;
అమలతేజఃపుంజ మగుచు రెండవది
యమతవిభ్రాజితమై తనరారె.
రాజితమైన యారథమందు రాజు
సంతోషమున వసిష్ఠుని నెక్కించి,
హరగురుగౌరీగణాధినాయకుల
స్మరియించి తానును స్యందన మెక్కె.

అలబృహస్పతియుక్తుఁ డగుపురందరుని
యటుల వసిష్ఠమహర్షి సమేతుఁ
డగుమహానాయకుఁ డలరారుచుండె.
నిజకులరీతిని నిగమపద్ధతిని
సకలసత్క్రియలను సలిపినపిదప,
సర్వులు పయనంబు సాఁగించుకొనుకుఁ
బ్రాప్తసన్నాహులై పరఁగుటఁ గాంచి
గురుదేవునాజ్ఞఁ గైకొని రాముఁ దలఁచి
బయలుదేరెను మహీపతి శంఖ మూది.
ఆవివాహోత్సవ మరసి దేవతలు
ఆకాశమందుండి హర్షాఢ్యులగుచుఁ
బరమమంగళవరప్రదము లైనట్టి
కుసుమవర్షంబులఁ గురిపించుచుండ్రి.
హయగజధ్వనుల, భూమ్యాకాశభాగ
బహుశుభవాద్యశబ్దంబులు నచట
భూరికోలాహలపూర్ణతఁ జెలఁగె.
సురనరకాంతలు సొంపొప్పనటుల
మంగళగీతముల్ పాడుచుండఁగను
సన్నాయివారలు సరసరాగములఁ
బాడిరి : ఘంటికాధ్వనులుఁ జెలంగె
వర్ణనాతీత మాపద్ధతి వెలయ.
భటజనుల్ గంతులు వైచి రుత్సుకత
బహువిధసాధనావళిఁ జూపుకొనుచు.
ఘనహాస్యకుశలురు కలగాననిపుణు
లగువిదూషకు లంద రానందపడఁగ.
గావించి రెన్నియో కౌతుకక్రియలు.
శ్రావ్యమృదంగనిస్వాణశబ్దముల
దరువున కనువుగాఁ దమతురంగముల
నడిపిరి సుందరనరపాలసుతులు.
తాళంబు రవ్వంత తప్ప కాహయము
లరుగుటఁ గని 'నటు' లాశ్చర్యపడిరి.
ఆపెండ్లిసంబర మభివర్ణనంబు

సలుప నెవ్వానికి వశంబు గాకుండె.
చూపట్టె సుందరశుభశకునములు:
వామపార్శ్వమునందు వారల కప్పు
డగపడె మగపిట్ట యవనీసలాన
ధాన్యంబు నేరుచుఁ దనముక్కుతోడ-
శుభము లెల్లను గల్గుసూచన గదుర.
పొలములోఁ గుడిపార్శ్వమున వారి కంతఁ
గాకంబు, నకులంబు కానంగ వచ్చె.
మందశీతలగంధమారుతం బప్పు
డనుకూలముగ వీచె హాయిఁ గొల్పుచును.
సఘటసబాలయూ సాథ్వీలలామ
కనవచ్చె: నొకజంబుకము ప్రదక్షిణము
సలుపుచుఁ దాఁ బలుసారులు తోఁచె.
వత్సంబునకుఁ బ్రీతిఁ బాలిచ్చుకొనెడి
సురభి వారలముందుఁ జూపట్టె; మఱియు
ఘనశుభగణములే కనవచ్చినట్లు
మృగమాల కుడిదెస కేతెంచెఁ జుట్టి
గరుడపక్షియుఁ జూపె ఘనమంగళముల;
నెడమదిక్కున మంచి వృక్షంబు పైన
శ్యామపక్షియు దృష్టియందునఁ దోచె.
దధిమీనములఁ గొని తరలి యొకండు,
కరమున నొకపుస్తకముఁ దాల్చుకొనియుఁ
బండితు లైనట్టి బ్రాహ్మణు లిద్ద,
ఱేతెంచి రచ్చోటి కెదురుగా నడచి.
మంగళకల్యాణమయము లైనట్టి
యభిమతార్థప్రదాయకము లైనట్టి
యలశుభసూచన లన్నియు నొక్క-
పర్యాయముగఁ గానవచ్చె నా వేళ
నాత్మీయసార్థకతార్థమై యనఁగ.
ఆసగుణబ్రహ్మ మాత్మపుత్రునిగఁ
గన్నధన్యునకు మంగళశకునములు
కనిపించె సుగమంబుగా, వింత లేదు.
ఆవివాహోత్సవమందలి వధువు
జానకి, రఘురామచంద్రుండు వరుఁడు,
జనకేంద్ర దశరథక్ష్మాపాలమణులు
తద్వధూవరులకుఁ దండ్రు, లీపెండ్లి
సద్వార్త విని శుభశకునంబు లెల్ల
దాండవమాడె, "విధాత యీ నాఁడు
సారకపరచె మాజన్మం" బటంచు.
ఈరీతిఁ బెండ్లివా రేగఁ దొడంగి
రశ్వేభభేరీరవావళిమధ్య.
ఆభానుకులకేతు వరుదెంచు టెఱిఁగి
కట్టించె జనకుండు ఘనసేతువులను
వాహినీచయములపై; మధ్యమధ్య
నమరావతీసమానాతివైభవము
లైన నివాసగృహంబు లేర్పరచె.
సరసదివ్యాశనశయనసద్వసన
వసతు లన్నియును నేర్పాటుకాఁబడియె
నెవ్వరెవ్వరి కెట్లు హితమానో యటుల.
ఆ నిత్యనూత్నసుఖావళి తమకు
ననుకూలమై యుండు టరసి సర్వులును
మఱచిపోయిరి నిజమందిరంబులను.

జనకాదులు దశరథాదులకు స్వాగత మొసఁగుట

పెండ్లికుమారుని బృందంబు పురికి
వచ్చుచుండె నటన్నవార్త నెఱిఁగి
భేరీనినాదముల్ వినఁబడినంత
వరహయగజరథభటసమేతముగ
నెదురుకోలు జనంబు లేగెను గలియ.

శ్రీరామచరితమానసము

బాలకాండము

దశమవిశ్రామము

శ్రీదేవీహృదయేశ్వర ! వేదాచలశిఖరనిలయ ! విశ్వాధారా !
శ్రీదాయక ! భక్తప్ర హ్లాదావన ! మట్టపల్లి హరి ! నరసింహా !

స్వాదుశీతలశుభ్రజలపరిపూర్ణ
కాంచనకలశసంఘుంబులు, మఱియు
వర్ణనసేయఁగా వలను గానన్ని
యమృతోపమానపక్వాన్నజాలములు
బహుఫలంబులు రమ్యవస్తుజాలములు
బాగుగా నిండినపళ్లెరంబులను,
జనకభూనాథుఁడు సంతోషపడుచుఁ
బంపెఁ గట్నంబుగా వారల కపుడు.
మఱియు రా జంపెను మణిగణంబులను
భూషణవసనసమూహకోటులను
ఖగమృగహయగజఘనతరవివిధ
వాహనచయముల బహువిధరమ్య
తమసుమంగళసుగంధద్రవ్యములను.
దధి, చిపిటంబులఁ దగునుపహార
ముల మోసికొనుచును భుజములపైనఁ
గావళ్ళతో, భటగణ మేగుచుండె.
ఎదురుకోల్సలుపఁగా నేతెంచినట్టి
వారలు మగపెండ్లి వారినిఁ జూచి
యానందమొంది హృదంతరంగములఁ
బులకీకృతాంగు లైపోయి రెల్లరును.

అఖిలసన్నాహసమంచితు లగుచు
వచ్చినయూహ్వానపక్షంబువారి
నరసి యావరుపక్షమందలివారు
ముదితులై భేరుల మ్రోయించి రపుడు.
ఒండొరుల్ కలియఁగా నుభయపక్షములు
గబగబ నడచిరి గంతు లేయుచును.
ఉప్పొంగి తీరంబు లుద్ధతి దాఁటి
కలసినయానందకంధిద్వయంబు
కరణి వా రుభయు లేకం బయి రంత.
సురసుందరీమణుల్ సుమవర్షములను
గురియుచుం బొడిరి కోయిల లటుల,
ముదితామరులు దుందుభుల మ్రోయఁజేయ.
అంతట జనకునియనుచరగణము
దశరథనృపునిముందటఁ బెట్టి సర్వ
వస్తుజాలంబులఁ, బ్రొర్థింపఁదొడఁగె
నమితానురాగసమంచితోక్తులను.
అప్పు డానృపుఁడు ప్రేమాన్వితుం డగుచు
నెల్లవస్తువుల గ్రహించి, యాపిదప
వానిని దనదగుపరిజనంబులకు
బహుమానముగ నిచ్చివై చెను, గొన్ని
సలిపె దానంబు యాచకతండములకు.
సముచితగౌరవసత్కారములను
సలిపినపిదప నాజనకునిజనము
పెండ్లికుమారునిబృందంబులకును

వేంచేయఁ జూపెను విడిదిగృహాల.
వరచిత్రవసనముల్ పఱచిరి క్రింద
రాజబంధువులు మార్గమ్మున నడువ.
అవ్వాని వైభవం బరసినయంత
ధనదునిధనమదధ్వాంతం బడంగె.
ప్రథితనూతనసర్వావసతులు గల్గు
నతిసుందరము లగునావాసపంక్తి
పెండ్లివారికి సమర్పింపఁ గాఁ బడియె.
పెండ్లికుమారునిబృందంబు, నగరి
కరుదెంచె ననువార్త నాలించి, సీత
ప్రకటించె స్వీయప్రభావం బొకింత.
తనదుసంకల్పమాత్రంబున నామె
వివిధసిద్ధులను రావించియుఁ బంపె
దశరథరాజబృందములోని జనుల
నందఱ సేవింపుఁ డని యాజ్ఞ నొసఁగి.
ఆజానకీదేవియాజ్ఞ నాలించి
సర్వసిద్ధులు పెండ్లిజనులవాసముల
నిఖిలసంపత్సుఖాన్వితనాకస
భూరిభోగవిలాసములతోడఁ జొచ్చె.
తాము వసించెడిధామంబులందు
సులభంబుగా, సర్వసురపురసుఖము
లంది యానందించి రాపెండ్లివారు.
ఆయనిర్వచనీయ మగు వైభవమున
కేది కారణ మది యెఱుఁగ రించుకయు,
జనకునే కీర్తింప సాగి రెల్లరును.
శ్రీరాముఁ డొక్కఁడే సీతామహత్త్వ
మాత్మలో నెఱిఁగి, మహాహర్ష మొందె
నా మైత్రేమాతిశయంబు గ్రహించి.

రామలక్ష్మణులు తండ్రిని గలియుట

ఆత్మీయపితృదేవునాగమనంబు
నారామలక్ష్మణు లాలించినంత

నాపఁజాలక పోయి యానంద మెసఁగ
జనకదర్శనలాలసస్వాంతు లయ్యు
గురువుతోఁ దెలుప సంకోచ మబ్బఁ బడి
ఆమహావినయంబు నరసి డెందమున
నమితసంతోషంబు నందెఁ గౌశికుఁడు
పరమహర్ష మున విశ్వామిత్రుఁ డంత
దత్సహోదరుల నిద్దఱి నొక్కసారి
హత్తించుకొనె హృదయంబునఁ, బు
పులకింపఁగా, నేత్రముల జలం బొల
అంతట వారు, ధరాధీశ్వరుండు—
దశరథుం డున్నట్టిసలికిని జనరి
దాహతప్తునిసన్నిధానంబుఁ జేర
నరిగినకాసార మటుల మునీంద్ర!
తనయులతో వచ్చుతపసిని గాంచి
హర్షంబుతో లేచి యవ్వారిఁ గలి
ముందుకు నడచెను, మోదాబ్ధి య
నడుగిడుచుండినయటుల భూవిభుఁడ
క్ష్మానాయకుఁడు మునీశ్వరుపాదము
దండప్రణామముల్ తా నొనరించి
తత్పాదరజమును దనశిరమందుఁ
బలుమాఱు ధరియించె భక్తిభావవ
కౌశికుండు నృపాలుఁ గౌఁగిటఁ జేర్చి
యాశీర్వదించియు నడిగె క్షేమంబు
అంతట రాజు నిజాంఘ్రుల కెఱఁగు
నాయన్నదమ్ముల నరసినయంతఁ
బొందె నిర్భరహర్ష మును స్వాంతమ
ఆబాలకుల, హృదయాగ్రమం దాత
డమితగాఢంబుగా హత్తించుకొనియ
దుస్సహావిరహాతిదుఃఖంబుఁ బాసె;
మృతమానవుఁడు పునర్జీవించినట్లు
పరమసంతోషసంభరితాత్మఁ డయె
రామలక్ష్మణు లంత రాజితభక్తి

శ్రీవసిష్ఠాంఘ్రి రాజీవంబు లందు
వినమితశిరులై రి; ప్రేమసమ్మోదిత
భావుఁడై యామునివరుఁ డంత వారిఁ
గౌఁగిటఁ జేర్చెను గరముల నెత్తి.
తదుపరి యాసహోదరు లిర్వ్వ, రఖిల
విప్రబృందములకు వినతిఁ గావించి
పొంది రాశీర్వాదముల భరద్వాజ!
భరతశత్రుఘ్నులు ప్రణతు లర్పింప
రామచంద్రుం డనురాగవేగమునఁ
బరిరంభణము సల్పె వారి గాఢముగ.
సోదరద్వయమును జూచి లక్ష్మణుఁడు
హర్షించె, గుండెకు హత్తించుకొనియె
ననురాగపరిపూరితాంగుఁడై, పొంగి.
పరిజనపురజన బాంధవజనుల
యాచకమంత్రిమిత్రాదుల నెల్లఁ
బ్రేమతోడను, యథావిధి నాదరించె—
వరవినీతుండును, బరమకృపాళు
వైన శ్రీరాఘవుఁ డాజగత్ప్రభువు.
శ్రీరామచంద్రు దర్శించి వా రెల్ల
సంప్రీతిఁ బొందిరి స్వాంతంబులందు.
ప్రేమరీతులఁ దెల్ప వీలుగా దెపుడు;
దశరథనృపసన్నిధానంబునందు
వెలసిరి నలుగురు ప్రియతనూభవులు
నలచతుర్విధపురుషార్థంబు లవని
నాకృతుల్ దాల్చినయటులఁ దోపంగ.
కూర్మినందనులతోఁ గూడి యున్నట్టి
దశరథధారుణీధవుని వీక్షించి
సర్వపౌరులు విశేషప్రీతిఁ గనిరి.
కుసుమవర్షంబులు గురియుచు సురలు
ప్రమోయఁ జేసిరి దుందుభుల నభస్థలిని.
నాకనటీమణుల్ నర్తనోత్కృష్ట
గానంబుసేసిరి కడు శ్రావ్యముగను.

అంత శతానందుఁ డవనీసురులును
సచివమాగధసూతజనవందిబృంద
భటవిదూషకముఖ్యవర్గ మంతయును
బరివారయుతముగాఁ బార్థివమణిని
సన్మాన మొనరించి చనిరి వీడ్కొనియు.
ఘనలగ్నదినమునకంటె ముందుగనె
వరునిసమాజంబు వచ్చియుండుటను
బురములో నధికప్రమోదంబు నిండె;
నఖిలజనంబు బ్రహ్మానందపడుచు
రాత్రింబవళ్ళ దీర్ఘం బొనరింపఁ
బ్రొద్దింపసాగిరి పరమేష్ఠి నాత్మ.
"అహహా! సీతారాము లఖిలలోకములఁ
బూర్ణశోభాస్వరూపులు; యథార్థముగ
దశరథ జనకు లిద్దఱును విశ్వమునఁ
బూర్ణపుణ్యస్వరూపులు సుమా" యనియె
నొండొరుల్ మాట్లాడుచుండి రెల్లెడలఁ
బురిలో వసించుస్త్రీపురుషు లెల్లరును.
"జనకుని సుకృతమే జానకి యయ్యె
దశరథసుకృతమే ధర రాముఁ డయ్యె
నీరాజయుగమున కెనగా నెవండు
శ్రీశివారాధన చేయఁగా లేదు.
అహ! వీర లొందినయట్టి ఫలంబు
లెవ్వరుఁ బొందలే దీలోకమందు.
ఈ దృశులగు వార లెందైన పూర్వ
ముఁ లేరు; లే రిప్పు ముం దుండఁబోరు.
నిఖిలపుణ్యవిశేషనిధులము మనము,
కావునఁ నే యీజగత్తునఁ బుట్టి
జనకపట్టణనివాసంబు నొందితిమి.
జానకీరాములసౌందర్య మరయఁ
గలిగిన మనవంటి కడు ధన్యు లెవరు?
అహ! రఘువీరకల్యాణంబుఁ గాంచి
యమితలోచనలాభ మందఁగాఁ గలము."

ఉవిద లీకీతిగా నొకరితో నొకరు
కలకంఠకమనీయగళములతోడ
గుసగుసవోయిరి కూర్మివశాన.
"ఓసులోచనలార! యుర్వీలో మనమె
యెంతయో లాభింతు మీవివాహమున.
మనయదృష్టంబునన్ మాన్యుండు బ్రహ్మ
సర్వంబు మంచిగా సమకూర్చియుండె
నీయన్నదమ్ము లీయిరువురు తరచు
నహ! మన కన్నుల కతిథు లయ్యెదరు.
అప్పు డప్పుడు జనకావనీవిభుఁడు
స్నేహవశంబుచే సీతను దెచ్చు,
నామెను గొనిపోవ నరుగుదెంచెదరు
కామకోటిసమానకమనీయరూపు
లీసహోదరు లిద్ద ఱీపురంబునకు.
ఎన్ని యో పండుగ లేతెంచుచుండు
మనజనకునిఁ బోలు మామగా రింట
నెవరు వసింపఁగా హృదిఁ గోరుకొనరు?
ఆసమయంబుల నఖిలజనంబు
రామలక్ష్మణులదర్శన మొనరించి
యానందపడఁగల రత్యంతముగను.
ఇంకను రాసుతు లిద్దఱు గలరు
దశరథన్నృపుతోడఁ; దద్రాజసుతులు
సాక్షాత్తు రామలక్ష్మణు లటు లుండి
రం దొక్కబాలుఁడు శ్యామలాంగుండు
మఱియొకఁ డుండె భర్మచ్ఛాయతోడ
నిద్దఱు సర్వాంగశృంగారమూర్తు
లని చూచి వచ్చువా రందఱుఁగూడ
నో సఖీ! వచియించుచున్నార" లనిన
నింకొక పద్మాక్షి యూరితిఁ బలికె:
"ఏ వారిఁ గాంచితి నీనాఁడు సకియ:
తానే స్వయంబుగాఁ దద్బాలకులను
దీర్చి దిద్దె విరించి ధీరత్వ మొప్ప
ననిపించె నరయఁగా నాత్మలో నాకు.
భరతుఁడు రాముని ప్రతిబింబ మేను
దొలిసారి చూచినతోడనే యెవరు
వారిభేదము గుర్తుపట్టఁగా లేరు.
శత్రుఘ్నలక్ష్మణస్వామి లాయిర్వు
రేకస్వరూపులే, యెన్నఁగా వార
లాపాదమస్తకాఽనన్యోపమాన
సుందరాంగులు, వారిఁ జూచినఁ జాలు
భావంబు పరవశత్వంబును బొందుఁ
గాని యానలుగురఁ గాంచి వాక్కులను
వర్ణనసేయఁగా వశముగా దెపుడు.
వారికి సరితూగువారు లే రనుచు
జెప్పచుండెను దులసీదాసు వినుఁడు:
అనుపమానులు వార లఖిలలోకముల
నని, కవికోవిదు లనుచున్నవారు.
వినయవిద్యాశీలవిక్రమబాహు
బలమహాసౌందర్యవార్ధులై వెలుఁగు
వారికి సరిపోలు వారలు వారె.
నలుగురు భ్రాత లీనగరంబునందె
పెండ్లాడుదురుగాక! ప్రీతితో మేము
గానం బొనర్ప మంగళగీతములను"
అని ప్రార్థనముఁ జేసి రంగనల్ విధిని
చీరచెఱంగులఁ జేతులఁ దాల్చి.
"ఆత్రిపురారిదివ్యానుగ్రహమున
సర్వంబు నెఱవేఱు సఖులార! యట్టి
పుణ్యపయోనిధుల్ భూపు లిద్దఱును."
అని చెప్పుకొనిరి యాయంగనామణులు
కాయముల్ పులకింపఁ గనుల నీ రొలుక.
వారు ప్రార్థించి రా పగిది గాధముగ.
వారిలో నానందవార్ధు లుప్పొంగె.
వసుధాత్మజాస్వయంవరమహోత్సవము
నకు వచ్చినట్టిభూనాథు లానల్లు

రన్నదమ్ములఁ గాంచి యానంద మొంది
యరిగిరి తమతమయావాసములకు
రఘురామవిశదవిరాజవిశాల
సద్యశఃకథనప్రసంగంబు లొప్ప.
ఇట్లు కొన్నిదినంబు లేగెఁ బౌరులును
బెండ్లికుమారుని బృందంబు మిగుల
సంతోష మొందఁగా స్వాంతరంగముల.

సీతారామకళ్యాణమహోత్సవము

దివ్యమా శుభలగ్నదిన మంత వచ్చె
శ్రీమంత మది మార్గశీర్ష మాసమున
నెంతయు నింపగు హేమంతఋతువు.
గ్రహతిథివారనక్షత్రయోగముల
శుభలగ్నకాలంబు శోధించి చూచి
లగ్నపత్రిక వ్రాసి లావణ్య మొప్ప
బ్రహ్మ నారదుచేతఁ బంపించె; నిచట
జనకునిజ్యోతిషశాస్త్రపండితులు
సైత మాలగ్నమే సరిగ గణించి
తామును దెలిపిరి తత్కాలమండె.
ఈవిషయము విని యెల్లజనంబు
"జనకరాజేంద్రునాస్థానదైవజ్ఞ-
లందఱు బ్రహ్మలే యనిపించుచుండె"-
నని చెప్పుకొనిరి మహాశ్చర్యపడుచు.
విమలసన్మంగళవిసరమూలంబు
విలసిల్లు గోధూళివేళను గాంచి
యనుకూలశకునంబు లరసి బ్రాహ్మణులు
తెలియఁజేసిరి శ్రీవిదేహభూపతికి.
నృపతి యంతటఁ బురోహితుఁ గాంచి "అనఘ!
యింక విలంబన మేల?" యనంగ
శ్రీశతానందఋషిశ్రేష్ఠుఁ డంత
సచివులఁ బిలిపింప, సత్వరం బఖిల
మంగళవస్తుసమంచితు లగుచు
వారెల్ల వచ్చిరి పరమమోదమున.
వరశంఖనిస్వానపణవాదిబహుళ
వాద్యవిశేషరావంబులు జెలఁగె.
మంగళకలశముల్ మంగళవస్తు
జాలంబు లన్నియు సమకూర్పఁబడియె.
సుభగసువాసినీస్తోమంబు లంత
సొంపుగాఁ బాడెను శుభగీతములను,
బ్రాహ్మణావళి వేదపఠనం బొనర్ప.
ఈరీతి వా రంద ఱేగి రాపెండ్లి
వారల సాదరపద్ధతి గదురఁ
గొని తెచ్చుటకు వారి కూటంబులకును.
వార లాకోసలపతివైభవంబు
గాంచఁగాఁ దోచెను, గడు స్వల్పునట్లు
లా మహేంద్రుఁడును మహర్షివర్యా!
విభు! సుముహూర్తమువేళ దా పయ్యె
బయలుదేరుఁ డటంచుఁ" బలికిరి వారు.
అనినంత భేరీమహాధ్వనుల్ సెలఁగె
బృథుమేఘుగణము ఘూర్ణిల్లిన రీతి.
అంతట దశరథుం డాచార్యుతోడ
సంప్రదించియుఁ గులాచారముల్ సలిపి
వెడలెను మునిసాధుబృందయుక్తముగ.
ఆయయోధ్యేంద్రుభాగ్యము, విభవంబు
లరసియుఁ గనుల బ్రహ్మాదిదేవతలు
తమజన్మ లెల్ల వృథా యని తలఁచి
యాతనిఁ గీర్తించి రల వేయినోళ్ల.
అదె సుమంగళసమయం బని యెటేఁగి
కుసుమవర్షంబులఁ గురియుచు సురలు
మ్రోయఁజేసిరి దుందుభుల రభసముగ,
విధిశివముఖ్యులౌ విబుధవరూథ
ములు విమానముల సమూహంబులందుఁ
దనువులు పులకింపఁ దన్మయత్వమున
నానంద ముప్పొంగ నంతరంగముల

రామవివాహదర్శన మొనరింపఁ
బయలు దేరిరి నభఃపథమునం దపుడు.
కని దేవతలు జనకప్రభుపురము
తమలోకతతి లఘుతరముగాఁ దోప
ననురాగవశులైరి యాపురంబందు.
ఆశ్చర్యపడుచు వా రరసి రచ్చోటఁ
దతమహాచిత్రవితానరాజమును
బహువిధాలౌకికవరశిల్పకృతుల.
ఆపురి స్త్రీపురుషాదు లెల్లరును
సౌందర్యనిధులును సద్ధర్మశీల
సుజ్ఞాననిలయులు, చూడఁగా వారి
సన్నిధానంబున సకలదేవతలు
దేవతాస్త్రీతతి తెలతెలంబారె
నలచంద్రికను దారకావళిరీతి.
తనసృష్టికార్య మాతావునం దెచటఁ
గానరాకపోవుటఁ గాంచి విధాత
స్వాంతమందున విశేషాశ్చర్య మొందె.
శివుఁ డంత దేవతాశ్రేణులఁ జూచి
ఈరీతి బోధించె నింపు దలిర్ప :
"ఆశ్చర్యపడకుఁడీ యాత్మలో మీరు.
శాంతిని బూని విచారంబు సలిపి,
పృథ్వీసుతారఘువీరవివాహ
మిది యని లోన గ్రహింపుఁ డీతఱిని.
ఎవరినామము స్మరియించినంతటనె
కడముట్టఁగా, నమంగళకోటి కూలు
నల చతుర్విధపురుషార్థంబు లెల్లఁ
గరతలగత మౌనొ, కాంచఁగా వార
లీజానకీరాము లెవ్వరో కాదు!"
కామారిహరుఁడు శంకరుఁడు భవుండు
శంభుఁ డీవిధి బోధసలిపి వారలకు,
వృషభరాజము నెక్కి వేంచేయసాగె.
పరమసంతోషసంభరితాత్మఁ డగుచుఁ,
బులకితదేహుఁడై పోవుచున్నట్టి
దశరథు న్గాంచె బృందారకగణము.
ఆనృపాలుని గూడి యరుదెంచుచున్న
సాధుమహీదేవసంఘంబు లరయఁ
గాయముల్ దాల్చి, సుఖప్రతానంబు
లతని సేవించుచున్నట్టులఁ దోఁచె.
అనృపుచెంగట నలరారుచున్న
నలుగురు సుందరనందనుల్ దోఁచి
*రపవర్గములు నాల్గు నాకృతుల్ దాల్చి
నరపతి వెనువెంట నడిచినవిధము.
మరకతకనకాభమహితాంగు లైన
రామలక్ష్మణుల దర్శన మొనరించి
ప్రేమభావోద్వేగవివశాత్మ లైరి
సర్వసుపర్వులు సంయమివర్య
శ్రీరాముఁ గాంచి విశేషంబు సురలు
హర్షంబు నొందుచు నంతరంగమున,
శ్లాఘ్యనాథు దశరథు సన్నుతించుచును
గురిసి రాతనిపైనఁ గుసుమవర్షములు.
శ్రీరాముసుందరాకృతిఁ జూచి చూచి
యాపాదమస్తక, మాయుమాశివులు
పులకసంకలితసంపూర్ణాంగు లైరి,
జలకణభరితలోచనపద్మ లైరి.
శ్రావణజలధరశ్యామలం బైన
రామచంద్రునిసుహారమ్య దేహమున
రహియించెఁ బీతాంబరము మెఱపట్లు.
సర్వమంగళసర్వసౌందర్యనిలయ
బహువిధకల్యాణవరభూషణముల
శ్రీరామవిభుఁ డలంకృతుఁ డౌచు వెలిఁగె.

---

*అపవర్గములు నాలుగు : సాలోక్య, సారూప్య, సామీప్య, సాయుజ్య మోక్షములు.

విమలశరచ్చంద్రవిభవాననంబు,
నిందీవరముల కెంతే సిగ్గుఁ గూర్చు
చారువిశాలలోచనయుగళంబు
విలసిల్లు నారఘువీరురూపంబు
సకల మలౌకికసౌందర్యయుతము.
అద్దాని దర్శించినంత మనస్సు
పారవశ్యము నొంది వర్ణింప లేదు.
ఆతనిప్రక్కనే యనుసరించుచును,
ముద్దులతమ్ములు ముగ్గురుఁగూడ
రమణీయచపలతురంగంబు లెక్కి
కదముఁ ద్రొక్కించుచు గమియించుచుండ్రి.
తదితరరాజనందనులు సైతంబు
తమహాయగమనవిధానంబు లెల్లఁ
జూపించుచుండిరి చోద్యంబు గదుర.
వంశప్రశంసకబహుబిరుదములఁ
బఠియించుచుండిరి వందిమాగధులు,
రామకల్యాణతురంగవేగంబుఁ
గాంచి పతంగపుంగవుఁడు లజ్జించు
నద్దానిసౌందర్య మన్నివిధాల
వర్ణనాతీతమై భాసిల్లుచుండె;
మదనుఁ డాయశ్వమై మహిఁ బుట్టి ననఁగఁ
గనిపించె నాతురంగముతీరుఁ జూడ.
శ్రీరాముకొఱకు నాచిత్తసంభూతుఁ
డతిశోభతోడ నాయశ్వరూపమున
వచ్చియుఁ దనవమోబలరూపసుగుణ
గతులతో సర్వజగంబు విమోహ
పఱచినవిధిఁ గానవచ్చె, మునీంద్ర!
మౌక్తికబహుమణిమాణిక్యఖచిత
పల్యాణ మొగి మూపుపైనను మెఱసె.
చిన్నమువ్వలతోడఁ జెలఁగుపట్టెడయు
నందమౌ కళ్ళెంబు నరయఁగా సర్వ
నరసురమునుల మనస్సు భ్రమించె.

ప్రభుచిత్తసమ్మగ్నభావంబుతోడ
నరుగుచున్నట్టి యాయశ్వరాజంబు
కడు మనోహరముగాఁ గనవచ్చె నొక్క
తారాతటిల్లతోద్భాసితాంబుదము
శిఖి నెక్కి యాడింపఁ జేసినరీతి.
శ్రీరామవిభుఁడు స్వారీ చేయునట్టి
యావరవాజిని నభివర్ణనంబు
సలుపఁ జాలదు వాణి సైత మోయనఘు!
రామస్వరూపానురాగియై శివుఁడు
పంచదశాక్షులభాగ్యంబు గలిగి
యున్నందులకును మహోత్సాహ మొందె.
శ్రీరామదేవు వీక్షించి సంప్రీతి,
హరియును, రమయు, మోహాక్రాంతులైరి.
రాముశోభను జూచి బ్రహ్మదేవుఁడును
హర్షంబుపొందె నిజాంతరంగమునఁ;
గాని తా నెనిమిది కన్నులే గలిగి
యుండుట, ఖిన్నత నొందెను మరల.
నలువకన్నను నింక నాలుగుకన్ను
లధికంబుగా నుంట నలరె షణ్ముఖుఁడు.
సుజ్ఞాని, సురపతి, చూచి శ్రీరాము
గౌతమశాపంబు ఘనవరం బయ్యె
నని సంతసించె నిజాంతరంగమున.
సురలెల్ల నింద్రునిఁ జూచి, కీర్తించి,
"రీపురందరునితో నెవ్వ రీనాఁడు
సరిపోలఁగలరు ముజ్జగములం దనుచు."
అఖిలదేవతలు రామాలోకనమున
సమ్మోదమొందిరి స్వాంతంబులందు.
దశరథజనకబృందద్వయమందుఁ
జెలఁగె నపారవిశేషహర్షంబు.
ఇరుతెగ రాజులబృందంబులందుఁ
బృథుహర్ష ముప్పొంగె; నిరుపక్షములను
ఘనదుందుభిధ్వానగణము జృంభించె.

కురిసిరి దేవతల్ కుసుమవర్ష ములఁ
"జయజయజయజయ, జయరఘునాథ!"
అని వచించుచుఁ బరమానందవశత.
ఈరీతిఁ బెండ్లి వా రేతెంచుచున్న
విషయంబు దెలిసిన వెంటనే నగరి-
నఖిలవాద్యములు మ్రోయఁగఁదొడంగె
నంత రాజ్ఞీమణి యాసునయనయుఁ
బొలుపుగా ముత్తైదువులను రావించి
యానందమంగళహారతు లొసఁగఁ
దగిన శుభద్రవ్యతతి సమకూర్చె.
వివిధహారతులను వెలిఁగించుకొనియు
సకలమంగళవస్తుజాలముల్ గొనియు
గజగామినీవరకాంతాగణంబు
బయలుదేరెను హర్ష భావంబు లెసఁగ
నావరునకు శుభహారతు లొసఁగ.
పూర్ణేందుఁ బోలినముఖములతోడ
నవరమ్యమృగలోచనంబులతోడఁ
దమరూపశోభచేఁ దద్రతీదేవి
మద మడంగఁగఁ జేసి మసలారుచున్న
యాసుందరీమణు లందఱు గూడ,
చిత్రంబు లగుపట్టుచీరలఁ గట్టి
ఎల్ల సొమ్ముల ధరియించి యంగముల
మంగళద్రవ్యసమంచితాంగములు
వెలయఁగాఁ బాడిరి వివిధగీతములఁ
గడు సిగు నొందఁగాఁ గలకంఠకులము.
అ ల్లెగుచున్నట్టి యాసతీమణుల
కంకణకింకిణీగణనూపురమ్ము
లతిమంజులముగ మ్రోయఁగఁ దొడంగె
వారి యెయ్యారంబుఁ బరికించినంతఁ
గామదేవునిభద్రగజము సిగ్గొందె.
బహువిధవాద్యరావములు చెలంగె,
నభమున నగరి నానందంబు నిండె.

సహజపావిత్ర్యంబు చతురత గల్గు
శ్రీశచీశారదా శ్రీభవానులును
దదితరదేవకాంతాగణంబులును
మాయాంగనామణీమహితాకృతులను
వచ్చి చేరియు రాణివాసంబులోన
సొంపుగాఁ బాడిరి శుభగీతములను;
వారిసంతోషాన వారలు మునిఁగి
యెవ్వ రాస్త్రీల గ్రహింప లేరైరి.
ఎవ్వరి నెవరు గ్రహింపఁగాఁగలరు?-
తత్పరబ్రహ్మావతారుఁ డైనట్టి
యావరునకు శుభహారతు లీయఁ
బ్రతికాంత యానందపారవశ్యమున
నరుగుచున్నట్టిమహాసమయమున!
క్రమభేరీధ్వనుల్, కలగానరవము,
పుష్పవర్షంబులు పొసఁగె; సర్వంబు
శోభాయమానమై చూపట్టె మిగుల.
ఆనందకందమా నారామచంద్రు
దర్శించి సర్వకాంతలు స్వాంతమందు
హర్షంబుఁ జెందిరి; యాసతీమణుల
యంబకాంభోజద్వయంబున నిండెఁ
బ్రేమాంబుకణములు; శృంగారవిలసి
తాంగంబులను బులకావళి పొడమె.
పెండ్లికుమారునివేషమం దున్న
శ్రీరామచంద్రు దర్శించి స్వాంతమున
నాసీతమాతయా నామహారా జి
పొందినయానందమును దుదముట్ట
వేయి శేషులు మఱి వేయిశారదలు
నూఱుకల్పము లైన నుడువఁగా లేరు.
అది శుభసమయం బటంచుఁ దలంచి
నేత్రపద్మంబుల నీ రాపుకొనియు,
నారాణి ముదమున హారతు లొసఁగి
వేదకులాచారవిధు లెల్లఁ దీర్చె.

* పంచశబ్దధ్వనుల్ వరభద్రగాన
ములు చేయఁగాఁబడె ముదము దీపింప.
బహువిధపటములు పఱచఁగాఁబడియె
మార్గంబునందున మంజులరీతి;
హారతు లిచ్చిన యాయనంతరము
పాద్య మర్పింపఁ గాఁబడియె రామునకు.
అంత రాఘవుఁడు కల్యాణమండపముఁ
జేర బయల్దేరె శృంగార మొలుక.
బహుసమాజముతోడ భ్రాజితుండైన
దశరథధారుణీధవువైభవంబుఁ
గాంచి లోకేశులుఁ గడుసిగ్గుపడిరి.
అప్పుడప్పుడు దేవతావళి యెల్ల
గురిపించుచుండిరి కుసుమవర్ష ముల.
అవనీసురులు సమయానుకూలముగఁ
జదువుచుండిరి శ్రావ్యశాంతిపాఠముల.
నభమున నగరమున న్విజృంభించె
నమితకోలాహల, మారోదలోన
నెవరిమాటలు వారికే వినరాక
పోయెను, బరవాక్యములఁగూర్చి యేల?
అటులఁ బ్రవేశించె నారామవిభుఁడు
మండితకల్యాణమండపస్థలిని.
ప్రక్షాళనముఁజేసి పాదపద్మముల
శ్రీరాము నుపవిష్టుఁజేసి రం దున్న
దేదీప్యమానమౌ దివ్యాసనమున.
శ్రీరాము నట్లు లాసీనుఁ గావించి
హారతు లిచ్చె నయ్యఖిలజనంబు;
వీక్షించి సర్వ లాపెండ్లికుమారు
నానందమందుచు స్వాంతరంగముల
మణివస్త్రభూషణమండలంబులను
బైనఁజల్లిరి వర్ష పాతంబు ఓలె.

సుందరీమణు లంత శుభగీతికలను
బాడిరి పరవశత్వము గల్గురీతి.
బ్రహ్మాదిసురవరుల్ బ్రాహ్మణాకృతుల
వచ్చి కౌతుకమునఁ బరికించుకొనుచు
రఘుకులకమలసూర్యస్వామి యైన
శ్రీరామచంద్రునిశృంగార మరసి
తమజీవితంబు సార్థక మయ్యె ననుచుఁ
దలఁచి రాహా! భరద్వాజమునీంద్ర!
అటఁ గలభటనటు లంబష్ఠకులును
గరదీపికాంచితగణము లచ్చోట
నారామునైఁ జల్లి నట్టివస్తువుల
స్వీకరించియు, మ్రొక్కి శిరముల వంచి,
పరమసంతోషసంభరితాత్మ లగుచు
నాశీర్వదించిరి యామహాభాగు.
వైదికలౌకికపద్ధతు లెల్ల
నాచరించినయంత నతిప్రీతితోడ
జనకభూపాలదశరథరాజేంద్రు
లుభయు లాలింగన మొనరించుకొనిరి.
ఆ యేకమైన మహారాజమణుల
యుజ్జ్వలదృశ్యంబు నుపమించుకొఱకుఁ
గవిజనుల్ సలిపియు ఘనయత్నకోటి
యపజయం బొంది లజ్జాన్వితు లైరి.
ఏ యుపమము లభియింపక వారు
భంగంబుఁ జెందియు, "వారికి వారె
యాన్యపాలురు సము"లని యెంచుకొనిరి.
వారిర్వురకు మధ్య భాసించుచున్న
బాంధవప్రేమానుబంధంబుఁ జూచి
ముగ్ధమై దేవసమూహంబు పైనఁ
గురియంగఁజేయుచుఁ గుసుమవర్ష ములఁ
బాడసాఁగెను వారి భవ్యయశంబు.

---

* పంచశబ్దములు : 1. వీణానిక్వణము, 2. కరతాళరవము, 3. తాళరవము, 4. భేరీస్వనము, 5. బాకాశబ్దము.
* పంచధ్వనులు : 1. వేదధ్వని, 2. వందిధ్వని, 3. జయధ్వని, 4. శంఖధ్వని, 5. దుందుభిధ్వని.

"ఏనాఁడు విధి సృజియించె నీజగతి
నానాఁటినుండియు, నఖిలస్థలాల
బహువివాహంబులఁ బరికించినాము,
విన్నాము, గాని యీవిధమైనపెండ్లి
సర్వవిధంబుల సరిసమమైన
యుభయపక్షముల వెల్లొందువైభవము
లతికినయిట్టివియ్యంకులజోడు
నీనాఁడె కన్నార మీపరిపంచమున."
అని సుర లాడుమహారమ్యసత్య
వచనముల్ విని, యిరుపక్షబృందములు
పరమానురాగసంభరితంబు లయ్యె.
పఱపించి రత్నకంబళుల మార్గమున
నర్ఘ్యపాద్యముల సమర్పించి, పూని
జనకమహారాజు స్వయముగాఁ దానె
దశరథధారుణీధవుఁ గొనితెచ్చె
మహితాదరమ్మున మండపస్థలికి.
ఆమండపములోని యత్యంతచిత్ర
రచనావిశేషముల్ రామణీయకత,
మునిమనంబులఁగూడ మోహింపఁ జేసె.
జ్ఞాననిధానమా జనకభూవిభుఁడు
చేఁజేత స్వయముగా సింహాసనములఁ
గొనితెచ్చి పూజ్యులఁ గూర్చుండఁజేసె.
తనయులువేల్పుచందమున వసిష్ఠుఁ
బృథుభక్తిఁ బూజించి వినతిఁ గావించి
యామహాపురుషునియాశీస్సు లొందె.
మఱియు నాకౌశికు మానవాధీశుఁ
డర్చించెఁ గొఱలేని యధికసద్భక్తి
యది వర్ణనముసేయ నలవిగా దహహ!
సమ్మదితాత్ముఁడై జనకభూమీశుఁ
డల * వామదేవముఖ్యర్షులఁ గొలిచి
యందఱి కిచ్చి దివ్యాసనప్రతతి
నామునిసింహుల యాశీస్సు లొందె.
తదుపరి జనకుఁడు దశరథభూపు
నీశ్వరసమునఁడని యెంచి చిత్తమునఁ
బూజఁగావించి సంపూర్ణసద్భక్తిఁ
గరములు జోడించి కడువినయమున
దశరథరాజబాంధవ్యంబుచేతఁ
దనకుఁ గల్గిన మహోత్తమభాగ్యవిభవ
ములఁ బ్రసంగించె సమ్మోదంబు దనర.
పెండ్లికుమారునిబృందంబు నెల్ల
దశరథసమముగాఁ దలఁచి పూజించి
యాదరం బొప్ప నాజనకుఁ డందఱిని
నుపవిష్టులను జేసె నుచితాసనముల.
తన్మహీపతిసమాదరభావ మెల్ల
నే నేకముఖముతో నెట్లు వర్ణింతు?
దాన, మాన, వినమ్రతావరోక్తులను
వరునివైపునఁ గలవారి నందఱను
జనకమహీపతి నన్మానపఱచె.
శ్రీరామమహిమ నెఱింగినయట్టి
బ్రహ్మవిష్ణుమహేశభానుదిక్పతులు
కపటవిప్రోత్తమాకారంబు లూని
యాకౌతుకమునఁ గాంచి రతిహర్షమునను.
దేవత లని వారు తెలియకుండినను
జనకమహీపతిసదమలభక్తి
సురసమదృష్టితోఁ జూచియు వారి
నర్చించి యొసఁగె దివ్యాసనంబులను.
ఎవరి సంగతి వారలే విస్మరింప
నెవ్వరు గుర్తింతు రెఱుఁగు నెవ్వరిని?
ఆనందకందమా నా పెండ్లికొడుకుఁ
గాంచియు నుభయపక్షంబులవార

---

* వామదేవుఁడు = దశరథుని వేఱొక పురోహితుఁడు.

లానందమయు లై రి; యఖిలజ్ఞుఁడై న
యా రామచంద్రుఁ డయ్యమరుల నెల్ల
గ్రహియించి మానసికముగఁ బూజించి
యర్పించెఁ దా నుచితాసనంబులను.
చూచి రాముని శీలసుస్వభావముల
విబుధులు ప్రముదసంభృతచిత్తు లై రి.
శ్రీరామచంద్రుని శ్రీముఖచంద్ర
సౌందర్యమును సులోచనచకోరములు
పానంబుసలిపెను బరమాదరమున
ననురాగపారవశ్యంబులతోడ.
సుముహూ ర్త మరుదేరఁ జూచి వసిష్ఠ
ముని, శ్రీశతానందముని కాదరమునఁ
గబురంప నాతఁడుఁ గడుఁబ్రీతి వచ్చె.
"వేగ మీ రేగియుఁ బెండ్లికుమారి
నిటకుఁ దేవలయు నిదే" యన వినియుఁ
జనియె నాతఁడు ప్రహృష్టస్వాంతుఁడగుచు.
ఆపురోహితువాణి నాలించి రాణి
పరిజనయుతముగాఁ బరగ హర్షించి
విప్రవధూకులవృద్ధులఁ బిలువ
వారు కులాచారపద్ధతుల్ సలిపి
మంగళగీతముం బాడి రింపుగను.
వరనరస్త్రీలరూపంబులఁ బూని
వచ్చియుండినసురవరభామ లెల్ల
నైజమై వెల్గుసౌందర్యంబుఁ గల్గి
నవయౌవనముతోఁ గనంబడుచుండ్రి.
జనకునిరాణివాసస్త్రీజనంబు
వారలఁ గాంచి సంబర మొందె నాత్మ.
ఎవ్వ రాకాంతల నెఱుఁగకుండినను
బ్రౌణాధికంబుగా వారలఁ గనిరి.
ఆనూతనస్త్రీల నామహారాజ్ఞి
యెంచి, యుమారమాశ్రీశారదలుగ
మరలఁ దా మరల సన్మానం బొనర్చె.

త్కన్యసుత నంత సింగారించి వార
లా మెచ్చుట్టును మండలాకృతి నిలిచి
చేర్చిరి మండపసీమలో ననఘ!
మంగళవస్తుసమంచిత లగుచుఁ
జెలులును దక్కి-నస్త్రీసమూహంబు
లాదరంబున మండపాంతరంబునకు
త్కన్యసుత న్దెచ్చిరి సాదరంబునను.
ఆసీత వెనువెంట నరుదెంచినట్టి
సర్వాంగనలు మహాసౌందర్యమణులు
షోడశాలంకారశోభితల్, మత్త
గజగామినులు; వారికలగానములను
విని మునిజనములు విడిరి ధ్యానముల;
కామునికోకిల కడు లజ్జ నొందె.
మంజీరనూపురమణికంకణముల
మంజులక్వణములుం బాటలతోడఁ
దాళముల్ వైచు విధానంబుఁ జెలఁగె.
సహజశోభావతి, జనకజ, సీత
యావనితాబృందమందు వెల్గొందె
ఛవిగణంబులమధ్య సంభాసురిల్లు
క్రమమనోజ్ఞ తాకారంబువోలె.
సీతామహాదేవి శృంగార మెన్న
వర్ణనాతీతమై భాసిల్లుచుండె.
అస్మన్మనశ్శక్తి యత్యల్ప మెన్న
నాసీతసౌందర్య మతిగభీరంబు.
సౌందర్యరాశియు, సర్వప్రపూత
యగు సీత వచ్చుట నరసి యావరుని
పక్షమందలిపెండ్లివా రెల్ల హృదినిఁ
బ్రణతు లర్పించి రాప్రవిమలాకృతికి.
శ్రీరామచంద్రుఁ డాసీతను గాంచి
సంపూర్ణకాముఁడై సంతోష మొందె.
దశరథభూపతితక్కి-నసుతులు
సమ్మోద మొందిరి స్వాంతరంగముల;

అకథనీయము వారియాత్మహర్షంబు.
పుష్పముల్ గురిసిరి ప్రమొక్కి దేవతలు,
మంగళాశీస్సుల మానులు పలుక,
గురుగాననిస్సాణకోలాహలంబు
భూనభోంతరములఁ బూరితం బయ్యె
అఖిలనారీనరు లాసమయమునఁ
బ్రేమప్రమోదసంభృతచిత్తు లైరి.
సీత యీవిధిఁ బ్రవేశించె నాతఱిని
మంజులకల్యాణమండపమందుఁ
బ్రముదితమునివరుల్ పఠియించుచుండ
శాంతిపాఠంబుల శ్రావ్యకంఠముల.
కులగురు లుభయులుఁ గూడి యంతటను
నిర్వహించిరి సర్వనిగమో క్తవిధుల
నవసరక్రియలఁ గులాచారవిధుల.
ఆచరించియును వంశాచారవిధుల
సలుప గౌరీగణేశ్వరపూజనముల
భూసురులను ముదంబున నియోగించి
రావసిష్ఠుండు శతానందబుషియు.
ప్రత్యక్షముగఁ బూజఁ బడసి దేవతలు
నతిహర్ష మొప్పఁగా నాశీస్సు లిడిరి.
అల మధుపర్కంబు లాదిగాఁ గలుగు
మంగళద్రవ్యసమాజంబు లెల్ల
నేసమయంబున కేది కావలెనో
మును లెంచి నంతనే మునుముందుగానె
ఆయాపదార్థంబు లన్నియుఁ గలుగుఁ
గనకపుఁబళ్ళెముల్ కలశముల్ పూని
పరిచారకులు సిద్ధపడుచుండి రచట.
సూర్యుఁడు స్వయముగా సుప్రీతితోడ
నిజకులాచారపునీయతులు తెలుప
నవి యన్ని నడిపిరి యాదర మొప్ప.
సీతచే సురపూజ చేయించి యిటుల
నామెను సుభగసింహాసనంబందుఁ
గూర్చుండఁ జేసిరి గురుమునీశ్వరులు.
తాపసప్రవర! సీతారామవిభుల
యన్యోన్యవీక్షణాత్యాసక్తి వెలుఁగు
నాపరస్పరనిగూఢాద్భుతప్రేమ
నెవ్వైనఁగాని గ్రహింపఁగా లేరు.
వరమనోబుద్ధులు వాక్కులు దాని
నందుకోఁజాలవే, యట్టిచో నెటులఁ
గవి దానిఁ బ్రకటింపఁగలుగు? మునీంద్ర!
హోమవేళను వీతిహోత్రుండు దానె
ప్రత్యక్షముగ నిల్చి పరమహర్షమున
నాహుతుల్ గ్రహియించె; నఖిలవేదములు
బ్రాహ్మణాకృతుల వివాహసద్విధుల
నన్నిటి నడిపె మహర్షివర్యా!
భాసురజనకభూవరుపట్టమహిషి
తజ్జగజ్జనని సీతాదేవి మాత
నభివర్ణనముసేయ నలవియే జగతి?
సుయశ, స్సుకృత, సుఖ, సుందరత్వముల
నన్నిటి వెచ్చించి యైక్యం బొనర్చి
విరచించెను విరించి వెలయ నాసతిని.
సమయం బెఱిఁగియు సంయమీశ్వరులు
నామెను కొనతెచ్చు టవసరం బనఁగ
ముత్తైదువలు విని పోయి యాసతినిఁ
గైకొని వచ్చిరి కడుఁ గారవమున.
జనకునివామపార్శ్వంబున నపుడు
'సునయన' మిక్కిలి శోభిల్లుచుండె
నగపతిచెంత మేనకచందముగను.
శ్మశ్రీపతి రాజ్ఞియు సంతోషపడుచు
సుచిరసువాసనాశుభజలపూర్ణ
కాంచనకలశముల్, ఘనమణిఖచిత
పాత్రంబులను స్వీయపాణులఁ దెచ్చి,
యుంచి రారామరఘూత్తముముందు.
హృష్టకంఠముల మునీశ్వరవితతి

పలియించుచుండిరి భవ్యవేదముల.
ఆకసమందుండి యాసమయమునఁ
గుసుమవర్ష ంబులుఁ గురియంగ సాఁగె.
అంతట వరునిఁ గన్యాచాత లరసి
యనురాగపూర్ణులై యంతరంగముల
నాతనిభవ్యపాదాంబుజద్వయినిఁ
గడుగసాఁగిరి తమకరములతోడ.
వార లాశ్రీరామపాదపద్మములఁ
గడుగసాఁగిరి మెల్లఁగా స్నేహ స్తములఁ
బులకింపఁగాఁ దనువులు ప్రేమవశత.
నభమునందునను, దన్నగరిలోఁ జెలఁగు
కలగాననిస్వాణఘనజయధ్వాన
మఖిలదిగ్గర్భంబులందున నిండె.
పావనం బైన యేపాదయుగ్మంబు
కామారిహృద్ఘనకాసారమందు
వెలుఁగొందుచుండునో విడువక యెప్ప,
డొకసారియైనఁ దా ముల్లంబులోన
వేసి నెంచఁగఁ జిత్తవిమలతఁ గలిగి
కలికలుషము లెల్లఁ గాలి నశించు,
వేనిస్పర్శముచేతఁ బృథుపాపకలిత
ముఁనిపత్ని పొందెనో మోక్షపదంబు,
వేనియందునఁ బ్రభవించినమధువు
శిరమున ధరియించు శివుఁడు; దేవతలు
పరమపావన మంచుఁ బలుకుచుండెదరో,
వేనిపైఁ దమమనోభృంగముల్ నిలిపి
మునివరయోగిసమూహంబు లెల్ల
నభిమతగతి సిద్ధి నందుచుండెడినో—
ఆ రామచంద్రునియడుగుకెందమ్మి
లతిభాగ్యభాజనుం డగుజనకుండు
ప్రక్షాళనముఁజేసెఁ బరమానురక్తి
సకలదిశోద్భూతజయజయధ్వనుల.
అల వధూవరులకరాబ్జముల్ కలిపి
కులగురు లిద్దఱుఁగూడియు, నుభయ
వంశక్రమంబుల వచియించి రంత.
పాణిగ్రహణమును బాగుగాఁ జూచి
అజసురనరమును లందఱుఁగూడ
నానందభరితాత్ము లైరి ముసీంద్ర!
ఆనందమూలమా నావరుఁ గాంచి
యాదంపతులు పులకాంగు, లత్యంత
సంతోషపారవశ్యస్నిగ్ధు లైరి.
వైదికలౌకికపథవిధుల్ తీర్చి
నృపభూషణం బగుశ్రీజనకుండు
సలిపెఁ గన్యాదానసత్కార్య మెన్న.
హిమవంతుఁ డాగౌరి నీశున కటుల,
నల సముద్రుఁడు శ్రీని హరి కిచ్చినటుల
సీతాకుమారిని శ్రీరామున కిడి
యతులితాపూర్వదిగంతవిశ్రాంత
కలయశంబును జనకప్రభు వొందె.
జనకభూవిభుఁడు విజ్ఞాపనం బొసఁగఁ
జాలకపోయె, నాశ్యామలమూర్తి
తనవిదేహాఖ్యసార్థక మొనరింప.
హోమముల్ చేయ విధ్యుక్తవిధాన
నావధూవరుల వస్త్రాంచలంబులకు
బ్రహ్మముడుల్ వేయఁబడియె, నా పిదప
నగ్నిప్రదక్షిణం బాచరింపంగ
సాగి రాదంపతుల్ సంయమివర్య!
వరజయస్వనముల, వందికీర్తనల,
వేదగానంబుల భేరికాధ్వనుల
భూరిమంగళగానములను విన్నంత,
సంతోష ముప్పొంగఁ జతురు లౌసురలు
సురతరువులనుండి సుమవర్ష ములను
వర్షింపసాఁగిరి వసుధాస్థలమున.
అందంబు లొలికెడియడుగులతోడ
నావధూవరు లిద్ద ఱగ్నిహోత్రునకుఁ

జేయుచుండఁగఁ బ్రదక్షిణమును సభ్యు
లాదివ్యదృశ్యంబు నాదరం బొప్పఁ
గాంచిరి కనులకుఁ గడు విందుఁగొల్ప.
అతిమనోహర మగునామిథునంబు
వర్ణనాతీతమై భాసిల్లుచుండె.
ఏయుపమానము నెంచి చూచినను
సముచితరీతిగా సరిపోవ దెదియు.
పృథుమణిస్తంభబింబితములై నట్టి
జానకీరాముల చారురూపంబు
లిల రతీమదను లనేకరూపముల
ననుపమరామకల్యాణోత్సవంబుఁ
గాంచుచున్న తెఱఁగు గానఁగా వచ్చె.
వారల లాలసత్వంబు, లజ్జయును
రెండును ఘన మైనరీతి నున్నట్టు
లొకసారి కనిపింతు రొకసారి కాను
పింపక మరలఁ గన్పించుచుండెదరు
ఆనందమగ్నులై యది చూచినట్టి
సర్వసదస్యులు జనకుఁడువోలెఁ
దముఁ దాము మఱచిరి తాపసవర్య!
ముదితాత్ములగుచును మును లావిధాన
నాదంపతులచేత నగ్నిహోత్రునకు
చేయించియును బ్రదక్షిణము లాపయిన
పెండ్లికట్నములతో విధుల నన్నిఁటిని
సలిపిరి, శ్రీరామచంద్రుఁ డంతటను
సీతాముఖంబున సిందూర మలఁదె.
అకథనీయం బహో! ఆదృశ్యశోభ.
సిందూర మలఁదెడిశ్రీరామహస్త
మరుణరజోభరితాంబుజం బటులఁ
జంద్రసుధాలుబ్ధసర్పంబువోలె
భాసిల్లె నోభరద్వాజమునీంద్ర!
అంత వసిష్ఠునియనుశాసనమున
నింపుగాఁ గూర్చుండి రేకాసనమున
నాజానకీరాము లావధూవరులు.
ఉజ్జ్వలాసనమున నుపవిష్టు లైన
జానకీశ్రీరామచంద్రులఁ గాంచి
దశరథనృపతి సంతస మొందె హృదిని.
ఫలుమాఱుఁ దనువెల్లఁ బులకరింపంగఁ
దనపుణ్యదేవతాతరువు ఫలించి
నట్టులఁ గనుఁగొనె నావధూవరుల.
సర్వలోకంబుల సంతోష మెసఁగె
నాయెను రామకల్యాణ మటంచు
సర్వులు పలికిరి సంతోషపడుచు

లక్ష్మణభరతశత్రుఘ్నులవివాహములు

ఆయపారం బగునానంద మహహా!
తుదమొట్ట నొక జిహ్వతోడ నేరీతి
నెవ్వఁడైనను వచియింపఁగాఁ గలఁడే?
అంతట శ్రీవసిష్ఠాజ్ఞఁ గైకొనియు
జనకమహారాజు సౌధంబులోనఁ
బెండ్లికూఁతుండ్రు గావింపఁగాఁబడిన
మాండవి, శ్రుతకీర్తి, మఱియు నూర్మిళను,
దనపుత్రికలను సాదరత రావించె.
తనతమ్ముఁ డగుకుశధ్వజమహారాజు
ప్రథమకుమారియై భాసిల్లుచున్న
సద్గుణసౌశీల్యసంతోషరూప
మహితశోభామయి మాండవిన్ భరతు
నకిడి కల్యాణ మొనర్చి హర్షించె;
సర్వవిధ్యుక్తముల్ సలిపి సంప్రీతి
సీతామహాదేవి చెల్లెలై నట్టి
యూర్మిళాదేవి సముజ్జ్వలసర్వ
సుందరీమణి యౌచు శోభిల్లుచుంట
లక్ష్మణున కిడి కల్యాణం బొనర్చె
సకలమహోన్నతసన్మానవిధుల;
అఖిలగుణాలయ, యబ్జాక్షి, సుముఖి

సౌందర్యసౌశీల్యసంపన్న యైన
యాశ్రుతకీర్తి నయ్యవనీశుఁ డంత
శత్రుఘ్ననకుఁ బెండ్లి సలిపె మోదమున.
అనురూపసంబంధ మందుటఁ గాంచి
యావధూవరులు లజ్జాన్వితు లైరి.
ఆంతర్యములను బ్రహర్షంబు మీఱ
నాదంపతులశోభ నరసి సర్వులును
సమ్మోద మొందిరి స్వాంతంబులందుఁ
గుసుమవర్ష ంబులఁ గురిసిరి సురలు.
వరవరో పేత లావరవధూమణులు
నట నేకమండపమందు రాజిలిరి
జీవహృత్స్థలిని రాజిలునిజనాథ
♦ సంయు క్తచతురవస్థలచందముగను.
నలుగురు కోడండ్ర నలుగురు సుతుల
నాయయోధ్యాపతి యరసి హర్షించె;
సముచిత † సాధనసంయుతంబుగను
* బురుషార్థములు నాల్గు పొందినరీతి
నారాజమణి నిర్భరానంద మొందె.
అల రామకల్యాణమటులనే జరిగె
మిగిలినయట్టిసుమిత్రాకుమార
భరతశత్రుఘ్నవివాహోత్సవములు.
అపు డీయఁబడినవేయాఁటుకట్నములు
వర్ణ నాతీతమై పఱఁగుచు నుండె.
మణిహేమమయ మయ్యె మండపం బెల్ల.
కంబళంబుల, మహోఘనతరామూల్య
చిత్రచిత్రాద్భుతచీనాంబరముల,
గజరథతురగసంఘంబుల, మటియు
దాసదాసీజనతతుల, ననేక
ఘనతరాలంకృతకామధేనూప
మానగోగణముల, మానితాగణ్య
వర్ణ నాతీతసద్వస్తుజాలముల
నెన్ని యో మైథిలుఁ డిచ్చెఁ గట్నముగ.
కండ్లతో వానినిఁ గాంచినఁ గాని
యెవరైనఁ గొంచె మూహింపఁ గల్లెదరు.
లోకపాలకు లవలోకించి వానిఁ
జెందిరి విభ్రాంతిఁ జిత్తంబులందు.
ఆయయోధ్యాపతి యాకట్నములను
సానందముగ వాని నన్నిటిం గొనుచు
యాచకావళికి సమర్పణచేసెఁ
గోరినవారికిఁ గోరినరీతి.
అట్లు దానము చేయ నావల మిగిలి
నట్టివస్తువు లెల్ల నటఁ బెండ్లివారి
వాసంబులకుఁ జేర్పఁబడియె; నంతటను
బెండ్లికుమారులబృందంబు నెల్లఁ
గరముల జోడించి గౌరవించియును,
మృదువచస్సుల జనకేంద్రుండు పలికె.
ఆదరణమున దానావళిచేత
వినయంబుచేతను వినుతులచేతఁ
బెండ్లివారల నెల్లఁ బ్రీతి వెలుంగ
మైథిలుం డపుడు సన్మానం బొనర్చి,
యానంద మొప్ప మహామునితతిని
భక్తియు శ్రద్ధయు వఱలఁ బూజించి
ప్రణతు లర్పించి; దేవతలకు మ్రొక్కి,
"సురసాధువులు కాంక్షు శుద్ధభావమునె,
దోసెఁడు నీటికే తోషించు జలధి"
యని వినుతించె బద్ధాంజలి యగుచు.
అంతట జనకేంద్రుఁ డతనిసోదరుఁడు
భక్తిశుద్ధాంజలిబద్ధుఁ డై నిలిచి

♦ చతురవస్థలు = జాగ్రత్స్వప్నసుషుప్తితురీయములు. వాని అధిపతులు = విశ్వతైజసప్రాజ్ఞాంతర్యాములు.
† సాధనలు = యజ్ఞదానతపోయోగములు.
* చతుర్విధపురుషార్థములు = ధర్మార్థకామమోక్షములు.

పలికిరి కోసలపతితోడ నిటుల
సుస్నేహ, సౌశీల్య, శుద్ధస్వభావ
మయమనోహరవచోమాధుర్య మెసఁగ:
"భవదీయదివ్యసంబంధంబుచేత
మే మన్నివిధముల మేదినీనాథ!
ఉన్నతస్థానంబు నొందినా మిపుడు
రాజ్యంబు మాదుసర్వస్వంబు నీవె!
మము మీభటుల మని మతి నెంచుకొనుమ.
ఈదారికలను గ్రహించియు నీదు
పరిచారికలుగను బాలింపు మనఘ!
సతము వాత్సల్యరసంబు వర్షించి.
నాయపరాధంబు నాథ! మన్నింపు
మిటకు రప్పించి మి మ్మేను మహాత్మ!
సాహసకార్యంబు సలిపినవాఁడ."
అన విని భానుకులాభరణుండు
జనకభూపాలునిసకలసన్మాన
ములు నాదరించెను ముదము దీపింప
ఆదశరథజనకావనీపతుల
విమలపరస్పరవినయాతిశయము
వర్ణనాతీతము. వారు భాసిలిరి
ప్రేమప్రపూరితహృదయాబ్జు లగుచు.

కుసుమవర్షంబులు గురిసిరి సురలు;
దశరథన్నపుఁ డంతఁ దరలెను, దాను
బరిజను లుండినవాసంబుఁ జేర
వరభేరికాజయధ్వానసమ్మిళిత
మహితవేదనినాదమధ్యమునందు.
నభమున జనకుని నగరంబులోన
నుద్భటానందమహోత్సవం బెసఁగె.
అంత మునీశ్వరుం డైనవసిష్ఠు
నాజ్ఞను గైకొని యచ్చటినుండి
చారుసఖీజనసంఘంబు లెల్లఁ
దద్వధూవరుల నందఱఁ దీసికొనియుఁ
బోయిరి కులవేల్పుపూజలు చేయు
భవనంబునకు భరద్వాజమునీంద్ర!
మాటిమాటికిని రామప్రభువైపు
సీత క్రేఁగంట వీక్షించుచు, మరల
బిడియంబుచేఁ జూడ వెనుకాడుచుండె
నెదలోని ప్రణయేచ్ఛ యెంత వద్దనిన.
ప్రేమపిపాసచేఁ బీడింపఁబడెడి
యామెచక్కనికన్ను లలరారుచుండె
మీనుసోయగమును మించి, జయించి.

శ్రీరామచరితమానసము

బాలకాండము

ఏకాదశవిశ్రామము

జయ జయ! రిపుగజసింహా!
జయ జయ! సమ్మార్జితస్వజనఘోరాంహా!
జయ భక్తావనరంహా!
జయ జయ శ్రీ మట్టపల్లి చండనృసింహా!

ఆరామచంద్రునిశ్యామలాంగంబు
సహజసంభాసురసౌందర్యనిలయ
మాశోభ కోటి యనంగుల గెలుచు.
మునిమనోమధుపసమ్మోహనం బైన
పారాణిఁ బూసినపదపద్మయుగ్మ
మమితమనోజ్ఞమై యలరారుచుండె.
విమలాతివిమలమౌ పీతాంబరంబు
తత బాలభానుసౌదామినీద్యుతుల
మించియు మేనిపై మెఱయుచు నుండె.
కలకింకిణీయుతకటిసూత్ర మరయ
నమితమనోహరం బై వెలుఁగొందె.
బహుభూషితుఁడు, దీర్ఘ బాహుఁడౌ వాని
చేతిప్రవేలికి విరాజిల్లునుంగరము,
పీతసువర్ణోపవీతంబు, వాని
సుందరాకృతి కతిశోభ నొసంగె.
ఎల్లరమతి హరియింపఁగాఁ గలుగు
నలవివాహపుభూషణావళితోడఁ
గాకుత్స్థవిభుఁడు శృంగారింపఁబడియె.
ఉరువక్షమందు వెల్గొంద ననేక
మహితభూషణములు మంజులరీతి,
మణులును మౌక్తికమాల లంచులను
ప్రవేలాడుపీతో త్తరీయంబు పైన
వల్లెవాటుగ నుంచఁబడి మెఱయంగ,
విచ్చినతమ్మిపై వెలుఁగునేత్రములు,
కలకుండలంబులు కదలుకర్ణంబు,
లఖిలశోభకు నిలయం బైనముఖము,
చక్కనికనుబొమల్, సంపంగిమొగ్గ
యనఁగఁ దోఁచెడి మనోహరనాసికయును,
జక్కఁదనమునకు సదనమై వెలుఁగు
తిలకంబుఁ దాల్చినదివ్యఫాలంబు,
మంగళమౌక్తికమణిగణస్థగిత
కమనీయకల్యాణఘనకిరీటంబు
గలశీర్ష మొప్ప రాఘవుఁడు భాసించె.
కలమణుల్ పొదిగినఘనకిరీటంబు
నఖిలాంగములు మనోహగములై వెలిఁగె.
నాకనారీమణుల్ నగరాంగనలును
బెండ్లికుమారుని వీక్షించి తృణము
ప్రతెంపివై చిరి పోవ దృష్టిదోషంబు;
మణివస్త్రభూషణమండలిం జుట్టు
త్రిప్పియు వెదఁజల్లి, దివ్యహారతుల
సొంపుగాఁ బాడిరి శుభగీతములను;
కుసుమవర్షంబులఁ గురిసిరి సురలు;
వందిమాగధసూతభటులుఁ గీర్తింప
ముత్తైదువలు మది ముదము వెలుంగఁ

బెండ్లికుమారులఁ బెండ్లికూఁతుండ్రఁ
నిలుఁవేల్పులను గొల్చుగృహమునఁ జేర్చి
భద్రగీతంబులం బాడుచు మిగులఁ
బ్రీతితో లౌకికవిధు లొనరింప
సాఁగిరి, హరిభక్తసంఘవరేణ్య!
అంతట విందులో, నద్రికుమారి
సీతకు బువ్వను జెలిమితోఁ బెట్టు
రీతి బోధించెను శ్రీరాఘవునకు;
శ్రీరామునకు ముద్ద సీత నొసంగఁ
గోరెను శారద కూర్మి దీపింప.
హాసవిలాసరసానందమగ్న
మయ్యెఁబో యంతఃపురాంగనాగణము.
ఆత్మజన్మైకధన్యతఁ గాంచి రెల్ల
వనితామణులు భరద్వాజమునీంద్ర!
తనపాణిమణిని సీతాదేవి చూచి
సౌందర్యనిధి రామచంద్రబింబమును,
విరహభయోద్వేగవివశాత్మ యగుచు
నిజభుజవల్లిని నేత్రపద్మములఁ
గదలింప వెఱఁగంది కదలాడు టూపె.
ఆవిలాసవినోదహర్షానురక్తు
లభివర్ణనముసేయ నలవియో యవ్వి
జానకీప్రియసఖీజనులకే యెఱుక.
అంత నాప్రియసఖు లాకమనీయ
దంపతులనుఁ గొని తరలిరి వారి
బృందంబు లుండిన విడిదికి, నపుడు
నినదించె దీవెనల్ నిఖలదిక్కులను.
నభమునఁ, బురి మహానందంబు చెలఁగె:
"ఈదంపతులు నల్లు రీధరాస్థలిని
జిరజీవు లౌచు భాసింతురుగాక!"
అని వచించిరి సర్వు లాహ్లాదపడుచు.
ఇఁక రాముఁగాంచి యోగీంద్రమునీంద్ర
సిద్ధబృందారకశ్రేష్ఠు లందఱును
ప్రేమాయఁజేయుచు దుందుభుల నభంబందుఁ
బ్రసవవర్షముల హర్షమున వర్షించి
జయజయజయజయస్వనములతోడ
నిర్మించిరి నిజనిజలోకములకు.
నిజవధూటీసమన్వితు లౌచు రాజ
తనయులు చేరిరి తండ్రిసన్నిధికి.
శోభాశుభానందసుభరిత మగుచు
నలరారుచుండె నాయోవాస మెల్ల.
అంతట జనకమహారాజమౌళి
పెద్దవిం దొకటి గావింపఁగాఁ జేసి
పెండ్లివారల నెల్లఁ బిలిచె భుజింప.
సుతసమేతంబుగా క్ష్మోణీవిభుండు
దశరథుఁ డేగుపథంబునం దెల్లఁ
బఱచఁగాఁ బడె ననుపమకంబళములు.
సర్వులపదములు సాదరంబుగను
ప్రక్షాళనము చేయఁబడినయాపిదప
నందఱు పీఠములందుఁ గూర్చుండ్రి
తమయోగ్యతలకును దగినవిధాన.
జనకుఁ డయోధ్యేంద్రుచరణపద్మములఁ
గడిగె నాతనిశీలగరిమ, స్నేహంబు,
వర్ణనాతీతము పరమమునీంద్ర!
ఆపయి, శివునిహృదబ్జమధ్యమున
భాసించునారామపాదపద్మములఁ
గడిగె నానరపతి కడుప్రీతితోడ
నంత నదేరీతి నాజనకుండు
తక్కిన ముగ్గురు తమ్ములయడుగుఁ
దమ్ములఁ గడిగెను దా స్వయంబుగను.
శ్రీరామసము లని చిత్తమం దెఱిఁగి
యుచితాసనంబుల నొసఁగి యందఱకుఁ
రావించె వంటవారల నెల్ల నృపతి.
మణిపర్ణములఁజేసి మంజులంబుగను
బంగారుపుల్లలు పైనఁ గూర్చుచును

కుట్టినవి స్తళ్ళఁ గొమరొప్ప నటులఁ
బఱచిరి పం క్తులఁ బరమాదరమున.
సమధికాభ్యాసవిశారదు లైన
పాకకారులు వచ్చి బహుసత్వరముగ
సుందరస్వాదువిశుద్ధసూపాన్న
గోదధుల్ వడ్డింపఁ గూర్మి వెలుంగఁ.
బంచాహుతులఁ గొని ప్రప్రథమమునఁ
గడఁగిరి భోజనకార్యం బొనర్ప
శ్రవణం బొనర్చు 'సరస' గానములఁ
బరమానురాగసంభరితాత్మ లగుచు.
అల వచోఽతీతంబు లమృతతుల్యంబు
లగుబహురూపపక్వాన్నంబు లెల్ల,
వడ్డింపఁబడియెను వారు భుజింప.
చతురపాకజ్ఞులు చక్కఁగా నంత
వడ్డించి రెన్నెన్నో వ్యంజనావళిని
వానిఁ బేర్కొనుటకే వశము గాకుండె.
అలభక్ష్యభోజ్యలేహ్యములఁ జోష్యముల
వడ్డించి, రొక్కొక్కవస్తువునందుఁ
బలురకంబు లెసంగెఁ బలుక లేనన్ని.
రమణీయబహుళషడ్రసము లొక్కొకటి
యగణితవివిధరూపావళి గలవి
వడ్డింపఁగాఁబడెఁ బరమాదరమున.
భోజనం బగుచుంటఁ బూఁబోఁడు లరసి
వావియు వరుసల భావించుకొనియు
స్త్రీపురుషులపేళ్ళు చేర్చి పాటలను
బాడఁగాసాఁగిరి వర్షింపమధువు—
సమయానుకూలహాస్యము సముచితమె!
ఆపరిహాసంబు లాలకించియును
దశరథరాజును దత్సమాజంబు
ప్రముదంబు చెందియుఁ బ్రహసించి రిట్లు
తృప్తి గల్గఁగ భుజియించి రెల్లరును.
అంత నాచమనార్థ మాదర మొప్ప
వడ్డనఁజేసిరి పాత్రలన్ జలము.
అంతఁ దాంబూలంబు లర్పించి ప్రీతి
దశరథపతిని, నాతనిసమాజమును
బూజించె జనకుఁడు; ముదితుఁడై సకల
మానవేశ్వరశిరోమకుటాయమానుఁ
డాదశరథుఁ డేగె నావాసమునకు.
ప్రతిదిననూతోత్సవంబులు చెలఁగె
జనకుని నగరరాజంబునఁ గడచె
నిమిషంబు లటు దివానిశలు ముసీంద్ర!
ధరణీశమణి యగుదశరథరాజు
పెందలకడ నిద్ర వీడియు లేచె.
అతనిసద్గుణముల యాచకజనులు
సన్నుతిసేయఁగా సాఁగి; రాతండు
వరవధూయుతతనూభవులను గాంచి
వర్ణింపరాని సంబర మందె హృదిని.
ప్రాతఃక్రియల్ దీర్చి పరమప్రమోద
సత్ప్రేమపూరితస్వాంతంబుతోడ
గురువును రప్పించుకొని ప్రణమిల్లి
పూజించి యంజలి పూని యిట్లనియె
నమృతోపమానవాక్యంబులు గదుర :
"విను మునిరాజ : నా విన్నపం బొకటి,
త్వత్కృపామహిమచేతనె నేను నేఁడు
పూర్ణకాముఁడ నైతి భూసురవరుల
నందఱఁ బిలిచి మహాభాగ! యిప్పు
డర్పింపఁ జేయు సర్వాలంకృతంబు
లగుగోగణంబుల" నన విని గురువు
తన్మహీపాలునిఁ దాఁ బ్రశంసించి
ముదమునఁ బిలిపించె మునిబృందములను.
వామదేవుండు, దేవర్షి నారదుఁడు,
వాల్మీకిమునియు, జాబాలిమహర్షి,
కౌశికముఖ్యులౌ ఘనతపశ్శాలు
లగుమహామునివరు లరుదెంచి రంత.

అమ్మహాముని వర్యు లందఱ్ఱమోల
నరపతి దండప్రణామముల్ సలిపి
సప్రేమమునఁ బూజ సలిపి యందఱకు
నున్న తాసనముల నొసఁగినపిదప
సురభిని బోలినసొంపైన మంచి
నాల్గు లక్షుల గోగణముల దెప్పించి
యన్నివిధంబుల నన్నిటిఁగూడఁ
గడు సొంపుగా నలంకారంబు సలిపి
దానం బొసంగె ముదంబు దీపింప
సర్వమహీ దేవసంఘంబులకును.
పిదప నాతఁడు బహువిధమార్గములను
బ్రార్థనఁ గావించి పలికె "నీ నాఁడె
నాథా! ఫలించెను నాజన్మఁ" మనుచు.
ఆసూర్యవంశమహానందమూ ర్తి
యానంద మొంది విప్రాశీస్సు లొంది,
పిదప యాచకులను బిలువఁగాఁజేసి
కాంచనమణివస్త్రగజహయరథము
లడిగిన వారికి నడిగినరీతి
దానంబుసలిపె నౌదార్యంబు వెలయ.
అంత నాయర్థిజనానీక మెల్ల
నాతనిసుగుణకథాళిఁ బాడుచును,
"జయ జయ సూర్యవంశప్రభూ" అనుచు
జయరావములతోడఁ జనియె యథేచ్ఛ.
ఈప్రకారంబుగా నినవంశ్య రామ
ఘనవివాహోత్సవకార్యంబు జరిగె
నాసహస్రముఖాంచితాదిశేషుండె
వర్ణింపఁ జాలనిపగిది మునీంద్ర!
పలుమాఱు దశరథవసుధేశ్వరుండు
కౌశికమునిపాదకంజంబులందు
వినమితశీర్షుఁడై పృథుభ క్తితోడ
"నీసుఖమెల్ల మునీంద్ర! త్వదీయ
సత్కరుణాకటాక్షప్రసాదిత మె"
యని వచియించె, మహామునివర్య!
జనకునిశీలంబు, సదమలప్రేమ,
సంపదన్ క్రియలఁ బ్రశంసించె సర్వ
విధముల దశరథపృథ్వీధవుండు.
అనుదినం బుదయమే, యాయయోధ్యేంద్రుఁ
డడుగును సెలవు ప్రయాణంబుసేయ;
నలయక జనకుఁడు ప్రార్థించి యాపు
నరాగభావసమంచితుఁ డగుచు.
ప్రతిదినం బొక క్రొత్తపద్ధతితోడ
నాదరించె విదేహుఁ డధికాధికముగ—
సపరివారుం డగుసాకేతపతిని.

దశరథాదులు సపరివారముగ
నయోధ్యకుఁ దరలుట

ఒకనాఁటికన్న నిం కొకనాఁడు హెచ్చి
వేయిమడుంగుల విభవంబు తనరె
ప్రతిదినం బొక క్రొత్తపర్వంబు వెలయ
నానందపడుచుండె నఖిలపురంబు.
దశరథధారుణిధవుఁ డింటి కేగు
చెవ్వారలకుఁగూడ నిష్టంబు లేదు.
ఆపెండ్లి వా రెల్ల రనురాగపాశ
బద్ధత నొందిరి బహుదినా లరిగె.
అంత గాధేయశతానందమూను
లిట్లు చెప్పిరి విదేహేంద్రు రావించి :—
"ఇఁక, దశరథు నేగనిమ్ము, స్నేహమున
నీయెడఁ బాటు నీ కెంతయో లోన
సహాయించుకొనఁగ నశక్యమే యైన."
అన విని "యోనాథ ! యటులనే, శుభము"
అని పల్కి జనకధరాధీశ్వరుండు
రావించె మంత్రుల; రయమున వారు
వచ్చియు, "జయ సార్వభౌమ ! జయంబు !
చిరజీవివై ప్రకాశింతువుగాక !"—

అని వినమితశీర్షులై వచియింప,
"ఆయయోధ్యానాథుఁ డరుగుదలంచె
నిది యంతిపురిలోన నెఱిఁగింపుఁ" డనెఱి
యవనీంద్రువాక్యంబు లాలించి మంత్రి
విప్రసభాసదుల్ విహ్వలు లైరి.
ఆమాట లాడినయాజనకుఁడును
బ్రేమభావోద్వేగవివశాత్ముఁ డయ్యె.
పౌరజనంబు లీవార్త నాలించి
వికలితచిత్తులై విశ్వసింపకయ,
"ఇది నిజమనూనె, వా రేగుచున్నారె?"
అని పరస్పరము వా రడుగుకొనంగఁ
బయనంబు నిజ మన్నవార్తయే తేలె.
అర్కాస్తమయసమయమునఁ బద్మములు
సంకోచ మొందెడిసరణి వా రెల్లఁ
గడు ఖిన్న లైరి ముఖంబులు వాడ.
పెండ్లి వా రెందెందు విడిసిరో, దారి
యక్కడక్కడికెల్ల నంపఁగాఁబడియె
బహువిధవస్తుసంభారంబు లెల్ల.
పలురకములపండ్ల, వరుగులన్, మటియు
నఖిలాతిరుచ్య పక్వాన్నజాలముల
సంఖ్యకు మించుభోజనపదార్థముల
నెన్నెన్ని యో పెద్ద యెద్దులపైనఁ
బంపియు, నగణితభటతతితోడ
మార్గసవిశ్రాంతిమందిరంబులకు
బహురమణీయతల్పప్రతానముల
సాదరంబుగ నంపె జనకభూవిభుఁడు.
మటియును నొక లక్షమహితాశ్వములను,
సర్వాంగభూషణచయములతోడ
వెలయునిర్వదియైదువేలరథాల,
నష్టదిగ్గజముల నపహసపఱచు
పదివేలమత్తేభవరముల, మటియు
బండ్లకొలందిగా భర్మవస్త్రముల
మణులను, గేదెల మంచిగోవులను,
బహువిధవస్తువుల్ పంపె నతండు.
ఇటుల విదేహభూమీంద్రుఁ డర్పించె
నరణ మింకొకసారి యుగణనీయముగ
వచియించుటకు వీలుపడనిరీతిగను.
ఆసంపదను గాంచ నక్షులలోకాధి
పతులసంపదలు స్వల్పంబులై తోఁచు.
సర్వ మీ రీతిగా సన్నాహపఱచి
యీవస్తువుల నయోధ్యాపురి కంపె
జనకమహారాజు సంయమివర్య!
పెండ్లికుమారునిబృందంబు లెల్లఁ
బయనంబు గానున్నవార్త విన్నంత
రాణు లందఱు స్వాంతరంగంబులందు
స్వల్పాంబువుల మీనసంఘంబు లటుల
వికలత నొందిరి పెనుచింతతోడ.
మాటిమాటికి వారు మహితాదరమున
సీతను నొడిలోనఁ జేర్చి దీవించి
యీ తెఱంగున వచియించి. "రోతల్లి!
విభునకు సర్వదా ప్రియ వౌచు మనుము.
నీ పతిఁ గూడియు, నీ విలలోనఁ
జిరజీవినివి గమ్మ! సీత! మా యమ్మ!
యిదియె మాదీవన, ప్రీతితో నీవు
నీ యత్తమామల నిఖిలవృద్ధులను
సేవింపుమా తల్లి! సీతమ్మ! నీదు
పతి కనుకూలవై వర్తింపు మెపుడు."
స్నేహాతిశయముచేఁ జెలులుసైతంబుఁ
దెలిపి రామెకు సతీదివ్యధర్మముల
మృదుమధురోక్తుల నింపు దీపింప.
తన్మహారాజ్ఞులు, దక్కినసుతల
సైతంబు బోధించి సాదరఫణితిఁ
బలుమాఱు సత్ప్రేమపారవశ్యమునఁ
గౌఁగిటఁ జేర్చిరి గాఢగాఢముగ

తల్లు లారీతిగాఁ దమకొమార్తెలను
పలుమాఱు తమబాహువల్లుల నిల్పి,
"స్త్రీని విరించి రచించు టదేల?"
అని వచించిరి వియోగార్తిసంభ్రమత.
ఆసమయంబున నారామచంద్రుఁ
డాసూర్యకుల కేతుఁ డనుజులతోడ
ననుమతిఁ గొనుటకై యాహ్లాద మొప్ప
జనకభూపాలునిసౌధంబుఁ జేరఁ
బయలు దేరెను భరద్వాజమునీంద్ర!
సహజసౌందర్యభాస్వన్మూర్తు లైన
యాసహోదరులఁ దా మరయుటకొఱకుఁ
బౌరనారీనరుల్ పరుగిడి చనిరి.
ఒక రిట్లు పలికిరి: "యోమిత్రులార!
వా రీదినంబునఁ బయనింపఁ గలరు.
ఇఁక విదేహుఁడు వారి నిపుడు వీడ్కొలుప
సర్వసన్నాహముల్ సలిపియున్నాఁడు.
కండ్లార వారలకలరూపుఁ గనుఁడు.
నరనాథతనయు లీనలుగురు మనకు
నతిప్రీతిఁ గొల్వైడునతిథు లైనారు.
మనపురాకృతభాగ్యమహిమ మెట్టిదియొ,
యావిధి మన కిట్టియతిథుల నంపెఁ
గనులారఁగాంచఁగాఁ గడుసులభముగ.
మరణింప నున్నట్టి మానవుం డెట్లో
యమృతంబు పొందినయట్టుల, మఱియు
నాజన్మ మాఁకట నల్లాడువాఁడు
కల్పవృక్షంబును గాంచినరీతి,
నల నరకంబున కరిగెడివాఁడు
హరిపదంబును గాంచినట్టుల మనము
పొందినారము వీరిపుణ్యాదర్శనము.
శ్రీరాముశోభ వీక్షించి యద్దానిఁ
జేర్చుఁడీ హృదిలోనఁ జెఱుగకుండఁగను.
ఫణిమణిఁ దాల్చిన పగిదిఁ జిత్తమున
శ్రీరామమూర్తి ధరించుఁడీ ప్రీతి."
ఆవిధి సరఘ్వజనాభ్వియుగ్మముల
నానందపఱచుచు నాసహోదరులు
నలుగురు చేరిరి నరనాథునగరి.
ఆరూపసింధువు లగుబంధువులను
బరికించియును రాణివాసంపుసతులు
హర్షంబుతోఁ లేచి రందఱుఁగూడ.
అత్త లంతటను మహానందవశత
వివిధదానంబుల వెదఁజల్లి, వారి
కొసఁగిరి హారతు లోమునిరాయ!
రాములావణ్యదర్శన మొనరించి
యత్యనురాగిణు లౌచు వా రెల్లఁ
బలుమాఱు వానిశ్రీపాదపద్మముల
వ్రాలిరి సుప్రేమపారవశ్యమున.
ప్రేమభావోద్విగ్నహృదయలౌ వారి
లజ్జయు విడిచి పలాయనం బయ్యె.
వారిజామాతలపైన వెలుంగు
సహజానురాగ మేసరణి వాక్యముల
వర్ణింప వశ మౌను? వార లాపైన
ననుజయుక్తంబుగా నారామచంద్రు
తనువును బరిమళద్రవ్యాలతోడ
నలుగిడి యభ్యంజనస్నానములను
గావింపఁగాఁజేసి కడుప్రేమతోడ
షడ్రసోపేతభోజనముల నిడిరి.
అడె మంచిసమయం బటంచుఁ దలంచి
శ్రీరాముఁ డిట్లు వచించె సౌశీల్య
సదమలప్రేమలజ్జామయోక్తులను:
"జనకపాదులు నేఁడు సాకేతపురికిఁ
బయనంబుసేయ సంభావించి యిప్పు
డనుమతి నొంద మమ్మంపినా రిటకు.
తల్లులారా! ప్రముదంబున మాకు
నాజ్ఞ నొసంగుఁడీ: యనవరతంబు

మీ బిడ్డలుగను బ్రేమింపుఁడీ మమ్ము.”
ఈమాటలను విని యెల్ల భామినులు
నతివిచారగ్ర స్త లై రి చి త్తముల;
అ త్తలు ప్రేమవశాత్మలై తిరిగి
పలుకంగ లేక దిగ్భ్రాంతిని గనిరి.
అంత వా రెల్ల రాయాత్మపుత్రికల
బిగికౌఁగిలించియుఁ బ్రేమదీపింప
విభుల కర్పించిరి వినతులు చేసి.
‘సునయన’ వినయ భాసుర విన్నపముల
శ్రీరామునకు సమర్పించి జానకిని
యంజలి ఘటియించి ప్రార్థించె నిటుల
మఱియును మఱియుఁ, బ్రేమంబు దీపింప :
“నాయనా! రామ! ఘనజ్ఞానధామ!
ప్రీతి నీసీత నర్పించితి నీకు.
ఎల్లరిభావంబు లెఱుఁగుదు వీవు
పరివారమునకును బౌరుల కెల్లఁ
బ్రాణతుల్యం బయి పరఁగు నీసీత;
నాకును నరనాథునకుఁ గల్గుప్రీతి
నిఁక వచియింపఁగా నేల? నీ వింక
నీమె శీలప్రేమ లెఱిఁగి శ్రీరామ!
భవదీయదాసిగాఁ బాలించుకొనుమ
యో తులసీప్రభూ! యో రామచంద్ర!
పూర్ణ కాముఁడవు ప్రభూ! రామ! నీవు
ఘనతరజ్ఞానశిఖామణి వీవు.
ప్రేమభావమునఁ నే ప్రేమింతు వీవు
భక్తులలో మంచిభాగమే చూచి
వారలదోషమున్ పాఱఁద్రోలెదవు.
కారుణ్యధామ! మేఘశ్యామ! రామ!”
అని వచియించుచు నామహారాజ్ఞి
యా రాముపాదంబులందున వ్రాలె.
తతరాగ సై కతస్థలి నింకె నా మె
వాగ్జలంబులు భరద్వాజమునీంద్ర!

ఆ మె వచించినయనురాగమహిత
భాషణంబుల రామభద్రుండు వినియు
సన్మాన మొనరించె సకలవిధాల;
అంజలి ఘటియించి యూజ్ఞ నర్థించి
పలుసారు లామెకుఁ బ్రణతు లర్పించె.
ఆ మెదీవెన లొంది యారఘువిభుఁడు
మరల, నా మెకుఁ బ్రణామంబులఁ జేసి
యనుజసమేతుఁడై యరిగె వీడ్కొ-నియు.
మంజులమధుర రామస్వరూపమును
హృది నిల్పుకొని రాణు లెల్లరుఁ గూడఁ
గుప్పగూలిరి కడుఁ గూర్మిమై నొకట.
కొంతసేపటి కెదఁ గూర్చియున్ ధృతిని
దమతనూజలఁ బిల్చి తగఁ బలుసార్లు
గుండెకు హత్తించుకొనిరి వారెల్ల.
ఆపయి నాతల్లు లందఱు కొంత
దూరము తనయలతోఁగూడ వచ్చి
యిక సాగనంపుచు నింకొక్క-సారి
కౌఁగిలించిరి వారి గాఢానురక్తి.
వారిపరస్పరప్రణయాతిశయత
యుప్పొంగి పొఱలె మహోద్ధతి; నట్లు
వదలి పోఁజాలక పలుమాఱు ప్రేమ
నాత్మవుత్రికలఁ దా మాలింగనంబు
సలిపెడుమాతలు సకియలచేత
విడఁదీయఁబడిరి, యా నేళ నే కన్న
పసిగందుదూడను వదలి పోఁదగిన
యావుచందమున మహర్షివరేణ్య!
సకలపౌరావళి, సకియలు, రాణు
లనురాగవివశులై రందఱుఁగూడ
కరుణయు విరహంబుఁ, గాఁపురం బుండె
నావిదేహునిపట్టణంబునం దనఁగ.
ప్రేమతో జానకి పెంచుకొన్నట్టి
కనకపంజరమునఁ గాఁపురం బుండు

శుక శారికలు మహాశోకంబుఁ జెందె
"నెటు పోయె వై దేహి? యెటు పోయె?"ననుచు;
వానిదుఃఖంబును బరికించి యెవఁడు
ధైర్యంబు నెదలోనఁ దాల్పగాఁ గలఁడు?
కనఁగ నీరీతిగా ఖగమృగగణమె
వికలతఁ బొంద నేవిధముగా నింక
మనుజులదశఁగూర్చి పలుకఁగా నగును?
జనకుఁడు సోదరసంయుతుం డగుచు
వచ్చె; నాతనినేత్రపద్మంబులందుఁ
బ్రేమోత్కటత బాష్పబిందువుల్ నిండె.
తద్విదేహావనీధవశేఖరుండు
పరమవిరాగియై పరఁగినఁగాని
సీతను గనుల వీక్షించినంతటనె
యతనిధీరత పలాయనమాయె నపుడు.
జనకమహారాజు జానకి నంత
గుండెకు హత్తించుకొనియె-నావేళ
నాతని జ్ఞానమర్యాదాతిశయము
సడలింపఁబడియు జర్జరితమైపోయె!
మహితధీమంతులౌ మంత్రిశేఖరులు
నృపతి నోదార్చిరి మృదుభాషణముల.
అది విచారమునకు నదును గాఁదనుచు
దెలిసియు జనకుఁడు ధీరతఁబూని,
పలుసార్లు కూఁతుండ్రఁ బరమానురక్తి
గుండెకు హత్తించుకొనియు నాపిదప
బాగుగా నమరింపఁబడుట సొంపైన
పాలకీలను నాల్గు త్వరగఁ దెప్పింప
నాజ్ఞాపనముచేసె, నచటిమంత్రులకు.
ఆతనిపరివార మంతయు మిగులఁ
బ్రేమభావోద్వేగవివశత్వ మొందె;
నయినను శుభలగ్న మాగమించుటను
జనకమహారాజు సదమలభక్తి
సిద్ధిగణేశుని చిత్తమం దెంచి

పాలకీ లెక్కించె వరపుత్రికలను.
బహువిధానముల నాపార్థివో త్తముఁడు
బుజ్జగించియుఁ దనపుత్రికామణుల
నంగనాధర్మకులాచారములను
గూర్చి బోధించెను గూర్మి వెలుంగ.
విశ్వాసపాత్రులు ప్రియు లైనయట్టి
దాసదాసీజనతతుల నొసంగె
జానకీదేవికి జనకభూవిభుఁడు.
సీత ప్రయాణముచేసినంతటనె
వ్యాకులు మొందిరి పౌరులందఱును.
మంగళప్రదము లై మహితంబు లైన
శుభశకునంబులు చూపట్టె నపుడు.
క్ష్మాసురవరమంత్రిసంయుతుం డగుచుఁ
దనపుత్రికలవెంటఁ దరలె మైథిలుఁడు
సాగనంపుటకునై సాదరంబుగను.
ఆసమయంబున నఖిలవాద్యములు
బ్రేమాయఁగాసాఁగెఁ బ్రమోదంబు గదురఁ
బెండ్లికుమారునిబృందంబు లెల్ల
రథగజహయముల రాజితరీతి
నాయత్త మొనరించె నరుగుటకొఱకు.
దశరథుం డంతట భారుణీసురుల
నందఱ రావించి యాదరంబొప్ప
దానమానములచేఁ దనియంగఁ జేసి
వారలపావనపాదరజంబుఁ
దనశీర్ష మందునఁ దాల్చి సద్భక్తి.
వారిదీవెన లొంది పరమహర్ష మున
శ్రీగణేశుని సంస్మరించియుఁ దరలె
శుభశకునంబులు చూపట్టుచుండ.
కుసుమవర్ష ంబులు గురియఁగా సురలు
నచ్చరల్ పాడఁగా సానందముగను,
సాకేతపతి సంతసంబున వెడలె
దుందుభిధ్వానసందోహమధ్యమున.

దశరథభూపతి తతవినయమునఁ
బౌరుల నిలువఁగాఁ బ్రార్థనచేసి
యఖిలయాచకుల సమాదరంబొప్పఁ
బిలిచి వారికి సమర్పించి యనేక
ఘనవిభూషణవస్త్రగజతురంగముల,
సత్ప్రేమరసముతో సంతృప్తిపఱచి
తీర్చె నందఱిపరాధీనద్వైన్యమును.
అంతట వా రెల్ల రానందపడుచు
నృపుబిరుదంబుల నెంచుచుఁ జనిరి
శ్రీరామచంద్రు హృత్సీమ ధరించి.
పలుసార్లు కోసలపతి యాగు మన్న
జనకుఁడు మఱలక చనుచుండె వెంట.
మరల శ్రీదశరథమనుజేంద్రుఁ డనియె
స్వాదుభాషణముల జనకునితోడ:
"మఱలు మింకను బ్రేమమహిత! యో జనక!
యిప్పటికే దూర మే తెంచినావు!"
ఇట్లంచు దశరథోర్వీశశేఖరుఁడు
రథమును డిగ్గి ధరాస్థలి నిలిచెఁ
బ్రేమప్రవాహముల్ విరియ నేత్రముల.
అంత విదేహధరాధీశమౌళి
యంజలి ఘటియించి యనియె నీరీతి
స్నేహసుధామయశ్రీవచనముల:
"ఏవిధానంబుగా నెట్టి వాక్యముల
నిన్నుఁ బ్రార్థింపఁగా నేర్తును నేను?
అంతటి దగుగౌరవాతిశయంబు
నా కొసంగితివి, భూనాథవరేణ్య!"
తనదువియ్యంకునిఁ దనబంధువరుని
జనకుని దశరథక్ష్మానాథుఁ డంత
నానావిధాల సన్మానితుఁజేసె
పరమవినమ్రసద్భావంబుతోడ.
ఉపగూహనంబుల నొనరించుకొనిరి
దశరథజనకు లిద్దఱు పరస్పరము
పట్టలేనంతటి సరమానురక్తి
వారిడెందంబుల భాసించుచుండె.
జనకుఁ డంతట మునిచయమున కెఱిఁగి
వారియాశీస్సులఁ బడసె మునీంద్ర!
ఆతఁ డాపివప మహారూపశీల
సద్గుణనిధు లగుసర్వసోదరులఁ
దనదునల్లుండ్ర సాదరభావ మొప్ప
నాలింగనముఁజేసె; నాపయి నతఁడు
తనధన్యపాణిపద్మముల జోడించి
ప్రేమరసాపూర్ణవిమలవాక్యముల
శ్రీరాము నిట్లు భూషించె స్తోత్రముల.

జనకరాజర్షికృత శ్రీరామస్తవము
గే య ము

రామ! యెటుల ని న్నేసెద ప్రశంస!
మునిశివమానసమానసహంసా!
నీ కయి యోగ మొనర్తురు యోగులు
కోపమోహమదమమతాత్యాగులు,
వ్యాపక! బ్రహ్మ! అలఘు! అవినాశీ!
చిదానంద! నిర్గుణ! గుణరాశీ!
మనోవాగతీతా! తర్కంబులు
నిన్నుఁ జేరఁగా నసమర్థంబులు,
కాని కార్యకారణములచేత
నూహింపఁగఁబడు చుందువు నేతా!
'నేతి నేతి' యని నీ మహిమంబున్
నిగమంబులు సలుపును గానంబున్.
సర్వకాలసర్వావస్థలలో
నేకరసంబున వెలిఁగెద వోహో!
అఖిలసుఖంబుల కాదిమూలమా!
నా కనులకుఁ దోఁచితివా, రామా!
ఈశునికృప యనుకూలం బగుచో
నన్నియు సులభము లీలోకములో.

అన్ని విధంబుల నాదరించితివి
నీ భటునిగ ననుఁ స్వీకరించితివి.
దశసహస్రసారదలు శేషులున్
నా భాగ్యంబును, నీ గుణంబులన్,
కోటికల్పములకైనను నాథా!
పలుకఁగఁ జాలరుగా రఘునాథా!
గట్టిగ నాదొక విశ్వాసంబున్
పలుకఁగఁ జాలెద నేను సతంబున్.
అణుమాత్రం బగుభక్తిచేతనే
ప్రసన్నతను గనుచుందు వే నిదే-
అంజలి పూనియు మాటిమాటికిన్
నినుఁ బ్రార్థించెద నొక్కదానికిన్.
నీ చరణంబుల నిరతము రామా!
నా మతి నిల్పు మిదే సుఖధామా!
అల పూర్ణకాముఁడౌ నారామచంద్రుఁ
డాప్రేమమహితవాక్యంబు లాలించి
పరితుష్టహృదయుఁడై బహువినయమున
మామకు మిగుల సన్మానంబుఁజేసె—
శ్రీపితృపాదకౌశికవసిష్ఠులకు
సమునిగాఁ దలఁచియు స్వాంతంబులోన.
అంతట జనకధరాధీశ్వరుండు
భరతుని వినయభావంబునఁ జేరి
కడుఁ బ్రేమతోఁ దనకౌఁగిటఁజేర్చి
యాశీర్వదించె మహర్షివరేణ్య!
లక్ష్మణశత్రుఘ్నులనుగూడ భూపుఁ
డాలింగనముచేసి యాశీర్వదించె.
ఒకరి నొక్కరు వార లొక్కరీతిగను
గూర్మిఁ గౌఁగిటఁ జేర్చుకొనిరి వే సార్లు.
పలుసార్లు జనకభూపతికి రాఘవుఁడు
గౌరవవినతులఁ గావించి, తరలెఁ
దమ్ములతో నయోధ్యాపురంబునకు.
జనకుఁ డంతటను విశ్వామిత్రుఁ జేరి
పాదముల్ పట్టి తత్పదపరాగమును
దలఁ దాల్చియున్ నేత్రముల కద్దుకొనియుఁ
బలికె నీరీతిగా భక్తి దీపింప :
"ఓ మహామునిరాయ! ఓ గాధితనయ!
భవదీయదర్శనభాగ్యంబు కలుగ
నెది యలభ్యం బగు నీత్రిలోకముల?
నాలోనిదృఢమైన నమ్మకం బిద్ది.
ఎల్ల లోకేశ్వరు లేమహానంద
సద్యశంబుల నొంద స్వాంతమం దెంచి
పొందఁగా సంశయమును బొందుచుందు
రా మహానందంబు నా సద్యశంబు
నే నొందినాఁడ స్వామీ! సులభముగఁ
ద్వద్దర్శనంబునఁ దాపసవర్య!
సర్వసిద్ధులుఁగూడ సంప్రాప్త మగును."
నరపతి యిట్లు విన్నప మొనరించి
పలుసారు లమ్మునీశ్వరుపాదములకు
శిరము వంచియు నమస్కృతులఁ గావించి
యాశీస్సు లంది తా నంతట మరలె
నిజపురంబునకు మునీ! భరద్వాజ!
భేరులు మ్రోయుఁగాఁ బెండ్లివా రంతఁ
దరలి రెట్లో యయోధ్యాపురంబునకు.
ఆబాలవృద్ధులు హర్షంబుఁ గనిరి.
గ్రామీణు లెల్లరుఁ గాంచి శ్రీరాముఁ
దమలోచనములు సార్థకతను గాంచఁ
బరమసంతోషసంభరితాత్మ లైరి.

రామాదుల అయోధ్యాపురప్రవేశ మహోత్సవము

మార్గమధ్యంబునం బలుమజిలీల
యం దాగి విశ్రాంతి నందుచుఁ దరలి
ప్రక్కనఁ గలజనపదనివాసులను
సంతోషపఱచుచు సాకేతపురిని

బెండ్లివారలు సమీపించినా రొక్క-
పుణ్యదినంబున మునిలోకనాథ !
నిస్సాణపణవముల్ నినదింపసాఁగె
శంఖభేరీధ్వానసంయుతంబుగను.
హయగజరావంబు లలమె దిక్కులను
తాళడిండిమఘనధ్వనులుఁ జెలంగె
సన్నాయివారల సరసరాగముల.
పెండ్లివారలు వచ్చువిషయంబు వినియుఁ
బురజను లానందపూరితు లైరి
తనువులు పులకీకృతంబులు గాఁగ.
నిజనిజసుందర నిలయబృందముల
నంగళ్ళ వీథుల నలచదుకములఁ
బట్టణద్వారపూర్వప్రదేశములఁ
గడు మనోజ్ఞముగ శృంగారించుకొనిరి.
పన్నీరు చల్లఁగాఁ బడియె వీథులను.
అట నట మిగుల శోభాయతలీలఁ
బెండిలిమ్రుగ్గులు విరచింపఁబడియె.
తోరణకేతుసందోహపతాక
తతవితానములఁ బథంబు లన్నియును
వర్ణనాతీతమై భాసిల్లుచుండె.
సఫలపూగరసాలజాలతమాల
వకుళకదంబరంభాకదంబముల
నాటిరి మార్గంబునన్ మనోజ్ఞముగ.
ఆరమ్యవృక్షంబు లన్నియుఁగూడ
ఫలభారవశమున వంగె నేలకును.
ఆవృక్షమూలంబులందున మణుల
యూలవాలంబు లత్యంతరమ్యముగ,
రచితంబు లయ్యె భరద్వాజమౌని !
వివిధవిధంబుల వెలుఁగొందుచున్న
మంగళకలశముల్ మంజులరీతి
రచియించి రెల్లెడఁ బ్రతిగృహమందు.
బ్రహ్మాదిదేవతల్ రఘువరుపురము
వీక్షింప మనసులో వేగిరపడిరి.
ఆసమయంబునం దారాజగేహ
మమితశోభాకరంబై వెలుఁగొందె.
అద్దానిరచనంబు నరసి మన్మథుఁడు
సైతంబు, మోహావశ్యస్వాంతుఁడయ్యె.
శుభశకునంబులు, సుందరత్వంబు,
వృద్ధిసిద్ధులు, సుఖవికచసంపదలు,
సర్వవిధోత్సాహసంతతు లెల్ల
సహజసౌందర్యభాస్వద్రూప మూని
దశరథధారుణీధవుసౌధ మందుఁ
గాఁపురం బున్నట్లు గాన్పించుచుండె.
జానకీరామదర్శనలాలసత్వ
మెవరి కుండదొ? వచియింపు మునీంద్ర!
గుంపులు గుంపులు గూడి ముత్తైదు
వలు బయల్ దేరిరి ప్రసవాస్త్రసఖని
మించులావణ్యము మెఱయుచుండఁగను.
సర్వమంగళవస్తుజాలహారతులఁ
గైకొని తమతమకరపల్లవముల
భారతీదేవియే బహురూపములను
భాసించుచుండినపగిదిగా వారు
పాడుచు నడిచిరి పథమునం దెల్ల.
దశరథరాజసౌధప్రదేశంబు
భూరికోలాహలపూరితం బయ్యె
అమ్మహోత్సవ మెన్న నకథనీయంబు
ప్రాజ్ఞ! కౌసల్యాదిరామమాతలకుఁ
బ్రేమభావోద్వేగవివశత్వ మొదవెఁ
దనువుల మఱచిరి తన్మాత లెల్ల.
వార లంతట గణేశ్వరమహేశ్వరుల
భక్తితోఁ బూజించి బ్రాహ్మణావళికి
సలిపిరి దానముల్ సంతృప్తి గలుగ;
అల చతుర్విధపురుషార్థముల్ గన్న
పరమదరిద్రునివలెఁ బ్రముదంబుఁ

జెందిరి మునిరాజ! శ్రీభరద్వాజ!
మువ్వురు తల్లులు మోదప్రమోద
వివశలై యడుగులు వేయ లే రైరి.
ఆమహామాతల కానందవశత
సర్వాంగములును సంశ్లథితంబు లయ్యె.
రామదర్శనమహారాగిణు లగుచు
తద్రాజమహిళ లాత్రంబుదీపింప
సమకూర్ప సాగిరి సర్వవస్తువుల.
వివిధమంగళవాద్యబృందంబు లెల్ల
మ్రోయఁగా సాగెను మోదంబు గదుర.
మిగుల హర్షమున సుమిత్ర యంతటను
దతహరిద్రాదూర్వదధిపత్రపుష్ప
వరనాగవల్లి కాపల్లవపూగ
ఫలశుభమూలశుభంకరాక్షతలు,
నవయవాంకురరోచనములు, లాజలును,
మంజులతులసికామంజరీప్రభృతి
సర్వమంగళవస్తుజాలముల్ కూర్చె.
సహజసౌందర్యభాస్వచ్చిత్రచిత్ర
హాటకఘటము లనంగపతంగ
నిర్మితగృహముల నియతి వెలింగె.
శుభసుగంధద్రవ్యశోభలు నిండె.
పలుకనశక్య మాపగిది నారాణు
లందఱు సమకూర్చి రఖిలమైనట్టి
మంగళద్రవ్యముల్ మహితపద్ధతిని;
బహువిధానముల నేర్పఱచి హారతుల
సంసిద్ధపఱచియు, సంతోషపడుచు
సొంపుగాఁ బాడిరి శుభగీతములను.
బహుమంగళద్రవ్యభరితంబు లైన
కనకపాత్రమ్ములఁ గరకమలముల
వహియించి సుతులకు స్వాగతం బొసఁగఁ
దరలి రారాజమాతలు ప్రమోదమునఁ
దనువులు పులకీకృతంబులై వెలుఁగ.

సద్ధూపధూమమేచకనభస్థలము,
శ్రావణఘనఘనశ్యామమై తోఁచె.
సురవృక్షములనుండి సురలు వర్షించు
సుమవరకణములు సొగసుగాఁ దోఁచె.
వర 'బలాకా'నంతపంక్తులు వోలె
మంజులమణిగణమయతోరణంబు
లింద్రధనుస్సుల ట్లింపుగాఁ దోఁచె.
బిరబిర నోబ్బుచు బిరబిర న్వచ్చు
భవనాగ్రసంచరద్భామినీజనులు
మెఱయుచు నుండిరి మెఱుపులు వోలె.
దుందుభిస్వనములు తోఁచె గంభీర
ఘనతరాంబుదచయగర్జలన్ బోలె.
ఆనందపడుచున్న యాచకుల్ మనిరి
చాతకమందూకచయబర్హా లటుల.
సురసుగంధాంచితశుద్ధవర్షములు
పౌరసస్యములకుఁ బ్రమదంబుఁ గూర్చె.
శుభసమయంబును జూచి, గురుండు
శ్రీవసిష్ఠమహర్షి చెప్పినపిదప
రఘువంశమణిదశరథరాజమౌళి
నగరప్రవేశ మొనర్చె మోదమున
సర్వానుచరబృందసంయుతుం డగుచు,
నీశ్వరగౌరీగణేశుల న్దలఁచి.
శుభశకునంబులు చూపట్టుచుండఁ
గుసుమవర్షంబులు కురిసిరి సురలు
మ్రోయఁజేయుచు దుందుభుల రభసమున.
విబుధవధూజనబృందంబు లెల్ల
మధురమంగళగానమధుకణంబులను
జిలుకుచు నృత్యముల్ చేసి రాయెడను.
వందిమాగధసూతభటనటు లంతఁ
ద్రిభువనరంగసందీపకుం డైన
శ్రీరామచంద్రుఁ గీర్తించిరి ప్రీతి.
జయజయధ్వనులతో సదమలవేద

నాదముల్ నిండెను నాల్గు దిక్కులను.
భూరివాద్యవిశేషములు మ్రోఁగసాగె.
నభమున సురలును నగరిలో నరులు
ననురాగపరవశు లైరి మునీంద్ర!
పెండి వారలతీరు వివరింప లేము
వారు మహామోదపరవశు లైరి
యూపఁ జాలక పోయి రానంద మెదల.
పౌరు లందఱు వచ్చి పార్థివేంద్రునకు
జోహారుఁ గావించి సురుచిరభ క్తి,
శ్రీరామచంద్రు వీక్షించి హర్షించి
పృథుమణివస్త్రముల్ వెదఁజల్లి రపుడు.
వారినేత్రముల బాష్పంబులు నిండెఁ
దనువులఁ బులకరింతలు విలసిల్లె.
పౌరనారీమణుల్ ప్రమదంబు గదుర
నారామునకు శుభహారతు లిడిరి.
తనరారు నాసహోదరుల నల్వురను
గాంచి వా రెల్లరు కడు నుల్లసిలిరి.
కమనీయశిబికలఁ గలవధూమణుల
యవనికల్ తొలఁగించి యరసి వా రెల్లఁ
బట్టరానంత సంబరమును గనిరి.
ఈప్రకారంబుగా నెల్లవారలకు
సంతోషమిడుచు రాజద్వారసీమ
కడ కేఁగుదెంచిరి కడువైభవమున—
జానకీరాఘవుల్ సపరివారముగ.
మతి హర్ష ముప్పొంగ మాత లాపిదప
నావధూవరులకు హారతు లిడిరి.
మఱియును మఱియు నామాత లందఱును
హారతు లిచ్చిరి; యామహారాజ్ఞి
లాతఱిఁ గన్నప్రేమానందములను
వర్ణింప నెవ్వరివశము గా దనఘ!
బహువిధభూషణవస్త్రముల్ మణులు,
నగణితవస్తువు లద్భుతంబుగను
వెదఁజల్లివై చిరి ప్రీతి వెలుంగ;
వరవధూయుక్తులై భాసిల్లుచున్న
ప్రియకుమారుల నెల్ల వీక్షించి పేర్మి,
పరమసంతోషసంభరితాత్మ లైరి
యామాత లెల —మహామునీ! వినుమ!
మాటికి మాటి కామాతృత్రయంబు
జానకీరాముల సౌందర్య మరసి
తమజన్మ సార్థకత్వముఁ గాంచె ననుచుఁ
బ్రముదంబుఁ జెందిరి భావంబులందు.
మాటిమాటికి సఖీమండలి యెల్ల
సీతాముఖంబు వీక్షించి హర్షించి
పాటలు పాడిరి పరవశత్వమునఁ
దమపూర్వసుకృతంబుఁ దా మెంచుకొనుచు.
అట, క్షణక్షణమున కమరు లుప్పొంగి
కురియఁగాఁజేసిరి కుసుమవర్ష ముల;
నాడిరి పాడిరి యర్చించి రెదల.
వరమనోహరవధూవరుల నల్వురనుఁ
గాంచి యాశారద కడు శ్రమఁజెందె
నఖలోపమానంబు లరసి గాలించి
కాని యేపోలిక గానరాదయ్యె
నన్నియు నత్యల్ప మైనవై తోఁచె.
అందుచే శారద యాస్యరూపముల
ననురాగ మొప్పఁగా నరయుచు నిలిచెఁ
గనుఱెప్ప వాల్పక, కదలకుండఁగను.
ఆగమాచారకులాచారసరణి
నిఖిలకృత్యంబులు నెఱవేఱినంత
నారాజమహిషులు హర్ష భారమున
నావధూవరులకు హారతు లొసఁగి
భవనంబునకుఁ గొనివచ్చిరి—ముందు
వారినిఁ బోసియుఁ, బటములఁ బఱచి.
పరమసౌందర్యనివాసంబు లైన
నాలుగు సింహాసనము లుంచి రచట.

అవి మన్మథుండు స్వయంబుగాఁజేసి
యుంచిన రీతిగా నొప్పుచు నుండె.
వానిపై నా వధూవరులను రాణు
లధివసింపఁగఁజేసి రాదర మొప్ప.
వారలపావనపాదపద్మములఁ
గడిగియు నాశుభఖనులఁ బూజించి
రాగమో క్తవిధాన మనుసరించుచును–
పృథుధూపదీప్నైవేద్యకృత్యముల.
మంగళహారతుల్ మఱిమఱి యొసఁగి
మంజులవ్యజనచామరములతోడ
విసరిరి వారల విమలశీర్ష ముల.
బహువిధవస్తువుల్ వారలకొఱకు
వెదఁజల్లిరైచిరి వివిధదిక్కు–లను.
పరతత్త్వమును గన్నవరయోగివోలె,
నమృతరసప్రా ప్తి నందినయట్టి
సంతతరోగా ర్త జనునివిధాన,
స్పర్శవేధిని గనఁజాలినయట్టి
జన్మదరిద్రునిచందంబుఁ గాంచ
నఖిలు వచ్చినయంధునిరీతి,
విజయంబు నొందినవీరునిపగిది
శారదాదేవీప్రసన్నత న్గనిన
మూకవిధానఁ బ్రమోదంబుఁ జెంది
రామాత లందఱు స్వాంతరంగముల.
ఈసుఖంబునకన్న నింకను వారు
శతకోటిగుణితమౌ సౌఖ్యంబుఁ గనిరి–
రఘుకులరత్న మౌరామచంద్రుండు
తమ్ములతోఁగూడి తాఁ బెండ్లియాడి
పిమ్మట స్వగృహప్రవేశం బొనర్ప.
ఆమాత లంత లోకాచారఫణితిఁ
జేసినవిధుల వీక్షించి లజ్జించి
రావధూవరులు మహర్షి వరేణ్య!
తత్ప్రమోదము, వినోదంబునుఁ జూచి
తనలోన రాముఁడు దా నవ్వుకొనియె.
ఆమాత లంతఁ దదాచారసరణి
దేవతాగణపితృ దేవతాపూజ
సలిపిరి స్వీయవాంఛాసిద్ధికొఱకు.
భ్రాతృత్రయోపేత రామకల్యాణ
వరదాన మొనరింపఁ బ్రార్థించుకొనిరి
వందనంబులఁజేసి భక్తి దీపింప.
దేవత లంత నదృశ్యరూపముల
నిచ్చినయాశీస్సు లెల్లరుఁ గూడ
స్వీకరించిరి పైఁటచెఱఁగులఁ బట్టి
పెండ్లికై వచ్చినవిహితుల నెల్ల
పిలిచి మహారాజు ప్రీతి నొసంగె
నల మణివసనవాహనభూషణముల.
ఆపయి సెలవొంది యాహితు లెల్ల
రామానుసంధానరమ్యాత్మ లగుచుఁ
దమనివాసములకుఁ దరలి రంతటను
బురనరనారీసమూహంబు లెల్ల
మణివస్త్రములను సన్మానింపఁ బడియె.
గృహగృహంబున జయగీతముల్ చెలఁగె.
ప్రముదితుం డగు దశరథమహారాజు
యాచకజను లేవి యడిగినఁ గాని
యవి యెల్ల నిచ్చె నేయరమర లేక.
సకలసేవకులను, సంగీతపరులు
మదిఁ దృప్తు లైరి సన్మానదానముల.
అంతట సర్వ్ లాయవనీంద్రమణికి
నాశీస్సు లిడియు జోహారుఁ గావించి
సన్నుతించిరి వానిసద్గుణకథల.
పిదప భూపతి గురువిప్రయుక్తముగ
నంతఃపురంబున కరిగె మునీంద్ర!
శ్రీవసిష్ఠమహర్షి చెప్పినరీతి
నాతఁడు వేదలోకాచారవిధుల
నన్నిటి నొనరించె నాదరమొప్ప.

అవనీసురావళి యరుదెంచు టరసి
పరమభాగ్యంబుగా భావించుకొనుచు
రయమున నిలిచిరి రాణు లందఱును;
వారల పావనపాదపద్మములఁ
బ్రక్షాళనముఁజేసి భక్తి దీపింప
స్నానాదు లొనరింప సాయమై రెంతో.
అంతట భూపతి యావిప్రవరుల
విధ్యుక్తపద్ధతి వెలయఁ బూజించి
షడ్రసోపేతభోజనములతోడ
సంతృప్తిపఱచెను సాదరఫణితి.
ఆదరదానమహానురాగములఁ
బరితోష మొంది యాబ్రాహ్మణు లెల్ల
రాశీస్సు లిడి యేగి రాహ్లాదపడుచు.
భూనాయకుఁడు గాధిపుత్రునిఁ జేరి
పరిపరివిధముల భక్తిఁ బూజించి,
"అధిప! ననోబలుధన్యాత్ములు లేర"
టంచు వచించె, మహారాజు పిదప,
బహురీతి నామునిన్ బ్రస్తుతుల్ చేసి
యాతనిదివ్యపాదాబ్జరజంబు
స్వీకరించెను స్వరాజ్ఞీసమేతముగ;
తనసౌధమందె యాతాపసపతికి
నొక రమ్యమందిర మొసఁగె వసింప.
రాజేంద్రునానతి రాణులంగొట్టి
యంద ఆమునిని మహాశ్రద్ధతోడ,
ఆతఁ డేయొకవస్తు వడుగకుండినను
ఏసమయంబున కేది గావలెనో
కనిపెట్టి యొసఁగుచుఁ గడు భక్తితోడ
సేవించుచుండిరి శ్రీభరద్వాజ!
గురుపాదపద్మముల్ క్షోణీధవుండు
పూజించి వినుతించెఁ బూర్ణభక్తి
తగ వధూయుతులైనతనయులతోడ,
రాణులతో, దశరథమహీనాథుఁ
డావసిష్ఠగురూత్తమాంఘ్రిపద్మములఁ
బ్రణతు లర్పించెను బలుసారు; లంత
నమ్మునిశేఖరుఁ డాశీస్సు లిడియె
వారందఱకుఁ బ్రేమభావంబుతోడ.
సంతోష ముప్పొంగ స్వాంతరంగమున
వినతులఁ గావించి పృథ్వీశ్వరుండు,
తనతనూభవులను, ధనసంపదలను,
సర్వ మర్పించె నాచార్యదేవునకు.
ఆమునినాయకుం డటులఁ గైకొనక
తనస్వధర్మమునకుఁ దగినంతఁ గొనియు
భూతిదాశీర్వాదముల వారి కొసఁగి
జానకీరాములసదమలాకృతుల
సంధించుకొనియు హృత్సారసమందు,
హర్షంబుతోఁ జనె నాశ్రమంబునకు.
అంత నానరపతి యాదరబుద్ధి
విప్రవధూజనబృందంబు నెల్ల
రావించి వానికి రమణీయచేల
ఘనభూషణముల సత్కారం బొనర్చె,
పురమునం దున్నట్టి ముత్తైదువులను
సర్వుల రావించి సన్మానపఱచె
వారు కోరినమంచివస్త్రాదు లొసఁగి.
సన్మానయోగ్యులౌ జను లెల్ల వచ్చి
బహుమతు లొంది రాప్రభుమణిచేత
నాత్మాభిమతముల కనుగుణ్యముగను.
కడుప్రియుల్ పూజ్యులుగా నెఱింగియును
సకలబంధువులను సముచితరీతి
సత్కరించెను దశస్యందనుం డపుడు.
ఆరఘువీరుకల్యాణంబుఁ గనిన
సుర లెల్లఁ గురిసియు సుమవర్షనిచయ,
మతిగాఁ బ్రశంసించి రమ్మహోత్సవము.
ప్రేమాయఁ జేయుచు దుందుభులఁ, బరస్పరము
రామయశంబు కీర్తనచేసికొనుచు,

ప్రేమరసోద్వేగవివశాత్ము లగుచుఁ
దరలి రాదేవతల్ తమధామములకు.
సర్వుల నారీతి సంతోషపఱచి,
దశరథుం డానందతన్మయుం డగుచు
నంతఃపురంబున కరిగి, వీక్షించెఁ
గొడుకుల మఱి తనకోడండ్ర నెల్ల
ఆనకేశ్వరుఁ డంత నంతఃపురాన
గారాబుతనయులఁ గౌఁగిటఁ జేర్చి
యభివర్ణనాతీత మగుహర్ష మొందె.
అట్టులే కోడండ్ర నందఱి నతఁడు
కూర్మితో నొడిలోనఁ గూర్చుండఁ జేసి,
పలుమాఱు లాలించెఁ బరమహర్ష మున.
అది గాంచి యంతఃపురాంగన లెల్ల
సంతోష మందిరి స్వాంతంబులందు.
అందఱిహృదయంబు లానందమునకు
వాసస్థలంబుగా భాసించె నపుడు.
వినిపింపఁగాఁ బెండ్లివృత్తంబు నృపతి
యందఱు వినియు మహానందపడిరి.
జనకరాజేంద్రునిసద్గుణశీల
మానమర్యాదల, మహితానురాగ
ఘనసంపదలను భూకాంతుండు ప్రీతి
భట్టుచందంబుగాఁ బలురకంబులను
వర్ణింప రాణులు ప్రముదంబుఁ గనిరి.
దశరథుం డంతటఁ దనయులఁ గూడి
స్నానంబుఁ గావించి మ్నాదేవతలను,
దనకులాచార్య బాంధవుల రావించి
విందు గావించియు వివిధభోజ్యములఁ,
దానును భుజియించెఁ – దత్కార్యమందుఁ
గడపఁగాఁబడె నైదు గడియలరాత్రి.
మంగళగీతముల్ మానినుల్ పాడి
రానందమూలమై యలరారుచుండె
రమణీయ మైన యారాత్రికాలంబు.

భోజనకార్యంబు పూర్తి యైనంత
దశరథుండొసంగఁ దత్సమాజంబు
పొందియు దివ్యతాంబూలముల్, నవ్య
పుష్పదామసుగంధభూషితం బౌచు
మంజులశోభాసమంచితం బయ్యె.
అంత నా కారితు లంద ఱారాము
నీక్షించి కండ్లార నింకొక్కసారి,
యాతనియనుమతి నంది సంప్రీతి
వినమితశీర్షులై వెడలి రిండ్లకును.
అటఁ బ్రదర్శితము లైనట్టియపూర్వ
పూర్ణానురాగప్రమోదవినోద
బహుళసమ్మానసంపద్వైభవమ్ము
లాశతశారద, లాదిశేషాహు,
లాశ్రుతుల్, బ్రహ్మలు, హరగణేశ్వరులు
వర్ణింపఁజాలరు, వర్ణింప లేరు;
అట్టిచో నే నెటు లభివచించెదను;
వానపా మిభూమి వహియింపఁగలదె?
తదనంతరకథావిధానంబు వినుము
నృపుఁ డంత రాణుల నెల్లరఁ బిలిచి
సర్వవిధంబుల సన్మాన మొసఁగి
మృదువచనంబుల నిట్లు వచించె;
"వధువులు పసివారు–వారు వచ్చినది
క్రొత్తయింటికి, మీరు గూర్మి వారలను
గంటికి రెప్పగాఁ గాపాడుకొనుఁడు.
బాలకు లలసిరి బడలియున్నారు,
శయనింపఁ జేయుఁడు సత్వర మింక."
అని రాజు పల్క– శయ్యాగృహంబునకుఁ
జనియె రామాంఘ్రుల సంస్మరించుచును.
రాజేంద్రుమధురానురాగ వాక్యముల
విని రాణు లెల్లరు ప్రీతి వెలుంగ,
బహుమణికాంచనపర్యంకములను
సురభిపయఃఫేనశోభ రాణించు

ధవళాతిమృదులవస్త్రములను బఱచి,
వర్ణ నాతీతోపబర్హ్ణంబు లిడిరి.
ఆమణిఖచితశయ్యామందిరంబు
ఘనపుష్పహారసుగంధబంధురము
బహురత్న దీపికా భాసమానంబు
వర్ణ నాతీతదీవ్యద్వితానంబు.
దానిఁ జూచినధన్యమానవుఁడె
యెది యెట్లు లున్నదో యెఱుఁగఁగాఁ గల్గు.
అ ట్లమర్చియు గమ్య మైనపానుపుల
నం దొక్క పర్యంకమందు శ్రీరాము
శయనింపఁజేసి రాజననీత్రయంబు.
సెలవీయఁ బలుసార్లు శ్రీరామచంద్రుఁ
డాతనిసోదరు లందఱుగూడ
నిజనిజశయ్యల నిద్రింపఁ జనిరి.
ఆజననీత్రయ మారామచంద్రు
నతిరమ్యకోమలశ్యామలాంగంబుఁ
గని యిట్లు పలికిరి కడుఁ బ్రేమతోడ;
"నాయనా! రామ! కాననమార్గమందు,
ఘోరతాటక నెట్లు కూల్చితి వోయి?
సమరాంగణంబునఁ జండప్రచండు
లెంతటివారి లెక్కింపరే వారు—
కడుక్రూరరాక్షసుల్ ఖలమతు లైన
భయదమారీచసుబాహుల నెట్లు
సైన్యయుక్తంబుగా సంహరించితివి?
మేము కుమార! నీ మేలును గోరి
భగవంతునకు సమర్పణము కాఁగలము.
తన్మునీంద్రునిప్రసాదంబుచే నిన్ను
బన్నంబు లడఁచి కాపాడ నీశ్వరుఁడు,
నీవును శ్రీరామ! నీసహోదరుఁడు
యజ్ఞరక్షణసేయునవసర మందె
సర్వవిద్యారహస్యంబు లొందితిరి.
త్వత్పాదధూళిని దాఁకినంతటనె
మునిపత్ని పొందెను మోక్షపదంబు
నీకీర్తి నిండెను నిఖిలవిశ్వమున.
రాజసమాజాంతరాళంబునందుఁ
గమఠపీఠస్థలఘనవజ్రకూట
పటుకఠోరం బగుభవునికార్ముకము
ఫెళ్ళున నడిమికి విఱిచి వైచితివి.
విశ్వజయంబును విఖ్యాతిఁ బొంది
సీతను బెండ్లాడి చిన్నితమ్ములకుఁ
గల్యాణములఁజేసి, ఘనత మీఱంగ
స్వగృహంబునకు నీవు వచ్చితివోయి!
కేవలకౌశికకృపచేతఁ దనయ!
ఈయమానుషకృతు లెల్లఁ జేసితివి.
త్వన్ముఖచంద్రుని వత్స! దర్శించి
సాఫల్య మొందె మా జన్మంబు నేఁడు.
కాంచక నిను, మున్ను గడపినయట్టి
యాదినంబులను మాయాయువునందు
బ్రహ్మ గణింపక వదలుటకొఱకు
భగవంతు హృదిలోనఁ బ్రార్థింతు మోయి!"
తదనంతరము భరద్వాజమునీంద్ర!
కమనీయవినయవాక్యముల రాఘవుఁడు
జననీత్రయంబును సంతోషపఱచి,
హరగురుపృథ్వీసురాంఘ్రిపద్ములఁ
జింతించుచును నిద్రఁ జెందె; నత్తఱిని
సాయంసమయమున సంకోచ మొందు
నెఱ్ఱితామర ఓలె నెసఁగుచు నుండె
నిద్రించు రాముని నిర్మలముఖము.
ప్రతిగృహంబందున భామినీమణులు
జాగరణంబును జరుపు చొండొరులు
సొంపుగాఁ బాడిరి శుభగీతములను.
"ఎంత ప్రకాశించు నీపురవరము!
ఎంత శోభిలుచున్న దీనిశీధంబు!"
అని రాను లొండొరు లనుకొని రపుడు.

ఫణి, శిరోమణిని దా వదలకుండఁగను
గుండెకు హ త్తించుకొని పండురీతి
నాయ త్త లెల్ల మహాశోభ గలుగు
కోఁడండ్ర హ త్తించుకొని వక్షములకు
నిద్రించి రంత మునీ! భరద్వాజ!
ప్రాతఃప్రశాంతశుభంకరవేళ
మేల్కొ-నె శ్రీరామమేదినీవిభుఁడు.
కుక్కు-టాండజకోటి కూసె, నంతటను
వందిమాగధగుణప్ర స్తుతుల్ చెలఁగె;
కోటవాఁకిటికడఁ గూడిరి ప్రజలు
జోహారు లర్పింప, సురుచిరభ క్తి.
ఆనలుగురు భ్రాత లంతట వచ్చి
తల్లి దండ్రులకును, దమగురువులకు
విప్రులకును దేవబృందంబులకును
బ్రణతు లర్పించియు భ క్తియు క్తముగ
వారిదీవన లొంది ప్రముదంబుఁ గనిరి.
ధరణీంద్రుతోఁగూడి ద్వారంబుకడకుఁ
బోయెడితనయులముఖపద్మములనుఁ
గాంచి రారాణులు కడు నాదరమున.
శౌచస్వరూపులై జగతి వెల్గొందు
నాసహోదరు లెల్ల రఖిలశౌచముల
సలిపియుఁ, బావనసరయూజలాల
స్నానంబుఁ గావించి, సంధ్యాదివిధుల
నన్నిఁటి నెఱవేర్చి యరిగి రింటికిని.

విశ్వామిత్రమహర్షి వీడ్కోలు

వచ్చిన వారినిఁ బార్థివో త్తముఁడు
బిగికౌఁగిలించెను బ్రేమ ముప్పొంగ.
తండ్రి యాజ్ఞను బొంది తద్భ్రాత లెల్ల
రుల్లాస మొందుచు నుపవిష్టు లైరి.
సర్వసభ్యులు రామచంద్రుని గాంచి
హర్ష మొందిరి తమయక్షియుగ్మములు
పరమధన్యతఁ గన్నపగిదిగా నెంచి.
శ్రీవసిష్ఠరికౌశికు లరుదేర
సుభగాసనములఁ గూర్చుండఁగాఁ జేసి,
తండ్రికుమారులు, తన్మునీశ్వరుల
భ క్తిఁ బూజించియుఁ బట్టి రంఘ్రులను.
ఆమహాచార్యద్వయంబు శ్రీరాముఁ
బరికించి యనురాగపరవశ మయ్యె.
ధర్మేతిహాసముల్ తద్వసిష్ఠర్షి
ప్రవచింప రాజును రాణులు వినిరి.
తత్ప్రసంగమున నాతాపసో త్తముఁడు
కన మునులకును నగమ్యమై యుండు
గాధికుమారునిఘనకథావళిని
వినిపించె ముదమున విపులపద్ధతిని.
ఆవామదేవమహర్షి యామోద
"నిది యెల్ల సత్యమే; - యీగాధిసుతుని
కలకీర్తి నిఖిలలోకవ్యాప్త" మనియె,
సర్వసభాసదుల్ సంతోషపడిరి.
శ్రీరామలక్ష్మణుల్ చిత్తంబులందుఁ
బరమసంతోషంబుఁ బడసి రత్తఱిని.
నిత్యమంగళమోదనిరుపమోత్సాహ
ములతోడ దినములు పోయెను దొరలి.
అంతకంతకు నయోధ్యాపురవరము
దినదినాధికముగ దీపితం బగుచు
నానందజలధి నోలాడఁగా సాఁగె.
చూచి యొకానొక శుభదిన మందు
ఘనసుమంగళమోదకలవినోదములఁ
బెండ్లికంకణములు విప్పఁగాఁ బడియె.
అమ్మహానిత్యోత్సవావళిఁ జూడ
నమరులు కౌతూహలాయత్త లగుచు,
నాయయోధ్యాపురియందు జన్మింపఁ
జేయఁగాఁ బ్రార్థనఁ జేసిరి విధిని.

ప్రతిదివసమున విశ్వామిత్రమౌని
పయనంబుసేయ సంభావించుఁగాని,
రామచంద్రునివినమ్రప్రార్థనమున
నేనాఁటి కానాఁడె యేగక నిలిచె.
అనుదివసంబు శతాధికం బగుచు
వర్ధిల్లునృపుభక్తి భావంబుఁ గాంచి
యమ్మహాముని ముగ్ధుఁడై ప్రశంసించె.
చివర కొక్క దినంబు శ్రీగాధిపుత్రుఁ
డాశ్రమంబున కేగ ననుమతిఁ గోర,
దశరథుం డనురాగతన్మయత్వమునఁ
దనయులతో నిల్చి తాపసిముందుఁ,
బలికె నీరీతిగా భక్తి దీపింప :
"నాదు సర్వస్వము నాథ! నీయదియె!
నేను, సతీసుతుల్, నీసేవకులమె!
ఈబాలకులపైనఁ గృప యుంచి స్వామి!
తరచు దర్శన మిచ్చి ధన్యత నిండు!"
అని వచియించి మహారాజమౌళి
సుతసతీయుతముగా సురుచిరరీతి
సాష్టాంగపడె మునిచరణాబ్జములను.
ఆతనిగళమునం దాగె వాక్కులును.
ఆవిప్రవర్యుఁ డాయవనీశ్వరునకు
బహువిధాశీస్సుల బహుగతి నొసఁగి
వర్ణనాతీతదీవ్యద్దివ్యరీతి
నిష్క్రమించె మహామునీ! భరద్వాజ!
భ్రాతృసమేతుఁడై రామచంద్రుండు!
ప్రీతితో మునివెంట వీడ్కొన నేగి,
యాతఁడు సెలవీయ నరుదెంచెఁ దిరిగి.
ఆగాధివంశమహాబ్ధిచంద్రుండు
రామరూపంబును, రాజేంద్రుభక్తి,
కలజానకీరామకల్యాణగాథ,
నమ్మహాయోగీంద్రాదివ్యానందములను
బ్రస్తుతించుచుఁ బోయెఁ బరమహర్షమున.

వామదేవుఁడు రఘువంశగురుండు
జ్ఞాని యైనవసిష్ఠసంయమీంద్రుండు
మరల వచించిరి మహితరీతిగను
తద్గాధితనయగాథావిశేషములఁ.
అమ్మునీశ్వరునిపోద్యద్యశోమహిమ,
ధారుణీపతి విని, తనమహాపుణ్య
గరిమ నెన్నుచు లోనఁ గడు మోద మొందె.
రాజానుమతిని సర్వప్రజల్ సనిరి.
పదఁపడి యాంధ్రరాపతి దశరథుఁడు
పుత్రులతో నంతిపురమున కరిగె.
ఆరామచంద్రుకల్యాణలీలలనె
పాడుచుండిరి జనుల్ ప్రతిగృహంబునను.
ఆరామచంద్రమహాభవ్యయశము
పాండురాఖిలజగద్భాండమై వెలిఁగె,
కల్యాణమహితరాఘవుఁ డరుదెంచి
స్వపురగృహప్రవేశం బొనరించి
నప్పటినుండి సర్వానందములకు
ధామమై శ్రీయయోధ్యాపురి వెలిఁగె.
ఆరామవిభునికల్యాణోత్సవముల
భారతీశేషులే వర్ణింప లేరు.
తన్మహాదివ్యసీతారామయశము
కవికులాధారము, కడుపవిత్రంబు,
నఖిలమంగళఖని యని యెఱుంగుటను
నిజవచశ్శుద్ధి నెంతే వృద్ధిసేయ
నేర్చినకొలఁది వర్ణించుకొన్నాఁడ.

రామాయణశ్రవణపఠనమాహాత్మ్యము

తనవాణి పావనత్వమును వహింప
శ్రీరామయశముఁ గీర్తించె నీతులసి.
రామాయణం బపారం బగుజలధి
యేకవి దానిఁ దరింపఁగా లేఁడు.
మంగళశ్రీరామమహితోపవీత

వైవాహికోత్సవవరచరిత్రంబు
నెవరు కీర్తింత్రో, యింకెవరాలకింత్రో
ఆపుణ్య పూరుషులందఱుగూడ
జానకీరామప్రసాదంబుచేత
సర్వదా సుఖ మొంది శాంతిఁ గాంచెదరు.

గేయము

సీతారామవివాహచరిత్రన్
సాదరమతితోఁ బాడిన విన్నన్
సదానంద ముదయించును హృదిలో
శుభనిలయము రామాయణం బహో!

తోదకవృత్తము

హృదయమె పళ్ళెర మీమతి స్వామీ!
సదమల మౌఘనసారము కాఁగా,
ఇదె శుభహారతి నిచ్చెదఁ దండ్రీ!
మృదుమతి! మట్టపలీశ! నృసింహా!

శ్రీ మట్టపల్లి లక్ష్మీనృసింహ
పరబ్రహ్మార్పణ మస్తు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః!

ఇది శ్రీగోస్వామి తులసీదాసకృత-సకలకలికలుషవిధ్వంసక 'శ్రీరామచరిత మానసము' లోని బాలకాండమునకు-శ్రీ రామతీర్థభగవత్పాద ప్రియశిష్య నిరంతర శ్రీ మట్టపల్లి లక్ష్మీనృసింహ పరబ్రహ్మవాస హృత్పద్మతీర్థ శ్రీ కేశవతీర్థ స్వామికృతమైన యాంధ్రానువాదము సంపూర్ణము

ఓం తత్సత్

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరామచరితమానసము

అయోధ్యా కాండము

ద్వితీయ సోపానము

W22

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరామచరితమానసము

అయోధ్యాకాండము

ద్వితీయసోపానము

ప్రథమవిశ్రామము

శ్రీకల్యాణగుణాలయ ! పాకారిప్రముఖవినుతపాదాంభోజా ! ప్రాకృతబంధవిమోచన ! శ్రీకర ! హరి ! మట్టపల్లి శ్రీనరసింహా !

ఉ. అంకముపై నపర్ణ, శిర
మందు సురాపగయున్, జటాళి నే
ణాంకుఁడు, కంఠమందు గర
ళాగ్ని, యురంబున సర్పరాజు, ఫా
లాంకమునందు వహ్ని, తను
వంతయు భస్మపరాగ మొప్పుశ్రీ
శంకరుఁ డీశుఁ డవ్యయుఁడు,
శర్వుఁడు నన్ననయంబుఁ గాచుతన్.

ఉ. పట్టముఁ గట్ట నెంచిన శు
భంకరకాలమునందు మోదమున్
నట్టడవిన్ జరించుచు ఘ
నశ్రమ లొందెడివేళ ఖేదముం

బుట్టక, వెల్గు లీను రఘు
పుంగవు దివ్యముఖారవింద మె
ప్పట్టున మా కొసంగుతఁ గృ
పన్ వరమంజులమంగళంబులన్.

ఉ. ఆపరమేశు, నారఘుకు
లాధిపు, నానవనీలపద్మరా
గోపమకోమలాంగుని, స
ముజ్జ్వలసుందరజానకీసమా
రోపితవామభాగు, రణ
రూఢమహాశరచారుచాపసం
దీపితహస్తు, రాఘవు మ
దిన్ స్మరియించి నమస్కరించెదన్.

గీ. శ్రీగురుచరణపద్మపరాగకణము
మన్మనోముకురమును నిర్మల మొనర్ప,
ఫలచతుష్కప్రదాయి యై వెలయుచున్న
రఘుకులోత్తంసుకీర్తి వర్ణన మొనర్తు.

కథాప్రారంభము

శ్రీరామచంద్రుండు సీతఁ బెండ్లాడి
స్వీయగృహంబుఁ జొచ్చిననాఁటినుండి
అట నిత్యనవమంగళాహ్లాద మెసఁగె.
భువనచతుర్దశభూరిభూధరము
లందున సుకృతమేఘాళి వర్షించె-
వరసుఖవారిఁ; బర్వతరాకుమారి!
బహువృద్ధిసిద్ధిసంపన్నదీచయము
లుప్పొంగి యా యయోధ్యోదధిన్ గలిసె;
పురనరనారీసమూహంబు వెలిఁగె
సుకులంబు, శుచి, సర్వసుందరత్వంబుఁ
గల యమూల్యపుమణిగణముచందమున.
నగసుతా! సాకేతనగరవిభూతి
వర్ణనాతీత మై భాసిల్లుచుండె!
అద్దాని రచియించుటందు విరించి
ధారపోసెనుసుమా తనశక్తి నెల్ల.
శ్రీరామచంద్రసుశ్రీముఖచంద్ర
బింబంబుఁ గని సర్వవిధముల పౌరు
లంద రానందంబు నందుచు మనిరి.
తమ మనోరథవల్లి తగ ఫలియించు
టరసి, మువ్వురు తల్లు లానందపడిరి.
నిజసఖీపరిజననికరయుక్తముగ
శ్రీరామగుణరూపశీలస్వభావ
ములఁ గని, వినుచు, ప్రమోదంబొందుచుండె
దశరథధారుణీధవుఁడు, ముఖ్యముగ.
సర్వప్రజల నొక్క సంకల్ప మొదవె:
"తనజీవితంబండె దశరథేశ్వరుఁడు
శ్రీరాము యువరాజుఁ జేయునుగాక"
అని జనులెల్ల నిజాంతరంగముల
ప్రార్థించి రమ్మహేశ్వరుని, శంకరుని.
ఒకనాఁడు తనదు పేరోలగమందు
రఘురాజు దశరథరాజేంద్రుఁ డలరె
సర్వసభాసదసంయుతుం డగుచు.
అఖిలపుణ్యాకృతి యైన ఆ నృపతి
వినియు శ్రీరాముని విమలయశంబు
అమిత మాయుత్సాహ మందె డెందమున.
ఆమహానృపుకృప నభిలషించెదరు
సర్వభూపాలకుల్ స్వాంతరంగముల;
దిక్పతుల్ సైత మా ధీరున కెపుడు
మిత్రు లై, హితరీతి మెలగుచుండెదరు.
మూఁడు లోకములందు, మూఁడు కాలముల,
జగమున దశరథత్మానాథుఁ బోలు
భూరిభాగ్యోపేతపురుషుండు లేఁడు;
అఖిలమంగళమూల మైన శ్రీరాము
తనయుఁ గాఁ బడసిన ధన్యునిఁ గూర్చి
ఎంతచెప్పినఁ గాని యెక్కువగాదు!

దశరథుఁడు శ్రీరాముని యువరాజ్య పట్టాభిషిక్తుం జేయఁ దలపెట్టుట

ఒక్కనాఁ డతఁడు పేరోలగమునకు
వచ్చెడి ముందు, స్వభావానుసరణి
ముకురమందున ముఖమును జూచుకొనుచుఁ
జారుకిరీటంబు సవరించుకొనియె;
అప్పు డాతనిచెవియందుఁ గాన్పించె
వెల్లగా నెఱసిన వెండ్రుక; లవ్వి-
వృద్ధత్వ మరుదెంచి, వీనులలోన,
"ఓనృపా! శ్రీరాము యువరాజుఁ గాగ
సలుపుము నీజన్మ సాఫల్య మొందు"-
నని యుపదేశించు నట్లులఁ దోఁచె.
అంత నా విభుని హృదంతరాళమున
రామాభిషేకంబు రయమునఁ జేయ
గాఢసంకల్పంబు కలిగె; నా క్షణమె
సుముహూర్తమును జూచి క్ష్మోణీధవుండు,

తగుసమయంబునఁ దన గురుదేవుఁ
డగు వసిష్ఠునిపాలి కరిగియు నెఱఁగి
తనవాంఛ వినిపించెఁ, దన్మాయత్వమునఁ
బులకింపఁ దనువు, సమ్మదమొంద మనము.
"ఓ మునినాయకా! ఓ ప్రభూ! దేవ!
అఖిలకళాపూర్ణుఁ డయ్యె రాముండు.
సచివులు, సేవకుల్, సకలపౌరులును,
మచ్చత్రుజనులును, మన్మిత్రజనులు,
మఱి, యుదాసీను లా మానవుల్ కూడ,
శ్రీరాము నావలెఁ బ్రేమించుచుండ్రు.
ప్రభు! త్వదాశీస్సులే, రామురూపమునఁ
దనువుఁ ధరించె నీ ధాత్రీస్థలాన.
పరివారయుతముగా బ్రాహ్మణు లెల్ల
మీవలె రాముఁ బ్రేమించుచుండెదరు.
శ్రీగురుచరణాబ్జరేణువు నెవఁడు
తన శీర్ష మందున ధరియించు, వాని
వశ మౌను సకలవైభవములు స్వామి!
ఇందు నా యనుభవం బెవనికిన్ లేదు.
భవదీయపావనపాదరజంబుఁ
బూజించి సర్వంబుఁ బొందితి నేను.
ఇప్పుడు నా దగు హృదయంబులోన
నొక వాంఛ మాత్రమే యుండెను మిగిలి;
అదియు సిద్ధించు నాథా! తమకృపను."
అని పల్క దశరథుఁ, డా ధరావిభుని
సహజభక్తికిఁ దాఁ బ్రసన్నత నొంది
ముని పల్కె నీ రీతి, "భూతలనాథ!
భవదీయవాంఛను బ్రకటింపు మెదియొ?
నీ శుభనామంబు, నీ మహోయశము,
సర్వాభిమతముల సఫలమొనర్చు.
నీవు కోరక ముందె నీ వాంఛితార్థ-
మరుదెంచు నీ వెంట నవనీశమౌళి!"
అని పల్క విని, తన ఆచార్యవరుఁడు
సర్వవిధాలఁ బ్రసన్నుఁ డై యుంట,
హసితాననుం డయి ఆధరావిభుఁడు
మృదువాణి గదుర నీ రీతి వచించె:
"ఓనాథ! శ్రీరాము యువరాజుఁ జేయఁ
గాంక్షింతు; మీకటాక్షము వచ్చెనేని
ఉచితసన్నాహంబు లొనరించువాఁడ;
మజ్జీవితమునండె, మౌనివరేణ్య!
జరిపిన నిమ్మహోత్సవ మెల్ల జనుల
కన్నులు సఫలముల్ కాఁగల వయ్య!
ప్రభు! మీప్రసాదమువలన శివుండు
సర్వంబు నెఱవేర్చెఁ జల్లఁగా మున్ను;
ఈ యొక్కకోర్కె నా యెదలోన మిగిలె.
ఈ వాంఛ సిద్ధించెనేని, ఆపిదప
ఈ తను వున్నఁ బోయిన నే గణింప;
పశ్చాత్తపించెడిపని యుండ, దింక
నిర్విచారం బయి నెగడు నా మనసు."
అని వచియించిన ఆ దశరథుని
పూర్ణమంగళమోదమూలంబు లైన
సమ్మతవాక్యముల్ శ్రవణంబొనర్చి,
ముని వచించెఁ బ్రసన్నముఖముతో నిటుల:

వసిష్ఠమహర్షి శ్రీరాముని యువరాజ్యాభి
షిక్తుంజేయ నంగీకరించుట

"వినుము నృపా! రామవిముఖతచేత
నుగ్రపశ్చాత్తాప మొదవు జీవులకు.
ఆరామభజనమే ఆత్మతాపంబుఁ
జల్లార్పఁ గలుగును; సదమలప్రేమ
ఎవ్వరిహృదయాన నెపుడు వసించు,
వారిని రాముఁడు వదలక సతము
అనుగమించును నీడయట్లు మహీశ!
అట్టిరామప్రభు వాత్మపుత్రుఁడుగ
నీ కుదయించెను నేఁడు ధరిత్రి.

సలుపకు మిఁక జాగు, సత్వరంబుగను
సకలసన్నాహముల్ సలుపుమా, రాజ!
శ్రీరాము యువరాజుఁ జేయుదినంబె
సుదినంబు, ఆరోజె శుభనిలయంబు"
అంత మహీపతి యానందపడుచు
మందిరంబున కేగి, మంత్రిసుమంత్ర
సేవకజనములఁ జెలఁగ రావింప,
'జయ జయ రాజేంద్ర! జయ చిరంజీవ'
అని వినమితశిరులై రివా; రపుడు
తనసుమంగళవాంఛఁ దద్ధరావిభుఁడు
ప్రకటించి, "మీ కిది భావంబులందు
సమ్మతం బైనచో సంతోషముగను
చేయుఁడీ రామాభిషేక" మనంగ,
స్వీయాభిమత మను వృక్షశాబకము
పాలిటి చినుకు లాపలుకులు వినియు,
మంత్రులు సమ్మోదమానసు లగుచు,
ముకుళితహస్తు లై భూతలనాథుఁ
బ్రార్థించి, "రో జగత్పాలనచతుర!
ఘనజగన్మంగళకరము నీవాంఛ!
ఓ నాథ! ఆలస్య మొనరింపవలదు.
శీఘ్రు మీకార్యంబు సేయుఁ" డ టంచు.
సచివుల ఆ సుభాషణ మాలకించి–
ఒక బలిష్ఠం బగునుర్వీజశాఖ
లభియించినప్ప డాలంబనంబునకు
విలసిల్లువల్లి కవిధముగా, మిగుల
ముద మొందె దశరథభూనాయకుండు.

దశరథుఁడు మంత్రులకు అభిషేకసంభా
రంబుల సమకూర్ప నాజ్ఞాపించుట

"శ్రీరామరాజ్యాభిషేకంబుకొఱకు
ఆ వసిష్ఠమునీంద్రు నాజ్ఞానుసరణి
సర్వసంభారముల్ సమకూర్చుఁ డింక
శీఘ్రుంబుగా మంత్రిశేఖరులార!"
అని వచియించె నా యవనీశ్వరుండు.
అంత వసిష్ఠమహర్షి హర్షించి,
"సకలస్తీర్థరాజముల జలంబు
సమకూర్చుఁ" డని పల్కె సచివులతోడ
మృదువాణి యొప్పగా మిగుల బ్రేమమున,
బహుళౌషధీమూలఫలపుష్పపర్ణ
చామరహరిచర్మసముదయంబులును,
పలుపలు రకముల భాసిల్లుచుండు
అగణితజాతిపీతాంబరావళులు,
సేలులుం, జిత్రకౌశేయవస్త్రములు,
మణిగణకోటులు, మఱియు ననేక
రాజ్యాభిషేకకార్యమునకు వలయు
మంగళవస్తువుల్, మహానీశ్వరుండు
పేర్కొ-నె-సమకూర్పఁ; బ్రీతి వెలుంగ
వేదోచితంబులౌ విధు లెల్లఁ దెలిపె.
"వివిధవితానముల్ విరచించి పురిని
వీథులందున దిశావితతి నెల్లెడల
సఫలవిశాలరసాలమహీజ
భాసురక్రముకరంభాకదంబముల
నాటింపవలయు విన్నాణంబు దనర;
రమణీయమణిమయరంగవల్లికల
వీథివీథులయందు విరచింపవలయు.
జనులకుఁ దెల్పుఁడీ సత్వరం బొప్ప
ఘనరాజవీథి శృంగారింపుఁ డనుచు.
విఘ్నేశపూజ గావింపఁగా వలయు:
ఆచార్య, కులదేవతార్చనల్ చేసి
సర్వవిధంబుల శ్రీమాసురసేవ
గావింపవలయును, గడుభక్తితోడ.
ధ్వజపతాకంబులు వరతోరణములు
కలశంబు లేర్పాటుఁ గావించవలయు;
మఱియును రథగజమత్తేభములను

సమకూర్చవలయును సంసిద్ధముగను."
అను మునిశ్రేష్ఠుని యా దేశములను
శిరసావహించియు శీఘ్రుంబ చనిరి
తమతమపనులను దగ నొనరింపఁ
దన్మంత్రు, లంతటఁ దపసివతంస!
ఆ మునీశ్వరుఁ డేమి యాజ్ఞ నిచ్చినను
శీఘ్రుంబుగా వారు చేసి రాపనులు
అంతకు మున్నె తా మవి చేసినట్లు.
రా జంతఁ బూజించె బ్రాహ్మణావళిని
సాధుసురావళి న్సద్భక్తితోడ;
రామహితార్థమై రాజితరీతిఁ
గడుశ్రద్ధ మంగళకార్యముల్ సలిపె.
శ్రీరామచంద్రాభిషేకసువార్త
పౌరులచెవులలోఁ బడియె నిం కేమి?
ఆ యయోధ్యాపుర మంతయు నిండె
కోటిమంగళవాద్యకోలాహలములు.
జానకీరాముల సదమలాకృతుల
శుభశకునంబులుఁ జూపట్టె; వారి
అమలమంగళసుందరాంగంబు లదరె;
పులకింపఁ దనువు లుప్పొంగ వాత్సల్య
మా జానకీరాము లనుకొని రిట్లు:
"ఆనందకరభర తాగమనంబు
సూచింపుచుండె నీశుభశకునములు.
బహుకాల మయ్యెను భరతుండు జనియు;
ఆతనిఁ గన మన కతిప్రీతి యుండె.
ప్రియసమాగమము లభించున టంచు
శుభశకునంబులు సూచింపుచుండె.
భరతునిఁ బోలిన పరమప్రియుండు
ఈజగంబున మన కెవ్వఁడు లేఁడు.
ఈశుభశకునాళి కిదియే ఫలంబు."
రాముఁడు పార్వతీ! రాత్రింబవళ్లు
తనతమ్ము భరతునిఁ దలపోయుచుండెఁ

గమఠమండంబులకరణి స్వాంతమున.
అంతఃపురాంగన లాశుభవార్త
విని, పూర్ణచంద్రుని వీక్షించుతఱిని
జలధివీచీవిలాసమున శోభిలిరి.
ఆవార్తఁ దొలిఁ దెచ్చినట్టివారలకు
వరభూషణాంబరబహుమానకోటు
లిచ్చి మహారాణు లెల్లరుఁగూడ
పరమానురాగసంభరితాత్మ లగుచుఁ,
దనువులు పులకింపఁ దన్మయత్వమున
మంగళకలశముల్ మానితరీతి
సమకూర్పసాగిరి, సంయమివర్య!
రమణీయబహుచిత్రరంగవల్లికల
రచియించె మణులతో రాజ్ఞి సుమిత్ర.
ఆనందమగ్న యై యలరామమాత
భారుణీసురలను దనిపి దానముల;
కడుఁ బూజఁ గావించి గ్రామదేవతల,
సురనాగగణముల, శుద్ధాత్మతోడ
బలుల సమర్పించి ప్రార్థనఁ జేసె–
"శ్రీరామకల్యాణసిద్ధిదం బైన
వరము నొసంగుఁడీ వరకృప"ననుచు.
శశివదనలు మృగశాబకనయన
లంత మంగళగీతికాళి శ్రావ్యముగఁ
బాడిరి కోయిలల్ పాడిన వనఁగ.
శ్రీరామరాజ్యాభిషేకంబుఁ దెలిసి
సర్వనారీనరుల్ సంతోషపడిరి.
విధి, మన కనుకూలవిధమున నుండె
నని తలంచుచును మహాప్రజ లెల్ల
నుత్సవసన్నాహ మొనరించుచుండ్రి.

దశరథుఁడు వసిష్ఠమహర్షిని శ్రీరామునొద్దకు పంపుట

దశరథధారుణీధవుఁడు వసిష్ఠు

రావించి పంపించె రామధామమున
కుచితోపదేశంబు లొనరించుకొఱకు.
ఆత్మీయగురువర్య నాగమనంబు
చెవిసోకినంతనే శ్రీరఘుస్వామి
ద్వారంబు చెంతకుఁ దా నెదుఁగేగి
పాదపద్మంబులపై వ్రాలి భక్తి,
రహి, *షోడశోపచారములఁ బూజించె.
తదనంతరంబు, సీతాసమేతముగ
గురుపాదములఁ బట్టుకొని రామవిభుఁడు
పాణిపద్మంబుల భక్తిఁ జోడించి
ప్రార్థించె నీరీతి, "వరగురుదేవ!
సేవకునింటికి శ్రీస్వామి రాక
మంగళమూల, మమంగళహరము;
అయినను భృత్యుల నధిపతుల్ నాథ!
సంప్రీతిఁ బిలిచి యాజ్ఞాపింపఁ జెల్లు;
నీతిపద్ధతి యిది; నే డట్లుగాక
ఆత్మాధికారంబు నావలఁ ద్రోసి,
నాస్వాములే యిట్లు నాపైనిఁ గృపను
వేంచేసినారు—పవిత్ర మైపోయె
మాగృహం బీనాఁడు. మానివరేణ్య!
భవదాజ్ఞ కెప్పుడు బద్ధుండ నేను.
స్వామిసేవాపరత్వమునఁ గాదె
సేవకుం డెప్పుడు శ్రేయస్సు నొందు."
అనెడి ఆస్నేహవాక్యంబు లాలించి
ముని ప్రశంసించె రాముని రఘువరుని,
"హంసవంశవతంసుఁ డన విరాజిల్లు
నీవాణి యుచిత మై నెగడదే" యనుచు.
శ్రీరామవరగుణశీలస్వభావ
ములవర్ణనముఁ జేసి మునివల్లభుండు
శ్రీవసిష్ఠమహర్షి చెప్పె, నీరీతి
ప్రేమభావోద్వేగవివశతచేతఁ
దనువెల్లఁ బులకీకృతంబయి వెలుఁగ:
"అభిషేకసన్నాహమవనీశ్వరుండు
సలిపెను; ని న్నింక సాకేతమునకు
యువరాజుఁ గాఁ జేయు నో రామచంద్ర!
నీ వీదినంబున నియతి వహించి
సముచితవ్రతముల సలుపంగవలయు—
నీశుఁ డీశుభకార్య మీడేర్చుకొఱకు".
అని పల్కి నృపుచెంత కరిగె గురుండు;
రాముఁడు హృదయాంతరాళంబునందు
విస్మయం బొంది యీవిధముఁ జింతించె;
"ఏనును నాతమ్ము లేకకాలమున
జన్మించినారము జగతీతలాన;
ఒక కంచమునఁ దిని ఒక మంచమందు
శయనించినారము; సర్వదా మేము
ఆటల పాటల యందు నేకముగఁ
బాయకుంటిమి మాదుబాల్యకాలమున;
అల కర్ణవేధయు, నల యుపనయన
మల వివాహాదికార్యంబు లన్నియును
ఏకముహూర్తమందే సంఘటించె.
అమలమౌ మావంశమం దున్నయట్టి
అనుచితం బొక్కటే: అది పెద్దవాఁడు
తమ్ముల విడనాడి "తా నొక్కరుండె
అభిషేకితుం డగు నాచార మకట!"
ఇట్లు చింతించె మునీశ! రాఘవుఁడు
ఆరామవిభుని మహానురాగంబు

---

* తాంత్రికశాస్త్రోక్తములైన షోడశోపచారములు: 1. ఆసనము 2. పాద్యము 3. అర్ఘ్యము 4. ఆచమనీయము 5. స్నానీయము 6. గంధము 7. వస్త్రము 8. పుష్పము 9. ధూపము 10. దీపము 11. నైవేద్యము 12. ఆచమనీయము 13. తాంబూలము 14. దక్షిణ 15. ప్రదక్షిణము 16. నీరాజనము.

వాత్సల్యభావంబు, భక్తులలోని
కుటిలత్వ మెల్లఁ బోఁగొట్టునుగాక!
ఆసమయంబున నరుదెంచె నటకు
మునిఁగి ప్రేమానందమున, లక్ష్మణుండు;
రఘుకులకైరవరాకేందుఁ డైన
శ్రీరాముఁ డతనినిఁ బ్రియవచనముల
సన్మాన మొనరించె సదమలప్రీతి.
బహువిధవాద్యశబ్దంబులు మ్రోసె;
పురిలోనఁ జెలఁగు ప్రమోదసంరంభ
మహ! వర్ణనాతీత మై విలసిల్లె.
అందఱు భరతుని యాగమనంబు
కై ప్రార్థనముఁ జేసి, రాత్మలలోన.
భరతుండు శీఘ్రమే వచ్చినయెడలఁ
గనుల సాఫల్యమ్మ్ముఁ గాంచుఁ గా నాతఁ-
డని వారిలో వార లనుకొనుచుండ్రి.
ప్రతివీథియందునుఁ బ్రతిగృహమందు
బ్రతికూటమందును బ్రజ పరస్పరము,-
"దేవుఁడు మనవాంఛఁ దీర్చెడికొఱకు
ఎప్పు డాశుభలగ్న మేతెంచు రేపు?
సీతాసమేతుఁ డై శ్రీరామవిభుఁడు
బంగారుగద్దెపై భాసించు నెపుడొ?
ఎప్పుడు మనకోర్కె- యీడేరు?" ననుచు
మాటాడుకొనుచుండ్రి మానినవరేణ్య!
ఎల్లరుఁ దెలవారు నెప్పుడో? యనుచు
నుత్సాహపడుచుండి రుద్ధృతలీల.
ప్రజలంద ఱీరీతిఁ బ్రార్థించుచుండ
ఆస్వార్థపరు లైన యమరు లీలోనఁ
గార్యవిఘ్నము గాఁగఁ గాంక్షించి తాము
ప్రార్థింపఁగడఁగి రీశ్వరుని; దొంగలకుఁ
బండువెన్నెల రేయి పనికిరానట్లు
సాకేతపురిలోని సంబరం బెల్ల
నిర్వాణకోటికి గిట్టకపోయె.

శ్రీరామపట్టాభిషేకమునకు విఘ్నమొనర్పు
మని దేవతలు సరస్వతిని బ్రార్థించుట

ఆహ్వానమొనరించి యంత శారదను
వినయంబుతోడను వినతు లొనర్చి
పాదాబ్జములపైనఁ బలుసార్లు వ్రాలి
దేవతాకోటి ప్రార్థించె నీరీతి:
"ఓ జగజ్జనని! మా యుగ్రవిపత్తు
వీక్షించి యీకార్యవిఘ్నం బొనర్చి
రాముఁడు స్వీయమారాజ్యంబు విడిచి
విపినవాసముఁ జేయువిధముఁగాఁ జేసి
దేవతాకార్యసిద్ధిని జేయవమ్మ!"
అను సురప్రార్థన మాలించి వాణి
నిశ్చేష్టురా లయి నిలిచి చింతించె—
"ఇల సరోజములను హేమంతరాత్రి
చందంబుగా నేను సాకేతజనుల
ఉల్లాస మార్పఁగా నుంటి" నటంచు.
అప్పు డామె ఖిన్నత నరసి దేవతలు
తిరిగి ప్రార్థించిరి దీనత నిట్లు:
"ఇందు నీకపకీర్తి యిసుమంత రాదు
జనని! శ్రీరఘురామచంద్రుండు సతము
సుఖదుఃఖరహితుఁ డై శోభిల్లుచుండు.
ఈవు పూర్ణంబుగా నెఱుఁగుదు వంబ!
ఆ రామదేవు మహాప్రభావంబు.
ప్రజ లన్నచో కర్మవశమున సతము
సుఖదుఃఖభాగు లౌచుందురు దేవి!
కావున దేవతాకార్యార్థ మీవు
శ్రీయయోధ్యాపురిఁ జేరఁగావలయు"
అని దేవతాగణ మామెపాదముల
మాటిమాటికి వ్రాలి మానక మిగుల
బలవంత మొనరింప, భారతి తుదకుఁ
బయనంబుఁ గావించె-భావంబులోన

అమరులు మతిహీను లని విచారించి.
"ఉచ్చలోకంబునం దున్న నీ సురలు
నీచకార్యంబులే నేర్తురు; వీర
లితరులమేలు సహింపలే" రనుచు
ఆశారదాదేవి ఆత్మఁ జింతించి,
అవనిసత్కవులు తన్నాశ్రయింపంగ
నిఁకముందు తా నిర్వహింపఁగాఁ బోవు
కార్యంబు నెల్లఁ జక్కఁగ విచారించి,
తాఁ బ్రవేశించెను దశరథపురిని-
దుస్సహదుఃఖసందోహదం బైన
గ్రహదశచందంబుగా భరద్వాజ!
మందమానస యైనమంథర యనెడి
ఒకదాసి కైకేయి కుండె మునీంద్ర!
దాని బుద్ధిబలంబుఁ దలక్రిందుఁ జేసి,
అపకీర్తి కద్దాని నాధారపఱచి,
అంతటఁ దనలోక మరిగె వాగ్దేవి.

శ్రీరామచరితమానసము

అయోధ్యాకాండము

ద్వితీయవిశ్రామము

ఓంకారరూపః కేశవః
హ్రీంకారనినాదశంఖహృద్యకరాబ్జాః
శ్రీంకారహృదయః మాధవః
క్ష్రౌంకారాః మట్టపల్లిసదన నృసింహా!.

మంథర శ్రీరామపట్టాభిషేకమును విఘ్న
మొనర్పఁ దలఁచుట

అపుడు మంథర అయోధ్యాశోభఁ జూచి
మంజులమంగళమహితవాద్యముల
సంరంభ మాలించి, జనులఁ బ్రశ్నించె—
"ఈయుత్సవమునకు హేతు వే?" మనుచు.
రామునితిలకధారణవార్తఁ దెలిసి
దహియించుకొనిపోయె దాని యెడంద.
వృక్షాగ్రశాఖకు వ్రేలాడుచున్న
తేనెపట్టును గాంచి తేనె గ్రహింప
యత్నించు కుటిల భిల్లాంగనరీతి
నా కుజాతి కుబుద్ధి యైనయా దాసి,
"ఈ కార్య మే రీతి నీరాత్రి కేను
విఘ్నంబుఁ గావింప వీలగు" నంచు
స్వాంతంబునందు విచారంబు సలిపి,
విలపించుకొనుచును వెడలె నా భరతు
మాతృసన్నిధి; కంత మంథరఁ గాంచి,
"ఎందుకే మంథరా! యిట్లు దుఃఖింతు?"
వని మందహాస యై అడిగె నా కైక.

అది మాఱుపలుకక యూరాటపడుచు
వేఁడినిట్టూర్పుల విడిచి, స్త్రీజనుల
విన్యాసముల నెల్ల వెలయఁజేయుచును
బొలబొలఁ గార్చెను మొసలికన్నీళ్లు.
అపుడు కై కేయి యి ట్లనియె నవ్వుచును:
"అవిధేయురాల వీ వందుచే నిన్నుఁ
జెలియ! లక్ష్మణుఁడు శిక్షించెనా యేమి?"
అని పల్కుచున్న మాఱాడక, సుంత
ఆ పాపమానసి యూర్ధ్వోశ్వశత
నుగ్రాహియట్లు నిట్టూర్పులు విడిచె.
అప్పుడు భయమొంది యూత్మ నారాణి,
"ఎందుకే మాట్లాడ వింతయైన?
రామభద్రుఁడును, ధరానాయకుండు,
సౌమిత్రి, భరతుండు, శత్రుఘ్ను, లిపుడు
కుశలమే గద?" యనఁ, గుబ్జ స్వాంతమున
వ్యాకులంబొందె, నా వాక్కు లాలించి.
"ఏల శిక్షింప న న్నితరులు? తల్లి!
ఏ యండ నా కుండె నెగసి పడంగ?
ఈనాఁడు కుశలుఁ డిం కెవ్వఁ డున్నాఁడు?
రాముఁడుగాక ధరానాథుఁ డతని
యువరాజుఁ గా జేయుచున్నాఁడు రేపు.
కౌసల్యాదినములు కడుమంచి వయ్యె.
ఇది చూచుకొని ఆమెహృదయగర్వమును
నిగ్రహం బొనరింపనేరని దయ్యె.

ఆ శోభ నంతయు నరయ వీ వేల?
ఆ వైభవముఁ గాంచినందుచే నాదు
భావమంతయును విభ్రాంత మైపోయె.
అల విదేశమున నీ యాత్మజుం డుండె;
నీకు లక్ష్యము లేదు, నృపుఁడు సంతతము
నీకు వశుం డయి నీ అఱచేత
నున్నట్లు నీ వెంచుచుందువు— కాని,
ఎఱుఁగవు నీవు రాజేంద్రునిలోని
కపటచాతుర్యంబు కాసంతయేని.
నీ పఱు పేమిటో? నీ నిద్ర యేమొ?
ఇవి తప్ప ఇం కొక్క— టెఱుఁగవు నీవు.”
అనుచు నా మంథర ఆడినయట్టి
ప్రియవచనంబుల వినియు, నద్దాని
కలుషచిత్త మెఱిఁగి కైక కోపమున,
“ఇఁక జాలు! నీ మాట లిఁక గట్టిపెట్టు
మిఁకమీఁద మఱుల నీ విటు లందువేని,
కలహబీజంబులఁ గడు నేర్పుతోడ
నాటికుటుంబముల్ నష్టంబొనర్చు
నీ నాల్క— బెఱుకెద నే” నని పలికె.
“సర్వసాధారణసరణి యే మనఁగ
ఏకాక్షులును గుబ్జు లిలఁ గుంటివాండ్రుఁ
గుటిలస్వభావు లై కుజను లై యుందు—
రందులో స్త్రీ లైన— నం దిఁక వారు
దాసీజనంబులా! తగఁ జెప్పనేల?”
అని పల్క— తా నవ్వె నా భరతాంబ.
కై కేయి తిరిగి యీశరణి వచించె:
“ఓ ప్రియవాదినీ! ఓ సఖీ! వినుము
హితము నేఁ జెప్పితి నింతగా నీకు.
స్వప్నమం దైన నీపై నాకు లేదు
కోప, మో మంథరా! కూర్మియే కలదు.
నీ వన్నవాక్కు— లు నిజ మైన దినమె
అతిపుణ్యదినము మహాశుభదంబు.
జ్యేష్ఠుఁడు స్వామి యై చెలఁగ, సోదరులు
సేవకు లై యుంట చెల్లు; నియ్యదియె
అర్కవంశస్థదివ్యాచార మెపుడు.
రేపటిదినమున శ్రీరామచంద్రు
నభిషేకమే నిజ మైన నో సకియ!
అడుగుము నీయిష్ట మైనట్టిదాని;
నీ కది తప్పక యే నిచ్చుదాన.
ప్రకృతిసిద్ధస్వభావమున, రాముండు
కౌసల్య నెట్టులఁ గాంచునో అటులె
తల్లుల నందఱఁ దగఁ బ్రేమఁ జూచు.
రామచంద్రున కంతరంగఁబునందు
సతము నాపై విశేషప్రేమ గలదు.
ఏఁ బరీక్షించితి నెన్ని యోసారు
లా రామునకుఁ గల దద్భుతప్రేమ.
ఈశుండు గృపబూని యీసారిగూడ
నరజన్మమే భువి నా కిచ్చునెడల
నల రాముఁడే పుత్రుఁ డగుఁగాక నాకు!
అల సీతయే కోడ లగుఁగాక నాకు!
రాముఁడు నా కహా! ప్రాణాధికుండు.
అట్టి శ్రీరాముని యభిషేకవార్త
కే వేల క్షోభింతు వీరీతిఁ! జెపుము!
‘భరతునితో’ డని పలుకు సత్యమును–
కపటరహస్యముల్ కడకుఁ ద్రోచియును.
ఆనందసమయమునందున నీవు
కడుశోక మందఁగాఁ గారణం బేమి?”
అన విని మంథర అనియె నీరీతి:
కైతవోక్తులచే మంథర కైకేయిబుద్ధినిద్రిప్పుట
“ఒకసారి మాట్లాడి యున్నమాత్రమున
ఫలియించెనమ్మ నా వాంఛ లన్నియును.
ఇం కొక్క— నాల్క—తో నిప్పుడు నేను
మఱుల మాట్లాడెద; మంచిచెప్పినను

నీకుఁ గోపము వచ్చె; నిజముగా నేఁడు
నా యభాగ్యశిరస్సు నడిమికి రెండు
ప్రక్క లై యుండును రాణి! కై కేయి!
భువిని సత్యాసత్యముల లెక్కఁగొనక
కపటవాక్యము లాడుఘనులె నీహితులు.
నీకు అప్రియురాల నేనెగా తలఁప.
ఈనాఁడు మొదలుగా నిఁకమీఁద యెప్పు
డేనును హితవాక్కులే పల్కుదాన;
కానిచో నానోరుఁ గదపక సతము
మౌనముద్ర వహింతు మాయమ్మ కైక!
నన్నుఁ గురూపిఁగా నలువ సృష్టించి
పృథివిఁ బరాధీనవృత్తి విధించె;
చేసినవారికిఁ జేసికొన్నంత!
ఎవరు రా జైన నా కేమి నష్టంబు?
నా యూడిగము తప్పునా? యిప్ప డేను
రాణిఁ గాఁబోదునా? రాజీవనేత్రి!
నా కున్నపాడుగుణం బది పోదు —
నీ పరాభవమును నేఁ జూడఁజాల.
అందుచే, సుంత మాటాడితి నిట్లు.
అయినది శాస్తి; ఘోరాపరాధంబు
క్షమియింపుమా దేవి! సత్కృపామతిని."

కైకేయి మంథరకపటోక్తులను విశ్వసించుట

అని దాసి వచియించు నా గూఢకపట
విహితవాక్యంబుల విని, రాణి కైక
భామాస్వభావచాపల్యంబుచేత-
అమరమాయావశ మైయుంటచేత-
హితురా లటంచు భ్రమించి, స్వాంతమున
ఆ శత్రురాలి నహా! విశ్వసించె.
శాంబరీగానరసంబున వనిని
సమ్మోహ మొందినశంబరం బట్లు
లా మంథరాకుటిలాలాపములకు
భ్రాంతాత్మురా లయి రాణి కైకేయి,
ప్రశ్నించె దానినిఁ బలుమారు ప్రేమ.
అల విధికృతమున, నా రాణిబుద్ధి
మాఱెను; మంథర మతి సంతసించెఁ
దనదు పన్నాగము తప్పిపోకుంట.
"కొంపలు గూల్చెడి కుటిలాత్మ ననుచు
నా కొక్కపే రిడినావు మాతల్లి!
మఱి గ్రుచ్చిగ్రుచ్చి యీమాఁడ్కిఁ బ్రశ్నింతు
విపుడు నోరెత్త నా యెద భయమొదవు"
అని పల్కె మంథర. ఆ ప్రకారముగ
కైకేయిమతి నమ్మకంబుఁ గల్గించి,
తనవైపు సర్వవిధంబులఁ ద్రిప్పి,
ఏడేడు పదునాలు గేడు లేడ్పించు
శనిమహాదశవలె సాకేతపురికిఁ
గష్టంబుఁ గల్గింపఁగాఁ బూనినట్టి
మంథర యీరీతి మాట్లాడె నంత;
"ఇప్పుడే నీవు వచించితి వమ్మ-
తగఁ బ్రియుల్ నీకు సీతారాము లనియు;
ఆ రామునకుసైత మాత్మ నీయందుఁ
గడుఁబ్రేమ యనియు; నిక్కంబు నీమాట.
కాని, ఈ సంగతి గతవిషయంబు;
ఆ రోజు లిప్పు డమ్మా! మాఱిపోయె.
స్థితిగతుల్ మాఱుటచేత లోకమున
సన్మిత్రజనులును శత్రు లయ్యెదరు.
కమలబాంధవుఁ డెచ్చుఁ గ్రాలు సూర్యుండు
జలములఁ బాసిన సమయంబునందుఁ
దక్కమలంబులన్ దగ్ధంబుఁ జేయు.
నీ సవతియును దా నీ కిఁకమీఁద
మూలంబునకుఁ దెచ్చు మోసంబు; కాన,
గట్టియుపాయ మన్ గంచెను గూర్చి
నినుఁ గాచుకొను మింక నీవు కైకేయి!
నీ పతిప్రేమను నిక్కమం బెంచి

నిద్రించుచుంటివి నిశ్చింతగాను.
నీవశుం డయియుండె నీ భ ర్త యనుచు
నీ వుంటి విప్పుడు నిర్లక్ష్యముగను.
మాటలు తీపియు మనసు విషంబు—
పృథ్వీంద్రు నాంతర్య మెఱుఁగవు నీవు.
కల్ల కాపట్యంబుఁ గలుగని యట్టి
పిచ్చితల్లివి నీవు వినుము నా మాట.
చతుర, గంభీర, కౌసల్య రామాంబ;
సమయంబుఁ గనిపెట్టి సలిపె నీరీతి.
అల రామమాతృమతానుసారంబె
మాతులు నింటికి మాన వేంద్రుండు
భరతుని ముందుగాఁ బంపించినాడు.
"సవతు లందఱు నన్ను సతము సేవింత్రు;
భరతునిమాత యే భావంబులోనఁ
బతి తనవశమందు వర్తించు ననుచు
గర్వించి నాసేవకై రా" దటంచుఁ
గౌసల్యహృదయానఁ గలదు క్రోధంబు.
కపటచాతుర్యముల్ గలిగిన దాఁటఁ
బయటికి మంచిగా వర్తింపుచుండు.
నృపునకు నీయందుఁ బ్రేమ మిక్కుటము;
సవతిమత్సరము నైజంబె యైయుంటఁ
గౌసల్యమనమునఁ గలదు ద్వేషంబు.
అందుచేఁ బన్నాగ మతిచతురముగఁ
బన్ని నృపాలుని వలయందు వైచి
శ్రీరామ పట్టాభిషేకం బొనర్పఁ
బెట్టించె లగ్న మీవిధముగాఁ దల్లి!
సారకులాచారసమ్మతం బగుచు
శ్రీరామపట్టాభిషేకంబు జరుగు;
నెల్లప్రజావళి కిది సమ్మతంబె.
ఈ నాకునైతము హిత మౌను; కాని,
భవితవ్యచింతచే భయఁపడుచుంటి.
ఆమె త్రవ్వినగుంటయం దామె పడును
గాక!—దేవునికృప గలిగినయెడల."
అని పల్కి మంథర, అతికౌశలమునఁ
గుటిలప్రబోధముల్ కొల్లగాఁ జేసి
కైకేయిబుద్ధిని గలుషంబొనర్చి,
ఆమెలోన విరోధ మతిశయింపంగ
సవతులకథ లొకశతము వచించె.
అంతట విధివశయై కైక నమ్మి
మంథరావాక్యముల్ మానసమందు.
తనపైన నొట్టిడి దానిని రాణి
మఱలఁ బ్రశ్నించెను మాన్యత మీఱఁ.
అప్పుడు మంథర యనసాగె నిట్లు:
"ఈవు న న్నడుగున దేమి? సంగతులు
ఇప్పటికేనిఁ గ్రహింపలేకుంట
ఆశ్చర్య మగుచుండె, నాత్మలో నాకు.
తన కేది మంచియో తనకేది చెడుగొ?
పశువున కేనియుఁ బాగుగాఁ దెలియు.
దేవిరో! పదునైదు దినములనుండి
అభిషేకసన్నాహ మగుచుండెఁ- గాని
నేఁడు నేఁ జెప్పఁగా నీ కిది తెలిసె.
నేఁ దినుచున్నది నీ విడునన్న
మేఁ గట్టుచున్నది నీ విచ్చువస్త్ర;
మందుచే ఉన్నసత్యంబు వచింప
నాకు దోషము లేదు; నామాట లెల్లఁ
గల్పన లైన లోకంబున నాకు
దగు శాస్తిఁ దేవుఁడే తప్పక చేయు.
తెపటిదినమున శ్రీరామచంద్రు
నభిషేక మే ఐనదా- నీదుతలనుఁ
బెనుముప్పు విధి తెచ్చిపెట్టినయట్లు
చేసి ప్రమాణముఁ జెప్పుచున్నాను-
పా లున్న చెంబులోఁ బడు నీగయట్లు
ఇఁక దిరస్కృత వౌదు విది యథార్థంబు.
ఈవు నీదు కుమారుఁ డిరువురుఁగూడ

వారిసేవకు లౌచు వర్తించునెడల-
ఇంట నుండఁగ నిత్తు రించుక; లేదొ
తలఁ దాచుకొన మీకుఁ దా వుండఁబోదు.
*కద్రువ వినతను గడుఁ గష్టపెట్టె;
అటులె కౌసల్య నీ కార్తిని గూర్చు.
బందీకృతుం డయి భరతుండు వగచు;
సౌమిత్రి రాముని సచివుఁ డై మనును."
అను కటువాణిని ఆలించి కైక
భయకుంచితాంగ యై పలుక లేకుండె.
క్రమ్మ ముచ్చెమటలు, కంపించె నామె
తనువెల్ల కదళికాతరుషండమట్లు.
అప్పు డాకుబ్జ జిహ్వాను గఱచుకొని
కపటకథాకోటిఁ గడునేర్పుతోడఁ
బలికియు రాణికి స్వాస్థ్యంబుఁ గూర్చి,
బోధించె ధైర్యంబుఁ భూనుమటంచు.
చివరకుఁ గైకేయి చిత్తంబు మాటి
దుష్కర్మమునకుఁ గుతూహలపడియె;
ఆమె, కొంగను హంస యని భ్రమియించె.
అంతఁ గైకేయి మాట్లాడె నీరీతి:
"మంథరా! వినుము నీమాటలు నిజము
నా దక్షిణాక్షి యనారతం బదరు;
ప్రతిరాత్రిగూడ దుస్స్వప్నముల్ గందు;
అజ్ఞతచేత నీ కవి చెప్పనైతి.
నే నేమి చేయుదునే? సఖి! నేను
సాధుస్వభావను; శత్రువు లెవరో? —
ఇల మిత్రు లెవ్వరో?— యెఱుఁగనిదాన.
ఈ నాటివఱకు నే నెవరికిఁగూడ
ఏ కీడుఁ గావించి యెఱుఁగ సుంతయును.
ఎందుకో? బ్రహ్మ నా కింతఘోరార్తి
సమకూడఁజేసె నాశ్చర్యమైతోచు!

అంతటికష్టమే అరుదెంచునెడల
పితృగృహమునకు నే వెడలి జీవింతు
నంతియేగాని నే నావంతయేని
సవతిని సేవింపఁజాల, నీబొండెఁ
బ్రాణంబు లున్నంతవఱకు నిక్కముగ.
అవనిఁ బరాధీనమందు జీవింప
వలసియేయున్న నాపనికన్న నేను
ప్రాణముల్ విడుచుటే, బహుసమంజసము."
అని రాణి పలుక దీనాలాపములను,
మాయలమారి ఆ మంథర కుబ్జ
తగిన కుతంత్రముల్ తాఁ బన్ని పలికె:
"ఇట్లు విచారింప నేల నో రాణి!
ఇట్టి నిరాశచే నే లాభ మొదవు?
నీదుసౌభాగ్యము నిత్యాభివృద్ధిఁ
గాంచుఁ గావుత దైవకరుణచే తల్లి!
ఎవరు ని న్వంచింపనెంచిరో లోన-
వారలే వంచింపఁబడఁగల రమ్మ!
ప్రియ! వారికుట్ర నే విన్నది మొదలు
ఎటు పోవుచున్నదో నేఁ దిన్నతిండి?
కంటికి నిద్రయే కరవయిపోయె!
దేవిరో! నేను జ్యోతిష్కుల నడుగ-
భరతుఁడే ధారుణీవల్లభుం డగును
గడుసత్య మనిరి; ఈ కార్యంబు జరుగు-
చెప్పిన రీతిగాఁ జేసినయెడల.
భామినీ! ఒక్కయుపాయంబుఁ జెపుదు:
నీకు వశ్యుఁడుగదా! నృపతి సతంబు."
అన విని కై కేయి అనియె నీరీతి:
"బావిలోఁ బడుమన్నఁ బడుదు తత్క్షణము;
పతి నైన సుతు నైన వదలివై చెదను.
కని నాదు దుఃఖంబుఁ గనికర మూని

---

* భారతము—ఆదిపర్వమునం దీచరిత్రము కలదు.

ఇది చేయుమని నీవు హితవాక్కులాడఁ
బెడఁచెవిఁ బెట్టి లాభించున దేమి ?
ఇంతయు నా మంచికే నీప్రబోధ."
కై కేయి తన కిట్లు కై వసమగుట
నొక యజ్ఞపశువుఁగా నొనరించి యామె
నా కుబ్జ, తనహృదయం బను శిలను
గపటత్వ మను తనఖడ్గంబు నూఁది
పదునుబెట్టెను భరద్వాజమునీంద్ర !
పచ్చిక మేసెడి బలిపశువటుల
కైక రానున్నదుఃఖంబు నెఱుంగ–
దా మంథరోక్తులయందు మృదుత్వ
మగపడుచున్నను అంత్యమం దమిత
కారుణ్యదుఃఖంబుఁ గలిగించఁగలవు;
విషయుక్తమధువుఁ ద్రావించెడిరీతి
అది యిట్లు వచియించె నా రాణితోడ:

మంథర కైకకు భరతపట్టాభిషేకము రామవనవాసము నను రెండు వరములు కోరుకొమ్మని ప్రబోధించుట

"స్వామినీ ! నీ యొకసారి నాతోడఁ
జెప్పియున్నట్టి విశేషంబు నీకు
గుర్తున్నదా? లేద? క్ష్మోణీధవుండు
ప్రియముతో నీ కిచ్చె రెండువరంబు,
లడుగు మవ్వాని, నీయాత్మ శాంతించు.
భరతాభిషేకంబు ప్రథమవరంబు;
శ్రీరామవనయాత్ర రెండవవరము.
ఈ రెండువరములనే కోరుకొనియు
సవతులముద మెల్లఁ జల్లార్పు మమ్మ.
'రామునితో, డని రాజు మున్నొందు
చెప్పినపిదపనే చెప్పుము వరము–
లల్లినఁ దాఁ దప్పఁ డాడినమాట.
ఈ రాత్రి గడచెనా! యింకఁ బని చెడును.
ప్రాణాధికములు నా పలుకు లటంచు
నమ్ముము గట్టిగా నా తల్లి! కైక!"
ఓ భరద్వాజ! ఋష్యుత్తమా! ఇటులఁ
బన్ని ప్రచండ మకోపన్నాగ మొకటి
పాపిష్ఠమంథర పలికె నీరీతి:
"కోపగృహమ్మునకున్ బొమ్మ లెమ్మ
చక్కఁబెట్టుము పని జాగరూకతను.
వేగిరపడి విభు విశ్వసింపకుము."
అన విని రాణి నిజాంతరంగమున
మంథర న్ప్రాణసమానఁగాఁ దలఁచి,
అద్దాని బుద్ధిబలాతిశయంబుఁ
దగఁ బ్రశంసించెను దాఁ బలుసార్లు.
"అఖిలప్రపంచంబునందున నాకు
నీవంటిహితురాలు నిజముగా లేదు.
ఘోరవాహినిఁ గొట్టుకొనిపోవుచున్న
వాఁ డొక చేయూతఁ బడసినరీతి
నేఁడు నీచేయూత నేను బొందితిని.
నా కీవు సాయమొనర్చితి విపుడు
నా కోర్కె సిద్ధించెనా! ఱేపు నిన్నుఁ
గంటిపాపట్టులఁ గాపాడుకొందు."
అని బహువిధముల నాదరించియును
తనదాసి యైనమంథరను, కై కేయి
కోపగృహంబునకున్ నిర్గమించె.
భీషణం బగు విపద్బీజంబునకును
పాపిష్ఠమంథర వర్ష కాలంబు;
కై కేయికుమతియే ఘనక్షేత్ర మయ్యె;
కపటాంబువులచేతఁ గలిగి యంకురము
వరదళద్వ్యయమును బ్రకటించె; నింకఁ
బరిణామమున దుఃఖఫలము లభించు.

కైకేయి కోపగృహమున శయనించుట

అలుకకుం దగువాని నన్నింటిఁ గూర్చి–

కోపగృహంబున క్షోణిభాగమున
శయనించెఁ గై కేయి సంయమివర్య!
రాచరికంబుచే రాజిత యయ్యె
తనదుష్టబుద్ధిచేఁ దగ భ్రాంత యయ్యె.
నగరియందున మఱి నగరంబులోన
అమితకోలాహలం బలరారుచుండె.
కాని కై కేయిలోఁ గలిగిన యట్టి
ఈ దురాలోచన మిసుమంత యైన
పాపము! తెలియ దెవ్వరికి మునీంద్ర!
పురనరనారీసమూహంబు లెల్ల
సమ్మద మొప్పఁగా సమకూర్చుచుండె
ఘనమంగళద్రవ్యగణముల నెల్ల.
అవనీంద్రసౌధ సింహద్వారసీమ
వచ్చిపోయెడిప్రజావాహినితోడ
ఎడ తెంపు లేకుండ నేకరీతిగను
గ్రిక్కిఱియుచుఁ గిటకిటలాడుచుండె.

శ్రీరాముఁడు తనబాల్యమిత్రుల నాదరించి పంపుట

రామాభిషేకవార్తను విని తాము
కడుహర్ష మొందుచుఁ గదలి జట్టుగను
బాల్యమిత్రులు రామభద్రు దర్శింప
వచ్చినా రనునట్టివార్త నాలించి
రామప్రభువు, వారి రాజితప్రేమ
తత్త్వంబు గ్రహియించి తగ నాదరించి
కోమలవాణితోఁ గుశలంబు లడిగె.
అంత నా బాలకు లానందపడుచు
తమప్రియమిత్రుఁ డౌదశరథాత్మజుని
ఆజ్ఞను గొని చని రాలయంబులకు-
శ్రీరాము మిగులఁ బ్రశంసించుకొనుచు.
"మనరాముతోడ సమానుఁ డైనట్టి
సౌశీల్యవంతుఁడు శాశ్వతహితుఁడు
ఈ ప్రపంచంబులో నిం కొకఁ డున్నె?
కర్మానుసరణి లోకంబందు మనము
ఎట్టియోనుల జన్మ మెత్తినంగాని
పరగ సీతాపతి ప్రభు వగునట్లు
మనము సేవకుల మై యనునట్లు చేయఁ
బరమేశ్వరుఁడు గృపవహియించుఁగాక!
ఈ మహాసంబంధ మెప్పుడుఁగూడ
శాశ్వతం బగుచును సాగునుగాక!"
ఈరీతి సర్వులు హృది నెంచుచుండ్రి;
కాని ఓ మునినాథ! కై కేయిహృదిని
దారుణవేదనాదావాగ్ని రేగె.
చెడువారు తోడైనఁ చెడనివా రెవరు?
చెడుగులబోధలఁ జెవిఁ దూర్చునరుఁడు
తప్పక కోల్పోవు తన వివేకమును.
సాంధ్యకాలంబున శ్లోకనాయకుండు
సంతోషమునఁ గైకసదనంబుఁ జేరె-
కాయంబుఁ దాల్చిన కఠినతకడకుఁ
దనువుఁ దాల్చినప్రేమ తరలినపగిది.

శ్రీరామచరితమానసము

అయోధ్యాకాండము

తృతీయవిశ్రామము

కృష్ణాకృపీటనికటాఁ।
తృష్ణానలశమనపరమదివ్యాకారాఁ।
వైష్ణవజనతాధారాఁ।
విష్ణూఁ। పిభుఁ। మట్టపల్లి వీరనృసింహాఁ।

కోపగృహంబును గూర్చి విన్నంత
క్ష్మానాయకుండు నిర్ఘాంతుఁ డైపోయె;
అడుగు ముందుకు వేయ నసమర్థుఁ డయ్యె,
భయమున నా నరపాలశేఖరుఁడు.
ఎవ్వని భుజబల మింద్రుండుఁగూడ
ప్రాపుగాఁ గైకొని బ్రతుకుచునుండు,
ఎవ్వానికృపను భూమీంద్రు లెల్లరును
ఆకాంక్ష సేయుదు రనవరతంబు,
అట్టిఘనుండు నిజాంగనాకోప
మున గడగడలాడిపోయెను; గనుఁడు—
దారుణకామపరితాపాతిశయము!
ఘనశూలకులిశాసిఘాతంబు లైన
భరియింపఁ గల్గిన బల్లిదుల్ గూడ
రతిపతి రువ్వెడిప్రసవాస్త్రములకు
తట్టుకోఁ జాలరు తాపసవర్య!
ఆత్మలో భయపడు చా నరేశుండు
తన ప్రియురాలిచెంతకు నిర్గమించి,
ఆమెదుర్దశఁ గాంచి అతిదుఃఖ మొందె.
ఆభరణంబుల నన్నిఁటి వదలి
ప్రాఁతగిల్లిన మోటువస్త్రములు దాల్చి
కటికినేలఁ బరుండి కైకేయి యుండె.
ఆమె ధరించిన ఆ నీచవేష
మకట! భవిష్యత్తునందు రానున్న
వైధవ్యదశను సుస్పష్టికరించె.
అంతఁ జెంతకుఁ బోయి అవనీశ్వరుండు,
"ఏలఁ బ్రాణప్రియా! ఇ ట్లాగ్రహింప?"
ననుచుఁ బ్రశ్నించెఁ దా నతిమృదులముగ.

కోపగృహమునన్న కైకను
దశరథుఁడనునయించుట

"ఇ ట్లీవు అలుగఁగా నేల? నారాణి!"
అని తనచేతితో నామె నొక్కింత
క్ష్మాపతి తాకఁగాఁ, గైక కోపమున
అట్టె తా విదలించి అతనిహస్తమును-
వాంఛాద్వయం బనఁబరగు నాల్కలను
కోడుచు, వరములన్ గోరలు మెఱయ,
ఆయువుపట్టున నరసి తాఁ గాటు
వేయఁ దూకొని యున్నవిషసర్పమట్లు
చుఱచుఱఁ జూచె నా క్షోణీంద్రమణిని.
పాప మాదశరథపార్థివమౌళి,
దానిని, భవితవ్యతావశంబునను
ప్రణయకోపం బని భావించెఁ గాని
ప్రళయకోపం బని భావింపఁ డయ్యె—

అని తులసీదాసుఁ డనుచున్నవాఁడు.
మఱలను మఱల నా మానవవిభుఁడు
కైకేయి ని ట్లనుగంగఁ దొడంగె:
"సుముఖీ! సులోచనా! శుకపికవాణి!
ఓ గజగామినీ! ఓ ప్రియా! కైక!
ఈ కోపకారణం బేమిటే! చెపుమ?
ప్రియ! నీకుఁ గీ డొనరించి రెవ్వారు?
ఆ రెండుతల లున్నయట్టివాఁ డెవఁడు?
ఆ మృత్యువును బిల్చునట్టివాఁ డెవఁడు?
ఏ భిక్షుకుని నే నరేశునిఁ జేయఁ
గావలె? ఏ నరకాంతు ఋణానఁ
జెలఁగ రాజ్యభ్రష్టుఁ జేయఁగావలెను?
చెప్పుమా! ఓ ప్రేయసీ! దాఁచకుండ.
నీ శత్రుఁ డైనచో నిక్కము నేను
అమరునిసైతము హతమొనరింతు:
ఇఁక గీటకప్రాయు లీనరు లెంత?
ఈవు నాదగుచిత్త మెఱుఁగుదు గాదె?
సుందరీ! నీ ముఖచంద్రబింబంబు
నరసి సమ్మోహిత మగుచుండు నాదు
చిత్తచకోరంబు. చెలియా! సతంబు
నా ప్రజావళియును నా పరిజనులు
నాదుసర్వస్వంబు నా కుమారులును
సఖి! నాదుప్రాణముల్ సైతముఁ గనఁగ
నీ యధీనంబులు; నీతోడ నేను
గపటవాక్యము లాడఁ గలిగితినేని
అల రాముపేర, నే, నప్రమాణములు
శత మొనరించిన చండపాపంబు
భామామణీ! నేను బడయుదుఁగాక!
ఈవు ప్రసన్న వై యిష్టార్థ మడుగు
మేదేనిఁ బ్రీతితో నే నొసంగెదను.
త్వన్మనోహర మైనతనువుపై నింక
భూషణంబుల ధరింపుము ప్రియా! లెమ్ము!

సమయోచితజ్ఞానసంయుక్త వగుచు
నీకువేషము వీడు మీ తత్ క్షణంబె".
అను మాటలను విని, యా మహాశపథ
మాత్మఁ దలంచుచు నజ్ఞ కైకేయి,
లేచి చివాలున లేనగ వొప్పఁ
దనువున భూషలు దాల్పఁదొడంగె-
అల కిరాతాంగన హరిణంబుఁ గాంచి
వలఁ బన్ను చుండినపగిది ముసీంద్ర!
అంతట నరపతి ఆమె ప్రసన్న
యయ్యె నటంచు నిజాత్మఁ దలంచి
మృదుమంజువాణితో ని ట్లనె మఱలఁ
బ్రేమభావోద్వేగవివశతచేతఁ
దనువెల్ల బులకీకృతం బయి వెలుఁగ:
"దేవి! నీ కోర్కె సిద్ధించె నిం కేమి?
పురిలోనిప్రతిగృహంబును విరాజిల్లె
నానందరూపమే యనఁగ; నే రేపు
శ్రీరాము యువరాజుఁ జేయఁగా నుంటిఁ-
గాన, సులోచనా! కడుసంతసమున
ఉత్సవశృంగార మొనరించుకొనుము."
అను మాటలను వినినంత ముసీంద్ర!
పొరపాటుచే హస్తమునఁ దాఁకఁబడిన
పరగఁ బొకమునకు వచ్చియున్నట్టి
గడ్డచందంబుగాఁ గైకేయి కఠిన
హృదయంబు పగిలిపోయెను బాధతోఁడ.
అయిన; నా పెనుబాధ నగపడకుండఁ
జిఱునవ్వు తెరక్రిందఁ జెలువుగాఁ దాఁచి
జోరునిభార్య హృచ్ఛోకంబు పైకిఁ
బ్రకటింపకను దాఁచుపగిదిఁ గైకేయి.
కౌటిల్యకోటిశిఖామణి యైన
మంథరయంతటిమాయలమారి
గురు వౌచు శిక్షణఁ గూర్చుటఁజేసి
మతి నామె కపటచమత్కృతిం దెలియఁ

జాలకపోయెను క్ష్మానాయకుండు.
అతినీతినిపుణుఁడే యగుఁగాక నృపుఁడు—
కాంతాస్వభావ మగాధాబ్ధి కాదె?
కపటానురాగంబు కనిపింపఁ గైక
వికసితముఖనేత్రవిన్యాస మొప్పఁ
జిఱునవ్వు వెలుఁగ వచించె నీరీతి.
"అడుగుము అడుగుము అనుటయే గాని
ఇచ్చిన దే మున్న డెప్పుడే గాని?
నాకు వాగ్దాన మొనర్చియున్నావు
వరములు రెండు పూర్వము నరపాల!
కాని వానిని బొందఁగలుగుట నేను
సంశయాస్పద మని స్వాంతమం దెంతు."

కైక కోరినవరము లిత్తు నని దశరథుఁడు
శపథము చేయుట

అన విని నవ్వు చి ట్లనెఁ బం క్తిరథుఁడు:
"అర్థమయ్యెసుమా! రహస్య మంతయును;
బ్రణయకోపంబుపై బహుర క్తి నీకు.
ఈనాఁటివఱకు నీ వెప్పుడుఁగూడ
ఆ వరద్వయము న న్నడిగిన దెపుడు?
నాకుఁ బరాకుగుణం బుండె, దాన
నేనును మఱచితి నీవరంబులను.
దోషంబు నాపైనఁ ద్రోయకు చెలియ!
రెం డేమి? ఇం కొకరెండు వరాల
అడుగు మొసంగెద నఱమర లేక.
ప్రాణముల్ విడువఁగా వలసిన సరియె
ఆడి తప్పుట కూడ దర్కవంశమున;
ఇది నిత్యనియమ మై ఎసఁగును మాకు.
అనృతసమంబుగా వఘుకోటి యైన.
గురివిందకుప్పలు గిరితోడ సమమ?
సుకృతాళి కెల్లను జూడ సత్యంబె
ఆధారమని నిగమాగమంబులును
వివిధపురాణముల్ విదితంబుచేసె;
మనుమహీపతియును మహిఁ బ్రకటించె.
ఇంతియే కాదు నే నీసమయమున
సర్వసద్గుణగణసంపూర్ణుఁ డైన
పరమోన్నతప్రేమవారిధి యైన
రఘువంశపతి యైన రాముని పైన
శపథంబు సైతము సలుపుచున్నాఁడ."

కైకేయి భరతపట్టాభిషేకము శ్రీరామ
వనవాసము నను రెండువరములుకోరుట

కైకేయి, కుమతి, ఈ కరణి నృపాలు
శపథబద్ధునిఁ జేసి సస్మిత యగుచు,
*నిజదుష్టమతఖగనేత్రయుగ్మమునఁ
గప్పిన మాతను గౌతుక మొప్పఁ
దీసివైచె మునీంద్ర! ధీశక్తిసాంద్ర!.
రాజమనోరథరమణీయవనిని
సుఖవిహంగంబులఁ జూచి, కైకేయి
యనెడిభిల్లాంగన అక్కటా! వదలె
కటువాక్యభీషణఖగము నుగ్రముగ.
"ప్రాణప్రియా! మహారాజరాజేంద్ర!.
అస్మత్ ప్రియం బగు నభిలాష వినుము:
భరతాభిషేకంబు ప్రథమవరంబు;
నా మనోరథమును నాథ! తీర్పంగ
హస్తముల్ జోడించి ప్రార్థించుచుంటి:
రెండవవరముగా శ్రీరామచంద్రుఁ
డడవుల మునివేష మమర విశేష

---

* వేటగాండ్రు పక్షులను వేటాడుటకు తమతో నొక డేగను తీసికొని పోయెదరు. దానికన్నులకు సామాన్యసమయములలో నితరపక్షులను జూడకుండ నొక తోలుమూత నుంచెదరు. అడవిలో వేటాడుసమయమున దానికన్నులకున్న గంతను తీసివైచి ఆడేగను పక్షులపైకివదలెదరు.

మైన యూదాసీన్య మాత్మ వహించి
పదునాలుగేడులు వసియింపవలయు”
అను తీక్ష్ణవాక్యము నాలించి నృపతి
అతివికలత నొందె నంతరంగమున
సోమునికిరణంబు సోక శోకించు
కోకంబు తెఱఁగున; గుండె రుల్లనఁగ
నతఁడు నిరుత్తరుఁ డై కొయ్యబారె
వనమున డేగచేఁ బడిన కౌ జటులు.
పిడుగు సోఁకిన తాళవృక్షంబు పగిదిఁ
నాతఁడు నిస్తేజుఁ డయ్యెఁ బూర్ణముగ.
శిరమునఁ జేతులు జేర్చి యా నృపతి
ముకుళించి కనులు వాపోవఁ దొడంగె–
దేహ మూనిన శోక దేవత వోలె.
“అన్నన్నానోరథ మను కల్పతరువు
బాగుగాఁ బూచియు ఫలియించుతఱిని
గై కేయి యను మదకరిచేత అకట!
ప్రేళ్ల తో సైతము పెకలింపఁబడియె.
హా! అయోధ్యాపురమంతయుఁ గైక
పాడుగావించి శాశ్వత విపద్దశను
జేఁజేతులను బ్రతిష్ఠించె నీనాఁడు.
మంగళవేళ నమంగళం బొదవె.
ఆడుదానిని నమ్మి అక్కటా! చెడితి–
యోగసిద్ధి ఫలింప నున్నకాలమున
యతి, అవిద్యావశుఁ డై చెడినట్లు.”
ఈరీతి దుఃఖించె హృది దశరథుఁడు.
అట్లు చింతాక్రాంతుఁ డైనృపాలుఁ
గని లోనఁ గుపిత యై కైక యి ట్లనియె:
“భరతుఁడు నీ తనూభవుఁడు కాదొక్కొ?
న న్నంగడిని దెచ్చినావ డబ్బునకు?
నే నాడుపలుకులు నీ చెవులందు
ములుకులవలె నున్న, ముందె యోజించి
వాగ్దాన మొనరింప వద్దన్న దెవరు?
ఇచ్చెద ననుము—లే కివ్వలే ననుము—
మఱి చెప్పు మీ రెండుమాటలు తేల్చి.
రఘుకులరాజపరంపరలోనఁ
గన, సత్యసంధాగ్రగణ్యుండ వీవు.
ఇచ్చినవరముల నివ్వలే ననుచు
సత్యంబు విడి దుర్యశంబును గనుము.
పిడికెడు పేలాల భిక్షింతు ననుచుఁ
దలఁచి పాపము వరద్వయ మొసంగితివి
కాఁబోలు— సత్యమున్ గడుఁ బొగడుచును.
తనుధనముల నైనఁ ద్యాగం బొనర్చి
శిబి, బలీంద్రుఁడు, దధీచియు, సత్యనిష్ఠఁ
బలికిన పలుకులు పాటించినారు.”
అని అతికటువాక్కు లాడెఁ గై కేయి
పుండుపై నుప్పను బోసినరీతి.
ధర్మధురంధరదశరథుం డంత
ధైర్యంబుఁ బూని నేత్రంబులు విప్పి,
“అక్కటా! కైక నా ఆయువుపట్టు
పైఁగొట్టె” నని నెత్తిపై బాదుకొనుచు
వేఁడినిట్టూర్పులు విడిచె మునీంద్ర!
ఒఱనుండి వెలువడ్డ యుగ్ర మైనట్టి
క్రౌర్యదేవతచేతిఖడ్గంబురీతి
ఎదుట నిల్చిన కైక నీక్షించె రాజు.
ఆ కేకయాత్మజ అను ఖడ్గమునకు
ఎంచగాఁ జెడుబుద్ధియే పిడియాను;
అలనిష్ఠురత్వమే అద్దానిపదును;
ఇల గూనిమంథర యే సానరాయి;
తత్కఠోరతరకరవాల
మీక్షించి యా నృపుఁ, “డిది యథార్థముగ
నా ప్రాణములఁ దీయునా? యేమి?” యనుచుఁ
దలపోసి తుద కెదఁ దాల్చి ధైర్యమును
వినయోక్తి లొప్ప నీ విధముగాఁ బలికె:
“ప్రేమవిశ్వాసముల్ విడి ప్రియురాల!

అనుచితవాక్కు లిట్లాడు టెందులకు?
భరతుఁడు రాముఁడుఁ బరగ నా కిర్వు
రిరునేత్రములు, భీరహృదయ! కైకేయి!
శంకరు సాక్షిగా సత్యమాడితిని.
తెప్పుప్రాతఃకాల మే నవశ్యముగ
దూతను బంపఁజేతును శీఘ్రురీతి.
విన్నంతనే వార్త వేగిర మొప్ప
భరతశత్రుఘ్నులు వచ్చెదరంత
శుభదినం బొక్కటిఁ జూచి సంప్రీతి
నఖిల సన్నాహసమంచితముగను
బట్టంబుఁ గట్టెద భరతున కేను.
రాఘవునకు లేదు రాజ్యలోభంబు;
భరతునిపై రామభద్రుని కెపుడు
పరమానురాగంబు భాసిల్లుచుండు.
నృపనీతిరీతిని నేను రామునకు
అభిషేక మొనరింప నాత్మ నెంచితిని—
జ్యేష్ఠకనిష్ఠతల్ చింత గావించి
వందసాతులు రామభద్రునిపైన
శపథంబుఁ గావించి సత్యమాడెదను;
ఈ విషయంబున నెప్పుడుఁగూడ
ఒక్కమాటయుఁ బల్కియుండఁగా లేదు.
నాతోడఁ గౌసల్య నమ్మ మీ మాట.
నీతోడఁ దెలుపకయే నేను సకియ!
తివిరి స్వతంత్రించితిని నిజం బిద్ది;
అస్మన్మనోరథ మందుచే నకట!
విఫలతఁ బొందె నీవిధముగా నేఁడు.
ఇంక నీ కోపంబు నిదె విడనాడి
వేగఁ దాల్పుము శుభవేషంబు చెలియ!

దశరథుఁడు భరతపట్టాభిషేకమునంగీకరించి
శ్రీరామవనవాసము సమంజసముకాదని
కైక నర్థించుట

కొలఁది రోజులలోనఁ గొమరొప్ప భరతు
యువరాజుఁ గాఁ జేతు నో ప్రియా! వినుము.
కాని నా కొక్కడే కడువగఁ గూర్చు:
అరయ రెండవవరం బసమంజసంబు;
దానిచే నా యెద దారుణశోక
దావాగ్నికీలచేఁ దపియించుచుండె.
అహ! రోషమా? పరిహాసమా యిద్ది?
ఇది యెల్ల నిజ మానతే సఖి! చెపుము.
వదలి రోషము రామభద్రునోషంబుఁ
దెలుపుమా దాచక తేట తెల్లముగ.
పరమసాధువు రామభద్రుఁ డటంచు
సర్వులు జగతిఁ బ్రశంసఁజేసెదరు.
ఈవును రాము నట్లే ప్రశంసించి
అమిత మాప్రేమతో నరయుచుండెదవు.
ఇప్పుడు నీకోర్కె నే విన్నపిదప
సంశయం బొదవెను స్వాంతంబునందు.
అరిజనులకు సైత మనుకూల మైన
వరరామచంద్రస్వభావ మెట్లు
కూర్మిమాతకుఁ బ్రతికూలమై యుండు?
ప్రియ! రోషహాసముల్ విడిచి నీ వింక
వరవివేకవిచారభాసుగం బైన
వాంఛను దెలుపుము భరతాభిషేక
కార్యంబుఁ గనులారఁ గాంచి సుఖింప.
జలముల విడిచి మత్స్యము మనవచ్చు;
ఫణమునన్ గల మణిఁ బాసి సర్పంబు
దుఃఖైన్యంబులతో మనవచ్చు;
ఏను నిష్కపట్యహృదయంబుతోడ
పరమసత్యంబును వచియింపుచుంటి:
రాముఁడు లేక నేఁ బ్రతుకఁగఁజాల.
ఓ బుద్ధిశాలినీ! ఓ ప్రియా! కైక!
నమ్ముము దృఢముగా నాదుజీవనము
సర్వదా రామదర్శనసుఖవశము."

అను మృదువాక్కు-ల నాలించి కుమతి
యైన కైకేయి మహోగ్రహం బొంది
హుతహుతాశనకీలయో యన నిట్లు
పలికె దశరథనృపాలునిఁ జూచి:
"పన్నము కోటియుపాయముల్ నీవు;
నీ మాయ నా ముందు నిలువంగలేదు.
ఏను కోరినకోర్కె- నిప్పుడు దీర్పు
మట్లుఁ గాదేని దుర్యశమును గనుము.
వాదాలతో నాకుఁ బనిలేదు రాజ!
సాధువు రాముఁడు, సాధువవీవు,
ఆ రామమాతయు నందఱికన్నఁ
బరమసాధువు నాకుఁ బొగుడగాఁ దెలియు.
ఆమె నా కెంతసమాదరబుద్ధిఁ
దగు మేలుఁజేయఁగాఁ దలచెనో— దాని
కేనును దగినట్లు లిపుడు చేసెదను.

శ్రీరామవనవాసమున కంగీకరింపనిచో
మరణింతు ననికైక నిష్ఠురోక్తు లాడుట

రేపు ప్రాతఃకాలమే రాఘవుండు
మునివేషమున వనమున కేగకున్న
మరణంబు నాకును, మాసిపోనట్టి
అపకీర్తి నీకు, సత్యముగ ఘటిల్లు-
నని గ్రహింపుము చిత్తమందు నృపాల!"
అని పల్కి యా కుటిలాంగన లేచి
శీఘ్రగా నిల్చెఁ గాఠిన్య మొప్పార-
పాపపర్వతమందుఁ బ్రభవంబు నొంది
ఉగ్రక్రోధజలముతో నుప్పొంగుకొనుచు
దుర్నిరీక్ష్యంబయి తోఁచుచున్నట్టి
ప్రళయోగ్రరోషతరంగిణిరీతి.
ఆమెరెండువరంబు లా నదీతటము;
లతికఠినం బగు నామె హఠంబె
ఆ ఘోర వాహినియందలి ధార;
మంథర చెప్పుడు మాటలే దాన
గుహ్యంబు లగు సుడిగుండంబు లగును;
ఆ ఘోర మగుప్రవాహము విజృంభించి
దశరథధరణీశధరణీరుహామును
కూకటి వ్రేళ్లతోఁ గూడఁ బెకల్చి
ఉగ్రవిపత్సాగరోన్ముఖం బగుచు
సాగె భరద్వాజసంయమివర్య!
అప్పు డా నరపతి యంతరంగమున
ఆ కైకనుడి పరిహాసంబుగాక
కడుసత్యమే యని గ్రహియించి, తనదు
ప్రియురాలిరూపున మృత్యువే వచ్చి
తనతలపై నెక్కి తాండవమాడు
చున్న దటంచుఁ దా, నుల్లమం దెంచె.
అంతటఁ బాప, మా యవనీశ్వరుండు
ఆమెయంఘ్రులఁ బట్టి యతివినయమునఁ
గూర్చుండు మని వేఁడుకొను చిట్టులనియె:
"ప్రియ! ఇనకులకుఠారవి గాకు, మిప్పు
డడుగుము నాశిర మతివ! యిచ్చెదను;
కాని రామవియోగఘనతాపజనిత
మరణంబుఁ గూర్పకుమా! సఖి! కైక!
ఎట్లైన శ్రీరాము నిచ్చోట నిలుపు
మట్లు గాకున్న నీ యంతరంగంబు
ఘోరతాపముచేతఁ గుములుట నిజము
భవదీయజీవితపర్యంత మింక."
ఇ ట్లెంతయో వేఁడి నృపుఁడు తాఁ దుదకు
నా వ్యాధి యిఁక నసాధ్యం బగు టరసి,
తల బాదుకొనుచును ధరణిపై నొరిగె—
'హా రామ! హా రామ! హా రఘునాథ!'
అని విలపించుచు నమితార్తితోడ.
వ్యాకులుం డైన నృపాలవతంసు
తను వెల్ల శిథిలీకృతం బయ్యె నకట!
కరిణి కూల్చిన కల్పకము చందముగను.

అతనిగళం బొఱె, నాగె వాక్యములు,
వారివినిర్గతపాఠీన మట్లు
అతఁడు దీనుం డయ్యె; నత్తఱిఁ గైక
మఱుల వచించె నీ మాఁడ్కినిర్భీతిఁ
గఠినతరోక్తులు, గాయంబుపైన
విషమును జొనిపినవిధము మునీంద్ర!
"చివరకు నీవు చేసెడి దిది యైన
ఏ ధైర్యమున నీవు నృప! నన్ను ముందు
కోరుము కోరుము కోరు మటంచుఁ
బల్కినాడవు త్యాగపద్ధతి మెఱయ?
ఓ ధరాధీశ్వరా! ఒకకాలమందె
పకపకనవ్వుట, బొవురుమనుట,
పృథుదానగుణమును, బిసినారితనము,
నొకనిలో మిళిత మై యుండఁగాఁ గలవె?
రణయోధుఁ డైయుంట, బ్రతుకుపైఁ దీపి,
ఈ రెండిటికిని బొత్తట్లు కుదురు?
అన్నమాటను దప్పి, మట్లు కాదేని
ధైర్యంబు నెదలోనఁ దాల్పుము, కాని-
అంగలార్పకు మిట్టు లబలచందమున.
తనువును దన్వియుఁ దనయులు మఱియు
ధామంబు ధనమును ధరణి సైతంబుఁ,
గను సత్యసంధుండు గడ్డిపోచగను."
అను మర్మవచనంబు లాలకించియును
దశరథధారుణీధవుఁ డిట్లు పలికెఁ:
"నీ యిష్ట మెట్టు లట్లే పల్కు మీవు;
అందుకు ని న్నన నవసర మేమి?
అల పిశాచమువోలె నకట, నా విధియె
ని న్నావహించియు నీ నోటినుండి
ఇట్లనిపించు నిం కేమి యొనర్తు?
పొరపాటుచే నైన భూపాలనంబు
భరతుఁ డేనాఁటికి వాంఛింపఁబోడు.
పుట్టెను విధివశంబున నీకుఁ గుమతి.
ఇది యెల్ల మత్పురాకృతపాపఫలము.
అక్కటా! అనుచితం బగుసమయమున
విధి నాయెడను గడువిపరీత మయ్యె.
తిగిగి సాకేతంబు దీపింపఁగలదు
అఖిలసద్గుణధాముఁ డైన శ్రీరాము
పరిపాలనంబున; వరభక్తితోడ
ఆ రాముని దమ్ము లందఱుఁగూడ
వీడక సతము సేవింపఁగాఁ గలరు.
ఆ రామచంద్రదివ్యమహోయశంబు
భువనత్రయంబునఁ బూరితంబగును.
కాని, నీదుష్కళంకంబును, నాదు
తాపంబు, మఱి శాశ్వతంబుగా నిలుచు;
నీ యిష్ట మెట్లట్లె నీ వుండు మింక;
ఇదె నీమొగంబు నా యెదుటఁ జూపకుము.
చేతులు జోడించి చేతుఁ బ్రార్థనము—
పృథివిపై నేను జీవించినన్నాళ్ళు
మఱుల నాతో నీవు మాట్లాడవలదు.
తుదకుఁ బశ్చాత్తాపదోదూయమాన
హృదయ వైపోవుదు విది నిక్క మకట!
ఓసి! అభాగినీ! ఓ కైక! నీవు
గోవును మాంసంబుకొఱకుఁ గూల్చితివి."
ఈరీతి నృపతి అనేకరీతులను
ఘోషించి ఘోషించి కూలె భూస్థలిని—
"సర్వనాశన మేల సల్పెద" వనుచు.
కాని, యా కపటశిఖామణి కైక
మాఱుమా టాడక మౌనంబుఁ దాల్చె—
అలశ్మశానస్థలమందున నున్న
తాంత్రికసాధనాతత్పరవోలె.
పక్షుల్ విరిగినపక్షిచందమున
పాపము, దశరథపార్థివోత్తముఁడు
వికలుఁ డై మిగుల నిర్వేదింపసాగె—
'హా రామ! హా రామ! హా రామ!' యనుచు.

"ఇనుఁ డుదయింపకయే యుండుఁగాక
ఈ వా ర్త రాఘవుఁ డెఱుఁగకుండఁగను,
ఓ రఘుకులగురూ! ఓ సూర్యదేవ!
ఉదయింపకుము నీవు; ఉదయించునెడల
ఈ యయోధ్యసితి నీక్షించి స్వామి!
ఉల్లమందున బాధ నొందెద వీవు."
కై కేయికఠినత, శ్రీరామనాథుప్రేమ,
ఈ మహాసృష్టియం దెల్ల నెంచఁగను
అనుపమానంబులు సగ్రగణ్యములు.
పృథ్వీశుఁ డిటు విలపింపుచుండఁగను
అరుణోదయం బయ్యె, నంత- ద్వారమున
శ్రావ్యవీణావేణుశంఖముల్ మ్రోసె;
కవిగాయకులగుణగానముల్ సెలఁగె;

అవి యెల్ల నృపునిహృదంతరాళమున
బాణంబులట్లులు బాధింపఁ దొడఁగె.
ఈ మంగళాచార మెల్ల నాతనికిఁ
జచ్చినభర్తతో సహగమనంబు
సలుపఁగా నుండినసతికి భూషణము
లట్లు, లసహ్యంబు లై తోచె నపుడు.
రఘురామచంద్రదర్శన సముత్సుకత
నెవ్వరు నిద్రించి యెఱుఁగరా రాత్రి.
చేరి ద్వారముచెంత సేవకుల్ సచివు
లరోకదయంబుఁ దా మరసి, యొండొరులు
గుసగుసల్ వోయిరి- కోసలనాథుఁ
డింకను మేల్కొనఁ డేమివిశేష
కారణంబో? యని- కళవళపడుచు.

శ్రీరామచరితమానసము

అయోధ్యా కాండము

చతుర్థవిశ్రామము

నిజశితనఖముఖవిదళిత
రజనీచరగర్భరుధిరరంజితవపుషః
స్వజనావనచణః మునిగణ
భజనీయపదాబ్జః మట్టపల్లి నృసింహాః

కైకేయి గృహము నందున్నదశరథునికడకు
పౌరులు సుమంత్రుని బంపుట

"అనుదినం బరోక్కదయాత్పూర్వమందె
నిద్ర మేల్కాంచును నృపతి, ఈనాఁటి
విషయంబుఁ గనఁ గడువింతగా నుండె.
అంతఃపురంబున కరిగి సుమంత్ర!
కుంభినీధవుని మేలొక్కలుపుము, పిదప
ఆయన ఆదేశ మనుసరింతమిదె."
అని ప్రజల్ వచియింప నంత సుమంత్రుఁ
డంతఃపురంబున కరిగి చూడఁగను
ఆతనియెద భయం బావిర్భవించె.
చరణముల్ ముందుకు సాగక నిలిచె;
ఏదియో పెనుభూత మెగసి పైఁబడియు
తను క్రుంగవచ్చుచందంబుగాఁ దోఁచె.
అది నృపాంతఃపురమట్లు కన్పడక—
నిస్తులాపద్దుఃఖనిలయ మై తోఁచె.
ఒక్క రాతనికిఁ బ్రత్యుత్తరం బిచ్చు,
వా రట లే రైరి; పాప మామంత్రి—
క్ష్మానాయకుండును, గైకేయి, యున్న
సౌధంబులోనికిఁ జని, నృపుఁ గాంచి,
"జయ జయ రాజేంద్ర! జయ చిరంజీవ!"
అని వినమితశిరుం డై కూరుచుండె.
నృపతిపరిస్థితి నీక్షించి యతఁడు
వెల వెలఁబోయెను; పృథ్వీశ్వరుండు
మూలవిచ్ఛేదనమును బొందియున్న
కమలంబురీతిగాఁ గళఁదప్పి నేలఁ
బడియుండె వికలుఁ డై పరమమునీంద్ర!
ఏ మాట నడుగుటకేని సుమంత్రుఁ
డాత్మలో నతిభీతి నందె; నత్తఱిని
అశుభసంపూరిత యగుకైక పలికెఁ:
"గతరాత్రి నిద్రింపఁగాలేదు, నృపతి;
హేతువు తజ్జగదీశుఁడే యెఱుఁగు.
తెల్లవారెడిదాక దేనికోగాని—
హా రామ! శ్రీరామ! యని, సంస్మరించె;
మర్మంబుఁ జెప్పఁడు మాకు సుమంత!
కావున, నీ వేగి కడు సత్వరముగ
రాముని జేకొని రమ్ము, నీ వపుడు
అఖిలసమాచార మడుగఁగావచ్చు."
అన విని, మంత్రి నృపానన మరసి
ఆయన మానమే ఆజ్ఞఁగా నెంచి,
వెడలె శ్రీరాముని వేగఁ దెచ్చుటకు.
ఏదియో కటిలేచ్ఛ నెదఁ దాల్చెఁ గైక,
అని యాతఁ డెంచి వ్యథాకులుం డగుచు,

అడుగు ముందుకువేయ నవశుఁ డైపోయె;
"రాముఁ డేతెంచిన రాజేంద్రుఁ డేమి
తెలుపునో?" యనుచుఁ జింతించి యాతండు,
స్వాంతంబులో ధృతి సమకూర్చుకొనియుఁ
జేరె సింహద్వారసీమ; నయ్యెడను
జనులెల్ల నతని విషణ్ణముఖంబుఁ
గాంచి ప్రశ్నింపఁగాఁ గడఁగి రేమేమొ.
ప్రజల సమాధానపరచి యెట్టులనో
ఆ సుమంత్రుం డేగె నా సూర్యవంశ
భూషణుం డగురామమూ ర్తిసన్నిధికి.
ఆ సుమంత్రునిఁగాక నరసి శ్రీరాముఁ
డా మహామాత్యుని ఆత్మీయజనక
సమునిఁగా నెంచియు సన్మాన మొసఁగె.

సుమంత్రుఁడు కైకేయిగృహమునకు
శ్రీరాముఁ డోడ్కొనివచ్చుట

అంత శ్రీరాముముఖాంబుజ మరసి
ఆ సుమంత్రుండు రాజాజ్ఞ నెలిపి
రఘుకులజ్యోతితో రయముగాఁ జేరె
మఱల రాజేంద్రుని మందిరంబునకు.
సచివునితో రామచంద్రుఁడు కూడి
అలపాదచారి యై యరుగుటఁ జూచి,
అటనట నున్నప్రజావళి యెల్లఁ
గడుఖేదమందెను గళవళపడుచు.
ఆడుసింగముఁ గాంచి యవసి మూర్ఛిలిన
వృద్ధగజేంద్రునివిధముగా మిగుల,
ఆపన్నదశ నున్న యవనీంద్రుఁ గాంచె
రఘుకులమణి యైన రామచంద్రుండు.
ఆ వృద్ధనరపతియధర మెండినది,
ఆతనితను వెల్ల నతిదుఃఖవహ్ని
దహియింపఁబడుచుండె, దారుణరీతి-
మణిహీన మగుదీనఫణివిధానమున,

దశరథధారుణీధవుఁడు కాన్పించె.
నిమిషంబు లెంచుచు నిల్చియున్నట్టి
మృత్యుదేవతయో లె నృపతిసన్నిధిని
ఆ రోషపరవశ యైనకై కేయి
నరసెను శ్రీరాముఁ; డా రామవిభుఁడు,
కరుణామయుండు, స్నిగ్ధస్వభావుండు;
ఆయనజీవితం బందున నిదియె
తొలిసారి చూచుట, దుఃఖదృశ్యంబు-
ఇంతకును దాని నెన్నఁడు వినఁడు.
అయినను సమయంబు నరసి రాఘవుఁడు
స్వాంతమందున ధృతి సమకూర్చుకొనియుఁ
దనపినతల్లితోఁ దగ నిట్లు పలికె
మధుమధురోక్తుల- "సూతా! వచింపు
మేల! మా పితృపాదు లిటు వగనొందె?
ఆ కారణముఁ దెల్పుమా, ప్రియజనని!
తద్విచారముఁ బాపుదారి జూచెదను."

కైక దశరథునివైకల్యకారణము శ్రీరామునికిఁ
దెల్పుట

"అసలు కారణ మిది యాలింపు రామ!
నృపతికి నీయందుఁ బ్రీతి మిక్కుటము;
ఆయన, నా యిష్ట మగువరద్వయము
వాంఛించుకొ మ్మని వాగ్దాన మిచ్చె.—
ఇష్టవరంబుల నేను గోరితిని;
ఆ నా వరంబుల నాలించి రాజు,
వ్యాకులపీడితుం డయ్యె,—నీపైన
మోహంబు విడలేకపోవుటఁజేసి.
చూడఁగా నొకవైపు సుతునిపై మమత,
ఇంకొకవైపున నింతకుమున్నుఁ
దాఁ జేసినట్టి వాగ్దానంబు, నృపునిఁ
బడవైచె, సంకటావస్థలో రామ!
శక్తి నీ కున్నచో శ్లోకనాథునాజ్ఞ

శిరసావహించియుఁ జిత్తంబులోని
దుర్భరవ్యథను బోఁద్రోలంగవచ్చు."
ఇట్లు సంకోచింప కిసుమంతయైన
పటుకటువాక్యముల్ పల్కెఁ గై కేయి;
ఆ వాక్యముల విన, నా కఠినతయు
నమిత మౌవ్యాకులమందు మునీంద్ర!
ఆ కైకజిహ్వ, మహోధనుస్సమము;
ఆమెకఠోరవాక్యములు బాణములు;
మృదుమతి దశరథనృపతిలక్ష్యంబు;
ఆ దృశ్య మగపడె నల కఠోరతయె
తగ వీరరూపంబు ధరియించుకొనియుఁ
దన ధనుర్విద్యఁ బ్రదర్శించురీతి.
ఆరీతి రఘుపతి కంతయుఁ దెలిపి,
ఆ కైక కూర్చుండె నాకృతిఁగన్న
నిష్ఠురంబటుల, మునీ! భరద్వాజ!
ఆ భానుకులభానుఁ డా రామవిభుఁడు
నిత్యనై జానందనిధి, రఘువిభుఁడు,
తనస్వాంతమందునఁ దా నవ్వుకొనియు,
దూషణవాసనా దూరంబు లగుచు
వాగ్విభూషణము లై పరగుచున్నట్టి
మృదుమంజులోక్తుల నిట్లు వచించె:
"విను జననీ! సర్వవిశ్వంబులోనఁ
దల్లిదండ్రులమాట దాఁటనిసుతుఁడు
వాఁడెపో నిజము మహాభాగ్యయుతుఁడు!
అహ! తల్లిదండ్రుల నానందపఱచు
పుత్రుఁడు కడు దుర్లభుఁడు కదా! జగతి.
ఎల్లరీతుల నాకు హిత మొనగూర్చు
మునిజనసాంగత్యమును, విశేషముగ
వనవాసమునఁ బొందువాఁడను;గాక,
జనకాజ్ఞ, జనని! నీసమ్మతి, గల్గె.
మఱియు, మత్ప్రాణసమానుఁ డైవఱలు
భరతుఁడు ధారుణిపతి యగు; నేఁడు
దైవము సర్వవిధాల నాయెడల
ననుకూలుఁ డైయుండె; నట్టిచో నేను
వనమున కేగఁగా వాంఛింపకున్నఁ
గానొకో మూఢాగ్రగణ్యుండ? జనని!
కల్పవృక్షమును ద్యాగంబొనరించి
ఆముదపుఁజెట్టు నాసించుజనులు,
అమృతంబు వదలి విషాసక్తి నొందు
జనులుసైతం, బిట్టిసదవకాశమును
బోఁగొట్టుకొనఁ దలపోయ రెప్పుడును.
ఇది విచారించి గ్రహింపుమా, తల్లి!
ఒక విషయముమాత్ర మో మాత! నన్ను
బాధించుచున్నది బహువిశేషముగ :
అవనీశ్వరుఁడు మహావ్యాకులుం డగుటఁ
గాంచి నా హృదయంబు కడుబాధ నొందె.
జనకపాదుం డింత స్వల్పాంశమునకు
అమితదుఃఖము నొందె నన్నది నేను
విశ్వసింపఁగఁజాల ప్రియమాత! నృపతి
కడుధీరమతి, గుణాగాధపాథోధి;
ఏదియో యపరాధ మేఁ జేసియుండుఁ
గానిచో మా తండ్రిగా రేల నేఁడు
మనసిచ్చి నాతోడ మాటాడకుండు?
నీ విదే, యెట్టిడి నిజమాడు మంబ!"
శ్రీరఘువరుఁడు వచించిననుడులు
స్వాభావికంబులు సరళంబు లైనఁ
గుమతి కైక గ్రహించెఁ గుటిలరీతిగను;
జగతిలో సరళ మౌజలమందుఁగూడ
జలగ వక్రంబుగాఁ జరియించుఁగాదె!
శ్రీరామచంద్రుఁడు స్వీయాభిమతము
ననుసరింపఁగ నుండెనని గ్రహియించి
కైక సంతోషించి కపటానురక్తిఁ
గనిపింపఁజేయు చీకరణి వచించె:
"నీపైన భరతుపై నే నొట్టుఁబెట్టి

పలుకుచుంటిని— ధరాపాలునివ్యథకు
ఇంతకన్నను హేతు వెఱుఁగను నేను.
నీ వెట్టిదోషంబు నేరవు, తనయ!
తల్లి దండ్రులకును దమ్ముల కీవు
సుఖదాయివోయి, విశుద్ధస్వభావ!
నీ వాడుపలుకులు నిజముగా నిజము.
తల్లిదండ్రులమాట దాటవు నీవు
తనయ! ఈ వార్ధక్యదశయందు నృపతి
కపకీర్తి రాకుండునట్లు బోధింపు—
మే మహాసుకృతంబు లిలఁ జేసియుంట
నీవంటిపుత్రుని నృపతి తాఁ గాంచె—
నా మహాసుకృతంబు లవనీశ్వరుండు
గౌరవబుద్ధితోఁ గనకుంట తగదు.”
ఇట్టి ధర్మోక్తు లయ్యెడను గైకేయి
కుముఖమునందు వెల్గొందెఁ, బాపిష్ఠ
మగధదేశంబున మహితగయాది
తీర్థరాజములు ప్రదీపించినట్లు.
గంగలోఁ గలిసి, నిష్కలుషంబు లైన
సకలజలంబులసరణి, రామునకుఁ
బినతల్లి నుడు లెల్లఁ బ్రీతినిగూర్చె.
అంతలో స్పృహవచ్చి యవనీశ్వరుండు
రాముని స్మరియించి ప్రక్కకు న్గదల,
రామాగమనవార్త రాజుకుఁ దెలిపె
సచివసుమంత్రుండు సమయోచితముగ-
వినయవిధేయతావిభవోక్తు లొప్ప.
శ్రీరాము రాక నెఱిఁగి భూవిభుఁడు
ధైర్యంబుఁ దాల్చి నేత్రంబులు విప్పె.
అంత సుమంత్రుఁ డాయధిపు మెల్లఁగను
గూర్చుండఁగాఁ జేసెఁ గూర్మి వెలుంగ.
అపుడు రాముఁడు జనకాంఘ్రియుగ్మమున
ప్రాలెను, భక్తిసంభరితాత్మఁ డగుచు.
అనురాగవిహ్వలుం డై దశరథుఁడు
తనయునిఁ బైకెత్తి తగఁ గౌఁగిలించె-
పోయినమణినిఁ దాఁ బొందినయట్టి
సర్పంబుచందంబు సంయమివర్య!
శ్రీరాము నృపతి వీక్షించి వీక్షించి
కన్నీరు మున్నీరుఁగాఁ గార్పఁదొడఁగె.
అతిశోకవశత మాట్లాడఁగాలేక,
ఆతఁడు శ్రీరామునతిప్రేమ పొంగ,
గుండెకు హత్తించుకొని పలుసారు,
లడవికి రఘుపతి యరుగనిరీతి
సలుపఁగాఁ బ్రార్థించె సర్వేశు నాత్మ.
శ్రీమహేశ్వరుని స్మరించి యీరీతిఁ
ప్రార్థించె, నాత్మ, నా పార్థివోత్తముఁడు:
“ఓ సదాశివ! వినుమోయి, నా వినతి;
శంకరా! సులభప్రసన్నుఁడ వీవు.
ఎట్టివాఁ డైన ని న్నెఱ నమ్మ
రక్షించునట్టి భోళాశంకరుఁడవు;
ఏ దీనుడ ననుగ్రహించి నా యార్తిఁ
బోఁద్రోలుమా, హరా! పురహరా! శర్వ!
అఖిలజీవులహృదయంబులలోని
ప్రేరకుండవుగదా! విశ్వేశ! నీవు
శ్రీరాముచిత్తంబుఁ ద్రిప్పు; మాతండు
శీలంబు నాపైని స్నేహంబు విడిచి,
అస్మదాజ్ఞఁను దాటున ట్లొనరింపఁ-
బ్రార్థింపుచున్నాడఁ బరమేశ! యీశ!
అఖిలప్రపంచసంవ్యాప్తదుర్యశము
నందెదఁగాక, నా అఖిలప్రతిష్ఠ
నాశనమగుఁగాక, నరకమే నాకుఁ
బ్రాప్తించుఁగాక, స్వర్గంబు పోఁగాక,!
పడరానిపాట్లెల్ల భరియింపఁగలను—
కాని— రాముఁడు సర్వకాలము నాదు
కనులకు దూరముగాకుండ నిలుపు—
మీ కోర్కె- దీర్పు మిం కేమియు వలదు!”

రాజిట్లు లోలోనఁ బ్రార్థించెగాని
పైకొక్కమాటయుఁ బలుకఁగా లేదు;
అతనిచిత్తము రావియాకువిధానఁ
గడువ్యాకులమునఁ బ్రకంపించుచుండె.
ఆ స్థితి రఘుపతి యరసియు, తండ్రి,
అనురాగవశుఁ డౌట నాత్మ గ్రహించి,
పినతల్లి తిరిగి యేదియొ వచియించు—
నని తలంచి, విచార మాత్మఁ గావించి,
దేశకాలపరిస్థితికిఁ దగినట్లు
వినయవాక్యముల నీవిధముగాఁ బలికె:
"ఓ పితా! మీకు నే నొక్కవిన్నపము
సలుపఁగా నిప్పుడు సాహసించితిని.
ఏను బాలుఁడ నౌట నెఱిఁగియు మీర
లీ యనుచితము క్షమింపఁ బ్రార్థనము.
అత్యల్ప మగువిషయమునను మీరు
ఇంతగా ఖేదింప నేల? నోజనక!
అక్కటా! యీవిషయంబు నాతోడఁ
బ్రభ్రమం దెవ్వరుఁ బలుక నై, రేను
మిమ్మ్ము దర్శించినమీఁదట నడుగ—
మా తల్లి చెప్పినమాటలఁబట్టి
యూరట గల్గె నా యుల్లంబులోన.
ఆనందసమయమునందు మీ రిట్లు
అనురాగవశులయి ఆర్తి నందకుడు;
సంతోష మొప్ప నాజ్ఞాపింపు డిదియె."
అనియు రామప్రభు వానందపులకి
తాంగుఁ డై, మఱల యి ట్లనెఁ దండ్రితోడ:
"పితృపాద! ఎవ్వని వినయశీలములు,
తలిదండ్రులకుఁ బ్రమోదం బొనగూర్చు-
జగతి నాతఁడె- ధన్యజన్ముఁ డోహోహో!
తగఁ దలిదండ్రులఁ దనప్రాణములకు
సములుగాఁ బ్రేమించు సత్కుమారునకు
నలచతుర్విధపురుషార్థంబు లెల్ల
నఱచేతిలో నుండు ననఘా! మహాత్మా!
తమఆజ్ఞఁ బాలించి ధర నేను జన్మ
సాఫల్యమును గాంచి సరగ నేతెంతు
గాన, ఆజ్ఞాపింపఁగాఁ బ్రార్థనంబు.
జనయిత్రి కౌసల్యసన్నిధి కేగి
ఆజ్ఞఁ గైకొని యిదే అరుదెంచి మఱలఁ
ద్వత్పాదపద్మవందన మాచరించి
వనవాసమునకుఁ బోవంగల జనక!"
అని పల్కి శ్రీరాముఁ డరిగె; భూవిభుఁడు
పరమశోకమున మూర్ఛలుకలేఁ డయ్యె.
తేలు కుట్టిన నెట్లు దేహమం దెల్ల
విషము వ్యాపించు, నా విధముగా నగరి
యందెల్ల వ్యాపించె నా ఘోరవార్త.
దావాగ్నిఁ జూచినంతనె వాడిపోవు
విటపలతాతతివిధి నెల్ల జనులు,
పురుషులు, స్త్రీలును, బొందిరాకులత.
ఈ ఘోరదుర్వార్త నెక్కడ విన్న
వాఁ డక్కడనె నెత్తి బాదుకొం చేడ్చె—
ఆ దుఃఖదావాగ్ని యతిదుర్భరంబు!
ఏడ్చెడిజనులనో ల్మెండెను, వారి
కన్నుల ధారలుగట్టుఁ గన్నీరు;
ఆపఁగాలేనంత అమితదుఃఖంబు
ఉప్పొంగివచ్చుచునుండె నెల్ల అకు;
ఆ యయోధ్యాపురమందున నాఁడు
కరుణారసము భటగణముతో వచ్చి
జైత్రయాత్రను జేయసాగిన ట్లుండె.
"చూచి పీటలఁమీఁది శుభకార్య మకట!
విధి నేఁడు చెడఁగొట్టె విపరీతరీతి."—
అని జనుల్ చింతించి రంతరంగముల.
పలుపలురీతులఁ బొరు లెల్లెడల:
గైకను నిందింపఁగడఁగి రీరీతి:
"పాపిష్ఠ! కై కేయి పచ్చనియింటి

కీనాఁడు చి చ్చిడె, నేలాభ మొదవు?
తననేత్రయుగ్మంబుఁ దనదుచేఁజేతఁ
బెఱికి తా బిమ్మట వీక్షింపఁదలఁచె;
సుధ వీఁడి విషరుచిఁ జూడఁగా నెంచెఁ;
బృథురమ్యరఘువంశ వేణువనంబు
పాలిటి కీకైక, పాపాత్మురాలు
కుటిల, కర్కశ చి త్త, కుమతి, అభాగ్య,
దావాగ్నిరీతిగా దాపురించినది.
చేరియు గొమ్మపైఁ జెట్టునే నటికె;
సుఖమున శోకంబుఁ జూపించె కైక;
రాముఁ డీమెకు సదా ప్రాణసమానుఁ
డట్టి శ్రీరామునియందుఁ దిట్టిఘోర
కౌటిల్యమును బూనఁ గారణం బేమి?
అన్నివిధంబుల నంగనాచి త్త
మగ్రాహ్యమత్యగాథాఽతిదురూహ్య
మని, కవుల్ చెప్పినదంతయు నిజము.
తన ప్రతిబింబంబుఁ దాఁ బట్టవచ్చుఁ
గాని, నారీమతి గ్రహియింపలేరు.
అగ్ని కాల్పనివస్తు. వవని నే ముండు?
అబ్ధి ముంపగలేని దరయ నే ముండు?
కాలసంగ్రసితంబు గాని దే ముండు?
ప్రబల యీనబల యేపనిఁ జేయకుండు?
ఒకపనిఁ జేయఁగా నుంకించి దైవ
మిం కొకపనిఁ జేసె నే మనవచ్చు?
ఒకటి చూపుటకు వేఱొక్కటిఁ జూపె"—
నని జనుల్ చింతించి రాపన్నులగుచు.
ప్రజలలోఁగొందఱు పలికి రీగీతి:
"నృపతి చేసినపని హితముగా లేదు.
సముచితాలోచన సలుపక రాజు
పాపాత్మురాలికి వరముల నొసఁగె:
అందుచే నీదుఃఖమంతయు నతఁడు
స్వయముగాఁగొని తెచ్చి పంచె నందఱకు.

అబలావిలోలుఁ డై అక్కటా! అతఁడు
కోల్పోయె జ్ఞానము, గుణము, శీలమును."
కొందఱు క్ష్మోణీంద్రు గురుధర్మగరిమ
నెఱిఁగి నిందింపక యిసుమంత యేని,
(శ్రీ) దధీచిమునీంద్ర శిబి హరిశ్చంద్ర
చారిత్రములను బ్రసంగించుకొనిరి.
కూడినవారిలోఁ గొందఱుజనులు,
భరతుండు పన్నె నీ పన్నాగ మనిరి.
అన వినికొంద ఱుదాసీను లైరి;
కొందఱు సహాయించుకొనలేక చెవులు
హస్తాల 'శివ శివా', యని మూసికొనియుఁ
గఱచుకొనుచును నాల్కలఁ బల్కరిట్లు:
"ఇవి యబద్ధములుమా! ఇ ట్లన్న యెడల
సుకృతంబు లెల్ల నశించును మీకు.
ఆ రామచంద్రమహాప్రభువునకు
భరతకుమారుండు ప్రాణప్రియుండు.
శశిబింబ మగ్ని వర్షింపఁగా వచ్చు;
అమృతము విషరూప మందఁగావచ్చు;
కాని, యీ భరతుండు కలలోనఁగూడ
శ్రీరామునకు వ్యతిరేకి గాఁ డెపుడు."
కొందఱు విధిఁ దిట్టుకొని– రా విధాత
అమృతంబొసంగెద నని ఆశపెట్టి
విష మొసంగె నటంచు, వికలాత్ము లగుచు.
పుర మల్లకల్లోలముగ మాఱిపోయె.
సర్వులు ఘోరవిచారంబుఁ గనిరి–
ఉత్సాహమంతయు నూడ్చుకపోవ.
అలకైక కతిమాన్య లై చెలువొందు
విప్రవధూకులవృద్ధమానినులు,
ఆ మెగుణంబుల నభినుతించుచును
విహితబోధములు గావించిరి, గాని,
ఆ బోధ లస్త్రంబులటు బాధఁ గూర్చె
నా మెస్వాంతంబున కపు డో మునీంద్ర!

భరతుకంటెను రామభద్రుండు నీకుఁ
గడుఁ బ్రేమపాత్రుఁడుఁ గాఁ జెప్పచుందు
విదిగాక, జగమెల్ల, నెఱుఁగును దీని.
రాముపై సహజానురాగంబు గలుగు
నీవు నేఁ డారాముఁ డే యపరాధ
మొనరించె నని కాన నుంపఁ గోరెదవు?
సవతులపైన మాత్సర్యంబు, లోన
కాసంతయేనియుఁ గలుగదు నీకు.
నీదగుప్రేమను, నీదగుకీర్తి,
దేశమం దెల్లెడఁ దెలియుఁ గైకేయి!
కౌసల్య, ఏ యపకారంబు నీకు
సలిపిన దని సర్వజనుల కీరీతి
అశనిపాతమువంటి ఆ ర్తిఁ గూర్చితివి?
శ్రీరాము విడి సీత జీవింపఁగలదె?
సౌమిత్రి నిల్చునా సౌధంబులోన?
భరతుఁ డయోధ్యను బాలింపఁ గలఁడె?
రాము వీడియు మహారా జిల మనునె?
చక్కఁగా నీవు విచారించుకొనుము,
క్రుధ విడనాడుమా, కోమలీ! మదిని;
అటుగానిచో వ్యథ కపకీర్తి కీవు
తావలం బగుదువు తప్పక సకియ!
అట్టులే నీయిష్ట మైనరీతిగను
భరతునే సలుపుము పట్టభద్రునిగ
ఎవ్వరుఁ గా దన, రింతియేగాని-
అలరాము వనమున కంపఁగా నేల?
రామునిహృది లేదు రాజ్యానురక్తి.
రాముఁడు ధర్మధురంధరుం డతఁడు
విషయభోగవిరాగి వినుము కైకమ్మ!
ఈ వంతగాఁ గోరుదేని రాఘవుఁడు
గృహమును విడి గురుగృహమందు నిలుచు.
రెండవవరముగా నృపు నిడి కోరు—
మంతియే! మా మాటలాలింపవేని
ఈవు పొందెడిలాభ మేమియు లేదు.
పరిహాసమున కిట్లు పలికితివేనిఁ
దెలుపుమా, హృదయంబుఁ దేఁట తెల్లముగ.
మఱి, రామువంటి కుమారునా? నీవు
వనములపాల్సేయఁ బాల్పడినావు!
ఇది విన్నచో లోక మేమనుకొనును?
లెమ్ము శీఘ్రమ్ముగా, లేచి తత్ క్షణము
ఈ శోకదుష్కర్తు లెల్లఁ బోఁజిమ్ము
మార్గంబుఁ జూడుమా, మాతల్లి కైక!
ఏ యుపాయముఁ బన్ని యేని మాతల్లి?
దుఃఖాపకీర్తులఁ దొలఁగించి, నీదు
కులమును గాపాడుకొను మమ్మ రాణి!
ఏ విధంబుననైన నింక శ్రీరాముఁ
డడవుల కేగనియట్లు యత్నింపు—
మిఁక వేరుచింతనమే వద్దు నీకు.
దినమణి లేనట్టి దినమువిధాన,
ఆయువు లేని దేహంబు రీతిగను,
చంద్రుఁడు లేనినిశా విధానమున
ఇలఁ దులసీదాసు నేలుచున్నట్టి
ఆ రాము విడి, యయోధ్యానగరంబు
కళ లేని దైపోవుఁ గావునఁ దల్లి!
చక్కఁగా లోన విచారించుకొనుము.”
కేకయపుత్రీసఖీజను లిట్లు
శ్రవణపేయంబులు సత్ఫలప్రదము
లగు హితోక్తులఁ బల్కి, రైన నాకైక—
కవి రుచింపకపోయె నావంతయైనఁ
దత్క్షబ్జదురోధ, తలకెక్కియుంట.
ఆ కైక దుస్సహం బగురోష మెప్పఁ
జుఱచుఱ వారిని జూచెను గాని
బదు లొక్కమాటయుఁ బలుకకపోయె.
ఆకలిఁ గొన్నట్టివ్యాఘ్రు మేరీతి
హరిణగణంబుల నరయు, నారీతి

ఆమె వారలఁ జూచె నాగ్రహం బొప్ప.
ఆసఖీజను లంత నాత్మలలోన,
ఈ వ్యాధి కుదురనిదే, యని తలఁచి,
తమతమయిండ్లకుఁ దరలి, "రీ కైక,
తలఁపఁగా మతిహీన, దౌర్భాగ్యురాలు;
విధి కైకవిభవంబు వీక్షింపలేక
మోసగించియు మార్గమును దప్పఁజేసె.
ఎవరుఁ జేయనిపని యీకైక చేసె."
అని యొండొరుల్ జెప్పుకొనుచు, మునీంద్ర!
పురనరనారీసమూహంబు లెల్ల
దూషించి కైకను దుఃఖించుచుండె.
దారుణదుఃఖదందహితాత్మ లగుచు,
"రాముఁడు లేనిచోఁ బ్రతు కేల?" ననుచు
నిట్టూర్పుదొడఁగిరి నిఖిలపౌరులును.
ఉరురఘురామవియోగంబుఁ దలఁచి,
సరసిలో నీరెండు సమయంబునందు
సంకటపడుజలచరగణ మటుల
అఖిలప్రజావళి ఆకులమందె.

ఆబాలగోపాలమందఱుఁగూడ
అతివిషాదవశాత్మ లైరి- ఇట్లుండ,
శ్రీరాముఁడు కౌసల్యసన్నిధి కరుగుట
రఘుకులమణి యగురామచంద్రుండు
జనని యీకౌసల్య సన్నిధి కరిగె
ఆ రామచంద్రుముఖాంబుజ మహహా!
అమితప్రసన్న మై అలరారుచుండె.
ఆ మహాత్మునిహృదయాంతరాళమున
తతచతుర్విధమౌ హూతాశనాంబు చెలఁగె.
తండ్రిగా రే మైనఁ, దనప్రయాణంబు
నాపునేమో! యని ఆత్మ రవ్వంత
సంకోచమే, రామచంద్రుఁడు పొందె.
రాజ్యాభిషేకకార్యప్రతిబంధ
రఘువీరసింధుర రాజశాబకము
వనగమనాదేశమును వినినంత,
బంధవిముక్తిని బడసితినంచు
అధికమౌ ఆనంద మాత్మలో నొందె.

శ్రీరామచరితమానసము

అయోధ్యాకాండము

పంచమవిశ్రామము

హరిహరముఖ్యామరనుత।
గరుడోరగసిద్ధసాధ్య – గణసంసేవ్యా।
హరి। వరకరాళసుందర।
వరదాయక। మట్టపల్లివాస। నృసింహా!

రఘుకులతిలకుఁ డౌరాముఁ డంతటను
అంజలి ఘటియించి ఆనంద మొప్ప
తనతల్లి పాదపద్మంబుల కెఱఁగె.
అప్పు డాకౌసల్య అతని దీవించి
కౌఁగిటఁ జేర్చియుఁ గడుఁ బ్రేమతోడ
భూషణవసనసమూహంబు లంత
దృష్టిదోషముపోవ దిశలందుఁ జిమ్మె.
ఆమె కుమారుముఖాంబుజాతంబు
నెన్నియోసార్లు ముద్దిడుకొనెఁ, గనులఁ
బ్రేమాశ్రుజలములు వెలుఁగొందుచుండఁ
దను వెల్లఁ బులకింపఁ దన్మయత్వమున.
ఆమె రాముని దనయంకభాగమునఁ
జేరిచి కొగింటఁ జేర్చెను మఱల;
వాత్సల్యరసముచేఁ బాలు స్రవించె
నామెవక్షోజంబులందుండి పొంగి.
ఆ దివ్యజననిమహానురాగంబు
ఆనంద మింతింత యని చెప్పఁ దరమె?
ధరలో దరిద్రుండు ధనదుఁ డైనట్లు
ఆమె సంతోషించె నాత్మ నత్తఱిని.

ఆదరం బొప్పఁగా నామె శ్రీరాము
సుందరముఖచంద్రుఁ జూచి యి ట్లనియె—
మనురవాగ్జాలసమంచితంబుగను:
"మా తండ్రి చెప్పమా, మా యన్న చెపుమ:
ఘనతరానందమంగళకర మైన
ఏతన్మహాలగ్న మెప్పుడు? తనయ!
సుకృతమహాశీలసుఖము లన్నియును
బరిపక్వ మగునట్టిపావనవేళ—
అయ్యదే! జన్మలాభావధి యగును.
ఆ దివ్యసమయంబు నరయఁ గాంక్షించి
స్వాతివర్ష మునకుఁ జాతకగణము
విధముగా, జను లెల్ల వేచియున్నారు.
లెమ్ము శీఘ్రమ్ముగా, లేచి నా తండ్రి!
స్నానంబుఁ గావించి స్వాదుపదార్థ
మేదే నొకింత భుజించి, యీ పిదప
జనకునిచెంతకు జనుము జా గయ్యె."
వరసుఖశ్రీమూలభరితంబు లైన
అనురాగసురవృక్షమందలిసుమము
లననొప్పు కౌసల్యయూడినయిట్టి
క్రమానుకూలవాక్యమ్ములు వినియు,
రామమానసబంభరము భ్రమ న్గొనదు.
ధర్మధురీణుఁ డాదశరథాత్మజుఁడు
తనధర్మ మేదియో తగ గ్రహియించి,
అతిమృదువాణి ని ట్లనెఁ దల్లితోడ:

శ్రీరాముఁడు వనవాసమున కాజ్ఞయిమ్మని
కౌసల్యను గోరుట

"జనకపాదులు నాకు జనని! సంప్రీతిఁ
గానన రాజ్యంబుఁ గరుణించినారు.
అట నిఃశోధికమహదవకాశములను
అఖిలవిధంబుల నందెద నేను.
కావున నా వనగమనకార్యంబు
సమ్మోదమంగళసంయుతంబుగను
సాగుటకై నీవు సంతోష మొప్ప
దీవించి పంపు మిదే, ప్రియజనని!
మమకారవశ వౌచు మాతరో! నీవు
భ్రాంతిసంజనిత మా భయ మొందవలదు;
భవదనుగ్రహమహాబలముచే నంబ!
సర్వదా నా కగు సన్మంగళంబు!
జనకుని ఆజ్ఞానుసారంబు నేను
పదునాలుగేడులు వనిని వసించి
తిరిగి యే తెంచి నీ దివ్యపాదముల
దర్శింపఁగలను, మాతా! సెలవిమ్ము.
మతివిచారింపకుమా, కన్నతల్లి!"
ఇటు రాఘవుఁడు వచియించినమధుర
వినయవాక్యంబులు పెనుబాధఁ గూర్చెఁ
గౌసల్యలలితహృత్కంజంబునందు.
వర్ష కాలపుజల్లు పడినమాత్రమున
వడఁ బడిపోవు *"యవాస"మొ క్కటులు,
శ్రీరామచంద్రుని శీతలవాణి
విని, యా మె భయపడి వెలవెలఁబోయె;
హరిగర్జనము విన్నహరిణియ ట్లయ్యె;
నా మెశోకము వర్ణనాతీత మనఘ!
అశ్రుసిక్తము లయ్యె, నా మెనేత్రములు;
తొలకరివానకు మలినంబుఁ గ్రోలి
వివశత్వమును బొంది విలవిలలాడు
మత్స్యంబు చంద మామాత కంపించె.
చెదరినధృతి నా మె చేకూర్చుకొనియు
శ్రీరాముముఖము వీక్షించు చి ట్లనియె.
గద్గదస్వనయు క్తకంఠంబుతోడ :
"తండ్రి! నీ జనకుండు తనప్రాణములకు
సమునిగా నినుఁ జూచు స్వాంతమం దెపుడు.
నీ చర్యలను గని నిరత మా నృపతి
ఉప్పొంగిపోవుచు నుండునే! తనయ!
యువరాజుఁ జేయ ని న్నర్హ్వీశుఁ డెంచి
చూచెఁగదా! ఒక్కశుభలగ్న - మకట!
ఏ యపరాధ మీ విపుడు గావింప
నడవుల కేఁగఁగా నాజ్ఞ నొసంగె?
ఈ విపరీతంబు కేమి కారణము?
నాయనా! శ్రీరామ! నా ముద్దుతనయ!
పచ్చని యీ సూర్యవంశంబునందు
చి చ్చెవ్వ రిడినారొ? చెప్పుమా రామ!"

శ్రీరామసహచరుఁ డగు సుమంత్రకుమారుఁడు
జరిగిన వృత్తాంతముఁ గౌసల్యకు
విన్నవించుట

అన విని రాముతో నరుదెంచినట్టి
అలసుమంత్రకుమారుఁ డారాముముఖము
వీక్షించి జరిగిన వృత్తాంత మెల్లఁ
దెలిపెఁ గౌసల్యకుఁ దేటపడంగ.
ఆ ప్రసంగము విన, నంత, నా జనిని
స్తంభింప మాట ని స్తబ్ధురా లయ్యె;
ఆ మె మనస్థితి అకథనీయంబు.
ఆ మె, కా దని గాని, యా నని గాని,

* యవాసమొక్క = తీఁటకసింద చెట్టు.

పలుక లే దయ్యె; యే వైపుఁ జూచినను
అమిత మా వ్యాకుల మా మెలోఁ గలిగె.
'రా' జనుటకు బదుల్ 'రాహు' వటంచు
భ్రాంతిచే వ్రాసినపగిదిగా నయ్యె:
విపరీతములు గదా! విధిచర్య లెపుడు."
అని ఆమె చింతించె నంతరంగమున.
ఒకవైపు ధర్మ, మిం కొకవైపు ప్రేమ,
ఆమెచి త్తమును సమాకులపఱచె.
వసుధఁ *జుంచెలుకను పట్టుకొన్నట్టి
సర్పంబువలె నామె సంకట మొందె;
"నేను నా కొమరుని నిలిపితి నేని
ధర్మ భంగం బగు ధారుణియందు.
బంధువిరోధంబు వ చ్చుటుగాక,
అడవుల కరుగఁగా ననుమతించితినో
అతికష్ట మొదవు" నటంచుఁ జింతించి,
పృథుశోకసంకటవివశాత్మ యయ్యె.
తదుపరి, తనసతీధర్మంబుఁ దలఁచి
తగఁ రామభరతులిద్దరుఁగూడఁ దనకుఁ
బుత్రులేయని తలపోసి స్వాంతమున
సరళస్వభావకౌసల్య యి ట్లనియెఁ
నలఘుధైర్యం బొప్ప నా రాముతోడ:
"ఈ వొనర్చినది తండ్రీ! మంచిపనియె;
పితృవాక్యపాలన విమలకృత్యంబె
అఖిలధర్మంబులయందు శ్రేష్ఠంబు.
మొదట నృపాలుండు పుడమికి నిన్నుఁ
బట్టంబుఁ గట్ట సంభావించి, యిపుడు
వనవాస మొనరింపఁ బంపుటవలన
లేశమాత్రము వగ లేదు నా కిపుడు.
కాని, నీ దగువియోగంబు కుమార!
భరతునకును మహీపతికిఁ బౌరులకుఁ
జండదుర్దాంతవిచారంబుఁ గూర్చు.
నీ తండ్రియొక్కఁడే నీ కాజ్ఞయిడిన
వనముల కేఁగఁగా వల, దెందుకనిన?
తండ్రికంటెను దల్లి తగఁ బూజ్యురాలు.
ఇటు గాక, తలిదండ్రులిద్దరుఁగూడ
అడవుల కేఁగ నీకాజ్ఞ యిచ్చినను
అడవియే యగు నయోధ్యాశతసమము;
వనదేవతలు కృపావారాసు లగుచు
అట, నీకుఁ దలిదండ్రు లౌదురు. తనయ!
ఖగమృగకోటులు ఘనభక్తితోడ
భవదంఘ్రిపద్మసేవన మొనరించు.
ముదుసలితనమున భూపాలకులకు;
వనవాసముచిత మై పరగును! నీవు
పసివాఁడ– విది– నన్ను బోధించు మిగుల.
రామ! నా తండ్రి; ఓ రఘువంశతిలక!
ఆ వన మెంత మహాభాగ్యయుత మొ!
అకట! నీచేఁ బరిత్యక్త మైనట్టి
ఈ యయోధ్యాపురి యెంత అభాగ్య?
ననుఁగూడ నీతోడఁ గొనిపో మ్మటన్న
నీవు సందేహింతు; వెల్లఱి కీవు
పరమప్రియుండవు వరపుత్ర! రామ!
మాకుఁ బ్రాణప్రాణమవు నీవు రామ!
అట్టి నీ విప్పుడు, "అమ్మ! నే నడవి
కరుగుచునున్నాడ" నను పల్కు వినియు
ఏడ్చుచుఁ గూర్చుంటి నిట్లు చావకయె.
అందుచే నాదు మిథ్యాప్రేమ నిపుడు
అతిశయోక్తిగఁ జెప్పి హాఠ మొనరింప.
ఏ నిన్నుఁ గోరున దిప్పు డొక్కటియె:

---

* పాము, మామూలు ఎలుకనుగా దలఁచిఁ జుంచెలు కను పట్టుకొని, అది చుంచెలుకగా తెలిసికొన్నపిదపదానిని మ్రింగ జాలదు; వదలఁజాలదు. మ్రింగిన పాముచచ్చును; విడిచినచో పాముయొక్కకన్నులు పోయి గ్రుడ్డిదగును.

మాత నౌ నను నీవు మఱువకుండఁగను
మనములో గుర్తుంచుకొనుము శ్రీరామ!
నా తండ్రి! శ్రీరామ! నా ముద్దుపట్టి!
కంటికి రెప్పల కరణి దేవతలుఁ,
బితృ దేవతలుఁ గృప వీక్షించి నిన్ను
రక్షింత్రుగాక అరణ్యమం దెపుడు.
పదునాలుగేడుల పరిమితి ప్రాదము;
ఇటఁ బ్రియపరిజనమే మీానగణము:
తతకృపాకరుఁడవు ధర్మధుర్యుండ
వగునీవు మఱువ కియ్యది మతిలోన.
ఇచటి వా రెల్ల జీవించియుంటకు
అవధి తప్పక వచ్చునట్లు చూడుమురా!
నీకు శుభం బగుఁగాక, శ్రీరామ!
సంతోషముగ నీవు చనుము కాననకు-
నిజనిజ పరిజన నిఖిల జనాళి
నిడె అనాథులఁ జేసి యేఁగుమా, వనికి.
సర్వులపుణ్యంబు క్షయ మయ్యె నేడు;
కాలంబు నేడు కరాళరూపమున
అక్కటా! మాయెడ వ్యతిరేక మయ్యె."
ఇట్లు కౌసల్య యనేక విధాలఁ
బలవించి రాముని పదముల వ్రాలె.
తనవంటిదౌర్భాగ్య, ధరణి లే దనుచు
ఆమె తలంచి పెల్లాకుల మొందె;
ఆమెస్వాంతం బెల్ల నావృతం బయ్యె
దారుణదుస్సహదాహంబుచేత;
ఆ విలాపకలాప మకథనీయంబు.
శ్రీరాముఁ డంతటఁ బ్రీతి వెలుంగఁ
దల్లిని బైకెత్తి మెల్లనఁ, దనదు
గుండెకు హత్తించుకొనుచు నోదార్చె-
సముచితమృదువాక్యజాలంబుచేత.
ఇంతలో నా సీత కీ వార్త తెలిసి
వ్యాకులంబున లేచివచ్చి యయ్యెడకు,

అత్త కొనర్చి పాదాభివందనము,
తల వంచుకొని చెంత ధరణిఁ గూర్చుండె.
కౌసల్య యా మెకుఁ గ్రమవాక్యముల
ఆశీస్సు లిడెఁ; నా మె యతిసుకుమార
తనువల్లికను జూచి తల్లడమొందె.
ఆ సతీమణి సీత, ఆ రూపరాశి,
కూర్చుండి తలవంచుకొనియు లోలోన,
"నా జీవితేశుఁ డీనాఁ డేఁగు వనికి;
రామునితోడ నిర్గమనంబుసేయు
ఉరుపుణ్య మెవ్వరి కున్నదో?- నేఁడు"
ఈ తనుప్రాణంబు లేగునో కలసి?
ఈ ఒక్కనాప్రాణమే చనఁ గలదో?
విధి యెట్లు చేయునో? విదితంబుకాదు-"
అని చింతఁజేసె మహానురాగమున.
జానకి తనచారుచరణనఖాగ్ర
భాగంబులను నేలవ్రాయు నత్తఱిని
నూపురధ్వనియు మనోజ్ఞ మై మ్రోసె-
జానకీచరణాంబుజంబులు; మమ్మ
నిరతంబు వదలక నిలుపుఁగా కనుచుఁ
బ్రార్థించుచున్నట్టిపగిది ముసీంద్ర!
బాష్పాంబుధారలు ప్రవహింపుచున్న
ఆ జానకీమంజులాక్షిపద్మములఁ
గాంచి కౌసల్య, యాకరణి వచించె;
"అన్న! రాఘవ! సీత అతిసుకుమారి;
అత్తమామలకును అఖిలబంధువుల
కమితగారాబమా యవనిజయన్న.
నృపమణి జనకేంద్రుఁ డీమెకుఁ దండ్రి;
రవివంశరవి దశరథుఁ డీమెమామ;
రఘువంశకైరవరా జయి, నిఖిల
గుణరూపనిధి యయి, తనరుచున్నట్టి
రామచంద్రుం డీమెప్రాణవల్లభుఁడు.
నా ముద్దుకోడలు నాసీత రామ!

అతిరూపరాశి, మహాగుణశీల;
నా కంటిపాపకన్నను మిన్నఁగాను
ఏఁ జూచుకొనుచుంటి నీమె నెల్లపుడు.
నా ప్రాణ మీమెయే! నాయనా! రామ!
ఎల్లవిధంబుల నీమె నాపాలి
ఘనకల్పవల్లికఁ గాఁ దలఁపోసి,
ప్రేమాంబువులఁ బోసి పెంచుచునుంటి;
ఆలత పుష్పించి అహా! ఫలియించు
తరుణమందున విధి తలక్రిందుఁ జేసె;
ఇఁక దీని పరిణామ మెట్టిదో యెఱుఁగ!
తల్పమందో, లేక, తగు పీఠమందొ,
లేనిచో, రమ్యడోలికయందొ, కాక—
ఈ నాదునొడియందొ, యెపు డైనఁగాని
మా తల్లి సీతమ్మ మానక నిలుచు;
కా లిడి యెఱుఁగదు కఠినమానేల;
పొసఁగ సంజీవనీమూలిక నటులఁ
గాపాడుకొనుచుంటి గారాబ మెప్ప.
ఏను దీపపువత్తి నెగఁద్రోయు పనియు
నీమెకుఁ జెప్పలే దెప్పుడు రామ!
అట్టియీసీత, మహారణ్యములకు
నీతోడ రాఁ గోరి నీయాజ్ఞకొఱకు
వేచియున్నది రఘువీర! కుమార!
తతచంద్రకిరణసుధారస రసిక
యగు చకోరిక, ప్రచండార్క-మండలము
నెట్లు వీక్షించి భరింపఁగా గలదు?
సింధుర శార్దూల సింహకోటులకు,
బహువిధక్రూరసత్వములకు, మఱియు,
రాక్షసకోటి, కరణ్యగర్భములు
తావలంబులు గదా! తనయ! యేరీతి
భయద మౌవిషవృక్షవాటికల సుభగ
సంజీవనౌషధి సంవసియించు?
అడవులలో నుండ ననుకూలముగను
ఏ భోగములఁగూడఁ నెఱుఁగనియట్టి
*కోల, కిరాతక, బాలికావళిని
ఆ బ్రహ్మ సృష్టించె నవనీస్థలమున;
పాషాణమందునఁ బ్రదుకుచునుండు
క్రిమి చందమున వా రొకించుకయేని—
కఠిన స్వభావ లై కష్టంబుఁ గనరు.
మఱి తపంబునకు నై మఱి విరాగమున
అఖిల భోగంబులఁ ద్యజియించినట్టి
తాపసాంగనలకుఁ దగును వనంబు.
చిత్రితకపిని వీక్షించుమాత్రమున
భయపడు సీతమ్మ వని నెట్లు మనును?
సురసరోవరదివ్యసుందరవనజ
వనవిహారిణి యగుబాలమరాళి,
పల్వలమం దెట్లు వసియింపఁ గలుగు?
ఇవి విచారించి వచింపు; మాపైని-
నీ యభిమతరీతి నేను జానకికి
నుపదేశ మొనరింతు నోయి కుమార!
ఇంటనేసీత వసించిన యెడల
అధికమనశ్శాంతి నందెద నేను."
ఇట్లు కౌసల్య వచించినయట్టి
తతశీలరాగసుధాప్రియవాక్కు-
లాలించి రఘువీరుఁ డామె నోదార్చెఁ
బ్రియవివేకాంచిత వివిధభాషణల.
తదనంతరము, ధరాతనయ కాతండు
వనగుణదోషముల్ ప్రకటించుకొనుచు
సలిపెఁ బ్రబోధంబు సదమలప్రీతి.
తనమాతృసన్నిధిఁ దనసతితోడ
సంభాషణముఁ జేయ సందేహపడియు

---

* కోలులు, కిరాతులు- ఈరెండు తెగలవారును సుప్రసిద్ధులగు ఆటవికులు.

అవసరసమయంబు నాత్మ గ్రహించి
పలికె శ్రీరాముఁ డీపగిదిగా నపుడు:
"వినుము నా మాటలు ప్రియ! రాకుమారి!
విని, అపార్థము చేసికొనకుమా, నన్ను.
నీ, నా, హితంబుల నీ వెంచునెడల
నా మాట విను మరణ్యమునకు రాక,
మందిరంబున నిలుమా, ధరాతనయ!
సఖి! మదీయాజ్ఞానుసారిణి వగుచు
అ త్తమామలసేవ నాచరించుచును
గృహమునం దీవు వసింపుటవలన
నెల్లవిధంబుల హితము నీ కొదవు.
అ త్తమామలపదాబ్జార్చనకన్నఁ
దస్వికి, మించిన ధర్మంబు లేదు.
నన్ను స్మరించి మనంబున మిగుల
వాత్సల్యవశమున వైకల్య మొందు
సమయంబులందు మా జననికి, నీవు
తగిన పురాణకథాఽర్థజాలముల
మృదుమధురముగ వచించి యోదార్పు—
మే న్మనస్ఫూర్తిగా నిదె చెప్పుచుంటి.
నే మాతృహిత మెంచియే, నిన్ను సుముఖి!
గృహమునం దుండఁ గాంక్షించు చున్నాను.
అస్మదా దేశంబు ననుసరించుచును
గృహములో నీవు వసించుటచేత,
ధర గురుశ్రుతిహితధర్మఫలంబుఁ
గడు ననాయాసంబుగా నొందఁగలవు.
హఠముఁ బూనుటచేత నవనిలో మున్ను
గాలవ, నహుష, భూపాలాదు లెల్లఁ
బలు సంకటంబులఁ బడసిరి సకియ!
ఓ సుముఖి! సఖి! ఓ జ్ఞానహృదయ!
జనకాజ్ఞఁ బాలించి, సత్వర మేను
మఱలివచ్చెద సుమా, మన పురంబునకు.
దినములు నిలువవు తిరుగు శీఘ్రముగ—
ఎంతలోఁ బదునాలుగేడులు వచ్చు?
సుందరీ! నా మాటచొప్పున నిలుము;
ప్రేమవశంబుచేఁ బ్రేయసీ! నీవు
మూర్ఛించు నెడ దుఃఖమును బొందవలయు.

శ్రీరాముఁడు సీతకు వనవాసకష్టములఁ
బేర్కొనుట

అత్యుష్ణ, మతివృష్టి, యతిశీతలంబు,
కర్కశోదగ్రదుర్గమము వనంబు.
కంటక, కుశ, శిలా, కఠిన, మార్గముల
వట్టిపాదములతోఁ బయనింపవలయు;
అతికోమలములు నీ యంఘ్రిపద్మములు.
ఆకాశమంటు నెత్తైన కొండలును,
గాఢాంధకారంబుఁ గ్రమ్మిన గుహలు,
పాతాళమును జూపులోతు లోయలును,
ఘోషించుచును బారుకొండవాగులును,
అతిమహాగాధంబు లై దాఁటరాక
తేజిచూడఁగ రానితీవ్రతతోడ
భయద గర్జనలతోఁ బ్రవహించుచుండు-
ఘన నదీనదములు న్గలిగిన, విపిన
మార్గంబు లతి దుర్గమంబులు దేవి!
భల్లూక, వృక, గజ, వ్యాఘ్ర, హార్యక్ష,
ఘోరరావములకు గుండెలు వ్రీలు.
జానకీ! నేలపై శయనింపవలయు;
వల్కలంబులఁ గట్టవలయును; మఱియు
ఫలకందమూలముల్ భక్షింపవలయు;
ఇవి యైన సతము లభించ వచ్చోట,-
ఋతుధర్మసరణి లభించునేగాని.
సతి! నరాహార నిశాచరుల్ వివిధ
కపటవేషములూని కానఁ జరింత్రు.
కొండవాఁగులనీరు గూర్చు రోగముల.
అడవుల యిడుమల నుడువఁగాఁ దరమె?

కడుభీతిఁ గూర్చెడి కాలసర్పములు,
పటుభయంకరము లౌ వనవిహంగములు,
స్త్రీలను బురుషులఁ జిత్రచిత్రముగ
నపహరించెడి రాక్షసావళి, వనిని
విహరించుచుండును విచ్చలవిడిగ.
వన మన్న ధీరులే వణకుదు, రీవు
భీరుస్వభావవు ప్రియ! మృగనేత్ర!
గహనవాసము నీకు విహితంబు గాదు.
కలహంసగమన! నిఁ గానల కేను
గొనిపోదు ననువార్త వినిన లోకంబు
నిందించు ననుసుమా, నీరేజనయన!
మానస సలిలసుధాఽనందహంసి
క్షీరాబ్ధి జీవింపఁ జాలునా? సకియ!
పల్లవనవచూతవనసుఖ పికము
చంద్రలఅడవిలోఁ జరియింపఁ గలదె?
స్వాంతమం దీవు విచారించుకొనియు
మందిరంబున నిలుమా, చంద్రవదన!
కాననక్లేశముల్ కడు దుస్సహములు.
సహజమిత్రుని, నిజాచార్యునిఁ విభుని,
హితవాక్కు శిరసావహింపని వ్యక్తి
తనకుఁ దానే కీడుఁ దగఁ జేసికొనియు,
ఆత్మఁ బశ్చాత్తాపమందును దుదకు."
ఈ రీతిఁగా వచియించు శ్రీరాము
మృదుమనోహరవాక్కు లెల్ల నాలింపఁ
గనుకొలంకుల నీరు గ్రమ్మె మైథిలికి.
'జానకీలలితలోచన కమలములు
బాష్పప్రవాహసంభరితంబు లయ్యె;
శ్రీరాముశీతల శ్రీవచనములు
చక్రవాకికి శరశ్చంద్రిక యట్లు
ధారుణీసుతకు సంతాపంబుఁ గూర్చె;
అపుడు నిరుత్తర యగుచు వై దేహి.
విమలభావుఁడు మహాప్రేమికుఁ డైన
తనపతి తన నింకఁ ద్యజియించి వెడలు
నని యెంచి వికలత నందె స్వాంతమున.
అంత నా భూసుత యతిప్రయత్నమున
నొలుకుకన్నీరుఁ గన్నులఁ గ్రుక్కుకొనుచుఁ
జెదరినధైర్యంబుఁ జేకూర్చుకొనుచుఁ
దనయత్తపాదపద్మంబుల కెఱఁగి.
సాంజలి యగుచు నీసరణి వచించె:
"దేవి! నాయధికాఽవిధేయత సైపు
మిప్పుడు నాదుప్రాణేశుండు నాకుఁ
బరమహితంబునే ప్రవచించెఁ – గాని
స్వాంతంబునం దే విచారించి చూడఁ
బ్రియవియోగముకన్నఁ బెనువగ లేదు.
ఓ ప్రాణనాయకా! ఓ కృపాయతన!
ఓ దివ్యసుందరా! ఓ సుఖదాత!
ఓ జ్ఞానసాగరా! ఓ రామచంద్ర!
రఘువంశకైరవరాకాశశాంక!
నినుఁ బాయ స్వర్గమేనియు నరకంబె
చూడ మాతాపిత్రుల్, సోదరీమణులుఁ,
ప్రియబంధుజనులు, సుహృద్వరగణము,
అత్తమామలు, సహాయులు, దేశికులును,
సుందరుల్ గుణనిధుల్ సుఖదు లైనట్టి
తనయులున్, సర్వబాంధవులునుఁ గూడ
పతి నెడఁబాసిన సతి కొనఁగూర్చు
గ్రీష్మాతపముకన్న భీష్మతాపంబు.
తను ధన, పుర, ధరా, ధామ, రాజ్యములు
తనపతి లేక సంతాపప్రదములు;
భోగసంఘంబులు రోగతుల్యములు;
ఆభరణంబు లత్యంత భారములు.
లోకమే ఒక యమలోక మైపోవు
ప్రాణనాయకు నెడఁబాసిన సతికి.
ప్రాణప్రియా! ఈ ప్రపంచంబులోన
నాకు నీకన్న నన్యము సుఖ మిడదు.

ప్రియ! జీవరహితశరీరంబుపగిది
జలహీనవాహినిచందంబు దోఁచు
నాత్మేశుఁబాసినయంగనబ్రతుకు.
విమలశరచ్చంద్రబింబసమాన
భవదాననము నేత్రపర్వంబు గాగఁ
గనుచు మీ సన్నిధి మనుటయే నాకు
సకలవిధంబుల సంతోషకరము.
ప్రాణేశ! రామ! నీ పాదసన్నిధిని
ఖగమృగగణములే యగుఁ బరిజనము;
వన మయోధ్యాపురవరముగా నగును;
వల్కలంబులె యగు వరదుకూలములు;
పర్ణశాలయె ఇంద్రభవన మై క్రాలు;
వనదేవతలు కృపాభావులు నన్ను
అత్తమామలవలె నాదరించెదరు;
ప్రభు! భవత్సాంగత్యభాగ్యంబుచేతఁ
గుశకిసలయశయ్య, కుసుమాస్తరమ్య
శయనంబుతోడను సరితూఁగఁ గలదు;
అల కందమూలఫలాళి భుజింప,
నమృతోపమానరుచ్యాన్న మై తోఁచు;
అటఁ బర్వతము లయోధ్యాపురిలోని
సౌధశతంబుతో సరిపోలఁ గలవు;
నీ చరణాబ్జముల్ నే క్షణక్షణముఁ
గూర్మితో వీక్షించుకొనుచు సుఖంతుఁ—
బగటిని గనుచక్రవాకివిధాన.
వనవాసమునఁ గల్గుబహుళకష్టముల,
భయవిషాదోత్పాతపరితాపములను
వివరించితిరి, నాథ! ప్రీతితో – కాని,
ఇవియెల్లఁ గలసియు నిసుమంతయైనఁ
బ్రభువియోగామితవ్యథ కెనరావు.

సీత తన్ను వనమునకుఁ గొనిపొమ్మని కోరుట

ఓ కృపారసనిధీ! ఓ జ్ఞానమూర్తి!
ఈ విషయములు గ్రహించి, నీతోడ
నన్నుఁ గైకొనిపొమ్ము నాథ! వీడకుము.
తతదయామయుడ వంతర్యామి వగుట
ఎక్కువ విన్నపం బేఁ జేయ స్వామి!
పదునాలుగేఁడులవఱకు న న్నిచట
వదలి మీ రేఁగ నేఁ బ్రదుకుట కల్ల
ఓ దీనబాంధవా! ఓ సుందరాంగ!
ఓ ఘనసుఖదాయి! ఓ శీలజలధి!
ఓ ప్రణయనిధాన! ఓ రఘునాథ!
మనప్రయాణములోన మార్గమం దేను
త్వద్దివ్యపాదపద్మము లనుక్షణముఁ
గనులార దర్శించుకొను చుంటచేత
ఆయాసమును గాంచ, నావంత యేని.
సర్వవిధంబుల సంసేవఁ జేసి
ప్రియ! భవన్మార్గపరిశ్రమ మెల్ల
నుపశమింపగఁ జేతు, నో ప్రాణనాథ!
ఏచెట్టునీడనో? యించుక నీవు
చేరి విశ్రాంతిని జెందుచున్నపుడు,
పాదంబులొత్తుచు బహుమృదులముగ
మెల్లన విసరెద నుల్లాసమెసఁగ.
శ్రమబిందుయుక్తము సుశ్యామలమైన
మత్రాణవిభవ్యమంగళాకృతిని
గనుచుండ దుఃఖంబు గలుగునే నాకు?
సమతలం బగుప్రదేశంబును జూచి
తృణకణంబులపైన మృదుపల్లవములఁ
జక్కఁగా బఱచియు శయ్య నమర్చి
ఈ దాసి, నీ మృదుపాదంబు లొత్తు:
దడవకుఁ దడవకుఁ ద్వన్మృదు మూర్తిఁ
గనులకుఁ బండువఁగాఁ జూచు నాకు
వడగాడ్పు సోకదు. ప్రాణేశ! రామ!
నేను నా ప్రభుచెంత నివసింప, నన్నుఁ
గన్నెత్తి యెవ్వఁడు గనజాలు నుర్వి?

ఎక్కడనైనను, నక్కట, కుందేలు,
సింహాని వీక్షించి జీవింపఁగలవె?
నే సుకుమారిని?- నీ వటుగాక
వనవాసివా ప్రభూ! ప్రథమంబునుండి?
వనమునం దీవు తపశ్చర్యనుండ-
భవనమందున సుఖపడుదునా? నేను;
ఇది పతివ్రతలకు హితకార్య మగునె?
ఇట్టి కఠోరోక్తు లిప్పుడు వినియు
రెండుగా నా గుండె వ్రీలక నిలిచె
ప్రభువియోగమహోదురంతదుఃఖంబు
భరియించుటకె, నాదుప్రాణముల్ పోవు!"
అని పల్కి సీత మహోకుల మొందె.
ఆ సీత, మాటలయందు సైతంబు-
రామవియోగభారము నోర్వ లేదు!
అంత నా రఘుపతి, యరసి యా స్థితిని
ఆ మెసంకల్పంబు ననుసరింపకయె
విడిచివెళ్ళినయెడ, విడుచుఁ బ్రాణంబు
లని, తా గ్రహించె నిజాంతర్యమందు.

శ్రీరాముఁడు సీతను తన వెంటఁగొనిపోవ సమ్మతించుట

ఆ సూర్యకులవిభుం డా కృపాళుండుఁ
బలికె నీ రీతిగాఁ "బ్రణయినీ! సీత!
దుఃఖంబు విడుము, నాతోఁ గూడిరమ్ము;
సమయంబు గాదు విచారింప నిపుడు-
వనయాత్ర కిదె వేగఁ బయనంబుఁ గమ్ము."
అటులఁ బ్రియోక్తుల నా రఘుస్వామి
జానకి నోదార్చి, జననిపాదముల
వ్రాలియు నామెదీవనలు గ్రహించె.
"మఱల శీఘ్రంబుగా మాతండ్రి వచ్చి
ప్రజల దుఃఖం బెడఁబాపుమా; మఱియు,
రామ! ఈ కఠినాత్మురా లగునీదు
మాతను మఱువకుమా, స్వాంతమందు.
హా! విధీ! యెపుడు నా దగుదశ మాఱు?
ఈ రమ్యమిథునంబు నెన్నాళ్ల కింకఁ
గనులార వీక్షింపఁ గలుగునో మఱల?
నేను జీవించియు నీ ముఖచంద్రుఁ
దిరిగి చూచెడి శుభదిన మెప్పు డగునో?
నా వత్స! నా తండ్రి! నా రామచంద్ర!
రఘుపతీ! రఘువరా! రఘువీర! యనుచు
నిన్ను నోరారఁగా నేఁ బిల్చుకొనుచుఁ
బ్రియమారఁగాఁ గౌఁగిలించి నీమూర్తిఁ
గనులారఁ గాంచఁగాఁ గలదిన మెపుడొ?"
అని పలుక్-చున్ననిజాంబను గాంచి,
అనురాగవివశాత్మ యై యామె యింకఁ
బలుకఁజాలక బాధపడుచుంటఁ జూచి,
పలువిధంబుల రామభద్రుఁ డాయమను
ధర్మవాక్యముల నోదార్చె, మునీంద్ర!
ఆ పరిస్థితియును, ఆ మహాప్రేమ
నభివర్ణనముఁ జేయ నలవిగా వనఘ!
అంత నా జానకి, యత్తపాదముల
కెఱఁగి, యీరీతి వచించె: "నో జనని!
వసుధలోఁ గడుమందభాగ్యను నేను!
ద్వత్సేవఁ గావించుతరుణంబునందు
విపినవాసము నాకు విధి విధియించి
నా మనోరథము భగ్నం బొనరించె.
వ్యాకుల మొందఁగా వలదు నీ వింక,
ద్వత్కృపమాత్రము తప్పక సతము
నాపైనఁ బరపుమా, నానతిఁ గొనుమ!
విధి యనుల్లంఘ్యము, పృథుకఠోరంబు-
ఏను జేసినదోష మిం దేమి లేదు."
అని సీత పలుకు వాక్యము లాలకించి
కౌసల్య ఘోరదుఃఖం బొందె; నామె
హృద్దురవస్థ వర్ణింపఁగాలేను.

ఆయమ్మ కౌసల్య ఆ ధరాసుతను
గుండెకు హ త్తించుకొని పలుసారు
లెట్ట కేలకు ధైర్య మెద వహియించి,
"నమ్యగంగాయమునాప్రవాహంబు
లుర్వీలో నెందాక యుండు, నందాక-
నీదు సౌభాగ్యంబు నిలుచునుగాక!"
అనుచు సంప్రీతితో నాశీర్వదించె.
అ ట్లనేకవిధాల అ త్త దీవించి
విహితబోధలను గావించినపిదప,
ఆమెపాదంబుల కతిప్రీతి పొంగఁ
బరగఁ బునఃపునఃప్రణతు లొనర్చి
చెమరించుకన్నుల సీతమ్మ కదలె.

శ్రీరామచరితమానసము

అయోధ్యా కాండము

షష్ఠవిశ్రామము

స్మితవదనాంబుజ: లక్ష్మీ
యుతశుభవామాంకపీఠ: ఉరగచ్ఛత్రా:
శ్రితజనవరదాఽభయకర:
పతగాధిపవాహ: మట్టపల్లినృసింహా:

శ్రీరామవనయాత్ర చెవిసోకినంత
వ్యాకులం బొప్పఁ జివాలున లేచి
సౌమిత్రి పరుగున జనె నన్న కడకు
వదనంబుపై ఖిన్న భావంబుఁ దోఁప.
కంపితపులకితగాత్రంబుతోడ,
అశ్రుప్రవాహపూర్ణాక్షులతోడ,
ఆ లక్ష్మణస్వామి యమితానురాగ
పరవశుఁ డై రాముపదముల వ్రాలె
అతఁడు మాటాడుట కవశుఁ డై నిలిచె
శ్రీరామచంద్రు వీక్షించు చూరకను
దీనత జలహీనమీనముపగిది.
"ఓ విధీ! ఏమి కానున్నదో ముందు?
నా సుకృతంబును నా సుఖ మెల్ల-
ఈనాటితోఁ దీరె; నిపుడు రాఘవుఁడు
దాసున కేయాజ్ఞ దయసేయఁ గలఁడొ?
తనతోడఁ గైకొని తరలునో? లేక
ఇంటనేనను విడి యేగునో స్వామి?"
అని లక్ష్మణుండు మహోకులుం డగుచుఁ
దనలోనఁ దాను విత్కరించు కొనియె.

వ్యాకులచిత్తుఁ డై నిల్చున్నలక్ష్మణుని
శ్రీరాముఁ డోదార్చుట

మతి దేహగేహాభిమానంబు లట్లు
తృణతుల్యముగను బరిత్యజించియును
ముకుళితహస్తుఁ డై ముందు నిల్చున్న
తనసహోదరుఁ గాంచి తన్న్యాయవిదుఁడు
సుస్నేహశీలవిశుద్ధస్వభావ
హార్ద్రాబ్ధి యగురాముఁ డనియె నీ రీతి:
"ప్రేమచే నీ విట్లు వికలతఁ గనకు-
తుదకుఁ గుమార! సంతోషమే కలుగు;
స్వస్థతఁ గను మిది స్వాంతమం దెఱిఁగి.
అరయ మాతాపితృగురుదేవవిభుల
ఆజ్ఞను దలఁదాల్చు నమ్మహాజనులె
ధన్యజన్ములు సుమా; తదితరజనులు
వ్యర్థజన్ములు లక్ష్మణా! ప్రపంచమున.
ఇయ్యది మదిలో గ్రహించి నా మాట
విని, మాతృపితృసేవ విడ కిట నిలుము.
భరతశత్రుఘ్నులు పురిలోన లేరు;
క్ష్మాపతి వృద్ధుఁడు, మఱి దుఃఖవశుఁడు;
నిను వెంటఁ గైకొని నే నరణ్యమున
కరుగఁ, బూర్తిగ నయోధ్య యనాథ యగును.
గురు జననీజనకులు పరిజనులు
పురజనుల్ కడు దుఃఖమును గాంత్రుగాన—

ముదమొంద నీ విట నిలుము;
కానిచో మన కతికలుషంబు కలుగు.
తన ప్రియజనుల కే ధారుణీవిభుని
పాలనం బొనగూర్చుఁ బరితాపభార,
మా నరపతి నరకావాస మొందు;
ఈ నీతి నెఱిఁగి నీ వింటిలో నిలుము."
అన విని లక్ష్మణుం డతిఖేద మొందె
చల్లని ఆ రామచంద్రు పల్కులకు
మంచుతుంపరకుఁ దామరపుష్ప మట్లు
తెల్లఁబోయె నతండు దీనాత్ముఁ డగుచు.
అత్తఱిఁ బ్రేమవశాత్ముఁ డై యతఁడు
మారాడఁ జాలక మహితరామాంఘ్రి
కమలయుగ్ముఁ గట్టిగాఁ బట్టుకొనియుఁ
బ్రార్థించె నిట్లు భరద్వాజమౌని !
"నేను నీ దాసుండ నీవు నా స్వామి
వో నాథ ! నను వీడుచో గతి యేమి ?
ఓ ప్రభూ ! నీ బోధ యుచితమే; కాని,
అతిదుర్బలాత్ముఁడ నగు నాకుమాత్ర
మాచరింపఁగ నసాధ్యంబు శ్రీరామ !
ధర్మధురంధరుల్ తతధీరు లైన
బుధజనుల్ మాత్రమే యధికారు లరయ
నిగమనీతుల విన, నేర్వంగ! నేను
స్వామి ! నీ చాటునఁ బ్రదుకు నర్భకుఁడ;
మందర మేరుగిరీంద్రముల్, హంస
యెత్తఁ గల్గున ? ప్రభూ ! యెఱుఁగ నీకన్న
వేఱొక్కగురువును, పితను, మాతలను !
హృత్పూర్వకముగ వచించుచున్నాఁడ—
నా మాట నమ్ముము నాథ ! సర్వజ్ఞ !
ఓ దీనబాంధవా ! ఓ హృన్నివాస !
వేదముల్ తెలిపిన విశ్వంబులోని
ప్రేమానురాగకీర్తి ప్రతిష్ఠాదు
లెల్లను నాకు నీవే, రామచంద్ర !

సత్కీర్తి, సంపద, సద్గతి, నెవఁడు
వాంఛించు మనమున – వానికిఁ దగును.
ధర్మనీతిప్రబోధంబు లొనర్ప.
త్రికరణంబుల భవచ్ఛ్రీపాదరతుఁడ
నగుననున్ను వదలుట న్యాయమా? రామ!
ఓ కృపాగుణసింధు! ఓ శ్రితబంధు!"
అనుమృదువాక్యంబు లాలించినంత
గుణవంతుఁ డగుతనకూర్మిసోదరునిఁ
గరుణాబ్ధి రాముఁడు కౌగిలించియును,
ఆతనిప్రేమవిహ్వలత వీక్షించి
తగువచనముల నోదార్చె ముసీంద్ర!

శ్రీరాముఁడు లక్ష్మణుని దనవెంటఁ
గొనిపోవ సమ్మతించుట

"తమ్ముఁడా! వెళ్లి నీ తల్లియానతిని
గైకొని శీఘ్రంబుగా వచ్చి వనికి
నాతోఁ ప్రయాణసన్నద్ధుండ వగుము."
అను రఘువరువాణి నాలించినంత
అమితనష్టము తప్పి యతిలాభ మొంది
నట్లుగా, లక్ష్మణుం డానంద మొందె
అంధుండు చూపొందినట్లు లాతండు
సంతోషమునఁ దల్లిసన్నిధి కరిగి,
ఆమెపాదంబుల కభినతుల్ చేసె-
అవనిజారాఘువాయ త్తచి త్తమున.
వచ్చిన సుతు మనోవ్యాకుల మరసి
ఆ సుమిత్రాదేవి యడిగెఁ గారణము.
అపుడు లక్ష్మణుఁడు వృత్తాంతమంతయును
వివరింప నా ఘోరవిషయం బెఱింగి
కార్చిచ్చుఁ గ్రమ్మఁగాఁ గళవళ మొందు
మృగిచందమున నామె మిగుల భీతిల్లె.
"ఈ నాఁడు వాటిల్లు నే యనర్థంబొ?
జనయిత్రి ప్రేమవశంబున నాదు

కార్యభంగంబును గావించు" ననుచు
సభయుఁ డై లక్ష్మణస్వామి శంకించె-
'అమ్మరో! సెలవి మ్మ'టంచుఁ గోరుటకు.
'హా విధీ! శ్రీరాము ననుసరింపంగ
ఈమె నా కనుమతి యిచ్చునో? లేదొ?'
అని యాతఁ డెంచె నిజాంతర్యమందు.
జానకీరాముల సౌందర్యశీల
సత్యభావంబుల సంస్మరించియును,
నృపునివాత్సల్యంబు నెంచి సుమిత్ర,
పాపిష్ఠకై కేయి పన్నాగ మెఱిఁగి
తల బాదుకొనియెను దల్లడపడుచు.
చెడుకాల మిది యని చిత్తమం దెఱిఁగి
చెదరిన ధైర్యంబుఁ జేకూర్చుకొనియు,
సహజసద్‌హృదయ యౌ జనని సుమిత్ర
పలికె నీవిధి మృదువాణి చెలంగ:
"వత్స! నీ ప్రియమాత వరసాధ్వి సీత;
ప్రేమతో ని న్నన్నివిధములఁ జూచు
శ్రీరాముఁడే భవత్ప్రియజనకుండు;
శ్రీరాముఁ డెచట వసించునో? అదియె
శ్రీయయోధ్యాపుర శేఖరం; బరయ
ఎట రవి వెలుగొందు నటఁగదా దివము?
జానకీశ్రీరామచంద్రులు వనికి
నిజముగాఁ బోవుచో, నీ కీ యయోధ్య
వాసం బొనర్పఁగాఁ బని యేమిగలదు?
తనగురుదేవుని, తల్లిదండ్రులను
అగ్రజు, సురల, నిజాధీశు, సతముఁ
బ్రాణసమంబుగా భజియింపవలయు.
రాముఁ డెల్లఅకును బ్రాణాధికుండు,
నిఖిలజీవేశుండు, నిస్వార్థసఖుఁడు.
ఎవ్వరెం తెంతగా శ్రీరామచంద్రు
బాంధవ్యమును గల్గి భాసింత్రు, వార
లంతంతగా మనకందఱి కమిత
పూజనీయులు, ప్రియంబును గూర్చువారు
ఈ విషయంబుల నెల్ల గ్రహించి
ప్రియసుతా! శ్రీరాము వెనువెంట నీవు
వని కేఁగి జన్మసాఫల్యంబుఁ గనుమ!
భవదాత్మ శ్రీరామపాదపద్మముల
నిష్కపటంబుగా నిలిచి యుండుటను,
తనయ! నీవును నేను ధన్యధన్యులము.
రఘుపతిపదభక్తిరతుఁ డగుసుతుని
గాంచినయువతియే కన జగంబందు
పుత్రవతీ, నామమున కర్హురాలు;
కానిచో గొడ్రాలుగా నుంట మేలు.
శ్రీరామవిముఖుఁ గాంచియుఁ బుత్రలాభ
మందినా నని యెంచు నాతన్వి పడిన
శ్రమ యెల్ల నిజము నిష్ఫలము నిష్ఫలము.
నీ భాగ్యవశమునఁ నే రఘూద్వహుఁడు
వనవాస మొనరింపఁ బయనించుచుండె-
అన్యహేతువు తనయా! యిందు లేదు.
అఖిలపుణ్యములమహాఫలంబోయి
జానకీరామాంఘ్రి సహజానురక్తి!
రాగరోషముల, నీర్ష్యామదమోహా
ముల, స్వప్నమం దైనఁ బొందఁగా వలదు.
వివిధవికారముల్ విడి, త్రిశుద్ధిగను
జానకీరాముల చరణాంబుజముల
నిరతంబుఁ గొలువుము నీవు కుమార!
నీ తల్లిదండ్రు లై నిన్ను ప్రేమించు
జానకీరాములసన్నిధి నుంట,
అఖిలవిధంబుల అడవిలో నీవు
పరమసంతోషంబుఁ బడయఁగాఁ గలవు.
రాముఁడు వనమందు శ్రమనొందకుండ
వేయికన్నులఁ గనిపెట్టి వర్తింపు
మిదియె నా యుపదేశ మెల్లఁ దనూజ!
శ్రీమతీరాములు కాంతారమందు

మొందునట్లుగాఁ జూడుము సతను.
తల్లి దండ్రులను బాంధవజనంబులను
నగరసౌఖ్యంబుల నాయనా! వారు
మఱచునట్లుగ నీవు మసలుకోవలయు" —
అని సుమిత్రాదేవి ఆ లక్ష్మణునకు
బోధించి సెల విడి, "పోయిర"మ్మనుచు,
"జానకీ రఘువీర చరణాంబుజముల
నిత్యావినూతననిర్మలావిరళ
భ క్తి నీ యెదలోన భాసించుఁగాక!"
అని, దీవనము లిచ్చె ననఘా! ముసీంద్ర!
అంత లక్ష్మణుఁడు నిజాంబకు మ్రొక్కి—,
ఆలసించిన నేమి ఆటంక మగునొ?
అని భీతినొందుచు స్వాంతంబులోన,
త్వరితంబుగా నేగె- వలఁ దప్పుకొనియు
పరుగిడుచుండిన హరిణంబురీతి.
జానకీనాథుని సన్నిధి కరిగి
సౌమిత్రి, మనమున సంతోష మందెఁ
దనప్రియాగ్రజుచెంతఁ దాఁ జేరియుంట.
అంత నాతండు మహాభ క్తి మెఱయ,
క్ష్మోణిజారాముల సుందరాంఘ్రులకు
ప్రణతులు గావించి, వారితోఁ గూడి
నృపమందిరంబున కేఁగె, నయ్యెడను—
"మనకోర్కె- లీడేర్చుమాదిరిఁ జూపి
విధి ఎంతవింతగా విఫలం బొనర్చె"—
నని చెప్పుకొనిరి మహాజను లెల్ల.
వారిశరీరముల్ వాఁడి కృశించె;
మనములు దుఃఖసమ్మగ్నంబు లయ్యె;
వదనముల్ దైన్యసంభరితంబు లయ్యె;
మధువుఁ గోల్పోయినమధుపంబు లట్లు
వ్యాకులం బొంది రాప్రజలు సర్వులును.
కుమిలి చేతులునల్పుకొనుచు ఎల్లెత్తి
పరితపించుచు నెత్తిపైఁ బాదుకొనుచు
పక్షముల్ విరిగినపక్షులపగిది
ఆకులపడి రయోధ్యాజను లెల్ల -
అవనీంద్రసౌధసింహద్వారమందు
గుంపులు గుంపులు కూడిరి జనులు;
వారి యపారదుర్భరవిషాదంబు
వర్ణనం బొనరింప నశముగా దనఘ!
అంత సుమంత్రుఁ డాయువనీశమణిని
తిన్నఁగఁ దా లేవఁదీసిఁ ఆసీనుఁ
జేసిఁ రాఘవుఁడు వేంచేసినాఁ డనెడి
ప్రియవ ర్తమానంబు వినిపించె నపుడు -
జానకీరామలక్ష్మణుల వీక్షించి
దుర్భరవ్యాకులదోదూయమాన
మానసుం డయ్యె నా మానవేశ్వరుఁడు -
పృథ్వీసుతను దనయిద్దఱుసుతుల
నరసినకొలఁది మహాకుల మొదవ,
అతఁడు వాత్సల్యవశాత్ముఁ డై వారిఁ
బలుమాఱుఁ గౌఁగిట బంధించుకొనియె.
వికలుఁ డై యతఁడు నోర్వ్వప్పలే డయ్యె;
ఆతని యెడద భయంకరదుఃఖ
దావాగ్నికీలికాదహిత మై యుండె.
అంతట రఘువీరుఁ డతిభ క్తితోడఁ
బితృపాదవినతిఁ గావించియు, లేచి
అడవుల కేఁగ ని ట్లాజ్ఞ నర్పించె :
"తండ్రి! న న్దీవించి త్వర సెల విండు!
ఈ హర్ష వేళ మీ కేల దుఃఖింప ?
భూనాథ! ప్రియవస్తుమోహంబుకతన
ధర్మపథంబును దప్పినయెడల
యశము నశింపఁగా, నపయశం బొదవు."
అన విని నరపతి యనురాగవశత
లేచి, రాముని చేయి లెస్సగాఁ బట్టి,
చెంతఁ గూర్చుండఁగా జేసి, యి ట్లనియె :
"నాయనా! శ్రీరామ! నాతండ్రి! వినుము :

రాముఁడు సర్వచరాచరనాథుఁ
డని ప్రకటించె మహామునిజనము.
జీవకోటికి వారు చేసికొన్నట్టి
శుభకర్మములకు, నశుభకర్మములకు
సముచితరీతి విచారించి తగిన
ఫలము లొసంగును బరమేశ్వరుండు.
ఎవఁడు చేసినది వాఁడే పొందు ననుచు
వేదముల్ తెలుపుఁ, విబుధు లాడెదరు.
కాని, యీనాఁటి సంఘటనలోఁ దోఁచు
అపరాధమును జేసినట్టివాఁ డొకఁడు,
ఫలభోక్త వేఱొండువ్యక్తి గా నహహా!
భగవద్విధానముల్ బహువిచిత్రంబు—
లీ జగంబున వాని నెఱుఁగలే రెవరు!"
రామునివిపిననిర్గమన మాపుటకుఁ
బాప మా దశరథపార్థివో త్తముఁడు
హృత్పూర్వకముగ నసేకయత్నములు
గావించెఁ గాని రాఘవభావ మరయ—
ధర్మధుర్యుండును దతధీరవరుఁడు
పారదర్శనుఁ డౌచు భాసిల్లు నతఁడు
వెనుకంజ వేయఁబో డని యర్థమయ్యె.
అంత నా నరపతి, అవనీకుమారి
నతిప్రీతిఁ గాగిలియందునఁ జేర్చి
ఎన్నియోవిధముల హితబోధఁ జేసె;
వనవాసదుస్సహబాధలఁ దెలిపి
అత్తవారింటిలోనైనను లేక
పుట్టింటనేనియుఁ బొసఁగ వసింపు
మని, వచియించె మహర్షి వరేణ్య!
కాని, (శ్రీ)రామాంఘ్రికమలానురాగ
యైన సీతాదేవి కావంతయేని
భవనము సుఖముగా, వనము కష్టముగ,
హృదిఁ దోప దయ్యె ముని! భరద్వాజ!
అటఁ జేరినట్టి వా రంద ఱాయమకు
విపిన విపతోత్కటి విశదీకరించి—
రల సుమంత్రునిభార్య, ఆచార్యపత్ని,
తదితరవృద్ధకాంతామణులెల్ల,
'అవనిజా! నిన్నెవ్వ రడవుల కేగఁ
గోరలే దందుచేఁ గోమలీ! సీత!
నీ అత్తమామలు నీ గురు వెట్లు
చెప్పిన నట్లీవుఁ జేయు" మటంచుఁ
బతిసలాడిరి, మృదువాక్కులు వెలయ.
తన్మృదుమధుర శీతలసుఖవిహిత,
వచనముల్ విని సీత వ్యాకుల మొందె—
కక్రమశీతలశరత్కాలచంద్రికను
బరితాపపడు చక్రవాకంబుపగిది.
అపుడు లజ్జాతిశయంబున నామె
మాఱువచింపక మౌనంబుఁ దాల్చె;
కాని, కైకేయి యాకాంతలనుడులు
విని, కోపమునఁ జివాలున లేచిపోయి
వనవాసులగు మునీశ్వరులుధరించు
వసనవిభూషణభాజనంబులను
దెచ్చియు (శ్రీ)రామదేవుముం దుంచి
మృదువాక్యములతోడ నీరీతిఁ బలికె:
"రఘువీర! (శ్రీ)రామ! రాజున కీవు
ప్రాణప్రియుండవై పరగుచున్నావు
శీలంబు, నీపైన స్నేహంబు,— రెండు
విడుటకు ధృతిలేక విభుడున్నవాఁడు.
పుణ్యంబు సత్కీర్తి పోయినన్ గాని
పరలోకసుఖమును బొసినన్ గాని
భూపతి నిన్ వనంబున కేఁగు మనఁడు;
దీని గ్రహింపు మా పైని నీయిష్ట"
మను పినతల్లి,వాక్యములను వినియు
రామచంద్రుండు హర్షస్వాంతుఁడయ్యె.
కాని, ఆ వాక్యముల్ బాణంబులట్లు
వచ్చి గ్రుచ్చుకొనంగఁ బార్థివమౌళి,

హా! మంద భాగ్యుఁడ నైన నా మొండి
యసువులుపో వయ్యె" నని లోనవగచెఁ
అంత భూపతి మూర్ఛనందుటఁ జూచి
ప్రజ లెల్ల వ్యాకులపడి, రట్టితఱిని
ఎవరికైనను సరే యేమి చేయుటకుఁ
బాల్పోవదయ్యెను భావంబులోన.
అప్పుడు మునినాయకా! భరద్వాజ!
వేగ రాముఁడు మునివేషంబుదాల్చి
తల్లిదండ్రుల యడ్డుఁదమ్ముల కెఱిఁగి
నిష్క్రమించెను ధర్మనియతి దీపింప.

శ్రీరాముఁడు వసిష్ఠాదులకు నమస్కరించి
సీతాలక్ష్మణులతో వనప్రయాణ మొనర్చుట

వనగమనమువకు వలయుసన్నాహ
మంతయుఁ గావించి యా రఘుస్వామి
నిజసతీసోదరాన్వితుఁ డౌచు వరుస
విప్రవసిష్ఠాదివిబుధుల కెల్ల
పాదాభినతులను భక్తిఁ గావించి
వెడలె సర్వులును నిర్విణ్ణు లై నిలువ.
వారంత నరపాలభవనంబుఁ గడచి
వాసిష్ఠమందిరద్వారంబుచెంత
నాగిరి; విరహదావాగ్ని సంతప్త
చిత్తు లై జనులెల్లఁ జింతించుచుండ్రి.
అప్పుడు రఘువీరుఁ డా ప్రజావళినిఁ
దగువచనముల నోదార్చిఁ ఆ పిదప
విప్రబృందముల గావించి, వారలకు
వర్షాశనంబులఁ బరఁగ నొసంగ
స్వాచార్యులకును విజ్ఞప్తిఁ గావించి,
ఆదరవినయదానాదులచేత
వారల సంతోషపఱిచె; వెండియును -
దానమానముల నుదారత మెఱయ
యాచకావళికి నాహ్లాదంబుఁ గూర్చి,

నిర్మలప్రేమచే నిఖిలమిత్రులను
పరితోషపఱిచె; నాపైన రాఘవుఁడు!
దాసదాసీజనతతిని రావించి,
కృపవసిష్ఠున కొప్పగించి, "ఓ స్వామి!
తలిదండ్రులట్లుగాఁ దగ మీరు వీరిఁ
గనిపెట్టి పోషించుకొనుఁడు మహాత్మ!"
అని ప్రార్థనముఁజేసి సాంజలి యగుచు.
మఱియు శ్రీరాముఁడు మాటిమాటికిని
గరములు జోడించి, క్రమవాక్యముల
అటుఁ జేరినట్టి వారందఱి నరసి,
"ఎవరు భూవరునకు హిత మొనరించి
పరితోషపరతురో? వారలేనాకు
నెల్లవిధంబుల హితు లగువారు.
ఊరువివేకము గల ఓ ప్రజలార!
మాతల్లు లందఱు మా విరహమున
శోక మొందనిరీతిఁ జూడుఁడీ మీరు"
ఈ రీతి శ్రీరాముఁ డెల్లప్రజాళి
నోదార్చి, గురుదేవపాదాబ్జములకు
వందనంబు లొనర్చెఁ బరమ హర్షమున.
అంతట రఘునాథుఁ డతిభక్తి గదుర
గణనాథు, గౌరిని, కైలాసపతిని,
చింతించి, గురువ రాశీస్సులఁ బొంది,
పయనంబు సాగించె, వనదేశమునకు.
అటుల శ్రీరామాదు లరుగుచునుండ
జనులందు రేఁగె బ్రచండ దుఃఖంబు ;
ఆర్తనాదంబు లాయాకాశమంటెఁ;
దోఁచెను లంకలో దుశ్శకునములు;
అతిశోకమున మగ్న మయ్యె నయోధ్య;
సురలు హర్ష విషాదభరితాత్మ లైరి.
భూమీశుఁ డంతట మూర్ఛఁ దేటియును
బిలిచి సుమంత్రుని, బలికె నీరీతి:
"రాముఁడు పోయె నరణ్యాని కకట!

పోవయ్యె నా ప్రాణములు మంత్రివర్య!
ఇంకను ప్రాణంబు లీ బొంది విడిచి
ఏ సుఖం బాసించి యేఁగవో? యెఱుఁగ!
ప్రాణంబు లీ శరీరముఁ బాయఁజేయ
నింతకుమించిన వంత యే ముండు?"
అని పల్క యెటులో ధైర్యముఁదెచ్చుకొనియు,
ఆ మహీపతియిట్టు లనియెఁ దాఁ మఱల:
"సఖ! రథంబును గొని సత్వర మీవు
కానకుఁ జను రాముఁ గలిసికొ మ్మరిగి.
మత్కుమారులు సుకుమారు లిర్వురును;
అవనీకుమారియు నతిసుకుమారి;
ఏఁగి వారల రథ మెక్కించుకొనియు
నామకార్థముగ వనంబును జూపి
మూఁడు నాలుగు దినమ్ములలోన రమ్ము.
పృథుధీరు లైన నా యిఱువురుసుతులుఁ
దిరిగిరా నెటు సమ్మతింపనియెడల,
సత్యసంధుఁడు దృఢవ్రతుఁ డై వెలుంగు
శ్రీరామచంద్రుఁ బ్రార్థింపుము, "నాథ!
జనకపుత్రిని గృహంబున కంపు" డనుచు
వనమును గని, సీత భయపడినపుడు,
సమయుఁముఁ గనిపెట్టి స్వయముగా నీవు
నా మాటలుగ నిట్లు నచ్చఁగాఁ జెపుమ:
"నీ అత్తమామలు నీ కంపినట్టి
సందేశ మియ్యది జనకకుమారి!
మఱలి యింటికి రమ్ము మాతల్లి! నీవు.
వనవాసమునఁ గల్గుఁబలుప్రయాసములు;
నీ అత్తమామల నిలయంబునందొ,
నీ తల్లిదండ్రుల నిలయంబునందొ,
నీ కిష్ట మైనట్లు నివసింపవచ్చు.
ఈ విధంబుగఁ జెప్పి, ఎట్లైనఁ గాని,
ఆమె నింటికిఁ దెమ్ము – అట్లైనయెడలఁ
గొంత నా ప్రాణముల్ కుదుటనుబడును.
కా దేని, నాచావు కడకు నిశ్చయము.
విధి కడు విపరీత విధముగా నుండ
నేమి సేయంగలనే?" నని పలికి,
"జానకీరామలక్ష్మణులఁ దోడ్తెచ్చి
ఓ సుమంత్రా! చూపుమోయి!" యటంచు
మూర్ఛిల్లెఁ బుడమి నా భూనాయకుండు.
అట్లాజ్ఞ నొంది ధరాధీశుమ్రోల
వినమితశిరుఁ డౌచు వెడలి సుమంత్రుఁ
డతివేగముగ జనునరదంబుఁ గొనియు
నగరోపకంఠంబునన్ మార్గమందు
జానకీరామలక్ష్మణులను గలసె.
పిదప నాతఁడు ధరావిభువచనముల
విన్నపం బొనరించి వినయంబు గదుర
రథ మధిష్ఠింపఁగా రాము నొప్పించె.

సీతారామలక్ష్మణులు రథము నారోహించి
తమసానదీతీరమున కేగి విడియుట

అంత సీతయు నిర్వ రన్నదమ్ములును
దత్ శతాంగము నెక్కి తగలిరి వనికి–
అయ్యయోధ్యకు నతు లాత్మఁ గావించి.
క్షితిజేశరహితసాకేత మనాథ
మని తలపోసియు నట జను లెల్ల
వారలవెనువెంటఁ బడి రార్తు లగుచు.
అంతఁ గృపాసింధు వైన రాఘవుఁడు
పలుపలువిధముల వారి నోదార్చి,
ఎట్టులో మఱలించె నిండ్లకు; కాని,
అనురాగవశు లౌచు నా జను లెల్ల
తిరిగివచ్చిరి, రాము దేవు వెన్నాడ.
అంధకారావృత మగు కాళరాత్రి
యట్లయోధ్యాపుర మా తరుణమునఁ
గడుభయానకముగఁ గనిపింపసాఁగె.
ఆపుర స్త్రీపురుషాదు లెల్లఱును

దో ఁచిరి ఘోరజంతువులచందమున;
వా రొండొరులఁ జూచి భయమొందుచుండ్రి;
వల్ల కాడులవలె స్వగృహాళితో ఁచ,
పరిజనుల్ దయ్యాలవలె ఁగనిపింప
సుత, హిత, మిత్రులు, చూపట్టి రపుడు—
యమదూతలట్లు, మహర్షివర్యా!
వనవల్లి కావిటపంబులు వాఁడె;
నల సరిత్సరములు నిలువున నెండె;
సామజతురఁగ కేళీమృగకోటి
పట్టణమందలిపశుసమూహములు
చాతకశుకపిక ఖారికాహంస
సారస కేకీచకోరరథాంగ
సంఘంబు లెల్లను జానకీనాథ
విరహాగ్ని చేతను వికలత నొంది
అట నట చిత్రంబులట్లులు నిలిచె.
ఫలవికీర్ణ విశాలవన మనఁజెల్లు
శ్రీయయోధ్యాపురశ్రేష్ఠ,మం దుండు
జనతతుల్, ఖగమృగసంఘంబు లగును;
అట, విధి, కై కేయి యనుకిరాతకిని
సృష్టించె; నామె దాక్షిణ్యంబు విడిచి

ఆ వనంబునకు ని ప్పంటించి నంతఁ
దద్రామవిరహాగ్నిఁ దట్టుకోలేక
పారిరి, ప్రజ లెల్ల వ్యాకులపడుచు.
"జానకీరామలక్ష్మణులు లేకున్న
మనము సుఖంబుగా మనలేము పురిని.
ఎచట రాఘవుఁ డుండు నచటనే మనము
సర్వుల ముందము; సాకేతమందు
మన కేమిపని యింక మన రాముఁ డేఁగ?"
అని నిశ్చయించి ప్రజావళి యెల్ల
కదలె రాముని వెంటఁ గానల కరుగ—
సురదుర్లభము లగుసుఖసదనముల
నెల్లఁ బరిత్యజియించి మునీంద్ర!
శ్రీరామచరణనీరేజంబులందు
బద్ధానురాగు లౌభక్తులమతిని
విషయభోగంబులు విజయింపఁ గలవె?
పిల్లల వృద్ధుల విడిచి గృహాల,
శ్రీరాము ననుసరించిరి జనులెల్ల.
ప్రథమదినంబున రఘువల్లభుండు
తమసానదీదివ్యతటమున విడిసె.

శ్రీరామచరితమానసము

అయోధ్యాకాండము

సప్తమవిశ్రామము

చెన్నారువంశసేవిత!
పన్నగపతిపీఠ! దుష్టబాధాహరణా!
సన్నుతపావనచరిత! ప్ర
పన్నావన! మట్టపల్లివాస! నృసింహా!

ఆ ప్రేమవశ్యప్రజావళిం జూచి
అమితదయానిధి యైనరాఘవుఁడు
కడుఖిన్నుఁ డయ్యె సఖా! భరద్వాజ!
కరుణామయుం డగుకాకుత్థ్సవిభుఁడు
పరులదుఃఖముఁ జూచి భరియించలేఁడు;
మృదుమంజులము లగుప్రేమోక్తు లొప్ప
రఘురాముఁ డెన్నో తెఱంగులఁ బ్రజల
నోదార్చి, సలిపె ధర్మోపదేశములు.
ఐన, వా రెల్ల మహాప్రేమవశత
మఱలిపో నెంచియు, మఱలిపో రైరి.
స్నేహశీలములఁ ద్యజింపంగలేక,
సందిగ్ధదశ రామచంద్రుండు పొందె.
జను లంత వ్యాకులశ్రమలచే డస్సి,
తమసానదీసైకతముల నిద్రించి—
రమరమాయయు వారియం దావరించె.
రెండుయామములరాత్రి గతించె; నపుడు
శ్రీరఘుస్వామి మంత్రినిఁ జేరఁ బిలిచి
ఈ తీరుఁ బలికెను గృపవెలయంగ:

"రథపుజాడ లెఱుంగరా కుండునట్లు
తాత! పోనిమ్ము రథమ్ము నీ విపుడు—
వే ఱుపాయము లేదు వీరి మఱల్ప."
అంత శివాంఘ్రుల కభినతుల్ చేసి
జానకీరామలక్ష్మణు లరదంబు
నధిరోహణముఁ జేయ, నా సుమంత్రుండు
రథపుజాడ లెఱుంగరా కుండురీతి
రథమును వివిధ మార్గంబులఁ దోలె.
తెల్లవారెను, లేచి యెల్లజనంబు,
"శ్రీరాముఁ డేగెను శ్రీరాముఁ డేఁగె"
నని ఘోష లిడిరి మహాకులవశత.
మున్నీటఁ దమపుట్టి మునుఁగుటఁ జూచి
వనరు వణిగ్జనగణముచందమున
రథపుజాడలు కానరామి నల్దిశలఁ
బరుఁగిడి రున్మత్తభావు లై వారు—
"ఓ రామ! ఓ రామ! ఓ రామ!" యనుచు
తమ దుఃఖమును జూచి దశరథాత్మజుఁడు
దయచేత మఱపించి తరలినాఁ డనుచు—
ఒకరికొక్కరు సర్వులున్ జెప్పుకొనిరి.
అందఱుఁ దమువఁ దాము నిందించుకొనుచు
నీరుఁ బోసినవెంటనే, మరణించు
మానగణంబుల మిగులఁ గీర్తించి,
"రఘువీరుఁ బోసినబ్రదుకు దుర్భరము!

ప్రియవియోగముఁ దెచ్చిపెట్టిన దైవ
మేల మృత్యువుఁ గూర్పఁ డీ మన కిపుడు ?''
అని యొండొరులు చెప్పుకొనిరి. మునీంద్ర!
ఇ ట్లనేకవిధాల నేడ్చియేడ్చియును
బ్రజ లెల్లఁ బరితాపభారంబుతోడ
మఱలి రయోధ్యకు; మానసంబులను
వార లొందిన మహావ్యాకులవహ్ని
అభివర్ణనాతీత మతిదారుణంబు.
పదునాలుగేండ్లకు వచ్చి రాఘవుఁడు
దర్శన మిచ్చును దప్పక యనెడి
ఆశతో మాత్రమే యా ప్రజ లెల్లఁ
బ్రాణముల్ బిగఁబట్టి బ్రతికి రయోధ్య.
దశరథసుతు పునర్దర్శనార్థంబు
నిఖిలనారీనరుల్ నియమవ్రతంబు
లాచరింపఁగ సాగి రతిదీక్షతోడ.
సూర్యదేవుఁడు పొడసూపనివేళఁ
గోకకోకీపద్మకోటిచందమున,
వా రెల్ల దైన్యతాభారంబుఁ గనిరి.

సీతారామలక్ష్మణులు గంగాతీరమున విడియుట

జానకీరామలక్ష్మణమంత్రు లంత
శృంగిబేరపురంబుఁ జేరి; రచ్చోట,
గంగాస్రవంతిని గాంచి, రాఘవుఁడు
రథమును డిగ్గి, హర్షంబు దీపింప
దండప్రణామముల్ తగ నాచరించె.
సౌమిత్రి, సీతయు, సచివుఁడుకూడ
గంగానదికి నమస్కారంబు లిడిరి.
జానకీలక్ష్మణసచివులతోడ
రాముఁ డానందవిరాజితుం డయ్యె.

సకలసన్మంగళస్థాన మాగంగ
సకలసుఖంబుల సమకూర్పగలదు;
సకలదుఃఖంబుల సమయింపఁగలదు;
కనుచు రాఘవుఁడు గంగాతరంగములఁ
దా సల్పే గోటికథాప్రసంగముల.
మఱియు, నాతఁడు తనమంత్రికి, సతికిఁ,
బ్రియసహోదరునకు, వినిపించెఁ బ్రీతి
న ద్విబుధనదీమహామహిమంబు.
తదనంతరము వారు తన్నదీమణిని
స్నానంబు లొనరించి శ్రమఁ బాపుకొనిరి;
తత్పావనాంబువుల్ తనియంగఁ ద్రావి
సంతోష మొందిరి స్వాంతంబులందు.
ఎవ్వని మది స్మరియించుమాత్రమున
జన్మమృత్యుశ్రమసమయునో – అట్టి
రామదేవుఁడు పథిశ్రమ నొందు టరయ
అహ! కేవలము జగద్వ్యవహారనటన!
అసఘా! భరద్వాజ! ఆ శుద్ధసచ్చి
దానందమయకంద మైన శ్రీరాముఁ
డా భానుకులకేతుఁ డా పరమాత్మ,
సంసారసాగరసంతారకంబు
లగులీల లొనరించె నహ! నరువోలె.

గుహుఁడు సీతారామలక్ష్మణులకడ కేతెంచుట

అంతఁ దా వినియు రామాగమనంబు
నచటి *నిషాదనాయకుఁ డైన గుహుఁడు
సంబరంబును బొంది స్వజనులఁ గూర్చి
ఫలమూలములను గావళ్లతోఁ గొనియు
శ్రీరామచంద్రు దర్శింపఁగా వెడలె—
నాత్మలోన నపారహర్ష ముప్పొంగ.
అ ట్లేగి యతఁడు రామాంఘ్రులపైన

* నిషాదులు ఒకహీనజాతికి సంబంధించినవారు; వీరిమూల పురుషులు ఒకానొకబ్రాహ్మణునకు శూద్రస్త్రీకిని జన్మించి రని ప్రతీతి.

సాష్టాంగనతిఁ జేసి, అతిప్రీతి వెలుఁగ
శ్రీరాముముఖము వీక్షించుచు నిలిచె.
సహజసుస్నేహవశంకరుఁ డైన
శ్రీరఘుపతి తనచెంగట, వానిఁ
గూర్చుండఁ జేసియుఁ గుశలంబు లడిగె.
అప్పుడు గుహుఁ డిట్లు ప్రార్థించె భ క్తి:
"నాథ! మీ శ్రీపాదనళినదర్శన మె
నిఖిలభద్రములకు నిలయంబు స్వామి!
నేఁడు ధన్యుఁడ నంచు నే నెంచుకొ నెద.
నా యిండ్లు వాకిండ్లు నా భూమి బుట్ర
నా సొత్తు సర్వంబు నా దేవ! నీ దె;
నేనును నా జనుల్ నీకు దాసాను
దాసుల మో ప్రభూ! దశరథతనయ!
నా పురి కే తెంచి నాథ! శ్రీరామ
నన్ గటాక్షించుము; ననుఁ బోలుధన్యుఁ
డీ ప్రపంచంబున నెట నుండఁబోఁడు."
అన, విని, శ్రీరాముఁ, డనియె, నీ రీతి,
"ఓ మిత్రమా! గుహ! ఓ బుద్ధిశాలి!
నీవు చెప్పిన దెల్ల నిజ మౌను; కాని,
వేఱుగా నుండె మా పితృపాదు నాజ్ఞ;
పదునాలుగేడులు వనిని వసించి
ఆహారవసనవిహారాదులందు
మునిజనవ్రత మేను బూనఁగావలయు.
కాన నా కహితంబు గ్రామనివాస"
మని పల్క- విని గుహుం డతిదుఃఖ మొందె.
జానకీరామలక్ష్మణదివ్యమంగ
ళాకారములఁ గని, అటఁ గూడియున్న
శృంగిబేరములోనిస్త్రీపురుషాళి,
"ఇట్టిబిడ్డల వని కి ట్లంపినట్టి
తలిదండ్రు లెటువంటి తలిదండ్రు? లకట!"
అని చెప్పుకొనియె మహానురాగమున.
"మంచినే చేసెను మనుజేశుఁ; డిట్లు
మనకు లోచనలాభమును విధి కూర్చె"
అని మదిఁ గొందఱుజను లనుకొనిరి.
అంత నిషాదనాయకుఁ డగుగుహుఁడు
కొంచె మాలోచించుకొని, రమ్య మైన
యొకశింశుపావృక్ష ముండుటఁ జూచి,
అటకుఁ దోడ్కొనిచని ఆ రాఘవునకు
దానినిఁ జూపింపఁ "దత్ప్ర దేశంబు
సర్వవిధంబులఁ జక్కఁగా నుండె"
నని తెల్పె శ్రీరాముఁ: డంత నప్పారు
లండఱు భ క్తిఁ జోహారు లొనర్చి
తమతమయిండ్లకుఁ దరలి; ర త్తటిని
అరిగె రాఘవుఁడు సాయంసంధ్య వార్చ.
ఇంతలో గుహుఁడు తద్వృక్షమూలమునఁ
గుశకిసలయమయకోమలరమ్య
శయ్య నమర్చియు సమతలమందు,
శుచిరుచిఁ గలిగినసుఫలమూలములఁ
దో డ్తెచ్చి స్వయముగా దొన్నెల నిండ
నట సిద్ధముగ నుంచె, నతిప్రీతి గదుర.
రఘువంశమణి యగురాముఁ డంతటను,
జానకీసచివలక్ష్మణసహితముగ
ఫలకందమూలముల్ భక్షణఁ జేసి
శయనించె, సౌమిత్రి చరణంబులొ త్త.
కొంతసేపటికిఁ గాకుత్స్నవిభుండు
సుఖనిద్రఁ జెందుటఁ జూచి లక్ష్మణుఁడు
భ క్తి మెల్లఁగ లేచివచ్చి సుమంత్రు
విశ్రమింపఁగఁ గోరి వినయవాక్యముల,
శరశరాసనములఁ గరమునఁ దాల్చి,
కొంతదూరంబునఁ గూర్చుండెఁ దాను—
పొసఁగ వీరాసనంబును వేసికొనియుఁ—
గావలిఁ గాయ నక్కా-ననమందు.
గుహుఁ డంత ఘన మగుకూర్మి వెలుంగ
నట నటఁ జుట్టు మహారణ్యమందుఁ

గడునమ్మకంబును గలిగిన తనదు
కావలివారలఁ గాపుగాఁ బెట్టి
నారసంబులపొది నడుమున ద్రవేల,
విల్లును బాణంబు వెలుఁగ హస్తమున,
వచ్చి రామానుజుప్రక్కఁ గూర్చుండె.
అట నేల దర్భశయ్యాగతుఁ డైన
ఆ రామచంద్రమహాప్రభు నరసి
అనురాగవశమున నంతరంగమున
నతివిషాదము నొందె నా నిషాదుండు.
పులకింప తను, వశ్రువులు గార కనుల
నతఁడు లక్ష్మణుఁ జూచి, అనియె నీ రీతి:
"క్ష్మాపతిభవనంబు సహజసుందరము;
అద్దానితోడ రామానుజా! కనఁగ
సురపతిసదనము న్నరిపోల దెందు.
రతిపతి స్వయముగా రచియించె ననఁగ
మణిమయసుందరమందిరచయము
లా రాచనగరిలో నలరారుచుండు.
తన్మందిరంబు, లత్యంతశుభ్రములు,
కడువిచిత్రంబులు, ఘనభోగమయము,
లమితప్రసూన మహాసుగంధములు,
తతహంసతూలికాతల్పయుక్తములు,
కమనీయమణిదీపికారాజితములు,
సర్వవిధానందసంభరితములు;
క్షీరఫేనసమానశృంగారధవళ
సుస్నిగ్ధబహువిధశోభాయమాన
వస్త్రోపధానముల్ పరగు నచ్చోట.
అట్టిదివ్యాంతఃపురాంతరాళముల
జితరతీమన్మథశృంగారు లైన
జానకీరాములు శయనించుచుందు,
రట్టిసీతారాము లక్కటా! నేఁడు
వస్త్ర మేనియుఁ దమపైఁ గప్పుకొనక,
అలసి నిద్రించి రౌరా; దర్భశయ్య.

ఈ దృశ్యమును గాంచి ఎవరు భరింత్రు?
పితరులు, బాంధవ బృందముల్, ప్రజలు,
సద్గుణధను లగుసన్మిత్రు, లఖిల
దాసదాసీజనుల్, తమప్రాణములకు
సమముగా శ్రీరామచంద్రుఁ ద్రేమింత్రు.
ఆ మహాభాగుఁ డహా! యిటు నేఁడు
నేలపైన బరుండి నిద్రించుచుండె!.
వరజగద్వినుతప్రభావుఁ డైనట్టి
జనకునంతటివాఁడు జనకుఁ డైయుండి,
రఘుకులేంద్రుఁడు దేవరాడ్భాతుఁ డైన
దశరథధారుణీధవునంతవాఁడు
మాన్యత న్గూచెడిమామ యైయుండి,
అఖిలార్చనీయమహామహుఁ డైన
వీరరాఘవుఁ డీమెవిభుఁడయియుండి,
మాతల్లి సీతమ్మ మహిఁ బవ్వళించె!
దుర్విధి యెవరి యందునఁ గరుణించు?
"కర్మప్రధానంబు కనిచో"ననెడి
పెద్దలాడిన సుద్ది వీక్షింప నిజము.
కడు మందమతి యైనకై కేయి, అకట!
కుటిలకఠోరసంకుచితాత్మ యగుచు
జానకీరాములు సౌఖ్యంబునొందు
సమయమం దిట్లు కష్టముఁ దెచ్చిపెట్టె.
ఆ కుమతి దినకరాన్వయవిటపి
కఠినకుఠారంబుఁగాఁ జరియించి,
అఖిలవిశ్వమును దుఃఖాబ్ధిలో ముంచె."
జానకీశ్రీరామచంద్రు లీ సరణి
నవనిపై శయనించినందుల, కా ని
షాదుండు మిగులవిషాదంబు నొందె.
అన విని లక్ష్మణుం డా గుహుతోడ
పరమభక్తి జ్ఞాన వైరాగ్యయుక్త
మృదుమధురోక్తుల నిట్లు వచించె:
"ఒక మానవునకు వేఱొక్క మానవుఁడు

కష్టసుఖాలకుఁ గర్త కాఁ డెపుడు;
తనకర్మఫలమును దాఁ బొందుచుండు.
యోగవియోగముల్ భోగశోకంబు
లలశత్రుమిత్రమధ్యస్థభావములు,
భ్రాంతిపాశంబులుఁ బరికింప సఖుఁడ!
జన్మమృత్యువులును సంపద్విపత్తు
లాకర్మమును గాల మఖిల భావములు,
పుత్రమిత్రకళత్రభూగృహాదులును,
స్వర్గంబు, నరకంబు, సర్వదృశ్యములు,
వేయేలఁ గనునవి, వినునవి, మనము
భావించునవి యెల్ల భ్రాంతిమూలములు;
పరికింప వితథముల్ పరమార్థమందు.
కలలోన నొక బిచ్చగాఁడు రా జగును;
ఘనుఁడు పాకారి బికారిగా మాఱు;
మెలఁకువ వచ్చినమీఁదటఁ జూడ –
ఆలాభ మీనష్ట మంతయు మిథ్య;
ఇట్టులే యీ జగం బెల్లను మిథ్య –
యని గ్రహింపఁగవలె నాంతర్యమందు.
ఈ సత్య మాత్మ గ్రహించి రోషమును
పోద్రోలుమా వ్యర్థముగ నేరిఁగూడ
నిందింపఁ బనిలేదు; నిజ మెంచునెడల
సర్వులున్ మోహనిశాసమయమున
నిద్రించుచుండి రా నిద్రలో వారు
పలుపలురకముల స్వప్నముల్ గంద్రు.
ఈ జగద్రాత్రిఁ జాగృతిఁ గన్నవారు,
పారమార్థికులు ప్రపంచవిరక్త
మతు లైనయోగులు మాత్రమే, సచివ!
విషయంబులందున విముఖుఁ డైనపుడె
నిబిడజగన్నిశానిద్రలోనుండి
జీవుఁడు జాగృతిఁ జెందినయట్లు.
అనఘ! వివేకోదయం బైనయపుడె
మోహవిభ్రమనిద్ర పోవుఁ దొలంగి;
అప్పుడుమాత్రమే ఆ రామచరణ
పద్మానురాగంబు ప్రాప్తింపఁగలదు.
పరమ మాజీవితపరమార్థ మెన్నఁ
ద్రికరణపూర్వక శ్రీరామభక్తి!
ఈ రామభగవానుఁ డెవ్వరో కాదు—
సాక్షాత్పరబ్రహ్మ, సత్యస్వరూపుఁ
డగ్రాహ్యుఁ, డవికారుఁ, డతులుఁ, డనాది,
అఖిలుఁ, డగోచరుం, డద్వయుం, డహహా!
నేఁతి నేఁతి యటంచు నిగమచయంబు
శ్రీరాముఁగూర్చి వచించు సంతతము.
తన్నుపాసించుభక్తవ్రజంబులకు
గోబ్రాహ్మణామరకోటికి, ధరకు,
హితము సేయఁగఁ బరమేశ్వరుం డవని
నరరూపమును దాల్చి నటియించు నిట్లు;
అమ్మహాలీలల నాలించినంత
సంసారఘోరపాశంబులు తెగును.
ఈ విషయంబు గ్రహించి ఓ సఖుఁడ!
వదలి మోహంబు, నుపాసింపు మెపుడు
జానకీరఘువీరచరణాంబుజములు.”
ఇట్లు లక్ష్మణుఁడు వచించి సంప్రీతి
శ్రీరామగుణనుతిఁ జేయుచుండఁగనె
తెల్ల వారెను; రామదేవుండు, శౌరి,
విశ్వమంగళదాయి, వేగ మేల్కాంచె.

శ్రీరామలక్ష్మణులు మజ్జిపాలతో జడలు దాల్చుట

అంతశౌచక్రియ లన్నియుఁ దీర్చి
పరమపావనుఁడు, మహాజ్ఞాని, రాముఁ
డుదయపూజాక్రియ లొనరించి, మిదపఁ,
దగ మజ్జిపాలతోఁ దానుఁ దమ్ముఁడును
శిరములపై జటల్ ధరియించుకొనిరి.
ఆ దృశ్యమును గాంచినంత సుమంత్రు

కన్నులలో నీరు గ్రమ్మె గిఱ్ఱునను.
దారుణదుఃఖదందహి తాత్ముఁ డగుచు
ఖిన్నాననుం డయి కేలు మొగిడ్చి,
ఆతఁడు శ్రీరాము నరసి యి ట్లనియె—
అతిదైన్యభరితవాక్యంబులతోడ:
"దేవ! శ్రీకోసలాధీశుండు నాకుఁ
జెప్పె నీ రీతిగాఁ జేరంగ బిలిచి: —
'రథముఁ గైకొని నీవు రాముతోఁ జనియు
వనమును జూపించి వారిమువ్వురను
గంగలో స్నానంబుఁ గావింపఁ జేసి,
వారిసంశయముల వారించి, నీవు
మగుడఁ జేకొనిరమ్మ్ము మందిరమ్మునకు'.
అవనీశుఁ డిట్లు నా కాజ్ఞ నొసంగె;
తమఆజ్ఞ యెట్టిదో? తత్ప్రకారముగ
వర్తింపఁగల నేను ప్రభు! రామచంద్ర!"
అని ప్రార్థనముఁ జేసి ఆ సుమంత్రుండు
రాముపాదంబుల వ్రాలియు నొక్క—
బాలునివలె నేడ్చె బావురుమనుచు.
"తండ్రీ! రఘూత్తమా! దయ వహియించి
శ్రీయయోధ్య ననాథఁ జేయఁగా వలదు."
అని వేఁడుచుండిన ఆ మంత్రి నంతఁ
బైకి లేవఁగ నెత్తి పరమానురక్తి
శ్రీరామచంద్రుఁ డీ రీతి బోధించె:-
"తాత! నీకు సమస్తధర్మంబు లెఱుక.
శ్రీదధీచి మునీంద్ర శిబి హరిశ్చంద్రు
లిల ధర్మమునకయి ఎన్నెన్నొ తాము
పడరాని యిడుములఁ బడినారు; మఱియు -
అల రంతిదేవుండు, బలిచక్రవర్తి,
అమితసంకటములయందు సైతంబుఁ
దొలఁగక ధర్మంబు నిల నిల్పి కొనిరి.
సత్యంబుతోడను సమమైనయట్టి
ధర్మంబు లేదని తగఁ బ్రవచించు
నిగమాగమ పురాణనిచయంబు లెల్ల.
అట్టి ధర్మంబు నా కతిసులభముగ
బ్రాప్తించె, దానిని వదలినయెడలఁ
ద్రిజగంబునందు నిందింపఁ గాఁబడుదు.
మానవంతుం డగు మనజున కరయ
దుష్కీర్తి కోటిమృత్యుసమాన మైన
దారుణదుస్సహతాపంబుఁ గూర్చు;
నే నధికంబుగా నీ కేమి చెపుదు?
పిత! భవత్సన్నిధిఁ బ్రతివచనములఁ
బలుకుటవలనఁ బాపంబు నా కొదవు.
జనకునిపాదంబులను బట్టుకొనియు
మత్కృతనతులను మఱిమఱి తెలిపి,
'ఓ ప్రియపితృపాద! ఓ మహాభాగ!
ఈ నన్నుఁగూర్చి మీ రేవిధంబుగను
జింతింపవల," దని చేతులు మోడ్చి
నాకు మాఱుగఁ బ్రార్థనము సేయు మనఘ!
నా తండ్రివలె మీరు నా కతిహితులు;
కావున, నే, మీకుఁ గరములు మోడ్చి
పితృపాదు మీర, లేవిధముగా నైన
నుమ్మ్ముఁ గూర్చినచింత మతి నొందకుండు
నట్లు చేయఁగ మిమ్ముఁ బ్రార్థించుచుంటి."
శ్రీరామసచివు లీ రీతిగాఁ జేయు
సంవాద మెల్లను శ్రవణం బొనర్చి
గుహుఁడును ఆతనిసహచరు లెల్ల
రతివ్యాకులత నొంది; రంత సౌమిత్రి
పరుషోక్తులను గొన్ని పలుకుటఁ జూచి,
శ్రీరాముఁ డతని వారించె- న ట్లనుట,
అనుచితం బని ఆత్మయందు గ్రహించి
లజ్జించి,- పిమ్మట లక్ష్మణోక్తులను
'ఎవరితో నైన వచింపకుఁ' డనుచుఁ
దనపైన నొట్టిడుకొని సుమంత్రునకు
వినతిఁ గావించె నా వీరరాఘవుఁడు.

పిదప, సుమంత్రుఁ డీ విధముగా మఱల
విభునిసం దేశంబువినిపింపసా గె:
"నృపతి నాతో వచియించె నీ తెఱఁగు—
వనవాసకష్టముల్ పడలేదు సీత;
కావున రాముండు నీవునుఁ గలసి
పృథ్వీజన్ నగరి కే రీతిగా నైన
చెప్పి చేర్చఁగవలె; సీత రాకున్న
ఇంకఁ బ్రాణాధార మే ముండు నాకు?
జలముఁ బాసిన చేప చందంబుమనను.
అత్తమామలయింట నైనఁ, గాకున్నఁ
దనపితృపాదునిధామమంద్రైన,
ఆమెకుఁ గొదు వేమి? ఆమె స్వేచ్ఛాను
సారంబుగా హితస్థానంబునందు
వసియింపవచ్చు నేబాధలున్ లేక—
ఆత్మేశ్వరప్రవాసావధివఱకు."
ఎంతటిఆర్తి మ ఱెంతటి ప్రీతి
వెలయఁగా నరపాలు వినతి శ్రీరాముఁ
డాలించె నయ్యది యభివచియింప
వశముగా దహ! భరద్వాజమునీంద్ర!
ఆ కృపావారాశి యైనశ్రీరాముఁ
డా పిత్రుసందేశ మాలకించియును
సీతను గనుఁగొని, "చెలియ! నీ వింక
మందిరంబున కేఁగ, మా తలిదండ్రు
లాచార్యబాంధవు లందఱుఁగూడ
స్వాస్థ్యంబుఁ గాంతురు జానకీ!" యనుచు
కోటివిధంబులఁ గూర్మి బోధించె.
పతివాక్కులను విని, వైదేహి యంతఁ
బలికె నిట్టుల రామభద్రునితోడ:
"ప్రాణేశ్వరా! ఓయి ప్రణయైకమూర్తి!
కరుణామయా! ప్రభూ! పరమవివేకి!
వినుము నా కావించువినయవిజ్ఞప్తి:
ఛాయదేహమునుఁ విసర్జింపఁగలదె?
వెలుఁగు భాస్కరునుండి విడఁదీయఁబడునె?
వెన్నెల శశినుండి విడిఁ బడు కెట్లు?
శ్రీరాము విడనాడి సీత యెట్లుండు?"
అని ప్రేమమయ మగువినతిఁ గావించి
సీతసుమంత్రుతోఁ జెప్పె నీ రీతిఁ
గమనీయమధురవాక్యంబులు తనర:
"నా మామతోడను, నా తండ్రితోను
మీరు సమానులు మిక్కిలి విహితు
లేను సమాధానమిచ్చుట తగదు.
నే దుఃఖవశముచే నీ రీతి తాత!
తమముందు మాట్లాడఁ దప్పకపోయె;
నిది దోషముగ మీర లెంచఁగావలదు.
అస్మదాత్మేశపదాబ్జముల్ తప్ప
నితరసంబంధంబు లెల్ల గౌణములు.
అనఘ! మా తండ్రి యీ జనకనృపాలు
సకలవైభవవిలాసంబులఁగంటి –
నృపమణిమకుటసంస్పృశితాంఘ్రిపీఠుఁ
డా విదేహనృపాలుఁ డట్టిసౌఖ్యముల
కాలవాలం బగు, నట్టిపుట్టిల్లు,
విభ్రాంతి నైన మత్ప్రియపతిలేక
సంతోష మివ్వదు స్వాంతంబునందు.
తలప మా మామ కోసలవల్లభుండు
సర్వావసుంధరాచక్రసమ్రాట్టు:
భూరిచతుర్దశభువనసంస్తవన
మహితప్రభావసమంచితుఁ; డతని
*దేవేంద్రుఁ డెదురేఁగి తెచ్చి సంప్రీతిఁ
దనసింహపీఠిపైఁదన కుడిప్రక్క
నాసీనుఁగావించు నతిగ మన్నించు;
మామగా రంతటి మహనీయమూర్తి.
ఆవాసపుర మయోధ్యాపురవరము;
బంధువు లందఱుఁ బరమానురక్తు:
లత్త నక్క దల్లియ ట్లతిప్రేమఁ జూచుఁ;

గాని, స్వప్నంబులోనేని పవిత్ర
రామాంఘ్రిపద్మపరాగంబుతప్ప
నొండు నా కానంద మొసఁగుదు, తాత!
ఘనవనగిరులు దుర్గమమార్గములును
కోలకిరాతులు గుహలు గుట్టలును
కరిహరిగణము దుస్తరసరిత్సరము
లల కురంగవిహంగములును, మత్ప్రాణ
వల్లభసాంగత్యభాగ్యంబుకతన
సంతోష మొనగూర్చు సచివా! సుమంత్ర!
నా యత్తమామల నమ్యాంఘ్రులందు
వ్రాలి! నాకొఱకయి రవ్వంతయేని
వ్యథ నొందఁబనిలేదు. వనములు నాకు
సహజసంతోషంబు సమకూర్చునను చు
నాకు మాఱుగ నీవు నా విన్నపంబుఁ
దెలుపుము దయతోడఁ దేఁటపడంగ.
ఘనతమవీరశిఖామణు లైన
నా ప్రాణపతియును, నా మఱందియును—
సోదరు లిర్వురు— శూరత మెఱయ
బాణబాణాసనపాణు లై వనిని
నా ప్రక్క నుండఁగా, నా కేమి భయము?
శ్రీరామచరణానుసారిణి నగుట
మది నాకుఁ దోఁచదు మార్గశ్రమంబు.
భ్రాంతియు శోకంబు వహియింప నేను.
అందుచే నాకయి ఆవంతయేని
వగ నొందవలదని వారితో నీవు
విన్నవింపుము, నాదుపిజ్ఞప్తిఁ దండ్రి!"
సీత పల్కిన యిట్టి శీతలోక్తులను
విని, సుమంత్రుం డతివికలత నొందె—
మణిని బాసినఫణిమాడ్కి—డెందమున.
కనులతో నాతఁడు కనలేకపోయె;
వీనులనాతఁడు వినలేకపోయె;
ఆతఁ డుత్తుంగమహాకులవశత
స్తబ్ధుఁ డై మాట్లాడఁజాలక నిలిచె.
పలువిధంబుల రామభద్రుఁ డాతనిని
ఉపశమనోక్తుల నోదార్చెఁ, గాని,
ఆతనిహృత్తాప మారిపోదయ్యె.
చివరకుఁ దానును శ్రీరాముతోడ
నడవులనుండఁ బ్రయత్నించెఁ గాని,
ప్రతివిషయంబున రఘునందనుండు
తగినరీతిని సమాధానం బొసంగె;
అదిగాక రామాజ్ఞ అనతిక్రమంబు;
కట! కర్మగతి మహాకఠిన మైయుండె;
ఏమి చేయంగలఁ డామంత్రి యింక?

సుమంత్రుఁడు రథమును మఱల్చుకొని
యయోధ్యకేగుట

జానకీరామలక్ష్మణులకు మ్రొక్కి,
మూలధనంబుఁ గోల్పోయిన వణిజు
వోలె, నాతఁడు పురంబున కంత మఱలె.
అరద మాతఁడు త్రోల నశ్వంబు లంత
పోలేక వెనుకకు ముఖములు త్రిప్పి,
మాటిమాటికి రఘుమండను గనుచు,
గోడొంది పెద్దగా ఘూషించు చేఁగె.
ఆ దృశ్యమును గాంచినంత నిషాదు
లతివిషాదముఁ నొంది హా హా యటంచుఁ
దల మోదుకొనుచు రోదనముఁ గావించ్రి.
రామవియోగభారము నోర్వలేక
పశువులే అంతగాఁ బరితపింపంగఁ –
బ్రజలు, మాతాపిత్రులు, బాంధవు, లెట్లు
శ్రీరాము విడనాడి జీవింపఁగలరు?

నావికుఁడు సీతారామలక్ష్మణులను గంగ
దాటించుట

బలవంతమున నట్లు పంపి సుమంత్రు,
వెనువెంటనే రఘువీరుఁడు కదలి

దివ్యమౌసురసరిత్తీరంబుఁ జేరి,
నావను దెమ్మని నావికున్ బిలిచె.
కాని, నావికుఁడు శంకనుబొంది లోన,
పడవను గొనిరాక పలికె నీ రీతి:
"ఓ రామ! నాస్వామి! ఓ మహాపురుష!
నీ మర్మ మెల్లను నే నెఱుంగుదును.
భవదీయపదరజస్స్పర్శమాత్రమునఁ
బ్రతివస్తువును మానవత్వముఁ బొందు—
నని, నోటనోట నే వినుచుంటి దేవ!
ఈమధ్య నీ పాద మించుక సోక,
శిలయొక్క టందమా స్త్రీ యయ్యెనంట!
దారువు శిలకన్న చార్ఢ్యంబు గాదు,
తరణి యిప్పుడు మునితరుణి- యీ నెడల?
నా కొంప మునుఁగును నాథ! శ్రీరామ!
నా జీవనమున కీ నావయే, దిక్కు—;
నా కుటుంబం బెల్ల నాయనా! దీని
పైననే ఆధారపడి యున్న దయ్య!
ఈ నావ నడిపెడివృత్తిని దప్ప
ఇంకొకవృత్తి నే నెఱుఁగను దండ్రి!
ఆర్య! గంగను దాటు టనసరం బైన
ముందు నీ పాదపద్మముల జేజేఁత
న న్నిదేప్రక్షాళనముఁ జేయనిమ్ము.
నీ పాదకమలముల్ నే స్వయంబుగను
గడిగిన పిదపనే పడవనెక్కించి
గంగ దాటింతును; గాసుఁ గైకొనను;
నీతోడు, దశరథనృపుతోడు,- నేను
బలికినదంతయుఁ బరమసత్యంబు.
ఆ లక్ష్మణుండు న న్నంబులతోడ
సంహరించినఁగాని స్వామి! నీ యడుగుఁ
దమ్ములఁ గడుగక దాటింప గంగ-
నో తులసీప్రభూ! ఓ కృపాజలధి!"
అను నావికుని నిగూఢానురాగోక్తి
లాలించి ఆ కరుణాబ్ధి రాఘవుఁడు,
సీత ననుజుఁ జూచి చిఱునవ్వు లొలికె.
తదనంతరము కృపాధాముఁ డా రాము
డా నావికునిఁ జూచి, అనియె నీ రీతి:
"నావికా! అట్లై నీ నావ భద్రముగ
నుండు మార్గం బెరిగెనో చూచుకొమ్ము.
సత్వరం బీ వేఁగి జలములు దెచ్చి,
నా కాళ్ళు కడిగియు నదిని దాటింపు
మాలస్య మగుచున్న దరుగఁగా వలయు."
ఎవ్వానిశుభనామ మేకపర్యాయ
మాత్మ సంస్మరియించినంతమాత్రమున
జను లపారభవాబ్ధి సంతరించెదరో,
ఎవనిపదత్రయి కీ విశ్వ మెల్ల
సంకుచితం బయి చాలకపోయె,—
ఆ కృపావారాశి ఆ పరమేశుఁ
డా యతిసామాన్యుఁ డైన, నావికుని
అర్థించె నిట్లు మహర్షివరేణ్య!
ఆ రామచంద్రువాక్యముల నాలించి,
గంగాస్రవంతి దిగ్భ్రాంతి నొందినను
ఆ రామచంద్రపాదాబ్జనఖంబు
లరసి, మునీంద్ర! బ్రహ్మానంద మొందె.
అటులు శ్రీరామునియాజ్ఞఁ గైకొనియు
ఆ నావికుఁడు వేగ నరిగి తా నొక్క-
దారుపాత్రమునిండఁ దగ నీరుఁ దెచ్చి,
అనురాగ ముప్పొంగ నంతరాళమునఁ
బరమొన్న తానందపరవశుం డగుచు,
శ్రీరామపాదాభిషేకంబుఁ జేసె.
ఆ సమయమున సర్వామరుల్ సైత
మా నావికునిపైన హర్ష ముప్పొంగఁ
గుసుమవర్షంబులు గురియుచు, "ఓహో!
ఇతనిమహాభాగ్య మే మనవచ్చు?
నింతటిపృథుపుణ్యుఁ డెవ్వఁడు లేఁడు!"

అనుచుఁ బ్రశసించి సైక్యకంఠమున.
అట్టు లా నావికుం డా రామచంద్రు
పాదారవిందముల్ భ క్తితోఁ గడిగి –
పరివారయుతముగాఁ బరమసంప్రీతిఁ
దత్పాదదివ్యతీర్థము స్వీకరించి
విమలుఁడయ్యెను; వానిపితరులుఁగూడఁ
దరియించి; రంత నాతఁడు సంతసమునఁ
గౌసలేయాదుల గంగ దాటించె.

శ్రీరామచరితమానసము

అయోధ్యా కాండము

అష్టమవిశ్రామము

శంకరభగవత్పాదవ
శంకరహృదయారవింద ! సత్యానందా !
సంకటహరణ ! సమస్త భు
భంకర ! హరి ! మట్టపల్లివాస ! నృసింహా !

అంత సీతారాము లా నావ డిగ్గి
లక్ష్మణగుహులతో లావణ్య మొప్ప
గంగాప్రవాహాసై కతముల నిలువ,
నావికుం డేతెంచి నమ్రత వెలుఁగ
సాగిలఁబడె రామచంద్రునిమ్రోల.
ఆ నావికున కేది యైన నొసంగఁ
దలఁచి రాముఁడు చెంత ధనము లేకుంటఁ
జిన్నవోవుటఁ జూచి, సీత గ్రహించి
తనవ్రేలి కున్నరత్నస్థగితంపు
టుంగరంబును రఘుపుంగవు కొసఁగె.
ఆ కృపాళుం డంత నా నావికునకు
ఇదె ఓడకూలి గ్రహింపు మటంచు
నుంగరంబును బ్రీతి నొసఁగ నున్నంత
నతఁ డతివ్యాకులుఁ డై, రామచరణ
ములఁ బట్టుకొని యిట్లు పలుకందొడంగె:
"ఓ ప్రభూ! నేఁడు నే నొందని దేమి?
ఈ నాఁడు స్వామీ! శమించె మదీయ
పృథుదోషదుఃఖదారిద్ర్యదావాగ్ని.
ఎన్నాళ్లనుండియో యిటు జీవనార్థ
మీ వృత్తితో శ్రమియించుచున్నాడ;
ఈ నాఁడుమాత్రమే యీశ్వరుం డహహా!
సంతృప్తికరముగా సరిపోవునంత
ప్రతిఫలం బొసఁగె శ్రీరామభూపాల!
దీనదయాపరా! దీనశరణ్య!
నీ కృప చాలును, నేఁ డేమి వలదు.
తిరిగి మీరింటికి మఱలెడితఱిని
స్వామివా రెద్దిప్రసాదింతు, రద్ది
శిరసావహింతును శ్రీరామదేవ!"
అనిప్రార్థనముఁ జేసి యా నావికుండు
సీతయు సౌమిత్రి చెప్పినంగాని;
ఆతరపణ్యంబు నాశింపడయ్యె.
అంత కృపామయుఁడైన రాఘవుఁడు
వానినిఁ బంపె సద్భక్తి నొసంగి.

సీతారాములు గంగను బ్రార్థించుట

తదుపరి రఘుపతి, తద్గంగలోన
సంతోష మొప్పఁగా స్నానం బొనర్చి,
పార్థివలింగంబు భక్తిఁ బూజించి,
నతులు గావించె వినమ్రత మెఱయ; –
జానకీదేవి హస్తంబులు మోడ్చి
గంగాభవాని నీ కరణిఁ బ్రార్థించె:
"మాత! నా భర్తయు, మఱఁదియు, నేను
తిరిగిక్షేమముగ నే తెంచి, నీ పూజఁ

గావించుకొనునట్లు కరుణింపు మమ్మ"

గంగ సీతను బ్రశంసించి దీవించుట

ఆ భక్తి రసమయ మైన ప్రార్థనము,
వినియు గంగాదేవి ప్రీతాత్మ యయ్యె.
గంగామహానదీగర్భంబునుండి
ఈ రీతి వినవచ్చె నింపైన వాణి;
"ఓ విదేహకుమారి! ఓ రామపత్ని!
భవదీయదీవ్యత్ప్రభావవిశేష
మీ జగమ్మున నెవ్వ రెఱుఁగరు? తల్లి!
ఈవు క్రీగంట నొకింత వీక్షించి
నంతమాత్రంబున నవని మానవులు
లోకపాలకు లైరి, లోకత్రయాంబ!
సకలసిద్ధులు భవచ్చరణాంబుజముల
సేవింపుచుండును జేతులు మోడ్చి;
ఈ రీతి నన్నుఁ బ్రార్థించితి వన్న
నామీఁది కరుణచే నా కిట్లు ఘనత
నిచ్చియుంటివి; కాని, యే నెంతదాన?
నైనను నా వాణి సారక మొంద
దీవింతు ని న్నిదే, దేవీ! మహీజ!
జనని! నీ పతితోఁ సౌమిత్రితోడ
కుశల మొప్పారఁగాఁ గోసలపురికి
మఱలివచ్చెద వమ్మ మాతల్లి సీత!
నీ యభీష్టము లెల్ల నెఱవేరఁ గలవు;
నీ సద్యశము నిండు నిఖిలలోకముల."
ఇట్టు లా గంగ వచించిన యట్టి
అనుకూలశుభవాక్కు లాలించి సీత-
సంతోష మొందెను స్వాంతంబునందు.
గుహు, నంత గృహమునకున్ రాముఁ డరుగు
మని, సెల వివ్వఁగా, నాతఁ డామాట
వినునంత, నిలువున వెలవెలఁబోయి
దారుణదుఃఖదందహితాత్మ్ముఁ డగుచు
ముకుళించుకొని హస్తముల రాముఁ జూచి
దీనవాక్యముల నీ తెఱఁగు ప్రార్థించె:

శ్రీరాముఁడు గుహుని దనవెంటఁ గొనిపోవ
నంగీకరించుట

"రఘువంశమణి! నాదు ప్రార్థన వినుము.
ఏను మీ రెంబడి నేతెంచి, మీకు
మార్గంబుఁ జూపించి మఱి నాల్గునాళ్లు
భవదీయపాదసేవన మొనరింతు.
వనములో మీ రెట వసియింప నెంతు
రచ్చోట నొక మనోహరపర్ణకుటిని
దమకు నిర్మించు నీ దాసుండు స్వామి;
ఆపైన నేను ద్వదాజ్ఞానుసరణి
వర్తింతు రామ! నీ పాదాలతోడు."
అనఁగ నగ్గుహుని నైజానురాగంబు
నరసి ప్రసన్నుఁ డై ఆ రాఘవుండు,
తనవెంట నతనిఁ గైకొనిపోవఁ దలఁచె.
ఆ గుహుండును మహాహర్షాత్ముఁ డగుచుఁ
దనబంధువులను సత్వరము రావించి
సత్కారములతోడ సంతోషపఱచి,
యిండ్లకుఁ బంపె మునీశ్వరా! వినుము!
పిదప విష్ణ్వీశవిశ్వేశులఁ దలఁచి,
గంగానదికి నమస్కారంబు సలిపి,
క్ష్మోణిజాలక్ష్మణగుహులతోఁ గూడి,
పయనించె రఘువంశపావనుఁ డంత.
ఆ నాటిరాత్రి రామావనీశ్వరుఁడు
వృక్షమూలంబున విశ్రాంతి నొందె.
స్వామికి వలసినవసతు లన్నియును
గుహుఁడును సౌమిత్రి కూర్చి రచ్చోట.

శ్రీరాముఁడు సీతా లక్ష్మణగుహులతో
ప్రయాగకుఁ జేరుట

ఉదయకాలమున రఘూద్వహుఁ డంత

స్నానసంధ్యాద్యనుష్ఠానముల్ దీర్చి
క్షోణిజాలక్ష్మణగుహులతో వెడలి
అల తీర్థరా జప్రయాగను జేరె.
ఆ తీర్థపతిమంత్రి అరయ సత్యంబు;
ఇల్లాలు సుశ్రద్ధ, హితుఁడు మాధవుఁడు;
అతనిభాండాగార మందలిధనమె?
అలచతుర్విధపురుషార్థంబు లగును;
అతనిమహామనోహరరాజ్యసీమ
అమలగంగానదీయమునాప్రవాహ
సంగమపరిసరసత్పుణ్యభూమి;
అరిజనదుర్గమం బతిరమ్య మైన
ఆతనికోట, తదావరణంబు;
కలుషసమూహ నిర్ధళనదక్షులును,
భండనభీము లౌ, వానిసైనికులు,
మహితప్రభావసమస్తతీర్థములు;
అతనిసింహాసన మట సంగమంబు;
మునిజనమానసమోహనం బైన
అతని శ్వేతచ్ఛత్ర, మక్షయవటము;
వానికిఁ జామరద్వయము, పార్శ్వముల
నవ్యగంగాయమునా తరంగములు-
దర్శనమాత్రదుర్దాంతదరిద్ర
దారుణసర్వసంతాపభంగములు;
వినుతవర్తను లగువిమలసాధువులు
తత్ క్షేత్రపతిని నిత్యంబు సేవించి,
కామితార్థంబులఁ గాంచుచుండెదరు;
మహితవేదపురాణమండలి యెల్ల
నందిజనంబులు, వానిసద్గుణము
లెప్పుడుఁ గీర్తించు నింపు మీఱంగ;
ఘోరకల్మషపుంజకుంజరభంజ
నాభీలమృగరాజ మైవెలుఁగొందు
భవ్యప్రయాగప్రభావాతిశయము
వర్ణింప నెవ్వరివశము ఖగేంద్ర!

ఆనందసాగరుం డగురఘువరుఁడు
రమ్య మా తతీర్థరాజంబు నరసి,
పరమసంతోషసంభరితాత్ముఁ డగుచు,
శ్రీముఖంబునను భాషించె, నద్దాని
పరమోన్నతప్రభావంబును గూర్చి
క్షోణిజాలక్ష్మణగుహులకుఁ బ్రీతి.

శ్రీరాముఁడు త్రివేణీస్నానమొనర్చి భర
ద్వాజాశ్రమంబుఁ జేరుట

తదనంతరంబు సీతావల్లభుండు
తత్ క్షేత్రమునకు వందన మాచరించి,
పరిసరవనములఁ బరికించుకొనుచు
నతిభక్తిఁ దెలుపుచు నా తీర్థమహిమఁ
జని చని దర్శించె, స్మరణమాత్రమున
సన్మంగళములఁ బ్రసాదించునట్టి
భవ్యత్రివేణిని, బరమహర్షమున.
పిదప శ్రీరాముఁడు విమలత్రివేణి
స్నానంబుఁ గావించి సంతోష మొప్ప
శివపూజఁ గావించి, క్షేత్రదేవతలఁ
గని, యథావిధిగ నర్చన మొనరించి,
తదనంతరము భరద్వాజు దర్శించె.
చరణంబులందున సాగిలఁబడిన-
దశరథాత్మఁజు భరద్వాజమహర్షి
పరిరంభణ మొనర్చెఁ బరమానురక్తి.
ఆ మునీశ్వరుహృదయానంద మహహా!
వాక్కుల వర్ణింప వశముగా దనఘు!
అహ! రూపుఁ గొన్నబ్రహ్మానంద మతని
ముందట నిలిచినపోలిక నయ్యె.
అమ్మునీశ్వరుఁ డంత నత్యాదరమున
శ్రీరామవిభున కాశీస్సు లొసంగె.
తనతపఃఫలమును దైవంబు నేఁడు
కనులకుఁ జూపించె నని భరద్వాజుఁ

డమితసంతోషంబు నందె స్వాంతమున.
జానకీరామలక్ష్మణుల నా మౌని
కుశలంబు లడిగియుఁ గూర్మి వెలుంగ
నుచితాసనంబుల నొసఁగి, పూజించి,
సదమలప్రేమచే సంతోషపఱచి,
అమృతోపమానంబు లౌకందమూల
వరఫలాంకురము లర్పణఁజేసె; నంత
క్ష్మోణిజాలక్ష్మణగుహులతో వాని
నారగించెను రాముఁ డభిరుచి మీఱ.
అటుల గతశ్రముఁ డైన రాఘవుఁడు
హాయిగా నాసీనుఁ డయ్యె; నత్తఱిని.
ఆ భరద్వాజమహర్షి యిట్లనియె
విమలమృదూక్తులు వెలుఁగొందుచుండ:
"అస్మత్తపోజపధ్యానయోగములు,
త్యాగవైరాగ్యతీర్థాటనంబులును,
వే యేల? మత్సర్వవిమలసాధనలు
రామ! నీ దివ్యదర్శనమాత్రమున నె
సాఫల్యమొందెను జానకీజాని!
ఇంతకన్నను సుఖ మెక్కువ లేదు.
ఇంతకన్నను లాభ మెక్కువ లేదు!
భవదీయదర్శనభాగ్యంబుచేత
నా యాశ లన్నియు నాథా! ఫలించె.
స్వామి! నీ పాదాబ్జసహజానురక్తి
మాత్రమే దయచేయ మతి వేఁడుచుంటి
కపటగుణంబును గడఁ ద్రోసిపుచ్చి
త్రికరణశుద్ధిగా దేవ! నీ చరణ
భజనంబు సేయనివఱ కెవ్వఁడేని
శతకోటియత్నముల్ సలిపినఁగాని
సౌఖ్యంబుఁ గనలేఁడు స్వప్నమందైన."
అను మునివాక్యముల్ విని రఘునాథుఁ
డతని మహాభక్తి కతిముగ్ధుఁ డయ్యె.
తదుపరి రాముఁడు తన్మునీశ్వరుని
భవ్యప్రభావంబు బహురూపములను
బ్రవచించి, మునితోడఁ బలికె నీ రీతి:
"ఎవ్వఁడు నీచే మునీశ్వరా! ధరణి
నాదరింపఁగఁబడు నాతఁడే, ఘనుఁడు;
ఆతఁడే సకలగుణాబ్ధి నిజంబు!"
ఋషివర! రఘువీరు లీ విధానమునఁ
గూర్మిఁ బ్రదర్శించుకొని, పరస్పరము
వాగతీతానందభరితాత్మ లైరి.
ఈ సమాచారంబు నెఱిఁగినంతటనె,
ఆ ప్రయాగనివాసు లగుమహాజనులు,
వటు, ముని, సిద్ధ, తాపసు, లుదాసీను,
లందఱుఁ జేరి రత్యంతానురక్తి
నా భరద్వాజుని ఆశ్రమంబునకు
సుందరదశరథ సుతుల దర్శింప.
రాముఁ డందఱికిఁ బ్రణామముల్ చేసె-
వా రెల్ల నేత్రలాభంబును బొంది
పరమసంతోషసంభరితాత్మ లగుచు
ఆశీర్వదించియు నరిగిరి తిరిగి-
జానకీరామలక్ష్మణుల మనోజ్ఞ
పరమసౌందర్యంబు వర్ణించుకొనుచు.
ఆ భరద్వాజుని ఆశ్రమమందె
ఆరాత్రి విశ్రాంతి నంది శ్రీరాముఁ
డంతఁ బ్రాతఃకాలమంద మేల్కాంచి
అటఁ ద్రివేణిని గ్రుంకి, అర్చనఁ జేసి,
మునిపదాబ్జములకు ప్రమొక్కి, మోదమున
క్ష్మోణిజాలక్ష్మణగుహులతోఁ గూడి,
పయనంబు సాగించెఁ బక్షీంద్ర! గరుఁడ!
రాముఁ డ ట్లేగుచుఁ బ్రేమ తలిర్ప
ఆ భరద్వాజమహర్షినిఁ జూచి,
"స్వామి! మే మేదారిఁ జనవలె" ననఁగ
ముని మనస్సున నవ్వుకొనుచు, "శ్రీరామ!
అన్నిమార్గములు నీ కతిసుగమంబు"

లని పల్క- తనశిష్యులను జేరఁ బిలిచె-
దారిఁ జూపింపఁగా దాశరథులకు.
గురువుపిల్పును విని గురుహర్ష మొప్ప
వచ్చి రేఁబదిమంది వటువు లేకముగ.
వా రందఱకు రాముపై మహాప్రేమ-
"నే నెఱుంగుదు దారి నేఁ జూపు" దనుచుఁ
బ్రతిబాలుఁ డనియె; భరద్వాజుఁ డంత
బహుజన్మసుకృతసర్వస్వ లౌవటుల
నం దేరి నల్వుర, నంపెఁ దోడుగను.
రాముఁడు ఋషికిఁ బ్రణామముల్ చేసి,
ప్రముదితహృదయుఁ డై పయనం బొనర్చె.
అ ల్లేగ మార్గమధ్యంబున నొక్క
గ్రామంబుఁ దవిలె నా గ్రామీణు లెల్ల
పరుగిడివచ్చిరి వారి దర్శింప.
జానకీరామలక్ష్మణుల దర్శించి
వా రెల్ల జన్మసాఫల్యంబు నొంది
పరమప్రహర్ష సంభరితాత్మ లైరి.
కాని, వారిని బాయఁ గడుబాధ పడుచు
మఱలిరి వారితో మనసుల నంపి.
కొంత ద వ్వేఁగి యనంతర మాఁగి,
రామచంద్రుఁడు వినమ్రత వెలుఁగొందఁ
బంపెను వెనుక కా బ్రహ్మచారులను.
వాంఛితార్థంబులఁ బడసి వా రట్లు
తమ ఆశ్రమమునకుఁ దాఁ జేరుకొనిరి.
తదుపరి రాముఁడు తరలి ముందునకు
నిజశరీరోపమనీలిమం బైన
యమునానదిని గ్రుంకులాడె హర్ష మున.
ఈ సద్విశేషంబు నెఱిఁగి నంతటనె
వరయమునాతటావాసులందఱును
బరుగిడివచ్చిరి పనులను మఱచి;
జానకీరామలక్ష్మణదివ్యసుంద
రాకారములఁ గాంచి యా జను లెల్ల
తమపూర్వపుణ్యంబుఁ దా మెంచుకొనిరి;
ఆత్మలోఁ గడుకుతూహల మున్నఁగాని
వారూరి పేరులఁ బ్రజ్ఞింప వెఱచి,
రందుఁగొందఱు వృద్ధు లగుధీరమతులు
చతురతతో రామచంద్రు గ్రహించి
పితృవాక్యపాలనావ్రతుఁ డౌచు రాముఁ
డడవుల కరుదెంచి నట్టిచరిత్ర
మంతయు వివరించి; రది విని సర్వ
లతిఖిన్న లై, "అక్కటా! రాజు, రాణి,
అక్రమం బొనరించి" రని దుఃఖపడిరి.
ఆ సమయంబున నచ్చోటి కొక్క-
తాపసి వచ్చె; నాతఁడు తరుణుండు;
పరమతేజస్వి. సుందరవిగ్రహుండు;
కవి యెఱుంగఁడు వానిగతివిశేషముల
అతఁడు విరాగి వేషాయితుం; డరయఁ
ద్రికరణంబుల రామదేవుభక్తుండు.
తనయిష్టదేవు సీతానాథుఁ గాంచి
ఆతఁడు గన్నుల నశ్రువుల్ గారఁ
బులకితదేహుఁ డై, పొంగి స్వాంతమున,
సాగిలఁబడియెను క్ష్మాస్థలిపైన;
అతనిమహాస్థితి అకథనీయంబు.
అనురాగపరవశుఁ డై రాముఁ డతనిఁ
గౌఁగిటఁ జేర్చెను; కడుదరిద్రుండు
భువిస్పర్శవేదిని బొందినరీతి.
పావనప్రేమయుఁ బరమార్థ మట్లు
మానవాకారముల్ మహి ధరియించి
కలసికొన్నట్లుగాఁ గనిపించె నపుడు.
పిదప నా తాపసి వినయంబు మెఱయ,
సౌమిత్రిపాదాంబుజంబుల వ్రాల,
నాతఁ డాతనిని మహానురాగమునఁ
బైకి లేవఁగ నెత్తె బదములనుండి.
పిదప నా తాపసి, పృథ్వీజాచరణ

దివ్యపరాగంబుఁ దీసి మూర్ధమున
ధరియించుకొనఁగ, నా తల్లి యాతనిని,
దనబిడ్డ గా మనంబున గ్రహియించి,
ఆశీర్వదించె; ఖగాధిపా! వినుము.
పిదప గుహుండును వినయభావమున
నా యువయోగిపాదాబ్జములందు
వ్రాల, నాతని రామభక్తుగా నెఱిఁగి,
ఆతఁ డాశ్లేషించె ననురాగ మెసఁగ.
తననేత్రపుటములఁ దన్మనీశ్వరుఁడు
సతతమంగళరామచంద్రస్వరూప
పీయూషమును గ్రోలి, ప్రీతాత్ముఁ డయ్యె
నమృతాన్నతృప్తసుధార్తుచందమున.
"ఇట్టిబాలకులఁ దా మీ విధానముగ
నడవుల కంపిన యా తలిదండ్రు
లెట్టివారని మన మెంచఁగావలయు?"
అని గుసగుస లాడు చట జను లెల
జానకీరామలక్ష్మణదివ్యమంగ
ళాకృతుల్ గాంచి ప్రేమాకులు లైరి.
పిదప, రాముఁ డనేకవిధముల గుహున
కుచితబోధనములనొనరింప నతఁడు
శ్రీరామునాజ్ఞను శిరసా వహించి,
తననివాసమునకుఁ దా నిష్క్రమించె.
జానకీరామలక్ష్మణు లంత మఱుల
ముకుళితహస్తు లై ప్రొక్కి రా విమల
యమునామహాప్రవాహమునకు భక్తి.
తదనంతరంబు సీతాదేవితోడ
బయనం బొనర్చి రా పార్థివాత్మజులు
తరణిసుతామహత్త్వముఁ జెప్పుకొనుచు
పాంథు లనేకులు వారిని గలసి,
బద్ధానురాగు లై పలికి రీరీతి.
"ఆర్యకుమారులారా! మిమ్ముఁ జూడ
సకలనృపాలలక్షణములు తోఁచు.

మీ దశఁ జూడఁగా మాదుఁడెందములు
పరమవిచారసంభరితంబు లయ్యె.
పదచారులై యిట్లు పయనింప మీరు,
సాముద్రికంబు నసత్య మైతోఁచు.
మార్గంబు కడుదుర్గమంబు మున్ముందు
భూరిపర్వతవనంబులు దాఁటవలయు.
అది గాక మీ వెంట నతిసుకుమారి
యైననారీమణి యరుదెంచుచుండె.
సింధురశార్దూలసింహసంకీర్ణ
వనగర్భములు భయావహములు కనఁగ;
మీరు రమ్మనినచో మీ వెంట మేము
తోడు వచ్చెదము, సంతోషంబుతోడ.
తా మేఁగవలసినస్థానంబువఱకు
మీ వెంటఁ జనుదెంచి, మే మనంతరము
ప్రొక్కి మీ పాదాబ్జములకు వెళ్లెదము.
ఈరీతి ఆబాటసారు లందఱును
దమసేవ గొనఁగఁ ప్రార్థన మొనరించి
రమితానురాగవశాత్మ్కు లై, కనుల
బాష్పముల్ కాల్వ లై ప్రవహించుచుండఁ
దనువులు పులకరింతలతోడ నిండ.
కాని, యా కారుణ్యకంధి రాఘవుఁడు
వినయ మృదూక్తుల వెనుకకుఁ బంపె
నా పాంథజనుల విహంగసంఘేంద్ర!
రాముఁడు వెడలుమార్గంబున నున్న
తత్పురగ్రామకదంబంబుతోడ
సురనాగనగరముల్ సరిపోల లేవు!
ఆ యా పురావాసు లైన దేవతలు,
"ఏ శుభలగ్నమం దే ధన్యవలన
నీ పురగ్రామంబు లిలఁ గట్టఁబడెనొ?
తతధన్యపుణ్యసౌందర్యవంతంబు"
లని సన్నుతించి రత్యంతహర్షమున.
రామునియడుగు లే భూముల సోకె

నవ్వానితోఁ బోల దమరావతియును.
రాముఁడు చనెడిమార్గమున వసించు
నా జానపదు లెల్ల నతిపుణ్యమూ ర్తు;
లమరులుఁ గీ ర్తించి రా ధన్యజనుల.
ఆ ఘనశ్యామలు నా రామచంద్రు,
జనకవుత్రికను, లక్ష్మణమూ ర్తి, నహహా!-
కన్నులవిందుగాఁ గాంచి, రా ప్రజలు.
ఆ రాఘవుఁడు గ్రుంకులాడినయట్టి
ఆ సరిత్సరములతో సరిరావు-
సురసరిత్సరములున్, గరుఁడా! మహాత్మ!
ఏ తరుతలములం దినకులుం డుండెఁ
ద త్తరువులఁ గల్పతరువు కీ ర్తించె.
రాఘవపదపద్మరజము ముద్దాడి
వసుధ, నా భాగ్యమే భాగ్య మటంచు.
తలపోసి పరవశత్వంబునుపొందె.
సూర్యాతపము పైన సోకకుండఁగను
ఛత్రముల్ పట్టఁగా జలదసంఘంబు
లాప్యాయమునఁ జూచు చమరగణంబు
ప్రసవవర్షంబులు పైఁగురియంగ,
వనగిరిఖగమృగవర్గముల్ గనుచు
వెడలుచుండెను రఘువీరుండు నడిచి.
అ ట్లేఁగుచుండఁగా నా దారిలోన
నెటనెట గ్రామంబు లేతెంచు, నచట
ఈ వా ర్త విన్నంతనే గ్రామజనము
లాబాలగోపాల మందఱుఁగూడ
పను లన్నియును వీడి పరుఁగిడి వచ్చి,
జానకీరామలక్ష్మణశుభాకృతుల
నరసి, లోచనలాభ మంది, డెందములఁ
బడసి రనూన మాపరమసుఖంబు.
ఆనందబాష్పంబు లశ్రులఁ బారఁ
బుల్కరింతలు తనువుల నిండుకొనఁగఁ
ద్రామలక్ష్మణదర్శనానంద

పారవశ్యంబును బడసి రా జనులు.
వాగి మనోదశ వర్ణింపఁ దరమె?
దారిద్ర్యపీడితుల్ దైవవశాన
చింతామణులకుప్పఁ జెంతఁ గన్నొన్న
చంద మై, వారలచందంబు తోఁచు.
ఆ జానపదులు మహాతృష్ణ గదుర,
"ఇదె రండు రం, డహహా! ఈ క్షణమందె
కన్నులు సఫలముల్ గావించుకొనుఁడు"
అనుచు నొండొరుఁ బిల్చుకొనిరి సంప్రీతి.
శ్రీరాముఁ గొందఱు చేరి వీక్షించి
అనురాగవశమున నట్టులే కనుచుఁ
జనసాగి రా రాము వెనువెంటఁ దవిలి.
కొంద ఱా రాముని కోమలాకృతిని
పొసగ నేత్రద్వారములనుండి హృదయ
కంజంబులోని కాకర్షించుకొనియుఁ
దనువులు మఱచి సంస్తంభితు లైరి.
మఱి కొంద ఱొకమంచిమట్టిచె ట్టరసి
దాని చల్లనినీడలోన శీఘ్రముగ
మృదుతృణపత్రముల్ మేదినిఁ బఱచి,
"ఓ స్వాములార! మీ రొక్కింత యిచటఁ
గరుణతో విశ్రాంతిఁ గైకొని, పిదప
ఈ పూటనో రేపొ? యేఁగుడీ" యనిరి.
కొంద ఱత్యంత మా కూర్మి వెలుంగ
జలపూర్ణకలశంబుఁ సరగునఁ దెచ్చి
"ప్రభు! ఈ జలంబులఁ ద్రాగుడీ" యనుచు
వినతిఁ గావించిరి వినయ మొప్పార.
అంత నా జనులయిష్టాలాపములను
విని, వారిఘనతరప్రేమ వీక్షించి,
ఆ కృపావారాశి అతిసుశీలుండు
శ్రీరామచంద్రుఁడు, సీతాసుసాధ్వి
బడలియుండుటఁ దనభావమం దెఱిఁగి,
కొంచెము విరతిఁ గైకొనఁ గూరుచుండె

నా వటవిటపిమహోచ్ఛాయలందు.
ఆ రామచంద్రుదీవ్యచ్ఛోభఁ గాంచి
నారీనరులు మహానందంబుఁ గనిరి.
అనుపమానం బగునతనిరూపంబు
దత్పజానీక నేత్రస్వాంతములను
సమ్మోహపఱచె; నా జను లెల్ల నచట
గుమిగూడి చుట్టును గూర్మి వెలుంగఁ
గనుఱెప్ప వాల్పక; కనుఁగొన సాగి –
రా రామచంద్రముఖారవిందమును
జంద్రుఁ గాంచుచకోరసంతతిరీతి.
తరుణతమాలసుందరవర్ణుఁ డైన
శ్రీరామచంద్రునిశ్రీవీక్షణములు,
శతకోటిమదనుల సమ్మోహపఱచె.
సౌదామనీవర్ణ సంభాసితుండు
ఆపాదమస్తకాత్యంతసౌందర్యుఁ
డగులక్ష్మణునిశోభ, యఖిలచిత్తముల
నపహరించెను ఖగేంద్రా! భక్తవర్య!
కటితలమందు వల్కలములఁ దాల్చి,
మూపునఁ దూణీరములను ధరించి,
శరచాపములఁ బూని కరకమలముల,
నా రామలక్ష్మణు లలరారు చుండి;
రింక నా సోదరు లెట్లుండిరనఁగ.
మంజులఘనజటామకుటమస్తకులు,
చారువిశాలవక్షస్థలయుతులు,
ఆజానుబాహు, లజ్జాయతనేత్రు,
లమలఘర్మాంబుకణాలంకృతాతి
రమ్యశరచ్చంద్రిరాజితముఖులు,
వర్ణనాతీతశోభావారిరాశు
లా సహోదరు లిద్ద; ఱా మహామహుల
పరమసౌందర్యం బపార మైయుండ,
అస్మన్మనశ్శక్తి యత్యల్ప మెన్న.
జానకీరామలక్ష్మణమహాదివ్య

సౌందర్యజలధిలో సర్వులచిత్త
బుద్ధ్యహంకారముల్ బ్రుంగి లయించె.
ప్రేమపిపాసచేఁ బీడితు లగుచు,
సకలనారీనరుల్ స్తంభితు లైరి–
తేజంబుఁ గనుఁగొని దిగ్భ్రాంతిఁ గన్న
వనమృగీమృగతతిపగిది, ఖగేంద్ర!
గ్రామీణకాంతలు తొమ్మిపుత్రిఁ జేరి
జంకుచు జంకుచుఁ జల్లఁగాఁ గొన్ని
ప్రశ్నలు వేసిరి పరమానురక్తి.
మాటిమాటికి– వారు మాన్యత మీఱ
నా మెపాదాబ్జంబులందున వ్రాలి.
మార్దవాఽకుటిలనిర్మలవాక్కు– లొప్పఁ
బలికి రీతెఱఁగునఁ బహువినయమున:
"ఓ రాజపుత్రి! మే మొక్క– విన్నపము
చేయఁగా నెంచియు స్త్రీస్వభావమున
జంకుచున్నారము స్వాంతంబునందు;
మన్నింపు దొరసాని! మా, యవినయము,
నాగరికతలేని నారీజనులము
గాన మమ్ముల వేఱుగాఁ దలంపకుము.
ఈ రాజనందను లిద్దఱుఁ గూడ
సహజసౌందర్యరసాకారు లెన్న,
మరకతకనకముల్, మహిఁ దమకాంతి
నీ కుమారులచెంత నెఱువుఁ గైకొనెను.
ఒకరు శ్యామలవర్ణు లొకరు గౌరాంగు
లీ రాజనందను లిరువు రత్యంత
మోహనలావణ్యపూర్ణ మైనట్టి
తరుణవయస్కు– లైతనరుచున్నారు.
వీరిముఖంబులు వెలుఁగొందుచుండె–
విమలశరచ్చంద్రబింబంబు లటుల;
వీరినేత్రంబులు వెలుఁగొందుచుండె–
చారుశరత్సరోజములవిధాన.
తమ అతిలోకసౌందర్యంబుచేత

కోటిమన్మథులనుగూడ నోహెూహో!
లజ్జింపఁజేయు నీ లావణ్యనిధులు,
నీ కేమి కాఁగలరో కమలాక్షి?"
అను వారిస్నేహరమ్యాలాపములను
విని జానకిదేవి బిడియంబు నొంది,
తనహృదయంబులోఁ దా నవ్వుకొనెను.
వారిముఖంబులవైపు వీక్షించి,
ఆ కనకాంగి లజ్జాతినేలమునఁ
దనవాలుఁజూపుల ధరణిపై బఱపె.
ఆ బాలమృగనేత్ర ఆ సీత యంత
లజ్జానతాననరాజిత యగుచుఁ
బలికె మృదూక్తుల వారితో నిట్లు –
"సహజస్వభావుండు చారుగౌరాంగుఁ
డగునాతఁడే లక్ష్మణాభిధానుండు–
నాదుమఱంది వినమ్రతామూర్తి."
అని వచియించి యా యవనీకుమారి
తనముఖాబ్జమునకుఁ దనచీరచెఱఁగుఁ
గొంచె మడ్డుగఁ జేసికొని తనవిభుని
ముఖమువీక్షించియు మోమును వంచి,
వాలుఁజూపుల భర్తవైపు వీక్షించి–
కంజనపక్షులకరణిఁ జలించు
చక్కనికనులతో సంజ్ఞఁ గావించె–
రామచంద్రుఁడు దనప్రాణేశుఁ, డనుచు.
అప్పు డాగ్రామీణలందఱుకూడఁ
గనకరాసుల స్వేచ్ఛగాఁ గొనిపోవ
నవకాశ మొందిన యమితదరిద్రు
లట్లు మహానందమంది రాత్మలను.
అత్యంతప్రేమచే నా కాంత లంత
జానకీపాదాంబుజంబుల వ్రాలి,
పలుదీవనల నామెపైఁ గురిపించి,
"ఆదిశేషుఁడు శీర్ష మందీ ధరిత్రి
నెంతకాలము వహియించు నందనుక
సర్వదా మను మమ్మ! సౌభాగ్యవతిగ.
పార్వతీశ్వరు లదాంపత్యంబువోలె
మీదుదాంపత్యంబు మెఱయునుగాక!
మమ్ములమాత్రము మఱువకు తల్లి!
తిరిగి మీ, రిటుల నేతెంచున ట్లైన,
మమ్ము మీ పాదపద్మముల్గఁ గొల్చు
దాసీజనమ్ముగా దఱుతో గ్రహించి
తప్పక యొకసారి దర్శనమ్మొసఁగ
అర్థించుచున్నాము హస్తముల్ మోడ్చి"
అని వచియించిరి యైక్యకంఠముల.
వారిప్రేనుపిపాస పరికించి సీత,
పలుమధురోక్తులు పలుకఁగా, వారు
కౌముదిచేతను గలువలయట్లు,
పరితోష మొందిరి స్వాంతంబులందు.
అత్తఱి, శ్రీరామునాంతర్య మెఱిఁగి,
సౌమిత్రిమృదువుగా జనులఁ బ్రశ్నించెఁ
'దా మేఁగవలసిన దా రేది'?–యనుచు.
ఆ మాట వినినంత, నట స్త్రీలుఁ బురుషు
లందఱు, ఘోర దుఃఖాకులు లైరి–
కాయముల్ పులకింపఁ, గనుల నీ రొలుక;
స్వాంతంబులందలి సంతోష మెల్ల
మటుమాయ మైపోవ, మది ఖేదపడిరి–
విధి తమ కిచ్చిన పెన్నిధిఁ దిరిగి
గైకొనుచుండినకరణి వా రెంచి.
కడకు వారలు కర్మగతిఁ దలపోసి
చెదరినధైర్యంబుఁ జేకూర్చుకొనియు
ఆలోచనముఁ జేసి యన్నిమార్గముల
సుగమమార్గంబును సూచించి; రంత–
జానకీలక్ష్మణసహితుఁ డై రామ
చంద్రుండు పయనంబు సాగించె; నపుడు–
జనులును సాగి, రా జననాథు వెంట.
శ్రీరాముఁ డంతటఁ బ్రియవచనముల

వారిని మఱలించె స్వగృహంబులను.
విధిలేక వా రట్లు- వెనుక కేఁగినను
మానక వారల మనసులుమాత్ర
మా రాము వెన్నంటి యరిగె ముందునకు.
తమయిండ్ల కేఁగుచుఁ దత్ప్రజ లెల్ల
పరిపరివిధములఁ బరితాపపడుచు
ఆ విధిన్నిందించి రాత్మలలోన.
వారు విషాదసంభరితాత్మ లగుచు
భాషించుకొని రిట్లు పక్షిలోకేశ!
"విపరీతములుకదా! విధికృతు లెల్ల;
ఆ విధి, అనివార్యుఁ, డతినిరంకుశుఁడు,
నిష్ఠురహృదయుండు, నిస్సంశయుండు;
చంద్రుని సఖుయు సకళంకుఁ జేసె;
కల్పకంబును జెట్టుగాఁ బుట్టఁ జేసె;
సాగరంబును ఘోరజలముతో నింపె;
నా విధిచైదంబు లరయ ని ట్లుండె
ఆ విధియే అక్కటక్కటా! యిట్టు
లా రాకుమారుల నడవుల కంపె;
వారికిఁ దగుచోటు వనములే యైన
భోగభాగ్యవిలాసముల సృష్టి యేల?
పదచారు లై వారు పయనించుచుండ,
బహువిధవాహనపటలంబు లేల?
భూమిపైఁ గుశపత్రములపైన వారు
శయనించునెడఁ బ్రపంచంబునం దింక
తతహంసతూలికాతల్పంబు లేల?
తరుమూలముల వారు తలఁ దాఁచుకొనఁగ,
ధవళాతిరమ్యసౌధవ్రజ మేల?
ఆ సుకుమారు లత్యంతసుందరులు
వల్కలంబులు కట్టి వహియింపఁ జడలు,
నానాంబరవిభూషణంబు లిం కేల?
ఆ మహోమహులు, వనాంతరాళముల
నలకందమూలఫలాశనుల్ కాఁగ,
అమృతాదిదివ్యరుచ్యాన్నంబు లేల?
విధి నిష్ఫలంబుగా వీని సృష్టించె."
అందుఁ గొందఱు ప్రజ లనుకొని రిట్లు:
"వారలు సహజశోభాకాశు లెన్న
వారికై వారలే వసుధాస్థలమున
నవతరించిరి గాని అరయఁగా వీరు
బ్రహ్మచే సృష్టింపఁబడలేదు లేదు.
శ్రవణాక్షిచిత్తగోచరములటంచు
వేదంబు లందున వివరింపఁ బడిన
తద్విధిసృష్టపదార్థంబు లెల్లఁ
బదునాల్గుభువనముల్ పరికించి చూడుఁ
డట్టిపురుషుఁ డేని? అట్టి స్త్రీ యేని?
ఎట మీకుఁ గనవచ్చు? హితులార! వారిఁ
గనుఁగొని యా బ్రహ్మ కడుమోహమొంది.
వారినిఁ బోలినవారి సృజింపఁ
గడుశ్రమ నొందెను గాని, యతండు
పడినశ్రమం బెల్ల ఫలియింప దయ్యె.
అందుచే నాతఁ డీర్ష్యావశుఁ డగుచు
వారి నీ రీతిగా వనిఁ జేర్చి దాఁచె."
మఱికొంద ఱీరీతి మాట్లాడి రపుడు-
"ఏ మేది యెఱుఁగ మే దెట్లైనఁ గాని-
తలఁపఁ గా మన మెల్ల ధన్యధన్యులము!
కనులార వారిని గాంచినవారుఁ,
గనుచున్నవారును, గననున్నవారుఁ,
బరమపుణ్యు లటంచు భావింతు మేము."
ఆ జను లిట్లు ప్రియాలాపు లగుచుఁ
గనుల నీ రిడికొని కళకళపడిరి.
"అత్యంతసుకుమారు లక్కటా! వారు,
తద్వనదుర్గమోదగ్రమార్గముల
నెట్లు గమింతురో? యెఱుఁగ మటంచు
అనురాగవశమున నంగన లెల్ల
వ్యాకులమొందిరి స్వాంతంబులందు –

సాంధ్యకాలంబున సంతాప మొందు
చక్రవాకిగణంబుచంద మయ్యెడను.
జానకీరామలక్ష్మణకోమలాంఘ్రు
లెంచి, చిత్తమున వా రేఁగెడి కఠిన
దారుణమార్గముల్ తలపోసి; వారు
సాంద్రానురాగసంచలమతు లగుచుఁ
బలికి రీ రీతిగా వరవాణి వెలయ--
"అమ్మహాత్ముల కోమలాంఘ్రణచరణ
సంస్పర్శచే మనస్సాంతంబులట్లు
భూదేవిసైతము పులకిత యగును.
వారల కీశుండు వనవాస మొసఁగె;
నట్టిచో నతఁ డేల నా మువ్వ రేఁగు
పథముపైఁ బూవులఁ బఱచకపోయె?
ఈశుండు మనవాంఛ లీడేర్చు నెడలఁ
వారల గనులలోపల దాఁచుకొనియు
బూజించుకొందము, పూఁబోణులార!"
సమయంబునకు లేక జానకీరామ
సందర్శనముఁ జేయఁజాలనివారు,
వారల గుణరూపవర్ణనల్ వినియు
నాతుర మొప్పఁగా, "ఆ దివ్యమూర్తి
లిప్పటి కెంతద వ్వేఁగి యుండెదరో?"
అనుచుఁ బ్రశ్నము సల్పి రచ్చటిజనుల.
శక్తి యుండినజనుల్ సరగున నుఱికి
వారలదర్శించి పరమహర్షంబు
నందివచ్చిరి జన్మసార్థక్య మొంద.
స్త్రీలును బాలురు వృద్ధు లెల్లఱును
పలవించిరలకగంబుల నుల్పుకొనుచు.
ఈ రీతిగా రాముఁ డెచటి కేఁగినను
అనురాగవివశు లై రచ్చటిజనులు.
రవికులకైరవరా కేందుఁ డైన
శ్రీరామచంద్రు దర్శించి కండ్లార
ప్రతిగ్రామమున జనుల్ ప్రముదితు లైరి.

శ్రీరామవనవాసకారణం బెఱిఁగి
కొందరు "కైకను, క్ష్మోణీంద్రు, నిందఁ
జేసిరి; కొందఱు, "శ్రీదశరథుఁడు
పరమదయానిధి పరికింప నిట్లు
జానకీరామలక్ష్మణులఁ జూపించి
సమకూర్చె మనకు లోచనలాభ." మనిరి
సకలనారీనరుల్ సరళానురాగ
రమ్యవాక్యములఁ బరస్పరం బట్లు
సంభాషణంబులు సలిపి రత్తఱిని:-
"జానకీరామలక్ష్మణులఁగన్నట్టి
తలిదండ్రు లెంతటిధన్యులో తలఁప!
వా రుండునగరంబు పరమధన్యంబు.
ఆ దివ్యమూర్తు లహా! మెట్టినట్టి
సర్వదేశంబులు సర్వశైలములు
సర్వవనంబులు జనపదంబులును
అవి యివి యన నేల? అమ్మహామహుల
అడుగడుగును ధన్య మైన దోహోహో!
అంతియే కాదు. నిజాత్మ నెవ్వండు
వారలఁ దనప్రాణబాంధవు లనుచుఁ
బ్రేమించు వాని నీ విశ్వంబులోన
సృష్టించి నందు కా సృష్టికర్తయును
బరమ సంతోష సంభరితాత్ముఁ డగును."
జానకీరామలక్ష్మణవనగమన
మధురసత్కథ లెల్ల మార్గంబులందు
వనగర్భలములోన వ్యాపించె ననఘ!
భాస్కరవంశదివాకరుం డైన
శ్రీరామచంద్రుఁ డీ రీతి మార్గస్థ
జనపదావాసులు సంతోషమంద
జానకీలక్ష్మణసంయుతుం డగుచు
వనశోభ లరయుచుఁ బయనంబొనర్చె.
మునివేషధారు లై ముద్దు లొల్కుచును
ఆ రామలక్ష్మణు లలరారుచుండ్రి.

ముందు శ్రీరాముఁడు పోవుచునుండె;
వెనుక లక్ష్మణమూర్తి వెడలుచునుండె;
ఉభయులమధ్య వెల్గొందె నా సీత –
జీవేశ్వరులమధ్యఁ జెలఁగు మాయవలె,
ఆమెసౌందర్యంబు నభివచియింప
నిం కొక యుపమాన మేను జెప్పెదను:
మధుమదనులమధ్య మను రతివోలె
నా జానకీదేవి అలరారుచుండె.
మతి జింతఁగావించి మఱి యొక్క ఉపమ –
వచియింతు, నా సీత భాసించుచుండె –
బుధచంద్రులకు మధ్యఁ బురణించుచున్న
రోహిణీదేవితీరున, ఖగరాజ!
తద్రామపాదముద్రలఁ దప్పకొనుచు
నడచుచుండెను సీత నయభయం బొప్ప.
ఆ జానకీరాఘవాంఘ్రిచిహ్నములఁ
దప్పించుకొనుచు సదా వానికెలమి
దక్షిణదిశగ సద్భక్తివెలుంగ
నడచుచుండెను లక్ష్మణస్వామి, అనఘ!
జానకీరామలక్ష్మణుల మహోన్న
తాదర్శవరపరమానురాగంబు
వాచామగోచరం బయి చెలువొందు;
అద్దాని వర్ణింప నలవి యెట్లగును?
శ్రీవారిశోభ వీక్షించినయంత
ఖగమృగములుగూడఁ గనెఁ బరవశత.
పాంథుఁ డౌశ్రీరామ భద్రుండు వాని
చిత్తంబులను హరించెను జిత్రముగను.
వనపథగాము లై భాసించుచున్న
జానకీ రామలక్ష్మణుల నెవ్వారు
దర్శించిరో – అట్టిధన్యాత్ము లెల్ల
ఆనందముగ ననాయాసరీతిగను,
మహితదుర్గమభవమార్గంబుఁ గడచి,
పడయఁగా గల్గిరి పరమగమ్యమును.

ఆ నాఁటిమాటగా దీనాఁడుఁగూడ
స్వప్నమం దైనను స్వాంతరంగమునఁ
దద్వనపథికసీతారామచంద్ర
లక్ష్మణస్వాముల లలితరూపముల
దర్శింపఁ గలిగినధన్యజీవుండు,
కన మునీశులకేని కష్టమైనట్టి
రామపరంధామరాజమార్గమును
దర్శింపఁగలఁడు సోదరులార! వినుఁడు!
అంత సీతాదేవి యలసియుండుటను
శ్రీరఘువీరుండు జిత్తమం దెఱిఁగి,
వటవృక్షమును దానిప్రక్కనే యొక్క
స్వాదుశీతలజలాశయ ముంట, నచటఁ
బృథ్వీజాలక్ష్మణోపేతుఁ డై విడిసి,
కందమూలఫలాదికముల భుజించి,
ఆ రాత్రి నిద్రించి, అట యహర్ముఖము
నందె మేల్కాంచి, స్నానాదు లొనర్చి,
సాగించెఁ బయనంబు సంతోష మొప్ప.

సీతారామలక్ష్మణులు గుహునితో వాల్మీకాశ్రమంబు బ్రవేశించుట

ప్రభు వట్లు రమణీయవనసరశ్శైల
సమితి వీక్షించుచుఁ, జని చని చేరె
నంత వాల్మీకిమున్యాశ్రమస్థలము.
రమణీయపర్వతారణ్యదృశ్యములు,
స్వాదువినిర్మలభవ్యోదకములు,
వికసితపద్మసంభృతసరశ్చయము,
పుష్పసంభాసితభూరుహకోటి.
మధురసపానప్రమత్తప్రమోద
మంజులగుంజితమధుపవ్రజంబు,
విరహితవైర సంవిహితసంతోష
గురుతరఖగమృగకోలాహలంబుఁ,
దనరు సుందర మైన తన్మునివాటి,

శ్రీరామమూ ర్తి వీక్షించె ఖగేంద్ర!
శుచియుతంబును మహాసుందరం బైనఁ
బ్రాచేతసాశ్రమవాటిక నరసి,

ఆ రామచంద్రుండు హర్షంబు నొందె.
అంత విన్నంత రామాగమనంబు,
వాల్మీకి యెదు రేఁగి స్వాగత మొసఁగె.

శ్రీరామచరితమానసము

అయోధ్యా కాండము

నవమవిశ్రామము

కేశవతీర్థహృదాలయ ।
కేశవ । మధువైరి । శౌరి । కృష్ణ । మురారీ ।
శ్రీశ । దయామయ । దనుజవి
నాశన । శ్రీమట్టపల్లినాథ । నృసింహా ।

అంతట శ్రీరాముఁ డమ్మునీశునకు
దండప్రణామముల్ తతభక్తిఁ జేయ,
నా విప్రవరుఁడు శుభాశీస్సు లొసఁగె.
ఆ రామచంద్రశోభావలోకనము
తన్మునినేత్రముల్ తనియంపఁ జేసె.
అంత నవ్వాల్మీకి ఆ జగత్ప్రభుని
సముచితసన్మానసంయుతంబుగను
నిజపర్ణశాలలోనికిఁ గొనితెచ్చె.
ఆ తనప్రాణప్రియాతిథి నరసి,
అమ్మునివరుఁడు మహామధుమధుర
కందమూలఫలాదికములఁ దెప్పించె.
జానకీరామలక్ష్మణు లా ఫలాళి
నారగించినయంత నా మునీశ్వరుఁడు
వారికి రమ్య మావసతిఁ జూపించె.
అమలమంగళమూర్తి యైనశ్రీరాముఁ
గనులార దర్శించి కడుమోద మొందె
వాల్మీకిముని తన భావంబులోన.
అంజలిఘటితకరాంబుజుం డగుచు,
శ్రీరాముఁ డంత నీ రీతి వచించె

శ్రవణసుఖప్రదసదమలోక్తులను
"స్వామీ! త్రికాలవిజ్ఞానసంపన్ను
లైన మీ కీ విశ్వమంతయు సతము
కరబదరం బయి క్రాలు, మునీంద్ర!"
అని పల్కి యూరాణి యైనకై కేయి
తన కరణ్యావాసమును గూర్చినట్టి
వృత్తాంత మెల్లను వివరించె విభుఁడు.
"పితృవాక్యపాలన విమలకార్యంబు,
మాతృహితంకరమహితకృత్యంబు,
భరతకుమారునివంటిసోదరుని
పట్టాభిషేకంబు, భవదీయదివ్య
దర్శనభాగ్యంబు, దలప ని వెల్లఁ
బొసఁగెను స్వామి! మత్పూర్వపుణ్యమున.
మునిరాజ! భవదీయఘనదర్శనమున
మత్సుకృతము లెల్ల మహి ఫలియించె.
ఎచట మే ముండుట హిత మెఱి? అచ్చోటి
కరుగువార ము భవదాజ్ఞానుసరణి.
మా యున్కిచేత నే మాని కేఁ గాని
యిబ్బంది కలుగరా, దిసుమంత యేని;
మునితాపసాళి కే భూపాలమౌళి
శోకంబుఁ గూర్చు నా క్ష్మోణీశకులము
అగ్నిలేకయె భస్మ మైపోవు దేవ!
అఖిలమంగళముల కాదిమూలంబు
బ్రాహ్మణపరితోషభవ్యకార్యంబు.

భూసురరోషంబు బూదిగాఁజేయు
కోటికులంబుల ఘోరరూపమున;
ఈ విషయం బాత్మ నెంచి కృపాళు!
సముచితం బగుప్రదేశముఁ దెల్పు, డచటి
కుర్వీజాలక్ష్మణయుతముగా నేఁగి,
ఇంపుగా నొక పర్ణతృణశాలఁ గట్టి
గడపెద మటఁ గొంతకాలంబు నాథ!"
అనఁగ నా రఘువర్యునత్యంతసహజ
సరళవాక్కులు విని జ్ఞాని యా మానిని,
పలికె నీ రీతిగాఁ బరమహర్ష మున—
"నిజము నీ వన్నది నిజము శ్రీరామ!
సంతతశ్రుతి సేతు సంరక్షణంబు
సలుపు నీ విట్టులు పలుక కెట్లుందు?
ఓ రఘువంశకేతూ! రామచంద్ర!

శ్రీ వాల్మీకిమహర్షి కృత శ్రీరామస్తవము

మత్తకోకిల :

రామ! శ్రీశ్రుతిసేతువు న్పరి
రక్షఁ జేయుచు విశ్వమున్
సీమ మొప్పఁగ నేలుచుండెడి
నీరజాక్షుఁడ వీ వహో!
స్వామి! సీత త్వదీయమాయ, కృ
పానిధాన! త్వదిచ్ఛమై
ఈమె సర్వజగంబులన్ సృజి
యించి పెంచి హరించెడున్.

ఆఁచి భూభర మెల్ల స్వీయస
హస్రభూరిశిరంబులం
దీ చరాచరసృష్టి నంతయు
నేలుశేషుఁడె లక్ష్మణుం,
డో చతుర్ముఖవంద్య! నీవు సు
రోపకారము నెంచియున్
రాచవేసముఁ గొంటి వాఖల
రాక్షసాళి వధింపఁగన్.

గేయం :

భవత్స్వరూపము శ్రీరామా!
వాక్కుల కందదు శుభనామా!
బుద్ధికిఁ బరము పరంధామా!
భవత్స్వరూపము శ్రీరామా!
అగ్రాహ్య మకథన మరిభీమా!
అఖండ మో మేఘశ్యామా!
భవత్స్వరూపము శ్రీరామా!
సతము శ్రుతులు తులసీదామా!
నేఁతి నేఁతి యను రఘురామా!

గేయం :

దృశ్య మీ జగ మెల్ల రామచంద్రా!
ఈవుద్రష్టవు సర్వసుగుణసాంద్రా!
బ్రహ్మవిష్ణుమహేశ్వరుల సైతమున్
ఆడింతు విష్టానుసరణి సతమున్ ॥దృ॥
బ్రహ్మాదు లెఱుఁగరే నీ మర్మము
అట్టిచో ఎవరి కయ్యది గ్రాహ్యము? ॥దృ॥
నిను నీవు ఎవ్వాని కెఱిఁగింతువో
ఆతఁడే ని న్నెఱుంగఁగలాఁడు పో ॥దృ॥
ని న్నెఱింగినయట్టి నిమిసంబులో
అతఁడు సీతో నేక మౌ నాహాహా! ॥దృ॥
నీ కరుణచేతనే రఘునందనా!
ని న్నెఱుఁగ నగుభక్త హృచ్చందనా! ॥దృ॥
నీరూప మల చిదానందమయము
అద్వి అవికల్ప మై వెలుఁగు సతము ॥దృ॥
అద్దాని నెఱుఁగుదురు అధికారులే,
అద్భుతాగాధ దివ్యజ్ఞానులే. ॥దృ॥
సాధుసజ్జనసురా్షవన దృష్టిమై
నరశరీరముఁ దాల్చియును బృథ్విపై. ॥దృ॥

ప్రాకృతావనినాథు చందంబుగా
పలుకుచు ప్రవ ర్తించుచున్నావుగా. ॥దృ॥
నీ చర్యలను విన్న కన్న మూఢుల్
విభ్రమింతురు; సంతసింతురు బుధుల్ ॥దృ॥
నీ నుడుల్ చేతలన్నియు నిజంబే
వేషానుకూలనాట్యం బుచితమే. ॥దృ॥
నే నుండఁ దగు స్థలం బెఱిఁగింపుమా.
అని నన్ను ప్రశ్నించినావు రామా! ॥దృ॥
ఒక సంశయము దీర్పఁ ప్రశ్నఁ జేతున్
ముందు తెల్పుము, నీవు, లేని తావున్. ॥దృ।
అపుడు నేఁ జూపింతు నీ వుండఁగాఁ
తగినతావును జానకీ వల్లభా! ॥దృ।

అని యమ్మునీశ్వరుఁ డాడినప్రేమ
రసవాక్యములు విని రామచంద్రుండు,
తనలోనఁ దా నవ్వుకొనె సిగ్గుపడుచు.
వాల్మీకియును హాసవదనుఁ డై పలికె,
మధురసుధో క్తుల మఱుల నీ రీతి:

వాల్మీకి శ్రీరామ సంవాదము

"శ్రీరామ! వినుము నేఁ జెప్పుచున్నాఁడ:
జానకీలక్ష్మణసహితుండ వగుచుఁ
దనర నీవు వసింపఁ దగినచో కొదియొ?-
భవదీయ సత్క-థావాహినీ చయము
సతతంబు ప్రవహించి సంగమించినను
నిండుట యనునది నిరతంబు లేని
సాగరం బెవ్వరిశ్రవణంబు లగునొ?
వారి డెందమె నీకు వాస యోగ్యంబు.
స్వామి! ఏ జనులలోచనములు సతము
జలధరప్రణయైక చాతకం బటుల
నీ దివ్యజలధర నీలరూపమునను
దర్శించు తృష్ణతోఁ దహతహపడునొ?
ఘుననదీసాగరకాసారజలము

లాశింపఁబోక వర్షాంబుకణంబె
ఆశించు చాతకమట్లు శ్రీరామ!
భవదీయ సౌందర్య వర్ష బిందువునె
ఆశించి సంతృప్తి నందునో? వారి
హృదయమే తగు సుఖసదనంబు నీకు.
సీతాస్వబంధుసమేతుండ వగుచు
అచ్చోట వసియింపుమా! రఘురామ!
మఱియు భవద్యశోమహితప్రపూత
మానసకాసారమండితపరమ
పావనగుణగణవరమౌ క్తికముల
ఎవనిజిహ్వాహంసి యెప్పుడు గ్రహించు?
వానిస్వాంతంబున వసియింపురామ!
ఎవ్వరినాసిక ఎంతయో ప్రీతి
భవదీయ రమణీయ పావనపాద
సారసయుగ్మపూజాద్రవ్యగంధ
మొగి నిత్య మాఘ్రాణ మొనరించుచుండు,
ఎవ్వరు భక్తి నీ కిడిన నైవేద్య
మునుమాత్రమే- నిత్యమును భుజించెదరొ?
భూషణాంబరముల మున్మందు నీకుఁ
బ్రేమ సమర్పించి పిదపఁ దా ల్చెదరొ?
సురగురుద్విజులను జూచినయంతఁ
బ్రీతితో నత్యంత వినయంబుతోడ
నెవ్వరిశీర్షంబు లెఱఁగు తత్ క్షణము,
ఎవ్వరికరము లహీనరాగమున
శ్రీరామ పదపూజ జేయు నిత్యంబు,
ఎవ్వరిహృదయమం దెడ తెంపు లేక
రామదేవా-నన్య రక్తి వెలుంగు,
ఎవ్వారి చరణంబు లీ ధరలోన
శ్రీరామతీర్థముల్ సేవింపఁ జనునొ?
వారిచిత్తములందు వసియింపు రామ!.
మఱియు నెవ్వారు నీ మంత్రరాజమును
నిత్యంబు జపియింప నేర్తురో? ఎవరు

పరివారయుతముగా భాసించు నిన్నుఁ
బూజింపుచుందురో? పుడమి నెవ్వారు
తర్పణహోమసంతతిఁ జేయుచుందు,
రెవరు విప్రులకు సంతృప్తిఁ గల్గింత్రు
భోజన దానాదిపుణ్యకార్యముల,
ఎవ్వరు నీకంటె నెక్కువ యనుచుఁ
దమ గురుదేవు నుద్యద్భారవమున
సంపూర్ణ భక్తితో సంసేవఁ జేతు?-
రెవరు సత్కర్మల నెల్ల నొనర్చి
రామాంఘ్రిపంకజరతి దప్ప నొండు
ఫలమును గోరరో? వారలహృదయ
మందిరంబున రఘుమండనా! నిలుము.
మదిని గామక్రోధమదమాన మోహ
లోభ విద్రోహ కల్లోల రాగంబు
లలదంభకపట మాయాగుణావళిని
ఎవ్వరు ధరణిఁ ద్యజించిరో? వారి
హృదయంబులో వసియింపుమా! రామ!.
ఎవ రెల్ల అకుఁ బ్రియుల్ హితకారు లెవరు
ఘనఖేదమోద దూషణభూషణముల
సమముఁగాఁ జూతురో? సంతతం బెవరు
సత్యప్రియాలాప సద్వ్రతు, లెవ్వ
రఖిలకాలముల సర్వావస్థలందుఁ
బరఁగ నన్యాధారవర్జను లగుచు
రామా! త్వదేక శరణ్యు లైయుంద్రు?
వారిచిత్తమె నీకు వాసయోగ్యంబు.
అన్యకాంతను దల్లి యట్లుగా మఱియు
పరధనంబును ఘోరతర విషమట్లు
ఎవ్వరు గాంతురో? యెల్ల వేళలను,
మఱియు నేమానవుల్ మానసమందుఁ
బరసుఖం బరసియుఁ బరితోషపడుచు
పరదుఃఖ మరసియుఁ బరితపించెదరొ?
శ్రీరామ! నీ వెవ్వరికి స్వాంతమందు

ప్రాణప్రియుండ వై వఱలుచుండెదవో?
వారిచిత్తంబులే వసియింప నీకు
శుభసదనంబులు సుందరాకార!
ఎవరికి రామ! నీవే, ప్రాణవిభుఁడ
వీవే, సఖుండ వీవే, తల్లిదండ్రి
వీవే, గురుండ వీవే, సర్వ మగుదొ?-
అవ్వారిహృదయాలయాంతరాళంబె
జానకీలక్ష్మణసహితుండ వగుచు
నీ వుండఁదగినట్టి నెలవు శ్రీరామ!.
ఏజనుల్ పరదోష మెన్నక వారి
సుగుణభాగంబునే చూతురో? మఱియు,
గో విప్ర హిత మొనఁగూర్ప శ్రమింతు
రేజనుల్? తమకీర్తి నిలఁ బ్రతిష్ఠింత్రు?
నీతిశాస్త్రాచారనిపుణు లై యుంద్రు!
వారిచిత్తమె నీకు వాసయోగ్యంబు.
ఎవ్వఁడు తనలోన నెగ్గెఁగెడుమంచి
యంతయు నీయదే, యని తలపోసి,
తనలోని చెడు గెల్లఁ దనదిగాఁ దలఁచు?
నంతియే కాక, నీయుండే సతంబుఁ
దనభార మెల్ల నుత్తమభక్తి వైచి
శ్రీరామభక్తులఁ బ్రేమించుచుండు?
వానిభావంబున వసియింపు మయ్య!-
వైదేహితో రామభద్రా! కృపాబ్ధి!
ఏ మానవుండు మహీస్థలమందు
మతకులజాత్యభిమాన గుణాళిఁ
బుత్రమిత్రకళత్రభూగృహాదులను
ధనధాన్యవస్తువాహనముల నెల్ల-
అవి యివి యన నేల? అఖిలసంగముల-
సన్న్యసించియుఁ దనసాంతంబునంచు
నీ స్వరూప ధ్యాన నిష్ఠఁ గావించు?
వానిలో శ్రీరామ! వసియింపు మెపుడు.
ఇంకను వచియింతు నెవ్వఁ డీ ధరణి

నల స్వర్గనరకంబు సపవర్గపదవి
సమముఁగాఁ దలపోసి సర్వత్ర సతముఁ
గోదండరాముఁ గన్గొని సంతసించుఁ,
గన మనోవాక్కాయకర్మల నెవఁడు
రామదాసుం డౌచు రాజిల్లుచుండు?
అవ్వాని హృన్మందిరాంతరాళమున
సీతాపతీ! రామ! స్థిరముగా, నిలుమ.
అంత్య వాక్యంబొక్క టాలింపు మీశ!
సత మకించనుఁడు నిష్కాముఁ డై యెవఁడు
సహజ సుస్నేహంబు సలుపు నీయెడల,
వానిచిత్తమునందు వసియింపు రామ!
నీ స్వగృహంబ దే, నీరదశ్యామ!"
ఈ ప్రకారం బామునీశుఁ డనేక—
సముచితవాసదేశంబులఁ దెలుప,-
ఆ ప్రేమమయ వాక్కు లాలించి మిగుల
రామచంద్రుండు హర్షస్వాంతుఁ డయ్యె
మఱల నీ రీతిగా మాని వచించె:

వాల్మీకి శ్రీరాముని తో చిత్రకూటాద్రినివాస
యోగ్యం బని వక్కాణించుట:

"ఓ భానుకులదీప! ఓ ప్రభూ! వినుము!
ఈ సమయంబున హితకరం బైన
ఆశ్రమస్థలము నీ కభివచియింతు:-
చిత్రకూటాద్రి వసింపుమా, రామ!
అన్నివిధాల నీ కట హాయి గలుగు.
ఆ పర్వతంబు మహామనోహరము;
కరిహరిమృగవిహంగములు చరించు
నచటియరణ్య మత్యంతరమ్యంబు.
వరపురాణములందు వర్ణింపఁబడిన
ఒక పుణ్యానది పారుచుండు నచ్చోట;
అత్రిసతీమణి యా యనసూయ
తన తపోబలముచేఁ దన్నదిం దెచ్చె,
నదియె మందాకినీనది యనఁబరఁగు.
ఊర్వి గంగానది కుపనది యైన
భవ్యమందాకిని- పరికించు నెడల
పాతకపోతకభయదధ్వాకినియె.
అత్రిముఖ్యమునీంద్రు లా ప్రదేశమున
యోగజపంబుల నొనరించుకొనుచుఁ
దమతనుశక్తుల ధారఁబోయుచును
చండతపశ్చర్య సలుపుచున్నారు;
అందుచే వేంచేసి యచ్చటి కీవు,
సఫలం బొనర్పుమా, సర్వాశ్రమల-
నమ్మహాచలమున కసమగౌరవము
దయసేయుచును పరంధామ! శ్రీరామ!"
అని పల్క వాల్మీకి మునిలోక నూత
ఆ చిత్రకూటశైలామితమహిమ
నెంతయో వర్ణించె నంత ఖగేంద్ర!
శ్రీరామలక్ష్మణుల్ సీతతో వెడలి
నిర్మలమందాకినీనదిం జేరి
స్నానముల్ సలిపిరి, సంతోష మొప్ప.
శ్రీరాముఁ డిట్లు వచించె, "సౌమిత్రి!
ఇచట నదీఘట్ట మింపుగా నుండె
దాఁపున నెట నైనఁ దగుప్రదేశమున
వాసం బొనర్ప నేర్పాట్లు గావింపు"-
మనఁగ లక్ష్మణుఁడు తత్క్షణము, పయస్వి
నీప్రవాహోత్తరనిర్మలతీర
మరసి యిట్లనియె నిజాగ్రజుతోడ
"దేవరవార లిదే, కనుఁ డిచట
నొడ్డుప్రక్కనె పారు నొక సెలయేఱు
ధనురాకృతిగ నుండెఁ; దద్ధనుస్సునకు
నారి మందాకినీనది యై రహించు;
శమదమదానముల్ శరపరంపరలు;
కలియుగ భీకరకలుషంబు లెల్ల
నా బాణములకు లక్ష్యంబు లైనట్టి

బహుళఘోరమృగాళి, భావించు నెడల;
ఈ మహోధనువు ధరించి వెలుంగు
ఈ చిత్రకూట గిరీంద్రంబు తోఁచు
నచలుఁ డై నిల్చున్న వ్యాధునిపగిది;
ఆతని గురితప్ప దావంత యేని,
వెనుకంజ వేయఁ డా వీర వరుండు!"
అని పల్క లక్ష్మణుం డాప్రదేశమును
జూప, శ్రీరాముఁడు చూచి హర్షించె.

కోలకిరాతవేషధారు లగు వేల్పులు తృణ
పర్ణాత్మకము లగురెండుశాలలు నిర్మించుట

రాము నాస్థానంబు రంజిల్లఁ జేసి
ననువార్త విన్నంత నమరజనంబు
విశ్వకర్మను గూడి వెడలి తత్క్షణము
కోలకిరాతవేషాల ధరించి
చిత్రకూటమున రచించిరి, భక్తిఁ
దృణపర్ణసదనముల్ రెండు, సొంపుగను.
ఆ పర్ణశాలల అందంబుఁ దెలుప
మాటలు చాలునే మానివరేణ్య!
అం దొక్కకుటి చిన్న దతి రమ్యతరము;
వే ఱొక్కతృణశాల పెద్దదైయుండె–

శ్రీరాముఁడు సీతాలక్ష్మణసమేతుఁ డై
పర్ణశాలలో నివసించుట

ఆ రమ్యపర్ణశాలాంతరాళమున
జానకీలక్ష్మణసంయుతుం డగుచు
రామచంద్రుండు విరాజిల్లుచుండె
కన రతీబుతురాజకలితుఁ డై యొప్పు
మానీశవేషమన్మథు విధానమున,
అత్తఱిఁ జిత్రకూటాద్రి కేతెంచి
రమరకిన్నరనాగు లష్టదిక్పతులు;
రాముఁ డందఱికిఁ బ్రణామముల్ చేసె!

వా రెల్ల నేత్రలాభంబును బొంది
పరమసంతోషసంభరితాత్ము లైరి.
కుసుమవర్షంబులు గురియుచు సురలు,
"నాథ! యీనాఁడు సనాథుల మైతి
మని వచించిరి, హృదయంబు లుప్పొంగ.
వా రంత నా రామభద్రునితోడ
దుస్సహ నిజఘోర దుఃఖజాలముల
విన్నపం బొనరించి వెడలిరి, తిరిగి
తమతావులకుఁ దాము తతహర్ష మొప్ప."
రఘునందనుండు శ్రీరామచంద్రుండు
చిత్రకూటమున వేంచేసినాఁ డనెడి
శుభవార్త విని మునీశులు చేరి రటకు!
హర్ష మొప్పారు ముఖారవిందముల
వచ్చినయా మునీశ్వరుల వీక్షించి
రాముఁడు భక్తితోఁ బ్రణతులొనర్చె.
ఆ మహామును లెల్ల రారామచంద్రుఁ
గౌఁగిటఁ జేర్చి ప్రగాఢానురక్తి
ఆశీర్వదించిరి ఆత్మీయవాణి
సఫలత నొందఁగా స్వాంతమం దెంచి.
ఆ మునుల్ జానకీరామలక్ష్మణుల
పరమసౌందర్యంబుఁ బరఁగ దర్శించి,
తమ తపస్సాధనతతి పూర్ణముగను
ఫలియించె నని యెంచి పరవశులైరి.
ఆ మునీశ్వరుల రామావనీవిభుఁడు
సన్మాన మొనరించి సముచితరీతి
సెలవీయఁ, జని వారు స్వీయాశ్రమముల
యోగతపోజపయాగంబులందు
నిష్ఠ లైరి, విహంగ నికరాధినాథ!
శ్రీరాముఁ డేతెంచెఁ జిత్రకూటమున
కనుసమాచారంబు నాలించినంత
నవనిధు లిండ్లకు నడచి యేతెంచి
నట్లు కోలకిరాతు లానందపడిరి;

అంత వారెల్లరు హస్తయుగ్మముల
ఫలకందమూలసంభరితపుటంబు
లెసఁగఁ బయల్దేరి రేకబృందముగ
ధనమును దోఁచఁగా జనుపేదలట్లు,
మునుపె శ్రీరామలక్ష్మణుల దర్శించి
మఱల దర్శింప నామార్గాన వచ్చు
బాటసారులఁ జూచి వార లాతురత
ఆ సోదరులవిషయము లడుగుచును,
తద్రఘువీర సౌందర్యంబుగూర్చి
బహుర క్తి వినుచును వర్ణించుకొనుచుఁ
జిత్రకూటముఁ జేరి శ్రీరాముఁ గాంచి
శ్రీవారిపావన శ్రీసముఖమునఁ-
దమ సమర్పణములఁ దనరఁగా నుంచి,
పరమవినమ్రతాభ క్తి వెలుంగ
నతులొనరించి తన్మయులౌచు నిల్చి
రట నటఁ జిత్రంబులట్లు నిశ్చలతఁ
గాయముల్ పులకింపఁ గనుల నీ రొలుక,
వార లారీతిగాఁ బరమానురాగ
మగ్నులై యుండుట మదిని గ్రహించి
బహుళప్రియోక్తులు పలికి రాఘవుఁడు
సర్వుల మిక్కిలి సన్మానపఱచె.
ఆ ఆటవికులు రామావనీపతికి
మాటిమాటికిని నమస్కృతుల్ సలిపి
కరములు జోడించి కడు వినయమునఁ
బలికి రీరీతిగాఁ బక్షీంద్ర! వినుము.

కోలకిరాతకృతశ్రీరామస్తవము

గేయం :

కంటిమి నీ పదముల స్వామీ!
కలిగెను గతి మా కిం కేమీ?
ప్రభు! మా భాగ్యముచే రామా!
వచ్చి తిటకుఁ గోసలధామా!

మంగళమహాశ్రీ

ధన్యములు నిక్కముగఁ ద్వత్పదము సోకిన, ని
తాంతవనశైలపథభూముల్
ధన్యములు త్వద్విమలదర్శనము నొందిన ప
తంగ మృగసంఘములు గూడన్!
ధన్యులము మేముఁ గడుధన్యులము చూడ బహు
ధన్య లిల మాప్రియజనంబుల్!
మాన్య! మిముఁ గాంచితిమి మా కనులపండువుగ
మమ్ము దయ నేలు రఘురామా!

మంగళమహాశ్రీ

స్వాములు వసింపఁ దగుచక్కనిస్థలంబునకె
వచ్చి రిది షడ్రుతువులందున్
రామ! సుఖ మీయఁగలరమ్యవనసీమ; ఇట
రాదు తమ కెట్టిశ్రమయైనన్.
పాములను నాగముల వ్యాఘ్రముల సింహముల
పారిచనఁ ద్రోలుటలు గాకన్
మేము కొలువంగలము మీ యడుగు లెప్డు తల
మీఁద నిడుకొంచు రఘునాథా!

గేయం :

చీమలు దూరని చిట్టడవుల్
కాకులు దూరని కొఱడవుల్
చీఁకటిగుహలును బెనుకనుమల్
లే వెట మే మెఱుఁగనిస్థలముల్
వివిధాటవులకు రఘురాయా!
వేఁటకు నిను గొనిపోదుమయా!
జలజలఁ బాఱెడి వాగులను
గలగలఁ బాఱెడి వంకలను
కళకళ లాడెడి కొలఁకులను
మాతో మిముఁ గొని చూపెదము.
నిరతము మీ యడుగుల వదలం
మే మెల్లను మీ సేవకులం.

ఆజ్ఞాపింపఁగ మము రామా!
సంశయ మొందకు శుభనామా!

ఏ జగన్నాథుని, ఏ కృపానిధిని,
వర్ణింప శ్రుతులకు వశము గాకుండె,
ఏ పరమేశు మునీశ్వరుల్ గూడ
స్వాంతమందు, గ్రహింపఁజాలరో-అట్టి
రామచంద్రుం డనురాగంబు మీఱి
పిల్లలపలుకులు వినుపితమోలె,
ఆ భిల్లజనుల వాక్యంబు లాలించె.
ప్రేమచేమాత్రమే శ్రీరామవిభుఁడు
సంప్రీతుఁ డగును జిజ్ఞాసు లౌవార
లీ సూత్ర మాత్మగ్రహింతురుగాక! —
రాముఁ డా భిల్లుల రమ్యానురాగ
వగమధురో క్తులఁ బరితోషపఱచె.
సెలవొంది వా రంత శ్రీరాముమ్రోల
వినమితశిరు లౌచు వెడలి రిండ్లకును
దారివెంటన్ రఘువీరుగుణాళి
సంతోష మొప్పఁ బ్రసంగించుకొనుచు.
జానకీరామలక్ష్మణు లీవిధానఁ
జిత్రకూటమున వసించిరి నిఖిల
సురమునివరులకు సుఖదాయులగుచు.
ఎప్పటినుండి సీతేశ్వరుం డచట
వసియింపసాగె-నప్పటినుండికూడ
అచ్చటి వనము శుభాస్పదం బయ్యె.
బహువిధవిటపముల్ ఫలపుష్పనిచయ
భరితంబు లౌచుఁ బ్రభాసించె; వాని
కల్లుకొన్నట్టి లతావళు లొప్పె
తత రమణీయ వితానంబులట్లు;
ఆ తరుల్ సురతరులట్లు వెలింగె
సహజసౌందర్యవిశాలంబు లగుచు;
నందనవని విడనాడి తత్తరులు
చిత్రకూటమునకుఁ జేరినట్లుండె.
మధుకరపుంజసుమంజుగుంజములు,
మందశీతలగంధమారుతంబులును,
కలకంఠశుకనీలకంఠచకోర
చాతకకలహంసచక్రవాకాది
చారువిహంగసుశ్రావ్యరావములు,
నపహరించుచునుండె నఖిలచిత్తముల.
కరిహరిక్రోడమర్కటకురంగములు
విడి వైరములఁ గూడి విహరించుచుండె.
విపినంబు నందున విహరించునట్టి
మృగబృంద మా రామశృంగార మరసి
అత్యంతపారవశ్యమునందె గరుడ!
విశ్వంబులోఁ గలవిబుధవనంబు
లన్నియు శ్రీరాముఁ డధివసియించు
వనముతో సరిపోల మని లజ్జఁ జెందె.
అమరనదీమణి యైనయా గంగ,
ఘనసరస్వతి, సూర్యకన్య యాయమున,
తతవినిర్మల నర్మదానది మఱియు,
ధన్య యై పరఁగు గోదావరీనదియు,
సకలసరిత్సరస్సాగరవివిధ
ఘననదీనదములు, గడుఁబ్రశంసించె
మందాకినీనదీమహిత భాగ్యమును.
అమరవాసము లుదయాస్తాచలములు,
కైలాసమందరఘనమేరుగిరులు,
వరహిమాలయముఖ్యపర్వతంబులును,

కొనియాడె నా చిత్రకూటశైలమును.
కడుసునాయాసంబుగాఁ దన కంత
ఘనత ప్రా ప్తించినకారణంబునను
*వింధ్యాద్రి యుబ్బి తబ్బిబ్బును జెందె.
చిత్రకూటంబునఁ జెలఁగుచున్నట్టి
ఖగమృగతరులతాగణత్రణజాతు
లన్నియుఁ బరమధన్యంబు లోహోహో!
నిఖిలపుణ్యములకు నిలయంబు" లనుచు
అభినుతుల్ సలిపి రహర్నిశల్ సురలు.
కండ్లున్నవార లా కాకుత్థ్సుఁ గాంచి
పుట్టుక ఫలియింప ముక్తార్థు లైరి.
అచలంబులును రాఘువాంఘ్రిరజంబు
సోకుటచే మహాసుఖ మొంది, పరమ
పదవికిన్ యోగ్యతఁ బడసె. ఖగేంద్ర!
ఆనందసాగరుం డగురామచంద్రుఁ
డధివసించిన పర్వతారణ్యతలులు,
సహజరమ్యంబులు సన్మంగళములు,
భవ్యభవ్యంబు; లవ్వాని మాహాత్మ్య
మభివర్ణనముఁ జేయ నలవి యె ట్లగును?
ఉరుదుగ్ధవార్ధి నయోధ్యాపురమును
త్యాగంబొనర్చి నితాంతానురక్తి,
జానకీరామలక్ష్మణులు వసించు
నా చిత్రకూటమహారణ్యశోభ
నభివర్ణనము సేయ నలవి గాఁబోదు
శతసహస్రాఽదిశేషస్వాములకును;
అట్టిచో నెట్లు నే నభినుతియింతు?
ఒక చిన్నపడియలో నొదిగి వసించు
కూర్మము, మంథరకుధరరాజమును
మూఁపునవహియించి మోయఁగా గలదె?
తనుమనోవాక్కులఁ దగ లక్ష్మణుండు.

శ్రీరామచంద్రుని సేవఁ గావించె
వర్ణనాతీతసద్భక్తిసౌశీల్య
సంయుతుం డయి, ఖగసంఘవరేణ్య!
సౌమిత్రి, అట ననుక్షణము సంప్రీతి—
జానకీరాఘువచరణముల్ గనుచు,
వారలఁ బూజ్యభావమున నెంచుచును,
స్వప్నమం దైనను స్మరియింప మఱచెఁ
దనసహోదరుఁ దల్లిఁ దండ్రినిఁ దుదకుఁ
దనదుప్రేయసిని సైతము, వైనతేయ!
శ్రీరామసన్నిధి సీతామతల్లి
పురపరిజనగేహముల విస్మరించి
మహితసుఖం బొప్ప మనియె ఖగేంద్ర!
ప్రియతమముఖచంద్రబింబంబు సతముఁ
గనుచుఁ బ్రమోదంబుఁ గాంచె నాసీత.
మహితచకోరకుమారిచందముగ.
దినదినమభివృద్ధిఁ గనుచు వెలుంగు
తనప్రాణవిభునకుఁ దనపైనఁ గలుగు
ప్రేమను గాంచి పృథ్వీజ సంతసించెఁ
బగటివేళను జక్రవాకివిధాన.
రామాంఘ్రిపద్మానురాగిణి యైన
ఆమెచిత్తంబున కయ్యరణ్యంబు
సతమయోధ్యాశతసమముగాఁ దోఁచె;
ఆ జానకీదేవి కటఁ బర్ణశాల
ప్రియునిసన్నిధిచేతఁ బ్రియ మొనఁగూర్చె—
మణిమయమండితమందిరంబటులు.
వనవిహంగకురంగవర్గ మాయమకుఁ
బరిజనగణ మూచు భాసింపఁ దొడఁగె;
మునిపత్నులును మహామును లరణ్యమున
అత్తమామలవలె నామెకుఁ దోఁచి;
రల కందమూలఫలాశన మామె

* చిత్రకూటము వింధ్యపర్వతశ్రేణిలోఁ జేరినది. అందుచే చిత్రకూటమునకు లభించిన మహాభాగ్యము తనకుఁ గూడ లభించినట్లుగా వింధ్యపర్వతము తలఁచి పరమసంతోష మొందినది.

కమృతోపమానరుచ్యాన్న మై తనరెఁ;
బ్రాణేశసాంగత్యభాగ్యంబుకతన,
లలితకోమలకిసలయశయ్య గూర్చె
మదనశయ్యాశత మహితసుఖంబు.
అరయ, నే జననికటాక్షమాత్రమునఁ
బ్రాప్తించు నింద్రాదిపదవు లా తల్లి —
ఈ లోకభోగంబు లెట్లు వాంఛించు?
శ్రీరాము సంస్మరించెడిభక్తజనులు
గడ్డిపోఁచవిధానఁ గాలఁ దన్నెదరు
విషయవిలాసాల, వెనుకాడఁబోక.
అట్టిచో శ్రీరామునర్ధాంగలక్ష్మి
అల జగజ్జననియౌ ఆ సీతవిషయ
మెన్నంగ, ఆశ్చర్యమే? ఖగరాజ!
జానకీలక్ష్మణుల్ సంతోష మొందు
చందంబుగా, రామచంద్రుండు సతము
భాషించు, వర్తించుఁ, బరమానురక్తి.
రాముఁడు పలుకుపురాణకథాళి
పృథ్వీజాలక్ష్మణుల్ వినుచుందు రమిత
సంతోష మొప్పగా స్వాంతంబులందు.
శ్రీయయోధ్యను సంస్మరించిన ట్లెల్ల
అల రాముకను లశ్రువులతోడ నిండు.
ఆ కృపావారాసి యగురామవిభుఁడు
తనతల్లిదండ్రులఁ దనపరిజనులఁ
దనసహోదరుల నందఱికన్న మిగుల
భరతునిసుస్నేహభక్తిశీలములఁ
దలపోసి మిగులఁ జింతాక్రాంతుఁ డగుచు,
సమయంబు కా దని స్వాత్మలో నెఱిఁగి
ధృతిఁ గూర్చుకొనుచుండు; నిది పరికించి
పురుషునియొకచాయఁబోలె వర్తించు
జానకీలక్ష్మణుల్ సైతము మిగులఁ
నాత్మఁ జింతాక్రాంతు లగుచుందు; రఘుఁడు—
ప్రియసతీబంధుపరిస్థితి నరసి
ఆ ధీరమూర్తికృపాంశువారాసి
భక్తహృచ్చందనభవ్యవిగ్రహుఁడు
రఘునందనుండు పురాణప్రణీత
కథలఁ బ్రసంగించుఁ గడురమ్యముగను.
వాని నాకర్ణించి స్వస్థు లౌచుందు
రల జానకీసుమిత్రాత్మజుల్ గరుడ!
ఆ చిత్రకూటదివ్యాశ్రమమందు
జానకీలక్ష్మణసంయుతుండైన
రామచంద్రుండు విరాజిల్లుచుండె,
అలశచీదేవీజయంతులఁ గూడి
అమరావతీపురమందు వెలుంగు
దేవేంద్రువిధమున ధీరా! ఖగేంద్ర!

శ్రీరామచరితమహావనము

అయోధ్యాకాండము

దశమవిశ్రామము

చండగదాదండమహో
ద్దండకనకకశిపుదర్పదళనసముద్య
త్పాండిత్యనఖరమండల
మండిత హరిః మట్టపల్లిమందిరః నృహరీః

తద్రామవిభుఁడు సీతాలక్ష్మణులను
గన్నుల ఱెప్పలకరణిఁ గాపాడు.
జానకీరాముల సతము సౌమిత్రి
అవివేకి తనదు దేహమునట్లు ప్రీతి
సేవింపుచుండెఁ. ఋషీ! భరద్వాజ!
ఖగమృగసురమునిగణహితుఁ డైన
శ్రీరామచంద్రుఁ డీరీతి సౌఖ్యముగఁ
జిత్రకూటారణ్యసీమ వసించె.
రమ్య మైనట్టిశ్రీరఘురామచంద్రు
వనగమనోదంతమును జెప్పినాఁడ;
వినుము సుమంత్రుఁ డే విధిఁ బురిఁ జేరె—
అటులు రాఘవు సాగనంపి గుహుండు
తిరిగివచ్చియు గాంగతీరంబునందుఁ
గనియెఁ సుమంత్రు, నాతనిశతాంగమును.
ఆ బోయనాయకు నరసి సుమంత్రుఁ
డతివికలుం డయ్యె; నా సమయమున
నాతఁడు పొందిన యమితదుఃఖంబు
వాక్కుల వర్ణింప వశముగా దనఘ!
'హా రామ! హా రామ! హా ధరాతనయ!
హా లక్ష్మణా!' యని యా సుమంత్రుండు
ధరణిఁ గూలెను దురంతవ్యాకులమున;
దక్షిణదిశ వైపు తమచూపుఁ బఱపి
హయములు సకిలించె నాకులపడుచుఁ
బక్షుల్ విఱిగినపక్షులువోలె.
అవి గడ్డి మేయ వహా నీరు ముట్ట
వూరకఁ గనుల నీ రొలుకుచు నిలుచు-
అట్టి ఆ రఘువీరునశ్వాల నరసి
అఖిలనిషాదు లత్యం తార్తులైరి
అంతగుహుండు ధైర్యముఁ గూర్చుకొనియుఁ
బలికె సుమంత్రునిఁ బరికించి యిట్లు:—
"ఓ సుమంత్రా! దుఃఖ ముడుగుము, నీవు
పరమార్థ మెఱిఁగిన పండితమణివి;
విధి యిట్లు వ్యతిరేకవిధముగా నుండె
నని గ్రహియించి ధైర్యముఁ బూను మనఘ!"
అని పల్కి గుహుఁడు మహోమ్మదుఘణితి
వివిధపురాకథల్ వినిపించి యెట్లో—
బలవంతమునఁ గొనివచ్చి యా సూతు
నరదమందునఁ జేర్చె; నైన నా సచివుఁ
డతిశోకశిథిలుఁడై యరదంబుఁ ద్రోల
జాలఁ డయ్యెను; వాని స్వాంతంబు నిండె
రఘువరవిరహదుర్భర బాధతోడ.
తద్రథాశ్వములు పథంబునఁ జనక
అప్పుడే తెచ్చిన యడవిమృగాల—

నరదంబునకుఁ బూర్ణినట్టులు బెదరి
అటు నిటుఁ జనుచుండె వ్యాకులత్వమున.
అవి ముందుఁ జనలేక యవనిపై సోలి
వెనుకకు వీక్షించు, వికలతఁ బొంది
రామవియోగదుర్భరదుఃఖవశత;
జానకీ రామలక్ష్మణులపే రెవ్వ
రేని యె త్తినఁ జాలు, హేషల నిడుచు,
నవి వారివైపున కనుర క్తిఁ జూచు.
ఆ తురంగము లొందినట్టి శ్రీరామ
విరహవేదనఁ దెల్ప వీ లెట్లు లగును?
మణులఁ బాసిన ఫణుల్ మది గుందునటుల
అవి, వ్యాకులత నొందె ననఘా! మునీంద్ర!
ఆ సుమంత్రుని దుఃఖ, మా యశ్వఘోష
మరయుచు నా గుహుం డతిఖేద మొంది,
సుభటుల నల్వుఱఁ జూచి పంపించె
నల రథసారథి యగు మంత్రితోడ.
అట్లు రథంబుపై నరుగుచున్నట్టి
మంత్రిని జూచుచు మఱలె గుహుండు;
వానిలోనివియోగబాధ నెన్నంగ
మాటలు చాలవు మానివరేణ్య!
ఆ యయోధ్యాపురికరుగునిషాదు
లతివిషాద నిమగ్న లై రనుక్షణము.
ఆ సుమంత్రుడు మహావ్యాకులుం డగుచు
విలపింపఁదొడఁగె నీ విధముగా నపుడు:
"రామవిహీన మాబ్రదుకు హేయంబు!
ఈ తుచ్ఛదేహ మిం కెట్లైన మనదు;
కాని, రాఘవవియోగంబు ఘటిల్లి
నప్పుడే యిది నాశ మంది యశంబుఁ
గాంచఁ గల్గిన భాగ్యగరిమ లే దయ్యె.
బ్రదుకెల్ల హా! పాపభాజనం బగుచు
నపకీర్తి నొందె; నీ యసువు లీతనువు
నెందుకు వీడవో? ఎఱుఁగ లే నైతి.
క్షితిని నీ దారాభాగ్యజీవి కోల్పోయె
నక్కట! సముచితం బగుసమయంబు;
నా గుండె యిపు డైన నడిమికి రెండు
వ్రయ్యలు గా దేమి పాపమో గాని?"
అని యిట్లు వచియించు చా సుమంత్రుండు
కుమిలి చేతుల నుల్బుకొనుచు, శిరంబు
పై మోదుకొనుచును బరితాప మొందె—
పృథునిధిఁ బాసినకృషణుని వోలె.
అవని నే వీరుండ నని చెప్పుకొనియు
యుద్ధరంగంబునందుండి ప్రాణాశఁ
బాఱివచ్చినమహాభటునిరీతిగను,
విమలవివేకియు వేదవిదుండు
సాధువు సుజనుండు సత్కులీనుండు
నగుబ్రాహ్మణుఁడు భ్రాంతినందినకతన
మద్యపానముఁ జేసి మతి వగనొందు
పగిది, సుమంత్రుండు పరితాప మొందె.
సాధ్వి వివేకిని సత్కులజాత
త్రికరణంబులఁ బతిం దేవుఁగాఁ గొల్చు
వరపతివ్రత కర్మవశమునఁ దాను
పతిఁ బాసి సంతాపపడెడిచందమున
నా మంత్రివరుఁడు నిజాంతరంగమున
దారుణదుఃఖసంతాపంబు నొందె.
అశ్రుసంభరితంబు లై వానికనులు
అంధునికనులయ ట్లగపడవయ్యె;
చెవులును వినరావు చెవిటికి వోలె;
ఆతనిమానసమంతయుఁ జెదరె;
ఆతనిపెదవులు నారిపోయినవి;
నాలుక యెండియు నలుపెక్కెఁ; గాని,—
పదునాలుగేండ్లకు వచ్చు శ్రీరాముఁ—
డనునాశ యొకదృఢ మైనకవాట
మై యడ్డునిలుచుట నాత్మలోనుండి
ఆతనిప్రాణంబు లరుగక నిలిచె.

తలిదండ్రులను హత్యసలిపినవాని
పగిదిగా నతఁడు వివర్ణుఁ డైపోయె.
ఆ రామవిరహ మహోగ్లానివలన
అతనిలో భూరినిరాశ వ్యాపించె.
అతఁడు కన్పట్టెను యమలోకమునకుఁ
జనుచు మార్గంబున సంతాపపడెడి
పాపిచందంబున; పాప మాతండు
వాక్కులు స్తంభింపఁ బలుకఁగా లేక
తనలోనె తాను సంతాపించె నిట్లు:
"ఏ నయోధ్యకుఁ జేరి యేమి వీక్షింతు?
రాఘవరహిత మారథమును గాంచి
వీనిమోమును జూడ వెఱతురు జనులు.
వ్యాకులచిత్తు లౌ పౌరులందఱును
నచ్చి విశేషముల్ ప్రశ్నింపనేను
పృథువజ్రఘాతనిర్భిన్నహృదుండ
నగుచు సమాధాన మహ! చెప్పవలయు.
ఆ దీనదుఃఖిత లగుమాత లెల్ల
అడిగినచో దైవమా; ఏమి చెపుదు?
ఆ లక్ష్మణునిమాత అడిగిన యప్పు
డే నేమి శుభవార్త లెఱిఁగింపఁగలను?
కడు లేఁగదూడను గన మఱు లెత్తి
పరుఁగిడివచ్చెడి వరధేనువటుల
నరుదెంచి న న్వార్త లడుగఁ గౌసల్య,
'జానకీరామలక్ష్మణులను నేను
వనగర్భములలోన వదలితి,' ననెడి
వార్తయే గద! చెప్పవలసినవార్త!
ఈ శుభవార్త నే యెవరడిగినను,
జెప్పఁగావలయు నేఁ జేరి పురంబు.
అదిగాక దుఃఖదైన్యాయత్తచిత్తుఁ
డా రఘురామచంద్రైకజీవనుఁడు
నృపతి న న్గాంచి ప్రశ్నించినయప్పు
డే నేముఖంబుతో, పృథ్వీతలేంద్ర!
అడవిలో వారల హాయిగా వదలి
వచ్చినాఁడ' నటంచు– బదులాడఁగలను?
జానకీరామలక్ష్మణులనుగూర్చి
విన్నతత్ క్షణమందె విడుచుఁ బ్రాణములు
నరనాయకుండు తృణప్రాయముగను.
అమితప్రియుఁడు రాముఁ డనెడిజలంబుఁ
బాసియు నాదు హృత్పంకిలభూమి
బీటలు బీట లై ప్రీలిపో దకట!
పరికింప విధి నాకుఁ బ్రదికియున్నపుడె
*యాతనాతను' విచ్చినట్టులు తోఁచు.
మార్గమం దిటులు సుమంత్రుండు మిగులఁ
వ్యాకులపడుచుండ సరదంబు చేరెఁ
దమసాతరంగిణీతటమున; కంత
నాతఁడు కడువినయంబు వెలుంగ
ఆ నిషాదుల స్వగృహంబుల కేఁగుఁ
డన, వార లాతనియడుగుల వ్రాలి,
సంతాప సంకులస్వాంతు లై చనిరి.
గురుని భూసురు గంగగోవును హత్య
సలిపినదుర్మార్గుచంద మా మంత్రి
నగరప్రవేశం బొనర్ప శంకించి,
ఒక చెట్టుక్రిందఁ గూర్చుండి యెల్లిట్లో
ప్రొద్దుపుచ్చగను సూర్యుం డస్తమించె.
చీఁకటి పడినంత చిన్నఁగా మంత్రి
నగరప్రవేశం బొనర్చి, తద్రాజ
సౌధసింహద్వారసన్నిధియందు
రథ మాపి యంతఃపురంబునఁ జొచ్చె.
ఈ వార్త వినినవా రెల్ల రా రథము
నరయఁగా రాజసింహద్వారసీమ

---

* నరకశిక్ష విధింపబడిన పాపజీవులకు నరకబాధానుభూతికై యాతనాశరీర మను ఒక సూక్ష్మదేహ మివ్వబడు నని శాస్త్రములలోఁ జెప్పఁబడినది. శిక్షావిమోచన మగువఱకు నానాబాధలకు గురియైనను ఆశరీరము భంగముగాదట.

యందున మూఁగి రత్యాత్రంబు గదుర.
అరదంబు గ్రహియించి, యర్కాతపమునఁ
గఱఁగెడు వడగండ్లకరణిఁ గృశించు
తనువులు గలిగి సంతపియించుచున్న
అశ్వంబులను గాంచి, అటఁ గూడినట్టి
స్త్రీపురుషులు మహార్తినిగాంచి రెదల
జలబహిర్గతజలచరములువోలె.
ఆ సుమంత్రునిరాక నాలించినంత
అంతఃపురస్త్రీజనావళి యెల్ల,
కళవళపడియెను; కనఁగ నా నగరి
భయద మా ప్రేతనివాసమ ట్లుండె.
అత్యార్తి గదురఁగా నట రాణు లెల్లఁ
బ్రశ్నించి రాతనిఁ; బొప మా మంత్రి
బదు లొక్కమాటయుఁ బలుకలేఁ డయ్యె
గద్గదికం బయి గళ మెండిపోవ.
కర్ణముల్ వినలేవు, కనలేవు కన్ను,
లెదు రైనవారల నెల్ల నాతండు,
"రాజుగా రెచ్చట? రాజుగా రెచ్చ"
టని యడిగెను; వానివ్యాకుల మరసి
దాసీజనంబు లాతనిఁ గొని చనిరి
కౌసల్యావసియించు ఘనసౌధమునకు.
అట సుమంత్రుఁడు గాంచె నమృతవిహీన
చంద్రునివలెఁ బ్రకాశంబును వీడి
వెలవెలఁబోవు పృథ్వీనాథమణిని.
ఆసనశయన భూషాదివిహీనుఁ
డగు చానరేశ్వరుం డతిదీనవృత్తిఁ
బడియుండె నేలపైఁ; బొప మాతండు
స్వర్గమందుండియు క్రొన్నగలిఁగూలి
వ్రాలియున్న యయాతిపగిది, నిట్టూర్చి
పరితాపపడుచుండె బహువిధంబులను;
కాలఁగా లొక్క లాకాశమందుండి
భూతలిఁ బడిన సంపాతిరీతిగను
ఘోరశోకముతోడఁ గుములుచు సతము
పడియుండె నా ధరాపతి నేలపైన.
హా రామ! హా రామ! అని యొకసారి,
హా రామ! హా లక్ష్మణా! హా మహీజ!
అనియు నింకొకసారి, ఆ మహోత్కృష్ట
రామానురాగి యాక్రందించుచుండె.

కౌసల్య గృహమునందు శ్రీరామవియోగ
దుఃఖితుఁ డైయున్న దశరథుని
సుమంత్రుఁడు చూచుట

అంత నా మంత్రి, "మహారాజ! జయము
శ్రీమత్ప్రభూ! చిరంజీవ," యటంచు
సాష్టాంగపడి నమస్కారం బొనరెచ్చె.
ఆ మాట వినినంత నా దశరథుఁడు
వ్యాకులంబున లేచి పలికె, "సుమంత్ర!
ఎచట నా శ్రీరాముఁ డెట నుండె?" ననుచు.
భువి నీటఁబడి మున్గిపోనున్న మర్త్యుఁ
డాధార మే దేని అగపడినంత
పట్టుకొన్నట్టు లా పార్థివేశ్వరుఁడు
గుండెకు హత్తించుకొనె నా సుమంత్రు.
ఆ మహీవిభుఁడు స్నేహంబు దీపింపఁ
గూర్చుండగాఁజేసికొని తనప్రక్క
జలకణభరితలోచనములతోడఁ
బలికె నీ రీతిగాఁ బరితాపపడుచు:
"రఘురామకుశలవార్తను దెల్పుమోయి!
సఖ! రామలక్ష్మణజనకజ లేరి?
వారిని దెచ్చినావా? లేక వారి
నడవిలో డించి నీ వరుదెంచినావ?"
అనుమాటలను వినినంత సుమంత్రు
కనులలో బాష్పోదకంబులు నిండె.
అతిశోకవికలుఁ డై అవనీశ్వరుండు,-
జానకీరామలక్ష్మణులనుగూర్చి

మఱలఁ బ్రశ్నించె నా మంత్రిపుంగవుని.
శ్రీరామగుణరూపశీలస్వభావ
ములు మాటిమాటికి భూనాయకుండు
స్మరియించుకొని తనస్వాంతంబులోవఁ
బలవింపసాగె నీ పగిది మునీంద్ర!
"అభిషేక మొనరింతు నని ప్రకటించి
హా! రాము వని కేఁగు మని యాజ్ఞ నిడితి.
కాని, మా రాముఁడు కాసంత యేని
హర్షవిషాదంబు లందలే దహహా!
ఇట్టికుమారుని నెడబాసికూఁత
ప్రాణముల్ పాయక బ్రతికియున్నాఁడ,
నిటువంటిపాపి మ మొవ్వాఁ డున్నాఁడు?
జానకీరామలక్ష్మణులు వసించు
తావున కిదె నన్నుఁ ద్వరఁ గొనిపొమ్ము.
కానిచో, ఓయి సఖా! యథార్థముగ
నిపుడె నా ప్రాణంబు లెగిరిపోఁగలవు."
ఇట్లు చింతించి భూమీశ్వరుం డంత
మాటిమాటికిని సుమంత్రు నర్థించె:
"నా ప్రాణతుల్యు లౌ నాముద్దుసుతుల
క్షేమవిశేషముల్ చెప్పుమా నాకు;
జానకీరామలక్ష్మణుల సత్వరము
నా కండ్లతోడఁ గనన్గలమార్గ"
మేదేని చూడు మోయీ! సఖా అనుచు.

రామవియోగార్తుఁ డగు దశరథునిగూర్చి
సుమంత్రుఁడు దుఃఖోపశమనోక్తులు పలుకుట

అపుడు సుమంత్రిధైర్యముఁ గూర్చుకొనియు
మెల్లగా నిట్లనె, "మేదినీనాథ!
పండితమణివి, దివ్యజ్ఞాని వీవు;
మతియు, ధీరుండవు, మహితధీరుఁడవు;
సాధుసజ్జనసేవ సత మొనరించి
నట్టిధన్యుఁడవు కాదా! నీవు దేవ!
భువి జన్మమృత్యువుల్, మోదఖేదములు,
లాభనష్టంబులు, లలితసద్విహిత
యోగవియోగంబు, లో మహారాజ!
కలుగుచుండును గాలకర్మానుసరణి
నిల దివారాత్రంబు లే తెంచునట్లు.
సుఖములు కల్గినచో సంతసిలుట,
దుఃఖముల్ కల్గిన దురపిల్లుచుంట,
అజ్ఞులపద్ధతి; అటుగాక రెంట
పండితుల్ సమదృష్టి వహియింత్రు గాన,
సమ్యగ్విచారణ సలిపి నీ విపుడు
ధైర్యంబుఁ బూను మెదన్, జగద్విహిత!

సుమంత్రుఁడు దశరథునితో శ్రీరామవన
ప్రయాణవృత్తాంతంబుఁ జెప్పుట

మొదటిదినంబున భూపాల! వారు
తమసాతరంగిణీతటమున నాగి,
ఆ మఱునాఁడు వా రమరప్రవాహ
దివ్యతీరంబున దిగి నిల్చినారు.
జానకీరామలక్ష్మణు లా దినంబు
స్నానంబుఁ గావించి జలములఁ గొనియు
ఉపవాస మొనరించి రో నరనాథ!
అంత నిషాదనాయకుఁ డైన గుహుఁడు
వచ్చి వారల మహాభక్తి సేవించె.
ఆ రాత్రి అట శృంగిబేరపురంబు
చెంత వా రెల్ల విశ్రాంతిఁ గైకొనిరి.
మఱునాఁడు ప్రొద్దున మజ్జిపాల్గొనియు
శ్రీరామలక్ష్మణుల్ శీర్షంబులందుఁ
దతజటామకుటముల్ ధరియించుకొనిరి.
అంత రామునిసఖుం డౌ గుహుఁ డొక్క-
నావఁ దెప్పింప నా నావలో ముందు
సీతను గూర్చుండఁ జేసి, యా పిదప
శ్రీరాముఁడును సీతచెంతఁ గూర్చుండె.

సౌమిత్రి యంతట శరచాపములను
భద్రంబుగా నావపైఁ జేర్చి, ప్రభుని
యాజ్ఞఁ గైకొని, తాను నం దెక్కెఁ; నపుడు-
అస్మదీయం బగువ్యాకులం బరసి,
రఘువీరుఁ డాత్మ ధైర్యము సమకూర్చి
మృదుమధురో క్తుల నిట్లు వచించె:
"మత్రృణామంబులు మత్పితృపాదు
కందఁ జేయవె తాత! యతిభ క్తి గదుర
నాకుఁ గా నీవు మా నాయనగారి
కోమలాంఘ్రులఁ బట్టుకొని పలుసార్లు
వారిపాదంబులపై వ్రాలి, పిదప
విన్నవింపుము నాదువిజ్ఞ ప్తి నిట్లు-
'జనక! నాకొఱకు విచారింపవలదు.
త్వత్కృపచేతను ద్వదనుగ్రహమున
ద్వత్పుణ్యమహిమచే ధారుణీస్థలిని
నా వనయాత్రయు నా వనవాస
మానందశుభమయంబై వెలుఁగొందు.
భవదనుగ్రహమున వనమార్గమందు
సకలసౌఖ్యంబులు సమకూరు నాకు.
నీ యాజ్ఞఁ బాలించి నేఁ గుశలముగఁ
దిరిగి యే తెంచి, నీ దివ్యపాదములు
దర్శించువాఁడఁ బితా! మహితాత్మ'.
ఈ రీతిఁ బలికియు శ్రీరామవిభుఁడు
తిరిగి నాతో నిట్లు తెలిపె రాజేంద్ర!
'మా జనయిత్రులమహితపాదముల
బలుసార్లు వ్రాలియుఁ బరితోషపరుపు
మె ల్లనఁ గోసలాధీశుండు కుశలుఁ
డగునట్లు గనుము మత్ప్రార్థనల్ తెలిపి.
మఱియు నా గురుదేవు మంగళాంఘ్రులకు
నాకుమాఱుగను బునఃపునఃప్రణతు
లొనరించి భ క్తితో, "ఓ గురుదేవ!
మాకొఱ కావంత మా తండ్రిగారు
వ్యాకుల మొందనిపగిదిగాఁ గరుణ
సముచితబోధల సలుపఁ బ్రార్థింతు."—
అని విన్నపము చేయు మనియె రాఘవుఁడు.
మఱియు, న న్గాంచి యీ మాటలు పలికెఁ:
"పురజనపరిజనంబుల నెల్లఁ బిలిచి
వినిపింపుమా నాదువిన్నపం-" బెవఁడు
మనుజేశు కనువుగా మసలఁగాఁ గలఁడో-
ఆతఁడే హితుఁడు నా కన్నివిధాల.
భరతుఁ డే తెంచిన, వానితోఁ దాత!
తెలుపుమీ, నాదు సందేశమిూరీతి:
"రాజ్యాధికారంబు గ్రహియించినంత
ధర్మ మేనాఁడును ద్యజియింపఁవలదు.
త్రికరణశుద్ధిగాఁ బ్రేమ వెలుంగఁ
బ్రజలఁ బాలింపుమా! భరతకుమార!
తల్లుల నందఱఁదగ సమదృష్టి
గాంచి సేవింపుమా, కడుభ క్తితోడ
జననీజనకులను స్వజనసంఘముల
సోదరా! కొలిచి నీసోదరత్వమును
వెలయింపవోయి! జీవిత ముండుదాక.
మఱి యొక్క ముఖ్య మీమాటఁ జెప్పెదను:
నాకొఱ కెన్నఁడు నాయనగారు
చీమంత దుఃఖంబుఁ జెందని రీతి.
అఖిలవిధంబుల యత్నింపవలయు.
అన, రాజ! ఈ సమయమున లక్ష్మణుఁడు
కఠినంబు లైనవాక్యంబులు పలుక,
వారించి శ్రీరామభద్రుండు, తాత!
సౌమిత్రి పల్కిన శైశవోక్తులను
బ్రకటింపవలదని పలుసార్లు- నన్నుఁ
దనపైన నొట్టిడి తగ వేడుకొనియె-
సీతమ్మ ప్రణతులు చేసి తా నేదో
తెలుపఁగా బెదవులు తెఱచెను- కాని
అనురాగవివశాత్మయయ్యె నా సాధ్వి;

ఆ మెకంఠము రుద్ధ మయ్యెఁ గన్గొసలు;
నశ్రులతో నిండె; నల తనూలతిక
పులకప్రఫుల్లితముగ వెలుగొందె
అత్తఱి నావికుం, డా రఘువరుఁడు
సలిపినసూచన స్వాంతమం దెఱిఁగి
పడవను నడిపె నావలి తీరమునకు
ఓ మహారాజ! నే నొడ్డుననుండి
బరు వగుగుండెతోఁ బరికించుచుండ
ని ట్లారఘూద్వహుం డెడమయిపోయె.
నా వ్యథ నెట్లు వర్ణన సేయఁగలను?
చావక శ్రీరామసందేశ మెసఁగ
మఱలివచ్చితి నిట్లు మానవనాథ!"
అని పల్కుచున్నంత ఆ మంత్రివరుని
గళము స్తంభించె వాక్యము లాగిపోయె
రామవియోగదుర్వారదుఃఖమున.
ఆ సూతవచనంబు లాలించినంత
దారుణశోకదందహ్యమానాత్ముఁ డగుచు
ధరణిపైఁ గూలె నా దశరథేశ్వరుఁడు.
అమితానురాగవశాత్ముఁ డై అతఁడు
తొలకరివానల మలినజలంబుఁ
ద్రావి తపించు మత్స్యంబువిధానఁ
వికలత నొందుచు విలవిలలాడె.
ఏడ్వసాగిరి రాణు లెల్ల ఱెల్లెత్తి;
వారి విపద్దశన్ వర్ణింపఁ దరమె?
ఆ మహారాణులయాక్రందనంబు
విని దుఃఖదేవత పెనుదుఃఖ మొందె;
ధైర్యంబు సైత మధైర్యంబుఁ జెందె.
రాజసౌధాంతరాక్రందనధ్వాన
మాకర్ణితం బయినంత, నయోధ్య
యందునఁ గలకలం బావిర్భవించె-
అర్ధరాత్రమున విహంగసంఘములు
వసియించుతావున భయద మానొక్క-

పిడుగు పడ్డవిధాన, విమలమునీంద్ర!
ఊర్ధ్వేంద్రుప్రాణవాయువు లంత గంత
గతము లయ్యె నతండు గతమణియైన
వ్యాళంబువలె మహావ్యాకుల మొందె.
జలము లెండినతఱి, సరసిఁ బద్మముల
సరణి, నా కౌసల్యానాథుసర్వేంద్రియములు
వికలంబు లయ్యె; నవ్విధ మెల్లఁ గాంచి
ఇల రవికులరవి యిక నస్తమించు
నని కోసలాత్మజ ఆత్మ గ్రహించె.
ఆ రామమాత ధైర్యముఁ గూర్చుకొనియు
సమయానుకూలవచస్సులు దనరఁ
బలికె నీ రీతిగాఁ బతినివీక్షించి:

కౌసల్య దశరథునితో ధైర్యవాక్యములు పల్కుట

"ప్రాణేశ! తగువిచారణ సల్పికనుఁడు
రామవియోగపారావారమందు
చనుచున్ననావ యీ సాకేతపురము;
భవదీయజను లిందుఁ బయనించుజనులు;
కర్ణధారుఁడ వీవు; కావున నీవు
ధైర్యంబు విడువక తాల్మి బూనిననె
తీరంబు మన మెల్లఁ జేరుట జరుగు.
కానిచో సర్వు లకాండవారాసి
మునుఁగుట జరుగును; ముప్పు ఘటించు.
నా విన్నపముఁ బ్రాణనాథ! మీ రాత్మ
గ్రహియించి ధృతిఁబూనఁగల్గుదురేని
దప్పక మనకు సీతారామలక్ష్మ
ణుల పునర్దర్శనానూనభాగ్యంబు
ప్రాప్తింపఁగలదు మత్ప్రాణేశ! వినుము."
ఇ ట్లాడుప్రియురాలిమృదులవాక్యముల
నాలించి నరపతి యిట్లులవిప్పె—
చల్లనినీరు పైఁజల్లినయంతఁ

దపియించుచున్నమత్స్యము తేరినట్లు.
ఇ ట్లానృపాలుఁ డొక్కింత తాఁ దేరి
లేచి కూర్చుండి, యీ రీతి వాపోయె:
"ఓ సుమంత్రా! చెప్పుమోయి సత్వరము
కారుణ్యావనధి నా కాకుత్థ్సుఁ డేడి?
నా లక్ష్మణుం డేడి? నా రాముఁడేడి?
నా తల్లి నా సీత నా కోడ లేది?"
వికలుఁ డై నట్టి ఆ పృథ్వీశ్వరుండు—
పలుపలువిధముల వాపోయె నిటులు.
ఆ రాత్రి ఒక యుగ మయ్యె నాతనికి;
ఆ దీర్ఘ రాత్రి కంత్యము లేనియట్లు
తోఁచె నాధారుణీంద్రునకు మునీంద్ర!
అతనిమనోవీథియందునఁ దోఁచె

నంధతపస్విశాపాలాప; మతఁడు
వినిచెఁ గౌసల్యకావృత్తాంత మెల్ల.
పూర్వేతిహాస మా భూనాయకుండు
వచియించి యిట్లు సంవ్యాకులుం డయ్యె:
"శ్రీరామవిరహితజీవనవాంఛ
ఛీ! ఛీ! నిజంబుగా సిగ్గుచే టగును.
వసుధ నా హృద్వాంఛ ఫలియింపనప్పు
డీ తను వుండి యిం కేమి లాభంబు?
ఓ రఘునందనా! ఓప్రాణతుల్య!
ఛీ! నేను నిను వీడి జీవించినాఁడ
నిన్నిదినంబు లే నెంత హీనుఁడను?
హా జానకీ! లక్ష్మణా! రఘునాథ!
హా పితృహృచ్చాతకానందజలద!"
అని దశరథనృపుఁ డా రామవిరహ
సంతాపకీలికాసంత ప్తుఁ డగుచు,
'రామ! రామా! రామ! రామ! శ్రీరామ!
రామా!' యటంచుఁ దాఁ బ్రాణముల్ వదలి
అమరలోకంబున కరిగె మునీంద్ర!

అంధతపస్విశాపమును దశరథుఁడు కౌస
ల్యకుఁ జెప్పి రాముని స్మరించుచు స్వర్గము
నలంకరించుట

శ్రీరామచరితమానసము

అయోధ్యాకాండము

ఏకాదశవిశ్రామము

భక్తాభీష్టఫలప్రదఃి
నక్తంచరగర్వభంగఃి నవజలదాంగాఃి
ముక్తి శ్రీసంధాయకఃి
భక్తిప్రియఃి మట్టపల్లివాసఃి నృసింహాఃి

దశరథధారుణీధవుఁ డొందె జనన
మరణసాఫల్యంబు మహితరీతిగను.
ఆతని నిర్మల యశము వ్యాపించె
నఖిలబ్రహ్మాండంబులందు ముసీంద్ర!
బ్రదికిననాళ్ళుఁ దత్పార్థివోత్తముఁడు
రామచంద్రునిముఖరాజంబుఁ గాంచె;
రామవియోగంబు బ్రాప్తించినంతఁ
దనువును విడచియు ధన్యతఁ గాంచె.
అపుడు మహారాణు లందఱుఁగూడ,
దుఃఖైకల్యంబుతోడఁ దన్నృపుని
సౌందర్యసౌశీల్య, శౌర్యతేజములఁ
బ్రస్తుతించిరి; నేలపైఁ దొర్లుకొనుచు
వివిధరీతుల విలాపించి రెల్లెత్తి.
దాసదాసీజనతతి విలపించె.
వ్యాకుల మొప్పఁగాఁ బట్టణమందుఁ
బ్రతిగృహంబున శోకరవళియే నిండె.
"నిఖిలసద్గుణరూపనిధి, ధర్మపూర్ణుఁ
డగుసూర్యకులసూర్యుఁ డహ! అస్తమించె."-
నని దుఃఖమందుచు నందఱుఁగూడ

అఖిలజగన్నేత్రహారిణి యైన
కైకను దిట్టి రనేకవిధాల.
ఇట్లల్ల రారాత్రి యెల్ల శోకించి;
రంతటఁ దెలవాఱె; నరుదెంచి రటకు
అఖిల సుజ్ఞానమహాముసిజనులు.
అంత వసిష్ఠమహాముసివాళి
సమయోచితంబుగాఁ జరిత లెన్నెన్నో
తెలిపి వారలశోక తిమిరంబుఁ బాపె
నాత్మవిజ్ఞానమహాప్రకాశమున;

దశరథకళేబరమును తైలద్రోణియందు
భద్రపఱచుట

పిదపఁ దైలద్రోణిఁ బృథ్వీంద్రుతనువు
భద్రంబుఁ జేయ నేర్పాటుఁ గావించి
భటులను రావించి పలికె నీ రీతి:
"త్వర నేగుఁడీ మీరు భరతునిచెంత
కెక్కడ నేనియు నెవరితో నేని
నృపుమరణంబు మీ రెఱిఁగింపఁ జనదు.
ఇదె మీ సహోదరు లిద్దఱుఁగూడ
సాకేతనగరికి సత్వరం బొప్ప
నేతేర గురుఁడంపె నిటకు మ మ్మనుచు
మాత్రమే, తెలుపుఁ, డే మాటలు వలదు."
అను మునియాజ్ఞను వినినంత భటులు
వెడలి రత్యంత మహావేగ మొప్పార

ను త్తమాశ్వము లె సిద్ధొందుచందమున.
అయ్యయోధ్యాపురమం దనర్థములు
ఘటియించినది మొదల్ కడుపీడకలలు
భరతుఁ డొందుచునుండె; బ్రతిరాత్రి యతఁడు
భయదంబు లైనదుస్స్వప్నముల్ కనియు
మేల్కాంచి మదిలోన మిగులఁ జింతించుఁ
గట! ఏ యరిష్టముల్ కలుగునో? యనుచు.
ప్రతిదిన మాతఁడు బ్రాహ్మణావళికి
భోజనదానాది పుణ్యకార్యముల
ఘనతరసంతృప్తి గలిగించుచుండె;
నానావిధానార్చనంబులతోడఁ
జేయుచుండె శివాభిషేకకార్యంబు;
మఱియు, నా భరతుండు మానితభక్తి
హృదయపద్మమున మహేశు ధ్యానించి
జననీజనకపరిజనసోదరులకు
భద్రంబుఁ గూర్పఁగాఁ బ్రార్థన సల్పె.
భరతుఁ డీ రీతిగా వ్యాకులుఁ డగుచుఁ
గాల మెట్టెట్టులో గడుపుచునుండ
సాకేతదూతలు చనుదెంచి రటకు.
ఆచార్యశాసన మాలించినంత
గణపతిస్మరణంబుఁ గావించి వెడలె
భరతుం డయోధ్యకుఁ ద్వరిత మొప్పార.

భరతాగమనము

హయములఁ దోలించు చనిలవేగమున
భరతుండు పయనించె, భయతరాగాథ
వరనదీనదనగవనుల దాఁటుచును.
ఆతనియెడద శోకాకులం బౌట
ఏదియు ఆతని కింపు గాకుండె.
ఎగిరి పోఁగలిగిన యెడలబాగుండు
నని ఆతఁ డాత్రంబు నాత్మలోఁ జెందె;
ఒకక్షణం బాతని కొకయుగంబయ్యె
భరతుఁడు పురసమీపముఁ జేరెనిట్లు:
నగరప్రవేశం బొనర్చెడితఱిని
దుశ్శకునంబులు తోఁచె నాతనికి;
అశుభస్థలంబులయందు గాకములు
కర్ణకఠోరంబుగాఁ గూయఁదొడఁగె;
ఖరస్మగాలము లమంగళరీతి నఱచె;
హృదయశూలంబులై యివి యెల్లఁ దోఁచెఁ
భరతున కో భరద్వాజమునీంద్ర!
వరసరోవరసరిద్వర్గముల్ తోఁచె
వెలవెలఁ బోవుచు విడనాడికళల;
నగరముండెను భయానక మాచు మిగుల;
రామవియోగదుర్వారరోగమునఁ
బీడింపఁబడుచుఁ గాన్పించె దీనముగ
ఖగమృగగజహయగణ మెల్లఁ; నప్పు
డపహృతసర్వస్వు లైనచందముగ
వగ మున్గియుండిరి పౌరులందఱును.
భరతుని గలిసినపౌరజనంబు
మాటాడకుండ నమస్కృతుల్ సలిపి
తమతమదారిని దా మేఁగి; రపుడు
భరతుఁడు సైతము భయవిషా దాత్మఁ
డౌట వారలక్షేమ మడుగలే దయ్యె.
రాజవీథులను మార్గంబులఁ జూడ
నాలుగువైపుల నగరమంతటను
కార్చిచ్చు గ్రమ్మినకై వడి నుండె.
రవికులజలరుహ రాజసమాన
యైనకై కేయి నిజాత్మజురాక
నాలించి మిక్కిలిహర్షంబు నొందె;
హారతుల్ గైకొని ఆమె యంతటను
సత్వరంబుగ లేచి సంతోష మొప్ప
భరతున కెదురేఁగి ద్వారంబుకడకు
నిజమందిరంబులోనికిఁ గొనితెచ్చె.
మంచుసోఁకుటచేత మహి వాడి యున్న

వనజవనం బటు బాంధవజనము
లతిశోకపీడితు లై యుంట, భరతు
డాశ్చర్యచకితుఁ డై యరసెఁ; గై కేయి
మాత్రము సంతోషమానస యగుచు
వని కగ్ని ముట్టించి, పరితోష మొందు
ఒక కిరాతకివలె నుండె మునీంద్ర!
అంతఁ గేకయపుత్రి, ఆత్మీయపుత్రుఁ
డటు విచారగ్రస్తుఁ డై యుంటఁ జూచి
"అట నాదుపుట్టింట నందఱుఁగూడ
క్షేమమేగద! సుతా! చెప్ప" మనంగ
భరతుఁ, డందఱిక్షేమవా ర్తలుఁ దెలిపి,
తనకులకుశలముల్ తల్లి నీ రీతిఁ
బ్రశ్నించె నాత్ర మొప్పంగ స్వాంతమున:—
"ఎట నుండె మా తండ్రి? యెట నుండ్రి తల్లు?
లెట నుండె సీతమ్మ? యెటఁ బ్రియానుజులు?
ఎట రామలక్ష్మణు? లెఱిఁగింపు జనని!"
అను స్నేహమయము లై నట్టికుమారు
వాక్యంబు లాలించి పాపిష్ఠ కై క
మొసలికన్నీళ్ళ కన్గొసలఁ గార్చుచును
భరతుని కర్ణహృద్వారిజంబులకు
పటుశూలములవంటి వాక్యముల్ పలికెఁ:
"సర్వంబు నా తండ్రి! సమకూర్చి యుంటి—
పాప మా మంథర పరమా ప్తురాలు—
కుడిభుజమట్లు నాకు న్దోడుపడియె.
అంతయు సంసిద్ధ మయ్యెను గాని
రవ్వంతలోనఁ గార్యము విధి చెఱచెఁ:
భూపతి సురపతిపురికి గమించె."
అనువాక్యములు వినినంత నా భరతుఁ
డతిశోకవశుఁ డయ్యె— హరిగర్జనంబు
కర్ణముల్ సోకినకరి విధానమున.
"హా తండ్రి! హా తండ్రి! హా ప్రియజనక!"
అని దుఃఖపఁ చాతఁ డవనిపైఁ గూలె
వ్యాకులభాగసంభరితాత్ముఁ డగుచు.
"అక్కటా! జనక! మి మ్మంత్యకాలమున
దర్శించుభాగ్యము తరు గయ్యె నాకు;
కానిచో నన్ను రాఘవునకు మీర
లప్పగించెడివారె యతికృపతోడ.

భరతుఁడు కైకేయిని బిత్రుమరణ
కారణం బడుగుట

అని కొంతవడి ఖేదమంది, యా భరతుఁ
డాత్మలో నెటులో ధైర్యముఁ బొందిలేచి,
కేకయపుత్రి, నీక్షించి, ఓ తల్లి!
రాజేంద్రు మరణకారణ మేమి?- అనఁగ
ఆత్మజువాక్యంబు లాలించి కైక,
ఆయువుపట్టు దా నసితోడఁ గోసి
విషముఁ గూర్చినగీతి విషయముల్ తెలిపె.
ఆ మహాకర్కశి యమితకౌటిల్య
సంతోష మొప్పగా స్వాంతరంగమునఁ
దాను గావించినతత్కార్య మెల్లఁ
జెప్పెను బూసగుచ్చినచందముగను.

శ్రీరామవనవాసవార్త విని భరతుఁడు
మూర్చిల్లుట

భరతుఁ డంతట రామవనగమనంబు
విన్నంత మఱి చెను బిత్రుమరణంబు.
ఈ యనర్థంబుల కెల్లఁ గారణము
తానే యటంచును దలఁచి యాతండు
మౌనముద్ర వహించి మాటాడలేక
మూర్చిల్లె ధరణిపై మునిలోకనాథ!
సుతుఁ డిట్లు వైకల్యమతినుంటఁ జూచి
వ్రణముపై నుప్పను బట్టించినట్లు
అనుననయోక్తులఁ బల్కె నా కైక యిట్లు:
"సుత! ధరావిభునకై శోకింపజనదు;
ఘనపుణ్యకీర్తులఁ గనుటయే గాక

ఆయన సకలభోగావళిఁ బొందె.
ఆత్మీయజీవితమం దా ఘనుండు
సకలమానవజన్మసాఫల్య మంది
అంతమందునఁ జేరె నమరేంద్రపురము.
ఈ విషయంబుల నెల్ల గ్రహించి
స్వాంతంబులోని విచారంబు మాని,
మహీ నేలు మోయి సమాజయుక్తముగ."
అనుమాటలను విని, యా రాజసుతుఁడు
పుండున కగ్నిని ముట్టించినటుల
అత్యంత మగుబాధ నందె స్వాంతమున.
పిదప నాతఁడు ధైర్య మెదఁ గూర్చుకొనియు
నిట్టూర్పు విడిచి ఈ నియతి వచించె:

భరతుఁడు కైకపై గోపించి నిందించుట

పాపాత్మురాల! మా వంశమంతయును
నాశనం బొనరించి నా వక్ష టకట!
ఇట్టి పాపఁపుబుద్ధి యెద నున్ననీకు
పుట్టిననాఁడె నన్ బొలియింప వేల?
చెట్టును నరకివేసియు ఆకుపైన
నీరును బోసెడి నియతిఁ జేసితివి;
చేపను బ్రదికింపఁ జింతఁగావించి
చెఱువు నెండించెడి చెనటివి నీవు.
అహా! వంశమా! మాది హంసవంశంబు!
తండ్రియా! దశరథధారుణీశ్వరుఁడు!
అన్నయా! శ్రీరామునంతటివాఁడు!
తమ్ములా! సద్గుణధాము, లెన్నంగ!
అట్టి నాకుం దల్లివై తివీ వకట!
విధికృతం బెవరు తప్పించుకోఁ గలరు?
పాపాత్మురాల! ఈ పాడుతలంపు
కలిగినయట్టిక్షణమందె, నీదు
హృదయంబు కాదేల రెండుఖండములు?
వరముల నీ వహా? వాంఛించునపుడు
నీ స్వాంత మెట్లొప్పె? నీ నాల్క నాఁడు
ఊడియుఁ బడదయ్యె నుర్వీతలాన.
నరపతి ని న్నెట్లు నమ్మినాఁ డకట!
మరణకాలంబున మానవేశ్వరుఁడు
విధివశ్యుఁ డై బుద్ధివిడనాడి యుండు.
కపటాఘదుర్గుణఖని స్త్రీలమనసు
నెఱుఁగఁగా నా బ్రహ్మకేనియుఁ దరమె?
సరళస్వభావుండు సౌశీల్యవనధి
ధర్మరతుం డగు ధారుణీనాథుఁ
డెట్లు నారీభావ మెఱుఁగగాఁ గలఁడు?
రఘురామచంద్రుని బ్రాణప్రియముగ
జగతిలో ఏ జీవజంతువుగూడ
ప్రేమింపకుండ జీవింపఁగా గలదె?
అట్టిరాముఁడు సైత మక్కటా! నీకు
కనఁబడె నహితునికరణి నే మందు?
తెలుపుము సత్య-మే తెగజీవి వీవు?
ఈ వెవరైన నా కేమి? ముఖాన
మసిఁబూసికొనుము సమంజసమగును.
ముందట నిలువక పొమ్ము తత్క్షణము.
రామునియందు వైరముఁ బూనినట్టి
పాపాత్మురాలి గర్భమున నన్బ్రహ్మ
ప్రభవింపఁజేసె; నావంటిపాపాత్మురాఁ
డీ జగత్రయమున నెం దైనఁ గలఁడె?
వృథ నిన్ను నిందింప నేల? పో పొమ్ము."
తనతల్లికపటంబు దా విని నంత
శత్రుఘ్నుతను వెల్ల చండకోపాగ్ని
సంతప్తమయ్యెను; సలుపున దేమి?
ఇంతలో నచ్చటి కేతెంచె *గుబ్జ

---

* కుబ్జ = గూనిమంథర.

రమ్యంబు లైనవస్త్రంబులు తాల్చి,
మెడనిండ సొమ్ములు మెఱయుచు నుండ.

శత్రుఘ్నుఁడు మంథరమూఁపుపైఁ దన్నుట
ఆ దాసి మంథర నరసినయంత
ఆజ్యాహుతిజ్వలితాగ్నిచందమున
ఆ లక్ష్మణానుజుఁ డత్యుగ్రుఁ డగుచు
దానిమూఁపున నట్టె తన్నెఁ బై కెగసి.
ఆ ఒక్కతన్నున కా గూనిదాసి
బోరగిలం బడి, భోరున నేడ్చె;
దాని మూపది యెల్లఁ దగఁ జదునయ్యె;
బ్రద్దలయ్యెను బుఱ్ఱ, పండ్లన్ని విఱిగె;
బళబళ రక్తంబు పడె నోటివెంట.
"హా దైవమా! నాదు అపరాధ మేమి?
ఏను చేసినమేలు కిదియా ఫలంబు?"
అనుమంథరో క్తుల నాలించి,దాని
నిలువెల్ల విషవహ్ని నిండుటఁ జూచి,
శత్రుఘ్నుఁ డాగ్రహోజ్జ్వలితాత్ముఁడగుచు
సిగఁ బట్టుకొని దాని ఘ్రితి నీడ్చుచుండ,
పరమదయానిధి భరతుఁడు వచ్చి
విడిపించె గానిని; విబుధవరేణ్య!
తదుపరి ఆ యన్నదమ్ము లిద్దఱును
చనిరి కౌసల్యాంబసన్నిధి కనఘ!
మలినవస్త్రముఁ గట్టి మానసమందు
వైకల్య మొప్ప వివర్ణయై మిగుల
దుఃఖభారముచేతఁ దోఁగి కృశించి
వని మంచు గురియుట వాడినయట్టి
లలితకాంచనకల్పలతవిధానముగఁ
గనవచ్చెఁ గౌసల్య గణ్యసౌశీల్య
కౌసల్య భరతునిఁ గనుగొనినంత
ఆత్రంబు గదురఁగా నాతనిఁ గలియఁ
బరుగిడి ఘనశోకపారవశ్యమున
మూర్ఛిల్లె ధరణిపై ముని! భరద్వాజ!

ఆ మెదుఃఖము చూచి యా భరతుండు
అత్యంతవికలుఁ డై ఆత్మీయదశను
మఱచి, యా జనయిత్రిచరణాల వ్రాలి,
విలపించె నీ రీతిఁ బ్రేమ యుప్పొంగ:
"జనని! మా జనకుఁ డెచ్చట? చూపవమ్మ!
ఎట నుండె సీతమ్మ? యెట నున్నవారు!
శ్రీరామలక్ష్మణుల్ ప్రియసహోదరులు?
ఎందుకు జన్మించె నిలను గైకేయి?
జన్మించెబోఁ? ఆమె జగతీతలాన
కుళకళంకుఁడు మహాకుఁముశభాజనుఁడుఁ
బ్రియజనద్రోహి యీపాపీనిని దాను
కనకుండ గొడ్రాలుగా నుండ దేల?
ఇట్టి దుఃఖంబు నీ కిలఁ గూర్చినట్టి
నన్నుఁబోలు అభాగ్య నరుఁ డెందుఁ గలఁడు?
అరిగెను బితృపాదు లమరలోకమున;
కరిగెను రఘువరుం డడవుల, కకట!
కేతుగ్రహంబటుల్ కేవల మేనె,-
ఈ యనర్థంబుల కెల్ల కారణము.
వంశవంశీమహావనగర్భమందు
నిప్పుఁ బెట్టినయట్టి నీచుండ; మఱియు,
దుస్సహదారుణ దుఃఖతప్తుఁడను!
లోకదూషణకహా లోనైనవాఁడ;
జగతి ఛీ, ఛీ నాదు జన్మం బ దేల?"
అని పల్కుభరతుని యా మృదువాక్కు-
లాలించి కౌసల్య, ఆత్మలో ధృతిని
సమకూర్చుకొని లేచి సత్ప్రేమతోడ
ఎత్తి కౌఁగిటఁ జేర్చె, యెడతెగకుండఁ
గనుగొలంకుల బొష్పకణములు జాఱ-
సరళస్వభావకౌసల్యామతల్లి
తిరిగి శ్రీరామఁ డేతెంచెనో యనఁగ-
గుండెకు హత్తించుకొనె గాఢముగను
పరమానురక్తితో భరతకుమారు.

తదనంతరం బామె తల్లక్ష్మణునకు
చిన్నతమ్ముం డౌచుఁ జెలువొందుచున్న
శత్రుఘ్ను బాహుపంజరమునఁ జేర్చె.
దుఃఖంబుతోఁ బ్రేమతో ఆమెయెడద
సంపూరితం బయ్యె సంయమివర్య!
ఆమెస్వభావంబు నరసినవార
లంద, "ఈ కౌసల్య ఆ రామమాత!
ఈమె కింతటిప్రేమ యెసఁగుటలోన
ఆశ్చర్య మే మున్న, దిది సహజంబు!"—
అని చెప్పుకొనిరి మహర్షివరేణ్య!
ఆ మాత, తనయొడియందున భరతుఁ
గూర్చుండఁజేసియుఁ గూర్మి వెలుంగ,
ఆతనికన్నీళ్ళ హస్తాబ్జములను
దుడుచుచునుడువగాఁ దొడఁగె నీ పగిది:
"మనమున ధృతిఁ బూనుమా! ప్రియతనయ!
అదనుగా దని యెంచి ఆర్తిని విడుము.
మనము పొందినహాని మతిఁ దలపోసి
వ్యాకుల మొందఁగా వలదు కుమార!
గడువరానివిగదా కాలకర్మములు!
వత్స! నిందింపఁగావల దేరినైన.
అరయ విధాత నా కన్నివిధాలఁ
బ్రతికూలుఁ డైయుండె భరతకుమార!
ఇట్టిదుఃఖంబుల నిలఁ గూర్చికూడ
నన్ను జీవింప నొనర్చె నా బ్రహ్మ;
ఇం కేమి చేయునో? యెవ్వరి కెఱుక?
పితృపాదునాజ్ఞను వినినంతఁ దనయ!
అల రాజవేషభూషాళిఁ ద్యజించి
వల్కలాజినముల వహియించి మేన
శ్రీరఘువీరుఁడు చిత్తంబులోన
ఖేదమోదంబు లొకింతయు లేక,
భువనమోహన మైన ముఖరంగమందు
దివ్యప్రసన్నత తేజరిల్లంగ
నుచితవిధంబుల నోదార్చి జనుల,
విపినవాసముఁ జేయ వెడలినాఁ డోయి!
ఈ వార్త విని సీత, యింటనుండకను
రామపాదాబ్జానురాగిణి యగుట
ఆతని వెనువెంట నడవికిఁ జనియె.
ఈ సమాచారంబు నెఱిఁగి లక్ష్మణుఁడు
ఎగిరి గంతేసి తా నేఁగె వారలతో;
శ్రీరాముఁ డెంతవారించినఁ గాని,
ఆతఁడు నిలువక అడవుల కేఁగె.
అంతట రఘుపతి అఖిలప్రజాళి
కభినతిఁ గావించి అవనిజాలక్ష్మ
ణోపేతుఁ డై సల్పె నుద్గమనంబు.
జానకీరామలక్ష్మణు లీ విధాన
వనవాస మొనరింపఁ బయనించినారు;
వారితోఁ గలసియు వనముల నుండ
ఈ శరీరంబుతో నేఁగుట గాని,
ప్రాణాల నేనియుఁ బంపుట గాని,
ఒనరింపఁజాలక యుంటి నిచ్చోట.
ఈ కండ్లముందఱ నిది యెల్లఁ జరిగె;
కాని, ఛీ! యీ పాడుకట్టెను వదలి
దౌర్భాగ్యజీవంబు తరలిపోదయ్యె;
బిడియ మొందను నాదుప్రేమఁ దలంచి;
మహి, రాముఁ బోలుకుమారున, కెన్న
నుఁ బోలుతల్లి! ఈ న్యాయ మెం దుండు?
వసుధపై జీవించవలసిన తెఱఁగు,
మరణించవలసిన మార్గంబు, నృపతి
బాగుగా నెఱుఁగును భావంబులోన.
కాని, నా హృదయము కఠినాతికఠిన
ముర్వి వజ్రముకన్న నొకనూఱురెట్లు."
అనెడి కౌసల్యోక్తి లాలకించియును
భరతుఁ డంతఃపురవాసజనంబు
విలపింపఁ దొడఁగిరి వికలాత్మ లగుచు;

శోకదేవత నిల్చుచోటుగాఁ దోఁచె
రాజగృహంబు భరద్వాజమౌని!
భరత శత్రుఘ్నులన్ బహువిలపించి
రతితీవ్ర సంకుల స్వాంతంబుతోడ.
కౌసల్య వారలఁ గౌఁగిటఁ జేర్చి
గుండెకు హ త్తించుకొని బుజ్జగించె.
పలుపలువిధముల భరతు నా మాత
ఓదార్చె మృదు వివేకో క్తులతోడ.
తదుపరి భరతుఁడుం దల్లులందఱిని
ఓదార్చె శ్రుతిపురాణో క్తసత్కథల.
అంజలిబద్ధుఁ డై అంత నా భరతుఁ
డీ రీతి వచియించె నింపుసొం పెసఁగ
నమల సారళ్యవాక్యంబులతోడ:—
"ఈ కుటిలంబు నే నెఱుఁగుచో మాత!
తల్లి దండ్రుల, సుతున్ ధర హత్యసేయఁ
నొడఁబడి యఘము నా కొదవును గాక!
గోశాలలను విప్రకోటి వసించు
గ్రామగృహంబులఁ గాల్చిన యెడల
వచ్చుపాపము నాకు వచ్చునుగాక!
స్త్రీహత్య, శిశుహత్యఁ జేసినయెడల,
విషమిడి హితు, ధరావిభుఁ జంపునెడలఁ
గలుగుదోషము నాకుఁ గలుగునుగాక!
మఱియు ఋషీశ్వరుల్ మహిఁ దెల్పినట్టి
అలమనోవాక్కర్మముల సంఘటించు
అల్పదోషములు, మహాపాతకములు,
నాకు సంప్రా ప్త మౌఁగాక! ఓజనని!
ఈ కుతంత్రంబు నే నెఱుఁగుచో? తల్లి!
శివకేశవులను భజించుట మాని
ఘోరభూతములను గొల్చెడివాని
ఘోరదుర్గతి నాకుఁ గూడునుగాక!
జనని! నా కిది యెల్ల సమ్మతం బేని
వేదవిక్రేతలు, భేదవ ర్తనులు,
చాటుచాటున నిందసల్పెడివారు,
పరులపాపంబులఁ బ్రకటించువారు,
కపటులుఁ గుటిలులు, గలహానురక్తు,
లాగ్రహావేశాంధు లైన జనంబు,
వేదవిదూషకుల్, విశ్వాఽహితాళి,
లోభులు లంపటుల్ లోలమానసులు,
అన్యధనాంగనాహరణ చింతకులు,
పొందు దుర్గతి నేను బొందెదఁ గాక!
ఈ రహస్యంబు నే నెఱుఁగుచో, మఱియు
సత్సంగమున అనాసక్తులౌ వారు,
పరమార్థవిముఖ దౌర్భాగ్యమానవులు,
నరశరీరముఁ దాల్చినన్గాని ధరణి
హరి భజింపఁగ లేని అజ్ఞానమతులు,
హరిహరకీ ర్తనమందు సంతతము
హర్షంబు గాంచనియట్టి మానవులు,
వైదిక పథమును వదలివైచియును
వామమార్గంబున వ ర్తించువారు,
దంభవేషంబులఁ దాల్చి లోకంబు
వంచనఁజేయుకాపట్యవార్ధిఘులు,
పొందుదుర్గతి నాకుఁ బొసగించుగాక
శంకరదేవుండు! సాధ్వీమతల్లి!"
భరతుఁ డీ రీతిగాఁ బ్రవచించినట్టి
సత్యవినిర్మల సరళ వాక్యములు
విని, మాత కౌసల్య అనియె నీ రీతి:
"నాయనా! భరత! అనారతం బీవు
త్రికరణశుద్ధిగా శ్రీరామచంద్రుఁ
బ్రేమించునట్టి పవిత్రచిత్తుఁడవు.
ప్రాణాధికుఁడు నీకు రామచంద్రుండు;
రామున కీ వట్లు ప్రాణాధికుఁడవు.
అల యమృతాంశుఁ డీ యవనీస్థలాన
విషమును వర్షింప వీలుగావచ్చు;
హిమ మగ్నిఖండంబు లెగఁ జిమ్మవచ్చు;

జలచరంబులు జలాస క్తిని వదలి
బ్రతుకగావచ్చును వసుధాస్థలాన;
జ్ఞానంబు మోహమున్ సమయింపలేక
పోవచ్చుఁ; గాని ఓ పుత్రకా! నీవు
శ్రీరామునకు వ్యతిరేకివి కావు.
ఈ కుతంత్రము నీకు హిత మని యెవరు
పలుకుదురో! వారు స్వప్నమం దైన
సుఖమును సుగతిని సుత! పొందలేరు".
అని పల్కి కౌసల్య అంత నా భరతుఁ
గౌఁగిటఁ జేర్చెను గాఢానుర క్తి.
ఆ మహామాత కయ్యవసరమందు
పాలు చేపుకు వచ్చె వాత్సల్యవశత;
కనుకొలంకుల బాష్పకణములు నిండె.
ఆ రీతిగా వార లా రాత్రియంత
అవనిఁ గూర్చుండి దుఃఖాలాపములను
గడపిరి కాల; మప్పుడు తెల్లవాఱె.
వామదేవ వసిష్ఠవరమునుల్ నచ్చి
సచివ మహాజనసమితి రావించె.
అపుడు వసిష్ఠమహర్షి శేఖరుఁడు
సమయానుకూల విజ్ఞానవాక్యముల
నుపదేశ మొసఁగె నెన్నెన్నో విధాల
భరతున కో భరద్వాజమునీంద్ర!
"వత్స! ధైర్యం బెదవహియించి నీవు
కర్తవ్య మొనరింపఁ గడఁగుమా, నేఁడు—"
అను గురు దేవునిఆజ్ఞ నాలించి
భరతుఁడు లేచి సర్వప్రయత్నములఁ
గావింప నియమించెఁ గడుశ్రద్ధ గదుర.

భరతుఁడు దశరథునికి దహనాదిక్రియ లొనర్చుట

వేదో క్తపద్ధతి విభు దేహ మతఁడు
స్నాతంబొనర్చి, శ్మశానభూస్థలికిఁ
గైకొనిపోవగాఁ గడుచిత్రమైన
వరవిమానంబు నేర్పాటుగావించె.
మరుభూమి కరుదెంచుమాతల నపుడు
భరతుఁడు వారించెఁ బొదాల వ్రాలి;
శ్రీరామదర్శనప్రీతిఁ వా రెల్ల
రాగిరి చనక, మహర్షి వరేణ్య!
తతచందనాగురుతరుఖండములను
దదితర బహుసుగంధద్రవ్యములను
గైకొని వెడలి సాఁకొత్స్వర్గమునకు
సోపానపంక్తిని సుందరరీతి
విరచించినట్లుగాఁ బేర్చిరి చితిని
దివ్య మౌసరయూనదీతీరమందు;
ఇట్లు దహనక్రియ లెల్లను ముగిసె,
పిదప నాదాహకబృందమంతయును
స్నానంబుఁ గావించి శాస్త్రానుసరణి
నర్పించె నంతఁ దిలాంజలుల్ భక్తి.
అల శ్రుతిస్మృతిపురాణాళి శోధించి
తగఁ జేసె భరతుండు దశరాత్రకర్మ;
మునిపతి ఆజ్ఞయిచ్చినదానికన్న
నఖిలకార్యములు సహస్రాధికముగ
భరతుం డొనర్చె, సద్భక్తి వెలుంగ.
అతఁడు శుచిరూఢుఁ డై దానకోటి
నవ్వారిగా సల్పె నతులితరీతి.
గోవుల గజముల ఘోటకాదులను
మఱియు సింహాసన మహితభూషాళి,
నన్నవస్త్రంబుల నగ్రహారముల,
ధనధాన్యముల, గృహోద్యానభూములను,
దానంబుసలుప నాతఁడు, ధరామరులు
సంపూర్ణకాము లై సంతోషపడిరి.
భరతుండు సలిపిన పైతృకక్రియల
వేయిజిహ్వాల నైన వివరింపఁ దరమె?
చూచి ఒకానొక శుభదివసంబు

శ్రీవసిష్ఠమహర్షి శేఖరుఁ డఖిల
సచివ మహాపౌరజనుల రావించె;
వా రెల్ల రాజసభాస్థానమందు
వచ్చికూర్చుండిరి వరుసలు దీరి.
భరతశత్రుఘ్నులు న్వచ్చి రచ్చటికి.
అంత వసిష్ఠమహర్షి యా భరతుఁ
జెంతఁ గూర్చుండఁగాఁ జేసి వచించెఁ
నల జ్ఞానధర్మమయాలాపములను.
మునుముందు వర్ణించె మునిశేఖరుండు
కై కేయికౌటిల్య కథను సాంగముగ;
బిదపఁ బ్రశంసించెఁ బ్రేమకై తనువుఁ
ద్యాగంబొనర్చిన దశరథేశ్వరుని
సద్ధర్మనిష్ఠను, సత్యసంధతను.
ఆ మునివల్లభుఁ డా రామచంద్రు
వరగుణశీలస్వభావవర్ణనము
సలిపె బాష్పాంబువుల్ జాల్వారఁ గనుల
దనువెల్లఁ బులకీకృతం బయి వెలుఁగ
మఱియు నాసుజ్ఞాని మౌనీశ్వరుండు
జానకీలక్ష్మణస్వాములకున్న
శ్రీరామభక్తి వచించె, విషాద
మహితానురాగనిమగ్నత వెలయ.
అమ్మునిపతి విషణ్ణాత్ముఁ డై అంతఁ
బలికెఁ నీరీతిగా భరతునితోడ:
"విను మోయి భరత! అవ్విధి బలీయంబు;
హానివృద్ధులును, గీర్త్యపకీర్తి, లవని
జన్మమృత్యువులు, విచారించునెడల,
అన్నియు దైవవశ్యంబు లై యుండుఁ;
నిందుచే నొకరిని నిందఁ జేయుటయు
నాగ్రహించుటయును వ్యర్థ మో భరత!
స్వాంతమం దీవు విచారించుకొనుము.
దశరథధారుణీధవునిఁ గుఱించి
శోచింపఁ బనిలేదు శోచనీయుండు–
వేదబాహ్యుం డయి విడిస్వధర్మమును
విషయలంపటుఁ డగు విప్రజనుండు;
రాజనీతిజ్ఞానరహితుఁ డైనట్టి
ప్రాణసమంబుగా బ్రజఁ జూడనట్టి
క్ష్మోణీశ్వరుం డెన్న శోచనీయుండు;
సిరి గల్గి కృపణుఁ డై జీవించునట్టి
ఇల నతిథులఁ దిరస్కృతిఁ జేయునట్టి
హరిపాదభక్తి లేనట్టి వైశ్యుండు
క్ష్మోణీతలంబున శోచనీయుండు;
బ్రాహ్మణాఢ్య గౌరవపరుఁ డౌచు నెప్పుడు
వదరుచు, నాకున్న పాండిత్యగరిమ
ఎవరి కున్నదటంచు నిల మిట్టిపడుచు
ఆత్మస్తుతిప్రియుఁ డై చరియించు
శూద్రుండు ధరణిలో శోచనీయుండు;
నిజభర్తృవంచకి, నీచస్వభావ
కుమతి, గయ్యాళియుఁ, గుటిల, స్వేచ్ఛాను
గామిని యగుకాంత కడుశోచనీయ;
స్వీయవ్రతంబును విడి, గురు నాజ్ఞఁ
బాలింపఁజాలని వటువు శోచ్యుండు;
మఱియు, మోహాధీనమానసుఁ డగుచు
విధ్యుక్తకర్మల విడుచుగృహస్థుఁ
డుర్వీలో శోచనీయుండు కుమార!
భువి వివేకవిరాగముల నెడఁబాసి
ఇహరతి గలయతి ఎన్న శోచ్యుండు;
తగు తపశ్చర్యను త్యాగం బొనర్చి
భోగానురాగి యౌయోగి శోచ్యుండు;
చాటునఁ బరుల దూషణఁజేయువాఁడు,
ఊరక నే కోప మొందుజనుండు,
జననీజనకగురుజనబంధువిముఖుఁ
డుర్వీలోశోచనీయుండు కుమార!
కడుపె కైలాసంబుగాఁ దలపోసి
నిజతనుపోషణనిరతుఁ డై సతము

దయ అనుమాటనె తలపోయకుండ
ఇతరుల కపకారమే చేయు నగుఁడు-
చూచుచో నన్నిట శోచనీయుండు;
అదిగాక, నిష్కపటాత్ముఁడై ఎడఁద
హరిని భజింపని నరుఁడు ధరిత్రి
చూడ నన్నివిధాల శోచనీయుండు;
భువనచతుర్దశపూర్ణ ప్రభావు
డగు కోసలవసుంధరాధీశ్వరుండు-
శోచనీయుఁడు కాడు శుద్ధసత్యంబు!
నీ తండ్రిఁబోలిన నృపవతంసుండు
మును పెప్పుడును లేడు, ముం దుండఁబోడు.
హరిహరబ్రహ్మలు నష్టదిక్పతులు
సర్వులు దశరథేశ్వరు సన్నుతింత్రు.
వర రామలక్ష్మణభరతశత్రుఘ్ను
లంతటివారిని ఆత్మసూనులుగఁ
బొందిన ఆతనిపుణ్యంబు నెన్న
ఎవ్వరివశము వచింపుమా వత్స!
ఎల్లవిధంబుల నృపతి ధన్యుండు-
అతనికై వగచుట వ్యర్థ మీ విషయ
మాలించి గ్రహియించి వ్యథవిడు మింక
శిరసావహింపుము క్షితినాథునాజ్ఞ;
రా జొసంగెను నీకు రాజ్యపదంబు.
మాటఁదప్పఁగలేక మహితాత్ముఁడైన
మీ తండ్రి దశరథ మేదినీవిభుఁడు
శ్రీరామచంద్రుఁ ద్యజించియు తాను
రామవియోగఘోరవ్యాకులమున
తనదేహమే పరిత్యజియించెఁ దుదకు.
కావున మీ తండ్రిగారివాక్యములఁ
బాలింప, నీ విలఁ బాలింపవలయు.
పరికింపఁ దనదగు ప్రాణంబుకన్న
మాట ప్రధాన మీ మనుజేశ్వరునకు;
అందుచే నాయనా! అరమరలేక
నీ తండ్రినుడులను నెఱవేర్పు మిపుడు.
నీ తండ్రియాజ్ఞ మన్నించుచో నీకు
అఖిలవిధాల శ్రేయస్కరం బగును.
తమతండ్రియాజ్ఞను దలను ధరించి
పరశురాముఁడు మాతృవధను గావించె-
నిది యెల్లలోకంబు లెఱుఁగు గా, భరత!
అల యయాతికుమారుఁ డగుపూరుఁ డుర్వీ
దనయాధనంబును దండ్రికొసంగి,
తండ్రివార్ధక్యంబుఁ దాను గైకొనియె;
ఐనను బాపాపయశము లాతనికి
అంటవయ్యెను తండ్రియాజ్ఞ బాలింప.
ఉచితానుచితచింత నుల్లమం దిడక,
తనతండ్రియానతిఁ దప్పనివాఁడు
సుఖభాజనుం డగు; సుయశంబు నొందు;
ఇంద్రలోకమున వసించు నంత్యమున.
అందుచే నీవు ధరాధీశునాజ్ఞఁ
బాలింపుమా, ప్రజావళి నేలుకొనుమ,
మతిశోకమును వీడుమా, దీనిచేత
స్వర్గాన మీ తండ్రి శాంతివహించు;
పుణ్యంబు సత్కీర్తిఁ బొందెద వీవు;
దీనదోషంబు ప్రాప్తింపదు నీకు.
ఏ పుత్రునకుఁ దండ్రి యిచ్చునో రాజ్య
మాతఁడే ధర నేల నర్హుఁ డౌననుట
నిగమసంవిదితము, నిఖిలసమ్మతము;
కావున బాలింపుమా, వసుంధరను.
విడుము విషణ్ణత, వినుము నామాట;
నీ మేలుఁ గోరి యేనే జెప్పుచుంటి.
ఈవు రాజ్యముఁ జేయు టెటిఁగినయంత
జానకీరాములు సంతసించెదరు;
ఇది దోష మనఁజాలఁ డే బుద్ధిశాలి.
మఱియుఁ గౌసల్యాదిమాతలుకూడ
జనులసౌఖ్యముఁ జూచి సంతసించెదరు.

శ్రీరామునకు నీకుఁ జెలువొందుచున్న
పరమబాంధవ్యంబు నెఱిఁగినవాఁడు,
నీయందుఁ బూర్ణమానెన రుంచఁగలఁడు.
తిరిగి శ్రీరాముఁ డేతెంచినపిదప
ఆతని కీవు రాజ్యము సమర్పించి
సేవింపవచ్చు సుస్నేహభావమున."
అంత మంత్రులును బద్ధాంజలు లగుచు
వినతిఁ గావించి రివ్విధి భరతునకు—
"దేవ! పాలింపుమా దేశికునాజ్ఞ;
తిరిగి శ్రీరాముఁ డేతెంచినపిదప
సమయోచితంబుగాఁ జరియింపవచ్చు."
అంతఁ గౌసల్య ధైర్యముఁ గూర్చుకొనియు
పలికె నీరీతిగా భరతునిఁగూర్చి:
"ప్రియపుత్ర! గురాజ్ఞ విహితంబు నీకు;
హితకరం బగుదాని నీవు మన్నించి
శిరసావహింపఁగాఁ జెల్లును తనయ!
కాలగతి నీవు గ్రహియించి మతినిఁ
జింతాకులత సంత్యజింపుమా; యిపుడు
రఘుపతి యుండె నరణ్యగర్భమున;
నరపతి సురపతినగరమం దుండె;
నీ విట్లు నాయన్తా! ఈ సమయమున
శోకభారముతోడ స్రుక్కుట తగునె?
నీ కుటుంబమునకు నీ ప్రజావళికి
నీ మంత్రిజనులకు నీదుతల్లులకు
ఆధారభూతుఁడ వందఱి కీవె.
ప్రియసుతా! గుణనిధీ! విధివిపర్యయము,
కాలకార్పణ్యముఁ గాంచియు నీవు
హృది ధైర్యమును వహియింపుమా, యింక
శిరసా వహించుమా శ్రీగురునాజ్ఞ;
పాలింపుమా, ప్రజావళిని గుమార!
పరిహరింపుము కుటుంబవ్యాకులమును".
చందనగంధంబుచంద మెడంద
కాప్యాయముగ నున్నయాచార్యవాక్కు-
లల మంత్రు లొసఁగినయభినందనముల
నన్నింటి నాలించె నా భరతుండు.
మఱియు నాతఁడు మహామాత కౌసల్య
చెప్పిన శీలసుస్నేహనిర్మలిన
భావామృతోపేతవాక్యముల్ వినియె.
సరళరసామృతసంభరితంబు
లైనకోసలతనయావాక్యములను
భరతుఁ డాకర్ణించి వ్యాకులుం డయ్యె;
అతనినేత్రాబ్జస్రుతాశ్రుజలంబు
లతనిహృత్కోదారమందు వెలుంగు
రఘువీరవిరహాంకురముల నేచించె.
ఆ సమయంబున నాతనిస్థితిని
అవలోకనముఁ జేసినట్టివా రెల్లఁ
దమ్ముఁ దా మఱచిరి తాపసచంద్ర!
జగమునందున సహజస్నేహభావ
పరిపక్వమూర్తి యీ భరతుం డటంచు
అభినుతించిరి సర్వు లాదర మొప్ప.
పరమధీరుం డగుభరతుఁ డత్తఱిని
హృదయాంతరంబున ధృతిని వహించి
అంజలిఘటితహస్తాంబుజుం డగుచు -
అమృతోపమానవాక్యంబుల నిట్లు
సముచితప్రత్యుత్తరముల నొసంగె:
"మహితోపదేశంబు మద్గురు డొసఁగె
జనులును సచివులు సర్వులుకూడ
సమ్మతిఁ జూపి, రా సరణి వర్తింప,
మాతయు నుచిత మూరీతి విధించె;
ఏ వీని శిరసావహింపఁగాఁ దగును;
తనగురుదేవుండుఁ దండ్రియుఁ దల్లి
యజమాని హితుఁ డిచ్చు నాదేశములను
మంచిగూర్పునటంచు మనమునం దెఱిఁగి
ఆచరింపగవలె హర్షభావమున;

ఆ యుపదేశసమాచరణమున
ఉచితానుచితముల నుల్లంబులోన
చింతసేయుచు నాలసించినయెడల
ధర్మచ్యుతిని బొందుఁ దత్ క్షణమందె;
పాపభారము వానిపై వచ్చిపడును.
హృత్పూర్వకముగ మీ రిచ్చినయట్టి
ఆ దేశములను సమాచరింపఁగను
నా కెంతయో మేలు చేకూరఁగలదు.
ఇది నేను బాగుగా ఎఱిగియుండినను
సంతృప్తివడదు నా స్వాంతంబు సుంత.
కావున మీరలు కరుణవహించి
నా యెనరించువిన్నప మాలకించి
ఉపదేశమిండు నా కుచితమౌరీతి.
ఇట్లు ప్రత్యుత్తర మిచ్చు నా దొసఁగు
మన్నింపఁ బ్రార్థింతు; మహితాత్మ లవని
దుఃఖితజనగుణదోషంబు, లాత్మ
పాటింప రెప్పుడు, భవ్యాత్ములార!
జనకపాదుఁడు స్వర్గసదనమం దుండె;
నవనిజారాఘవు లడవులం దుండి;
రిట్టిచో మీరు న న్నీధరాతలినిఁ
బాలింపు మనుచును బలుకుచున్నారు;
ఇందుచే నేలాభ మే నొందఁగలను?
కాక మీ రొండెడి ఘనలాభ మేమి?
మా తల్లికుటిలత మహిని నే నట్టి
పరమభాగ్యం బెడఁబాసియుండినను,
సీతేశుపదపద్మసేవయే నాకుఁ
బరమహితంకరపథము నిజంబు.
బాగుగాఁ జింతించి పరికించి కంటి—
నిదె నాకు హితమార్గ మిఁక వేఱు లేదు.
జానకీరామలక్ష్మణచరణాబ్జ
సందర్శనముఁ బొందఁజాలని త్తఱిని,
ఈ రాజ్యమును గీజ్య మేల? కేవలము
అది, దుఃఖనిలయమే యగు, బుధులార!
మేన వస్త్రము లేక, మెడ సొమ్ము లేల?
వైరాగ్యదృష్టిని వదలినపిదప
బ్రహ్మవిచారణవల్ల యే మొదవు?
శవమున కేల భూషణవితానములు?
హరిభక్తి రవ్వంత ఆత్మలో లేక
జపములు యోగముల్ సలుపు టెందులకు?
ఆయువు పోవఁగా అంద మెందులకు?
రఘుపతి లేనిచో రాజ్యం బ దేల?
శ్రీరామవిభుఁడు వసించుతావునకు
జన నాకు సెలవిండు సదయాత్ములార!
ఇదియె నా కేకైకహితపథం బగును;
కాక, న న్యాపతిఁగా సేయుటందు
లాభ మేదో మీకు లభియించు ననుచుఁ
భావించి యీరీతిఁ బలికినయెడల—
అనురాగసంజనితాజ్ఞానవశత
చేతనే మీ రట్లు చెప్పుచున్నారు.
కైకేయితనయుఁడఁ, గౌటిల్యమతిని,
శ్రీరామవిముఖుండ, శ్రీవిహీనుఁడను
హా; ఇట్టి అధముని నవనీశుఁ జేసి
సుఖపడఁగా మీరు చూచుచున్నారు.
మోహవశాత్మ లైపోయి ఈరీతి,
నిజ మాడుచుంటిని నేఁ జెప్పుదాని
విని, విశ్వసింపుడు విమలాత్ములార!
ధర్మశీలుఁడె తగు ధరణిఁ బాలింప;
హత మూని మీరు నన్నవనీశ్వరుని.
సలిపినయెడలఁ దత్క్షణమందె క్రుంకు
రస, రసాతలికి— దుర్భరభారవశత
అకట! సీతారాము లడవికిఁ జనుట
నా మూలమునఁ గదా! ననుఁ బోలునట్టి
దారుణాత్యంతపాతకుఁ డెవ్వఁడుండు?
రాజేంద్రుఁ డటవికి రామునిఁ బంపి,

తద్వియోగంబుచేఁ దత్క్షణమందె
అమరపురంబున కరిగినాఁ డహహా!
ఈ సకలానర్థహేతుభూతుండ
నగుశఠుండను నేనో– హాయిగా నిట్లు
వృత్తాంత మెల్లను వినుచుఁ గూర్చుంటి!
రఘువీరవిరహిత రాజమందిరముఁ
గాంచియు జీవముల్ కలిగియున్నాఁడ;
నగుఁబాటుపా లయ్యె నా బ్రదు కెల్ల;
ప్రేమైకలక్ష్యపవిత్రస్వరూపుఁ
డగురామచంద్రుపై అనురక్తి విడచి
రాజ్యభోగముల లోలతఁ గోరుచుంటి;
నా హృత్కఠోరగుణంబు వర్ణింప
వాక్కులు చాలవు; పరికింప నద్ది—
వజ్రాతికఠినమ న్వాసికెక్కినది.
కారణంబునకన్నఁ గార్యంబు కఠిన
మిందుకు నా దోష మేమియు లేదు:
శల్యసంసృష్టవజ్రంబును గనుఁడు—
అది శల్యమునకన్న నతికఠినంబు.
పాషాణమందునఁ బ్రభవించినట్టి
ఇనుమును గనుఁ, డది యెన్ని యోరెట్లు
పాషాణమునకన్నఁ బరమకర్కశము.
కటకటా! కై కేయిగర్భవాసమునఁ
బుట్టినయీ దేహమును బాయలేని
పాపిష్ఠినా ప్రాణవాయువు లెంత
దార్ఢ్యవంతముల్, తలపోయునెడల?
ప్రియుఁ డైనశ్రీరాము విడనాడికూడ
ప్రాణాలపైఁ దీపిఁ బాయని నేను,
వినఁగల కనఁగల విషయంబు లెన్నో
ఇంకను ముందున్న వింతియే కాదు.
జానకీరామలక్ష్మణులఁ గైకమ్మ
వనముల కంపియు, భర్త నా పిదప
నాకంబునకుఁ బ్రయాణమును జేయించె;
తా నో వైధవ్యంబుఁ బాల్చి, దుష్కీర్తిఁ
దగినంత తిరముగాఁ దలను ధరించె;
అంతతోఁ బోక మహాజనావళికి
శోకసంతాపముల్ చేకూర్చె; నింక
అమిత సుఖంబును అసమానయశము,
బ్రహ్మాండ మగుమహారాజ్యంబు నాకుఁ
గట్టిపెట్టిన; దీప్రకార మాతల్లి
సర్వులకోర్కెలు సంతృప్తిపఱచె.
ఇప్పు డే నొందినయీమేలు చాలు–
ఇంతతో వదలక యీ నన్ను మీరు
ధారుణీపతిఁ జేయఁ దలపెట్టినారు.
క్ష్మాతలిఁ గై కేయి గర్భవాసమున
నేఁ బుట్టియుంటచే, నీ పని, నాకు
సముచిత మైన దే, సర్వవిధాల!
విధి వ్రాయవలసినవిషయంబు లెల్ల
నొక్కసారిగ వ్రాసియుండె, నా నొసట;
ఇంక మీరును బ్రజ లేక మై దాని
గట్టిఁజేయఁగ నేల కష్టింతు? రకట!
అవని గ్రహగ్రస్తుఁ డైయుండె నొకఁడు;
పైగ వానికి సన్నిపాతజ్వరంబు;
పై పెచ్చు తే ల్గుల్లెు; వానికి మద్య
పానంబుఁ గూర్చిరి ప్రక్కజనంబు
ఇది యేమి యుపచార మెఱిఁగింపరయ్య?
వర గైకసుతునకు నలసిన దెల్లఁ
జతురుఁ డైనవిరించి చక్కఁగాఁ గూర్చె.
మఱి యొకచిత్రము మహిని దైవంబు,
దశరథధారుణీధవు తనయుండ–
శ్రీరామచంద్రునిప్రియసహోదరుఁడ–
నని దంభవాక్యంబు లాడుచుఁ బ్రదుక
ఘనతఁ బ్రసాదించెఁ గరుణవహించి.
ఏ,రాజుఁ గాఁగ మీ రెల్లఁ గాక్షింత్రు.
ధరణీశునాజ్ఞ యందఱకు హితంబె.

ఇందరి కెటు జవా బిత్తు నే నొకఁడ?
ఎవ్వారి కెయ్యది హిత మెు? వా రటుల,
ఆహ్లాదముగఁ జెప్పఁ డమలాత్మ్మలార!
ఏను, నా దుర్మాత.- ఈ మేము తప్ప
ఈ యకార్యమున కిం కెవరు హర్షింత్రు?
సచరాచరప్రపంచమున నేఁ దప్ప
జానకీశ్రీరామచంద్రుల నెవరు?
తమప్రాణములతోఁడఁ దగ సమానముగఁ
బ్రేమింపకుండ జీవింపఁగాఁ గలరు?
పరమనష్ట మె మీకుఁ బరమలాభముగ
నగపడుచున్న దియ్యది నా యభాగ్య;
మితరుల ననుకొన నేమి ఫలంబు?
సంశయసౌజన్యసదయు లౌమీరు
పలుకున దెల్లను భావ్యమే యగును.
రాఘవజనని, సారళ్యస్వభావ;
ఆ మెకు నాయెడ నధికమాత్రేమ;
ఆర్తితో నున్నన న్నరసి ఆ తల్లి
సహజవాత్సల్యవశంబుచే నిట్లు
భాషించియుండెను, భవ్యాత్మ్మలార;
అస్మద్గురుస్వామియగువసిష్ఠర్షి
జ్ఞానసాగరుఁ డంచు జగ మెల్ల నెఱుఁగు;
ఆ మహా పురషున కఖిలవిశ్వంబు
కరబదరం బయి క్రాలు సంతతము.
ఆయనగూడ న న్నభిషిక్తుఁ జేయ
యత్నించుచుండె నాహా! యే మ నందు?
విధివ్యతిరేకి యూవేళ సర్వులును
వ్యతిరేకు లౌదు రిం దాశ్చర్య మేమి?
జరిగినపని నాకు సమ్మతం బనుచు
ధరణిజారాములు తప్ప, నీ జగతి
నెవ్వరు. దాము వచింపకుండెదరు?
ఈ యపవాదంబు లెల్ల నే వినియు
సహియింపవలెను బ్రసన్నభావమున;
నీరున్నతావున నే సహజముగఁ
గనవచ్చు బురదయు;— కావున నేను
లోకాపవాదుకు లోన భీతిల్ల —
పరలోకమున కేని బరితాపపడను—
కాని, నాకై గదా! క్ష్మాసుతారాము
లడవులం దిడుముల నందుట దాన
దారుణాసహ్యసంతాపదావాగ్ని
నా యెదఁ గాల్చుచున్నది ప్రచండముగ.
సౌమిత్రి గాంచెను జన్మసార్థక్య
మఖిలసంగంబులఁ ద్యాగం బొనర్చి,
శ్రీరామచరణనైష్ఠికచిత్తుఁ డగుచు;
ఛీ! నేనొ? పుట్టితి శ్రీరామదేవు
వనముల కంపియు బాధించుకొఱకు;
ఎందుకు— నా యేడ్పు లెల్ల నిష్ఫలము;
హా! మందభాగ్యుఁడ! హా! అభాగ్యుఁడను!
అందరికిదె క్రమొక్కి ఆత్మలో నున్న
ఘోరదుఃఖముఁ జెప్పకొందు మీముందు:
రఘునాథపాదదర్శనము సేయకయె
శాంతింపఁబోదు నా స్వాంత మె ట్లైన.
ఇంతకన్న నుపాయ మిం కొండు లేదు.
శ్రీరాముకన్న నా హృదయాంతరాళ
మెవ్వఁ డీ జగతి గ్రహింపఁగాఁ గలుగు?
నే నాత్మ నెంచిన నిశ్చయం బిదియె:
రేపటియుదయమే శ్రీరామదేవు
సన్నిధానమునకుఁ జనువాఁడ నేను.
అధముఁడ, నపరాధి, నఖిలసంతాప
హేతుభూతుండ నై యే నున్నఁగాని,
శరణాగతుండ నై సన్నిధియందు
చేరిన న న్గాంచి శ్రీవారు, నాదు
కలుషంబు లన్నియు క్షమియింపఁగలరు;
వర్షింపఁగలరు నాపైన విశేష
కరుణారసామృత కమనీయవృష్టి.

ఆ రఘునాథుఁ డహా! శీలరాశి,
వినయవార్ధి, మహావిమలస్వభావుఁ,
డమితకృపాస్నేహ కమనీయమూ ర్తి;
శత్రువు నేనియు ఱుమియించి ప్రోచు
రాముఁడు, నే నపరాధినే యైన-
శిశువును, శ్రీహరి సేవకజనుఁడ
నగుననన్ను మన్నించు నని చెప్పవలెనె?
ఓ మహాజనులార! ఓ భవ్యులార!
మీరెల్లఁ దలచి నా మేలు శ్రీరాము
శ్రీసన్నిధికి నేఁగ సెల విచ్చి నన్ను
దీవించుఁడీ రామదేవుఁడు కరుణ
నా విన్నపము విని ననుఁ గింకరునిగఁ
జేకొని పురికి వేంచేసెడియట్లు.
ధర నేను పాపిష్ఠిదాని గర్భమున
జన్మించి యున్నను, శఠుఁడ నై యున్న,
సతతపాతకుఁడ నై చరియించుచున్నఁ,
దనవాఁడ నని మహాదయచే గ్రహించి
శ్రీరాముఁ డెపుడుఁ ద్యజింపఁడు నన్ను;
అని నాకు విశ్వాస మాత్మలోఁ గలదు".
అల రామభక్తిరసామృతమయము
లగుభరతునివాక్కు లాలకించుచును
సంతోషమందిరి సర్వులు మిగుల;
రామవియోగదురంతవిషాగ్ని
పీడిత మగుప్రజాబృంద మత్తటిని,
కలితబీజాంకురగరుడమంత్రమును
విన్నపన్నగదష్టువిధిఁ దేరుకొనియె.
మాతలు గురులును మంత్రులు పౌరు
లందఱు ప్రేమసంవ్యాకులు లగుచు
భరతుఁ బునఃపునఃప్రస్తుతిఁ జేసి
పలికి రీతెఱఁగున, "భరతకుమార!
నీ స్వరూపంబున, నే డిట్లు ధాత్రి
శ్రీరామభక్తి మూర్తిభవించినది!

నీ విట్లుపలుకుటలో వింతలేదు.
ప్రాణప్రియుండవు రామున కీవు.
నీ తల్లికపటంబు నీ కున్న దనుచు
అజ్ఞులైనిందించునట్టిపామరులు—
నిజపూర్వపూరుషనికరంబుతోడ
శతకల్పకాలంబు చండోగ్రనరక
కూపమందునఁ గూలిఁ ఘోషింపఁగలరు.
ఫణిఫణామండలోద్భాసిత మణికి
ఫణి కుండుదుర్గుణవ్రజ మెన్న లేవు.
అంతియేకాకుండ ఆ మణి, ధరణి
విషదుఃఖదారిద్ర్యవితతి హరించు.
భరత! ఓ రఘురామ భక్తాగ్రగణ్య!
మంచిఆలోచన మాకుఁ జెప్పితివి:
రాముఁ డుండు నరణ్యసీమకు మనము
తరలిపోవుద మిదే తప్పనిసరిగ;
ఘనశోకజలధిలో మునిఁగెడిమాకుఁ
జేయూఁత నిచ్చి రక్షించినా వనఘ!"
ఘనఘనధ్వని విని కడుమోద మొందు
చాతకశిఖిబృందసరణి నందరును
బరమసంతోషసంభరితాత్మ లైరి.
ఇదె రేపు ప్రొద్దుననే పయనంబు
సాగింపవలె రాము సన్నిధి కనెడి
భరతునినిశ్చయభావం బెఱింగి,
వా రెల్ల భరతుని బ్రాణతుల్యునిగఁ
బ్రేమించి రానందవివశాత్మ లగుచు.
అంత నా ప్రజ లెల్ల నా వసిష్ఠునకు
వందనం బొనరించి, భరతున కెఱిఁగి,
యొగి నాజ్ఞఁ గొనుచు గృహోన్ముఖు లైరి.
"ఈ ప్రపంచంబున నెంచిన యెడల
పరమధన్యం బహా! భరతుజీవితము."—
అని భరతుని శీల మసదృశభక్తి
బరమసంప్రీతితో బ్రస్తుతించుచును

"ఒకమహాశయసిద్ధి నొందితి" మనుచు,
వా రొండొరులతోడ భాషించుకొనిరి.
ప్రజ లెల్ల అంతటఁ బయనసన్నాహ
మొనరింపసాగిరి మోదం బెలర్ప.
"ఇంటిలోఁ గావలి కీ వుండు" మనుచు
యజమానిచే నాజ్ఞ నందినవాఁడు,
పిడుగు పై బడినట్లు వికలతనొందె.
"ఎవ్వరు నిలువఁబో రింట నత్తఱిని;
జీవనలాభ మేజీవి త్యజించు
నుర్వపై?" నని పల్కె నొక పౌరజనుఁడు.
"శ్రీరామచరణరాజీవాభిముఖత
కనుకూలపడని గృహారామవిత్త
సౌఖ్యసంతతులు నాశంబును బొందు.
శ్రీరామచరణరాజీవాభిముఖత
కాహ్లాదమున సహాయము సేయనట్టి
సచివుఁడు, జనకుండు, జనని, సోదరుఁడు,
నాశమ్మునొందు ఘనజ్ఞానవనధి!
బహువిధవాహనవ్రజము లింటింట
సంసిద్ధపఱచిరి, స్వాంతరంగముల
నుదయప్రయాణమహోత్సాహు లగుచు.
భరతుఁడు స్వీయనివాసంబుఁ జేరి
చింతించె నీరీతిఁ, జిత్తంబులోన:
"నగర, నాగాశ్వ, ధనాగార, సౌధ,
రాజంబులన్నియు రఘునాథుసొత్తు;
స్వామిసంపదను రక్షణసేయకుండ
నరుగుచో నాకు- మహానర్థ మొదవు;
మేటిపాతకము స్వామిద్రోహచర్య!
కోటిదూషణములకు న్గుర్తియైన
స్వామిహితంబును సలిపెడివాఁడె,
సేవకుండనుటకుఁ జెల్లును గాదె?."
అని విచారించి నిజాంతరంగమున
కల నైన నిజధర్మగతి వీడనట్టి
విశ్వాసపాత్రు లౌ విహితసేవకుల
రావించి తగినమర్మముల సూచించి,
మఱియుఁ బ్రబోధించి మహితధర్మముల,
వారివారికిఁ దగు పనుల విధించె.
భరతుఁ డిట్లన్నిఏర్పాట్లుఁ గావించి,
పురరక్షకుల భద్రముగ నియమించి,
తదుపరిఁ గోసలాత్మజకడ కేఁగె.

భరతుఁడు శ్రీరాముని దోడ్తెచ్చుటకుఁ బ్రయాణసన్నాహం బొనర్చుట

తల్లులందఱు దుఃఖిత ప్తలై యుంటఁ
బ్రేమమార్గాఖిలవేది యౌ భరతుఁ
డవ్వారు పయనింప నాయత్తపరచె
అందలంబులను సుఖాసనంబులను.
జక్కవపిట్టలజంటలువోలె
పురనరనారీసమూహంబు లెల
నా రాత్రి సూర్యోదయం బగుదనుకఁ
గడపెను గాలంబుఁ గనుమూయకుండ.
భరతుఁ డంతట మంత్రివరుల రావించి,
"పట్టాభిషేకసంభారంబు లెల్ల
సమకూర్చి, వెడలుఁడు సత్వరంబుగను-
విపినమందే రామవిభునకు రాజ్య
తిలకంబు సిడు మునితిలకుం" డటంచు
ఆజ్ఞాపనముఁ జేయ నా సచివేంద్రు
లొనరించి జోహారు లుత్తమభక్తిఁ
జని సిద్ధపఱచి రా క్షణమాత్రమందె.
హయగజరథముల నఖిలవస్తువుల.
అంతట నగ్నిహోత్రాదుల న్గొనియు
సాధ్వి అరుంధతీసతితోడఁ గూడి
ఆచార్యవరుఁడు మహర్షి వసిష్ఠుఁ
డరదంబు నెక్కి బయల్దేరె ముందు;
తతతప స్తేజోనిధాను లౌవిప్రు

లందఱు వివిధవాహనముల నెక్కి-
అనుగమించిరి యమ్మహామునివరుని;
వారి వెన్నంటిరి పౌరజనంబు.
రమణీయశిబికల రాఁగు లందఱును
బయనించి రంతఁ దాపసలోకనాథ!
ఆంతరంగికసేవకాళికిఁ బురముఁ
గడుభద్రముగఁ జూడఁగా నొప్పగించి,

అందఱు ముం దంపి ఆదరం బెసఁగ,
భరతశత్రుఘ్నులు భవ్యు లిద్దఱును
దరలిరి తుదకు- సీతారామచరణ
సంస్మరణాయతస్వాంతు లై అనఘ!
ఈ పరికారంబుగా నెల్లఱుఁగూడ
దమతమ విహితసాధనములతోడఁ
జిత్రకూటమునకుఁ జేసిరి యాత్ర.

శ్రీరామచరితమానసము

అయోధ్యా కాండము

ద్వాదశవిశ్రామము

డింభకపరిరక్షణ సం
రంభామితశౌర్యరంభ! రణవనసింహా!
దంభాసురగజసింహా!
స్తంభోద్భవ! మట్టపల్లిప్రచండనృసింహా!

భరతుఁడు సపరివారముగ శ్రీరామునికడకు
బయనించుట

ఓ గరుత్మంత! భక్తోత్తమా! వినుము:
ఉదకంబుకై ఆత్ర మొప్పఁగా నేఁగు
కరికరిణీతతికరణి నా సర్వ
నారీనరులు రఘునాథపాదాబ్జ
దర్శనతృష్ణతోఁ దరలి రో గరుఁడ!
హ్లాసుతారాములు కాన్పలోనుండి
రనుభావ మెపుడు వెన్నాడియుండుటను
ఆత్మసోదరయుక్తుఁడా భరతుండు
బయనంబొనర్చెఁ దాఁ బదచారి యగుచు.
వారిప్రేమను గాంచి ప్రజ లెల్ల రంత,
అనురాగవశు లౌచు హయ, గజ, స్యంద,
నాదివాహనముల నన్నింటి వదలి
తామును నడచి; రత్తఱిని గౌసల్య
శ్రీరామజనని వీక్షించి యవ్వారి-

భరతుచెంగటఁ దనపాలకీ నాపి,
పలికె నిట్టుల మృదువాణి వెలుంగ:
"నాయనా! భరత! జనంబులఁ జూడు
మరదమథిష్ఠింపు మటు చేయవేని
ఈ ప్రియపరివార మిటు శ్రమ నొందు.
పదచారి వై నీవు పయనించునెడల
అందఱుఁ బదచారు లౌదురు; వీరు
వ్యాకులకృశితాంగు లై యుంటచేత
నడచుట కష్టము నాయనా! భరత!"
అని పల్కఁగా నామె యాజ్ఞ నా భరత
శత్రుఘ్ను లిద్దఱు సద్భక్తితోడ
శిరసావహించుచున్ గరములు మోడ్చి
తమరథం బెక్కియుఁ దరలి రోతార్క్ష్య!
పోయినా రట్టుల మొదటిదినంబు
*తమసానదీదివ్యతటమున, నవల
గోమతీతటమునఁ, గొనిరి విశ్రాంతి.
కొందఱు పాలను గొందఱు పండ్లఁ
గైకొని జీవముల్ కాపాడుకొనిరి.
కొందఱు రాత్రి గైకొనిరి భోజనము.
త్యక్తభూషణభోగు లై వార లెల్ల
రామహితార్థమై వ్రతనిష్ఠు లైరి.

---

* తమసానది ఘూగ్రానదియొక్క ఉపనదులలో నొకటి. ఇది అయోధ్యకుఁ బదిమైళ్ళదూరమున ఘూగ్రానదినుండి చీలి అజంఘర్ నగరప్రాంతమున సరయూనదిలోఁ గలియుచున్నది.

భరతుఁడు సపరివారముగ శృంగిబేరపురము
నొద్దకు జేరుట

అల ♦'సయూతీరంబునందున విడిసి,
తెలవారినంతనే తిరిగి వా రెల్లఁ
బయనంబు సాగించి భ క్తితత్పరత
† శృంగిబేరపురంబుఁ జేరుకొన్నంత,

గుహుఁడు భరతురాకనుగూర్చి వితర్కించుట

ఈ సమాచారంబు నెల్ల నాలించి
అట నిషాదాధినాయకుఁ డైనగుహుఁడు
హృదివిషాదము నొంది యిట్లు చింతించె:
"భరతుఁ డీ రీతిగా వనమున కఁరుగఁ
గారణ మెయ్యది? కాంచగా నకట!
హృదయమం దీతని కేదియో కపట
భావంబు కల; దట్టిభావంబు లేక-
దేని కీసై న్య మే తెంచు వెన్వెంట?
రామలక్ష్మణులను రణమునఁ జంపి
ఇఁక నకంటకముగ నెల్ల భూతలము
హాయిగా నేలుకో నాత్మఁ దలంచి
యుండు నీతండు, మదోద్ధతుండగుచు.
ఎఱుఁగ డీ భరతుఁడు హృది రాజనీతి;
మును పపకీర్తినే పొందుట జరిగె;
ఇపు డొందు మృత్యువు నితఁడు నిక్కముగ;
ఎల్లసురాసురు లేకమై వచ్చి
తాకినప్పటికి యుద్ధక్షేత్రమందు
రాముఁ డజేయుఁడై రాణింపఁగలఁడు.
భరతుఁ డీరీతిగా వర్తించుటందు
వింత యేమున్నది? విషభూరుహమున
అమృతఫలంబుల నరయఁగాఁ గలమె?

గుహుఁడు తనసైనికులకు భరతునిపై
దండెత్త నాజ్ఞాపించుట

ఇట్లు గుహుండు లో నెంచి యా పిదపఁ
బలికె నీ రీతిగా స్వజనులతోడ:
"అందఱు సంసిద్ధులై యిఁడె నిలుఁడు!
నదిలోన ముంచుడీ! నావలన్నిఁటిని!
ముట్టడించుఁడు నదీ ముఖ్యఘట్టముల!
సర్వసన్నాహు లై- సత్వర మిపుడె
అన్ని రేవులలోన అడ్డ మై నిలుఁడు
చావు కేనిఁ దెగింప సంసిద్ధ మగుఁడు
ఏ నిదే భరతుని నెదిరించి నిలిచి
యుద్ధం బొనర్చెద నూపిరి బొందె-
నెందాక యుండునో అందాక నతఁడు
గంగానదిని దాటఁగా నీయఁబోను.
ఈ శరీరము నిత్యమే, నశ్వరంబు;
పుడమిపై నిది రాలిపోవు నే నాఁడొ.
ఆహవంబునఁ జావు: అందులోఁ బరమ
పావనగంగాప్రవాహతీరమున;
ఎంతటి భాగ్యమో యిది హితులార!
అది గాక రామకార్యార్థ మై ధరణి
క్షణభంగురం బగు కాయము న్వదలు
టెంత మహాభాగ్యమెన్నగాఁ దరమె?
భరతుఁడో శ్రీరామభద్రసోదరుఁడు,
మఱియు నీ ధారుణీమండలాధిపుఁడు;

♦ 'సయూ'నది గోమతీగంగానదులకు మధ్యప్రదేశమునఁ బుట్టి, 'జౌనపుర'మునకుఁ బదిమైళ్ళదిగువ గోమతీనదిలోఁ గలియుచున్నది.

† ప్రాచీనమైనశృంగిబేరపురప్రదేశము, అలహాబాదునకు 22 మైళ్ళదూరమందున్న 'సిఙ్గార్' (Sing-raur) అనే నవ్యకృతనామములతో నున్న గ్రామముగాఁ గుర్తింపఁ బడినది. ఇచట గంగానది తనప్రవాహమార్గమును మార్చుకొన్నది. ఇప్పుడీ ప్రవాహమార్గమున నొక చిన్న ఉపశాఖమాత్రమే ప్రవహింపుచున్నది.

నే నెన్న చో నొక్క- నీచసేవకుఁడ;
ఇట్టిమృత్యువు లభియించుట యన్న
ఘనతరాదృష్టమే గద! మిత్రులార!
స్వామికార్యార్థమై శక్తికొలంది
చండసంగ్రామంబు సలిపెద నిదియె-
నా కీర్తి యీ పదునాల్గులోకముల
వెలుఁగొందు నట్లుగా ప్రియవీరులార!
ఆ రఘునాథకార్యార్థమై నాదు
ప్రాణముల్ బలిఁజేయుఁ బూనితి నేఁడు
ఎట్లైన సంతోషమే నాకుఁ జూడ:
సంగ్రామమున నాకు జయ మబ్బు నేని-
స్వామికార్యంబును సలిపిన ట్లగును;
కాక, గతింతునా? కైవల్య మబ్బు.
సాధుమహాజనసంఘుంబులోన
ఏ మానవుఁడు గణియింపఁగాఁబడడొ-
ఆ రామచరణభక్తావళియందు
ఏ మానవుఁడు గణియింపఁగా బడడొ-
ఆతఁ డీభూమికి అతిభార; మతఁడు
తనతల్లియౌవనవనమును జెరుపఁ
బుట్టినట్టికుఠార మో హితులార!"
అని పల్కి ఆ ధీరుఁ డైనగుహుండు
తనసైన్యమున సముత్సాహంబుఁ గూర్చి
శ్రీరామచంద్రు స్మరించి స్వాంతమున,
తనధనుర్బాణముల్ తనకవచమును
దెచ్చి యిం డనుచు నాదేశ మొసంగె.
"శీఘ్రమే చనియు సంసిద్ధులు కండు!
నే నాజ్ఞ నిడునంతనే మీర లెల్ల
వెనుకంజ వేయక వీరత మెఱయ
రారండు దుముకుఁడీ రణరంగమందు."
అని యా నిషాదనాయకుఁ డనినంత,
"చిత్తముదొర!" యని చేసి రా భటులు
జయ జయ, ధ్వానముల్, సంతోష మొప్పఁ-
దతపరస్పరసము త్సాహిత మగుచు.
అంతనా బోయ లత్యంతభక్తి
ఒక్కరితఱువాత నొకరుగా వచ్చి
ఆత్మాధిపతికి జోహారుఁ గావించి
వెడలి; రా శూరులు వీరు లందఱును
యుద్ధం బొనర్పఁగా నుప్పొంగుచుండ్రి.
పావనరామాంఘ్రిపద్మపాదుకలు
ఆత్మలో స్మరియించి, యంబులపొదుల
వీపులఁ దాల్చిరి; విండ్లెక్కు-వెట్టి
కవచశిరస్త్రాణగణము ధరించి,
గొడ్డండ్ల నీకెల, గొప్పబల్లెముల,
ఝళిపించి రుత్సాహశౌర్యముల్ మెఱయ.
గరిడీలలో మొన గాండ్రగువారు
కుప్పించి యెగసిరి కుంభిని న్దాము
తాఁకనే తాఁకక తద్గగనమున
విహరింపుచుండినవిధము గన్పట్ట.
ఆ యోధవరు లాయుధాళి ధరించి
జట్లుజట్లుగ వచ్చి స్వామి యీగుహుని
కతివినయమున జోహారుఁ గావింప,
గనుఁగొని వారలఁ గార్యదక్షతను
స్వాంతమందున సంతసముఁ బొంది యతఁడు
పేరుపేరున వారిఁ బిలిచి చెంగటికి
సన్మానపఱచి యీ సరణి వచించె:
"ప్రాణాలపైఁ దీపి వల దన్నలార!
ఘనకార్య మొదవె నీ దినమున మనకు".
అనుమాటలను వినినంత నా సుభటు
లని రిట్లు మిగుల రోషావేశ మొప్ప:
"వెఱఁగొందఁ బనిలేదు వీరవరేణ్య!
ఆ రామచంద్రుమహాప్రభావమున,
మీ నగుబలముచే మే మిదే పోయి
భరతసైన్యములోని భటనికాయమును
స్యందనహయగజసంయుతముగను

నిశ్శేషముగఁ బ్రభూ! నేలఁ గూల్చెదము.
కొనయూపి రీ మాదుకుత్తుక నుండు
దనుక నిల్చుండి యుద్ధం బొనర్చెదము.
మొండెముల్ తుండెముల్ భూమి నింపెదము".
అని వచియించిన ఆత్మీయభటుల
శౌర్యంబు నరసి హర్షస్వాంతుఁ డగుచు
ఆ నిషాదాధీశుఁ డాజ్ఞఁ గావించె,-
రణభేరి మ్రోగింప రయముదీపింప;
ఎడమవైపునఁ దుమ్మె నింతలో నొకఁడు;
అప్పుడు శకునజ్ఞు "లాతుమ్మి, మంచి
దెసనుండి వినవచ్చె; దీనిచే మనకు
జయమే! లభించు నిస్సంశయం" బనిరి.
అంతట నొకవృద్ధుఁ డంతరంగమునఁ
శకున ఫలంబు విచారించి పలికె:
"మన మేఁగి, భరతుని, మాన్యభావమునఁ
గలియంగవచ్చును గలుగదు పోరు;
తిరిగి శ్రీరామునిఁ దెచ్చుటకొరకు
భరతకుమారుఁడు బయనించుచుండె;
సంగరం బొదవదు శకునార్థ మగయ.
అన విని గుహుఁ డిట్టు లనె వివేచించి:
"ఈ వృద్ధుఁ డిపుడు వచించిన దెల్లఁ
గడుసమంజసముగాఁ గనుపట్టుచుండె.
ముందువె న్కరయక మూఢమానవులు
పనిచేసి చివరకుఁ బశ్చాత్తపింత్రు.
భరతస్వభావప్రవర్తనల్ గనక
పోరుకు దిగినచోఁ బొసఁగును గీడు.
ఓ యోధవరులార! ఓ మిత్రులార!
అరిగి భరతుచెంత కతని ఆంతర్య
మెఱిఁగివచ్చెదను మీ రెల్ల రందాకఁ
గలిసియు నిలుఁడు గంగాతీరములను;
ఆతఁడు మిత్రుఁడో? అరయ శత్రుండో?
కాక, మధ్యస్థుఁడో? కనిపెట్టి నేను
తదుపరి వర్తింతుఁ దగినవిధాన.
ఆతఁడు చూపెడి యా స్నేహాతత్త్వ
మను మచ్చురాతిపై నాతనిప్రేమ
నేఁ బరీక్షించెద- నెంత దాఁచినను
దాగదు వైరంబు దాగదు ప్రేమ."
అని చెప్పి ఆ నిషాదాధినాయకుఁడు
విభుల కర్పించెడి విహితవస్తువుల
కందమూలఫలాల, ఖగమృగంబులను,
సమకూర్ప భటుల కాజ్ఞాపనఁ జేసె.
ప్రాచీనఘనపీనపాఠీనమీన
గణముల జాలరుల్ గంపలకొలఁదిఁ
గైకొని తెచ్చిరి కావళ్ళతోడ.

గుహుఁడు కానుకలు గొని భరతునిచెంత
కేగుట

గుహుఁ డంత కట్నముల్ గొని బయల్ వెడలె
భరతునిచెంతకు; భద్రంబుఁ గూర్చు
శుభశకునంబులుఁ జూపఁజొ నపుడు.
అమ్మునివల్లభుఁ డగు శ్రీవసిష్ఠుఁ
గాంచినయంతనె ఘనభక్తి నతఁడు
తనపేరుఁ బల్కుచుఁ దాఁ బ్రణమిల్లె
నల్లంతదూరాన నపు డా మహర్షి,
అతఁడు రామప్రియుం డని గ్రహియించి
ఆశీస్సు లొసఁగియు నతనివృత్తాంత
మంతయు వచియించె నా భరతునకు.
అల రామహితుఁ డాతఁ డని వినినంత
రయమున భరతుండు రథమును డిగ్గి
ఆ నిషాదునిచెంత కాత్ర మొప్పార
ముందుకు నడచె నుప్పొంగఁగాఁ బ్రేమ;
గుహుఁ డంతఁ దనయూరుఁ,గులమును, బేరుఁ,
దెలిపియు ధరణిపైఁ దలమోపి మ్రొక్కె-
భరతున కో భరద్వాజమునీంద్ర!

భరతుఁడు గుహుని సత్కరించుట

అవనిపైఁ బ్రణమిల్లి నట్టియా గుహుని
భరతుండు కనుఁగొని పైకెత్తి తనదు
గుండెకు హత్తించుకొనియె, లక్ష్మణునిఁ
గలిసినరీతిగాఁ గడుప్రేమ పొంగ.
పరమానురక్తితో భరతుఁ డా రీతి
గుహునిఁ గౌఁగిటఁ జేర్చుకొనుట వీక్షించి
ఆ ప్రేమఁ బొగడిరి, అఖిలజనంబు.
ఆకసమందుండి అమరు లావేళ
జయ జయ ధ్వనులను సలుపు చా గుహుని
ధన్య ధన్యుం డహా! ధర నీతఁ డనుచుఁ
బొగడిరి, కురిసిరి పుష్పవర్ష ములఁ.
"ఈ నిషాదుఁడు లోకదృష్టిలో మఱియు
నిగమదృక్పథమున నీచుఁ డెన్నంగ;
ఈ నిషాదునినీడ యెవనిపై సోకు?
వాఁడు స్నానముఁ జేయవలయుఁ దత్క్షణమె;
అయినను నేఁడు రామానుజుం డితని
గాఢానురక్తితోఁ గౌఁగిటఁ జేర్చె,
ఆనందపులకీకృతాంగుఁ డై అహహా!
ఆవులించుచు నైన నా రామనామ
సంస్మరణంబును సలిపెడివారి
పాపసంఘంబులు పారిపోయెడిని.
అహ! యీ నిషాదనాయకుఁ డగుగుహునిఁ
గడుఁబ్రేమతోడను గౌఁగిటఁ జేర్చి
ధర రాముఁ డితని కీతనివంశజులకు
నిఖిలలోకమును బునీతం బొనర్చు
ఘనతరమహిమఁ దాఁ గరుణించియుండె.

*కర్మనాశజలంబు గంగలోఁ గలియ
వానినిఁ దలపైన వహియింపఁ డెవఁడు?

రామనామమహిమానువర్ణనము

వాల్మీకి మున్ను విపర్యయరీతి
రామనామజపంబు రక్తిఁ గావించి
బ్రహ్మసమానుఁ డై భాసించె; నట్టి
విషయంబు విదితము విశ్వమం దెల్ల.
♦శ్వపచులున్, శబరులు, జడయవనులును,
మఱియు ఖాశీలు, బామరజను లైన
కోలకిరాతకకోటులుఁగూడ,
మహనీయ రామనామ ప్రభావమునఁ
బరమపావను లౌచుఁ బరిఢవిల్లెదరు;
భువనవిఖ్యాతిని బొంది వెల్గెదరు;
ఇందులోఁ నాశ్చర్య మేమియు లేదు;
యుగ యుగ మం దిట్టు లుర్వైఁ జరుగు.
రఘువీరచరణానురక్తిఁ జే నెవఁడు
పృథుకీర్తిఁ బొందలే డీ విశ్వమందు?"
ఈ ప్రకారంబుగా బృందారకాళి
రామనామమహిమఁ బ్రస్తుతిసేయ
విని యయోధ్యాప్రజల్ వీనులారంగఁ
బరమసంతోషసంభరితాత్మ లైరి.
ఈ రీతి భరతుఁడు శ్రీరామహితుని
గుహునిఁ దాఁ గలసియు గురుతరప్రీతి
లలితవాక్కులఁ గుశలప్రశ్న లడిగె.
భరతునిశీలంబుఁ బరమానురక్తి
నరసి యా గుహుఁడు నిషాదాధివిభుఁడు
తన్మయుం డయ్యెను దన్నుఁ దా మఱచి.

---

* కర్మనాశనది = బీహారులోని ఒకనది. దీనిలో స్నానముచేసిన సమస్తపుణ్యకర్మలు నశించునని ప్రతీతి.

♦ శ్వపచులు = కుక్కమాంసము వండి తిని జీవించువారు. శబరులు = భిల్లులు. కోలులు, కిరాతులు = ఇరుతెగల పర్వతారణ్యవాసులు. యవనులు = మ్లేచ్ఛులు (గోమాంసభక్షకులై దురాచారులై జీవించువారు) ఖాశీలు = ఉత్తర భారతములోని 'ఖాశా' అను పర్వతప్రాంతమున వసించు ఒకానొక ఆటవికజాతికి చెందినవారు.

అతఁడు లజ్జయుఁ బ్రేమ ఆనందరసము
ఆత్మలో నుప్పొంగ నట్టె యా భరతుఁ
గనుఱెప్ప వ్రాల్పక కనుచు నిల్చుండె.
అటు కొంతవడి కాతఁడంతరంగమున
ధృతిఁ గూర్చుకొనియును దిరిగి యా భరతు
పదపంకజములకుఁ బ్రణతిఁ గావించి,
ముకుళితహస్తుఁ డై ముందు నిల్చుండి,
ప్రేమతో నీ రీతి వినతిఁ గావించె;
"ఆనందమూలంబు లగు భవచ్చరణ
కమలముల్ దర్శింపఁ గలుగుటచేత
ఆనందమే నాకు నఖిలకాలముల
త్వన్మహానుగ్రహబలముచే నాథ!
బహుకోటితరములవఱకును మాకు
సర్వమంగళములు సంప్రాప్తమగును.
నా కర్మవితతిని నా కులం బెంచి
ఆ మహాప్రభునిమహత్త్వంబు నెంచి-
శ్రీరఘువీరు భజింపనిజనుఁడు
విధివంచితుఁడు సుమా విశ్వంబులోన.
కపటమానసుఁడను, గడుభీరుజనుఁడ,
కుమతిని, కడుహీనకులుఁడను, లోక
బాహ్యుండ, మఱి వేదబాహ్యుఁడ, నేను;
కాని శ్రీరాముండు కారుణ్యమూర్తి
తనవానిఁగా నన్ను దయతో గ్రహించి
నప్పటినుండి నే నహహా! సమస్త
భువనభూషణుఁడ నై పొలుపొందుచుంటి".
అని వచియించిన ఆ గుహరాజు
ప్రేమను వీక్షించి వినతి నాలించి,
శత్రుఘ్నుఁ డాతని సదమలప్రీతిఁ
గౌఁగిటఁ జేర్చియుఁ గడు సంతసించె.
అంతట రాణుల నరసి గుహుండు
మున్ముందు తననామమును జెప్పుకొనుచు
సాదరవినయభాషణములతోడ

నభినతుల్ గావింప, నా రాణు లెల్ల
ఆతని లక్ష్మణునట్లు ప్రేమించి,
"బహుకోటివత్సరపర్యంత మీవు
సుఖజీవనుండ వై శోభిల్లు" మనుచు
ఆశీస్సులిడిరి సమైక్యకంఠముల.
అఖిలనారీనరు లా గుహుఁ జూచి
సాక్షాత్తు తాము లక్ష్మణుఁ గాంచినట్లు
సంతోషమందు చీ సరణి వచించి,
"ఈ నిషాదాధిపుఁ డెంత ధన్యుండో-
బడసెను జన్మసాఫల్య మోహోహో!
మనరామభద్రుఁ డీతనిఁ దనబాహు
పంజరంబునఁ జేర్చెఁ బరమానురక్తి"
అని తన మహితభాగ్యముఁ గొనియాడు
ఆ మహాజనులప్రేమాలాపములను
విని యట్లు ప్రమదంబు వెలయఁజిత్తమున
వారలఁ దోడ్కొని పయనించె గుహుఁడు.
తమనాయకునిసంజ్ఞఁ దగ గ్రహియించి
గంగానదీతీరఘట్టముల్ వదలి
తద్గుహభటు లెల్ల తమతావు లైన
క్ష్మారుహావనగుల్మసరములఁ జేరి
వచ్చిన అతిథుల వాసంబొనర్ప
వసతు లొనర్చిరి, వరమునినాథ!
శృంగిబేరమును వీక్షించినంతటనె
అనురాగపారవశ్యమున నా భరతు
తనువెల్ల జర్ఝరితంబయ్యె; నపుడు;
పొసఁగ నిషాదుని భుజముపై వ్రాలి
ఆతఁడు నడుచుచున్నప్పుడు ధాత్రిఁ
దగవినయముఁ బ్రేమ, తనువులఁ దాల్చి
విహరింపుచుండినవిధము శోభించె.
భరతుఁ డిట్లు సపరివారుఁ డై వెడలి
కనె జగత్పావనిన్ గంగాభవాని.
ఆతఁ డచ్చోట రామావనీవిభుఁడు

స్నానంబొనర్చినసద్ఘట్ట మరసి
ప్రణతులు గావించి ప్రణుతు లొనర్చె-
శ్రీరాముఁ గలిసినరీతిగా హృదయ
మానందపారవశ్యంబును బొంద.
నగరనారీనరుల్ నతులు గావించి
తద్దివ్యవాహినీ దర్శనశ్రీని
బొంది నందులకుఁ బ్రమోదంబుఁ గనుచుఁ
దన్నదీజలములఁ దానం బొనర్చి
"శ్రీరామచరణ రాజీవంబులందు
సంతతభక్తిఁ బ్రసాదింపు మమ్మ"
అని వేఁడుకొనిరి బద్ధాంజలు లగుచు.
భరతుఁ డీరీతిగాఁ బ్రార్థ నఁజేసె;
"పావనీ! గంగాభవాని! ఓ జనని!
కనఁగఁ ద్వత్తీరసైకతరేణువితతి
సౌఖ్యప్రదం బహో! సకల జీవులకు;
కామధేనువు సేవకవ్రజంబునకు
అందుచే నేను బద్ధాంజలి నగుచు
వరమొక్కటీయగాఁ బ్రార్థించుచుంటి :
సతము సీతారామచరణాంబుజముల
సహజభక్తిని నా కొసంగుమా, మాత!"
ఈ రీతి స్నానాదికృత్యముల్ దీర్చి
గురుదేవునాజ్ఞఁ గైకొని, తల్లు లెల్ల
స్నానముల్ జేసినసంగతి నెఱిఁగి,
భరతుఁ డేర్పరచెను బటకుటీరముల;
సముచిత స్థలముల, సర్వులుఁగూడ
తమతమ వసతులఁ దా మొండి రఘుఁడు;
భరతుండు సర్వుల వసతులఁ జూచె.
పిదప దేవతలసేవించియు భక్తి
వారల సెల వొంది భరతశత్రుఘ్ను
లుభయులు గౌసల్య యొద్దకుఁ జనిరి.
అట భరతుండు మహోదర మొప్ప
పదముల నొత్తుచు స్వాదుభాషణల
మాతల నెల్ల సన్మానం బొనర్చె.
వారల సేవింపవలసిన దనుచు
శత్రుఘ్ను నియమించి సాదర మొప్ప
గుహు నంతఁ బిలిపించుకొని వాని చేయి
తనచేతఁ బట్టియుఁ దగఁ బయనించె
స్నేహభావోద్వగ్నశిథిలాంగుఁ డగుచు.
జానకీరామలక్ష్మణు లే ప్రదేశ
మందు నిద్రించిరో ఆనాఁటిరాత్రి-
ఆ ప్రదేశముఁ జూపి, ఆత్మీయనయన
హృదయతాపముల నొకింత చల్లార్పు
మని యాతఁ డర్థించె నా ప్రియసఖునిఁ
గనుగొలకులఁ బాష్పకణములు నిండ.
అన విని యా నిషాదాధినాయకుఁడు
దుఃఖించి భరతునిఁ దొడ్కొని చూపె-
రఘువల్లభుండు విశ్రాంతిఁ గొన్నట్టి
విమల మా శింశుపావృక్షతలంబు.
ఆ స్థలంబును జూచినంతనే భరతుఁ
డతిభక్తిగౌరవా లాత్మ వెల్లొంద
సాష్టాంగపడి సమస్కారం బొనర్చె.
ఆతఁ డాస్థలమునం దలరారుచున్న
అంద మానొక్కకుశాసనం బరసి
దానికి సల్పెఁ బ్రదక్షిణప్రణతు;
లాపయి రామపాదాంబుజముద్ర
లంటిన ధూళిని అఱచేతఁ దాల్చి,
వర్ణనాతీత మాభక్తి దీపింపఁ
గనులకుఁ దా నద్దుకొనియె మునీంద్ర!
సీత దాల్చిన చీరచెఱఁగు నందుండి
జారినబంగారు జల్తారుపోగు
లచ్చోట దర్శించి ఆ భరతుండు,
వానిని దలపైన వహియించె భక్తి-
సీతాసమంబుగాఁ జిత్తమం దెంచి.
కన్నీరు కాల్వ లై కారఁ గన్గవల

సంతాప ముప్పొంగ స్వాంతరంగమునఁ
దనమిత్రుఁ డగు నిషాదప్రభుఁ గాంచి
మధురవాక్యముల నీ విధముగాఁ బల్కె–:
ఈ జరీపోగులు పృథ్వీతనూజ
నెడఁబాసి శోభావిహీనంబు లయ్యె–
వ్యాకులవహ్నిచే వనరుచున్నట్టి
సాకేతనగరప్రజాతతి రీతి.
యోగభోగముల మహోదధి యైన
జనకనృపాలుతో సముఁ డెవఁ డుండు?
ఆ జనకుం డామె కహా! జనకుండు!
సూర్యవంశమునకు సూర్యుఁ డైనట్టి,
విజితపురందరవిభవుఁ డైనట్టి,
దశరథధారుణీధవుఁ డామెమామ!
ఎవ్వానిమహిమన్ మహిష్ఠు లెల్లరును
స్వప్రభావంబులఁ బడయుచున్నారొ
ఆ రామదేవుం డహా! ఆమె విభుఁడు!
అట్టి సీతాదేవి– అఖిలప్రపంచ
మహితపతివ్రతామణి– శయనించి
నట్టియీ ముదుగుదర్భాసనం బేను
కనులారఁ జూచినన్ గాని నా గుండె
వ్రయ్యలుగా; దిది, వజ్రంబుకన్నఁ
గఠినాతి కఠినంబుగాఁ గానిపించు.
నా సహోదరుఁడు లక్ష్మణుఁడు సౌందర్య
సౌకుమార్యములకుసదనుఁ డెన్నంగ;
అతనిఁ బోలినతమ్ముఁ డహా! మను లేఁడు;
నేఁడును లేఁడు; కాన్పింపఁడు ముందు.
పౌరుల కతఁడు పరమప్రియుండు;
తల్లిదండ్రుల కాతఁ డల్లారుముద్దు;
పృథ్వీసుతారఘువీరులకతఁడు
ప్రాణసమానుఁ డై పరఁగెడువాఁడు
కోమలసుశరీరుఁ డామృదుభావుఁ
డల వేఁడి గాల్పుల కలవాటు పడడు!

అట్టి యీ సౌమిత్రియడవులలోన
నిడుములఁ బడుచుండె నెన్నోవిధాల.
హా! కోటికోటి నక్రాతికఠోర
మీ నా యెడంద! ఇం కేమి యొనర్తు?
శ్రీరామచంద్రుఁడు స్వీయావతార
సందీపితాఖిల జగతీతలుండు;
సౌందర్యసౌశీల్యసౌఖ్యసమస్త
కల్యాణగుణగణఘనసాగరుండు;
ఆ మహాపురుషుదివ్యస్వభావంబు
జనపరిజనగురుజనపితృమాతృ
హృదయంబులకు మోద మిచ్చు సంతతము.
వినయమృదూక్తుల విమలశీలములు
మహితమర్యాదల మనసు హరించు–
శ్రీరామచంద్రుఁ గీర్తింత్రు వైరులును.
కోటివాణులు శతకోటి శేషులును
ఆ రామచంద్రుననంతకల్యాణ
ఘనగుణగణముల గణియింప లేరు.
ఆ చిదానందమయస్వరూపుండు
ఆ సర్వమంగళాహ్లాదనిధానుఁ
డా రఘుకులమణి అక్కటా! నేల
శయనించినాఁడు కుశాస్తరణమున;
విధివిధానము లౌర! పృథుబలీయములు!
దుఃఖమన్నది యెట్టిదో! రామవిభుఁడు
తా విని యెఱుఁగడు; తండ్రి, యీ మహితు
నెంచెను జీవనవృక్షంబునట్లు
కంటిని రెప్పలకైవడి, మణిని
సర్పంబురీతిగా జనయిత్రు లెల్లఁ
గాంచి రాయనఁ గడు గారాబ మెప్ప.
అట్టి శ్రీరాముఁ డాహా! కందమూల
ఫలపుష్పములఁ దిని బ్రదుకు నెల్లెట్లో
పసియించుచున్నాఁడు వనగర్భములను.
ఈయమంగళముల కెల్లను మూల

కారణం బై నట్టికై కేయి, ఎంత
దౌర్భాగ్యురాలు! తాఁ దనప్రాణపతికె
ప్రతికూలవిధమున వ ర్తించి యుండె.
ఉగ్రాఘనిధిని, సర్వోత్పాతములకు
హేతుభూతుండ నౌనే నంతకన్నఁ
బరమదౌర్భాగ్యుండఁ బరికింప; నకట!
మా వంశమున కెల్ల మాయని మచ్చ
గా, నన్ను విధి సృష్టిఁ గావించినాఁడు.
కపటి యౌమాతల్లి కై కేయివలన
మేదిని నేను స్వామిద్రోహి నైతి."
ఇట్లు నిర్వేదించునృపసుతు న్భరతు
నోదార్చె నా నిషాదో త్తముఁ డంతఁ
బ్రేమ, స్వాంతంబున వెలుగొంద నిట్లు.
"ఓ ప్రభూ! నీ వేల యూరక నిట్లు
పరితాప మొందుట? వదలుమా, వగను;
రామచంద్రుఁడు నీకుఁ బ్రాణప్రియుండు;
రామున కీవును ప్రాణప్రియుఁడవు;
పరమసత్యం బిది;- పరికింప సర్వ
దోషంబు ఘటియించె దుర్విధికతన.
పృథుకఠినములు దుర్విధివిధానములు.
అరయ దుర్విధియె కైకమ్మచి త్తములు
చలియింపఁ జేసె నీ చందంబు నాథ!
ఆ రాత్రి యిచ్చోట నా రామవిభుఁడు
మహితాదరంబున మాటిమాటికిని
నిను బ్రశంసించెను; నినుఁబోలునట్టి
శ్రీరామునకు మహాప్రియుఁ డైనభ క్తుఁ
డింకొకండు జగత్రయిని లేఁ డటంచుఁ
జెప్పుచుండెను దులసీదాసుఁ డనఘ!
నేఁ బ్రమాణముఁ జేసి యిది వచించెదను.
ధైర్యమూనుము మహాత్మా! స్వాంతమందు;
అంతయుఁ దుదకు శుభాస్పదం బగును.
తద్రామచంద్రు డంతర్యామి సతత
మతులితాఖండ మహాప్రేమమూ ర్తి
కరుణార్ద్ర హృదయుండు; కావున స్వామి!
హృదయాంతరంబున ధృతిని వహించి
వెడలియు శయనించి విశ్రాంతిఁ గనుము."
సఖుఁ డిట్లు పలికిన సద్వాక్యములకు
ధృతిఁ గూర్చుకొని నిజహృది భరతుండు,
శ్రీరఘువీరు స్మరించుచుం జనియెఁ
దనవాసమునకు; న త్తటి యీ విశేష
మటఁ గలయా పౌరులందఱు వినియు
శ్రీరామవిభుఁడు నిద్రించినయట్టి
స్థలముఁ గాంచఁగఁ దాము సైతమును జనియుఁ
బరమని ర్వేదసంభరితాత్మ లైరి;
తత్ స్థలమునకుఁ బ్రదక్షిణప్రణతు
లాచరించిరి మనసారఁ; గై కేయి
చేసినపనికి దూషించి రేకముగ.
తడవతడవకు నేత్రముల నీ రొలుక,
దుర్విధిందిట్టి రందునఁ గొంతమంది;
ప్రస్తుతిఁ జేసిరి భరతుని భ క్తి,
కొందఱు; దశరథక్ష్మోణీశ్వరుండు
తనదుప్రేమను యథార్థం బొనరించె
ననుచు సంభాషించి రటఁ గొంతమంది.
తుదకు వారలు తమదురదృష్టమునకు
దురపిల్లుచుం దమ్ము దూషించుకొనిరి;
గుహునిభాగ్యంబును గొనియాడుకొనిరి;
వారిబాధావ్యథల్ వర్ణింపవశ మె?
ఆ రీతి వా రెల్ల రా రాత్రి యెల్లఁ
గనుమూయకుండ జాగరణం బొనర్చి
రంతఁ బ్రాతఃకాల మయ్యె; నందఱును
గంగఁను దాటఁగాఁ గడఁగిరి; ముందు
శ్రీవసిష్ఠాచార్య శేఖరుండొక్క-
ఇంపగునోడలో నెక్కింపఁబడియె.

నవ్య మా నింకొక్క-నౌకలో నంత
నెక్కి-రి మెల్లగా నెల్లతల్లులును.
నాలుఁగు గడియలకాలంబులోన
గడచి రెల్లఱును గంగాప్రవాహమును
భరతుఁడు దిగి నావఁ బరివార మెల్ల
వచ్చినవిషయంబుఁ బరికించి చూచె;

అంతఁ బ్రాతఃక్రియ లన్నియుఁ దీర్చి
తల్లులపాదపద్మముంబుల కెఱఁగి,
ఆచార్యవందన మాచరించియును
భరతుఁడాపిమ్మట వనమార్గమందు
బోయలఁ గొందఱ ముందు బంపించి
తదుపరి సర్వులఁ దరలఁగాఁ జేసె.

శ్రీరామచరితమానసము

అయోధ్యాకాండము

త్రయోదశవిశ్రామము

శరణాగతజనరక్షక
బిరుదాంకిత! పరమపురుష! విశ్వాధారా!
హరిహరవిధిముఖవందిత!
వరదాయక! మట్టపల్లి వాస! నృసింహా!

భరతుఁ డంతట, భరద్వాజమునీంద్ర!
ముందుండి గుహు మార్గము న్జూప బంపి
తల్లులపాలకిఁ ల్తరలించి, వాని
వెనువెంట శత్రుఘ్నుఁ వెడలగాఁ జేసె.
పిదప వసిష్ఠ ర్షి, విప్రులఁగూడి
పయనంబుఁ గావించె. భరతుఁ డంతటను
గంగాభవానికిఁ గరములు మోడ్చి,
జానకీరామలక్ష్మణుల స్మరించి,
పయనంబు సాగించెఁ బదచారి యగుచు.
ఆతఁ డధిష్ఠించునశ్వరాజమును
నడిపించుకొని వెంటనడిచె భటుండు;
పరమవిశ్వాసు లౌభటు లది చూచి
"ప్రభు! దయచేసి యశ్వం బధిష్ఠింపు"
డని మాటిమాటికిఁ బ్రార్థనఁజేయ
నా మహారామభక్తాగ్రేసరుండు
భరతుఁ డీ రీతిగాఁ బలికె వారలకు:
"పదచారు లై రామభద్రులు చనగ
రథగజవాజివర్గములు నా కేల?
వాహనయానమా? భావించి చూడఁ
దలమోపి ధరణి,ఁ బాదములు పైఁ కెత్తి
పఁయనంబుసేయుట భావ్యమా నాకు
అఖిలధర్మంబుల నతికఠోరంబు
సేవకధర్మంబుఁ జింతించు నెడల."
అని వచియించెడియా మహాపురుషు
భరతకుమారు సద్వర్తనఁ జూచి
మృదువాక్యముల విని యెల్లసేవకులు
కఱఁగి నీరైరి శోకప్రతాపమున
అ ట్లేగిఁ యేఁగి యయ్యపరాహ్ణవేళ
కా భరతుండు ప్రయాగను జేరె.
ఉల్లమం దనురాగ ముప్పొంగ నతడు,
"రామ! సీతారామ! రామా!" యటంచు
ఉచ్చరింపఁగసాగె నుద్గమించుచును.
ఆ భరతునికోమలాంఘ్రులయందుఁ
బొడమినబొబ్బలుపొలుపొందె నపుడు
తామరమొగ్గపైఁ దగ వెలుఁగొందు
మంచుబిందువులట్లు, మానివరేణ్య!
భరతుఁ డా దినమునఁ బదచారి యగుచుఁ
బయనించె నని విని పరివార మెల్ల
అత్యంతదుఃఖంబు నందె మునీంద్ర!
స్నానంబు నెల్లరు సలిపినట్లెఱిఁగి
చని భరతుఁడు త్రివేణిని సమీపించి
ప్రణతులు గావించి భక్తితత్పరతఁ
దత్సితాసితశుభోదకములఁ గ్రుంకి

విధ్యుక్తపద్ధతిఁ బృథ్వీసురలను
దానంబు లొసఁగి సన్మానం బొనర్చె;
ఆ నీలధవళవర్ణాయతోత్తుంగ
రంగ త్త్రివేణీతరంగంబు లరసి,
ఆనందపులకీకృతాంగుఁ డై యిట్లు
ప్రార్థనఁ జేసెఁ గరంబులు మోడ్చి:
"ఓ తీర్థరాజమా! ఉర్వీలో నీవు
సకలకామప్రద శ క్తిమంతుఁడవు.
వేదసంవిదితము విశ్వవిఖ్యాత
మహ! భవదీయమహాప్రభావంబు.
నిజధర్మ మిప్పుడు నే విడనాడి
ఒక్కటి యాచించుచున్నాఁడ నిన్ను;
ఆర్తుఁ డెట్టియకార్య మైన నొనర్చు;
ఈ విషయం బాత్మ నెఱిఁగిన యట్టి
జ్ఞాను, లుదారులు, జగతి యాచకుల
ప్రార్థనావళిని, సాఫల్యంబొనర్తు.
కోరను ధర్మంబుఁ, గోర నర్థంబుఁ
గోరఁ గామంబును, గోర మోక్షమును,
జన్మజన్మములకుఁ జలనంబు లేని
శ్రీరామపదగతిఁ జేకూర్చు— మిదియె
ఏఁ గోరుకొనునట్టి ఏకైకవరము.
శ్రీరామచంద్రుఁడు చి త్తంబులోన
నే గుటిలుడ నంచు నెంచినఁగాని,
నను ద్రోహిగా జను లనుకొన్న గాని
భవదీయకృపను మద్భావంబులోన
జానకీరామాంఘ్రిజలజానుర క్తి
అనుదినం బభివృద్ధి నందునుగాక!
ధరణి యావజ్జీవితము, జలదంబు
చాతకపక్షిపైఁ బ్రీతిఁ జూపకనుఁ
వడగండ్లుఁ బిడుగులు వడఁ గురిసినను,
అది యంబుదప్రీతిఁ ద్యజియించునెడలఁ
బ్రజలు దానిని గౌరవంబునఁ గనరు;
అధికాధికంబుగా నది యంబుదమును
ప్రేమించియే సర్వవిధములఁ దుదకు
లాభంబుఁ గాంచు నిలాతలమందు.
పుటమున నిడినట్టిపుత్తడివోలె
బరమప్రియుం డగుప్రభు, రామచంద్రు
శ్రీచరణముల నై ష్ఠికచిత్తుఁ డైన
భక్తుండు జగతిలో భాసింపఁగలడు."
అని భరతుఁడు భక్తిఁ ప్రార్థించి నంత
నా త్రివేణీగర్భమందుండి యొక్క—
మృదుశుభవాణి యీ రీతి ధ్వనించె:
"నాయనా! భరత! కన న్నగమందు
సాధువర్యుఁడ వీవు సర్వవిధాల.
శ్రీరామచరణరాజీవంబులందు
నీకుఁ గల్గినభక్తి నిరవధికంబు.
మనమున వగ నొందఁ బనిలేదు నీకు;
నీకన్న శ్రీరఘునేత కిం కొకఁడు
పరమప్రియముఁ గొల్పువాఁడు లేఁ డనఘ!"
అని త్రివేణి వచించు ననుకూలవాక్కు—
లాలించినంత నే ఆ భరతునకుఁ
బులకించె దేహ, ముప్పొంగె నెడంద;
"ధన్యుండు భరతుఁడు ధన్యుం" డటంచు
సురలు కీర్తించిరి సుమములఁ జల్లి.
తీర్థరాజం బయి దీపించుచున్న
ఆ ప్రయాగక్షేత్రమందు వసించు
వైఖానసావళి, బ్రహ్మచారులును,
దనరు గృహస్థు, లుదాసీను లెల్ల,
బ్రముదంబుఁ గాంచిరి భావంబులందు.
అటనట నైదుగు రైనను, లేక
పదిమందియో కూడి, వారిలో వారు
"భరతునిభక్తియు వర్తన మరయ
సదమలం బత్యంతసహజ మోహహో!"
అని చెప్పుకొనిరి మహాహర్ష మొప్ప.

భరతుడు భరద్వాజాశ్రమమునకుఁ బోవుట

అంత శ్రీరామునియందు భాసించు
ఆ మహానంతకల్యాణగుణంబు
లానంద మొప్పఁగా నాలకించుచును
భరతుండు శ్రీభరద్వాజమునీంద్రు
సన్నిధానమునకుఁ జనియె; నత్తఱిని
తనమ్రోల ధరణిపైఁ బ్రణమిల్లినట్టి
ఆతనిఁ గనుఁగొని యా ముని, తనదు
భాగ్యదేవత రూపు వహియించి వచ్చి
నట్లుగాఁ దలఁచి, మహాహ్లాద పడుచుఁ
బరుఁగిడి ముందుకుఁ బైకెత్తియతనిఁ
గౌఁగిటఁ జేర్చి ప్రగాఢానురక్తి
ఆశీస్సు లొసఁగి కృతార్థుఁ గావించె.
అంత నా ముని చూపినట్టియాసనము
నందునఁ గూర్చుండె నా భరతుండు
తలవంచుకొనియు; నేతద్దృశ్య మరయ
అతిలజ్జ యనెడి గుహాగర్భమందుఁ
దనమోము దాఁచ నాతఁడు పరువిడఁగ
నుంకించుచుండిన ట్లుండె; నతండు
ముని యేమి యడుగునో యని మదిలోనఁ
గళవళపడుచుండె, ఖగరాయ! అప్పు
డా భరతునిశీల మతనివ్యాకులముఁ
బరికించి యా భరద్వాజుఁ డి ట్లనియె:
"వినుమోయి! భరత నే వినియుంటి మున్నె
వృత్తాంత మెల్ల ను– విధిఁ గాఁటఁగలమె?
తన్మాత చేసినదానిఁ దలంచి
వగవంగఁ బనిలేదు భావమం దీవు;
తలపోయఁ గైకేయితప్పిందు లేదు–
వత్స! వాగ్దేవియే, భ్రాంతం బొనర్చె
ఆమెచిత్తమును మాయాప్రభావమున.
అటుగాక నేను నీయందు దోషంబు
కల దని చెప్పినన్ గాని యెవ్వరును
సమ్మతింపరుసుమా, స్వాంతంబులందు.
ఎది, లోకహిత మౌనో– ఎది వేదహిత మొ–
దానిని బండితుల్ తగ సమ్మతింత్రు.
నీదగు దివ్యవినిర్మలయశము
కథనం బొనర్చి లోకంబు, వేదములు,
ఘనతవహించు నకల్మషచరిత!
ఏ పుత్రునకు రాజ్య మిచ్చునో తండ్రి,
అతఁడె రాజ్యాధికారార్హుఁ డౌననుట
విశ్వహితంబును వేదహితంబు.
సత్యవ్రతుం డగుతొల్మనాయకుండు
పిలిచియు నిన్నుఁ బృథ్వీరాజ్య మొసఁగె;
దాన నాతఁడు సుఖ, ధర్మ, కీర్తులను
చెందినా డిందులో చెడు గేమి లేదు.
కాని వచ్చిన సర్వకష్ట మే మనఁగ–
రామచంద్రునిమహారణ్యవాసంబె!
ఇద్ది విశ్వంబున కెల్ల నిశాత
కర్ణశూలం బయి కడుబాధఁ గూర్చె.
విధివశ్య యై, అవివేకురా లైన
కైకేయి, ఇ ట్లీయకార్యం బొనర్చె.
ఇపు డామెసైతము హృదయాంతరమున
భూరిపశ్చాత్తాపమును బొందుచుండె.
ఈ విషయంబులో నేమాత్ర మైన
నీయెడ దోషంబు నిలిపెడి వర్త్యుఁ
డధముఁ డజ్ఞాని మహాపాపి నిజము.
ఈవు రాజ్యమును గ్రహించినన్గాని
అందున నీ కఘుం బంటదు భరత!
రాముఁడుగూడ హర్షంబును బొందు
భవదభిషేకసద్వార్త నాలించి.
కాని నీ విప్పుడు గావించినట్టి
కార్యంబుఁ జూడఁగాఁ గడుసముచితము.
రఘువరచరణానురాగమే జగతి

నిఖిలసుమంగళనికరమూలంబు.
ఆ రామభ క్తియే యగు నీ ధనంబు
నీ జీవనంబును నీదుప్రాణంబు.
అహహా! నీవంటి మహాధన్యుఁ డెవఁడు?
ఇందులో నాశ్చర్య మేమున్న దోయి?
దశరథరాజేంద్రుతనయుఁడ వీవు,
శ్రీరామదేవునిప్రియసోదరుఁడవు.
ఆ రఘువంశదివ్యాభరణునకు
మనమున నీతో సమానుఁ డైనట్టి
ప్రేమపాత్రుఁడు లేఁడు వినుమోయి భరత!
తద్రాత్రి యెల్ల సీతారామలక్ష్మ
ణులు నిన్నె యనుకొని నుతిజేసి రనఘ!
ఏ నీ రహస్యంబు నెఱిఁగితి; వార
లలప్రయాగను స్నాన మాడుచున్నపుడు-
నిన్ను స్మరించి నిర్నిద్రానుర క్తి
వారు మువ్వురుఁ బ్రేమపరవశు లైరి.
అజ్ఞు మానవున కీ యవనిలో ఎంత
విషయసుఖప్రీతి వెలయునో, అంత
అనుర క్తి కలదు నీయందు రామునకు.
ప్రణతకుటుంబ సంరక్షకుం డైన
ఆ రఘువీరున కాత్మ నీపైన
ఇంతప్రేమ వెలుంగు నెన్న ఘనంబె?
అన్మదాశయ మిదే! అభివచించెదను:
శ్రీరామభ క్తిమూ ర్తి భావ మీవు!
ఎది కళంకంబుగా నెంచుచున్నావో
అది నీకు సుంతయే నంటదు; తలఁప
అది మాకు గుణపాఠ మనఘచరిత్ర!
శ్రీరామభ క్తిసంజీవనీసిద్ధి-
కీ సన్నివేశంబు పృథుహితంకరము.
రఘువరదాస్యైక రవచకోరముల
పాలిటి కహ! నీదు భవ్యయశంబు
సదమల నవనవ చంద్రబింబంబు;

అది అ స్తమింపక యనవరతంబు
వెలుఁగొందుచుండును విష్ణుపదాన;
అది జగదాకాశమందు భాసించు
తుయలయంబులు లేక సర్వకాలముల;
అది యీ త్రిలోక కోకాతిప్రియంబు;
అద్దానికళలఁ దా హరియింపఁ డెపుడు
తద్రామ దేవప్రతాప భానుండు;
రాత్రింబవ ళ్ళది రంజిల్లఁ జేయు
సర్వజీవాళిని సర్వకాలముల;
అల కైకదుష్కార్య మనురాహు, వెప్ప
డేనియు దాని గ్రసించఁగా లేదు;
మఱియుఁ దద్భవదీయమహిత యశోఽబ్జ
మండలం బోహోహో! నిండి వెల్లొందు-
విమలరామప్రేమపీయూషమునను.
అందులే దెందు గుర్వవమానదోష
చిహ్న మేదియును గ్వచిత్తుగా నైన.
సుధ వసుధాస్థలి న్నులభంబు నీవు
చేసియుండుటచేత శ్రీరామభ క్తు
లింక సంతృ ప్తిగా నీ యమృతమును
ద్రావి తాండవ మాడి తరియింత్రుగాక!
స్తోత్రార్హ మగుమీదుసూర్యవంశమున
మును భగీరథనృపపుంగవుఁ డెలమి
స్మరణమాత్రమున సమ స్తసన్మంగ
ళములఁ బ్రసాదించు లలితపవిత్ర
సురనదీమణిని వసుంధరలోన
బాటించినాడు తపఃప్రభావమున.
ఇఁక దశరథధారుణీంద్రు గుణంబు
లెన్నఁగాఁ దర మౌనె యేరికే గాని?
జగతిలో నతనితో సముఁ డెందు లేఁడు.
హృదయసంతృ ప్తిగా, నే రామచంద్రు
శివుఁడునుఁ గనుల దర్శింపఁగా లేదొ-
ఆ రామచంద్రుఁ డహా దశరథుని

భ క్తివినమ్రతాపరవశుఁ డగుచుఁ-
బ్రకటీకృతుం డయ్యె వసుధాస్థలమున,
సమము లేనిభవద్యశశ్చంద్రబింబ
మలరామభ క్తి మృగాంక మై యలరు.
ఈవు విచారింప నేల? కుమార!
చింతామణిని అఱచేతఁ గల్గియును
ధారిద్ర్యభీతిఁ బొందఁగ నేల నీవు?
ఆలింపు మోయి! నే ననృతంబుఁ బలుక;
వదలి ప్రాపంచికబంధజాలముల
వనగర్భములలోన వసియించు చిట్లు
దాపసవృ త్తి సదా పూనియుంటి;
ఏను గావించినయెల్ల సాధనల
మహితఫలంబునే మహిఁ బొందియుంటి-
జానకీరామలక్ష్మణదర్శనమున.
ఆ పొందినట్టి మహాఫలంబునకు
ఫలముగాఁ గల్గె భవద్దర్శనంబు.
అహ! ఈ మహాభాగ్యమందుటచేత
నే నొక్కఁడనె గాక యెల్లప్రయాగ
వాసులున్ ధన్యులు వత్స! యో భరత!
నిజయశో నిర్జిత నిఖిలవిశ్వండ
వగునీవు ధన్యుండ వన్నివిధాల."
అని భరద్వాజ మహర్షి వచించి
ప్రేమభావోద్యోగ వివశుఁ డైపోయె.
ముని పల్కు నీ వాక్యముల నాలకించి
సర్వసభాసదుల్ సంతోషపడిరి.
దేవతల్ భరతుఁ గీర్తించు చుప్పొంగి
కుసుమవర్ష ంబులఁ గురిసి; ర త్తజిని,
ఆకాశవీథిఁ బ్రయాగతీర్థమున
ఏకరీతిగ ధ్వనియించిన యట్టి
భూరిజయధ్వానముల నాలకించి
భరతుండు భ క్తిభావమున మై మఱచె.
అప్పు డా మహితాత్ముఁ డౌ భరతుండు
తను వెల్లఁ బులకీకృతం బయి వెలుఁగఁ
గన్దమ్ములను బాష్పకణములు నిండ
జానకీశ్రీరామచంద్రైక్యభావ
సంపూరితాత్ముఁ డై సదమలభక్తి
మునిసమూహమునకు ప్రొక్కి యీ పగిది
పలికెను గద్గదస్వన మొప్పుచుండ:
"ఇచట సదస్యులు ఋషివర్య; లింక
నిల్చియున్నది- తీర్థనేత ప్రయాగ.
ఇట్టిప్రదేశమం దేనరుఁ డైన
సత్యమే యగుఁగాక, శపథం బొనర్చి
పలుకుటచేతఁ బాపంబు ఘటించు;
ఇట్టిచో నింక ననృత మాడునెడల
నంతకు మించు ఘోరాఘుంబు కలదె?
అంతకు మించు నైచ్యం బుండఁగలదె?
మీ రెల్ల సర్వజ్ఞు; లా రఘూత్తముఁడు
ధరణిజానాథుఁ డంతర్యామి గాదె!
ఋతమును నేను వచించుచున్నాఁడ.
చింతింప మా తల్లి చేసినపనికి;
జననిందకును గుంద స్వాంతరంగమున;
పరితాపపడ సుంత పరలోకమునకు;
జనకునిమృతి కైన సంతాప మొంద;
ఆయన సుకృతమహోయశఃకాంతు
లఖిల జగంబులయందు వ్యాపించె;
ఆ రామలక్ష్మణు లంతటివారిఁ
దనయులుఁగాఁ గన్నధన్యుఁ డాతండు;
ఆ మహాభాగుఁ డహా! రామచంద్ర
విరహసంతప్తుఁ డై విడిచెను దనదు
దేహంబు నొక క్షుద్రతృణము చందమున.
అట్టిధన్యునిఁగూర్చి వ్యథ నొందఁ దగదు.
కాని, నా గుండియుఁ గలఁచుచున్నయది-
జానకీరామలక్ష్మణు లక్కటకట!
పురమును విడనాడి ముని వేషు లగుచు

పదచారులై వనివని సంచరించు
చుండిన విషయమే, ఓ బుధులార!
అజినవసనులు, ఫలాశనుల్, కఠిన
భూతలాస్తరితకుశాఽతతపత్ర
శయనులుఁ, దరుతలశరణు లై, శీత
వాతాతపోద్ధృతవాయువర్ష ముల
నోర్చుచు, వనములం దున్నారు వారు.
ఈ దుఃఖదావాగ్ని యే, నా యెడంద
నెడ తెగకుండ దహించుచున్నయది.
ఏ పూఁట యేనిఁ గూ డింతయుఁ బోదు;
రాత్రులఁ గనులకు రాదు నిద్దురయు;
ఏను శోధించితి నెల్ల విశ్వమును-
గాని, నా రుజఁ బాపఁ గలమందుఁ గాన.
*మా తల్లి కౌటిల్యమానసమనెడి
పాపాత్మఁ డొనొక వడ్డంగి అకట!
స్వకుమారహిత మనుబాడిసతోడ
వైరభావాశుభదారువుం జెక్కి-
దానితోఁ జెడుగు యంత్రమును గావించి,
శ్రీరామవనవాసచింతనం బనెడి
ఘోరభయంకరక్షుద్రమంత్రమును
బదునాల్గువత్సరాల్పరిమితి యనెడి
కాలపర్యంతంబు కడు జపియించి
పాఁతఁ దా సాకేత వసుధాస్థలమున,
అకట! నాకై గదా! ఆమె యీ దుష్ట
మంత్రాంగమును బన్ని మానీంద్రులార!
సర్వప్రపంచనాశనమును గూర్చె;
తిరిగి శ్రీరఘురామ దేవుఁ డయోధ్య
కే తెంచుపర్యంత మీ కీడు పోదు.
తిరిగి సాకేత ముత్తేజ మొందుటకు
ఇంతకన్న నుపాయ మేదియు లేదు."

అను భరతునివాక్కు లాలించినంత
నా భరద్వాజర్షి హర్షంబు నొందె.
సర్వు లా భరతుని సన్నుతిఁ జేసి
రెన్నెన్నోవిధముల హృది సంతసిలుచు.
"వత్స! నీ వింతగా వగ నొందవలదు.
శ్రీరామదర్శనశ్రీ నొందినంతఁ
దృటిలోన నీ శోక మెల్ల నశించు."
భరతు నిట్లా భరద్వాజమహర్షి
పరగ నోదార్చి యీ పగిది వచించె:
"అస్మత్ప్రియాతిథి వై నేఁడు భరత!
ఆరగింపుము తృప్తి దీర మే మొసఁగు
వరకందమూలముల్ ఫలపుష్పములును".
అన విని మునివాక్కు లా భరతుండు
మనమున వ్యాకులమును బొందె; నతని
కాక్లిష్టసమయంబునం దది యొక్క-
కఠినసమస్యఁగాఁ గనుపించెఁ; గాని
పెద్దల ఆజ్ఞను బెడచెవిం బెట్టఁ
దగ దని యెఱిఁగిన ధర్మజ్ఞుఁ డౌట
ముని పదాబ్జములకు ప్రొక్కి సద్భక్తి
నంజలిబద్ధుఁ డై యనియె నీ తెఱఁగు:
"చిత్తము, మీఆజ్ఞ శిరసా వహించు
టరయ మహోధర్మ మగుఁగాదె, నాథ!"
అనుభరతోక్తుల కలరి యా మౌని
విశ్వాసపాత్ర మై వెలుఁగొందుచున్న
తనభృత్యతతి, శిష్యతతి జేరఁ బిలిచి,
"భరతున కారగింపఁగ సత్వరంబు
కందమూలఫలాదికములను దెండు"
అని పల్క విని వార లంద ఱేకముగఁ
"జిత్త" మటంచును శిరముల వంచి
వందనంబు లొనర్చి పరమహర్షమునఁ

---

* శత్రువును వానియింటినుండి వెడలఁ గొట్టుటకు మాంత్రికుఁడు చేయు ప్రయోగవిధాన మిందు సూచితము.

జని రంతఁ దమపనుల్ సలుపఁ దలంచి.
"భరతునియంతటిపరమఘనుండు
వచ్చె నే డతిథిగా భాగ్యవశానఁ
దలఁప నా యా దైవతములకుఁ దగిన
పగిది నారాధింపవలయునుగాదె!"
అని భరద్వాజర్షి ఆత్మలోఁ దలఁచె.
అని మునిసంకల్ప మైనంతలోనె,
వృద్ధిసిద్ధులు వచ్చి వినతులొనర్చి
ఏమి కావలయు స్వామీ! ఆజ్ఞ నొసఁగుఁ
డని ప్రార్థనముఁ జేసె ననఘా! ఖగేంద్ర!
"భరతశత్రుఘ్నులు వారిబృందమును
రఘురామవిరహఘోరవ్యాకులాత్మ్ము
లై, వచ్చి రిచ్చటి కతిథు లై నేఁడు-
వారలశ్రమను నివారణఁ, జేసి
సంతోషపఱచుఁడీ సకలవిధాల"
అని యా మునీశ్వరుఁ డనియె హర్షమున.
అమ్మునివరునాజ్ఞ నా వృద్ధిసిద్ధు
లానందమున శిరసా వహించియును
అమితభాగ్యముఁ గంటి మని తలపోసె.
"ఆ రాముసోదరుఁ డైన యీ భరతుఁ
డసమానుఁ డైనట్టియతిథి యోహోహో!
ఇదె మునినాథునిపదముల కెఱుఁగి
చని రాజపరివార జనుల కెల్లఱకు
సౌఖ్యసంతతుల నొసంగుద" మనుచు
తలఁచెను సిద్ధులు తమలోనఁ దాము.
రమ్యరమ్యవిమానరాజంబు లైన
అద్భుత నానాగృహాళి నిర్మించి-
రవి, మహాభోగభాగ్యప్రపూర్ణంబు
లాశింత్రు కని సురలైన నవ్వాని.
దాసదాసీజనతతిప్రీతి గదుర
అవసరవస్తువు లన్నింటిఁ గొనుచు
నతిథుల సేవింప నాయత్తమైరి.

స్వప్నమం దైనను స్వర్గలోకమునఁ
గాంచఁగా లేని సౌఖ్యంబు లన్నిఁటిని
సిద్ధులు సిద్ధిల్ల జేసెను త్రుటిని.
ప్రథమంబున న్వారు ప్రతియతిథికిని
ఆ వ్యక్తి కభిరుచి కనువై వెలుంగు
పరమసుందరసుఖప్రదసౌధ మొసఁగి
రో గరుడా! విహగోత్తమా! వినుము.
అంత మునీంద్రునాజ్ఞానుసారముగ
భరతునకును వాని పరివారమునకు
సముచితావాసముల్ సమకూర్పఁ బడియె.
అహ! భరద్వాజమహర్షివరేణ్య
వరతపశ్శక్తి సంభవవిభవంబు
విధిని సైతము మహావిస్మయపఱచె.
అమ్మునినాథుమహాప్రభావంబుఁ
గాంచఁగా భరతునికనులకుఁ దోఁచె
అల దిక్పతులసిరి యత్యల్ప మగుచు.
ఆ భోగములఁ జెప్ప నలవిగా దనఘ!
అవ్వానిఁ గనినచో నహ! జ్ఞానులైన
తమవిరాగంబును వ్యజియింపఁ గలరు.
వర శయనాసనవసన వితాన
ఘన వనవాటికా ఖగమృగావళులు,
మహితసుగంధసుమప్రతానములు,
అమృతోపమానమహాఫలవితతి,
అమలిననానాజలాశయసమితి,
అలరారె నప్ప డయ్యాశ్రమమందు.
అమృతధిక్కారరుచ్యాన్న పానీయ
జాలంబు లచ్చట సమకూరియుండె.
వానిఁ గైకొనక తపస్సులరీతి
నా యతిథులు సంశయావిష్టు లైరి.
సురసురభీ, వరసురతరుతతులఁ
బ్రతిమందిరంబుఁ బ్రభాసించుచుండె.
అలశచీదేవేంద్రు లరసి యవ్వాని

నాశాప్రపీడితు లైరి, ఖగేంద్ర!
మధుమాస మేతెంచె, మందసుగంధ
శీతవాతములు వీచెను మంజులముగ.
అలచతుర్విధపురుషార్థంబు లెల్ల
అందఱికును సులభ్యంబు లైయుండె.
వరలుప్రక్చందనవనితాదిభోగ
వితతి నా యతిథులు వీక్షించి మదిని
హర్ష విచారంబు లందిర త్తఱిని.
ఆ భరద్వాజమహాముని యాజ్ఞ
అను నొక్క-క్రీడాపరాయణుం డైన
బాలుఁ డాశ్రమ మనుపంజరమందు
భోగాళి యను చక్రవాకిని మఱియు
భరతుం డనెడి చక్రవాకముఁ, రెంటి
నా రాత్రి బంధించె; నైన నా జంట
తెలవారుదనుకను, గలియక నిలిచె!

భరతుఁ డాతనిపరివారమంతయును
అఖలతీర్థవరేణ్య మగు నా త్రివేణి
స్నానంబు లొనరించి సదమలభ క్తి
ప్రమొక్కి అమ్మహాముని పాదములకు.
భరతుండు తద్భరద్వాజమహర్షి
యాజ్ఞను మఱియు శుభాశీస్సు లొంది
ఆ సంయమీంద్రుని యడుగుఁ దమ్ములకు
దండప్రణామముల్ తగ నాచరించి
ఘనతరప్రార్థనఁ గావించె గరుడ!

భరతుఁడు పరివారసమేతముగ చిత్ర
కూటమునకుఁ బయనించుట

తదుపరి నాతఁడు తగుమార్గదర్శ
కులతోడఁ బరివారకోటితోఁ గదలెఁ
చిత్రకూటంబును జేరఁగాఁ దలఁచి.
అలరామసఖుఁ డైనయా గుహుచేయిఁ
దనచేతితోఁ బట్టుకొని భరతుండు
తనువుఁ దాల్చినప్రేమ యనఁగ గమించె.
గొడుగు నెత్తిని, గాళ్ళకుం జెప్పు లేని,
ఆ భరతునకు లే వయ్యె- ఆ మహితు
నందలిప్రేమయు, నాత్మనిగ్రహము,
నిష్ఠయు, ధర్మంబు, నిర్మలినములు.
తతభ క్తి నతఁడు, సీతారామలక్ష్మ
ణారణ్యయాత్రాకథాళి వచింపఁ
గోర, శ్రావ్యంబుగా గుహుఁడు విన్పించె.
రామచంద్రుండు విశ్రాంతిఁ గైకొనిన
స్థలములఁ గాని వృక్షంబుల నేని
అరసినయంతనే యా భరతుండు
ఆపుకోలేనంతయనురాగ మెప్పఁ
బరవశుఁ డగుచుండె, పక్షిలోకేశ!
ఆతని మహిత దివ్యస్థితిఁ జూచి
కురిసిరి ధర సురల్ కుసుమవర్ష ములు;
మృదుమంజులం బయ్యెఁ బృథ్వీతలంబు;
మంగళప్రద మయ్యె మార్గ మత్తఱిని;
నీడల నీనెను నింగిమేఘములు;
వీచెను హాయిగాఁ బిల్ల తెమ్మెరలు;
ఆరామచంద్రుప్రయాణంబుకన్న
బహుసుఖంబుగ సాగె భరతునియాత్ర.
శ్రీరామదర్శనశ్రీఁ గాంచినట్టి
సచరాచరప్రపంచప్రాణు లెల్లఁ
బరమపదార్హతఁ బడసె- నిత్తఱిని
భరతసందర్శనభాగ్యంబుచేత
భవరోగముక్తినే బడసె ఖగేంద్ర!
ఎవ్వని శ్రీరాముఁ డెద నెంచు సతము-
ఆ భరతున కిది యధిక మాపనియె?
ఒకసారి రామనామోచ్చారణంబు
సలిపినమాత్రాన సంసారవార్ధిఁ
దాఁ దరించుటగాక తగ నితరులను
సంతరింపఁగజేయఁ జాలుదు; రింక

రామలక్ష్మణులచేఁ బ్రేమింపఁబడెడి
భరతునంతటివాఁడు పయనించుచుండ
నా యాత్ర సర్వశుభాకరం బయ్యె-
ననుటలో నాశ్చర్య మరయ నే మున్న?-
దని, సిద్ధసాధుమహాముని జనులు
తలఁచు చాభరతు సందర్శించి మిగుల
హర్ష ంబునొందిరి స్వాంతరంగముల.
అప్పుడు భరతుమహాప్రభావమును
గాంచి దేవేంద్రుఁడుఁ గళవళపడియె.
మంచివారికిఁ దోఁచు మంచి దై జగము,
చెడ్డవారికిఁ దోఁచుఁ జెడ్డ దై జగము:
ఆ సమయంబున నా దేవనాథుఁ
డాత్మీయగురుని బృహస్పతిఁ గాంచి
పలికె నీ రీతిగా వ్యాకులపడుచు:

దేవేంద్రుఁడు రామభరతసమాగమమున
కంతరాయము గల్గింప బృహస్పతినిఁ
బ్రార్థించుట

"అలరామభరత సమాగమ మధిప!
ఘటియింపకుండ మార్గముఁ గనవలయు.
కరుణాసముద్రుఁడై క్రాలుచున్నట్టి
శ్రీరామచంద్రుఁడు ప్రేమవశ్యుండు-
భరతుఁడో ప్రేమత త్త్వమునకు వార్ధి-
మనపని చెడునని మతిభీతి కలిగె;
మనకార్యసిద్ధి యీమార్గంబుఁ గనుము."

బృహస్పతి శ్రీరామప్రభావము నుగ్గడించి
దేవేంద్రు బుద్ధిని మఱల్చుట

అను నింద్రువాక్కుల కా సురగురుఁడు
చిఱునవ్వు నవ్వి, తాఁ జిత్తంబులోన
"అరయ నీతఁడు సహస్రాక్షుఁ డైగూడ
అంధుఁ డై యున్నాఁ డ"టంచు గ్రహించి
పలికె నీ తెఱఁగు దేవప్రభుతోడ
"మాయాధినేత రామప్రభుపాద
పద్మముల్ గొలిచెడి భక్తునిపైన
మాయఁ బ్రయోగించు మందుండు తానె
మాయానిబద్ధుఁ డై మ్రందు దేవేంద్ర!
క్రిందటితడవ నా శ్రీరామచంద్రు
సుముఖత గ్రహియించి సురనాథ! మనము
చేసితి మొక్కింత చిత్రకార్యంబు;
కాని యిత్తఱిని గుకార్యంబు మనము
చేసితిమా? కీడు చేకూరు మనకె.
విను మింద్ర! శ్రీరఘువీరస్వభావ
మే మనఁ దన కెగ్గు యెవఁడేని సేయ
నాతనిపై నాగ్రహంబును గనఁడు;
జగతి భాగవతాపచారం బొనర్చి
నట్టివానిని మాత్ర మా రామరోష
పావక కీలలు భస్మం బొనర్చు.
ఈ యితిహాస మ దెల్ల లోకముల
వేదంబులందున విదితంబు గాదె:
ఆ రామచంద్రు మహాప్రభావంబు
స్వాంతంబులోన దుర్వాసుం డెఱుంగు.
జగ మెల్ల రాముని జపమొనరింప
రాముఁడో? మదిని భరతుని జపించు;
భరతునివలె రామభద్రునిపైన
నిరతమహాప్రేమఁ నిలుపువాఁ డెవఁడు?
ఓయి సురాధిపా! ఓ శక్ర వినుము!
రఘురామభక్తకార్యంబును జెఱచు
తలఁపేని మనములోఁ దలపోయవలదు.
అది నీకు లోకమం దపకీర్తిఁ గూర్చు;
పరమునఁ బెనుదుఃఖభారంబుఁ గూర్చు;
నీ జీవితం బెల్ల నిత్యశోకమున
దందహింపఁగఁబడుఁ దథ్య మీ మాట.
ఓ యింద్ర! వినుము నా యుపదేశ మిదియె:

శ్రీరామునకు మహాప్రియుఁడు, భక్తుండు;
తద్దాసదాస్యతత్పరత రాఘవుఁడు
స్వాంతరంగంబున సంప్రీతుఁ డగును.
భక్తులయెడ వైరభావంబు గలుగు
వారల కా హరి, బద్ధవిరోధి.
రఘురామచంద్ర పరబ్రహ్మ మరయ-
రాగవిద్వేషవిరహితుండు, సముఁడు,
పాపపుణ్యాతీతపరమపావనుఁడు,
ఒగి గుణదోషశూన్యుం డయి యున్నఁ-
గర్మప్రధానముఁ గాఁ జేసి జగతిఁ
దన్మూలమునఁ దాము తాఁ జేసికొనిన
దానికి జీవులు తగుఫలంబులను
జెందుచుండెడిరీతిఁ జేయుటచేత
నొకఁ డాస్తికుండు నిం కొకఁడు నాస్తికుఁడుఁ
గాఁగ వర్తించినకతన నొక్కనికి
హితునిఁగా, నొకని కహితునిచందముగ
బాహ్యంబునకుఁ గానవచ్చు చుండినను,-
గన నిర్గుణుఁడు నిరంజనుఁ డభిమాన
హీనుండు, మఱియు నిశ్చేష్టకరసుండు
నై, వెలుఁగొందుచున్నప్పటి,- కమల
భక్తానురాగసంవశ్యుఁ డై భువిని
సగుణరూపంబున సాక్షాత్కరించు.
సర్వదాశ్రీరామచంద్రుండు భక్త
చిత్తానుసారంబు చెలఁగుచునుండు.
వేదపురాణముల్ విబుధసాధువులు
దీనికి సాక్ష్యము దేవేంద్ర! దీని
గురించి మతిలోనఁ గుటిలత విడిచి
భరతపాదాబ్జసద్భక్తిని గనుము.
శ్రీరామపాదరాజీవసేవకులు
పరహితనిరతులు, పరదుఃఖదుఃఖి
తాత్ములు, పరమదయాళువు- లెన్న
భక్తశిరోమణి భరతుండు; కాన,
ఆతనిగూర్చి భయంబొందఁ జనదు.
సాకేతనాథుండు సత్యసంధుండు
సురహితకారి; యీ భరతుఁడో- రామ
చంద్ర దివ్యజ్ఞానుసారి సతంబు.
స్వార్థవశ్యుండ వై స్వాంతమం దీవు
వ్యాకుల మొందితి; వమరేంద్ర! కాని
భరతునిలో దోష మరయఁగా లేదు;
నీ శోకహేతువు నీ మోహగుణ మె!"
అని దేవతాగురుం డాడిన దివ్య
వాక్కుల నాలించి వాసవుం డంత
పరమహర్షముఁ బొంది భావంబులోన
వ్యాకులంబును బరిత్యాగం బొనర్చి,
పొంగి తాఁ గురియుచుఁ బూలవానలను
భరతు సద్భావంబుఁ బ్రస్తుతిఁ జేసె.
భరతుఁ డీ రీతిగాఁ బయనించుచుండె-
అతనిమహాదశ నరసి సిద్ధర్షి
లాశ్చర్యపడుచుండ నంతరంగముల.
"హా రామ!" యని యాతఁ డార్తితోఁ బల్కి-
నిట్టూర్పు విడిచిన నిముసమం దెల్ల-
అతనిమహాప్రేమ అవధులు దాటి
యుప్పొంగి పొరలిన ట్లుండె- నత్తఱిని
గఱిన మాశీలలును గఱఁగి నీరయ్యె
నాతని విరహశోకాలాపములకు.
పౌరులప్రేమయు వర్ణనాధికము.

భరతుఁడు సపరివారముగ యమునానదిని
దర్శించుట

దారిలో నొకచోటఁ దద్భ్రమంద మెల్ల
విశ్రాంతిఁ గైకొని వెడలియుఁ జేరె
నతజగత్ప్రియ యమునాతీరమునకు.
నిర్మల యమునా వినీల నీరముల
దర్శించినంతనే తద్భరతునకుఁ

గనుఁగోనలను నీరు కాల్వలు గట్టె.
రామసుశ్యామవర్ణము గల్గియున్న
ఆ యమునానది నరసినంతటనె
భరతుఁడు నాతని పరివార మెల
శ్రీరామవిరహవార్ధి నిమగ్నులగుచు
నెట్టులో బ్రతికి రొక్కింత యూఁతగను
దతవివేకం బనుతరణి లభింప.
ఆ రోజు వార లా యమునాతటాన
విడిసి; రందఱికిని విడుదు లేర్పడియె
సమయోచితం బగుసరణి ఖగేంద్ర!
ఆ రాత్రి యట కసంఖ్యాకంబు లైన
బహువిధ నౌకాళిత్వర జేరికొనియె
అన్ని రేవులనుండి అండజరాజ!
అంతటఁ దెలవాఱ నందఱుఁగూడ
దాఁటిరి నది నొక్కతడవగాఁ గలిసి-
ఆ రామసఖుఁడు నిషాదాధి విభుఁడు
సలిపినసేవకు సర్వులు నాఁడు
సంతోషమందిరి స్వాంతరంగముల.
అంత స్నానాదికార్యంబులఁ దీర్చి
తన్నదీమణికి వందన మాచరించి
భరతశత్రుఘ్నులు పయనంబుఁ జేసి-
రలనిషాదాధిపుఁ డగు గుహుతోడ.
అందటికన్నను ముందటఁ గదలె
వామదేవవసిష్ఠవరమును లున్న
వాహనరాజ; మా వాహనంబునకు
వెనువెంటనే రాజబృందంబు కదలె.
భరతశత్రుఘ్ను లుభయులును బిదపఁ
బయనంబుఁ జేసిరి పదచారు లగుచు:
పృథునిరాడంబరవేషభూషణము
లూని, యా దివ్యసహోదరుల్ భృత్య
తతిమిత్రమంత్రినందనయుక్తు లగుచు
జానకీరామలక్ష్మణులసంతతము
సంస్మరించుచు యాత్ర సాగించి రనఘ!
రామచంద్రుండు విశ్రాంతిఁ గైకొన్న-
విడిదిఁ గావించిన- విమలంబు లైన
ఆ యా సలంబుల నరసినంతటనె
ప్రణతిఁ గావించిరి భక్తితో వారు.
విని యీ విశేషంబు విపినమార్గమునఁ
గలగ్రామములయందుఁ గాపురముండు
స్త్రీపురుషాదులు శీఘ్రంబు దనరఁ
దమతమగృహకృత్యతతి విడనాడి
పరుగిడి రా రాజపథికులవెంట;
వారిరమ్యాకృతుల్, భక్తి వీక్షించి
తమజన్మ ధరణి సార్థక మయ్యె ననుచుఁ
బరమసంతోషసంభరితాత్ములై రి.
ఒకకాంత యప్పు డింకొకతెతో నిట్లు
సంభాషణముఁ జేసె సదమలప్రీతి:
"ఈ సహోదరు లిద్ద రెవ్వారో? చెలియ!
అలరామలక్ష్మణులా? మఱికాద?
వయసున వర్ణరూపప్రకాశముల
శీలంబునందున స్నేహంబునందుఁ
దత్తుల్యులై యుండ్రి తరుణిరో! మఱియు
వీరలనడకయు వీక్షించునెడల
శ్రీరామలక్ష్మణుల్ స్మృతికి వచ్చెదరు.
కాని, తేడా, దేనిలోఁ గల దనఁగ?
వీరివేషంబులు వేఱుగా నుండె;
వెంట సీతాదేవి వీరికి లేదు.
చతురంగబలసమన్వితులు పై పెచ్చు;
ముఖరంగములను బ్రమోదంబు లేక
ఖిన్నాంతరంగు లై యున్నారు వీరు-
దీనిచే నేను సందేహించుచుఁటి."
అను నామె తర్కంబు నాలించి చెలులు
సమ్మతించుచు, "నీకు సమయైన చతుర
కీతినిలే" దని ప్రశంసించి రేకముగ.

మఱియొక వనిత యా మానినీమణిని
సన్నుతించుచు, "ఆ మె సత్యంబుఁ బలికె"
నని మెచ్చుకొనియు మహామృదుభణితి
వచియించె శ్రీరామపట్టభంగాది
వృత్తాంత మెల్లను బ్రేమ దీపింప;
భరతునిసౌశీల్యభ క్తివై రాగ్య
సౌభాగ్యముల నిట్లు సన్నుతిఁ జేసె:
"పితృదత్తరాజ్యంబు విడి తృణమటులు
ఏకాయకసరో యొకింత గైకొనుచుఁ
దిరిగి రఘూద్వహుం దెచ్చుటకొఱకుఁ
బయనించుచుండెను భరతుఁ డీ రీతిఁ
బదచారి యాచు సద్భ క్తి వెలుంగ.
ఈ నాఁడు భరతుతో నెవ్వఁడు సముఁడు?
భరతుభ్రాతృప్రేమ, భ క్తిశీలములు,
వినిపించువారును, వినువారు, సకల
దుఃఖోగ్రదోషవిదూరు లౌచుంద్రు.
ఏ నా గుణంబుల నెంత చెప్పినను
స్వల్పమే యగు సుమా! సఖులార! వినుఁడు!
తద్రామచంద్రసోదరుఁ డట్లుగాక
ఎ ట్లుండు? ఆశ్చర్య మిం దేమి గలదు?
భరతశత్రుఘ్నులఁ బరగఁ గన్నట్టి
మనము ధన్యులమహా! మహిళలయందు".
అట్లు లా భరతుని యమలగుణంబు
లాలించి యతని దైన్యమును వీక్షించి
ఆ యంగనామణు లందఱుఁగూడ,
"కైకగర్భంబునఁ గలుగఁగాఁ దగిన
వాఁడు కాఁ డెన్న నీ భరతుఁ" డటంచుఁ
బరితాపపడిరి భావంబులలోన.
అంత నిం కొక కాంత యనియె నీ రీతి:
"కైకను దూషింపఁగాఁ బనిలేదు,
మనబోటివారి కీమహిత భాగ్యంబుఁ
గలిగింప విధి యిట్లు గావించినాఁడు.

తలఁప లౌకిక వేదధర్మహీనలము,
కుక్రియాపరలము, కులవిహీనలము,
కుప్రదేశంబున కుగ్రామమందు
సంవసియించు నీచస్త్రీల మైన
మన కెట్లు లభియించు?- మహితపుణ్యంబు
చేసినవారి కే చేకూరు వారి
భవ్యసందర్శన పరమభాగ్యంబు!"
ప్రతిగ్రామమునఁగూడఁ బ్రకటింపఁబడియె
ఆశ్చర్యహర్ష ంబు లావిధానమున.
కన మరుభూమిలోఁ గల్ప వృక్షంబు
కనవచ్చి నటు తోఁచె గరుడ! అ త్తఱిని.
వనమార్గపరిసరప్రజ లెల్ల నాఁడు
భరతదర్శనమును బడయుటచేతఁ
బరమధన్యత్వంబుఁ బడసి రోహోహో!-
సింహళమందు వసించువారలకు
విధివశంబున మహావిమలప్రయాగ
అతిసమీపంబున కరుదెంచినట్లు.
తనగుణవితతిని దద్రామచంద్ర
కళ్యాణగుణకథాకాండముల్ వినుచు
శ్రీరామదేవు స్మరించుచు లోన
భరతుండు వనమునఁ బయనించుచుండె.
ఆతఁ డ ట్లేగుచు నగపడినట్టి
సర్వతీర్థంబుల స్నానముల్ సలిపె;
అఖిలాశ్రమంబుల నాలయంబులను
సేవించియును నమస్కృతు లొనరించె.
జానకీరామాంఘ్రిజలజాతభ క్తి
మాత్రమే వర మీయ మతిఁ గోరుకొనుచు
భరతుఁ డట్లేగుచు వనమార్గమందు
ఏ భిల్లు లేని మఱే కోలు లేని
ఏ యాటవికుఁ డేని ఏ వటు వేని
ఏ యతి యేనియు నే యుదాసీనుఁ
డేని వైఖానసుఁ డేని కన్నులకుఁ

గనుపించుచో నమస్కారముల్ సలిపి
జానకీరామలక్ష్మణులు వసించు
వనభాగ మెఱిగింపఁ బ్రశ్నించుచుండు.
వారు శ్రీరాముని వార్తలఁ దెలిపి
భరతసందర్శనభాగ్యంబుచేతఁ
బడసిరి జన్మసాఫల్యంబుఁ దార్క్ష్య!
"జానకీరామలక్ష్మణులఁ జూచితిమి
వారు క్షేమం బన్న వరశుభవార్తఁ
దెలిపిన ధన్యు లౌ తెరవరు లెల్ల
జానకీరామలక్ష్మణుల చందముగ
నతిప్రీతిఁ గూర్చిరి యా భరతునకు
దారిఁ గన్పడు బాటసారుల నెల్ల
మంజులఫణితి సమాచార మడిగి
వారలచే రామవనవాసవృత్త
మాలకించు నతం డనంతార్తితోడ.
ఆ రోజు భరతుఁ డయ్యూటవిలోఁ దగిన
తావున విడిసి ప్రాతఃకాలమందె
శ్రీరామచంద్రు స్మరించి చిత్తమునఁ
బయనంబు సాగించె; భరతునివలెనె
ఆతని పరివారమంతయు రామ
దర్శనలాలసత్వంబు వహించె.
చూపట్టె వారికి శుభశకునములు:
కన్నులయందునఁ గరములయందు
సంచలనంబులు సద్రీతిఁ గలిగె.
"రామనరేంద్రుదర్శనభాగ్య మెదవు
దుఃఖతాపం బింకఁ దొలఁగు" నటంచు
భరతుఁడున్ ఆతని పరివార మెల్ల
యుల్లంబులందు సముత్సాహపడిరి;
తమతమబుద్ధికిఁ దగినరీతిగను
వార లేవేవియో భావించుచుండ్రి;

అల రామభక్తి మహామధుపాన
మత్తు లై మేనుల మఱచి రండఱును;
దడఁబడుచుండఁ బాదంబులు వారు
ప్రేమవశంబుచే విహ్వలు లగుచు
మాటాడఁ దొడఁగి రున్మాదులరీతి.

చిత్రకూట సందర్శనము

అంత రాముని సఖుఁ డైన గుహుండు
భరతునకుం జూపెఁ బరమానురక్తి
భాసురసహజశోభానిధానంబు
ఘనశైలరత్న మాకామదగిరిని.
తత్సమీపమునఁ దే తనరారుచున్న
దివ్యపయస్వినీతీరంబునందు
జానకీరామలక్ష్మణులు వసింత్రు.
ఆ చిత్రకూటంబు నరసినంతటనె
సర్వులు "జయ జయ జానకీనాథ!
జయ రామ శ్రీరామ జయ రఘురామ!"
అని జయధ్వానంబు లతిభక్తి నిడుచు
సాష్టాంగపడి నమస్కారంబు లిడిరి.
పురికి శ్రీరాముఁడు మఱలినరీతిఁ
బ్రేమభావోద్వేగవివశ మైపోయె
అఖిలరాజసమాజ- మాసమయమున.
ఆ శుభవేళయం దా భరతుండు
వెలయంగఁ జేసినప్రేమ వర్ణింప
నాదిశేషున కైన నలవిగా దహహా!
'నేను' 'నాయది'-యని నిరత మెంచుచును
మలినాత్మ లై యుండు మానవావళికి
బ్రహ్మసుఖం బెట్లు ప్రాప్యంబు కాదో-
ఆ రీతి యా భరతానురాగంబు
కవివర్ణనల కందఁగారాక వెలయు!

శ్రీరామచరితమానసము

అయోధ్యాకాండము

చతుర్దశవిశ్రామము

భువనచతుర్దశవందిత!
ప్రవిమలయోగీశహృదయవాస! రమేశా!
శివ! భవ! గోవిందాచ్యుత!
భవభయహర! మట్లపల్లివాస! నృసింహా!॥

శ్రీరాఘవస్నేహశిథిలాంగు లగుచుఁ
బయనించి సూర్యాస్తమయమగువఱకు
నాల్గుక్రోసులదవ్వు నడచిరి వారుఁ
సముచితస్థలిజలాశయ ముంటఁ జూచి
వా రెల్ల నారాత్రి బసఁజేసి రచట;
ఆపయిఁ దెలవాఱినంతనే భరతుఁ
డా రాఘవప్రియుఁ డందఱితోడఁ
బయనంబు సాగించెఁ బక్షిలోకేశ!

జానకీస్వప్నవృత్తాంతము

అక్కడఁ జిత్రకూటాశ్రమమందుఁ
బెందలకడ రఘువిభుఁడు మేల్కొనియె;
నుర్వీజ కా రాత్రి యొక కల వచ్చె:
తనసమాజఁబుతోఁ దరలి యా భరతుఁ
డరుదెంచినట్లును, ఆతఁడు రామ
చంద్రవియోగాగ్నిసంతప్త దేహుఁ
డై యుండినట్లును, ఆతనివెంట
వచ్చినవారును బహుదుఃఖదైన్య
భారాంధకారసంవ్యాపితహృదయు
లై యుండినట్లును, అత్తలందఱును
వైధవ్యవేషముల్ వహియించియుండి
నట్లును గనిపించె నా స్వప్నమందు.
ఆ స్వప్నవృత్తాంత మాలించినంత
నీ ర్ష్యిమ్మె శ్రీరాము నేత్రాంబుజముల;
సర్వశోచనవిమోచనుఁ డయి వెలయు
నా రామపరమాత్మ అహ! శోక మొందె.
"శుభసూచకము గాదు చూడ నీ స్వప్న
మో లక్ష్మణా! ఏదియో ఘోర మైన
దుర్వార్త మనము విందు మటంచుఁ దోఁచు"-
నని రాఘవుండు లక్ష్మణుఁ గూడి స్నాన
మాచరించియును బురారిఁ బూజించి
సాధుసన్మానంబు సల్పె ఖగేంద్ర!
సురల సన్మానించి వరమునీశులకు
వందనంబు లొనర్చి భక్తి వెలుంగ
నా రామధరణీశుఁ డంతఁ గూర్చుండి
దృక్కుల నుత్తరదిశవైపుఁ బఱపె;
నత్తఱి ధూళిచే నాకాశ మెల్లఁ
గ్రమ్మఁగాఁ బడియెను; గళవళ మొంది
ఖగమృగగణములు కడురయ మొప్ప
రామాశ్రమమువైపు రాసాఁగెఁ బాఱి.
అంత రాముఁడు లేచి అరసి యా దృశ్య,
మిందుకుఁ గారణ మేమి యైయుండు?
నని స్వాంతమందున నాశ్చర్య మొందె.

అపుడు కోలకిరాతు లట కరుదెంచి
విన్నవించిరి దృశ్యవృత్తాంత మెల్ల;
విని రాముఁ డా భిల్లబృంద సుమంగ
ళాలాపముల మహాహర్ష ంబు నొందె-
తను వెల్లఁ బులకరింతలతోడ నిండ,
అల శరత్సరసీరుహాక్షియుగ్మమునఁ
బరమానురాగ బాష్పంబు లుప్పొంగ.
అటుల సంతోషించియా రామవిభుఁడు
మఱునిమేషంబున మానసమందుఁ
గడువ్యాకులం బొందె, "నడవి కిత్తఱిని
దేనికై భరతుఁ డేతెంచెనో?" యనుచు.
ఇంతలో నెవ్వఁడో యేతేంచి తెలిపె,
"భాసుర చతురంగబల యుతుం డగుచు
వచ్చుచున్నాఁడయా; భరతుఁ" డటంచు.

శ్రీరాముఁడు భరతాగమనంబు నాకర్ణించి
తనలోఁ దాను వితర్కించుకొనుట

ఆ మాట వినినంత నా రామవిభుఁడు
కళవళపడియెను గడు మానసమున.
ఒకవైపుఁ దనతండ్రి యొసఁగినయాజ్ఞ,
ఒకవైపునఁ బ్రియసహోదరుఁ డైన
భరతునిపై గలపరమానురక్తి!
శ్రీరామచంద్రుండు చిత్త మందెఱుగు
భరతస్వభావంబు బాగుగా, దాన;
నిదమిత్థ మని నిశ్చయింపలేకుండె.
అటుపైన నతఁడు నిజాంతరంగమున,
"భరతుఁడు వినయసంపన్నమానసుఁడు
సాధువు ధర్మవిచారపరుండు;
కావునఁ బితృవాక్కుఁ గాదని, నెట్టి
నా వ్రతభంగం బొనర్పరా డనుచుఁ
దలపోసికొని సమాధానంబు నొందె.
ఆరీతి శ్రీరాముఁ డంతరంగమున

నాందోళనముఁ జెందు టరసి లక్ష్మణుఁడు,
సమయోచితముగ నీ సరణి వచించె:
"అవసరసమయంబునందు సేవకుఁడు
తగుమాటఁ జెప్పుట తప్పు గాకుంట;
నాకయి నేనె ఓ నాథ! శ్రీరామ!
చెప్పఁగా నిటు సాహసించితి దేవ!
సర్వజ్ఞమణి వీవు; స్వామి! శ్రీరామ!
ఐనను నీ చరణానుచరుండ
నగుటచే నా స్వాంతమం దున్నదాని
విన్నవించుచునుంటి మన్నించు మీశ!
ఓ ప్రభూ! నీవు మహోదారహృదయుఁ
డవు, వినిర్మలచిత్తుఁడ, వమాయకుఁడవు;
సౌశీల్యసుస్నేహసదనుండవీవు;
ప్రతివ్యక్తిఁ బ్రేమించి పరగ నమ్మెదవు;
అందఱునీవలెనుందురటంచుఁ
దలఁతువు నీవు సీతాప్రాణనాథ!

లక్ష్మణుఁడు శ్రీరామునితో భరతునిఁగూర్చి
పరుషోక్తులాడుట

విషయసుఖాపేక్ష విడనిమూఢాత్మ
లే దేని పదవి లభించినయంత
విభ్రాంతు లై మదోద్యోగంబు నొంది
తమ్మైజగుణమును దగఁ బ్రకటింత్రు.
భరతుండు మును ధర్మనిరతుండు, మఱియు
సాధువు సుజ్ఞాని- సకలప్రపంచ
విదిత మాతనిరామపదపద్మభక్తి;
కాని, నేఁ డాతఁడు కాకుత్స్థనాథ!
త్వద్రాజ్యపదమునంప్రాప్త మైనంత
ధర్మమర్యాదలఁ ద్యజియించినాఁడు.
కనిపెట్టి సమయంబు గహనమం దీవు
ఏకాకిగా వసియించుటఁ దెలిసి
ఈ దుష్టకపటసహోదరుం డొక్క-

చెడ్డపన్నాగంబుఁ జింతనఁ జేసి
సముచితసన్నాహసన్నద్ధుఁ డగుచుఁ
దన దగురాజ్యపదంబు సంతతము
నిష్కంటకంబుగా నిలుపుకొనంగ
వచ్చుచున్నాఁడు దేవా! రామభద్ర!
కుటిలదుష్టోపాయకోటిఁ జింతించి,
ఈ సహోదరు లిద్ద ఱేక మై పెద్ద
సైన్యంబుఁ గైకొనిచను దెంచుచుండ్రి.
వారిలోఁ గపటంబుఁ బాపచింతనము
మయగకుండిన రథగజవాజు లేల?
భరతుని దూషింపఁ బని యేమి గలదు?
రాజ్యపదంబు సంప్రాప్తించినంత
నిలను మదోన్మత్తుఁ డెవఁడు కాకుండు?
గురుపత్నినే మున్ను గూడె చంద్రుండు?
బ్రాహ్మణులను దనపాలకీ మోయు
నట్టుగా నియమించె నా నహుషుండు;
వేనునితోడ సమానుఁ డై నట్టి
నీచాతినీచుఁడు నృపులందు లేఁడు;
వాఁ డిల లౌకికవైదికధర్మ
విముఖుఁ డై జృంభించె విశ్వరంగమున;
ఊర్వీసహస్రబాహుఁడు, సురాధిపుఁడు,-
మతియుఁ ద్రిశంకుభూమండలాధిపుఁడు,-
వీరలం దెవ్వఁడు వీక్షించునెడల
రాజ్యమదోన్మత్తు లై జగం బందు
దుష్కృతిఁ బొందలేదో? సెలవిమ్ము.
ఋణరిపుశేషంబు లిలలోనఁ దగవు.
భరతుఁడు తగినయుపాయమే పన్నె;
కాని, యాతం డొక్కఁడానిలో మిగుల
పోరపాటుపడెను- రాముఁడు నిస్సహాయుఁ
డని తలచెను లోన; నై నఁ గానిమ్ము-
నేఁ డాతఁ డిఁకపై న నిశ్శేషముగను
బొందిన పోరపాటుఁ బోఁగొట్టుకొనును-

సంగ్రామరౌద్రరసావేశదుర్ని
రీక్ష్యభయంకరశ్రీరఘువీర
ముఖరంగదర్శనమున నిశ్చయముగ."
ఇట్లు లక్ష్మణుఁడు వచించె నుద్విగ్న
హృదయుఁ డై, ధర్మవిస్మృతిని వహించి;
ఆతని వీరరసావనీరుహము
పులుకల విరియఁగాఁ బూచె నత్తఱిని.
అంత నా సౌమిత్రి ఆ రామవిభుని
పాదంబులకు ఁ మ్రొక్కి, వానిరజంబు
శిరమునఁ దాల్చి, వచించె నీ రీతిఁ
దనసత్యసహజప్రతాపంబు వెలయ:
"మన్నింపుమా, నాదుమాటలు స్వామి!
భరతుండు నాలోనఁ బ్రజ్వలితంబు
సల్పినకోపంబు స్వల్పంబు గాదు.
ప్రభు! నీవు నా చెంత వసియించియుండ
గరమున ధను వుండఁగా నెంతదనుక
నీ యపరాధంబు నే సహియించి
ఆగ్రహంబును నిగ్రహం బొనరింతు?
క్షత్రియజాతిలో జన్మించి యుంటి;
రఘుకులమందునఁ బ్రభవించి యుంటి;
శ్రీరామచంద్రునిసేవకజనుఁడ
నని ప్రసిద్ధిని గంటి నఖిలలోకముల;
ఇట్టి నే నీదోష మెట్లు సహింతు?
ధూళికణంబుతోఁ దుల్య మూనీచ
వస్తు వేముండును? వసుధ నయ్యాదియుఁ
గాలితోఁ ద్రొక్కినఁ గనలి పై కెగసి
శిరముపై కెక్కును, శ్రీరామచంద్ర!"
అని పల్కి లేచి రామానుజుం డంతఁ
జేతులు ముకుళించి సెలవు నర్థించె-
తద్దృశ్య మరయ నిద్రాణ మై యున్న
వీరరసంబు కన్విప్పిన ట్లుండె.
విడి వ్రేలు జడలను పెనవైచి ముడిచి,

అంబులపొది మూఁపునందు ధరించి,
వి ల్లెక్కఁ బెట్టియు, భీషణంబైన
బాణ మొక్కటి హ స్తపద్మమం దూని,
పలికె నా లక్ష్మణస్వామి యీ పగిది;
"ఈనాఁడు రామున కేను సేవకుఁడ
ననుమాట యీథార్థ్య మెనరించుకొనియు
భరతున కొకగుణాపాఠంబు పరఁగ
నేను రణక్షోణి నేర్పెదఁగాక;
శ్రీరాముననిరాదరించినందులకు
ఫలముగా భరతుఁ డవ్వానిసోదరుఁడు
సంగ్రామశయ్యపై శాశ్వతనిద్రఁ
గాంతురుగాక ఓ కాకుత్స్థనాథ!
సకలసమాజంబు సమకూడె నిచట;
మంచిది, నేఁడు నా మదిఁ గల్గియున్న
కోపమంతయుఁ దీర్చుకొందు శ్రీరామ!
ఇభసంఘములను మృగేంద్రునిరీతి,
భరతపక్షుల డేగపగిదిగా, నేను
భరత శత్రుఘ్నుల వారిసైన్యముల
నందఱఁ జీల్చి చెండాడెద నేఁడు.
శివుఁడె ఆతని యండఁజేరి నిల్చినను
రాముసాక్షిగ వానిరణమునఁ గూల్తు!"
అని లక్ష్మణుండు రోషాతిరేకమున
నాడిన శపథవాక్యంబు లాలించి
లోకముల్ కంపించె; లోకాధిపతులు
భయపడి పారిపోవఁగ సిద్ధపడిరి;
గడగడ వణకె జగంబు; ల త్తతిని.

అశరీరవాణి

లక్ష్మణునదోర్బలంబు నెంచుచును
ఆకాశమందుండి అశరీరవాణి
వినిపించె వీనులవిందుగా, "వత్స!
త్వత్ప్రతాపప్రభావంబుల నెవరు
వచియింపఁ గల?- రంతవఱి కేఁగ నేల?
గ్రహియించుకొనఁ గలరా? మహాభాగ!
ఏ దేని పనిచేయ నెంచుచో ముందు
తలపోయవలె నుచితానుచితముల;
ఇది జనసమ్మత; మిట్టుగాక యెవరు
తలపోయ కే యుచితానుచితములఁ
బనిచేసియున్ దుదిఁ బశ్చాత్తపింతు
రరయ వా రవి వేకు లని ప్రవచించు
వేదశాస్త్రంబులు విబుధసంతతులు,
అని వినవచ్చిన ఆకాశవాణి
విని లక్ష్మణస్వామి బిడియంబుఁ జెందె-
కాని శ్రీరాముడున్ ఊర్మిపుత్రి యతని
సాదరసన్మానసద్వాక్యములను
బలికి యోదార్చిరి; "వత్స! సౌమిత్రి;
నీదువాక్యంబులు నీతియుక్తంబు;
లవు- నతిదుష్టమే- ఆ రాజమదము;
సాధుసంసేవన సలుపని యట్టి
అవివేకి యగు నృపుఁ డవని రాచరిక
మును, రుచిచూచియు మోహితుఁ డగుచు
మదమత్తుఁ డగును లక్ష్మణ! కాని, వినుము:

శ్రీరాముఁడు భరతభక్తిప్రాశస్త్యంబు నుగ్గడించుట

భరతుని యంతటిపరమభక్తుండు
విధిసృష్టియందున వేఱొక్క రుంట,
కన లేదు మఱియు నే వినలేదు తనయ!
బ్రహ్మవిష్ణుమహేశపదవుల నైన
బొందినన్, భరతుండు పొందఁడు సుమ్మి
రాజ్యమదంబును రవ్వంత యైన;
చిలకరించఁగ గంజి క్షీరసాగరము
విరుగుట కల్గునా వీస మేనియును?
మధ్యాహ్నమార్తాండమండలం బంధ

కారంబుచే మ్రింగఁగాఁ బడవచ్చు;
గగన మంబుదమునఁ గలసిపోవచ్చు;
గోష్పాదజలములోఁ గుంభసంభవుఁడు
మునిఁగిపోవచ్చును, భూమాతయైనఁ,
శ, ఋమాగుణమును ద్యజియింపవచ్చు;
శకాళి ఫూత్కారమాత్రంబుచేత
మేరుపర్వత మెగిరిపోవచ్చుఁ;
ని, ఆ భరతుండు కలయందుఁగూడ
ర్వంత పొందఁడు రాజ్యమదంబు.
జము సుమిత్రజా! నీతోడు మఱియు,
జనకపాదులతోడు! జగతి గాలింప
భరతునిఁ బోలినపరమసజ్జనుఁడు
పరిశుద్ధహృదయుఁ డై వఱలు సోదరుఁడు
మఱి యొక్కఁ డెందు లక్ష్మణ! లేఁడు లేఁడు!
గుణదుగ్ధముల నవగుణజలంబులను
గలిపి యీ విధి సృష్టిగావించె జగము;
అలహంసవంశపద్మాకరమందుఁ
బ్రభవించి యున్నట్టిపరమహంసంబు
భరతుఁ; డాతఁడు గుణవ్రజక్షీరములను
గ్రహియించి యవగుణవ్రజనీరములను
విడిచి, విశ్వంబును వెలుఁగొందఁ జేసె-
నిజయశఃకాంతుల నింపి సౌమిత్రి!"
అని రాముఁ డా భరతామలశీల
సత్స్వభావములఁ బ్రసంగించుకొనుచుఁ
బ్రేమపయోరాశి లీనుఁడై పోయె.
ఆ రామచంద్రుదివ్యాలాపములను
విని, భరతునిపైన విభునకుఁ గల్గు
పరమానురక్తిని బరికించి సురలు
కడు సంతసంబును గాంచి యెందమున;
"అహ! రామచంద్రమహాప్రభువంటి
పరమకృపానిధి పరికింపఁ గలఁడె?"
అని ప్రస్తుతిం జేసి హృక్యకంఠముల.

"జగతిలో భరతుఁ డే జన్మింపకున్న
సకలధర్మంబులు క్ష్మామండలమున
సంస్థాపనముఁ జేయఁజాలు నెవ్వండు?
కవికులంబునకు నగమ్య మై పరఁగు
భరతుని సద్గుణవ్రజము నెఱుంగ
నీవు గాక సమర్థు లెవ్వరు! రామ!"
అనుచున్న సురలవాక్యము లాలకించి
జానకీరామలక్ష్మణు లాత్మలోన
అభివర్ణనముఁ జేయనలవి గానంత
పరమహర్షంబును బడసిరి గరుఁడ!
అక్కడ భరతుఁ డయ్యఖిలసమాజ
సంయుతంబుగ నేఁగి స్నానం బొనర్చి
నిర్మలమందాకినీనదిలోన-
తత్తీరమందు బృందము నెల్ల నిలిపి,
మాతలకడ, గురుమంత్రులచెంత,
ననుమతి నొంది, బయల్ దేఱె నంత
గుహుని, శత్రుఘ్ను నిఁ, గూడి సంప్రీతి
జానకీ రాఘువాశ్రమదేశమునకు.
ఆతఁ డ ట్లేగుచు నంతరంగమునఁ
దనతల్లికపటంబు తలపునం దోఁప,
జంకుచు జంకుచు సందేహపడుచుఁ
దనలోనఁ దాను వితర్కింపఁ దొడఁగె
నెన్నియో భావంబు లెదలోన రేఁగ:
"జానకీరామలక్ష్మణులు నా పేరు
విని, యీ స్థలంబును విడిచి వేఱొక్క-
స్థలమున నసీయింపఁ జనినార లేమొ?
అస్మజ్జననిబుద్ధి కనుకూలవర్తి
గా నెంచి నన్ను రాఘవుఁ డెట్టిఘోర
శిక్షవిధించినన్ జిన్న దే, యగును;
కాని, ఆ ఘనునిహృత్కుంజంబు నరయఁ
దప్పక నాదగుతప్ప లన్నిఁటిని
క్షమియించి కరుణింపఁగలఁ డని తలఁతు.

మలినచిత్తుఁడ నంచు మనమున స్వామి
ఎంచి నన్ను నిరాకరించినన్ గాని,
కాక, స్వకీయకింకరునిగా నెంచి
చేరఁగాఁ దీసి రక్షించిన ట్లాని.
రామపాదుకలె శరణ్యముల్ నాకు.
రామచంద్రుండు సత్ప్రభు; వెంచిచూడఁ,
జెడుఁ గెల్ల నుండె నీ సేవకునండె.
నియమసుప్రేమలు నిలుపులోనఁ
గడుకీర్తిఁ గనె, చాతకములు మీనములె."
స్వాత్మ నిశ్లెంచుచుఁ జనుచుండె భరతుఁ
డాతనితను వెల్ల నలసియు సొలసె
సంశయప్రేమాతిశయవశ్య మగుచు.
తల్లి చేసినదుష్కృతము పాదములను
వెనుకకు లాగఁగా, విడువక నతని
భక్తిబలంబు చేఁ బట్టి ముందునకు
లాగఁగా, హృదిని ధైర్యముఁ గూర్చుకొనుచు
భరతుఁ డేగఁదొడంగెఁ, బక్షీంద్ర! గరుఁడ!
శ్రీరామహృదయంబుఁ జిత్తమం దెంచి
నపుడెల్లఁ దడఁబడు నాతని యడుఁగు
లావేగమున ముందు కరుఁగఁదొడంగె.
అరయ జలప్రవాహానుసారముగఁ
జను సుడిక్రైవడిఁ జనుచుండె భరతుఁ
డత్తఱి భరతునియాందోళనంబు
ననురాగ మరసి నిషాదాధిపవిభుఁడు
మై మఱచెను గరుత్మంత! ధీమంత!
శుభశకునంబులు చూపట్టె నపుడు
విని, వానిఁ గనిపెట్టి, వివరించె గుహుఁడు
"ఆందోళనము పోయి ఆనంద మొదవుఁ
గాని, తుదిన్ జింతగలుగు" నటంచు.

భరతుని సీతారామాశ్రమ వన ప్రవేశము

శ్రీరామచంద్రునిసేవకుఁ డైన
శబరేంద్రుప్రతివాక్కు సత్యమం చెఱిఁగి
చని చని భరతుఁ డాశ్రమతలిఁ జేరె.
అచటి యరణ్యమహాశైలపంక్తు
లవలోకనముఁ జేసినంత నతండు
ఆకలిఁ గొన్నవాఁ డమృతాన్న మరసి
నట్లు మహానంద మందె డెందమున.
*ఈతిబాధలచేత నేగింపఁబడుచు
♦త్రివిధతాపంబులఁ దికమక పడుచు
భీష్మమారీగ్రహపీడితం బగుచు
సంతాపపడెడిప్రజానీక మొక్క
సత్పరిపాలనాసంయుతం బైన
నిత్యసుభిక్షమై నెగడొందుచున్న
సుప్రదేశముఁ జేరి సుఖియించినట్లు
భరతుఁ డానందసంభరితాత్మఁ డయ్యె.

సీతారామాశ్రమవనవర్ణనము

సద్భూభు ర్నన్న ప్రజానీకమట్లు–
శ్రీరామవిభుఁడు వసించుటచేత
వనలక్ష్మి పరమశోభాపూర్ణ యగుచు
కళకళలాడుచుఁ గనవచ్చుచుండె.
అచ్చటిరమణీయ మామహావన మె
దివ్య మానొక మహాదేశము తలఁప;
అల వికేక మె దాని యధిపతి యానఁ;
మహితవిరాగమే మంత్రిసత్తముఁడు;

---

* ఈతిబాధలు = 1 అతివృష్టి, 2 అనావృష్టి 3 మూషికబాధ 4 మిడుతల బాధ 5 చిలకల బాధ 6 శత్రురాజుల దాడులు.

♦ త్రివిధతాపములు = 1 ఆధ్యాత్మికము 2 ఆధిభౌతికము 3 ఆధిదైవికము.

*యమనియమావళి యగు భటవరులు;
ఇక జిత్రకూటాద్రియే రాజధాని;
శాంతియు సద్బుద్ధి సదమలమతులు
రమ్యాకృతులు గలరాణు లెన్నంగ;
ఈ రీతిగా వివేకోర్వీశుఁ డెసఁగె-
ఉత్తమపాలన కుచిత మైనట్టి
సర్వాంగసంపూర్ణ సంశోభతోడ.
అలరామచరణసమాశ్రయుం డగుట
ఆ నృపవర్యుహృదంతరాళంబు
చండతేజోబలశక్తిపూరితము.
మోహమహీపాలుమోహారసుందు
దళయుతంబుగ గెల్చి తద్వివేకావ
నీపతిరాజ్యంబు నిష్కంటకముగఁ
బాలింపుచుండె నవార్యశౌర్యమున;
సర్వత్రసుఖవృద్ధిసంపద లెపుడుఁ
గొల్లలుకొల్ల లై కొమరొప్పుచుండె.
ఆ వనదేశంబునందు రహించు
అగణితమునినివాసావళి యగును-
ఘనపురనగరముల్ గ్రామసంతతులు;
వివిధాగణితచిత్రవిహగమృగాళి
ఆ నరనాథుప్రజానీక మగును;
వరశశ,కరి,హరి,వ్యాఘ్రు,వరాహ,
వృష, మహిషావళి,దృశ్యంబు దనరె-
భాసుర సైన్యవ్యవస్థగా; నచటఁ
దమనై జవైరముల్ ద్యజియించి మిగుల
కలసియు మెలసియుఁ గడుభీతిఁ దిరుగు
నా మృగములు చతురంగబలంబు
లట్లుగా దీపించె నా రాజ్యమందు;
జలపాతధారలశబ్దసంతతులు
తతమత్తగజబృంహితంబు ల-చ్చోట
బహువిధభేరీరవంబు లై చెలఁగు;
చక్రవాకచకోరచాతకానీక
శుకపికనికరమంజులకలహంస
మధురకూజితములు, మధుపరావములు,
నృత్యన్మయూరకేంకృతులు వెలింగె-
వైభవోపేతసత్పాలనమందు
సతతసన్మంగళశబ్దంబు లటుల;
తృణలతాచయవృక్ష బృందంబు లెల్ల
బూచియుఁగాచియుఁబోలుపొందుచుండె-
నిత్యసన్మంగళాన్వితు లై సమస్త
పౌరులానందంబుపడుచున్నరీతి;
ఆ రామభగవానుఁ డధివసియించు
వరచిత్రకూటపర్వతశోభఁ గాంచి
భరతుఁ డత్యానందపరవశుం డయ్యె-
వ్రతము ఫలించి తపస్సిద్ధిఁ గాంచి
నట్టితాపసివోలె, అద్రికుమారి!
అయ్యెడ నా నిషాదాధిపుఁ డొక్క-
ఎత్తైనశైలమం దెక్కి వీక్షించి
భరతునితో నిట్లు పల్కెఁ జేయెత్తి:
"అదిగో! ప్రభూ! కనుఁ డా మహోప్లక్ష
జంబూతమాల రసాలవిశాల
మహితమహీరుహమండలమందుఁ
గనవచ్చుచుండె నాకాశ మంటుచును
బరమరమ్యం బగువటవృక్ష మొకటి;
ఘననీలపల్లవగణములతోడ
వరమనోజ్ఞారుణఫలతతితోడ,
లలితావిరళశీతలచ్ఛాయతోడ,
సర్వకాలంబుల సౌఖ్యదం బగుచు
నలరారుచుండు నా యవనీరుహంబు;
అద్దానిఁ గనుఁగొన్నఁ నా బ్రహ్మదేవుఁ

---

* యమములు=1 అహింస 2 సత్యము 3 బ్రహ్మచర్యము 4 అపరిగ్రహము 5 ఆస్తేయము—
నియమములు=1 శౌచము 2 సంతోషము 3 తపస్సు 4 స్వాధ్యాయము 5 ఈశ్వరప్రణిధానము.

డఖిలోన్నతం బగునందంబు నెల్ల
రమ్యనీలారుణరాగరాశిగను
ఆ వృక్షమునఁ గూర్చినట్లుగాఁ దోఁచు;
దివ్యమందాకినీతీరమం దున్న
ఆ వృక్షమండలమందె ఓ నాథ!
శ్రీరాముపర్ణకుటీరంబు కలదు.
పర్ణ శాలాముఖ భాగంబునందు
జానకీమాత, లక్ష్మణుఁడు, సంప్రీతి
నాటినతులసీవనంబులుఁ గలవు;
అవి, వివిధంబు లత్యంతరమ్యములు.
ఆ మట్టినీడలయందె సీతమ్మ
తనమృదుపాణిపద్మములతోఁ దానె
అందంబుగా నొక్కయరుగు రచించె.
ఆ దివ్యవేదికయందె కూర్చుండి
భూమిజారాములు మునులతోఁ గూడి,
నిత్యంబు వినుచుంద్రు నియమంబు గదుర
నిగమాగమపురాణనిచయంబు లనఘ!"
అనుగుహువచనంబు లాలించి, యచటి
వృక్షసమూహంబు వీక్షించినంత
భరతునినేత్రపద్మంబులలోనఁ
గన్నీరు నిండెను; గడుభక్తితోడ
భరతశత్రుఘ్నులు పరవశు లగుచు
నడచిరి ముందుకు నతులు గావించి.
ఆ యన్నదమ్ములయమలానురక్తి
వర్ణన సేయఁగా భారతీదేవి
సైత మశక్త యై సంకోచమందె.
చిత్రకూటాశ్రమశ్రీపథమందు
రాముని పాదముద్రలను దర్శించి,
నిరుపేద, చింతామణిని గాంచినట్లు
భరతశత్రుఘ్నులు పరవశు లైరి.
వారు శ్రీరాముని పాదరజంబుఁ
గైకొని శీర్ష భాగంబునఁ దాల్చి
గుండెకు హత్తించుకొనియు నా పిదపఁ
గనుదమ్ములకు నద్దుకొని కడుభక్తి
శ్రీరామచంద్రు దర్శించినరీతిఁ
బరమసంతోషసంభరితాత్ములై రి.
వర్ణనాతీత మై భాసించుచున్న
తద్భరతునిమహాదశఁ జూచినట్టి
ఖగమృగవృక్షాదికంబులుగూడ
మానితప్రేమనిమగ్నంబు లయ్యె.
అలభరతునిమిత్రుఁ డౌనిపాదుఁడును
అనురాగవివశుఁ డై ఆ యరణ్యమున
దారిఁ దప్పెను గాని, తత్సమయమున
సురలు మార్గంబులు జూపి యాతనికిఁ
గురిసిరి ముదమునఁ గుసుమవర్ష ముల.
సిద్ధసాధకజనశ్రేణులా భరతు
దర్శించినంత, నుద్యత్ప్రేమపూర్ణ
లై, ప్రశంసించి రా యనఘుని లోని
రాజితసహజానురాగాతిశయము.
భరతుఁ డీ భూతలిఁ బ్రభవింపకున్న
చరము లచరము, లచరములు చరము
లుగను మాకొంద వీలుండదు సుమ్ము.
క్షితి సాధుసురలకు హితమొనరింప
నమితకృపాసింధు వగు రఘువీరుఁ
డలభరతుని యగాధాంతర్యజలధిఁ
దద్వారవిరహమందరముచేఁ జిలికి,
ఈ ప్రేమరసమహామృతముఁ బుట్టించెఁ
సాంద్రవృక్షంబులు చాటుగా నుంట
ఆ వచ్చు దివ్యు లౌ అన్నదమ్ములను,
గుహుని, లక్ష్మణుఁడు కన్గొనఁజాలఁ డయ్యె.
భరతుని కన్నుల న్బడియె నత్తఱిని
నిఖిలసుమంగళనిధి యై వెలుంగు
రమణీయపావనరామాశ్రమంబు.
అట నాతఁ డడుగిడునంతనే యతని

మానసవ్యథ యెల్ల మటుమాయ మయ్యె-
బరమార్థమును గన్నవరయోగికటుల.

తాపసవేషధారు లైయున్న సీతారామలక్ష్మ
ణులను భరతుఁడు సందర్శించుట

శ్రీరాము ముం దతిప్రీతితో నిలిచి
సంభాషణంబుల సలుపులక్ష్మణుని
శుభమూ ర్తి భరతుఁడు చూ చె- నాతండు
శిరమున జటలను జేర్చి బంధించి
కటితటంబందు వల్క లమును దాల్చి
మూఁపునఁ దూణీరమును బిగియించి,
భుజమునఁ గార్ముకంబును వహియించి
కరమున శరమును గలిగి చూపట్టె.
సీతాసమేతుఁ డై శ్రీరామవిభుఁడు
నిర్మలనీరదనీలవిగ్రహుఁడు,
వల్క లంబులఁ గట్టి పరిధానములుగ
మూర్ధమందున జడల్ ముడివడఁ గూర్చి
సదమలమునివరసాధుసమాజ
పరివేష్టితుం డయి భాసిలుచుండె.
మునివేషములఁ దాల్చి పొసగఁ గూర్చున్న
అలరతీకాములో యనఁ దోఁచి రపుడు
జానకీరఘురామచంద్రు లోఁ గౌరి!
ఆ రఘువీరుఁడు హస్తాంబుజముల
శరచాపముల విలాసతఁ ద్రిప్పుచుండె.
ఆ జగద్విభుమందహాసప్రభాస
సదమలాపాంగవీక్షణమాత్రమునఁ
మానసదుఃఖతమస్సులు వ్రీలు.
జ్ఞానంబు, భ క్తియు, సచ్చిదానంద
మయపరబ్రహ్మము, మానవాకృతుల
వెలుఁగొందుచుండినవిధము,- మునీంద్ర
మండలి, మతియును మైథిలీరామ
చంద్రులు, వెలసిరి, సంయమివర్య!

శ్రీరామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల
పరస్పరానురాగ ప్రదర్శనము

భరతశత్రుఘ్నులుఁ, వారిమిత్రుండు,
మగ్న లౌ చును బరమప్రేమలోనఁ
దమతమమోదఖేదంబుల నెల్ల
మఱచిరి; భరతుఁడు, "మాం పాహి, నాథ!
మాం పాహి, మత్ప్రభూ! మాం పాహి" యనుచు
దండంబువోలె భూస్థలిఁ బ్రణమిల్లె.
*ఆతనిభ క్తిమయాతతవాణి
నాలించి లక్ష్మణుం డాతఁడు భరతుఁ
డని గ్రహియించె నిజాంతర్యమందు.
భరతునిపైఁ బ్రేమ పరఁగుచుండినను
మఱియొకవైపు రామప్రభుపాద
పద్మసేవానిష్ఠబలవ త్తరంబు
గా నుంటచేత, లక్ష్మణమూ ర్తి, భరతు
సన్మాన మొనరింపజాలకపోయె;
మనసులో సంప్రీతి మలుపలేకుండె.
నాఁటిలక్ష్మణునిమనసితిఁ దెలుప
కేవలసుకవులకే వశ మే మొ?
గగనమం దెగిరెడి గాలిపటంబు
క్రిందికి లాఁగినచంద మాతండు
రామసేవామహావ్రతమువైపునకె
చి త్తంబు లాఁగి నిశ్చేష్టుఁ డై నిలిచి
వినమితశిరుఁ డౌచు ప్రేమ వెలుంగ,
"ప్రణమిల్లుచుండెను భరతుఁ డేతెంచి
రఘునాథ! త్వత్పాదరాజీవములకు"-
అని పల్కె; నా మాట వినినయంతటనె

---

* రామలక్ష్మణులు పరస్పరాభిముఖు లై యున్నసమయమున భరతుఁడు వచ్చి లక్ష్మణునివెనుకగా భూమిపైఁ బ్రణమిల్లినాఁడు. శ్రీరామాభిముఖతను వీడఁజాలని లక్ష్మణుఁడు శబ్దమునుబట్టి భరతుని గుర్తించినాఁడు.

ప్రేమభావో ద్వేగవివశుఁ డైపోయి,
దిగ్గున లేచి, పృథ్వీసుతావిభుఁడు
ముందున కురికెను- భుజమున ప్రేలు
వల్కలాజిన మొక్కవై పెగురంగఁ,
జాపనిషంగముల్ జారి, యింకొక్క
వైపున కెగురంగ- పట్టించుకొనక.
కారుణ్యవనధి యా కౌసలేయుండు
బలవంతమునఁ బట్టి భరతుఁ బైకెత్తి
కౌఁగిటఁ జేర్చెను; కమనీయ మైన
ఆ రామభరతసమాగమ మహహా!
దర్శింప గలిగిన ధన్యాత్మ్ర లెల్ల
మహితసమాధినిమగ్నతఁ గనిరి
తనువుల మఱచి రుద్యద్భక్తివశత.
ఆ యనురాగసమాగమ మెట్లు
వర్ణింప వశమౌను? వరకవీశ్వరుల
త్రికరణంబులకె యతీత మైయుండ.
ఆ సహోదరు లిద్ద రనుపమాఖండ
పరమానురాగసంభరితాత్మ్ర లైరి-
అలమనోబుద్ధిచిత్తాహంకృతులను
లేశమాత్రం బైన లేకుండ విడిచి.
అట్టిమహాప్రేమ నెట్టు వర్ణింపఁ
గలమో వచింపుఁడు; కవివరుబుద్ధి,
దేని ఛాయామాత్ర మేని యాధార
ముగఁ జేసికొని ప్రాఁకిపోయి రవ్వంత
ఆ మహాప్రేమఁ దా నందుకోఁగలదు?
భావవాక్కులు కవీశ్వరుల కాధార-
మా రామభరతమహానురాగంబు
విధి, హరి, హరు, లకే వేద్యంబు కాక
అగమ మైయున్న దే! అట్టి యా ప్రేమ
నెట్లు యీ కుమతి వర్ణింపఁగాఁ గలఁడు?
దూసరతీవెలతోఁ గట్టఁబడిన
వీణియ చిల్కఁ నే విధి గానరసము?

అలరామభరతసమాగమ మరసి
భయపడె నంత సుపర్వాజనంబు
గుండియల్ దడదడ కొట్టుకొనంగ.
అంత బృహస్పతి ఎంతయో తెలుప
ఆ జడుల్ విడనాడి యజ్ఞానబుద్ధి;
గురిసిరి మురియుచుఁ గుసుమవర్ష ములు;
సలిపి రొక్కమ్మడి "జయ జయ" ధ్వనుల.
అంతట శత్రుఘ్ను నా రామవిభుఁడు
కౌఁగిటఁ జేర్చెను కడుప్రేమతోడ;
తదుపరి గుహుఁగూడి తగ మోద మొందె.
అట్టులే భరతుఁ, డత్యంతసంప్రీతిఁ
దన కతిభక్తి వందనమాచరించు
లక్ష్మణుఁ గౌఁగిట లాలించె మిగుల.
అప్పై లక్ష్మణుఁడు ప్రియంబు దీపింప
శత్రుఘ్నుఁ గలసియు శబరేంద్రు గుహుని
గుండెకు హత్తించుకొని యాదరించె.
భరతశత్రుఘ్నులు భక్తియుక్తముగ
మునిగణంబులకెల్ల ప్రొక్కి వారిడిన
అభిమతాశీస్సుల నానందపడిరి.
పిదప నా యిర్వురు ప్రియసహోదరులు
భక్తిభావో ద్వేగపరవశు లగుచు
పావనసీతాంఘ్రిపద్మరజంబుఁ
దమశిరంబులపైన ధరియించుకొనియు
పరఁగఁ బునఃపునఃప్రణతు లొనర్ప
వారల నామె లేవఁగ నెత్తి ప్రీతి
నిమురుచు శిరముల నిజకరాబ్జములఁ,
గూర్చుండఁజేసెను గూర్మి వెలుంగ;
వారల నామె భావమున దీవించి,
వాత్సల్యపరవశత్వమున మే న్మఱచె.
ఈ రీతి ఆ తల్లి పృథ్వీకుమారి
సర్వవిధాలఁ బ్రసన్న యై యుంటఁ
గనుఁగొని వారలు గలిగియున్నట్టి

ఆందోళనముల నూహాభయంబులను-
సర్వంబు వదలియు స్వాస్థ్యంబుఁ గనిరి.
ఆ సమయంబున నట నొక్క రేని
పలువిప్పి మాట్లాడువారు లే రైరి;
కుశలసంప్రశ్నముల్ గూడ లే వయ్యె;
ప్రేమసంభరిత మై వివశత నొంది
సర్వులచిత్తంబు స్తబ్ధత్వ మొందె.
అత్తఱి నా నిషాదాధినాయకుఁడు
గుహుఁ డెట్లోధృతిఁ గూర్చుకొని డెందమందు,
ప్రణతు లర్పించి కరంబుల ముడిచి
తా విన్నవించె సీతాపతి కిట్లు:
"ఓ ప్రభూ! నీదువియోగవిషాద
మును భరింపఁగలేక పురమును వదలి
మువ్వురుతల్లులుఁ, బురజనకోటి,
సేవకజనములు, సేనాధిపతులు,
సచివులు, మొదలుగా సర్వులు నేఁడు
శ్రీవసిష్ఠర్షివరేణ్యునితోడ
వచ్చియున్నారు పర్వతపాదమందు."
ఆ శీలగుణనిధి ఆ ధర్మమూర్తి
ఆ ధీరశేఖరుఁ డా దయామయుఁడు
శ్రీరాముఁ డట్లులు స్వీయగురుండు
వేంచెసె ననువార్త వీనుల సోకి
నంతనే, వెడలె మహోత్రంబు గదుర,
జానకీసన్నిధిన్ శత్రుఘ్ను నిలిపి.
ఆచార్య దర్శించినంతనే పరమ
భక్తి మహోద్వేగపరవశు లగుచుఁ
బ్రణమిల్లి రవనిపై రామలక్ష్మణులు.
మునిపతి, యది గని ముందున కురికి
ఆ యన్నదమ్ముల నతిప్రేమ పొంగ
గుండెకు హత్తించుకొని యాదరించె.
గుహుఁడును ఆ మునికుంజరు నెదుట
దవ్వునందుండియే, ధారుణి వ్రాలి
దండంబు లర్పించెఁ దననామధేయ
మును జెప్పుకొని భక్తి పొంగులువార,
దనువునఁ బులకరింతలు వెలుఁగొంద.
అంత నా ఋషివర్యుఁ డా బోయ రేని
రామసఖుం డని గ్రహియించి యుంట,
బలవంతమున నేలపైనుండి యెత్తి
కడుప్రేమతోడను గౌఁగిటఁ జేర్చె-
అవనిపైఁ బడియును అట నిటఁ జెదరి
యుండిన ప్రేమను నొక్కతావునకుఁ
బ్రోవిడి యెత్తినపోలిక తోఁప
"అఖిలమంగళమూల మహా! రామభక్తి"
అని ప్రశంసించు చయ్యఖిలదేవతలుఁ
గుసుమవర్షంబులఁ గురిసి రత్తఱిని.
ఎంచ నీ గుహువంటి హీనుఁ డెవ్వండు?
అల వసిష్ఠునివంటి అధిపుఁ డెవ్వండు?
ఐన నోహోహోహో! ఆ మునిరాజు
ఘనలక్ష్మణుని కన్నఁ గడుహర్ష మొప్ప
గుండెకు హత్తించుకొనె నా నిషాదు.
దీన, సీతానాథదివ్యాంఘ్రిపద్మ
భజనప్రతాపప్రభావముల్ తెలియు.
సత్కరుణానిధి, సర్వజ్ఞుఁ డైన
రామచంద్రుండు సర్వప్రజానీక
మూర్తితో నుండుట నాత్మ గ్రహించె.
వారివారల మనోభావాను సరణి
వారలు సంతుష్టిపడువిధానమున
శ్రీరామలక్ష్మణుల్ చేరి ప్రజాళి
దారుణదుఃఖసంతాపంబు లెల్ల
శాంతింపఁజేసిరి, క్షణమాత్రమండె.
ఇది యొకకష్టమే యినకులేశునకు?
ఇనుఁ డేకసమయమం దే, కోటిఘటము
లందున్నజలముల నందంబు వెలయ
ప్రతిఫలించుట లేదె? పక్షిలోకేశ!

ప్రజ లెల్ల రనురాగభరితాత్ము లగుచు
గుహుని సన్మానించి కొనియాడి రతని
భాగ్యవిశేషంబు బహువిధానముల.
శ్రీరాముఁ డంత వీక్షించెఁ దల్లులను;
వారు మువ్వురు, హిమపాతంబుచేత
వాడినలతికలవలెఁ గానఁబడిరి;
భీషణవ్యాకులపీడిత లగుచు
వారుమువ్వురుఁ గనఁబడిరి దైన్యముగ,
నతిహిమక్లిన్నలతాంతంబులట్లు.
ప్రప్రథమంబున రామభద్రుండు
కైకేయికడ కేఁగి కడుప్రీతితోడ
ఆమె చిత్తము స్వాస్థ్యమందఁగాఁ జేసె-
నిజవినిర్మలభావనిరుపమానూన
భక్తివిశేషప్రభావంబుచేత.
ఆ మహామహుఁ డామెయడుగుల వ్రాలి,
"కాలకర్మవిధిప్రకారవశాన
నిట్లు ఘటించె నీయెడఁ దప్పు గలదె?"-
అని బోధ గావించి ఆమె నోదార్చె.
తదనంతరము రఘూద్వహుఁ డతిప్రీతిఁ
దక్కినతల్లు లందఱికడ కేఁగి,
"ఈశ్వరాధీన మై యీ జగ మెల్ల
వర్తింపుచుంటచేఁ బరికింప నొకరి
దోష మిం దేమియుఁ దోఁపదు కనఁగ"
అని ప్రబోధించియు ఆనందపఱచె.
రామలక్ష్మణు లంత రాజితభక్తి
గురుపత్ని, నామెతోఁ గూడి యే తెంచి
నట్టివిప్రస్త్రీలనందఱఁగూడ,
గౌరీస్వరూపిణుల్ గా నెంచుకొనుచుఁ
బూజఁ గావింపఁ, సమ్మోదమున వారు
చేసిరి మంగళా శీర్వాదములను.
ఆ రామలక్ష్మణు లటు సుమిత్రాంఘ్రి
పద్మంబులకు సల్పి వందనంబులను,

ఆ తల్లియొడిలోనఁ బ్రీతిఁ గూర్చుండి
సంతసించిరి మహాసంపద గన్న
పుట్టుదరిద్రులువోలె మునీంద్ర!
ఆ సహోదరు లిద్ద రటుపైన వెడలి
జనని యాకౌసల్యచరణాంబుజముల
వ్రాలిరి ప్రేమభావవ్యాకులాఖి
లాంగు లై- అత్తతో నా జనయిత్రి
అతిప్రీతిఁ గౌఁగిఁట నదిమి వారలను
వాత్సల్యరసబాష్పవర్ష ధారలను
దడిపె నయ్యా! జనార్దనభక్తవర్య!
ఆ సమయంబున నా తల్లి గనిన
హర్ష విషాదంబు లభివర్ణనంబు
సలుపఁగా నే కవీశ్వరుచేత నౌను?
వస్తువురుచి మూఁగ ప్రకటింపఁ గలఁడె?
ఆ రీతిఁ దమతల్లి నా సహోదరులు
శ్రీరామలక్ష్మణుల్ సేవించుకొనియుఁ
దమవెంట దయసేయఁ దమగురూత్తమునిఁ
బ్రార్థనఁ జేసిరి భక్తియుక్తముగ.
అంత వసిష్ఠుని యాజ్ఞానుసరణి
బసలు గావించిరి ప్రజ లా వనానఁ
దగుతావు, నీ రున్నస్థలమునం దెల్ల.
మంత్రినుహీసురమాతృవసిష్ఠ
గురువరప్రముఖులఁ గూడి యంతటను
భరతలక్ష్మణరామభద్రులు వెడలి-
రల చిత్రకూటదివ్యాశ్రమంబునకు.
వచ్చి జానకిమునివరుపాదములకుఁ
బ్రణతులు గావించి భక్తిదీపింప
స్వీయమనోభీష్టసిద్ధినిగూర్చు
వరశుభాశీస్సులఁ బడసె; నాపైన
ఆమె శ్రీగురుపత్ని యానరుంధతిని
సకలమునీశ్వరసతుల సంప్రీతి
నాదరించినరీతి అనుపమానంబు.

వరుసగా నా విప్రపత్ను లందఱికిఁ
బాదపూజన మతిభ క్తితోఁ జేసి
సీత పొందెను బ్రియాశీర్వచనముల.
అ త్తలఁ గనుఁగొని ఆ సుకుమారి
నేత్రముల్ మూసికొనెన్ దిగులొంది.
వ్యాధునిచేతిలో ఁబడి వగ నొందు
హంసీత్రయుం బట్టు లగపడ వారు,
"దుర్దైవ మెంతటి దుర్గతిఁ గూర్చె"-
నని సీత చింతించెఁ దనలోనఁ దాను.
వారును సీతను బరికించినంత
నిలువున నీరయి ని స్తబ్ధు లైరి.
"విధిప్రాత మనము తప్పించుకోఁ గలమె?
అనుభవింపఁగవలె నంతయు నిట్లు"
అని ఖేదపడిరి నిజాంతరంగముల.
అ త్తతి జనకధరాధీశతనయ
స్వాంతమందున ధృతి సమకూర్చుకొనియు,
నీలికన్గలువల నీరు నిండంగఁ
దనయ త్తలందఱిన్ దగఁ గౌఁగిలించె.
తత్సమయంబున ధారుణి యెల్లఁ
గరుణరసావేశపరవశ మయ్యె.
వరుసగా న త్తలపాదాబ్జములకు
నా సీత ప్రణమిల్ల నతిప్రేమ గదుర,
"దివ్యసౌభాగ్యవతీ భవ" యనుచు
నాశీస్సు లిడిరి-నిజాంతరంగముల
ననురాగపరవశ లౌచు వారెల్ల.
సీతయు రాణులుఁ జిత్తంబులందు
ననురాగవిహ్వల లై రని యెఱిఁగి
స్థిరతరజ్ఞాని వసిష్ఠగురుండు,

కూరుచుండఁగఁ జేసెఁ గూర్మి వారలను.
తదుపరి తన్మునితల్లజుఁ డెలమి,
అరయఁగా జగము మాయగ నిరూపించి,
పరమార్థమునుగూర్చి పరఁగ బోధించి,
ప్రకటించె దశరథరాట్స్వర్గయాత్ర.
అది విని రఘుపతి అతిఖేద మొందె.
తనమీఁదిప్రేమచే ధారుణీవిభుఁడు
ప్రాణముల్ విడె నని భావమం దెంచి
రాముఁ డాధైర్యధురంధరుం డుగ్ర
దుఃఖాగ్నికీలికాదోదూయమాన
మానసుం డయ్యె సుమా! గిరితనయ!
అశనిపాతమువంటి ఆ ఘోరవార్త
నాలించి లక్ష్మణుం, డవనీకుమారి,
రాణులందఱును విలాపించి; రచటి
సర్వసభాసదుల్ సంతాపపడిరి-
నృపతి యా దినమే, గతించినరీతి.
అంతవసిష్ఠమహర్షివరేణ్యుఁ
డోదార్ప నుపనిషదుక్తి లెసంగ,
శ్రీరాముఁ డటఁ గల ప్రియులతోఁగూడి
దివ్యమందాకినీతీర్థంబులందు
స్నానాదికృత్యముల్ సలిపె; నంతటను
నీ రైసఁ గ్రోలక శ్రీరామ చంద్రుఁ
డుపవాసమొనరించె నుజ్వలభక్తి;
మునిపతి చెప్పినఁ మూచూడరైరి;
జలబిందు వేనియు సర్వు లానాఁడు.
అంతఁ బ్రాతఃకాల మయ్యె- మునీంద్రుఁ
డాదేశ మొనరించినట్లు లత్యంత
భక్తితో శ్రద్ధతోఁ బైతృకక్రియల
నన్నిఁటి నెఱవేర్చె నా రఘుస్వామి.

శ్రీరామచరితమానసము

అయోధ్యాకాండము

పంచదశవిశ్రామము

భోగిశయాన! జనార్దన!
సాగరతనయాసుసేవ్యచరణసరోజా!
భాగవతోత్తమగేయా!
ఆగమనుత! మట్టపల్లిహరి! నరసింహా!

శ్రీరాముఁడు మృతుఁ డైనతండ్రి కౌర్ధ్వ
దైహిక క్రియలొనర్చుట

పాపాంధకారప్రభాకరుఁ డైన
శ్రీరామచంద్రుఁ డారీతివేదో క్త
పద్ధతిఁ గావించి పైతృకక్రియలు,
తిరిగి శౌచముఁ బొందె దేవీ! అపర్ణ!
ఎవ్వనిశుభనామ మెన్నఘోరాఘ
చయతూలజాల భాస్వజ్జ్వాల యగునొ!
ఎవనిసంస్మరణ మీ యెల్లలోకముల
నఖిలమంగళమూల మై వెలుఁగొందు,
ఆ రామచంద్రమహాప్రభు వపుడు
సాధుసమ్మతరీతి శౌచంబు నొందె–
అఖిలతీర్థంబుల నావాహనంబుఁ
గావించి నట్టిగంగానదివోలె.
అట్లు శుచిర్భూతుఁ డై రెండునాళ్ళు
గడచినపిదప రాఘవుఁ డిట్లు పలికె
గురువర్యుతోడను గూర్మి వెలుంగ:
"నాథ! యీ ప్రజ లీ వనంబున కంద
మూలపర్ణఫలాంబువులను గైకొనుచు
శ్రమ నొందుచున్నారు ప్రతిదివసంబు.
భరతశత్రుఘ్నుల, మఱియు మంత్రులను,
దల్లులఁ గనుచుండఁ దాపసవర్య!
ఒక్కక్షణం బొక్క యుగముగాఁ దోఁచు.
కనుక వీరందఱఁ గైకొని నీవు
నగరంబునకుఁ బోవ నా ప్రార్థనంబు.
స్వామి! నీ విటఁ దండ్రి స్వర్గమందుండె:
నగరరక్షణసేయునాథుఁడుఁ లేఁడు
ఎక్కువ చెప్పితి, నిది దోషమగును
స్వామి! ఎట్లుచితమో వర్తింపుఁ డట్లు."
అన, వసిష్ఠుఁడి యి ట్లనె రాముతోడ:
"ధర్మవారిధివి, యుద్యత్కృపానిధివి
నీవోరఘూత్తమా! నీ విట్లు పలుకు
టాశ్చర్యకరవిషయంబు కాఁదోయి!
ఈ మహాజనులు సీతేశ! త్వద్విరహ
భారపీడితు లౌచు వచ్చి రిచ్చటికి.
మఱి రెండునాళ్లు నీ మహితముఖాబ్జ
దర్శనశ్రీ నొంది తగ శాంతి నొంద
నవకాశ మిమ్ము దీనార్తి విదూర!"
శ్రీరామువాక్యముల్ చెవిసోకినంత
జనసభ యెల్లను సంకులమయ్యె–
ఝంఝూనిలముఁ దాకి, సాగరమందు
తల్లడిల్లెడు ఒక్క తరణి చందమున;
మఱుల గురూత్తమమంగళవాణి

వినినపిమ్మటఁ బ్రజాబృందమంతయును
స్వస్థతఁ గాంచెను, వాయువు తిరిగి
అనుకూలముగ మాఱినంత నా నావ
కల్లోలదుస్థితిఁ గడచినరీతి.
ఆ మహాజను లెల్ల అనుదిన మచట
దర్శనమాత్రపాతకదూర మైన
దివ్యపయస్వినీతీర్థంబునందు
మూఁడువేళల స్నానములఁ జేసికొనుచు,
శ్రీరాముమంగళాకృతిని సంతతము
కన్నులవిందుగాఁ గడుప్రీతిఁ గనుచు,
శ్రీరాముపాదముల్ సేవించుకొనుచు
పరమసంతోషసంభరితు లౌచుండ్రి.
సర్వసౌఖ్యములకు సదనంబు లైన
దుఃఖాల కెల్లను దూరంబు లైన
రామతేజఃప్రపూర్ణము లై రహించు
ఆ వనశైలంబు లన్నిఁటి వారు
దర్శించి రో పర్వతప్రభుపుత్రి!
తేనెవాఁకలవంటి తీయనినీళ్ళు,
జలజలఁ బొంగుచుఁ జను సెలయేళ్లు,
త్రివిధతాపముల హరింపుచు విడక
వీచెడి చల్లని పిల్ల తెమ్మరలు,
రకరకంబులచెట్లు, లతలు, తృణాళి
విరియఁ బూచిన పూలు, ప్రవేలాడు పండ్లు
చెలువొందు పచ్చని చిగురుటాకులును,
బహుచక్కఁగా నున్న పఱపుబండలును,
చలువలఁ జిమ్మి వృక్షములనీడలును–
కలిగిన ఆ మహాకాననశోభ
వర్ణనాతీత మై భాసిల్లుచుండె.
కళ లీనెఁ గొలఁకులు కలువలతోడ,
జలపక్షిగణకలస్వనములతోడ,
మదభృంగసంగీత మాధురితోడ.
బహువిధఖగమృగవ్రజము లా వనిని
విగతవైరము లౌచువిహరింపుచుండె.
అచ్చటివనములయందు వసించు
భిల్లకోలకిరాత బృందముల్ ప్రీతి
నాకుదొన్నెలఁ గుట్టి, ఆ దొన్నెలందు
అమృతోపమాన మై యలరారుచున్న
శుచిరుచిరుచిర మై శోభిలుచున్న
మధువును నింపి యా మధుప్రటంబులనుఁ
అల కందమూలఫలాంకురావళిని,
గొనితెచ్చి నమ్రతాగుణము దీపింపఁ
బ్రణతులఁ గావించి, పరివచించుకొనుచు
వివిధతద్వనరుచి భేదనామముల,
నర్పించె నా నూతనాతిథులకును.
ప్రజ లవి గైకొని వానిమూల్యముల
నొసఁగఁ బోనౌదార్యమొప్పఁ గా వాని
నా యాటవికులు ప్రేమాయతదృష్టి
స్వీకరింపక రఘువీరునిపైన
నోట్టిడి, తద్ద్రవ్య మొసఁగియుఁ దిరిగి,
స్నేహనిమగ్న లై స్నిగ్ధవాక్యములఁ
బలికి రీ రీతి: "నో భవ్యాత్మ్మలార!
మహితమర్యాదను మానితప్రేమ
నీనాఁటి కేమగ్రహింపఁగల్గితిమి.
సుకృతవంతులు మీరు; చూడఁగా మేమొ–
హీననిషాదుల– మెట్లో యీనాఁడు
శ్రీరాముకరుణావిశేషంబుచేతఁ
దమదర్శనము గల్గె; ధన్యధన్యులము!
మరుభూమికి నంగమాడ్కి– దుర్లభము
త్వద్దర్శనం బెట్లో ప్రాప్తించె మాకు.
కరుణామయుండు రాఘవుఁడు నిషాద
పతి యైనగుహునిపై వర్షించెఁ బ్రేమ;
ప్రభువోలె నాతనిపరిజనుల్ ప్రజలు
సైతము వర్తింప సముచిత మగును–
కావున మీ రన్యభావంబు విడిచి,

మా ప్రేమ గు ర్తించి మముఁ గరుణించు
డేము సమర్పించు నీ ఫలాదులను
మముఁ గృతార్థులఁ జేయ మహిని గైకొనుఁడు.
ఈ వనంబునకు మీ రేఁగుదెంచితిరి
మా ప్రియాతిథు లౌచు, మహితాత్ములార!
ఐన మిమ్ములఁ గొల్చు నర్హత గల్గు
భాగ్యంబు మావంటివారికిఁ గలదె?
మేము తలంప మీ కే మీయఁగలము?
కష్టులు ఆకులే గద– సమర్పణలు.
మఱి మేము చేసెడిమానితసేవ–
మీదుపాత్రములును, మీదువస్త్రములు,
నపహరింపక పోవు టగు నయ్యలార!
జీవసంఘముల హింసించుచు బ్రదుకు
జడజీవులము మేము జన్మాదినుండి.
కుటిలస్వభావము, కుపథవర్తనము,
కుమతి, కుజన్మముఁ, గూడెను మాకు.
భువిని దివారాత్రములు మాకుఁ గడచు
దుష్టకృత్యంబులతోడనే,– కాని,
కూటికిఁ గుడ్డలకు న్నదా కఱవె.
శ్రీరామదర్శనశ్రీప్రభావమునఁ
గాక యే విధమునఁ గల నైన మాకు
ధర్మబుద్ధి జనించు? ధన్యాత్ములార!
ప్రభుపాదపద్మదర్శనమహాభాగ్య
మహా! ఎప్పు డొదవెనో అప్పుడే మాకు
దుస్సహదుఃఖోగ్రదోషముల్ తొలఁగె!"
అను వనాటులవాక్కు లాలించి ప్రజలు
ప్రేమభావోద్వేగవివశాత్మ లగుచుఁ
బ్రస్తుతించిరి వారి పరమభాగ్యమును.
సర్వు లా వనవాసజనుల యదృష్ట
మునుఁ గొనియాడి రుప్పొంగగాఁ బ్రేమ.
విని, వారివాక్కులు, వీక్షించి మైత్రి,
దర్శించి వారిసీతారామచరణ
పద్మానురాగంబుఁ, బరవశు లై రి.
ఆ కోలభిల్లవాక్యము లాలకించి
ఎల్లస్త్రీపురుషాళి హృదయంబులందుఁ
దలఁచెను తమ్ప్రేమ తక్కువే, యనుచు.
రఘువంశమణియనుగ్రహశక్తి చేత
నొక లోహఖండ మయ్యుదధిపైఁ దేలి
పడవను మోసెను బరికింపుఁ డనుచుఁ
చెప్పుచుండెను దులసీదాసు వినుఁడు!
ప్రతిదినం బొ ప్రజల్ పరమహర్ష మున
విహరించి రా సర్వవిపినభాగములఁ
దొలకరివానలు తోలుకొనునంత
బునరుత్సుకతఁ బొంది ముదమును జెందు
భేకకేకీతతివిధము ఖగేంద్ర!
పౌరులందఱుఁగూడఁ బరమానురాగ
మగ్న లై యుండుట మఱచి లోకమును
గడపిరి దినములు క్షణములరీతి.
తనప్రతిరూపముల్ దాల్చి యా సీత
ముగురత్తలకు సమమ్ముగ సేవఁ జేసె.
అఖిలమాయాశక్తు లా జానకీమ
హామాయకున్ వశ్యమై యుండుఁ గాదె?
ఒక్కరామునఁడుతప్ప నొరు లెవ్వ రెఱుఁగ
రా! మహామర్మంబు నంతరంగమున.
సీత కావించినసేవ, కా ఠాణు
లందఱు వశ్య లై ఆహ్లాదమొంది
ఉచితోపదేశంబు లొనరించి ప్రీతి
ఆశీస్సు లిడిరి విహంగవతంస!
జానకీరామలక్ష్మణుల వినిర్మ
లాంతరంగంబుల నరసి కైకేయి,
అమితపశ్చాత్తాప మంది భూసతిని
మృత్యుదేవతను బ్రార్థించెఁ దోడ్పడఁగ;
కాని భూసతి తనగర్భంబులోన
నామెకు శరణీయదయ్యె నత్తఱిని;

మృత్యు దేవతయు సమీపింప దయ్యె.
శ్రీరామవిముఖు లౌజీవుల కరయ
నరకమండైన స్థానము చిక్క దనుచు
లోకు లాడగ, శ్రుతులును వచియింప,
విబుధు లుద్ఘోషింప వినమే? ఖగేంద్ర!
"హా దైవమా! రాముఁ డడవులు విడిచి
తిగిగి యయోధ్య కేతెంచునో? లేదొ?"
అనున దే యిఁక నిప్ప డందఱి నిలఁచు
పెద్దసమస్యగాఁ బెరిగె నత్తఱిని.
భరతున కహ! నిద్రపట్టదు రేయి;
పగలు భోజనము పోవదు లోని; కతఁడు
అత్యంతనిర్వేద మందుచు నుండె-
తలఁప, సంకుచితగ ర్తస్థితపంక
సమ్మగ్న యై, తగుసలిలముల్ లేక-
విలవిలలాడెడు పెనుమీన మట్లు.
"కైక నెపంబునఁ గాలపూరుషుఁ డొ
అకట! యీ కృత్రిమంబంతయుఁ జేసె-
పంటకు వచ్చినపై రెల్ల, ఈతి
బాధకుఁ జివరకు వశ మైనరీతి.
రామాభిషేక కార్యం బెట్లు జరుగు?
ఏ యుపాయముఁ దోఁచ దిసుమంత యేని;
శ్రీగురునాజ్ఞను శిరమునఁ దాల్చి
పురి కేఁగుదెంచు రాముఁడు; కాని, గురుఁడు
శ్రీరామచిత్తాను సారమే నడచు;
తప్పడు రఘుపతితల్లి చెప్పినను;
మతి నెంచ ఆ రామమాత రాఘవుని
బలవంతపఱచునా? పఱచ దే నాఁడు.
నేనొ? శ్రీవారిపాదానుచరుండ;
నెన్నఁగా నేనిలఁ ఋణసమానుఁడను;
గాక యే తెంచె దుష్కాలంబు; నాకుఁ
బ్రతికూలుఁ డైయుండెఁ బరఁగ విధాత;
ఏపట్టుఁ బట్టినయెడ ఘోరపాప;
మరయ సేవకధర్మమా? భారతరము-
కైలాస మెత్తుటకన్న నిక్కముగ!"
భరతుఁ డీ రీతిగాఁ బరితాప మొందె;
నాతని కే యుపాయముఁ దోఁచదయ్యె.
ఈ రీతిఁ జింతలో నా రాత్రి గడచె-
నంతటఁ దెలవాఱినంత నాతండు
స్నానాదికృత్యముల్ సలిపి శ్రీరామ
పాదాంబుజములకుఁ బ్రణతు లర్పించి
శ్రీవారిసన్నిధిఁ జేరి కూర్చుండ
నున్నంతలోన, గురూత్తముల్ పిలిచి
రనువార్త యే తెంచె నద్రిజా! వినుము.
భరతుఁ డ ట్లేఁగియు భక్తి దీపింప
గురుపదాంబుజములకుఁ బ్రణమిల్లి
అనుమతిఁ గొని చెంత నాసీనుఁ డయ్యె.
అంతలో విప్ర ప్రజానీక సచివు
లాదిగాఁ గలవార లందఱు వచ్చి
అట సభఁజేసి; రయ్యవసరమందు-
శ్రీవసిష్ఠమహర్షి శేఖరుం డిట్లు
సమయోచితముగఁ బ్రసంగం బొనర్చె:

మహాసభలో వసిష్ఠమహాముని ప్రసంగించుట

"ఓ సభాసదులార! ఓ జ్ఞాని! భరత!
అస్మదీయోక్తుల నాలింపుఁ డిపుడు:
ఆ సూర్యకులసూర్యుఁ డౌ రామవిభుఁడు
ధర్మధురీణుండు, తలఁప నాతండు
స్వవశుఁ డై భాసిల్లు పరమేశ్వరుండు;
పరులపై నాధారపడనట్టివాఁడు;
సత్యసంధుఁడు, వేదసంరక్షకుండు;
రామజన్మము జగత్త్రయశుభంకరము;
ఆ మహామహితాత్మఁ డాచార్యదేవ
పితృమాతృవిబుధసంహితవర్తనుండు;
ఖలదళదళనుండు, ఘనసురహితుఁడు;

అలచతుర్విధపురుషార్థ త్వముల
బాగుగా నెఱిఁగినవాఁడు రాఘవుఁడె.
హరిహరరుద్రచంద్రార్కదిక్పతులు,
మాయ, జీవుఁడును, గర్మంబు, కాలంబు,
అహిమహీధవులును, అఖిలశక్తులును,
వేదంబులందున విదితంబు లైన
యోగసిద్ధులు, మది యోజించి కనుఁడు-
సకలశక్తులు, రామచంద్రునియాజ్ఞ
శిరసా వహించియే జీవించుచుండు.
శ్రీరామచంద్రునిచిత్తంబు నెఱిఁగి
అతనియాజ్ఞను శిరసా వహించుటయె
మనకు శ్రేయస్కరమార్గ మై యుండు.
ఓ విజ్ఞులార! మీ రొగి విచారించి
సర్వసమ్మతరీతి సలుపుఁ డాపైన.
శ్రీరామపట్టాభిషేకకార్యంబు
సకలమహానందసంధాయకంబు;
పూర్ణమంగళమోదమూల మయ్యదియె;
పురికి రాఘవుఁ గొనిపోవుట యెట్లొ
యోజించి చెప్పుఁ డట్లొనరింత మంత."

అను నర్థపరమార్థఘననయోపేత
మునినాయకోక్తులు విని రాదరమున
అచటిసభాసదు; లం దొక్క లైన
బదులు మాటాడెడువారు లే లైరి;
అందఱు మానముద్రాంకితు లైరి.
భరతుఁ డప్పుడు లేచి వంచి శిరంబు
వినతిఁ గావించియు వినయ మొప్పార
అంజలిబద్ధుఁ డై యనియె నీ పగిది:
"సూర్యవంశంబున క్ష్మోణీంద్రు లెంద
ఱో పుట్టినారు; వా రొక్కరికన్న
నొక్కరు ఘను లయి ఒప్పుచున్నారు.
ఎవరిజన్మంబున కేనిఁ గారణము
అవ్వారితలిదండ్రు లగుదురు; కాని,
చూడ వారలశుభాశుభకర్మఫలము
లొసఁగువాఁ డీశుఁడే! ఓ మహాభాగ!
నీ మహాశీస్సులు నిఖలార్థి నడఁచి
సకలభద్రములఁ బ్రసాదించుననుట
విశ్వప్రసిద్ధ మై వెలుఁగొందుమాట!
*విధివిధానము మార్చవే, స్వామి! మున్న!

---

* శ్రీవసిష్ఠమహర్షి విధివిధానమును మార్చిన విశేషములు కొన్ని యిటఁ బేర్కొనఁ బడుచున్నవి:

1. దశరథమహారాజునకుఁ బుత్రసంతానము లేదు. శ్రీవసిష్ఠభగవానుని ఆశీర్వాదప్రభావమున నాతఁడు 60,000 ఏండ్ల వయస్సునఁ బుత్రచతుష్టయప్రాప్తి నొందెను.

2. సప్తమ మను వగు వైవస్వతునకుఁ బుత్రసంతానము లేదు. శ్రీవసిష్ఠమహర్షి ఆతనిచే నొక యజ్ఞమును నిర్వహింపఁ జేసెను. వైవస్వతమనువుభార్య శ్రద్ధాదేవికిఁ బుత్రికపై వాంఛయుండుట, హోతను తనకుఁ బుత్రిక గావలెనని ప్రార్థించెను. ఆమెవాంఛానుసార మతఁడు హోమ మొనర్చెను. అందుచే శ్రద్ధాదేవికి ఇలాదేవియను పుత్రిక కలిగెను. పుత్రునకు బదులు పుత్రిక కలిగి నందుకు వైవస్వతుఁడు విచారగ్రస్తుఁ డై శ్రీవసిష్ఠునికడ కేగి విన్నవించెను. శ్రీవసిష్ఠుఁడు జ్ఞానదృష్టితోఁ బరికించి, జరిగినవిషయమును గ్రహించి, తన తపశ్శక్తిచే నతని మనోరథ మీడేర్పఁగల నని యాశీర్వదించెను. అట్లే ఆ మహాముని భగవంతుని ప్రార్థించి ఆ వైవస్వతుని కుమార్తెను కుమారునిగా మార్చి వైచెను. ఇలాదేవి సుద్యుమ్ననిగ మారినది. యౌవనప్రాయము నం దొకనా డాసుద్యుమ్నుఁడు వేటకై చని, సుమేరుపర్వతప్రాంతమున గల నొక వనమునఁ బ్రవేశించెను. ఆ దివ్యవనము పార్వతీపరమేశ్వరుల ఏకాంతక్రీడారంగము. అటఁ బురుషు లెవ్వరును ప్రవేశింపరాదు. అటఁ బ్రవేశించిన పురుషులు శివశాపానుసారము స్త్రీలౌదురు. ఆకారణమున సుద్యుమ్నుఁడు స్త్రీయయ్యెను. తత్పశ్చాంతమునఁ దపముఁ జేయుచున్న చంద్రునికుమారుఁ డగు బుధుఁ డామెను జూచి మోహితుఁ డయ్యెను. ఉభయులును పరస్పరానురాగబద్ధులై భార్యాభర్తలుగఁ గాలముఁ గడుప

భువి నీదుసంకల్పమున కడ్డు గలదె?
ఇట్టిమహాత్ముఁడ వీవు న న్నిప్పు
డడిగితి వొక యుపాయముఁ జెప్పు మనుచు.
ఇది నాదుదౌర్భాగ్యమే! కాక, యేమి?"
అని పల్కు-భరతు ప్రేమాలాపములను
వినినంత నా మునివిభుహృదయంబు
ఘనతరప్రేమచేఁ గఱఁగి నీ రయ్యె.
"వత్స! నీ వాడినవాక్కులు నిజము;
కాని, రామునియనుగ్రహ మది యెల్ల.
శ్రీరామవిముఖు లౌజీవులు తనయ!
కల నైన సిద్ధిని గాంచఁగా లేరు.
కల దొకమార్గంబు, కాని, చెప్పుటకు
సంశయించుచు నుంటి స్వాంతరంగమున.
సర్వంబుఁ జెడ నున్నసమయంబునందు
సగ మైన విడిచి నష్టముఁ బొందుకొనుట,
పండితు లగువారిపద్ధతి వత్స!
నీవు శత్రుఘ్నుఁడు నిలువఁ గానలను,
జానకీరామలక్ష్మణు లుంద్రు పురిని."
అని వసిష్ఠుం డాడినట్టి సూక్తులకు
భరతశత్రుఘ్నులు పరవశులై రి-
పులకరింతలు తనువున నిండుకొనఁగ.
వారిస్వాంతంబులు స్వాస్థ్యంబుఁ గాంచెఁ
దనువు లుత్తేజముఁ దాల్చి వెల్గొందె-
పృథ్వీవిభుఁడు పునర్జీవితుం డగుచు
రామాభిషేక కార్యంబయినట్లు.
"ఇది యొకరీతిగా హితమగున్; దీన
స్వల్పనష్టంబు, లాభం బధికంబు
కలుగు," నటంచును దలఁచిరి జనులు.
సుఖమును దుఃఖంబు చూడఁగా నిందు
సమముగా నుండుట సంతాపపడిరి
రాణు లెల్లఱు; గిరిరాజకుమారి!
అప్పుడు భరతుఁ డి ట్లనె సభలోన:
"గురునాజ్ఞఁ బాలించు గురుధన్యుఁ డఖిల
విశ్వజీవాఖిలప్రీతిఁ గల్గింప

సాగిరి. ఒకసారి ఆ రాకుమారి శ్రీవసిష్ఠుని స్మరించినది. ఆయన దర్శనమైనది. ఆమె దైన్యావస్థ ఆ మహామునిని కదలించినది. అప్పు డాతఁడు శివుని ప్రార్థించి ఒకమాసము పురుషునిగను, ఒకమాసము స్త్రీగను నుండు విధానమున నా రాకుమారునకు వరము నొసంగఁ జేసెను. తదనంతర మాతఁ డొకమాసము బుధునిభార్యగను, మఱుమాసమున సుద్యుమ్ననిగను మారుచు జీవించెను. సుద్యుమ్నుఁడైన మాసమున రాజ్యపాలనముఁ జేయుచుండెను.

3. బ్రహ్మమానసపుత్రుఁ డగు వసిష్ఠుఁడు తన తండ్రిచే సూర్యవంశరాజుల పౌరోహిత్య మొనర్పఁ బ్రేరితుఁ డయ్యెను. కాని ఆతని కాపని ఇష్టము లేదయ్యెను. అప్పుడు బ్రహ్మ, త్రేతాయుగమున భగవానుఁడు శ్రీరాముఁడై సూర్యవంశమున నవతరించు ననియు, సాక్షాద్భగవత్సేవ లభించు ననియు దెలిపి, వసిష్ఠు నొప్పించెను. కాని సత్య యుగానంతరము ద్వాపరము గడచిన గాని త్రేతాయుగము రాదు. ఈ విలంబనమున కోర్వఁ జాలక, శ్రీ వసిష్ఠమహర్షి, సత్యయుగానంతరము, త్రేతాయుగము వచ్చునట్లును, ఆ పిదప ద్వాపర మరుదెంచునట్లును యుగక్రమమును మార్చి వైచెను.

4. క్షత్రియుఁడైన విశ్వామిత్రుఁడు వేయి సంవత్సరములు తపస్సుచేసి, బ్రహ్మచే బ్రహర్షి యనిపించుకొనికూడ శ్రీవసిష్ఠర్షి యామోద మొందినఁగాని సంతృప్తి వహింపఁడాయెను. విశ్వామిత్రునిలో అహంకారలేశముకూడ లేకుండ బోయినపిదపనే శ్రీ వసిష్ఠర్షి ఆతనిని బ్రహర్షి యని పేర్కొనెను.

5. దిలీపమహారాజునకు సుదక్షిణకుఁ బాణిగ్రహణమహోత్సవ సందర్భమున, ఉభయుల కొంగు ముడులుఁ గడు గట్టిగా వేయఁబడెను. కారణ మేమని వసిష్ఠర్షి యడుగగా, ముడిపీడినచో దంపతులు మరణింతు రని తెలుపఁబడెను. అప్పుడు శ్రీ వసిష్ఠ మహర్షి వారి విధిగతిని మార్చి, వారి మృత్యువును తప్పించెను.

వచ్చు ఫలంబును బడయఁగా గలఁడు.
తండ్రి! యావజ్జీవితముఁ బురి వీడి
కానలో వసియింపఁ గల; నింతకన్న
నధిక మాసుఖ మున్నదా? గురుదేవ!
ధరణీజారాము లంతర్యాము; లీవు
సర్వజ్ఞుఁడవు మహాజ్ఞానివి స్వామి!
నీవు పల్కినయది నిజమగునేనిఁ
జెల్లించుకొను మది శీఘ్రమే నాథ!"
భరతువాక్కులు విని, భక్తిని గాంచి,
సర్వసదస్యుల్ సంయమీంద్రులును
దనువులు మఱచియుఁ దన్మయు లైరి.
భరతమహాప్రభావసముద్రపార
మును జేరఁజాలక మునిపతియుక్తి,
నిలిచె నిర్విణ్ణ మై నిస్తబ్ధ మగుచు-
సాగరంబును దాఁట స్వాంతమం దెంచి
ఒక పడ వేనియు నొక నావ యేనిఁ
జివరకుఁ దె ప్పైనఁ జిక్కనందునను
దిక్కులు చూచుచుఁ దీరంబునందు
నవశ మై నిలుచున్నయబలచందముగ.
అట్టిచో భరతుమహామహిమంబు
వచియింప నెవ్వనివశ మగు? నోహో!
సాగరం బిముడునా సరసిలో? జెపుఁడు!
అపుడు వసిష్ఠమహర్షి స్వాంతమునఁ
బరమహర్షముఁ బొంది భరతునితోడ
సర్వసభ్యజనసంఘంబుతోడ
శ్రీరామచంద్రునిచెంత కేతెంచె.
వచ్చిన గురునకుఁ బ్రణతు లర్పించి
ఉన్నతాసనమున నుపవిష్టుఁ జేసి
సన్మాన మొనరించె జానకీవిభుఁడు.
సంయమీశ్వరు ననుజ్ఞను గొని సర్వు
లుపవిష్టు లైరి, ఖగోత్తమా! వినుము.
అంత వసిష్ఠమహర్షిపుంగవుఁడు

దేశకాలపరిస్థితికిఁ దగుహితము
లుచితవిచారసంయుతవాక్కు లొప్ప
నిట్లు రాముని తోఁ వచింపఁగా సాఁగె:
"వినుము మోయిశ్రీరఘువీర! శ్రీరామ!
సర్వజ్ఞుఁడవు నీవు జ్ఞానరూపుఁడవు;
ధర్మనీతిజ్ఞానతతగుణనిధివి;
అఖిలజీవులహృదయంబుల వెలుఁగు
వాసుదేవుఁడ వీవు; పరికింప నీకు
సర్వస్వభావముల్ చక్కగాఁ దెలియు.
నీ పురజనులకు నీ తల్లులకును
భరతునకును హిత ప్రదమైన పథము
దెలుపు మిప్పుడు రఘుతిలక! శ్రీరామ!
ఆర్తుఁడు వెనుకముం దాలోచనంబు
సలిపి ప్రసంగింపఁజాలఁడు; మఱియు
జూదరి స్వార్థమే చూచును సతము."
అన ముని, విని రాముఁ డనియె నీ పగిది:
"ఏ సమస్యాపరిష్కృతి యైన నాథ!
కలదు భవద్ధస్తకమలంబునందె.
నీ యభిమతముల నెఱవేర్చు వాఁడు,
నీ యాజ్ఞ ముదమున నెత్తిపైఁ దాల్చి
పాలించువా డొందు పరమహితంబు.
ప్రప్రథమంబుగా భవదాజ్ఞ నేను
శిరసావహించెద నెలవిమ్ము దేవ!
ఎవ రైన భవదాజ్ఞ యెదియైనఁగాని
శిరమునఁ దాల్చియు సేవింపఁగలరు."
అన విని రాముతో ననె ముని యిట్లు:
"నీవు చెప్పినదెల్ల నిజము శ్రీరామ!
కాని, యీ భరతు నఖండమాప్రేమ
అపహరించెను మదీయప్రయుక్తులను.
ఏఁ దేల్చి చెప్పన దేమన? రామ!
భరతమహాభక్తివశ మయ్యెనోయి!
నా బుద్ధి శక్తిపూర్ణంబుగా నిపుడు-

శివసాక్షిగా నేను జెప్పుచున్నాఁడ:
భరతహితంకరభావంబుతోడ
నెది నీవు చేసిన నదియె సర్వులకు
శుభ మొనగూర్చును సూరివతంస!
భరతునివినతిని బరఁగ నాలించి
స్వాంతంబునందు విచారించుకొనుము.
జనసమ్మతంబును సాధుసమ్మతము
మఱి రాజనీతిసమ్మతమును సకల
వేదసమ్మతము నౌవిధమున నీవు
వర్తింపు మో రఘువంశవతంస!"
భరతునిపై గరు పాదునకాత్మఁ
గలప్రేమఁ జూచి, హృత్కంజంబులోన
అవనిజాపతి విశేషానంద మొందె.
భరతుఁడు ధర్మసువ్రతధురంధరుఁడు,
తనుమనోవాక్కులఁ దనసేవకుండు–
అనుచు నెఱింగిన యా రాముఁ డంత
దేశికాదేశవిధేయతాయుక్త
మంజులమృదులసుమంగళమాల
వాక్యంబు లొప్ప నీ పగిది వచించె:
"స్వామి! నీపైఁ బిత్రపాదులపైన
శపథం బొనర్చియు సత్యంబు నేను
వచియింపుచున్నాఁడ: భరతునివంటి
ఆదర్శసోదరుం డఖిలప్రపంచ
మందున వేఱొక్కఁ డగపడఁ డయ్య!
నిజగురుపదభక్తినిరతు లౌవార
లిల లోకవైదికదృష్టుల రెంట
అత్యంత ధన్యు లాహా! మునినాథ!
త్వన్నిహ్రేమ నంతగఁ జూరఁగొన్న
భరతుభాగ్యం బెన్న వశ మేరి కగును?
నాకన్నఁ జిన్నగా నన్, వాని యెదుట
వానిఁ బ్రస్తుతిఁజేయఁ బాడిగా దనుచు
వెనుకాడుచుండె నా మనము మహాత్మ!
భరతుఁడు సూచించుపగిదిఁ జేయుటయె
మన కుచితం బని మదిఁ దలపోతు"—
అని యూరకుండె నా యవనిజావిభుఁడు.
అప్పుడు భరతుతో ననె ముని యిట్లు:
"వత్స! సందేహముల్ వదలి నీ విప్పు
డమితకారుణ్యాబ్ధి యై వెలుగొందు
నీప్రియాగ్రజునకు నీ హృది నున్న
విషయంబు సర్వంబు విడువకఁ దెలుపు
మను మునివాక్యంబు లాలించి రామ
హృదయం బెఱింగి హర్షించెను భరతుఁ
డల గురుప్రభువు లత్యనుకూలు లౌట.
ఐనను దన శిరమందె సమస్త
భారంబు వేయఁగాఁబడె నని యెఱిఁగి,
అతఁడు నో ర్విప్పి మాట్లాడఁగా లేక
ఆలోచనామగ్నుఁ డై యట్టె నిలిచె.
అతఁడు సభామధ్యమందున నిల్చి
తనువునఁ బులకరింతలు నిండి వెలుఁగఁ
గనుదమ్ములను బాష్పకణధార లొలుక
నీరీతిఁ దా వచియింపఁగా సాఁగె:
"ఏఁ జెప్పవలసిన దెల్లను జెప్పి
ముందుగానే మహాముని లోకనాథుఁ
డింక నే నెక్కువ యేమి వచింతు?
మత్ప్రభుహృదయంబు మది నెఱుంగుదును;
ఆగ్రహింపఁడు స్వామి యపరాధి నైన–
ఇంక నాపైన నా యినకులేశునకుఁ
దనరు విశేషవాత్సల్యంబు, కరుణ.
అహహా! నాపై నాఁత డాటలం దేనిఁ
గుపితుఁ డౌఁజును గన్గొనియుండ లేదు.
శైశవదశనుండి సైతము నేను
శ్రీరాము విడనాడి జీవించి యెఱుఁగ;
ఆయనగూడ న న్నావంత యేని,
నొప్పించియుండ లే దొకనాడుకూడ.

ప్రభుకృపారీతులు గ్రహియించియుంటి:
ఆటలం దే నోడినప్పుడుకూడ
సదయుఁడై నా స్వామి చతురత నాకె
గెలు పిచ్చి తా నోడుఁ, దలఁచుఁ డీకరుణ!
ప్రేమచే సిగ్గుచే విభునికట్టెదుట
నెప్పుడు మాట్లాడియెఱుఁగను నేను.
రఘురామచంద్రదర్శనతృషితములు
నాదునేత్రమ్ము లీ నాఁటికిఁగూడ-
సతతానురక్తిచే సంతృప్తిఁ గనవు.
కాని, నా ప్రేమను గని యోర్చలేక
పాపిష్ఠి మా తల్లివలన విధాత
మమ్ము వేర్పరచి హా! మది వగఁగూర్చె.
ఈ మాటసైతమే నిప్పుడు పల్కు-
టసమంజసం బగు; నరసినయెడల
తనవిషయంబును తాఁ జెప్పుకొనియు
మంచివాఁ డనికీర్తి మహి నొందె నెవడు?
మా తల్లి దుర్మతిఁ మటి నేను ఘనుఁడ,
నని తలంచుటయు మహాపాప మగును.
ఆరిక మొక్క- కెందైన నీ జగతి
వరికంకి పుట్టునా? వసుధ నెందైన,
నత్తగుల్లను బుట్టునా మా క్తికంబు?
ఏ లోప ముండక యెవని కేనియును
గలనైనఁ జెడుగు తాకదు సుమా! జగతి;
ఊరక యేల నా కొదవు నీ నింద?
కన నా యభాగ్య మగాధపాథోధి;
పరిపక్వ మయ్యె నా పాప మీ రీతి;
అని యెంచుకొనక మా యమ్మను దిట్ట
ఫల మేమియుండు? నిష్ఫల మగుఁగాదె.
ఏఁ గడతేరుట యెట్లులా? యనుచు-
నాత్మలో వెదకితి నఖిలమార్గములు;
అడుగంటె నా కన్నియాశలుగూడ.
కల దొక్క- టే, నేను గడతేరు నాస:
మహితవసిష్ఠర్షి మద్గురుమూ ర్తి!
మహిజారఘూ త్తముల్, మత్ హృదీశ్వరులు!
అందుచేఁ దుది మంగళాంత మాసర్వ-
మని నమ్ముచున్నాఁడ నంతరంగమున.
భవ్య మీసాధుసభా మధ్యమందు,
ఈ నా గురూ త్తమునెదుటను, మటియు
జానకీనాథునిసన్నిధానమున,
ఈ పుణ్యతీర్థమం దేను నిల్చుండి
ప్రకటింపుచుంటి మద్భావంబు లెల్ల.
నాలోన రామాంఘ్రినళినానురక్తి
యున్నదో? లేదో? మదుక్తు లన్నియును
సత్యమో? కాక, యసత్యమో? - తెలియు
నా మునీశ్వరునకు, నా రాఘవునకు.
శ్రీరాముపైఁ గలప్రేమచే, మటియు
మాతల్లి కాపట్యమతిచేత, నృపతి
గతియించె ననుట జగత్ప్రసిద్ధంబు.
ఇక మహారాణులపృథుశోక మెవరు
కాంచి సహింపఁగాఁ గల రీ ధరిత్రి?
పౌరులు చూడ నాబాలగోపాల
మమితదుఃఖాగ్నితప్తాత్మ లైయుండి;
రీ యనర్థంబున కెల్లను నేనె
కారణమని వింటి; గ్రహియించుకొంటి;-
సహియించుకొనియుంటి సకలదుఃఖముల.
సర్వసర్వంసహాచక్రపాలనము
సలుపఁగాఁ దగు రామచంద్రప్రభుండు
మునివేషమును దాల్చి భూరికాననకు
జానకీలక్ష్మణసహితుఁ డై నడిచి
వెడలినాఁడనువార్త వినియును నేను
ప్రాణముల్ విడలేక బ్రదికితి నకట!
శివసాక్షిగా నేను చెప్పుచున్నాఁడ-
అదిగాక గుహుని దివ్యానురాగంబుఁ
గాంచియు వజ్రాతికఠిన మీ గుండె

వ్రీలియు నడిమికి రెండు గాదయ్యె.
కండ్లార సర్వంబుఁ గంటి నే నిపుడు–
పాపిష్ఠినా ప్రాణవాయు వెందాక
నిల్చు నీ బొండెలో నే నంతదనుక
ననుభవింపక తప్ప దఖిలతాపములు.
ఏ మని నేను వచింపఁగాఁ గలను–
జానకీరామలక్ష్మణులనుగూర్చి!
అవ్వారిదర్శన మైనమాత్రమున
వృశ్చికసర్పాది విషజంతువులును
విషమవిషంబును భీషణక్రుధలు
వదలి సాత్వికబుద్ధి వహియించు నహహా!
అట్టి మహామహితాత్ము లైయున్న
జానకీరామలక్ష్మణుల శత్రులుగ
చూచిన కై కేయి సుతుఁడ నౌ నన్ను
వదలి యిం కెవ్వరిఁ బట్టి వేధించు–
ఆ దైవ మీ లోకమందునఁ జూడ?"

వసిష్ఠమహాముని పరితపించుచున్న
భరతు నోదార్చుట

అట్లార్తి, ప్రీతి, నయంబును, వినయ
గుణములతోడను దనరారుచున్న
భరతుని నిర్వేదవరవాణి వినియు
సకలసభ్యులు శోకసమ్మగ్ను లైరి–
కడు మంచుసోకిన కమలంబులట్లు.
జ్ఞాననిధానుఁ డౌసంయమియపుడు
వివిధపురాణపవిత్రకథాళిఁ
బ్రవచించి ప్రేమమై భరతు నోదార్చె.
ఘనదినకరకులకై రవచంద్రుఁ
డౌ రామచంద్రుఁ డయ్యనుజునితోడ
సముచితరీతి నీ సరణి వచించె:

శ్రీరాముఁడు భరతు నోదార్చుట

"వత్స! నీ పూరక వగఁ జెందనేల?
ఎల్లజీవులగతి యీశ్వరాధీన
మని యెఱుంగుము నాయనా! మానసమున.
కనఁ ద్రికాలత్రిలోకముల వెల్గొందు
సకలపుణ్యశ్లోకజనులు నీ ముందు
అణుమాత్రులే, భరతా! శుభచరిత!
నినుఁ గుటిలుం డని నిందించువారు
ఇహపరదూరు లై యెప్పుడుం డెదరు.
సాధుసద్గురుసేవ సలుపనివాఁడె
తల్లి కై కేయిని తనయ! దూషించు.
భరత! నీ నామముఁ బలికినయంత
అఖిలపాపంబులు, నశుభభారములుఁ
బాయు; నీ యిహమునఁ వచ్చు సద్యశము;
పరమునఁ గలుగును బరమసుఖంబు.
తమ్ముఁడా! నాదుస్వాంతమ్ము వచింతు–
సత్య మియ్యది శివసాక్షిగా, భరత!
ఈ ధాత్రి నీచేత నే భరియింపఁ
బడుచున్న దోయి! సద్భక్తవరేణ్య!
నినుగూర్చి నాయనా! నీ హృదయమున
వ్యర్థముగాఁ గుతర్కాళిఁ జేయకుము.
వైరంబు ప్రేమయు భావంబులోన
దాఁచిన దాగునా? దాఁగవు తనయ!
కనుము లోకంబున ఖగమృగగణము
సాధుసన్నిధియందుఁ జనువునఁ దిరుగు;
బాధించువ్యాధునిపజ్జ కేఁజనవు;
పశుపక్షులకుఁగూడ భావమం దెఱుక–
తమశత్రు లెవ్వరో– తమ మిత్రు లెవరొ!
ఇఁక గుణజ్ఞానసంభృత మాచుఁ దనరు
మనుజ జన్మునిఁ గూర్చి మఱి చెప్పవలెనె?
నీ విషయం బెల్ల నే నెఱుంగుదును
కాని, నేఁ జేయఁగాఁ గల దేమి? వత్స!
మతి, యతిడోలాయమాన మై యుండె:
ఎఱుగుదు! వీవు– శ్రీనృపతి న న్వీడచేఁ

దనమహాసత్యవ్రతము వీడ లేక;
మఱియుఁ బ్రేమవ్రతమతిచేత నతఁడు
తనప్రాణములె పరిత్యాగం బొనర్చెఁ;
దండ్రియానతి నటు దాఁటుదమన్నఁ
జిత్త మాందోళనఁ జెందుచునుండె;
ఇటు నిన్నుఁ జూచుచో నెడఁద నీ రగును-
అదిగాక గురువరునాదేశ మయ్యె-
సరియె- ఏ దెట్లైన సమ్మతి నీవు
చెప్పెడు విధముగాఁ జేసెద నేను.
సంశయింపక నీవు సంతోష మొప్ప
ఏఁ జేయవలసిన దెఱిఁగింపు మోయి!
ఈనాఁడె యా కోర్కె-, యే నెఱవేర్తు.”
అనుసత్యసంధుఁ డౌనా రఘురాము
వాక్యముల్ వినియు సభాసదు లెల్లఁ
బరమసంతోషసంభరితాత్మ లైరి.
అపుడు దేవేంద్రాదియమరు లందఱును.
మనపని చెడెనని మఱి భయపడుచు
ఆందోళనముఁ జెంది రతితీవ్రలీల.
ఏ దిక్కు- తోఁచ దాయెను వారి కపుడు.
చివరకు మనకింక శ్రీరామవిభుఁడె
శరణని తలఁచిరి స్వాంతరంగమున.
వారిలో వారు విచారించుకొనియు
భక్తభక్తివశుండు పరఁగ శ్రీరామ
భద్రుఁడ టంచు దుర్వాసాంబరీష
కథలు స్మరించియుఁ గళవళమంది
అతినిరాశాస్వాంతు లైరి ఖగేంద్ర!
“మును దీర్ఘకాలము, పొగులగా మనము
చివరకుఁ బ్రహ్లాదుచేఁ గదా! నాఁడు
తన్నారసింహావతారంబు వచ్చె”-
నని నెత్తి బాదుకొం చా సుర లెల్ల
గుసగుసల్ పోయిరి కూడి యీ రీతి:
“భరతవశ్యముసుమా! సురకార్య మెల్ల.

ఓ సురలార! వే ఱొకదారి లేదు.
కన నొక్కమార్గమే కలదు రక్షింప:
జానకీవిభుఁడు ప్రసన్నత నొందు
స్వీయసుసేవక సేవచేఁ- గాన-
స్మరియింత మిదె భక్తిమయచిత్తములను
నిజగుణశీలవినిర్మలత్వముల
శ్రీరాము వశునిఁగాఁ జేసికొన్నట్టి
భాగవతోత్తము భరతకుమారు.”
అని సురల్ తలపోయ నా సురాశయము
విని బృహస్పతి యిట్టు లనియె సంప్రీతి:
“ఆహా! త్వదీయభాగ్యం బతిఘనము
భరతపావనపదపద్మానురక్తి
అఖిల మంగళమూలమగుఁ గదా! జగతి.
సీతాధిపతిపాదసేవకసేవ
కామధేనుశతంబుగా సుఖ మిచ్చు.
భరతునిపై భక్తి ప్రభవించె మీకు-
చింతనొందకుఁ డింకఁ జిత్తంబులందు-
విధితీర్చెఁ గృప మీ యభీష్టంబు లెల్ల.
భరతప్రభావంబుఁ బరికింపు మింద్ర!
వివశుఁ డయ్యెను రఘువీరుఁ డాతనికిఁ,
గడుసునాయాసముగా, సహజముగ.
భరతుఁడు శ్రీరామభద్రునినీడ
యని గ్రహియించి స్వాస్థ్యంబును గనుమ!
భీతిల్లఁ బనిలేదు విబుధవ్రజంబ!”
అంత సర్వవ్యాపి యైనరాఘవుఁడు
విని సురగురుసురబృందభాషణల,
కని తదీయామరగణమనోవ్యథల,
స్వాంతరంగమ్మున వ్యాకులమొందె.
భారమంతయుఁ దనపై నుంట నెఱిఁగి
భరతుఁ డాలోచించి పలు తెఱంగులను,
చివరకు నిశ్చయించెను జిత్తమందు-
రామచిత్తానుసారపరివర్తనమె

అమిత శ్రేయస్కరం బగు నా కటంచు.
"నా మాట నెఱవేర్ప రామచంద్రుండు
తనశపథము వీడఁ దలఁచె నోహోహో!
ఎంతటి దయ, స్వామి కెంతటి ప్రేమ!
అహహ! సీతాపతి యఖిలవిధాల
అత్యమితానుగ్రహంబు నాయందు
వర్షించినాఁ"— డని భరతుండు దలఁచి
ప్రణమిల్లియును గరపద్మముల్ మోడ్చి
భాషించె నీ రీతి భక్తి భాసిల్ల:
"తతకరుణాబ్ధి,వంతర్యామి వైన
శ్రీరామ! నీ కేమి చెప్పఁగా గలను?
ఇతరులతోడ నీ కేమి చెప్పింతు?
సద్గురువులును బ్రసన్ను లై రహహ!
స్వామియు ననుకూలభావు లై యుండి
రీ నాదుమలిన మామానసమందుఁ
గల్పిత మైనట్టి ఘనబాధ తొలఁగె.
ఊహాభయంబుల నొందితిఁగాని
వానికి హేతువు, పరికింప లేదు.
దిక్కులు తోఁచక దిగ్భ్రమఁ గనిన,
సూర్యునిదోషంబు సుంతైనఁ గలదె?
నా దురదృష్టము, నా తల్లి కుమతి,
దుర్విధిగతియును, దుష్కాల, మొకటి
గాఁ గూడెఁ బతనంబుఁ జేకూర్పనాకు;
అయినను బ్రణతార్తి హరుఁడ వీ వౌట
నీ ప్రతిజ్ఞావాక్కు నెఱవేర్చుకొనఁగ-
నో దీనశరణ! నన్నుద్ధరించితివి.
నీ కిది క్రొత్తయా? నీరజనయన!
ఇది విశ్వవిదితము, ఇది వేదవిదిత;
మెన్నఁగా నిది గోప్య మేమియుఁ గాదు.
జగము సర్వంబు ద్వేషంబుఁ జూపినను
కృపను జూపెడువాఁడ వీ వొక్కరుఁడ వె!
ఓ రామచంద్రప్రభూ! కృపాజలధి!

చెప్పము నీ కృపచేఁ గాక యెవరి
కృపచేత శుభ మొందు నీ జీవకోటి?
దేవ! రాఘవ! నీ స్వభావంబు, కల్ప
వృక్షంబుపోలిక వెలుఁగొందుచుండు-
ఒకనికి విముఖ, మిం కొకనికి సుముఖ-
మయ్యది కాదు మహామహితాత్మ!
ఎట్టిగి అయ్యది కల్పవృక్షం బటంచు
ఆశ్రయించినఁ జాలు, నద్దానినీడ
సకలదుఃఖంబుల శాంతింపఁజేయు-
నృపతి యైనను మఱి, నిరుపేద యైన,
సజ్జనుఁ డైన, దుర్జనుఁ డైన సరియె-
ఎవ రేది కోరిన నిచ్చు నద్దాని.
నా గురుదేవులున్ నా ప్రభువర్య
లఖిలవిధంబుల నద్భుతప్రేమ
నాయందు వర్షించినా రందుచేతఁ
బ్రశమించె నా మనోవ్యాకులవహ్ని;
సమసెను నాలోనిసందేహరాశి.
ఇప్పు డో కరుణానిధీ! రామచంద్ర!
త్వత్సేవకునినిమిత్తముగ నీ వాత్మ
వ్యాకుల మొందనిపగిది వర్తించి
నన్నటాక్షింపఁగా నతు లొనరింతు.
ఏసేవకుఁడు నిజహితతంత్రుఁ డగుచుఁ
దనయజమానిచిత్తమును బాధించు-
వాఁడు క్షుద్రాత్ముఁడు, బరమనీచుండు.
స్వార్థసుఖాల లోభంబును వదలి,
స్వామిసేవ నొనర్పఁజాలు సేవకుఁడె
సత్ఫలంబును బొందఁ జాలును గాదె!
ప్రభు! నీ వయోధ్యకు వచ్చినయెడల
సర్వులకోర్కెలు సంసిద్ధిఁ గాంచు.
నీ ఆజ్ఞఁ దలఁ దాల్చి నెఱవేర్ప మేము,
కోటిరీతుల లాభకోటిఁ బొందెదము.
భవదాజ్ఞఁ దలఁదాల్చి వర్తించుకొనుచె-

అలస్వార్థపరమార్థముల సార మగును;
సకలసుకృతముల సత్ఫల మగును;
సకలసద్గతులభూషణరాజ మగును.
దేవ! నాదొకవినతిని విని, పిదప
భవదనుగ్రహరీతి వర్తింపు మయ్య!
పట్టాభిషేకసంభారంబు లెల్ల
సమకూర్చి తెచ్చితి, సదయుండ వగుచు
స్వామి! నీ వుపయోగపఱుపఁ బ్రార్థింతు-
సమ్మత మగునేని స్వాంతరంగమున.
జానకీనాయకా! శత్రుఘ్నుతోడ
నను వని కంపుము నాథ! సాకేత
నగరప్రజలను సనాథులఁ జేయు;
మట్లు కాదందువా? అనుజు లిద్దఱిని
నగరికిఁ బంపించి నన్ను శ్రీరామ!
నీతోడఁ గానలో నిలువఁగానిమ్ము.
కానిచో నేను లక్ష్మణుఁడు శత్రుఘ్నుఁ
డేము మువ్వురము వసింతుము వనిని;
తొల్నాసుతాసహితంబుగా రామ! నీవు
దయసేయుమా, అయోధ్యాపురంబునకు.
నీకు సమ్మత మైన నియతి వర్తింపు
మో కృపాసాగరా! ఓ జగన్నాథ!
స్వామి! నాపై సర్వభారముంచితిరి-
నాలోన లే దెట్టినైతికదృష్టి,
ధర్మవివేచనాతత్పరత్వంబు;
స్వార్థమే నాదుభాషణముల నుండు;
దీనదుఃఖితునకుఁ దెల్వి యే ముండు?
ప్రభునాజ్ఞ వినియు మార్పలుకులు పలుకు
సేవకు గనుఁగొని సిగ్గు సిగ్గొందు.
ఏ నట్టి యవగుణబృందమహాబ్ధి
నైనను, స్వామి, ప్రేమాయత్తదృష్టి-
సాధు వంచుఁ బ్రశంస సలిపెను నన్ను.
ఓ కృపాసాగరా! ఓ రామచంద్ర!
నీ మనస్సుకు నొప్పి నే సుంత యైనఁ
గల్గింపనట్టిమార్గం బెదో- అదియె-
మాకును జగతికి మంగళప్రదము-
ప్రభుసాక్షిగా నిది పలుకుచున్నాఁడ.
సాకేతనాథ! ప్రసన్నుండ వగుచు
స్వాంతమం దెట్టి సంశయములు లేక
ఆజ్ఞాపనము సేయవయ్య! మే మెల్లఁ
దలఁదాల్చి వర్తింపఁగల మట్లు దేవ!
అన్యాయ మంతయు నడుగంటఁ గలదు.
చిక్కు- లన్నియు దీరు శ్రీరామచంద్ర!"
అని పల్కు- భరతుని అమలవాక్యముల
నాలించి దేవతల్ హర్షంబు నొంది,
బాగు బా, గని పుష్పవర్షముల్ గురిసి;
రపు డయోధ్యాప్రజ లాకులపడిరి
మునివనచరులుఁ బ్రమోదాత్మ లైరి.
పరమగభీరస్వభావుఁ డారాముఁ
డేమియు మాట్లాడ కే యూరకుండె.
తద్రామమౌనముద్రను దిలకించి
అఖిలసభాసదుల్ వ్యాకులపడిరి.

జనక రాజేంద్రునిదూతలు వచ్చి జనక
రాజేంద్రునాగమనంబుఁ దెల్పుట

అత్తఱి జనకమహానృపుదూత
లరుదెంచి రనువార్త నాలించి వారి
సత్వరంబుగ వసిష్ఠర్షి రావించె;
వా రట్లు వచ్చియుఁ బ్రణతు లొనర్చి,
అల రామమునివేష మరసి బెగ్గిలిరి.
"సపరివారంబుగా జనకభూవరుఁడు
క్షేమమే గద!" యని సేమంబు లడిగె
ఋషిపతి దూతల నీక్షించి; యపుడు
సౌజన్యహృదయు లా జనకునిభటులు
ఖిన్న లై తలవంచి కేల్మోడ్చి యిట్లు

పలికిరి మునిసార్వభౌమునితోడ:
"కూర్మి మీ రడిగినకుశలసంప్రశ్న
మే, మాకుఁ గూర్చె స్వామీ! కుశలంబు;
మున్ను మీ కుశలంబు లన్ని యీ కోస
లేశునితోడనే యెడబాసె నయ్య!
ఆ మహామహుని నిర్యాణంబుకతన
అఖిలప్రపంచ మనాథ మైపోయె;
ప్రాముఖ్యముగ మిథిలానగరంబు,
సాకేతనగరంబు, క్ష్మామండలమునఁ
గడు దిక్కు-లేనివిగా మాఱిపోయె.
వినినంత దశరథవిభుమృతివార్త
జనకపురస్థప్రజాతతియెల్ల
ఉగ్రశోకవ్యాకులోన్మత్తమయ్యె;-
అత్తఱినా విదేహప్రభుఁ గాంచ
సార్థకనామధేయముఁ దాల్చినట్లు
లేరికి న్దోఁచదాయెను మునినాథ!
కైకమ్మ చేసినకపటంబు వినియు
అపహృతమణి యగువ్యాళంబువోలె
వ్యాకులమొందె భూపతి జనకుండు.
రాముఁడు వని కేఁగి, రా జయ్యె భరతుఁ
డనువార్త జనకుని యంతరంగమును
దారుణదుఃఖసంతప్తం బొనర్చె.
అంత నాతఁడు విబుధామాత్యవరుల
నందఱ రావించి, "ఆత్మీయులార!
ఇప్పుడు కర్తవ్య మేమియో? తెలుపుఁ"
డాలోచనముఁ జేసి యంతరంగముల.
అని పల్క వా రయోధ్యాపురిలోని
కష్టపరిసితుల్ గమనించియుంట
నృపుఁ డేఁగఁ దగునని, యేఁగన ద్దనియుఁ,
దేల్చిచెప్పుటకు సంధిగ్ధాత్మ లై రి.
అప్పుడు మిథిలాపురాధినాయకుఁడు
సమకూర్చుకొని ధృతి స్వాంతరంగమున
సముచితాలోచన సలిపి, నల్వురను
జతురు లౌదూతల సాకేతపురికిఁ
జని మీరు భరతునిస్వాంతరంగంబు
మంచిదో? చెడ్డదో? మది గ్రహియించి
శీఘ్రమే రం డని చెప్పిపంపించె.
అ ట్లేఁగి యీ దూత లచ్చట భరతు
పావనచర్యలఁ బరికించి చూచి,
ఆతఁడు చిత్రకూటాచలంబునకుఁ
బయనింప, మిథిలకు వచ్చిరి తిరిగి.
వచ్చి ఆ దూతలు భరతుచర్యలను
జనకునిసభలోన శక్తికొలంది
వర్ణించి చెప్పిరి; వాని నాలించి
గురుపరిజనమంత్రి కువలయాధిపులు
పృథులవ్యథాక్రేమ వికలాత్మ లై రి.
తదుపరి నృపుఁ డెద ధైర్యంబుఁ బూని
భరతుఁ గీర్తించి, సద్భటసాహిణీజ
నంబుల రావించి, నగరిని బురిని
రాజ్యముక్ గాపాడ రక్షణఁ గూర్చి,
చతురంగబలముల సన్నద్ధపఱచె.
ఇ ట్లొకగంటలో నెల్ల సన్నాహ
మొనరించియు శుభముహూర్తమునందుఁ
బయనంబుఁ గట్టె సత్వరము దీపింప.
ఆయనమార్గమధ్యమున నెచ్చోట
నాగకుండగను బ్రయాణం బొనర్చె.
అటు లరుదెంచి ప్రయాగలోఁ బ్రభువు
స్నానం బొనర్చి యీనాఁటిప్రొద్దునను
పయనంబు సాగించెఁ బరమమునీంద్ర!
యమునానదిని వారలందఱు దాటఁ
బోవుచు మమ్ముల ముం దంపి రనఘ!"
అని పల్క యీ దూతలందఱుఁగూడ
మ్రొక్కిరి శిరములు భూమికి వంచి;
అంతఁ దత్క్షణమె మహర్షివర్యుండు

ఆ రేడుగురు సద్వినాటుల నిచ్చి
పంపె నా జనకభూపాలుదూతలను.
జనకు నాగమనము విని జను లెల్ల
సంతోషమొందిరి; స్వాంతరంగమున-
ఆందోళనముఁ జెందె నా రఘూత్తముఁడు;
సంక్రందనుఁడు గడుసంకటపడియె.
కుటిల కైకేయి లోఁ గుములఁగా సాఁగె-
ఎవరితోఁ దనమతి నికఁ జెప్పుకొనును?
ఎవరిని నిందించు నీ కర్మమునకు?
మఱికొన్ని నాళ్లు రామప్రభుపాద
సన్నిధిలో నుండఁజాలుదు మనుచు
సాకేతజను లెల్ల సంతోషపడిరి.
ఆ ప్రకారంబుగా నా రోజు గడచె.
మఱునాఁటిప్రొద్దున మహితప్రజాళి
స్నానాదికృత్యముల్ సలిపి, సద్భక్తి
గణనాథు, గౌరిని, గరళకంధరుని,
ఆదిత్యదేవు, శ్రీహరినిఁ, బూజించి
ప్రార్థనఁ జేసిరి, భక్తి దీపింప.
అంజలిబద్ధు లై అఖలపూరుషులు
చేలాంచలము లూని స్త్రీజనంబులును
ప్రార్థించి రీ రీతి భక్తి వెలుంగ:
"రఘురామచంద్రుఁడు రా జగుఁగాక!
జానకీదేవియే రాణి యౌఁగాక!
బహుజనబృందసంభరిత మై తిరిగి
తనరుఁగావుత మయోధ్యారాజధాని
ఆనందసంపూర్ణ మై వసుంధరను.
రామచంద్రుఁడు యువరాజుగా భరతుఁ
జేయునుగాక, సుశ్రీ వెలుఁగొంద;
ఈ సుఖామృతమున మే మెల్ల మునిఁగి
జీవనలాభంబుఁ జెందఁగా జగతిఁ
బ్రార్థించుచున్నాము పరమేశ! ఈశ!
సాచార్యమంత్రిప్రజానుజంబుగను

శ్రీరామచంద్రుఁ డీ క్షితి నేలుఁగాక!
పావనశ్రీరామపాలనమందె
సాకేతపురి మేము శాంతి దీపింపఁ-
గడతేరుదుము గాక, కాకుత్థ్సకృపను."
ఆ యయోధ్యాపౌరు లందఱుఁగూడఁ
బ్రొద్దిం చి రిట్టులు పరమమునీంద్ర!
అట్లు వచించెడి ఆ మహాజనుల
ప్రేమమయోక్తుల విని జ్ఞాను లైన
ఘనమునుల్ సైతము గర్వించుకొనిరి
నిజయోగవైరాగ్య నియమనిష్ఠలను.
నిత్యకర్మల నిట్లు నెఱవేర్చి పౌరు
లందఱు వెడలి రామాంఘ్రులమ్రోలఁ
బ్రణమిల్లి రనురాగపరవశత్వమునఁ
దనువులఁ బుల్కరింతలు వెలయుంగ.
అఖలనారీనరు- లధికు లల్పులును
మధ్యస్థులును అభిమతవిధానమున
శ్రీరామదర్శనశ్రీ నొంది రఘుడు.
జానకీనాథుఁడు సావధానముగ
ఆదరించెను వారినందఱుఁగూడ.
అప్పు డాప్రజ లెల్ల ఆ కృపానిధిని
శ్రీరామదేవుఁ గీర్తించి రీ రీతి:
"వారివారికిఁ దనపైఁ గల్గు ప్రేమఁ
బరికించి, సముచితపద్ధతి నేలు
పాలకనీతి, తద్బాల్యంబునుండి
రామునిలోన విరాజిల్లుచుండు.
స్వామిమోమున సుప్రసన్నత సతము
శృంగారరసముతోఁ జెలిమియెనర్చు;
శ్రీవారికన్నులఁ జిందులు ద్రొక్కు-
సదమలకరుణారసంబు సంతతము;
మా ప్రభువర్యునిమానసమందు
నిర్మలత్వము సదా నివసించుచుండు;
మానమర్యాదల మహిత శీలమున

మా రాము మించిన మహనీయుఁ డెవఁడు?
అని ఈ విధంబుగా ఆ జను లెల్ల
శ్రీరామచంద్రుఁ గీ ర్తించి నోరార,
అనురాగపరవశు లౌచు, "ఆహాహా!
మనవంటిధన్యు లీ మహిలోనఁ గలరె?
తనవారిఁగా స్వామి తలచెను మనల."
అని పరమానందమందున మునిఁగి
యుండి; ర త్తఱి జనకోర్వీశ్వరుండు
వచ్చుచున్నాఁ డనువా ర్త నాలించి,
రవికులరాజీవరవి రాఘవుండు
సభికులున్ లేచిరి సంభ్రమ మొప్ప.

శ్రీరామచంద్రుఁడు జనకరాజర్షికి స్వాగత మొసఁగుట

తన వెంట రా సహోదరులు సుమంత్రుఁ
డా చార్యుఁడును పౌరు లంనఱుఁ గదలి-
వెడ లె శ్రీరాముఁడు ప్రీతి యుప్పొంగ
జనకరాజర్షికి స్వాగత మొసఁగ.
కుధరరాజమునఁ జిత్రకూటంబుఁ గాంచి
నంతనే జనకధరాధినాథుండు
ప్రణతు లర్పించియు రథమును డిగ్గె.
రఘురామచంద్రదర్శనలాలసాత్మ
లౌ మిథిలావాసులం దొక్క రేనిఁ
గన రె రొకింతమార్గాయాస మహహా!
జానకీశ్రీరామచంద్రులయందు
మగ్నమాయెను వారిమానస మెల్ల;
చి త్త మింకొక చోటఁ జేరియుండంగఁ
దనుసుఖదుఃఖముల్ తమ కెట్లు తోఁచు?
ఈ రీతి మిథిలేశుఁ డే తెంచుచుండె
సపరివారముగ భాస్వత్ప్రేమ మొప్ప;
జనకరాఘవసమాజంబు లీ రీతి
విమలానురాగంబు వెలయ నొండొంటఁ
గలసి సత్కా రముల్ గావించుకొనియె.
రామునిచెంగట రాజిలుచున్న
మునులకు జనకుఁడు ప్రొక్కె సద్భ క్తి.
జనకునితోడను జనుదెంచినట్టి
తాపసులకు ప్రొక్కె దశరథాత్మజుఁడు.
అంత శ్రీరాముఁడు అనుజులతోడ
జనకుని గలసియు సన్మాన మొసఁగి-
ఆతని, నాతనియనుచరావళినిఁ
గొండపైఁ గల పర్ణకుటికిఁ దోడ్తెచ్చె.
రామాశ్రమము శాంతిరసపూర్ణ మైన
పరమపావనమహావార్ధియ ట్లుండె;
శ్రీరాము వెంట వచ్చినజనకేంద్రు
పరివారమంత యా వార్ధిలోఁ గలియ
వచ్చినకరుణాప్రవాహమ ట్లుండె.
తత్కరుణానదీతటయుగళంబు
జ్ఞానవై రాగ్యముల్; దానిలోఁ గలియు
ఉపనదు లెన్న శోకోక్తులు; మఱియు
ఏడ్పులు నిట్టూర్పు లేతత్ప్రవాహ
వీచికావాయువుల్; వీని తాకిడికిఁ
దటమున నుండినధైర్యవృక్షములు
పెకలింపఁబడుచుండె ప్రేళ్ళతోఁగూడ;
కన నా ప్రవాహవేగం బుగ్రదుఃఖ;
మందున లెక్కింప నలవిగానట్టి
పలుసుడిగుండముల్ భయవిభ్రమములు;
విబుధులన్ నావికుల్, విద్యాభిధేయ
ఘననౌకలను దెచ్చుకొని నిల్చి రందు;
ఐన వా రానదియందున వాని
నడుప నశ క్తు లై నట్లాడుచుండ్రి.
తెలియదు వారి కా తీవ్రప్రవాహ
జలములందలిలోతు శాంకరీ! గౌరి!
కోలకిరాతు లా ఘోరప్రవాహ
తీవ్రతన్ గనుఁగొని దిగ్భ్రాంతిఁ జెంది

భయముతో నిల్చినపాంథజనంబు;
తత్ప్రవాహంబట్లు తరలి యే తెంచి
ఆశ్రమసాగరమందునం గలియఁ-
దత్సాగరముగూడ తల్లడ మొందె.
ఉభయసమాజంబు లుగ్రశోకమున
నుద్ఘోషణముఁ జేసె-- నూడ్చుకపోవ
జ్ఞానంబు, ధృతియు, లజ్జయు, నేకముగను.
దశరథధారుణీధవురూపశీల
గుణముల నెంతయుఁ గొనియాడుకొనుచు
విలపించి విలపించి వివశు లై, వారు
మునిఁగిరి శోకసముద్రగర్భమున.
సర్వజనుల్ దుఃఖసాగరమగ్న
లై విలపించుచు, "హా! ఎంత చేసె
దుర్విధి!" అని విధిన్ దూషించుకొనిరి.
చెప్పుచుండెను దులసీదాసు వినుఁడు:-
జనకునిస్థితిఁ గన్న సర్వసుపర్వ
సిద్ధతాపసయోగిశేఖరుల్, మునులు,
సదమల స్నేహరసప్రవాహమును
దరియింపఁజాలక తల్లడపడిరి.
అట నట న్నిల్చి మహర్షులు, జనుల
నోదార్చి రమితమహోపదేశములు.
శ్రీవసిష్ఠమహర్షి శేఖరుఁ డంత,
"ధైర్యమూనుము మహీధవ! హృదయమున"-
నని యూఱడించె నా జనకభూవిభుని.

శ్రీరామచరితమానసము

అయోధ్యాకాండము

షోడశవిశ్రామము

శ్రీవేదశై లనిలయా!
దేవేంద్రప్రముఖ సేవ్యదివ్యపదాబ్జా!
భూవనితాదుఃఖహరా!
పావనశ్రీమట్టపల్లి వాస! నృసింహా!.

"ఎవనిసుజ్ఞానార్కుఁ డెల్లభవాంధ
కారంబుఁ బోఁద్రోలఁ గలుగునో జగతి,
ఎవనివాక్కిరణంబు, లెల్ల మునీశ
హృదయపద్మముల హర్షింపగాఁ జేయు,
నట్టి యా జనకమహోన్నపు నోర!
మోహమమత్వముల్ మూచూడఁ గలవె?
అట్టి ద్వంద్వాతీతుఁ డౌజనకుండు
శోకవశుం డౌట, చూడఁగా నతని
కా జానకీరాములం దెంతగాఢ
ఘగుప్రేమ మున్నదో- యవగతం బగును.
అరయఁగా నల విషయాసక్తజనులు,
సాధకుల్, మఱి సిద్ధజను, లనఁ బరఁగు
త్రివిధజీవులు ధరిత్రిని గల రనుచు
వేదశాస్త్రంబులు విదితం బొనర్చు.
వీర లందఱిలోన వేనిస్వాంతంబు
రామానురాగరసామృతమయ మెమొ-
ఆతఁడే పూజితుం డౌ సాధుసభల.
అల రామభక్తి లేనట్టి జ్ఞానంబు
కర్ణధారుఁడు లేని కల మనఁ దగును.

ఓ పార్వతీ! సతీ! ఓ యుమా! వినుము!
ఆ విదేహనృపాలు నవ్వసిష్ఠర్షి
యూఱటపఱచె నె న్నెన్నో విధాల.
అంతట సర్వప్రజాళి స్నానంబుఁ
గావించె నట రామఘట్టంబునందు.
అఖలనాగీనరు లతివ్యాకులమున
నీ రైనఁ గ్రోలక నిలిచి రా రోజు.
పశుపక్ష్యమృగములున్ వని నా దినాన
మేత మూచూడక మిగుల శోకింప,
శ్రీరామచంద్రైకజీవను లైన
పరిజనులనుగూర్చి పలుకఁగావలెనె?
అంతఁ బ్రాతఃకాలమందున లేచి
నిమివంశపతి రఘునేత లిద్దఱును
సపరివారంబుగా స్నానముల్ చేసి
వచ్చికూర్చుండిరి వటమూలమందు-
బరు వైనయెదలతో, బడలినయట్టి
తనువులతోడఁ, బతంగవతంస!
సాకేతపురినుండి, జనకరాజేంద్రు
పురినుండి, వచ్చిన భూసురవరులు,
హంసవంశాచార్యుఁ డగువసిష్ఠర్షి,
శ్రీజనకేంద్రుని ప్రియపురోహితుఁడు
ఇహపరంబుల రెంటి నిలను సాధింపఁ
దగినమార్గమును శోధన మొనరించి
నట్టిఘనుండు శతానందమౌని,

పృథుధర్మ నీతి వివేక వైరాగ్య
సంబంధసద్విశేషంబు లెన్నెన్నో
ప్రవచించి రద్భుతవాక్కులు వెలయ.
కౌశికమునియు వాక్కౌశల మెసఁగ
వివిధపౌరాణికవిషయముల్ చెప్పి,
స్వస్తులఁ గావించెసభ్యుల నెల్ల.
అంతనగ్గాధేయు నరసి రాఘవుఁడు,
"ఓ ప్రభూ! గురుదేవ! ఓ మునిరాయ!
నిన్నటినుండియు నీ రేనిఁ గొనక
యుపవాస మొనరించుచుండి రందఱును"—
అని సూచనముఁ జేసె వినయ మొప్పార.
"సముచితంబులు రామచంద్రువాక్యంబు;
లవును, నేఁడును అపరాహ్ణంబు తిరిగె."
అనఁగ విశ్వామిత్రు డా జనకుండు
మునివర్యభావంబుఁ గనిపెట్టి పలికె—
"అశనంబుఁ గొననిట ననుచితం" బనుచు.
జనకరాజేంద్రునిసముచితోక్తులకు
సర్వులు హర్షించి సాంధ్యతంబులందు
మునివర్యునాజ్ఞఁ గైకొనియు మధ్యాహ్న
కాలపుస్నానముల్ గావింపఁ జనిరి.
అంతలో వనచరు లరుదెంచి రటకుఁ
గావళ్లనిండుగాఁ గందమూలముల
ఫలపుష్పదళముల భక్తిఁ గైకొనియు.
రామప్రసాదముచే మహీధరము
లఖిలకామ్యప్రదాయకము లై మఱియు
దర్శనమాత్రసంతాపాపహార
కంబు లై, మిగులఁ బ్రకాశించె; నపుడు
వరసరోవరసరిద్వనభూము లెసఁగె
హర్షానురాగమయంబు లైనట్లు.
తతలతావృక్షకదంబంబు లెల్ల
ఫలపుష్పజాలసంభరితంబు లయ్యె;
ఖగమృగమధుపసంఘంబులు కలసి
శ్రావ్యరావంబుల సలుపుచునుండె;
అత్తటి వనసీమయంతయు వెలిఁగె
భూరిసంతోషసంపూరిత మగుచు;
మందశీతలగంధమలయానిలములు
సర్వజనంబుల సమ్మోదపఱచె;
వర్ణనాతీతమా వనమనోహరత!
కనఁగ నా భూదేవి జనకభూపతికి
ఆతిథ్య మొసఁగుచున్న ట్లుండె నపుడు.
జనులంద అంతట స్నానముల్ సలిపి,
శ్రీరామజనకవసిష్ఠాజ్ఞ నొంది,
వృక్షరాజంబులఁ బ్రీతి వీక్షించి,
అటనట విడిసి రా విటపిమూలముల,
అంతవసిష్ఠర్షి యాదర మొప్పఁ
దట్టల నిండుగాఁ దనివితీరంగ
శుద్ధసుందరసుధాసుమధురవివిధ
కందమూలఫలాదికములఁ బంపింప,
వా రారగించిరి భక్తిఁ బూజించి—
పితృదేవతాతిథిబృంద దేశికుల.
గడచె నీ తెరఁ గొప్పగా నాల్గుదినము;
లఖిలనారీనరులా రామచంద్ర
శుభదర్శనముతోడ సుఖముగా నుండ్రి.
"పృథ్వీజారాముల విడి మనమేగు
టనుచితవిషయ మా; నరయఁగా మనకు
జానకీశ్రీరామసాంగత్య మున్న—
వనవాసమే కోటిస్వర్గాలకన్న
మిన్నగా సుఖ మిచ్చు; మేదిని నెవఁడు
జానకీరామలక్ష్మణులసాన్నిధ్య
భాగ్యంబు విడనాడి వసియించు నింట?
వానికి మించుదౌర్భాగ్యుఁ డెవ్వండు?
శ్రీరామపాదరాజీవసన్నిధిని
వసియించుభాగ్యంబుఁ బడయుఁ గల్గుటకు
పరిపూర్ణముగ మనపై నుండవలయు—

దైవకటాక్షము తప్పనిసరిగ.
ప్రీతి మీఱఁగ మూఁడు వేళలయందు
మందాకినీనదీమజ్జనంబులును,
ఆనందసన్మంగళాధార మైన
సదమలశ్రీరామసందర్శనంబు,
రామగిరిప్రాంతరమ్యాతిరమ్య
వనమునివాటికావరవిహారంబు,
అమృతోపమానరుచ్యామలకంద
మూలఫలాహారములు నిత్య మెసఁగ,
పరమసుఖంబుగాఁ బదునాలుగేండ్లు
గడచు నొక్క నిమేషకాల మట్లుగను."
అని అయోధ్యామిథిలావాసు లెల్లఁ
దలపోసికొనుచును దమలోనఁ దాము,
"మన మయోగ్యుల మట్టి మహితసుఖంబు
నంద; నంతటిభాగ్య మబ్బునే?" అనుచు
భాషించుకొనిరి తీవ్రవ్యాకులమున.
ఆ యయోధ్యామిథిలావాసజనుల
సహజనిర్మలరామచరణానురాగ
మట్టిది. ఖగవల్ల భా! గరుత్మంత!
ఈ రీతి వారు, నిజేప్సితంబులను
భాషించుకొనిరి; తత్పరమానురాగ
వాక్యముల్ వినఁగ శ్రావ్యంబు లైయొప్పె.
తత్సమయమున సీతాప్రియజనని
సునయన, సకియలఁ జూచి రం డనుమ
మహితకౌసల్యాదిమాతలకడకుఁ
బంపఁగా, వారలు వచ్చి, సూచించి–
రనుకూలసమయమే, యనువిషయంబు.

జనకపత్ని యగుసునయన మొదలగువారిని
గౌసల్య సత్కరించుట

జనకునిరాణివాసమువార లంతఁ
జనుదెంచఁ గౌసల్య, సాదర మొప్ప
సన్మాన మొనరించె సమయోపలబ్ధ
సముచితాసనము లొసంగి ఖగేంద్ర!
ఆ మహారాణుల యనురాగశీల
ములఁ జూచినను విన్న, భూరికఠోర
ఘనవజ్ర మేనియుఁ గఱఁగి నీ రౌను.
ప్రేమచే వా రెల్ల వివశత్వ మొంది
తనువులఁ బులకరింతలు వెలయుంగఁ
గనుల బాష్పంబులు కారుచుండంగ
శోకభారముచేత క్ష్మోణీస్థలాన
పాదనఖంబుల వ్రాయఁ గడంగి;
రహ! వారు తోఁచి రయ్యవసరమందు
సీతారఘూత్తమస్నేహాకృతులుగ!
కాంచఁగా వారల, కారుణ్యరసము
బహురూపములఁ దాల్చి వగచిన ట్లుండె!
అప్పుడు జనకు నర్ధాంగి యి ట్లనియె:
"అరయఁగా విధిచిత్త మతివక్ర మకట!
పాలపై నురుగును బగులగొట్టుటకు
కఠినవజ్రప్రయోగము సేయుచుండు!
అమృత మున్న దటంచు ననవరతంబు
వినుచుంటిమే కాని కనియుండ లేదు;
విషమునుమాత్రము వీక్షింపఁగలము.
ఎక్కడబట్టిన నెన్న లేనన్ని
కాకఘూకబకాళిఁ గాంతుమేగాని,
హంసలఁ గనుఁగొన ననువుగా దెపుడు
తన్మానసంబునఁ దక్క వే ఱెచట."
అన, సుమిత్రా దేవి యనె నీ విధాన
స్వాంతమ్ములోన విచారంబు నిండ:
"కడువిపరీతముల్ కడువిచిత్రములు
విధి చేయుపను లెల్ల వీక్షించునెడల:
తానె పుట్టించియుఁ దానె పోషించి
తానె గిట్టించు నంత్యంబునం; దతని
కృత్యముల్ బాలక్రీడల ట్లుండు!"

కౌసల్య అంత యీ కరణి భాషించె-
"ఎవ్వరిదోష మిం దేమియు లేదు;
తలఁపఁ గర్మాధీనములు సుమా! జగతి
నలఖేదమోదముల్ హానివృద్ధులును.
కర్కశం బగు కర్మగతిని దాఁ దెలియుఁ
దచ్ఛుభాశుభఫలదాత విధాత!
ఈశ్వరాజ్ఞాధీన మీ జగ మెల్ల-
సృష్టిస్థితిలయంబు లీ విషామృతము
లాదిగాఁ గల-వెల్ల యతనినశ్యములు.
మోహవశంబునఁ బొగుల నీ విట్లు
ఏమి లాభంబు దేవీ! యూఁఅడిలుము.
భువి ననాదు, లనంతములు, విధికృతులు.
నరనాయకుఁడు మరణంబును గాంచ
స్వహితంబునకు హాని జరిగెను గాన
మన మార్తిఁ గంటిమి; మహి, నైజ మద్ది."
అనవిని సునయన అనియె నీ రీతి:

సునయన కౌసల్య నోదార్చుట

"నీ సూక్తు లెంతయు నిజము నిజంబు.
అఖిలప్రపంచపుణ్యాత్మాలయందు
మేటిశ్రీదశరథ మేదినీవిభుఁడు-
ఆ మహాత్మునిరాణి వహ! నీవు దేవి!"
"జానకీరామలక్ష్మణు లరణ్యమున
వసియింపఁ దుదకు శుభంబె ప్రాప్తించుఁ
గాని కీ డెన్నఁడుఁ గలుగ దే నొక్క-
భరతునివిషయమే భయపడుచుంటి-"
నని పల్క- తీవ్రశోకావేశవశత
గద్గద స్వనమొప్పఁ గంఠంబులోన
కౌసల్య మఱల నీ కరణి వచించె:
"హరికృపచే భవదాశీస్సుచేత
నాదుకుమారులు నాదుకోడండ్రు
గంగోదకములటు కడుపరిశుద్ధు;
లే నెన్నఁడైన నొట్టిడ రాముపైనఁ
గాని, రాముసితోడుగా నిప్పు డేను
వచియించుచుంటిని- భరతసౌశీల్య
సద్గుణ వినయ విశాలభావముల,
భ్రాతృవాత్సల్య సద్భక్తి విశ్వాస
మానితౌదార్యాది మహితగుణంబు,
లభివచింపఁగఁ జాల దావాణి యైన.
కాకిచిప్పను గొని కంధిజలంబు,
నావలఁ దోడిపోయఁగ వీలు గలదె?
పరమపావనుఁ డైనభరతుఁ డెప్పుడును
కులదీపకుఁడు మహాగుణుఁ డని నాకుఁ
దెలియును మనసులోఁ జేట తెల్లముగ.
నృపతియుఁ బలుసారు లిదియె వచించె.
ఒక మచ్చరాతిపై నుర్విఁ గాంచనము
పరగఁబరీక్షింపఁబడు; నదేరీతి-
మణి, రత్నశోధకమండలిచేత
బరగఁ బరీక్షింపఁబడు;- నదేరీతి-
జగతినా యీ క్లిష్టసమయంబులందుఁ
బ్రకటింపఁబడెడుస్వభావంబుచేతఁ
బరగఁ బరీక్షింపఁబడుఁ బురుషుండు.
ఏ నిట్లు మాట్లాడు టీ సమయమున
అనుచిత మైన, మీ కందఱి కెఱుక-
వికలత, మమత, వివేకముం జెఱచు."
అని పల్కఁ గౌసల్య ఆ పవిత్రంపు
గంగోదకాతినిష్కలుషవాక్యముల,
రాణులందఱుఁ బ్రేమరసవశ లైరి.
తిరిగి యీ కౌసల్య ధృతిఁ గూర్చుకొనియుఁ
బలుకఁదొడంగె నీ పగిదిగా నపుడు:
"ఓ మిథిలారాజ్ఞి! ఓ దేవి! వినుము!
జ్ఞానసాగరుఁ డైనజనకు నర్ధాంగి
వగునీకు బోధింపఁ దగినవా రెవరు?
ఐనను జెప్పెద నాత్మలో మాట:

సమయంబుఁ గనిపెట్టి జనకరాజంద్రు-
నీ తలంపుగఁ జెప్పి నిర్మలహృదయ!
ప్రారింపు- మా రామభద్రునితోడ
భరతుఁడు వనములో వసియించునట్లు,
సౌమిత్రినగరికిఁ జనుదెంచునట్లు,
యేర్పాటుఁ గావింప- నిందీవరాక్షి!
ఇది నీ హృదీశున కిష్ట మౌనెడలఁ
దత్కార్యసిద్ధికై తగుచింతఁ జేసి
గట్టియత్నముఁ జేయఁగా వేఁడుకొనుము.
కారణ మే మనఁగా, నా యెడంద
భరతునిఁగూర్చియే, బహుచింత గలదు.
భరతుని కా రామభద్రునిపైనఁ
దనస్వాంతమున నగాధప్రేమ గలదు.
ఆతఁడు మందిరమం దున్నయెడల,
అతని కపాయ మేదైనను గల్గు
నని నా భయంబు మహారాణి! వింటె?"
అని వచియించిన నా రామమాత్మ
దివ్యస్వభావంబుఁ దిలకించి, ఆమె
సదమలవాణిని, శ్రవణం బొనర్చి,
రాణు లెల్లరు దుఃఖరసమగ్న లైరి.
అత్తఱి ఆకసమందుండి చెలఁగెఁ
బ్రస్తుతిధ్వానముల్, ప్రసవవర్షములు.
సిద్ధయోగిమునిప్రసిద్ధు లందఱును
ప్రేమభావోద్వేగ వివశాత్మ లైరి.
రాణివాసమునోని రమణు లందఱును
దచ్చిత్త మరసిని స్తబ్ధు లై; రపుడు
హృది సుమిత్రాదేవి ధృతి బూని, "దేవి!
గడచె నిదే రెండుగడియలరాత్రి"
అని వచింపఁగ విని ఆ రామమాత
ప్రియ మొప్ప లేచి యీ విధముగాఁ బలికెఁ
బ్రేమయు మైత్రియు వెలుగొందుచుండ:-
"తమనివాసమునకుఁ ద్వరగ వేంచేయుఁ
డిత్తఱి శరణ మింకెవ్వ రీశ్వరుఁడె!
సహకారపరుఁడు శ్రీజనకభూవిభుఁడె!
ఆ వినీతానురాగాలాపములను
విని జనకునిరాణి ప్రీతి యుప్పొంగ
భవ్యకౌసల్యాంఘ్రిపద్మముల్ బట్టి
పలికె నీ రీతిగాఁ, భాసురోక్తులను:
"భర్మపత్నివి నీవు దశరథేంద్రునకుఁ;
గన్నతల్లివి నీవు కాకుత్థ్సపతికి;
అట్టిమహాధన్య వైననీ కిట్టి
వినయసంపద యుంట విహితమే- దేవి!
ఘనులు హీనులఁగూడ గౌరవించెదరు:
అగ్ని భూమముఁ దాల్చు; నద్రివర్గములు
ధరియించుఁ దృణములఁ దమశిఖరముల.
మీ సేవకుఁడు సుమా, మిథిలేశ్వరుండు-
శ్రీకరణంబులఁగూడ దేవి! కౌసల్య!
అలపార్వతీశివు లనవగతంబు
మీరు సహాయకుల్; మేదినిలోన
మీకుఁ దోడ్పడఁ గలమేటి యెవ్వండు?
దీపసహాయంబు దినమణి కేల?
రాముఁ డొనర్చి యరణ్యవాసంబు
దేవకార్యంబు సాధించినపిదప
శాంతిమై సాకేతసామ్రాజ్య మేలు!
రఘురామబాహుపరాక్రమశక్తి
సురనాగనరు లెల్లసుఖపడఁగలరు-
స్వస్థానములలోన శాంతి దీపింప.
ఈ విషయంబుల నెల్ల వచించె
నా యాజ్ఞవల్క్యమహర్షివర్యుండు;
ఋషివాక్కు- దేవి! అనృతముగా దెపుడు!"

సునయన కౌసల్యయనుమతిఁ గొని సీతా
దేవినిఁ దమబసకుఁ గొనిపోవుట

ఈ రీతి సునయన మృదువాక్కు లొలికి

వ్రాలెఁ గౌసల్యాంఘ్రిపద్మంబులందుఁ
బరమానురాగంబు బరఁగ డెందమున.
తదుపరి సీతను దనతోడఁ బంపఁ
బ్రార్థించె వినయమ్ము భాసిల్లుచుండ.
కౌసల్య సెలవీయఁ గడుఁబ్రేమతోడ
సునయన, సీతతోఁ జనెఁ దనబసకు.
వై దేహి, పుట్టింటివారల నెల్లఁ
దగినరీతిగ సమాదరణం బొనర్చె.
తాపసివేషంబుఁ దాల్చియున్నట్టి
జానకిఁ గనుఁగొని సర్వులుగూడ
అతివిషాదనిమగ్ను లైరి, ఖగేంద్ర!
అంత వసిష్ఠర్షియాజ్ఞను బొంది
జనకుఁడు తననివాసమున కేతెంచి
కనుఁగొనెఁ దనపుత్రికను సీత నచట.
తనమహాప్రేమకుఁ దనప్రాణములకు
నాదరింపఁగఁ దగ్గయతిథి యై వెలుఁగు
సీతను గౌఁగిలించెను జనకుండు.
ఆ విదేహనృపాలునంతరాళమున
ఒక మహాప్రేమాబ్ధి యుప్పొంగె నపుడు:
అతనిమానసము ప్రయాగగా నొప్పె:
సీతయుం దతనికిఁ జెలువొందుప్రేమ-
అక్షయవటవృక్షు; మా నృక్షశిఖర
పత్రరాజంబున భాసిలుచున్న
బాలుఁ డౌహరి- రామభక్తి; యా నృపుని
జ్ఞాన-మార్కండేయసంయమీంద్రుండు
ప్రళయదుఃఖాపారవారాశి బడియు,
వ్యాకుల మొందుచు, నబ్ధిగర్భమున
మునిఁగి పోఁబోవుచు, ముందు వెల్గొందు
వటపత్రశాయి యా బాలముకుందు
శరణంబుఁ జొచ్చి రక్షణఁ మొందె ననఘ!

అనినచో నా విదేహావనీవిభుని
బుద్ధి మోహాబ్ధిలో మునిఁగె నటంచుఁ
దలపోయవల దోయి, తార్క్ష్య! వీక్షింప
అది, ఆ నృపాలునియవనిజారామ
పరమానురాగప్రభావంబుఁ దెలుపు
మహితసంఘటన సుమా! ఖగరాయ!
తల్లిదండ్రులప్రేమఁ దాఁ గాంచి సీత
యతివ్యాకులం బొందె నాత్మలోఁ; గాని,
సమయంబు ధర్మంబు స్వాంతమం దెంచి
ధృతిఁ గూర్చుకొనె నామె హృదయాంతరమున.
తనపుత్రి వై దేహి తాల్చినయట్టి
విమలతపస్వినీవేషంబుఁ గాంచి
జనకుఁడు ప్రేమరసంబున మున్ని
పరమహర్ష ము నొంది పలికెఁ నీ రీతి:
"పుత్రీ! పవిత్రతఁ బొందె నీవలన
నుభయకులంబు లీ యుర్వీస్థలాన;
భవదీయయశము సర్వప్రపంచమును
ధవళితం బొనరించి తనరారఁ జేసె-
నని పల్కుచున్నార లఖిలమానవులు.
భవదీయకీర్తిప్రవాహ మెన్నంగ
బ్రహ్మాండకోటిగర్భములఁ జొచ్చుటను
గంగానదిని మించఁగలిగె నో తల్లి!
*గంగ త్రిస్థలముల ఘనత వహింప,
అగణితసాధుజనానీకసభలఁ
ద్వత్కీర్తి వేణిసంస్తవనీయ మయ్యె!"
అని జనకుండు ప్రేమాతిరేకమునఁ
బలికిన ఋతరమ్యవాక్యముల్ వినియు
మైథిలి, లజ్జాబ్ధిమగ్న యై నిలిచె.
అంత మాతాపిత్రు లామెను మఱల
గుండెకు హత్తించుకొని యతిప్రీతి,

---

* 1 హరిద్వారము, 2 ప్రయాగ, 3 గంగాసాగరము - ఈ మూఁడుస్థానములు గంగానదికి ప్రసిద్ధ స్థలములు.

చారుహితోపదేశములఁ గావించి
ఆశీస్సు లిడిరి. హిమాచలపుత్రి!
సీత, పై కేమియు జెప్పకుండినను,
'ఈ రాత్రినే వసియించు టిచ్చోట
ఉచితంబు కా' దని యుల్లంబులోన
నాందోళనముఁ జెంద- నది కనిపెట్టి
సునయన, జనకరాజున కెఱిఁగించె.
జానకీసౌశీల్యసత్స్వభావముల
కాదంపతులు ముగ్ధులైరి స్వాంతములఁ.
మాటిమాటికి వారు మైథిలిన్ గలసి
గుండెకు హత్తించుకొని కడుఁబ్రీతి
సన్మానపఱచియుఁ జన సెలవిడిరి.
అయ్యది తగుసమయం బని యెఱిఁగి
సుమతి యాసునయన సుధ లొల్కునుడులఁ
బతి కెఱిఁగించెను భరతునిస్థితిని
ఘనగంధసంయుతకనకంబువంటి,
చంద్రమండలసుధాసారంబుఁ బోలు,
భరతునిభవ్యప్రవర్తనఁగూర్చి
విని, జనకావనీవిభుఁడు నిమీలి
తాక్షుండై ప్రవహింప నశ్రువాహినులు
పులకరింతలు తనువున వెలుఁగొందఁ
బరవశత్వంబునఁ బ్రస్తుతిఁ జేసె
భరతుని భాస్వత్ప్రభావ మీ రీతి:

జనకమహారాజు భరతుని గూర్చి
ప్రశంసించుట

"ఓ చంద్రముఖి! సఖి! ఓపద్మనేత్రి!
శ్రవణం బొనర్పుము సావకాశముగ-
భరతునికథ భవబంధముల్ త్రెంచు.
ధర్మ,నృపాలకధర్మాళిఁగూర్చి
బ్రహ్మవిచారణపరము లైనట్టి
విషయంబులనుగూర్చి వివరింపఁగలను
నా శక్తికొలఁది ప్రియా! శివకృపను;
కాని, ఆ భరతునిఘనమహిమంపు
నీడనేనియుఁ దాఁకనేరదు నాదు
బుద్ధి యెట్టియుపాయమున నైనఁ జెలియ!
అజగణేశాదిశేషాఽహివిభూష
శారదాదులు, కవిజనకోవిదులును,
బుద్ధివిశారదుల్, బుధవరు లెల్ల,
భరతకథాయశోవర్తనధర్మ
సౌశీల్య,సౌజన్య,సన్మహిమముల,
విన నుత్సహింతురు; వినుతిఁ జేసెదరు.
భరతునిగుణములు పరికించునెడల
గంగకన్ననుగూడ ఘనపవిత్రములు;
అమృతంబుకన్న రుచ్యాతిరుచ్యములు.
నిరుపమపురుషుండు, నిరవధిగుణుఁడు,
పరమభక్తుం డగుభరతుఁ డెన్నంగ;
అతని కాతఁడె సాటి అఖిలలోకముల;
క్షితి మేరువుం దూఁచ శేరుఱా యెటుల
సరిపోవు నని కవుల్ సంకులపడిరి!
నీరముల్ తేనట్టి నేల, మత్స్యములు
వర్ణింపలే నట్లు భరతునిమహిమ
వర్ణింపఁజాల రెవ్వరుఁగూడ రమణి!
వినుము భరతుని గంభీర మామహిమఁ
దెలియఁగ శ్రీరామదేవుఁ డొక్కఁండె!
కాని, ఆతఁడున్నైత మా మహామహిమ
వర్ణింపజాలఁడు పారంబుముట్ట."
అని యిట్లు జనకుఁ డత్యంతసంప్రీతి
భరతప్రభావంబు వర్ణనఁ జేసి
తనసతియభిరుచిఁ దాఁ గనిపెట్టి
ఇట్లు ప్రసంగించె నింపుగా మఱల
"సౌమిత్రి నగరికిఁ జనుటయు, పిదప
భరతుఁడు రాముతో వని వసించుటయు,
సర్వసమ్మత; మిదే, సర్వులవాంఛ!

రాఘవభరతపరస్పరప్రేమ
విశ్వాసము లతిగభీరంబు లెన్న;
సమదృష్టికిన్ రామచంద్రుఁ డాదర్శ;
మహ! భరతుండు ప్రేమానురాగముల
కవధియూఁ దలపోయ నఖిలవిశ్వమున.
భరతుఁడు తలఁపఁడు స్వప్నమందేని
ఇహపరసౌఖ్యంబు లించుకగూడ.
ఆతనిసాధన- ఆతనిసిద్ధి-
శ్రీరామపాదరాజీవాను రక్తి!
భరతునిమతసాగమరయఁగా నిదియె-"
యని నా యభిప్రాయ మజ్ఞాయతాక్షి!
అట్లు సంభాషించు నా జనకుండు
గళము గద్గదికంబుగా నిట్లు పలికె:
"పొరపాటు చే నైన భరతుఁ డెన్నఁడును
రామాజ్ఞ సుంత యుల్లంఘింపఁ బోడు
అనురాగవశుల మై మన మీ విధాన
వ్యాకుల మొందఁగాఁ బనిలేదు సకియ!"
రాణియు రా జిట్లు రఘురామభరత
గుణగణమ్ములఁ గూర్మిఁ గొనియాడుచుండ
క్షణమునఁ దెలవాఱె ఖగకులాధ్యక్షు!
ఉదయకాలంబున నుభయనృపాల
పరివారములు లేచి ప్రాంతప్రవాహ
జలములయందున స్నానముల్ సలిపి,
కడఁగిరి సురపూజఁ గావింప భక్తి;
రఘునందనుండును ప్రాతరాహ్నికము
నంతయు నెఱవేర్చి, యాచార్యచెంత
కరిగి యా మునిపతియడుగుల ప్రాలి,
లెమ్మని తెల్పఁగా లేచి, యి ట్లనియె-
వినయమ్ము దీపించువిమలవాక్యముల:
"సద్గురూ! భరతుండు జనులును దల్లు
లందఱు శోకసంవ్యాకులు లగుచు
వనవాసమునఁ గష్టపడుచున్నవారు.
అదిగాక శ్రీమిథిలాధినాథుఁడును
ఆయనపరివార మంతయుఁగూడ
పలుదినంబులనుండి వననివాసమున
శ్రమనొందుచున్నారు స్వామి! కావునను
సముచితం బగురీతి సలుపుము దేవ!
అందఱిహితము మీ హస్తాలఁ గలదు."
అని రామచంద్రుఁ డత్యంతనయంబు,
భయమును, భక్తియు, భాసిల్ల నిలిచె;
మునిపతి ఆనందపులకితుం డయ్యె,
శ్రీరాముసౌజన్యశీలంబు లరసి.
"నాయనా! శ్రీరామ! నా రఘురామ!
ఇరుసమాజంబుల కీవు లేకున్న
ధర సర్వసౌఖ్యముల్ నరకతుల్యములు.
రామ! ప్రాణములకుఁ ప్రాణంబ వీవు;
ఆనందమున కీవ ఆనంద మోయి!
ఎవ్వరు నిను వీడి యింట నుండెదరో-
పరమదౌర్భాగ్యులు వా రహో! రామ!
శ్రీరామపాదనీరేజంబులందు
భక్తి లేకున్నఁ బ్రపంచంబులోన
ధర్మకర్మము లెల్లఁ దగులఁబెట్టుటకె!
ప్రప్రథానముగ శ్రీరామాంఘ్రిభక్తి
లేకున్న- ఆ యోగమే, కుయోగమ్ము!
ఆ జ్ఞానమే నితాంతాజ్ఞానతమము!
నీ వియోగమె వగ! నిజ మెంచ రామ!
నీదుసంయోగమే నిజ నిత్యసుఖము!
ఎల్ల అడెందంబు లెఱుఁగుదు వీవు;
నీ ఆజ్ఞఁ బాలించు నిఖిలవిశ్వంబు;
నీ కృపాహృదయంబు నిఖిలమార్గముల
నెఱుఁగుఁ బూర్ణముగ; నీ కేఁ జెప్పవలెనె?
అరుగుము నా తండ్రి ఆశ్రమంబునకు"
అని వచియించి మహర్షి వసిష్ఠుఁ
డనురాగపరవశుం డయ్యె- రాఘవుఁడుఁ

బ్రణతు లొనర్చి ఆశ్రమమున కేఁగె.
గురు శేఖరుఁడుఁ దేఱుకొని కొంతవడికి
శ్రీమిథిలేశుని చెంతకుఁ జనియు
శ్రీరామచంద్రునిస్నేహసౌశీల్య
సంభరితాతిప్రసన్న వాక్యముల
వినిపించి పలికె నీ విధముగా మఱల:
"ఓ మహారాజ! ధర్మోచితరీతి
అఖిలశుభంకరం బగుమార్గ మీవు
చెప్పుమా, బాగుగాఁ జింతనఁ జేసి.
జ్ఞానరాశివి, మనీషావిశాలుఁడవు,
అలధర్మవీరుండ, వవనీశ! నీవు.
సందిగ్ధ మగునిట్టిసమయంబునందుఁ
దగుమార్గమును జూపఁదగినవాఁ డెవఁడు–
నీకన్న? జనకావనీనాథ మూళి!"
అను మునివాక్కుల కా జనకుండు
ప్రేమభావోద్వేగవివశాత్ముఁ డయ్యె.
అతనిమహాస్థితి నరసినయంత
నాతనిజ్ఞానంబు, నతనివిరక్తి,
వైరాగ్యమును బొంది వెడలె నెచ్చటికో!
అనురాగశిథిలీకృతాంగుఁ డైయతఁడు
తనలోనఁ దా నిట్లు తలపోయసాగె:
"ఏ నిట కేతెంచు టెంతయు తప్పు;
దశరథధారుణీధవుఁడు శ్రీరాము
నడవులకంపించె ననుమాట నిజము;
కాని, యీ ధన్యుఁడు కాకుత్థ్సునైనఁ
దనకెంతప్రేమయో ధరఁ బ్రకటించె;
ఇఁక మేమొ?– శ్రీరాము నీ కాననుండి
మఱియొక కానకు మఱలఁగాఁ జేసి
చల్లగా నింటికిఁ జనఁగల మింక
మా మహాజ్ఞానంబు మహిఁ జాటుకొనుచు."
అత్తఱి యీ జనకావనీవిభుని
వాణిని, వైఖరిన్ బరికించి వినియుఁ

దాపసమునివరధారుణీసురలు
సర్వులుఁ బ్రేమవశంబున మిగుల
వ్యాకుల మొందిరి భావంబులందు.
సమయంబు గమనించి జనకుఁ డంతటను
ధృతిఁ గూర్చుకొని తనహృది నేగుదెంచె
పరివారయుతముగా భరతునికడకు.
భరతుఁడు నెదురుగా వచ్చి యీ జనకు
సన్మాన మొనరించి స్వాగతం బొసఁగి
సమయ లభ్యోచితాసనసమాసీనుఁ
గావింపఁగా జనకక్ష్మావిభుండు
ఇట్లు చింతించెఁ దా నెంతయో ప్రీతి:
"ఓ వత్స! భరత! నీ కుల్లంబునందు
విదితంబు శ్రీరఘువీరుస్వాంతంబు.
సత్యవ్రతుండును సద్ధర్మరతుఁడు
సర్వహితంకరసౌజన్యమూర్తి
శ్రీరామచంద్రుఁడు; ప్రియతమా! భరత!
ఇతరుల నొప్పింప నిష్టము లేని
హేతువుచేతనే యిప్పు డా మహితుఁ
డాత్మలో సంకట మందుచున్నాఁడు.
నీ నిశ్చయము విని నేను రామునకు
దానినిఁ దెలిపెద ధర్మనిధాన!"
అనువాక్యములు వినినంత నా భరతు
తనువెల్ల రోమాంచితం బయి వెలిఁగె,
కనుదమ్ములను బాష్పకణములు నిండె;
తనపైనఁ బడినట్టి తతభార మెంచి,
భరతుఁ డీ రీతిగాఁ బలికె నత్తఱిని:
"ఓ ప్రభూ! ఓ జనకోర్వీశ! నీవు
నా తండ్రియట్టులు నాకుఁ బూజ్యుఁడవు.
మద్గురుండు వసిష్ఠమౌనివర్యునకు
నా తల్లికన్నను నా తండ్రికన్న
నాపైనఁ బ్రేమ యున్నది; యట నుండి
రల కౌశికాదిమహామునీశ్వరులు;

మహితాత్మ లగుమహామంత్రులుఁ గలరు;
అదిగాక జ్ఞానాబ్ధి వగు నీవుఁగూడ
మా మధ్య నుంటివి మా భాగ్యవశత.
ఏ నొకశిశువును, యే నొక నమ్ర
భృత్యుఁడ మాత్రమే; వీనికి నాథ!
భవదాజ్ఞ దయసేయఁ బ్రార్థనఁ జేతు.
ఈ బుధావళిముందు, ఈ తీర్థమందు
హిత మేను తెల్పుటా? ఎంతయు సిగ్గు!
మౌన మూనెద నేని మానసమందు
కలుషభావంబులు కలవనుకొంద్రు;
అటుగాక యీ సమయంబున నేను
మాట్లాడఁ జూతునా, మహిని నాకన్న
నమితమూర్ఖుం డెవ్వఁ డరయ లోకమున?
అయినను నే నేదో అవసరమగుటఁ
దప్పదు మాట్లాడఁ– దండ్రి! మన్నింపుఁ–
డక్కటా! విధి నాకు వ్యతిరేకియగుట!
'అరయ సేవాధర్మ మమితకఠోర'–
మని, వేదశాస్త్రమహాపురాణముల
విశ్వంబునందున విఖ్యాత మనఘ!
స్వామిధర్మమునకు స్వార్థంబునకును
జు క్కెదురెప్పుడు సూరివతంస!
ద్వేషంబు గ్రుడ్డిది; వెఱ్ఱిది ప్రేమ;
ఏఁబరాధీనుండ నెఱుఁగనివాఁడ.
శ్రీరామచంద్రునిచిత్తంబుఁ దెలిసి,
తన్మహాపురుషునిధర్మవ్రతంబు–
అందఱి కాయనయం దున్నప్రేమ,–
అన్నియు గ్రహియించి యఖిలసమ్మతము
నఖిలహితం బగునట్లు కావింపఁ
బ్రార్థనఁ గావింతుఁ బార్థివచంద్ర!"
భరతువాణి విని, స్వభావం బెఱింగి,
జనకుఁ డాతనిసమాజమువార లెల్ల
ముగ్ధు లై యాతనిఁ బొగడి రేకముగ.

అరయ సుగమ్యమే యైన న్నగమ్య,
మతిమృదుమంజులం బైనఁ గఠోర,
మతియర్థగర్భితం బైన సంక్షిప్త
మై వెల్లుభరతునియద్భుతవాణి–
అఱచేతిలో నున్న యద్దంబులోని
ప్రతిబింబమట్టు లగ్రాహ్య మైయుండె.
అంత నా జనకధరాధీశభరత
మునివసిష్ఠసమాజజనము లందఱును
విబుధకైరవముల వికసింపఁజేయు
శ్రీరామచంద్రుని చెంతకుఁ జనిరి.
ఈ వార్త నాలించి యెల్లప్రజాళి
ఇలఁ దొలకరివాన యే తెంచినంత
వ్యాకుల మొందు మత్స్యావళిరీతి
నాందోళనముఁ జెందె నతితీవ్రముగను.
అత్తఱి దేవత లవ్వసిష్ఠుని
వరుపరిస్థితిని బ్రబ్రథమ మం దరసి,
పిదప, వి దేహభూవిభు మహాప్రేమ
నంతయుఁ బరికించి ఆపయిఁ గనిరి
భరతుని శ్రీరామభక్తిస్వరూపు.
అట్లు వీక్షించిన యంత నా స్వార్థ
పరు లైన దేవతల్ వ్యాకుల మొంది
గుండెలు పగిలి దిగుల్ పడి రనఘ!
ఎవ్వరిఁ గనుఁగొన్న యెదలలో నిండి
రామానురాగమే రాజిల్లుచుంట,
నా సుర లెల్ల మహాకులపడిరి.
"ప్రేమవశ్యుం డయ్యె శ్రీరాముఁ డిప్పు"
డని పల్క– దేవేంద్రుఁ డతివిచారమున,
"కలసియు మన మెల్లఁ గనిపెట్టవలయు
నొక్క– యుపాయమేదో, కానియెడలఁ
గార్యమంతయును భంగం బగు సుమ్ము"
అని హెచ్చరించె సురాళితో నపుడు
దేవతల్ శారదాదేవినిఁగూర్చి

ప్రస్తుతిఁ గావించి ప్రార్థించి రిట్లు:
"శరణార్థులము మేము శారదామాత!
పరిరక్షణము సేయఁ బ్రార్థింతు మమ్మ!
భరతునిమతిఁ ద్రిప్పి త్వన్మాయచేత
అమరతాపముఁ బాపుమా యెది యేనిఁ
జిత్రకార్యవిశాలశీతలచ్ఛాయ."
అనెడిగీర్వాణులవినతి నాలించి
చతుర యౌశారద స్వాంతరంగమున
వారలబుద్ధిని, స్వార్థపరత్వ
మపహరించు నెటొంగి– యనియె నీ రీతి.
"పరివర్తనము సేయ భరతునిబుద్ధిఁ
బ్రార్థించుచున్నావు వాసవా! నన్ను;
వేయికన్నులు నీకు వెలయుచుండినను
భూరిమేరువు నల్లపూస యై నీకుఁ
గనఁబడ దయ్యె; సంక్రందనా! శక్ర!
అజవిష్ణుశివులమహామాయ యేని
భరతునిమతివైపుఁ బరికింప నైనఁ
బరికింపఁగలదె? ఓ సురలోకనాథ!
అట్టియాతనిమతి నహ! నేన మార్తు?
చంద్రికమాపునా చండమార్తాండు?
పావనభరతహృత్పద్మ మోయింద్ర!–
జానకీరామవాసస్థలం బోయి!
నా మాయ అచ్చటనా ప్రసరించు?
చొచ్చునేచీఁకటి సూర్యసన్నిధికి?"
అని పల్కి తనలోకమున కేఁగె వాణి
చక్రవాకములు నిశాకాలమందు
వలె, నిలింపులు కడువ్యాకుల మొంద
మలినాత్మలున్ స్వార్థమతులై సుపర్వ
లంత నొక్కకుమంత్ర మాత్మలోఁ బన్ని
ప్రబలమాయాప్రభావంబునుఁ బఱపి,
సాకేతనగరప్రజాహృదయములఁ
భయవిభ్రమాకులభావజాలములఁ
గల్గించి రోవిహంగప్రభూ! వినుము.
అట్లు మాయలఁ బన్ని యా పురందరుఁడు
కార్యంబు సిద్ధింపఁగలుగుట, చెడుట,
భరతునిచేతిలోపని యని యెంచె
జనకభూపతిరామచంద్రుసన్నిధికి
వెడల వార ల నెల్లఁ బృథుసమాదరణ
మొనరించె సూర్యకులో త్తముఁ; డంత
శ్రీరఘువంశదేశికవతంసుండు
సమయమునకు సమాజమునకుం దగిన
ధర్మావిరోధపద్ధతిఁ బ్రసంగించి,
జనకునిభరతునిసంవాదములను
భరతుమనోజ్ఞసంభాషణంబులను
వినిపించి, "నాయనా! ప్రియతమా! రామ!
ఇప్పుడు నీ యాజ్ఞ యేదియో? దాని
నెల్లరుఁ దలఁ దాల్తు రిదియె నా మతము."
అని తెల్ప విని రాముఁ డనియె నీ రీతి
సత్యసన్మంజులసరళవాక్యముల
నంజలిఘటితహస్తాంబుజుం డగుచు:
"మీదగుసన్నిధి, మిథిలేశు ముందుఁ
బలుకుట నేను సంభావ్యంబు గాదు.
మీ రిచ్చునాజ్ఞను మిథిలేశునాజ్ఞ
సర్వులుఁ దలఁదాల్ప సంసిద్ధు లెపుడు.
ఇది తమసాక్షిగా నేఁ జెప్పుచుంటి.
అనురామశపథంబు నా వసిష్ఠర్షి
జనకావనీపతి, సభ్యులు, వినియు
వ్యాకులమొంది మార్వలుకలే కంత
భరతుపైఁ దమదృష్టిఁ బఱపి రేకముగ.
కనుఁగొని సర్వులున్ గలవరపడుట
ఆ రామసోదరుం డగుభరతుండు,
స్వాంతమం దత్యంతస్థైర్యంబుఁ బూని
అనుకూల మగుసమయం బనియెఱిఁగి

తనమహోన్నత మగుననురాగ మెల్ల
నా యగ స్త్యర్షి వింధ్యాద్రినిబోలె
లోలోనన నెట్టెట్టులో నిగ్రహించె.
తతశోకకనకాక్షుదానవుం డపుడు
నిఖిలసద్గుణభూతనికర మైనట్టి
తత్సభాసదధరాతలము నంతయును
అపహరింపఁగ ఋణమం దవలీల
భరతవివేకభాస్వన్మహోష్ణోణి
యుద్ధరించెను, విహగోత్తమా! అంత
భరతుఁడు భక్తితోఁ బ్రణమిల్లి నిలిచి
అంజలి ఘటియించి యందఱిముందు
శ్రీరామజనకవసిష్ఠసజ్జనుల
నెల్లఁ దాఁ బ్రార్థించె నీతెఱఁ గొప్ప:
"మృదువగునాల్క-తో నే నీ దినానఁ
గనినవాక్కు-లు పల్క-ఁ గడఁగితి నకట!
ఈ యపచారంబుఁ గృపతోడ మీరు
క్షమియింపఁ బ్రార్థనఁ గావించు చుంటి."
అని పల్క- భరతుఁడు స్వాంతరంగమున
భారతీదేవిని బ్రార్థింప, నామె
ఆతనిమానసహ్రదమునందుండి
వదనాబ్జరంగంబుపై కరుదెంచె;
విమలాతివిమలవివేకసద్ధర్మ
నయగుణమయమై ఘనప్రీతిఁ గూర్చు
భరతభారతి వెల్లె వరహంసియటుల.
సర్వసభాసదుల్ సదమలప్రేమ
పరవశు లైయుంట భరతుఁ డీక్షించి
సర్వులకు న్నమస్కారముల్ సలిపి
జానకీరాములస్వాంతమం దెంచి
యిత్తెఱంగున వచియించె నత్తఱిని:-
"ఓ ప్రభూ! శ్రీరామ! ఓ రఘురామ!
నీవె నా తల్లివి, నీవె నాతండ్రి
వీవె నా మిత్రుండ వీవె నా గురుఁడ
వీవె నా స్వామివి, నీవె నాహృదయ
తలమున వెలుఁగు నంతర్యామి వయ్య!
సత్ప్రభుండవు, మహాసరళభావుఁడవు,
సౌశీల్యనిధివి, సుజ్ఞానరూపుఁడవు,
ప్రణతపాలుఁడవు, సర్వజ్ఞుండ, వఖిల
శక్తిమయుండవు, సర్వేశ్వరుఁడవు,
శరణాగతత్రాణబిరుదాంకితుఁడవు,
అఖిలగుణగ్రాహి, వవగుణాఘౌఘ
హారివి నీవు దేవా! రఘువీర!
హే ప్రభూ! నీకు నీవే సాటి వైన
స్వామివి నీవు; నే స్వామివిద్రోహు
లందున సాటిలేనట్టి మందుఁడను.
అజ్ఞానమున భవదాజ్ఞను, మఱియు
జనకునియాజ్ఞను జవదాఁటి నేను
జనుదెంచితిని మహాజనులతో నిటకు.
ఈ ప్రపంచంబున నేఁ గనుఁగొంటి-
సుజనదుర్జనుల, నీచుల నుత్తములను,
అమృతవిషంబుల, నమరత్వమృత్యు
వుల; ఐన, రామాజ్ఞఁ దలఁపునందైన
జవదాఁట గలసాహసం బున్నవానిఁ
గని విని యెఱుఁగను; కాని, యీనేను
ద్రికరణంబులఁగూడ శ్రీరామునాజ్ఞ
జవదాఁటఁగా, సాహసం బొనర్చితిని;
ఇంతటిపాపాత్ముఁ డెచట నున్నాఁడు?
అయినను నా యీ మహాపచారమును
నా స్వామి శ్రీరఘునాథుఁ డోహోహో!
ప్రేమగా, సేవగాఁ, బ్రీతి గ్రహించె.
అస్మత్ప్రభునికృప, ఔదార్యగుణము,
నా దోషముల భూషణములుగా మార్చె-
నఖిలదిక్కు-లను సంవ్యాప్తంబు నొంద
మన్ననోహరలసన్మహితయశంబు.
రామ! నీ సౌశీల్యరమ్యగుణాళి,

ఘనమహిమంబు, జగద్వినుతములు;
నిగమాగమపురాణనికరగేయములు.
క్రూరులుఁ గుమతులుఁ గుటిలులు ఖలులు
సకళంకజనులు నీచస్వభావులును
శీలహీనులును నాస్తికులు నిర్భీతు
లెవరేనిఁ గాని, 'స్వామీ! శరణనుచు
ఒక్కపర్యాయము మ్రొక్కినజాలు,
వారల నీవు నీవారిఁ గాఁ గొనుచు
రక్షింతు వో ప్రభూ! రఘురామచంద్ర!
స్వయముగాఁ గాంచియు వారిదోషములఁ
బట్టించుకొనవు కృపాభావ మొప్ప;
వారలగుణములవఱకె ఆలించి
సాధుబృందమునఁ బ్రశంసింతు వవ్వి.
తనను సేవించెడిదాసజనాళి
సకలయోగక్షేమ సంతతి నొనుచుఁ
దాను జేసినమేలుఁ దలఁప కించుకయుఁ
దనభక్తజనుల డెందంబుల కెట్టి
బాధ కల్గినఁ దానె బాధనొందుచును
బరమకృపఁ బ్రోచు ప్రభు వెవ్వరయ్య?-
మత్ప్రభూ! దేవ! రామా! నీవు గాక!
ఈ సత్యవిషయంబు నేను శ్రీరామ!
చేతులెత్తి ప్రతిజ్ఞఁ జేసి వచింతు.
పశువు, లాడించినపగిదిగా నాఁడు;
చిలుక, చెప్పినరీతిఁ బలుకు; ని దెల్లఁ
బైన నేర్పెడివాని వశమయి యుండు.
అఖిలేశ! నీవు నిజాంఘ్రిసేవకుల
సంస్కరించియుఁ గడుసన్మాన మొసఁగి
సాధువర్యులనుఁ గా సలుపుచుండెదవు.
శరణాగతత్రాణచణుఁ డనుబిరుదు
అమితకృపానిధి వగు నీక చెల్లు.
ఆర్తివశంబున, ననురాగవశత,
బాల్యచాపల్యస్వభావంబుకతన,
భవదాజ్ఞదాఁటి నే వచ్చితి నిటకు.
అయినఁ గృపాళుండ వగునీవు, నీదు
సహజస్వభావానుసారంబు, నాదు
దోషంబులెల్ల నిర్దోషముల్ జేసి
మన్నించితివి ప్రభూ! అన్నివిధాల.
నిఖిలసుమంగళనిలయంబు లైన
త్వత్పాదపద్మముల్ దర్శించి,- నాకు
సహజప్రసన్నుఁడు స్వామి యటంచు
గ్రహియించుకొని ధృతిఁ గంటి స్వాంతమున.
ఈ మహాసభను నేఁ డేను గన్గొంటి
నా భాగ్యదేవతన్; నా నాథుఁ గరుణ
నతిదోషి నైన నాయందు వర్షించె!
పరమకృపారసపరిపూర్ణుఁ డైన
నా ప్రభువర్యుఁడు నన్గటాక్షించె-
నన్నివిధాల ననర్హుండ నైన!
తనశీలగుణమహోదారస్వభావ
ములచేత రామప్రభుండు నా యెడల
సర్వదా, అహా! సుప్రసన్నతఁ జూపు.
నా నాథుఁ డగు రఘునాథునియెదుట
నీ సమాజమువారియెదుట నిల్చుండి
సిగ్గును విడిచి భాషించి తే మేము!
కాని, నా ఆర్తిని గని రాఘవుండు
నిక్కంబు నన్ను మన్నించు సత్కృపను.
సుస్వభావుండును సుజ్ఞానియైన
స్వామితో నధికప్రసంగంబు తప్పు;
కావున, ఓ దేవ! కరుణవహించి
భవదాజ్ఞ నొసఁగఁగాఁ బ్రార్థనఁ జేతు.
నా కోర్కె లెల్ల నో నాథ! నీ కృపను
సిద్ధించినవి ప్రభూ! శ్రీరామచంద్ర!
సత్యంబునకుఁ బుణ్యసముదయంబునకుఁ
బరసుఖంబున కాటపట్టై వెలుంగు

రామపాదాబ్జపరాగకణంబు
సాక్షిగా నా హృది సర్వకాలముల-
జాగ్రదవస్థలో స్వప్నంబునందు
మఱియు సుషుప్తిలో మానక వెలయు
నేకైకవాంఛ నిదే విన్నవింతు:
స్వార్థమున్ విడి, పురుషార్థముల్ మఱచి,
సహజానురాగసుస్వాంతంబుతోడ,
స్వామిసేవ సతంబు సలుపఁగావలయు
నిజవిభునాజ్ఞను నిర్వహించుటయె-
పరమోన్నతం బగుప్రభుసేవ యగును.
దేవ! అయ్యది ప్రసాదింపవే! నీదు
పాదకింకరునకు భాసురకృపను."
అని పల్కి భరతుఁ డత్యంతానురాగ
వివశుఁ డై పులకలు వెలయ దేహమున,
కన్నుల బాష్పముల్ కాల్వలు గట్ట,
ఘోరాతివేదనాకులచిత్తుఁ డగుచుఁ
బట్టుకొనెన్ రామపాదపద్మములు.
ఆ సమయమునఁ బ్రత్యక్ష మైనట్టి
ప్రేమాతిశయత వర్ణింపఁగాఁ దరమె?
అంతఁ గృపాసింధుఁ డా రాఘవుండు
వాత్సల్యభావసంభరితవాక్యముల
నాదరించుచును స్వహస్తాల నెత్తి
కూర్మితోఁ దనప్రక్కఁ గూర్చుండఁజేసె
నబ్భరతుని మహాహార్యద్యాభగవతుని.
ఆ భరతుని వినయాలాపములను
విమలస్వభావంబు వినియు వీక్షించి,
పరవశు లైరి సభాసదుల్, మఱియు
శ్రీరాముఁడును శాంకరీ! గిరితనయ!
మైథిలీపతి, సాధుమండలి, జనకుఁ
డవ్యసిష్ఠమునీంద్రు, లా సమయమునఁ
బ్రేమభావోద్వేగవివశత నొంది
భరతకుమారుని భ్రాతృవాత్సల్య
భక్తివిశేషప్రభావమాత్మలను
గొప్పగాఁగొనియాడుకొనిరి దేవతలుఁ
గలఁత నొందినమతుల్గలిగియు పొంగి
కురిసి రొక్కుమ్మడిఁ గుసుమవర్షముల.
తులసి వాక్కుల శ్రద్ధతో వినరయ్య!:
అత్తటి సర్వులు వ్యాకులపడిరి
రాజీవములువోలె రాత్రికాలమున.
సాకేతమిథిలాప్రజల్ సర్వులపుడు
దీనదుఃఖితులౌటఁ దిలకించి, యింద్రుఁ
డతిమలినాత్ముఁడు స్వార్థసుఖార్థ
మంతకుమున్నె మహార్తిని బొంది
చచ్చినవారిని జంపఁదలంచె.
కపటులయందుఁగుకర్ములయందు
మేటిదేవేంద్రుఁడు; మిగుల నాతండు
పరనష్టమును స్వలాభమును గాంక్షించు;
వాయసమట్టు లా పాకశాసనుఁడు
కాపట్యకలుషసంకలితమానసుఁడు-
ఎవరిని నమ్మఁ డొకించుకే నతఁడు.
ప్రథమమం దొక కుతంత్రముఁ బన్ని యతఁడు
బహుళకష్టంబులఁ బడవేసె, నెల్ల
వారలనెత్తిపైఁ గ్రూరత్వ మెప్ప.
తదుపరి యాతఁడు తనదేవమాయ
నందఱిపైఁ గప్పి వ్యామోహపఱచె;
కాని వారలలోనఁ గలరామభక్తి
సంపూర్ణముగ వీడి జనదయ్యె- వారు
భయమహాందోళనావశాత్మ లగుచు
వైకల్య మొందిరి; వారి చిత్తములు
స్వాస్థ్యంబు నొందక వ్యాకుల మొందె.
కాసేపు వని నుండఁగా బుద్ధిపుట్టు;
కాసేపు పురి కేఁగఁగా గోర్కె గల్గు;
ఈ రీతి నా ప్రజాహృదయంబు లెల్ల
సందిగ్ధదశ నొంది సంకులపడియె-

కన, నదీసింధుసంగమము చెంగటను
సంకుల మొందెడి జలములువోలె.
వ్యాకులచిత్తు లై వార లెచ్చటను
శాంతిఁ గాంచఁగలేక సతమత మైరి.
ఒకరిభావంబు లిం కొకరి కెవ్వరును
తెలుపుకోఁజాలని స్థితిలోనఁ బడిరి.
ఇదియంతఁ గని కృపాసదను డౌరాముఁ,
*"డీ మఘువునిబుద్ధి నెంచినయెడల
శ్వానప్రకృతి, యువజనుమతిఁ బోలు"
నని యనుకొనె మందహాసంబు వెలయ.
భరతుని, జనకభూపాలుని, మునుల,
మంత్రులఁ, దత్సాధుమండలిం దప్ప
నందఱిపైఁ గప్పె నా దేవమాయ
వారి వారికిఁ దగుపగిదిగా గరుడ!
ఒకవైపు తనమీఁద నుండెడిప్రీతి
మఱియొకవైపున మఘువునిమాయ
బంధింప వ్యాకులపడుచున్నజనులఁ
గనుఁగొనెఁ గారుణ్యకంధి రాఘవుఁడు.
సభ్యులు జనకుండు సంయమివరుఁడు
ఘ్నాసురుల్ సచివులు సర్వులుకూడ
భరతమహాభక్తివశచిత్తు లౌచు
లిఖితచిత్రంబులరీతి శ్రీరాము
నూరక వీక్షించుచుండి– రేదైనఁ
బలికిన సంకోచపడి పల్కుచుండ్రి–
వల్లెవేసియుఁ జెప్పపాఠమ్ములోలె.
ఆ భరతునిమహోద్యత్ప్రేమ, నీతి,
వినయసౌజన్యముల్ వినసుఖ మొదవు;
కాని వర్ణింపఁగాఁ గాదు సాధ్యంబు.
ఆ భరతునిమహోద్యద్భక్తిగరిమ
లవమాత్రమును గన్నులారఁగాఁ జూచి
సర్వమునీశ్వరుల్ జనకభూవిభుఁడు
మానితప్రేమాబ్ధిమగ్నులై రఘుడు.
ఇంక నీ తులసి తా నెట్లు వర్ణింపఁ
గలుగు నా భరతుని ఘన భక్తిమహిమ?
ఆ మహాపురుషునుద్యద్భక్తిభావ
జాలమే కద, కవిస్వాంతంబునందు
ప్రేరణంబొనరించె విమలభావముల!
అట్టియీ భరతు మహాప్రభావమును,
దన యసమర్థతఁ దలఁచి, సిగ్గొంది
వెనుకకుఁ మఱలె నాతనిమానసంబు–
కవికులహితవాక్కు గౌరవించుచును.
ఆ భరతుని మహోద్యద్గుణములను
గడుఁబ్రీతితోఁ జూడఁగల్గినఁ గాని
వానిని వర్ణింపవశము కాఁబోదు;
పసిబాలకునివాణివలెఁ గవిబుద్ధి
అసమర్థ మైయున్న దద్ది వర్ణింప.
భరతవినిర్మలభవ్యసత్కీర్తి
సదమలరమణీయచంద్రబింబంబు
పరిశుద్ధభక్తిభావవ్యోమసీమ
పొడసూప కన్నులుమూయక చూచు
వరకవిమానసచకోరి.
భరతునిదివ్యస్వభావంబు నెఱుఁగ
సుగమంబు కా దలనిగమంబులకును;
కావున నో మహాకవిజనులార!

---

* "శ్వ, యువ, మఘోనామవద్భాతే" అను పాణినిసూత్రమున శ్వ, యువ, మఘవచ్ఛబ్దములు నకారాంతములు. దాని ననుసరించి యిచ్చట చమత్కరింపఁబడినది: శ్వ = కుక్క, యువ = పడుచువాఁడు, మఘవ = ఇంద్రుఁడు— అని అర్థములు గాన ఈ మూఁడును నకారాంతములే అనియు—మూడింటిప్రకృతియు—మూడింటిస్వభావమును నొక్కటియే యనియు వ్యంగ్యముగాఁ జెప్పఁబడినది. అనఁగా ఇంద్రుఁడు, కొంచెబుద్ధిగలవాఁడని, కుక్కబుద్ధిగలవాఁడని ధ్వని.

ఱుమియింపుఁడీ నాదుచాంచల్యమతిని.
భరతమహాభ క్తిఁ బలికిన విన్న
జానకీరామాంఘ్రిజలజాతనిరతుఁ
డెవ్వఁడు కాకుండు నీ జగ త్త్రయిని?
భరతపవిత్రసంస్మరణమాత్రమున
అతిసులభంబుగా నా రామభ క్తి
యెవ్వనిహృది నుదయింపదో వాని
కన్న దౌర్భాగ్యుఁ డహా! యెవ్వఁ డుండు?

శ్రీరామభరతసంవాదము

ఆ దయాళుఁడు మహాజ్ఞానసాగరుఁడు
శ్రీరామవిభుఁడు వీక్షించి సమ స్త
సభ్యులదశను నిజస్వాంతమందు
భ క్తుఁ డౌభరతు భావమ్ము గ్రహించె.
తదనంతరమ్ము తద్ధర్మధురీణుఁ,
డా ధీరశేఖరుఁ, డా నయవార్ధి,
ఆ సత్యశీలమహాప్రేమభావ
సుఖసాగరుం డగుక్ష్మోణిజావిభుఁడు,
ఆ న్యాయపాలకుం డా స్నేహమూ ర్తి,
ఆ రఘువంశమహాబ్ధిచంద్రుండు,
దేశకాలపరిస్థితిసమాజములను
గమనించి యీ రీతిగాఁ బ్రవచించె–
నుద్యద్వాచోవిలాసోన్నతఫణితి–
హితపరిణామముల్ మృదుమధురామ్య
తోపమానాతిదివ్యోక్తులు వెలయ;
"నాయనా! భరత! జనస్తుత్యచరిత!
ధర్మధురంధరత్వమ్ము నీ సొమ్ము.
వేదలౌకికమార్గవిదుఁడవు మఱియుఁ
బ్రేమయోగాతిప్రవీణుండ వీవు!
త్రికరణశుద్ధుఁడై దీపించు ఘనుఁడు
నీతోసమానుఁడు నిజము లేఁ డోయి!
ఇందఱు పెద్దలయెదుట నిత్తఱిని
జిన్నవానిగుణంబుఁ జెప్పఁ దే రీతి?
సదమలసూర్యవంశాచారములను
నీ వెఱుంగుదువు తండ్రీ! విపులముగ.
మనతండ్రి ఎంతటిమహితసత్యాత్ముఁ
డమలయశఃకాముఁ డరయుమా! వత్స!
సమయపరిస్థితుల్ జ్ఞాతముల్ నీకు;
గురువృద్ధహిత మెఱుంగుదువాత్మనీవు
అల హితాహితుల మధ్యస్థజనాళి
మానసంబులు నీకు మది విదితములు;
అఖిలవిధ్యుక్తధర్మాళి నీ కెఱుక;
పరఁగ నీ కెయ్యది పరమధర్మంబొ–
పరఁగ నా కెయ్యది పరమధర్మంబొ–
విపులంబుగా నీకు విదితంబు భరత!
ఉభయుల కేయది యుచితకర్తవ్య
మదికూడ నెఱుఁగుదు వాత్మఁ గుమార!
అన్నివిధాల నీయందు నా కున్న
దమలవిశ్వాస మనంత మై; కాని,
సమయానుసరణిఁ బ్రసంగించుచుంటి:
నాయనా! మనతండ్రి! పోయినపిదపఁ
గేవలగురువులకృపయె రక్షించె–
లేకున్నఁ బ్రజలును బ్రియపరిజనులు
మనపరిజనములున్ మనము నీపాటి
కెట్టి దుర్దశ వహియించి యుండెదమొ?
దినపతి, వేళ యే తెంచకమున్నె
అస్తమించినయెడ నవనిలో నెవఁడు
వ్యాకుల మొందఁడో వచియింపు మోయి!
అట్టియుత్పాతమే యవ్విధి, మనకు
సమకూర్చ, గురువరజనకభూవరులు
రక్షించినారు సర్వప్రకారముల.
రాచకార్యములుమాత్రమెకాక, మనదు
గౌరవకీర్తులు ఘనధర్మనిరతి
ధనదరాధామకదంబంబు లెల్లఁ

బృథుగురుకృపచేత నే రక్షితములు.
ఆ గురువరునిమహానుగ్రహంబె
కడకు సర్వము శుభకరముగాఁ జేయు.
వనములయందును భవనమ్ములందు
సద్గురుదేవుప్రసాదమే సతము
నిన్నును నన్నును నిఖలహితాళిఁ
బరిరక్షణముచేయు భరతా! కుమార!
అరయగాఁ బితరుల నాచార్య విభుల
ఆజ్ఞ భావించుటే అఖిలధర్మముల
కాధారభూత మాఅగ్రధర్మంబు
ధరణికి శేషుఁ డాధార మైనట్లు.
కావునఁ దమ్ముఁడా నీ వట్లు వారి
యాజ్ఞను బాలించి, అక్లె నేఁగూడ
వర్తింప సాహాయ్యపడి, సూర్యవంశ
పావనధర్మంబుఁ బాలింప వోయి!
ఈ యొక్క సాధనయే ప్రసాదించు
సకలసిద్ధులను నిజంబు కుమార!
అది త్రివేణివిధాన నమరఁగాఁ జేయు
సుయశంబు సంపద సుగతి నేకముగ.
ఈ విషయంబుల నెల్లఁ జింతించి,
కడుకష్టమేయైనఁగాని భరించి,
ప్రజలను నీ పరివారంబు నెల్ల
సుఖ మొందఁజేయుము సుజ్ఞానహృదయ!
అస్మద్విపద్భార మందఱిపైనఁ
బడినది; కాని, నీపైఁ బడె నోయి!-
అతికఠినంబుగా- నల పదునాల్గు
వత్సరంబులకాలపర్యంత మనఘ!
అతిమృదుహృదయుండ వహ! నీ వటంచు
నెఱిఁగియు నీతోడ నే నీ విధానఁ
గర్కశోక్తులఁ బల్కఁగా నయ్యె; నిపుడు
అనుకూల మగుసమయంబు కాకుంట
ననుచిత మిది కా దటంచుఁ దలంతు.

ఆపదవేళల నాత్మసోదరులె
సాహాయ్యపడ నిల్వఁజాలుదు రోయి!
పిడుగులు పైఁబడువేళలఁగూడ
భుజములే గద! అడ్డుపోయి నిల్చునవి.
సేవకు లన్నచోఁ జేతులు, కాళ్లు,
కన్నులకరణిని గ్రాలఁగావలయు;
అధిపతి నో రటు లలరారవలయు;
ఈ మహాప్రభుభటప్రేమధర్మంబు
వినిసత్కవీశ్వరుల్ వినుతింపఁగలరు."
ప్రేమపయోధి, మథించి సాధించి
నట్టిమహామృత మట్లువెలుంగు-
శ్రీరామువాణి నాలించి సర్వులును,
మహితానురాగసమాధిలో మునిఁగి
తనువుల మఱచిరి; తద్దృశ్య మరసి
శారదస్వైతము సంస్తబ్ధ యయ్యె.
భాగవతాగ్రణి భరతుఁ డత్తఱిని
బరమసంతోషసంభరితాత్మఁ డయ్యె.
ఆతనియందున అవనిజావిభుఁడు
సుముఖుఁ డైయుండుటఁ జూచి యాతనికి
విముఖంబు లై దుఃఖబృందదోషములు
దూరదూరంబుగాఁ దొలఁగె; నత్తఱిని
అతఁడు ప్రసన్నముఖాంబుజుం డయ్యె;
హృదయభారం బెల్ల విదళితం బయ్యె;
వాణీయనుగ్రహవశమున మూఁగ
మాట్లాడఁ గలిగినమాదిరి నతఁడు
ప్రణతులఁ గావించి భక్తి వెలుంగ
అంజలి ఘటియించి హస్తాంబుజములఁ
బలికె నీ రీతిగాఁ బరవశుఁ డగుచు:
"స్వామి! త్వత్పాదానుసరణసుఖంబుఁ
బడసితి; నా జన్మ ఫలియించె నేఁడు.
ఓ కృపాసాగరా! ఓ రఘువీర!
ఈ విప్పు డే యాజ్ఞ నిచ్చినన్ సరియె-

దానిఁ దలఁ దాల్చి ధన్యతఁ గందు.
భవదీయవనవాసపర్యంత మేను
సేవించుకొనుచును జీవింప నిలను
నాధార మొండు మహాకృపతోడ
దేవ దేవా! ప్రసాదింపవే! నాకు.
స్వామి! గురూ త్తమాజ్ఞానుసారముగ
అఖిలతీర్థంబులయం దుండి నీకుఁ
దెచ్చితి నభిషేకతీర్థజలంబు;
వాని నే మొనరింపవలయు నే నిపుడు.
సెలవిమ్ము కరుణతో సీతాసనాథ!
"ఒక్కమనోరథ మున్న దద్దాని
భయముచే లజ్జచేఁ బలుకలే నైతి."
అన విని, శ్రీరాముఁ, "డనుజ! అదేమొ?
తెలుపుము" నాగను, తెలిపె నా భరతుఁ
డా రామవిభునాజ్ఞ నంది యీ రీతి
ననురాగమయమధురామృతో క్తులను!
"భవదాజ్ఞ యైన-చో ప్రభు! నేను బోయి
చిత్రకూటాచలసీమ వెల్గొందు
పావనస్థలతీర్థవనగర్భములను,
ఖగమృగకాసారఘుననిర్ఝ రాద్రి
పం క్తుల, మఱియును బ్రాముఖ్యముగను
త్వ త్పాదముద్రాంకితప్ర దేశములఁ,
గనులార దర్శింపఁగలను శ్రీరామ!"
అన విని శ్రీరాముఁ డనియె నీ రీతి:
"తమ్ముఁడా! అట్టులే తప్పక నీవు
అత్రిమహాముని యాజ్ఞానుసరణి
వ ర్తింపు మీవు నిర్భయముగా వనులఁ
దిరుగాడవచ్చు నిదే స్వేచ్ఛమీఁఱ.
తన్మనీశ్వరప్రసాదమునఁ దే అనుజ!
వనమంతయున్ శుభవంతంబు భవ్య
మమితశోభామయ మీచు వెలుంగు.
ఏ స్థలమున నా ఋషీశ్వరుం డత్రి,
ఉంచ నాదేశించు, నుంచు మచ్చోట
నీవు తెచ్చిన తీర్థ మో విమలాత్మ!
అనురామువాక్యంబు లాలించినంత
భరతుఁ డానందసంభరితాత్ముఁ డగుచు,
అత్రిమహాముని యడుఁగుఁదమ్ములకు
దండప్రణామముల్ తగ నాచరించె.
అత్తఱి స్వార్థపరాయణుల్ సురలు
అఖిలమంగళమూల మై తనరారు
భరతశ్రీరామసంవాద మాలించి
రఘువంశమును గడుఁ బ్రస్తుతించుచును
గల్పవృక్షాగ్రశాఖలపయినుండి
కులుకుచుఁ గురిసిరి కుసుమవర్ష ములు.

శ్రీరామచరితమానసము

అయోధ్యా కాండము

సప్తదశవిశ్రామము

శ్రీవరఁ గాబరలక్ష్మీ
సేవితపాదాంబుజాత! శ్రితజననేతా!
దేవా! దానవకానన
దావానల! మట్టపల్లిధామ! నృసింహా!

"ధన్యుండు భరతుఁడు! ధన్యుండు భరతుఁ
డహా! రామచంద్రున కగుఁగాక విజయ"-
మని దేవతల్ పల్క రమితహర్షమున.
జనకవసిష్ఠులు సర్వసభ్యులును
భరతోక్తు లాలించి పరవశు లైరి.
పులకీకృతాంగుఁ డై యల విదేహుండు
రామభరతగుణగ్రామానురాగ
ములఁ బ్రశంసించె నుప్పొంగుచు మిగుల.
సచివసభాసదుల్ సర్వు లత్తఱిని
పరమానురాగసంభరితాత్ము లగుచు
స్తవమొనరించిరి శక్త్యనుసార-
మా ప్రభుభృత్యులయందు వెలుంగు
రమ్యసద్భావానురాగవిశ్వాస
పరమపవిత్రతాప్రతిభ లేకముగ.
భరతశ్రీరామసంవాద మాలించి
ఉభయపక్షమువార లుల్లంబులందు
ఘనమోదఖేదసంఘర్ష ణ న్గనిరి.
కోసలతనయ కాకుత్స్థనిజనని
ద్వంద్వభావాతీతభావంబు గదుర
రామగుణాభికీర్తన మొనరించి
తోటిరాణులమహాదుఃఖ మణంచె.
కొందఱు రఘువీరుగొప్పతనంబు
పరఁగఁ గీర్తించిరి భక్తి వెలుంగ.
కొందఱు భరతుసద్గుణ మెంచుకొనిరి.
అప్పు డత్రిమహర్షి అనియె నీ తెఱఁగు:
"ఈ పవిత్రాద్రిసమీపమం దొక్క-
రమణీయకూపంబు రాజిలుచుండె.
నీవు తెచ్చినయట్టి నిస్తులభవ్య
దివ్యామృతోపమతీర్థోదకంబు
తత్కూపమం దుంచఁ దగునోయి భరత!"
అను నత్రిమునియాజ్ఞ నంది యా భరతుఁ
డఖిలతీర్థాంబు సమాయతపాత్ర
లన్నియుఁ దెచ్చియు ననుజునితోడ,
నత్రిముఖ్యమునీశ్వరావళితోడ,
సాధుమహాజనసంఘంబుతోడ,
వెడలి, యగాధ మై వెలయుచున్నట్టి
తత్కూపమును జేరి, తత్పుణ్యతలిని
భద్రం బొనర్చె తద్భవ్యతీర్థముల.
అప్పు డత్రిమహర్షి యానందపడుచుఁ
బలికె నీ రీతిగాఁ బరమానురక్తి:
"అన్న! ఈ కూప మనాదిసిద్ధంబు-
కాని, లోపించుట కాలాంతరమున,
ఎవరికిఁ దెలియ దీ పృథుతీర్థతలము.

ఈ మధ్య నా శిష్యు లీ చోటుఁ జూచి
జలమయరమ్యదేశముగ గు ర్తించి
శుద్ధజలంబులఁ జూచునందాక
బాగుగా ద్రవ్వి రీ భవ్యకూపమును.
దైవయోగమున నీ పావనతీర్థ
మీ కూపమునఁ జేరె; నిందుచే వత్స!
సకలవిశ్వప్రయోజనము సిద్ధించె.
ఈ దివ్యకూపమహోదకంబులను
స్నానంబొనర్చినజనుల కందఱకుఁ
దగ నగమ్యం బగుధర్మచింతనము
సుగమ మగును గుమార! క్షోణిలో నిద్ధి,
భరత తీర్థం బనఁ బరఁగి రహించు.
సర్వతీర్థంబులజలము లిద్దానఁ
గలియుటచేత నీ సలిలంబు లనఘ!
పరమపావనము లై భాసిల్లె భరత!
ఈ తీర్థజలముల నే ప్రాణికోటి
శాస్త్రోక్తపద్ధతి సద్భక్తితోడ
నవగాహనముఁ జేయు నా ప్రాణికోటి
త్రికరణములఁ బవిత్రీభూత మగును."
అత్రి యిట్లు వచింప నందఱు వినియుఁ
దత్కూపమహిమ నుద్యత్ప్రీతితోడ
నొకరితో నొక రెంతయో? చెప్పుకొనుచుఁ
జేరిరి శ్రీరఘువీరునాశ్రమము.
అత్రి వచించెఁ దా నంత రాఘవున
కమ్మహాతీర్థపుణ్యప్రభావంబు.
ధర్మేతిహాసకదంబప్రసంగ
ములతోడ నా రాత్రి ముదమునఁ గడచె;
అంతఁ బ్రాతఃకాల మయ్యెను- భరత
శత్రుఘ్ను లిద్దరు స్నానసంధ్యాది
కృత్యంబులను దీర్చి కేవలభక్తి
శ్రీరాఘవాత్రివసిష్ఠాజ్ఞ లొంది
అనుచరయుక్తు లై అమితసామాన్య
వేషంబు లొప్పఁగా వెడలిరి నడచి,
శ్రీరామవనము దర్శింపఁ దలంచి.
చిగురుటాకులవోలెఁ జెలువొందుచున్న
భరతశత్రుఘ్నుల పదముల లేవు
పాదరక్షలుకూడ; భూదేవి యపుడు
వారికోమలపాదపద్మముల్ గాంచి
స్వాంతంబునందు విచారంబు నొంది
కటుకఠోరములఁ మార్గస్థంబు లైన
కుశకంటకశిలాది కుపదార్థములను
దనగర్భమందునఁ గనఁబడకుండ
నిమిడించుకొనె సమమృదుతలయగుచు
ఇట్లు మార్గావళి నెల్ల భూదేవి!
మృదుమంజులం బొనరింపఁగా- వీచె
మందశీతలగంధమలయానిలములు;
కుసుమవర్షంబులఁ గురిసిరి సురలు;
జలదముల్ శీతలచ్ఛాయల నీనె;
వృక్షముల్ ఫలపుష్పవితతితో నిండెఁ;
దృణతతి మార్గాళి మృదు వొనరించె-
పచ్చనికంబళుల్ పఱచినయట్లు.
మృగములు తమరమ్యదృష్టులఁ బఱపె;
ఖగములు పాడెను గంఠంబు లెత్తి;
సకలభూతంబు లీ సరణి సేవించె
నా సహోదరుల, భవ్యానురాగమున-
వారు రామప్రేమపాత్రులం చెఱిఁగి.
ఆవులించెడియప్పు డైనను గాని
'శ్రీరామ', యనుచు స్మరించినయంతఁ
బ్రాకృతుం డైనను బహుసులభముగ
సకలసిద్ధులఁ బొందఁజాలఁగా,- నింక
రామభద్రున కహా! ప్రాణప్రియుండు
భరతుఁ డమ్మహనీయుపట్ల నీ రీతిఁ
బ్రకృతి గౌరవమును ప్రకటించు టరుదె?
ఈ రీతి భరతుఁడు శ్రీరామవనిని

సంచార మొనరించె- సంయముల్ గూడ
ఆతనిభ క్తి నయ్యద్భుతనిష్ఠ
నరసి లజ్జను బొంది రంతరంగముల.
పుణ్యజలాశయభూమిభాగములు,
ఖగమృగతరుతృణగణగిరివనులు,
శృంగారమయములు చిత్రచిత్రమ్ము
లతిపవిత్రమ్ము లై యలరారుచుండె.
భగవద్విభూతితో భాసిల్లుచున్న
తద్దృశ్యముల నెల్ల దగ గనుఁగొనుచు-
వానినిఁ గూర్చియుఁ బ్రశ్నింప భరతుఁ,
డత్రిమహాముని యానంద మొప్ప
అవ్వానిపుట్టువు, లవ్వానిపేరు,
లవ్వానిగుణములు, నవ్వానిమహిమఁ
బూసఁగ్రుచ్చినరీతిఁ బొసఁగ వచించె.
ఒకపుణ్యతీర్థమం దొగిఁ గ్రుంకు లిడుచు,
నింకొక్కచో నమస్కృతు లిడుకొనుచు,
మఱియొక్కచో శాంతిమయసీమ లరసి
అందుఁ గూర్చుండి ఋష్యాజ్ఞానుసరణి
జానకీరామలక్ష్మణులఁ జిత్తమున
స్మరణం బొనర్చి, ప్రశాంతిని గనుచు,
భరతశత్రుఘ్నులు పరితోషపడిరి.
భరతునిసత్స్వభావప్రేమ లరసి
నిష్కామసేవాతినిష్ఠ వీక్షించి
వనదేవతలు మహాప్రమద మొప్పార
దీవన లిచ్చి; రీ తెఱఁగున వారు
వనమున విహరించి వసతికిఁ జేరి
శ్రీరామపాదరాజీవయుగ్మంబు
దర్శించి ఆనందతన్మయు లైరి.
ఆ దినంబున మూఁడుయామముల్ గడచె.
సప్పటి; కో విహంగాధిపా! గరుడ!
అయిదుదినాలలో నఖిలతీర్థముల
దర్శించి వచ్చెను దద్భరతుండు.

అంతిమదినము సూర్యాస్తమయంబు
వఱకును హరిహరభవ్యకథార్థ
సత్ప్రసంగాలతోఁ జక్కఁగాఁ గడచె.
మఱునాటిప్రొద్దున భరతవిదేహ
భూనాథభూసురముఖ్యు లందఱును
స్నానాదికృత్యముల్ సలిపినపిదపఁ
దిరిగి కూడిరి రామదేవునిచెంత.
వారలయోధ్యకుఁ బయనింప నాడు
మంచిగా నుండుట మది రాముఁ డెఱుఁగు-
కాని, యా కారుణ్యకంధి, యద్దానిఁ
గూర్మిచేఁ దెలుప సంకోచంబు నొంది,
తద్గురుజనకభూధవసభాసదుల
ముఖములఁ బరికించి మోమాటపడుచుఁ
దలవంచి నేలపైఁ దనదృష్టిఁ బఱపె.
ఇతరమనస్సుల కించుకగూడ
కష్టంబుఁ గల్పింపఁగాఁ బోని రామ
చంద్రుని దివ్యసౌజన్యంబు నెంచి,
అహ! రాముఁబోలు మర్యాద గలట్టి
సత్ప్రభుం డెందుండు జగతి నిం కొక్కఁ?
డని, చెప్పుకొనిరి సభ్యప్రజ లెల్ల.
అత్తఱి శ్రీరామునాంతర్య మెఱిఁగిఁ
విజ్ఞాని భరతుండు ప్రీతితో లేచి,
గురుధృతి సమకూర్చుకొని స్వాంతమందు
దండప్రణామముల్ తగ నాచరించి,
కరములు మోడ్చి యీ కరణి వచించె;

భరతుఁ డయోధ్యకేగుటకు శ్రీరామునిఁ
సెలవు గోరుట

"స్వామి! తీర్చితివి నావాంఛ లన్నిఁటిని.
నా నిమిత్తము రఘునాథ! సర్వులును
బాధలనొందఁగా వలసెను; తాము
సైత మత్యంత మాశ్రమ నొందవలసె.

ఓ ప్రభూ! సెలవిం డయోధ్య కేఁబోయి
తిరిగి మీరచటి కే తెంచెడిదనుకఁ
గనిపెట్టుకొని యుండఁగా మహాభాగ!
ఓ దీనవత్సలా! ఓ కోసలేశ!
భవదీయవనవాసపర్యంత మేను
కాల మేరీతిగాఁ గడపియు మఱలఁ
ద్వత్పాదదర్శనభాగ్యంబుఁ గాంతు
నా యుపాయముఁ దెల్పుమా! దేవదేవ
స్వామి! నీ పురజనపరిజనప్రజలు
సర్వులు పావనుల్ సమోన్మాదయుతులు,
భవదీయపదరతస్వాంతు లైయుంట.
దారుణసంసారతాప మేనియును
భరియింపఁ జెల్లును ద్వన్నిమిత్తముగ.
ప్రభు! నిను వీడుచోఁ బరమపదంబు
సైతము నిష్ప్రయోజన మయిపోవు.
సర్వజ్ఞుఁడవు నీవు స్వామి! త్వత్పాద
సేవకు స్వాంతంబు జీవితరీతు
లన్ని యెఱుంగుదు వార్తశరణ్య!
సర్వుల రక్షింపఁజాలుదు వీవె-
ఇహపరసుఖముల నిచ్చి సంతతము.
కల వన్నిటికి నీవె కాచి రక్షింప!
అన్నిటఁ, నా హృదయాంతరాళమున
నీ దృఢవిశ్వాస మెంతయుఁ గలదు;
ఇదె నా మనోధైర్య మిందుచే నాకుఁ
గష్టముల్ కష్టముల్గాఁ దోచవయ్య!
నాదగునార్తియు, నా నాథకరుణ,
అధికప్రసంగి యౌనట్లు న జ్జేసె.
అస్మద్దురంతఘోరాపచారంబు
క్షమియించి స్వామి! సంశయమును విడిచి
చరణసేవకున కాజ్ఞాపింపు మెదియొ?
అని భరతుఁడు సల్పుప్రార్థన వినియు
సర్వులున్ మిగులఁ బ్రశంసించుకొనుచు,

"క్షీరనీరమ్ములఁ జీలగాదీయు
హంసి- విధంబున నలరారుచున్న
దహ! భరతునివినయప్రార్థనంబు."-
అని వచియించిరి హర్ష మొప్పార,
జ్ఞానరూపుఁడు దీన జనబాంధవుండు
శ్రీరామచంద్రుఁడు సీతావిభుండు
విని, భరతునిదైన్యవిమలవాక్యములఁ-
బ్రత్యుత్తరం బిచ్చెఁ బరగ నీ రీతి,
దేశకాలపరిస్థితి సముచితంబు
లగువచనంబుల నాప్యాయ మెసఁగ:-
"వనమునం దేని, భవనమునం దేని
నిన్నును నన్నును నిఖిలప్రజాళిఁ
గంటికి రెప్పఁగాఁ గాచెడివారు
స్వాచార్యవర్యులున్ జనకభూవరులు.
స్వగురూత్తములును, శ్రీ జనకభూవిభులు
మన కండగా నుండి మనుచున్నవఱకుఁ
గల నైన మన కెందుఁ గలుగదు కీడు.
నాకును నీకును నాయనా! భరత!
మనయిర్వురికిఁగూడ మనతండ్రియాజ్ఞఁ
దలఁదాల్చుటే గదా! తలఁపఁగాఁ బరమ
పురుషార్థ- మదియెకా దరసినయెడల
అదె మనసంపద యశము ధర్మంబుఁ
బరమార్థమగు నోయి భవ్యస్వభావ!
నృపునిసత్కీర్తిని నిలుపుటే మనకు
విశ్వసమ్మతమును వేదసమ్మతము
నగుహితకృత్య మా నన్నివిధాల.
తనయ! శ్రీగురునాజ్ఞ, తలిదండ్రియాజ్ఞ,
స్వామియాజ్ఞను, భక్తిఁ బాలించువారు
తప్పడుపథముల దా మెప్పుడేని
బడఁజాల రొక వేళఁ బడఁ దలఁచినను.
ఈ విషయంబు గ్రహించి స్వాంతమున
సంకులంబును వీడి సాకేతపురినిఁ

బోయి పాలింపు మా పుత్ర! నీ వింక
నా వనవాసదీక్షావధివఱకు.
తత దేశకోశ బాంధవపరివార
పరిజనరక్షణ భార మంతయును
స్వాచార్య పాదరజంబండె కలదు.
మనవసిష్ఠాచార్యజననీసుమంత్ర
మహితోపదేశముల్ మది నుంచుకొనుచు
ఏలుమా భరత! మహీజన, రాజ
ధానుల, ధర్మపథంబు దీపింప."
అన్నపానీయంబు లన్ని తాఁ గొనుచు
నఖలావయవముల కన్నిశక్తులను
బ్రసరింపఁజేయుచు భాసిల్లునట్టి
ముఖమురీతిగ, రాజు పొలుపొందవలయు
నని తులసీదాసుఁ డనుచున్నవాఁడు.
ఆత్మలో సంకల్ప మట్టుల శాస్త్ర,
గర్భంబులందున గ్రాలుచునుండు
రాజధర్మాళి సర్వస్వ మియ్యదియె.
ఇట్లు వచించి అనేకరీతులను
భరతునిశ్రీరామభద్రుఁడో దార్చె;
కాని, యాతనికి రాఘవపదపద్మ
సన్నిధి స్మృతిఁ గూర్పఁజాలినయట్టి
ఆత్మప్రసన్నత నందలేకుండె.
భరతునిపైఁ బ్రీతి, గురుమంత్రిసభ్య
జనులసాన్నిధ్యంబు, జానకీవిభుని-
వాత్సల్యసందేహవశునిఁ గావించె.

భరతునభిప్రాయం బెఱింగి శ్రీరాముఁడు
తనపాదుక లిచ్చుట

చివరకుఁ దాఁ గటాక్షించి, రాఘవుఁడు
తాను ధరించెడు ధన్యపాదుకలు
భరతున కొసఁగె; నా భరతుఁ డవ్వాని
భక్తితోఁ దనతలపైన ధరించెఁ-

గూర్మిఁ గనుల కద్దుకొని పలుసార్లు.
కేవలకరుణాని కేతనుం డైన
శ్రీరామచంద్రుఁడు శ్రీచరణములఁ
బరఁగ ధరించు, నా, పాదుకాద్వయము-
ప్రథితప్రజాప్రాణరక్షకద్వయము;
రాజితభరతహృద్రత్నద్వయంబు:
అఖిలసంతరణమంత్రాక్షరద్వయము;
వరరఘునంశకవాటద్వయంబు;
అఖిలసుకృతపరాయణకరద్వయము;
భవ్యసేవాధర్మపథ దర్శకాతి
నిర్మలరమణీయనేత్రద్వయంబు;
అట్టియాలంబన మంది యా భరతుఁ
డమితప్రహర్షము నందె డెందమున;
జానకీరాము లే సాకేతాత్తు వచ్చి
సాకేతమున నుండ సమ్మతిఁ జూపి
రన్నంతసంతోష మందె నాతండు.
అంత నా భరతుఁ డత్యంత మాభక్తిఁ
బ్రణతు లర్పించియుఁ బయనం బొనర్ప
సెలవు నర్థింపఁగా శ్రీరాముఁ డతనిఁ
గౌఁగిటఁ జేర్చెను గాఢానురక్తి.
ఆ కష్టసమయంబు నఱసి దేవేంద్రుఁ
డదనుగా గ్రహియించి అతికుటిలుండు-
ప్రజలనందటిని విభ్రాంతులఁ జేసె.
ఇంద్రుబన్నాగము లెల్ల వారలకుఁ
బరిణమించెను మంచివరములలోలె.
పదునాలుఁగేడులు వనినుండి పిదప
మఱల శ్రీరాముఁడు పురి కేఁగుదెంచు
ననునాస వారల యసువుల నిల్పె;
కానిచో వారలు క్ష్మాసుతారామ
లక్ష్మణవిరహాకులప్రచండాగ్నిఁ
బ్రాణముల్ తప్పక వదలెడివారు.
శ్రీరామకృపచేతఁ జిక్కులు దీరె-

వ్యతిరేకరీతిగా వర్తింపుచున్న
యమరులందఱు నిప్పు డనుకూలు లైరి.
శ్రీరామచంద్రుఁ డా ప్రియసహోదరుని
బంధించుకొని తనబాహుశాఖలను
గుండెకు హత్తించుకొనె గాఢముగను;
ఆ రామచంద్రుమహాప్రేమగరిమ
వాక్కుల వర్ణింపవశముగా దనఘు!
ఆయన దేహంబు, ఆయనమనసు,
ఆయనవాక్కులు, అమలానురాగ
రసముతో నిండియు రాజిల్లుచుండె.
ఆ మేరుధీరుఁ డహా! రామచంద్రుఁ
డత్తఱి కఱఁగి నీరయి జాలిఁ దూలె;
ఆయనపద్మపత్రాక్షులవెంటఁ
గన్నీరు మున్నీరుగాఁ బ్రవహించె.
ఆ దశఁ గాంచి సురావళికూడ
కడుదుఃఖ మొందెను గళవళపడుచు;
జ్ఞానాగ్నిశోభితస్వాంతులు, మఱియు
నాగర్భనిర్ముక్తు, లంబుసంజాత
పద్మోపమానపంచసంభవులు
నగుమహామునులు, సూర్యాన్వయాచార్య
జనకభూపాలకసమధీరవరులు
సైతము, శోకాబ్ధి సంమగ్ను లైరి–
త్రికరణంబులఁ దమధీవిరాగములుఁ
గూడ నొక్కుమ్మడిఁ గొట్టుకపోవ–
ఆ రామభరతమహాపారనిస్తు
లం బైనప్రేమవిలాస మిట్టిఁంచి.
జనకవసిష్ఠాదిసంయమీశ్వరుల
హృదయంబులనుగూడ, కదలించినట్టి
ఆ రామభరతమహానురాగంబు
ప్రాకృతమన్నఘూ రాపచారంబు.
ఒగి రామభరతవియోగవర్ణనము
సల్పినచోఁ గవిన్ జగతీజనంబు
కఠినచిత్తుం డనఁగలరు నిక్కముగ.
ఆ కరుణారస, మకథనీయంబు!
అత్తఱిఁ బ్రత్యక్షు మైన ఆ ప్రేమ
రసమును దలఁచి వర్ణన మొనరింప
ఎంతటిఘనవాణియేని వెన్కాడు!
ఆ విధి శ్రీరాముఁ డనుజుఁ డౌభరతుఁ
గడుఁబ్రీతితోఁ గ్రుచ్చి కౌఁగిటఁ జేర్చి,
తగ లాలనముఁ జేసి, తదనంతరంబు
శత్రుఘ్ను బాహుపంజరమునఁ జేర్చె.
భరతుని లోనభిప్రాయం బెఱింగి
సచివులు సేవకుల్ చని యటనుండి
తమతమపనులను ద్వరఁజేయఁ గడఁగి–
రిరుసమాజములవా రిది గ్రహియించి
దారుణదుఃఖసంతప్తాత్మ లగుచు
సలుపసాగిరి యానసన్నాహములను.

భరతశత్రుఘ్నులు శ్రీరామునాజ్ఞఁ గైకొని
అయోధ్యకుఁ బయనించుట

భరతశత్రుఘ్నులుభయులు శ్రీరామ
పాదపద్మములకుఁ బ్రణతు లర్పించి,
శ్రీవారిఆజ్ఞను శిరసావహించి
పయనంబుఁ గట్టిరి; వారలు మఱియు
వరమునితాపసనన దేవతలకుఁ
బలుసార్లు మ్రొక్కిరి, పయనించుముందు.
ఆపయి భరతుఁ డత్యాదర మొప్పఁ
గౌఁగిటఁ జేర్చె లక్ష్మణుని; శత్రుఘ్నుఁ
డును వందనంబుల నొనరించె; నంత
వారిద్ద రవనిజాపాదరజంబు
శిరముల ధరియించి స్థిరతరభక్తి,
నిఖిలసన్మంగళనిలయంబు లైన
ఆమెఱుఁ భాశీస్సు లంది, యా పిదపఁ
బయనించి రో హరివాహనా! గరుడ!

రఘురామచంద్రుఁడు లక్ష్మణుఁ గూడి
జనకేంద్రునకు నమస్కారముల్ సలిపి
వివిధవిధంబుల వినుతించి, యిట్లు
పలికెను వినయభావంబు దీపింప:
"మాయందు దయచేత మహితాత్మ నీవు
కడుశ్రమ నొంది యీ కానల కింత
దూర మాత్మీయులతోడ వచ్చితివి;
మమ్ముల దీవించి మఱలియుఁ బురికి
వేంచేయఁ బ్రార్థింతు విజ్ఞానజలధి!"
అనువాక్యముల విని ఆ జనకుండు
మతి ధృతిఁ బూనియు మఱలెఁ దాఁ బురికి.
పిదప నా దశరథపృథ్వీశసుతుఁడు,
మునిమహీసురసాధుజనముల నెల్ల
హరిహరసమముగా నతిగౌరవించి
వీడ్కొల్పె వారల వినయ మొప్పార.
అటనుండి వెడలియు నా యన్నదమ్ము,
లల్ల నాసునయనయడుగులఁ గొలిచి
ఆమెదీవన లొంది, యరుదెంచి పిదప
దివ్యకౌశికవామదేవజాబాలి
ముఖ్యమునీంద్రులఁ బురజనసచివ
పరిజనులను గారవంబునఁ గొలిచి,
వీడ్కొల్పి రత్యంతవినయభావమున.
ఆ కృపానిధి రాముఁ డఖిలప్రజాళి-
నధికమధ్యస్థాల్పులందఱఁగూడ-
సముచితవిధమున సన్మాన మొసఁగి
పురికిఁ బంపించె నో గరుడా! ఖగేంద్ర!
భరతుమాతకు రామభద్రుఁ డంతటను
పాదవందనము సద్భక్తిఁ గావించి
కౌఁగిటఁ జేర్చియుఁ గడుఁబ్రీతితోడ
ఆమెదుఃఖం బెల్ల హరణం బొనర్చి
పాలకీ నెక్కించి పయనింపఁ జేసె.
పరమపతివ్రత వసుధాకుమారి

తల్లిదండ్రులను బాంధవజనావళినిఁ
గలసియు వీడ్కొల్పఁ గడునాదరమున;
అంత దా నత్తల యడుగుదమ్ములకుఁ
నతిఁజేసి, ఆలింగనము జేసికొనియె
వారల నెల్ల దివ్యత్రీతి గదుర.
ఆమెమహాప్రేమ నభివచియింపఁ
గవికి సామర్థ్యంబు కనిపింప దయ్యె!
తనతలిదండ్రులు తనయత్త లెల్ల
చెప్పినబోధలఁ జెలువొంద వినియుఁ
దనయభీప్సితముల కనుకూలరీతి
వారిచే దీవనల్ వడసి యంతటను
జానకియుభయపక్షంబులపైనిఁ
బ్రేమలో మునిఁగియు వివశురా లయ్యె.
రఘుపతి యంతట రమ్యంబు లైన
పాలకీలను మూఁటిఁ బరగఁ దెప్పించి
ఉద్యోధనములతో నోదార్చి వారి
నం దుపవిష్టల నమరఁ గావించె.
శ్రీరామలక్ష్మణుల్ చెలిమి దీపింప
తల్లుల ముగ్గురఁ దగఁ బలుసార్లు
కౌఁగిటఁ జేర్చియు ఘనసమ్రేమ
నంపలే కంపలే కంపించి రంత.
హయగజవివిధవాహనముల నెక్కి-
భరతవిదేహభూపాలదళంబు
లాపయిఁ బయనంబు లయ్యె ముసీంద్ర!
జానకీరామలక్ష్మణమహాధ్యాన
పరవశు లగుచు నా ప్రజ లేఁగుచుండ్రి.
వారణహయవృషభంబులవంటి
పశువులుసైతము పరితాపవశత
ముందడు గుంచక మోటించి నిలిచి
బలవంతమున నెట్లో పయనించుచుండె.
జానకీరామలక్ష్మణు లనంతరము
శ్రీయరుంధతికిని, శ్రీవసిష్ఠునకుఁ

బ్రణమిల్లి భ క్తితోఁ బదపూజజేసి
వారల వీడ్కొల్పి, వచ్చిరి తిరిగి
తమపర్ణశాలకుఁ బ్రమద విషాద
భావముల్ పెనుగొన్న స్వాంతంబు లొప్ప.
అంతనిషాదనాయకుఁ డగుగుహుని
సైతము వీడ్కొల్పె సాదర మొప్ప
శ్రీరామచంద్రుఁడు సీతావిభుండు;
ఆ నిషాదునిహృదయాంతరాళమునఁ
జండవియోగవిషాదాగ్ని రేఁగె;
ఎన్నెన్నొ చెప్పగా నెట్టులో తుదకు
భిల్లకోలకిరాతవిపిననివాసు
లెల్లఱుఁ బల్లెల కేఁగిరి మఱలి-
బలుసార్లు మ్రొక్కుచు భ క్తి రామునకు.
అంత సీతాలక్ష్మణాన్వితుఁ డగుచు.
వటమూలవేదికపైనఁ గూర్చుండె
శ్రీరామచంద్రుండు- ప్రియజనవిరహ
వేదనావ్యాకులావృతభావుఁ డగుచు-
కనుఁగొనలను బాష్పకణములు జార
మంచిముత్తియములమాలలలీల.
భరతానురాగసద్భావసూక్తులను
గూర్చి ప్రసంగించెఁ గూర్మి వెలుంగ
నత్తఱి శ్రీరాముఁ డర్థాంగితోడఁ
దనయనుజునితోడఁ దాపసవర్య!
తన్మయుఁ డౌచు నా దశరథాత్మజుఁడు
శ్రీముఖతఃప్రశంసించె నయ్యెడను-
త్రికరణశుద్ధిగా దీపించుచున్న
భరతునిభక్తివిశ్వాసాతిశయము.
ఆ సయంబునం దా చిత్రకూట
ఖగమృగజలమీనగణములే కాదు-
సర్వచరాచరసంతతు లెల్ల.
వ్యాకుల మొందె నహా మునివర్య!
అపుడు బృందారకు లందఱుఁగూడఁ

గుసుమవర్షంబులఁ గురిసి, ఆపైనఁ
దమతమ బోధలఁ దాఁ జెప్పుకొనిరి;
రాముఁడు వారికిఁ బ్రణతు లర్పించి
అభయం బొసంగఁగా నాసుర లెల్ల
భయమును వదలి సంబరమునఁ జనిరి.
జానకీరామలక్ష్మణులు మువ్వురును
అటఁ బర్ణశాలలో నలరారుచుండ్రి-
భక్తియు జ్ఞానంబు వైరాగ్యగుణము
లే తదాకృతులతో నెసఁగుచున్నటులు.
ఋష్మాసురమునిగురుజనకరాడ్భరత
పరివారజను లెల్లఁ బ్రభువిరహమున
బరు వెక్కి- యుండిన భావాలతోడఁ
బోవుచుండిరి మౌనముగ ముందుసాఁగి
సంస్మరించుచు రామచంద్రగుణాళి
అల్లఁగి వా రెల్ల యమునను దాటి
చేరిరి, యా వలితీరంబునందు;
అశన మెవ్వరికైన నా రోజు లేదు.
ఆ మఱునాఁడు వారందఱుఁగూడ
దేవనదీపుర స్తీరంబునందు
విడిసిరి శ్రీశృంగిబేరముచెంత;
నచట వారలకు నిషాదాధివిభుఁడు
శ్రీరామచంద్రునిప్రియసేవకుండు
వలసినవసతు లేర్పాటుఁ గావించె.
పిదప వారలు సయీనది నుత్తరించి
గోమతీనదియందు గ్రుంకియుఁ దరలి
నాల్గవదివసంబు నాఁటికిఁ జేరి
రావల వా రయోధ్యాపురంబునకు.
నాల్గునాళ్లు విదేహనరనాయకుండు
రాజధానిని నిల్చి రాజ్యకార్యముల
నన్నిటి సవరించి యాచార్యమంత్రి
భరతున కలరాజ్యభార మొసంగి
తనసమాజముతోడఁ జనె *తిరుహతికి.

* తిరుహతి = జనకునిరాజధాని.

సకలపౌరులు వసిష్ఠర్షి శ్రీయాజ్ఞ
శిరసావహించి వసించి ర యోధ్య,
సుఖ మెప్పఁగాఁ, బ్రియసఖి! గిరితనయ!
శ్రీరామదర్శనశ్రీ నొందుకొఱకుఁ
బొరు లందఱుఁగూడ వ్రతనియమోప
వాసనిష్ఠితు లై రి భ క్తిదీపింప.
వదలి విభూషల వై రాగ్య మొప్ప
విషయభోగమ్ముల విడిచివేసియును
అలచతుర్దశవత్స రావధిఁపిదపఁ
దిరిగి శ్రీరాముఁ డేతెంచున టన్న
పేరాసతోడ జీవించిరి వారు.
ఆంతరంగికసేవకామాత్యవరుల
రావించి భరతుఁడు రాజితప్రీతి
సముచితబోధలు సలిపి వారలను
విధ్యుక్తకార్యప్రవిష్టులఁ జేసె;
శత్రుఘ్ను రావించి సద్బోధఁ జేసి
తల్లుల సేవింపఁ దా నియమించె;
బ్రాహ్మణావళి నంతఁ బరఁగ రావించి
ప్రణతు లొనర్చి కరంబులు మోడ్చి
భయవిసయములు ప్రభాసిల్లుచుండ,
"ఓ ధరామరులార! ఓ పూజ్యులార!
మీరు చెప్పినరీతి మేదినిఁ జేతు
నెదియైన; మీయాజ్ఞ నెఱిఁగింప రయ్య!"
అని ప్రార్థనముఁ జేసె; నాతఁడు మఱియు
బరిజనపురజనప్రజల నందఱని
దగురీతిగా సమాధాన మొనర్చి
స్వస్తులఁ గావించె సముచితరీతి.
తమ్మునితోఁగూడి తద్భరతుండు
శ్రీవసిష్ఠాచార్యు చెంతకుఁ బోయి
పాదాబ్జముల వ్రాలి ప్రణతు లర్పించి
కరములు మోడ్చి, "యో గురుదేవ! స్వామి!
నీ యాజ్ఞఁ గైకొని నే నిటనుండి
వహియించెదను దపోవ్రతము, మహాత్మ!"
అని ప్రార్థనముఁ జేయ నాలించి మౌని
ప్రేమభావోద్వేగవివశాత్ముఁ డగుచుఁ
దను వెల్ల రోమాంచితం బయి వెలుఁగ,
"నీ వేది తలఁచిన, నీ వేదియన్న,
నీ వేదిచేసిన, నిజ మది యెల్ల
ధర్మసారమె యగుఁ దనయ! ఈ జగతి."-
అని వచియించె, విహంగవతంస!

శ్రీరామపాదుకాపట్టాభిషేకము

అట్లు నిజాచార్యునా దేశ మంది
ఆ మహాపురుషుశుభాశీస్సు లొంది-
భరతుఁడు విమలదై వజ్ఞులఁ బిలిచి
శుభముహూ ర్తంబును జూచిపెట్టించి
ఆ మహాశుభదినమందు వెల్లొందు
శ్రీయయోధ్యాపురసింహపీఠమున-
శ్రీరామచంద్రుని శ్రీపాదుకలను
దగఁ బ్రతిష్ఠించె నుద్యద్వైభవముగ.
భరతుఁడు నందిగ్రామమున నివసించుట
రామమాత్రంఘ్రి నీరజముల కెఱఁగి
తనగురుదేవుపాదములకు మ్రొక్కి-
శ్రీపాదుకలచెంత సెలవొంది పిదప
ధర్మధురీణుఁ డౌతద్భరతుండు
పుణ్య నందిగ్రామమున కేగి యచట
నిర్మించుకొని యొక్క నిర్మలాశ్రమము
వసియింపసాగెను వై రాగ్యమొప్ప
తల జటాజూటముఁ ధరియించి మేన
వల్కలంబులఁ గట్టి భరతుఁ డచ్చోట
ధరణినిద్రవ్వియుఁ దత్స్థలమందుఁ
బరగఁ గుశావళిఁ బఱచిఁ కూర్చుండి
నిరతరామధ్యాననిష్ఠుఁడై యుండు.
ఆహారవేషవిహారాదులందు

నియమవ్రతాదులనిష్ఠుర మైన
ఋషిధర్మమూనివర్తించె నాతండు
భూరిభూషణవస్త్రభోగాదు లెల్లఁ
ద్రిక్కరణంబులను నుద్దీప్తవిరక్తి
నాతఁడు త్యజియించె నహ; ఖగరాజ!
ఆ యయోధ్యానగరాతి వైభవముఁ
గనిన దేవేంద్రుఁడున్ గడు సిగ్గుఁ జెందు.
దశరథధారుణీధవుభాగ్య మెంచి
ధనపతిసైతము తలనంచుకొనును.
అట్టిమహాపురమందున నిలిచె
భరతుఁడు వైరాగ్యభాసురుండగుచు
*జంపకవనిలోనఁ జంచరీకంబు
చందంబుగా, ఖగస్వామి! వీక్షింప
అతిభాగ్యశాలుఁ లౌ నా రామభక్తు
లీ విషయాసక్తు లెన్నఁడుఁ గారు;
మహిలోన వారీరమావిలాసముల
వమనంబురీతిగా వదలివై చెదరు!
పరగ రామప్రేమభాజనుం డైన
భరతుఁ డిట్టివిరాగభావుఁ డైయుంట.
వింత యే మున్నది? వినుతింపఁబడవె-
చాతకపక్షి దీక్షామతిలోన!
హంస వివేచనాయతబుద్ధియందు!
దినదినం బాతనిదేహంబు తగ్గి
కడుఁగృశియించినఁ గాని, యా మహితు
తనుశక్తి యొక్కింత తగ్గకపోయె;
వదనతేజము సుంత వాడక వెలిఁగె;
అతనిరామానురాగానలజ్వాల
నిత్యనవ్యం బయి నెగడొందుచుండె.
అల శరత్కాలమునందుఁ గాసార
వారి క్షీణించినన్ బలియును దానఁ
దామరతంపరల్ తతజలజములు;

ఆ రీతిభరతునియం దభివృద్ధి
నందె ధర్మాసక్తి యతిదృఢలీల;
స్వాంతరంగంబు ప్రసన్నతనొందె.
అతనినిర్మలహృదయాకాశమందు
శమదమనియమసంయమములు వెలిఁగెఁ
గమనీయతారకాగణములరీతి.
ఆతనివిశ్వాస మగుధ్రువతార;
ఆ వనవాసదీక్షావధిపిదప
నలరాముఁ డేతెంచు ననెడిపేరాస
పూర్ణమానిశి యాచుఁ బొలుపొందుచుండు;
అల రామసంస్మృతి, యగుస్వర్గపథము;
ఆతని రామపదానురాగంబె
తారకామండలోద్భాసితం బైన
సదమలనిశ్చలచంద్రబింబంబు.
భరతునిశీలస్వభావవర్తనల
భక్తివైరాగ్యదీవ్యద్గుణమహిమ
అభివర్ణనము సేయనఖిలసత్కవులు
మాకు సమర్థత మఱి లే దటంచు
సంకోచపడెదరు స్వాంతరంగముల.
ఆదిశేషగణేశు లల సరస్వతియు
వానిని దుదముట్ట వర్ణింప లేరు.
భరతుఁడు (శ్రీ) రామపాదుకాద్వయికి
నిత్యమర్చనఁ జేసి నిస్తులభక్తిఁ,
తత్సన్నిధిని నిల్చి తా విన్నవించి
రాజకార్యముల నిర్వర్తింపుచుండు.
ఆ భరతునితను వనవరతంబు
పులకరింతలతోడఁ బొలుపొందుచుండు;
ఆ మహాత్మునిడెంద మనవరతంబు
జానకీరాములతో నింపియుండు;
ఆ దివ్యనేత్రంబు లనవరతంబుఁ
బ్రేమాశ్రువులతోడ వెలుఁగొందుచుండు,

---

* చంపకపుష్పము అత్యంతసుగంధబంధుర మైనను తుమ్మెద దానిని రవ్వంతకూడ ఆఘ్రాణింపదు.

జానకీరామలక్ష్మణు లుండ్రి వనిని;
భరతుఁడో? పురమందు వసియించికూడ
ఘనతపస్సంత ప్తతనుఁ డై రహించె;
ఉభయవిధానము లుల్లమం దెంచి
భరతుఁడు ప్రస్తుతిపాత్రుఁడన్నింట
నని సంస్తుతించిరి జనము లందఱును.
వరభరతుని మహావ్రతనియమాళి
విని సాధుజనములు బిడియంబుఁ గనిరి.
అతని మహోన్నత మాస్థితిఁ జూచి
మునిరాజులును సిగ్గుఁ బొంది రాత్మలను.
భరతునిచర్యలు పరమభవ్యములు,
మధురమంజులములు, మంగళకరము,
లానందకందంబు లఖిలపూజ్యములు.

భరతకథాశ్రవణఫలశ్రుతి

భరతుని పరమపావనచరిత్రంబు
కర్క-శకలియుగకలుషా ర్తిహరము.
అజ్ఞానతిమిరాంతకార్క-బింబంబు;
చండాఘపుంజకుంజరమృగరాజు;
సర్వసంతాపప్రశమనామృతంబు;
భవభంజనము; సర్వభక్తరంజనము;
రామభక్తిసుధాకరరసమయంబు.
జానకీశ్రీరామచరణానురాగ
పరమసుధారసభరితుఁ డౌ భరతుఁ

డుర్వీతలంబున నుదయింపకున్న
ఘనమునులకును నగమ్యమై యున్న
శమదమనియమసంయమకటు వ్రతము
లెవ్వఁ డనుష్ఠించు నీ జగమందు?
తతదుఃఖదారిద్ర్య దంభదోషముల
నెవ్వఁడు హరియించుఁ నీ జగత్రయిని?
తనదివ్యకీర్తి ప్రతాపంబుచేత
దుర్దాంతకలిలోనఁ దులసినిబోలు
శఠులచిత్తంబును సామర్థ్యమొప్ప
రామాభిముఖమొనర్పంగలఁడెవడు?
భక్తితో నెవ్వఁడు భరతుచరిత్ర
విను నియమం బొప్ప వీనులారంగ,
సంసారభోగవాసనలఁ ద్యజించి
వాఁడు సీతారామపదభక్తినొందు.

సుగంధివృత్తము

మంగళంబు దేవదేవ! మాధవా! జనార్ధనా!
మంగళం బుపేంద్ర! విష్ణు! మంగళప్రదాయకా!
మంగళంబు మద్ హృదబ్జమత్తషట్పదా! హరీ!
మంగళంబు శ్రీనృసింహ! మట్టపల్లిమందిరా!

శ్రీమట్టపల్లి లక్ష్మీనృసింహ
పరబ్రహ్మార్పణమస్తు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఇది సకలకలికలుషవిధ్వంసక మైన శ్రీగోస్వామి తులసీదాసకృత- 'శ్రీరామచరిత మానసము' లోని అయోధ్యాకాండమునకు-శ్రీ రామతీర్థభగవత్పాద ప్రియశిష్య నిరంతర శ్రీ మట్టపల్లి లక్ష్మీనృసింహ పరబ్రహ్మవాస హృత్పద్మతీర్థ శ్రీ కేశవతీర్థ స్వామికృతమైన యాంధ్రానువాదము

సర్వము సంపూర్ణము

ఓం తత్సత్

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరామచరితమానసము

ఆరణ్యకాండము

తృతీయ సోపానము

9/11

ఓం

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరామచరితమానసము

ఆరణ్య కాండము

తృతీయ సోపానము

ప్రథమవిశ్రామము

శ్రీమత్కేశవతీర్థమ
నోమందిరవాస: నిత్యనూతనవిభవా:
ప్రేమరసావేశాకృతి:
స్వామీ: శ్రీమట్టపల్లివాస: నృసింహా:

ఉ. ధర్మమహీజమూలమయి.
తద్ఘనదివ్యవివేకవార్ధిరా
ణ్నిర్మల పూర్ణచంద్రుడయి,
నిస్తులభూరివిరాగపద్మినీ
శర్మదసూర్యదేవుఁడయి,
సాంద్రమహాఘతమ:ప్రదీపమై,
ఊర్మిపయోదవాయువయి,
యొప్పుత్రితాపహా శంభు శంకరున్,
కర్మవిదూరు రామపద
కంజమహోన్నతభక్తుఁ గొల్చెదన్.

మ. విమలానందపయోదసుందరతనున్,
బీతాంబరాలంకృతున్
కమనీయోరుజటాకటాహమకుటున్,
కంజాయతాక్షున్, రఘు
ద్యుమణిన్, చాపశరాత్తహస్తు, విలస
త్తూణీరభారున్, హరిన్
రమణీసోదరసంయుతున్, పథికు, శ్రీ
రాము నృజింతున్ సదా.

కథా ప్రారంభము

ఓ ఉమా! రాముమహోన్నతగుణము
లతిగభీరంబు లహా! వానినెంచి
పండితమునిజనుల్ వైరాగ్యదీప్త
భావులౌచుంద్రు; విభ్రాంతులైనట్టి
మూఢులు, హరిపరాఙ్ముఖు, లధార్మికులు,
వానిని విన నాశపడ రించుకైన.
సాకేతనగరప్రజాళికిన్ మఱియు
భరతునకున్ రామభద్రునియందు
రాజిల్లు ననుపమరమ్యానురక్తి
నా శక్తికొలఁది వర్ణన, మొనర్చితిని,
విను మిప్పు డా రఘువిభుఁడు శ్రీరాముఁ
డమరర్షిజనుల కాహ్లాదంబుఁ గూర్పఁ
గావించినట్టి జగన్నుతమహిత
పరమపావనవనవాసలీలలను.

ఒకసారి శ్రీరాముఁ డుజ్జ్వలప్రీతి
అందమౌ పూవుల నన్నిఁటిఁ గోసి,
స్వయముగా మాలికావళి విరచించి
స్నాతనూభవను సింగారించి మిగుల,
ఆమెతో నుపవిష్టుఁ డయ్యె నందొక్క-
రమ్యమౌ స్ఫటికశిలాతలమందు.

కాకరూపధరుఁడగు జయంతుఁడు
సీతపాదమును బొడిచి పీడించుట

అత్తఱి నవివేకియగు నింద్రసుతుఁడు
వాయసరూపంబు వహియించి వచ్చి
శ్రీరాము శక్తిఁ బరీక్షింపఁ దలఁచె-
లేశ మేనియు బుద్ధిలేనట్టి చీమ
వనధి లోతు నెఱుంగ వాంఛించి నట్లు.
ఆ మూఢుఁ డా మందుఁ డట్లాత్మలోన
దుష్టభావమునొంది దుర్మదుం డగుచు
కాకవేషముఁదాల్చి తాస్రాసుతాచరణ
మును, తన ముక్కు-తోఁ బొడిచి తాఁ బోయె.

శ్రీరాముఁడు కాకముపై బ్రహ్మాస్త్రము
నభిమంత్రించి విడుచుట

తదుపరి జానకీపదరక్తధార
వీక్షించి, శ్రీరఘువీరుఁ డెఱింగి,
ఒక యీషికమును నిజోగ్రచాపమున
సంధించి విడిచెను సాయకమటుల.
అహ! రఘునాయకుఁ డమితకృపాబ్ధి
సంతతదీనవాత్సల్యసాగరుఁడు;
ఆ జగన్నాథునియండే తదీయ
మూర్ఖాతిమూర్ఖుండు పూర్ణదుర్గుణుఁడు
తన కుతంత్రంబులఁ దలపెట్టినాడు;
అట్లు మంత్రితమైన ఆ గడ్డిపోఁచ
బ్రహ్మాస్త్రమై వెంటఁబడియె; ఆ కాకి
పరువిడ సాఁగెను భయసంకులమున.
వాయసరూపంబు వదలి పర్యాడుచుఁ
బోయి, యా దేవేంద్రపుత్రుండు తనదు
తండ్రిసన్నిధిఁ జేరె; తత్ క్షణమందె
అతఁడు రామద్రోహి యని గ్రహియించి,
శరణీయ కే బోవఁదరిమె నింద్రుండు.
విష్ణుచక్రముచేత భీతిలినట్టి
దుర్వాసుచంద మా దుష్టాత్ముఁ డంత
జీవితాశను వీడి చిత్తంబులోన
కడుభయం బొందెను గౌరి! అపర్ణ!
వాఁడట్లు దుఃఖసంవ్యాకులుఁ డగుచు
అలయుచు సొలయుచు నజహరముఖ్యు
లుండు లోకంబుల కొగిఁ బరుఁగెత్తె.
కాని, వానినిఁ జూచి కరుణ వహించి
కూర్చుండు మనువారుఁగూడ లేరైరి.
ఎవరు రామద్రోహి కీ జగత్రయిని
శరణీయుఁగలవారు గరుడా! ఖగేంద్ర!
వినుము శ్రీరఘువీరవిముఖజీవునకు
తల్లి పెన్మృత్యుభూతము, తండ్రి యముఁడు,
సచివుఁడు శతశత్రుసముఁ డయిపోవు;
అమృతంబు ఘోరమహా విష మగును,
సురనదీమణియు వైతరణిఁగా మారు;
వేయేల? వానికి విశ్వమంతయును
రౌరవనరకతుల్యం బయితోచు;
అట్లతిశోకవిహ్వలుఁ డయి పాఱు
ఆ యింద్రసుతుని జయంతునిఁ గాంచి
నారదమౌని దయారసహృదయుఁ
డయ్యె- మహాత్ము లహా! నిరంతరము
కరుణార్ద్రహృదయులు గాదె, ఖగేంద్ర!
అపుడు నారదముని ఆ యింద్రసుతుని
పంపెఁ దత్ క్షణమె సత్వరము దీపింప
శ్రీరాము సన్నిధిన్ జేరుమటంచు.

కాకాసురుఁడు శ్రీరామునిశరణుఁ జొచ్చుట

"ప్రణతా ర్తిహరణ! మాం పాహిమాం పాహి"
అనుచుఁ గుయ్యిడుచు జయంతుఁ డత్యంత
భయసంభ్రమంబులఁ బర్విడిపోయి
శ్రీరామచరణరాజీవయుగ్మమున
వ్రాలి యీ విధమునఁ బ్రార్థింపసాగె:
"త్రాహిసంత్రాహి శ్రీరఘురామచంద్ర!
భవదసమానప్రభావప్రతాప
ముల నేరనైతిని మూఢుఁడ నౌట.
మత్కృతపాపకర్మంబున కేను
తగుఫలం బొందితి; త్వత్పాదపద్మ
శరణాగతుఁడ దయాస్వాంతుండ వగుచు
రక్షింపుమా, ప్రభూ! రక్షింపు మీశ!"
అను జయంతుని మహోత్తాలాపములను
విని, కృపాళుఁడు రఘువీరుండు, వాని
నేత్ర మొక్కటిఁ గొని, నిర్జింపకుండ
ఏకాక్షునిగఁ జేసి, యిఁకఁ బొమ్మనిటంచు
వదలెఁ బ్రాణాలతోఁ బర్వతతనయ!
ఆ జయంతుండు మోహాధీనుఁ డగుచు
రామవిద్రోహకార్యం బొనరించె-
దానిచే నతఁడు వధార్హుఁడే యైన-
సదయాత్ముఁడై వాని వదలె రాఘవుఁడు:
రఘువీరసముఁ డౌచు రాజిల్లునట్టి
కరుణాళు వెవఁడు జగత్రయంబందు?
చిత్రకూటమున వసించి రాఘవుఁడు
కర్ణామృతోపమకమనీయలీల
లెన్ని యో! ప్రకటించె నీ విధానముగ.

సీతారామలక్ష్మణు లత్రిము
న్యాశ్రమమున కేగుట

ఒకనాఁడు శ్రీరాముఁ డుల్లంబులోన
ఇటనున్న, జనులెల్ల రెఱిఁగి నా విషయ
మరుదెంచుచుందు రటంచుఁ దలంచె.
జానకీరామలక్ష్మణులంత, మీను
లందఱికడ సెలవందియున్ వెడలి
రా చిత్రకూటపర్వతమును విడిచి,
జానకీలక్ష్మణసహితుఁడై యట్లు
చనిచని శ్రీరామచంద్రుఁడు చేరె
అత్రిమహాముని యాశ్రమస్థలికి.
శ్రీరామవిభుఁడు వేంచేసినాఁడన్న
వార్త విన్నంతనే పరవశుఁ డగుచుఁ
దనువెల్లఁ బులకీకృతంబయి వెలుఁగ
నా యత్రిమునివరుఁ డానంద మొప్ప
సంభ్రమంబున నిజాసనమును విడిచి,
పరుఁగిడె శ్రీరామభద్రునిఁ గలియ.
అ ట్లెగుదెంచెడి యత్రిమునీంద్రు
వీక్షించి, శ్రీరఘువీరుఁడాత్రమునఁ
దానును బరుఁగిడెఁ దపసినిఁ గలియ.
రామలక్ష్మణులట్లు రయమున వచ్చి
సాష్టాంగపడఁ దన చరణసన్నిధిని,
అ య్యత్రిమౌని మహోదర మొప్ప
వారలఁ బైకెత్తి బాహువల్లికలఁ
గట్టిగా బంధించి కడుప్రేమ పొంగ
ఆనందబాష్పధారాభిషిక్తులను
గావించె, నోయిఖగప్రభూ! గరుడ!
తత్రామదివ్యసౌందర్యవిగ్రహముఁ
గన్నులపండువుఁగాఁ జూచి చూచి,
ఆ యత్రిమౌని మహోహర్ష మొందె.
అంత నమ్మునివరుఁ డత్యాదరమున
జానకీరామలక్ష్మణుల మువ్వురను
లోనికిఁ గొని తెచ్చి, మానితరీతి
నర్ఘ్యపాద్యాదుల నర్చించి, పిదపఁ
గుశలాదు లడిగియుఁ గోమలఫణితిఁ
గడురుచిఁ గూర్చెడి కందమూలముల

ఫలముల నర్పించి పరితోషపఱచె.
అంత శ్రీవిభుఁడు సుఖాసీనుఁడయ్యె;
అత్రిమహర్షి మహాబ్రహ్మవేత్త
ఆ రామచంద్రుని యతిలోకదివ్య
మంగళసుందరమహితరూపమును
గన్నులవిందుగాఁ గాంచి హస్తముల
జోడించి ఈ రీతి-స్తోత్రం బొనర్చె:

అత్రిమహర్షికృత శ్రీరామస్తవము
గే య ము లు

నమ స్స్వభక్తవత్సలా! కృపాలవాల! కోమలా!
అహైతుకాత్మభక్తులన్ స్వధామ మిచ్చి ప్రోచు నీ
పదాబ్జముల్ భజించెదన్ సదా మదాత్మలోఁ బ్రభూ!
మనోజ్ఞశ్యామసుందరా! భవాంబురాశిమందరా!
ప్రఫుల్లకంజలోచనా! మదాదిదోషమోచనా!

ప్రలంబబాహువిక్రమా! ప్రభూ! అమేయవైభవా!
నిషంగచాపసాయకా! హరీ! త్రిలోకనాయకా!
దినేశవంశమండనా! మహేశచాపఖండనా!
మునీంద్రనిత్యరంజనా! సురారిబృందభంజనా!

మనోజవైరివందితా! అజాదిదేవసేవితా!
విశుద్ధబోధవిగ్రహా! సమస్తదుఃఖతాపహా!
రమాసతీమణీపతీ! సుఖాకరా! సదాగతీ!
నమస్సశక్తిసానుజా! శచీపతీప్రియానుజా!

త్వదంఘ్రిమూలమేనరుల్ భజింత్రసూయవీడియున్
తదీయమర్త్య లెప్పుడున్ వితర్కతుంగభంగమౌ
భవాబ్ధిఁగూల; రే నరుల్ వివిక్తవాసులై సదా
విముక్తిఁ గోరి, యింద్రియాదు లెల్ల నిగ్రహించి, నిన్
భజింత్రువారు స్వస్వరూపమైన నిన్నుఁగాంత్రహా!

ప్రభూ! అఖండ! అద్భుతా! నిరీహ! ఈశ్వరా! విభూ!
జగద్గురూ! సుశాశ్వతా! తురీయరూప! కేవలా;
సుభక్తిభావవల్లభా! కుయోగిలోకదుర్లభా!
స్వభక్తకల్పపాదపా! సమస్తసేవ్య! కొల్తునిన్,
అనూపరూప! భూపతీ! నమస్సురార్విజాపతీ!
అనుగ్రహింపుమాసదా-త్వదంఘ్రిభక్తి, రాఘవా!
సమాదరాత్ములౌచు ఎవ్వరీస్తుతిన్ బఠింతురో?
ప్రభూతభక్తి, ముక్తియున్, బ్రభూ! వరించువారలన్.

అని స్తోత్ర మొనరించి ఆ యత్రిమౌని
శిరమును వంచియుఁ జేతులు మోడ్చి,
నాథా! మదీయమనంబు సంతతము
త్వత్పాదపంకజద్వయి నిల్చుఁగాక!
అని పునఃప్రార్థన మొనరించె గరుడ!
తదుపరి సాధ్వీమతల్లి ఆ సీత
వినయసౌశీల్యముల్ వెలుఁగొందుచుండ,
అత్రిమహాముని అర్ధాంగియైన
అనసూయ చరణంబులందున వ్రాలె.
ఆ ఋషిపత్ని మహానంద మొంది
దీవించి ఆమె నుద్దిష్టానురక్తిఁ
సన్నిధిం గూర్చుండసలిపి యంతటను
నిత్యవినూత్నవినిర్మలదివ్య
వసనభూషణముల బరఁగ నొసంగి
సన్మాన మొనరించె, సకియా! అపర్ణ!
మఱియు నా ఋషివధూమణి యనంతరము
సమయోచితంబుగా సరసమృదూక్తు
లొలుక నారీధర్మముల నిట్లు పల్కె:

అనసూయ సీతాదేవికిఁ
బతివ్రతాధర్మములు బోధించుట

"వినుమమ్మ! సీత! పృథ్వీసుతా! స్త్రీకి
తల్లి దండ్రులు సహోదరముఖ్యులెల్ల
పరిమితహితకారు లరయఁ బ్రాణేశుఁ
డసమానదివ్యమహాహితకారి
పతిని సేవింపని పడఁతి నికృష్టు

రాలు; విదేహభూపాలకుమారి!
ధైర్యంబు, ధర్మము, తన్వి, హితుండు-
పరఁగ నీ నాల్గు నా పత్కాలమందె
పరిశోధనముఁ జేయఁబడును ధరిత్రి.
ముదుసలి, రోగిష్ఠి, మూర్ఖుఁ, డంధుండు,
బధిరుండు, కోపిష్ఠి, పరమదీనుండు,
నగుగాక తన భర్త నవమానపఱచు
కాంత, నానానరకవ్యథలొందు.
త్రికరణపూర్వకోద్దిష్టమౌ స్వీయ
పతిపదప్రేమయే భామిని కరయ-
నేకైకధర్మ; మేకైకవ్రతమ్ము;
నియమంబు; జానకీ! నిర్మలహృదయ!
క్షితిఁ జతుర్విధపతివ్రత లుందు రనుచు-
వేదపురాణముల్ విబుధాళి తెలుపు:
ఆత్మేశ్వరునిదప్ప నన్యుఁడౌ పురుషుఁ
గలనైన యెఱుఁగని కాంతయేసుమ్ము-
పరమపతివ్రత పరిగణింపఁగను.
పరపురుషుని సహోదరునిఁగాఁ బితగ
దర్శించుకాంత-మధ్యస్థురా లగును.
తన కులాచారంబుఁ దలపోసిలోన
ధర్మమార్గమ్మును దప్పనియట్టి
భామ, నికృష్టఁగాఁ బలుకు వేదములు.
వెఱచి లోకమునకు, వెలికిఁ గన్పడఁగ
ధర్మ మనుష్ఠించు తన్వి వహించు-
నధమాధమస్థాన మంగనలందు.
పతిని వంచించియుఁ బరపురుషులను
గామించుస్త్రీ శతకల్పంబు లుగ్ర
రౌరవనరకదుర్వారాగ్నిఁ గూలు.
క్షణసుఖంబును గోరి శతకోటిజన్మ
లతిదుఃఖ మొందెడి యంగనవంటి
అతినీచజీవి కటా! యుండఁబోదు.
తనరఁ బతివ్రతాధర్మంబు నడుపు

సాధ్వి, రవ్వంతయు శ్రమనొందకుండఁ
బరమగతిన్ బొందు భాసురరీతి.
పతికిఁ దాఁ బ్రతికూలవతియైనకాంత
వచ్చుజన్మంబున వైధవ్య మొందు-
యావనదశయందె యతిఘోరరీతి.
కాంతనైజముగ సకల్మష; కాని
పతిసేవచేత సద్గతి నొందగలదు.
పతిభక్తిచేఁగదా! పడతియౌ తులసి
ఈ నాఁడుఁగూడ లక్ష్మీశునిచేతఁ
బ్రేమింపఁబడి నాల్గువేదంబులందు
స్తోత్రింపఁ బడుచుండెఁ జూడుమా! సీత!
జగతి, నీ నామసంస్మరణం బొనర్చి,
ధన్యపతివ్రతాధర్మంబు స్త్రీలు
నిర్వహింపఁగలారు, నీరజనేత్రి!
ప్రాణప్రియుఁడు నీకు రామచంద్రుండు-
నీ వెఱుంగని ధర్మనియతు లేముండు?
లోకహితార్థమై నీకు నేఁడివ్వి
చెప్పితి నూరకె సీతామతల్లి!"
ఆ ప్రసంగము విని అవనీకుమారి
పరమహర్షమునొంది, భక్తిదీపింప
అనసూయపాదాల కభినుతుల్ సలిపె.
తదనంతరము రఘూద్వాహుఁడు గృపాబ్ధి,
అత్రిమహర్షితో ననియె నీ రీతి:
"భవదాజ్ఞఁగొని, మేము పయనింప గలము
వేఱొండు వనికి పవిత్రాత్మ! సతము
ద్వదనుగ్రహంబు మాపై నుంచవలయు.
మముఁ గింకరులమని మదిని గ్రహించి,
కృప వీడవల దెప్పుడేని మహాత్మ!"
అని వచియించిన యా రామచంద్రు
ధర్మధురంధరు దశరథతనయు
వినయవాక్కులు విని విద్వద్వరిష్ఠుఁ
డా యత్రిమౌని యి ట్లనియె నత్తఱిని;

"ఎవని యనుగ్రహ మిచ్చింతు రెప్పు
డజ, శివ, సనకాదు, లఖిలసుజ్ఞాను-
లా పరబ్రహ్మవీ వాది దేవుఁడవు;
నిష్కామ భక్తియే నీ కతిప్రియము;
దీనబంధుఁడవీవు దేవ! శ్రీరామ!
అట్టినీ వీ రీతి ననుపమవినయ
వాక్యముల్ నాతోడఁ బలుకుచున్నావు;
సర్వదేవతలను సంత్యజియించి,
నిన్నేవరించిన యన్నలమిన్న-
ఆ లక్ష్మిచాతుర్య మహ! నేఁడు తెలిసె.
అసమానుఁడును నిఖలాతీతుఁడైన
సర్వేశ్వరునిలోన సౌశీల్య మిట్లు
భాసింప కెట్లుండు పరమేశ! రామ!
నీ వేగదగు నని నేఁ జెప్పఁగలనె?
ఓయి! అంతర్యామి! ఓ స్వామి! చెపుమ!"
అని పల్కి ఆ ముని అట్టెనిల్చిండె-
స్తబ్ధుఁడై శ్రీరామచంద్రుఁ జూచుచును-
బాష్పప్రవాహముల్ పాఱ నేత్రములఁ
దనువుపైఁ బులకరింతలు నిండుకొనఁగ
అ ట్లామహర్షి మహాప్రేమభావ
పులకితగాత్రుఁడై పొంగిపోవుచును
ఱెప్పలు వ్రాల్పకే శ్రీరామచంద్రు
శ్రీముఖాబ్జమును వీక్షించుచు నిలిచి,
తనలోనఁ దా నిట్లు తలపోసె నపుడు:

"మనమునకున్ జ్ఞానమునకు, గుణముల,
కఖలేంద్రియములకు నావల వెలుఁగు-
పరమాత్మనిట్టులు ప్రత్యక్షముగను
దర్శింపఁగలిగిన ధన్యత్వమునకు
ఏ జపతపముల నే నొనర్చితినొ?"
జపయోగధర్మాదిసాధనంబులను
అనుపమం బగు భక్తి నందునరుండు.
ఈ తులసీదాసుఁ డిందుకే భవ్య
రఘువీరదివ్యలీలావిలాసములు
గానం బొనర్చు దివానిశీథములు.
చండోగ్రకలిమలశమనశౌర్యములు,
ఘనతరచిత్తనిగ్రహదాయకములు,
మోక్షసామ్రాజ్యప్రమోదమూలములు-
గురుతర శ్రీరామగుణకీర్తనములు.
ఆదరంబున వాని నాలించువారి-
కెప్పుడు రాముఁడు హిత మొనరించు.
కడుఘోర మీ కలికాలముదగ్ర
పాపాలవాలము; పరికింప నిపుడు
ధర్మంబు జ్ఞానంబు తద్యోగజపము
లుపయోగపడఁజాల వొక్కటే దిక్కు:
అది రామభజన మయ్యది రామభజన!
అఖిలాశలను పరిత్యాగం బొనర్చి
శ్రీరామచంద్రు భజింతు రెవ్వారు-
వా రే- వివేకసంభాసురమతులు!

శ్రీరాఘవచరితమానవసవము

ఆరణ్యకాండము

ద్వితీయవిశ్రామము

కేతవరాద్రినికేతనఁ
భూతాధిపఁ భూతగర్భఁ భూతశరణ్యాఁ
పాతకశమనఁ శుభంకరఁ
తాత్రితాఁశ్రీమట్టపల్లిధామఁ నృసింహాఁ

ఆ సురనరమునీశాధీశ్వరుండు
శ్రీరాముఁ డత్రికిఁ జేసివందనము-
వనయాత్రసాగించెఁ బార్వతీ! వినుము.
ఆ రామలక్ష్మణు లలరారుచుండ్రి
మునివేషధారులై;- చనుచుండెముందు
విభుఁడు శ్రీరాముఁడు, వెనుకలక్ష్మణుఁడు;
వారిద్వారకు మధ్యభాగంబునందు
జీవేశ్వరులమధ్యఁ జెలువొందుమాయ
చందంబుగా సీత చనుచుండె; నపుడు-
వరసరిద్వనగిరివ్రజము లన్నియును
వచ్చుచుండెను జగత్ప్రభు వని యెఱిఁగి-
మృదులమార్గము లిచ్చె మిగులసంప్రీతి.
ఎట కేగినన్ సరే, అట నెల్ల మింట
ఛత్రంబు లగుచును జలదసంఘములు,
చల్లనినీడ లొసంగె రామునకు.

విరాధవధ

ఆ మువ్వు ర ట్లరణ్యంబున నేగు
చుండ, విరాధుఁ డుద్దండదానవుఁడు
కలిసెవారలను మార్గమునఁ దత్ క్షణమె-
ఆతనిన్ రఘువీరుఁ డవనిపైఁ గూల్చె.
అట్లా విరాధుండు హతుఁడయినంత
దివ్యరూపముఁ దాల్చి దీనుఁడై నిలువ-
జానకీనాథుఁడు జాలి వహించి,
వానినిఁ బంపించె వైకుంఠమునకు.

సీతారామలక్ష్మణులు శరభంగాశ్రమమున కేగుట

తదనంతరము రఘూద్వహుఁడు వేంచేసె
జానకీలక్ష్మణసంయుతుఁ డగుచు-
శరభంగమునివరాశ్రమదేశమునకు.
ఘనశరభంగలోచనభృంగయుగము
రామముఖాంభోజరాజంబుఁ గాంచి,
తన్మహాదివ్యసౌందర్యామృతమును
పానం బొనర్చె నాప్యాయతమిఁ బొ.
ఆ శరభంగమహామునిజన్మ
మతిధన్య మతిధన్య మాహా! ఖగేంద్ర!
అంత నా మునివరుఁ డనియె నీ రీతి:
"కాకుత్థ్స! రఘువీర! కరుణాలవాల!
శంకరమానసచారుమరాళ!
ఏ బ్రహ్మలోకాని కేగఁ దలంచి
సంసిద్ధమైయుండ శ్రవణరంధ్రముల-
వచ్చుచుండెను రామభద్రుఁడు వనుల-

కనువా ర్త సోకఁగా నతిముదమొంది
రాత్రింబవళ్ళు మార్గంబులఁ గనుచు
వేచియుంటిని రఘువీర! ఈ నాఁడు
త్వద్దర్శనమున స్వాంతంబు శాంతించె.
ఎట్టిసాధనముల నెఱుఁగను స్వామి!
కాని, దీనుఁడ నౌటఁ గరుణఁ జూపితివి.
నీ ప్రతిజ్ఞను నీవు నెఱవేర్చుకొంటి-
విది నీదు ధర్మమోయీ! రామచంద్ర!
భక్తమానసచోర! భవభయహార!
ఈ దీనజనునిపైఁ గృపవహియించి
తనువును విడి పరంధామ! నీలోనఁ
గలిసెడిదనుక నా కన్నులముందు
నిలువుమో శ్రీరామ! నీరదశ్యామ!"
అని ప్రార్థనముఁజేసి ఆ శరభంగుఁ,
డఖిలయోగీంద్రయజ్ఞయాగముల
జపతపోవ్రతదానసర్వస్వములను
రామపాదాంబుజార్పణ మొనరించి,
ప్రతిఫలంబుగ మహాభక్తిని బొందె.
పరమదుర్లభమైన భక్తిభాగ్యంబుఁ
జెంది యా తెఱఁగునఁ జితియొండుఁ బేర్చి
అందు నిస్సంగుఁడై ఆ శరభంగుఁ
డాసీనుఁడౌచు రామైక్యచిత్తమున-
"జానకీలక్ష్మణసహితమైనట్టి
ఘనఘనాఘననీలకాంతులనీను
ఈ నీ సగుణరూప మెప్పుడుఁగూడ
నా హృదయాబ్జమ్మున న్నిల్చుఁగాక,
శ్రీరామ! శుభనామ! శివచిత్తధామ!"
అనుచుఁ బ్రార్థించి యోగాగ్నిసందగ్ధ
దేహుఁడై శ్రీరామదేవుని కృపను
వైకుంఠమునకేగె భాసురరీతి.
ఆ శరభంగమహాముని వరుఁడు,
ప్రథమంబునన్ భేదభక్తినే, వరము
గాఁ గోరియుండినకతమున, నతఁడు
హరివిలీనత నందఁడయ్యె- నత్తఱిని
అటఁ జేరుకొనిన మహర్షు లందఱును
అమ్మునీశ్వరుని మహాగతిఁ గాంచి,
పరమసంతోషసంభరితాత్మ లౌచు,
"జయజయకారుణ్యాజలధి! శ్రీరామ!
జయజయ ప్రణతార్తజనహిత! రామ!"
అని జయధ్వానంబు లొనరించి రఖిల
వనగర్భమున్ బ్రతిధ్వను లొనరింప.

శ్రీరాముఁ డసురనిర్మూలన మొనర్తు
నని ప్రతిజ్ఞఁ జేయుట

అంతట రఘురాముఁ డటనుండి కదలి
వనయాత్రసాగించె వెనువెంటఁ దవిలి
వరమునితండముల్ వచ్చుచుండఁగను.
అ ట్లేగు చా యరణ్యప్రదేశమునఁ
గొండవిధంబునఁ గూడియున్నట్టి
ఎముకలప్రో వొక్క- టేర్కొంచినంత,
గుండె నీరయిపోవ- కోమలహృదయుఁ
డా రాఘవుం డాగి, అవ్వానివిషయ
మడుగఁగా, మునిబృంద మనియె నీ రీతి:
"అఖిల మెఱుంగుదు వైన మ మ్మిటులఁ
బ్రశ్నింతు విదియేమి స్వామి! శ్రీరామ!
సర్వదర్శివి నీవు సర్వహృద్వర్తి-
వీ వెఱుంగని దేమి ఈ విశ్వమందు?
ఈ ప్రాంతమునఁగల యెల్ల మానులను
చంపిరయ్యా! నిశాచరులు శ్రీరామ!"
అనుమాట వినినంత నా రామచంద్రు
నేత్రాబ్జముల నీరునిండె గిట్టునను.
"ఋషివర్యులార! ఇదే నా ప్రతిజ్ఞ:
పుడమిని దైత్యనిర్మూల మొనర్తు"
అని బాహువుల నెత్తి, ఆ రఘువీరుఁ

డుగ్రప్రతిజ్ఞఁ దా నొనరించెఁ; బిదప
వరుసగా సర్వతాపసజనాశ్రమము-
లవలోకనముఁజేసి, యా మునీశ్వరుల
నందఱి నానంద మొందఁగాఁ జేసె.

సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణాశ్రమమునకుఁ
జేరుట

అలయగ స్త్యమహర్షి కతులితజ్ఞాని
పరమభ క్తుం డయి భాసిలు నొక్క-
శిష్యవతంసుండు చెలువొందుచుండెఁ.
అతఁడు సుతీక్ష్ణమహర్షి నాఁబరగు;
త్రికరణపూర్వకశ్రీరామభ క్తుఁ
డా సుతీక్ష్ణుండు స్వప్నావస్థనేని
రామాఽన్యదేవతార క్తుండు గాడు.
రామాగమనవా ర్త శ్రవణరంధ్రముల
సోకెనో? లేదో? ఆ శుద్ధభ క్తుండు
రామసందర్శనలాలసుఁ డగుచు-
దిగ్గునలేచి యుద్వేగచి త్తమునఁ
బరువిడె నాశ్రమద్వారంబుకడకు-
భావించుకొనుచు ఈ పగిది స్వాంతమున:
"దైవమా! ఆ రామదేవుఁ, డా దీన
బాంధవుం, డౌర! నావంటిమూఢునకు
సాక్షాత్కరించుట జరుగునా? నన్ను
శ్రీరామలక్ష్మణుల్ స్వీయపాదాబ్జ
కింకరుఁగాఁగొని కృపఁజూడఁగలరె?
అంత మహాభాగ్యమందఁగా నాకు
గాఢవిశ్వాసంబు కలదన్న- లేదు;
భ క్తివిర క్తులా? పరికింప లేవు;
జ్ఞానమా? శూన్యము; సజ్జనసంగ-
మంతకన్న నెఱుంగ; అలయోగయాగ
జపతపశ్చర్యలఁ జక్కఁగా నెఱుఁగ;
పోనిమ్మ్ము, ప్రభుపాదపుండరీకముల
దృఢమైన యనురాగమేని లేదయ్యె.
ఆ కరుణానిధి ఆడిన ఒక్క-
వాక్యమే, నమ్మితి భావమ్ములోన;
'అలయనన్యశరణ్యులై నన్ను నమ్మి
యున్నవారలను నే నుద్ధరించెదను'-
అను మహావాక్యమే ఆధార మగుచు
భవవిమోచనరామభద్రముఖాబ్జ
దర్శనశ్రీ నొంది ధన్యతఁ గాంతు
నని ఆశగూర్చె మదంతరంగమున."-
అని ఎంచు చా మౌని ఆ మహాజ్ఞాని
నిర్భరప్రేమవార్ధిమగ్నుఁ డయ్యె.
అతని మహాదశ నభివచియింప
వాక్కులు చాలవు పార్వతీదేవి!
పరవశుఁడైన ఆ పరమర్షి కపుడు
దిశలు కాన్పించవు, తెఱ వగుపడదు,-
బద్ధుఁడో- భ క్తుఁడో- భావంబులోనఁ
దా నెవ్వఁడోకూడ- తా విస్మరించె.
పిచ్చివాఁ డట్టుల వెనుకకుఁ బోవు,
మది ముందుకుఱుకు నా మార్గంబునందె;
ఒకసారి తాండవం బొనరించుఁ, బాడు.
అవిరళప్రేమభక్త్యావేశమందు,
మగ్నుఁడై యట్లున్న మౌనివరేణ్యుఁ
గనుచుండెఁ జెట్టుచాటున రాఘవుండు.
అట్లు వీక్షించియు, నా రఘువీరుఁ
డా మునివల్లభు నతిశయప్రీతి
కలరి, యాతని హృదయాంతరాళమున
భవహరమౌ తన భవ్యరూపమును
బ్రకటించె; అప్పు డా పరమర్షివరుఁడు
చతికిలఁబడియు, నిస్తబ్ధుఁడై పోయె-
తనువెల్ల రోమాంచితంబయి, పనస
పండువిధంబున భాసిలుచుండ.
అంత నా రఘునాథుఁ డమ్మునికడకు

చనుదెంచి, కనుఁగొని తన భ క్తు దశను,
స్వాంతమందున మహాసంతోష మొందె.
అమ్మునిన్మేలొక్కల్ప నా రాముఁ డంతఁ
బలుప్రయత్నంబుల సలిపెను; కాని
ముని లేవఁ డయ్యెను ఘనతరధ్యాన
జనితమహానందసమ్మగ్నుఁ డగుట.
అప్పుడు శ్రీరాముఁ డా మునీశ్వరుని
హృదయమందలి స్వీయనృపరూప మణఁచి
తన చతుర్భుజరూపమును బ్రకటించె;
తత్క్షణ మా ముని తనఫణామణిని
పోఁగొట్టికొనినట్టి భుజగమువోలె
నాకులమందు, చత్యాక్రత లేచె;
కాని, ప్రత్యక్షముగా కండ్లయెదుట
నిల్చున్న శ్రీరాము నీరదశ్యాము
జానకీలక్ష్మణసహితాభిరాము
దర్శించి, ఆ మహాధన్యమహర్షి
మహితానురాగనిమగ్నుఁడై, వ్రాలె
శ్రీరామపాదరాజీవంబులందు.
అంత నమ్మునిని, మహాబాహుయుగళిఁ
బైకి లేవఁగ నెత్తి, పరమానురక్తిఁ
గౌఁగిటఁ జేర్చెను గౌసలేయుండు.
కనకతమాలవృక్షముల చందమున
మునిపతి, రఘుపతి, పొలుపొంది రపుడు.
ఆ సుతీక్ష్ణమునీంద్రుఁ డా రామచంద్ర
ముఖసరోజమును ప్రమగ్ధుఁడై కనుచు
స్తబ్ధుఁడై నిలిచెఁ జిత్తరువుచందమున.
అంత నెశ్టట్లులో అంతరంగమున
ధృతిఁ గూర్చుకొని యా ఋషీశుండు, రామ
నరనాథమణికి పునఃపునఃప్రణతు
లర్పించి తోడ్తెచ్చి యాశ్రమంబునకుఁ
బలుపలువిధముల భక్తిఁ బూజించి
సత్కార మొనరించె సంయమివర్య!

అటుపయి అమ్మునిని అనియె నీ రీతి:
"వినుము నా ప్రార్థన విశ్వాధినాథ!
నిన్నెట్లు నుతియింపనేర్తు నోరామ!
మిహిరుని ముందట మిణుగురు పుర్వ్వా
వలె- నీ మహాప్రభావంబు చెంగటను
స్వల్ప మస్మద్బుద్ధి భాసింపఁగలదె?

సుతీక్ష్ణకృత శ్రీరామ స్తవము
గే య ము లు

శ్యామతామరసదామశరీరా!
జటామకుటధర! ధృతమునిచీరా!
పాణిచాపశర! కటితూణీరా!
మ్రొక్కెద నీకిదె శ్రీరఘువీరా!

మోహవిపినచయదహనకృశానూ!
సాధుసరోరుహకాననభానూ!
దైత్యమదేభమహామృగరాజా!
కావుము భవభుజగాండజరాజా!

అరుణనయనరాజీవ! సువేషా!
సీతానయనచకోరనిశేశా!
హరహృన్మానసరాజమరాళా!
మ్రొక్కెద వక్షోబాహువిశాలా!.

సంశయసర్పగ్రసనఖగేంద్రా!
కర్కశతర్కనగేంద్రసురేంద్రా!
భయభంజన! రంజితసురయూథా!
కావుము కృపాళు! సీతానాథా!

నిర్గుణసగుణవిషమసమరూపా!
సర్వాతీత! అనంత! అనూపా!
అమల! అఖిల! అనవద్య! అపారా!
మ్రొక్కెద రామా! హృతభూభారా!

భక్తజనేప్సితకల్పారామా!
అరిషడ్వర్గమదారివిరామా!
పరమశీల! భవసాగర సేతూ!
కావు మీశ! దినకరకులకేతూ!.

అతులితభుజవిక్రమ! బలధామా!
కలిమలభంజన! పావననామా!
ధర్మరక్షకా! సుగుణగ్రామా!
రక్షింపుము శ్రీరఘుకులరామా!.

నిష్కామా! విష్ణూ! అవినాశీ!
సకలహృదంతరనిత్యనివాసీ!
సతీసోదరులతోడ ఖరారీ!
నామతి నిలువుమురా! వనచారీ!.

సగుణుఁడ వగుణుఁడ వని నిను స్వామీ!
జ్ఞాను లెఱుంగుదు రంతర్యామీ!
ఓ కోసలపతి! పంకజనేత్రా!
నిలు మిటు నా హృది దశరథపుత్రా!

రఘుపతి! మత్పతి! నేఁగింకరుఁడన్,-
అను అభిమానము, కలయండైనన్
వదలక నా మది వెల్గును గాకన్!
రాముఁడు ననుఁ గరుణించునుగాకన్!.

అను, మునివాక్కుల విని రాఘవుండు
పరమహర్షముఁబొంది మఱి యొకసారి
గుండెకు హత్తించుకొని యా మునీంద్రు,
"అమితప్రసన్నుండనైతి మునీశ!
ఏ వరం బడిగిన నేనిచ్చువాఁడ;
అడుగుము నీ యిష్టమైన వరంబు."
అనిపల్క- నమ్మహాముని యిట్లు బల్కె-:
"ఎట్టివరంబేని నేఁగోరి యెఱుఁగ
ఎది కోరవచ్చునో? యెది కోరఁదగదో?
తెలియదు రాఘవా! దేవాదిదేవ!
ఓ సదాసుఖదాత! ఓ రఘునేత!
నీ కేది యిష్టమో నాకది యిమ్ము."-
అన విని శ్రీరాముఁ డనియె నీ రీతి:
"సకలగుణజ్ఞానసదనుండ వౌట
అవిరళభక్తియు నమలవైరాగ్య
విజ్ఞానములఁబొంది వెలుఁగొందఁ గలవు-
ఓ సుతీక్ష్ణమునీంద్ర! ఓ తపస్సాంద్ర!"
అనువాక్యముల విని యమ్మునిమఱలఁ
బ్రార్థించె నీ రీతి భక్తి వెలుంగ:
"ప్రభుదత్తవరములఁ బడసితిఁ; గాని
యేఁ గోరు వర మొక్క టేమువేఁడెదను:
శరశరాసనములు కరములఁ దాల్చి,
జానకీలక్ష్మణసహితుండ వగుచు,
నిత్యనిష్కామ్యమై నెగడు నా హృదయ
గగనంబునందు రాకాచంద్రబింబ
మగుచు భాసింపు మయ్యా! రామచంద్ర!"
అన రాఘవుండు, "తథాస్తు"ని పలికి,
ఆనందమున అగస్త్యాశ్రమంబునకుఁ
బయలుదేరెను, భరద్వాజమునీంద్ర!
అపుడు సుతీక్ష్ణమహర్షి యిట్లనియె-
"నాథ! మద్గురుదర్శనముఁ జేసికొనియుఁ
జాలకాలం బయ్యె; సన్నిధిన్ వదలి
వచ్చినదాది నే వసియింతు నిచట;
మీ కవరోధము లేకున్న దేవ!
కలసి మీతోవచ్చి కనులపండువుగ
గురుపాదు దర్శించు కొనెద శ్రీరామ!"

సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణునితోఁగలసి
అగస్త్యాశ్రమమునకుఁ బోవుట

అనవిని కారుణ్యావనధి, మునీశు
చతురత్వ మరసి లక్ష్మణుపైపుఁ జూచె;
ఉభయులు చిఱునగ వొలుక, మునీంద్రు

వెంటఁ గైకొని బయల్ వెడలి రంతటను.
మార్గంబునందు రామప్రభువరుఁడు
పరమోన్నతంబగు భక్తినిగూర్చి
భాషించె హృదయముల్ పరవశమంద.
వా రట్లు కుంభసంభవు నాశ్రమంబుఁ
జేరుకొన్నంతనే, శీఘ్రుంబె పోయి
ఆ సుతీక్ష్ణుండు నిజాచార్య్య ప్రేమాల
సాష్టాంగపడి లేచి స్వామీ! మహాత్మ!
దశరథ రాజేంద్రు తనయు లిద్దఱును
నిన్ను దర్శింపఁగా నేఁడిట కిదియె
దయచేసినారు– సీతా దేవికూడ
వేంచేసియున్నది విభునితోఁగూడి.
ఎవ్వని శుభనామ మెప్పుడు నీవు
స్మరియించుచుందు, వా స్వామియే వచ్చె
భవదాశ్రమమునకుఁ, బావనపాద!"
అను వాక్యముల వినినంత నగస్త్య
మౌని దిగ్గున లేచి, మహితానురక్తిఁ
బరుఁగిడె నాశ్రమద్వారంబుకడకు.
రఘురామచంద్రపరబ్రహ్మమూర్తి
కనఁబడినంత నగస్త్యర్షికనులు
పరవశానంద బాష్పములతో నిండె.
రామలక్ష్మణు లంత రాజితభక్తి
వ్రాలిరి మునిపదాబ్జంబులపైన;
ఆ యగస్త్యర్షి మహాప్రేమపొంగఁ
గైకొని వారల గాఢగాఢముగ
గుండెకు హత్తించుకొనెఁ బలుసార్లు.
ఆ మహాజ్ఞాని మహాదర మొప్ప
వారలఁ గుశల సంప్రశ్నముల్ జేసి,
కొనితెచ్చె లోనికిఁ గూర్మి వెలుంగ,
భవ్యాసనము లిచ్చి, పలువిధానముల
సముచితపూజలు సలిపె, "నావంటి
ధన్యుఁడు లేడహో! ధరణిలో"– ననుచు.

అటఁ జేరినట్టి మహర్షి లందఱును
ఆనందకందమా నా రామచంద్రుఁ
దర్శించి ఆనందతన్మయులైరి.
అట, మునిమండలమందుఁ గూర్చుండె
నెదురుగా శ్రీరాముఁ డెల్లవారలకు.
అలశరచ్చంద్రబింబాలోకనైక
లక్ష్యంబు లగు చకోరములచందమున
రఘురామముఖచంద్రలక్ష్యచక్షుస్సు
లగు మహామునిజను లలరారుచుండ్రి.
అప్పుడు శ్రీరాముఁ డడిగె నీ రీతి,
కుంభసంభవమునికుంజరుఁ గాంచి:
"ఓ నాథ! ఓ మహర్ష్యత్తమా! దేవ!
నే దాచఁదగినది నీకడ లేదు.
ఏను వచ్చిన హేతు వెఱుఁగుదు వీవు–
కాన, మిక్కిలి చెప్పఁగాఁ బనిలేదు.
తాత! వచింపుము తాపసద్రోహు
లగు దానవులఁ గూల్చుదగు మార్గములను."–
అను ప్రభువాక్కుల విని యగస్త్యర్షి
నవ్వి యిట్లనియె, "ఓ నాథ! శ్రీరామ!
ఇట్లు ప్రశ్నించెద వేల నన్నీవు?
భవదీయభక్తిప్రభావంబుచేత
నీ ప్రభావ మెకింత నే గ్రహించితిని–
ఓ అఘారీ! హరీ! ఓ చక్రి! శౌరి!
పెద్ద ఉదుంబరవృక్షుంబుఁబోలు
నీ మహామాయ, ఓ నీరజనాభ!
గురుతరబ్రహ్మాండకోటు లద్దాని
రమణీయఫలములై రాజిలుచుండు.
ఆ ఫలగర్భంబులందలి క్రిములు
సకలచరాచరజంతుజాలములు;
ఆ జీవు లెఱుఁగ వన్యప్రదేశములు.
కఠినకరాళ మా కాలసర్పంబు,
భక్షించు నా మహాఫలముల నెల్ల.

అట్టికాలముఁగూడ అహ! నీకు వణకు.
కాలకాలుఁడ వీవుగాదె? శ్రీరామ!
దేవదేవుఁడ వీవుగావె? శ్రీరామ!
అట్టి నీ వొకమర్త్య నట్లడిగెదవు-
హితమార్గములఁ దెల్పువిూ!- యని నన్ను.
ఓ కృపాగుణసాంద్ర! ఓ రామచంద్ర!
నిన్నీవరం బీయ-నే వేఁడికొందు:
సీతాసుమిత్రజోపేతుండ వగుచు
నా హృత్సరోజంబున న్నిల్వ విూశ!
అవిరళభక్తియు, అమలవిరక్తి,
సజ్జనసంగతి శాశ్వతస్వీయ
చరణసరోరుహసదమలప్రీతి,
నాకుఁ గల్గునుగాక- నాథ! నీ కరుణ.
కనఁ బరబ్రహ్మ, మఖండ, మనంత,
మనుభవగమ్యమై అలరారుచుండు,-
అది మహాత్ములకె సంవిదిత మటంచు-
తన్మహానిర్గుణతత్త్వంబుఁ గంటి.
అయినను నీ సగుణాకృతియందె
నా చిత్తమెల్ల లగ్నం బయ్యె, రామ!
నీవు నీ దాసుల నిరుపమకృపను
గారవింతువు; దానఁ గాకుత్స్థతిలక!
హితము వచింప నన్నీవు కోరితివి.
పరమమనోహరపావనస్థలము
దండకారణ్యమధ్యంబునఁ గలదు-
పంచవటీనామభాసుర మొండు.
రామ! తద్దండకారణ్యంబునెల్లఁ
ద్వత్పదస్పర్శచే భవ్యం బొనర్చి
చండశుక్రాచార్యశాపవిముక్త
మొనరింపు మోపురుషోత్తమా! రామ!
ఆ పంచవటి కేగ అందు వసించి
ఎల్లమానులపైనఁ గృపఁజూప వోయి!"
అనవిని శ్రీరాముఁ డా యగస్త్యర్షి
ఆజ్ఞఁ గైకొనియుఁ బ్రయాణమై వేగ
పంచవటిన్ జేరె వనములఁ గడచి.
అట గృధ్రవల్లభుఁ డౌ జటాయువును
రాముఁడుకలసె- శ్రీరామున కతని
కమితమైత్రి ఘటిల్లె- ఆ వనమందు
దివ్యగోదావరీతీరమందున్న
పంచవటీనామపావనస్థలిని
ఒక పర్ణశాల సొంపొప్పనేర్పరచి
శ్రీరామవిభుఁడు వసింపఁగా సాఁగె-
జానకీలక్ష్మణసంయుతుం డగుచు-
ఓ భరద్వాజబుుష్యుత్తమా! వినుము!

శ్రీరామచరితవాచస్పతి

ఆరణ్యకాండము

తృతీయవిశ్రామము

సాలగ్రామనివాసా!
జ్వాలామాలాభిరామ! జగదాధారా!
బాలప్రహ్లాదావన
శీలా! శ్రీమట్టపల్లిశ్రీనరసింహా!.

శ్రీరామగీత

శ్రీరామచంద్రుఁడు సీతావిభుండు
దండకారణ్యమధ్యంబున వెలుఁగు
పంచవటిన్ బ్రవేశించిన నాఁటి
నుండి మునుల్ సుఖముండి రుల్లముల-
సర్వభయంబుల సంత్యజియించి.
గిరిసరోవరసరిద్వరవనచయము
కళకళలాడుచుఁ గడుశోభ లీనె-
దినదినాధికముగఁ దేజరిల్లుచును.
ఖగమృగగణము సుఖంబు నిండార
విహరింపఁగాసాఁగె స్వేచ్ఛ దీపింప.
మధురగుంజన్మదమధుపమండలము-
లతిమనోహరములై యలరారఁదొడఁగె.
రఘువీరనిలయమై రాజిలుచున్న
ఆ మహావనశోభ నభినచియింప-
నాదిశేషునకేని అలవిగా దనఘ!
అట్లుండ- నొకదినం బా రామచంద్రుఁ
డొగి సుఖాసీనుఁడై యుండె- లక్ష్మణుఁడు
పరమవినిర్మలభావంబుతోడఁ
గరములు మోడ్చి యాకరణిఁ బ్రార్థించె:
"సురనరముని చరాచరజగన్నాథ!
నా స్వామి వౌట విన్నప మొండు సేతు:
వదలి సర్వమ్ము నీ పదరజస్సేవ
నొనరించు తెఱఁ గెట్లు లోరామదేవ?
పరఁగ జ్ఞానముఁగూర్చి ప్రవచింపు మీశ!
వైరాగ్యమునుగూర్చి భాషింపు మనఘ!
మాయనుగూర్చిన మర్మంబుకూడ
బోధింపుమా గురూ! బోధస్వరూప!
నీ కృపామృతవృష్టి కాకరంబైన
భక్తిని గూర్చియుఁ బలుకుమా నాథ!
జీవేశ్వరులమధ్యఁ జెలఁగు భేదంబుఁ
గూర్చియుం దెలుపుమా, కోసలాధీశ!
త్వత్పాదరతి నొంది భయశోకమోహ
ముక్తుండ నౌదుఁ, బ్రభూ! రఘురామ!"
అన విని శ్రీరాముఁ డతిప్రీతితోడ
భాషించె నిట్లు దివ్యజ్ఞాన మెసఁగ:
"ఓ లక్ష్మణా! వినుమోయి! ఏకాగ్ర
చిత్తుండ వగుచు- వచింతుఁ గ్లుప్తముగ;
'నేను నాయది'- 'నీవు నీయది'- యనెడి
దేహభావమె మాయ-దీనికి సర్వ
జీవకోటియును వశీభూతమోయి!
ఇంద్రియంబులచేత నీక్షింపఁబడెడి-
చిత్తంబుచేతను జింతింపఁబడెడి-

దెల్లఁను మాయయే- ఎఱుఁగు మా మాయ
రెండువిధంబులనుండుఁ గుమార!-
ఒకటి 'అవిద్య', వేఱొక్కఁండు విద్య;
ఆ యవిద్యామాయ యతిదుఃఖరూప-
మది పరాభవకూపమందునఁ గూల్చు
జీవుని- ఓ లక్ష్మణా! వినుమోయి!
ఇంక విద్యామాయ- సృష్టికారణము,
త్రిగుణాత్మకము, ప్రభుప్రేరిత మెపుడు;
ఈ మాయ, పరతంత్ర మీశ్వరాధీన-
మిది పరమేశు సన్నిధిమాత్రమునఁ నె
బ్రహ్మాండరచనావిలాసంబు నెఱపు.
అల అహంభావశూన్యం బయినట్టి-
సర్వత్రబ్రహ్మమున్ సమముగాఁ జూచు
నట్టి- మహాదృష్టి యగు జ్ఞాన మెన్న.
అఖలమా సిద్ధుల, నలత్రిగుణములఁ
దృణముచందమునఁ బరిత్యజియించి
నట్టివాఁడే, సుమా- అసలు విరాగి.
మాయ యేదియొ? మఱి మాధవుఁ డెవరొ?
మఱియుఁ దా నెవఁరొ?- యీ మర్మంబెఱుంగఁ
జాలక దురపిల్లుజడుఁడు- జీవుండు;
బంధమోక్షప్రదస్వాతంత్ర్యమూర్తి,
అఖిలుండు, మాయానియంత- శివుండు.
అలధర్మకర్మసమాచరణమున
వైరాగ్య ముదయించు భావంబునందు;
యోగంబుచేత జ్ఞానోదయం బగును;
జ్ఞానంబుచేత మోక్షంబు లభించు-
నని వేదములు నిర్వచన మొనరించు.
అనుజ! నా హృదయంబు నతిసులభముగఁ
గఱఁగించునదిసుమా ఘనభక్తిపథము;
భక్తుల కియ్యది పరమప్రియంబు.
ఈ భక్తిదర్శన మెన్న స్వతంత్ర-
మన్యావలంబన మైనది కాదు.
జ్ఞానవిజ్ఞానముల్ సహితము, దీన
నాధారపడియున్న వనఘ! సౌమిత్రి!
పరమానురాగరూపం బగుభక్తి-
అనుపమానమ్మ్ర మహానందమూల,-
మది మహాపురుషకృపైకలభ్యంబు!
ప్రాణికోటులు సులభంబుగా నన్నుఁ
బడయఁగాఁగల భక్తిపథము సిద్ధింపఁ
గొన్ని సాధనల వాక్రిచ్చెద నిపుడు:
*బ్రాహ్మణపాదనీరజములయందుఁ
బరమభక్తి వెలుంగవలయు మున్మొందు.
శ్రుత్యుక్తవిధము విశ్రుతముగా నవలఁ
దమ స్వధర్మంబులఁ, దగు శ్రద్ధతోడ
నాచరింపఁగవలె- నందుచేఁ గలుగు
విషయవిరక్తి, మత్ప్రేమానురక్తి.
♦శ్రవణాదినవవిధరాజితభక్తి,
యంతదృఢంబగు. ఆపై మదీయ
మహితలీలారతి మతివృద్ధిఁ గాంచు.
మఱియు మహాత్ముల చరణాంబుజముల
సిరతరప్రీతితో సేవింపవలయు.
త్రికరణంబుల నన్ను దృఢనియమమున
భజియింపవలయును బరమసంప్రీతి.
తల్లిఁగాఁ, దండ్రిఁగాఁ, దన దేశికునిఁగ,
బాంధవజనునిఁగాఁ బతిగ, దేవునిఁగ,
సర్వస్వముగ నెంచి స్వాత్మలో నన్ను
సేవింపవలయును స్థిరచిత్తమొప్ప-
భక్తి సిద్ధించు నీ పగిదిఁగావింప.

---

* బ్రాహ్మణులు = బ్రహ్మనిష్ఠయే వృత్తిగాఁగలవారు.

♦ 1 శ్రవణము, 2 కీర్తనము, 3 స్మరణము, 4 పాదసేవనము, 5 అర్చనము, 6 వందనము, 7 దాస్యము, 8 సఖ్యము, 9 ఆత్మనివేదనము.

ఆ భక్తుఁ డస్మద్గుణాళిఁ గీర్తింపఁ
బులకాంకురంబులు పొడము దేహమున;
గద్గదనాదంబు కలుగుఁ గంఠమున;
బాష్పప్రవాహముల్ పాఱునేత్రముల;-
అతఁడరిషడ్వర్గహారియై వెలయు-
అట్టి సద్భక్తున కనవరతంబు
నేను వశ్యుండనై నిలుతుఁ గుమార!
త్రికరణమ్ముల నన్ను దృఢముగా నమ్మి
అల యనన్యశరణ్యులై ఎవ్వ రాత్మ
నిష్కామ్యభక్తితో నిరతంబు నన్ను
భజియింతు వారి హృత్పద్మమందేను
సర్వదా వసియింతు, సౌమిత్రి! వింటె."
అట్లు రాఘవుఁడు దయన్ బల్కినట్టి
భక్తి యోగము విని, పరమహర్షమున
లక్ష్మణస్వామి శ్రీరామపాదాబ్జ
ముల కతిభక్తితో మ్రొక్కె- మునీంద్ర!
ఈ విధానంబున నేగఁ దొడంగె
దినములు- వై రాగ్యదివ్యవిజ్ఞాన
సౌజన్యనీతిప్రసంగాలతోడ-
జానకీరామలక్ష్మణుల కా వనిని.

శూర్పణఖరామలక్ష్మణులవద్దకు వచ్చుట

లంకాధిపతియైన రావణాసురున
కొక సహోదరికల దుగ్రాహితుల్య
అమితదుర్గర్వరా లా దైత్యవనిత
శూర్పణఖాభిధ; చూడఁగా దాని
పేరు సార్థకమాయి విహగాధినాథ!
ఒక్కనాఁ డది యెందుకో పంచవటికి
వచ్చిన; దద్దానిపాపిష్ఠదృష్టి-
పడె రామలక్ష్మణస్వాములపైన.
ఆ రాజపుత్రుల నరసి నంతటనె
అది కామవైకల్య మందె స్వాంతమున.

తండ్రియే యైనను, దనయుఁ డేయైన,
సోదరుఁ డేయైన-సుందరుఁ డగుచో?
అబలలు విభ్రాంతలై ద్రవించెదరు-
దినమణికడ సూర్యమణుల చందమున.
ఆ శూర్పణఖమనోహారరూప మూని,
చేరి రాముని చెంతఁ జిఱునగ వొలుకఁ,
బలికె నిట్టుల యొడల్ తెలియని దగుచు:
"నినుఁబోలు యువకుఁడు ననుఁబోలు యువతి
విశ్వమం దెచ్చట వెదకినఁ లేరు.
బ్రహ్మ విచారించి, పరఁగ నిద్దఱికి
జతఁ గూర్చి నాఁడోయి! జగతిలో నిట్లు.
తగినవరుం డెటఁ దారసిల్లకను
వెదకి త్రిలోకముల్ వేసారి, నేటి
వఱకుఁ గన్యగ నుంటి- భాగ్యవశాన
ఈ నిను గాంచఁగా యించుక నాకు
హృదయము శాంతించె హృదయాధినాథ!"
అనవిని శ్రీరాముఁ డవనిజవైపు
వాల్గన్నులనుజూచి పలికె- "నా తమ్ముఁ
డిట బ్రహ్మచారియై యిపు డుండె"-ననుచు.
అంత నయ్యది సుమిత్రాత్మజుఁ జేర
దానిని శత్రుసోదరిగ గుర్తించి
లక్ష్మణస్వామి శ్రీరాము నీక్షించి,
మృదువుగా దానితో నిట్లు వచించె:
"సుందరీ! నేను దాసుఁడను రాముసకు-
పరతంత్రుఁడను- నన్ను వాంఛించునెడల
నీవు సుఖించున దేమి?- శ్రీవారు
సర్వసమర్థులు; సాకేతవిభులు;
సర్వస్వతంత్రు లా స్వామివా రేది
సలిపిన నయ్యది సముచితం బగును.
చూడఁగా భృత్యుఁడు సుఖముఁ గోరుటయు,
అరయ భిక్షుకుఁడు మర్యాద గోరుటయు,
కనఁగ దుర్వ్యసనుండు ధనముఁ గోరుటయు,

పరికింప వ్యభిచారి పరముఁ గోరుటయు,
తిలకింప లోభి సత్కీర్తిఁ గోరుటయు,
కాంచ, నహంకారకలితమానసుఁడు
పురుషార్థములనెల్లఁ బొందగోరుటయు,
గగనతలంబును గట్టిగాఁ బీఁకి
క్షీరముల్ గొన నాశఁ జేయుటేగాదె?"
అన నది మఱలి, రామునికడ కేగ-
మగిడి రాముండు లక్ష్మణుకడ కంపె-
అప్పుడు లక్ష్మణుం డద్దానిఁ జూచి,
"సిగ్గులేని జనుండె ఛీ! నిన్నుఁ గోరు"-
నన, నది రొసరొస లాడుచు రాము
సన్నిధికేగి, ప్రచండమై నట్టి
తన రాక్షసీరూపమును బ్రకటించె.
అప్పుడు రఘుపతి, యవనిజ మిగుల
భీతిల్లు టరసియుఁ, బినతమ్ముఁ జూచి
సైగఁ గావించెను సంయమివర్య!

లక్ష్మణుఁడు శూర్పణఖముక్కుచెవులు
గోయుట

అంతట లక్ష్మణుఁ డతిలాఘవమునఁ
గోసి అద్దాని ముక్కున్ చెవుల్ రెండు,
పొ మ్మని పంపెశౌర్యమ్ము దీపింప-
రావణు రణమొనర్వ బిల్చినటుల.
ముక్కు చెవుల్ రెండు చెక్కుఁగాఁబడిన
ఆ చుప్పనాతి భయంకరరూపు-
నైరికథారాద్రినైవడిఁ దోచె.
అంత నా రాక్షసి అతిరయమొప్ప
ఖరదూషణాదుల కడ కేగుదెంచెఁ
గొల్లున నేడ్చుచు, "క్ష్మోణిలో మీదు
బలపౌరుషములు కాల్పంగనా? దేని
కో యన్నలార! ఓహో! దైత్యులార!"-
అని ప్రలాపించుచు నతిరోష మొప్ప.

అంత వా రడుగ వృత్తాంత మంతయును
వినిపించె నయ్యది విశదమా రీతి.

ఖరదూషణాదులు యుద్ధసన్నద్ధులై రాముని
కడకు వచ్చుట

అప్పు డా యాతుధానాధినాయకులు
సేనల సమకూర్చి రా నిమేషమున.
ఆ యసంఖ్యాకనానాకారదైత్య
గణయూథములు భయంకరమహోగ్ర
బహువిధాయుధముల వహియించి కదలె
నంత నానావాహనావళిపైన-
అలపక్షయుక్తకజ్జలగిరు లట్లు.
తత్సైన్యమునకు ముందటిభాగమందు
నాసికాకర్ణహీనముగ నున్నట్టి
ఆ చుప్పనాతి బయల్ దేరె నశుభ
సూచకంబుగ తార్క్ష్య! సూరివతంస!
అతిభయంకరముతో నపశకునములు
తోఁచె నా దైత్యసందోహంబునందు;
గణియింప కవ్వానిఁ గదలి రవ్వార
లలమృత్యువివశాత్ములై ఖగరాజ!
గర్జించి, తర్జించి, గంతులు వేసి-
రా దైత్యభటులు మదాతిరేకమున.
అట్టి సైన్యముఁగాంచి అసురనాయకులు,
పట్టలేనంతసంబర మొంది- రొకఁడు
వచియించె భీకరస్వనము వెలుంగ-
"అసువులతోఁబట్టి ఆ సహోదరుల
బంధించియున్, జిత్రవధను గావించి
వారి చెంగటఁగల వనితఁదెం" డనుచు.
తద్దైత్యసైన్యపదవ్రజోద్ధూత
ఘనధూళికణపూర్ణ గగనంబుఁ గాంచి
రాముఁడు లక్ష్మణస్వామిని బిలిచి,
"జనకజ న్గొని నీవు సత్వర మొక్క-

కొండగుహన్ జేరి యుండు మచ్చోట;
అదె వచ్చుచుండె భయంకరమైన
దైత్యసైన్యం బొండు తరలి యిచ్చటికి;
నీ జాగరూకత నీ వుండు మచట."
అని పల్క సౌమిత్రి విని ప్రభు నాజ్ఞ
సీతను గైకొని, చేరువ నున్న
ఒక కొండగుహఁ జేరె- యుగ్రచాపంబు
శరములు వెల్గొంద కరకమలముల.
అంత శ్రీరఘువీరుఁ డా వచ్చుచున్న
రాక్షససైన్యంబు వీక్షించి నగుచు
భండనోద్దండకోదండ మెక్కిడియె.
ఆ శ్యామసుందరుఁ డా రామవిభుఁడు
తద్ధగద్ధగితకోదండ మెక్కిడియు
నిజదివ్యపాణిపంకజములతోడ
జడలను శిరమున ముడివేసి కొనెడి
ఆ దృశ్య మొప్పె-మహారమణీయ
మరకతశైలాగ్రమండలమందు
సౌదామనీసహస్రప్రకాశముల
రెండు సర్పము లాడుచుండినపగిది.
కటితటంబున నిషంగమును బంధించి,
దీర్ఘ బాహువుల నుద్దీపింపుచుండ
వరధనుర్బాణముల్,- పరికించె నంత
రఘువీరుఁ డఖిలశాత్రవనికాయమును-
మృగరాజు గజరాజ బృందంబునట్లు.
"పట్టుఁ డాతని పోయిపట్టు" డటంచు
నఱచు చొక్కు-మ్మడి నతిభీషణముగ
ఆ దైత్యయోధమహాయూథ మంత
పర్ణశాలాప్రాంతభాగంబుఁ జేర
నుటికె నుదగ్రమదోద్ధతం బగుచు-

ఉదయభానునిగాంచియున్ సమీపించు
*మందేహదానవ మండలివోలె,
అట్లు ముట్టడిఁ జేసినట్టి ఆ దైత్య
లా రామచంద్రుని నరసి నంతటనె
నివ్వెరపోవుచు నిలిచి యెల్లరును.
వారెల్ల వివశులై బాణముల్ వదలఁ
జాలకపోయి; రా సమయంబునందు
ఖరదూషణులు మంత్రిగణములఁ బిలిచి,
పలికి రీ రీతిగా- "భళిభళీ! వహ్వా!
మానవభూషణుం డా నృపసుతుఁడు!
నాగసురాసురనరమునీశ్వరుల
నెందఱినో లోకమందుఁ జూచితిమి;
ఎందఱినో పట్టి ప్రమందించియుంటి;
మీ జీవితంబునం దింతటి దనుక
నింతసుందర రూప మెటఁజూచియెఱుఁగ-
మో సహోదరులార! ఓ మిత్రులార!
ఎంచఁగా నిజమున కీ నృపసుతుఁడు
మన సోదరిని యవమానం బొనర్చె-
ఐన నీతండు వధార్హుండు కాడు.
పురుషులం దీతనిఁ బోలిన యట్టి
పరమసుందరమూర్తి పరికింప లేడు;
కాన ఈతనిఁ జంపఁగా మతి యెప్ప
దందుచే మీ రేఁగి యాతని కడకు-
'శరణుఁగోరియు మమ్ము సత్వర మెసఁగ,
ఎచ్చటదాచి తా యింతినిదెచ్చి
అర్పించుమోయి! మీ యన్నదమ్ములను
చంపక విడుతుము సదయుల మగుచు;
ప్రాణముల్ దక్కఁగాఁ బాటి మీరింక
ఇండ్లకుఁ జనియు సుఖింపఁగా వచ్చు'-

---

* మందేహనామకు లగు రాక్షసు లాయుధపాణులై ప్రతిదిన ముదయకాలమున సూర్యభగవానుని చుట్టు ముట్టి డింతు రనియు ప్రాతఃకాలసంధ్యావందనమున విప్రులు విడుచు నర్ఘ్యప్రదానములచే వారు పారద్రోలబడుచుందు రనియు శాస్త్రములు వచింపుచున్నవి.

అని మాదు సం దేశమును వినిపించి
ప్రత్యు త్తరము తెండు! పరగఁ బోపొండు!"
అంత నా ద్వై త్యసంఘామాత్యు లేఁగి
వినిపింప సం దేశమును, రాఘవుండు
విని, మందహాసంబు వెలయ ని ట్లనియె:
"మేము క్షత్రియులము మృగయావినోద
మెప్పుడు మా కతిహిత మయియుండు.
ఈ వనగర్భమం దేముంటయెల్ల
మివువంటి ఘాతుకమృగముల నెల్లఁ
బరిమార్చుటకెసుమా పరిపంథులార!
శత్రు వెంతటి బలశాలియే యైన
కాలుఁడే వచ్చినఁ గాని భీతిలము.
మనుజుల మని మమ్ము మతి నెంచవలదు-
దనుజులపాలిటి దండపాణులము.
బాలకు లని మీరు భావింపవలదు.-
దనుజమారకులము, మునిపాకులము.
యుద్ధంబునకు శ క్తి యుండని యెడల
ఇండ్లకుఁ బొండు; మేమెప్పుడుకూడ
సంగ్రామవిముఖులఁ జంపఁగా బోము.
మీరు యుద్ధముఁ జేయఁజేరిన యెడల-
కపటచాతుర్యవాక్యములు పల్కుటయు,
అరులపైఁ గృపఁజూప నాశించుటయును,
బిరికితనంబుగా గుఱుతుంచుకొనుఁడు."
అను రఘురాము వాక్యంబు లాలించి
మఱలి యే తెంచి యా మంత్రిజనంబు
జరిగినదెల్లఁ దా మెఱిఁగించి రంత.
ఆ ఖరదూషణు లాగ్రహోదగ్ర
దందహితాత్ములై "తత్ క్షణ మింక
ముట్టడింపుఁ డటంచు భూరిరావమున
ఆజ్ఞ నొసంగిరి; ఆ క్షణమందే
రాక్షసభటు లతిరౌద్రంబు మెఱయ
శరచాపతోమరశ క్తిత్రిశూల
కులిశకృపాణాసికుంతల పరిఘ
పరశుముఖ్యాయుధవ్రజములతోడ
ముందుకు దుమికిరి ముట్టడింపఁగను;
సా కేతపతి ధనుష్టంకృతి సలిపె;
ఏతత్కఠోరఘోరాతిఘోరోగ్ర
ఘనతరజ్యానాదమును విని నంత
చెవులు దిమ్మిరవోవ, చెదర గుండియలు
దైత్య లెల్లఱుఁ దెల్విఁ దప్పిరి గరుడ!
పిదప నా రాక్షసబృందంబు లెల్ల
స్మృతినొంది తా మెదిరింపఁగా నున్న
శత్రువసామాన్యజనుఁ డని యెఱిఁగి
సావధానతఁబూని, చండశస్త్రాస్త్ర
ములను వర్షింప రాముపైన; వాని
నా రఘువీరుఁ డుద్యద్విక్రమమున
నులినులిఁ గావించి తిలసమానముగ,
వింటినారిని చెవినంటఁగా లాగి
శరముల విడిచె రాక్షససేనపైన.
వరభయంకర రామబాణంబులంత
బుసఁగొట్టు భీషణభుజగాళివోలె
తాకె నద్దానవతండంబు నెల్ల.
రణవిక్రమావేశ రామకోదండ
ముక్తతచ్ఛితశిలీముఖపరంపరల
దాడికి, దానవుల్ తాళఁగాలేక,
వెన్నిచ్చియును కకావికలయి; రంత
నా ఖరదూషణు లా త్రిశిరుండు
చండకోపంబున సైన్యమున్ గాంచి,
"పవరంబు విడనాడి పాఱినవారు
సర్వులు మాచేతఁ జచ్చుట నిజము"-
అని హెచ్చరించి రత్యంతభీష్మముగ.
ఎట్లైన మనకుఁ జావిఁకఁ దప్ప దనుచు
అంత రాక్షసభటు లాగి పాఱకను
తిరిగి యుద్ధమునకు దిగిరి తీవ్రముగ-

వివిధఘోరాయుధవిసరంబులొగోడ.
అపుడు శాత్రవుల కోపాతిశయంబు
గ్రహియించి శ్రీరఘురామచందు్రండు
శరములఁ సంధించి చాపంబునందు
బహుళనారాచముల్ వదలె నుగ్రముగ-
కుప్పగూలంగ నా ఘోరదానవులు.
ఉరములు శిరములు కరచరణములు
తెగిపడుచుండె ధాత్రీరంగమందు.
మొండెముల్ పడుచుండెఁ గొండలపగిది.
తుత్తుము రగుచుండె దుష్టదానవుల
తనువు లా రామాస్త్రధారలచేత;
కాని యా మాయావులైన దానవులు
మగుడసజీవులై మదము దీపింప
పోరాడుచుండిరి ఘోరఘోరముగ.
ఖండితభుజశిరోగణము లాకాశ
మున విహరింపుచుండెను పయికెగసి.
మొండెముల్ పరుగిడుచుండె భూస్థలిని.
ఖగకంకకాకసృగాలసంఘములు
ఒండొండు పోరాడుచుండెఁ జండముగ;
సంచరింపుచునుండె జంబుకగణము;
రక్తపూరితకపాలముల చేఁబట్టి
విహరింపుచుండెను విచ్చలవిడిగ
సకలభూతప్రేతచయపిశాచములు.
రణహతభటకపాలములఁ దాళముల
పగిది మ్రోగింపుచు వర్తింపుచుండె
భీకరముగ మహాబేతాళగణము;
తత్తాళగతులకుఁ దగ నర్తనంబు
లొనరింపుచుండెను *యోగినీగణము;
రఘువీరఘోరశరప్రతానములఁ
దెప్పలు కుప్పలై తెగిపడుచుండె

ఉరములు శిరములు కరము లాదిగను.
అట్టు లా దానవుల్ హతు లగుచున్న,
మాయావులవుటచే మఱల జీవించి
పోరాడుచుండిరి, ఘోరఘోరముగ
"ఊ! ముట్టడించుఁడీ! ఊ! పట్టుకొనుఁడి"-
అని కేక లిడుచు భయంకరలీల.
క్రిందపిశాచముల్ మ్రుందిన వారి
తనువులఁ గైకొని తాండవమాడ
ఆ కళేబరములయందలి ప్రేవు
లన్ లాగుకొనుచును గ్రద్ద లాకసము
నం దాడుచుండె మహానందలీల-
సంగ్రామనగరవాసం బొనరించు
బాలకుల్ విడు గాలిపటములరీతి.
క్షతగాత్రులైన రాక్షసభటుల్ కొంద
ఱిల మూల్గుచుండిరి ఈ తెఱఁ గరసి
తమ సైన్యదుర్గతిఁ దగ గ్రహియించి
ఖరదూషణాదిరాక్షసముఖ్యు లెల్ల
రాము నెదుర్కొని రో మునిచంద్ర!
కోపఘూర్ణితులౌచు ఘోరరాక్షసులు
వేనకువేల్ విజృంభించి, ఏకముగ
విసరిరి శ్రీరఘువీరునిపైన-
శరశక్తితోమరపరశుకృపాణ
శూలాదిబహుళాయుధాళిఁ; దత్క్షణమె,
ఏతదాయుధములనెల్ల భంజించి
విడిచె శ్రీరాముఁడు విశిఖసంఘముల-
ఒక్కొక్క దైత్యుని యురమున నాట
పదిపది బాణముల్ బహుభీషణముగ.
పక్షులవలె నేలఁబడిరి దానవులు;-
కాని, మాయావులుగాన వారెల్లఁ
దిరిగి జీవించియుఁ దీవ్రత మెఱయ

---

* పార్వతీపరమేశ్వరుల సన్నిధిలో వసించు స్త్రీభటగణమునకే యోగినీగణ మని పేరు. వారు అరువదినాలుగు మంది గల రని శాస్త్రవాక్కు.

పోరాడుచుండిరి; పోరిలోవారు
పన్నుచునుండి రెన్నెన్నో మాయలను.
రాఘవుఁ డొక్కఁడు, రాక్షసభటులు
పదునాల్గువే లున్నవా రనితలఁచి,
భీతిల్లి సాగిరి విబుధర్షి జనులు.
అట్లు భయంబొందు నా సురమునుల
అరసి రాఘవుఁడు మాయాధినాయకుఁడు,
ప్రకటించె నొకలీలఁ బార్వతీ! వినుము!
ఒకని కొక్కండు రఘూద్వహు నట్లు
తోచ, వారిని వారె దుష్టదానవులు
వధియించుకొని నేలఁబడి నాశమైరి.

ఆ క్రూరదానవు లవసానవేళ
'రామరామ' యటంచు బ్రలపించియుంటఁ
బడసిరి నిర్వాణపద మవలీల
ఆ కృపానిధి రాముఁ డట్లొకలీలఁ
బ్రకటించి రాక్షసవధఁ జేసిఁ ద్రుటిని
అత్తటి దేవత లతిహర్ష మొప్ప
కుసుమవర్ష ంబులఁ గురిసియుఁ మింట,
మ్రోసిరి జయదుందుభులనేకముగను.
పిదప నా సురలెల్ల వినుతు లొనర్చి
తరలిరి తమతమస్థావముల్ చేర
వివిధవిమానోపవిష్టులై గారి!

శ్రీరామచరితమానసము

ఆరణ్యకాండము

చతుర్థవిశ్రామము

హృద్వనచారణసింహా!
విద్వజ్జనగీయమానవిక్రమరంహా!
సద్వరదాయకసింహా!
అద్వయ! శ్రీమట్టపల్లి హరి! నరసింహా!

రణరంగమందున రామచంద్రుండు
ఖరదూషణాదిరాక్షసుల నందటిని
సంహరించుటచేత సర్వసుపర్వ
నరమునుల్ జెందిరానంద; మంతటను
జానకిన్ గొనియు లక్ష్మణుఁ డాశ్రమంబుఁ
జేరి రామాంఘ్రిరాజీవంబులందు
వ్రాలఁగాఁ దద్రఘువల్ల భుం డతనిఁ
గౌఁగిటన్ జేర్చెను గడుసంతసమున.
రామసుశ్యామలకోమలాకృతిని
వీక్షించె సీతసంప్రీతి వెలుంగ-
తనివితీరక తృషాతప్తచందమున.
పంచవటిన్ వసియించు చా రీతి
సురమునిజనసుఖకరదివ్యలీల
లొనరించె, రఘునాథుఁడోఖగనాథ!

శూర్పణఖ రావణాసురునికడకేఁగి తన
పరాభవమునుఁ దెలుపుట

ఖరదూషణాదులు కడతేరినంత
ఆ శూర్పణఖ, రావణాసురున్ జేరి
ఉద్రిక్తపఱచె నెన్నోవిధానముల.
ఆ నిశాచరి ప్రచండాక్రోశమొప్పఁ
బలికె నీ రీతి రావణునితో నపుడు:
"దేశకోశములఁ జింతింపక నీవు
క్రాగి కుత్తుకంబంటి రాత్రింబవళ్ళు
నిద్రించుచున్నావు- నేరవు నీవు
వాకిటికడనున్న పరిపంథి నకట!
ఇలరాజనీతివిహీనరాజ్యంబు,
ధర్మవిహీనమౌ ధనము సంపదయు,
ఈశ్వరార్పణబుద్ధిహీనసత్క్రియలు,
అలవివేకవిహీనమైన విద్యయును-
నిష్ఫలంబులుసుమా, నిజ మెంచునెడల.
సంగంబుచే, యతి,శ్లాఘ్యస్థలిం జెడును;
రాజు కుతంత్రంబుచేఁ జెడిపోవు;
జ్ఞానంబుచెడు నభిమానంబుచేత,
మధుపానవశమున మర్యాదచెడును;
ప్రియములేనందునఁ బ్రీతి నశించు;
యోగ్యతచెడు గర్వమండినయెడల;-
అని నీతిశాస్త్రోక్తులను వింటి నేను.
అరిని, రోగము, నగ్నిని, నఘమును, అధిపు
సర్పమున్, దలపోయఁ జనదల్పముగను"-
అనిపల్కి పలురీతులను బ్రలపించి,
తుదకు రోదనసేయ మొదలిడె నద్ది.
ఆ శూర్పణఖ రావణాసుఁడమ్రోల

భూరిసభామధ్యమున నేలఁబడియు
దొరలుచు, "దశకంఠ! దోర్బలశాలి
వీవు జీవించి యీ పృథ్వి నుండఁగ నె
ఇట్టి దుర్గతికల్గె నే మొనరింతు?"
అని రోదనముఁ జేసె నతివ్యాకులమున.
అదిగని, ఆ సభాసదులు కల్లోల
పడుచు లేచియు దాని పజ్జకుఁబోయి
లేవఁగానెత్తి లాలించి; రాపైన
లంకాధిపతియైన రావణాసురుఁడు,
"జరిగిన వృత్తాంత మెఱిఁగింపు; మెవరు
చేసిరి, నిన్నిట్లు? చెప్పు"- మనంగ
ఆ చుప్పనాతి యి ట్లభివచియించె:
"ఆ యయోధ్యాధీశుఁ డగు దశరథుని
పుత్రరత్నములౌచుఁ బొలుపొందువారు
పురుషసింహులు వచ్చి రిరువు రీమధ్య
దండకారణ్యమధ్యమున వేఁటాడ.
ధారుణిక్ వారు నిర్దైత్యం బొనర్ప
నడుముఁ గట్టినయట్లు నాకుఁ దోఁచెడిని.
ఓ దశకంధరా! ఓయి లంకేశ!
ఆ రాజపుత్రుల అండచే మునులు
వనులలో స్వేచ్ఛగా వర్తింపుచుండ్రి.
వారు బాలుఁగారు పరికించునెడల
ఘనరాక్షసులపాలి కాలురు గాని.
జగదేకధానుష్క-జనశిఖామణులు,
వివిధవిద్యానిధుల్, వీరాధివీరు,
లసురసంహారకార్యామితరతులు,
రాజితసురమునిరక్షణవ్రతులు,
పరికింప నయ్యిరువురు రాజసుతులు.
అందులో పెద్దవాఁ డందాలకుప్ప;
రాముఁ డందురువాని నామధేయంబు.
ఒక్క- జవ్వని వాని కున్నది వెంట.

ఆ చిన్నదాని సోయగ మేమనందు?
అందమెల్లను బ్రహ్మ ఆ తన్నిలోన
రాశిఁబోసినరీతి రావణా! తోఁచు.
శతకోటిరతు లామె సన్నిధానమున
దిగదుడు పన్నచోఁ దెలుసుకొమ్మా వె!
ఆ రాముతమ్ముఁడే, అక్కటా! నాదు
ముక్కు- చెవుల్ కోసి పొమ్మంటగాక-
దశకంధరుని సహోదరినని యెఱిఁగి
పరిహాస మొనరించెఁ బ్రల్లదాలాడి.
ఖరదూషణాదు లీ చరితమాలించి
పగఁ దీర్చుకొనఁ దలపడిరి పోరునకు.
కాని, యా రాముఁడు క్షణమాత్రమందె
అక్కటా! మనవారి నందఱఁ గూల్చె."

రావణుని విచారము

అట్టు లా ఖరదూషణాదుల చావు
విన్నంత నా దైత్యవిభుని దేహమ్ము
దందహించుకపోయె దారుణలీల.
అతఁ డనేకవిధాల నాత్మీయబలము
నతిశయోక్తులతోడ నభివచియించి.
ఆ శూర్పణఖహృదయాగ్ని నోదార్చి,
అంతిపురిం జేరె నతివ్యాకులమున;
నిద్ర యెఱుంగఁ డా నిశియెల్ల నతఁడు.
"నరసురాసురఖగనాగాదులందు
మద్భటావళితో సమానులు లేరు.
ఖరదూషణులు పరాక్రమశక్తులందు
నాతోడ సరిసమానత గలవారు.
పరమాత్మగానిచో వారలఁ జంప
నెవరితరంబగు నీ జగమందు?
సురరంజనుఁడు మహీభరభంజనుండు
భగవంతుఁడే ధరాభాగమం దిట్లు
అవతరించినయెడ అదియు శుభంబె-

పోయి ఆతనితోడఁ బోరి ఘోరముగ
వాని శరాహతిన్ భవముక్తిఁ గాంతు;
ఈ తామసశరీర మీశ్వరభజన
కనుకూలపడదు రవ్వంతయుఁ గాన-
వైరభక్తియె ముక్తిపథమని నేను
త్రికరణంబుల నమ్మితిని; కాక, వారు
ప్రాకృత నరపాలబాలకు లైన,
సంగ్రామమున వారి సంహరించియును
ఆ సుందరీమణి నంతఁ గైకొందు.

రావణాసురుఁడు మారీచునియొద్ద కేతెంచుట

అని నిశ్చయించి నిజాత్మ రావణుఁడు
రథ మెక్కి యొంటిగా రయమునఁ జేరఁ-
బరగ మారీచుఁడు వసియించుచున్న
వార్ధితీరమునకుఁ బార్వతీ! వినుము:
శ్రీరాముఁ డపుడు చేసిన చిత్ర మొకటి:
కందమూలఫలాదికములు తెచ్చుటకు
లక్ష్మణుం డరిగె నరణ్యగర్భముల;
కత్తఱి కరుణాబ్ధి ఆనందవనధి
శ్రీరాముఁ డీ రీతి సీతతోఁ బలికె-
చిఱునవ్వుముఖమునఁ జిందులుద్రొక్క:
"ఓ సతీ! ఓ ప్రియా! ఓ మహాశీల!
ఒనరింతు లలితమా నొక నరలీల;
అసురసంహారకార్యం బగుదనుక
నీ వగ్నిలోపల నిలువుము సకియ!"
అని పల్క- రాఘవుఁ డతివిశదముగ,
విని జానకీదేవి విహ్వలానురక్తి
ప్రభుపాదపద్మముల్ భావంబులోన
ముద్రించుకొని, బాహ్యమున నిల్పి తనదు
ప్రతిబింబమును నిజాకృతిగ వెల్గొందఁ,
దగ వహ్నిలోన నంతర్ధాన మొందె.
జానకీప్రతిబింబజానకి, సత్య

జానకితోడ సమానసౌశీల్య
సౌందర్యయుతయౌచు సంభాసురిల్లె.
ఈ మర్మ మొక్కింతయేని లక్ష్మణుఁడు
సైత మెఱుంగడు స్వాంతరంగమున.
అచ్చట దశముఖుం డంత మారీచు
చెంతకున్ జని నమస్కృతి యొనరించె-
స్వార్థరతుండు నీచస్వాంతుఁ డౌట.
అరయఁగా నీచుని అతివినయంబు
అంకుశ మట్లు శరాసన మటుల
మార్జాల మట్లులు, మహిఁ గీడుఁ గూర్చు.
ఖలుల మెత్తని వాక్యములు భయదములు
వసుధ నకాలికప్రసవంబు లట్లు.
ఓ పార్వతీ! ఉమా! ఓ ప్రియురాల!
అంత మారీచుఁ డయ్యసురాధిపతికి
స్వాగతం బొసఁగియు సాదరఫణితి,
"ఎటనుండి నాయనా! ఈ విప్ప డిటకు
వచ్చినా వొంటరివై నిన్నుఁజూడ
ఏదియోచింత నీ యెదనుంటఁ దోఁచు."
అన నయ్యభాగ్యుఁ డయ్యసురాధినాథుఁ
డభిమానపూర్ణుఁడై యఖిలంబుఁ దెలిపి,
"కపటమృగాకృతిఁ గైకొను మీవు
నృపకుమారిని నే హరింతు"- ననంగ
మారీచుఁ డంత నీ మాఁడ్కి- వచించె:

శ్రీరామునితో వైరము వలదని మారీచుఁడు
రావణునికి హితోపదేశము చేయుట

"వినుమోయి దశకంఠ! దనుజాధినాథ!
సకలచరాచరస్వామి రాఘవుఁడు,
నరరూపమందున్న నారాయణుండు;
వత్స! రాముని తోడ వైరంబు వలదు;
మనచావు బ్రతుకు లా ఘనుని వశ్యములు.
మునిమఖంబును గావ ము న్నా నృపాల

సూను లిద్దఱు రాగఁ జూచితి నేను.
కొనలేని బాణంబుఁ గొని రాముఁ డఫుడు
విడువఁగా నా శరవిక్రమంబునకు
క్షణమాత్రమున నల్పతృణముచందమున
నూరు యోజనముల దూరమం దేను
పడిపోతి, నెట్టులో ప్రాణముల్ దక్కె.
వారితో వైరంబు భద్రంబు గాదు.
అలభృంగకీటకన్యాయంబు వోలి
నా పరిస్థితియున్న- దేవ్రక్కఁగన్న
ఆ రామలక్ష్మణు లగుపించుచుండ్రు.
పోనిమ్మ్ల వారలు మానవమాత్రు
లనుకొన్న ననుకొను మసదృశవీరు
లనునదిమాత్ర మత్యంతసత్యంబు.
కనఁ దాటకను సుబాహుని నవలీల
సంహరించుటయన్న సామాన్య మగునె?
శివధనుర్భంగముఁ జేయశక్యంబె?
ధృతిఖరదూషణత్రిశిరులఁబోరఁ
బరిమార్చు టేరికి వశమగుఁ జెపుమ?
మర్త్యమాత్రులు వీని మహిఁ జేయఁగలరె?
నీ కులక్షేమంబు నీ మతిఁ దలఁచి
గృహమున కేగుమోయీ దశకంఠ!"
అనవిని రావణుఁ డాగ్రహోదగ్రుఁ
డై పలువిధముల నా దైత్యుఁ దిట్టి
పలికె నీ రీతిగాఁ బౌరుష మొప్ప:
"ఓ మూర్ఖ! నీవు గురూత్తమునట్లు
నాకు బోధించుచున్నావ? వచింపు
మీ జగమందు నా కెనయైన యట్టి
యోధుఁడౌ వాఁడెవఁడో చింతఁజేసి?"
అప్పు డా మారీచుఁ డంతరంగమునఁ
దలపోసె నీ రీతి- "ధారుణిలోన
శస్త్రి, మర్మజ్ఞుఁడు, శఠుఁడు, ప్రభుండు,
ధనికుండు, వైద్యుఁడు, ఘనపాకకారి,
వంది, కవీశుండు- పరికించునెడల
వైరంబు వీరితోఁ బనికిరా దెపుడు."
ఈ రీతిఁ జింతించి మారీచుఁ డంతఁ
దనచావు ఎట్లైనఁ దప్ప దటంచు
రఘునాథచరణశరణ్యమే తనకు
హిత మని తనలోన నిట్లు తాఁ దలఁచె:
"ఇంకను నేను భాషించినయెడల
నీ యభాగ్యుండు వధించును నన్ను.
అట్టిచో ఆ రాఘువాస్త్రధారలను
తనువు వీడుట నాకు ధన్యతకాదె!"
ఈ రీతి నెంచి ఆ మారీచుఁడంత
పయనం బొనర్చె రావణునితోఁ గలసి,
రామాంఘ్రిభక్తివిరాజిల్ల లోన.
ఆత్మబాంధవుఁడైన ఆ రామచంద్రు
దర్శించి నేనిఁక ధన్యతఁ గాంతు
నని యెంచి లోలోన నతిహర్ష మొంద
మారీచుఁ డత్తటి, మానివరేణ్య!
ఆనందరూపుఁడౌ ఆ రామదేవుఁ
దతమహాప్రీతితో దర్శించి నాడు
కన్నులు సఫలమాఁగాదె ఈ నాఁడు,
జానకీలక్ష్మణసహితుఁడై వెలయు
ఆ కృపాసదను దివ్యాంఘ్రిపద్మముల
మచ్చిత్త మీ నాఁడు మగ్నం బొనర్తు.
ఆ హరి ఆ మహదానందవనధి
ఆ బ్రహ్మపదదాయకాగ్రహావేశుఁ
డా యవశుండు నిజాంతర్యభక్త
జనవశ్యుఁ డగు రామచంద్రుఁ డోహోహో!
తన మహోద్దండకోదండంబునందు
శరమును సంధించి స్వయముగా నన్ను
వధియించు నేఁడు, మద్భాగ్య మేమందు?
శరశరాసనములఁ గరములఁ దాల్చి
నా వెంటఁ బరువిడు నా రామవిభుని

మంగళాకృతిఁ గాంచ మాటిమాటికిని
వెనుకకుఁ దిరుగుచు వీక్షింపఁగలను-
ననుబోలు ధన్యుఁ డున్నాడొకో ధరణి?

మారీచుఁడు మాయామృగరూపము
ధరించి పంచవటీప్రాంతమున సంచరించుట

పంచవటీప్రాంతవనసీమ కంత
రావణమారీచరాక్షసుల్ చేరి
రాపైన మారీచుఁ డతిచిత్రమైన
కపటమృగాకృతిఁ గైకొనె- నద్ది
బంగారు దేహముపై నచ్చటచట
మణిరచితంబులౌ మచ్చలు కలిగి
వర్ణనాతీతమై భాసిలుచుండె.
సర్వాంగశృంగారసదనమై వెలుఁగు
పరమమనోజ్ఞ మా హరిణంబుఁ గాంచి
శ్రీరాముతోఁ నిట్లు సీత వచించె:

సీత మాయామృగమును వధించి తెమ్మని
శ్రీరాము నర్థించుట

"ప్రాణేశ! రఘువీర! పరమకృపాళు!
ఆ మృగంబునుజూడుఁ డద్దానిచర్మ
మతిసుందరమ్ముగా నలరారుచుండె.
దానిని గూల్చి యద్దాని చర్మమును
నా కొసంగుము తెచ్చి నాథ! శ్రీరామ!
ఓ రఘునందనా! ఓ సత్యసంధ!"
అనవిని రఘుపతి స్వాంతరంగమున
అఖిలం బెఱింగియు సమరకార్యార్థ
మానందమున లేచి హరిణమున్ జూచి,
నడికట్టుఁ గట్టి బాణాసనమూని
మెఱపట్లు మెఱుఁగెడి కఱకుటమ్ములకటి
యెక్కడి, లక్ష్మణు నీక్షించి పలికెఁ:
"విహరింపుచుండు రీ విపినంబులందుఁ
గ్రూరదైత్యులు-జాగరూకతఁ బూని
ఉర్విజన్ గాపాడుచుండుమా నీవు-
ఘనబుద్ధిబలవివేకంబులతోడ
సమయానుకూలవిచారణతోడ."
అంత రాఘవుఁ గాంచినంత ఆ లేడి
పరుఁగిడ సాగెను; ప్రభువు నద్దాని
వెనువెంటఁ దవిలెను విల్లెక్కుఁబెట్టి.
నేతి నేతి యటంచు నిగమంబు లెవని
తత్త్వంబుఁగూర్చియుఁ దగఁ బ్రవచించు,
శివుఁ డెవ్వనిన్ దన చిత్తము దెపుడు
ధ్యానింపుచుండునో తన్మయత్వమున,
ఆ పరమేశ్వరుఁ డా రామవిభుఁడు
మాయామృగార్థమై మహిఁ జనుచుండె-
ఎంత చిత్రం బిది యెంచఁగాఁగారి!

శ్రీరాముఁడు మాయామృగరూపధారియగు
మారీచుని వధించుట

చిక్కి-నట్లులఁ గడుచేరువ న్నిలుచు-
అంతలోఁ బర్వెత్తు నందకుండఁగను.
కనిపించు,- నంతలోఁ గనఁబడ- దిట్లు
కనఁబడు చొకసారి కనఁబడకుండు
మఱియొకసారి; ఆ మాయామృగంబు
పలుపలు జిత్తులఁ బన్నుచు రాముఁ
గొనిపోయెఁ గడుదూరమున కరణ్యమున.
తుదకు శ్రీరాముఁడు హృది నిశ్చయించి
విడువ నొకానొక భీష్మశరంబు-
తన్మృగమంత భూతలమునఁ గూలె-
'హా లక్ష్మణా!' యని ప్రథమ మం దొక్క-
భీకరంబగు కేక వేసి, యా పిదప
మది రామనామంబు స్మరియించుకొనుచు.
అది తన ప్రాణముల్ వదలెడి వేళ
నిజరూపమును దాల్చి నిజహృదయమునఁ

బ్రేమ దీపింప స్మరించె శ్రీరాము.
హృద్గతప్రేమన్ గ్రహించు రాఘవుఁడు
మునిదుర్లభంబగు ఘనపదం బొసఁగె
నా రాక్షసునకు మహర్షివర్యా!
అపుడు దేవతలు మహాహర్ష మొప్పఁ
గుసుమవర్షంబులు కొల్లగాఁ గురిసి,
"అహా! దీనబంధుఁ డాహా! రఘునాథుఁ
డసురునకును మోక్షమొసఁగె" నటంచుఁ
బ్రస్తుతించిరి రామభద్రగుణాళి.
ఇట్లా ఖలుని వధియించియున్ మఱలెఁ
బర్ణశాలకు రామభద్రుండు– చేత
రమ్యకోదండంబు రాజిలుచుండ,
మూపునఁ దూణీరమున్ రహియింప.

సీత సౌమిత్రిని శ్రీరాముకడకేగుమని
ప్రేరేపించుట

అట ఆర్తనాదంబు నాలించి నంత
సీత మహాభీతచిత్తయై పలికె,
లక్ష్మణున్ గాంచి; "ఓ లక్ష్మణా! చనుము
మీ యన్న కేదో! అపాయంబు కలిగె."
అన నవ్వి లక్ష్మణుం డనియె నీ రీతి:
"ఓ తల్లి జానకీ! భీతిని విడుము.
రాముఁడు భ్రూకుటీవిలాసమాత్రమున
సృష్టిని లయమొందఁ జేయఁగాఁగలడు.
ఆ జగన్నాథున కహా! కలనేనిఁ–
గీడు సుంతేనియుఁ గూడునా? జనని!"
ఇట్లు వచించియుఁ, బృథ్వీకుమారి
పలుకుచుండిన మర్మవాక్యముల్ వినియుఁ
హరియిచ్ఛచేత రామానుజుఁ డంతఁ
దన దృఢసంకల్పమును విడనాడి.
రావణ శశిబింబరాహువౌ రాము
చెంతకుఁ బయనించె– సీతామతల్లి
నలవనదిగ్దేవతల కొప్పఁజెప్పి.

రావణుఁడు యతివేషమున పర్ణశాల
కేతెంచుట

ఇకఁ దగు సమయ మిదే! యని చూచి
ఆ దశకంఠుఁడు యతివేషమూని
పర్ణశాలాసమీపమున కేతెంచె.
ఎల్ల సురాసురు లెవని పేర్చిన్నఁ
గడుపునకున్ దిండి కనులకు నిద్ర
ఎఱుఁగక వణకుచు నెపుడు భీతిల్లు
చుందు రా దశశీర్షుఁ డుగ్రబలుండు
సీతాపహరణంబుఁ జేయ నేతెంచె–
అటునిటుఁ గుక్క– యట్లతిభీతిఁ గనుచు.
వినుమోయి గరుడ! ఓ విహగాధినాథ!
చెడుమార్గమునఁ బ్రవేశించినయంత
ఎవ్వఁ డైనను సరే– యీ జగమందుఁ
దన దేహతేజంబు, దన బుద్ధిబలము,
తన బలశక్తులుఁ, దగఁ గోలుపోవు.
అంత నా రావణుఁ డవనిజన్ జూచి
కమనీయబహువిధకథల వచించి,
అలరాజనీతికౌశలముఁ జూపించి,
నయభయంబులఁ జూపి, నానావిధాల
సీతపైఁ దనకున్న ప్రీతి వచించె.
అప్పు డా జానకి, "అయ్య! యతీశ!
దుష్టుని రీతిగా దుర్వాక్యములను
బలికినా విది నీకు భావ్యమా" అనియె.
అంత రావణుఁడు నిజాకృతిన్ జూపె;
వాని నామము విని భయపడె సీత.
పెనుధృతి సమకూర్చుకొని తుద కామె
పలికె నీ రీతి నిర్భయము దీపింప:
"ఓరి! దుర్మార్గుఁడా! ఒక్కింత నిలుము–
వచ్చును మత్ప్రాణపతి రాఘవుండు.

అల్పమా కుం దేలు ఆడుసింగంబు
నభిలషించినరీతి నాశించి తీవ్ర-
నీకుఁ బోఁగాలము నే డరుదెంచె-
ఓ దానవాధమా! ఓ దశకంఠ!"
అను జానకీవాక్కు లాలించినంత
ఆ నిశాచరుఁడు నిజాంతరంగమున
నా మె యడ్డులగొల్చి హర్ష మొందినను-
పరమరోషావేశపరవశుఁ డయ్యె.

రావణుఁడు సీతనపహరించుట

అట్లు మహాక్రోధుఁడై దశాననుఁడు
సీతను రథముపైఁ జేర్చి గమించె
నాకాశమార్గాన నాత్రమ్మ్మగదుర;
భయముచే నాధైర్యవల్లభుఁ డరద
మును త్రోలఁజాలకపోయె ఖగేంద్ర!
"హా! జగదేకవీరా! రఘువీర!
హా! ఆర్తిహరణ! పాదాశ్రితసుఖద!
హా! రఘుకులనీరజార్క! శ్రీరామ!
ఈ వింతకాఠిన్య మెదను వహింప
ఏను చేసిన దోష మేమి? ప్రాణేశ!
హా! లక్ష్మణా! సుగుణాతిసంపన్న!
నీయందు దోషంబు నాయనా! లేదు;
నా దురుద్రేకగుణంబున కేను
పొందితిఁ దగుఫలంబును బ్రియతనయ!"
ఇట్లనేకవిధాలఁ బృథ్వీకుమారి
విలపించెఁ గఠినమా శిలలు ద్రవింప.
"పరమకృపానిధి ప్రాణేశ్వరుండు
దూరమందుండె మహారణ్యమందు.
నా విపద్దశను నా నాథున కిపుడు
తెలుపువా రెవ్వారుగల రీ వనాన?
కట! పురోడాశమున్ గబళింపనుండెఁ
గడు నీచమైనట్టి గార్దభం బొండు."

ఇట్లు సీతా దేవి ఏలుగెత్తి యేడ్వ
సచరాచరప్రపంచము శోక మొందె.

జటాయువు రావణాసురు నెదుర్కొనుట

గృధ్రా ధిపుండగు వృద్ధ జటాయు
వా మహోర్తారావ మాలకించియును
గర్కశమ్మేచ్ఛుని కై వసమైన
కపిలగో వటుల-రాక్షసకులాధమునిఁ
చేఁ గొనిపోఁబడు శ్రీరాము దేవి
విలపించుచుండిన విషయం బెఱిఁగె.
"సీతమ్మ! ఓ పుత్రి! భీతిఁ జెందకుము!
ఈ రాక్షసాధము నిదె వధియింతు!"
అనిపల్కి చండకోపావేశ మొప్ప
ఆ జటాయువు రావణాసురుం దాకె
పర్వతంబును ఘోరవజ్రంబువోలె.
"ఓరోరి! దుష్ట! నిల్చుండ వదేమి?
పయనించుచుంటివి భయము లేకుండ;
న న్నీ వెఱుంగని తెన్ను దోఁచెడిని".
అని మృత్యు వట్లు వెన్నంటి యే తెంచు
ఆ ఖగవిభు రావణాసురుఁ డంత
వెనుకకుఁ దిరిగియు వీక్షించి, "అద్ది
మైనాకపర్వతమా? ఖగపతియ?
ఆ గరుత్మంతున కాతని పతికి
విదితంబు నాదగు విక్రమశక్తి."
అని తలపోయు చున్నంత జటాయు
వరుదేరఁ జెంతకుఁ బరికించి, "ఓహో!
వీడు జటాయువు, వృద్ధగృధ్రంబు,
నా చేతిలో మరణంబును గాంచు!"-
అని నిలువంబడె; నంత జటాయు
వాగ్రహోదగ్రుఁడై యనియె నీ రీతి;
"వినుమోరి! రావణా విడిచి జానకిని
క్షేమంబుగా నీవు గృహమున కేగు;

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

మిది నే వచించెడి హితమురా నీకు.
ఈవు నిర్లక్ష్యింతువేని నిక్కముగ
జరుగున దేమిటో ఎఱిఁగింతు వినుము:
అతిఘోరరామరోషాగ్నికీలలకు
భవదన్వయము శలభప్రాయ మగును."
అనఁ, గదనప్రియుం డైన రావణుఁడు
ప్రత్యుత్తరముమాని పయనింపనుండ,
గృధ్రాధిపతి మహాకృద్ధుఁడై తవిలి
వాని కేశంబులఁ బట్టియు, బీకి
విరథుఁ గావించి పృథ్వినిపడలాగె.
అంత నా విహగేంద్రుఁ డవనీకుమారి
సరగ సురక్షిత స్థానముం జేర్చి
మగిడి యే తెంచి యమ్మదద్వైత్యుఁ దాఁకి
చండతుండాగ్రనిశాతఘాతములఁ
జీల్చి చెండాడె నా చెనటి దేహమును.
అపుడు రావణుఁడు మూర్ఛాక్రాంతుఁ డగుచు
ఘడియసేపటికెట్లో కన్నులు తెఱచి
ఆగ్రహోదగ్రుఁడై యట్టె తా లేచి
రణతలోదగ్రకరాళఖడ్గమున
విహగేంద్రు పక్షముల్ ద్రేటుకు నఱకె.
ఆ మహోద్భతయోధుఁ డా రామభక్తుఁ
డా జటాయువు తెక్క లా రీతి విఱుగ,
హా! రామ! యనుచు నత్యద్భుతలీల
ధరణిపైఁ గూలెఁ బతంగవతంస!
పిదప రావణుఁడు పృథ్వీసుతన్ మగుడ
రథముపైఁ జేర్చియు రయమున వెడలె
గుండియల్ దడదడఁ గొట్టుకొనంగ
ఆకాశమార్గాన అరుగుచున్న సీత
గోడుగోడున, నేడ్చెఁ గ్రమ్మరఁ జూచినట్టి
వేటకానికిఁ జిక్కి భీతిలుచున్న
ఆడులేడివిధాన– అక్కటా! గరుడ!
అ ల్లెగు చా సీత అవనిపై నొక్క
కొండకొమ్మునఁ గొన్ని కోతులఁ జూచి
చీరకొంగును చింపి జారఁగా విడిచె
స్మరియించుకొనుచు శ్రీహరినామమాత్మ.

రావణుఁడు జానకిని అశోకవనమున
నుంచుట

ఈ రీతి రావణుం డా రాముసతిని
గైకొనిపోయి లంకానగరమున
అలయశోకవనంబునం దుంచెగరుడ!
ఆ రావణాసురుఁ డా మహోగ్రుఁడు
నయభయంబులఁ జూపినన్ గాని సీత
సుప్రీతగాకుంటఁ జూచి వేసారి,
ఎట్టకేల కశోకవృక్షంబుక్రింద
నామెను నిల్పి భయంకరదైత్య
కాంతలఁ గాపుంచెఁ గడుకఠోరముగ.
రమణీయమాయాకురంగానుసరణ
రఘురామచంద్రవిగ్రహము డెందమున
స్థాపించుకొనియు సీతామహాదేవి
రామనామైకపరాయణ మగుచు
ఆ యశోకవనంబునందుండె గరుడ!

A. MEMORIAL LIBRARY
ACC. NO.

శ్రీరామచరితమానసము

ఆరణ్యకాండము

పంచమవిశ్రామము

హనుమద్గురుడార్చితపద!
సనకాది ప్రముఖమౌనిసన్నుతనామా!
దనుజతమఃపటలార్కా!
వనజోదర! మట్టపల్లి వాస! నృసింహా!

రామచంద్రుఁడు మహారణ్యమార్గమునఁ
దనకెదురైన సోదరుని వీక్షించి,
ప్రకటించె నమితమౌ వ్యాకులత్వమును:
"అక్కటా! లక్ష్మణా! ఆశ్రమమందు
పృథ్వీజ నొంటిగా విడిచి వచ్చితివి-
నా వాక్యముల ననాదరణ మొనర్చి.
ఘోరభయంకరక్రూరరాక్షసులు
విహరింపుచున్నారు విపినంబులందు;
కాన, ఆశ్రమమందు జ్ఞానసుతయుండ
దని తోచుచున్నది మనములో నాకు."
అని పల్క- రాముఁడు, విని లక్ష్మణుండు
రాముని పాదసీరజముల కెఱఁగి,
కరములు మోడ్చి, "ఓ కరుణానిధాన!
నిరపరాధిని నేను కరుణింపు"-మనియె.

శ్రీరాముఁడు సీతావిరహితమగు పర్ణశాలం
జూచి కలవరపడుట

అంతఁ దమ్మునితోడ నా రఘుస్వామి
చేరె గోదావరీతీరమందున్న
తన పర్ణశాలకుఁ, దపసివతంస!
అట జానకీనాథుఁ డా రామవిభుఁడు
చూచి సీతాహీనశూన్యాశ్రమమును
నిలువున నీరయి కలవర మొంది
పాకృతజనునట్లు పరితాప మొందె-
"హా! సుగుణోపేత! హా! ధరాజాత!
హా! రూపశీలమహావ్రతనియమ
నిష్ఠాప్రపూత! కాన్పింపవే!" అనుచు.
పలువిధంబుల రామభద్రు నత్తఱిని
సౌమిత్రి యోదార్చె సంయమివర్య!

శ్రీరాముఁడు పరితపించుచు సీత
నన్వేషించుట

సీతావియోగవిశేషదుఃఖమున
రాఘవుఁ డా మహారణ్యాలఁ జనుచు
తరులతాదులనెల్లఁ దన ప్రియురాలిఁ
గూర్చి ప్రశ్నించెను గూర్మి వెలుంగ:
ఖగములారా! ఒహొ! మృగతతులార!
ఓ మధుపములార! ఈ మహాటవుల
మృగనేత్రసీత నెందేఁ జూచినార?
*ఖంజనమీనమృగవ్రజాబ్జములు,
మన్మథకరదీప్తమహితచాపంబు,

* లోకమున సహజముగ సుందరీమణుల కన్నులు- ఖంజనపక్షులతో, (కాటుకపిట్టలతో) మీనములతో, మృగ

శుకకపోతంబులు, పికసమూహములు,
దాడిమకుందసౌదామినీ గణము,
అళిగణాహిచయంబు, లలశరత్కమల
శరదిందుబింబముల్, వరుణపాశములు,
శ్రీఫలవర్గముల్ సింహసంఘములు;
కాంచనకదళీనికాయముల్ మత్త
గజమరాళంబులు కనఁగ నీ నాఁడు
వినఁగల్గె దమనుతుల్ వీనులారంగ;
సంశయలజ్జావిచారభారముల
వదలి నేఁ డివ్వి సంబర మొందుచుండె;
నీవు లేకుంటచే నేఁ డివి సకియ!-
రాజ్యాధిపత్యము ప్రాప్తించినట్లు-
పట్టశక్యముగానిపగిది హర్షించు.
ఈ శత్రువర్గవిజృంభణ మీవు
సహాయింతు వేరీతి? సరగ వెల్వాడుము!

ఓ ప్రియా! ఆలస్య మెనరింతు వేల?"
స్వామి యి ట్లొక మహాకామి చందముగ
వెదకుచు సీతను- విరహార్తుఁ డగుచు
కన్నీరు మున్నీరుగా విలపించె-
కలఁగ సాంద్రారణ్యగర్భంబు లెల్ల
ఆ పూర్ణకాముఁ డయ్యానందమయుఁడు,
అజుఁ, డవినాశియౌ నా రామవిభుఁడు-
నరునిచందంబుగా నటియించె నోహో!

రామలక్ష్మణులు నెత్తుటఁదోగియున్న
జటాయువుం గనుట

శ్రీరామలక్ష్మణుల్ చింతించుకొనుచుఁ
బోయిపోయి యరణ్యమున నొకచోట
*దివ్యరేఖాసముద్దీప్త శ్రీరామ
చరణారవిందసంస్మరణఁ జేయుచును-

నేత్రములతో, పద్మములతో, కనుబొమ్మలు- మన్మథునిధనువుతో, వాక్కులు - చిలుకల పలుకులతో, కంఠములు - కపోతకంఠములతో, దంతములు - దాడిమబీజములతో, మల్లెమొగ్గలతో, మెఱుపుతీవెలతో, కేశపాశములు - తుమ్మెదలతో, సర్పములతో, ముఖము - శరత్కమలములతో, శరదిందుబింబముతో, మందహాసము - వరుణపాశములతో, వక్షోజములు - శ్రీఫలములతో (బిల్వఫలములు) నడుములు- సింహమధ్యములతో, ఊరువులు -కాంచనకదళీతరుషండములతో, నడకలు - మత్తగజయానములతో, మరాళగమనములతో, బోల్చఁబడుచుండును. కానీ సీతాదేవియొక్క అప్రాకృతదివ్యసౌందర్యమున కివి సరిపోలవయ్యెను. అందుచే సీతామహాదేవి కనబడుచున్నంతవరకు, వీనినిగూర్చి అనుకొనువారు లేరైరి. ఇప్పుడు సీత కనబడనందున, మఱల వీనిప్రశంస కొంచెము లోకమునఁ బ్రారంభమైనందున, అవి తమ లజ్జాభయాదులను వదలి సంతోషముతో సంచరించుచున్న వని మహాకవి తులసీదాసస్వామివారిభావన. శ్రీతులసీగోస్వామివా రెక్కడను సీతాదేవియొక్క అంగములను వర్ణనచేయలేదు. ఈసమయమునఁగూడ, ఉపమానములను మాత్రమే పేర్కొనెనుగాని, ఉపమేయములఁ బేర్కొనలేదు. ఈ లీలామాత్రవర్ణనముకూడ శ్రీరామచంద్రుని ముఖమునుండియే ప్రకటించుట - గమనీయము. శ్రీతులసీదాసుని అపూర్వ దివ్యకవితాసంస్కృతియొక్కరూపము నిందు మనము సందర్శించవచ్చును.

* భగవానుని దివ్యపాదపద్మములందు- పాదమున కిరువదినాలుగు ముద్రల (రేఖలు) చొప్పున నలుబదిఎనిమిది దివ్యముద్రలు భాసించుచుండు నని శాస్త్రములు తెలుపుచున్నవి. ఎడమపాదమందుండు రేఖలు: (1) ఊర్ధ్వరేఖ (2) స్వస్తిక (3) అష్టకోణము (4) శ్రీలక్ష్మీదేవి (5) హలము (6) ముసలము (7) శేషాంకము (8) శరము (9) ఆకాశము (10) పద్మము (11) రథము (12) వజ్రము (13) యవబీజము (14) కల్పవృక్షము (15) అంకుశము (16) ధ్వజము (17) కిరీటము (18) సుదర్శనము (19) సింహాసనము (20) గద (21) చామరము (22) ఛత్రము (23) మానవాకృతి (24) జయమాల.

కుడిపాద మందుండు రేఖలు: (1) సరయూనది (2) గోరింక (3) పృథ్వి (4) కలశపాత్ర (5) కేతనము

నేలపైఁ గూలియు నెత్తుటఁ దోగు-
పులుగు రేనిని జటాయువును గన్గొనిరి.
అంతఁ గృపాసింధు వగు రఘువీరుఁ
డా గృధ్రవిభుని శీర్షాగ్ర భాగమును
నిజకరాంబుజముతోఁ నిమురఁ, నాతండు
కన్నులు తెఱచి రాఘవరమ్యమూ ర్తి
వీక్షించె; ఆతని వేదన మెల్ల
ఉపశమించెను- మహర్ష్యుత్తమా! అంత
గృతిఁ దేఱి యా ఖగపతి యిట్లు పలికెఁ:
"రామ! భవభయవిరామ! సుశ్యామ!
రావణాసురుఁడు న న్నీ విధిఁ జేసె.
ఆ ఖలుండే, సీత నకటా! హరించె.
కురరివిధంబునఁ గుయ్యిడ సీత-
ఆమెను గైకొని ఆ దురాత్ముండు
దక్షిణదిశకు నాథా! గమియించె-
త్వద్దర్శనార్థమే ప్రభు! వేచియుంటి-
ఇంక నా ప్రాణంబులేగు శ్రీరామ!
ఘనతరాగాథసత్కారుణ్యధామ!"
అనవిని శ్రీరాముఁ డనియె- "ఓ తాత!
ఇంకను నీవు జీవింపు" మటంచు.
అన జటాయువు నవ్వి అనియె నీ రీతి:
"అధముఁ డైనను సరే, అవసానవేళ
ఎవ్వాని నామ మొకింత స్మరింప
ముక్తుఁ డౌనని వేదములు నిర్వచించు-
ఆ పరమేశ్వరుఁ- డహహా! నా ముందుఁ
బ్రత్యక్షు మయ్యె- నా భాగ్య మేమందు!
దేనికి నాకింక దేహబంధంబు?"
అనవిని జలభరితాక్షులతోడ
శ్రీరాముఁ డి ట్లనెఁ బ్రేమ వెలుంగ:
"తాతా! త్వదీయసత్కర్మలే నీకు
సద్గతిఁ గూర్చె నిజం బరయంగ.
పరహితమతులైన భవ్యుల కనఘు!
సాధ్యంబు కానిది జగతి నేముండు?
తనువును ద్యజియించి తండ్రి! నీ వింక
మద్ధామమున కేగుమా మహాభాగ!
అలపూర్ణ కాముఁడ వైన నీ కిప్పు
డీయఁగాఁ దగినట్టి దేమున్న దేను?
అట నాదు జనకున కనఘు! నీ విపుడు
సీతాపహరణవిశేషంబుఁ దెలుప
వల; దేను శ్రీరామభద్రుండ నేని-
రావణు సపరివారముగ వధింతు;
స్వయముగా వాఁడె, సర్వముఁ దెల్పు నపుడు."

జటాయుమోక్షము

అంత జటాయు వత్యద్భుతలీలఁ
దన గృధ్రదేహంబుఁ ద్యజియించి వైచి
బహువిధభూషణవ్రజదీపితుండు,
అనుపమరమ్యపీతాంబరయుతుఁడు,
భూరిదీవ్యచ్చతుర్భుజకలితుండు,
నై, హరిరూపుఁడై- ఆ రామచంద్రుఁ

---

(6) జంబూఫలము (7) చంద్రరేఖ (8) శంఖము (9) షట్కోణము (10) త్రికోణము (11) వేత్రము (12) అణు రూపమగు జీవస్వరూపము (13) బిందువు (14) శక్తి (15) అమృతకలశము (16) త్రివళీరేఖలవంటి మూడు సమానాంతరరేఖలు (17) మీనము (18) పూర్ణచంద్రుడు (19) వీణ (20) మురళి (21) ధనువు (22) బాణము (23) హంస (24) స్త్రీశిరోధార్యాభరణము.

సీతాదేవి పాదపద్మము లందుకూడ ఈ నలుబదినిమిది దివ్యరేఖ లుండును. కాని, శ్రీరాముని వామపాదము నందు గల ముద్రలు సీతాదేవికి దక్షిణపాదమందును, శ్రీరామునకు దక్షిణపాద మందుముద్రలు సీతాదేవికి వామపాదమందును భాసిలుచుండును.

బ్రస్తుతిఁ జేసె సద్భక్తి నీ రీతిఁ
గన్నుల బాష్పముల్ కాల్వలు గట్ట:

జటాయుకృత శ్రీరామ స్తవము
మత్తకోకిలవృత్తములు

రామ! శ్రీఅసమానరూపధ
రా! గుణాగుణ! ప్రేరకా!
భీమరావణబాహుఖండన
విక్రమా స్త్రశరాసనా!
శ్యామలాంగ! సరోరుహానన!
అంబుజాక్ష! కృపానిధీ!
ఓ మహాభుజ! ఓ భవాపహ!
ఓ ప్రభూ! కొనుమా నతుల్.

వందనంబు లమేయశౌర్య! భ
వా! అనాది! అగోచరా!
నంద! అద్వయ! ద్వంద్వదూర! అ
నంత! చిన్మయ!భూధ్ర! గో
విందా! గోపద! కామహీనప
విత్రభక్తజనప్రియా!
సుందరాంగ! స్వమంత్రజాపక
శుద్ధమానసరంజనా!

ఏ పరాత్పరు వేదముల్ విను
తించు- శుద్ధము, బుద్ధమున్,
వ్యాపకం, బజమై వెలింగెడి
బ్రహ్మ—మంచునజస్రమున్,
ఏ పరేశు మునీశ్వరుల్ కన
నెంచి జ్ఞానవిరాగయో
గోపమార్గము లాశ్రయించెద
రో, తదీశుఁడ వీవహో!.

అట్టి నీవు కృపావశంబున
నాశ్రితావళిఁ గావఁగాఁ
బుట్టినా వతిరమ్యవిశ్వవి
మోహనాకృతితో ధరన్,
ఇట్టి మన్మథమన్మథాకృతి
యే, మదీయహృదబ్జ మె
ప్పట్టునన్ విడిపోని షట్పద
వల్లభంబగు, రాఘవా!.

ఏ విభుండు అగమ్యుడయ్యును
ఎంచిచూడ సుగమ్యుఁడౌ,
ఏ విభుండు సమాసముండు, స
మిద్ధశుద్ధుఁడు, శాంతుఁడౌ,
ఏ విభుఁ గనుచుంద్రు చిత్తము
నింద్రియంబు లణంచి, నా
నావిధాననుసాధనంబుల
నమ్యయోగిమహాజనుల్.

ఏ విభు న్నుతియింపఁగా భవ
శృంఖలంబులు భంగమౌ—
ఆ విభుండు, రమానివాసు, డ
నారతాశ్రితవశ్యుఁ డా
దేవదేవుఁడు విశ్వనాథుఁడు,
దివ్యసుందరమూర్తి, సీ
తావిభుండు, రఘూత్తముండు, స
దామదాత్మవసించుతన్.

శ్రీరాముఁడు జటాయువున కంత్యక్రియ
లొనర్చుట

ఇట్లు స్తుతించి ఆ గృధ్రవల్లభుఁడు
అవిరళమగు భక్తి నర్థించి, చేరె
హరిపదంబునకు మహావైభవమున.
అలరామసేవాగతాయు వైనట్టి
ఆ జటాయువున కంత్యక్రియ లెల్ల
స్వయముగా శ్రీరామచంద్రుఁడే సలిపె—

సముచితరీతి భాస్వద్భక్తి వెలయ.
ఈ మహాభాగ్య మింకెవ్వరికబ్బు?
రామచంద్రుం డతికోమలహృదయుఁ
డలదీనవత్సలుం డమితనిశ్చేతు
కాద్భుతకరుణాగుణాలయుం డహహ!
ఆ జటాయువునకే యాధిక్యముండె?
ఆమిషప్రియ, మతిహైన్యఖగంబు;
అమ్మదిగ్రద్దకాహా! రాముఁ డొసఁగె
మోగులకందని యున్నతపదము.
అట్టి శ్రీహరియెడ ననురక్తిఁ గనక
విషయానురక్తితో విహరించు జనులు
పరమదౌర్భాగ్యులు, పార్వతీ! వినుము!
ఆ రామలక్ష్మణు లంతట గదలి
రవనిజాన్వేషణాయతకార్యమందు.
చనినకొలందిగా సంకులసాంద్ర
తతలతావిటపవితానవికీర్ణ
ఖగమృగమృగరాజగంధేభపూర్ణ
దుర్గమారణ్యసందోహముల్ వచ్చె.

కబంధసంహారము

ఒక్కచో నెదురైన నుగ్రకబంధు
సంహరించెను రామచంద్రప్రభుండు.
ఆ కబంధాసురుఁ డంత రామునకు
"మున్ను దుర్వాసుఁడు నన్ను శపించె-
నా ఘోరపాప మీనాఁటి కీ రీతి
త్వత్పాదపద్మసందర్శనవశత
ప్రక్షాళితం బయ్యె ప్రభు! రామచంద్ర!"-
అని తన శాపవృత్తాంతంబు వినిచె.
అప్పుడు శ్రీరాముఁ డనియె నీ పగిది:
"ఓయి గంధర్వుఁడా! ఒగి వినుమోయి!
బ్రాహ్మణద్రోహిని వదలనూరకను-
శిక్షింపకుండఁగా- సిద్ధ మీ మాట.

శ్రీరాముఁడు కబంధునికి బ్రాహ్మణసేవా
ప్రాశస్త్యంబుఁ దెల్పుట

త్రికరణంబుల మహీదేవసేవనము
చేసెడివారికి శివవిధిముఖ్య
దేవతలేకాదు తిలకింప నేను
సైతము వశ్యుండ సత్య మీ మాట.
విప్రుండు శాపము బెట్టినఁ గాని
దండించినను గాని తత్కథనోక్తు
లాడినంగాని పూజార్హుండటంచు
వేదముల్ తెలుపును విబుధు లాడెదరు.
భూసురుం డెప్పుడుఁ బూజ్యుఁడై వెలయు.
అని ప్రబోధించి రామావనీవిభుఁడు
తనభక్తిమార్గంబుఁ దగ వివరించి,
అతనికిఁ దన చరణాబ్జంబులందుఁ
గలిగిన భక్తికిఁ గడు సంతసించె.
తత్కబంధుండు గంధర్వరూపమును
పొంది రాఘవపదాంబుజముల కెఱఁగి,
చనియె స్వర్గమునకు సంతోషమొప్ప.

శ్రీరామలక్ష్మణులు శబర్యాశ్రమమునకుఁ
జేరుట

అటుల మహోదారుఁ డగు రామచంద్రుఁ
డా కబంధునిశాప మపహరించియును,
చని అటనుండియు శబరి ఆశ్రమము
చేరెను- ఓ మునిశేఖరా! వినుము.
తన ఆశ్రమమునకు దయసేయుచున్న
శ్రీరామదేవు నీక్షించినంతటనె
స్మృతికి వచ్చెను శబరికి మతంగర్షి
చెప్పియుండిన శుభశ్రీవచనములు-
ఆమె మహానంద మందె డెందమున.
ఘనజటామకుటసంకలితోత్తమాంగు,

లబ్జలోచనులు, దీవ్యన్మహాభుజులు,
వరవనమాలికాభాసురగళులు,
శ్యామలగౌరవర్ణాయతతనులు,
రామలక్ష్మణులు, నేత్రములకుఁ దోపఁ-
బరువిడి శబరి సంబరము వెలుంగ
వారల పాదపద్మంబుల వ్రాలె.
ఆనందపరవశయ్యె యామె నోట
మాటలు రాకను మాటిమాటికిని
వారిపాదములపైఁబడి ప్రణమిల్లి-
ఉదకముల్ గొనితెచ్చి పదములు కడిగి,
భక్తిదీపింప లోపలికిఁ దోడ్తెచ్చి,
ఉపవిష్టులను జేసె నుచితాసనముల.

శ్రీరాముఁడు శబరి సమర్పించిన
పండ్లారగించుట

అంత నా శబరి మహారుచి గల్గు
కందమూలఫలాదికంబులఁ దెచ్చి
అర్పింప రాఘవుఁ డతి ప్రేమ మీఱఁ,
'ఎంతబాగుగనుండె నెంతబాగుండె'
నని మాటిమాటికి యభినుతించుచును
భుజియించె నో మహామునీ! భరద్వాజ!
అంజలిబద్ధహస్తాంబుజ యగుచు
ఆ తపస్విని నిల్చె నా రాముమ్రోల.
ఆమె శ్రీరామముఖారవిందంబుఁ
గాంచిన కొలదిగాఁ గడుభక్తి, ఆమె
యుల్లంబునందున నుప్పొంగసాగె:
"దేవ! నే నధమజాతిని బుట్టియుంటి
జడమతి నెట్లు ని న్నన్నుతించెదను?
అంగన నధమాధమాధమమందలఁప-
అందులో నే నతిఅజ్ఞమానసను-
రామ! పాపవిరామ! రమణీయనామ!"
అని పల్క- శబరి, రామావనీవిభుఁడు
భాషించె నీ రీతిఁ బరమాదరమున:

శ్రీరాముడు శబరికి నవధాభక్తి తత్వ
ముపదేశించుట

"ఓ సాధ్వి!శబరీ! మదుక్తుల వినుము:
ప్రప్రథానము నాకు భక్తియేసుమ్ము;
జన్మంబు, కులము, వంశంబు, ధర్మంబు,
ధనమును, బలమును, గుణము, చాతుర్య
ముండిననుండని మ్మిల్లమ్మిలోన
భక్తి లేకున్నచో వసుధ నా నరుఁడు
జలవిహీనంబగు జలదంబువోలె
నిష్ప్రయోజకుఁడు పునీతచారిత్ర!
వచియింతు నవవిధభక్తిసాధనల-
సావధానంబుగా శ్రవణం బొనర్చి-
మనసునందున నిల్పుకొనుము సంతతము.
సత్పురుషావళీసాంగత్య మరయ
ప్రప్రథమంబగు భక్తిమార్గమ్ము.
అస్మత్కథాప్రసంగానురాగంబు
పరగ ద్వితీయమౌ భక్తిమార్గమ్ము.
సవినయసద్గురుచరణసేవనము
భాసమానతృతీయభక్తిమార్గంబు.
కపటవిహీననిష్కల్మషప్రథిత
మద్గుణకీర్తనమయజీవనంబు,
భవ్యచతుర్థ సద్భక్తిమార్గంబు.
దృఢతరవిశ్వాసదీపితం బైన
మంత్రజపంబును, మహిత వేదములు
పంచమంబగు భక్తిపథముఁగాఁ దెలుపు.
దమమును, శీలంబు, దనరఁగా బాహ్య
కర్మలన్ విరతిని గాంచి, సంతతము
సజ్జనధర్మానుసారియై యుంట-
షష్ఠవిధానమౌ సద్భక్తిపథము.
అఖిలవిశ్వము మన్మయం బని యెఱిఁగి,

సమదృష్టివహియించి సంచరించుచును
మద్భక్తజనులను మతిని నాకన్న
నధికులంచు భజించు టరయఁగా శబరి!
సప్తమంబగు భక్తి సత్పథం బగును.
ఇల యథాలాభసంతృప్తుఁడై యెపుడు
పరదోషదర్శనపరుఁడు గాకుంట-
అష్టమంబగు భక్తి యగు నమ్మ సాధ్వి!
సరళవినిర్మలస్వాంతుఁడై మనుచు,
జెలఁగ మదర్పితాఖలభారుఁ డగుచు
ద్వంద్వవిహీనుఁడై నర్తించు టరయ
నవమభక్తిపథం బనన్ విదితంబు.
పరగ నీ నవవిధభక్తిమార్గముల
నే యొక్కటైన సాధించినవారు-
అరయ స్త్రీలైనను- బురుషులే యైన-
సర్వచరాచరజగతి నేదైన-
అస్మన్మహాప్రేమకర్హతఁ గాంచు.
ఈ నవధాభక్తిలోన నన్నింట
సిద్ధురాలవు నీవు శుద్ధాత్మురాల!
అలయోగిదుర్లభమైన సత్పదము
నీకు సులభ్యము నేఁ డహా? శబరి!
భవ్యమద్దర్శనపరమాద్వితీయ
ఫలముగా జీవుఁడు స్వస్వరూపంబు
నొంది శాంతించు నానందంబు నొంము.
జనకసుతాసమాచారంబు నీకుఁ
దెలిసినవఱ కిదే తెలుపుమా, శబరి!."
అనవిని శబరి యి ట్లనియె నత్తఱిని:
"పంపాసరోవరప్రాంతంబు కరుగు
మో రఘువల్ల భా! ఓ రామచంద్ర!
సుగ్రీవునకు నీకు సుస్థిరమైత్రి
అచ్చోట లభియించు; నాతఁడు నీకు
విదితం బొనర్చు నా విషయంబులెల్ల.
ఓ ప్రభూ! రఘువర! ఓ శుభాకార!
ఈ వెఱుంగని దున్నదే, మహాధీర!
న న్నడుగన్ బని నాథ! నీకేమి?"
అనిపల్కి శబరి రామాంఘ్రిపద్మముల
మాటిమాటికి వ్రాలి మహితానురక్తిఁ
దన గురూత్తముఁడు మతంగమహర్షి
తనకుఁ జెప్పిన యట్టి ఘనవిషయములు
తాను శ్రీరఘురామదర్శనార్థంబు
వేచియుండిన యట్టి విషయంబు నెల్ల
ఎఱిఁగించె నానందపరవశయగుచు.

శబరీమోక్షము

సర్వవృత్తాంత మా చందంబు తెలిపి
రఘురామచంద్రపరబ్రహ్మమూర్తి
నట్టె వీక్షించుచు- ఆ స్వరూపమును
హృదయపద్మమునఁ జెదురనిరీతి
నిల్పి మహాభక్తి నిష్ఠాత్మ యగుచు,
తనువును యోగాగ్ని దగ్ధం బొనర్చి
వరపునరావృత్తివిరహిత మైన
హరిపదంబును జేరె నా సాధ్వి శబరి.
"ఓ మహాజనులార! ఒకమాట వినుఁడు!
అత్యంతదుఃఖదాయకములై నట్టి
బహువిధకర్మల, పాపజాలముల
నానామతంబుల నాయనలార!
విడనాడి నిశ్చలవిశ్వాస మెసఁగ
రామపాదాబ్జానురాగులు కండు!"-
అని తులసీదాసు వినతిఁ గావించు.

శ్రీరామచరితమానసము

అరణ్యకాండము

షష్ఠవిశ్రామము

భవ్యవధూయుక్తాంకా!
దివ్యరథారూఢ! దేవదేవ! ముకుందా!
శ్రావ్యసుతూర్యారావా!
అవ్యయ! శ్రీమట్టపల్లి హరి! నరసింహా!

నిరుపమబలదీప్తనరసింహు లైన
రామలక్ష్మణు లిద్ద ఱా మహోవనము
సైతము విడనాడి చనిరి ముందునకు.
జానకీవిరహవిషాదభారమున
లక్ష్మణుతోడ శ్రీరామచంద్రుండు
వచియించె కథల, సంభాషణల్ సలిపె:
"ఇదె లక్ష్మణా! చూడు-మీ వనశోభ!
ఎవనికిఁ గల్గింప దెదను సంక్షోభ!
కామినీసంయుక్తఖగమృగగణము
సౌమిత్రి! ననుఁగని సలుపు దూషణము.
పరికించి నన్న దే భయమునఁ బారు
మృగములఁ గని మృగీబృందంబు లాపి,
"భీతిల్ల బనిలేదు; స్వేచ్ఛ జరించి
సంతోషపడవచ్చు: చనుటయ దేల?
బంగారు లేడికై వచ్చె నాతండు."-
అని చెప్పుచున్నవన్నా! కనుమోయి!
కరిణీతతిన్ బాయకన్ జనుకరులు
నీతిపాఠమునాకు నేర్పు నట్లుండె.
ఎంతపండితుఁ డైన నే ప్రొద్దు శాస్త్ర
చింతన పలుసార్లు చేయుచుండినను
శాస్త్రమర్మమ్ములు జ్ఞాతముల్ గావు:
ఎంతసేవించిన నృపుని మనస్సు
కనిపెట్టు టెంతయుఁ గష్టమ్ము సుమ్ము.
శాస్త్రంబు లట్టుల శ్లోకపతియట్లు
తన్వి నొకం డెంత తన స్వాంతమందు
నిలుపుకొన్ననుగాని, నిజ మెంచునెడల
సంపూర్ణముగ గాంత స్వాధీనమయ్యె-
నని చెప్పవీలుగా దనుజ! సౌమిత్రి!
మధురమనోజ్ఞ మీమధుమాస మకట!
ప్రియురాలు లేమిచే భీతిల్ల జేయు.
విరహాకులుండ, నిర్వీర్యుండ, నౌట
గమనించి, మదనుండు ఘనవనమధుప
ఖగసంఘసుభటనికాయంబుతోడ,
నన్నెదిరింపఁగా సన్నద్ధుఁ డయ్యె.
కాని, నే నొక్కఁడగాక, నీతోడ
కలసి యుండినవార్తఁ దెలుపఁగా దూత,
దండును నిలిపినన్ దాకఁగా వెఱచి
ఆ చిత్తభవుఁడు వెన్కాడుచున్నాడు.
వివిధమహావృక్షవివృతలతాళి
ఘనవితానంబులుగాఁ గానవచ్చు;
వరకదళీతాళపంక్తులు వెలయు
ధ్వజపతాకంబులవలె వెలుఁగొందు;
ధీరుఁడే వీనిని తిలకించి నిలుచు

వైకల్య మొందక భావంబునందు.
వివిధపుష్పాంచితవిటపరాజములు
బహువిధకవచాత్తభటు లటుల్ తనరు;
అటనట వేఱువేఱగు ప్రదేశములఁ
గనఁబడు సుందరక్ష్మారుహావళులు
అటనట విడియు సైన్యాధినాయకులు;
కూజితపికకోటికుంజరగణము;
ఖగకాకగణముష్ట్రగార్దభచయము;
కీరచకోరమయూరసంఘములు
వరమనోహరమహాశ్వప్రసంతతులు;
పారావతమరాళవర్గంబు లెల్ల
యవనదేశాగతజవనాశ్వసమితి;
తిత్తిరలావసంతతులు పదాతు
లహ! మన్మథవరూథ మంతయుఁగూడ
వర్ణనాతీతమై భాసిలుచుండె.
గిరిశైలపంక్తులు వరరథశ్రేణి;
నిర్ఝరుల్ దుందుభినికరంబులోయి!
చాతకంబులు వందిజననికరములు;
ముఖరితమధుకరంబులు తూర్యరవళి;
మందశీతలగంధ మలయానిలములు
ఆ పంచశరుదూత లనుజ! సౌమిత్రి!
ఆ మదనుండు మదాతిరేకమున
చతురంగబలసమన్వితుఁ డౌచు వెడలె
రణభేరి మ్రోగించుకొనుచు నెల్లెడల.
స్మరు నుగ్రసంగ్రామసంరంభ మరసి
చలియింపకను నిల్చు జనుఁడె ధీరుండు.
కాముని బలమెల్ల కామినియండె
కల; దట్టి కామినీకామవశుండు
కానివాఁడేనుమా కన మొనగాడు.
వత్స! ఓ లక్ష్మణా! ప్రబలాతిప్రబలు
రగు దుష్టశత్రువుల్ ముగు రెంచిచూడ:
కామము, క్రోధము, ఘనలోభగుణము.
విజ్ఞాననిధులైన విబుధులఁగూడ
అవి క్షోభపెట్టును స్వాంతరంగమున.
కామభావమునకుఁ గామిని బలము;
క్రోధగుణమ్మునకుఁ దలపోయఁ
బరుషవాక్యంబులు బలము కుమార!
ఇఁక లోభగుణమున కిచ్చయు, దంభ
మును, బలంబునుగూర్చు నని మహామునులు
కడు విచారణ చేసి నుడివియున్నారు."
అలఁ ద్రిగుణాతీతుఁ డఖిలవిశ్వేశుఁ
డఖిలగతుండు దివ్యానందమూర్తి
యైన శ్రీరాముఁ డాహా! యీ విధానఁ
గామార్తు లగువారి గతినిఁ జూపించి
ధీరమానవుల మదిన్ విరాగమును
సుప్రతిష్ఠిత మొనర్చుటకైఁ నటించె.
ఆ రామచంద్ర దివ్యానుగ్రహమున
రూక్షకామక్రోధలోభమోహాది
మాయావికారముల్ మటుమాయమాను.
కన జగన్నాటకఘననసూత్రధారి
యగు రాముకృపఁ గాంచి నట్టి జీవుండు,
జగతి నాతని యింద్రజాలంబుచేత
విభ్రాంతి నొందఁ డో ప్రియసఖీ! వినుము-
శివదర్శనంబు వచింపుచున్నాడ:
హరిభజనముసత్య, మఖిలజగంబు
స్వప్నసమాన,మసత్యమ్మునుమ్మీ!

పంపాసరోవరాభివర్ణనము

శ్రీరామలక్ష్మణుల్ చారుగభీర
పంపాసరోవరవరతీరమునకుఁ
జేరి; రా రమ్యకాసారజలంబు
సత్పురుషుని మనస్సారస మటుల
అతినిర్మలం బయి అలరాడుచుండె.
వరుస దానికి నాల్గువైపులయందు

సోపానపంక్తులు శోభిలుచుండె.
అలమహోదారగృహస్థనివాస
మాశ్రయించెడి యాచకాళిచందమున
వివిధమృగాళి యా విమలోదకములఁ
గ్రోల వచ్చుచునుండి గుంపులు గూడి.
దుర్గ! మాయాచ్ఛన్ననిర్గుణబ్రహ్మ
మ ట్లగోచర మౌచు అలరారుచుండు
అగణితకమలపత్రావృత మైన
తత్సరోవరమహోదక మరయంగ.
క్షితి ధర్మశీలుని జీవనయాత్ర
సతము శాంతంబుగా జరుగు తెఱంగు,
ఆ యగాధసరోవరంబువులందు
మత్స్యముల్ సుఖముగా మను నిరంతరము.
వివిధవర్ణాబ్జముల్ వికసించియుండె;
మధుప మరాళసుమధురగీతములు
శ్రవణపేయంబులై రాజిలుచుండె;
కలహంసజలపక్షికలకలధ్వనులు
శ్రీరామచంద్రు దర్శించి హర్షమునఁ
జేయు సన్నుతు లట్లు చెలరేగుచుండె;
బకచక్రవాకాదిపక్షుల శోభ
వర్ణనాతీతము; వానిని కనులఁ
గాంచిన వారలే గ్రహియింపఁగలరు;
రమ్యవిహంగసుశ్రావ్యరావములు
బాటసారులఁ బిల్చి పగిదిగాఁ దోఁచు;
ఆ సరోవరతీర మండె వెలొందు
మునుల పర్ణకుటీరములు సుందరముగ;
చుట్టును గన్పట్టు దట్టమౌ అడవి.
వకుళకదంబచంపకసువిశాల
వటతమాలరసాలపనసపనాస
పాటలాదికపాదపంబు లన్నియును,
పల్లవకుసుమసంభరితంబు లగుచు
భృంగసంగీతసంభృతములై యొప్పు.

మందశీతలగంధమారుతం బెప్పుడు
వీడక నచ్చోట వీచుచునుండు.
కూహూ కుహూ రూపకోకిలారవళి
ధ్యాననిమగ్నులౌ తాపసజనుల
చిత్తముల్ చలియింపఁ జేయుచునుండు.
ప్రథితపరోపకారపరాయణు లగు
సజ్జనుల్ కడు గజసంపద లుర్విఁ
బొందినకొలఁదిగా, భూరినమ్రతను
బ్రకటించు నట్లుగా, ఫలభారవశత
వసుధఁ దాకుచునుండె వంగి వృక్షములు.
శ్రీరామచంద్రుఁ డీ శృంగారభరిత
పంపాసరంబును బరికించి, అందు
స్నానం బొనర్చి ప్రసన్నత నొంది,
తత్సమీపస్థసుందరతరుచ్ఛాయఁ
గూర్చుండె లక్ష్మణుఁగూడి; అత్తఱిని,
చనుదెంచి అచటికి సర్వానుపర్వ,
మునిజనుల్ భక్తితో వినతు లొనర్చి
తమతమ నెలవులఁ దాఁ జేరుకొనిరి.
పరమప్రసన్నతాభావ మెసంగ
ఆ కరుణామూర్తి ఆసీనుఁ డగుచు
సలిపె సౌమిత్రితోఁ స్వాదుభాషణలు.

నారదమహర్షి శ్రీరామదర్శనార్థము వచ్చుట

జానకీవిరహావిషణ్ణరాఘవుని
గాంచి నారదమునికలవర మొంది,
"మచ్ఛాపవశమున మహి, రాముఁ డకట!
దుఃఖవారాసిలోఁ దోఁగుచున్నాఁడు;
ఆ దయానిధికడ కరిగి దర్శింపఁ
దగు సమయంబిదే దర్శించివత్తు."
నని తలపోసి హస్తాబ్జంబులందు
వీణె వెలుంగఁగా వెడలె వేవేగ
వృక్షమూలంబున వేంచేసియున్న

రఘురామచంద్రపరబ్రహ్మకడకు.
అ ట్లేగి ఆ ముని అతివిశదముగ
రామగుణంబుల ర క్తితోఁబాడి
ఆ ప్రభుపాదంబులందున ద్రావె.
అంత శ్రీరఘునాథుఁ డమ్మునినెత్తి
కడు దీర్ఘ కాలము కౌఁగిటఁజేర్చి;
కుశలాదు లడిగియుఁ గూర్మిఁ వెలుంగఁ
జెంత గూర్చుండగాఁజేసె; నత్తటిని;
రామాంఘ్రిపద్మముల్ లక్ష్మణస్వామి
మెత్తగాఁ గడుబ త్తి నొత్తుచునుండె.
అంత నారదమని ఆ రామచంద్రు
వివిధవిధంబుల వినుతిఁ గావించి
స్వామిప్రసన్నత స్వాంత మం దెఱిఁగి,
అంజలిబద్ధహస్తాంబుజుం డగుచుఁ
బలికె నీ తెఱఁగునఁ బ్రభుని వీక్షించి:
"ఓ సహజోదార! ఓ రఘునాథ!
అందఁగాఁ దగినవి అందరానట్టి-
వరము లిచ్చెదవు నీ పాదభ క్తులకు.
తలఁపఁగా స్వామి వంతర్యామి వీవు-
ఎల్ల అవాంఛల నెఱుఁగుదు వీశ!
మామూలురీతి నా మనసునఁ గల్గు
వాంఛను దీర్పఁగా వరముఁ బ్రార్థింతు."
అనవిని రఘునాథుఁ డనియె నీ రీతి:
"మునినాథ! నీవు నా మన సెఱుంగుదువు-
దాసులకడ నేనుఁ దాచ నేదియును.
ఎంచగా నేను నీ కీయగా రాని
ప్రియవస్తు వేమిండు? విమలమునీంద్ర!
ఏ నివ్వజాలని దేదియు లేదు;
ఈ వాక్యమును నమ్ము మెప్పుడుఁగూడ
కలనైన భ్రమ నందవలదు దేవర్షి!"
అనవిని నారదుం డనె హర్ష మొంది:
"ఏఁ గోరు వర మిదియే దేవదేవ!
స్వామి! నీకు సహస్రనామముల్ కలవు-
ఒక్కదానికన్న నింకొకటి ఘనంబు-
వేదముల్ తెలిపె నీ విషయంబు నాథ!
అయినను ఖగముల వ్యాధునివోలె
చండాఘసంతతిఁ జెండాడుటందు
రామనామము, మించి రాజిల్లుఁగాక!
భక్తిస్వరూపమా పౌర్ణ మీరాత్రి
త్వద్భక్తనిర్మలస్వాంతాంబరమునఁ
దదితరనామముల్ తారకల్ గాఁగ
రామనామంబు విరాజిల్లుఁగాక
చంద్రబింబంబుగా జానకీనాథ!"
అనుచుఁ బ్రార్థింపఁ గృపాబ్ధి రాఘవుఁడు
హృదిని బ్రసన్నుఁడై, 'ఏవమ' స్తనియె.
నారదమునియు మనంబున మిగుల
సంతోష మొందియు స్వామి యంఘ్రులకుఁ
బ్రణతు లర్పించెను పార్వతీ! వినుము.
జానకీపతి సుప్రసన్నుఁడై యుంటఁ
గని నారదుం డిట్టులనె మృదువాణి:
"నాథ! నీ మాయ ఆ నాఁడు నాపైనఁ
బ్రసరింప, నేను వివాహ మాశింప,
దేనికి నా కోర్కెఁ దీర్పకుండితివి?"
అనవిని శ్రీరాముఁ డంత నిట్లనియె:
"ఎవ రనన్యశరణ్యాహృదయులై నన్ను
భజియించుచుందు రా భక్తజనాళి
వలయు యోగక్షేమములనెల్ల నేనె
చూతును శిశువుల మాతచందముగ-
వినుమిది- చెప్పుచుంటిని దృఢంబుగను.
అగ్నినో- పామునో- అరసియు శిశువు
పట్టుకొనన్ గోరి పరువిడ, తల్లి
పోనిచ్చునా? గుంజిపోనివ్వఁబోదు.
ఆ బిడ్డయే పెద్దయూ ననుకొనుము-
తల్లి కా సుతునిపైఁ దగఁ బ్రేమయుండు;

కాని, యప్పటి రీతిగాదిది వేఱు.
జ్ఞానులు పెద్దవారైన నా సుతులు;
నమ్రులౌభక్తులో- నాపసిబిడ్డ;
లలభక్తజనులు నాయందే సతంబు
ఆధారపడియుందు; రల జ్ఞానులన్న
ఆత్మబలంబుపై నాధారపడెద;
రుభయులకున్ దప్ప దుగ్రకామాది
శత్రులతోఁ బోరు, సంయమివర్య!
ఈ రహస్యమును గ్రహించి పండితుఁడు
నన్ను భజించు ననారత మాత్మ;
భక్తిని విడువడు పరగ జ్ఞానంబు
నొందియుఁగూడ ఋష్యుత్తమా! వినుము!
రూక్షకామక్రోధలోభమదాదు
లజ్ఞానశత్రుని అతిబలోపేతు
లగు ముఖ్యభటులు మహర్షివతంస!
ఆ సైన్యమందు మహాఘోరదుఃఖ
దాయకం బైనది మాయాస్వరూప
మగు కామినియెసుమా- అరసిన యెడల.
వేదపురాణముల్ విబుధగణంబు
లిట్లు వచించు మునీశ్వరా! వినుము:
కనఁగఁ గామిని మోహావనవసంతంబు;
జపతపవ్రతజలాశయనిదాఘుంబు;
మఱియుఁ గామక్రోధమదమత్సరాది
బహుళభేకానీకవర్ష కాలంబు;
ఘోరదుర్వాసనాకుముదసమూహ
సర్వదాసుఖదభాస్వచ్ఛరద్రుతువు;
అఖిలధర్మాంబుజహరణ హేమంత;
మలమమతా*'యవాసానీక'శిశిర;
మో నారదా! భక్తియోగజ్ఞ! వినుము.
మఱియుఁ బాపోలూకమండలంబులకు
గాఢాంధకారంబు- కామిని యనుచు,
సద్బుద్ధిబలశీలసత్యమత్స్యముల
పాలిటి బడిశంబు-భామినియనుచు,
విజ్ఞు లుద్ఘోషింత్రు విశ్వరంగమున.
అవగుణమూలంబు, అఖిలదుఃఖాల
వాలంబు, హృత్పద్మశూలంబు, తరుణి;
అందుచే నారదా! ఆ నాఁడు నీకుఁ
బెండ్లి, కాకుండఁ గావించితి నంతె."
అనిపల్కె- రాము దివ్యామృతోక్తులను
విని, నారదుఁడు హర్షవివశతన్ గాంచె-
తనువెల్లఁ బులకింపఁ గనుల నీరొలుక.
"ఆహాహా! సేవకులం దింతప్రీతి
మమకార మే ప్రభుమతి నుండఁగలదు?
భ్రమవీడి యిట్టి శ్రీరాముని భజనఁ
జేయనివారు ఛీ! ఛీ! జడమతులు,
పరమదౌర్భాగ్యులు పరికించునెడల."-
అనుచుఁ జింతించి యా ముని నారదుండు
మఱలఁ బ్రార్థించె నమ్రత వెలుగొంద,
సర్వవిజ్ఞానవిశారదా!నాథ!
ఓ రఘువీర! సంసారవిదూర!
భక్తలక్షణములఁ బ్రవచింపు"- మనుచు.
అంతట రాముఁడిట్లభివచియించె:

శ్రీరాముఁడు నారదమునికి భక్తలక్షణంబులు
సెప్పుట

"ఆలింపు మనఘ! మహోత్కలగుణము;
లవి యుంటచేతనే అనవరతంబు
వారికి నేఁ బూర్ణవశ్యుండ నగుదు.
జితషడ్వికారులు, హతదోషచయులు,
నిష్కాము, లానందనిధు, లకించనులు,

---

* యవాసానీకము=తీఁటకసిందచెట్టులు.

శుద్ధులు, నిశ్చలుల్, సుజ్ఞానగుణస
మృద్ధు, లనీహులు, మితభోగయుతులు,
సత్యసంధులు, కవుల్, సములు, కోవిదులు,
యోగులు, ధీరు, లత్యున్నతమతులు,
మానప్రదుల్, మదహీనులు, ధర్మ
మార్గధురంధరుల్, మహితసద్గుణులు,
భవదుఃఖరహితులు, పరమపావనులు,
విగతసంశయులు, గభీరమానసులు,
మత్పదాంభోజైకమహితానురాగ
నిర్లక్ష్మీతాఖిలనిజదేహగేహు,
లాత్మస్తవైకపరాఙ్ముఖుల్, సతత
పరగుణశ్రవణైకపరమహర్షణులు,
సములు, ప్రసన్నులు, సరళస్వభావు,
లనురాగమయులు, మహానీతిపరులు,
జపతపోవ్రతదమసంయమనియము,
లాచార్యభూసురహరిపాదరతులు,
శ్రద్ధాన్వితులు, క్షమాసహితులు, హితులు,
పరమదయాళువుల్, నిరతప్రహర్షు,
లస్మత్పదాబ్జప్రియామలమతులు,
విరతివివేకసద్వినయవిజ్ఞాన
వేదపురాణసద్వ్యాదుష్యయుతులు,
మదదంభమానదుర్మార్గసుదూరు,
లాత్మీయదివ్యలీలావళీశ్రవణ
సంకీర్తనానందసంతతరతులు,
నిరతనిర్హేతుకపరహితంకరులు—
సత్పురుషులు— మునీశ్వర! వేయునేల?
భారతీశ్రుతులును వర్ణింప లేవు
సాధుసత్పురుషుల సద్గుణకోటి.
అమ్మహామహుల దీవ్యద్గుణావళిని
శారదాశేషులు సైతంబుఁ దెలుప
నసమర్థు లో నారదా! మునినాథ!"

అని పచియింపఁగా విని, నారదర్షి.
రఘురామపాదనీరజముల వ్రాలె.
ఇట్లా కృపామూర్తి, యినవంశవిభుఁడు
దీనబాంధవుఁడు, వై దేహిప్రియుండు,
భక్తగుణంబుల స్వయముగాఁ దెలిపె.
నారదుఁ డంతఁ బునఃపునఃప్రణతు
లర్పించి రామపాదాంబుజంబులకు
బ్రహ్మలోకమునకుఁ బయనించె గౌరి!
ఆశల నన్నింటి నావలఁ ద్రోసి
హరిపాదపంకజనిరతులా వారె—
ధన్యధన్యు లటంచు— ధరఁజెప్పి తులసి.
అహ! రావణారిభవ్యస్తవంబులను
విన్నను, బొడిన, విమలప్రగాఢ
రామభక్తి లభించు— నా మానవునకు
వైరాగ్యజపయోగపరత లేకున్న.
కామినీదీపశిఖల్ గోరి నీవు
శలభంబవై మనసా! చెడవలదు.
కామాదిశత్రవగణముఁ ద్యజించి,
రామాంఘ్రియుగమనురక్తి భజించి
సర్వదా సత్సంగసౌఖ్య మార్జించి,
తరియించు మిప్పుడే! తరియించు మిపుడె!

సుగంధివృత్తము

మంగళంబు, కేశవర్షిమానసాలయా! ప్రియా!
మంగళం, బురుక్రమా! రమానివాస! నిర్భయా!
మంగళంబు, ఘోరదైత్యమర్దనా! జనార్దనా!
మంగళంబు, మట్టపల్లిమందిరా! నృకేసరీ!

ఓమ్ ఓమ్ ఓమ్

ఇది సకలకలికలుషవిధ్వంసక మైన శ్రీగోస్వామి తులసీదాసకృత- 'శ్రీరామచరిత
మానసము' లోని ఆరణ్యకాండమునకు-శ్రీ రామతీర్థభగవత్పాద
ప్రియశిష్య నిరంతర శ్రీ మట్టపల్లి లక్ష్మీనృసింహా
పరబ్రహ్మావాస హృత్పద్మతీర్థ శ్రీ కేశవతీర్థ
స్వామికృతమైన యాంధ్రానువాదము
సర్వము సంపూర్ణము

ఓం తత్సత్

٥٩٨

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరామచరితమానసము

కిష్కింధా కాండము

చతుర్థోపానము

498

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరామచరితమానసము

కిష్కింధా కాండము

చతుర్థ సోపానము

ప్రథమవిశ్రామము

శ్రీకర! శుభకర! భక్తవ
శీకర! శివచిత్తచోర! శ్రితభర! కారు
ణ్యాకర! మునిమోహనది
వ్యాకారా! మట్టపల్లిహరి! నరసింహా!

కుందేందీవరరమ్యమూర్తులు,
లసత్కోదండు, లుద్యద్బలుల్
సౌందర్యాబ్ధులు, జ్ఞానధాములు, హితుల్,
సద్ధర్మవర్మల్, త్రయీ
బృందస్తుత్యులు, గోద్విజావనచణుల్,
లీలానరాకారు,ల
య్యిందుబ్రధ్ననిభుల్, రఘూద్వహులు, శ్రీ
పృథ్వీసుతాన్వేషు లా
నందంబొప్పఁగ భక్తిభాగ్యమిడి న
న్నాలింత్రుగాకన్ సదా.

గంభీరాగమవార్ధిజాత, మఘ
సంఘాతాంతకం, బవ్యయం,
బంభోజాసనకీర్తితంబు, భవ
రోగార్తిప్రదూరంబు, త
చ్చుంభచ్చుంభుముఖేందుశోభితము,
శ్రీక్షోణీసుతాజీవనా
రంభంబౌ రఘురామనామసుధఁ
గ్రోలన్ ధన్యత న్గాంచమే!

కథాప్రారంభము

శ్రీకరంబును ముక్తికాకరం బనుచు
ప్రజ్ఞానఖని, పాపభంజనం బనుచు
గ్రహియించి మనమునఁ గడుభక్తిగదుర
పార్వతీపరమేశవాసమై తనరు
కాశిని సేవింపఁ గాంక్షింప వేల?
సురబృందములు దేనిఁ జూచినయంత
దందహితాత్మలై తల్లడపడిరొ?
ఆ కాలకూట మహావిషవహ్ని
నవలీలఁ గ్రోలిన యా నీలకంఠు
నీ వేలఁ గొలువ? వో నీచమానసమ!
ఆ శివుకన్న దయాళు వెవ్వండు?

సుగ్రీవుఁడు రామలక్ష్మణులకడ
కాంజనేయునిఁ బంపుట

అటనుండి వెడలి రామావనీవిభుఁడు
ఋష్యమూకాద్రిఁ జేరెను మునిరాజ!
ఆ ఋష్యమూకశైలాగ్రభాగమునఁ
గీశపుంగవుఁడు సుగ్రీవుఁ డమాత్య
వర్గంబుతోఁ గూడి వసియింపుచుండె.
ఆతఁ డా యతులమహాబలనిధుల
రామలక్ష్మణుల దూరంబునఁ జూచి
కడుభయ మొందియుఁ గని హనుమంతుఁ
బలికె నీ రీతిగాఁ; బవమానతనయ!
ఆ వచ్చినరు లిర్వు రరయఁగా మహిత
బలరూపనిధులయి భాసిలుచుండ్రి,
వటురూపమును బూని వారిచెంగటికిఁ
జని నీవు వారలస్వాంతం బెఱింగి
సైగఁజేయుము నాకు సచివవతంస!
వాలిపంపున వారు వచ్చినయెడల
ఈ పర్వతము వీడి యేను సత్వరము
పాఱిపోఁగల నిదే, ప్రాణాలుదక్క."

శ్రీరామాంజనేయుల సంభాషణము

అన విని హనుమానుఁ డా ఋణమండె
విప్రరూపముఁ దాల్చి వెడలి యవ్వారి
చెంతకేగియు నమస్కృతులఁగావించి
పలికె నీ రీతిగా లలితవాక్యముల:
"ఋత్రియాకృతులతోఁ గానలం దిరుగు
శ్యామలగౌరవర్ణాంగులౌ మీర
లెవ్వరో? వచియింపుఁడీ వీరులార!
కఠినకంటకశిలాకలితమార్గముల
భవదీయమృదుపాదపద్మముల్ పొక్క
ఈ కాననలో మీర లేలఁ జరింప?
ఓ స్వాములార! సరోత్తములార!
కమనీయకోమలగాత్రులౌ మీర!
లహా! మహారణ్యవాతాతపక్లేశ
ముల నెట్లు భరియింపఁ గలుగుచున్నారు?
మీరు త్రిమూర్తులన్ జేరినవారొ?
అల నరనారాయణులో? లేనియెడల
భవసాగరముఁ దరింపఁగఁజేయుకొఱకు
భూభారమంతయుఁ బోఁగొట్టుకొఱకు
ఆ జగత్కారణుఁ డఖిలేశ్వరుండు
మీరూపములతోడ మేదినిపైన
అవతారములఁ దాల్చెనా? చెప్పరయ్య!"
అన విని శ్రీరాముఁ డనియె నీపగిది:
"కోసలాధీశుఁడై కొమరొందినట్టి
దశరథరాజేంద్రుతనయుల మేము.
మా తండ్రియాజ్ఞను మహిని బాలింప
వనగగ్భముల కేము వచ్చియున్నాము.
మే మన్నదమ్ముల మో మహితాత్మ!
రామలక్ష్మణు లని నామధేయములు.
మత్పత్ని యతిసుకుమార వినీత
సుందరాకారసంశోభిత సీత
మా వెంట వచ్చె, నా మైథిలి నొక్క
యసురుండు హరియించె; నామెకై మేము
విపినంబులెల్లను వెదకుచున్నాము.
ఇది మా చరిత్ర వచించితి; మింక
నీ చరిత్రంబు విన్పింపుమా విప్ర!"
అన విని హనుమంతుఁ డంతరంగమున
నా రాముఁ దననాథుఁ డని గ్రహియించి
సాగిలఁబడె వానిచరణాంబుజముల.
ఆ యాంజనేయుమహానంద మెన్న
వాక్కులు చాలవు పర్వతతనయ!
ఆతనితనువు రోమాంచితం బయ్యె;
వాక్కులు స్తంభించెఁ; బరవశుం డగుచు
ఆతఁ డూరక వారి యనుపమరమ్య

వేషముల్ కనులార వీక్షింపసాగె.
అటు చూచి చూచి యయ్యాంజనేయుండు
కడకు సంస్మృతిగాంచి కడుభక్తితోడ
సంస్తోత్ర మొనరించి స్వాంతరంగమునఁ
బరగ హర్షించుచుఁ బ్రభుఁ గంటి ననుచు
నీ రీతి వచియించె నింపు సొంపెసఁగ:
ఏ నిన్నుఁ బ్రశ్నించు టెన్న న్యాయంబె;
కాని– నీ వొక లోకమానవు నట్లు
ప్రశ్నింతు వేల? శ్రీరామ! లోకేశ!
భవదీయమాయ కే వశ్యుండ నగుట
నిన్ను గుత్తింపఁగా నేరకపోతి.
మొదలు, నే మందుఁడ, మోహవశుండఁ,
గుటిలుండ, నజ్ఞానగుణసమేతుఁడను–
ఇవియన్ని యి ట్లుండ నేమి వచింతు?
దీనబాంధవులైన దేవరవారు
సైతంబు మఱచిరి స్వాంతంబునందు.
సర్వాపరాధిని స్వామి! నే నెన్న;
ఐనను ప్రభువువా రంతరంగమున
సేవకు మఱువఁగాఁ జెల్లునే? నాథ!
భవదీయమాయచే బద్ధుఁడైనట్టి
జీవుఁడు త్వత్కృపచేతనే మఱల
ముక్తి నెన్నటికేని బొందఁగావలెను.
అదిగాక, రఘునాథ! అఖిలలోకేశ!
పలికెద భవదీయపాదసాక్షిగను:
సృజించుపథాల నే నేవి యెఱుఁగ–
'దాసోహ మను నొక్క దారియే'– తెలియు.
స్వామిపై ఆధారపడి సంతతంబు
కింకరుం డెప్పు డకించనుఁ డగుచు
నిశ్చింతగా నుండు నిరతంబు ధరణి–
పరగఁ దా నాధారపడి తల్లిపైన
జీవించుచుండెడి శిశువుచందమున.
ప్రభు! నీదె సర్వభారము ననుఁ గావ–

అని వచియించి యా హనుమంతుఁ డంత
విహ్వలుఁడై రఘువీరు పాదముల
వ్రాలి, నిజాకృతిఁ బ్రకటించె; నతని
భావము భక్తిచేఁ బరవశంబయ్యె.
అంతట రఘుపతి యయ్యాంజనేయు
లేవనెత్తియుఁ గౌఁగిలించి సంప్రీతి
అశ్రుధారలఁ దను వంతయుఁ దడిపి
చల్లార్చి ఆతని సంతాపమెల్ల–
పలికె నీ విధముగ వాత్సల్యమొప్ప:
"వినుమోయి కపినాథ! విడుము వ్యాకులము.
నీవు లక్ష్మణుకన్న నిజమెంచి చూడ
రెట్టింపుగా నాకుఁ బ్రియుఁడవు సుమ్ము.
'సమదర్శి' యందురు సర్వులు నన్ను;
కాని యస్మదనన్యగతికసేవకులు
నా కతిప్రియులు; వానరయూథనాథ!
ఈ చరాచరజగమెల్ల నా స్వామి
దివ్యస్వరూప; మా దేవదేవునకు
నేను దాసుఁడ నంచు నిశ్చలదృష్టి–
ఎవ్వఁడు పొందునో– ఎంచ నాతండె
అస్మదనన్యభక్తాగ్రగణ్యుండు."
అన విని తనస్వామి యనుకూలుఁ డగుచు
సుప్రసన్నుండయి చూపట్టు టెఱిఁగి
పవమానసుతుఁడు హృద్వ్యాకుల మెల్ల
విడి హర్ష మొంది యీ విధము వచించె:
"ప్రభు! రామచంద్ర! యీ పర్వతాగ్రమున
సుగ్రీవుఁ డను కపీశుఁడు వసియించు;
అతఁడు భవచ్చరణాబ్జసేవకుఁడు;
అతనితో మైత్రిసేయుఁగఁ బ్రార్థనంబు.
దేవ! ఆ సుగ్రీవుదీనత నెఱిఁగి
ఆతనిభయముఁ బోనాడుమా స్వామి!
అతఁడు సీతాన్వేషణార్థ మగణ్య
కపిసైన్యములఁ బంపఁగలఁడు దిక్కులకు–

కార్యంబు సిద్ధించుఁ గాకుత్సతిలక!"
అని సర్వవృత్తాంతమును వినిపించి
ఆ మరుత్సుతుఁడు శ్రీరామలక్ష్మణుల
మూపునఁ గైకొని పోయె సత్వరము
పర్వతాగ్రమునకుఁ బార్వతీ! వినుము.

రామసుగ్రీవులమైత్రి

శ్రీరామచంద్రు దర్శించి నంతటనె
కేశవల్లభుఁడు సుగ్రీవుండు మదిని
తనజన్మ మిక్కిలి ధన్యతఁ గాంచె
నని సంతసిలుచు మహోదగ మొప్ప
నెదురేగి శ్రీవారి పదపద్మములకు
శిరముతాకఁగ నమస్కృతు లొనరించె.
రామలక్ష్మణు లంత రాజితప్రీతిఁ
గౌఁగిటఁ జేర్చి రా కపినాథు నెత్తి.
"అహ! వీరితోఁ మైత్రి యవని ఘటిల్లు
నట్టిభాగ్యము గల్గునా? నా కటంచు"-
అత్తఱి సుగ్రీవుఁ డాత్మఁ జింతించె.
అప్పుడు హనుమంతుఁ డనుకూలఘణితి
ననోన్యవిషయంబు లన్నియుఁ దెలిపి
అగ్నిసాక్షిగఁ దదీయాద్రిరాజమున
రఘునాథకపినాథులకు మైత్రిఁ గూర్చె.
అట్లు మైత్రిఘటిల్లినంత లక్ష్మణుఁడు
శ్రీరాముకథ నెల్లఁ జెప్ప సుగ్రీవుఁ
డశ్రుప్రపూర్ణాక్షుఁడై పల్కె నిట్లు:
"ఓ నాథ! ఓ రామ! యోర్చుఁ డొకింత-
సీతాసమాగమసిద్ధి తప్పకను
గలుగు; నిచ్చట నే నొకానొకదినము
మంత్రులతోఁ గూడి మాట్లాడుచుండ,
ఆ జానకీదేవి యసురచేఁ జిక్కి
రోదింపఁ గంటిమి రోదసీపథిని.
"హా! రామ! హా! రామ! హా! ప్రాణనాథ!"-
అని విలపించుచు అద్రిపై మేము
కనఁబడినంతనే గ్రక్కున విడిచెఁ
జేలాంచలముఁ జింపి శ్రీరామచంద్ర!
అని పల్కి విని, రాముఁ డడుగ నద్దానిఁ
జెచ్చెరఁ దెచ్చి యిచ్చెను గపివరుఁడు.
రాముఁ డా చేలాంచలంబుఁ గైకొనియు
గుండెకు హత్తించుకొని ఖేదమొందె.
అప్పుడు సుగ్రీవుఁ డనియె నీ పగిది:
"వినుప్రభూ! రఘువీర! విడుము శోకమును;
ధైర్యమూనుము నేను దాసుండఁ గలను;
అధిప! సీతాన్వేషణార్థమై నేను
సర్వసన్నాహముల్ సలుపఁగా గలను-

సుగ్రీవుఁడు శ్రీరామునకు స్వీయచరిత్రముఁ జెప్పుట

అన విని తనసఖుం డాడిన పల్కు
లా కృపాసింధుఁ డనంతబలుండు
రామచంద్రుఁడు ప్రహర్షస్వాంతుఁ డగుచు
"ప్రియసఖా! సుగ్రీవ! విపిననివాస
మేల ప్రాప్తించె నీ కెఱిఁగింపు"- మనియె.
అనఁ గపీశ్వరుఁ డిట్లు వినిచె స్వకథన:
"వాలియు నేనును ప్రభు! సోదరులము,
మే మిర్వురముగూడ మిగుల ప్రేమమున
జీవించుచుంటిమి శ్రీరామచంద్ర!
మాటలు చాలవు మాప్రేమఁ దెలుప.
ఇట్లుండ నొక్కనాఁ డేతెంచె మాదు
పురికి మాయాసురపుత్రుఁ డైనట్టి
మాయావి యను నొక్క మదదానవుండు;
నడిరేయి వాఁ డిట్లు నగరికి వచ్చి,
నిల్చి సింహద్వారనికటంబునందు,
యుద్ధంబొనర్ప మాహూద్ధతి నార్చె.
శత్రుఁ డ ట్లెదిరింప సహియింపలేక

వాలియుఁ బర్విడివచ్చెఁ బోరునకు.
వచ్చెడి వాలిని బరికించినంత
భయపడి యాతఁడు పాఱఁగాఁదొడఁగె.
ఆ దైత్యువెంట మా యన్నయుఁ దవిలె;
అన్నపిఱుంద నే నరుగుచునుంటి.
అట్లు తాఁ బాఱి యా యసురుఁ డొక్కెడను
పెద్దపర్వతగుహన్ వీక్షించి దూరె.
అది కాంచి వాలి నన్నరసి, "సుగ్రీవ!
పదునైదుదినములవఱకు నీ విచట
నిలువు; మప్పటికిని నే రానియెడల
హతునిఁగా నను నెంచు మాత్మలో" ననుచుఁ
బలికి తానును గుహ భోగంబుఁ జొచ్చె.
ఒక్కమాసము వేచియుంటి; ఖరారి!
వాలిరాకకు నేను బరికించుచుండ
ఆ గుహనుండి బయల్ దేరె నొక్క
రక్తప్రవాహ ముగ్రస్వరూపమున.
దానిని గాంచి యా దానవుచేత
వాలి వధింపఁగాఁబడె నంచు ఁదలఁచి
ఇక నన్నుఁగూడ వా డే తెంచి చంపు
నని భయమొంది గుహాద్వార మొక్క
పెనుశిలతో మూసి వెనుకకు న్గనక
పాఱి పురంబులో దూరితి స్వామి!
నగరంబుఁ గాంచి యనాథమైయుండఁ
బలుపలువిధముల బలవంతపఱచి
సచివులు రాజుఁగా సలిపిరి నన్ను.

ఇంతలో నట వాలి యార్భించి దనుజు,
వచ్చె ఁగిష్కింధకుఁ- బరికించె నన్ను-
ఉడికిపోయెను వానియుల్ల మంతయును;
చావఁగొట్టియు నన్నుఁ జండకోపమున,
నా భార్యతోఁగూడ నాదు సర్వస్వ
మపహరించియును బొమ్మని హుంకరించె.
ఆతనిభయముచే నతిదీనవృత్తి
ఓ రఘుకులవీర! ఓ రామచంద్ర!
దేశదేశములెల్లఁ దిరిగితి నాథ!
ఈ ఋష్యమూకాద్రి కేతెంచి తుదకుఁ
దలఁ దాచుకొని యుంటి దశరథతనయ!
*ఒకశాప ముంటచే యో దేవదేవ!
వాలి యీ గిరిఁ జేర వలనుగా; వైన
మురిగి చచ్చుచునుంటి మూల నీ రీతి.
ఇ ట్లెంతకాల మే నేగింతు స్వామి!
దిగులుతో దినములు తిరుగు నెట్లెట్లో?"
అను సేవకునిదుఃఖ మాలించినంత
ఆ దీనవత్సలుఁడైన రాఘవుని
ఘనబాహుయుగము ప్రకంపించె సహజ
దీనరక్షణమహోద్యోగ ముప్పొంగ-
శ్రీరాముఁ డనియె- "సుగ్రీవ! ఆలింపు
మొకబాణమున వాని నుర్విపైఁ గూల్తు;
బ్రహ్మరుద్రులె అడ్డు వచ్చినన్ గాని
వాఁడు రక్షింపఁగాఁ బడఁజాలఁ డింక.

---

* మాయావి అను దానవునకు దుందుభి యను తమ్ముఁ డుండెను. దుందుభికూడ ఒకసారి మహిషరూపమును ధరించి వాలి నెదుర్కొనగా నతఁడు వానిని సంహరించి, వాని భయంకరమహాకళేబరమును కిష్కింధానగరమున కెనిమిది మైళ్లదూరమునఁ బడునట్లు విసరటవైచెను. ఆ సందర్భమున నా కళేబరముఖమునుండి కొన్ని రక్తబిందువులు ఋష్యమూకాద్రిపైఁ గల మతంగాశ్రమమునఁ బడెను. అప్పు డాఋషి కుపితుఁడైఁ, "ఎవ్వ డీరక్తబిందువులచే ఆశ్రమమును పంకిలమొనర్చెనో వాఁడా పర్వతమును సమీపించునెడలఁ దల వ్రక్కలై మరణించు" నని శాపమిడెను.

శ్రీరామచరితమానసము

కిష్కింధా కాండము

ద్వితీయవిశ్రామము

శ్రీక్ష్మామండలమండన!
సూక్ష్మోన్నతబుద్ధిదీప్త! సుజనస్తుత్యా!
లక్ష్మీకాంతా! కాబర
లక్ష్మీయుత! మట్టపల్లిప్రభు! నరసింహా!

శ్రీరాముఁడు సుగ్రీవునకు మిత్రభావమును
బోధించుట

"మిత్రమా! ఎవ్వఁడు మిత్రుని దుఃఖ
మరసి దుఃఖముఁ జెందఁ డాతని ముఖము
బరికింప ఘోరమా పాపంబువచ్చు.
తనకష్ట మొకపర్వతం బటులున్న
ఇసుక రేణువునట్లు లీక్షింపవలయు,
హితుని కష్టముచూడ నిసుమంత యైన
పర్వతసమ మట్లు పరికింపవలయు.
ఇట్టి మైత్రీభావ మెసఁగని శఠులు
శుష్క-మైత్రిని బైకిఁ జూపుచుండెదరు.
సత్యమిత్రుఁడు తన సచివుని సతము
చెడుమార్గ మందుండి విడునట్లు చేసి
సన్మార్గమందునఁ జనఁ జేయవలయు.
హితునందు మంచి గ్రహింపఁగాఁ జెల్లు
నిచ్చకాలాడక యెఱుకై నఁగాని
వానిలోగలచెడుఁ బ్రకటించి దానిఁ
దొలఁగింప యత్నింప వలయు సుగ్రీవ!
మఱియు సంశయహీనమతి తనకార
హితున కీయఁగవలె హితుకడఁ దాను
నల్మై గైకొనవలె నరమర లేక
శక్తికొలందిగా సచివుని కతఁడు
సాహాయ్యపడవలె, సచివుఁడు కష్ట
మందున్న వేళల ముందటికన్న
నూఱు రెట్లధికమా భూరిప్రేమంబుఁ
జూపంగవలయును సుగ్రీవ! ఇవ్వి
విహితధర్మములని వేదముల్ పలుకు.
ఎదుట నిచ్చకముల నెపుడుఁ బల్కుచును
మొగముఁ ద్రిప్పినఁ గీడుఁ బొసఁగించు నట్టి
కుటిలచిత్తముతోడ నటియించు నట్టి,
పన్నగం బటు వక్రవర్తనుం డైన
వాఁ డెంచఁగా స్నేహపాత్రుండు గాడు;
వానిని వదలుటే బహుశుభప్రదము.
చింతింప మూర్ఖుఁడౌ సేవకజనుఁడు,
కృపణుఁడౌ నృపుఁడు, దుర్వృత్తయౌ నాతి,
కపటియౌ మిత్రుఁడుఁ- గడుబాధఁగూర్చి-
శూలంబుపోలికసుగ్రీవ! సచివ!
నమ్మినిదే నా బలమ్మ్ము, శోకమ్ము
విడుమోయి, నే సర్వవిధముల నీదు.
కార్యంబు నెర వేర్పఁ గడఁగెద నోయి.!

సుగ్రీవుఁడు శ్రీరామపరాక్రమముఁ
బరీక్షించుట

అనవిని సుగ్రీవుఁ "డనఘ! శ్రీరామ!

వాలిమహాబలశాలి, యత్యంత
రణధీరుఁ” డనిరాఘవునకుఁ జూపించె
నంత దుందుభియొక్క అస్థిపంజరముఁ,
దాళసప్తకమును; దశరథాత్మజుఁడు
వానిని అవలీలఁ బడఁగూల్చె నేల.
ఒక్కబాణముతోడ నోయుమా! వినుము.
అట్లు రాఘవుని మహాబల మరసి
మతినితోధికము రామప్రేమ నొంది
వారక వాలిని వధియింపఁ గలఁడు
శ్రీరాముఁ డనుచు సంతృప్తి వహించె
అంత నా కపినాథుఁ డా రామచంద్రు
పదముల కెఱఁగుచుఁ బలుపలుసార్లు
తనపాలి పరమేశుఁ డని రాము నెఱిఁగి
పరమసంతోషసంభరితాత్ముఁ డౌచు
నుల్లంబులోన జ్ఞానోదయం బొంది
పలికె నీ రీతిగాఁ “ప్రభు! రామచంద్ర!
భవదీయకృపను మద్భావంబు నేఁడు
స్వస్థత వహియించె స్వామి! నే నింక
సౌఖ్యసంపత్పరిజనయశంబులను
ద్యజియించి నీ సేవయందె జీవింతు.
పరికింప శ్రీరామభక్తిమార్గమున
కివియెల్ల నడ్డంకులే యని బుధులు
నిరతంబుఁ గొల్తురు నీ పదాబ్జముల.
క్షితి శత్రుమిత్రులు; ఖేదమోదంబు,
లరయ నన్నియును మాయారచితములు–
మఱి సత్యములు కావు; పరికింప వాలి
శత్రుండుగా డహా! సచివోత్తముండె!
నని యనుగ్రహవశమునఁగాదె
సకలార్తిశమనుని శరణంబు దొరకె.
మేల్కాంచ, కలలోన మించు రోషమున
నెవనితోఁ దాఁ బోరె నింతకు నతఁడు
నన్న వేరైన జనుఁడు గాకుంట
గ్రాహ్యమై సిగ్గొందుగద నరుం డనఘు!
సర్వంబుఁ ద్యజియించి సర్వేశ! నిన్నె
సర్వదా భజియించు శక్తినా కిప్పు
డతికృప న్దయసేయ నర్థింతు స్వామి!”
అను విరాగాయుత మగు కపివాణి
కొమరొప్ప నాలించి కోదండపాణి
చిఱునగవొప్ప వచించె నీ రీతి.
“నీ వన్న దెల్లను నిజమె సుగ్రీవ!
కాని నా మాటలు కల్లలుగావు.”
శ్రీరామచంద్రుఁడు జీవజాలమును
నటుఁడు లోకమున మర్కటమునుబోలె
నాడించు నని శ్రుతులాడు నో గరుడ!
వినుమంత మర్కటవిభుని గైకొనుచు
వెడలె శ్రీరాముఁడు వీరవరుండు
శరచాపములు కరాబ్జముల వెల్గొంద.
అ ట్లేగి రాఘవుఁ డంప, సుగ్రీవుఁ
డల రామచంద్రబలాతిధైర్యమునఁ
జని వాలివాకిట సలిపె గర్జనము.
ఆ గర్జ వినినంత నాగ్రహాతురత
వాలి సౌధము వీడి వడిఁ జనుచుండ
నరుదెంచి యాతని యంగనతార.
పదములఁ బట్టి యీ పగిది వారించె:
“వినుము ప్రాణనాయకా! వినుము నా మాట
సుగ్రీవుపై మైత్రిఁ జూపుచున్నట్టి
ఆ యన్నదమ్ము లుద్యద్దుస్సహోగ్ర
బలశౌర్యధుర్యులు వా రెవ్వ రనుచుఁ
దలపోసినాడవో? దశరథరాజ
రాజకుమారులు రామలక్ష్మణులు–
కదనరంగంబునఁ గాలునిఁ గూడ
నవలీల గెలిచెడి యతులవిక్రములు.”
అనవిని వాలి యి ట్లనె భార్యతోడ:
“పిరికిదానా! వినవే ప్రియురాల!

తన

సమదర్శనుఁడు రఘుస్వామి ఆతండు
నను సంహరింపుచో, నా కేమికొదువ?
వచ్చు నాతని దివ్యపదము, నే నతని
నిజనాథునిగఁ బొంది నిరతంబుఁ గొలుతు."

వాలిసుగ్రీవుల యుద్ధము

అనిపల్క వాలి మహాగర్వ మొప్ప
సుగ్రీవుఁ దృణమట్లు చుల్కనఁ జేసి
వెడలె యుద్ధమునకు వేగ మెసంగ.
కదిసిర ట్లుభయులుఁ గదనం బొనర్ప.
అంత నవ్వాలి నిజాక్షియుగ్మమున
నగ్నివర్షింపు చత్యాగ్రహంబునను
ముష్టిఘో సుగ్రీవుఁ బొడిచి గర్జించెఁ-
బ్రళయకాలోదగ్రపర్జన్య నటులు.
ఆ పిడి గ్రుద్దున కావులించియును
పాఱి సుగ్రీవుఁడు ఫఱువిడి చేరె
శ్రీరామచంద్రునిచెంత; కవ్వాలి
ముష్టిఘాతంబెన్న ముష్టిఘాతంబె-
అదిభయంకరమైన అశనిపాతంబు!
"ఏమనిచెప్పుదు నే రఘువీర!
అన్నగా డతఁ డక్కటా! కాలయముఁడు"
అని పల్క కపిపతి, విని రాఘవుండు,
"ఇరువురిపోలిక లేకమైయుంట
వాలినిఁ జంపఁగా వలనుగాదయ్యె."
అని తెల్పి శ్రీరాముఁ డంత సుగ్రీవు
తనువును స్వీయహస్తంబుచే నిమిరె.
ఆశ్చర్యమా! మర్కటాధిపుతనువు
వజ్రతుల్యం బయ్యె బాధశమించె.
పిదప రాఘవుఁడు కపిప్రభుకంఠ
మున వేసి యొక రమ్యపుష్పమాలికను
ఘన బలం బొసఁగి యిక నొబ్బమ్మటంచు
మఱలఁ బంపించె సంగర మొనరింప.

తిరిగి యా సోదరు లిరువురుఁ గూడ
తాకి పోరాడి రనేకరీతులను.

శ్రీరాముఁడు వాలిని వధించుట

వృక్షంబుమాటున వీక్షించుచుండె
రఘువల్లభుఁడు వారి రణకేళి నెల్ల.
సకలచలంబును సర్వబలంబు
వెలయఁ బోరాడియు విజయంబుఁ గనక
సుగ్రీవుఁ డలసియు సొలసి భీతిల్లె
కడుస్వాంతమందునఁ; కని యత్తెఱుంగు-
రాముఁడు దివిచి నారాచమొక్కండు
వాలి యుర మ్మొగిఁ జీల్చఁగా విడిచె.
అత్యంతబలశాలి యైన యా వాలి
ఆ శరాహతిచేతఁ హా, యనికూలి,
మగుడఁ జివ్వునలేచి మహిగూరుచుండె-
సాక్షాత్కరింపఁగా శ్యామసుందరుఁడు,
ఘనజటాజూటసంకలితమస్తకుఁడు,
అరుణాంబుజాక్షుఁడు, శరచాపధరుఁడు,
శ్రీరామచంద్రుఁ డక్షిద్వయిముందు.
ఆ రామచంద్రు దివ్యాకృతి నట్లు
వీక్షించి వీక్షించి విరతిని గనక
శ్రీపాదములపైనఁ జిత్తంబు నిలిపి
ఇతఁడు పరంధాముఁడే యని తెలిసి
తనజన్మ ధన్యత్వమును గాంచె ననుచు
స్వాంతరంగంబున సంతోష మొందె.
హృదయంబులో భక్తి యెసఁగుచుండినను
ఆ వాలి కరినోక్కు లనియె నీ రీతి
శ్రీరామదేవు వీక్షించి వారకను:
"ధర్మరక్షణసేయ ధరణిపై స్వామి!
అవతరించియు అక్కటా! నను, బోయ
మృగమును వేటాడురీతిఁగూల్చితివి.
చూడనేశత్రుండ? సుగ్రీవుఁడేమొ?

నీకు మిత్రుం డయ్యెనే? రఘురామ!
నేను గావించిన నేర మదేమి?
నా ప్రాణములఁ దీసినాడ వో నాథ!"
అనవిని శ్రీరాముఁ డనియె నీ తెఱఁగు;
"తమ్ముని భార్యయుఁ దన సహోదరియుఁ
గోడలు మఱి తనకూతు రీ నల్వు
రును సమానులు మూర్ఖ! వినుము వీరలను
గామించు వానిని గడతేర్చు నెడల
కలుషమంట దటంచు గ్రహియించుకొనుము.
అజ్ఞుఁడా! అతిదురహంకారవశత
నీ భార్య చెప్పిన నీతిబోధలను
చెవిని దూర్చక తిరస్కృతిఁ జేసినావు.
తెలియు నస్మద్బాహుబలసమాశ్రితుఁడు
సుగ్రీవుఁ డని నీకు– సుంతయు నీవు
జంకక దుర్మదస్వాంతుండ వగుచు
వానిని జంపఁగా వచ్చి తేమందు?"
అనవిని వాలి యిట్లనియె "శ్రీరామ!
నాథ! నీ ముందట నా చమత్కృతులు
నిలువఁజాలవుసుమా, నిజ మెంచునెడల,
అంత్యకాలమునఁ ద్వదాశ్రయమొందఁ
గలిగిన నేనొకో కలుషజీవుఁడను?
ధన్యుండనేను నాథా! రఘునాథ!"
అనువాలి మృదువాణి నాలించి రాముఁ
డాతని శిరముఁ గరాబ్జంబుతోడఁ
బ్రేమతో నిమురుచు "ఓ మర్కటేంద్ర!
నీ శరీరం బిదే నిత్యం బొనర్తు
నీ వమరుఁడ వౌచు జీవింపవచ్చు."–
ననివచియింపఁగా ననె వాలి యిట్లు:

వాలి శ్రీరాముని స్తుతించుట

"వినుకృపానిధి! నాదు విన్నప మెల్ల:
జన్మజన్మల మునీశ్వరు లుగ్రతపముఁ
గావించుచునుగూడ కడ కంత్యవేళ
శ్రీరామనామసంస్మృతిమహాభాగ్య
మును బొందఁజాలకపోవుచుండెదరు.
కాని ఎవ్వని నామఘనశక్తి చేత
కాశికాపురిని శంకరుఁ డందఱకును
సమగతి నవినాశసద్గతి నొసఁగు
ఆ నా ప్రభుం డహహా! నేఁడు నాకుఁ
బ్రత్యక్షమయ్యె నీ భాగ్యంబు మఱుల
వచ్చునే? జానకీవల్ల భా! రామ!
'నేతినేతి' యటంచు నిగమంబు లెవని
సన్నుతిఁ గావించు సతతంబు విడక,
ప్రాణమ్ము జిత్తమున్ బంధించివైచి
నిఖలేంద్రియంబుల నిగ్రహించియును
ధ్యానమందున మునితండంబు లెవని
దర్శింపఁజాలక తల్లడిల్లెదరొ?
ఆ పరబ్రహ్మ మహా! నేఁడు నాకుఁ
బ్రత్యక్షమయ్యె నీ పగిది– ధన్యోస్మి!
స్వామి! నే నభిమానవశుండ నంచెఱిఁగి,
'తనుఘనునిల్పుకొ'మ్మనినన్నుఁగోరె.
కాని, యెచ్చటనైనఁ గల్పవృక్షమును
కంపచెట్లను గావఁ గంచెవేయుటకు
నటికివై చెడి మూర్ఖనగుఁ డుండునొక్కొ?
నన్నటాక్షింపుము నాథ! నేనడుగు
వరము నొసంగుము వాత్సల్య మొప్ప:
కర్మవశంబుచే గాకుత్సతిలక!
ఏ నెట్టిజన్మల నెత్తినన్ గాని
నీ పాదభక్తితో నెగడెద న్గాక!
ఇతఁడు నాసుతుఁడు స్వామీ! అంగదుండు
చలమున బలమున సముఁడు నా కితఁడు!
కళ్యాణసంధాయకా! రఘుతిలక!
వీనిని జేపట్టవే! కింకరునిగ."

వాలికి మోక్షప్రాప్తి

అని వచియించి రామాంఘ్రినీరేజ

దృఢభ క్తిభావసంభృతచిత్తుఁ డగుచు
అవ్వాలి యవలీలఁ ద్యజియించెఁ దనువు-
గళగళితం బగు కంఠమాలికను
లక్ష్యపెట్టని గజరాజంబువోలె.
శ్రీరాముఁ డప్పుడు స్వీయధామమున
కంపె నవ్వాలి నత్యంతవత్సలత.
అంతటఁ బురమెల్ల వ్యాకుల మొందె;
విడివడి కేశముల్ వ్రేలాడఁ దనువు
సోలఁగాఁ దూలఁగా శోకించెఁ దార-
పరిపరివిధములఁ బలవించుకొనుచు.

భర్తృవియోగ దుఃఖితయగు తారను శ్రీరాముఁ డోదార్చుట

అ ల్లేడ్చుతార న య్యర్కకులుండు
వీక్షించి, "ఓ సాధ్వి! విలపింపవలదు.
పంచభూతాత్మకం బెంచ నీ తనువు-
కడునీచ మైనది; కడు తరళంబు.
నీ కండ్లముం దిది నిస్తేజ మగుచు
యెట్లుండెనో చూడు; మిదిపోకనిలదు.
ఆత్మనిత్యము సత్య; మది నాశమవదు.
మఱి దేనికై నీవు పరితపించెదవు?"-
అని ప్రబోధ మొనర్చి ఆమె అజ్ఞాన
తిమిరం బణంచె, నా దివ్యవిజ్ఞాన
తేజంబు సోకఁగాఁ దేఱి యా తార
రామాంఘ్రియుగమున ద్రావి ప్రార్థించెఁ,
'బరమభ క్తిని నాకు వరమిమ్మటంచు.'
సర్వసమర్థుఁడు జానకీవిభుఁడు
బొమ్మల నాడించు పోలిక మనల
నాడించుఁ దన యిచ్ఛమై యుమా! వినుము.
తదనంతరంబు సీతావల్లభుండు
ఆజ్ఞనొసంగఁ గీశాధినాయకుఁడు
సుగ్రీవుఁ డొనరించె సురుచిరరీతి
వాలికంత్యక్రియల్ భ క్తి వెలుంగ.
అంత రఘుస్వామి యనుజునిఁ బిలిచి,
ఈ "విప్ప డేగి సుగ్రీవున కమరఁ
బట్టంబుఁగట్టుము ప్లవగరాజ్యమున"-
కని వచియింపఁగా విని లక్ష్మణుండు,
వినమితశిరుఁడౌచు వెడలె; నందఱును
ఆ ఆజ్ఞఁ దలదాల్చి యరిగిరి పురికి.
రయమొప్ప నంతట లక్ష్మణస్వామి
పౌరభూమీసురప్రతతి రావించి
కీశాధిపతిగ సుగ్రీవున కెలమిఁ
బట్టమున్ గట్టియు, వాలికుమారు
రహి నంగదుని యువరాజుఁగాఁ జేసె.

శ్రీరామచరితమానసము

కిష్కింధా కాండము

తృతీయవిశ్రామము

ఆశ్రితజనపరిరక్షక!
విశ్రుతసత్కీర్తియుక్త! విశ్వాధ్యక్ష!
శ్రీశ్రుతిపర్వతవరశృం
గాశ్రయ! శ్రీ మట్టపల్లిహరి! నరసింహా!

ఓ ఉమా! రాముతో నుపమింపఁ దగిన
వేరొండు గురువును, పితయు, మాతయును,
హితకారి, బంధు, వి కెవ్వరు లేరు.
సురనరమునికోటిఁ జూచిన యెడల
వారిప్రేమలలోన స్వార్థంబు తోఁచు.
వాలిచే భయమునఁ బవలును రాత్రి
గడగడ వణకుచుఁ గాయ మంతయును
గాయాలతోనిండి గాసిలు చెపుడుఁ
జింతాజ్వరోత్తప్తచిత్తుఁడై యున్న
సుగ్రీవు నహ! కపీశునిగఁ గావించె!
భూరికృపాస్వభావుఁడు రఘువీరుఁ;
డట్టి మహాప్రభు నంతయుఁ దెలిసి
వదలెడువారు విపజ్జాలమందుఁ
జిక్కెదరన్నచోఁ జిత్రంబు గలదె?
అంత శ్రీరాముఁ డత్యంతానురక్తి
సుగ్రీవుఁ బిలిపించి, సురుచిరవివిధ
రాజనీతులను సక్రమముగాఁ దెలిపి,
పలికె నాపైన నీ పగిడిఁ "గపీంద్ర!
పదునాలుగేడులవఱకును నేను,

ఏ పురంబున వసియింపఁగారాదు.
చనె గ్రీష్మ మిపుడు, వచ్చెను వర్ష ఋతువు
కాన, నీ దాపునఁగల పర్వతమున
వసియింతు; నీవును బరగ నంగదుఁడు
రాజ్యంబు నేలుడు రాజితరీతి;
మదిలోన నాపని మఱవకు మోయి!"
అని చెప్పి సుగ్రీవు నంపిన పిదప
శ్రీరామవిభుఁడు వసింపఁగా సాగె
భవ్యప్రవర్షణపర్వత మందు.
కారుణ్యగుణనిధి కోసలేయుండు
శ్రీరామవిభుఁడు వేంచేసి కొన్నాళ్ళు
వసియింపఁగలఁ డను భావంబుతోడ
నంతకుమున్నే సురానీక మచట
రచియించె నొక మహారమ్యమాగుహాను.
వికసితబహుపుష్పవిసరంబుతోడ,
మధులుబ్ధగుంజితమధుపాళితోడ,
ఆ రమ్యమైన మహావనసీమ
అమితశోభామయంబై రహియించె.
శ్రీరామమూర్తి వేంచేసినదాది
వరకందమూలముల్ ఫలపత్రములును
కొల్లలు కొల్లలై యెల్లెడన్ దోఁచె.
అనుపమసుందరమైన యా శైల
మందు రాఘవుఁడు సురాధీశ్వరుండు
తమ్మునితోఁగూడి తా వసియించె.

సురసిద్ధమును లటఁజోద్యంబు మీఱ
ఘనభృంగఖగమృగతనువులఁ దాల్చి
సేవింపఁ దొడఁగిరి శ్రీరామచంద్రు.
శ్రీనివాసుం డగు శ్రీరామదేవుఁ
డేనాఁడు కాలూనె నా నాటినుండి
ఆ వన మెప్పె శుభాకార మగుచు.
స్ఫటికశిలాతలం బటఁగల దొకటి-
అది మహారమ్య మత్యంతశుభ్రంబు.
రామలక్ష్మణు లా శిలాఫలకమున
అలసుఖాసీనులై రా సమయమున
రాముఁడు లక్ష్మణస్వామి కెన్నెన్నో
భక్తివై రాగ్యనృపాల ధర్మములు,
విమలవివేకాదివిషయముల్ తెలిపె.

వర్షర్తువర్ణనము

నింగిపై నెల్లెడ నీలమేఘములు
క్రమ్మె సుశ్రావ్యగర్జాధ్వను లొప్పఁ.
"కనుమోయిలక్ష్మణా! కను మటువైపు-
నీరదంబులగని నీలకంఠములు
విష్ణుభక్తునిఁ గాంచి వివశత్వ మొప్ప
ముద మొందు వైరాగ్యమూర్తియౌ నొక్క-
గృహమేధివిధమున నృత్యం బొనర్చు.
మేఘుంబు లొండొండు మిగుల వేగమునఁ
గలసి యుగ్రంబుగా గర్జించుచుండె-
ప్రియురాలు చేఱువ లేనందువలన
ఈ దృశ్య మరయఁగా నెద భయం బొదవు:
మేఘాలమధ్యను మెఱసెడి మెఱపు
అతిచంచలంబులై యగపడుచున్న-
వలఖలస్నేహంబులట్లు సౌమిత్రి!
వసుధకుం దాకుచు వంగిన యట్టి
జలభరితంబులౌ జలదసంఘంబు-
లమితవిద్యానిధు లయ్యును మిగుల
వినయంబు గల్గిన విబుధు లట్లుండె.
వర్షధారల నట్లు భరియింపుచున్న
పర్వతపంక్తులఁ బరికింపు- మవ్వి-
ఖలుల నిందావాక్యముల నోర్చుకొనెడి
భక్తుల చందాన భాసిలుచుండె
పరమవేగంబునఁ బ్రవహింపుచున్న
క్షుద్రప్రవాహముల్ చూడఁగాఁ దోఁచు
నల్పభాగ్యోద్రిక్తు లగు ఖలు లట్లు.
ఆకాశమందుండి యవనిపైఁ బడెడి
జలమ్ము దే, కల్మషకలిత మౌచుండె-
మహిపైనఁ బడినంత మాయాప్రసంగుఁ
డగు జీవు విధమున అనుజ! సౌమిత్రి!
సకలదిక్కులనుండి జలము లే తెంచి
కలసెడి సొంపైన కొలను గన్గొనుము-
సకలసద్గుణములు సహజపద్ధతిని
చేరెడి సజ్జను చిత్తమ్ము తోఁచు.
ఆ ప్రవాహోదక మంబుధిన్ జేరి
స్వాస్థ్యమ్ముఁ జెందెడి చందమ్ము- జీవు
డీశ్వరైక్యమున వహించుఁ బ్రశాంతి.
పాషండవాదవిభ్రాంతులచేత
మరుఁగునఁబడు వేదమార్గంబు లటుల-
గడ్డిగాదము చేతఁ గప్పఁగాఁ బడియు
మహియెల్లఁ బచ్చనై మార్గముల్ మాసె.
మండూకనర్తరమ్యధ్వనుల్ సెలఁగు,
బ్రహ్మచారుల వేదపఠనంబువోలె.
వరనవపల్లవభరితవృక్షములు
కళకళలాడుచుఁ గనిపించుచుండె
అమలవివేకోదయంబునుగన్న
సాధకజనునిసుస్వాంతంబువోలె.
అర్కయవాసాదు లవనిపైఁ గూలె
సత్ఫలనంబున సకలదుర్మార్గ
సంఘోద్యమంబులు సమసినరీతి.

ధూళి రవ్వంతేనిఁ దోఁచ దెచ్చటను-
కోపసన్నిధి ధర్మగుణముచందమున.
మహి, సస్యసంపన్నమై తనరారెఁ
నుపకారి సంపద లొందిన రీతి.
అలనిశీథముల సాంద్రాంధకారమున
విహరించు ఖద్యోతవితతిభాసించు-
డాంబికజనుల పటాలంబుపగిది.
అతివృష్టిచే గట్టులన్నియుఁ దెగిన
పొలములు- స్వేచ్ఛను బొంది పాడైన
స్త్రీలవిధంబునఁ బ్రియతమా! తోఁచు.
కలుషను బెఱుకుచుఁ గడు శ్రద్ధతోడ
సస్యరక్షణ చేయు చతురకర్షకులు-
మదమానమోహాముల్ మొదలంటఁ బెఱుకు
విబుధులవిధము కాన్పింత్రు కుమార!
జక్కవపక్షు లెచ్చటఁ గనఁబడవు-
కలిలోన ధర్మముల్ గనరాని కరణి.
కుంభవర్షంబులు కురిసినఁ గాని
ఊసరక్షేత్రాన నొక మొక్క పుట్ట-
దలహరిభక్తుని యాత్మకామంబు
లేశ మేనియు నంకురింపని పగిది.
వివిధజంతువిధాన విభ్రాజితోర్వి-
జనవృద్ధిఁగను సురాజ్యమువోలె నుండె.
అక్కడక్కడఁ బాంథు లాగి విశ్రాంతి
నొందుచుండిరి జ్ఞాన ముదయించినంత
నింద్రియావళి విశ్రమించినరీతి.
అప్పు డప్పుడు వీచు నా పెనుగాలి
మబ్బుమాయ మొనరించు మబ్బులనెల్ల-
ఇలఁ గుపుత్రుఁడు పుట్టి కులధర్మములను
పారఁద్రోలెడు రీతిఁ బరికింపు మోయి!
అప్పు డప్పుడు మబ్బులలమియున్ బవలె
చిమ్మచీకట్లు గాఢమ్ములుగాఁ గ్రమ్ము-
సూర్యుఁడు కనిపించు శుభసమయముల
వెలుఁగులు ప్రసరించు నలువైపులందు-
జ్ఞానంబు దుర్జనసంగతి నణఁగి
సాధుసంగతి ప్రకాశముఁ బొందునట్లు.
లక్ష్మణా! వర్షకాలముపోవ నంత
అతిమనోజ్ఞము శరద్ఋతు, వరుదెంచె.

శరద్ఋతువర్ణనము

వర్షర్తు విలజరాభర మొందినటులఁ
దెల్లనిపూలను గొల్లగాఁ గల్గు
కాశనామకతృణగణముతో నిండి
యున్నదదే సమస్తోర్వీతలంబు.
*అలయగస్త్యోదయం బఖిలమార్గముల
జలముల నింకించె- సంతృప్తి, లోభ
మును శోషిలం జేయుపోలిక న్వాత్న!
స్వచ్ఛసరిత్సరోవరజలం బెసఁగు
మదమోహరహితసన్మానసమట్లు.
ఒకొక్కచుక్క వెంటొకొక్కచుక్క-
ఇగిరి పోవుచునుండె నెల్లప్రవాహ
కాసారజలములు-ఘనవివేకమున
మమత నశించెడిమాడ్కిఁ గుమార!
వరశరత్కాలము వచ్చుటఁజేసి
కాటుకపిట్టలు కనిపింపఁజొచ్చె-
తగు సమయంబున ధరసుకృతముల
ఫలము కనంబడు పగిదిగా నవిగొ!
ధూళిధూసరపంకదూరమై ధరణి,
వరనీతినిపుణనృపాలురాజ్యాంగ
మట్లు శోభిలుచున్న దనఘ! సౌమిత్రి!
జలశంకమీనముల్ సంకుల మొందు-

---

* భాద్రపదమాసమున, విదియ వెళ్ళిన పిదప ఏడవదినమున నగస్త్యోదయ మగును.

మందుఁడైన గృహస్థమానవుం డవని
ధనము చాలకను బాధలనొందు రీతి.
అంబుదహీనమౌ ఆకాశసీమ-
నిష్కామ్యభక్తుని నియతి భాసించు
అపు డప్పు డెప్పుడో అరుదుగా వచ్చు
వానజల్లులు- నాదు భక్తి యెవ్వనికొ
అరుదుగా లభియించు నట్లు సౌమిత్రి!
నృపులు, తాపసులు, వణిగ్జనుల్, భిక్షు
వులు, సంతసంబునఁ బురి వీడుచుండ్రి-
*చతురాశ్రమస్థులున్ స్వాంతరంగముల
హరిభక్తి పొందుచోఁ దరియించు నటుల.
అలఅగాధాంబువులందు మత్స్యములు
సుఖముగా జీవించుచొప్పున-జగతి
సతతనారాయణచరణశరణ్యుఁ
గష్టసంతతులు తాకఁగఁజాలవోయి!
కమనీయవికసితకమలజాలములఁ
గడుమనోజ్ఞము లయ్యెఁ గమలాకరములు-
నిర్గుణబ్రహ్మము నిఖిలభక్తార్థ
మలసగుణబ్రహ్మమైన చందముగ.
తేనెసోనలు బారఁ దీయనిపాట
లవె పాడుచున్న వహా! తేటిగములు.
పక్షులు సేసెడి బహువిధధ్వనులు
చెవులకుఁ బండువు సేయఁదొడంగె.
జక్కవల్ నిశిఁగని సంతపియించు
పరసంపదలఁగన్న దురితాత్మ లట్లు.
చాతకమ్ములు తృష్ణ సంతాప మొందు
శంకరవిముఖులు శ్రమనొందు పగిది.
శారదాతపమును శశి బాపుచుండుఁ-
దగ బాపముల సాధుధర్మన మటుల.
చంద్రదర్శనమునఁ జక్రవాకములు
పరమసంతోషంబు బడయుచు నుండు-
హరిదర్శనమున భక్తాళిచందమున.
మంచుచే మశకముల్ మడిసె నెల్లెడల
బ్రాహ్మణద్రోహులు వంశనాశనముఁ
గాంచినపగిదిగా శ్మాతలమందు.
రా, శరదృతువు ధరన్ గ్రిమిసమితి
సమసె నెల్లెడ సదాచార్యనిర్మోల
సర్వసంశయములు సమసిన పగిది.
వర్షకాలము పోయె, వచ్చె శరత్తు;
నిర్మేఘమై నింగి నిర్మలం బయ్యె-
పరిశుభ్రమయ్యె ప్రవాహోదకంబు-
కాని, సీతావర్తమానంబు వినము.
ప్రియసోదరా! సీతవిషయం బెఱుఁగ
జాలినఁ జాలు తత్ క్షణమున వెడలి
కాలుచేఁ జిక్కినఁగాని నే నపుడ
విడిపించి ఆమెను వేగంబ తెత్తు.
సీత, ఎచ్చట నైన జీవించియున్నఁ
జాలు, ఆమెను దెత్తు శౌర్యంబు మెఱయ.
ఔర! సుగ్రీవుఁడు ఆత్మ న న్మఱచె
రాజ్యధనాగారరమణీసుఖాలఁ
ఆ మూర్ఖు నిదియె రే పంత మొందింతు
వాలిని గూల్చిన బాణంబుతోడ"-
అని పల్కి శ్రీరాముఁ డనుజునితోడ.
మదమోహగుణము లేమహనీయ కృపను
హరియింపఁ బడునట్టి యా రామవిభున
కాగ్రహంబున్న దే? ఆవంత, గౌరి!
రఘువీరచరణాబ్జరతులై రహించు
జ్ఞానులౌ మునులె ఆ స్వామిస్వాంతంబు
గ్రహియింపఁ గలరు జగత్త్రయమందు.
రాముఁ డొకింత యాగ్రహ మొందినంత

---

* చతురాశ్రమస్థులు—1 బ్రహ్మచారులు 2 గృహస్థులు 3 వానప్రస్థులు 4 సన్న్యాసులు.

లక్ష్మణస్వామి శౌర్యంబు దీపింప
వి ల్లెక్కుఁబెట్టియు వేగ బాణములఁ
గైకొని నిల్చెను గారీ! అపర్ణ!
అప్పుడు లక్ష్మణు నరసి రాఘవుఁడు
పరమకారుణ్యాబ్ధిపలికె నీ పగిది:
"అనుజ! సుగ్రీవుఁడు మన ప్రియసఖుఁడు
వాని నించుక నీవు భయపెట్టి యిటకుఁ
గైకొనిర మ్మంతె-కడతేర్చఁ జనదు."

సుగ్రీవునాజ్ఞచే హనుమంతుఁడు వివిధప్రదే
శములందున్న వానరులకొరకు దూతలను
బంపుట

అచటఁ గిష్కింధలో ననిలాత్మజుండు-
హనుమంతుఁ, "డౌర! కీశాధినాయకుఁడు
మఱచె శ్రీరాముని మహితకార్యంబు"-
అని తలపోసి యాతని చెంతకేగి
పాదంబులకు ప్రమొక్కి పరగ బోధించె-
నల*చతుర్విధసాధనల నియోగించి.
హనుమంతు-వాక్యంబు లాలకించియును
సుగ్రీవుఁ డంత సంక్షుభితాత్మఁ డగుచు,
"ఓ సచివో త్తమా! ఓ వాయుపుత్ర!
విషయలోలత నా వివేకంబుఁ జెఱచె.
అచ్చ టచ్చటఁగల హరిభటావళినిఁ
బిలువఁగాఁ బంపుము వేగఁ జారులను.
పదునైదు దినముల వ్యవధిలోపలను
అష్టదిక్కులనున్న హరిసైన్యసమితి
వచ్చి నా కడ నిల్వవలయుఁ దప్పకను.
ఇట్లు చేయనివార లెవ్వరో? వారి
వధియింతు నేనని ప్రకటింపు" మనియె.
అన విని హనుమంతుఁ డా క్షణమందె
దూతల నెల్లఱఁ బ్రీతి రావించి

* సామదాన భేదదండోపాయములు.

సముచితవిధమున సన్మానపరచి,
నయభయంబులు లాలనములుఁ జూపించి,
కర్తవ్యకర్మను గావింపఁబంపె.
అంత నా దూత లయ్యాంజనేయునకుఁ
బాదాభినతులను భక్తి గావించి
నలుదిక్కులకుఁ బయనంబయి చనిరి.
అంతలో సౌమిత్రి యడుగిడె నగరి-
అతని క్రోధోద్రేక మరసిన యంత
భయ మొంది వానరుల్ పాఱిరి దిశల.

లక్ష్మణుఁడు వానరులను భయపెట్టుట

ధనువు సంధించి లక్ష్మణుఁ డట్టి తఱిని
"ఇదియె, ఆగ్నేయాస్త్ర మేఁ బ్రయోగించి
బూదిఁ గావింతు నీ పుర" మని పలికె.
అంతటఁ బుర మెల్ల వ్యాకులం బగుట
నరసి యంగదుఁ డట కరుదెంచి వేగ
లక్ష్మణాంఘ్రులకు శిరస్సుఁ దాకించి
రక్షింపు మనుచుఁ బ్రార్థన మొనరింప,
న య్యంగదునిఁ గాంచి యభయబాహువుల
సాచి యాతండు ప్రసన్నత నొందె.
లక్ష్మణస్వామి యాగ్రహావార్త వినియుఁ
గీశవల్లభుఁడు సుగ్రీవుఁ డంతటను
అతిభయాకులుఁడౌచు హనుమానుఁ బిలిచి,
"వాయుకుమార! సత్వరము నీవిపుడు
తారతో వెడలియుఁ దగు తేజంగులను
వినతు లొనర్చి యెవ్విధముగా నైన
శాంతింపఁ జేయుమా సౌమిత్రి" ననియె.

సుగ్రీవునిపంపున హనుమంతుఁడు తారతోనేగి
సౌమిత్రినిగొనితెచ్చుట

ఆ ప్రకారము పవనాత్మజుఁ డంత,

రాజ్ఞియా తారతో రయమున వెడలి
ఆ లక్ష్మణాంఘ్రులఁ గతిథ క్తి మ్రొక్కి
సలిపియు శ్రీరామసంకీ ర్తనంబు
వివిధవిధంబుల వినతు లొనర్చి,
సుప్రసన్నుండౌటఁ జూచి యాయనను
దగఁగొనిపోయి యంతఃపురంబునకు
అర్ఘ్యపాద్యాదుల నర్చించి పిదప
నున్న తాసనమున నుపవిష్టుఁ జేసె.
అంత వానరవిభుం డరుదెంచి మ్రొక్కి
రామానుజుని పాదరాజీవములకు.
అప్పు డా సుగ్రీవు నతఁ డనుర క్తిఁ,
జేత లేవఁగ నెత్తి చేర్చెఁ గౌఁగిటను.
"భువిలోన విషయోపభోగంబుఁబోలు
మదము వే ఱెటలేదు- మానిచి త్తముల
నైత మయ్యది మార్చు క్షణమాత్రమందు.
నా యపరాధమున్ నాథా! క్షమింపు"-
మని పల్కఁ గపిపతి, విని లక్ష్మణుండు,
ఆతని వినయవాక్యంబుల కలరి,
యోదార్చె వాని నెన్నో విధానముల.
అత్తఱిఁ బావని యవని నెల్లెడలఁ
గల కపిసైన్యమున్ బిలువ దూతలను
బంపిన విషయముల్ ప్రవచించె; నంత
అంగదాదులఁగూడి హరిసంఘవిభుఁడు
సంతోష మొప్పఁగా సౌమిత్రి వెంటఁ
జని రామచంద్రదర్శన మొనరించె.

సుగ్రీవుఁడు శ్రీరామునిఁ బ్రసన్ననిఁ
జేసికొనుట

శ్రీరామచరణరాజీవంబులందు
వినమితశిరుఁ డౌచు వినతిఁ గావించె
నపుడు సుగ్రీవుఁడు హ స్తముల్ మోడ్చి
వినయ మొప్పార నివ్విధము: "శ్రీరామ!
నేను నిర్దోషిని- నేనేమి సేతు
నహా! నీదు మాయ మహాబలిష్ఠంబు-
అది దురత్యయము, నాథా! త్వదనుగ్ర
హముచేత మాత్రమే యది విడిపోవు.
సురనరమును లెంతశూరులుఁగూడ
విషయజాలమునకు వివశులు కాగఁ,
బరమపామర మగు పశువను నేను-
అతికామి నగు కోతి నక్కటా! నేను!
నా దొకటెక్కయే నాథ! లోకేశ!
కామినీజనకటాక్షశరహతుండు-
క్రౌర్యనిశీథనిద్రానిమగ్నుండు-
బహుదృఢతమలోభపాశబద్ధుండుఁ
గానినరుండు- సాక్షాత్ భవాదృశుఁడె!
ఈ మహాహార్యద్ జ్ఞాన మెప్పుడుఁగూడ
స్వామి! నీకృపచేతసాధ్యమాఁగాని
అది స్వశ క్తికిఁ జిక్క నట్టిది కాదు.
నాటికిఁ గోటి కేమేటి ధన్యుండో
భవదనుగ్రహమునఁబడయునద్దాని."

శ్రీరాముఁడు సుగ్రీవునాదరించుట

అనెడి సుగ్రీవు వాక్యముల నాలించి
చిఱునగ వొలుకఁగా శ్రీరామవిభుఁడు,
"సోదరా! సుగ్రీవ! క్ష్మోణి నా కీవు
భరతుతో సముఁడవు; పరగ నీ విపుడు
సీతానివాసవిశేషంబు లెఱుఁగు
యత్నముల్ సేయుమా, అతిశ్రద్ధ" ననియె.

నలుదిక్కులనుండి వానరసైన్యము
లరుదెంచుట

అటులవా రిర్వు రత్యనుర క్తితోడ
మాట్లాడుకొనుచుండ మర్కటసేన
లరుదెంచె నట కసంఖ్యాకంబు లగుచు.
ఎటు జూచిననుసరే యిల యీనినటుల
వివిధవర్ణ ములతో వెలుగొందుచున్న
కోటానుకోటులు కోతులు తోఁచె.

శ్రీరామచరితమానసము

కిష్కింధా కాండము

చతుర్థవిశ్రామము

కపిగణసేవితచరణా!
తపనకులాభరణ! సకల ధర్మాచరణా!
అపరిమితకరుణ! కనకక
శిపుసుతబాధాపహరణ! శ్రీనరసింహా!

ఓ యుమా! ఆ కపియూథాల నేను
స్వయముగాఁ గంటి నా సమయంబునందు
వానిని లెక్కింపఁగా నెంచువానిఁ
గడుబుద్ధిహీనునిఁగాఁ దలపోతు.
అంత నవ్వానరు లందఱుఁగూడ
శ్రీరామపాదరాజీవంబులందు
వినమితశిరులౌచుఁ బ్రీతి వెలుంగ
స్వామిముఖాబ్జంబుఁ బరికించి; అతఁడు
దమపాలిదైవము దమనాథుఁ డనుచు
గ్రహియించి సంతోషకలితాత్ములైరి.
అమ్మహాకపిగణమందు రాఘవుఁడు
స్వయముగాఁ గుశలసంప్రశ్నఁ జేయకను
వదలఁగాఁ బడినట్టివాఁ డొకండైన
లేడయ్యెఁ బార్వతీ! ప్రియసఖీ! వినుము.
విశ్వరూపుఁడు మహావిష్ణు వైనట్టి
శ్రీరాము కిదియొక చిత్రకార్యంబె?

సుగ్రీవాజ్ఞ

వరుసలై నిలిచిరి వానరులెల్ల
అంత సుగ్రీవుఁ డిట్లాజ్ఞ నొసంగె;
"శ్రీరామకార్యంబు స్థిరబుద్ధితోడ
నిర్వహింపఁగ మిమ్ము నేఁ గోరుచుంటి.
ఓ మహాకపులార! ఓ యోధులార!
అఖిలదిక్కులకు మీ రరిఁగి గాలించి
తేవలెఁ బరగ సీతావృత్తమాన-
మిం కొకమాట,- మీ రెల్లఱుఁగూడ
ఓ సహోదరులార! ఒక నెలలోనఁ
దిరిఁగి రావలెసుమా, స్థిరనియమమున;
తెలిపిన గడువులోపల నెట్టివార్త
లేకుండ నరుదెంతు రేని వారలను
చేజేత ఖండింతు సిద్ధ మీ మాట."
అట్లు సుగ్రీవాజ్ఞ యైనంతఁ గపులు
వెడలిరి శీఘ్రుంబె వివిధదిక్కులకు.
అంత సుగ్రీవుఁ డయ్యంగదు నలుని
హనుమంతు జాంబవంతునిఁ బిల్చి పలికె:

సుగ్రీవుఁడు హనుమదాదుల
దక్షిణదిశకంపుట

"ఓ అంగదా! నీల! ఓ హనుమంత!
ఓ జాంబవంతాదియోధేంద్రులార!
మీ రతిధీరులు మిగులసుజ్ఞాను
లిపుడు దక్షిణదిశ కేఁగి మీరెల్ల
ఱగపడినట్టివా రందఱు నడిగి

జానకీశుభవ_ర్తమానంబుఁ దెండు.
మీ సర్వశ_క్తుల మిగుల శ్రమించి
సీతజాడనుదెచ్చి శ్రీరామచంద్రు
కార్యనిర్వహణంబుఁ గావింపరయ్య!
అర్క_సేవనమున నభిముఖం బొప్ప-
దగ్ని సేవనమున నభిముఖం బొప్ప-
స్వామిని సేవించుపనియందు మాత్ర
మొడలు దాచఁగఁజెల్ల దొక్కి_ంతఁగూడ;
త్రికరణంబుల శ్రద్ధ దీపింపవలయుఁ
గపట మొక్కి_ంతయుఁ గలుగరా దెదను
మాయను ద్యజియించి మది నేకదీక్షఁ
బరమపదంబును బడయఁగాంక్షించి
శ్రమియించి నప్పుడే శమియించు భవము.
నిష్కామ్యదృష్టితో నెగడొందునట్టి
శ్రీరామభజనమే జీవితాశయము.
రఘువీరచరణానురాగియా వాఁడె-
పరమగుణజ్ఞుండు! పరమధన్యుండు!"
అంత సుగ్రీవు నాజ్ఞానుసారముగ
ర్మొక్కి- యాతనికి సమ్మదము దీపింపఁ
బయనించి రొగి నా ప్లవంగ పుంగవులు
రఘునాథచరణైకలగ్నాత్మలగుచు.
చివరకు మిగిలిన శ్రీహనుమంతుఁ
డరుదెంచి శ్రీరాము సంఘుల వ్రాలె.
తనకార్యసిద్ధి యాతనిచేతఁ గలుగు
నని రాఘవునకు గ్రాహ్యం బయియుంటఁ,
బైకెత్తి మారుతిఁ బరమానుర_క్తిఁ
జెంతకుఁ జేరియు శీర్ష ంబు నిమిరి
కమనీయనిజపాణికమలంబుతోడ
స్వాంతరంగికభ_క్తుఁ డౌటచే నతని
కౌసఁగియుఁ దన ప్రేలియుంగరం బొకటి,
"ఆంజనేయా! పోయి అవనీతనూజ
కస్మద్బలంబును, అస్మదుదగ్ర
విరహవేదనమును, వివరించి తెలిపి,
సర్వారీతుల దుఃఖశమనం బొనర్చి,
తిరిగి సత్వర మేగుదెమ్మని పలికె."
అంత నా హనుమంతుఁ డనిలాత్మజుండు,
తన జన్మఫలియించె నని సంతసిలుచు
కారుణ్యమయరఘువీరవిగ్రహముఁ
బాదుకొల్పియును హృత్పద్మమధ్యమున,
ఆ రామకార్యార్థమై నిర్గమించె.
సర్వజ్ఞుడయ్యును స్వామి, ఆ దేవ
తాజనప్రాతమహాజగన్నేత-
మహిరాజనీతిని మన్నించె నట్లు.
అట్లు వానరులెల్ల అతిసముత్సుకత
శ్రీరామకార్యవిలీనాత్మ లగుచు
దేహామోహాదులఁ దెగగోసివైచి,
అధిగమింపఁగసాఁగి రలవనశైల
నదనదీహ్రదముల వెదకు చెల్లెడల.
ఆ మూఁక కెటనైన నసురుఁ డడ్డైన
ఒక దెబ్బతోవాని నుర్విపైఁగూల్చి
చనుచుంద్రు ముందుకు సంతోష మొప్ప.
కాకులు దూరని కారడవులను
ఆకాశమంటు నెత్తైన కొండలను
ప్రతిదాని వీడక పరికింత్రువారు.
మునియెవ్వఁ డైనను గనిపించు నెడలఁ
జుట్టు మూగుచు నుంద్రు చోద్యంబుమీఱ.
అ ల్లేగుచుండఁగా నా కపీశులకు
దారిలో మిక్కి_లి దప్పికపుట్టె-
దోసెడు నీ రెటఁ దోచక పోయె.
అదిగాక తన్నిబిడారణ్యమందు
దారి తప్పిరి వారు దైవవశాన.
అప్పుడు, "చచ్చెద రందఱుఁగూడ
జలములు గ్రోలక సత్వర" మనుచు

భావంబు లోనెంచి పవమాన సుతుఁడు
దాపునఁగల పర్వతంబు పైకెక్కి
తిలకింప దిశలెల్ల నిల నొక్కచోట
బిల మొండు కనవచ్చె- వింతైన యొక్క
దృశ్య మచ్చో గోచరించె నత్తఱిని.
తద్గుహాద్వారంబుదరిఁ జక్రవాక
బకహంసకలకలధ్వను లొప్పుచుండె-
వివిధవిహంగముల్ వేలకొలంది
ఆ గుహాలోపలి కరుగుచునుండె.

హనుమత్ప్రముఖులగు వానరులు గుహలోఁ
బ్రవేశించి స్వయంప్రభను దర్శించుట

ఈ దృశ్య మంతయు నీక్షించి హనుమ
అద్రిని దిగివచ్చి యందఱున్ గొనుచుఁ
జని గుహన్ జూపించె- సత్వర మంత
వానరు లెల్లఱుఁ బవమానతనయు
ముందుంచుకొని బిలమ్మునఁ జొచ్చి రపుడు.
అ ల్లగ వారల కావల నొక్క-
పుణ్యోపవనము ప్రఫుల్లకల్హార
కలితకాసారంబు కానఁగా వచ్చె.
ఆ సరోవరతీర మందుండె నొక్క-
దివ్యసుందర మైన దేవళ-మచట
నుపవిష్టయైయుండె నొకసాధ్వి- ఆమె
తనువుఁ దాల్చిన మహాతప మట్టు లెసఁగె-
అలఁత దూరంబు నందుండి కపులు
చేసి రామెకు నమస్కృతు లతిభక్తి.
అపు డామె వారి వృత్తాంతంబుఁ లడుగ
వార లామెకు విన్నపముఁజేసికొనిరి
తమ చరిత్రంబెల్లఁ; తదుపరి ఆమె,
"వెళ్ళి నీరముఁ గ్రోలి వివిధమనోజ్ఞ
మధురఫలంబుల మదిఁ దృప్తిదీర
భుజియింపుఁ" డని పల్కె- భూరిసంప్రీతి.
అంత నవ్వనచరు లందఱు పోయి
స్నానంబుఁ గావించి జలములు గ్రోలి,
మధురఫలాల సమ్మతి నారగించి,
వచ్చిరి తిరిగి తపస్విని కడకు.
ఆమెయు వారికి ఆత్మీయచరిత
మంతయు వినిపించి, "హరివరులార!
శ్రీరామచంద్రు దర్శింతు నేనేగి-
నిలిచి క్షణంబు కన్నులు మూసికొనుఁడు-
వేగ నీ గుహనుండి వెలివడఁ గలరు.
సీతను మీరు దర్శింపఁగాఁ గలరు;
పరితాప మొందఁగాఁ బనిలే-" దనంగ
విని కీశవరులెల్లఁ గనుమూసి మఱలఁ
దెఱచి నంతట వార్ధితీరమం దుండ్రి.

స్వయంప్రభ శ్రీరాముని దర్శించి
బదరికాశ్రమమున కేగుట

తదుపరి యా సాధ్వి తత్క్షణం బేగి
శ్రీరాము దర్శించి శ్రీపదాబ్జముల
కభివందనంబుల నాచరించియును
బలుపలువిధములఁ బ్రార్థనఁజేయ
జానకీవిభుఁడు ప్రసన్నుఁడై యామె-
కపుడనపాయిని యగు భక్తి నొసఁగె.
అంత నా యోగిని ఆ రామచంద్రు
శ్రీయాజ్ఞ భక్తిమై శిరమునఁ దాల్చి-
అజహరాదులచేత నర్చింపఁ బడెడి
ఆ రామదేవాంఘ్రి లాత్మసంధించి
రమ్యమా బదరికారణ్యంబు జేరె.

శ్రీరామచరితమానసము

కిష్కింధా కాండము

పంచమవిశ్రామము

వనచరనికరశరణ్యా!
వనజాంబక! వనజనాభ! వనజాత్మేశా!
వనజభవామరసన్నుత!
వనశాయీ! మట్టపల్లివాస! నృసింహా!

అంగదుఁడు సీతా దర్శన నిరాశుఁడై
పరితపించుట

వార్ధితీరముఁ జేరి వానరు లట్లు
"గడువు సమీపించెఁగాని, నేటికిని
కార్యంబు నెఱవేరు కరణి లేదయ్యె"
అని తలపోయుచు నందఱుఁగూడి-
ఒక చోటఁ గూర్చుండి యొకరితో నొకరు
"పనిపూర్తిగాకుండ మనమెల్ల తిరిగి
కిష్కింధ కేగుచోఁ గీడునుగాక-
పడయఁగాఁ గల్గు లాభం బేమియుండు?"
అని చెప్పుకొని; రప్పు డంగదుం డనియె
నశ్రుప్రపూర్ణ నేత్రాబ్జుఁడై యిట్లు:
"రెండు మార్గంబుల మృత్యువు మనకు
తప్పదుసుమ్ము- సీతావార్తఁ గనక
కిష్కింధకేగ, సుగ్రీవుండువిడక
మన గళాలు త్తరించును దత్క్షణంబ.
మా తండ్రి యా నాఁడు మరణించి నపుడె
ఆతఁడు ననుబట్టి హతమార్చి యుండు-
రామచంద్రుఁడు నన్ను రక్షించెఁగాని.
అందుచే సుగ్రీవునందు నమ్మకము
కలుగ దయ్యెను నాకుఁ గపివీరులార!"
అనిపల్కి అంగదుం "డక్కటా! మనకుఁ
జావింకఁ దప్పదు సత్య" మటంచు
మాటిమాటికిఁ బల్క, మర్కటవీరు
లంత నిరుత్తరు లైరి, కన్గొనలఁ
గన్నీరు మున్నీరుగాఁ బ్రవహింప.
ఇట్లొక్క క్షణ మా కపీశ్వరు లెల్ల
దుఃఖసాగరమునఁ దోగియుఁ దుదకు
నంగదు నీక్షించి "అవనిజావార్త
లేకుండఁగా నగరి కేరఁబోము.
యువరాజ! మే మిటే యెరిగెద", మనుచు
వనధితీరమున దర్భల విస్తరించి,
ప్రాయోపవిష్టు లై రో యుమా! వినుము.

జాంబవంతుఁ డంగదునకు శ్రీరాము
మహిమ నుగ్గడించుట

జాంబవంతుం డట్టి సమయంబునందు
అంగదు దుఃఖంబు నరసి యీ రీతి
మహితోపదేశంబు మాన్యతన్ జేసె:
"నాయనా! రాముఁడు నరుఁ డనుకొంటె?
అజితం బజం బయి యలరారుచుండు
ఆ నిర్గుణబ్రహ్మ మని మఱువకుము.
సగుణరూపమ్మున క్ష్మాస్థలియందుఁ

బ్రకటితం బైన పరబ్రహ్మ నిటుల
సేవింపఁ గలిగిన సిరి మనకబ్బె.
మన మహోన్నత భాగ్యమును జెప్పఁ దరమె?
సురగోధరామరధరణీహితార్థ
మవతరించును బరమాత్మ నిజేచ్ఛ.
*అఖిలవిముక్తులఁ ద్యాగం బొనర్చి
సగుణరూపము నుపాసనఁజేయు ఘనులు
పృథ్విపై కరుదెంచి విభునితోఁగూడి
అతని లీలాకార్యమందుఁ బాల్గొంద్రు;
ప్రభువును వారలు వదల లే రెపుడు."

సంపాతియను గృధ్రనాయకుఁడు వానరులను సమీపించుట

పలువిషయంబు లీ పగిదిగా వార
లొండొరుల్ మాట్లాడుచుండఁగా వినియె-
దాపున శైలకందరమున నున్న
♦సంపాతియను గృధ్రసంఘవల్లభుఁడు.
అతఁ డంత గుహావీడి యరసి యా కపులఁ,
దనకుఁ దా నిట్టుల ననుకొనసాఁగె:
"ఒహో! పరమేశ్వరుఁ డొక విందుఁ గూర్చె;
నేఁ జిదే వీరల నేఁ జీల్చి వైతు.
ఎన్నాళ్ళనుండియో యే నుపవాస
ములఁ జేయుచుండఁగాఁ బోసఁగె నీ దినము
కఱవెల్లఁ దీరెడి కమ్మని విందు."
అనెడి ఆ వృద్ధగృధ్రాలాపములకుఁ
గడుభీతి వణకెను గపిబృంద మెల్ల,
"మనకింకఁ దప్పదు మరణ" మటంచు.
అంతలోఁ బర్వత మట్లు సంపాతి
దృగ్గోచరం బౌట దిగ్గున లేచి
రెల్లకపుల్ గుండె ఝుల్లు మనంగ.
జాంబవంతుని మేనఁ జలువలు గ్రమ్మె;
ఆలోచనామగ్నుఁ డైన అంగదుఁడు
పలికె నీ విధము "ప్రపంచంబులోన
అహ! జటాయువుఁబోలు నతిధన్యుఁ డెవఁడు?
రామకార్యార్థమై ప్రాణముల్ విడిచి
హరిపదంబును బొందె నతఁ డవలీల.
ఆ గృధ్రయోగి మహాభాగ్యశాలి!"

సంపాతి వానరులను జటాయువృత్తాంత మడుగుట

అయ్యెడ నా వాక్కు లాలకించియును
సంపాతిసంతోషసంతాపకలితుఁ
డై వానరులకడ కరుదెంచుచుండ
వానరుల్ ఘనభయవ్యాకులు లైరి.
భయపడ వలదని వారికిఁ దెలిపి
సంపాతి వారల సన్నిధిఁ జేరి-
తన సహోదరుఁ డైన ఘను జటాయువుని
వృత్తాంత మడుగఁగా వినిపించి రెల్ల
చరిత మా వానరసంఘనాయకులు.
తన యనుజన్ముని ఘనమరణమును

---

* ఆరు విధములగు ముక్తు లున్నవని శాస్త్రోక్తి:
1. సాలోక్యము:- భగవానుని లోకమున వసించుట. 2. సార్ష్టి:- భగవంతునితో సమానముగ నైశ్వర్యమును బొందుట. 3. సామీప్యము:- భగవానునకు సమీపమగు స్థానమును బొందుట. 4. సారూప్యము:- భగవానునకు సమానమగు రూపమును బొందుట. 5. సాయుజ్యము:- భగవంతునియందైక్యమొందుట. 6. నిర్గుణ బ్రహ్మైక్యసిద్ధి.

♦ కశ్యపమహర్షికి 'వినత' యను భార్యవలన అరుణుఁడు, గరుడుఁడు- అను కుమారు లిర్వురు జన్మించిరి. అరుణుఁడు సూర్యసారథి యయ్యెను; గరుఁడుఁడు శ్రీవిష్ణుదేవుని వాహన మయ్యెను. సంపాతియు జటాయువును అరుణునియొక్క కుమారులు.

శ్రీరామచంద్రుని చేసేత నతఁడు
అంత్యక్రియావళి నందిన కథన
మాలించి సంపాతి హర్షాశ్రు లొలుక
శ్రీరాము కరుణావిశేషగాథలను
బలుపలువిధములఁ బ్రస్తుతిఁజేసి–
"ఓ రామపదకింకరో త్తములార!
సింధుతీరమునకుఁ జేర్చుడీ నన్నుఁ–
దమ్మున కర్పింతుఁ దగఁ దిలాంజలులు.
మీర లన్వేషించు మిథిలాకుమారి
నీక్షింపఁగల తెఱవేఁ జెప్పఁగలను.
అనిపల్కఁగపు లట్లు లొనరించి రపుడు.
అనుజుని కటఁదర్పణాదు లొసఁగి
సంపాతి వనచరసంఘమ్ముతోడఁ
దన చరిత్రం బిట్లు వినిపింపఁ దొడఁగె:

సంపాతి వానరులకుఁ దన వృత్తాంతము వినిపించుట

"మా కథ వినుఁడు మహోకపులార!
అనుజుఁ డైన జటాయువును నేను మిగులఁ
దరుణవయస్సులోఁ దనరు కాలాన,
ఒక్కనాఁ డుభయుల మొగి నింగి కెగిరి
సూర్యమండలమునఁ జొచ్చితి మంత
మా జటాయువు చండమార్తాండతాప
మోర్వంగఁ జాలక యుర్వికి న్మఱలె.
కాని నే మాత్రము గర్వంబుకతన
నర్కు సమీపించి, ఆ మహోపార
చండతేజమునఁ బక్షమ్ములు కాల
ఘోరఘోరంబుగాఁ గుయ్యిడికొనుచుఁ
బడినాడ నీ ధరాభాగంబునందు.
అత్తఱిఁ జంద్రముఁ డను నొకమౌని
కలఁ డాతఁ డీ ననుఁ గని కరుణించి,
వివిధవిధాల వివేకంబుఁ గఱపి,
దేహాభిమానంబు తెగునట్లు చేసి,
"త్రేతాయుగాన ధాత్రిని బరబ్రహ్మ
మవతరించును మానవాకృతిఁ బూని,
అత్తఱి నతని యర్థాంగిని వైత్యుఁ
డొక్కఁడు హరియింప నక్కమలాక్షి
వీక్షింపఁ బ్రభుదూత లేతెంతు వారిఁ
గలియఁగా నీ సర్వకలుషముల్ పాయు.
తిరిగి నీ తెక్క లేతెంచు నత్తఱిని.
వీనికై యిఁక నీవు విలపింపఁ దగదు.
సీత యుండిన తావుఁ జెపు మంతెచాలు–
అదియె నీ కర్తవ్య' మని తెల్పె నాకు.

సంపాతి వానరులకు జానకీవృత్తాంతముఁ దెల్పుట

నేటికి మునివాక్కు నిజ మయ్యె– మీరు
నా వాక్యముల విని నాయనలార!
స్వామికార్యముఁ దీర్ప సన్నద్ధు లగుఁడు.
పరగఁ ద్రికూటాద్రిపై లంక కలదు,
తత్పురంబున నుండు దశకంధరుండు,
సహజనిర్భయుఁడు రాక్షసచక్రవర్తి.
అట నశోకవనంబునందు రావణుఁడు
సీతను వసియింపఁజేసె– నా సాధ్వి
అమితవిచారభారాయత యగుచు
నుపవిష్టయై యుండు నొక చెట్టుక్రింద.
మీకుఁ జూడఁగ వీలు గాకున్న'గాని
నేఁ జూడఁగల నామె నెందుచే ననఁగ–
గృధ్రదృష్టియపార– మిప్పుడు నేను
వృద్ధుఁడ నైతిఁ గా దేని మీ కేను
దోడడ్పువాఁడ నేదో విధానమున.
శతయోజనాయతసాగరోల్లంఘు
నముఁ జేయఁగల మహోన్నతబుద్ధిశాలి
శ్రీరాము కార్యంబుఁ జేయఁగాఁ నోపు.

నను జూచి ధైర్యంబు గనుఁ డాత్మలందు.
అహ! యీ జరాశిథిలాంగ మీ రీతి
శ్రీరాము కరుణావిశేషంబుచేత
ఉజ్జ్వలోత్తేజ మెట్లొందెనో? కనుఁడు!
రామనామముచేతఁ బామరుల్ కూడ
సంతరింతు రపారసంసారజలధి.
అలరాము కింకరు లైన మీ రెపుడు
భయ మొందఁ బనిలేదు, భావపీఠముల
శ్రీరామచంద్రుని శ్రీమూర్తినిల్పి,
రఘురామదాసులారా లెండు లెండు."
అని ప్రబోధ మొనర్చి యీ గృధ్రనాథుఁ
డెగసి యాకసమునఁ కేగె నెచ్చటికొ?
ఆశ్చర్యమునఁ గపు లరయఁగా గరుడ!

సముద్రతరణసమాలోచనము

అంత నవ్వానరు లందఱుఁగూడ
తమతమ బలములఁ దగఁ జెప్పుకొనుచు
సాగరంబుఁ దరింప సంశయ పడిరి.
అపుడు భల్లూకేశుఁ డగు జాంబవంతుఁ
డిట్లు వచించెఁ గపీశులఁ గాంచి:
"ఏ నతివృద్ధుండ నిపుడు నాలోని
పూర్వపు బల మెల్ల బోయె- భూతలిని
మను ఖరారిత్రివిక్రముఁడుగ జన్మించి
నపుడు నే మంచి వయస్సులో నుంటి
ఆనాఁటి నా బల మద్భుతాద్భుతము.
బలిని బంధింపఁగా భగవంతుఁ డపుడు
వర్ణనాతీతమై భాసిలుచున్న
భూరిత్రివిక్రమాకారంబుఁ దాల్పఁ
గనుఁగొని, ఒక రెండు గడియలలోన
ఏడు పర్యాయంబు లేఁ బ్రదక్షిణము
సలిపితి భక్తి నా స్వామి కేమందు!"
అనవిని, యంగదుఁ, "డంభోధి నేను
లంఘింపఁగలగాని- రాజాలఁ దిరిగి
యను భయం బొదవు మదాత్మలో" ననియె.
అన జాంబవంతుఁడు విని, "యువరాజ!
ఈవు సమర్థుండవే యైనఁగాని
నాయకు నినుఁబంప న్యాయమే?" యనుచు
హనుమంతుఁ గాంచి యిట్లభివచియించె:
జాంబవంతుఁడు హనుమంతుని సముద్ర
తరణమునకుఁ బురికొల్పుట
"ఓ మహాబలవంత! ఓ హనుమంత!
ఇట్లు మౌనముఁ దాల్చితేమి మహాత్మ!
వాయుసుతా! నీవు వాయుసమాన
చండమహాబలశాలివి, మతియుఁ
బ్రజ్ఞావివేకాతివిజ్ఞాననిధివి,
నీ వీ జగంబున నెఱవేర్పలేని
కార్య మేమున్నది? కపియూథముఖ్య!
రఘురామకార్యనిర్వహణార్థ మవని
నవతరించితి వీవయా! ఆంజనేయ!"

హనుమంతుఁడు సముద్రతరణమునకు సముత్సాహుఁడై, విజృంభించుట

అనుబుధపతివాక్కు- లాలించినంత
మారుతి పర్వతాకారుఁడై నిలిచె.
కమ్రకాంచనవర్ణకలితముదగ్ర
దుర్నిరీక్ష్యప్రభోత్తుంగమౌ నతని
మహితమహాకాయ మహ! వెలుఁగొందె;
అపర మేరుమహీధరాధిపం బట్లు.
అంత, శ్రీరామకార్యావేశపూర్ణ
రోమరోమాంచితరూక్షస్వరూపుఁ
డగు హనుమానుఁ డత్యంతభీష్మముగ
సింహనాదంబులు చేసి పల్ సార్లు,
"అవలీల నే నిదే యబ్ధిఁ దాటియును,

రావణాసురసేనతో వధియించి,
పెరికి త్రికూటంబు వేఁ గొనివత్తు.
ఓ జాంబవంత; నే నొనరింపఁ దగిన
దేమియో? సెలవి మ్మిదే పోయివత్తు."
అనఁగ భల్లూకేంద్రుఁ డనియెఁ "గుమార!
సీతను దర్శించి ఆ తల్లి వ ర్త
మానంబుఁ గైకొని మగుడ వచ్చుటయె
నీదు క ర్తవ్యంబు- నీ వా ర్త వినియు
శ్రీరామచంద్రుండు నీరజాక్షుండు
కపిబలయు క్తుఁడై కదలి లీలార్థ-
మాత్మీయ బాహుబలాతి రేకమున
జానకి న్విడిపించు సామోరి! సూరి!
సకలవానర సై న్యసంయు క్తుఁ డగుచు
రఘువీరుఁ డుగ్రసంగ్రామరంగమున
రావణాసురముఖ్యరాక్షసావళిని
సంహార మొనరించి జనకజ నొనియు
సాకేతమును జేరి జగతిఁ బాలించు.
ఆ త్రిలోకప్రపూతాద్భుతచరిత
మా నారదాదిమహామునీశ్వరులు
గానం బొనర్పఁగా గల రాంజనేయ!
ఆ మహాచరితంబు లాలించువారు,
పాడెడివారలుఁ బఠియించువారు,
పారాయణముఁ జేయువారు, తప్పకను
బరమపదశ్రీని బడయఁగాఁ గలరు.
రఘువీరపాదనీరజమధువ్రతము
"తులసి" యా చరితముల్ గళ మెత్తిపాడు,
సతతంబు వీడక సంతోష మొప్ప.
భవభేషజంబులై భాసిల్లుచుండు
రఘునాథగాథల శ్రవణం బొనర్చు
సకలనారీనరుల్ సకలేప్సితార్థ
సంసిద్ధిఁ గాంచియు శాంతి నొందెదరు-
త్రిశిరారి శ్రీరాము కృపచేత జగతి.
కాన, నీలోత్పలఘనతనుశ్యాము-
స్వప్రభానిర్జితశతకోటికాము-
పాపమహారణ్యపావకనాము-
కేశవ హృదయపంకేజసద్ధాము-
సంకీర్తనముఁ జేసి, సౌఖ్యంబుఁ గనుఁడు!

సుంగధివృత్తము,

మంగళంబు, రామతీర్థమానితాకృతీ: పతీ:
మంగళంబు, చిత్స్వరూప! మారగర్వభంజనా:
మంగళంబు, భక్తలోకమానసార్తివారకా:
మంగళంబు, మట్టపల్లిమందిరా: నృకేసరీ:

ఓమ్ ఓమ్ ఓమ్

ఇది సకలకలికలుషవిధ్వంసక మైన శ్రీగోస్వామితులసీదాసకృత- 'శ్రీరామచరిత మానసము' లోని కిష్కింధాకాండమునకు-శ్రీ రామతీర్థభగవత్పాద ప్రియశిష్య నిరంతర శ్రీ మట్టపల్లి లక్ష్మీనృసింహ పరబ్రహ్మవాస హృత్పద్మతీర్థ శ్రీ కేశవతీర్థ స్వామికృతమైన యాంధ్రానువాదము సర్వము సంపూర్ణము

ఓం తత్సత్

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరామచరితమానసము

సుందర కాండము

పంచమ సోపానము



శ్రీ పాటీలు తిమ్మారెడ్డి, కిశోర్, ఎం. ఏ.

(9188

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరామచరితమానసము

సుందర కాండము

పంచమ సోపానము

ప్రార్థన

శ్రీకృష్ణవేణీతీరస్థ
మట్టపల్యాంస్థితమ్ హరిమ్!
లక్ష్మీ నృసింహశ్రీమూర్తిం
నౌమి సౌమ్యమహం సదా॥

అనేకానేకసద్భక్త
ర్పితమాలాయుతోరసే
భక్తావనాయ సౌమ్యాయ
నృసింహాయాఽస్తుతే నమః॥

అనంతకళ్యాణగుణాభిరామమ్।
ంశోరసంరక్షణభారధుర్యమ్।
ముక్తోగ్రరూపం వరదం ప్రశాంతమ్।
ాక్ష్మీనృసింహం మనసా భజేఽహమ్।

వీనాం పరమంలక్ష్యః
భక్తానాంపరమంపదః
యన్మహామూర్తిసాన్నిధ్యం
తన్మాంనిత్యం ప్రసీదతు॥
రోమ్యాంధ్రం గీయమానం
భుశుండి గిరిశాధిభిః
దం శ్రీరామచరిత
మానసం తులసీకృతమ్॥

శ్రీకరః శుభకర! చింతితఫలద!
లక్ష్మీనృసింహ! సల్లక్షణోపేత!
కృతి కవిఘ్నత దయసేసెడికొఱకు
భక్తి విఘ్నేశ్వరు వరదు భజించి,
నిరతము వాక్కున నెలకొనికావఁ
బరమప్రసన్నశోభనమూర్తి సౌమ్య
చల్లనిమాతల్లి శారదామాత
చరణాబ్జములకడ సాష్టాంగ మెరఁగి,
యస్మదాచార్యుల కంజలివట్టి
దేశికుల్ కేశవతీర్థులయానఁ
దలమోసి నీ కంకితమ్ముగ నవధి
భాషయందున మును బరమభక్తుండు
శ్రీయుతుం డా తులసీదాసకవి
చేసిన యా దివ్యశ్రీరామచరిత
మానససత్కావ్య మాంధ్ర మొనర్తు.
నందు సుందరకాండ మవధారుదేవ!
భక్తసంరక్షణభారధౌరేయ!
నాకౌకసానోకహమ్మ! నృసింహ!
యవధారు పరమేశ! యవధారు తండ్రి!

ఓం తత్సత్

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరామచరితమానసము

సుందర కాండము

పంచమ సోపానము

ప్రథమవిశ్రామము

శ్రీస్మితజితాంగనీలా!
యస్మాకీనాఘహారహారాజ్ఞత మో
ఘస్మరః ప్రహ్లాదప్రద!
భస్మీకృతదైత్య మట్టపల్లినృసింహా!

సీ॥ శ్రీరామచంద్రు బృందారకవంద్యుని
వేదాంతవేద్యుని విభుని హరిని
మాయామనుష్య బ్రహ్మాండాధినాయకు
గైవల్యశాంతిదు గంజనే'తు
ననఘుని శాశ్వతు నప్రమేయుని శాంతు
గరుణాలవాలు భాసురకపోలు
రఘుకులజలనిధిరాకాసుధాకరు
రాజచూడామణి రాజవదను

పద్మభవనీలకంధరపాకశత్రు
శేషముఖ్యసుపర్వసం సేవ్యమాను
విశ్వరూపు సుధామయు విమలచరితు
మద్ధృదయపీఠి నిల్పి నమస్కరింతు.

ఉ॥ ఓ యఖిలాంతరాత్మ! భవ
దుజ్జ్వలరూపము చూచుకోర్కిగా
కే యితరమ్ము నా యెడ వ
నింతయులేదు వచింతు సత్యమున్
నాయెడ సుప్రసన్నత మ
నమ్మున నీ పదభక్తి నిచ్చి య
ట్లే యరిషట్కముఁ దొలఁచి
యింక గృతార్థునిఁ జేయఁగాఁదగున్.

ఉ॥ శ్రీరఘురామదివ్యపద
సేవకు దైత్యపదాన్వవాయకాం
తారకృశాను సర్వగుణ
ధాముని జ్ఞానిజనాగ్రగణ్యు సా
మీరి మహోజ్జ్వలాంగుని న
మేయపరాక్రమశోభితున్ లస
న్మేరునగాభదేహుని వ
నేచరనాథు దలంచెద న్మదిన్:

కథాప్రారంభము

హనుమంతుఁడు సముద్రోల్లంఘన మొనర్చుట

శ్రీకర! వరద! లక్ష్మీనారసింహా!
శంకరుం డిట్లను శైలజతోడ

గరుడునితో ననుఁ గాకభుశుండి:
జాంబవంతుని వాక్యసరణికి మెచ్చి
హనుమానుఁ డంత నత్యంతహర్ష మున
"నన్నలారా! యిమ్మహాబ్ధిని దాఁటి
సీతమ్మతల్లి వీక్షించి తద్వార్తఁ
దెచ్చునందాఁక నిం దే కందమూల
ఫలములు గుడుచుచుఁ బొడుచుఁ గష్ట
ములనెల్ల విస్మరింపుఁడు; నాదుహృదయ
మురకలువేయుచునున్నది; కార్య
సిద్ధి తప్ప"- దటంచుఁ జెప్పి శ్రీరామ
నామము హృదయమునన్ సంస్మరించి,
వందన మొనరించి, వనరాశితీర
మందునఁ గల సుందరాచలశిఖర
మొక్కఁదూఁకున నెక్కఁ, నోపక యదియుఁ
బాతాళమున కేఁగెఁ; బావని యంత
నామమ్మ నెడదఁ బొనఃపున్యముగను
జపియించి, ధీరగర్జన మొనరించి,
శ్రీరామచంద్రుని చేతియస్త్రమ్మో
పోలిక రివ్వున ముందున కరిగె;
వారిధియును రఘుపతిదూత యనుచు
మదిలోనఁ దలపోసి మైనాకుఁ బిలిచి,
"యాతనిశ్రమ హరియింపు" మటంచు
ననిచిన వానిమైయంటి వందనము
గావించి "శ్రీరామకార్యార్థి యగుచుఁ
జనుచున్ననాకు విశ్రాంతి యెక్కఁడిది?"
యని పల్కఁ ముందున కరుగ దేవతలు
పావనిబుద్ధియు బలము నెఱుంగఁ
దలపోసి, సర్పమాతను సురసాఖ్యఁ
బంపఁగ, నా మెయు వచ్చి "యాహార
మిచ్చిరి దేవత లీనాఁడు నాకు"
నని పల్కఁ నది విని యాంజనేయుండు
"శ్రీరామకార్యము సేసి నే దిరిగి
వచ్చి యా జానకివార్తను బ్రభుని
కందించి పిదప నీ యాస్యము సొత్తు;
సత్య మియ్యది నన్ను జనని! పోనిమ్మ"-
టంచుఁ బోవఁగ నెన్నియత్నముల్ సేయ
నవి వమ్ముసేసిన హనుమానుఁ "డట్టు
లైన, నన్ గ్రహియించు టది కష్ట" మనియె;
నది విని యోజన మ్మాస్యము విప్పె;
ద్విగుణము పావని పెంచెను మేను;
బదునారుయోజనా ల్వదనము దెరువ,
నయ్యె ముప్పదియురెం డాంజనేయుండు;
తనవదనమ్ము నెంతగ నది పెంచు
నంత రెండింతలై యలరెను గపియు;
శతయోజనమ్ము లాస్య మ్మది విప్ప
నత్యంతలఘురూప మాతఁడు పూని,
వదనమ్మునం జొచ్చి బయటకువచ్చి,
శిరము వాలిచి నమస్కృతిసేసి "యింక
నేఁగెద నే నెలవిప్పింపు" మనిన,
"నీ బుద్ధిబలములు నే నెఱింగితిని;
రామునిదైనకార్యమ్మును నీవు
చేసెద" వనుచు నాశీర్వాదమిచ్చి
సంతోషమున నది సనియె; నామోఁద-
జలనిధియందు నిశాచరి యోర్తు
వసియించుచుండు; వాయ్వధ్వము వట్టి
యరుఁగుదెంచెడు పతంగాదులనీడఁ
బొసఁగ మాయాబలమ్మున బట్టికొనుఁడు
నవి యిఁక సుంతయు నరుఁగ లేకున్న
వాని నయ్యది పట్టి భక్షించుచుండ;
నది తనచలము నయ్యనిలతనూజు
పైనఁ బ్రయోగింప వడి ఁబ్రయత్నింపఁ,
గపివర్యుఁ డద్దాని గాపట్య మెఱిఁగి
నిర్జించి దాని, వార్నిధి యుత్తరించి
యవ్వలితీరమునందున వివిధ

ఫలపుష్పములచేత భాసిల్లు వృక్ష
వితతియునుం బహువిధపతంగమృగ
సంతతి గనుఁగొని సంతసమందె;
నెసఁగును దానికట్టెదుట విశాల
పర్వత మొకఁడు; నిర్భయమున హనుమ
పరువిడి యప్పు డప్పర్వత మెక్కెఁ;-
బార్వతీ! యిందు నా పావనిగొప్ప
తనము లే దిద్దియంతయుఁ గాలభో క్త
యగు భగవానుని యీ ప్రతాపమ్మె;

లంకానగరవర్ణనము

అట్లు పర్వత మెక్కి యాంజనేయుండు
గనుఁగొనె నపుడు లంకావై భవమ్ము;
నది యిట్టి దది యట్టి దని చెప్పరాని
వప్ర మున్నతమయి వరలు; నల్దడలఁ
ద్రవ్వని పరిఖ సంద్రము చుట్టియుండు;
ధగధగమనెడు రత్నమ్ములు దాపఁ
బడియున్నకతమున బంగారుబురుజు
లెల్లెడఁ గాంతుల నీనుచునుండె;
శోభావహమ్ములౌ సుందరాయతన
రాజి యీ లోపల రాజిల్లుచుండె;
రచ్చలు క్రంతలు రాజమార్గములు
గడువిచిత్రములుగాఁ గైసేయఁబడియె;
నరదము లేనుఁగు లశ్వముల్ బంట్లు
చతురంగసైన్యపుసంపదలెల్ల
గణుతింపఁగా నశక్య మ్మేరికేని;
వివిధరూపమ్ముల వెలయుచునుండు
నత్యంతబలయుతమ్మైన యీ సేన
వర్ణించుకార్య మెవ్వం డోపువాఁడు?
వనవాటికలు నుపవనములు దోఁట
లబ్జాకరమ్ములు నలరుకూపములు
పుటభేదనమ్మునఁ బొలుపొందుచుండె;
నరనాగదేవగంధర్వకన్యకలు
సౌందర్యమున మానసము హరియింత్రు;
శైలాభము లగు విశాలదేహముల
నెసఁగి మల్లులును గర్జింపుచు ఖురళి
యందుఁ బరస్పర మాహవమ్మునకుఁ
బిల్చెద రొక్కొఁడఁ బేరెలుంగునను;
వికృతాకృతులు కోటివీరాగ్రగణ్య
లప్రమత్తాత్మలై యీ నగరమ్ము
నలుగడల్ గాచియున్నా రొక్కచోట;
మహిషధేన్వజఖరమానవగణము
బట్టి రాక్షసభలుల్ భక్షించుచుంద్రు;
తప్పక రామచంద్రాస్త్రతీర్థమున
వీరెల్లరును మేనువిడిచి పొందెదరు
పరమపదంబును భాసురరీతి.

హనుమంతుఁడు లంకిణిని నిర్జించుట

ఈవిధంబున నా కపీశుఁడౌ హనుమ
పురరక్షకులనెల్లఁ బొడఁగాంచి, కొంత
చింతించి, "యెంతయుఁ జిన్నరూపమునఁ
జెచ్చెరఁ బురిఁ బ్రవేశించెదఁ గాక"
యని యెంచి యొకదోమయంతవాఁ డగుచు
శ్రీరామచంద్రుని జింతించి యెడఁద
లంకద్వారముఁ జేరె; లంకిణియ నెడు
రాకాసి యో ర్తది రక్షించుచుండె;
నది యాతనిం గాంచి "యీర! నీ విట్లు
సరకుసేయక నన్నుఁ జనుచున్నవాఁడ
వెఱుఁగవు మూర్ఖ! నీ వింత నా మర్మ;
మెవ్వరైనను జోరు లిటు వచ్చిరేని
వారినెల్లరిని నే భక్షింతు" ననినఁ,
గోపించి పిడికిట గ్రుద్దె నక్కపియు.
నెత్తురుల్ గ్రక్కుచు నేలపైఁ బొరలఁ
గోల్కొని యదియును గొంతసేపటికిఁ

బాణీద్వయము మోడ్చి భయసంభ్రమములు
బెనఁగొన నతనికి వినిచె నీ రీతి:
"రావణునకుఁదా వర మ్మిచ్చి పోవు
సమయమ్మునందున సరసిజాసనుఁడు
నను గని, యొక్క-వానరహతిచేతఁ
జత్తు వెన్నండు రాక్షసవినాశమ్ము
తథ్య మప్పుడె యని తగఁ దెల్పె నాకు;
తండ్రి! నా పుణ్య మెంతటి దొక్కొ-- కన్ను
లారంగఁ గనుఁగొననయ్యె శ్రీరామ
చంద్రునిదూతను; స్వర్గాపవర్గ
సుఖములనెల్లఁ ద్రాసున నుంచి తూఁప
సకలమ్ము క్షణకాలసత్సంగమునకుఁ
జాల వట్లగుటఁ గోసలనాథుఁడైన
శ్రీరామచంద్రుని హృదయమధ్యమునఁ
దగఁ బ్రతిష్ఠించి పత్తనమును జొరుము!
రామభక్తులకు గరళము పీయూష,-
మరి మిత్రుఁ డగును మహాబ్ధిగోష్పాద
మగు, ననలమ్ము శైత్యమువొందు, మేరు
నగ మదియు రజఃకణమ్మగు ననఘ!"

హనుమంతుని లంకా ప్రవేశము
సీతాన్వేషణము

అన విని హనుమంతుఁ డతిధీరవర్యుఁ
డత్యంతలఘురూప మంత ధరించి
బట్టణముం జొచ్చె భగవాను దలఁచి;
యన్వేషణముసేసె నఖిలమందిరము;
లగణిత యోద్ధుల నందందుఁ గాంచె;
నామోఁదఁ గపి రావణాగారమునకు
వడి నేఁగె; నది యనిర్వచనీయశోభ
నెసలారు; నం దొక్క-యెడ సెజ్జగాంచెఁ;
గాని వై దేహియుఁ గానరాదయ్యెఁ;

హనుమద్విభీషణ సమాగమము

బిసప నాతఁడు గాంచె వే ఱొక్క-చోట
నత్యంతరమణీయమౌ భవనమ్ము;
దానియందున దేవతాగార మొండు
ప్రత్యేకముగఁ గట్టఁబడియుండె; మీఁద
రామాయుధమ్ములు రచియింపఁబడియె;
నది యొప్పు నింతింత యనరాని శోభ;
నచ్చోట నవ్యనవ్యమ్ములు, తులసి
బృందముల్ గాంచి హర్షించి యక్క-పియు,
"లంకాపురమనంగ రాక్షసబృంద
మలరు నివాస, మయ్యారె! యిచ్చోట
నే సజ్జనుఁడు నివసించుచున్నాఁడొ?-"
యనుచుఁ దర్కించు న య్యవసరమందు
రావణానుజుఁడు మేల్కాంచి "శ్రీరామ!
శ్రీరామ!" యని సంస్మరించిన, "నితఁడు
సజ్జనుఁ" డని మానసమ్మునఁ దలఁచి,
"యీతని పరిచయ మింక నార్జింతు;
సాధులచేఁ గార్యసంతతి చెడదు"
గానెంచి బ్రాహ్మణాకారము దాల్చి,
పిలిచిన వినియు విభీషణుఁ డంత
లేచి యల్లన వచ్చి ప్రీతిఁ బ్రణామ
మదిసేసి కుశలములడిగి "యో విప్ర!
నిజకథ నింక విన్పింపఁగ దయ్య!
హరిదాసు లం దెవ్వఁ డగుదువో నీవు?
నినుఁ గన్న యదిమొదల్ నిజ మాత్మయందు
నత్యంతప్రీతి సమావిర్భవించుఁ;
గాక దీనులదెసఁ గారుణ్యమూను
శ్రీరాముఁ డగుదువో చెప్పుము, నన్నుఁ
జేయుఁ గృతార్థు విచ్చేసితి విట్లు"-
లన విని హనుమానుఁ డా రామచంద్రు
కథ సర్వముం జెప్పి, కడపటఁ దన్ను
నెఱిఁగించుకొనె; నంత నిరుఘరియొడలు

లెంతయుఁ బులకించె; నే ఁ్తెర రామ
గుణసమూహములు బేరొ్కనుచు నానంద
వారధిమగ్నులై వా రుండి రప్పు;
డంత విభీషణుం డనిలకుమారు
వంకఁ గనుంగొని పలికె నీ రీతి:
"నా కథ వినుమిఁక నన్న! యిచ్చోట
దంతసంఘమ్మ్మధ్యమ్మున, దిక్కు-
మాలి నాలుకపడి పులఁ గెడుభంగిఁ
బడియున్నవాఁడ నా భానుకులేంద్రుఁ
డీ యనాథునివిూఁద నెప్పుడు కరుణఁ
దా వహించునో? మేను తామస మగుట
నే సాధనయు నిర్వహింపలేకుంటి;
నయ్యను మానస మా రామచంద్ర
పాదాబ్జములపయి భ క్తివహించు;
శ్రీరామచంద్రునికృప గల దంచు
నే విశ్వసించెద నిపు; డెట్టు లన్న-
హరికృపలేనిదే యవనిలో సాధు
జనసఖ్య మద్ది దుస్సాధము గాదె!
రఘునాయకునియనుగ్రహ మున్నకతన
నీ రీతి దర్శన మీ వొసంగితివి."-
నా విని పవమాననందనుం, "డో వి
భీషణ! చెప్పెద వినుప్రభురీతి:
సేవకు లన్న నా శ్రీరామచంద్రుఁ
డెంత ప్రేమించునో? యెంత నా కులము?
చపలవానరుఁడను, సకలవిధాల
హీనుండ, నా నామ మెవ్వఁడు వల్క-
నుదయమాతని కిఁక నోగిరముండ-
దంతటి యధముఁడనయ్యు నా రాముఁ
డెంతగ నన్నుఁ బ్రేమించుచున్నాఁడొ!"-
యని పల్కుచుండఁగ నాతని రెండు
కన్నులఁ బ్రేమాశ్రుకణములు నిండె;
"నిట్టిఁడు స్వామి యం చెఱిఁగియుఁగూడ
నాతని మఱచి యందందుఁ గోరాడు
వాఁడు దుఃఖితుఁ డేల వసుధఁ గాఁ" డనుచు
రామచంద్రునిగుణరాశిఁ బేర్కొనుచు
నతఁ డనిర్వచనీయ మగు శాంతి యొందె.

హనుమంతుఁ డశోకవనమున సీతను దర్శించుట

అంత విభీషణుం డచ్చట సీత
యె ట్లుండు నా కథయెల్ల వ్రాకుచ్చె;
నంతయు విని పవనాత్మజుం, "డేను
జానకీమాతదర్శన మపేక్షింతు"
ననిన విభీషణుఁ డన్నిమార్గములఁ
జెప్పెఁ; బోవనియును సెలవును బొంది
సీతామతల్లి వసించుచునున్న
య య్యశోకావని కరిగి యచ్చోట
నామెను గని, హృదయమున వందనము
గావించె; నా రాత్రి గడచె నాల్జాము;
లయ్యెడ సీత దేహమ్ము కృశించి
యేకవేణికయయి యెడఁదలో రామ
గుణములఁ స్మరియించుకొనుచును, జూపు
లడుగుల నిల్పి ధైర్యము రూపుకట్టి
కూర్చుండుటను గనుంగొని పవమాన
తనయుఁడు గు ర్తించి, తరుపల్లవముల
మాటునఁ గూర్చుండె మానసమందు
'నీమెదుఃఖము బాపుదు' ట్లనుకొనుచు.

శ్రీరామచరితమానసము

సుందర కాండము

ద్వితీయవిశ్రామము

రామా! శుభగుణధామా!
కామారిస్తుత్యనామ! కదనోద్దామా!
కోమలమేఘశ్యామా!
స్వామీ! శ్రీమట్టపల్లివాస! నృసింహా!

రావణుఁడు సీతయొద్దఁ బ్రలాపించుట

సామీరి యట్లుండ, స్త్రైణము వెంటఁ
గదలి రా మిక్కిలి గైసేసి పంక్తి
వదనుఁ డచ్చోటికి వచ్చి వై దేహిఁ
గని పెక్కుభంగులుగాఁ జెప్పి సామ
దానముల్ భేదము దండము ననెడు
చతురుపాయమ్ములు సాగకున్నంత,
"సుముఖి! యో మైథిలీ! సుందరీ! వినుము!
ప్రేమతో మందోదరీముఖ్యసతుల
జేసెద నీదు దాసీజనంబులుగ.
ఇదె నా ప్రతిజ్ఞ కన్నెత్తి నన్నొక్క
సారి గన్నొన్నచోఁ జాలు నయ్యదియె"-
యనుడు జానకి కోసలాధీశు నెడఁదఁ
బరమస్నేహమ్మున భావించి యొక్క
తృణము నడ్డముగొని యీ గతి ననియె:
"పంక్తికంధర! యెందుఁ బద్మిని మిణుఁగు
రుంబుర్వు దగు వెల్తురున వికసించు
నే? యిటుగా దీని నెడఁద భావింపు
మూర్ఖ! రామునిశిలీముఖములకథల
నే మెఱుంగుదువు? పాపీ! స్వామి లేక
యుండు నెటకింగి న న్నొడిసి తెచ్చితివి;
లజ్జావిహీనుఁడ; లజ్జింపవేల?"
యని తన్ను మినుకు బు ర్వసియు రాఘవుని
భానుఁ డటుంచును బలికెడు సీత
ఘోరవాక్యములకుఁ గోపించి యాతఁ
డడిదమ్ము లాగి యి ట్లనుచు నాక్రుచ్చె-
"నోసి! నా కవమతి యొనరించి తిటుల;
నీ చండకరవాల మెత్తి నీ శిరము
విదలింతుఁ, గా దేని వినుము నా మాట.-
జీవనహాని జేసేఁతల నేలఁ
గొనితెచ్చుకొందువో కోమలి!" యనుడు
జానకీదేవి "దశగ్రీవ! నీల
కమలమాలాభముల్ కరికరసమము
లా రాముభుజము లయ్యవి యొండె, నిశిత
కరవాల మిది యొండె, కాక మదీయ
కంఠ మాశ్లేషింపఁగా నన్య మోప-
దిదె నా ప్రతిజ్ఞ యోయీ శుంఠ!" యనుచు
"నో చంద్రహాసమా! యుర్వియందీవు
శ్రేష్ఠము తీవ్రము శీతలమైన
ధారచేఁ బోకార్చి దయసూపు రామ
విరహాగ్నిజాతమా వేదన నెల్ల"-
ననియె; నమ్మాటల కలిగి రావణుఁడు
జానకిఁ బొడువఁగ సమకట్టె; నంత
మయసుత వాని న మ్మార్గమునుండి
వారించె నీతులు వలికి యెన్నేని;

రావణుం డంతట రాకాసిమూఁక
రావించి, "బహుప్రకారముల జానకిని
జంకించి యొక్క మాసావధిలోన
నొప్పింపుఁ డట్లు కాకున్న నీ చంద్ర
హాస మీ పనిసేయు నానాఁడె" యనుచుఁ
బల్క యేఁగెను నిజప్రాసాదమునకు.

త్రిజటాస్వప్నవృత్తాంతము

ఇచటఁ బిశాచము లెన్నేని వికట
ము లగు రూపమ్ములఁ బూని జంకింప
సాగె; నమ్మాఁకఁ ద్రిజట యను నొక్క-
రాకాసి గలదు; శ్రీరామపదార
విందతత్పరయు వివేకియుఁ జతుర
యది రాక్షసీసమూహమ్మును బిలిచి
తనస్వప్నవృత్త మంతయు నిట్లు చెప్పె:
"సీతామతలి ని సేవించి మీరు
కల్యాణములఁ బొందఁ గాంక్షింపుఁ డెదల;
నా స్వప్నమందు వానర మొక్కఁ డఖిల
లంకాపురముఁ గాల్చె; రాక్షససేన
సకలముచచ్చె; రాసభ మెక్కి నగ్నుఁ
డై ముండితశిరస్కుఁడై ఖండితభుజుఁ
డై దశాననుఁడు యామ్యమువట్టి పోయె;
నగర మ్మిది విభీషణాధీనమయ్యె;
శ్రీరామవిజయభేరీధ్వని జెలఁగె;
బిలిపించె రాముఁ డాపిదప జానకిని;
త్వరలోన నీ కల తథ్యమౌ నమ్ము!"-
డని పల్క యా యసురాంగన లెల్ల
భయహతి జానకిపదముల వ్రాలి
యెందెందో సురిగిపోయిరి వనమందు.

సీతా త్రిజటల సంభాషణము

నీచరాక్షసుఁ డింక నెల గడువేగ
వధియించుఁ ద న్నని భావంబులోన
నా ధరాజాత శోకాకుల యగుచు
నప్పుడు త్రిజటదిక్కె, "తల్లి! నీవు
నన్ను నాపదలందు నాదుకొన్నావు;
వెంటనే యిమ్మేను విడుచు నుపాయ
మెఱిఁగింపు మే దేని; యీ విరహమ్ము
కడునసహ్యమ్మయ్యెఁ; గాష్ఠముల్ దెచ్చి
చితి నొండు ప్రీతి రచింపుము; దానఁ
జొత్తుఁ గాకుండిన శూలములోని
పంక్తికంధరుక్రూరవాక్యము లెట్లు
వినఁగల?" నని పల్క- విని యవి త్రిజట,
జానకిపాదాంబుజమ్ములు వట్టి
ప్రభునిప్రతాపమ్ము బలము యశమ్ము
వినిపించి, "సుకుమారి! విను మిట్టిరాత్రి
యగ్ని యెందు లభించు?" నని యింటికరిగె.

సీతాహనుమత్సంవాదము

ఆమోద సీతయు నంతరంగమున
"విధి యింతగా నాకు విపరీతమయ్యె;
నగ్నియు లభియింప దాపదగడువ;
దాకసమ్మున నన్ని యగ్నులు గలవు;
పృథ్వీస్థలమ్మున లే దొకతార;
పావకమయుఁడు విభావరీధవుఁడు
హతభాగిని యి దంచు నగ్నివర్షింపఁ-
దో యశోకమ్మ! నా దొక్కటి మనవి:
హరియించి శోకము సార్థకనామ
వగుము; నవ్యకిసాలయము లగ్ని సమము;
లగ్ని నొసఁగి విరహార్తిని బాపు"-
మని యార్తయై దుఃఖితాత్మయౌ సీతఁ
గనుచు క్షణమ్ములు *కల్పము లట్లు
గడపి నెమ్మనమునఁ గడు విచారించి

---

* కల్పము :జగజ్జీవన కాలము అనగా - 432,00,00, 000 సంవత్సరములు.

యా యశోక మ్మిచ్చె నగ్ని ననంగ
పై నుండి మెల్లగా పవమానసుతుఁడు
ముద్రిక సీతమ్మ ముందట వై చె;-
నతిహర్ష మున సీత యద్దాని నె త్తి
చేత, నద్దానిపైఁ జెక్కిన దివ్య
శ్రీరామనామమ్ము చెచ్చెరఁ గాంచి
హర్ష విషాదము లాత్మలో నిగుడ,
"శ్రీరామచంద్రుఁ డజేయుం డెవండు
స్వామిని గెలిచెడు వాడిమగండు?
ఈ రీతి ముద్రిక నెవ్వఁడు మాయ
కతమున నిర్మింపఁగాఁ గల" డనుచు
భావించుచుండఁగఁ, బావని మధుర
వాక్కుల శ్రీరామవరగుణగణము
వర్ణింపఁ దొరకొనె; వానిని వినుట
జానకి దుఃఖము సకలము దీరె-
నా మెయుఁ జెవులొగ్గి యది వినసాగె;
నారంభముందొట్టి యఖిల మా కథను
బావని వినిపింపఁ, బదపడి, "యిట్టి
శ్రవణామృతమ్మగు చక్కని గాథ
నాద్యంతమును జెప్పినట్టి యో యన్న!
యేల దర్శనము నా కీ"? వని యనుడు-
నా మె యెదుట నిల్చె ననిలకుమారుఁ;
డా మె యాతనిఁ గాంచి యాశ్చర్య మొంది
మఱియొకవంక మగిడి కూర్చుండె-
నప్పుడు హనుమంతు, "డమ్మరో! నేను
రాముని దూత; నీ రత్నాంగుళీయ
క మ్మేన తెచ్చితిఁ; గరుణానిధాను
పై శపథముగొని పలుకుచునుంటి;
నీకు గుర్తుగ రఘునేత యిద్దాని
నా కిచ్చె"- ననఁగ జానకి "నరులకును
వానరులకు నెందు వరలునే సంగ"
మన మారుతాత్మజుఁ డంతయు వినిచె.

ఆ హనుమాను ప్రేమార్ద్రవాక్యములు
విన సీతమనమున విశ్వాస మపుడు
కల్గె- నీతండు త్రికరణశుద్ధుఁడగు
శ్రీరఘుతిలకునిసేవకుఁ డంచు.
హరిభక్తుఁ డితఁ డని యాతనిమీఁద
గాఢాభిమానము గలుగఁగఁ గనుల
నశ్రువుల్ నిండ దేహము పులకింప
"నో తండ్రి! విరహపయోధి మునుంగు
నాపాలిటికి నీవు నావ వైనాఁడ;
వనుజయుతుండు ఖరారి సేమమ్మో?
కోమలహృదయుఁ డా కోసలనాథుఁ
డింతటి కాఠిన్య మేల వహించె?
స్వాభావికముగ సేవకహితకరుఁడె!-
యా రాముఁ డొకపరియైనను నన్ను
స్మరియించునొకొ? యా శ్యామలములగు
మృదులాంగములు బరికించి కందోయి
జల్లనౌనే?" యని సజలనేత్రములఁ
గంఠమ్మ్రగూడ గద్గదమ్మ్ము గొనఁగ,
"నన్నును మఱచితే నాథ!" యటంచుఁ
గడువిరహమున దుఃఖమ్మునఁ బొగులు
సీతామతల్లి వీక్షించి వినీతుఁ
డై యనిలాత్మజుఁ డనియె, "నో తల్లి!
యనుజయుతుండు ఖరారి సేమమ్ము;
కాని నీ దుఃఖ మొక్కండె రామునకు
నెంతేనియుం దుఃఖహేతు; వెడంద
నూరక దుఃఖింపకుండుమా జనని!
శ్రీరామచంద్రునిహృదయమ్మునందు
ద్విగుణమ్ము నీయెడఁ బ్రేమ; యెడంద
ధైర్యము వహియించి దశరథసూనుఁ
డంపిన సందేశ మాలింపు మమ్మ!"-
అని రుద్ధకంఠుఁడై యశ్రువు లొలుక
హనుమంతుఁ డల రాముఁ డాడిన పలుకు

లీ రీతి వినిపించె నెంతయోప్రీతి:
శ్రీరామచంద్రుఁడు జెప్పె ని ట్లనుచు:
"నో సీత! నీదువియోగమ్మువలన
సర్వావస్తువులతో శాత్రవ మెసఁగెఁ
దరుపల్లవమ్ములు దహనతుల్యములు;
నిశి కాళనిశి; కళానిధి యర్యముండు
కువలయాకర మది కుంతవనమ్ము;
క్రాఁగుతైలమును మేఘుమ్ములు గురియు;
హితకరమ్ములు నేఁ డహితకారకములు;
వాయుత్రయమ్ము సర్పశ్వాససమము;
తగ్గు ననెదరు చింతలు జెప్పికొన్నఁ-
గాని నే నెవ్వరికడఁ జెప్పికొందు?
నెట్టిదో యీ దుఃఖ మెవ్వఁ డెఱుంగు?
మన్మ్రేమత త్త్వము మఱి యెవ్వఁ డెఱుఁగు-
నొక నా మనము కాక యుర్వీస్థలమున?
మచ్చిత్త మెప్పుడు మైథిలీ! సకియ!
నీకడ వసియించు; నింతియ చాలు
నెట్టిదో నా ప్రేమ యెఱిఁగికొనంగ"
నను ప్రభుసందేశ మపు డాలకించి
జానకియును బ్రేమసాగరమగ్న
యై దేహసంస్మృతి యపుడు కోల్పోయె;
నంతట హనుమానుఁ డామెతో ననియె-
"నమ్మ! ధైర్యము హృదయమున వహింపు;
సేవకసుఖదుని శ్రీరామచంద్రు
స్మరియించి రఘునాథుసత్ప్రాభవమ్ము
మనమున నిల్పు; నా మాటలు నమ్మి
కాతరత్వము వీడఁగాఁగదె తల్లి!
నిశిచరగణము లన్నియు శలభములు;
పతియస్ర్తవితతి వైశ్వానరాభమ్ము;
దితిసుతుల్ భస్మసాత్కృతులాట నిక్క;
మీ జాడ తెలిసిన నింతకాలమ్ము
రఘుపతి సేయఁ డాలస్యమ్ము తల్లి!
రామబాణములను రవి యుదయింప
యాతుధానచమూమహోధ్యము గలదె?
యిప్పుడే నేను ని న్నిచ్చటినుండి
జననిరో! కొంపోవఁజాలుదు గాని
ప్రభుశపథ మ్మొండు బాధించు నన్నుఁ;
బ్రభువులయానతి పడసి రానైతి;
నోపికతో నుండు మొకకొన్ని నాళ్ళు;
రామచంద్రుఁడు వానరమ్ములఁ గూడి
యరుదెంచి యిటకుఁ గ్రవ్యాదగణమ్ము
నడచి చేపట్టి ని న్నరుగఁగలండు-
నారదముఖ్యు లనశ్వరకీర్తి
మూఁడులోకమ్ములఁ బొగడఁగా"- ననిన
హనుమతో సీతమ్మ యనియె, "నో పుత్ర!
సకలవానరులు నీ సాటియయ్యెదరు;
ధైర్యులు వీర లెంతయుఁ గ్రొవ్వియుండి;
రక్లాట నా హృదయమున సందేహ
మది పాయకున్నది"- యనవుడు నమ్మ
హాబలసుతుఁడు నిజాకృతి సూపె;-
సమరభయంకరశాత్రవమథన
చణమగు నా రత్నసానూపమాన
మగు మేను గనుఁగొని యానంద మొందె
సీత; లాఘవమును జెందెఁ బావనియు.
"వానరజాతికి బలమును బుద్ధి
తక్కువగావచ్చుఁ దల్లి! యీ ప్రభుని
సాయమున్న చో చిన్నసర్పము గరుడు
నైనను భక్షించు" ననియెడు హనుమ
భక్తితేజఃప్రతాపబలయుతములు
వచనము లాలించి వైదేహి పరమ
సంతోషమున రామచంద్రున కీతఁ
డిష్టుఁ డం చాశీస్సు లిచ్చి, "యో తండ్రి!
బలశీలనిధి వికపై గుణనిధివి,
యజరుఁడ వమరుఁడ వగుము; సాకేత

నాథుఁడు కృపఁజూచు నాయనా" యనిన
విని హనుమంతుఁడు ప్రేమనిర్మగ్నుఁ
డై మాటిమాటికి నా మెపాదముల
శిరమునేరిచి మ్రొక్కి చేతులుమోడ్చి
"యమ్మ! నే నిపుడు కృతార్థుఁడ నైతి;
ముదిత! యాశీస్సు లమోఘము ల్నీవి;
తల్లి! నా కిచటి సుందరఫలవృక్ష
వితతిఁ గన్నొన ఁకుత్తు విపరీతమయ్యె"-
నన సీత "నాయనా! యతిబలయుతులు
రాక్షసు లిద్దాని రక్షింతు" రనియె.
"తల్లి! నీ యాజ్ఞ నా తలపయి నున్న
దితితనయులకు భీతిల్లను సుంత."-
ననిన వాయుకుమారు నతిబలాఢ్యుండు
నతిబుద్ధిమంతుఁడు నని యాత్మ నెంచి,
"పొమ్ము తండ్రీ! రఘుపుంగవచరణ
ములు హృదయమ్మున బూని యమ్మధుర
ఫలములు భక్షింపు వలసినయన్ని"-
యని యానతిచ్చె నా యవనీకుమారి.

శ్రీరామచరితమహానవనవము

సుందర కాండము

తృతీయవిశ్రామము

సృష్టిస్థితిసంహారక!
శిష్టావన! దుష్టహరణ! శ్రితజనభరణా!
కష్టనివారణ! సర్వ
ద్రష్టా! శ్రీమట్టపల్లిధామ! నృసింహా!

అశోకవనవిధ్వంసనము అక్షయాది రాక్షసహననము

అంత నా కపివీరుఁడా మెకు మొక్కి
వనమునఁ జొరబాఱి ఫలములు మెసవి
తోఁటలోపలితరుల్ ద్రుంచగసాగె;
కావలివారలఁ గనుఁగొని కొంత
మందిని బంపె యమాలయమ్మునకు;
వార లంతట భయభ్రాంతులై పారి
రావణుఁ గాంచి మొఱల్ పెట్టి రిటులు:
"ఒక పెద్దవానర మో మహారాజ!
యెక్కడినుండియో యిటకు వచ్చినది;
య య్యశోకవనమ్మ్ము నంతయుఁ దోచి
ఫలములు దిని పాదపమ్ములు గ్రిళ్ళ
గించి మర్దించి మర్దించి రక్షకుల
యుద్ధరంగంబున నొరగించె" ననిన
నంపించె రావణుఁ డమితసైన్యమ్ము.
కనుఁగొని వారల గర్జించి హనుమ
హతమార్చెఁ బైఁబడి; హతశేషు లార్చు
కొనుచును బారిరి కొందలమంది.
కడువడి దైత్యుఁ డక్షయకుమారకుని
జను మన వాఁడు నసంఖ్యాకులైన
భటులను గైకొనివచ్చినఁ గాంచి
వృక్ష మొక్కటి వేగఁ బెరికి చేఁబూని
తర్జించి వానిని ధరఁ గూల్చి హనుమ
కావించె గంభీరగర్జారవంబు;
కొందరి మర్దించెఁ గొందరిఁ జంపెఁ;
గొందరినిం బట్టికొని నేలరాచె.

ఇంద్రజిత్తుచే హనుమ బంధింపఁబడుట

పరువిడి కొంద రీ వార్త రావణుని
చెవి వేయ, సుతుఁడు చచ్చినదాని కలిగి,
యత్యంతబలశాలి యగు మేఘనాదుఁ
బిలిచి "పుత్రక! దానిఁ బిలుకుమార్చకుము;
పట్టి తె మ్మా కోతిఁ బరికింపవలయు
నెచ్చటినుండి తా నేఁగుదెంచినదొ"—
యని పంప నరిగె న య్యతులితబలుఁడు;
తమ్ముని మరణవార్తను విని వాని
గుండెఁ గ్రోధాగ్ని రగుల్కొనుచుండె;
నాతనిఁ బొడఁగాంచి యాంజనేయుండు,
నరుదెంచె నొక్క మహావీరుఁడనుచు
గర్జించె నప్పుడు దిక్తతులు భేదిల్ల;
బరుఁగిడి యచ్చోట వరలెడు నొక్క
పెద్దవృక్షమ్మును బెకలించి తెచ్చి
రావణిపై వైచి రథమును ద్రుంచి
వెంట వచ్చిన మహావీరులనెల్ల

మర్దించి మర్దించి మరి సంహరించి
మదహస్తి వేఱొక మదహస్తిఁ దాఁకు
గతి మేఘనాదుని గవిసి పోరాడె;
హనుమానుఁ డంతట న య్యింద్రజితుని
బొడువఁగఁ బిడికిట మూర్ఛితుఁడయ్యెఁ;
బావని వృక్షముపై నెక్కె; మూర్ఛ
తేరి మాయలను దై తేయుఁ డెన్నేని
పరపియు లొంగఁడు పవమానతనయుఁ
డని యెంచి తుదకు బ్రహ్మాస్త్రము వాఁడు
సంధించె- నంతట సామీరి యెడఁద,
"నే నిఁక దీని మన్నింపకయున్న
మహిమమ్ము గోల్పడు మహి నిది" యనుచు
భావించి చిక్కఁగ భావించియుండె-
నంతట బ్రహ్మాస్త్ర మాతని దాఁకె;
వృక్షముపై నుండి క్రిందికిఁ బడుచుఁ
బెక్కు- రాక్షసులను బీచ మడంచె;
నది గని హనుమంతుఁ డప్పుడు మూర్ఛ
నున్నాఁడనుచు మది నూహించి నాగ
పాశబంధితుఁజేసి వడిఁ గొని చనిరి.
నగసుతా! యెవ్వని నామమంత్రమ్ము
జపియించి జ్ఞానులు సంసారబంధ
తతులను గోతు రాతనిదూత యెందు
బంధితుండగువాఁడు? ప్రభుకార్యపరత
తనయంత నతఁడు బంధమ్ములఁ జిక్కె-

హనుమద్రావణ సంవాదము

వానరుం డిట్టుల బంధింపఁబడుట
విని కౌతుకమున బర్విడి సభఁ జేరె
నఖిలరాక్షసగణ; మప్పుడు పవన
తనయుఁడు పం క్తికంధరుసభాస్థలము
వారకచూచెఁ; దద్రాభవ మెట్లు
వర్ణింపనగును? దేవతలు దిక్పతులు
హస్తముల్ మోడ్చి భయాకులితులయి
దైత్యునిభ్రుకుటిపైఁ దమదృష్టి నిలిపి
యట నిల్చియుండి; ర య్యనిలాత్మజుండు
భయమేమి లేక సర్పకులమ్ము జొచ్చు
వైనతేయునిభంగి వరసభఁజొచ్చెఁ-
బావనిఁ గాంచి రావణుఁడు దుర్భాష
లాడియు విహసించి యాత్మజు చావు
స్మరియించి యెడఁద విషాదము నొంది,
"యెవఁడవురా కోఁతి! యెవ్వానిబలము
నండగాఁ గొని వనమట్లు పెకల్చి?
తెఱుఁగవె నీవు న న్నెన్నఁడుగాని?
నీచుఁడ! మిక్కిలి నిర్భయమూ ర్తి
వై నిల్చియుంటి? వే యపరాధ మరసి
రాక్షసగణముల ప్రమందించినావు?
లేదె ప్రాణములపై లేశము తీపి?"
యన విని మారుతి యల్లన నవ్వి
"రావణ! యెవనిబలమ్మును బొంది
మాయ సమ స్తబ్రహ్మాండసమూహ
ముల రచించెను; దశముఖబ్రహ్మావిష్ణు
పరమేశ్వరులు వేనిబలమున సృజన
పాలనహరణాదిబహుకార్యములను
వహియింతు; రెవ్వనిబలమునఁ బర్వ
తాటవీసంయుతాజాండంబు లెల్ల
శేషుఁడు ధరియించు శీర్ష మునందు;
వేల్పులరక్కసై వివిధదేహముల
నెవ్వఁడు ధరియించె; నెవ్వఁడు గజపు
మందబుద్ధులకు; నుమాధవుఘోర
బాణాసనమ్మును భగ్నముసేసి
రాజసమూహగర్వము విదలించె;
నతులితబలశాలులౌ ఖరదూష
ణత్రిశిరాదుల నాశ మొనర్చె;
నెవఁడు లేశము బల మీయఁగ నీకు

సకలచరాచరజగములఁ గొంటి;
వెవ్వనిసతిని హరించియున్నాఁడ–
వా రఘునాయకుఁ డంపిన దూత;
నెఱుఁగుదు నేను నీ యీ ప్రాభవమ్ము;
*కా ర్తవీర్యార్జును గట్టి తెచ్చితివి;
♦వాలితోఁ బోరాడి వడి పేరుగొంటి"–
వనుచును బల్కు మర్మాఘాతవాక్య
ములు విని హసియించి పుణ్యజనేంద్రుఁ
డా మాటలను మార్చె; హనుమ యిట్లనియె:
"వడి బుభుక్షువునౌట ఫలములు దింటిఁ;
గపిస్వభావమున వృక్షములు ద్రుంచితిని;
దేహ మెవ్వనికైనఁ దీపియే కాదె?
దుష్టదైత్యులు ననున్ను దునిమెద మనుచు
వచ్చిన వారలఁ బట్టి చంపితిని:
ఈ మీ సుతుండు న న్నిపుడు బంధించె;
దానికిఁ నేను సుంతయును లజ్జింప;
నేను నా ప్రభుకార్యనిర్వహణమ్ము
నిచ్చగించుచునుంటి నిదిగో రావణుఁడ!
కరములు మోడ్చి యొక్కటి విన్నవింతు:
నభిమానమును వీడి యాలింపు మోయి!
నీవు పుట్టితివి పునీతవంశమున;
నది యెంచి భక్తభయాపహారకుని
పాదపంకేజముల్ భజియింపుమయ్యా!
కాల మెవ్వనిఁ జూచి గడగడలాడు,
నీ చరాచరముల నెల్ల దేవతల
దైత్యుల భక్షించుఁ దగఁ నెవడట్టి
వానితోడను శాత్రవ మ్మేల నీకు?
నా మాట నమ్మి జానకి నీ గదయ్యా!

రఘునాయకుండు ఖరారి కారుణ్య
కంధి ప్రణతపాలకాగ్రేసరుండె!
యాతనిశరణొందు మపరాధములను
మఱచి నిన్నాతఁడు మన్నింపఁగలఁడు;
రామునిదివ్యచరణపంకజములు
హృదయమ్మున ధరించి స్థిరముగ లంక
నేలుము; నిర్మలహిమకరువంటి
యీ పులస్త్యుని కీర్తియం దిట్టి మచ్చ
రావణ తేకుమీ! రామనామమ్ము
గలుగనిదే శోభ గలదె నాలుకకు?
మదమోహాములు వీడి మది విచారింపు
మమరారి! జగతి సర్వాభరణములఁ
గైసేసికొన్న, నగ్నాంగన శోభ
నిచ్చునే యెందు? దైత్యేశ్వర! రామ
విముఖునిసంపదల్ విభవముల్ నిలువ
వట్టివి యుండి లేనట్టివిగాక;
పుట్టినకడ జలమ్ములు లేనినదులు
ప్రావృడంతమ్మున వట్టిపోఁగలవు.
దశకంఠ! నే శపథమ్మునేసెదను:
శ్రీరామవిముఖు రక్షింపఁ డొక్కరుఁడు;
వేలాదిశంకరుల్ విష్ణులు నజులు
రామవిద్రోహిని రక్షింపలేరు;
మోహమూలకము తమోరూప మధిక
శూలప్రద మ్మగు సు మ్మభిమాన–
మది విసర్జించి నీ వా రఘుతిలకు
భగవాను గారుణ్యవార్ధి భజింపు–"
మని హితవాక్యము లాంజనేయుండు
వైరాగ్యము న్నీతిభక్తిజ్ఞానమ్ము

---

* ఒకప్పుడు రావణుఁడు కార్తవీర్యార్జునునిచే బంధింపఁబడెను.

♦ ఒకానొకసారి వాలి సంధ్యావార్చుకొనుచున్నసమయమున రావణుఁడు వానిని వెనకగుండ బంధింపనుంకింపగా, వాలి గ్రహించి, రావణుని బాహుమూలమున నారుమాసములు బంధించి, తుదకు బ్రహ్మ వచ్చి కోరగా విడిచి పెట్టెను.

గడలుకొనంగఁ బల్క న్వీని నవ్వి
యభిమాని యగు రావణాసురుం డపుడు,
"చక్కని యొక కోఁతి జ్ఞాని లభించె
మా కొక గురువుగా; మరణ మాసన్న
మయ్యెఁ గాఁబోలు; నీ యధముఁడు బోధ
నాకు సేయఁగ వచ్చినాఁ" డని పలుక,
హనుమానుఁ డనియెఁ, —బద్వ్యతికర మ్మగుట
నిజము మతిభ్రమ నీవు గాంచి తని-
ప్రత్యక్షముగ నాకుఁ బ్రకటితమయ్యె."

లంకాదహనము

అనిన రావణుఁ డది యాలించి క్రోధ
మున "నోరి! యింక నిమ్మార్కుని మేనఁ
బ్రాణముల్ నిల్పిన వాఁ డెవ్వఁ" డనుచు
నార్చిన రాక్షసుల్ హనుమంతుఁ జంపఁ
బఱచి; రప్పుడు మంత్రివర్యులఁ గూడి
యరుదెంచి యచ్చటి క విభీషణుఁడు,
శిరమువాలిచి నమస్కృతిసేసి, "దూత
హత్యసేయుట నీతి కావలికార్య;
మిం కొకశిక్ష యే దేని యిం"- డనిన
నిటుసేఁత మేలని యెల్లఱు వల్క-:
రది విని దశముఖుఁ డల్లన నవ్వి,
"యటులైన నీ కోఁతి కంగభంగమ్ము
గావించెదముగాక! కపికిఁ బుచ్ఛమ్ము
పై నెంతయును మమత్వమ్ము గహించు;
నట్లౌటఁ దైలము లద్దిన వస్త్ర
వితతిఁ దోఁకకుఁ జుట్టి వీతిహోత్రమ్ము
నంటింపుఁడీ; తోఁకనటు గోలుపోయి
యీ కోఁతి పతియున్నయెడ కేగి, వానిఁ
దనవెంటఁ గొని యిట్లు తరలిరాఁ గలదు;
పరికించెదను వానిప్రాభవ మ్మేను!"
నా రావణునివచనములకు నవ్వి
కొని హనుమంతుండు, "గుర్తించినాఁడ;
శారద నా కిట్లు సాయమొనర్చె"-
నని మానసమ్మున నానంద మొంది.
అంత నా మూర్ఖనిశాటులు దోఁక
కార్పాటమున సన్నహనములు సేసి;
రప్పుడు హనుమంతుఁ డంతంత దోఁకఁ
బెంచఁ దొడంగె; న వ్వీటను వస్త్ర
ఘృతతైలములు హరియించె సర్వమ్ము;
నీ చోద్యమును జూడ నెల్లఱుపోరు
లరుదెంచి పదముల హనుమని దన్ని
కరములు సరచుచుఁ గడు నవ్వఁదొడఁగి;
రందుఁ గొందఱు భేరు లపుడు మ్రోయించి;
రట్టు లాతని ద్రిప్పి యా పుర మ్మెల్ల,
వాలమ్మునకు నగ్ని వడిఁ దగిలించి-
రది గని పావని యతిలఘురూప
మును గొని బంధనమ్ముల నూడ్చివైచి
బంగారుమేడలపై కెగఁబ్రాకె-
నాతనిఁ గని రాక్షసాంగనలెల్ల
విహ్వలస్వాంతలై వెడవెడఁ బాఱి;
రప్పుడు భగవానునానతిమేర
*కేకోనపంచాశదేధితపవన
ములు వీవఁ దొడఁగె- సమ్మోదితాత్ముఁ డగుచు
నట్టహాసమ్మున హనుమ గర్జించి
యొక్కట గుప్పించి యుప్పరం బంటెఁ;
దనదేహ మెంతపెద్దదిసేయు నంత
కంతకుఁ దేలికయగుచు సామీరి
యొకమందిరమునుండి యురికి వేఱొక్క-
ప్రాసాద మెగఁబ్రాకి పట్టణంబెల్ల

* నలుబది తొమ్మిది వాయువులు గలవనియు, ఈ వాయ్వధిష్ఠానదేవతలను మరుత్తు లనియు, ప్రళయకాలమున నీ నలుబది తొమ్మిది మరుత్తులను కాలపురుషుఁడు వదలుననియు శాస్త్రములు వాక్రుచ్చుచున్నవి.

వీతిహోత్రునకు నర్పింపఁ దొడంగె–
విహ్వలచిత్తులై విఱుగఁగ జనులు;
విస్ఫులింగమ్ముల వెదజల్లుకొనుచు
నాల్కలుజాచుచు నలుగెలంకులకు
జాజ్వల్యమానుఁడై సప్తజిహ్వుండు
పురమునంతయుఁ జుట్టుముట్టిన బెదరి,
"యిప్పుడు గాచువా రెవరు మ" మ్మనుచు,
"హా తండ్రి! హా తల్లి!" యనుచు నార్చుచును,
"వానర మిది కా దెవండో సుధాంధుఁ
డీ వేషమున వచ్చె నిట కని మున్నె
చెప్పమే" యనుచును, "జెచ్చెర సాధు
జనులకు నవమతి సలిపినఫలము
నగర మయ్యయ్యో! యనాథమై మండు"
నంచుఁ బేరొక్కని యథాయథలయి పఱువ,
నొక్క విభీషణుఁ డుండు గృహమ్ము
దక్క పురముసమస్తమ్ము భస్మమ్ము
పావని యొనరించెఁ– బొవకు నెవరు
సృజియించి రాతని సేవకుఁ డగుట
హనుమ నేమియు సేయఁ డగ్నిహోత్రుండు.

హనుమంతుఁడు మఱలి శ్రీరామునికడ కేగ
సీతాదేవికడ సెలవొందుట

వెదకియు వెదకియు బీరువోకుండ
లంకాపురము గాల్చి లంఘించి సాగ
రము సొచ్చి తనదువాల మ్మందు ముంచి
శ్రమదీర్చికొని మీఁద జానకియెదుటఁ
జిన్నరూపముగొని చేదోయి మోడ్చి
నిలుచుండి యిట్లు లనియెఁ "దల్లి! రాముఁ
డిచ్చిన విధమున నీఁగద వమ్మ!–
చిహ్న మొక్కం డన సీతయు నిచ్చెఁ
జూడామణిని; దానిఁ జూచి గ్రహించెఁ
నాంజనేయుం; డపు డామె యిట్లనియెఁ–
"దండ్రి యర్పించి వందనముల నిట్లు
రామునికడఁ జేరి, 'ప్రభు! నీవు పూర్ణ
కాముఁడవయ్యు సకలదీనజనుల
పై దయనెరపుట భవదీయగుణము;
దాని స్మరించి నాథా! సంకటముల
హరియింపు' మని సీత యనె నను మయ్య!
శక్రసూనునికథ సకలము వలికి
విశిఖప్రతాపము వినిపింప వయ్య!
యొక నెలదినముల నుర్వీధవుండు
రాఁడేని నే నీక బ్రదుక నం చనుము;
పలుకవే నీవె యీ ప్రాణము లెట్లు
భరియింపఁగలదాన, బావనీ! నీవు
సైత మిచ్చట వీడి చనుచుంటి విపుడు;
నా హృదయము చల్లనైయుండె నిన్నుఁ
గని; యిటుమీఁద నా కా దివారాత్ర
ములె మిగిలిన" వని పొగిలెడు నామె
వీక్షించి పావని వేయివిధాల
ధైర్యమ్ము గఱపి పదమ్ముల కెరఁగి
రాక్షసాంగనల గర్భమ్ములు ద్రీల
ప్రళయాభ్ర మట్లు గర్జన మొనరించి
బయలు దేరెను రామపాదసన్నిధికి.

శ్రీరామచరితమానసము

సుందర కాండము

చతుర్థవిశ్రామము

శ్రీమదహోబిలవాసాఁ
శ్రీమద్వేదాద్రినిలయఁ ఋషిజనవరదాఁ
కామక్రోధనివారకఁ
ప్రేమార్ణవఁ మట్టపల్లి శ్రీనరసింహాఁ

హనుమంతుఁ డలగదాదులఁ గూడుట
వానరులు మధువనమున విహరించుట

ఆవలితీరము నం దున్నయట్టి
కీశనాథులఁ గని కిలకిలారావ
మొనరించె; నా కపియోధులు హనుమఁ
గాంచి పునర్జన్మగాంచిన యట్లు
సంతసమందిరి; సామీరి హర్ష
ముఖము దీప్తాకృతిఁ బొడఁగాంచి రామ
కార్య మీతఁడు సేసెఁగాఁ దలపోసి
నలువలఁకులఁ జుట్టి నకనకలాడు
చేపకు నీరము చిక్కఁనకరణి
సంతసమందిరి; సామీరిఁ జేరి
"వివిధవృత్తాంతముల్ వినిపింపు" మనుచు,
నపుడు చెప్పిన వాని నడుగుచు మఱలఁ
గోలాహలమ్మొగఁ గూడి యెల్లరును
బయలుదేరిరి రామపాదసన్నిధికి.
మార్గమధ్యమ్మున మధువన మొక్కఁడు
గలదు; కీశేశు లంగదునిసమ్మతము
గైకొని చొచ్చి యక్కడి తేనెద్రావి
ఫలములు మెసవి, కావలివా రదల్ప
వారలఁ గొట్టిరి; పరువిడి వారు
"యువరాజు వనమెల్ల నూడ్చుచునుండె"
నని విన్నవించిరి హరియూథపతికి.

సుగ్రీవవానరసమాగమము

ఆ వార్త నాలించి యపుడు సుగ్రీవుఁ
"డా కపిజనము కార్యము నిర్వహించి
యరుదెంచె; నట్లు లా యవనిజవార్త
దేకున్న నాగతిఁ దేఁకువ వారు
మధువనమ్మ్రిం జొచ్చి మధుఫలమ్ములను
భక్షింతురే?" యని భావించి, హర్ష
పడుచున్నయంతట వానరగణము
సనుదెంచి శిరములు చరణముల్ సోఁక
మ్రొక్కి నిల్చినఁ, బ్రేమపూర్వకమ్ముగను
"నేమమే ?" యనుచుఁ బ్రశ్నించిన, వారు
"త్వచ్చరణాబ్జసందర్శనమ్మ్మనను
సేమమ్మె మాకెల్ల; శ్రీరాముకరుణ
కార్యము నడచె విఘ్నమ్ములు గడచి;
హనుమంతుఁ డఖిలకార్యము నిర్వహించి
కపులప్రాణమ్ములు గాపాడె" ననిన
సుగ్రీవు డంతటఁ జొక్కి సామీరిఁ
బరిరంభణ మొనర్చి వానరయూథ
మది పరివేష్టించి యరుదేర రామ
సన్నిధి కేఁగెఁ; గీశగణమ్ము లట్లు
కార్యనిర్వహణము గావించి వచ్చు

టూరసి రాముఁడు హర్షించె నెడద.

శ్రీరామహనుమత్ప్రసంగము

స్ఫటికశిలోపరిభాగమ్మునందుఁ
గూర్చున్న రాముఁ గన్గొని చరణముల
వ్రాలిరి; వానరవరులెల్ల; వారిఁ
బైకెత్తి రాముఁడు పరమానురక్తి
కంఠ మాశ్లేషించి కడువడి, "మీకు
నేమమే" యనుచుఁ బ్రశ్నించిన వారు,
"త్వచ్చరణాబ్జసందర్శనమ్మునను
నేమము మా" కని చెప్పిరి; పిదప
జాంబవంతుఁడు రఘుస్వామినిఁ గాంచి,
"నీ కృప యెవనిపై నెక్కొ్కను నాథ!
వానినేమమ్ములు ప్రశ్నింప నేల?
యమరులు నరులు మహర్షులు వాని
పైనఁ బ్రసన్నులు; వాఁడెపో గుణధి,
వినయవంతుండును, విజయియు వాఁడె!
యాతని సుందరయశము ముల్లోక
ములఁ బ్రకాశించుఁ బ్రభునికృపవలన
నెరవేరినది పని; నేఁడు మా పుట్టు
సాఫల్య మొందెను; సామీరిసేత
లేము వేముఖములనేని వర్ణింపఁ
జాల" మంచును గథ సకలముఁ జెప్పె;
నంతఁ గృపానిధి యా రాఘవుండు
మనమున నానందమగ్నుఁడై హనుమ
నుగమున జేర్చుక, "యో తండ్రి! చెప్పు
సీత యెట్లున్నది? జీవించునొక్కొ?"
యనవుడు హనుమంతుఁ డధిపుతో ననియెఁ:
త్వన్నామమే సదా ద్వారంబు గావ,
త్వద్ధ్యాననిష్ఠ కవాటంబుగాఁగ,
నిజపదసంబద్ధనేత్రయా నామె
ప్రాణంబు లే రీతిఁ బాయు? శ్రీరామ!
తిరిగి వచ్చెడి నాకు దేవి యొసంగె
నీ శిరోరత్నంబు నిదె స్వీకరింపుఁ
డని యిచ్చె; రఘునాథుఁ డది యురమ్మునకు
హత్తుకొనియె; మీఁద హనుమానుఁ డనియెఁ–
"గన్నుల బాష్పాంబుకణములు జార
జానకి గొన్నివచనములు నెప్పె:
"ననుజసనాథుఁడై యలరెడు దీన
బంధుని రఘుపతిఁ బ్రణతార్తిహరుని
బాదమ్ములనుబట్టి ప్రార్థింపు; త్రికర
ణమ్ములఁ దచ్చరణానురాగిణిని–
నన్ను నే దోష మున్న దని త్యజించె?
నొప్పుకొనెద నిపు డొక్కఁడు గోష:
మధిపువియోగమునందుఁ బ్రాణములు
నశియింప విది లోచనమ్ములతప్ప–
ప్రాణనిర్గమనమ్ముపట్టున బట్టి
పట్టి బాధించును; బరికింప విరహ
మగ్ని– తూలమ్ము దేహమ్ము– పవనము
శ్వాస– యట్లగుటచే ఋణమున మేను
నశియించుఁ, గాని యీ నయనముల్ ప్రభుని
గాంచెద మని నీరుగార్చుట కతన
దేహ మీ విరహాగ్నిదీప్తిని గోలు
పడ దను'మని చెప్పెఁ బాప మాసీత
యాపదలను జెప్పఁ టది లెస్సకాదు;
ప్రతినిమేషమ్ము కల్పమ్మట్లు లామె
గడుపుచున్నది గానఁ గరుణానిధాన!
వెంటనే యిటనుండి వెడలి శత్రులను
భుజబలమ్మున గెల్చి భూమిజఁ దెమ్ము"–
నావుడు ధరణీతనయదుఃఖములను
విని సుఖాకరములు వికచపద్మాభ
ములు గనులను బాష్పపూరము గ్రమ్మఁ,
"ద్రికరణముల నన్నె ది క్కని తలఁచు
వారికిఁ గలనైన బాధలు గలవె?"

యనెడు శ్రీరామున కనియె సామీరి :
"యాపదయంచు వేఱది గలదొక్కొ?-
నిన్ను భజించుట నిన్నుస్మరించు
నెప్పుడు లే దదియేసుమీ యాతు
ధానులునా నెంత? తప్పక నీవు
శత్రుల నిర్జించి జానకిఁ దెత్తు"
వన భగవానుఁ డిట్లను, "హనుమంత!
నీవంటి యుపకారి నిర్జరమ ర్త్య
ఋషిసమూహమ్ముల నెవ్వఁడు లేఁడు;
ప్రత్యుపకార మేభంగి నొనర్తు?
హృదయమిచ్చియు ఋణమిూఁగుట కల్ల"-
యనుచు సుర్రాత యప్పుడు మాటి
మాటికి నా పవమానపుత్రకుని
గన్నులఁ బ్రేమాశ్రుకణముల్ స్రవింపఁ
గాయము పులకింపఁగాఁ జూచుచుండ,
ననిలకుమారుఁడు హర్ష ముప్పొంగఁ
బ్రేమాకులుండయి, "శ్రీరామచంద్ర!
త్రాహిత్రాహి!" యని పదమ్ముల వ్రాలె.
అంతట శ్రీరాముఁ డాతని మాటి
మాటికిఁ బైకెత్త మదిని దలంచు;
మఱల నాగతిఁ బ్రేమమగ్నుఁడౌ వాని
పైకెత్తు టది కాదు భావ్యమటంచుఁ
దలఁచు నప్రభుని హస్తాబ్జముల్ కీశ
శీర్ష మ్మ్రొపై నుండె; శివుఁ డిదియెల్ల
స్మరణకురాఁ బ్రేమమగ్నుఁడై పోయె-
నామిూఁదఁ గావించి సావధాన మ్మ్ర
దనదు మన మ్మిట్లు దగఁ జెప్పఁ దొడఁగె
నతిసుందరమ్ము రామాయణగాథ:
యటు కొంతసేపుండి యప్పవమానిఁ
గరకంజముల నెత్తి కౌఁగిటఁ జేర్చి
యతినికటమ్మున నపుడు గూర్చుండ
నియమించి "యో పావనీ! చెప్పవయ్య!

రావణరక్షితలంకాపుర మ్మ్ర
నెట్లు చొచ్చితి వది యెట్లు కాల్చితివి?
నా విని యపు డంజనాతనయుండు
స్వామి యెంతయును బ్రసన్నుఁ డం చెఱిఁగి
యభిమానవిరహితుఁడై యిటు లాడె:
"శాఖామృగ మ్మొక్క శాఖపైనుండి
యింకొకశాఖపై కెగురుట యేమి
పురుషార్థ మయ్యె? సముద్రము దాఁటి
కాంచననగరము గాల్చి క్రవ్యాద
గణము విఱిచి యశోకవనమ్ము గూల్చి
చనుదెంచు టిదియెల్ల స్వామి! నీ శక్తి-
దానిలో నా గొప్పతన మేమి గలదు?
నీ కృప యెవనిపై నెనయు నాతనికిఁ
గలదె దుస్సాధము? కడువడిఁ బ్రత్తి
బొడబమేని గాల్పఁగ సమర్థమ్ము;
కావున దేవ! సుఖావహ మ్మయిన
భవదీయపదకంజభక్తి ని" మ్మనిన
హనుమానుసరళవాక్యము లాలకించి,
"యేవమ" స్తనె భవానీ! రఘునాథుఁ;
డెవఁడు రాముస్వభావ మెఱుఁగు నాతనికి
భజనకాదని వేఱుభావము రాదు;
స్వామిసేవకులసుసంవాద మిద్ది
యెవ్వానిహృదయమం దెప్పుడు కలదో-
వాఁడు రాముని పదభక్తిని గాంచు.

శ్రీరాముఁడు వానరసేనతో సముద్రతీరముఁ
జేరుట

ప్రభునిమాటలు విని వానరగణము
"జయజయ సుఖకంద! జయ దయాసాంద్ర!"
యని యార్చి రంత రామావనీశుండు
వానరపతి గని "ప్రస్థానమునకు
నాయత్తమొనరింపు మాలస్య మేల?

కపులకన్నిటికి నాజ్ఞనొసంగు" మన్న
నది విని దేవత లభ్రమునుండి
పుష్పవర్ష మ్మ్నులు బోరన గురిసి
రప్పుడు సుగ్రీవుఁ డఖిలవానరులఁ
బిలిపింప నరుదెంచి వివిధవర్ణముల
నతులితబలముల నలరెడు కీశ
భల్లూకవాహినీపతులు శ్రీరామ
పదముల కెరఁగి దిగ్భాండముల్ వగుల
నార్చుచు నిలిచిన నందరివిూఁదఁ
గరుణానిధానుఁడు కంజలోచనుఁడు
తన దృష్టిఁ బఱపె; నంతట వానరాళి-
పటుసనాథముల్ పర్వతశ్రేణు -
లట్లయ్యె; యెల్లయు నధ్వమునందు
శుభశకునమ్ములు సూచుచుఁ జనిరి;
మంగళమయకీర్తిమహితుప్రస్థాన
సమయాన మంగళశకునముల్ దోచు
టది వింతయే? యట నా లంకయందు
వై దేహికిని బంక్తివదనున కదరె
వామాంగములు, దానఁ బ్రభునిప్రస్థాన
మెఱిఁగినసీతమ్మ యెంతయుఁ బొంగె;
నటు బయల్వెడలిన యా సేన నెవఁడు
వర్ణింపఁజాలు? నపారభల్లూక
కపివరుల్ నడచిరి గర్జించుకొంచు;
నా నఖాయుధము ల ట్లగములు తరులు
దాల్చి యభ్రమున గొందఱు నేలఁ బరులు
సింహములట్లు గర్జించుచుఁ జనిరి;
దిఙ్నాగములు భ్రమొగ్గె దిశలు భేదిల్లె;
నవని ప్రక్కకు ద్రుక్కె; నద్రు లల్లాడె;
నల్లకల్లోలము లయ్యె వారిధులు;
గంధర్వదేవనాగర్షి కిన్నరులు
మా దుఃఖ మింతట మాసిన దనుచు
నంతరంగమ్ముల నానంద మొందఁ,
"బ్రబలప్రతాపుండు ప్రభుఁ డగు కోస
లాధీశునకు జయ" యని గుణగణము
కీర్తించుచును బండ్లుగీటుచు ఘోర
వానరకోటులు బరువులు వెట్ట,
రామచంద్రుని మహాప్రస్థానయాత్ర
పరమరమ్య మ్మని భావించి దాని
నచలపవిత్ర మాఖ్యానము నాది
కమఠపృష్టమ్మునైఁ గడక లిఖించు
నహిపతి యనుగతి నాతఁ డా సైన్య
భార మోపఁగలేక వడవడ వడకి
కమఠపృష్ఠము బండ్లఁ గఱచుకొన్నాఁడు.
కరుణాబ్ధి విడిసె సాగరతటమందు;
వానరర్క్షమ్ములు ఫలములు మెసవె.

శ్రీరామచరితమానసము

సుందర కాండము

పంచమవిశ్రామము

శ్రీ సామగానలోలా!
భూసుర పూజాభిమాన! పుణ్యచరిత్రా!
వాసవ సంసేవిత పద!
దాసావన మట్టపల్లిధామ! నృసింహా!

మందోదరి రావణ సంవాదము

అట లంక దహియించి యనిలాత్మజుండు
చనుటలు దొట్టి రాక్షససమూహమ్ము
వెఱగొంది తమతమగృహములు సేరి,
"రాక్షసకుల మిక రక్షింపఁబడు నె?
యకట దూతబలమ్మె యంతటి దైన
నా స్వామి నగరమం దడుగువెట్టినచో
నెక్కడి సేమ?" మం చేడువఁదొడఁగె;
నా వార్తలెల్ల మయాత్మజ కామె
చెలులు విన్పించినఁ జింతతో నామె
యేకాంతమందు దైత్యేంద్రుని జేరి
హస్తముల్ జోడించి యడుగుల కెరఁగి
నీతివాక్యమ్ము లనేకముల్ సెప్పె:
"నాథ! శ్రీహరితోడనా విరోధమ్ము?
మానుఁ డెడంద నా మాటలు నమ్ముఁ,
డా దూత సేయుకృత్యమ్ములు దలఁపు
నను బార దైత్యాంగనాగర్భపాత
మగు; శుభకాంక్ష మీ కది గలదేని
సచివులఁ బిలిపించి జనకాత్మజాతఁ
బంపివేయుఁడు; భవద్వంశాబ్జసదన
హేమంతశార్వరి యీ రామపత్ని;
యీమెను బంపక యీశ్వరపద్మ
భవులును నిన్నుఁ గాపాడఁగాఁజాల;
రహిగణమ్ములు రామునస్త్రచయమ్ము;
భీకరదైత్యులు భేకసమూహ;
మది గ్రసింపకమున్నె యత్నముల్ సేయుఁ"-
డని యూడ విహసించి య య్యభిమాని,
"భీరువుల్ స్త్రీ లంట విదితము జగతి;
భయమునొందెదవు శుభమ్ములయందు;
వానరవాహిని వచ్చుటే లెస్స
రాక్షసజీవనిర్వహణము గలుగుఁ;
గంపింతు రెవ్వని గాంచి దిజ్నేత -
లతనిభార్యకు భయ మన నవ్వుదోచు"-
నని పరిరంభించి యతిస్నేహ మొప్పఁ
గొలువున కేఁగె; "నా కూరిమిపతికి
విపరీతమయ్యెను విధి" యని చింతఁ
బొగులసాగెను మయపుత్త్రియు;-నచట
విభీషణుఁడు హితబోధజేసి
రావణునిచేఁ బరాభవింపఁబడుట

సభఁజేరినంత రాక్షసవల్లభునకుఁ
బరసేన వార్ధియవ్వలితీరమందు
విడిసిన దనువార్త విచ్చేసె;- "నేమి
చేయుట యిప్పు డుచిత" మని యూతఁ
డడిగె సభ్యులను: వా రల్లన నవ్వి

"మీ కేల చూచుచు మిన్నక యుండుఁ
డీ సురాసుర జేత కీ కోఁతిమూఁక
లీ నరులను గెల్చు టిది యెంత?" యనిరి.
మంత్రియు వైద్యుఁడు మతియు గరుండు
భీతిచే నాశచేఁ బ్రియములు వలుక,
లాజ్యశరీరధర్మములు నశించు;
నా దైత్యవిభునకు నట్టిద కలిగె.
సచివులు ముఖమున సంస్తుతిసేతు;
రవసరమ్ము నెఱింగి యనుజన్మఁ డప్పు
డరుదెంచి యగ్రజు నడుగుల వ్రాలి
యాసనమును గొని యనుమతి గాంచి
యిట్లను, "గరుణాబ్ధి! యీవు న న్నడుగు
నెడ బుద్ధికొలఁది నీ హితము నెఱిపెదను;
సుయశమ్మును సుబుద్ధి శుభగతి శివము
నానాసుఖమ్ము లేనరుఁడు వాంఛించు —
వానికిఁ బరనారిఫలమ్ము– చవితి
నాఁటి చంద్రుఁడు; పదునాల్గులోకముల
కేలిక యగుఁగాక యెవ్వఁడు భూత
విద్రోహి వాఁడు జీవింపఁగా లేఁడు;
చతురుఁడయ్యెడు గుణసాగరుఁడగుత
స్వార్థ మల్పము లేక పలుకఁడు హితము;
మహిని గామక్రోధమదలోభముఖ్య
ములు నరకద్వారములు; వీని వీడి
సాధులు గొలుచు కోసలనాథుఁ గొలువు
మన్న! రాముండు ధరాధిపుఁడొక్కొ?
కాలకాలుండు లోకాధినాథుండు
భగవంతుఁ డజుఁడు వ్యాపకుఁడు నజేయుఁ
డాద్యంతరహితుఁ డనామయుఁడైన
యా పరబ్రహ్మమె; యా కరుణాబ్ధి
సురభూమిసురభూమిసురభిహితమ్ము
నెంచి మానుష దేహ మిట్లు ధరించె;
జనరంజకుండు, దుర్జనభంజకుండు,
వేదముల్ ధర్మముల్ వెలయించువాఁడు,
రఘుకుల తిలకుఁడు ప్రణతార్తిహరుఁడు!–
తలయొగ్గి వైరముదలఁగి వై దేహి
నిచ్చి యాపై భజియింపు నిశ్చేతు
కన్నేహి నతని. జగద్ద్రోహినేని
శరణన్న విడువఁడు; స్వామినామమ్ము
తాపత్రికమ్మును దహియించు; నట్టి
ప్రభుఁడె మానవుఁడయి ప్రభవించె ననుచు
హృదయమ్మునందున నెఱిఁగికో వయ్య!
దశకంఠ! నీదుపాదము లంటి వినుతు:
మానమోహాదులు మాని యెడందఁ,
గోసలాధీశుని గొలుచుట తగవు;
ఛాత్రునిచేఁ బుల స్త్యమహర్షి చెప్పి
పంపిన మాటలు ప్రభువులయొద్ద
వెంటనే నే విన్నవించితి" ననిన–
మాల్యవంతుం డను మంత్రి సజ్జనుఁడు
సంతసమంది "రాక్షసనాథ! నీతి
భూషణుం డనుజుఁడు బోధించు నీతి
హృదయమందున ధరియింపుఁ" డనంగ
నురిమి రావణుఁడు, "రిపూత్కర్ష వలుకు
మూర్ఖులు వీరిని మున్నిటనుండి
తొలగింపుఁ" డన విని తొలుదొల్తఁ దానె
తొలఁగె న మ్మాల్యవంతుఁడు; విభీషణుఁడు
నేతులు జోడించి చెప్పఁదొడంగె
"నెల్లరిమనముల నెసఁగు దుర్బుద్ధి
సద్బుద్ధి;– యెచ్చట సద్బుద్ధి కలదు,
వివిధసంపద లట వెలయు; దుర్బుద్ధి
గలచోట, నాపదల్ గల వని సతము
వేదపురాణముల్ వేరొక్కొనుచుండు;
నెడఁద దుర్బుద్ధి నీ కెసగుట హితము
గాన్పించు నహితమ్ముగా, హితు లహితు
లట్లు; లంకొకసహారకాళరాత్రి

మైథిలిపై నీకు మక్కువ యెక్కు;
వన్న! కాళులువట్టి యర్థింతు నొకఁడు:
నా హఠమ్మునకునై ననుఁ సీత నొసఁగు"-
మనుచుఁ బురాణశాస్త్రాగమసమ్మ
తమ్ముగఁ బల్కున, దైత్యనాథుండు
క్రోధాంధుఁడగుచు "మూర్ఖుఁడ! చేరువయ్యె
మృత్యువు; నా కూడు మెసవిననీకు
శాత్రవపటుమే చక్కని దయ్యె;
భుజబలమ్మున నేను బొడువనివాఁడు
వెడఁగ! యెవ్వండు? నా వీటవసించి
తపసుల! బొగడెదు, తరలు మిచ్చోటు;
వా రున్నకడ కేగి వారికి నీతి
గఱపుము పో" మ్మని కాల దన్నినను
వీడఁడు వాని విభీషణుఁ! డవని
కాత్యాయనీ! యపకార మొనర్చు
జనులకునైన సజ్జను లుపకార
మొనరించెదరుగాదె- యోడక వాఁడు
"తండ్రిసముండవు; దన్నట మేలు
సేసినాఁడవు; కాని శ్రీరామచంద్రు
సేవింపకుండిన శ్రేయము గలుగ;"
దని పల్కి తనమంత్రు లనుసరింపంగ
నభ్రపథమ్మున కరిగి యెల్లఱును
వినఁగ, "నీ సభ కాలప్రేరిత మ్మిపుడు;
సత్యసంకల్పుఁడు సార్వభౌముండు
శ్రీరామచంద్రుండు సీతావిభుండు.
శరణుబొందెద రామచరణసన్నిధిని.
నాథ! యిందున లేదు నా దోష" మనుచుఁ
గదలిపోయెను; దైత్యగణములయాయు
వది తగ్గె; సాధుల కవమతిసేయ
పార్వతీ! సకలశుభమ్ములు దొలఁగు;
ననుజుని వీడినదాది రావణుఁడు
పాపము తనవైభవము గోలుపోయె.

విభీషణుఁడు శ్రీరాముఁ శరణుజొచ్చుట

అట విభీషణుఁడు నిజాంతరంగమున
సందడింపంగ వాంఛలు, "నేను వెడలి-
మృదులారుణమ్ములు, ఋషిసతీతార
కమ్ము, లనుచరసుఖదములు, దండ
కాటవీపావనకరణచణములు,
వై దేహీయురమున వరలెడునవియుఁ
గపటమృగము వెంటఁ గదలినట్టివియు
శివమనోజ్ఞాకర శ్రీఁ బెంచునవియు
నగు పాదకమలము లాశ్రయించెదను;
భరతుఁడు గొనిపోయెఁ బాదుక లొండె,
చరణముల్ నేఁడులోచనములఁ దెత్తు"-
నని తలపోయుచు నంభోధి దాఁటి
వచ్చిన నాతని వానరుల్ గాంచి
దైత్యులదూత యీతం డని యెంచి
యచ్చోటనే నిల్పి యీవార్త కీశ
పతికిఁ జెప్పిన రామభద్రుని జేరి,
"రామచంద్రా! విను రావణానుజుఁడు
నచ్చి మిమ్మిం జూడవలె ననుచుండె"
ననిన "సుగ్రీవ! నీ యభిమత మేమి?"
యని రాముఁ డడుగ న య్యర్కసుతుండు
"రాఘవ! యెఱుఁగము రాక్షసమాయ;
కామరూపుఁడు వచ్చు కారణ మేమొ-
గుట్టెఱుంగఁగ వచ్చుకొలఁది తోచెడిని;
గట్టివై చుట మేలుగాఁ దలఁచెదను".
నావుడు రాముఁడు నవ్వి "సుగ్రీవ!
నీతిమార్గమ్మును నీవు బల్కితివి;
శరణాగతత్రాణచణుడ నే" ననిన
హనుమానుఁ డది విని యానంద మొందె.
"శరణుజొచ్చినవాని శత్రువం చెంచి
వదలిపెట్టునతండు పాపి పామరుఁడు;
వానిని జూడఁ బాపము సంభవించు:

కోటిబ్రాహ్మణులను గూల్చి నా శరణు
పొందినఁ ద్యజియింపఁబో నిది నిజము;
జీవమాత్రము నన్ను జేరినంతటనె
కోటిజన్మాఘముల్ గూలిపోఁగలవు!
పాపులసహజస్వభావమువలన
వారెఱుంగరు నాదు భజనమునేని;
నాతఁడు దుష్టాత్ముఁడైన రాఁగలఁడె
నే నున్నచోటికి? నిర్మలహృదయుఁ
డొక్కఁడే ననుఁ బొంద నోపు నిజ్జగతిఁ;
గపటమ్మువలన లొంగను; మర్మ మెఱుఁగ
నెంచి రానీ మన కేమిభయమ్ము?
చాలు భూమిఁ గల నిశాటులనెల్ల
సంహరింపంగ లక్ష్మణుఁడొక్కరుండె;
యటుగాక వాఁడు భీతాత్ముఁడై వచ్చు
చోఁ బ్రాణములసాటి జూచెద వాని"
నని నవ్వి, "యీరెంటియం దేదియైనఁ
దోడితె" మ్మనఁ నంగదునిఁ బావమాని
గైకొని తనవెంటఁ గపిపతి "రామ
చంద్రుని కయ్యెడు జయ" మని పలికి
కదలి యాదరపూర్వకమ్ముగ నతని
నట గొనిరా, రావణావరజుండు
దవ్వున నుండి సోదరులను నయన
శివకరులను దయాసింధులఁ జూచి,
తెఱచినకన్నులు దెఱచిన ట్లుండ
యనిమిషత్వమునొంది యాశ్చర్యమందె;
నాజానుబాహుఁ గంజారుణ నయను
శ్యామసుందరగాత్రు శరణార్తిహరుని
శ్రీనిధానుని మహాసింహసంహనను
విపులమహీరస్కుఁ బెక్కుమన్మథుల
మోహింపఁజేసిన మోహనమూర్తిఁ
గాంచి ప్రేమాశ్రులు గన్నులఁ జాఱె;
గరుపొడిచిన దొడల్; గడ కతిధృతిని
మృదుగతి "నాథ! దైత్యేంద్రుతమ్ముఁడను;
సురరక్షకా! నేను సురవైరివంశ
జాతుండఁ గడు తామసశరీర మిద్ది;
తమము గోరును దివాంధ మ్మెట్లు లట్లు
పాపముకోరు స్వభావమునాది;
భవభయహారి యీ ప్రభుఁ డని కీర్తి
చెవులార వినుట వచ్చితి ననుఁ జూడఁ;
ద్రాహి యో శరణాగతత్రాణ! త్రాహి
ప్రభువర్య!" యని దండవత్ప్రణామమ్ము
సేయుట గాంచి హర్షించి విభుండు
వెంటనే లేచి విభీషణు దీన
వాక్యముల్ విన్న సంభ్రమమున, దీర్ఘ
భుజములచే నురమ్మునకు హత్తుకొనె;
యనుజుని పాటిగా నతనిఁ గూర్చుండఁ
గా నియమించె భక్తవ్రజాభయదుఁ
డిట్లు వచించె నెంతే బ్రీతి గదుర;
"నీకును లంకేశ! నీ వారలకును
సేమమే? నీవు వసించెడు చోటు
మంచిదిగాదు; దుర్మార్గులనడుమ
నీ వహోరాత్రముల్ నివసింతు; వచట
ధర్మముల్ నడచునే? ధర నీ సమస్త
వర్తనమ్ము లెఱుంగువాఁడ నేఁ దండ్రి!
నీతిచణుండవు; నీ కవనీతి
సహాయింపరానిది సతతంబు సచివ!
హా! దుష్టజనసఖ్య మది యిచ్చుకంటె
నరక మిచ్చిన బ్రహ్మ నాయన! లెస్స".
అను రామచంద్రున కనె విభీషణుఁడు:
"త్వచ్చరణాబ్జసందర్శనమ్మునను
రామచంద్రా! కుశలము నాకు; దండ్రి!
సేవకుఁ డని ననుఁ స్వీకరించితివి;
యీ శోకధామకార్యములు త్యజించి
నిను గొల్చుదాఁక శాంతియుఁ గుశలమ్ము

గలదొకో జీవికిఁ గలయందునేని?
మానమత్సరలోభమదమోహముఖ్య
సర్వదుర్గుణములు చాపనిషంగ
హస్తుఁడై తనహృదయమున రాముండు
నెలకొనుమీఁదట నిల్చునే యందుఁ?
బుడమి రాగద్వేషములు దివాంధములు
మమత కుహూనిశి మానసవీథిఁ
బ్రభునిపరాక్రమభానూదయమ్ము
గలుగక తొలఁగవు కరుణాలవాల!
త్వచ్చరణాబ్జసందర్శనకార
ణమున నేఁ గుశలుఁడ; నా మహాభయము
లన్నియుఁ దీరె; మహాకృపానిలయ!
అల యనుకూలుఁడ వైనచో నీవు
భవశూలములు మూఁడు వ్యాపింపకుండు;
నధమరాక్షసుఁడ శుభాచరణమ్ము
లే; దిట్టి నన్ను హర్షించి సన్మనుల
ధ్యానమ్ములకుఁగూడ నందని స్వామి
యురమున గదియించు టొక గొప్పగాదె?
హే కృపాసుఖపుంజ! యెంతటిభాగ్య
మాహా! శివబ్రహ్మలంతటివారు
పట్టినఁ ద్వత్పదద్వంద్వము గనులఁ
గనఁ గంటి" నావుడుఁ గడుసంతసమున
శ్రీరామభద్రుఁడు నెపై ని ట్లనుచుఁ:

శ్రీరాముఁడు విభీషణు నంగీకరించుట

"కాలారి పార్వతి కాకభుశుండి
ప్రముఖులు నాదు తత్త్వ మ్మెఱుంగుదురు;
శరణువచ్చిన చరాచరజగద్ద్రోహి,
హరియింతు భయము; మోహమదచలములు
సకలము త్యజియింప సాధుసమానుఁ
జేతుఁ; దల్లియుఁ దండ్రి స్త్రీసుతబంధు
తనుధనభవనమిత్రానుచరాది
మమతల్ త్యజించి యస్మచ్చరణముల
కడవోయు సమదర్శి కాంక్షారహితుఁడు
ద్వంద్వాద్యతీతుఁడు ధరణి మన్మనము
నందు వసించు నెట్లన లోభియెడఁద
విత్తము వసియించు విధమున; నాకు
మిగుల నీవంటి సన్మిత్రులే ప్రియులు;
మీ కృతజ్ఞత దెల్ప మేదిని దేహ
ధారినై జనియింతు దైత్యకులేంద్ర!-
పరహితనిరతులు బ్రాహ్మణహితులు
నుర్వీని సగుణతత్పోపాసకులును
నియమశీలురు ప్రాణనిభులు నా కెపుడు;
నివియెల్ల నీలోన నెసఁగెడు కతన
నాకుఁ బ్రియుండవు"- నా రామచంద్రు
వచనమ్ములను విని వానరగణము
"జయ దయాజలనిధే! జయ రామచంద్ర!"
యని యార్చి రంతట న విభీషణుఁడు
హృదయము ప్రేమచే నింపి తొలక్కాడ
రఘుపతిదివ్యచరణములు వట్టి
"స్వామి! చరాచర జగదధినాథ!
శరణాగతత్రాణ! సర్వాంతరంగ
నిలయ! పూర్వమ్ము నా హృదయ మందున్న
వాసనలెల్ల భవత్పద భక్తి
కూలంకష గొట్టుకొనిపోయె నయ్య!
కరుణాబ్ధి! శివునకుఁ గడుఁ గూర్చునట్టి
పావనత్వత్పదభక్తిని" మ్మ నిన
"నేవమ" స్తని కోసలేంద్రుఁడు వార్ధి
జలము దెప్పించి "యో సఖుఁడ! యెడందఁ
గోరిక నీకు లేకుండునుగాక-
గా దెన్నటికి నమోఘము దర్శన" మని
యాతని కపుడె రాజ్యాభిషేకమ్ము
గావించె; నంత యాకసమునను
సుమవృష్టి గురిసిరి సుమనోగణమ్ము;

ఆగతి నిజవచనాని లేరితము–
రావణక్రోధానలము బారి నుండి
రావణావరజు సంరక్షణసేసి
రామభద్రుఁ డఖండరాజ్యము నొసఁగెఁ;
బగితల లొసఁగుటవలన రావణున
కే సంపదల శివుఁ డిచ్చె నవెల్ల

నతియుదారత రాముఁ డా నిశాచరుని
తమ్ముని కవ్వేళ దత్తమొనర్చె;
నిట్టి కృపాళు భజింపని జనులు
గొమ్ములు తోఁక లేకుండు జంతువులు;
సేవకుఁ డని వాని స్వీకరింపంగ
న వ్వనేచరగణ మ్మానంద మొందె.

శ్రీరామచరితమానసము

సుందర కాండము

షష్ఠవిశ్రామము

బృందావనసంచారీ!
బృందారకరిపు విదారి! విష్ణు! మురారీ!
బృందానందా! జయ గో
విందహరీ;మట్టపల్లివిభునరసింహా!

సముద్రతరణ సమాలోచనము
దర్భశయనము

సర్వస్వరూపుఁడు సర్వాంతరంగ
నిలయుఁడు సురపతి నీతిపాలకుఁడు
కారణమర్త్యవిగ్రహుఁడు సర్వజ్ఞుఁ
డసురాంతకుం డిట్లు లనియె "సుగ్రీవ!
లంకేశ! వీరులారా! వినుఁ డిదియె:
యీ యగాధ సముద్ర మెటు దాఁటవచ్చు?
సంకులోరగఝషసంభరితమ్ము
నుత్తరించుట యిపు డొక్కసమస్య."
యన "రఘునాథ! నీ యస్త్ర మొకండె
సింధుకోటులను శోషింపఁగాఁ జేయు;
నైనను మున్నబ్ధి నర్థించు టుచిత:
మంబుధి మీ వంశమందునఁ బూర్వుఁ;
డేదో యుపాయమ్ము నెఱిగింపఁగలఁడు;
ఋక్షముల్ కపులు పరిశ్రమలేక
యవ్వలితీరము నందుకొందు" రని
యూడె విభీషణుఁ డది విని రామ
చంద్రుఁడు "మిత్రమా! చక్కని మాట
నెప్పితి వట్టులే చేయుద మిందు
భగవానుఁడును దోడుపడఁగలఁ" డనియె-
నీ యుపాయము రుచియింపక యిట్లు
లనియె సౌమిత్రి "యో యన్న! దైవమ్ము
నమ్మకమ్మేమి? బాణాసన మ్మెత్తి
యీ యకూపారమ్ము నింకించు టొప్పు;
దైవము పంద కాధారమ్ము జగతి
నలసులు దైవ మం చాడుదు రెప్పు-"
డన నవ్విరాఘవుఁ "డట్ల చేయుదము
ధైర్యమ్ము నెడఁదను ధరియింపు" మనుచుఁ
బలికి సాగరసమీపమ్మున కేగి
శిరము వాలిచి నమస్కృతిసేసి యచటఁ
బఱచి దర్భలు, వానిపయి గూరుచుండె.

రావణుని దూతలగు శుకాదులను మన్నించి
లక్ష్మణుఁడు రావణునకు సందేశమంపుట
శుకశాపవిమోచనము

ఆ విభీషణుఁ డట్లు లరుదేర వాని
వెంట దూతలను బంపించె రావణుఁడు;
వానరాకారముల్ వారు వహించి
ప్రభుని యీ లీలలు పరికించిరెల్ల;
బ్రభునిగుణములు శరణ్యులమీఁది
స్నేహము గాంచి హర్షించి యెడందఁ,
గపటాకృతులు వీడి కడుప్రేమ రామ
చంద్రుని హరిని బ్రశంసింపఁదొడఁగి;-
రదియెల్ల వానరు లారసి వీరు

వైరిదూత లటంచు భావించి వారిఁ
గట్టి సుగ్రీవునికడకుఁ గొంపోయి;
రతఁడు "వానరులార! యాలింపుఁ డంగ
వికలులఁజేసి యీ వెడఁగురక్కసులఁ
బారద్రోలుఁ" డనంగ వానరుల్ వారి,
సేన యీ నాలుగుచెరగులు ద్రిప్పి
యీరక కొట్టుచునున్నంత వార
లత్యంతదీనాత్ములై "ముక్కు సెవులు
గోసినయట్లైనఁ గోసలనేత
పై నాన" యన వారివాక్కు లాలించి
సౌమిత్రి, పిలిపించి సన్నిధానమున,
కారసి వారిదైన్యము, జాలిబొంది
నవ్వి, రాక్షసులబంధములు విప్పించి,
"రావణుచేతఁ బత్ర మ్మిది యుంచి
కులఘాతకుఁ బరించుకొను మని చెప్పుఁ;
డటుమీఁద 'జానకి నర్పించి వారి
యాశ్రయమును బొందు; మట్లు కాకున్న
మృత్యువు నిన్ను సమీపించె' ననుచుఁ
గరుణాళుఁ డగుచు లక్ష్మణుఁడు సందేశ
మంపినాఁ డని చెప్పుఁ డరుగుఁడీ" యనిన,
నతనికి మ్రొక్కి యత్యంతహర్షమున
శ్రీరామగాథ కీర్తించుచు జనిరి.
అట వారిఁగాంచి దశాస్యుఁడు నవ్వి
"కుశలము లనవు శుకుండ! యేమిటికి?
మృత్యుసన్నిహితు విభీషణువార్త
లరసితివే? పాప మాతడు లంక
యందుఁ బాలించురాజ్యము వీడిపోయె
నాకాశమున వైచినట్టి పుర్వయ్యె;
వానరభల్లూకవాహిని యెట్టి?
దది కాలప్రేరితమై యరుదెంచెఁ;
బాపము మృదులస్వభావుఁడు కంధి
యేకైకరక్షకుఁ డిపుడు వారలకు;
నను గని తమదుమానసముల జడియు
నా తాపసులకథలైన వచింపు;
వారలఁ గలసితె? వారు నా కీర్తి
విని యట్ల పోయిరా యెనుకకు శత్రు
సేనల బలమెంతో చెప్ప వేమిటికి?
గడుచకితుండవు కతమేమి" యనిన
వాఁడును "నాథ! కృపాత్ముఁడ వగుచు
నడిగితి వట్లై క్రోధాత్ముఁడుగాక
వినుము నామాట; విభీషణుఁ డిచట
నాసిపోవంగనే పట్టము గట్టి
రాముఁ డాతనికిని; రావణుదూత
లని మమ్ము వానరు లదిమి బాధించి;
రటు ముక్కు సెవులు గోయఁగ నుద్యమింప
రాముని పై నొట్టు రక్షించె మమ్ము;
నడిగెదు రామసైన్య మెట్టి దనుచు:
శతకోటిముఖముల సన్నుతింపంగఁ
జాలము; వానరర్క్షములు నైక
వర్ణవర్ణితములు బలసంయుతమ్ము
లాభీలవదనము లత్యంతఘనము;
లందు లంక దహించి యక్షయుఁ జంపి
వెడలిన యాతఁడే వెడఁగుబాలకుఁడు;
పెక్కునామమ్ములవీరు లున్నారు;
మేరునిభాంగు లమితనాగబలులు
గదగధిముఖనలాంగదజాంబవంత
నిశఠకేసరిశఠనీలమయంద
ద్వివిధముఖ్యులు మహావీరులు గలరు;
బలమున సుగ్రీవుపాటి వచ్చెదరు;
కలరు కోట్లకు నెట్టి ఘనులందు వారి
నెంతని మాకు లెక్కింపంగ వచ్చు?
రాముని కరుణ కారణముగ వార
లతిబలాఢ్యులు; తృణమట్లు చూచెదరు
ముల్లోకముల; దశముఖ! వింటి మేము-

వానరవాహినీపతులె యున్నారు
బదునెనిమిదిమహాపద్మసంఖ్యాకు;
లందున మిము దురమం దోర్వలేని
వాఁ డొక్కరుఁడు లేఁడు; వారు కోపముఁన
"రామచంద్రునియాజ్ఞ రాఁబే" దటంచు
నులుముచుఁ జేతులందున్నవా రురక;
"సోరగమత్స్యమహోదధి నెల్ల
నాపోశనముసేతు మటు గాకయున్న
నుత్తుంగశైలము లొగిఁ దెచ్చి దానిఁ
బూడ్చివైతుము; దశముఖుఁ బిడిసేసి
దుమ్మునఁ గలిపివైతుము మే" మటంచు
సహజనిర్భయత దిసంతు లాడెదరు;
లంక నిప్పుడె మ్రింగులాగున వారు
గర్జించుచున్నారు; కపులు ఋక్షములు
సహజవీరులు; రామచంద్రుని కృపయు
శిరముపైఁ గల దిఁకఁ జెప్పెడిదేమి?
కాలకోటులనైనఁ గదనరంగమున
నిర్జింపఁజాలిన నిర్ణిద్రబలులు;
శేషసహస్రము శ్రీరామచంద్రు
తేజ మాధిక్యమ్ము ధీయు బలమ్ము
పాడఁగలే; రొక బాణమ్మె వేయి
యబ్ధి లింకించు; నట్లయ్యును నీతి
చతురుండు దా విభీషణుమార్గ మడిగెఁ
దద్వచనానువర్తనుఁడయి కరుణ
హృదయమ్మునందున నెసఁగ, నబ్ధిఁ
బ్రార్థించుచుండె నధ్వమ్ము ని" మ్మనుచు;
నను దూతవాక్యము లపు డాలకించి
"యంతటి మతిమంతుఁ డగుచుఁ గావలయుఁ
గపుల సహాయకుల్ గాఁ దెచ్చికొనియె;
సహజభీరుని విభీషణువచనములఁ
బాటిగాఁ గైకొని వారిధి యొద్ద
గోము సేసెడిని; మూర్ఖుండు పైపైని
వట్టిడాంబికములు పచరించువాఁడు.
చాలు నింతటితోన, శత్రుబలమ్ము
ధీవిశేషమ్ములు దెలిసిపోయినవి;
సహజభీరుఁడు విభీషణుఁడు మంత్రి యఁట!
యెక్కడి విజయ మిం కేమి విభూతి!"
యను కష్టదెత్యవాక్యములకుఁ గినిసి
యిదె సమఁము మ్మని యెంచి యా పత్రి
కను దీసి "దీని లక్ష్మణుఁ డిచ్చెఁ జదివి
హృదయమ్ము చల్లగఁ జేసికొం" డనిన
నవ్వి వామకరమ్మునం గొని దాని,
సచివుని బిలిపించి చదివింపఁ దొడఁగె:
"వెట్టిమాటలచేత వెడఁగ! మానసము
నుబ్బించుకొని కుల మూరక చెఱుప
వలదు; రామునితోడ వైర మెనర్చి
శరణుబొందియు మహేశాజమాధవుల
రక్షింపఁబడలేవు; రావణ! సుంత
యభిమానమును వీడి యనుజునిభంగిఁ
బ్రభుపదపంకజభ్రమరమ వగుము;
కానిచో శ్రీరామకార్ముకవహ్ని
శలభమయ్యెద వనుచరసహితముఁగ."
నని పత్రిక పఠించినంత రావణుఁడు
భయ మెదఁగాంచియుఁ బైకి హసించి
యందరు వినఁగ "న న్నన్న యీ చిన్న
తపసిమాటలు విన, ధర నిలుచుండి
యీకాశ మంటెడు యత్నము దోచు."
అన శుకుఁ డనె "నాథ! యభిమానప్రకృతి
త్యజియింపు; మెల్లసత్యములుగఁ దలఁపు;
వీడుము కోపము; వినుమునామాట;
రామునితోడ శాత్రవ మది వలదు.
సకలలోకముల కీశ్వరుఁడయ్యు మృదుల
హృదయుఁడు, నీ వట కేఁగినఁ జాలు,
మఱచి నీ తప్పులు మన్నింపఁగలఁడు,

విభునకు సీత నిప్పింపుఁ'' డనంగ
సీత ని మ్మను మాట చెప్పుట తడవు
ఖలరావణుఁడు వాని గాలను దన్నె;
వాడును దలవంచి పాదముల్ వట్టి
కరుణాబ్ధిరఘుపతికడ కేఁగి ప్రణతి
గావించి తన యెల్లగాథ విన్పించి
నిజగతి గొనె భవానీ! మహోజ్ఞాని
యగు ముని యొక్కఁ డా ఘటజర్షి
శాపమ్మువలన రాక్షసుఁడుగఁ బుట్టి
శుకుఁ డన బరగె; శ్రీశునికృపచేత
శాపము విడి రాము చరణాల కెరగి
చనియె నంతట నిజాశ్రమ దేశమునకు.

శ్రీరాముని ఆగ్రహము సముద్రుని శరణాగతి

మూఁడుదినమ్ము లమ్మొగిఁ గూరుచున్నఁ
దర్భాసనంబున దశరథసుతుఁడు
ప్రార్థన నాలకింపక యుండె వార్ధి;
యపుడు కోపించి రామావనీనేత
''ప్రీతి జనింపదు భీతిలేకున్నఁ;
జయ్యన లక్ష్మణా! శరశరాసనము
లిటు తెమ్ము బాణాగ్ని నింకింతు జలధి;
వెడఁగుఁ బ్రార్థించుట, వెస కుటిలాత్ము
నెడఁ బ్రీతి,లోభికి నెంతయు నీతి,
వైరాగ్యగాథలు వడిఁ జెప్పుటయును,
మమతారతున కిల మహితసుజ్ఞాన
కథలు సెప్పుట, క్రోధికడ శాంతివాక్య
ములను బల్కుటయుఁ, గాముకునకు దైవ
గాథలు విన్పింపఁగడఁగుట యొక్క.
విధ మూషకమ్మున బీజము వైచు
విధ'' మని శర మెక్కు పెట్టెఁ; లక్ష్మణుని
మనమున కిద్ది సమ్మతమయి తోఁచెఁ;
ప్రభువు భయానక బాణము వింట
సంధించి విడిచిన సాగరగర్భ
మందు నగ్నిజ్వాల లావిర్భవించె;
ఝషమకరోరగసమితి కంపించెఁ;
ప్రాణులు దహియింపఁబడు టది యెఱిఁగి,
యభిమానమును వీడి యంబుధి వివిధ
మణిగణమ్ములను శుంభత్స్వర్ణపాత్ర
మందునఁ గొని బ్రాహ్మణాకృతి వచ్చె;
పక్షీంద్ర! యుక్తులు బన్నుము కోటి
ఫలియించునొక్కొ రంభాతరు వెందు?
మంచిమాటలను దుర్మార్గులు వినరు;
తర్జింపకుండినఁ దగ్గ రెన్నఁడును;
సాగరుండును భయసాగరుండగుచుఁ
బాదముల్ గ్రహియించి ''ప్రభువ! క్షమింపు
కొనకుమీ నా యవగుణముల నెడఁద;
నాకాశవాయ్వనిలాప్పృథ్వ్వ లివ్వి
స్వాభావికమ్ముగ జడములు నీవు;
బ్రేరేపఁగా మాయ వీనిని సృష్టి
కార్యార్థమై యట్లు కలిగించె ననుచు
నఖిలసద్గ్రంథము లాడుచునుండుఁ;
బ్రభువులయాజ్ఞానువర్తన మొక్కఁ
జీవు లన్నింటికిఁ జేకూర్చు సుఖము;
నీ యాజ్ఞ తిరుగరానిది యని శ్రుతులు
కీర్తించు స్వామి! నీ కేది యిష్టమ్ము
గావింతు నది'' యని కడువినమ్రుఁడయి
విన్నవించినఁ గృపావీచి రాఘవ్రుఁడు
దరహాసమున ''సమస్తము కీశసేన
దాఁటి ని న్నానలితటమున కేఁగు
యుక్తి సెప్పు'' మనంగ నుదధి యి ట్లనియె:
''నాథ! మీ సేనలో నలుఁడు నీలుండు
ననెడు సోదరు లిర్వు రతిబలుల్ గలరు;
బాల్యమందున నిరాబారియొక్కఁ డని
యాశిషమ్ముల గొని యలరెడు వారు

వార లొకించుక స్పర్శించు నెడల
నెం తెంత శ్రమలు లేని త్వదీయ
కరుణచేతను దేలఁగలవు వారాశి;
నేనుసైతము ప్రభూ! నీ ప్రాభవమ్ము
నస్తుంకరించితి నంతరంగమున;
సాయము శక్త్యనుసార మొనర్తు;
మూఁడులోకమ్ముల మొనలెత్త యశము
వారధి గట్టుఁడు వారిధిమీఁద
నా యుత్తరతటమ్మునందు వర్తించు
పాపరాశుల మున్న వట్టి దుర్జనులఁ
బీచమ్మడంచి నా ప్రీతిసేయఁగదె!
బాణమ్ముచే" నన వార్ధిదుఃఖమ్ము
గ్రహియించి ఘోరసంగ్రామధీరుండు
కరుణాబ్ధి యట్టులఁ గావించె; రామ
చంద్రునిబలపౌరుషమ్ములు గాంచి
హరించి సాగరుఁ డా కపిజనుల
కథయెల్లఁ జెప్పి యక్కఁజాటుచరణ
కంజమ్ములకు ప్రమొక్కి కడువడి నరిగె;-

శ్రీరామసంకీర్తనప్రభావము

ఇది రామచంద్రుని కెంతయు లెస్స
గాఁదోచె;- నిక్కథ కలియుగాఘౌఘ
విధ్వంసకము దీని విశదయశుండు
తులసిదాసుఁడు బుద్ధిఁ దోచినభంగి
కీర్తించుకొన్నాఁడు; కీర్తిచంద్రుఁ డగు
రామచంద్రునిగుణరాశి సుఖాబ్ధి
శమితసంశయము విషాదనాశకము;
వెడగుమానసమ! యీ విశ్వమ్మునిమీఁది

ఆశను ద్యజియించి యనవరతమ్ము
వానిని గీర్తింపు వానిని వినుము!-
సకలసన్మంగళసంధాయకంబు
సాకేతనాథుని సంకీర్తనంబు!
ఆదరంబున దాని నాలించువారు
భయతరాగాధమౌ భవసాగరమును
తరణిలేకుండనే తరియింపఁగలరు!

శ్లో. మంగళం నారసింహాయ
మహనీయగుణాత్మనే
మట్టపల్లినివాసాయ
మద్ధృదీశాయ మంగళమ్.

ఓమ్! ఓమ్!! ఓమ్!!!

ఇది గుణసాగరుఁ డీశపదాబ్జ
పుష్పంధయుండును బూజ్యపాదుండు
పరమవదాన్యుండు పాపభీరుండు
విమలయశోనిధి విశ్వకల్యాణ
కాంక్షి మహోత్మఁ డంకంపల్లివాసి
పాటీలు వంశాబ్ధిపార్వణవిధుఁడు
నైన గోవిందార్యనాత్మజాతుండు
సజ్జననమ్రుండు స్వామిభక్తుండు
విశ్వనాథమహాకవీంద్రశిష్యుండు
నగు కిశోరునిచేత నాంధ్రీకృతమ్ము
సరళము శ్రీరామచరితమానసము
నందు సుందరకాండ మది సమాప్తమ్ము.

ఓం తత్సత్

025

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరామచరితమానసము

లంకా కాండము

షష్ఠ సోపానము

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరావుచరితమానసము

లంకా కాండము

షష్ఠ పోపానము

ప్రథమవిశ్రామము

శ్రీశ్యామాహృదయేశ్వర ! పశ్యత్ఫాలాజతనయప్రముఖామరస
ద్వశ్యాంతరంగనిలయ ! అ
వశ్యమ్మవధారు మట్టపల్లినృసింహా !

శ్రీరామచంద్రుని సీతాసనాథుని
కామారిసేవ్యుని జ్ఞానగమ్యు
నుర్వీశరూపుని యోగీంద్రవంద్యుని
నిర్గుణు నజితుని నిర్వికారు
ఖలవధనిరతుని కందావదాతుని
దేవేంద్రవందితు దేవదేవు
మాయాద్యతీతుని మాయామనుష్యుని
గోబ్రహ్మరక్షకు గుణనిధాను
కాలమత్తేభసింహుని కమలనయను
సకలభవభయహరణుని సార్వభౌము
శ్రీపదమ్ము లాస్మాకీనహృదయపీఠి
దగ బ్రతిష్ఠించి కొలుతు సద్భక్తి సతము.

ఇందుశంఖాభాతిసుందరతరదేహు
వైయాఘ్రచర్మసువస్త్రధారి
భీకరకాలదర్వీకరాలంకారు
జాహ్నవీబాలశశాంకప్రియుని
నఖిలకల్యాణప్రదామరానోకహు
*నానందదివ్యవనాధినాథు
నద్రిరాట్కన్యాహృదంబుజకమలాప్తు
సకలకల్యాఘప్రశమనచతురు
నఖిలసుగుణాలవాలుని నాదిభిక్షు
నస్థిమాలికాధారి భస్మాంగరాగు
గ్రూరధానంజయాలికాక్షుని గపర్ది
గామగర్వాపహారి శంకరుని దలతు.

అమితదుర్లభ మగునట్టి కైవల్యమ్ము
సజ్జనావళికి నొసంగువాడు
ధరణి ఖలులఁ బట్టి దండించునాతండు
శివుడు సతము నాకు శివము లిడుత !

శ్రీవైదేహిమనోఽధినాయక! కృపా
సింధూ! జగద్వల్లభా !
భావత్కమ్మకృపార్ద్రదృష్టి మది సం
భావించి రామాయణ

---

* ఆనంద దివ్యవనము = కాశీక్షేత్రము.

శ్రీవిన్యాసము నుద్యమించితిని తం
ద్రీఁ యుద్ధకాండమ్ము, సం
భావింపంగదె మామకీనమగు
పూర్వగ్రంథ మెట్లట్లుగన్,

కథాప్రారంభము

సేతునిర్మాణము

శ్రీసతితోడ నా శివుఁ డన్న విధము
గరుడునితోడ నక్కాకభుశుండి
పలికిన శ్రీరఘువరుచరిత్రమ్ము
తక్కినకథ సవిస్తరముగా వినుతు:
అట్టు ల వ్వారిధి యూడినమాట
లవి విని హసియించి యా రఘువరుఁడు,
సుగ్రీవునెమ్మోము చూచి, "యిం కేల
యూరక జాగుసేయుట; వార్ధిమీఁద
సేతువు గట్టుఁడు సేన లి వెల్ల
వారిధి నుత్తరింపఁగ" నని పల్క
జాంబవంతుండు హస్తమ్ములు మోడ్చి
"రవికులాలంకార! రాఘవ! వినుము!
త్వన్నామసేతువు దగ నెక్కువాఁడు
భవసాగరమ్ము నిర్భయమున దాఁట,
నీ చిన్ని సాగర మిపుడు తరించు
టిది యెంత?" యని పల్కె నెంతయు భక్తి.
మారుతి యప్పుడు, "రామప్రతాప మను
బడబానలమ్మునేఁ బాథోధి యింకె;
నాపయి దుఃఖితు లగు వైరివరుల
నారల కన్నీటిధారల నిండె;"
నన విని కీశసైన్యములు హర్షమున
జయజయధ్వానముల్ సలిపె; నా మీఁద
బుక్కనాథుఁడు నలు నీలు రావించి
సాగరుమాటలచందము దెలిపి,
"రాము స్మరించి వారధి గట్టఁ బూనుఁ
డశ్రమమ్మున నాయాసమ్ముగ" నని
తక్కినవానరతతుల రప్పించి,
"వానరులార! నా ప్రార్థన వినుఁడు:
హృదయమధ్యమ్మున శ్రీరామచంద్ర
దివ్యపాదములు ప్రతిష్ఠించి, బుక్కు
వానరు లుత్సాహవంతులై కూడి,
పరువునఁ జని మహాపర్వతమ్ములను
వృక్షముల్ భుజశక్తి పెకలించి తెండు
పొం" డన వార లుప్పొంగుచుఁ బఱచి,
యాకసమంటు మహోన్నతముల
నమరాద్రిఁ దెగడు మహాపర్వతముల
లీల నల్లనఁ బెకలించుక తెచ్చి
కుప్పలోసిన, వాని గొని యంతనంతఁ
గడురమణీయముగాఁ బేర్చి సేతు
రచనసేయుటఁ గాంచి, రాఘవుం డనియె:

శ్రీరామేశ్వరప్రతిష్ఠ

"అతిరమణీయ మత్యంతపావనము
మహిమాన్వితమ్ము సంభావ్య మవర్ణ్య
మీ ధరాస్థలము నాకెంతయు *నించె;
శంభు నిచ్చోట సంస్థాపింప నాకు
హృదయమం దుత్సాహ మేపారుచుండె."
అన వినియుఁ గపీశుఁ డపుడ దూతలను
రప్పించి పనిచిన రయమున వారు
సని యెల్లజను మునీశ్వరులఁ దోడ్తెచ్చి:
రప్పుడు శ్రీరాముఁ డచ్చోట నొక్క
శివలింగమును బ్రతిష్ఠించి సద్భక్తి

---

* ఇంచు=ఇష్టమగు.

విధ్యుక్తపూజలు వేడ్కఁ గావించి,
"ప్రియుఁ డీ శివునికంటె వే రెవ్వ రింక?
మును శివద్రోహమ్ము బొనరించి నాకు
భక్తుఁడ నంచును బలెఁ డివాఁడు
గలలోనఁగూడ నన్ననుఁగొనఁజాలఁ
డట్టి యీ మోరకుఁ డా యల్పబుద్ధి
పొందు నారకము; న న్బొందఁగ లేఁడు;
విడనాడి నను శివున్ వేఁడినవారు
శివువీడి న న్నట్ల సేవించువారు
నాకల్పనారక మనుభవించెదరు;
రామేశ్వరమ్ము దర్శన మొనరింప
వాఁడు గై సేయును వైకుంఠపదము;
గాంగజలము దెచ్చి కడుభక్తి నెవ్వఁ
డభిషేక మొనరించు నతఁడు సాయుజ్య
పదమొందు; నిష్కామభక్తి నేనరుఁడు
రామేశ్వరునకు నర్చనలిచ్చు నతని
కస్మదీయాంఘ్రిద్వయమ్ముపై భక్తి
పాయనివర మిచ్చు పరమశివుండు;
నాయొనర్చిన సేతు నరుఁ డెవ్వఁడేని
గనుఁగొన సంసారఘనసాగరమ్ము
నశ్రమమ్మున దాఁటు" ననుచును బల్క
నా రామచంద్రుని యాప్తవాక్యముల
నాలించి మునివరుల్ హర్షించి రాము
ననుమతి వడసి నిజాశ్రమమ్ములకుఁ
జనిరి. పార్వతి! రఘుసత్తముఁ డిట్ల
భక్తులఁ బ్రోతి సంభావించు సతము.

శ్రీరాముఁడు సేనతో సముద్రము దాటి
సువేలాద్రిపై విడియుట

అట్లు వారధియు సమాప్తమ్మునొంద
శ్రీరఘుపతియశశ్రీ పర్వె జగతి;
మునిఁగెడునవియును ముంచెడినవియుఁ
బాషాణవితతులు ప్లవములై తేలు
టది సాగరునిగొప్పయా? రాతిగుణమె?
కపులకార్యమ్మె? రాఘవుని సన్నహిమ
గాక! యీ రాఘవుఁ గాదని పరుల
నెవఁడో మందుం డాశ్రయించెడుఁగాని,
శ్రీరఘుపతి యంత సేతువు గాంచి
యానందమగ్నాత్ముఁడై తల యూచె;
సంతన కట్టి యుత్సాహసమేతు
లై కపియూథ మాశాంతము ల్వగులఁ
గడు పిచ్చలించుచు గర్జన ల్సలిపె;
వారధి నా రఘువరుఁ డధిష్ఠించి
సాగరుఁ గనుఁగొనఁ జనుదేర నప్పు
డా కరుణాకరు నా దివ్యమూర్తి
భగవంతుఁ డగు రామభద్రు వీక్షింప
నొక్కఁడొక్కఁడు శతయోజనోన్నతము
లగు నక్రమకరమహావ్యాళమీన
తిమితిమింగిలగిలాదికము లై నట్టి
జలచరబృందముల్ సనుదెంచె నొత్తు
కొని పరస్పరభీతిఁగూడఁ ద్యజించి;
శ్రీరామచంద్రమూర్తిని గనుఁగొంచు
ననిమేషనయనము లవి తాల్చె; నపుడు
తన్మనోంతర్గతోత్సాహ మెం తనుచు
వర్ణింపఁగావచ్చు వదల వచ్చోటు;
నొండొంటిఁ గడచుచు నొత్తుకనచ్చు
యాదోవితానమహార్ణవమందు
నెందున జలధి కన్పింపనిదయ్యె;
అంత రామునికటాక్షాంచలసంజ్ఞ
నెఱిఁగి యక్కేశవాహిని మురు ర్మరించె;
పదఘట్టనల ధరాభాగము గ్రుంగ
దిక్కుంభ లవి గ్రొగ్గతిలఁబడివోవ
నోపక శేషుండు హుమ్మని యొఱఁగ;
సాఁగె న క్కపిసేన సంభ్రమమ్మునను;

గుంపులుగుంపులై గుదిగొని పోవఁ
గానక నెదుట మార్గ మ్మొక్కఁ డొక్కఁ
డాకాశపథమున నరుగఁ దొడంగె;
జలచరతతుల మస్తకములమీఁదఁ
బడి త్రొక్కికొంచును బఱచిరి కొంద;
ననుజయుక్తుండయి యా రామచంద్రుఁ
డిదియెల్లఁ గనుచు హసించుచు సేన
వెంటరా వారాశి వెస నుత్తరించి
యావలితీరమ్మునందునఁ జేరి,
పటకుటీర మ్మొండు పన్నిన విడిసి,
తన్నుఁ గన్గొనుచున్న తరుచరవరుల
యాస్యముల్ పరికించి, "యరుగుఁడి మీర
లల్ల వే కనుఁడు మహావృక్షవితతి,
యారగింపుడు కడుపార ఫలమ్ము-
లంగదయుడుగఁగ" నన విని మొగము
విప్పార వానరబుభుక్షైన్యములు
గోయని యార్చుచు గుములుగఁ బఱచె.

నట్లు బన్నము వడి నట్టిదానవులు
పరువిడి యా దశవదనుని డాసి
కీశులు వెట్టిన కిగ్గాడిపాటు
లెల్ల విన్పించి దుఃఖించినఁ గాంచి
పంక్తికంధరుఁడు సంభ్రమచిత్తుఁడగుచు
నంబుధి బంధించి రను వార్త మిగుల
నాశ్చర్యకరముగా నపు డగ్గలించి
పది మొగమ్ముల నొక్క పరి, "యిదియేమి
వననిధి నీరధి వారిధి కంధి
యుదధి తోయనిధి పయోనిధి జలధి
యన్నదీపతి సింధు వవుర బంధింపఁ
బడియెనే?" యనుచు విహ్వలుఁడయి బెగరి
యాపయిఁ గొంత నిజాంతరంగమునఁ
జింతించి, "బాపురే! చెన్నటి యట్లు
సంభ్రమించెద నిజచ్ఛాయఁ గన్గొనియు"-
నని తలపోసి భయమ్మునొలంగి
చారుమందోదరీసౌధమ్ము సేరె;

శ్రీరామాగమనవార్త విని రావణుఁడు విభ్రాంతుఁడగుట

అంతట రామకార్యము గురుతుంచి
కాలధర్మమ్మును గైకోక తరులు
స్వాదుఫలమ్ము లక్షయముగాఁ గపుల
కందిచ్చె; వానరు లంతట నైజ
చాపల్యమునఁ దరుశాఖలు వట్టి
యూఁపుచు దానవు లుదిలఁగొనంగ
లంకమీఁదికిని శైలములు పైచుచును,
అందందు గోరాడునప్పు డెందేని
దొరకిన చెన్నంగితులువరక్కసులఁ
బట్టి యాడించుచు, వడి ముక్కు సెవులు
గఱచి శ్రీరామునికల్యాణయశము
కీర్తింపగాఁజేసి గీటున బుచ్చ;

మందోదరి రావణునకు హితము సెప్పుట

అప్పు డచ్చోట మయాత్మజ, కంధి
బంధనమ్మును రామభద్రునిరాక
యెఱిఁగినదగుట ప్రాణేశ్వరుపదము
లందున వ్రాలి, వీణాతిశాయియగు
కంఠము గాద్గదిక్యము వహియింప,
జడిగొనఁ గనుల బాష్పాంబుపూరములు,
"నాథ! ప్రాణాధిక! నా మాట వినుము!
హృదయస్థితము కోప మీఁగుట లెస్స;
సమబుద్ధిబలులతో శాత్రవ మొప్పు;
నీవును రాముఁ డి దెక్కడిపొత్తు?
ఖద్యోత మెక్కడ ఖరకరుఁ డెందు?
బలయుతుల్ మధుకైటభాదుల దైత్య
యోధులనెల్లఁ ద నుక్కడగించి

బలియుఁ డా బలి దగుబలము ద్రుళ్ళించి,
కా ర్తవీర్యార్జునుగర్వము దూల్చి
యవతరించినయట్టిఁ డా మహాభాగుఁ;
డక్కటా! కాలకర్మాదులన్నియును
దక్కరస్థమ్ము లాతనితోడ వేర
మేటికి? జానికి నిదె కొనిపోయి
య మ్మహాభాగున కర్పించి పుచ్చి
రామచంద్రునిపదరాజీవయుగళ
సన్నిధానమ్మున సాష్టాంగ మెఱిఁగి
యాత్మజన్ములకు రాజ్య మ్మప్పగించి
వన మేఁగి శ్రీరామపాదముల్ గొలిచి
శేషజీవితము బుచ్చిన మేలుగాదె?
నాథ! రాఘవుని దీనదయాళు వందు;
రెదుట నిల్చిన వాని నెంతటి పులియుఁ
గసిమసంగదు, దయాకరుఁ డేమిసేయు?
సకలకార్యమ్ములు సాధించినావు;
దేవదానవుల మర్దించి మించితివి;
వార్ధక్యమందు నెవ్వండును దనదు
రాజ్యమ్ము విడిచి యరణ్యముల్ సొచ్చి
సృష్టికి స్థితికి సంహృతికి మూల మగు
పరమాత్మ గొలుచుట భావ్యమటంచు
నీతికోవిదులు వర్ణింతురు కృతుల;
శరణాగతత్రాణశబ్దవిభాజి-
శ్రీరఘుపతి- నహంకృతి విసర్జించి
భజియించు టుచిత; మీ భాగ్యమ్ము నోఁచు
కొఱకుఁగాదే ఋషికుంజరు లన్ని
కష్టమ్ము లోర్చుట- కడకు రాజ్యమ్ము
లేని నృపుల్ వీడి యేఁగుటవనికి;
అట్టి కోసలపతి యీ రఘునేత
నిమఁ గావ వచ్చియుండెను స్వామి! యిప్పు
డస్మదీయములు వాక్యమ్ము లాలించి
ముల్లోకపావనమ్ము యశమ్ము గొనుము.

శ్రీరామచరణరాజీవముల్ గొల్చి
నాదుమాంగల్యము నాథ! రక్షింపు"-
మని యిట్లు గజగజలాడుచునున్న
గని దానవేంద్రుఁ డక్కఁజాత్కోఁ గ్రుచ్చి
యెత్తి కౌఁగిట విరియించి, "యో పిచ్చి
దాన! నీ విట్లు వ్యర్థభయమ్ము గొనెద,
వెవ్వఁడు జగతి నా కీ డగు యోద్ధ?
వరుణకుబేరపవనయమాదులను
మద్బుజశక్తిచే మర్దించినాఁడ;
దేవదానవనరాదికసమస్తమ్ము
నా కధీనము; కారణ మేమి జడియ?"
నని పెక్కుగతుల మయాత్మజ ననున
యించి సభాస్థలి కేఁగె రావణుఁడు.
"తనదునాథునకు నింతటియహంకార
ముద్భవించుట కాలయోగమ" యనుచు
మయపుత్రి తనదగుమది నేడ్వఁ దొడఁగె.

రావణప్రహస్తసంవాదము

అటు దానవాధీశుఁ డా కొల్వునందు
మంత్రులదిక్కయి, "మనపయి వచ్చు
న య్యరాతి నెదుర్చుటది యెట్లు?" లనిన
నవ్వి మంత్రులు, "దైత్యనాథ! మీ రిట్లు
మాటికి శత్రునామము వల్కనేల?
యిందు భీతిల్లుట కేమికారణము?
నరులు వానరులు మనకు బువ్వగాదె"
యన, వారివాక్యము లాలించి కేలు
మొగిచి ప్రహస్తుఁ డిమ్మొగిఁ బల్కఁ, "నధిప!
దుష్టు లీ మంత్రుల తుచ్ఛవాక్యములు
సెవియొగ్గి దుర్నీతిసేయఁగఁబోకుఁ
డీ యిచ్ఛకమ్ముల కేమివచ్చినది
కోఁతియొక్కఁడు మహాకూపార మట్లు
దాఁటివచ్చిన యీ కథలు మఱచితిరో,

ఆనాఁడు వీరల కాఁకలి లేదొ?
లంకను వాఁడు కాల్పంగ బంధించి
యొకఁడును భక్షింపనోపఁ డెందులకు?
వినుట కెంతయును నొప్పిదమయి మీఁద
హానికారకములౌనట్టి వాక్యములు
సెప్పి రీ మంత్రులు సేకొనఁ దగదు;
అలవోకగా సేతు వబ్ధికిఁ గట్టి
సేనతోడ *సువేలఁ జేరినవారి,
మానవుల్ వారిని "ప్రమందింతు మనుచు
వట్టిడాంబికములు పచరింప నేల?
తండ్రి! నా మాట లాదరమున వినుము!
భీరుఁ డటంచు భావింపకు నన్న;
ఇంచునట్టి ప్రియోక్తు లెన్నేని చెప్పి
వారును వినువారు వసుధను గలరు;
కాని వినంగ దుఃఖదములే యయ్యి
హితము గూర్చెడు మాట లెందఱు సెప్ప
నోపుదు? రవి విననోపు వా రెంద?-
అ ట్లాట నీవు న్యాయమ్మువాటించి
మొదట దూతను బంపి భూపుత్రి నిచ్చి
సంధిసేయుము రామచంద్రునితోడ;
నామెను గొని వార లరిగిరా లెస్స!
కాకున్న యుద్ధరంగమ్మున నాఁడె
యెదురొడ్డి మనశక్తి యెఱిఁగింపవచ్చు
నాథ! యీ యుక్తి యెనర్పఁగఁ జెల్లు;
నిరు తెఱఁగులఁ గీర్తి యేపారు జగతి"-

నను పుత్రుమాటల నాలించి పంక్తి
వదనుఁడు మిగులకోపమ్మున, "నోరి!
పలువ! నీ కెవ్వఁడీ పలుగాకిమాట
లెఱిగించినట్టివాఁ, డెట్లు పుట్టితివి
చందనవనమున సరివిభ్రమాకట్టు?"
లన విని తండ్రివాక్యమ్ముల కతఁడు
గటకటవడి, "యగుఁ; గాలము సేరు
వైన మానవునకు నౌషధమట్లు
చేదయ్యె నామాట సీ!" యని కనలి
యట నిల్వనోపక యరిగె నిజేచ్ఛ
అపుడు సాయంసమయ మ్మగుటయును
దనకొల్వుకూట మంతటన జాలించి
యిరువదిభుజముల నీక్షించుకొంచుఁ
బ్రౌఢాదమున కేఁగి రావణుం డందు
నాసీనుఁడయ్యె రత్నాసనమందు;
మూఁడుజగమ్ములు బోరుకొనంగ
గంధర్వకిన్నరగానముల్ సాఁగె;
వేణుమృదంగసువీణాదిమధుర
వాద్యముల్ మొరసె; నప్సరసలపాద
మంజీరములు ఘల్లుమంచును బలికె;
ఒకప్రక్కేవఁ దలపయి నుద్ధతవైరి
యెక్కి కూర్చుండుటయేని గైకొనక
శతశతమఖభోగసంపదలందుఁ
బొరి రావణుఁడు దలమున్కలైయుండె.

---

* సువేల = సువేలాచలము, మంచిసమయము.

శ్రీరామచరితమానసము

లంకా కాండము

ద్వితీయవిశ్రామము

సోమకదానవహరణో
ద్దామోగ్రగదాభిరామ ! తారకనామా ;
శ్రీమీనాకారధరా ;
స్వామీ ! శ్రీమట్టపల్లివాస ! నృసింహా !

శ్రీరాముఁడు చంద్రోదయము నభివర్ణించుట

అట రామచంద్రుఁ డనంతవాహినులు
వినుతింప నపుడు సువేలాద్రి విడిసె;
నం దతిరమణీయ మత్యున్నతమ్మ
నత్యంతధవళమునగు శృంగముపయి
లక్ష్మణుండును గిసాలయములు విరులు
గొని తెచ్చి విరచించెఁ గూరిమిశయ్యఁ;
గృష్ణాజినము దానిమీఁదనుఁ బరచె;
అద్దానిపైఁ గరుణాకరుం డాద్యుఁ
డాదిదేవుండు కేశాధీశుతొడల
పయి శీర్ష ముంచి, చాపము నిషంగమ్మ
లిరుగెలంకులయందు నిడికొని వానిఁ
గేలఁ దాకుఁచును లంకేశ్వరానుజుఁడు
సెవిని రహస్యముల్ సెప్పుచుండంగ,
హనుమదంగదులు పాదాబ్జము లొత్తు
చుండఁగఁ, దనవెన్క సోదరుండైన
లక్ష్మణస్వామి వీరాసనస్థితుఁడు
బాణమ్ము ధనువు చేపట్టి తన్గొలువ,
నతిలోకమోహనుండయి విరాజిల్లె;
ఆ మహోత్తమదృశ్య మత్యంతసుఖద
మద్ది ధ్యానించిన యతఁడె ధన్యుండు.
అంతలోఁ బూర్వదిశాంగణమందుఁ
జూపట్టఁ జంద్రుఁడు సూచి శ్రీరాముఁ
డటగలవారితో ననియె నీరీతి :
"మృగపతియట్ల యా మృగలాంఛనుండు
బలశాలి తేజస్వి భయవిరహితుఁడు,
ప్రాగ్దిశ యనియెడు పర్వతగుహల
వసియించి యాంధ్యమన్ వన్యమదేభ
కుంభమ్ములు విదల్చికొంచు నాకాశ
వనమున విహరించువాఁడు గాంచితిరె?
రిక్కలల్లవె శర్వరీదివ్యకాంత
గైసేసికొన్న ముక్తాఫలవితతి.
ఆ కళానిధియందు నల్లదె సుంత
కాలిమ మీకును గన్పించు; నెట్టి
దగునొ తోచినభంగి నాడుఁడీ వినెద"-
ననిన, "భూచ్ఛాయ సుధాంశునియందుఁ
బ్రతిఫలించు" నటంచుఁ బలికె సుగ్రీవుఁ;
"డొడిసి శశాంకు రాహువు పట్టికొనఁగ
నైన వ్రణ" మ్మని యూఁదె నొక్కరుఁడు;
"బ్రహ్మ, రత్నాస్యనిర్మాణమ్ము పూని
యా సుధాసూతియం దత్యంతరమ్య
భాగమ్ము హరియింప వడి కందు నిలిచె"-
ననియె వేఱొకఁ; డప్పు డా రఘునేత.
"గరళము చంద్రునిగారాబుచుట్ట
మగుటచే హృదయమ్మునందు ధరించెఁ

గావున విషలిప్తకరముల విరహి
జనముల బాధించు జాల్మఁడై" యనియె.
ఆ మాటలను విని యంజనాపుత్రుఁ
"డతఁడు నీ దాసుఁ డట్లగుటను నీదు
మూర్తి యాతనిఁ డెందమున విరాజిల్లు;
నయ్యెడెపో శ్యామతాభాస" మనిన
నల్లన నవ్వి దయాసాగరుండు
దృష్టి దక్షిణముసారించి యి ట్లనియె :

శ్రీరాముఁ డొక్కబాణముచే రావణుని
కిరీటచ్ఛత్రముల నేలఁ గూల్చుట

"ఓ విభీషణ! చూచితొక్కొ యవ్వలను
కాలకాదంబినీఘటలు గ్రమ్మినవి:
చారుసౌదామనీచయములు మెఱయు;
మధురగర్జనము లమందమ్ము లయ్యె;
కరకాసువృష్టి యక్కడఁ గల దోటు"!
నావు డాతఁడు, "రఘునాథ ! కృపాళు!
లంకాశిఖరి రాజప్రాసాదమందుఁ
బరికించుచుండె రావణుఁడుగావలయు
నృత్యగీతాదు లమేయబలుండు;
కాదు కాదంబినికాలాతపత్ర,
మా తటిల్లతలు మయాత్మజశ్రవణ
తాటంకప్రభలు, వాద్యధ్వనుల్ సుమ్మి
యా మధురధ్వని కాధారభూమి"—
యనవుడు రావణు నభిమానమునకు
నల్లన నవ్వి మాయామనుష్యుండు
చాపమ్మ నెక్కి-డి సంధించె బాణ;
మది యేఁగి యద్దానవాధిపు గొడుగు
ముకుటముల్ తాటంకములు హరియించెఁ;
జూచుచుండఁగ నవి సురిగెను ధరణి;
నీ రహస్యము గ్రహియింపఁ డొక్కరుఁడు;
ఇట్లు కౌతుకము హరించి శ్రీరాము
శర మరుదెంచి నిషంగము సొచ్చెఁ;
గడక దానవుసభ గగ్గోలువుట్టె.
"పృథ్వి చలింపదు వీవదు గాలి,
శస్త్రాస్త్రములు వచ్చు జాడయుఁ గాన;
మొకప్రళయమ్మ్ర రానుండెఁ, నాభీల,
మపశకున" మ్మ్రని యుడలఁదొడంగి—
రిట్టుల సభ సంచలించుట గాంచి
హసియించి పౌలస్త్యుఁ డనియె వారలకుఁ;
"బదితలల్ ద్రెళ్ళిన పట్టునఁగూడ
శుభములకాని యశుభములు రాని
నన్ను నీ యపశకునము లేమిసేయు?
ముకుటము లవి జారిపోవె యేనాఁడు?
నెల్లయు మీ యిండ్ల కేఁగి నిద్రింపుఁ
డిఁక పొం" డనంగ వా రేఁగిరి ద్రొక్కి—
మందోదరి తిరిగి రావణునకు హితముచెప్పి,

శ్రీరామప్రభావము నుగ్గడించుట

శ్రవణకుండలములు జారి భూస్థలిని
బడిన మందోదరి భయభీతయయ్యెఁ;
గన్నుల నీ రోడికల్గట్టఁ గేలు
మొగిచి, "ప్రాణేశ్వర! ద్రొక్కెద నాదు
ప్రార్థన మన్నించి రామునితోడి
వైరము విడనాడి వర్ధిల్లఁదగవె?
ప్రత్యంగమున జగత్ప్రతతి ధరించు
విశ్వరూపుడు రఘువీరుఁడుసుమ్ము;
బ్రహ్మలోకము తల, పాదముల్ భుజగ
భువనమ్ము, తక్కినభువనము లొడలు,
భ్రుకుటీవిలాసమ్ముపొమ్ము కాలమ్ము,
కన్ను లాదిత్యుండు కంధి సుతుండు,
ఆ యు హోరాత్రమ్ము లగు ఱెప్పపాటు,
లంబుదమ్ములు కచ, మబ్ధియె నాల్క,
యాశలు శ్రవణమ్ము, లశ్వినీసుతులు

నాసిక, మాయయే నవ్వు, దిక్పతులు
బాహులు, వేదముల్ వాణి, మారుతము
శ్వాసము, వహ్ని యాస్యమ్ము, లోభ మ్మె
యధరమ్ము, యముఁడె మహాభీలదంష్ట్ర,
సృష్టియు స్థితియు సంహృతియుఁ గార్యములు,
పదియు నెన్మిదివనస్పతులు రోమాళి,
శైలమ్ము లెమ్ములు, చంద్రుఁడు మనము,
హరుఁ డహంకృతి, బ్రహ్మ యాతనిబుద్ధి,
యీ మహత్తత్త్వమ్మె యగును జిత్తమ్ము,
సకల మియ్యది చరాచరవిశ్వకోటి
తద్విశ్వరూపము దానవనాథ!
అతఁడు మానవమాత్రుఁడౌనె భావింప?
వానితో నిఁక శాత్రవ మ్ముజ్జగించి
నాదుసౌభాగ్యము నాథ! కాపాడు!"
మనిన రావణుఁడు నిజాంగనమాట
లాలించి పకపక మని నవ్వి, "భీరు
రాల! మోహమ్ము మహాశక్తివంత
మగుగదా? నాతులయందు సాహసము
చాంచల్యము భయ మ్మసత్యము మాయ
యపవిత్రతయు నిర్దయయు నవిచార
మనియెడు నెన్మిదియవగుణవితతి
భాసిల్లు ననియెడి పండితవాక్య
సత్యమే? యిప్పుడు శత్రుఁ గీర్తించి
యీతటిభయము నా కెఱుఁగఁ జెప్పితివి.
నా యధీనమ్ములోనన యుండు భయము
తత్ప్రభావ మ్మింతదాఁక నే నెఱుఁగ;
నిన్నిదినమ్ముల కీవు సెప్పితివి.
ఈ మిషతోడ వర్ణించితి నాదు
సామర్థ్య మెంతటిజాణవు నీవు;
హరిణలోచని! భవదభిభాషణమ్ము
లతిగూఢములు విన్న నలమెడు భీతి,
పరికించినన్ సుఖ ప్రదమగు"- ననినఁ
దల బాగికొని మయాత్మజ వెచ్చనూర్చి
"యీతనిబుద్ధి యిట్లేల భ్రమించె-
కాలమ్ము తీరెను" గాఁ దలపోసె.
అట్టులారావణుఁ డా రాత్రియెల్ల
హాసవిలాసాదులందునఁగడపె
నంతట దెలవాఁ డై నా దైత్యవిభుఁడు
సహజనిశ్శంకుడు చండమదాంధుఁ
డరిగె సభాస్థలి; యీఁ! మేఘుంబు
సుధను వర్షించిన క్ష్మోణిలో రెల్లు
కాచునా? పూచునా? కన నా విధాన
బ్రహ్మ చెప్పినగాని పరమమూర్ఖులకు
జ్ఞానంబుగలుగునే సంయమివర్య!

శ్రీరామచరితవమానసము

లంకా కాండము

తృతీయవిశ్రామము

మందరగిరిధరఁ శౌరీ!
సుందరకూర్మావతారఁ సురమునిబృందా!
నందదఁ శ్రీమందిరఁ గో
విందాఁ శ్రీమట్టపల్లివీరనృసింహాఁ

అంగదరాయబారము

అచట దయానిధియగు రాఘవుండు
వఱువాత లేచి దీవ్యత్ప్రీతిగదుర
తనమనమాత్యులఁ దగఁ బిలిపించి
"యీకపయిఁ గర్తవ్య మేమి? వచింపుఁ"
డన జాంబవంతుఁ డిట్లనియె వినీతి;
"సర్వజ్ఞుఁడవు విశ్వసాక్షివి బుద్ధి
ధర్మతేజోబలధాముఁడ వగుదు—
వట్టి నీ కెఱిఁగించునంతటి వార
మే? యయ్యఁ జెప్పెద నే నొక్కమాట:
వాలిపుత్త్రుని రాయబారము పంపు
టొప్పనటంచు నే నూహింతు" ననిన,
నందుల కెల్లఱు నస్తుంకరించి;
రంతట రాఘవుఁ డంగదుఁ గాంచి,
"బుద్ధిబలమ్మునఁ బొగడికగాంచు
వాడవు గావున వాలికుమార!
అస్మదీయమ్మ్ర కార్యమ్మ్ర లక్షించి
లంకకుఁ జని రావలయు నయ్య తండ్రి!
ఎఱుఁగుదు వెల్ల నీ కింక నేఁ జెప్ప
వలసిన దేముండె? వైరికి హితము
మన కనుకూలమౌ మార్గము సేయు"—
మనిన శ్రీరామునియంఘ్రిపద్మముల
కడ వ్రాలి మ్రొక్కి— యంగదుఁ డతిభక్తి,
"త్వత్కార్యములు తమంతట సిద్ధిఁబొందు;
నిఁక నన్ను బంపించు టిది యొక హేల;
నాకుఁ జేకూరె ధన్యత్వ"— మటంచుఁ
బులకాంకురమ్ములు వొడమ నెమ్మోన
నాడిన, నెల్లఱు హర్షితులైరి.
రామనామము మనోరామమ్మునందుఁ
దగఁ బ్రతిష్ఠించి యందఱకును మ్రొక్కి—
యరిగె నంగదుఁడు లంకాభిముఖుఁడయి.
అట్లేగి లంకయం దడుగిడినంత,
దానవేశ్వరునిపుత్రకుఁడొక్కఁ డెదురు
వడియెఁ గోపము పరస్పరము పైకొనియె;
నంత రక్కసిపట్టి యంగదుఁ దన్నఁ
బదమెత్త నద్దానిఁ బట్టి కపీంద్రుఁ
డటునిటు వడి ద్రిప్పి యవనిఁ జామోఁదెఁ;
గనుఁగొని దాని రాక్షసబలగమ్ము
కపిచేత హతుఁడయ్యెఁ గానిశ్చయించి
చత్రాతిపైఁగొట్టు చట్టిపెంకులయి
పంచబంగాళమై పఱువులువారి,
రొకఁడును భయమున 'నో' యనఁడయ్యె;
మున్ను లంక దహించిపోయిన కోతి
వచ్చెను వచ్చె నన్వార్త కార్చిచ్చు
పోలిక వ్యాపించెఁ బురినలుఁగడల;

నింకఁ ద మ్మిశ్వగుఁ డేమిసేయుంగఁ
దలఁచెనో యని యెడందల బెగ్గడిలిరి.
అల్లంతదవ్వున నంగదుఁ డుండ
విచ్చుమొగ్గయి దారి విడిచి పర్విరి;
అంగదుఁ డెవనియాస్యము గనుఁగొన్నఁ
గాల్సేతు లాడక గజగజ వణఁకు;
నాగతి యంగదుఁ డరిగి యకొక్కల్వ
సేరి యాగమనము సెప్పి పు త్తెంచె;
నది విని రావణుం డల్లన నవ్వి,
"కొనితెండు ముక్కడికోఁతి యొక్కడిదొ—
పరికింత" మన దైత్యభటు లేఁగి కీశ
కుంజరుఁ దెచ్చిరి కొల్వులోపలకు.
అంగదుం డంత సింహాసనాసీనుఁ
బరికించె నెదుట— జీవత్కజ్జలాగ
సన్నిభుండైన నిశాచరనాథు
శృంగాభమస్తకు విపులవక్షస్కు—
బాహులు తరులట్లు భాసిల్లువాని
శ్రవణాస్యనాసికాచక్షూరంధ్రములు
భీకరగుహలట్లు వెలసెడువాని;
అట్లు నిర్భీకుఁడై యంగదుఁ డడుగు
వెట్టిన సభ్యులు భీతిల్లి నిలిచి;
రంత రావణుఁడు క్రోధాగ్నియై మండె;
గజయూథమునఁ జొచ్చు కంఠీరవమ్ము
భాతి నంగదుఁ డా సభాస్థలి సొచ్చి,
యెడఁద రాఘవు స్మరియించి కూర్చుండె.
ఆతనిఁ గని దానవాగ్రణి, "కోఁతి!
యొక్కడివాఁడవో యెఱిఁగింపు"— మనిన
నాతనిదిక్కె క్క, "దశాస్య! యొక్కరుఁడ
నరుదెంచితిని రాము డంపిన నిటకు;
జనకునిసఖుఁ డను చనవుండు కతన—
నిటకు వచ్చితి నీకు హితము గాంక్షించి;
యీ పులస్త్యునివంశ మందుఁ బుట్టితివి;
బ్రహ్మాదిసురలను బ్రస్తుతించితివి;
వారల మెప్పించి వరములు గొంటి;
వాశాధినాథుల యాటకట్టితివి;
రాజ్యాభిమానకారణమున నేమొ
మోహమ్మునొ భూమిపుత్రిని లోక
జననిఁ దెచ్చితి విట్లు సనునె నేయంగ?
రాముఁడు నీ యపరాధము లిప్పు
డేని మన్నించు; నా హితము పాటింపు;
తృణము మేయుచుఁ గంఠదేశమ్మునందుఁ
గరవాల ముంచి యంగన కేలు వట్టి
పరిజనుల్ వెంటరా వైదేహి ముందు
గొని రామచంద్రు గన్గొని యంజలించి,
"ప్రణతపాలక! రామభద్ర! రక్షింపు"
మన్నచో జాలు నీకభయమొసంగు—
నన విని రావణుఁ డల్లన నవ్వి
"పిల్లకోఁతీ! పెక్కు ప్రేలెద వేల?
సురలగుండెలయందు సుమ్ము నిద్రింతు—
హిత ముపదేశింప నే తెంచినావె?
పేరేమి? యెవ్వనిప్రియతనూజుండ?
వాతనితోడ సఖ్య మ్మెట్టులబ్బె?"—
నన "నంగదుండఁ గీశాధిపుఁడైన
వాలికుమారుండ, వాని నెఱుంగు
దీవు కదా?" యన నెంతయుఁ ద్రుళ్ళి,
"యవు నెఱుంగుదు, వాలి యనుకోఁతి కలదు;
మంచిది, వాలియాత్మజుఁడవా నీవు?—
వంశమ్మునం దగ్నివై పుట్టితేల?
వ్యర్థుఁడ! నినుఁ గన్న పడతిగర్భమ్ము
వ్రక్కలుగాదె? యిప్పగిదిఁ దాపసికి
నే దూత నని వచ్చి యిచ్చోట నరవ
సిగ్గిల వేటికి? నేమమే వాలి?
యెం దున్నవాఁడు దా నేమి యెనర్చు?"—
నన నివ్వి యంగదుఁ డతనితో, "నింకఁ

బదినాళ్లు సననిమ్మ్ల వాలినిఁ జేరి
యాలింగనమొనర్చి యడిగెదు గాక;
రామునితోడివైరమ్మ్ల సేమమ్మ్ల
కా దనుచుం జెప్పఁగలడు నీ కతఁడె;
యే హృదయమ్మ్లనం దెసఁగఁడో రాముఁ
డయ్యది శకలమ్ములై దీరు నిజము;
కులనాశకుండనే? కులరక్షకుడవె?
ఇరువదినేత్రమ్మ్ల లిరువదికనుల
విలసిల్లి జనుపాంధువిధమునఁ బుట్టు
చెవిటిపోలికిఁ బల్కఁజెల్లునె నీకు?
అజశంకరాదిసురౌఘు మెవ్వాని
పదకంజములువట్టి బ్రదుకునో వాని
దూతనై వంశము దూలింతు ననుచుఁ
బలుకుదుర్బుద్ధికిఁ బగులదే వక్ష?"-
మని కఠోరమ్మ్లగా నాడినఁ గనలి
కనులు రెండును నిప్పుకల నుమియంగఁ,
"గ్రోఁతి! నీ వింతటి క్రూరమ్మ్ల లాడి
బ్రదుకుట నాదుధర్మముకృపఁ బేర్మి;
నాపు మీఁద సహింప" ననె రావణుండు.
అంత కపీంద్రుఁ డాహా యని నవ్వి
"యిన్ననాళ్ళకుఁ గల్గెనే ధర్మమూర్తి
పరనారి హరియించు పరమసజ్జనుఁడు
చెల్లెలిముక్కునుం జెవియు ఖండింప
ధర్మమ్మ్ల దలఁచి యీ తప్పుఁమించె!
వసుధ నీ ధర్మప్రవణత యెఱుంగుఁ;
గన్నార నిప్పుడు గాంచితి నేను-"
ననిన రావణుఁడు "మూర్ఖా! ప్రేలవలదు.
దిజ్ఞాయకులకు బుద్ధినిఁ జెప్పినట్టి
వస్మదీయమ్మ్ల లీ హస్తముల్ సుమ్మి!
అభ్రతటాకమ్మ్లనందు నా హస్త
సరసిజంబులఁ జిక్కి శంకరుతోడి
కలధౌతశిఖరి యక్కమలషండమ్మ్ల
నడుమ మరాళమ్మ్లనట్లు రాజిల్లె!
ఎవఁడు మీలోన నన్నెదిరించు మేటి?
విరహాకాతరుఁడు మీ వెడఁగునాయకుఁడు;
సోదరుదుఃఖము సూచి కృశించి
సౌమిత్రి కోల్పోయె శక్తియు యుక్తి;
భానుజుఁ డీవు నదీ ప్రాంతతరులు;
భీరువు మాదు విభీషణుఁ; డింక
వృద్ధులలో నతివృద్ధు ఋక్షపతి;
పాపము నలుఁడు శిల్పమ్మ్లనఁ జతురుఁ;
డెవ్వఁడో యీ యింక నెత్తెడువాఁడు?
మున్నరుదెంచి మీ పురము దహించి
చన్న యొక్కరుఁ డుండె శక్తిగలాడుఁ;—
వాఁడు నన్ను జయింప వలఁతియె?" యనిన
నా మాట విని నవ్వి యంగదుం డంత,
"నేమిది యో రాక్షసేశ్వర! మఱుల
సెప్పుము లంకను జిచ్చుపాల్సేసి
చన్నట్టి కపి కడుశక్తిగలట్టిఁ
డనెదు నీ విది పరిహాసమో నిజమొ!
యోధు డీతం డని యొకగొప్పసేసి
యంటి వెవ్వాని వాఁ డల్పభటుండు;
కరములు మోడ్చి యక్కపికులతిలకు
పనుపుసేయుచునుండు ప్రత్యహ మ్మ్లతఁడు;
వానిని వెదకుచు వచ్చితి నిటకు;
నిప్పుడు లంక దహించుట వింటి;
ప్రభునాజ్ఞ లేక యిప్పనిసేయుకతన
వాఁ డెందు సురిగినవాఁడొ భయాన;
ప్రభువులయొద్దకు రాఁడయ్యె మఱుల
నీ వన్నమాటలు నిక్కముల్; నిన్నుఁ
గదనమం దెదిరింపఁగలవాఁడు లేఁడు
నీతోడ పోరుటనిన సిగ్గుచేటు;
శాత్రవ మ్మది సమస్కంధుల కొప్పుఁ;
గంఠీరవ మ్మది కప్పతోఁ బోరఁ

దలఁచునే రామచంద్రప్రభుఁ డదియ
కారణమ్ముగ నిన్నుఁ గసిమసంగుటకు
వెనుకాడుచున్నాఁడు వినుము రావణుఁడ!
కాని నమ్మఁగరాదు క్షత్రియజాతి"-
ననుచు వక్రోక్తి శరాసనమందు,
వాక్యశరమ్ముల వడి నెక్కు-పెట్టి
హృదయమర్మములు భేదిల్లఁగొట్టుటయు
నదియెల్ల సహియించి యాస్యమునందు
నలతిన వ్వాలయ దశాస్యుఁ డిట్లనియెఁ:
"గోఁతుల కొక్క-సద్గుణ మొప్పు-ప్రభునిఁ
బెక్కు-భంగుల గొప్పఁ బేరొక్కు-చుండు;
సిగ్గుత్యజించి చెచ్చెర గంతులిడుచుఁ
బ్రజలఁ బీడించుచుఁ బ్రభువె గొప్ప యని
పల్కు-కోఁతులగొప్ప పల్కుంగనగునె?
స్వామిభక్తికిఁ బేరువడసినజాతి
యందు జన్మించియు నడ్డదిడ్డముగఁ
బలుకక చెప్పుమీ పరగుణగ్రాహి
నగు నాకు మీ స్వామియాధిక్య మేమొ"-
యనవుడు నవ్వి యిట్లనియె నంగదుఁడు:
"నీ గుణగ్రాహిత నే నెఱుంగనిదె?
యంజనాతనయుఁ డీ యఖిలము నెప్పెఁ;
వనిఁ గూల్చి నిజసుతువక్షముఁ జీల్చి
పురిఁగాల్చువానిని బో విడిచితివి;
సౌమ్యుఁడ వగుట ని న్జ్ఞాల డిట్టితిని;
నాఁ డాంజనేయుఁ డన్నట్లు రోషమ్ము
సిగ్గు లే వనుట సూచితిఁ గన్నులార!"
ననుమాటలాలించి, "యభ్రను ప్లవంగ!
యిట్టిఁడుగాక నీ వెట్లు ప్రింగితివి
తండ్రి" నటంచు నద్దానవుఁ డనిన
నంగదుఁ డనియె "నౌ నవుఁ దండ్రిఁ దింటి;
ని న్నిఁక దినుటయే నేఁడు దక్కునది;
అస్మజ్జనకునకు యశము నార్జించి
యిచ్చినకతన ని న్నిపుడు వధింప;
నది యట్టులుండె ని న్నడిగెద నొకఁడు-
వసుధను గలరు రావణులు పెక్కు- రని
యాలకించితిని నీ వం దెవ్వఁడొక్కొ?
బలి గెల్వ నొకరుఁడు పాతాళ మేఁగి
యచ్చోట బాలకుల్ హాయశాలఁ బెట్టి
యాటలో నేడ్పించు టది గాంచి బలియుఁ
డా బలి విడిపింప నరుదెంచె మఱల;
ఒక్కఁడు కార్తవీర్యుని నెదిరించి
వింతజంతు వటంచు వెస వాఁడు పట్ట
రక్షితుఁడయ్యెఁ బులస్త్యునిచేత;
మఱొకండు వాలిని మాన్య నెదిర్చి
బాహుపంజరమున బంధితుఁడయ్యె;
నెవ్వఁడ విందుజ్జగించికోపమ్మ్ర
పలుకు" మనంగ రావణుఁ డల్లి "మూర్ఖ!
వినుము నే నెవఁడనో వినిపింతు సుంత:
హేలగాఁ గైలాస మెత్తినవాఁడ;
మద్భుజాగర్వ ముమాపతి యెఱుఁగుఁ.
బూజించితిని దలల్ పువ్వు లొనర్చి
పలుమరు త్రిపురారిపాదకంజములు;
దిక్పతులయురఃప్రదేశాన నేను
చేసిన వ్రణములు సెప్ప నాశక్తి;
కొండలనైనను గ్రుమ్మి చూర్ణమ్ము
గావింపఁజాలుదిక్కరులు నా యురము
గ్రుమ్మి దంతమ్ములు గూలిన బెగడెఁ;
గాలూఁద భూమి మ్రొగ్గతిలంగఁ బడును -
నాగ మెక్కిన చిన్ని నావచందాన;
ఓ యలీకప్రలాప! యొక్కనాఁడేని
యెఱుగుదువొక్కొ నీ విట్టి రావణుని?
ఖర్వ! బర్బర! దుష్ట! ఖలు రాముఁ బొగడి
నను దిట్ట నీదుజ్ఞాన మ్మెఱింగితిని"
నావు డంగదుఁడు కనలి, "జనుపాంథ!

యోజించి చూడు మీ యొక్కింత నీవు;
కార్త వీర్యునిభుజస్కంధసహస్ర
వనము పాలిటికి దావ మ్మైనయట్టి
పరశు వెవ్వనిచేత భాసిల్లు, వాని,
తనకుఠారసముద్రధారాతరంగ
పంక్తుల నైకభూపతులను ముంచు
వానిగర్వమె రామభద్రునిమ్రోల
విరిసెను బొగమంచు విరిసిన కరణి;
ఆ రాముఁడే నరుఁడయ్యె నీ కార!
ధానుష్కమాత్రుఁడే దర్పకుండెన్న?
పావనగంగ కేవల మొక నదియె?
సురగవి పశువొక్కొ? సుధ రస మ్మగునె?
కల్పక మొక చెట్టె? కాక, సామాన్య
దాన మానే యన్నదానము దలఁపఁ?
బక్షియే గరుఁడుఁడు? పామె శేషుండు?
లోక మ్మై వైకుంఠలోకమ్మ్మ? రామ
పాదాబ్జములమీఁది భక్తిలాభమ్మ్మ
సామాన్యలాభమే? సైన్యముతోడ
నీదుగర్వ మడంచి, నీ వనిఁ గూల్చి,
పుత్త్రుని జంపి, నీ పురము దహించి
యరిగినమారుతి యయ్యెనే కోఁతి?
వట్టిడాంబికములు పచరింప మాని
రవికులతిలకుచరణముల కెఱఁగు;
మిల రామచంద్రుని నెదిరించునిన్ను
శివుఁడు బ్రహ్మాయును రక్షింపఁగనోప;
రుబ్బిపోయెద వేల యూరక నీవు?
రాముసితోడ వైరముపెంచుకొన్నఁ
గపులుసూడఁగ మస్తకమ్ములు పడియు
నేలపైఁ బొరలుట నిక్కమీమాట;
వానితో వానరుల్ బంతులాడెదరు;
రణమునఁ గోపించి రాముఁడు శాత
శరము లేసెడితటి సాఁగ విక్కతలు;
వెడలి శ్రీరాముని వేఁడుము శరణ"-
మన్న యంగదుమాట లగ్గి నాజ్యమ్మ్మ
పోసినట్టి దైత్యపుంగవుఁ డనియెఁ-
"గుంభకర్ణునివంటి కూర్చుతమ్మ్మండు,
మేఘనాదునిబోలు మేటిసుతుండు,
గలరు; ప్రపంచము గానముసేయు
నా కథల్ నీవు విన్నట్టు కన్పింప;
దొకకొన్ని కోఁతుల నొక్కెఁడఁ జేర్చి
సేతువుగట్టుట శ్రీరాముఘనత!
యెన్నిఖగమ్ము లోయీ మూర్ఖ! జలధిఁ
బ్రత్యహమ్మును దాఁటు బలసంయుతములె?
అస్మద్భుజాబ్ధిబలాంబువులందు
మునిఁగి రెందతొసురల్; ప్రుక్కడిమనుజు
లిట్టిమహావార్ధి లిరువది గలవు-
తరియించుఁగాక యాతం డిఁక వీని;
దిక్పతులే నాకు దీనులై నీర
మోయ నెక్కడివాడో ప్రుక్కడిరాజుఁ
గొని తెచ్చి నాముంద గొప్పలువల్క;
దాతఁడు బలవంతుఁడైనచో దూత
బంపుట యేటికి? వైరితో సంధి
సేయఁ దలంపఁగ సిగ్గైన లేదె?
తెగువ హరాద్రి మథించిన బాహు
లివి చూచి కీర్తింపు మిఁక రాము గీము;
రావణువంటి పరాక్రమాన్వితుఁడు
గలఁడె యొక్కఁడు, మస్తకమ్ములు ద్రుంచి
యతిహర్ష మున ప్రేల్చునట్టిధీరతకు
గౌరీశుఁడే సాక్షి; కాలెడు మస్త
కములఫలమ్మునఁ గమలజుప్రాఁత
నరునిచేఁ జచ్చు నన్నట్టివాక్యమ్మ్మ
గాంచి 'వృద్ధాప్యముకతన రచించె
నజవాక్య మిపు డసత్యమ్మ్మగానుండె'-

నని హసించితిని భయంపడనైతి;
నట్టి నాముందు నీ వన్యులబలము
వొగడఁగ సిగ్గైన బుట్ట దేమిటికి?"
అన విని యంగదుఁ డంతటఁ గనలి,
"మూర్ఖుఁడా! మస్తకమ్ములు ద్రుంచుకొనిన
శక్తు లౌదురె? యైంద్రజాలికు లెందుఁ
దమతను వింతలింతలు దునియలుగఁ
జెదరి రూపఱునట్లు సేసి యచ్చెరువు
సేయరె? శలభముల్ చిచ్చునఁ బడవె?
గ్రద్దకుసైతము కాయమ్ము లేదె?
దురభిమానము వీఁడి దుష్టుఁడ! వినుము!
రాయబారము సేయ రాలేదు నేను;
కరుణానిధాన మ కౌసల్యపట్టి
'కంఠీరవమ్ము నక్కను దాఁకరాదు-
గావునఁ జని నీవు కార్యము దీర్పు'-
మని యంప నిచ్చటి కరుదెంచినాఁడ,
ఆతనివాక్యమ్ము లవి తలపోసి
నీ క్రూరవచనముల్ నే సహించితిని;
గానిచో నీదు మొగమ్ములు గ్రొచ్చి
తల్లి జానకిఁ గొని తరలియుండుదును;
సతి యొంటరిగ నున్న సమయ మెఱింగి
దొంగిలించుటయ నీదు పరాక్రమమ్ము;
నిను నేలఁ జామోఁది, నీ సేన నుఱిచి,
పురి గొల్ల వెట్టి నీ పొలఁతిని బట్టి,
సీతామతల్లితోఁ జేకొనిపోవఁ
జాలియు నే నలసత భజించెదను.
చచ్చినవానిని జామోఁదు కేమి
హెచ్చుకార్యము? దాని నెవ్వ రౌ ననరు.
కామియుఁ, గృపణుఁడు, కడుక్రోధి, పాపి,,
యాగర్భనిర్ధనుఁ, డాగమద్వేషి,
యయశస్వి, వ్యర్థదేహము పెంచువాఁడు,
నిత్యరోగియుఁ, బరనిందకుఁ, డమిత
మధుపాయి, వృద్ధుఁడు, మానహీనుండు,
మూర్ఖుఁ, డచ్యుతవైరి, భూతలమందు
జీవచ్ఛవము లని చెప్పుదు రార్యు;
లందుచే బ్రదికితి" వన రావణుండు
చటులాసిపుత్రికఁ జయ్యన ముట్టి,
"క్రోఁతి!నీ కాయువు గూడివచ్చినది;
పిట్ట కొంచెము కూఁత పెద్దది, నీవు
పొగడె దెవ్వని వాఁడు బుద్ధిహీనుండు,
నిర్బలుం, డల్పుఁడు నిర్గుణుం డసదు,
తేజోవిహీనుండు, దీనుఁడు- కానఁ
దండ్రి యొల్లక వానిఁ దరిమెఁ గానలకు;
విరహాకాతరుఁడును వెడఁగు దుఃఖితుఁడు
ప్రత్యహమ్మును నాకు భయపడుచుండు;
నిట్టి మానవులఁ దా రెందఱెందరినొ
పట్టి భక్షింత్రు నా భటు లహర్నిశము;
వెడఁగుమాటల నిఁక విడుచుట లెస్స-"
యనియె న మ్మాటల కలిగె నంగదుఁడు.
హరిహరనిందల నాలించునట్టి
వాఁడు గోవునుజంపుపాపము నొందు;
అక్లాట నంగదుఁ డంగముల్ గనల,
వికటభ్రుకుటి ఫాలవీథి రంజిల్ల,
కటకటంబడుచు దిక్తటములు చిటుల,
పటపటమంచును బండ్లుగీటుచును
నిజఘనభుజముల నేలను జరువ
నది *యొడ్డగెడవయి యపుడు గ్రక్కదలె
ఆ సభవారు భయానిలహతిని
దూలశకలములై తూలిరి డిశల;
నాసనస్థుండు దశాస్యుఁడు దుదకు
నేల గూలక యెట్లో నిలద్రొక్కుకొనియె;

* ఒడ్డ గెడవు = ఒక ప్రక్కకు వంగినది.

భూరిహిరణ్మయముకుటము లంత
భళ్లున ద్రెళ్లి తా వ్రాలెను ధరణి;
సంభ్రమమ్మున నిశాచరనాథుఁ డందుఁ
జేకొని కొన్నింటి శిరములఁ దాల్చె;
నింకఁ దక్కినవాని నెత్తి యంగదుఁడు
పారవైచెను రామభద్రునికడకు;
ఆ కిరీటమ్ము ల ట్లరుదేరఁ గాంచి
ప్లవగముల్ గడువడి పఱచి, 'యి దేమి
పగలునయం దుల్కపడ నేమికత మొ ?
కోపించి దైత్యుఁడు కులిశము ల్విసర
నీ నాలు గీ రీతి నే తెంచు నేమొ'—
యని సంచలింప రామావనీభర్త,
"యడలకుఁడీ యవి యశనులు నుల్క—
లని నెమ్మనమ్ముల; నంగదుఁ డెత్తి
పారవైవంగ రావణకిరీటములు
వచ్చు" నావుడు కపివరులు హర్షించి;
రంత నా హనుమానుఁ డవి గొనితెచ్చి
జానకీపతిపాదసన్నిధి నిడియె;
అంత వానరులు మహార్యమహార్య
భీశుసంయుతములు ప్రేక్షణీయములు
దానవేశశిరోజ్ఝితమ్ములు దివ్య
ముకుటము ల్గ్గొన మూఁగి రచ్చోట.
అంత రావణుఁడు మహాక్రోధవివశ
చిత్తుఁడై, "వీనిఁ జెచ్చెరఁ బట్టు
డెలవానరుల మీ రేఁగి భక్షించి
తబ్బిసోదరుల నిద్దరను బీరోక్ష
ప్రాణాలు దీయక బంధించి తెండు!
పొం" డన న వ్వాలిపుత్త్రుఁడు గనలి,
"పలుగాకిమాటలు వలుక సిగ్గిలవు;
లజ్జావిహీన! కులధ్వంసి! రాము
బలము గన్గొని భవద్వ్యక్తము ద్రీల
దేటికి మంద! కామా! పాపరాశి!
సన్నిపాతము నిన్ను సంధించుకతన
నీదుముందల నట్టి మృత్యు వీడ్వంగ
బకబక నీ విట్లు వాగుచున్నాఁడ;
వచిరకాలమున నీ వద్దానిఫలము
గుడిచెదు తప్పక; క్రోఁతులు సుట్టి
వరుస చపేటసంభావన లిచ్చు;
నరుఁడు రాముం డను నాల్క— వ్రయ్యలగుఁ;
దలలతో నది రసాస్థలి గూల కున్నె?
యొక్కమ్మచే వాలి నొగి కూల్చినట్టి
వా డక్కటా రామభద్రుఁడు నరుఁడె?
నీ యదృష్టమునకు నిను విడిచితిని;
ప్రభునాజ్ఞయున్న నిన్ బట్టి పల్లార్చి
నీ కోరలు వెకల్చి నేలఁ బెట్టెదను;
పదితలల్ దునిమి యి ప్పట్టణమెల్ల
సాగరమ్మున ముంచి చయ్యనఁ బోదు;
ఔదుంబరఫలమ్మునందు జీవాళి
యట్లు మీ రీ లంక నధివసించెదరు.
గాటంపుటంగద గాసిల్లు నాకు;
రామచంద్రునియాన రాలేదుగాక —
గుటుకున ద్రుంగనే క్రూరుఁడ" యనిన
నవ్వి దైత్యుఁడు, "కపీంద్రా! యిట్టిమాట
లెందు నేర్చితివి;తా నెన్నఁడు వాలి
వ్యర్థప్రలాపముల్ వల్కనె వినఁగఁ?
దపసులపక్షము దాల్చి హైన్యమ్ము
గాంచితి" వనఁగ, నంగదుఁ, "డవు నవును,
జిహ్వాలు ద్రీల్చక చేసితి జాగు;
నింతకంటెను హైన్య మిం కేమివలయు?"
నని పల్క రామునియడుగుల నెడఁదఁ
దలపోసి తనదుపాదము సభ నూఁది,
"యట్టిహీనుండ నా యడు గిడుచుంటి;
మగసిరిగలవాఁడు మసలక వచ్చి
తొలఁగింపఁ గనుఁ డట్లు తొలఁగించి రేని,

మా రామచంద్రుఁడు మగిడి పోఁగలఁడు;
నీకు సీతమ్మను నే నోడిపోదు;
నని యప్పు డంగదుఁ డా సభఁ జూచె.
దానవేశ్వరుఁ డంత "దానవులార!
కాంచెదరేల ప్రుక్కడికోఁతి దీని
గాల్పట్టి విసరి యక్కడఁ బడవేయుఁ
డన నింద్రజిన్ముఖ్యు లడరి కపీంద్రు
కా ల్గదల్పఁగ లేక కడువిన్ననగుచు,
వినతశిరస్కుఁ లై వెనక్కుఁ జనిరి;
యోగిబ్రువుండు మహామోహం
తరువును బట్టి కుద్దాలింప లేని
వడువున నంగదుపాద మొక్కండు
నేని కదల్పక నిల్చిరి డస్సి;
కోటివిఘ్నమ్ములు గూడియు నీతి
పథము సత్పురుషుఁడు బాయనిరీతిఁ
గపివరుపాదము కాశ్యపి సుంత
వీడమిఁ గన్గొని వెఱచి రెల్లఱును.
వాలిపుత్త్రుఁడు దశవదనునిఁ జూచి
"చోద్యము గనుఁచు గూర్చున్నఁ గార్యమ్ము
దప్పును నీవు సైతము సూడరాదె?
వచ్చిన దింక నీవం" తనఁ గనలి,
వీనినిఁ గాల్పట్టి విసరెదఁ గాక
యని లేచివచ్చి య య్యంగదుకాలు
పట్టఁగఁబోవ గుభాలున దాని
వెనక్కు లాగి, "యో వెడఁగ! నాపాద
ములుపట్ట నీ కేమి మోక్షము గలదు?
పోయి రాముని పదమ్ములు పట్టుకొనుము
లెమ్ము నీ" వనుచుఁ బల్కి నఁ దెల్ల వోయి
తనచోటునకుఁ జనె దశవదనుండు;
మధ్యాహ్న వేళాసమాగతవిధుని
కరణి ముఖశ్రీ సకలము నశించెఁ;
బెన్నిధిఁ గోల్పడ్డ వేదవిధానఁ
బరిదీనవదనుఁ డై పలవింపఁ దొడఁగె;
నా జగదీశు దయామయు హారిని
గా దన్న దుఃఖమ్ము గాక మ ఱేమి
కలదు? శ్రీరాముకనుసన్న లోక
సృష్టియు సంహృతి చెలఁగుచునుండుఁ;
దృణము వజ్రమ్ముగాఁ దృణముగా వజ్ర
మలరఁ జేయుచునుండు నాతనిదూత
సేసిన ప్రతినకు సేగి రాఁగలదె?
యట్లు లంగదుఁ డెన్నియైన నీతులను
వినిపించి వినిపించి "వెడఁగురక్కసుఁడ!
యూహావరంగమ్మునందు ని న్బట్టి
యూడింపకుండిన నంగదుఁడనకు;
ముందుగ నిట డంబములు వల్క నేల?
యప్పుడ చూతుగా" కని పల్క కదలి
రామచంద్రునిపాద రాజీవయుగళ
సన్నిధానమ్మున సాష్టాంగ మెఱఁగి.
వచ్చుచునే సుతవధసేసియున్న
యంగదుపల్కుల కడలిరి సభను.

మందోదరి మఱియొకసారి రావణునకు
హితము సెప్పుట

చండగభస్తి పాశ్చాత్యాగ మెక్క
దై త్యాధినాథుడు దశకంధరుండు
జాలించి కొలువు విచారాబ్ధి మునిఁగి
యేఁగెఁ బ్రాసాద; మయ్యెడ మయపుత్రి,
"కాంత! విసర్జింపు గర్వము; నీకు
రామునితోడివైరము లెస్సగాదు;
లక్ష్మణుం డొక్కండు లఘురేఖ గీయ
దాఁటలేరై తిరి దానినిగూడ;
నవలీల దూతలే యబ్ధి లంఘించి
లంకాపురము సొచ్చి రాక్షసవరులఁ
గొట్టి యుద్యానము గూల్చి కట్టెదుట

నక్కుయపుత్తు సంహారముసేసి
పురినెల్ల దహియించి పోవఁగా నింక
రాముని తోడ శాత్రవ మెట్టిదగునొ?
నాఁడును లంక నున్నాఁడవుగా వె?
రాజమాత్రుఁడుగాఁడు రాముఁడు; సకల
జగదధీశుఁడు దివ్యస త్త్వాయుతుండు.
మారీచుఁ డెఱుఁగు రామబలమ్ము సుంత
చెప్పఁగా నాతఁడు సెవి సేర్పలేదు.
సకలరాజన్యులసన్నిధి విల్లు
విఱిచి రాముఁడు సీతఁ బెండ్లాడునాఁడు
కడుశక్తుఁడ నటంచు గర్వించు నీవు
గలవుగదా? యేల కదన మ్మొనర్చి
చెండాడి వైరుల సీతను దేవు?
నయన మొక్కండు పోనాడుకొన్నట్టి
కాకాసురుఁడు రామకథ కొంత యెఱుఁగు,
శూర్పణఖావస్థ చూచియుఁ గూడ
హృదయమందున లజ్జ యేర్పడదయ్యె;
ఖరదూషణాదుల ఖండించి, వాలి
బాణైకహతిఁ దూల్చి వ్రచ్చి విరాధుఁ,
జెలఁగి యంభోధిపై సేతు గట్టించి
వాహినుల్ వెంటరా వచ్చి సువేల
విడిసిన రఘుకులవీరుఁడు కరుణఁ
ద్వచ్ఛుభ మ్మెదఁ గోరి పంపెను దూత;
నాతండు సింగము హస్తియూథమును
గలఁచిన విధమునఁ గలఁచె నీ సభను.
మాటికి రాముని మానవుఁ డనుచు
వ్యర్థగర్వ మ్మిట్లు పచరించె దేల?
రామునితోడి వైరము కాలవశతఁ
గలుగ, దుర్బుద్ధులు గలిగె నీ కిట్లు;
దండమ్మ గొని యెందు దండించునొక్కొ-
కాలుఁడు ధర్మము గ్రసియించుఁగాక!
యిట్టిబుద్ధులు కాల మెప్పుడు దీరె-
నప్పుడు జన్మించు నను మాట నిజము.
పుత్త్రులు సచ్చిరి, పురి గాలె, నింక
నైన రాముని శరణాగతత్రాత
నభయమ్ము వేఁడి సద్యశమునై కొనుము;
నామాట విను" మని నానావిధములఁ
జెప్పి చూచిన నది చీరికిఁ గొనక,
యుదయ మ్మె లేచి మహోత్సాహ మొప్ప
సభఁ జేరికొనియె నిశ్శంక రావణుఁడు.

శ్రీరామాంగద సంభాషణము

అట రామచంద్రుఁ డయ్యంగదుఁ బిలిచి
చరణకంజములకు సాష్టాంగపడిన,
నాదరమ్మున నెత్తి, "యంగద! నాకు
విస్మయమ్మయ్యెడు వినిపింపు మయ్య!
విశ్రుతభుజబలవీరుఁడు యాతు
ధానవంశకరుండు దానవనేత;
వానికిరీటముల్ వరుసగ నాలు
గప్పుడు విసరితి వవి యెట్లు చిక్కె?"
నావు డంగదుఁడు వినయమున, "దేవ!
ప్రణతా ర్తిహరణ! శుభంకరచరణ!
యవ్వి కిరీటము లగునె సర్వజ్ఞ!
భూమీశగుణములై పొలుపొందు సామ
దానభేదమ్ములు దండము ననెడు
నవిగాక;-వేర్కొను నాగమమ్ము లవి
నీత్యభిజ్ఞులకడ నెలకొను ననుచుఁ;
గావున నిట్లు మీకడ కరుదెంచె
ధర్మహీనుండు వృథాగర్వికాల
వివశుఁడు త్వత్పాదవిముఖుఁడు దాన
వేశ్వరుం డని వాని నివి విడనాడె"-
నని పల్క రాముఁడు హసియించెఁ; బిదపఁ
గోటయందలికథ కూలంకషముగ
వినిచె రాఘవునకు వీరాంగదుండు.

శ్రీరామచరితమానసము

లంకా కాండము

చతుర్థవిశ్రామము

ఘనకనకాక్షవిదారణ!
కనదుగ్రనిశాతదంష్ట్ర! క్ష్మాదుఃఖహరా!
మునినుతవరాహరూపా!
వనజాక్ష! మట్టపల్లివాస! నృసింహా!

రామరావణ సంగ్రామారంభము

అంత రాముం డమాత్యవరులఁ జూచి,
"లంకాసుదుర్గము లగ్గలువట్టు
టెట్లు విచారింపుఁ డింక మీ" రనఁగ,
జాంబవదాదులు స్మరియించి రాము
తమ సైన్యమును నాల్గు దళము లొనర్చి,
దళనాయకులుగఁ గొందఱ నియమించి,
వారల నెల్ల రా బనిచి సద్భక్తి
రామచంద్రుని పరాక్రమము వర్ణించి
కర్తవ్యమును బల్క కదలుఁ డనంగ,
రామాపనీశచరణముల కెఱఁగి
ఋక్షగోలాంగూలవితతులు మెఱసి
గిరిశిఖరమ్ములు వృక్షసంతతులు
కరములఁ గీలించి కడుపిచ్చలించి
ద్యావాపృథువులు రయమ్మున వ్రీల
సింహనాదమ్ములు సేయుచు ఘోర
భూరిభేరీగణమ్ములు మొరయించి
"జయజయ శ్రీరామచంద్ర! జయమ్ము
జయ లక్ష్మణా! జయజయ వానరేంద్ర!
జయజయ" యనుచు నుచ్చైర్నాదములను
గదలి, నిర్భీతి లంకాపురి నాల్గు
చెఱఁగుల నాక్రమించిన, లంకయందుఁ
గోలాహలమ్ము గగ్గోలు భయమ్ము
చిందఱవందఱ చింతయు వణకు
జన్మించె; నంత నిశాచరనేత
కపు లెల్ల వచ్చి లంకను ముట్టడించి
రని విని వికటాట్టహాస మొనర్చి
నిజసేనఁ బిలిపించి నెమ్మి నిట్లనియె:
"కాలవశమ్మునఁ గపిసమూహములు
ముట్టియున్నవి మనపురము; నరాద
గణములు కడు బుభుక్షార్తి నుండంగ
బ్రహ్మాయాహారము పంపె నీ రీతి;
నోహో! నిశాచరయోధ్దలు! మీరు
సని పిచ్చలించి ప్రచండులై మెఱసి
డెస లాక్రమించి మర్దించి వధించి
యక్కపిబుక్కుచయమ్ముల మెసవుఁ-"
డన రొమ్ము లుబ్బించి యసురసైన్యములు
పరశుముద్గరగదాపరిఘమహాసి
భిండివాలత్రిశూలభీకరతోమ
రాదినానాప్రకారాయుధవితతి
హస్తమ్ముల ధరించి, యరుణోపలములఁ
బలలఖండము లని భావించి ముక్కు-
విరుగుట యెఱుఁగక వెట్టి గృధ్రములు
సనియెడు విధమునఁ జయ్యన రత్న
సానుకందరముల జలధరమాల

శోభిల్లుచందానఁ జూపట్టి, కోట
గవకుల కెగఁబ్రాకి కాలాబ్దగర్జఁ
బోసినిరణభేరి మ్రోఁతలు సెలఁగ
సాహసమ్మున యుద్ధసన్నద్ధు లైరి.
అ టిరువాగులయందు వాహినులు
జయజయ ధ్వానముల్ సలుపుచు ఘూర్ణ
మానాబ్ధి లొండొంటి మాత్సర్య మెప్పఁ
దాఁకు విధమ్మునఁ దాఁకె; రాకాసి
మూఁకలు గిరిశృంగములు దెచ్చి వైవ
నడుమనె వాని వానరులు చేపట్టి
యూర్చుచు వైచి రా యసురులమీఁద;
దర్జించి వానరదళములు కోట
కొమ్మల కెగఁబ్రాకి క్రూరదానవుల
కాల్వట్టి గిరగిర గడువడిఁ ద్రిప్పి
విసరేఁ జుక్కలు సూచి వేంచేయుఁ దనుచుఁ;
బఱచెడి వారలఁ బరికించి మేటి
మగ లిట్లు పోదురె మగపాడి దప్పి
యని కపుల్ వెన్నాడి యసురులఁ దన్ను;
కోటకొమ్మలమీఁది కోఁతులు కొన్ని
బాహుపంజరముల బంధించి దైత్య
గణములఁ, జతురతాగరిమమ్ము మెఱయ
నటనుండి దూఁకు– న య్యసురలు దమకు
వసుధకు నడుమను బడి కూయి వెట్ట;
రామచంద్రుని కృపారాశిని హరినిఁ
బేరొక్–ని యూర్చుచుఁ బేఱెత్తి మించి
కపులు నిశాటులఁ గసిమసగంగ,
ఝంఝూనిలోద్ధూతజలదమాలికల
వడువున రాక్షసుల్ పఱచిరి దిశల;
కంతట లంకలో హాహారవములు
మి న్నందె; "నక్కటా! మే మిఁక నేమి
సేయుదు? మెవరికిఁ జెప్పుదు? మెందుఁ
జొత్తు? మెయ్యది దిక్కు? శుభములు గడచె–
నున్నది కుడిచి తా నుండక యిట్టి
పాటు లంకకుఁ దెచ్చెఁ బొడు రావణుఁడు;
రాక్షసులకును గాలము సెల్లె" ననుచు
నార్చిరి వెఱగొంది యా బాలవృద్ధ;
మది విని లంకేశుఁ డమిత కోపమున
విస్ఫులింగమ్ములు వెడలఁగఁ గనుల
"రణభూమి వీఁడి యే రక్కసుఁ డైన
వచ్చెన న్వార్త శ్రవణములఁ బడిన
వాని మత్సితకరవాలధారలకు
బలిసేతు; నాదు సర్వస్వమ్ము మెసవి
యఖిలభోగముల నాయట్ల భోగించి
యీ దిన మ్మాహవ మే తెంచి నంత
నోహో పఱతు" రని హుంకరింపంగ
బెదరి లజ్జించి నివ్వెరఁబొంది నిలిచి
ధృతి గాంచి మఱలఁ గ్రోధించి నిశాట
చమువులు, "రణమునఁ జచ్చుఁ వీర
వరులకు శోభ; యవ్వానరగణము
దునుముటయో కాక తూలుటో?" యనుచు
నిశ్చయమ్మునఁ బునర్నిశితాస్త్రపాణు
లగుచు వానరసేన నడరి మధింప
దొరకొన్న వానరుల్ దూలుచు భీతి,
"నంగఁదుఁ డెచ్చట? హా హనుమంత!
కావుము నీలుఁడ! కంటివె ద్వివిద!
పరికింపు నల!" యంచుఁ బఱచి రెందేని.
పావని పశ్చిమద్వారము నొద్ద
నింద్రజిద్దానవు నెదిరించి పోరు
నట్టిడు నిజసైన్య మది తూలు టెఱిఁగి
ద్వార మొక్కింతయు వ్రయ్యలుగామిఁ
గోపభరమ్మునఁ గుప్పించి యెగసి
వప్రమ్ము నెక్కి జవమ్మున నింద్ర
జిద్రథమునుబట్టి చిద్రుపలు సేసి
సారథిఁ జంపి వక్షమ్మునఁ దన్ని

మూర్ఛితుఁ గావించి భో యని యార్వ,
వేఱొక సారథి వేగమ వచ్చి
పడియున్న యింద్రజిద్వీరుఁ గొనిపోయె;
నొక్కరుం డందు వాయుసుతుండు కోట
పై విహరించు ననూర్ధ్వ నాలించి
యరుదెంచె రయమున నంగదుఁ డటకుఁ;
జయ్యన యుద్ధవిశారదు లైన
కపియుగళమ్ము లంకానాథదివ్య
సౌధభాగము గని చారుతద్గరిమ
కాశ్చర్యచిత్తు లై యచ్చటి కరిగి
జయజయ శ్రీరామచంద్ర యటంచుఁ
తద్గురుశోభవిధ్వస్తము సేయ
సమకట్టి, కమ్రకాంచనకలశముల
తోడి ప్రాసాదముల్ ద్రోయుచు నేల
గర్జింపఁ గాంచి లంకాధీశుఁ డడలె;
నచటి సైన్యమ్ము భయాకులితమయి,
"వచ్చె నయ్యయో మున్ను వచ్చిన రెండు
కోతు" లటంచును గుండెలు బాదు
కొనుచుఁ బర్విడిరి దిక్కులువట్టి; యప్ప
డంగదుండు హిరణ్మయస్తంభ మొండు
పెకలించుకొని దాని పెన్గదవోలె
ధరియించి మఱల యుద్ధక్షేత్రమునకు
వచ్చి రక్కసులను వధియింపఁ గడఁగె
నాంజనేయుండు దన్ననుసరింపంగఁ;
గొందఱిఁ గాళ్ళచేఁ గూల్చి, కొందఱినిఁ
జెంపలు వాయించి, చీకొట్టి, "రామ
చంద్రుని నామమ్ము స్మరియింపకున్నఁ
బాపఫల మిమ్ములు పట్టి పీడించు"
నని తలల్ ద్రుంచి లంకాధిపు మ్రోల
దధిభాండములవోలె దబ్బునఁ బడఁగ
విసరఁ దొడంగిరి; వేరు గన్నట్టి
వారు చిక్కిన రామభద్రుని యెదుటఁ
బడవైచు చుండిరి; వారిని రావ
ణానుజుఁ డెఱిఁగింప నందరి కప్పు
డొసఁగె రాముండు సాయుజ్యపదమ్ము;
కరుణాకరుండు లోకైకవంద్యుండు
శరణాగతత్రాణసంరక్షకుండు
వారలు శాత్రవభావమే యగుత
తన్ను స్మరించుట తలపోసి యెడఁదఁ
బరమయోగీంద్రసంభావ్యమౌ పరమ
పద మొసంగె నటన్నఁ బార్వతీ! రాముఁ
డెంత దయాళుఁడో యేమని చెప్ప?
నంగదపవనజు లా రీతిఁ జొచ్చి
మందరద్వయిఘూర్ణమానపాథోధి
మథియించు చందాన మథియించి రిపుల,
నస్తాచలమ్ము సర్వముఁడు సేరంగఁ
దారును రామచంద్రప్రభుపాద
సన్నిధానమునకుఁ జనుదెంచి మ్రొక్క,
వారి రాముండు కృపాదృష్టిఁ గాంచె
నశ్రమమ్మున వారి యలసట దొలఁగ.
హనుమదంగదు లాహావావనిఁ దొలఁగి
చనుట యెఱిఁగి బుజ్జగింపిన్సైన్యములు
చాలించి తారును జనుదెంచుచుండ-
నది ప్రదోష మ్మాట ననుకూల మంచుఁ
గడకఁ గ్రవ్యాదసంఘమ్ములు పొంగి
"జయ దశకంధర! జయము లంకేశ!"
యని వానరులఁ దాకి నంతటఁ, గనలి
ప్లవగమ్ములు గడంగె భండనమ్మునకు
"నిలు నిలు" మంచును "నీ వెంత" యనుచు
"నెం దేఁగె" దనుచు "నోయీ ర" మ్మటంచు
నిరువాగులందున నెసఁగెడు మోహ
లోసరిల్లక సుంత మోటమి నొప్ప
కొనక వెన్జూపక కోపము గ్రమ్మఁ
దగ సమస్కంధులు తాకి యొండొరులఁ

ద్వంద్వయుద్ధమునకుఁ దలపడి నంత
నల్లని రాక్షసుల్ నానాప్రకార
చిత్రవర్ణులు కపిశ్రేష్ఠులు పోరఁ
బ్రావృషేణ్యపయోదపటలమ్ము శార
దికనలాహకములు ధీరతఁ బోరు
కరణిఁ జూపట్టు; రాక్షసచమూనాథు
లప్ప డకంపనుఁ డతికాయుఁ డనెడు
వారు రాక్షసమాయ పన్ని జగమ్ము
నంధకారావృత మగునట్లు సేసి
రక్తమాంసమ్ములు రాళ్ళు వర్షింపఁ,
గన్నులు గానక కపిదళ మ్మంత
కూయిడఁ దొడఁగె నొక్కమ్మడి; దీని
నఖిలమ్ము శ్రీరాముఁ డప్పుడ యెఱిఁగి
హనుమదంగదుల, "మీ రటుపొం" డనంగ
నక్కపికుంజరు లతిరోషభీష
ణాకృతులై, "కపులార! భీతిలకుఁ
డిదె వచ్చితి" మటంచు నేఁగి రయ్యెడకు;
నంత రాఘవుఁడు శరాసన మెక్కు
పెట్టి యాగ్నేయము విడువఁగ జ్ఞాన
భానూదయమ్మున వడి సంశయాంధ
కారమ్ము వాసిన గతి నిరుల్ విరిగె;
భల్లూకవానరవాహిని యట్లు
చీఁకటుల్ దొలఁగినఁ, జెలరేగి భీతి
దక్కి శ్రమ మ్మేది తలపడి భీక
రాట్టహాసమ్ముల నాచరింపంగ
భయమున రాక్షసుల్ పఱవఁ దొడంగి-
రంత వానరులు సురారులవట్టి
నెత్తురుల్ గ్రక్కఁగ నేలకు బాది
ద్రిప్పి గిట్టున జడధిన్ బడవైన,
నక్రోరగాదు లంబఱను భక్షించెఁ;
జచ్చినవారును జానున్నవారు
నై రక్కసులు పారి రంతటఁ బురికి;
వెఱ శత్రుదళములు విరుగుట నెఱిఁగి,
"జయము జయమ్ము కోసలరాజచంద్ర!
యమరేంద్రవినుత! దయాగుణసాంద్ర!"
యను జయధ్వానము లాకసమంటఁ
గపులు రాముని పాదకంజముల్ సేరె;
నశ్రమమ్మున వారి యలసతఁ దొలఁగఁ
గాంచెఁ గృపాదృష్టిఁ గరుణామయుండు.

మాల్యవంతుఁడు రావణునకు హితోపదేశ మొనర్చుట

అచట రావణుఁ డమాత్యావళిఁ బిలిచి,
"యుద్ధమందున మహోద్ధతు లచ్చి;
రక్కసిబలముచే హత మయ్యె మనదు
సేన సగ మ్మిఁక సేయుద మేమి
చెప్పుఁ" డనంగఁ, జెచ్చెర దశగ్రీవు
మాతామహుం డగు మాల్యవంతుండు,
"నాయనా! యొక్కింత నా మాట వినుము.
వై దేహిఁ గైకొని వచ్చినదాది
పల్కం జనని యశుభము లయ్యెఁ బెక్కు;
లాగమవంద్యుఁడు కా రఘూత్తముఁడు
కెదురొడ్డుచో సుఖ మెక్కడి మాట?
యా హిరణ్యాక్షుని నగ్రజుతోఁడఁ
బోకార్చి మధుకైటభులఁ గొట్టి నట్టి
యా కృపాసింధుఁ డిట్లవతార మెత్తెఁ;
గాలస్వరూపుఁడు ఖలవనవహ్ని
సద్గుణమూర్తి విజ్ఞానధనుఁడు
శంకరాజమహేంద్రసంసేవితుండు-
వానితో నీ కిట్టి వైర మేమిటికి?
వై దేహి నొసఁగి యా ప్రభుపదాబ్జములు
సేవింపు" మనఁగ నా శీతలవాక్య
వితతి శూలమ్ములు వీనులఁ జొనిపి
నట్లైనఁ గినిసి లంకాధిపుఁ, "డోరి!

నో రె త్త కిచ్చటినుండి వే పొమ్ము;
వృద్ధుఁడ వగుట వధింపను నిన్ను;
నింక నా కన్నుల నెన్నఁడుఁ బడకు"-
మనుచుఁ దర్జింప నిజాంతరంగమునఁ,
"గరుణానిధానుఁ డక్కంజాక్షుఁ డితని
పై దయమాలినవా"ఁ డని యెంచి
దూషించి మాల్యవంతుండు వై దొలఁగె.
అపు డింద్రజిత్తుఁ డత్యంతకోపమున,

"దిగులొంద నేటికిఁ? దెలవాఁటనిండు
వింతలు సూతురు; వేఱుగా నిట్లు
చెప్పను బెక్కులు సేఁతలు మాని"-
యనవుడుఁ బుత్త్రి వాక్యము లాలకించి
హర్షించి, యతని నత్యంతాదరమునఁ
దన యొడి నిడికొని తగఁ గురుల్ పుడికె;
నింతలో నెట్టి నయ్యెను దూర్పు దిక్కు.

శ్రీరామచరితమానసము

లంకా కాండము

పంచమవిశ్రామము

రక్షోనాయకకర్కశ
వక్షోభూభృద్విభంగవజ్రనఖా! శ్రీ
వక్షఃడింభకరక్షా
దక్షఃశ్రీమట్టపల్లిధామఃనృసింహాఃపునర్యుద్ధప్రారంభము

కపు లంతఁ గోటనల్లడ లాక్రమించి
నంత నాభీలశస్త్రాస్త్రపాణులయి
సింహనాదమ్ములు సెలగంగ బురుజు
లెగఁబాకి రాక్షసు, లెత్తి కోటాన
కోట్లుశైలమ్ములు గూలద్రోయంగ,
నశనులవలెఁ బ్రళయాభ్రగర్జనల
ననుకరించుచు నవి యరుదేరఁ, గపులు
వానిన చేపట్టి వైచిరి మఱలఁ
దుత్తుమురై చావ దుష్టరాక్షసులు;
కోఁతులు మఱల నకోటను ముట్టి
రనువార్త విని రావణాత్మజుఁ డల్గి
భోరన రణభేరి మొరయింపఁజేసి
యంతకాకారుఁడై యరిగి, "యెం దున్న
వారు తాపసులు భువనవంద్యు లస్త్ర
విద్యావిశారదుల్; ద్వివిదుఁ డెందుండె?
నెం దేఁగెరా నీలుఁ? డేఁడీ నలుండు?
బలయుతు లంగదపవనజు ల్లేరె?
చూపుఁ డెచ్చో డాగె సోదరద్రోహి
మా విభీషణుఁ డిక మద మడఁగింతు"–
ననుచు బాణాసన మపు డెక్కు–వెట్టి
సాచి యాకర్ణ మస్త్రములు సంధింప,
నవి *గరుత్మంతమ్ము లగు జిహ్మగముల
గతి నరుదెంచి యక్కపులను దాక,
నాతని కొక్కరుం డనిమొన నెదురు
వడ నోడి భల్లూకవానరప్రతతి
రణచికీర్ష దొలంగి రక్షింపుఁ డనుచు
భయసంభ్రమమ్మునఁ బఱచిరి మేఘు
నాదాస్త్రవితతిఁ బ్రాణావశిష్టులయి.
అంతట శక్రారి యతిరభసమునఁ
బ్రతికపి గాడంగఁ బదిపది శాత
శరము లేసి యదల్చి చావుఁడీ యనుచు
యట్టహాస మొనర్ప, నంతట కీశ
సేనలు ప్రొగ్గుట చింతించి, పవన
తనయుఁడు దానవదళములపాలి
కాలుఁడో యనఁగ భీకరముగ నార్చి
యొకమహాశైలము నొగి పెల్లగించి
మేఘనాదరథమ్మున్మీఁదికి వైవ,
నది గని కడుభీతి నమ్మేఘనాదుఁ
డరదమ్ము సారథి నశ్వచయమ్ము
విడనాడి సురిగె విన్వీథి సమీర

---

* గరుత్మంతములు = రెక్కలుగలవి.

ఇంద్రజిల్లక్ష్మణయుద్ధము

భ్యాధమహోరస్కుఁ డుత్తుంగభుజుఁడు
నరుణలోచనుఁడు హిమాలయుభాతి
నతికమనీయగౌరారుణతనుఁడు
లక్ష్మణుం డంతఁ గేల ధనుశ్శరములు
ధరియించి రామభద్రస్వామిముదలఁ?
గొని యంగదాదులు కొలిచిరా నడచె;
రావణప్రేషితరాక్షసబలము
లస్త్రశస్త్రాద్యనేకాయుధమ్ములను
ధరియించి యాతనిఁ దలపడఁ జనిరి;
వారలు వచ్చుట వనచరుల్ గాంచి
నగనఖముఖ్యనానాయుధప్రతతి
గొని, "జయ జయ నృపకుంజర! రామ
చంద్ర!" యంచును బ్రతిస్పర్ధులఁ దవిలి
విజిగీషులై మహావేశమ్ము నొంది
గ్రుద్దుచుఁ బదములఁ గ్రుమ్ముచుఁ బట్టి
గఱచుచు రక్కుచుఁ గవియుచు, "గొట్టు
కొట్టుఁడు పట్టుఁడు కూల్చుఁడు తలలు
విరువుఁడు హస్తముల్ పెరికివేయుండు
కనుగ్రుడ్లు దీయుఁడు ఖండముల్ సేయుఁ"
డనుచుఁ బెల్లుగ భూనభోఽంతరాళములు
నిండఁగ నార్చుచు నిక్కి ప్రచండ
రుండముల్ పరులపై రువ్వుచుఁ దాఁకి —
రమ్మహాహవ మమ్మతాంధసుల్ సూడ
నతికౌతుకమున వియచ్చరపంక్తి
లెక్కి నభోవీథి నేతెంచి నిలిచి
విస్మయానందముల్ పెనఁగొనఁ గనిరి.
రణభూమి యంతయు రక్తకుండమ్మై
లై ధూళిగప్ప మహాగ్నికుండమ్మై
ధూమావృత మ్మట్లు తోఁ దెంచుచుండెఁ;
గుసుమితకింశుకకోటియో యనఁగ

తనయుఁడు పేరెత్తి తన్ను బిల్చినను
తిరుగ, కాతసిశక్తి తెలియుటకతన–
ఆపయి రాఘవునంతికమ్మునకుఁ
జని వాఁడు కడువెక్కసమ్ములు వలికి
నానావిధాభీలనారాచములను
బరపిన శ్రీరామభద్రుఁడు వాని
నవలీల హరియించె; నంతట మేఘు
నాదుఁడు కినిసి నానావిధదైత్య
మాయలఁ జిన్నజిహ్మగము ఖగేశు
బెదిరింపఁ జనునట్లు విరచింపఁ దొడఁగె –
శంకరబ్రహ్మాదిసకలనిర్జరుల
నిజపృథుమాయ బంధించెడువాని
సన్నిధి వాఁ డాకసమ్మట్లు సేరి
నిప్పుకల్ వర్షించె; నేల యెల్లెడల
జలధార లుప్పొంగెఁ; జంపుఁడు తినుఁడు
పొడువుఁడు కొట్టుఁడు ముంచుఁ డటంచు
శాకినీఢాకినీశక్తులు గుంపు
గట్టి నాట్యముసేయఁ గడఁగె; నల్లడల
రక్తమేదోమాంసరాశులు గురిసె;
నుద్ధత ఝుంఝూమహోగ్రప్రసార
వశమున భూళి దిగ్భాగముల్ గప్పి
కరము సాచుటగూడ కన్పింపనట్టి
చిమ్మచీఁకటి గ్రమ్మి చీకాకువఱచె—
ఈ యాసురీమాయ కెంతయు బెదరి
కపులెల్ల మన కింకఁ గాలముదీరె
నని యార్చుచుండఁగ నదిగాంచి నవ్వి
రామచంద్రుండు నారాచమునేసి
యర్యమోదయమున నంధకారములు
విరిసెడుగతి మాయ విరియించి, ఱుక్కు
వానరసేనఁ గృపాదృష్టిఁ గనినఁ
దొలుతటికన్న నిర్ధూమధామమ్ము
సేసెద మని కపుల్ చెలరేగి చనిరి.

క్షతగాత్రులా వీరసైనికు లొప్పి —

లక్ష్మణమూర్ఛ

రంత, లక్ష్మణుఁడు శత్రుకారియుఁ గోప
వివశులై యొండొరు వీఁకఁ దాఁకుటయు
లక్ష్మణుం డింద్రజిద్రథమును విఱిచి
సారథిఁ జంపి నిశ్శంక ననేక
శస్త్రప్రహారముల్ సల్పి ప్రాణావ
శిష్టు'గావింప' నచ్చెరువును భయము
పిరిగొనఁ బ్రాణముల్ వీడునటంచుఁ
దనహృదయమ్మునఁ దలపోసి, వీర
ఘాతినీశక్తి లక్ష్మణునిపై వేయఁ,
గ్రక్కున వచ్చి వక్షస్థలి నాఁటె
నాటుడు వడి లక్ష్మణస్వామి మూర్ఛ
నొంది ధరాస్థలినొరఁగె — నిర్భీతి
నంతటఁ గదలి శత్రుకారి లక్ష్మణుని
దరిఁ జేరి యతని నెత్తగ సమకట్టె —
నింద్రజిత్సము లెందఱొని యత్నించి —
రయ్యఁ గదల్పలేరైరి వారెల్ల;
విశ్వవిఖ్యాధారు వేదసన్నుతుని
స్వామిశేషాహిని జగతి నెత్తంగ
శక్తుఁ డెవ్వండు? భస్మమ్మొనరించు
నెవ్వనిక్రోధాగ్ని యీ రేడులోక
ములను, నెవ్వని శుచిముఖులు మానవులు
సావరజంగమసర్వలోకమ్ము
సేవించు నాతని శేషావతారు
సంఖ్యమందునఁ గెల్వఁజాలు నెవ్వండు?
శ్రీరామచంద్రుసల్లీల యెఱుంగఁ
దక్కృపలేక సాధ్య మ్మగునొక్కొ-!
అయ్యె సాయంకాల మపుడిరువాగు
బలములు దమతమపట్లకుఁ జేరె.
వ్యాపకుం డజితుఁడు బ్రహ్మలోకేశుఁ
డా దయాసాగరుం డా రామచంద్రుఁ,
"డెక్కడ లక్ష్మణుం డెందుండె" ననినఁ,
బవమానతనయుఁడు వడివడి నేఁగి
కొని తెచ్చె; నతనిఁ గన్గొని రఘునాథుఁ
డంత దుఃఖమహాబ్ధియందున మునిఁగె.

హనుమంతుఁడు సంజీవనికై వెడలుట

అపుడు ఋక్షేశ్వరుఁ డనియె- "నీ లంక
యందునను సుషేణుఁ డను భిషగ్వరుఁడు
గలఁడు; తెచ్చిన వానిఁ గడచు విపత్తు"-
నన విని యపుడు మహా బలసుతుఁడు
స్థూలరూపమ్మునఁ జొచ్చి, యప్పురము,
వానియిల్ పెకలించి వడిఁ గొని తెచ్చె;
శ్రీరామచంద్రుఁ గాంచి సుషేణుఁ డప్డు
పాదకంజములకుఁ బ్రణమిల్లి భక్తి,
నోషధిపేరు నా యోషధి దొరకు
పర్వతమ్మును జెప్పి, "పవమానతనయ!
చని కొని తె" మ్మన సామిారి తనదు
బల ముగ్గడించి యా ప్రభునిపాదములు
హృదయమందున ధరియించి గర్జించి
'యిదె తెత్తు' నని పల్కి యేఁగె వేగమున.

రావణకాలనేముల సంవాదము

ఇక్కథ నచట లంకేశునికడకుఁ
జని దూతయొక్కఁడు సకలమ్ము దెలుపఁ,
దలయూఁచి యాతఁడు తగఁ గాలనేమి
గృహమున కరుదెంచి యిఁక నేమిసేయ
వలయు సర్వముఁ జెప్ప, వాఁడును శిరము
నడ్డమ్ముగా నూఁచి" యయ్యారె మున్ను
మీరు చూచుచునుండ మించి యిప్పురము
తగులఁబెట్టిన వానిదారిగాయంగఁ
జాలుదునే? యింకఁ జాలు నీ తగుల

మక్కటా రాముని యడుగులు గొలిచి
బ్రదుకుటయన సరిపడ దేల నీకు?
ఈ వృథాకల్పన లిక నుజ్జగించి
నీలోత్పలాభుని నీరదవర్ణు
నయనాభిరాముని నాకసేవితుని
హృదయపీఠమునఁ బ్రతిష్ఠింపఁ దగదె?
మమతాభిమానముల్ మాని యజ్ఞాన
సుప్తునిఁ దొలఁగి యీ సుందరాకారు,
స్వప్నమందును గెల్వఁజాలనివానిఁ,
గాలమహోజిహ్మగాశనుఁ గొల్వు"—
మన దశకంఠుఁ డత్యంతము గనలి
వానిఁ దర్జించిన వఁడె గాలనేమి,
"యీతనిచేఁ జావ నేల? యీ రాము
సేవకుచేతఁ జచ్చిన సుఖమ్మొండె"—

కాలనేమివధ

నని తలపోసి నిజాంతరంగమునఁ
జని యాంజనేయుఁడు సనుదెంచుత్రోవ
నొక్కతటాకమునొడ్డున వనము,
దాన నొక్కండు సుందరభవనమ్ము,
నిజమాయచేత వినిర్మించి యెదురు
సూచుచుండఁగ దాని, జూచి సామీరి,
"యిది శుభాశ్రమము నా యెద కింపునించు
నలసట తీరఁగ నాతని నడిగి
జలములఁ ద్రావి యశ్రమమునఁ జనెద"—
నని వాని డాయంగ నరిగిన, సరసి
తటమునఁ గల మాయతపసి, మాయాధి
నాథుఁడౌ శ్రీరఘునాథునిదూత
కడ మాయఁ బచరింపఁగా నుద్యమించె.
ఆంజనేయుఁడు మునియని వాని నెంచి
తలవంచి మ్రొక్క, న త్తపసి శ్రీరామ
చంద్రునిగుణరాశి సన్నుతిసేసి,

"రామరావణుల ఘోరాజిలో రామ
చంద్రుఁడు గెలుచు సంశయ మందు లేదు;
జ్ఞానదృష్టిబలమ్మునకతన నిచ్చోట
నిలిచి సమస్తము నేఁ గనుచుంటి"
నన విని పావని యపుడు పిపాస
వాయఁగ నీరముల్ వాంఛింప, దైత్యుఁ
డ క్కమండలుజల మందించె, నప్పు
డవియెల్ల ద్రావి మహాబలాత్మజుఁడు,
"చాల" వనంగఁ బిసాళిపలాశి
యీ సరోవరమునయందు మజ్జనము
గావించి రమ్ము, దీక్షనొకంతు నిత్తుఁ;
దద్బలమ్మున నౌషధమ్ముల నీవు
గుర్తింపఁగల" వన గొబ్బున హనుమ
చని సరమ్మున నిజచరణ ముంచుటయు
నొక మహామకరి తా నొడిసిపట్టుకొ నె-
పావని దానిని వధియించి నంత
నదియును దివ్యదేహముదాల్చి వ్యోమ
యానమారోహించి, "యయ్య! నే నొక్క
యప్సరోంగనను; మహాత్ముని నిన్ను
గనుట నా పాపముల్ గడచె; ము న్నొక్క
ఋషి. యొసఁగినశాప మింతటఁ దీరె;
స్వామి! నా సత్యవచనములు వినుఁడు;
వంచింపఁగా నిన్ను వచ్చినయట్టి
మ్రుక్కడిరాకాసి, మునిగాఁడు; వీని
మాయఁ జిక్కకు" మని మఱిమఱి చెప్పి
యభ్రపథమ్మున నరిగె నిజేచ్ఛ.
అంతట హనుమానుఁ డల్లనఁ గాల
నేమిని డగ్గరి, నీ దీక్ష వచ్చె
గురుదక్షిణనుమును గొను టుచితమ్మ్ము
స్వీకరింపుఁ డటంచుఁ, "జెచ్చెర వాని
శీర్షము తనతోఁకచేఁ జుట్టి యెత్తి
నుగ్గునుగ్గుగ మోది నురిమినఁ, బూర్వ

కాయమ్ముఁ గొని వాఁడు, "కారుణ్యజలధి!
శ్రీరామ! నన్ను రక్షింపు" మటంచు
నసువులు దొరఁగె నయ్యా! పక్షిరాజ!

భరతశరాహతిచే హనుమంతుఁడు మూర్ఛిలుట

తదుపరి యంజనా తనయుఁడు వేగ
నటుబోసి యేఁగి యత్యంతహర్ష మున,
నచలమ్ము గనుఁగొని యందు నోషధుల
గుర్తింపలేక యొక్కమ్మడి దానిఁ
బెకలించి భుజముపై వేగమ పూని
రాత్రికిరాత్రి యభ్రపథమ్ము వట్టి
యతిజవమ్మున నయోధ్యానగరమ్ము
మీఁదుగాఁ బరవ, న మ్మేటినిఁ గాంచి,
యెవ్వఁడో రాక్షసుఁ డేఁగెడు ననుచుఁ
దలపోసి భరతుఁడు ధను వెక్కుపెట్టి
శరము సంధించినఁ, జని యది పవన
తనయువక్షస్థలిఁ దాకె— "శ్రీరామ!
జానకీనాథ! కౌసల్యాసుపుత్ర!"
యని పల్కు మూర్ఛితుఁడయ్యె నాతండు.

హనుమద్భరత సంవాదము

పావనిసుమధురవాక్యముల్ శ్రవణ
సుఖదముల్ గాగ నచ్చోటికిఁ బరచి
భరతుఁ డాతనిఁ దేర్చ బహుతరయత్న
ములుసల్పి నిష్ఫలమ్ములుగాగ దుఃఖ
వివశుఁడై గన్నుల వెస నశ్రు లొలుక,
"నయ్యయ్యో! నన్ను రామావనీపతికి
దూరగుఁ జేసిన ధూర్తవిధాత
కుదకు నీ దారుణదుఃఖమ్ము దెచ్చె;
భువి మనోవాక్కాయముల రామచంద్ర
పాదాబ్జములు గొల్చువాఁడనయేని
రాముఁడే నాకు సర్వస్వమౌనేని
కపికుంజరా! లెమ్ము కష్టపా టుడుగు"—
మనిన నా వాక్యము లాలించి, "కోస
లాధీశ! జయము! దయాకర! జయము!
జయ" మని పొగడుచు సామీరి లేచె—
లేచిన హనుమ నాలింగితుఁజేసి
పులకితుఁడగుచు సమ్మోదాశ్రుధార
జడిగొన రఘుకులస్వామి స్మరించి
హృదయ ముప్పొంగ, "నోయీ మహాభాగ!
జానకీలక్ష్మణసహితుఁడౌ రామ
భద్రుఁడు నేమమే! పలుకఁగదయ్య!"
యన విని కడుసంగ్రహమ్ముగ సకల
కథ వినిపించె న క్కపికుంజరుండు;
భరతుఁడు దుఃఖసంభరితాంతరంగుఁ
డై "పుట్టి తెందుల కక్కటా! నేను?—
జగతికి భారమై స్వామికార్యముల
కొక్కదానికిఁగాని యుపయోగపడక"—
యని యా విపత్సమయమ్ము గుర్తించి
యెట్టకేలకు ధృతహృదయుఁడై, "తండ్రి!
చనునప్పటికినీవు, జాగగు నేమొ;
సూర్యోదయమైన సుడియును గార్య;
మచలసనాథత నస్మచ్చరమ్ము
నెక్కు కూర్చున్న నే నేసెద దాని
నొకతృటిలో రామునొద్దకుఁ జనెద"—
వను మాట లాలించి యభిమానధనుఁడు
పావని, యింతటిభారము పూని
యే రీతి నీ యస్త్ర మేఁగఁజాలు నని
తలఁచి యా భరతుపాదములకు ప్రమొక్కి,
"నాథ! నే శ్రీరఘునాథపాదమ్ము
లెడదయందు ధరించి యేఁగెద, జాగు
సేయక నా కిఁక సెల" వని పలికి
ముదలఁ గైకొని కడుముదితాత్ముఁడగుచు

భరతునిశీలము బలము గుణమ్ము
రామునిపై ననుర క్తియు, భ క్తి
వివశుఁడై పొగడుచు వేవేగఁ జనియె.

శ్రీరామునివిచారము

అచట రాముండు మాయామనుష్యుండు
మనుజ భావమున లక్ష్మణుఁడెసఁ గాంచి,
"యర్ధరాత్రమ్మయ్యె న క్కపి యింక
రాఁడేమి?" యని పల్క లక్ష్మణు నెత్తి
యురమున గదియించి, "యో హొ మా కుమార!
మృదులస్వభావ! నీ వెప్పుడు నాదు
దుఃఖమ్ము చూచిన దుఃఖించువాఁడ;
వక్కటా! నా కొఱకై గాదె నీవు
తలిదండ్రులను సమ స్తమ్మును విడిచి
శీతవాతాతపక్లేశ సహించి
కానల నిడుములఁ గాంచితి; విప్పు
డా యనురాగ మెం దడఁగె నో యన్న!
ఇట్లు నే దుఃఖింప నేమియు నెఱుఁగ
నట్లు నిద్రించుట న్యాయమే? నాకు
నడవుల కేఁగిన ననుజన్మవిహ
మేర్పడు ననుమాట యెఱిఁగియే యున్నఁ,
*దండ్రి! నేఁ దప్పక తండ్రిమాటలను
ధిక్కరించియె యుండుఁ దెగువయొనర్చి;
అటుగాక నే దాని నస్తుంకరింతు
నేని యీ వచనమునేని కాదనెడి
వాఁడ; సతీసుత బాంధవభవన
పరివారధనములు వసుధ రావచ్చుఁ
బోవచ్చుఁగాక! నిన్బోలు సోదరుఁడు
మఱల లభించునే మాన్యచరిత్ర!
పక్షముల్ పోయిన పక్షివిధాన
రత్నమ్ము దొరగు సర్పమ్ముచందమ్మున
నీవు న న్వీడిచనిన బ్రదుకేల!
బ్రదికింప దైవము వట్టి జడుండు;
దారకునై సహోదరుని గోల్పోయి
యే నయోధ్యను మొగ మెట్లు చూపింతు?
భార్యావియోగ మేపాటిది తలఁప?
నీ యపయశము నే నెట్లు సైరింతుఁ?
దండ్రి! నాక్రూరహృదయ మపయశము
త్వద్వియోగమ్ము నిత్తఱి సహియించు!
♦ఏకైకపుత్రుఁడ వింక మాయమ్మ
నీయందుఁ బ్రాణముల్ నిలిపి జీవించు;
హితకరుం డనుచు న న్నెంచి సుమిత్ర
యన్న! ని న్నపుడు నా కప్పగించినది;
ఇట నిన్ను విడచి, "యేఁడీ రామ నీదు
గారాబుతమ్ముఁడు కన్పింపఁ" డనిన
"నామె కేమని బదులయ్య! యీవలయుఁ?
నక్కటా లేచి న న్ననునయింపఁగ దె!"
యని దుఃఖమోచకుం డగురఘునేత

---

* రాముఁడు తండ్రిమాటలను ధిక్కరింతునని యెట్లుచెప్పెను? "రథ చఢాయ దిఖరాయవన ఫిరహు గయేదిన చారి" అన్నాఁడు గదాయని ప్రశ్నించుకొని పెక్కు వాదోపవాదములు సేసి పెద్దలు కొందఱు శ్రీరాముఁడు "లోక సంగ్రహణంబులోనఁ దలఁచి (1540) యన్నమాటలని చెప్పిరి. అనఁగా రాముఁడిట్టి బుద్ధులా లోకమునకు నేర్పు నని ప్రతిపక్షులు ప్రశ్నించిరి. ఇవి "మనుజ భావమున" నన్నమాటలు (1500), సాధారణ మానవుని యట్లు తోపిం పఁజేయుటకు రాముఁ డారీతిఁ బల్కెనని సమాధాన మొసఁగిరి.

♦ తులసీదాసులవారు లక్ష్మణుని నేకపుత్రుఁడని యెట్లు చెప్పిరి? శత్రుఘ్నుఁడు సైతము సుమిత్రాసుతుఁడు కాఁడా? యని ప్రశ్నించుకొని నాగరీ ప్రచారణీ వ్యాఖ్యాతలు ఏకశబ్దమునకు శ్రేష్ఠమని 'ఏకం ప్రశస్తం శ్రేష్ఠంస్యా' త్తని నిఘంటువు చూపిరి.

యద్వితీయుఁ డఖండుఁ డాగమనుతుఁడు
లోకసంగ్రహణము లోన దలంచి
రాజీవలోచనరాజి నశ్రువులు
జడిగొన దుఃఖింపసాగె నా రీతి"
రామునికరుణావిలాపముల్ కీశ
కుంజరుల్ వినుచు వ్యాకులచిత్తులైరి.

హనుమంతుఁడు సంజీవని దెచ్చుట
లక్ష్మణుఁడు మూర్ఛదేరుట

హనుమ యల్లంతలో నరుదెంచెఁ గరుణ
రసమునందున వీరరసముచందమున;

పరమకృతజ్ఞతాభావమ్ము గదుర
రామభద్రుఁడు కపిరాజున కెదురు
సని యక్కునఁ గదించి సన్నుతుల్ సలిపె;
అంత భిషగ్వరుయత్నమ్మునలన
లక్ష్మణస్వామి మూర్ఛను దేరి నిలిచె;
అపుడు రాఘవుఁడు మహాహర్ష మొప్ప
లేచి యాతనిఁ గౌగిలించి శిరమ్ము
హర్షాశ్రుజలప్రవాహమ్మునఁ దడిపె;
భల్లూకవానరప్రతతు లుప్పొంగె;
ఎట్లు తెచ్చెను మునుపేఁగి, యా రీతిఁ
బురము సేర్చెను వాయుపుత్త్రుఁడు వైద్య.

శ్రీరామచరితమానసము

లంకా కాండము

షష్ఠవిశ్రామము

ఇంద్రప్రార్థిత! శ్రీమదు
పేంద్రా! బలిగర్వభంగ! విశ్రుతకరుణా
సాంద్రా! వామన! రఘుకుల
చంద్రా! శ్రీమట్టపల్లిసదన! నృసింహా!

రావణుఁడు కుంభకర్ణుని నిద్రలేపుట
కుంభకర్ణుని హితోపదేశము

ఆ వార్త నాలించి యతిదుఃఖివివశుఁ
డై నిశాచరపతి యతిదారుణముగఁ
దల బాదికొని యేడ్చి తమ్ముఁడౌకుంభ
కర్ణునిదరి జేరి గహనయత్నములఁ,
గాలిమదేహము గాంచెనో యనఁగ
శోభిల్లువానిఁ బ్రసుప్త మేలొక్కలుప,
వాఁడు మేల్కని యన్నవదనము గాంచి,
"అన్న! యే మిది భవదాస్యము శోభ
తరిగియుండె" ననంగ దశకంధరుండు
భూపుత్రిఁ దెచ్చుట మొదలుగా సకల
వృత్తాంత మంతట వినిపించి, "యోయి
తమ్ముఁడా! వానరదళములుపెక్కు
పలలాదగణములఁ బట్టి వధించె;
యోధ్దలఁ బల్వార నుక్కడగించె;
దుర్ముఖాకంపననరాంతకాదిముఖ్య
లమ్మహోదరముఖ్య లందఱు చచ్చి"-
రన విని ఘటకర్ణుఁ డతిక్రుద్ధుఁడగుచు,
"నక్కటా! దుష్ట! నీ వా జగన్మాతఁ
గొనితెచ్చి శుభములు గోరుచున్నావె?
ఇది లెస్సగాదు న న్నిపుడు మేల్కొలిపి
నందున లాభ మెయ్యది నీకు వచ్చు?
నిప్పుడైన గర్వము నీ వుజ్జగించి
రాము సేవింపఁ గల్యాణమ్ము గలదు.
ఆంజనేయాదిమహాబలు లెవని
పనుపు సేయుచునుండ్రు వాఁడు మానవుఁడె?
ఇది మున్నె నీవు నా కేటికిఁ జెప్ప
వేల వంచించితి? వీశ్వరద్రుహిణ
ప్రముఖామరేశ్వుని పరమునితోడ
ఖలభావ మేటికిఁ? గలహాశనుండు
నాకు ము న్నొనఁగిన జ్ఞానోపదేశ
మీఁదలఁచెదఁ గాని యిది తఱిగాదు;
హత్తుకొ మ్మోయన్న! యక్కున నన్ను;
శ్యామాంగు సరసీరుహాక్షుఁ దాపత్ర
యాపహారకుఁ గని యక్షీద్వయమ్ము
సఫలమ్ముఁ గావింపఁ జనియెద" నంచుఁ
గన్నులు మూసె నొక్కక్షణమ్ము; దైత్య
కుంజరుం డాలోనఁ గోటికుంభములు
మదిరయు మదిసినమహిషముల్ పెక్కు
దెప్పింప నవియెల్ల దిని, కల్లు ద్రావి,
కులిశపాతమ్మట్లు క్రుద్ధుఁడై యార్చి
దుర్గమ్ము విడి యుద్ధతుండయి సైన్య
మేమియుఁ గొనక తా నేఁగె నొక్కరుఁడ.

విభీషణకుంభకర్ణసంవాదము

కుంభకర్ణునిరాక గు ర్తించి యెదురు
వోయి తమ్ముఁడు పాదముల వ్రాలి, తనదు
పేరు సెప్పిన, న వ్విభీషణు నెత్తిఁగి
పరిరంభణముసేసి ప్రభుపాదభ క్తుఁ
డగుటకు మనమున హ ర్షించె మిగుల;
అపుడు విభీషణుఁ, "డన్నా! హితమ్ము
వలికిన నన్ను రావణుఁడు గా లె త్తి
తన్నె; నా గ్లాని నెదన్ దలపోసి
రామచంద్రునిపాదరాజీవయుగళి
నాశ్రయించితి; దీనుఁ డగుననన్నుఁ జూచి
స్వీకరించెను గడుప్రేమ శ్రీరాముఁ"-
డనఁ గుంభకర్ణుఁ, "డో యన్న! రావణుఁడు
కాలవశుండు; సఖ్యమ్మునఁ జెప్పు
హితములు వినునె? యోయీ ! ధన్యతముఁడ;
వసురవంశమ్మున కాభరణమవు;
సుఖసాగరుని గొల్చి సోదరాన్వయము
వెలుఁగఁ జేసితి; రఘువీరు భజింపుఁ
ద్రికరణశుద్ధిగా దేవసన్నుతుని;
ఇఁక బొమ్ము తమ్ముడా! యేఁ గాలవశుఁడ;
స్వపరభేద మ్మిఁక స్మరియింపనోప"-
కుంభకర్ణుఁడు యుద్ధమొనర్చి నిహతుఁ డై
మోక్షమునొందుట

అనిన విభీషణుఁ డంతఁ ధై ర్యలోక్య
భూషణుం డున్న తావున కేఁగి, "నాథ!
భూధరా కారుండు భూరిబలుండు
కదనధీరుఁడు కుంభకర్ణుఁ డల్లదిగొ
వచ్చుచుండె" నటంచు వాక్రుచ్చె; నపుడు
కపులు రోషమున వృక్షములు శైలములు
పెకలించి వానిపై విసరిన, మ త్త
గజనాథు జిల్లేడుకాయలు దెచ్చి
కొట్టుచందము దోపఁ, గుంభకర్ణుండు
వాని నొక్కిం తయుఁ బరికింపఁడయ్యె;
అంతఁ గ్రుద్ధుండయి హనుమయు ముష్టిఁ
బొడిచిన వికలుఁ డై భూమినిఁ ద్రెళ్ళి
పదఁపడి లేచి, యప్పావనిం గొ ట్టె-
జర్జరితుండయి జగతిఁ బడంగఁ;
గడుఁగొని యక్కుం భకర్ణుఁడు నలుని
నీలునిఁ జావఁగ నేలకు మోది
మందర మ్మబ్ధిని మథియించుపోల్కి-
వానర యోధుల వరుసగఁ జంప,
భయపడి తక్కి నవానరుల్ పఱచి;
రంగదజాంబవదాదుల మూర్ఛ
ముంచి సుగ్రీవు సమ్మూర్ఛితు నె త్తి
కొని లంక కేఁగె న క్కుం భకర్ణుండు;
సామీరి యంత మూర్ఛను దేరి కీశ
నాథుని నన్వేషణముసేయఁ గడఁగె;
శవముగాఁ దలపోసి చంకనుఁ బెట్టి
కుంభకర్ణుఁడు దన్ను గొనిపోవుచుండఁ
ద్రోవను దెలివొంది దుసుకున జారి,
కపికులతిలకుఁడు, ఘటకర్ణముక్కు-
సెవులును గఱచి చెచ్చెర మింటి కెగయఁ
గనుఁగొని యక్కుం భకర్ణుడు వానిఁ
బట్టి నేలకుఁ గొట్ట వడి లేచి వాఁడు
కుంభకర్ణుని గ్రుద్ది కూల్చి, శ్రీరామ
చరణసన్నిధిఁ జేరి, "జయజయ' రామ
చంద్ర" యటంచు నుత్సాహియై పలికెఁ;
గుంభకర్ణుండు ముక్కుం జెవుల్ వో వ
బెగడి యచ్చటినుండి వెన్కకు మఱలి
చనుదేరఁ గని వనేచరచమూపతులు
భీతిల్లి మొదట, నా పిమ్మట ధై ర్య
వంతులై, "జయ రఘువంశశశాంక!
జయ గుణసాంద్ర! కౌసల్యాకుమార!"

యని జయధ్వానమ్ము లప్పుడు సేసి,
సానుమద్గణము వృక్షచయమ్ము దెచ్చి
వై చిరి; క్రుద్ధుఁడై వాని లెక్కిడక
రూపముగొన్న కాలుఁడో యనఁ గదలి
కోటికోటిప వంగకుంజరపతుల
గులకరాల్ పర్వతగుహాఁ బేర్చుకరణిఁ
బట్టి మ్రింగఁదొడంగె; బదఁపడి కోటి
కపుల దేహమునకుఁ గ్రక్కున రాచెఁ
గరములరెండిటఁ; గపులొక్కకోటిఁ
జేపట్టి నులిమి చెచ్చెరఁ బడవైచె;
భక్షితవానరభల్లూకపతులు
గుంపులుగట్టి ముక్కునఁ జెవులందు
వెలువడి వచ్చిరి పెక్కసపడక;
దర్పితుఁడయి మనోద్ధతుఁడయి విశ్వ
విశ్వమ్ము నిఁక దినివేయునోఁ నేఁడు
నాగ దైత్యుండు రణక్షేత్రమందు
విహరించుచుండఁగ వెఱదూలి కపులు
తిరిగి కన్గొనకయ దిక్కులువట్టి
పిలిచినఁ బలుకక వీక్షింపఁ గానఁ
బడక పార, నరాదభటు లది యెఱిఁగి
కపులు దూలి రటంచుఁ గడు సంతసించి
క్రమ్మరవచ్చి విక్రమములుసూపఁ
దొడఁగినఁ, దనసేన తూలుట శత్రు
వాహిను లుప్పొంగివచ్చుట రామ
చంద్రుం డెఱిఁగి, "లక్ష్మణ! విభీషణుఁడ!
సుగ్రీవ! మీ రేఁగి సురిగినసేన
భీతివాపుఁడు, వచ్చు వీనిబలమ్ము
నీ సైన్యములు చూతు నేనని పలికి
శార్ఙ్గముదాల్చి హస్తమ్మునం, గటిని
దరకసమ్ము ధరించి, దైత్యసంఘముల
నురుమాడఁ దలఁచి మున్నగ నారివట్టి
ఘోరంటకృతిసేయఁ గ్రూరనిశాట
చయములు భీతిల్లె; సత్యసంధుండు
శరమునసంధించి లక్ష్యమునూచి వైవ
సగరుద్ధ్వజిహ్వాముచందాన నెల్ల
గడలఁ దా నగుచు రాక్షసమస్తకములఁ
గొందఱి జంఘలఁ గొందఱికేలు
గొందఱి భుజములఁ గొందఱి తొడల
నురుమాడి యొకొకని నూరుచీలికలు
గావించె; రక్కసుల్ ఖండితులయి గుజ్జు
గుజ్జయి నేలపైఁ గూలియు మఱల
సంగరమ్మునకు నుత్సాహమ్ము సెడరు;
పట్టుఁడు కొట్టుఁడు వధియింపుఁ డనుచు
మొఱయుచు నూఱక మొండెములేని
చండరుండమ్ములు చనుచుండె దిశల;
రాముని దివ్యశరమ్ము లీ రీతి
వికట నిశాచరవితతుల క్రొవ్వు
ద్రుళ్ళించి చొచ్చెను దూణీరమందు;
క్షణకాలమందు రాక్షససేన నిట్లు
రామావనీంద్రుఁడు ప్రమదించు నెఱిఁగి
కుంభకర్ణుఁడు మహాక్రుద్ధుఁడై సింహ
నాదమ్ము గావించి నగములు వెఱికి
వానరయోధులపై వైవఁదొడఁగె;
వానినిఁ గని రామభద్రుఁడు తనదు
ధను వెక్కువెట్టి శాతశరాళి వైవ
మేఘమాలికలలో మెఱపులపోల్కి
నవి వాని దేహమునందున దూసి
కొనిపోవుచుండె; నా క్రూరదానవుని
ఘనదేహశైలనిర్గతములై పెక్కు
గైరికనిర్ఝరప్రమములై రక్త
ధారలు గ్రమ్మ నాతండు చిక్కి నని
భల్లూకవానరప్రతతులు దైత్య
కడకుఁ బర్విడె; వానిఁ గని కుంభకర్ణుఁ

*డదవీయసులఁ బట్టి యట్టహాసమ్ము
సలుపుచు మత్తగజమ్మ్రుచందమున
బిట్టు వానిని నేలఁబెట్టియు రాచి,
"జయజయరావణ! జయములంకేశ!"
యని యార్వ తోడేలు నల్లంతఁ గాంచి
పరువిడు గొట్రెలభాతి వానరులు
బేయని యార్చుచు భీతిల్లి, "యకట!
కపికులదేశమ్ము గ్రమ్మెడు నిదిగొ
రాక్షసుఁ డను నకాలమ్ము; శ్రీరామ!
ప్రణతార్తిహరణ! యాపద్బంధు! దుష్ట
హరణ! దయానిధీ! హా! రామచంద్ర!
పాహిపాహి" యటంచుఁ బఱచిరి; వానిఁ
గరుణాన్వితములు వాక్యము లాలకించి
శరశరాసనములు సంధించి తనదు
సేన వెనక్కునెట్టి శ్రీరామచంద్రుఁ
డపుడు సేనాముఖమందున నిలిచి
యాశ్రవణమ్ముగ నల్లియ లాగి
యస్త్రమ్మునేయ నయ్యది దైత్యమేన
గాడిపారెను; దానిఁ గని యల్లి వాఁడు
శైలమ్ము లూటాడ జగతి కంపింపఁ
దోయధుల్ ఘూర్ణిల్లఁ దూఁగ నభమ్ము
పఱచి యొక్కఁడుమహాపర్వత మెత్తెఁ;
దోడనె రాముండు దునిమెను గరము,
వామహస్తమున నా పర్వతమ్ముఁ గొని
వాఁ డరుదేర నా బాహువుగూడ
రామచంద్రుండు ధరణిఁ ద్రెళ్ళనేసె;
నిజపక్షములు వోయి నిలిచిన మంద
రాగమ్ముపోలిక హస్తద్వయమ్ము
హరియింప నొప్పి, క్రోధారుణితాక్షుఁ
డగుచుఁ ద్రైలోక్యము నప్పుడ ఱింగు
వానిపోలిక రామభద్రునిఁ గాంచి
హుంకార మొనరించి యుగ్రుఁడై యాస్య
కుహరమ్మువిప్పి గగ్గోలుగాఁ బరవ,
నభ్రవీథిని వింత నారయుచున్న
నాకగంధర్వకిన్నరసిద్ధగణము
భీతిచేతస్కమై బెగడొంది బెదరి
హాహారవమ్ముల నాచరింపంగఁ,
గరుణామయుండు నాకౌకసుల్ బెదరి
యార్చు టెఱిఁగి వారియడ లుడుపంగ
శ్రవణపర్యంతము సారించి మార్వి
శరపరంపరలను సంధించి వాని
వదనమ్ము నింపిన వసుధను బడక
కాలరూపము తరకసము సజీవ
మై యెత్తివచ్చెనో యన నెత్తివచ్చె;
అంతటఁ గుపితుఁడై యా రాఘవుండు
తీక్ష్ణశుగమ్ము సంధించి తదీయ
మస్తకమ్మును ద్రుంచి ఱ్రుందించె వాని;
ఆ మస్తకమ్ము లంకాధిపుఱ్రోల
ఱ్రాలిన నిజశిరోరత్నము గోలు
పోయిన సర్పమువోలిక నతఁడు
కడువిచారించె; నిక్కడ కుంభకర్ణ
చండముండము సర్వజగతి గ్రక్కదలఁ
బరువిడుచున్న నా ప్రభుఁ డదిగాంచి
ఖండించె వడి రెండుగా, నవి రెండు
కొండలవిధమునఁ గూలిన, వాని
క్రింద నెన్నేనియుఁ గీశభల్లూక
వితతులు పడి పిండిపిండియైపోయె;
ఆ కుంభకర్ణ మహాదేహనిర్గ
తమ్మయి కని విబుధాళి యచ్చెరువు
నొంద మహాతేజమొక్కఁడు వెడలి

---

* అదవీయసులు=దగ్గఱివారు

రామచంద్రునిముఖరాజీవమందు
నల్లనల్లన లీనమయ్యెను; దేవ
దుందుభుల్ మ్రోసెను దూర్యముల్ సెలఁగె
సుమవృష్టిగురిసె సంస్తుతిసేసి రామ
చంద్రుని సుమనసుల్ చనిరి నిజేచ్ఛ;
అప్పు డచ్చోటికి నరుదెంచి యమర
మాని వీరరససంభరితమ్మైలైన
హరిగుణగణము లత్యంతము పొగడి,
"దుష్టుల వేగమ ద్రుంచగదయ్య!"
యని హెచ్చరించి తా నరిగె నెందేని;
అతులబలుఁడు కోసలాధీశుఁడు హరి
ఘర్మయుతాస్యుండు కంజలోచనుఁడు
శోణితబిందుసంశోభితనీల
దేహుఁడు నిజభుజధృతశరాసనుఁడు
భల్లూకవానరప్రతతులు నాల్గు
దెసల వేష్టించి స్తుతింపఁగ యుద్ధ
రంగమ్మునందున రామచంద్రుండు
వేంచేసియున్నట్టి విధ మురుశోభ
వర్ణింప శేషాహివశమునుగాదు.
దుర్గుణఖనులును దుర్మతుల్ నీచు
లగు దైత్యులకుఁ దుదీయ మ్మిచ్చినట్టి
శ్రీరామచంద్రుభజింపనివాఁడు
మందబుద్ధియగాక మఱి యెవ్వఁడగును?

శ్రీరామచరితమానసము

లంకా కాండము

సప్తమవిశ్రామము

క్షత్రియగర్వక్షయకరః
శ్రోత్రియహిత! పరశురామ! సురవరదా! లో
కత్రయకీర్తిత! హరిః తా
పత్రయహర! మట్టపల్లివాస! నృసింహా!

మేఘనాదునియుద్ధము శ్రీరాముఁడు
లీలార్థము నాగపాశబద్ధుఁడగుట

ఖరకరుం డస్తనగమ్మును జేర
సంగ్రామ మంతటఁ జాలించి సకల
దళములు సనియె స్కంధావారములకు;
ఆ దిన మాహవమం దతివేల
మగు పరిశ్రమకులోనైన యోద్ధలను
బుక్కుగోలాంగూలవితతిని బలము
పైకొని శ్రీరామభద్రునికరుణ-
తృణముఁబైకొనిన వహ్నిని బురుడించి.
అట నాఁటనాఁటఁ బలాదవాహినులు
గతబలమ్ములయి బెగ్గడిలంగఁదొడఁగె-
నాత్మసంస్తుతిపరాయణపుణ్యమట్లు.
అంత రావణుఁడు నిజానుజశిరము
వక్షస్థలము సేర్చి ప్రలపింపఁదొడఁగె;
నానావిధమ్ముల నాతులు వాని
బలము తేజము పెక్కు-భంగుల నొడివి
వక్షఃప్రదేశముల్ వడి మోదుకొనుచు
నార్వఁదొడంగి- ర య్యవసరమందు
శక్రారి యచటకుఁ జనుదెంచి పెక్కు-
గతుల రావణునిదుఃఖము వోవఁ బలికి,
"యస్మద్బలాధిక్య మయ్య! నేఁ బొగడి
కొననేల రేపు కన్గొనెదరుగాక;
యిష్టదైవము భజియించి నే నొక్క-
దివ్యరథమ్మును దెచ్చితి; దాని
నెవరికిఁ జూపలే దిప్పటిదాఁకఁ;
దత్సహాయమున నుదయ మేను గపులఁ
జీకాకువఱిచెదఁ జింతిలనేల?"
యని పట్టువఱిచెడునాలోనఁ బూర్వ
శైల మారోహించెఁ జండగభస్తి.
కపివరుల్ మఱల లంకాపురి చుట్టు
ముట్టిన, దానవుల్ పొడిచిరి వారి;
తుములయుద్ధమ్మునఁ దుమురయి పడిరి-
యిరుపక్షములయోధులెల్ల - నా యుద్ధ
మెవ్వఁడు పొగడ ఖగేంద్ర! శక్తుండు?
అంతట స్వీయమాయారథ మ్మెక్కి-
మేఘనాదుండు, కంపింపఁగాఁ గీశ
గణము, వియన్మార్గతుఁడయి యట్ట
హాస మ్మొనర్చి మహారభసమునఁ
బరిఘముద్గరగదాపట్టిసశూల
భిండివాలత్రిశూలభీషణఖడ్గ
కరవాలతోమరగండోపలాదు
లస్త్రశస్త్రమ్ముల నమ్మఘన్ గురియు
మేఘమ్మ్రుచందాన మేకొని గురిసె;
పట్టుఁడు కొట్టుఁడు వధియింపుఁ డనెడు

భీకరారావముల్ వీనులు ప్రిదుల
నే తెంచుఁ, గాని తా నెందున్నవాఁడొ
శస్త్రప్రయోక్త యెచ్చటఁ గానరాఁడు;
శైలముల్ తరులు హస్తముల బూని
యక్కీశపతులు విహాయసమెల్లఁ
గ్రుమ్మరి యెందును గొల్తెదువానిఁ
గానక దీనముఖముల వచ్చి;
రా శక్రవైరి నిజాసురీమాయ
మార్గములను దుర్గమమ్ము లొనర్చి
పర్వతగుహలెల్ల బౌణమయమ్ము
గావించె; నిఁక నెక్కడబోదు మనుచు
వ్యాకులచిత్తులై వనచరు లింద్ర
బంధితమందరపర్వతమట్లు
సుడివడి; ర వ్వాయుసుతనలనీల
ద్వివిదాంగదాదులు తెలివిగోల్పడిరి;
లక్ష్మణసుగ్రీవరావణానుజులు
శరహతికతన జర్జరితులై పడిరి;
పదపడి సుత్రామవైరి రాఘవుని
దరిఁజేరి నారాచతతులను గురిసె;
నవియు నాగములయి యాతనిఁ జుట్టె;
స్వవశుఁ డనంతుఁడు స్వామి ఖరారి
బద్ధుఁడయ్యెను నాగపాశమ్ములవలన-
అమ్మహానటులీల లవి యవర్ణ్యము-
లాహవశోభకునై రామచంద్రుఁ
డట్లు బంధితుఁడైన నడలిరి సురలు.
ఎవనినామము పార్వతీ! జపింపంగ
భవబంధముక్తి యేర్పడు నట్టి దేవ
దేవుం డజితుఁడు బంధితుఁ డగునొక్కొ?
అంత నింద్రారి యాహవభూమిఁ జొచ్చి
వానరసేన నవారితశక్తి
వ్యాకులితముసేసి వరుస దుర్భాష
లాడిన ముష్కేశుఁ డలిగి యదల్చెఁ;
గోపించి శక్రారి, "కూళ! వృద్ధుఁడవు
గా నెంచి వదలితిఁగాక నీ వెంత?
బెదరింతు" వనుచు నాభీలత్రిశూల
మును వైవ దానిన మునుకొని యొడిసి
పట్టి యంతట జాంబవంతుఁడు పఱచి
వక్షమ్ము గాడఁగ వైచిన, నింద్ర
వైరి మూర్ఛితుఁడయి వసుధను వ్రాలె;
వ్రాలినరక్కసుపదములు వట్టి
గిరగిరఁ ద్రిప్పి యొక్కెడఁ జావమోదె;
నయ్యును వరశక్తి నాతఁడు చావ
కున్న లంకను బడ నొయ్యన విసరె;
నారదుం డంపిన నాగారి, రామ
చంద్రునిపావనచరణసన్నిధికి
నరుదెంచి చెలఁగి మాయాసర్పములను
భక్షింప, వానరబలము లుప్పొంగి
నగవృక్షపాషాణనఖధారులగుచుఁ
గ్రుద్ధులై తరిమిరి కూరదానవుల.

మేఘనాదునియజ్ఞము నంగదాదులు
భంగమొనర్చుట మేఘనాదునియుద్ధము

అంత మూర్ఛను దేరి యసురారి, తండ్రిఁ
గని సేతు నజయయజ్ఞము నే నటంచుఁ
బలికి చొచ్చెను మహాపర్వతబిలము.
ఇట విభీషణుఁ డిది యెఱిఁగి, "శ్రీరామ!
శక్రారి యొక్కయజ్ఞమ్ము సేయంగ
సమకట్టియుండె; యజ్ఞమ్ము సమాప్తి
బొందిన నిక రణభూమిని వాని
మార్కొనుయోధుఁ డి మ్మహి నుండఁబోవఁ"
డనవుడు రాముఁడు హర్షితుఁడగుచు
నంగదాదులఁ బిల్చి, "యన్న! మీరెల్ల
తేఁగి లక్ష్మణునితో నీ క్రతుధ్వంస
మొనరించి రం డిఁక; యోయి కుమార!

లక్ష్మణ! నీవు సంగ్రామమునందు
వధియించి ఋభువులభయము వాపఁగదె!
జాంబవంతా! విభీషణుఁడ! సుగ్రీవ!
మీరు మువ్వురును మీమీ చమూగణము
వెంటరా లక్ష్మణు వెన్నంటి యుండుఁ"
డన విని లక్ష్మణుం డపుడు శ్రీరామ
చరణమ్ము లెద నిల్పి జలదగంభీర
నిస్స్వానమ్మున, "వాని నేఁడు వధించి
రాకున్న నింక శ్రీరామునిలెంక
గాను; నూరుగురు శంకరులు తోడైన
జయము రాఘవునిపక్షమ్మె వరించు;
వాని వధించి యే వత్తు" నటంచుఁ
బలికి శ్రీరామునిపదముల వ్రాలి
చనియె శీఘ్రమ్ము; లక్ష్మణునిమయంద
హనుమదంగదముఖ్యులగుమహోద్ధ
లప్పుడు వెన్నంటి యరిగి, కట్టెదుట
యజ్ఞదీక్షితుఁడయి యతివేల రక్త
భాండముల్ మహిషముల్ వడి వ్రేల్చుచున్న
శక్రారి గాంచి యజ్ఞముసమస్తమ్ము
విధ్వస్తమొనరింప, వీడక వాఁడు
నిజదీక్ష నుండె; దానిం గని కపులు
వాని నత్యంతము ప్రస్తుతిసేసి;
రయ్యును నా మఘువారి విచలిత
చిత్తుఁడుగాకున్నఁ జెచ్చెర నేఁగి
కేశపాశమువట్టి కీడ్వఁడ లాగి
పదములఁ దాఁచిరి; పదపడి యాతఁ
డంత క్రోధారుణితాక్షుఁడై లేచి
యొకత్రిశూలము గొని యుద్ధతుఁడగుచుఁ
దరిమిన వానరతతులు లక్ష్మణుని
మఱుఁగున డాఁగె; న మ్మఘువశత్రుండు
ఘోరాట్టహాస మొక్కఁమ్మడి సేసి
రా వానిగని సమీరణసుతాంగదులు
కుద్ధులై యేఁగి మార్కొనుడు, సురారి
వారిఁ ద్రిశూలము వక్షమ్మునందుఁ
గ్రుమ్మి ధరాస్థలిఁ గూలఁగనేసి
చండశూలమ్ము లక్ష్మణునిపై వైవ
నడుమన దానిఁ దున్కలుసేసె నాతఁ;
డంతలోననఁ బవనాత్మజాంగదులు
కడుకొని లేచి శక్రారిని దాఁకి;
రయ్యు నక్షతుఁడయి యాతఁడు నిలిచె;
అక్షతుండగువాని నంతటఁ గాంచి
వెక్కసుమఱులి రా వీరు; లాతండు
సింహనాదమ్మును జేసి కాలుండో
కో యన రాఁ గని క్రూరాస్త్ర మొకఁడు
సంధించె నపుడు లక్ష్మణుఁడు; ఘరంద
రారి పురోహితుఁడగుచు నానావి
ధాకృతుల్ ధరియించి యాహవభూమి
విహరింపఁ దొడఁగె; నవ్విధమును గాంచి
కపులెల్లఱును భయాక్రాంతులై యార్చి;

లక్ష్మణుఁడు మేఘనాదుని సంహరించుట

రంతట లక్ష్మణుం, "డాలస్య మింకఁ
దగదు: పాపిని జాలతడ వాడఁజేసి"-
తని కోసలాధీశు నా రామచంద్రు
హృదయమునఁ స్మరియించి యొక్కండు
ఘోరశరమ్ము నకుంఠితశక్తి
సంధించి విడువ వక్షమ్మున నాటి,
మాయఁద్యజించి, "రామానుజ! యెచట
నుంటివి? రామ! యెం దుంటి?" వటంచు
యార్చి ధరంబడి యసువులు దొరగె;
హనుమదంగదులు, "శక్రారి! ధన్యుఁడవు
నినుఁ గన్నతల్లి తా నెంతయు ధన్య"-
యనుచుఁ బ్రశంసించి; రంజనాతనయుఁ
డశ్రమమ్మున వాని నప్పు డెత్తికొని

చని లంకవాకిటఁ జయ్యన నుంచి
వచ్చె; న య్యింద్రజిత్ వధియింపఁబడుట
విని సుర లానందవివశులై వ్యోమ
యానమ్ము లెక్కి యభ్రధ్వము వట్టి
వచ్చి సుమమ్ములు వర్షించి దుందు
భులు మొరయించుచు ముదితాత్ములగుచు,
"జయ జగదాధార! జయ మహావీర!
జయ యనంతా! నీవు జగ ముద్ధరించి
తయ్య!" యంచు నుతించి యరిగిన వెనుక
లక్ష్మణుం డేఁగె శ్రీరామునికడకు.

శ్రీరామచరితమానసము

లంకా కాండము

అష్టమవిశ్రామము

దశముఖదానవదళనా!
దశరథసుత! రామచంద్ర! ధరజానాథా!
సశరశరాసనా! సేవక
వశవర్తీ! మట్టపల్లివాస! నృసింహా!

రావణుఁడు రణమున కేగుట

తనయునిమరణవార్తను విని పంక్తి
వదనుఁడు స్మృతిదప్పి పడియెను ధరణి;
మయపుత్రి దుఃఖసమ్మర్దమువలనఁ
బలుపలువిధములఁ బ్రలపించుకొనుచు
మొమ్మ్ము బాదుకొనుచు రోదింపసాగె;
నయ్యెను శోకవిహ్వలితమ్ము నగర
మెల్ల; రక్కసులు లంకేశునిఁ దెగడి;
రంతట రావణుఁ డడలు నంగనల
దరిసి, "మీ రేల యిత్తఱి విచారింపఁ?
గనుఁ గొనఁగా నీ జగము నాశీల
మగుఁగాదె, దీనికై యడలెద" ననుచు
జ్ఞానోపదేశ మొసంగె– లోకమున
నుపదేశకుశలు లోహో! సహస్రములు;
కాని యద్దాని నొక్కఁడు నాచరింపఁ;
డంతలోపలన బల్లనఁ దెల్లవాఱెఁ–
గీశఋక్షములు వాకిళ్ళు లడ్డగించె;
నపుడు రావణుఁడు సైన్యముల రావించి,
"యాహవమున శత్రునాస్యము గన్న
బెదరుపుట్టినట్టిభీరు లిక్కడనె
పొందు నన్నిడి, రణభూమికి నేఁగి
యచ్చటఁ బరువిడు నట్టిదుర్జనుల
విధ మోర్వ, మద్భుజవీర్యము నమ్మి
యీగతి శాత్రవ మ్మేఁ బెంచుకొంటి;
నెత్తివచ్చినవైరి కీ వేళ బదులు
సెప్పజాలుదు" నని చెప్పి, సమీర
జవమునఁజను తేరు సంసిద్ధపరచె;
రణవాద్యములు మున్మ్రోగమ్మ్రోగ మొఱసె;
మాననీయానంతమహితశక్తు లగు
వీరు లద్దనుజుని వెన్నంటి యేఁగి–
రొక్క– కజ్జలఝుంఝు యుప్పొంగినట్లు.
చనియెడు నెడ నపశకునము లెన్ని
కలిగియు స్వీయవిక్రమగర్వియగుచు
నవ్వి లెక్కింపక యరిగె లంకేశుఁ;
డాయుధమ్ములు జారె; నరదములందుఁ
బడిరి యోఘులు; మదవారణవాజు
లార్చుచుఁ బరుఁగిడె; నప్పుడు గృధ్ర
కాకశివాశ్యేనగార్ధభరవము
లెసఁగె; దివాంధము లెంతేని భీక
రమ్ముగ నప్పు డార్వంగఁదొడంగెఁ–
గాలునిదూతలకరణిఁ జెలంగి,
మోహవశుండు కామోల్బణచిత్తుఁ
డాగమవైరి భూతార్థికరుండు
శ్రీరామవిముఖుఁడై చెలగునాతనికిఁ
గలనైన శుభములు కలవె చింతింపఁ?

గదలె నపార రాక్షసచతురంగ
వాహిను లరదముల్ వాహము లెక్కి;
చిత్రవర్ణ ధ్వజశ్రీ ల్దిశల్ నిండె;
ప్రావృషేణ్యపయోదపటలి వాయువునఁ
బ్రేరితమ్మై చనురీతి నున్మత్త
దంతావళమ్ము లుద్ధతము లై నడచెఁ;
వివిధాస్త్రధారులు వీరులు యుద్ధ
చతురులు మాయావిశారదుల్ సనిరి
వాసంతవాహినీవైభవ మొప్ప;-
మ్రొగ్గె దిగ్గజము; లంభోనిధుల్ కలఁగెఁ;
దూఁగాడె శైలముల్; ధూళి గభస్తి
గప్పె; వసుంధర కంపించె బిట్టు;
వాయువు స్తంభించె; వనములు విటిగెఁ;
గల్పాంతసమయసంక్రాంతబలాహ
కౌఘమ్ములోలె భీకరముగ మొఱసె-
భేరీపటహముఖ్యభీషణవాద్య
తతులు; లంకేశుఁ డంతట వారిఁ గాంచి,
"భటులార! మీర ల వ్వనచరబృంద
గణముల మెసవుఁడు; కడువడి రాజ
తనయుల నేను మర్దనసేసి విడుతు"-
నని హెచ్చరింప భటావళి చెలఁగి
గర్జించి నడచినఁ, గపులు బృంద ములు
సగరుదున్నతదివ్యసానుమన్నిభులు
కాలకరాళులు కడుచిత్రవర్ణ
లగవృక్షదంతనఖాయుధధారు
లగుచు, "లంకేశమహోమత్తదంతి
పంచాననుం డగుప్రభునకు రామ
చంద్రున కగుఁగాకజయ" మని యార్చి
తలపడి రాసురదళముల; నపుడు-

శ్రీరాముని విజయరథము

రావణుం డెదిరించె రాముని; నట్టి
యెడ రథస్థితుని లంకేశునిఁ జూచి,
రథవిహీనుం డగు రామునిఁ జూచి,
బెగడొంది యెడఁద విభీషణుం డడుగుఁ
దమ్ముల వ్రాలి, "యో తండ్రి! రథమ్ము
లేదు; పాదుకలును లేవు; రక్షింప
నకట! తనుత్రాణమైనను లేదు;
బలసనాథుఁ డగు రావణుని నిర్జింప
నగునె?" యనంగ దయాసాగరుండు,
"సఖుఁడ! భీతిలకుము జయశీలమైన
రథ మిది యగునె? ధైర్యమును శౌర్యమ్ము
చక్రముల్; శీలము సత్యము దాని
ధ్వజములు; దమమును బలవివేకములు
నుపకృతి యనునివి యుత్తమాశ్వములు;
దయయు క్షమాసమత్వమ్ములు త్రాళ్ళు;
*ప్రాజిత యీశ్వరభజనమ్ము; ముదము
తరవారి; వైరాగ్యతత్త్వమె డాలు;
దానము పరశువు; తతబుద్ధి చండ
శక్తి; విజ్ఞానము చక్కనిధనువు;
విమలస్థిరమనమ్ము పెను తరకసము;
యమనియమములు మహాస్త్రసంఘమ్ము;
గురుపూజ కవచము; ఘోరసంగ్రామ
మందున నీక జయోపాయము దీని
కంటె వేఱొక డేమికలనో యిసచివ?
ఈ ధర్మరథముపై నెక్కి చరించు
వాని జయించెడివాఁ డెవ్వఁ డింక?
నెవ్వనికడఁ గల దిట్టి రథమ్ము,
సంసార మనెడు దుర్జయశత్రు నైన
నొక్కట నిర్జింపనోపు" ననంగ
విని హర్షితుండు విభీషణుఁ డపుడు
రాముని పాదనీరజముల వ్రాలి,
"యీ మిష, స్వామి నా కిచ్చితి వొక్క

* ప్రాజిత = సారథి

సదుప దేశ" మ్మని సం స్తుతిసేసె.

వానరదైత్యసంగ్రామము

అట రావణుఁడు పవనాత్మజాంగదులు
తర్జించుచుండిరి తారొండొరులను;
వానరఋక్షక్రవ్యాదసైన్యములు
వేడ్కఁ బరస్పరవిజిగీషఁ బోరు
సల్పుచునుండె; నజామరనాథ
ముఖ్యబృందారకుల్ పూని విమాన
సంస్థితులై యాకసమ్మునఁ గూడి,
రప్పు డో పార్వతీ! యచ్చోట నేను
సైతము శ్రీరామసంగ్రామలీల
గనుఁగొననెంచి యాకసమున నుంటి;
ఇరువాగు లందున నెసఁగెడి వీరు
లుప్పొంగి పోరుచునుండిరి; కపులు
శ్రీరామబలమునఁ జెచ్చెరఁ బొంగి
క్రుద్ధకృతాంతులొక్కో యని తలఁప
శోణితచర్చితసుందర దేహు
లగుచుఁ గాలాబ్దములట్లు గర్జించు
కొనుచు దానవసేనఁ గ్రుమ్మరి, వారిఁ
గొట్టుచుఁ బట్టుచుఁ గ్రుమ్మచుఁ గుక్షిఁ
జీల్చుచు బాహులఁ జిదుముచు నేల
రాయుచుఁ గేశముల్ లాగిరి పట్టి.
నరసింహదేవుఁ డనంతరూపముల
రణరంగమున విహారముసేసె ననగ
నురములువ్రచ్చియు నుదరముల్ చీల్చి
ప్రేవులు ప్రోవులుపెట్టఁదొడంగి
రతిభయంకరలీల న క్కపివరులు.
అప్పుడు, "కొట్టుడీ యడఁచుఁడీ తన్నుఁ"
డనెడి యార్పులు నిండె ద్యావాపృథువులు.
"తృణముగ వజ్రముఁ దృణము వజ్రముగ
సలుపఁజాలిన రామచంద్రునకు జయ"
యనుచు నార్చిరి కపు లంతరాళమ్ము
వగులఁగ; రాక్షసవాహినుల్ విఱిగి
లంకాభిముఖమై పరవఁదొడంగినవి.
తనసేన యిట్లు యథాయథ లగుటఁ
గని తన యిరువదికరముల విండ్లు
దాల్చి యుత్తుంగరథ మ్మెక్కి, "దైత్య
వీరులారా! యింక వెన్కకు మఱలుఁ"-
డని యార్చి రాఁ గపు లాతనిఁ గాంచి
పర్వతానోకహాపాషాణతతులు
వైచిన నవి వాని వజ్రశరీర
ఘట్టనమ్మునను దున్కలుతున్క లయ్యెఁ;
గోపించి దానవకుంజరుం డప్పు
డరదమ్ము నిలుపఁగ నానతి వెట్టి
చుట్టినకపివరుల్ చూర్ణముగాఁగ
వాఁడిశరమ్ములు వైచిన, బెగడి,
"యంగద! రక్షింపు, హనుమ! కాపాడు,
పాహి యో శ్రీరామభద్ర! కృపాళు!
కాలునివలె నేఁడు గసిమసంగెడిని
స్వామి! యీ దుష్టరాక్షసుఁడు మమ్మెల్ల"-
నని యార్చి పఱచిన నదిగని వాఁడు
నవ్వి ఘోరములు బాణములను దొడిగి-
వైచిన నవియు సర్పమ్ములపగిది
పోయి భూమ్యాకాశములు దిశల్ విదిశ
లన్నియుఁ గప్పిన, నంతటఁ బఱవఁ
గాఁ జోటుగానక కపులు బెగ్గడిలి,
"కరుణానిధానమ! కంజాక్ష! భక్త
జనరక్షకా! దీనజనపరిపోష!
రఘువీర! శ్రీహరీ! రక్షింపుమీశ!"

లక్ష్మణరావణసంగ్రామము

అని యార్చఁ దమదుసైన్యమ్ములపాటు
గని క్రుద్ధుఁడగుచు లక్ష్మణుఁడు ధనుస్సు

ధరియించి రాముపాదములకు మ్రొక్కి
యనుమతిగైకొని యరిగి, "యో దుష్ట!
వానరభల్లూకవరులను గొట్ట
నే మాయె? వచ్చితి నిదిగో నీపాలి
కాలుండ" ననిపల్కి కాండము లేయ
నాతనిదెసఁ గని యపుడు రావణుఁడు
కడుక్రుద్ధుఁడై, "పుత్త్రీఘాతక! నిన్ను
వెదకుచునుండ నీవే వచ్చినావు;
ని న్నిప్పుడ వధించి నేఁడు నాగుండె
మండుట యంతయు మాన్పెద" ననుచు
ఘోరనారాచముల్ గురిసిన, వాని
శతశతశతసహస్రములు దున్కలుగఁ
దునిమి లక్ష్మణుఁడు మదోద్ధతు డైత్య
వరు మేనిపై నంపవానను గురిసె;
రథమును ద్రుంచి, సారథిని నిర్జించి,
పదితలల్ గాడంగ బాణముల్ వేయి
గుప్పింపఁ బర్వతగుహఁ జొరఁబాఱు
జిహ్మగమ్ము లనంగఁ జెలఁగె; నా మీఁద
బాణశతమ్మున వక్షమ్మున జీల్పఁ
బడి ధరాస్థలి, కొంతవడికిఁ దెప్పరిలి
బ్రహ్మదత్తమ్మగు వరమహాశక్తి
సంధించి విడువ లక్ష్మణు నెద నదియు
నాటిన నప్పు డనంతావతారుఁ
డొరగె; రావణుఁ డట్టులొరిగినయతని
నెత్తంగ సమకట్టె; నెవ్వనిశిరము
పైని బ్రహ్మాండముల్ భాసిల్లు ధూళి
కణముపోలిక, నట్టిఘను నెత్తఁగలఁడె?
అది గాంచి కోపించి హనుమ యచ్చటకు,
"నిలునిలు రాక్షస! నిలు" మని పలుచె;
వచ్చిన నతని రావణుఁడు లక్ష్మించి
గ్రుద్దిన, మారుతి కూలక త్రొక్కి
కొనినిల్చి యాతనిఁ గ్రూరముష్టిప్ర
హారమునన్ నొంప నసురనాయకుఁడు
వసుధ శైలముభంగి పడి మూర్ఛమునిఁగె;
"నెందుల కక్కటా! యీ నాబలమ్ము;
మ్రుక్కడియసురాధమని జగద్ద్రోహి
నొక్కగ్రుద్దునఁ జంపకున్నంత" ననుచుఁ
గించను మునిఁగి యక్కోశుఁడు లీల
లక్ష్మణు మోసుక రాముసన్నిధి కరిగె; రాక్షసనేత లేఁచి
యది గని మునిఁగె నత్యాశ్చర్యజలధి;
అచ్చట రాముఁ, "డో యన్న! మనమ్ము
నందు విచారింపు మయ్య! గీర్వాణ
వందితుండవు కాలభక్షకుండగుదు"
వన విని లక్ష్మణుం డప్పుడు లేఁచి
కూర్చుండె, శక్తియు గొబ్బున వీఁడి
యభ్రమార్గమున నరిగె నెండేని;
అంత లక్ష్మణుఁడు శరాసనబాణ
హస్తుఁడై యప్పు డాహవభూమి కేఁగి
రావణునూతనరథము నుగ్గాడి
సారథినిం జంపి శతశరమ్ములను
హృదయమ్మునఁ జీల్ప లంకేశుఁడు నేలఁ
గూలె; నాతనిఁ గనుఁగొని రయమ్మునను
వేఱొకసారథి విచ్చేసి తనదు
రథముపై నిడికొని రావణు లంకఁ
జేర్చె; లక్ష్మణుఁడును శ్రీరామదివ్య
చరణమ్ములకు నమస్కారమ్ముసేసె.

రావణునియజ్ఞమును వానరులు భంగము
సేయుట

అట మూర్ఛఁదేరి సురారి యజ్ఞమ్ము
సేయఁగ సమకట్టుఁ జెచ్చెర; దాని
విని రాముఁ జేరి విభీషణుఁ డపుడు
"నాథ! రావణుఁడు జన్నముసేయనుండె;

నది వాడు ముగియించినట్లైనఁ జావఁ;
డటుగాన శీఘ్రమ్మ యనుపుఁడు కపుల
యజ్ఞవిధ్వంసమ్ము నాచరింపంగ"-
నన విని రాఘవుఁ డట్ల కావించె;
హనుమదంగదముఖ్యులగు కీశవర్య
లలవోకగా లంక యందునఁ జొచ్చి
రావణుర మ్యహర్మ్యముఁ జొరబాటి
యజ్ఞదీక్షితుని సురారిని గాంచి
క్రుద్ధులై, "యోరోరి కూళ! నిర్లజ్జ
చిత్తుఁడవై రణక్షేత్రము వీఁడి
బాకజపము సేయఁ బరతెంచినావె?"
యని తిట్టి; రంగదుఁ డాతనిఁ గాలఁ
దన్నె; నయ్యు నతండు ధ్యానము వీడఁ;
డది గని వానరు లావేశవివశు
లంతఃపురముసొచ్చి, యంగనామణుల
దీనులై మిగుల రోదించెడివారి
ధమ్మిల్లములువట్టి తగ నీడ్వఁదొడఁగి;
రది గని క్రుద్ధుఁడై యా పంక్తికంఠుఁ
డతికోపమున వానరాళిపైఁ బడియె;
నాలోనఁ గీశులు యజ్ఞము సెఱచి
పఱచిరి శ్రీరామపాదసన్నిధికి.

రామరావణసంగ్రామము

క్రతువినాశమ్మును గాంచి నిస్పృహుఁడు
రావణుం డంతటఁ బ్రాణాలమీఁది
యాశఁ ద్యజించి మహాకోపచిత్తుఁ
డై యెత్తిపోవఁగ, నపశకునములు
కనుపట్టఁదొడఁగెను; గ్రద్దలు వాని
తలలపై వ్రాలె; నార్తధ్వను లెసఁగెఁ;
గాని దాని నొకింత కైకొన దైత్య
చతురంగవాహినుల్ సాగె నిర్భీతి-
వహ్నిముఖమ్మునఁ బడు పతంగముల
పగిది; భీకరరణవాద్యములు మొరసె;
ఆకాశవీథి నాకౌకసుల్ సేరి,
"వీఁడు, రాఘవ! మమ్ము వెతలగుందించె;
నీతనితోఁ గ్రీడ లేటికి? వీని
ద్రుందించి జానకీమాత దుఃఖమ్ము
హరియింపఁగదె?" యన్న నల్లన నవ్వి
రఘుపతి బాణశరాసనమ్ములను
బూని తా నిల్చె; ప్రభుండు లతాంత
కలితజటామ స్తకాతిశోభితుఁడు
రక్తలోచనుఁడు పర్జన్యవర్ణుండు
పుష్టబాహుఁం, డట్లు పూనిన సకల
బ్రహ్మాండములును దిగ్వారణసమితి
శేషకచ్ఛపులు నశేషసముద్ర
శైలయుతము ధరాసలము కంపించెఁ;
ప్రభుని యా దివ్యశోభను బరికించి
సుమనసుల్ గురిసిరి సుమనోగణమ్ము-
"కరుణానిధాన! లోకైకచరిత్ర!
జయము శ్రీరఘురామ జయజయ" యనుచు;
ఔద్ధత్య మేపార నత్యంతసాంద్ర
మయి చనుదెంచు సురారివాహినులఁ
బ్రళయవేళాసముద్భవమహాంభోద
తుల్యులౌ కీశు లెదుర్కొని పోరి;
రత్యంత భయదములగు కరవాల
ధాళధళ్యమ్మ లుద్యచ్ఛంపలుగను,
సమదవారణరథాశ్వస్వనమ్ము లవి
కడుకొని పర్జన్యగర్జలు గాఁగ,
వానరభల్లూకవరులపుచ్ఛములు
శారమఘువధనుస్సంఘముల్ గాఁగఁ,
బర్వతమ్ములు వజ్రపాతముల్ గాఁగఁ,
గ్రమ్మినదు మ్ముదకమ్ముగ, బాణ
బిందు లొప్పఁగ, మహావృష్టిసాగినది.
అంతరాఘవుఁడు శరాసన మెత్తి

బాణముల్ గురియఁ గ్రవ్యాదసైన్యములు
స్మృతిదప్పి పడియె నచేతనములయి;
అ మ్మహావీర దేహాద్రినిర్గతము
లై రక్తఝరము లత్యంతము పొంగె;
రథము లేతమ్ము; చక్రమ్ములు సుడులు,
హస్తివాహాదులు యాదోగణమ్ము;
శక్తితోమర బాణసమితి సర్పములు,
చాపమ్ములు తరంగసంఘముల్, డాళ్ళు
కమఠముల్, రెండుపక్షమ్ములభటులు
కూలద్రుమమ్ములు, గుజ్జగుమజ్జ
ఫేనమ్ముగా, భీరుభీతికరమ్ము
వీరసుఖదమయి వెలయుచు రుధిర
వాహిని యచ్చోటఁ బ్రవహింపఁదొడఁగె;
నాశైవలినియందు నపుడు స్నానమ్ము
బొనరింపుచుండెను భూతబేతాళ
ప్రమథపిశాచముల్; వాయసగృధ్ర
వితతులు పలలము వెస గఱచికొని
చనుచుండె; ఢాకినీశాకినీగణము
లంబరస్థలి నాట్యమాడుచునుండె;
జంబుకప్రతతులు శవములఁ బట్టి
కడుపార మెసవి ప్రక్కల నున్నవాని
తోడఁ బోరుచునుండెఁ; దొరఁగి శిరమ్ము
మొండెముల్ పరచెను; మొండెముల్ లేని
తలలు వసుంధరాస్థలిఁ బడి జయజ
యారావములుసేసె నతిభయదముగ;
శ్రీరామశక్తిదర్పితులౌచు కపులు
రాక్షసచమువుల రాచిరి ధరణి;
శ్రీరామశాతవిశిఖములఁ జచ్చి
గణభూమి శాత్రవప్రతతులు గూర్కె.
ఆగతిఁ దనసేన యడఁగిపోవుటయు
నాహవరంగమునం దొంటి యగుట
భల్లూకవానరవాహినుల్ పెక్కు
లగుట విచారించి యపుడు సురారి
యంత సేయ దలంచె నాసురీమాయ.

ఇంద్రుండు శ్రీరామునకు రథము నంపుట

రాఘవుం డారీతి రథములేకుండ
పోరుటఁగాంచి ఋభువులు క్షోభిల్లి;
రప్పు డింద్రుఁడు తన యరదము బంపఁ,
జంచలమ్ములు మనోజ్ఞము లజరమ్ము
లైన దివ్యముల వాహమ్ములఁ బూన్చి
దానిని వేడ్క మాతలి గొనితెచ్చెఁ;
దెచ్చిన నప్పు డా తేరెక్కి మిగుల
రామచంద్రుఁడు కృపారాశి శోభిల్లె;
నదిగని కీశసైన్యమ్ములుప్పొంగె;
ఆలసింపంగరా దని తలపోసి
యాసురీమాయ సురారి రచించె;
రాముఁ డొక్కఁడు తప్ప రాక్షసకీశ
భల్లూకనాహిని వరలెడు యోద్ధ
లనుజ సనాథు రామావనీనాథు
ప్రతికృతుల్ వేనవేల్ పరికించి బెగడి;
రంతట వాహిని యాశ్చర్యచకిత
మగుట నెఱిఁగి మందహాస మొనర్చి,
బాణ మొక్కట తెప్పపాటున మాయ
విదలింప వానరవీరు లుప్పొంగి;
రఘుడు రాముండు సైన్యమ్ములఁ గాంచి,
"యలసితి రో వీరులార! చాలింపుఁ
డెక్కటి కయ్యము నింకఁ గనుం" డ
టంచు వచించి విప్రాంఘ్రుల కెరగి
యరదమ్ము దోల దేవారి కోపమున
సింహనాదముసేసి చెచ్చెర నతని
నెదిరించి, "యో తపస్వీ! యింతవఱకు
నెట్టివీరులను జయించితి వట్టి
వాఁడనుగాను; రావణుఁడు నాపేరు;

జగములన్నియు నా యశమ్మునఁ గీర్తించు;
దిజ్నాయకులను బంధించితి నేను;
ఖరదూషణాదుల ఖండించినాఁడ;
వా విరాధుని జంపి; తట్టులె వ్యాధు
పోలిక వాలిని బోలియించినావు;
కుంభకర్ణునిఁ బట్టి కూల్చితి; మేఘు
నాదు గొట్టితివి; కీనాశులఁ బెక్కు-
మంది ద్రవేల్చితిగద? మఱులక నిలుము!
నా పగయెల్ల నీ నాఁడు నే తీర్చి
కొనియెదఁ; బడితివి క్రూరరావణుని
పాలికిఁ, గాలునిపాలి కంపెద" న
టంచు దుర్వచనములాడుచునున్న
వానిని గని కాలవశుఁ డని యెఱిఁగి
యా దయాసాగరుఁ డప్పుడు నవ్వి,
"యోయి! చెప్పిన వన్నియును నిక్కువమ్మ
లొక్కనాఁ, డీ దిన మొక్కఁడు లేదు;
పౌరుషముండినఁ బాఱక నిలుము
వ్యర్థవాక్యమ్ముల వచ్చున దేమి?
నన్ను శమింతు నన్నచో వినిపింతు
నీతి నొక్కించుక నీకు రావణుఁడ!
ముత్తెఱఁగుల జనుల్ పొల్తురు ధరణి:
వరుసఁ బాటల చూత పణసవృక్షములఁ
బూలు, పూలుంబండ్లు, మునుకొని పండ్లు,
మలసెడిగతి-వట్టి మాటలు ప్పుసె
వారు, సెప్పియుఁ జేయువారు, సెప్పకయె
చేసెడివా రని; చెచ్చెర నిందు
నెవ్వఁడ వీ వౌదు వెఱిఁగింపు" మనిన
నవ్వి రావణుఁడు, "జ్ఞానము సెప్ప వచ్చి
నావె? యీనాఁడు ప్రాణములపైఁ దీపి
యెుదవెనే?" యని కులిశోపమమ్ములగు
క్రూరనారాచముల్ గుప్పఁగ నవియు
దశదిశల్ గప్పఁగఁ, దగ రాఘవుండు
పావకాస్త్రమ్మున భస్మమ్ముసేసె
క్షణకాలమున; దానిఁ గని రావణుండు
గినిసి యొక్కండు శక్తిని వైచె; వైవ
రాముఁడు చెండె నారసమున దాని;
కోటిచక్రమ్ములు కోటిత్రిశూల
ములు వైవ, నశ్రమమ్మున వానిఁ దునిమె;
నాగతి రావణునమ్ములు దుష్ట
జనమనోరథములచందాన నిష్ఫ
లములైనఁ గోపానలమ్మున మండి
క్రూరాస్త్రముల్ నూరు గుప్పి సారథిని
గొట్టిన, "జయ నృపకుంజర" యనుచుఁ
బడియె వాఁడును; రామభద్రుఁడు వాని
లేపి క్రుద్ధుండయి లీలగా నల్లె
త్రాడుమ్రోయింప శబ్దము విని సకల
దానవానీకముల్ దటతటలాడె;
మయపుత్త్రియెడఁద కంపము సెందె; జలధి
కచ్ఛపపృథివీనగమ్ములు బెదరె;
కఱచుక ధరణి దిక్కరులు బృంహితము
గావించె; నిదియెల్లఁ గని యాదితేయు
లల్లన హసియించి; రప్పుడు రాముఁ
డాశ్రవణమ్ముగ నల్లియ లాగి
యాలీఢపాదుఁడై యతిరయమ్మునను
భీకరాస్త్రమ్ముల విడువఁగ నవియుఁ
బక్షనాథసర్పమ్ములపగిదిఁ
జని మున్ను సారథిఁ జంపి యశ్వములఁ
దూఁటాడి యరదముద్రుంచి ధ్వజములఁ
గూల్చి, బలమ్మును గోల్పడి శ్రాంతుఁ
డయ్యును భయదాట్టహాసము సేసి
వేఱొక్కరథ మెక్కి వివిధశస్త్రాస్త్ర
ప్రతతులు గుప్పఁ, బరద్రోహచిత్తుఁ
డగువానియత్నముల ట్లవి నిష్ఫ
లములైనఁ బదిత్రిశూలమ్ములు విసరి

రామాశ్వాముల నొంచె రావణుఁ; డపుడు
రాముఁడు క్రుద్ధుఁడై రావణశీర్ష
కమలవనమ్మునఁ గాండసుమంధ
యాళిని విరచించి యపుడు పదేసి
శరముల శిరములఁ జయ్యన నాఁటఁ
బ్రవహించె రక్తస్రవంతులు మేన.
అంత సురారి యత్యంతకోపమునఁ
బర తెంచె; నదిగని ప్రభుఁడు చాపమున
ముప్పదినారసమ్ములను సంధించి
పదిశిరమ్ముల నిరువదిబాహువులను
దునిమెను; దునిమినతోడనె యవియు
మఱలఁ జిగిర్చె; నిమ్మాడ్కి రాఘవుఁడు
త్రుంచినట్లెల్ల తోడ్తో నవి పుట్టు-
ననుభవింపఁగ విషయావళి దినది
నమ్మ క్రొత్తలుగ జన్మమ్మొందునట్లు.
కొట్టినట్టివి ధరఁ గూలఁగనీక
శరకౌశలమునఁ గోసలపతి యభ్ర
మందున నిలుపంగ నవి యసంఖ్యమ్మై
లై కోటిరాహువు లాకాశవీథిఁ
జరియింతు రనఁగ నాశ్చర్యమ్మ గొలిపెఁ;
జండగభస్తిప్రచండకిరణము
లా రాహుగణముపై నల్గి గ్రసించు
నన రామచంద్రు దివ్యాస్త్రము లొప్పె.
ఆ శిరఃపంక్తుల నప్పుడు గాంచి
రావణుం డంత మరణభీతి మఱచి
చాపమ్ములు పదింటి సంధించి పఱచి
రామభద్రుని దివ్య రథముపైఁ గ్రుమ్మఁ,
జండదీధితి యొక్కసానుమత్కుహర
మం దడంగె ననంగ నరదము గాన
రాదయ్యె; నిర్జరర్షభులు హాహార
వములుసేయఁగ, రామభద్రుఁడు గనలి
శాతశరమ్ముల శత్రుశరములు
గూల్చి రావణుతలల్ గూల్చి దిక్కులను
నిజశరప్రతతిచే నింపిన నభ్ర
మండలి "నెందు లక్ష్మణుఁడున్నవాఁడు?
రాముఁ డేఁడీ? వానరాధిపుఁ డెచట?"
ననుచు రావణుని శిరావళి పోవు
చుండఁగఁ గీశచమూత్కర మ్మద్ది
గని భయభ్రాంతమై కడువడిఁ బఱవ,
నదియెల్లఁ గనుఁగొని యల్లన నవ్వి
రఘుకులమణి యా శిరమ్ములఁ గూల్చెఁ;
జండకాళికలు హస్తమ్ముల రుండ
మాలికలను దాల్చి మండలిఁ బేర్చి
గొండిలియాడె దిక్కుహరము లద్రువ
సంగ్రామవటపూజ సవదరింపంగ
నన రక్తవాహినులందు మునింగి.

విభీషణునిపై రావణుఁడు శక్తినిప్రయోగింప
శ్రీరాముఁ డెదిరించి మూర్ఛిలుట
విభీషణ రావణ సంగ్రామము

అప్పుడు కనలి దశాస్యుఁడు చండ
శక్తి వైచిన విభీషణుఁ డెస నదియుఁ
గాలదండమ్మునఁగాఁ బఱి తెంచె;
నదిగని తన ప్రణతార్తిహరత్వ
సత్ప్రతిజ్ఞఁ దలంచి స్వామి యత్యంత
రయమునఁ జనుదెంచి రావణానుజుని
వెనుకకుఁ ద్రోసి యా భీకరశక్తి
ఘాతమ్ము దా నోర్వఁగా నెంచి వచ్చి
శక్తి తాఁకిడికి మూర్ఛమునింగి పడియెఁ;
బ్రభుని యీ లీలను బరికించి నిజము
దెలియమి నార్చిరి దేవతలెల్ల;
స్వామిశ్రమము విభీషణుఁడు లక్ష్మించి
కడుక్రుద్ధుఁడై కేల గదఁ గొని పఱచి
"యో యభాగ్యుఁడ! మూర్ఖ! యోయి దుర్బుద్ధి!

దైవమానవమునీంద్రాదులతోడఁ
బగ తెచ్చుకొంటివి; పరువమ్మునందు
శివునిఁ బూజించితి శిరములనిచ్చి;
తత్ప్రతిఫలముగ దక్కె నీనాఁడు
కోటిశిరమ్ములు; కూళ! య య్యదియ
కతముగ బ్రదుకుటకలిగె నిందాఁక;
నింక నీ తలపయి నృత్యముసేయు
చుండెఁ గాలుండు నీచుండ! శ్రీరామ
విముఖుఁడవై సిరుల్ వేఁడెద వెట్టు"
లని పల్క గదనెత్తి యపుడు రావణుని
వక్షోఽంతరమ్మున వడి మోదినంత
దశవదనముల రక్తమ్ము గ్రక్కుచును
దశవదనుం డంత ధరణిపై వ్రాలి,
క్రమ్మఱి దేరి యుగ్రతరస్వభావుఁ
డై భీకరమ్ముగ ననుజుని దాఁకె;
అంతట మల్లవిద్యావిపశ్చిత్వ
సరణి వారలు పరస్పరవిజిగీషఁ
బెనఁగుచుండఁగ విభీషణుఁడు శ్రీరామ
వరగర్వితుఁడయి రావణుని బూరికిని
గొనఁ; డుమా! యెందుఁ గన్గొనఁ జాలునొక్కొ?
కన్నెత్తి యా దశకంధరు నతని
తమ్ముఁ; డట్టిఁడు నేఁడు దర్పితుఁడగుచుఁ
గాలతుల్యుఁడయి సంఖ్య మ్మొనరించు
నన రాముని ప్రభావ మగుఁ గాదె చెపుమ?
రావణానుజుఁ డతిశ్రాంతుఁడౌ టెఱిఁగి
పావమాని యొకండు పర్వత మెత్తి
వైచి రథమ్ము నశ్వముల సారథిని
జిద్రుపలుసేసి చెచ్చెర వక్షమందుఁ
బాదమ్మునం దన్నఁ బడక రావణుఁడు
కంపించి నిలువెల్ల గడగడ వడఁకె;

హనుమద్రావణ యుద్ధము
రావణుని మాయాప్రయోగము

అంత విభీషణుఁ డార్తశరణ్యుఁ
డున్నచోటికిఁ జనె; నొగి రావణుండు
తెప్పరిల్లి యొకింత తేఁకున హనుమఁ
గ్రుద్ధి యాతనితోఁకఁ గొని మోఁది కెగయ
నాతనితోడన యరిగి కపీంద్రుఁ
డపుడు వాయ్వాధ్వమునందుఁ బోరాడఁ
గడఁగెఁ జూపరులకుఁ గజ్జలాగమ్మ
రత్నసానువును బోరాడుచందమ్మ
దోఁప; బలమున దైత్యుని గూల్పరామి
గ్రహియించి హనుమ లోకావను రాముఁ
దలఁచి ముష్టిప్రహూతముసేయ వాఁడు
భళ్ళున ధరణిపైఁ బడి లేచి మఱలఁ
బ్రాణాలకుఁ దెగించి వానినిఁ దాఁకఁ,
బ్రబలవానరభుక్తబలములఁ గాంచి
యాసురీమాయచే నపు డదృశ్యుఁడయి
పరసేన నెందఱుభటులుండి రన్ని
యాకృతుల్ గైకొని యవతరింపంగ
నెందుఁ జూచినను దైత్యేంద్రుఁడై, కపులు
ధృతిసెడి భయమున దిక్కులువట్టి,
"రక్షింపు లక్ష్మణ! రామ! కాపాడు"
మనుచు నెలుంగెత్తి యార్చి పర్వడిరి;
పొలసి ద్యావాపృథువులు దిశల్ విదిశ
లెందుఁ జూచినను దైత్యేంద్రుఁడై యమరు
"లన్నలా! యింక జయమ్మనునాశ
యెక్కడి దొక్కలం కేశుఁడే సకల
బృందారకులను జయింపఁగ, నింత
మందిరావణులైన మన మేమిబ్రదుకు
వారము? కొండొక పర్వతగుహాను
డాఁగికొందము పదుండా" యని పలుచి;
రచ్చోటఁ బ్రభునిమాహాత్మ్య మెఱుంగు
శంకరబ్రహ్మాలు సన్మునీశ్వరులు
నిశ్చలచిత్తులై నిలిచి యా వింతఁ
గనుచుండి; రెల్లయు కపులు పర్వడఁగ
హనుమదంగదముఖ్యులగుమహావీరు

లప్పుడు కపటద్వై త్యాకారములను
దలపఁ జొచ్చిరి ధరణికిఁ; గాని
శాంబరజీవి వృక్షములఁ బుట్టించు
గతి వేనవేలురక్క-సు లుద్భవించి;

శ్రీరాముఁడు రావణునిమాయను హరించుట

రాగతి వానరుల్ నాకౌకసులును
భయచిత్తులగుచు సంభ్రమమునఁ బఱచు
నెఱిఁగి రాముఁడు హసియించి శౌర్యమున
బాణమ్ము సంధించి వడి నేయఁగా న
హస్క-రోదయమున నాంధ్యముల్ విఱుగు
చందానఁ గపటరాక్షసుల హరించె;
ఒక్క-డై త్యేంద్రుఁడే యొప్పుటఁ గాంచి
హర్షితులగుచు లేఖావళుల్ పుష్ప
వర్ష ముగురిసిరి ప్రభుమూర్ధ్నందు;
అంత రాఘవుఁడు ధైర్యమ్ము బోధించి
మఱలించె వానరమండలినెల్ల;
శ్రీరాముఁ డాగతిఁ జేవీచినంతఁ
గపులు ధైర్యమున సంగ్రామరంగమున
కురికిరి; ఆర్చి మహోద్ధతు లగుచు
దేవతల్ రాము స్తుతించుటను విని,
"యిపుడు నే నొకఁ డను నెఱిఁగినా"ర లని
కసలి "మోరకులార! కడువిజృంభణము
లేల? యేనాఁటికినేని నాచేతి
క్రిందివా" రనుచు గర్జించి ఖేచరుల
పై కెత్తిచన వారు పఱచి రార్చుచును.
ప్రచండయుద్ధమున రావణుఁడు మూర్ఛిలుట

విబుధు లాగతి దుఃఖివశులుగాఁగఁ
గని వాలితనయుఁ డాకసమున కెగసి
దైత్యనాయకుని పాదమ్ములు వట్టి
ధరఁబడవైఁచి పాదమ్మునఁ దన్ని
రాముని కడ కేఁగె; రావణుం డపుడు
గర్జించుచును లేఁచి కడుక్రుద్ధుఁ డగుచుఁ
బదిచాపముల యందు బాణము లెక్కు-
పెట్టి వీరులను క్షోభిల్లఁగఁ జేసి
తనశ క్తిఁ బరికించి తానె యుప్పొంగు
నెడ రాఘవుం డసురేంద్రునితలలు
బాహువు లిషువులు బాణాసనమ్ము
లదవదసేసెఁ; బుణ్యక్షేత్రమందుఁ
గావించినట్టి యఘుమ్ములవో లె
నవి యంతకంతకు నగ్గలమ్మయ్యె;
అదిగని "యీతఁ డయ్యారె శిరములు
ద్రుంచియుఁ జావఁడు దుష్టుఁ" డటంచుఁ
గనలి పవనసుతాంగదనలనీల
ద్వివిదసుగ్రీవాదివీరులు తరులు
నగములు వైచిన నడుమన వానిఁ
జేపట్టి కపులను జిదిమె రక్క-సుఁడు;
హనుమత్ప్రముఖులెల్ల అప్పుడు మూర్ఛ
యందు మునింగి; రదంతయుఁ గాంచి
పఱచె ఋక్షేశుఁ డవ్వలను గోపమున.
అది ప్రదోషమ్మగు టారసి దైత్య
నాథుఁ డుప్పొంగె మనమ్మునయందు.
అగ్గించియగ్గించి యా ఋక్షనేత
తన్నుఁ గొట్టంగ దైత్యాధిపుఁ డలిగి
యతనిసేనల నురుమాడె గర్జించి;
భల్లూకపతి నిజబలములపాటుఁ
గని క్రుద్ధుఁడగుచు వక్షమ్మునఁ దాఁచెఁ;
దాఁచిన దానికిఁ దాళఁగలేక
యరదమ్మునుండి వాఁ డవనికిఁ గూలె-
నిరువదిచేతుల ఋక్షగణములఁ
బట్టి- విభావరిన్ భ్రమరముల్ లోన
వర్తింప నొప్పు నబ్జము గూలునట్లు;
మూర్ఛితుఁ గని పాదమున వాని మఱలఁ

దాఁచి శ్రీరామపాదమ్ములకడకుఁ
జనె ఋక్షపతి; దైత్యసారథి, పడిన
దనుజుని నెత్తి రథమ్మునఁ బెట్టి
కొని, రయమున లంకకుం గొని చనియెఁ;

గపులు రాముని పాదకంజసన్నిధికి
నరిగిరి మిగులహర్షాతిరేకమున;
నతిభయాక్రాంతక్రవ్యాదగణమ్ము
లాహారవముల దైత్యాధిపుఁ జుట్టె.

శ్రీరామచరితమానసము

లంకా కాండము

నవమవిశ్రామము

యదుకులతిలక! జనార్దన!
మదయుతకంసాదిదైత్యమర్దన! కృష్ణా!
మదనసహస్రాకారా!
సదయా! శ్రీమట్టపల్లిసదన! నృసింహా!

సీతాత్రిజటలసంవాదము

ఆ రాత్రి సీతామహామాతకడకుఁ
జని యెల్లకథలు త్రిజట వినిపించె.
శత్రుశిరములు భుజమ్ములు పెరుగు
కథ విని వైదేహి కడుభీతినొంది,
"తల్లి! పల్కవె జగత్తాపకరుండు
రావణుం డెట్లు మరణమొందఁగలఁడు?
రామునిక్రూరనారాచముల్ దవిలి
కూడ నాతఁడు నేలఁగూలఁ డనంగ
విధిచరిత మ్మెంత విపరీత మొకొ్క?
స్వామికమ్రక్రమజలజసన్నిధికిఁ
దొలఁగఁజేసిన నాదు దురదృష్ట మతని
బ్రదుకఁజేసినది; కపటస్వర్ణమృగము
సేసినట్టివిధాత సేసి యిదెల్ల
నిట్టిదుఃఖముల సహింపఁగఁజేసె;
జననాథ విరహనిపాక్తేషుతతుల
బాధించి బాధించి ప్రాణముల్ నిలిపి
నట్టి విధియె వాని ప్రాణము ల్నిలిపె"
నని దయాకరుని రామావనీనాథు
స్మరియించి స్మరియించి జానకీమాత
విలపింపఁ ద్రిజటయు, "*వినుమ రాఘవుఁడు
హృదయమ్మ్ము గాడఁగ నెప్పుడు శరము
సంధించు నప్పుడ చచ్చు సురారి;
అయ్యును రాఘవుఁ డట్లు సేయమికిఁ
గారణ మొక్కఁడు కలదు; రావణుని
హృదయమధ్యమ్మున నెసఁగు వైదేహి;
యీమెయెడంద రామావనీనేత
యెసఁగు; నాతనికుక్షి నీ విశ్వమెల్ల
వసియించుఁ; గాన రావణహృదయమ్ము
కొట్టిన లోకముల్ గుందు నటంచు
సంశయించెడి రామచంద్రుఁ" డనంగ
జానకి హర్షవిషాదముల్ పొందెఁ;
ద్రిజట యంతట, "సుందరీ! నీ యెడంద

---

* రావణాసురుఁడు, పరాశక్తియగు సీతాదేవిని ఏదో యొక రూపమున నుపాసించుటచేతనే మరణింపఁడయ్యెను. సక్రమవిధానమున వాఁడుపాసింపక, వామాచారమార్గమున శక్త్యుపాసనచేయుచున్నాఁడు. ఎట్లైనను వాఁడు మహాశక్తి నుపాసించుటయే అజేయుఁడగుటకు కారణమైనది. ఏక్షణమున వాఁడు శక్తిని విస్మరించునో, అప్పుడే వాఁడు నిహతుఁడగు నని శ్రీతులసీదాసస్వామివారిచట మహాగహనసత్యమును మనోజ్ఞముగఁ బ్రకటించుచున్నారు. నాస్తికమానవుని విజయమునకుఁగూడ కారణము ఏదోయొకరీతి వానిలోనుండు అవ్యక్తమైన ఆస్తికత్వమే - ఆత్మవిశ్వాసమే - శక్త్యుపాసనమే - యని మనము గ్రహింపవలసియున్నది.

బొగడుచు దుందుభుల్ మొరయించి, రసుర
వదన తేజము రామవదనముఁ జొచ్చె;
శంకరబ్రహ్మాదిసకలగీర్వాణ
సంఘ మత్యంతహర్షాన్వితమయ్యె;
తన్మధ్యమున రామధరణీధవుండు
శతకోటికందర్పసముఁడు వేంచేసి
యుండెఁ; దేజశ్శాలి యుత్సాహమూర్తి
తలపై జటారాశి, దాన మనోజ్ఞ
సుమములు, చెలువొంద సుందరనీల
నగముపై విద్యుత్సనాథనక్షత్ర
పంక్తిచందమ్మున, బౌణచాపములు
భుజదండములయందుఁ బొలుపారుచుండ,
దేహ మెల్లెడల రుధిరకణమ్ము లవి
యా తమాలమ్ముపై నలరెడి రక్త
లావుకమ్ములు గూర్కొలాగున నెసఁగ,
రామచంద్రుఁడు దయారసము వర్షించి
విబుధసంతతుల నిర్భీతులఁజేసె;
భల్లూకవానరవాహినుల్ పొంగి
"జయ దశకంఠమస్తకహరణచణ!
జయ జయ సుఖధామ! జయము ముకుంద"
యని చేసి రపుడు జయధ్వానములను.

మందోదరిమొదలగు రాణులు విలపించుట రావణుని అంత్యక్రియలు

భర్తృశిరమ్ములఁ బరికించి నంత
మందోదరీదేవి మహిఁ బడి మూర్ఛ
మునుఁగ నార్చుచు నంతిపురిగలయింతు
లెల్లఱు భోరున నేడ్చుచుఁ బఱచి
యామె లేవఁగ నెత్తి, యసురేశుఁ జుట్టి,
వానికీర్తిప్రతాపము లుగ్గడించి
యార్వఁదొడఁగిరి; మయాత్మజ కురులు
విరఁబోసికొనియుఁ గంపింప దేహమ్ము
కనుల బాష్పములు వాఁకలుగట్టి పాఱ
నేమ్చుచు నూరక యెద బాదికొనుచు
భర్తృయశఃప్రతాపములు పేరుకొని,
"నీ బలమ్మున నవనీతలమ్మెల్ల
నాథ! కంపించె నిన్నాళ్ళు;, పతంగ
చంద్రవైశ్వానరుల్ స్వామి! నీ యెదుట
తేజోవిహీనులు; ధృతిశేషకమఠ
మూర్తులు నీభారమును సహింపంగ,
నోప; రా దేహ మయ్యో నేఁడు ధూళి
ధూసరితమ్మయి దొరలెడి ధరణి;
వరుణకుబేరేంద్రవాయ్వాదులందు
నొక్కఁడు ధైర్యమ్ము నూని యా ప్రథన
భూమియందున నిన్ను మూర్ఛొనలేరు;
భుజబలమ్మునఁ గాలుఁ బొడిచిన నీవ
నాథుఁడై పడియుండ నా హృదయమ్ము
దహియించుకొనిపోవు; త్వద్భావభవమ్ము
వసుధ యెఱుంగు; నీ బలము నీ సుతుల
బలము లవర్ణ్యముల్; స్వామి! శ్రీరామ
వైముఖ్య మీవు సంపాదించుకతన
నీ దృశావస్థ నీ కేర్పడె నయ్యో
ఈ మహోన్యాయమున నేడ్చుటకైన
నొక్కఁడు మిగులఁ డో హహా విచిత్రమ్ము
దిగ్జాయకులుగూడ ధృతిసెడి నీకు
శిరమువాలిచి నమస్కృతులు గావించి;
రక్కటా, నీ బాహు లట్టివి నేఁడు
నక్కలపాలయ్యె; నాథ! ఆ గర్వ
బలమున నెందఱు పలికినఁగాని
వినక పరాత్పరు వీఁక నెదిర్చి
యి ట్లైతి వయ్యారె! యీ దైత్యవంశ
వనధనంజయుఁడయి వరలిన హరిని
మానవుఁ డనుచు సంభావించి చెడితి;
వజశంకరాదిదేవౌఘసన్నుతుని

కరుణానిధానుని గైకొనవైతి;
జన్మమాదిగను విశ్వమ్ము బాధించి
నట్టిది నీదు దేహమ్ము ప్రాణేశ!
అట్టిదానికిఁ దురీయ మిచ్చినట్టి
యతనికి వందన మాచరించెదను;
వర యోగిజనదుర్ల భమ్మగుపదము
నిచ్చిన యా రాఘవేశ్వరునంత
కరుణాజలధి యీ జగమ్మునఁ గలఁడె?"
యను మయపు త్రివాక్యము లాలకించి
యమరగణమ్ము లత్యంత ముప్పొంగె;
బ్రహ్మేశ్వరామరేంద్రముఖామరులును
నారదసనకసనందనాదులును
శ్రీరామచంద్రమూర్తిని గన్నులారఁ
బరికించి ప్రేమవిహ్వలులైరి మిపుల.
అంతిపురమ్మున నంగన లేడ్చు
విధమెల్లఁ గని విభీషణుఁ డట కేఁగి
యగ్రజుదురవస్థ కతిదుఃఖితాత్ముఁ
డగుటఁ గన్గొని కోసలాధీశ్వరుండు
పిలిచి లక్ష్మణుని "విభీషణుదుఃఖ
మపనయింపు" మటంచు నానతి వెట్ట
నేఁగి సౌమిత్రి యనేకవిధముల
నాతని నోదార్చ నా విభీషణుఁడు
చయ్యన శ్రీరామచరణసన్నిధికి
వచ్చె; రాఘవుఁడు కృపాపూర్ణదృష్టిఁ
గనుఁగొని, "యోయి! శోకమ్ము త్యజించి
యింక నగ్రజున కంత్యేష్టిఁ గావింపు"
మనవుడు నానతి నౌదలఁ దాల్చి
యెద దేశకాలము లెంచి సమస్త
కార్యముల్ విధిపూర్వకమ్ముగఁ జేసె;
మందోదరీముఖ్యమహిళలెల్లఱుఁ ది
లాంజలి యొసఁగి దయామయు రాము
దివ్యగుణములు కీర్తించుచుఁ జనిరి

ప్రాసాదములకు నిర్మలచిత్తులగుచు.

విభీషణపట్టాభిషేకము

తదనంతరము వచ్చి వైత్యానుజుండు
రాఘవుదివ్యచరణముల వ్రాలె;
నపుడు కృపాసింధుఁ డనుజునిఁ బిలిచి,
"తమ్ముఁడ! సుగ్రీవతారేయనీల
హనుమంతజాంబవదాదుల నీతి
కుశలుల నీవెంటఁగొని చని లంక
నా విభీషణుని పట్టాభిషేకమ్ము
గావించి రండు, నగర మేను జొరను;
దాతపాదులయాన తా నవిలంఘ్య;
మటుగాన నేను నాయంతటివారి
వానరభల్లూకవరులను దమ్ముఁ
బంపుచుంటి" నటంచుఁ బలికిన నప్పు
డఖిలవానరులు పట్టాభిషేకమ్ము
గావించి వినతులై గారవమొప్ప
స్తుతియించి యాతనిఁ దోడ్కొని రామ
చరణసన్నిధికి రా, స్వామి వారలకుఁ
బ్రియవచనముల సంప్రీతిఁ జేకూర్చె.
"త్వద్బలమ్మునఁ బ్రబలవైరి నిట్లు
సంహరించితి; విభీషణుఁడు రాజ్యమ్ము
పొందె; మీ కీరితి ముల్లోకములను
నిత్యనూతనము వినిర్మల మగుచు
వర్ధిల్లు; నెవ్వఁడు పరమప్రేమమున
నా కథయందు వానరశుభకీర్తి
జోడించి పాడిన సుఖములు వడయు;
సంసార మను మహాసాగరమందుఁ
జిక్క" డటంచు వచించిన దాన
సంతృప్తి వడయక సారెకుఁ గపులు
ప్రణమిల్లఁ దొడఁగిరి రామభద్రునకు.

శ్రీరామచరితవాచస్పతి

లంకా కాండము

దశమవిశ్రామము

హింసామార్గధ్వంసకఁ
హంసాత్మక! బుద్ధదేవ! అచ్యుత! కల్కి!
సంసారాంతక! దైవవ
తంసా! శ్రీమట్టపల్లిధామ! నృసింహా!

బ్రహ్మాదిదేవతలు శ్రీరాముని స్తుతించుట

స్వార్థి దేవగణమ్ము చనుదెంచి మిగుల
పరమార్థులవిధానఁ బలికిరి భక్తి;
"దీనబాంధవ! నీవు దేవతాతతుల
పై దయబూని విశ్వద్రోహరతుని
దుర్మార్గవర్తుని దుష్టునిఁ గామిఁ
జంపితి రామ! నీ సహజస్వభావ
మెఱుఁగ నేవాని కోయీ! శక్య మవని?
సముఁడవు బ్రహ్మవు శాశ్వతుఁడవు ద
యాంభోధి వాద్యుఁడ వపరిమితుఁడవు
నిర్గుణుండవు నీవు నిర్వికారుఁడవు;
మానుగ మత్స్యకమఠవరాహనర
సింహవామనులుగా శ్రీరామ! నీవె
పుట్టితి; వెప్పుడెప్పుడు సురల్ దుఃఖ
బాధితులై రప్డు స్వామి! శరీర
ధారివై హరియించి తయ్య! రావణుఁడు
దుష్టుఁడు కామమత్తుఁడు సురద్వేషి
యధమశిరోమణి యాతని కీవు
పరమపదమ్మిచ్చువైఖరిఁ జూడ
నాశ్చర్యకరము; మే మమరులమయ్య
నధికారులయ్యును స్వార్థతఁ బ్రుంగి,
త్వద్భక్తిమఱచి, యీ భవసాగరమునఁ
బడియుంటి మో ప్రభూ! పాహి! త్వచ్చరణ
జలజసన్నిధియందు శరణు పొందితి" మ
టంచు నందందున; హస్తముల్ మొగిచి
వులకితాపఘనుండు పూజ్యుఁడజుండు,
"జయ రవికులసోమ! జయ సుఖధామ!
కోవిదజనవంద్య! కోదండరామ!
భవమత్తవారణపంచాననేంద్ర!
శతకోటిదర్పకసన్నిభమూర్తి!
సిద్ధమునీంద్రసంసేవితపాద!
రావణకాలసర్పమును గోపమున
వైనతేయునియట్లు పల్లార్చినావు;
సేవకసుఖకర! శ్రేష్ఠావతార!
జ్ఞానభండార! విశ్వావనచతుర!
రాఘవ! భూమిభారహరణదక్ష!
వ్యాపకుఁ డవికారి వజుఁడవు హరివి;
దుష్టహరణమహోద్యోగమ్మునందు
నతినిపుణుండ వయ్యా! మొక్కువాఁడ
భవకంధితారక! పాపసంహార!
కారణప్రకృతికిఁ గార్యజగతికిఁ
గడునతీతుండవు కారుణ్యనిధివి;
ఎల్లరూపమ్ముల నెసఁగువాఁడయ్య
నీ వవి కా వని నిగమముల్ పలుకు;
నర్యముండును నర్యమాతప మ్మెట్లు

వేఱయ్యుఁ బరికింప వేఱుగానట్లు,
లోకమ్ముతో నీవు లోకేశ! భిన్నుఁ
డయ్యు నభిన్నుఁడ వగుదువు తలఁప;
నాదరమ్మున భవదాననశ్రీని
గన్నొనువానగుల్ కడుధన్యతములు;
శ్రీహరీ! యేల యీజీవన? మ్మేల
యీ దివ్యతనువు? నేనిట్లు త్వత్పాద
భక్తినిమాని పఁపంచమ్మునందుఁ
బడిచెడితిని స్వామి! పరికింప దుఃఖ
కరములఁ గడుసుఖకరము లం చెంచి,
విపరీతకర్మముల్ విరచించునట్టి
నా భేదదృష్టిని నాథ! హరింపు;
ఖలఖండనుఁడవు, లోకాభరణమవు;
పార్వతీశంకరవందితాంఘ్రిఁడవు;
భవదంఘ్రిభక్తి తాఁ బొయని వరము
దయసేయు మయ్య! సంతమసవిదూర!"
యని ప్రణామమొనర్చె హర్షితుఁడగుచు.

దశరథుడు శ్రీరాముని దర్శించి సత్యలోకమున కేగుట

అప్పుడు దశరథుఁ డటకు వేంచేసి
కన్నులఁ బ్రేమాశ్రుకణములు రాలఁ
బుత్త్రులఁ గనుఁగొనె; భూపతి యనుజ
సహితుఁడై జనకునిచరణకంజముల
కంతటఁ బ్రణమిల్లి యాశిషమ్ములను
గైకొని, "తండ్రి! యిక్కరణి నజేయు
రాత్రించరాధిపు ప్రమందించుఁ జెల్ల
త్వత్పుణ్యఫల" మని పలికి యెడందఁ
బూర్వప్రేమఁ దలంచి పొంగి జనకునిఁ
బరికించి స్వస్వరూపజ్ఞాన మిచ్చె;
పార్వతీ! తా భేదభక్తిని మనము
తార్చుటఁ జేసి యా దశరథుం డట్లు
ముక్తుఁడుగాఁడయ్యె; మునుకొని స్వామి
సగుణరూపము నుపాసనసేయువారు
మోక్షమ్ముగొనరు; రాముండు వారలకుఁ
బదభక్తి దయసేయుఁ; బంక్తిరథుండు
ప్రభుస్వరూప మెఱింగి ప్రణతులొనర్చి
చనియె శీఘ్రమ్ముగా సత్యలోకమ్ము.

రామాజ్ఞానుసార మింద్రుఁడు మృతవానరుల
పునర్జీవింపజేయుట

జానకీలక్ష్మణసహితుని గోస
లేంద్రునిఁ గని నిర్జరేంద్రుఁడు భక్తి,
"జయము శోభధామ! జయ రఘురామ!
వరధనుస్తూణీర బాణాభిరామ!
ఖరదూషణాది రాక్షసనాథహరణ!
యీ దుష్టరాక్షసు నిట్లు మర్దింప
నాకు లీనాఁడు సనాథుల్గె మించి;
రసురవైరీ! కరుణాకర! వరద!
బలగర్వితుండు రావణుఁడు గీర్వాణ
గంధర్వులను బరాక్రమమునఁ గొట్టి
పరులను సతతము బాధలుపెట్టె;
నా పాపఫలము నేఁ డతఁడు భోగించు;
ఎవ్వఁడు ననుఁ బోలు నీరేఁడుజగము
లం దని గర్వించి తయ్య! యిన్నాళ్ళు;
స్వామి! దివ్యములు నీ చరణముల్ గాంచి
యీ గర్వమెల్ల నేఁ డడఁగిపోయినది;
ఆగమమ్ములు నిత్య మవ్యక్త మనుచుఁ
బలుకు నిర్గుణపరబ్రహ్మముఁ గొంద
ఱెంతురు గాని, నా కేలనో నీదు
సగుణరూపమ్ముపై స్వామి! గౌరవము;
జానకీలక్ష్మణసహితుఁడై నాదు
హృదయమందున వసియింపుము; దాసు
గా నెంచి నీ పాదకంజాతభక్తి

మున రావణుని రణభూమిఁ గూల్చితిని;
బట్టము గట్టితి వానితమ్మునకు;
నింక మీమీయిండ్ల కేఁగి నిర్భీతి
నన్ను స్మరింపుఁ" డనంగ హస్తములు
ముకుళించి, "స్వామీ! ప్రభూ! యేమి చెప్పి
గాని చెల్లించుకోఁగా సమర్థుఁడవు;
కపులను దీనులుగా మది నెఱిఁగి
వారల రక్షింప వచ్చితి వీవు;
మీ వాక్యముల విని మేము లజ్జాభ
రమునఁ గ్రుంగెదము ధరణికి లోకేశ!
సాయమ్మ్రాసేయునే? జగతి దార్ఢ్యునకు
నెందేని మశకము లిది నీదులీల;"
యని వినీతిని బల్కి యపు డిండ్ల కేఁగు
నిచ్చ లేకుండియు నెల్లఱు బయలు
వెడలిరి కడుదుఃఖవివశచిత్తులయి.

సుగ్రీవాంగదహనుమదాదివానరవీరులతో
సీతారామలక్ష్మణులుపుష్పకవిమానారూఢులై
అయోధ్యకుఁ దరలుట

కపినాథపావనిగవయతారేయ
నలనీలముఖ్యవానరవీరులెల్ల
రనిమేషనయనులై యశ్రులు కనుల
నిండి పాఱఁగఁ దననెమ్మోముఁ గాంచు
విధము గన్గొని, రామవిభుఁడు ప్రేమాతి
శయమున వారిఁ బుష్పక మెక్కఁజేసి
యెడఁద విప్రాంఘ్రుల కెరఁగి, యద్దాని
సంకల్పబలమునఁ జయ్యన నుత్త
రాభిముఖమ్ముగా నప్పుడు నడుప
"జయ జయ శ్రీరామచంద్ర!" యటంచు
దిక్కు-హారములు ప్రతిధ్వను లొసఁగ
జయజయధ్వానముల్ సలిపిరి కీశు;

లా విమానమ్ముమధ్యమున రమ్యమ్ము
నత్యున్నతమ్మగు హాటకాసనము
పైని జానకి తనవామపార్శ్వమున
నొప్పార రత్న సానూజ్జ్వలదివ్య
కందరమ్మునఁ గాలకంధర మొకఁడు
విద్యుత్సనాథము వెలుఁగుచందాన
రామచంద్రుండు విరాజితుఁడయ్యె;
ఆ విమానము చను నధ్వమునందు
నమరులు కల్పలతాంతముల్ గురిసి;
రత్యంతసుఖదములయి మూఁడువిధము
లగు వాయువులు వీచె; నబ్ధితటాక
శైవలినీక్షురజలములు నిర్మ
లములయ్యె; నప్పుడు రామచంద్రుండు,
"జానకీ! కనుగొంచె సంగ్రామభూమి;
యిచ్చోటనే సుమీ యింద్రునిఁ గెల్చు
మేఘనాదాఖ్యు సౌమిత్రి వధించె;
హనుమదంగదులచే హతు లల్ల వార
లిటఁ గుంభకర్ణుఁ డియ్యెడ రావణుండు
పడిరి నాచేత; నా పట్టున సేతు
వేను రచించితి; నిచ్చట భక్తి
శివుఁ గృపాకరుఁ బ్రతిష్ఠించితి" ననుచుఁ
బలికి జానకిఁ గూడి వందన మ్మొప్పఁ
గావించి విశ్రాంతిగైకొన్న తావు
లెల్లఁ జూపించుచు నేఁగి, రయమునఁ
బరమరమ్యము మునివరశోభితమ్మ్రొ
ందకాటవిఁ జొచ్చి, తగమునిగణము
లాశిషమ్ము లొసంగ, నచ్చోటుఁ బాసి
చిత్రకూటమ్ము వేంచేసి, యచ్చోటి
ఋషుల నెల్లఱను హర్షితులఁ గావించి
యటు బాసి, సకలకల్యాఘ*హారకము
యమునను జూపించి, యామీఁద ద్రిపథ

* ఆఘము = అఘముల (పాపముల) సమూహము.

గామినియైన గంగామాతఁ జూపి,
"వై దేహి! వీరికిఁ బ్రణతులుసేయు ;
మది పావనమ్మ్ర ప్రయాగతీర్థమ్మ్ర;
పరమపవిత్రమై పరగు త్రివేణి
యది; పాపహారకుఁడగు హరి పరమ
పదమును జేర్చు సోపానసంచయము;
తాపత్రయమ్మ్రను దహియించునదియు
భవరోగహారియుఁ బావనమ్మ్ర నగు
సాకేతనగరము జానకీ! కంటె"
యని పులకితదేహుఁడై బాష్పనేత్రుఁ
డై ప్రణామమ్ములనప్పు డొనర్చి
యా త్రివేణీసంఘమందున డిగ్గి
స్నాతుఁడై వానరసహితుఁడై విప్ర
తతులను బూజించి దానము లిచ్చి
సామీరిఁబిలిచి "తక్షణ మీవు బ్రహ్మ
చారిరూపము దాల్చి సాకేత మేఁగి
యస్మదాగమనమ్ము నచ్చట భరతు
నకు వినిపించి యన్నా! ర" మ్మనంగ,
సామీరి చయ్యనఁ జనియె; శ్రీరాముఁ
డంత భరద్వాజునాశ్రమమ్మునకుఁ
జనిన, మహర్షి పూజలుసల్పి, పిదప
నాశీస్సు లిచ్చిన నందఱు మునికి
మ్రొక్కి సద్భక్తిని ముందరికరిగి;
రచట శ్రీరాముని యాగమనమ్ము
విని నిషాదవిభుండు వేగిరఁపడుచు
నావలన్నియును సన్నద్ధముసేయు
నవసరమ్మున, వ్యోమయానము గంగ
దాఁటి రాముని యాజ్ఞఁ దలఁదాల్చి తీర
మందున డిగియె; మహామాత సీత
గంగ కర్చనలిచ్చి క్రమాంఘ్రికంజ
ములఁ బ్రణమిల్లిన ముదితయై యామె,
"అమ్మ! సీతమ్మ! ముత్తైదువతనము
పదికాలములు నిల్వ వర్ధిల్లు" మనుచు
మనమున దీవించె; మాన్యుఁడు గుహుఁడు
పరువిడి శ్రీరామభద్రుని గాంచి
యానందమగ్నుఁడై యప్పుడు దేహ
స్మృతిఁ గోలుపోయి మహిం బడ, దానిఁ
గని పరమప్రేమఁ గౌసల్యసుతుఁడు
వాని నక్కునఁ జేర్చి పార్శ్వమునందుఁ
గూర్చుండ నియమించి కుశలము లడిగి,
"శంకరబ్రహ్మేంద్ర సంసేవితములు
శ్రీచరణములు దర్శించినకతనఁ
గుశలుండ నేను కాకుత్స్థకులేంద్ర!
ఆనందధామ! రామా! పూర్ణకామ!
నా నమస్కృతు లివే, నాథ! గైకొనుమ"-
అని గుహుం డాడిన హర్షించె మదిని.
అన్నివిధంబుల నధముఁ డా గుహునిఁ
బరిరంభణముఁజేసె భరతునిఓలె-
శ్రీహరి రాముఁడు సీతావిభుండు!
అహ! యట్టిప్రభుని మహామందుఁడైన
యీ తులసీదాసు ఁడెద ఁగొల్వ మఱిచె-
మోహవశంబున మూఢాత్ముఁ డగుచు.

ఫలశ్రుతి

అతిపావనము రావణారిచరిత్ర
రామపాదాబ్జానురాగదాయకము!
కామాదిహర ముగ్రకలుషవారకము
విజ్ఞానకరమాట, విడువక సతము
సురసిద్ధమునులు నిస్తులభక్తితోడ
గానంబొనర్చి సుఖం బొందుచుంద్రు.
రఘువీరుపావనరణవిజయంబు
విను విజ్ఞులకు రామవిభుఁ డిచ్చుఁ బ్రీతి
విజయవిభూతివివేకముల్ సతము.

వెడఁగుమానసమ! నీ విది విచారింపు:
కలికాల మిది మహాఘములకు నెలవు;
శ్రీరామనామాతిరి క్త మెయ్యదియు–
నిప్పుడు ని న్నోమ దిది నిక్క–వమ్మ!

శ్లో. మట్టపల్లినివాసాయ
మచ్చి త్తాంబుజభానవే.
రమా దేవీస మేతాయ
నృహర్యా ఖ్యమంగళమ్.

ఓమ్!

ఇది గుణసాగరుఁ డీశపదాబ్జ
పుష్పంధయుండును బూజ్యపాదుండు
విమలయశోనిధి విశ్వకల్యాణ
కాంక్షి మహాత్ముఁ డంకంపల్లి వాసి
పరమవదాన్యుండు పాపభీరుండు
పాటీలువంశాబ్ధిపార్వణవిధుడు
నైన గోవిందార్య నాత్మజాతుండు
సజ్జననమ్రుండు స్వామిభ క్తుండు
విశ్వనాథమహాకవీంద్రులశిష్యుఁ
డైన తిమ్మారెడ్డి యాంధ్రీకరించు
కలిమలవిధ్వంసకమ్ము రమ్యమ్ము
సరళము శ్రీరామచరితమానసము
నందు లంకాకాండ మది సమా ప్తమ్ము.

ఓం తత్సత్

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరామచరితమానసము

ఉత్తరకాండము

సప్తమ సోపానము

ఓమ్

శ్రీరామ జయరామ జయజయరామ

శ్రీరామచరితమానసము

ఉత్తరకాండము

సప్తమసోపానము

ప్రథమవిశ్రామము

శ్రీకంఠార్చితః సజ్జన
నాకౌకోనోకహాః ప్రణతపాలకః వి
ద్యాకంజాకరబాలవి
భాకరః అవధారు మట్టపల్లి నృసింహాః

సీ. శ్రీకంఠకంఠాభశృంగారనీలాంగు
శోభాసనాథుని సుప్రసన్ను
శరశరాసనధృతచారుకరాంబుజు
సరసిజదివ్యవిశాలనేత్రు
విప్రపదాంకితవిపులమహోరస్కు
జనకసుతాచిత్తజలజమిత్రు
సకలబాంధవహితసంసేవ్యమానుని
వానరభల్లూకవరసమేతు
రఘుమహాన్వయాంభోధికైరవహితు ఘను
సురవరేణ్యునిఁ బీతవస్త్రిని శుభాంగు
లోకవంద్యుని హరిని సుశ్లోకచరితుఁ
బుష్పకారూఢుఁడైన రాము న్నుతింతు.

తే. అజమహేశవందితము లత్యంతమంజు
లములు జానకీహస్తాబ్జలాలితమ్ము
లఖిలభక్తచిత్తభ్రమరాలయములు
కోసలేంద్రపదాబ్జముల్ కోమలములు.

తే. ఇందుకుందసన్నిభగౌరసుందరాంగు
నీప్సితార్థప్రదుని సతీహృదయనాథు
నంబుజమనోజ్ఞనేత్రు దయాసముద్రుఁ
గామగర్వాపహారి శంకరునిఁ దెలఁతు.

శ్రీమద్భానుకులాబ్ధిసోమ! కరుణాసీమా! పరంధామ! శ్రీ
రామా! శ్రీతులసీమహర్షికృతమున్ రామాయణమ్మున్ దెలుం
గేమానోజ్ఞము సేయనుంటినిఁ బ్రభూ! యీవందుసాయమ్ముగా
స్వామీ! యుత్తరకాండసద్రచనవిశ్వఖ్యాతమైమించుతన్.

కథాప్రారంభము

శ్రీసతితోడ నా శివుఁ డున్నవిధము
గరుడునితోడ న క్కాకభుశుండి
పలికిన శ్రీరామవరచరిత్రమ్ము

దెలఁచు = నమస్కరించు.

తక్కినకథ సవిస్తరముగా వినుతు:
ఇక నొకదినమున నేతేరనుండె
సాకేతమునకుఁ గౌసల్యాసుతుండు;
పౌరు లత్యంతసంభ్రమచిత్తులయిరి;
రామవియోగకారణకృశులైన
స్త్రీలును బురుషులు తెన్నులుచూచు
చుండి; రంతటఁ బెక్కుశుభశకునములు
గాంచి యానందమగ్నాత్ములై రెల్ల
వారు; శ్రీరాముఁడు వచ్చెడువార్త

శ్రీరామ విరహార్తుఁడగు భరతునకు
శుభశకునములగుట భరత
హనుమత్సమాగమము

మున్నె చెప్పుట కీనఁ బురమునల్లడలు
రమణీయరమణీయరమణీయమయ్యె;
వై దేహితోడ నవరజునితోడ
నరుదెంచె రఘుపతి యనువార్త నెప్పు
డెవ్వరు తెత్తురో యేగతి ననుచు
మదులఁ గౌసల్యాదిమాత లాతురము
పడుచుండి; రచ్చట భరతుఁడు తనదు
దక్షిణభుజమును దక్షిణాక్షియును
గొట్టిన నిది సుశకున మని యెడఁద
హర్షమ్ము నందియు, "నయ్యో మఱొక్క
దిన మింకఁ గల దవధి" యటంచు మిగులఁ
జింతించి మది నిట్లు చింతింపసాగె:
"రాముఁడు రానికారణ మేమియగునో?
ననుఁ గుటిలుం డని నాథుఁడు మఱచి
పోయెనో? లక్ష్మణుభూరిభాగ్య మ్మ
దెంతటిదోగదా! యెల్ల వేళలను
శ్రీరామపాదరాజీవముల్ గొల్చుఁ;
గపటి కుటిలుఁ డని కాబోలు నాఁడు
నాథుఁడు గొనిపోఁడు ననుఁ దనవెంట;
ప్రభుఁడు నా చేతలపయి ధ్యానముంప
శతకోటికల్పముల్ సాఁగినఁగాని
తారక మున్న దే? తనవారితప్పు
లెన్నడుఁ బ్రభుఁడు తా నెన్నఁడు మృదుల
భావుఁడు నిరతార్తబాంధవుఁ డగుట.
ఈ శుభశకునము లీక్షింప నాకు
రాముఁడు తప్పక రాఁగలఁ డనుచు
ధైర్య మున్నది; గాని, దాఁటియు గడువు
ప్రాణమ్ము లివ్వి పోవకయున్న యధముఁ
డింక నాకంటెఁ దా నెవ్వఁడు జగతి?"
నని రామవిరహాబ్ధియందున మగ్న
హృదయుఁడౌ భరతుఁ డున్నెడ కొకనావ
విధమున సద్యోప్రవేషముబూని
పవనకుమారుండు వడి నేఁగుదెంచి,
"శ్రీరామ! శ్రీరామ! శ్రీరఘురామ!"
యనుచు జపించుచు నశ్రులజార
నతికృశుండగుచుఁ గుశాస్తరణమునఁ
గూరుచున్న జటాముకుటధారిఁ గాంచి,
పులకింప దేహము ముదమొంది కనుల
నశ్రువుల్ గ్రమ్మఁ గర్ణామృతమ్ముగను
"నిదె వచ్చె నిదె వచ్చె నెవ్వనివిరహ
మున నీ వహోరాత్రములు విచారింతు
వెవ్వనిగుణగణ మెపుడు జపింతు
వా రఘుకులనాథుఁ డా సురత్రాత
కుశలమ్ముగా శత్రుకోటుల ఘోర
సంగ్రామమందున జంపియు ననుజ
సీతాసమేతుఁడై శ్రీ లుల్లసిల్ల
సుమనోచయమ్ము సుశ్లోకింప" ననుడు
నది విని తనదుఃఖమంతయు మఱచి
భరతుఁడు "తండ్రి! యెవ్వారు మీ రిచటి
కెందుండి వచ్చితి రెంతయుఁ బ్రీతి

పాత్రముల్ వచనముల్ పల్కితి" రనిన
హనుమానుఁడనియె, "నే ననిలసుతుండ;
హనుమంతుఁ డనువాఁడ నగచరకులుఁడ,
దీనబంధుని రఘు దేవుని భటుఁడ
నన విని భరతుఁ డత్యాదర మొప్ప
లేచి యాతనిఁ గౌగిలించె; నవ్వేళ
హృదయమ్మునన్ బ్రేమ యెంతని చెప్పఁ,
బులకించె మే నశ్రుపూరము గ్రమ్మ
నప్పుడు భరతుఁడు, "హనుమంత! నీదు
దర్శనమ్మున సమస్తములు దుఃఖమ్మ్ము
లింతటితోఁ దీరె నిట్లు; రాముండు
ప్రీతిపూర్వకముగ వేంచేసె నిటకు"–
నని కుశలములు పొనఁపుణ్యముగను
నెంతయు నడిగి, "నీ కే మిచ్చువాఁడ?
జగతి లే దొక్క డీ సందేశమునకు
సాటివచ్చున, దెట్లు పరికించి చూడ;
నీగఁజాలను దండ్రి! యీ నీ ఋణమ్ము;
ప్రభుచరిత్రము వినుపంగ దే" యన్న
భరతుపాదములకుఁ బ్రణమిల్లి హనుమ
రాముని కథ సకలమ్ము విన్పించె.
అప్పుడు భరతుండు, "హనుమంతఁ చెపుమ
కరుణాబ్ధి తన దాసుగా నెప్పుడైన
నను స్మరియించునే," నావుడు హనుమ
యాతనినమ్రవాక్యమ్ముల కలరి
పులకితుఁడై పాదములపయి వ్రాలి
"సకలచరాచరస్వామి శ్రీరాముఁ
డెవనిగుణమ్ముల నెపుడు వర్ణించు
నట్టి యీ భరతుఁ డత్యంతవినమ్రుఁ
డతిపునీతుండు గుణాబ్ధి కాకున్నె?"
యని యెంచి, "నాథ! నీ వా రాఘవునకుఁ
బ్రాణప్రియుండ వీ పలుకు సత్యమ్ము"–
నావుడు భరతుఁ డానందాబ్ధి మునిఁగె.

అయోధ్యకు శ్రీరామాగమనము

భరతుపాదములకుఁ బ్రణమిల్లి హనుమ
వెంటనే శ్రీరామవిభుచెంతఁ జేరి
యెల్ల తి క్షేమము లెఱిఁగింప నతఁడు
హరించి యా వ్యోమయానము నెక్కి
సాకేతపురిదెస సాఁగె వైళమ్మ.
ఇట భరతుండు తా నేఁగి యయోధ్య
కచ్చటి గురుల కిదంతయుఁ జెప్పి
రాముఁడువచ్చువార్తను జెప్పి పంపె
నంతఃపురమ్మున; కట రాజమాత
లందఱు పరువిడి యరుదేరఁ బ్రభుని
సేమ మెల్ల ఱికును జెప్పెను మఱల;
అదివిని పౌరులు హర్షాత్ములైరి;
దర్భగోరోచనదధిఫలపుష్ప
మంగళతులసికామాలికాప్రముఖ
సత్పదార్థమ్ములు స్వర్ణ పాత్రములఁ
గైకొని సింధురగామినుల్ నడచి;
రున్నవా రున్నట్లు యొగిఁ బరువిడిరి;
వృద్ధబాలాదుల వెంటఁ గొంపోరు–
ప్రక్కవారలఁ జూచి "ప్రభునిఁ గృపాబ్ధి
రామునిఁ జూచితివా?" యనుచుందు;
రి ట్లయోధ్యాపురియెల్ల రాఘవుఁడు
వచ్చుటఁ దెలిసి శోభావహమయ్యె;
ఆహ్లాదసంధాయకానిలత్రయము
లల్లనల్లన వీచె; నతిస్వచ్ఛమయ్యె
సరయూతరంగణి; సంతోష మొప్ప
గురువర్యులను రిపుఘ్నునిఁ బరిజనము
విప్రుల మాతల వెంటఁబెట్టికొని
ప్రభునిసన్నిధికి నా భరతుఁడు వెడలె;
జనము లెల్ల ఱును ప్రాసాదము లెక్కి–
య వ్యోమానముగాంచి హర్ష ముప్పొంగ
మంగళగానముల్ మహితస్వరమునఁ

బాడిరి; రఘునాథపార్వణచంద్రుఁ
గని యయోధ్యామహోకంధి యుప్పొంగి
లిఁ జేసెఁ గోలాహలమ్మును సుంద
రాంగనాదివ్యతరంగాలవలన;
భానుకులాంబుజభానుఁ డచ్చోటఁ
గపివర్యులకు నన్నగరమనోహరతఁ
జూపుచు "లంకేశ! సుగ్రీవ! వాలి
తనయ! యీ నగర మత్యంతపునీత
మెంతయు సుందర మీ దేశమయ్య!
కోటివిధాల వైకుంఠప్రశ స్తి
వేదపురాణముల్ వినిపించు; సకల
జను లెఱుంగుదు; రయ్యా సాకేతమువలెఁ
బ్రియముకా దది నాకు; వినుఁ, డొక రిద్ద
రెఱుఁగుదు రిద్దాని; నీ సుమనోజ్ఞ
పుటభేదనమె జన్మభూమియూ; దాని
యుత్తరదిశ సరయూనది పాఱుఁ;
బరమపునీత మీ వాహిని మజ్జ
నముసేయఁ గాంతురు నాదుసామీప్య;
మెంతయుఁ బ్రియులు నా కిందలి పౌరు;"
లను ప్రభువాక్యము లాలించి కపులు
హర్షించి; రెంతధన్య మె రామచంద్రుఁ
డంతగఁ బొగడిన యీ నగరమ్ము;
పౌరులు తనకయి వచ్చుట యెఱిఁగి
నగరమీవల విమానమ్మును నిలువఁ
బంచిన నది భూమిపై నట డిగియె;
పుష్పకముం డిగి భూనేత "యింక
నీ వైలబిలునిసన్నిధి కేఁగు" మనిన
నంతరంగమునందు హర్షదుఃఖములు
బెనఁగొన రామునివీడ్కొని చనియె.

శ్రీరామభరతసమాగమము

ఆగతిఁ గృశతనులై కూడి భరతు,
వచ్చియున్న వశిష్ఠవామదేవాది
మునులను గాంచి ప్రభుండును విల్లు
నమ్ముల నిడి క్రింద ననుజయుతుఁడయి
యడుగుల కెరఁగె; దేహము పులకింపఁ
బ్రభువరు నంతటఁ బైకెత్తి వారు
పరిరంభణమొనర్చి ప్రశ్నింప సుఖము,
"మీ కృపచే నేమమే" నని పలికి
ధర్మధూర్వహుఁడు సద్బ్రాహ్మణపంక్తి
చరణసన్నిధిని శీర్ష మ్మది వంచె;
భరతుఁ డంతట సుపర్వాణులు మునులు
శివుఁడు బ్రహ్మయు నమస్కృతిసేయునట్టి
ప్రభునిపాదాబ్జముల్ పట్టి నేలపయిఁ
బడియుండి లేవఁడు పైకెత్తికూడ;
అంతఁ గృపాసింధుఁ డతికష్టమునను
లేవఁగా నెత్తి యాలింగనమందుఁ
గొనియె దేహమ్ము గగురొడువంగఁ
గన్నుల జల మోడికల్గట్టి పార;
సోదరు లట్లొక-చోటఁ జేరంగఁ
దచ్ఛోభ నుపమింపఁ దరమె యెవ్వరికిఁ?
గడువడి ప్రేమ శృంగారముల్ దేహ
ధారులై కూడువిధమ్మున నొప్పె.
ఆ కృపానిధి 'సేమమా?, యని యడుగుఁ
గాని హర్షాతిరేకమ్మున భరత
వదనమునందుండి వాక్కులే రావు;
పార్వతీ! విను మనోవాగతీతమ్మౌ
తత్సుఖ మనుభోక్తతప్ప వేఱొక్కఁ
డందరానిది; అప్పు డనేఁ గైకతనయుఁ
"డార్తుం డనుచుఁ గోసలాధీశ! దర్శ
నమ్మిచ్చితివి దాసునకుఁ గుశలమ్మ;
విరహసాగరమున వెస మున్గు నాకుఁ
జేయూత నిచ్చి రక్షించితి స్వామిఁ
యన విని హర్షించి యామోదఁ బ్రభుఁడు

చిన్నతమ్ముని నెద సేర్చి మన్నించె;
అటుపయి భరతున కపుడు లక్ష్మణుఁడు
ప్రొక్కి శత్రుఘ్నుని ముదమున నెడఁద
హ త్తించుకొని దుస్సహవిరహజన్య
దుఃఖమ్ము నీఁగె; శత్రుఘ్నునితోడ
భరతుఁడు వై దేహిపాదాల కెరఁగి
పరమసౌఖ్యమ్ము సంపాదించుకొనియె.

శ్రీరామసంయోగమునకుఁ
బౌరజనుల మహోత్సాహము

ప్రభుదర్శనమ్మునఁ బొరు లత్యంత
హర్షమ్మునఁ గాంచి; రి ట్లఖిలజనములు
ప్రేమవిహ్వలులౌట శ్రీరామవిభుఁడు
ఖరవైరి కరుణాబ్ధి గాంచి యవ్వేళఁ
గావించె నొకచమత్కార మసంఖ్య
మగురూపములు దాల్చి యప్పు డెల్లజీని
గడకసంభావించి కరుణార్ద్రదృష్టి
నెల్ల తిశోకము లీఁగఁగాఁ జేసె;
భగవానుఁ డిట్లు శాంబరిక్షణమందు
నందరిఁ గలియు రహస్య మొక్కఁడును
గుర్తింప లేఁడయ్యె; గుణధాముఁ డంత
జనియె ముందునకుఁ; గౌసల్యాదు లటకుఁ
గ్రొత్తగ నీనిన గోవు మేయంగ
నడవుల కేఁగి సాయంవేళ నింటి
కడనున్న తనక్రేపు జ్ఞప్తిరాఁ జనులఁ
బొలు వాఁకలుగట్ట బరువిడి యింటి
కంభారవమ్ముల నరుదెంచుపోల్కిఁ
జనుదెంచి యగణితసౌఖ్యహర్షములు
పొంది; రంత సుమిత్ర పుత్త్రుని రామ
పాదానురాగమ్ము భావించి వారిఁ
గూడెఁ; గైకేయి సంకోచమ్ముతోన
నందఱఁగూడె; నా యవసరమందు

సౌమిత్రి తల్లులచరణకంజముల
ప్రొక్కి యాశీర్వాదములు గొని మించె;
జానకి యత్తల చరణకంజముల
ప్రొక్కిన వారును ముదితలై కుశల
మడిగి నీ మాంగల్య మచలమౌ ననుచు
నాశిషమ్ము లొసంగి; రామోద వార
లఱులఁ గారెడి యశ్రుసంమోహ
మశుభసూచక మగు నని యాపుకొనుచు
బంగారురంగారుపళ్ళెరమ్ములతో
నారతులిచ్చి రత్యాదర మెప్పఁ;
దమ యెడందలయందు, "దశకంఠ వీర
లెట్లు ప్రమదించిరో యెంతయు బొలు
రతిసుకుమారు; లయ్యారె రక్కసులు
క్రూరు" లంచును వెఱగుంబొంది; రప్పు
డఖిలవానరులు నరాకృతులు గొని
భరతునిప్రేమస్వభావము భక్తి
నగరవాసులమహానందము గాంచి
యంత వారలఁ గొనియాడిరి ప్రీతి;
ఆమోద రాఘవుఁ డార్యవశిష్ఠ
పాదకంజములకు వానరవరుల
ప్రొక్కించి "మిక్కిలి పూజ్యులు మాకుఁ
గులగురువు" లటంచుఁ గొనియాడి గురుల
వదనమ్ముఁ జూచి "దేవా! మునిచంద్ర!
హితులుసుమీ నాకు నెల్లఱు వీరు
సంగ్రామసాగరసంతరణమున
నాకుసాయమ్మైరి నౌకలయట్లు;
నాకయి తమదుప్రాణము లొడ్డినారు;
ప్రాణాధికులు నాకు భరతునికన్న"—
నను వచనమ్ముల నాలించి కీశు
లతిహర్షసంభరితాత్మకులైరి;
కపివరు లంతటఁ గౌసల్యచరణ
కంజములకు ప్రొక్కఁగా నామె "రాము

నట్లుగాఁ బ్రీతిదాయకు" లని పలికె;
పిదప శ్రీరాముఁడు వేంచేసెఁ దనదు
ప్రాసాదమునకు నభ్రంకషభవన
భాగమ్మున న్నిల్చి పరమహర్షమునఁ
బురుషులున్ స్త్రీలును బుష్పముల్ గురియ;
బంగారుకలశముల్ ధ్వజములు దీర్చి
గృహము లెల్ల నలంకరించిరి ప్రీతిఁ;
బన్నీట వీథులు పరిశుభ్రపరచి
ముక్తామణులచేత ముగ్గులు పెట్టి,
రానందతూర్యము లతివేల మయ్యె;
సకలయావతములు స్వర్ణపాత్రముల
నా ర్తిహరుండు సూర్యాన్వయపద్మ
వనహేళి యగు రామభద్రున కప్పా
డారతు లిచ్చె నత్యాదర మొప్ప;
అ ప్పురి దివ్యశోభాతిశయమ్ము
కల్యాణమయధామగరిమ వర్ణింపఁ
బాపజేఁడును సరస్వతియుఁ బ్రౌమినుకు
లోపుదురో కాక యోపరో గాని
సాధారణులకు దుశ్శకము జగాన.
సాకేతకల్యాణజలజాకరస్థ
స్త్రైణోత్పలములు విరహచండతపనుఁ
డస్తంగతుండై మహాకాంతితోడ
దాశరథీకుముదపిణ్యోదయముఁ
బొడఁగాంచి మిగులఁ బ్రఫుల్లము లయ్యె;
శుభశకునమ్ములు చూపట్ట గగన
వీథిని కాహళభేరికాపటహ
మంగళారావసమ్మర్దముల్ నిగుడ
నఖిలపౌరులను గృతార్థులఁజేసి
ప్రాసాదమున కేఁగెఁ బ్రభువతంసుండు;
మనమున నెంతయు మాత కైకేయి
గొదుకుటఁ గని రఘుకుంజరుం డామె
ననునయించెను బహూపాయముల్ సేసి.

శ్రీరామపట్టాభిషేకమహోత్సవము

ఆ పిమ్మటన్ వసుధామరవరులఁ
జెచ్చెరఁ బిలిచి వశిష్ఠుఁడు "విప్ర
వరులార! నేఁడు సర్వవిధాలఁ బుణ్య
దినమాట మీ రానతిచ్చిన రామ
చంద్రుఁ గృపానిధి స్వర్ణసింహాస
నాసీనుఁ జేసెద" ననిన హర్షించి
"శ్రీరామరాజ్యాభిషేకము సర్వ
జగతికి మిక్కిలిసంతోషకరము;
సంయమివర! యలసత భజింపంగ
నేల? సన్నాహములెల్లఁ జేయింపుఁ"
డన వశిష్ఠుండు మహామాత్యుఁడైన
యా సుమంత్రునకు నీ యఖిలముఁ జెప్ప
నాతఁడు వైశ్య యరదముల్ గజము
లశ్వముల్ దెప్పించి యన్నిదిక్కులకుఁ
బుచ్చె దూతల; వారు వోయి యీ వార్త
నాశ్చాంతములఁ జాటి యరుదెంచి మఱల
మంత్రికడన్ నతమస్తకులైరి.
సమలంకృత మ్మయ్యె సాకేతపురము;
పరమరమ్యమ్మగఁ బైనుండి పుష్ప
వృష్టిసాగించిరి బుభువులు ప్రీతి;
సేవకులం బిల్చి శ్రీరఘునేత
"సఖులనెల్లఱను సుస్నాతులఁజేయుఁ
డని వచించిన వార లరిగి సుగ్రీవ
జాంబవత్ప్రముఖుల స్నాతులఁజేసి;
రంతఁ గృపానిధి యనుజుని భరతు
రావించి యా జటారాశిని స్వీయ
కరములఁ దొలఁగించి కడపట మువ్వు
రనుజులచే స్నాన మపుడు చేయించె;
భరతునిభాగ్యము ప్రభునికోమలత
యర్బుదాహీంద్రుల కగునె వర్ణింప?
అంతట గురువులయనుమతి వడసి

రాముఁడు నిజజటారాశిని వీఁడి
స్నాతుఁడై నూత్నవస్త్రాభరణములు
దాలిచి కోటికందర్పులు లజ్జ
వడఁగ నత్యంతశోభాఢ్యుఁడై మించె;
అత్తలు మైథిలి నాదరమొప్ప
నప్పుడు జలకము లాడించి ప్రీతి
దివ్యదుకూలముల్ దివ్యభూషలును
గైసేయఁగా నిచ్చి, కంజాక్షువామ
పార్శ్వమునన్ రమాభగవతియోజ
వెలసెడు నాయమ వీక్షించి తమదు
జన్మముల్ నాఁటితోఁ జారితార్థ్యమ్మొ
పొందినవనుచుఁ బ్రమోదించి రెదల;
ఖగరాజ! వినుము శంకరమఘువాజ
ముఖ్యులౌనిర్జరుల్ మునులును వ్యోమ
యానాధిరూఢులై యానందకందు
దళితమహామోహు ధవళాంబుజాక్షు
దర్శింపవచ్చి రత్యంతము భక్తిఁ;
బ్రభుని యా దివ్యశోభను బరికించి
ప్రేమాబ్ధిమగ్నుఁడై వేగ వశిష్ఠుఁ
దనుపమ మతిలోక మతిమనోజ్ఞమ్మొ
శతకోటిమార్తాండసన్నిభ తేజ
మగు నొక్క రత్నసింహాసన మటకుఁ
దెప్పించె; నంత భూదేవుల కెరఁగి
యా మహోన్నతము సింహాసనమ్ముపయి
రామచంద్రుండు విరాజితుఁడయ్యె;
జానకీసహితు దాశరథిని గాంచి
మునిజనమ్ములు మనమ్ముల సంతసించి
రాగమమంత్రము లవనీసురాళి
గావించె; నభమార్గమ్మున నిలిచి
జయజయధ్వానముల్ సలిపిరి సురలు.
రాముని దివ్యశీర్షమ్మునయందు
రత్నస్థగితము స్వర్ణమయమ్మొ దివ్య
భూరికిరీటమ్మొ బూన్చి వశిష్ఠుఁ
డాతనిఫాలమునందునఁ దిలక
మద్దె; ననంతర మఖిలభూదేవ
తతులును దిలక మాతనిలలాటమునఁ
దీర్చిరి; తల్లులు దివ్యసింహాస
నాసీనుఁ బుత్రికు నప్పుడు గాంచి
యానందభరితులై యారతు లిడిరి;
రాముఁ డామోద విప్రాళి కనేక
భూరిదానమ్ములు పొలుపొంద నిచ్చె;
ఆ యయోధ్యాపురి నాసనస్థుఁ డగు
త్రిభువనస్వామిని శ్రీరామచంద్రుఁ
గనుఁగొని త్రిదశు లాకసమునఁ గూడి
మొరయించి రట దుందుభులు రభసమున;
గిన్నరగంధర్వగీతముల్ మించె;
నప్సరోదివ్యనాట్యమ్ములు చెలఁగె;
భరతలక్ష్మణు లాతపత్రచామరము
లతిభక్తి ధరియించి; రపుడు వీజనము
దాల్చె శత్రుఘ్నుఁడు; దనుజసమీర
తనయసుగ్రీవాంగదాదులు ధనువు
కత్తియు డాలు భీకరశక్తిఁ బూని
శ్రీరామచంద్రుని సేవించి నిలిచి;
రప్పుడు శ్రీయుతుండై భానువంశ
భూషణుం డగు రఘుపుంగవుఁ డొప్పె-
శతకోటికందర్పసన్నిభుఁడగుచు;
సజలజలదనిభశ్యామదేహమునఁ
బీతాంబరమ్ము శోభించుటఁ గాంచి
యెడఁదల సురలు మోహితులైరి మిగుల.
ముకుటకేయూరకముఖ్యభూష లవి
చిత్రభానూజ్వలశ్రీతిరస్కారు
లంగాంగమునను మహాకాంతి నించె.
జలజాతనేత్రు విశాలవక్షస్కు-
న్నతభుజుని మహోన్నతచాపు

నపుడు దర్శించిన యా నరుల్ ధన్యు;
లయ్యా! విహంగేశ! యా మహాశోభ
యా సుఖమ్ము సమాజ మది యేమి చెప్ప?
శారదా శేషులున్ జాలరు పొగడ-
నొక్క-మహా దేవుఁ డోపును గాని;
దివిషదు లాతనిఁ దెలచి సన్నుతులఁ
స్వస్థానములకునై చని రతిభక్తి.

వేదములు శ్రీరాముని స్తుతించుట

అప్పుడు వందులయాకృతుల్ పూని
యాగములు నాలు గటకు వేంచేయఁ
గరుణానిధానుండు కడు గారవించె;
నీ రహస్య మ్మవనీంద్రుఁడుతక్కఁ
బరు లెవ్వ రెఱుఁగరు; పదపడి నవియు
శ్రీరామచంద్రుఁ గీర్తింపఁ దొడంగె:

గేయములు

జయ సగుణనిర్గుణరూప! భూపశి
రోమణీ! రఘునాయకా!
దశకంధరాదిప్రచండనిశిచర
ప్రబలఖలభుజబలహరా!
ఇల నరుఁడవై హరియించి భూభర
మమితదుఃఖము లడఁపవే?
జయ ప్రణతపాల! దయాళు! ప్రభు! ఓ
శక్తిసహిత! నమస్కృతుల్,

నీ విషమమాయను బడి సురాసుర
నాగనరు లీయెల్లఱున్
భవపంథభ్రమితులు కాలకర్మగు
ణాల రాత్రిందివములన్
ఇదె నీ కృపాలోకమునచేఁ దా
పత్రయమ్ములు దొలఁగెడిన్

భవభేదనాశకదక్షు! కావుము
రాము! సతము నమస్కృతుల్,

అజ్ఞానమానప్రమత్తతన్ భవ
హరుని భక్తిని మఱచుచో
నా దేవదురభపదము నొందియుఁ
బతనమగుటను గానమే?
ఇఁక నాశలను విడి నమ్మి నిను నీ
నామమును జపియించుచో
వాఁడ శ్రమమ్ముగ దాఁటు నీ భవ
సాగరమ్ము నమస్కృతుల్.

బ్రహ్మేంద్రరుద్రాద్యర్చితాంఘ్రి!
పావనీకృతమునివధూ!
జయ నఖవినిర్గతమునిగణార్చిత
లోకపావనసురనదీ!
ధ్వజకులిశకంజాంకుశయుతమ్ములు
పదము లడవిని ముండ్లచేఁ
గడుఁ గిణము లయ్యె ముకుంద! వానికి
రామ! నిత్యనమస్కృతుల్.

ఇట నాల్గుచర్మము, లారుకాండము,
లిరువదై దగు కొమ్మలున్,
గనఁ బెక్కు లాకులు పూలు, ఫలములు
రెండు తిక్తము మధురమున్,
బం డాశ్రితమ్మగు తీఁగ, యిది సం
సారవృక్షము చిత్రమౌ
అవ్యక్తమూల మనాది యిది నీ
వగుదు గాదె నమస్కృతుల్.

అల బ్రహ్మ మజ మద్వైత మనుభవ
గమ్య మని సేవింతు రీ
ధరఁ గొంద అయ్యును సగుణరూపమె
స్వామి! మా కిష్టమ్మగున్;

గరుణానిధీ! సుగుణాకరా! వర
మిమ్ము త్రికరణశుద్ధిగా
నీపదజలజములఁ గొలుచు బుద్ధి యె
సంగ; నీకు నమస్కృతుల్!
వేదమ్ము లీ రీతి వినతులుసేసి
యెల్లఱుఁ జూడ నదృశ్యము లగుచు
సత్యలోకమునకు సాగి పోయినవి.

శివుఁడు శ్రీరాముని స్తోత్రించుట

ఖగనాథ! యప్పు డక్కడకు శివుండు
చనుదెంచి గద్గదస్వరమునఁ బులకి
తాంగుఁడై రాము నిట్లనుచు నుతించె:

గేయములు

జయ రామ! రమారమణా! వరదా!
శమితభవాదికతాప! సదా
అవధేశ! సురేశ! రమేశ! ననున్
శరణాగతు దీనునిఁ గావనగున్

దశకంఠవిలుంఠనచతుర! విభూ!
ఇదె భూరిమహీరుజ దీర్ఘఁగదేఁ
రజనీచరబృందపతంగగణ
మ్ముల పాలి మహాగ్నిజ్వాలవుగా!

మహిమండలమండన! చారుగుణా!
ధృతసాయకచాపనిషంగ! విభూ!
మదమోహమహామమతాంధ్యములన్
దొలఁగించెడి చండమయూఖ! ప్రభూ!

మదనకిరాతుఁడు భోగవాంఛ శర
హతిని మనుజహరిణమ్ములఁ గూల్చెడు
వానిఁ గొట్టి యీ విషయాటవిఁ జెడి
తిరిగెడు ననాథజీవుల గావుము.

బహురోగవియోగార్తులు సర్వులు
భవదంఘ్రినిరాదరఫలితమ్మిది;
భవసింధు వగాధము దాఁటుఁటుల్-
పదపంకజప్రేమము లేని యెడన్.

అతిదీనులు దుఃఖిత లార్తులు త్వ
త్పదపంకజప్రీతి రహింపనిచ్ఛో;
నవలంబముగాఁ గొని నీదుకథల్
మునివర్యులు కామ్యము లొందెదరున్.

రాగలోభమదమానాతీతులు
సుఖదుఃఖానుభవమ్ముల సములయి
యీ కతమున యోగాశ్రయమును విడి
ముదమున నీ పదసేవకు లౌదురు.

శుద్ధహృదయమున నీ పదకంజము
లతివినయమ్మునఁ గొల్తురు నిత్యము;
భూషణభూషణతిరస్కారముల
సములై తిరిగెద రవనిని సాధులు.

మునిమానసపంకజభృంగ! హరీ!
రఘువీర! మహారణధీర! విభూ!
భవరోగమహాగదమౌ భవదీ
యము నామము నే జపియింతు సదా!

గుణశీలకృపాపరమాయతనా!
నినుఁ గొల్చెద నిత్యము శ్రీరమణా!
రఘునాథ! హరింపుము ద్వంద్వములన్
జననాథ! కనంగదె దీను ననున్.

నినుఁ మాటికిఁ గోరెద నీ వరమున్;
భవదంఘ్రిజలేజనితాంతరతిన్
భవదర్చక సంతతసంగతియున్
బ్రియమార నొసంగు మటంచు హరీ!

అని యిట్లు పొగడి మహాదేవుఁ డరిగెఁ

గైలాసమున; కంతఁ గంజలోచనుఁడు
కపివర్యులకును సుఖప్రదమ్మగను
బెక్కు-వాసములు కల్పించెను బ్రీతి.

శ్రీరామాభిషేకకథాశ్రవణఫలము

ఈ కథ పావన మిది తాపహారి
భవనాశకము రామభద్రురాజ్యాభి
షేకచరిత్రమ్ము చెచ్చెర విన్న
నరులకుఁ గలుగు జ్ఞానమ్ము విర క్తి;
ఎవఁడు సకామియై యిది వినునతఁడు
సురదుర్లభములగు సుఖసంపదలను
భోగించి శ్రీరఘుపుంగవు పరమ
ధామమ్మునఁ జేరు నంత్యమ్మునయందు;
భ క్తిలభించు జీవన్ముక్తుఁడైన;
ము క్తిలభించును మొగి విర క్తునకు;
సంపదల్ దొరకు విషయవాంఛలున్న;
ఖగనాథ! యీ రామకథ విన్నవారి
కబ్బు వై రాగ్యము నత్యంతభ క్తి;
పృథుమోహానది తరియింపఁగఁజేయు
సుందరపోతమ్ము సుమ్ము రామకథ.

శ్రీరామచరితమానవసము

ఉత్తర కాండము

ద్వితీయవిశ్రామము

శ్రీమంగళాద్రివాసా!
సోమేశ్వరవినుతపరమభాగవతంసా!
మామానసాబ్జహంసా!
స్వామీ! శ్రీ మట్టపల్లి సదన! నృసింహా!

శ్రీరాముఁడు వానరముఖ్యులను సత్కరించి వీడ్కొల్పుట

సాకేతమున శుభోత్సవములు నిత్య
నవ్యములయ్యె నా నగరమందెల్ల
పౌరు లానందసంభరితాత్ములైరి;
ఈశ్వరబ్రహ్మమునీంద్రదేవితములఁ
బదములఁ గొల్చిరి భక్తియుక్తులయి;
నవ్యవస్త్రాభరణమ్ములు దాల్చి
యాచకులెల్ల అయాచకులైరి.
అఖిలవానరులు బ్రహ్మానందమగ్నులై ప్రభుచరణములం దతిప్రీతి
యెసఁగఁగఁ దమతమయింట్లు మఱచిరి;
కనుచుండ నెలలారు గడచిపోయినవి;
సాధుచిత్తమున విశ్వద్రోహబుద్ధి
పొడమనిగతి స్వప్నములఁగూడ వారు
తమగృహమ్ములమాట తలపెట్టరైరి;
అపుడు రాముఁడు వారి నందఱఁ బిలిచి
నతశిరస్కులను దనకడఁ గూర్చుండఁ
బనిచి, "యెంతగ నన్ను భక్తి సేవించి
నారలో మీ వదనమ్మునఁ బొగడ
నేటికి? నాకయి యిండ్లు వీడితిరి;
త్యాగమొనర్చితి రఖిలసుఖమ్ము;
లించెద రెడఁద నా కెంతయు మీరు;
తమ్ములు వై దేహి ధనము రాజ్యమ్ము
తనువు గృహ మ్మయోధ్యానగరమ్ము
ప్రాసాదములు సఖుల్ పరివార మనిన
నాకు నెంతయును మనమ్మునఁ బ్రీతి
యయ్యె నా యన్నిటికంటె మీమీఁద
నతివేల వాత్సల్య మదియే మొగాని;
ఏ నసత్యము వల్క నిది స్వభావమ్ము;
మీ గృహముల కేఁగి మిక్కిలి భక్తి
సర్వగతుండును సర్వహితుండు
గా ననుఁ దలఁచి యక్కడన స్మరింపుఁ"
డనువచనమ్ముల నాలించి ప్రేమ
విహ్వలులగుచుఁ గపీశ్వరులెల్ల
తనువులు మఱచి శ్రీరామునిప్రేమాలఁ
గరములు మోడ్చి పల్కఁగలేక మౌన
ధారులై నిల్వ నద్దశరథసుతుఁడు
కనుఁగొని వారికి జ్ఞానోపదేశ
మిచ్చినఁ బదముల కెరఁగిరి వార;
లంత రాముండు చిత్రాతిచిత్రమ్ము
లనుపమమ్ము లగు దివ్యాంబరాభరణ
సముదాయ మిప్పించె; సౌమిత్రి తాను

గీశేశ్వరునకు లంకేశ్వరునకును
స్వయముగా రామునాజ్ఞం దలఁ దాల్చి
యంబరాభరణము లపుడు గైసేసె;
అతిప్రేమమగ్నుఁడై యంగదుఁ డొక్క-
యింతైనఁ గదలమి నెఱిఁగి శ్రీరాముఁ
డతని ధ్యానమ్మున కడ్డురాడయ్యె;
నలనీలజాంబవంతప్రముఖులకు
స్వయముగాఁ గట్టించె స్వామి వస్త్రములు;
వినతులై వెడలిరి వార; లా పిదప
నంగదుఁ డరుదెంచి హస్తముల్ మొగిచి
కన్నుల మోదాశ్రుకణములు రాల
నమ్రుఁడై మృదుభాషణముల, "సర్వజ్ఞ!
యార్తరక్షక! కరుణాకర! నాథ!
చచ్చెడుతఱి నన్ను స్వామి! నీ యొడిని
బడవైచె మా తండ్రి భక్తార్తిహరణ!
అశరణశరణుఁ డీ వను బిరుదమ్ము
స్మరియింపు, నను జేయిజారకు దేవ!
తల్లియుం దండ్రియు దైవమ్ము గురువు
సకలమ్ము నాకు నో స్వామి! నీ వయ్య;
త్వచ్చరణాబ్జముల్ వదలి యెం దేఁగు
వాఁడ విచారించి ప్రభువ! యే దేనిఁ
బనిచెప్ప మదిచేసి బ్రదికెద నిచట;
ఈ జ్ఞానబలబుద్ధిహీనుని దీను
సేవకు శరణమిచ్చి కృపాళు! కావు;
త్వత్పాదనిత్యసందర్శనభాగ్య
వశమునఁ దరియింతు భవమహాజలధి"—
నని పల్కి విభుచరణాంబుజద్వయిని
సాష్టాంగమెరఁగి, "యో స్వామి రక్షింపు
నాథ! గృహమునకు నన్నుఁ బొమ్మనకు"—
మని వినీతుండయి యూడ నాలించి
కరుణానిధానుండు కనులు చెమ్మగిలఁ
బైకెత్తి యాతనిఁ బరిరంభణమ్ము
గావించి నిజమాలికలను వస్త్రములు
భూషణమ్ములు వాలిపుత్త్రిన కిచ్చి
బహువిధమ్ములఁ బట్టువఱచి యొప్పించె;
తమ్ములు మువ్వురు తనవెంట రాఁగ
నంతదూరము సాఁగనంపి రంగదుని;
అడుగు ముందున కుంచు నచ్చోటె యాగుఁ;
దిరిగిచూచును గడుదీనుఁడై మ్రొక్కు;
నింక రాముండు న న్నిందె యుండు మని
యనఁడేమి యని మది నారాటపడును;
గతము స్మరించి సంకటపడు నెడఁదఁ;
గాని గంజాయుఁ డక్కడ నిల్చిపోవు
టూరసి తచ్చరణాబ్జము లెడఁదఁ
బూని యాతఁడు సాఁగిపోయె ముందునకు.
భరతుఁడు తక్కినవానరవరుల
నంపించె; నప్పుడు హనుమ సుగ్రీవు
పాదకంజములకుఁ బ్రణమిల్లి లేచి,
"స్వామి! నే నిచటఁ బదినాళ్లు నిలిచి
శ్రీరామచరణముల్ సేవించి పిదపఁ
ద్వచ్చరణములు సందర్శింతు" ననిన
వానరాధీశుఁడు "పవనకుమార!
కడుఁబుణ్యరాశివి కరుణానిధాను
శ్రీరామచంద్రుని సేవింపుమయ్య"—
యనియె; వానరులెల్ల నురిగి; రంగదుఁడు,
"హనుమ! ప్రార్థించెద హస్తముల్ మోడ్చి;
స్వామికి నే దండవత్ప్రణామమ్ము
భక్తిఁ జేసితి నని పలుకఁ గదయ్య!
మాటికి నన్ను రామావనీంద్రునకు
జ్ఞప్తిసేయుఁ గదయ్య కడుఁ బ్రీతి" ననుచుఁ
బలికి దుఃఖమ్మునఁ బాసె నచ్చోటు;
అఖిల మియ్యది చెప్పె హనుమ రామునకు;
నది విని ప్రభుఁడు ప్రేమాంబుధి మునిఁగె—
విహగేశ! రామునివిమలచిత్తమ్ము

ప్రాణినికన్న మహాకఠినమ్మ్ము;
నవ్యసుమమ్ముకన్నను సుకుమార;
మియ్యది యెఱుఁగంగ నేరికి శక్య?
మంతరాముఁడు నిషాదాధిపుఁ బిలిచి
వస్త్రాభరణములు బహుమతు లిచ్చి,
"యింక గృహమ్మున కేఁగి యచ్చోటఁ
ద్రికరణమ్ములను స్మరించుచు నన్ను
ధర్మానుసారివై తగఁ బ్రవర్తింపు
మయ్య! యీ భరతుని యట్లనరజుఁడఁ;
వపుడప్పు డీ వయోధ్యకు వచ్చి పొమ్ము"-
నావు డా పలుకు లానందప్రదములు
విని ముదశ్రులు గ్రమ్మ వేగఁ బాదములఁ
బడి లేచి రామునిపదముల నెడఁద
నిడికొని తనగృహ మేఁ తెంచి ప్రభుని
దివ్యచరిత్ర కీర్తించె సద్భక్తి.

రామరాజ్యాభివర్ణనము

శ్రీరామపట్టాభిషేకమ్ము గాంచి
మూఁడులోకమ్ములు ముదితమ్ములయ్యె;
శోకమ్ములు నశించె సుఖములు మించె;
వైషమ్యక్రూరభావమ్ములు దొలఁగెఁ;
బ్రజలెల్లవారు వర్ణాశ్రమధర్మ
తత్పరుల్ వేదపథప్రవర్తకులు
దైహికభౌతికదైవికమ్ములను
తాపముల్ మూఁడు చెంతం జేర వెవని;
రామరాజ్యమున ధర్మము నాల్గుపాద
ముల వసుంధర పరిపూర్ణమై యొప్పె;
స్త్రీలునుఁ బురుషులు శ్రీరామపాద
భక్తితత్పరులయి పరమపదాధి
కారులై మించి; రకాలమృత్యువులు
కరవయ్యెఁ బీడలు కలుగ వెవ్వరికి;
నొక్కఁ దరిద్రుండు నొక్కఁ దీనుండు
నొక్కఁడు దుఃఖితుఁ డొక్కఁడు మూర్ఖుఁ
డొక్కరుఁ డవలక్షణోపేతుఁ డెందు
నగపడఁ డయ్యెడ; నారోగ్యవంతు
లతిసుందరులు ప్రజ లందఱుఁ దలఁప
ధర్మపరాయణుల్ దంభరహితులు
గుణయుతుల్ చతురులు గుణవిదుల్ పుణ్య
లతిపండితులు జ్ఞాను లానందమతులు.
సకలచరాచరజగ మదికాల
కర్మస్వభావదుఃఖాతిదూరమ్ము;
కంధిసప్తకము మేఖలగాఁగ నొప్ప
ధరణి నేకాతపత్రమ్ముగ నేలెఁ
గోసలనేత లోకోత్తరగుణుఁడు;
ఎవనిరోమమున ననేకబ్రహ్మాండ
గణములు వెలయు నా కంజాతునెదుట
నేడుదీవులరాజ్య మేమంతగొప్ప?
ఏకపత్నీవ్రతు లెల్లనుపురుషు;
లంగనల్ భర్తృహితాకాంక్షగుణులు;
రామావనీంద్రునిరాజ్యమునందు
దండము యతులహస్తమ్ములయందె;
భేదము నర్తకప్రియసమాజముల;
గెలువుఁడీ యనుమాట కేవల మొక్క-
చిత్తవిషయమయి చెలువొందుచుండు;
వృక్షముల్ సతము పుష్పించుఫలించు;
సింహావారణములు చెలఁగు నొక్కయెడఁ;
బశుపక్షిచయము స్వాభావికశాత్ర
వము వీడి యవి పరస్పరము ప్రేమించు;
సురభిళశీతలసుందరమంద
పవనుఁడు లోకాన భ్రమియించు సతము;
కుసుమరసమ్మ్మును గ్రోలి సుమంధ
యాళి మత్తిల్లి జుమ్మనుచును మొరయు;
అడిగినంత ననోకహమ్ములు లతలు
కురియు మరందము; గోవులు వలయు

నన్ని క్షీరము లిచ్చు; నవని సస్యాఢ్య
యై యొప్పుఁ; ద్రేత సత్యయుగ మ్మాటంచు
భ్రమియింపఁజేసె; విశ్వప్రవ ర్తకుఁడు
శాసకుఁ డని యెంచి శైలముల్ వివిధ
రత్నచయమ్ములఁ బ్రకటముసేసె;
శైవలినుల్ రమ్యస్వాదిష్ఠవిమల
శీతలజలములఁ జెలువారె; నపుడు
సకలదిక్కు-లును బ్రసన్నములయ్యె;
నంభోనిధులు తమహద్దులు విడవు;
రత్నాలు దెచ్చి తరంగము లొడ్డఁ
జల్లును బ్రీతులై జనులు కైకోఁగఁ;
జంద్రుఁడు నింపు జ్యోత్స్నల ధరాస్థలము;
వలసినయంత తాప మ్మిచ్చు నర్కు-ఁ;
డడిగినజల మిచ్చు నంభోధరములు.
హయమేధశతక ర్త యాగమమార్గ
పాలకుండును ధర్మభారధరుండు
త్రిగుణసంపుటికి నతీతుఁడు ఘనుఁడు
భోగదేవేంద్రుఁడు భూమీశమౌళి,
శ్రీరామచంద్రుఁడు క్షితి నేలుచుండె.

శ్రీరామలక్ష్మణభరతశత్రుఘ్నులకు పుత్రోదయమగుట

శోభాఢ్యయు సుశీల సుందరి నమ్ర
పత్యనుకూలయై వై దేహి ప్రభుని
వైభవ మ్మెఱిఁగి తత్పదపంకజములు
చిత్తమున న్నిల్పి సేవించుసతము;
దాసదాసీజనుల్ దనయింటఁ గుశలు
లెంద ఱుండినను మహీసుత యెల్ల
పనులు దాఁ గడఁగి నిర్వర్తించుఁ బ్రీతి;
శ్రీరామచంద్రునిచిత్తమ్ము నెక్క-
సేయుఁ గార్యమ్ములు శ్రీదేవి పూని;
మదమభిమానము మాని సంతతము
భక్తి నత్తలకు సపర్యలొనర్చు;
శాంభవీ! యా రమ జగదంబ దేవి
బ్రహ్మేంద్రాదివందితచరణ
తనదుసన్నిహితములు దలఁపక రామ
భద్రునియంత్రణములు భక్తి సేవించు;
అనుకూలులై కొల్చి రందఱుతమ్ము
లతిప్రేమ రాఘవునడుగుల నిలిపి
యెప్పుడు శ్రీరాముఁ డే మాజ్ఞయిడునో
యని వదనాబ్జమం దాబద్ధదృష్టు
లగుచు; రాముండు నిజానుజన్మ్మలకుఁ
బ్రీతుఁడై నీతులు వివిధముల్ గఱపు.
కొన్ని నాళ్ళకు లవకుశు లనువారి
నిరువురి సుతుల మహీసుత గాంచె-
విజయులు నమ్రులు వేదసన్నుతులు
తోయజనేత్రు నెందును బోని పరమ
సుందరమూ ర్తులు సుగుణమందిరులు.
మువ్వురుతమ్ములు పుత్త్రులఁ గాంచి
తిద్దతిద్దఁను మహీజననుతుల
సద్గుణాభరణుల సౌమ్యుల ఘనుల.

శ్రీరామపాలితమైన అయోధ్యాపురిశోభ

జ్ఞానవాగింద్రియకర్మాద్యతీతుఁ
డజుఁడు మాయామయుఁ డప్రమేయుండు
సచ్చిదానందుఁడు స్వామి రాఘవుఁడు
క్రీడించు నరునిపోల్కి-ని విచిత్రముగ;
స్నాతుఁడై ప్రత్యూషస్సంధ్యఁ బునీత
సరయూసరిజ్జలసందోహమందు,
బ్రాహ్మణసజ్జనపరివృతుఁడగుచు
నొడ్డోలగమ్మున నొప్పి, వశిష్ఠు
డాగమగాథల నపుడు విన్పింప
నెల్లఁ దా నవి మున్న యెఱిఁగియుఁగూడ
నాలించు నెఱుఁగనియట్లు సద్భక్తిఁ;

దమ్ముల మువ్వురఁ దనప్రక్క నునిచి
కొని భుజియించు; సద్గుణగరిష్ఠుఁ డగు
తనయునిఁ గనుఁగొని తల్లులు మువ్వు
రమితహర్ష మున దేహస్మృతి విడిరి;
భరతశత్రుఘ్నులు పవనకుమారుఁ
దమ వెంట సుందరోద్యానవనమున
కుంగొని చని యటఁ గూర్చుండఁ బెట్టి
కొని రామచంద్రునిగుణములు కథలు
వర్ణింపవే యని ప్రార్థించు చుందు;
రాతఁడు చెప్పిన నంతటఁ దనియ
కింకను వచియింపవే యని మిగుల
బ్రతిమాలుకొనుచుంద్రు భక్తి భావమున;-
రామాయణమ్ము పురాణముల్ నిగమ
నిచయ మందటియిండ్ల నెలకొనియుండు;
స్త్రీలునుం బురుషులు శ్రీరామదివ్య
గుణకీర్తనముసేసికొనుచు హర్ష మున
దినములు గడచుట తెలియ రొక్కింత;
న్యాయముగా శ్రీరామచంద్రుఁడే రాజ్య
మేల సాకేతమం దెంతసుఖమ్ము
కలదొకో వర్ణింపఁగలఁడె శేషుండు?
నారదసనకసనందనముఖ్య
దివ్యర్షిసంఘముల్ దినదిన మ్మటకు
రాముని దివ్యదర్శన మపేక్షించి
చనుదెంచి యమ్మహాసాకేతవైభ
వ మ్మించి మఱితూరు వైరాగ్యమెల్ల;
రత్నస్థగితసువర్ణ మయసౌధముల
రంజిల్లు సుందరరత్నకంబళము;
లప్పరి నలుఁగడ లత్యున్నతములు
వప్రముల్ పెక్కుగవకుల నొప్పారు;
తొమ్మిదిగ్రహములు తోయమ్ముగూడి
యమరావతిని జుట్టె ననఁగ ననేక
వర్ణరత్నముల దీవ్యచ్ఛూర్ణములను
గచ్చుపఱిచిరి నగర మెల్లయెడల
మునివరుల్ గూడ సమ్మోహితుల్ గాఁగ;
అభ్రచుచుంబిష నలరుసౌధముల
భాస్కరచంద్రప్రభానిందకమ్ము
లగు దివ్యకలశము లపుడు స్థాపించి;
రెక్కడఁ జూచిన నెసఁగెడు రత్న
వేదికల్ రత్నదీపికలు రమ్యములు;
విద్రుమదేహళుల్ వెలుఁగొందుచుండుఁ;
బ్రతిగృహమ్మున సుమవాటికల్ వివిధ
సుమభరితమ్ములు శోభిల్లుచుండు;
మధుమాసమునఁబోలె మంజులఫణితి
భసలరుతమ్ములు భాసిల్లు సతము;
సురభిళశీతలసుందరమంద
పవనము లతిసుఖప్రదములై వీచు;
బాలకపాలితపక్షిసంచయము
కలకూజితమ్ములు గావించుకొనుచు
నాడు నందముగ నుద్యానవీథులను;
గలహంససారసఖంజననీల
కంఠపారావతగణములు సౌధ
భాగమ్ములను రత్నఫలకమ్ములందు
బ్రతిబింబములఁ గాంచి పచరించు నృత్య;
"మవనీశతిలక! దయానిధి! రామ!
రాఘవ! జానకీప్రాణేశ! యీశ!
సాకేతనాథ! కౌసల్యాకుమార!
నిర్జితదశకంఠ! నీలాంగ!" యనుచు
బాలకుల్ తమ వచావచగణమ్ములకు
నిపుణత మాటలు నేర్పుచునుంద్రు;
పరమసుందరము విపణివీథియందు
లభియించుచుండు మూల్యమ్ము చెల్లింప
కఖిల సద్వస్తువు లతివేలముగను;
లక్ష్మీశుదివ్యసామ్రాజ్యమునందు
భూరిసంపద వేఱ పొగడఁగ నేల?

ఐలబిలుం గొందు రచటివ_ర్తకులు;
వనితలుం బురుషు లాబాలవృద్ధమ్ము
సుఖులును సజ్జనుల్ సుందరుల్ శాంతు;
*లౌదీచ్యభాగమ్మునందుఁ బావనము
ప్రవహించు సరయూనద్వంతి గంభీర
విమలజలాశ్రయవిశ్రుతచరిత;
సోపానపం_క్తులు శోభిల్లు దానఁ;
గర్దమరహితముల్ గట్టు లవెల్ల;
గజఘటలకు నాశ్వికదళమ్ములకు
జలము వట్టుటకు నచ్చట నొకప్రక్క-
రమ్యఘట్టములు విరాజిల్లుచుండుఁ;
బారులు నీరముల్ వడిఁ దెచ్చుకోఁగ
వేఱుగా రేవులు విలసిల్లుఁ గొన్ని-
జలకములాడ నచ్చట వీలులేదు;
రాజఘట్టము సుందరమ్ము శ్రేష్ఠమ్ము;
జనులెల్ల నిక్కడ స్నానముల్ సేతు;
రా నదీకూలమునందునఁ బెక్కు-
లుపవనమ్ములు వెలయుచునుండు; వాని
నడుమ దేవాయతనములు భాసిల్లు;
శమదమసంయుతుల్ సన్న్యాసు లచట
వసియించుచుందురు భ_క్తిభావమునఁ;
దులసీకదంబముల్ దొడ్డలు దొడ్డ;
లా దివ్యనగరశోభాతిశయమ్ము
వర్ణింప నెవ్వరివశము? కన్గొన్న
సకలమహాఘముల్ క్షాళితమ్ములగు.
శ్రీరామచంద్రుఁ గీ_ర్తించుచు భ_క్తి
నొండొరులకు నేర్పుచుందురు జనులు;
"ప్రణతపాలకుఁడు, శోభాశీలరూప
గుణనిధానుండు, నకుంఠితశరుఁడు,
జలజాతనేత్రుఁడు, శ్యామగాత్రుండు,
కన్నులఁ గన్నాకు గాచెడుపోల్కి-
భ_క్తులసతతము పాలించువాఁడు,
బాణబాణాసనపాణిపల్లవుఁడు,
సాధుసరోవరజలజబాంధవుఁడు,
కాలభీకరపన్నగాభ్రగేంద్రుండు,
భ_క్తి నిష్కామభావమునఁ బ్రణుతి
సేసిన మమతను జించెడివాఁడు,
పంచాస్త్రమదగజపంచాననుండు,
రాగమోహమృగకిరాతవరుండు,
జన్మమృత్యుజరానిశాహస్కరుండు,
దానవకాననదావపావకుఁడు,
సంశయశోకాంధ్యస_ప్తై_ంధవుఁడు,
మానసవాసనామశకహిముండు,
నిత్యుఁ డొక్కరుఁడు, మనీషి, రసజ్ఞుఁ,
డజుఁ, డజేయుఁడు, ఘనుఁ, డప్రమేయుండు,
మునిజనచి_త్తసమ్మోహకుం, డమృతుఁ,
డవనీమహాభారహరణచణుండు,
శ్రీనాథుఁ, డా తులసీదాససేవి
తాంఘ్రిద్వయుండు, దయాసాగరుండు,
దశరథసుతుఁడు, సుధామయమూ_ర్తి,
రాముఁడు, జానకీప్రాణేశ్వరుండు,
ప్రజలార! యీతని భ_క్తి సేవింపుఁ"-
డనుచు గీ_ర్తింత్రు నిత్యమ్ము రాఘవుని
వారల నా రామభద్రుఁడు ప్రోచు;
సోపర్ణ! శ్రీరామచంద్రప్రచండ
చండమయూఖుఁడు చనుదేర మూఁడు
జగములు సత్ప్రకాశమ్ముచే నిండెఁ;
గొందఱు శోకమ్ము గొందఱు సుఖము
పొందిరి; సుజను లుప్పొంగిరి మివుల;
హరియింపఁబడె నవిద్యాకాళరాత్రి;

---

* ఔదీచ్యము=ఉ_త్తరదిక్కునకు సంబంధించిన

పాపదివాంధముల్ పరువిడిపోయెఁ;
గామక్రోధాదులు కలువలు బ్రుంగెఁ;
గాలముం గుణమును గర్మము ననెడు
సకలజీవంజీవసంచయ మడఁగె;
మాత్సర్యమదమోహమానాదిపశ్య
తోహరగణములు తొలఁగె దిక్కులకు;
ధర్మతటాకమధ్యమ్మున జ్ఞాన
విజ్ఞానకమలముల్ వికసించె నపుడు
సూనృతమ్ము విరక్తి సుఖము వివేక
మాదిగా నొప్పు రథాంగముల్ పొంగె.

సనకసనందనాదులు శ్రీరామదర్శనార్థము వచ్చుట

ఒక్కదినమ్ము రఘూత్తముఁ డరిగెఁ
దమ్ములఁ బవమానతనయుని వెంటఁ
గైకొని వాహ్యాళిగా నుపవనము.
సమయ మియ్యది యని *సనకసనంద
నాదులు సతతబ్రహ్మానందరతులు
గుణశీలసంయుతుల్ కోమలమతులు
తేజోనిధానులు దివ్యవిగ్రహులు
వేదస్వరూపులు విజ్ఞానధనులు
శ్రీరఘునాథచరిత్రశుశ్రూష
వరలెడివారు దిగ్వాసులు బాల
వేషధారులు విశ్వవిశ్వసన్నుతులు
హర్షమ్ముతోడ మహర్షి యగస్త్యుఁ
డరణిలోపలినుండి యగ్ని జనించు
గతి మహోత్తమలసద్జ్ఞాన మొసంగు
శ్రీరామకథలు వర్ణింప నాలించి

యా ప్రభుఁ గనుఁగొన నరుదెంచి రటకు;
వారలఁ గని రామభద్రుఁడు దండ
వత్ప్రణామముసేసి స్వాగత మొసఁగి
కుశలమ్ము ప్రశ్నించి కూర్చుండఁ బీత
వసనమ్ము బఱచెను; బదపడి మువ్వు
రవరజులును సమీరాత్మజుఁగూడి
మ్రొక్కిరి సద్భక్తి; మునికులతిలకు
లా రామచంద్రుని యతులమహస్సు
గనుఁగొని మన మాపఁగాలేక ప్రీతి
ననిమేషనయనులై, శ్యామలగాత్రు
సౌందర్యమందిరు జలజాతనేత్రుఁ
డగు దాశరథికి హస్తాబ్జముల్ మొగిచి
వినమితమూర్ధులై ప్రేమమగ్నులయి
యుండ వారలఁ గని యుత్కటానంద
భరితుఁడై శ్రీరామభద్రుఁడు పులకి
తాంగుడై మోదాశ్రు లశ్రులజార
వారలహస్తముల్ పట్టి కూర్చుండఁ
బనిచి తా మంజులఫణితి నిట్లాడె:
"ఓ మునులార! ధన్యుండ నీ నాఁడు
భవదీయదర్శనభాగ్యమ్మునకతన;
దురితసంఘమ్ములు తొలఁగిపోయినవి;
భవసంగహర మగు పరమసత్సంగ
మెంతలసద్భాగ్య మెంతశ్రమమ్మున
చేసిన లభియించుఁ జెప్పుడీ మీరు;
సత్సంగ మిచ్చు మోక్షపదమ్ము; దుష్ట
సంగతి తా భవసాగరమందుఁ
ద్రోయు నటంచు సాధువులు కోవిదులు
వినిపించుచుందురు; వేదపురాణ

---

* సనక సనందన సనత్కుమార సనత్సుజాతు లీ నలువురును బ్రహ్మమానసమునుండి సృష్ట్యాదిని జన్మించిన మహాత్ములు. వీరు నిత్య బ్రహ్మచర్య నిష్ఠ లగు మహాసన్న్యాసులు. వీర లిప్పటికిని బ్రహ్మలోకమున వసించు చున్నారని శాస్త్రములు తెలుపుచున్నవి. వారల వయస్సిప్పటికి- 1,95,00,00,000 సంవత్సరములైనను నిత్య కౌమారదశలో నలరారుచుందురు.

విశ్రుత మిది" యన విని రామచంద్రు
వచనాల పులకితస్వాతనుఁ లై వారు
పాణిపల్లవములు ఫాలమునేర్చి
ప్రభుసన్నుతించి రిప్పగిది సద్భక్తి;

సనకాదికృతశ్రీరామస్తవము గేయములు

జయ భగవంత! అనంత! అనామయ!
అనఘ! అనేక! ఏక! కరుణామయ!
జయ నిర్గుణ! జయ జయ గుణసాగర!
సుఖమందిర! సుందర! అతినాగర!

జయ ఇందిరారమణ! జయ భూధర!
అనుపమ! అజ! అనాది! శోభాకర!
జ్ఞాననిధాన! అమాన! మానప్రద!
పావన! సుయశ! పురాణవేదవద!

తజ్ఞా! కృతజ్ఞ! అజ్ఞవిభంజన!
అనేకనామ! అనామ! నిరంజన!
సర్వ! సర్వగత! సర్వమవస్థిత!
నా యెద నిలువుము నిరతము సురనుత!

ద్వందవిపద్భవబంధనివారక!
కామమదాదులుగాల్చుము పాయక!
పరమానంద! కృపాకర! భూవర!
పాదభక్తి దయ నిమ్ము రమావర!

భక్తి నిమ్ము సురనుత! రఘునాయక!
త్రివిధతాపభవశోకనివారక!
ప్రణతకామసురధేను! కల్పతరు!
వరము నొసంగుము నాకు బ్రహ్మగురు!

భవవారిధికుంభజ! రఘునాయక!
సేవకసులభ! సకలసుఖదాయక!
మనోజదారుణదుఃఖము త్రుంచుము
దీనబంధు! త్వద్భక్తిని బెంచుము

ఆశాత్రాసేర్ష్యాదినివారక!
వినయవివేకవిరతివిస్తారక!
భూవర! సంసారసరిత్తారక!
మైన భక్తి మాకొసఁగుము వారక.
మునిజనమానసహంస! వరద! అజ!
శంకరబ్రహ్మార్చితచరణాంబుజ!
రఘుకులకేతు! రామ! శ్రుతిరక్షక!
స్వభావగుణకాలకర్మభక్షక!

శ్రీరాముఁడు సోదరులకు సజ్జనదుర్జన లక్షణముల నెఱిగించుట

అని ప్రీతి నుతియించి యభిమతసిద్ధి
వడసి యేఁగిరి వారు బ్రహ్మలోకమ్ము;
పదపడి తమ్ములు ప్రభుపదమ్ములకుఁ
బ్రణతులై యాతనిఁ బ్రశ్నింపనోడి
పవమానతనయునివదనమ్ముఁ జూడ
స్వామి యంతర్యామి సకలము నెఱిఁగి
మృదుమధురముగ, "సామీరి! యేమికథ?"
యనుచుఁ బ్రశ్నింపంగ హనుమంతుఁ డపుడు
చేతులు జోడించి, "శ్రీరామచంద్ర!
నాథ! మహాత్మ! దీనదయాళు! ప్రభువ!
భరతుఁ డొక్కటి మిమ్ముఁ బ్రశ్నింపఁదలఁచి
కూడఁ దా నడుగ సంకోచించు" ననఁగ
నవ్వి శ్రీరాముఁడు, "నా స్వభావమ్ము
పావనీ! యెఱుఁగవె? భరతునకేని
నాకేని నడుమ నంతర మున్న దొక్కో?"
యన నాలకించి పదాబ్జముల్ పట్టి
భరతుఁడు, "శ్రీరామభద్ర! సురేడ్య!
ప్రణతార్తి హరణ! కృపానంద నిలయ!
త్వత్కృపవలన స్వప్నమ్మందుఁగూడ
మోహశోకములు ప్రభూ! నే నెఱుంగ;
సందేహ మెడఁదను జనియింపఁబోదు;

కాని నే నిన్ను నొక్కటి యడుగంగ
సాహసించెద నది స్వైచుట తగును;
సేవక సుఖద! నీ సేవకుం డేను
రఘునాథ! వేదపురాణముల్ సాధు
మహిమను గీర్తించు మంజులపణితి;
స్వయముగా వారి గొప్పతనమ్ము నింత
దాఁ కను మీర కీర్తనము సేసితిరి;
వారి లక్షణము నోప్రభు! విన నాకుఁ
గౌతూహల మ్మట్లు గానఁ జెప్పఁగ దె;
సదసజ్జనుల నెట్లు స్వామి! గుర్తింప
నగు వివరింపవే?" యన రాఘవుండు,
"తమ్ముఁడ! వినుము వేదపురాణశాస్త్ర
సుప్రసిద్ధమ్ములుసుమి సాధుజనుల
సల్లక్షణమ్ము లసంఖ్యముల్ వెలయుఁ;
జందనపరశులక్షణములు చూడ
సజ్జన దుర్జనసమితి భాసించు :
నరకును దాఁ జందనమ్మును సతము
పరశు వ ట్టయ్యును బరిమళ మ్మిచ్చు
దానికిఁ బ్రీతి చందనము; కావున నె
సురలశీర్ష మ్మెక్కి చొక్కు చందనము;
పరశుముఖమ్మును వహ్నిలోఁ గాల్చి
సమ్మెటపోటులఁ జావ మోదెదరు;
సాధుజనుల్ శీలసద్గుణఖనులు
విషయవిదూరులు విజ్ఞానధనులు;
దుఃఖింతు రితరులదుఃఖమ్ముఁ జూడ;
సుఖియింతు రితరులసుఖము గన్నొన్న;
సములు విరాగు లజాతశత్రువులు
ద్వంద్వాద్యతీతులు ధర్మనిరతులు
దీనదయాళురు శ్రీకరణశుద్ధి
గాఁ గొల్తు నా పాదకంజాతములను;
శైతల్యసారళ్యసర్వహితేచ్ఛ
లా సాధుగుణము; లియ్యవి వేనియెడఁద
యందుండె సజ్జనుఁ డాతఁడ సుమ్మి
శమదమనియమముల్; చలియింప రెపుడు;
పరుషవాక్కులు నోటఁ బలుక రేనాఁడు;
నిట్టి సజ్జనులన్న నెంతయు బ్రీతి
యెఁసగు నాకు నెడంద నింతయు సత్య;
మింక దుర్జనుల నే నెఱిఁగింతు వినుము:
కపిలమందలోఁ గలసిన నొక్క
చెడుధేను వన్నిటిఁ జెఱచుచందమున
దుర్జనసంగతి తూలించు జనులఁ;
బెన్నిధి లభియించుపేదవిధాన
పరనిందలను వినఁ బరవశు లగుదు;
రితరులసంపద లింత గన్గొన్నఁ
గన్నులలో నిప్పుకలు పోసికొందు;
రరివర్గమునకు నిత్యమ్ము భీనిసలు;
నిత్యసంతప్తులు; నిర్దయుల్;కుటిలు
లఘునిధానులుధూర్తు లవినీతిమంతు;
లే కారణము లేక యే తమయెడఁద
వైరభావమ్మును వర్ధిల్లఁజేసి
హితచింతకునిగొంతు నెప్పుడు నులుము
రె ట్లని సంతత మెదురుచూచెదరు;
అన్యతమ్మెయిచ్చెద రన్యతమ్మె కొందు
రన్యతమ్మె భోజన మన్యతమె తిండి;
బర్హి చక్కఁగఁ గూసి పన్నగమ్ములను
భక్షించుగతి మంచిపలుకులు సెప్పి,
గోతులు తీతురు కూర్చున్నచోటఁ;
బరనారియన్నను బరధనమన్నఁ
బరనిందయన్నచోఁ బరమసుఖమ్ము;
లోభమ్మె ద్వీపటము లోభమ శేయ్య;
మానవరూపాన మహి నొప్పు పాపి
జనులు కాకున్న రాక్షసులు వేఱెవరు?
మైథునాహారసమయములయందు
వారిపాశవవృత్తిఁ బరికింపవచ్చు;

యమపురియన్న భయంపడ రెదల;
నితరులయుత్కర్ష నెఱిఁగినయెడల
శీతజ్వరముచేఁ గృశించిరొనాఁగ
నుస్సు రటంచు నిట్టూర్చి గాఢముగఁ
జచ్చెడుదాఁక విచారించుచుంద్రు;
పరుఁ డొక్కరుండు విపత్తున మునుఁగ
సార్వభౌమత్వము సంక్రమించె నన
నానందజలధి నోలాడుదు రెపుడు;
స్వార్థపరాయణుల్ వట్టిమోరకులు
తల్లిని దండ్రిని దైవముం గురుని
విప్రుని మది లక్ష్యపెట్ట రొకింత;
తాఁ జెడ్డకోఁతి యంతయుఁ ద్రోఁటఁ జెఱచె
ననఁ బ్రక్కవారల నందఱఁ జెఱుతు;
రానందనిలయుఁడౌ హరిపుణ్యకథలు
వెట్టిమాటలపోల్కి వినిపించుచుండు;
సజ్జనసంగతి సైఁప రొక్కింత;
మందబుద్ధులు వేదమతము దిట్టెదరు;
పరులను జెఱుచుటే పనియయ్యు విప్ర
వరులను జెఱుపఁగఁ బైన పోయెదరు;
గరళమ్ము హృదయభాగమ్మున దాఁచి
పలుకులలో సుధల్ వర్షించుచుందు;
రిట్టినీచులు మచ్చుకేని లభింప
రా కృతఘ్నతలయం దొక్కడేని;
ఆ ద్వాపరమున నందందుఁ గన్పింతు ;
రిఁక గలిలో వీరలే వీరు చూడ;
పరహితమొక్కఁడే పరమధర్మమ్ము,
పరపీడనముకంటెఁ బాపమ్ములేద
టంచు పురాణవేదాదులు పలుకు;
దుర్లభనరజన్మ దొరికించికొనియుఁ
బరులఁ బీడించుచుఁ బాపస్వభావు
లై విహరించెడి యధములు ఘోర
భవసంకటమ్మునఁ బడి యడంగుదురు;
మోహాన స్వార్థత బ్రుంగి మానవులు
పాపమ్ము లొనరించి పారలౌకికము
చెఱచుకొందురు; నేను జెచ్చెరఁ గాల
రూపుండనగుచు వారు పొనర్చినట్టి
కర్మానుగుణ్యమైక్రాలుఫలమ్ము
నిచ్చెద నిదియెల్ల నెఱిఁగినవారు
సంసార మిది దుఃఖసాగర మనుచు
భక్తి మత్పాదముల్ భజియించుచుంద్రు;
నా వచించినలక్షణమ్ము లెఱుంగ
భవసాగరమ్మునఁ బడరు మానవులు;
తండ్రి! మాయారచితమ్ములై వెలయు
నీగుణాగుణము లివెల్ల ; గుణమ్ము
వీనిని వేఱు భావింపమియంద
కల; దట్లు చూచుట కడు నవివేక"-
మనిన నా వచనము లాలించి తమ్ము
లానందపరవశులై కేలుమోడ్చి;
రాంజనేయునిహృదయాంతరమందు
నెంతయానంద మో యెవ్వఁ డెఱుంగు?
తదనంతర మ్మజధారుణీనాథ
పౌత్రుఁడు వేంచేసెఁ బ్రాసాదమునకు.
అనుదినమ్మును లీల లాతఁ డారీతిఁ
గావించుచుండును; గలహాశనాది
సన్మునివర్యులు సాకేతమునకు
వచ్చి నిత్యము రామభద్రునిదివ్య
చరితమ్ము ఁగీర్తించి చనెద రెందేని;
బ్రహ్మలోక మ్మేఁగి వాగ లీ కథలు
వినిపింప నానందవివశుఁడై ధాత ,
"ఏది మ ఱొక్కమా రిం కొక్కమారు
శ్రీరామచరితకీర్తింపుఁ" డటంచు
బ్రతిమాలుకొనుచుండు బహువిధమ్ములుగ;
బ్రహ్మనిష్ఠానిధుల్ పరమమహర్షు
లా సనకాదు లహర్నిశల్ వినుచు

శ్రీరామదివ్యచరితమానసమ్మ్ని,
మఱతురు బ్రహ్మసమాధినిఁగూడ;
ఈ సమస్తమ్మ్ని తా నెఱిఁగియు మఱల
శ్రీహరికథలపైఁ బ్రేమ యొక్కింత
కలుగనియెద మహాగ్రావము గాదె?

రామగీత

రవికులతిలకుఁడు రావింప నొక్క
సారి గురుద్విజుల్ సకలపౌరులును
చనుదెంచి శ్రీరామచంద్రునిసభకు
నుచితాసనమ్ముల నొప్పుట గాంచి
భవహారకుఁడు రామభద్రుఁ డి ట్లనియె:
"ఓ పురజనులార! ఒకమాట కలదు;
నీతిదూరగుఁడనై నే నిది యనను;
శాసించుటయుఁగాదు; సకలమ్ము విన్న
వెనుక నిచ్చినచో నా విధమున నేఁగుఁ;
డెవ్వఁడు నా యాజ్ఞ నెపుడుఁ బాలించు
నతఁడె సేవకుఁడు నా కతఁడె ప్రియుండు;
నీతినిఁ బోనాడి నేఁ బల్కు నెడల
నిర్భయమ్మ్ని దాని నిలుపుఁడీ యుపుడ;
అమరదుర్లభమని యఖిలగ్రంథములు
వాకొను నీ మానవశరీర మెట్టి
భాగ్యమ్మ్నికతన లబ్ధమ్మ్నినదొక్కొ?
సాధనపథము మోక్షద్వార మిద్ది;
యీ శరీరప్రాప్తి యొసఁగియుఁగూడఁ
బారలౌకికము సంపాదింపఁ డెవఁడు
వాఁడు మీఁదట దుఃఖభాజనుఁడగును.
కాలమ్ము మీఁదను గర్మమ్ము మీఁద
దైవమ్ము మీఁదను మిథ్యాదోషములను
రోయక సత్య మారోపించునతఁడు;
నరశరీర మ్మొందినందుల కవని
ఫల మొక్క విషయలంపటతయే కాదు;
స్వర్గసౌఖ్యము కడుస్వల్పము దుఃఖ
దాయియుఁ జివఱకు; ధరనరజన్మ
నెత్తియుఁ దా విషయేచ్ఛ జరించు
నాతఁడు కొని విషమమృతమ్ము నొసఁగు
నట్టిఁడు, గురిగింజకై స్పర్శవేది
యిచ్చెడునట్టివాఁ; డీ యవినాశి
జీవుఁ డ్ఢా యండజస్వేదజోద్భిజ్జ
ములునుజరాయుజము లనంగ నొప్పు
నా చతుర్విధజీవులందు జన్మించుఁ;
జెలఁగెడి నా చతుశ్శ్రేణియోనులను
బుట్టుచుఁ జచ్చుచుఁ బొగులుచునుండు;
నిట్టిచోఁ గరుణ నిర్హేతుకస్నేహి
స్వామి వానికిని బ్రసాదించుచుండు
నీ నరదేహమ్ము; నిది భవాంభోధి
తారక మ్మగునొక; ధర నాదుకరుణ
పవనానుకూల్యము; వరలు సద్గురుఁడె
కర్ణధారుండు; జగమ్మున నిట్టి
సాధనసంపత్తి సమకూరికూడ
భవవార్ధి దాఁటనివాఁడు కృతఘ్నుఁ
డతిమందబుద్ధి; వాఁ డాత్మహంతకుఁడు
పొందెడుదుర్గతిఁ బొందు సంతతము;
ప్రజలార! ఐహికపారలౌకికము
లగు సుఖమ్ములు గోరునట్టివారైన
దృఢముగా మీ లసద్ధృదయమ్ములందుఁ
బాటింపుఁడీ నాదువచనముల్ ప్రీతి;
భక్తిమార్గము సులభము సుఖదమ్ము
వేదపురాణాదివిహితము, నుతము;
జ్ఞానమార్గమ్ము దుర్గమము తత్ప్రాప్తి
యందు విఘ్నములు పెక్కుగుచుండు; దాన
సాధనకఠినము; చయ్యన దాని
యందు మనమ్మున కాధారమేనిఁ
గలుగదు; మిక్కిలికష్టించి దాని

సాధించియును భక్తిసహితమ్ముగాక
యది నాకు సుంత ప్రియమ్ముగాఁబోదు;
భక్తిస్వతంత్రము, పరమసుఖదము.
జగతిని సజ్జనసంగతి లేక
భక్తి లే; దెంతటిభాగ్యమ్ముచేసి
యుండిన లభియించునొకొ్క– సత్సంగ?
మదియు సంసారమహోంథ్యవారకము;
త్రికరణమ్ములను భూదేవులఁ గొల్చి
కంటెఁ బుణ్యమ్ము జగమ్మునఁ గలదె?
అలరు నింకొ్కక్కరహస్యము; కేలు
మోడ్చివచింతు ;శంభుని పార్వతీశు
కలధౌతనగధాము కామవిరోధి
పదము లెన్నక నాదుభక్తి లభింప;
దీ భక్తిమార్గ మ దేమికష్టమ్ము?
యోగయజ జపతపోపవాసముల
పనిలేదు; సరళస్వభావ మకుటిల
చిత్తమ్ము సంతృప్తి చెలఁగినఁ జాలు;
ఏల పెక్కు–వచింప నిది యాచరించు
ప్రజలకుఁ బెరటికల్పకమను నేను.
వైరవిగ్రహములు భయము లేనట్టి
వానికి సుఖ మింటిపట్టున వెలయు;
ననఘుఁ డరోషుఁ డనారంభుఁ డమలుఁ
డనికేతుఁడు నమాని యానందఘనుఁడు
స్వర్గాపవర్గవిషయములఁ దృణము
వలెఁ గనుంగొను భక్తిపక్షువాఁడు
తర్క–దూరుండు సత్సంగప్రేమికుఁడు
మమకారమోహమదవిదూరుండు
విమలమాస్మకీనవిఖ్యాతదివ్య
నామజపపరాయణాంతరంగుండు
మిక్కి–లి నాకు సంప్రీతి సేకూర్చు;
నెఱుఁగు నొక్కరుఁ డాతఁడే యా సుఖమ్ము”–
నావుడుఁ బ్రభువచనము లాలకించి

కరుణాకరునిపదకంజముల్ పట్టి
భక్తి నిట్లనిరి సర్వప్రజల్, “దేవ!
తల్లియుఁ దండ్రియు దైవముం గురుఁడు
నన్నదమ్ములు మాకు నఖిలమ్ము నీవ;
ప్రాణాధికుండవు ప్రణతపాలకుఁడ
వీ యుపదేశము నెవ్వ రిచ్చెదరు–
నీవుగాకున్న ననిందితచరిత!
జననియు జనకుఁడు స్వార్థచింతకులు
మా కిది చెప్పరు మా స్వామి! జగతి
లోకోపకారు లిర్వురె ప్రవర్తింతు–
రొక్కఁడు నీవు వే ఱొకఁడు నీ పాద
భక్తుఁడు; పరులెల్ల స్వార్థముకొఱకె
స్నేహితుల్; కలలోనేని వారలకుఁ
బరమార్థభావమ్ము ప్రభువ! చూపట్ట”–
దన వారివచనము లాలించి రామ
చంద్రుఁ డెడందను సంతసమందెఁ;
బ్రభునియనుజ్ఞను బడసి వారెల్ల
జేఁగిరి తమతమయిండ్లకుఁ బ్రీతి;
స్వయముగా శ్రీరామచంద్రుఁడే యేలు
సాకేతపురమున జనియించినట్టి
పౌరులే ధన్యులు పరములు ఘనులు.

శ్రీరామవసిష్ఠసంవాదము

ఒకనాఁడు శ్రీరాముఁ డోలగమ్మునఁడ
నటకు వశిష్ఠమహర్షి వేంచేసె;
నాతని రాఘవుఁ డపు డాదరించి
చరణముల్ గ్రక్షాళించి చరణామృతమ్ము
గైకొనె; మునియును గరములు మోడ్చి,
“ఓ కృపాసింధు! నా దొకవిన్నపమ్ము:
త్వత్ప్రవర్తనలను బరికింప మామ
కీనమానసమునఁ గెరలు నపార
మోహమ్ము లోకైకపురుష! శ్రీరామ!

అవధి తన్మహిమ కో యసురారి! లే ద
టంచుఁ బేరొక్కనుచుండు నాగమమ్ములును;
స్వామి! యిం కేమని వర్ణింతు నిన్ను;
వసుధఁ బౌరోహిత్యపద మతినీచ
మని పురాగ్రంథము లాడుటయెల్ల
నెఱిఁగి దానినిఁ దిరస్కృతిసేయ ద్రుహిణుఁ
డప్పుడు ననుఁ బిల్చి, 'యయ్య! కుమార!
మున్ముందు లాభము, పొందెద వీవు;
స్వయముగా నా పరబ్రహ్మ ఘనుండు
ద్వైత్యారి నరరూపధారియై భూను
వంశమ్మునందునఁ బ్రభుఁడుగాఁ బుట్టు"
ననిన "నస్మద్ధృదయమ్మున యోగ
యజ్ఞజపవ్రతాద్యఖిలసద్ధర్మ
తతులచే సాధింపదగినట్టివాని
సాధింతు నేఁ గర్మసంగతివలనఁ,
దత్తుల్యమైన సద్ధర్మము కలదె?
తతయోగజపసత్యధర్మాదికమ్ము
లంగమవిహితమ్ములైన కర్మములు
జ్ఞానదయాదమసకలస్తీర్థ
స్నానములు వేదసుజనవాక్కులును
దంత్రమంత్రములు వేదపురాణశాస్త్ర
పఠనశ్రవణములు పరమ సాధనలు;
వీనియన్నింటికి విభు! ఫలితమ్ము
భవదీయపాదసద్భక్తియ కాదె?
అశ్రమమ్మున నాకు నది లభియింపఁ
గలదె కామ్య మ్మింతకంటె" నటంచుఁ
దలఁచి యీ కులగురుత్వ మొప్పుకొంటి;
మలినమ్ముపోవునే మలినమ్ముచేత?
నేయిలభించునే నీరు మథింప?
నంతఃకరణమల మా ప్రేమభక్తి
విమలజలములేక వెడలునె యెందు?
త్వత్పదభక్తుఁడై వరలునతండె
తత్త్వజ్ఞుఁడుం గుణధాముఁ డఖండ
విజ్ఞాని చతురుఁడు వేదవేదాంగ
విదుఁడు సర్వజ్ఞుఁడు విమలుఁడు సర్వ
శుభలక్షణమ్ముల శోభిల్లువాఁడు.
"స్వామి! నే నిన్నొక్కవరము గోరెదను -
గరుణించి నాకు నీఁగల వని యెంచి:
యెన్ని జన్మమ్ము లి ట్లెత్తినఁగాని
నీ పాదములపయి నెగడుత భక్తి"-
యని మునీంద్రుం డేఁగె; నది రామభద్ర
హృదయమ్మునకుఁ గడునింపుఁ జేకూర్చె.

ససోదరుఁడై శ్రీరాముఁడు చూతవనమునకు
విహారార్థ మేగుట

తదనంతరమ్ము భక్తజనావనుండు
సేవకసుఖదుఁడు శ్రీరామవిభుఁడు
భరతాదు లనుజులఁ బావని వెంటఁ
గైకొని యేఁగి నగరబాహ్యదేశ,
మచటికి స్యందనహస్తితురంగ
మాదులఁ దెప్పించి యందఱిఁ బొగడి
యెవ్వరి కందున నేది యిష్టమ్మో
యుచితమ్ము నెఱిఁగి య దొసఁగి వారలకు
శ్రమహారకుం డగుస్వామి శ్రమించె;
అటనుండి కదలి వా రనతిదూరమున
సుందరశీతలచూతవనమ్ము
కనుఁగొని యరిగి రక్కడకు; వస్త్రమ్ము
భరతుఁడు పఱచినఁ బ్రభుఁడు దానిపయి
నాసీనుఁడై, భక్తి ననుజులు దన్నుఁ
జుట్టి సేవలుసేయఁ, జొక్కసమీర
పుత్త్రుఁడు వీవఁగ బులకితాంగుఁడయి
కన్నులఁ బ్రేమాశ్రుకణములు నిండ
వేడ్క మహానందవివశుఁడై యిట్లె;
పార్వతీ! పావనిభాగ్య మెన్నంగ

నగునె? యాతనిప్రేమ ననవరతమ్ము
ప్రభుఁడు స్వయమ్ముగా వర్ణించుచుండ.

నారదమహర్షి రామదర్శనమున కేతెంచుట

ఆ సమయమున నుహతి చేతఁ బూని
శ్రీరామభద్రచరితము సద్గుణము
లాలపించుచును దివ్యర్షి నారదుఁడు
చనుదెంచి యి ట్లని సన్నుతిఁజేసె:

నారదకృత రామకీర్తనము

గేయములు

పరికింవఁగదే పంకజలోచన!
కృపావిలోకన! శోకవిమోచన!
నీలతామరసశ్యామా! స్మరారి
హృదయకంజమకరందమధుప! హరి!

యాతుధానపృతనాబలహారక!
మునిసజ్జనరంజన! అఘవారక!
భూసురసస్య వినీలబలాహక!
అశరణశరణ! దీనజనగ్రాహక!

భుజబలఖండితధరాధురా! ఖర
దూషణవిరాధభంజక! కావర!
రావణారి! సుఖరూప! భూపవర!
జయ దశరథకులకుముదసుధాకర!

సుయశ! పురాణవిదిత! నిగమాగమ!
వందితసురమునిసాధుసమాగమ!
కరుణాకర! ప్రభు! దుర్మదఖండన!
చతుర! మహాత్మ! అయోధ్యామండన!

మమతాకలిమలహారకనామా!
భానువంశకులజలనిధిసోమా!
తులసీకిశోరసేవితపాద!
దయగనవే నీ దాసుఁడ గాదా!

అని రామచంద్రు గుణాబ్ధిఁ గీర్తించి
హృదయమ్మున ధరించి యేఁగె నారదుఁడు
బ్రహ్మలోకమునకు భక్తితత్పరుఁడు.

శ్రీరామచరితమానసము

ఉత్తరకాండము

తృతీయవిశ్రామము

శ్రీఘటికాచలపతిఁ భో
రాఘూఘమహోగ్రమేఘహరణసమీరా!
శ్రీఘనసుందరవర్ణా
మోఘూంగా! మట్టపల్లిపురనరసింహా!

శివపార్వతీసంవాదము

పార్వతీ! యీ మహోజ్జ్వలదివ్యగాథ
నా బుద్ధికొలఁది నీనాఁడు చెప్పితిని;
శ్రీరామదివ్యచరిత్ర మగాధ
మాగమాదుల కది యలవిగానట్టి;
దా రామభద్రుఁ డనంతుఁడు; వాని
నామకర్మగుణజన్మము లనంతములు;
జలశీకరమ్ము లెంచగవచ్చు; భూళి
కణము లెన్నేనియు గణియింపవచ్చు;
శ్రీరామభద్రచరిత్రవర్ణింప
వశముగా దేరి; కీ పావనగాథ
పరమపద మ్మిచ్చు; భక్తి లభించు
విన్నవారికి శాంభవీ! యిది మునుపు
గరుడునితోడ న క్కాకభుశుండి
పలికినసుందరవరచరిత్రమ్ము;
శ్రీరామభద్రునిశ్రీగుణసమితి
నొకకొన్ని వర్ణించియుంటి నిందాఁక;
నింకేమి నే వచియింపఁ గోరెదవు
పలుకు మనంగ ని ప్పావనదివ్య
కమనీయమంగళగాథ నాలించి
పార్వతి వివశయై భక్తి వినమ్ర
కోమలమధురవాక్కుల నిట్లు లనియె:
"భవహారి యగురామభద్రునిగాథ
నాలించుకతన ధన్యతఁగాంచియుంటిఁ;
గృతకృత్యనైతిఁ దత్కృపచేత నాదు
మోహమ్ము దొలఁగె; ప్రభునిరామచంద్రు
మాహాత్మ్య మెఱిఁగితి; మదనవిరోధి!
తతభవద్వదనసుధాకరబింబ
నిర్గతశ్రీరామనిరుపమవిమల
గాథాసుధల మనఃకర్ణపుటాల
నెంతగఁ ద్రావియుఁ దృప్తి యేర్పడదు;
శ్రీరామదివ్యచరిత్ర నాలించి
సంతృప్తిగాంచినజనుఁడు తద్రసము
గ్రహియింపఁజాలని కడుమోరకుండు;
రామకథాలసద్రాజీవ మిచ్చు
రసమరందము భక్తభ్రమరముల్ ద్రావు;
మూర్ఖదర్దురసంఘమున కేమియెఱుక?
అవని జీవన్ముక్తు లగుమహామునులు
తద్గుణమ్ములను సత మ్మాలకింత్రు;
భవమహాకూపారపారమ్ము ముట్టఁ
దలఁచుచో రామకథాదృఢనౌక
యావశ్యకమ్ముగాదా నిరంతరము?
హరిగుణమ్ములు విషయాసక్తులకును

గర్ణ పేయమ్మ్ములై క్రాలుచునుండు;
కర్ణవంతుఁడు రామకథ నాలకించి
హర్షింపఁ డెవఁ? డట్లు హర్షింపనట్టి
యాతఁడు నిజముగ నాత్మహంతకుఁడు;
శ్రీరామచరితఁ గీర్తింపఁగ మీరు
హర్ష మేపారఁగ నాలించి తేను;
గరుడునితోడ న క్కాకభుశుండి
పలికె నీ శ్రీరఘువరచరిత్రమ్మ
టంచుఁ జెప్పితిరి మహాదేవ! కాకి
యెక్కడ? పరికింప నిట్టివై రాగ్య
మిట్టివిజ్ఞానమ్మ్ము నిట్టి శ్రీరామ
పదభక్తి యెక్కడ? పరగు సంశయము;
వేగురిలో ధర్మవిదుఁ డొక్కఁడుండు;
నట్టి ధర్మాత్మ్మలయం దొకకోటి
కే యొక్కఁడో రహియించును విషయ
విముఖుఁడు సుజనుఁడు వీతరాగుండు!
వారలు వేగురు వరలినచోట
నలరు నొక్కరుఁడు సమ్యజ్ఞానవిదుఁడు;

తత్సహస్రమ్మునఁ దనరుచునుండుఁ
బరమపావనుఁడు జీవన్ముక్తుఁ డొక్క;
డట్టిజీవన్ముక్తులందునఁగూడ
సౌఖ్యధాములును విజ్ఞానులు సములు
బ్రహ్మనిష్ఠు లతిదుర్ల భులు మహాత్మ!
వారియందును రామభద్రునిపాద
కంజాతభక్తి యొక్కనికే లభించు;
నట్టి దుర్ల భమగుహరిభక్తి చేత
వాయస మ్మొక్కఁడు వరలు ననంగ
వింతసుమీ; నాకు విన్పింపవలయు,
నట్టివిజ్ఞానికి నా ధీరబుద్ధి
కా భుశుండికిని వాయసదేహ మేమి
కారణమ్మున వచ్చెఁ? గాకభుశుండి
పరమసుందర మతిపావనమైన

నీ రామచరితము నెచ్చట వినియె?
నీ మహాగాథ మీ రెచ్చట వింటి?
రా వినతాసుతుఁ డతిపుణ్యగుణుఁడు
హరిపదభక్తుఁ డహర్నిశ లతని
సన్నిధియందునఁ జరియించువాఁడు
విజ్ఞానధనుఁడు తా వీడిమహర్షి
గణముల ని ట్లొకకాకిని దరిసి
యీ రామచరితము నేల నాలించెఁ?
గాకభుశుండియు గరుడుండు గలిసి
హరిభక్తిఁగూర్చి యేమని మాటలాడి?"—
రనిన మృడానివాక్యము లాలకించి
శంకరుం డప్పుడు, "సతి! ధన్య వీవు;
నీ బుద్ధి యభినందనీయము; వినుము —
పరమపవిత్రమ్మ్ము భవతారకమ్మ్ము
నుజ్జ్వలరామభక్త్యుత్పాదకమ్మ్ము
నగు రమ్య మీ యితిహాసమ్మ్ము; మున్ను
గరుడుఁడుసైతము కాకభుశుండి
నట్ల ప్రశ్నించె నత్యాదర మొప్ప;
నదియెల్ల వివరింతు నాలింపు మీవు
సుముఖి! సులోచని! సుందరి! రామ
కథ నేను విన్నట్టిక్రమము విన్పింతు:

శివుఁడు పార్వతికి కాకభుశుండివృత్తాంతముఁ

దెలుపుట

మొదట దక్షునియింటఁ బుట్టితి వీవు
సతి యనుపేర, దక్షక్రతువేళ
నవమానసంతప్తవై ప్రాణములను
వదలినఁ గ్రుద్ధులై ప్రమథులు నడచి
దక్షయజ్ఞమ్ము విధ్వస్తమ్ముసేసి;
రి క్కథయెల్ల నీ వెఱుఁగుదుగాదె?
అప్పుడు నే హృదయమునఁ ద్వద్విరహ
శుగ్వహ్నిచేఁ గడుస్రుక్కి విరక్త

భావమ్మ్లతోనఁ బర్వతసరిత్కాన
నాదుల వెంబడి నరుగుచునుంటి;
రత్నసానువును త్తరమ్మున దూర
మతిదూర మేఁగిన నం దొక్కచోట
నొక్కనీలమహార్య మొప్పారు హేమ
సుందరశృంగసంశోభిత; మందు
నాలుగుశిఖరముల్ నా మది కమిత
హర్షమ్ము నొడఁగూర్చె; నవి పరివ్యాధ
చలదళ మన్మథ చమరికా జంభ
శారదీ పున్నాగ శంపాక నేమి
పారిభద్ర మధూక ప్లక్షు వాలూర
గాల వామ్ర పలాశ క్రముక కదంబ
ర్ఘూబుక తింత్రిణీ శాండిల్య చవ్య
శాల్మలీ లాంగలీ చాంపేయ వకుళ
శేఫాలికా సహా సింహుండ ముఖ్య
పాదపవితతుల భాసిల్లుచుండు;
దన్మధ్యమందు సుందరతటాకమ్ము
తనరారుచుండుఁ గా ర్తస్వరపట్ట
భంగసనాథము పరమసుమధుర
నిర్మలశీతలనీరసంభరిత;
మనవరతము రాజహంస లచ్చోట
మధురస్వరమ్ముల మలయుచునుండు;
నిందిందిరారావ మెంతయు మదికి
హాయిసేకూర్చు; న య్యాచలమ్మువీఁద
నా పక్షివరుఁడు మహోత్ముఁడు ఘనుఁడు
కాకావతారుండు కాపురమ్ముండు;
మాయారచితములై మహి నొప్పు మోహ
కామావివేకవికారాదిసకల
దుర్గుణపుంజముల్ తోఁప నొక్కటియు
నచ్చోట; నా వాయసాధీశ్వరుండు
భజియించునో యెంతభ క్తిని రామ
భద్రుని- వర్ణింప వశమొకో నాకు?

అశ్వత్థమునఁ జేరి ధ్యాన మొనర్చి
శాల్మలిపై కెక్కి జపము గావించుఁ
వటము నారోహించి ప్రభుకీ ర్తించుఁ;
జేరి చూతము మానసికి రాజసేయు;
సతతము లేచి గోసర్గమధ్యమున
గావుకావు మటంచుఁ గడుభ క్తి మేలు
ననుదినమ్మును భ క్తి హరిఁ గొల్చుకంట్లు
నాతని కన్యకార్యాస క్తి లేదు;
వటశాఖపైఁ జేరి ప్రభుచరిత్రమ్ము
గానమొనర్పఁగ ఖగసంచయమ్ము
లరుదెంచి కడుభ క్తి నాలించుచుండు;
దానిని గని నా హృదయమున మిగుల
ప్రేమభావ మ్మురవ్వల్లి న నేను
నుజ్జ్వలసన్మానసోకసాకార
ధారినై కాకమ్ము దరిసి శ్రీరామ
గాథ నాలించి యి క్కిలాసమునకు
మన్మనోవైక్ల బ్యమంతయుఁ దొలఁగ
విచ్చేసితిని, శాంభవీ! యిది నేను
శ్రీరామదివ్యచరిత్రము విన్న
తెఱఁగు సుమీ; వైనతేయుఁడు వికిర
వంశమండనుఁ డేల వడి కాకికడకు
వెడలెనో యీ కథ విన్పింతు నింక:-

గరుఁడుడు మోహాధీనుఁడై శివునిపనుపునఁ
గాకభుశుండి నాశ్రయించి రామకథ వినుట

సంఖ్యమందున రఘుస్వామి తా మేఘ
నాదహ స్తముల బంధన మిచ్చగించె;
నారదముని ఖగనాథు నచ్చటకుఁ
బంప సుపర్ణుఁడు పన్నగతతుల
భక్షించి యూడ్చెను బంధనమ్ములను;
దదుపరి యతనిహృదయమధ్యమందు
నేదియో సుంతయు నెఱుఁగరానట్టి

యొక్కమహారాట ముప్పతిల్లినది;
స్వామిబంధన మెద స్మరియించి సర్వ
వైరి య్యాలోచించెఁ బరిపరిగతుల;
వ్యాపకుండును బ్రహ్మ పరమేశ్వరుండు
విరజుం డచింత్యుండు విష్ణుఁడు దేవ
దేవుఁడు మూలమూర్తియీతుఁడు జగతి
నవతరించె నట్టిం దు నాలించియుంటిఁ;
గాని తచ్ఛక్తి యెక్కడ గానరాదు;
నామదివ్యస్మరణమ్మున ఘోర
భవవార్ధి దాఁటించు భగవంతుఁ డొక్క-
తుచ్ఛరాక్షసునిచేతులలోన నాగ
పాశమ్మునిచే నెట్లు బంధితుఁడయ్యె?
నిది కడువింత సుమీ” యని తలఁచి
యేమిగావించియు నీ చింత చనక,
తనహృదయమ్మునఁ దర్కమ్ము పెంచి,
నీవలె మోహావార్నిధి మునింగి
తుటతుదకు నారదుం గని తనదు
మది నేర్చునెగులు క్రమమ్మునఁ జెప్పఁ
గడుజాలిఁబొంది యక్కలహాశనుండు,
“పక్షీంద్ర! ఆ రామభద్రునిమాయ
యతిబలీయము; జ్ఞానులగువారిఁగూడ
మోహింపఁగాఁ జేయు; మునుకొని నన్నె
యాడించెఁ బలుమారు; లది నీకుఁగూడ
వ్యాపించె నక్కటా! యది చెప్పినంత
వైదొలఁగునె? నీవు వైళమ యేఁగి
దర్శించి వేఁడ, నాతం డేమిచెప్పు
నటు చేయుట యు క్తమగు” నని పలికి
శ్రీరామచంద్రుఁ గీర్తించుచుఁ జనియె.
తదుపరి తార్క్ష్యుఁడు ధాత దర్శించి
తనదుసందేహ మాతని కెఱిఁగించె;
అంతయు విని కోసలాధీశు నెడఁద
స్మరియించి యాతనిమాయాబలమ్ము
గనుఁగొని వెఱఁగొంది కడుప్రేమమగ్నుఁ
డై, “యెంతకోవిదులైన తద్భక్తు లె;
అక్కటా నేన మాయకులొంగిపోవ
నింక నీ ఖగనాథు నేమనఁగల” న
టంచు భావించి “యో యహివైరి! రామ
సన్మహిమమ్మును శంకరుఁ డెఱుఁగు;
నాతనికడ కేఁగి యడుగుము; పరుల
నడుగకు, మీ సందియమ్ము శంకరుఁడు
గాక పరుల్ దీర్పఁగాలే” రనంగ
నత్యాతురమున విహంగనాథుండు
వచ్చె నాకడకు “నో పార్వతీ! నిన్ను
గలధౌతశిఖరి నొక్కర్తుక డించి
చనుచుండ నేను వైశ్రవణపురమ్ము
వచ్చి పాదమ్ముల” వ్రాలి సందేహ
మడిగిన నేను బ్రేమాంబుధి మునిఁగి
“తార్క్ష్య! యిప్పుడు నడిదారిలో నీకు
నేమని వివరింతు నీ క్షణమందు?
బహుకాలసత్సంగ భాగ్యము లేక
సంశయనిచయము చన దేరికేని;
ఆదిమధ్యాంతము లమరనివానిఁ
బ్రభుని శ్రీరాముని బ్రతిపాదనమ్మునఁ
గావించు శ్రీహరిగాథలు పెక్కు-
వారముల్ వినక నివారింపఁబడునె
యీ సంశయమహాగ్ధ్య? మి ట్లగుకతన
నేను బంపుచునుంటి ని న్నిట్టిచోటి;
కచ్చట హరికథ లలరును సతత
మట కేఁగి నీ వవి యాలించునెడల
దీరు నీ మదిని సందియము; శ్రీరామ
పాదకంజములపై భక్తి జనించు;
ఎచ్చోటసత్సంగ మెసఁగ దచ్చోట
హరిదివ్యకథలు లే; వవిలేక మోహ
తతిపోవ; దదిపోక ధర రామభద్రు

శ్రీపదమ్ములమీఁదఁ బ్రేమ యేర్పడదు;
ఖగనాథ! యీ ప్రేమకలుగక యోగ
యాగవైరాగ్యజపాదులవలన
శ్రీరామచంద్రుఁడు చిక్కఁ డేరికిని.
ఉత్తరదిక్కున నొకనీలశైల
మొప్పారు సుందర ముజ్జ్వల మందు
ఘనుఁడు భుశుండినాఁ గాకవరుండు
కలఁడు తా భక్తిమార్గప్రవర్తకుఁడు
జ్ఞానియు బహుగుణాగారుండు; సతత
మాతఁడు శ్రీకోసలాధీశుగాథ
లఖిలపక్షులకు సమాదరమొప్ప
వినిపించుచుండుఁ బ్రౌఢిమ్యమెలర్ప;
అచ్చటి కేఁగి యీ హరిగుణమ్ములను
విన్న నీ మోహము వీఁగిపోఁగలదు;
నమ్ము" మటంచు నానాప్రకారముల
నందుల కాతని నస్తుంకరింపఁ
జేసిన నాతఁడు శీఘ్రమ నాదు
చరణకంజములకు సాష్టాంగమెరఁగి
యరిగె; నే నాతని కీ కథ చెప్ప
నందుల కొక్కరహస్యకారణము
కలదు: పక్షీంద్రుఁడు కడుదర్పితుండు;
రాఘవుఁ డతనిదర్పమ్ము హరింప
నిట్టిమాయను బార్వతీ! పన్నియుండె;
ఖగముఖగంపువాక్చయమును విశ్వ
సించునటంచుఁ జెచ్చెర ఖగనాథు
నంపితి నేను వాయసనాథుకడకుఁ;
బార్వతీ! ప్రభుమాయ బలవత్తరమ్ము;
జ్ఞానశిరోమణి కంజాతు త్రిభువ
నాధీశుదివ్యవాహనము సద్భక్తుఁ
డగువైనతేయుఁడే యీ మాయఁ జిక్క,
నల్పమానవు లేటి కాగతి తామె
విశ్వకర్తల మని విజ్రుంభీఁగెదరు?

శివవిరించ్యాదులే చిక్కి రీ మాయ,
మే మెంత యనికదా మిన్నక సన్మ
నీంద్రులు భగవంతు నెప్పుడుఁ గొలుతు;
రా విహగేశ్వరుఁ డట్లకుంఠమతి
హరిభక్తిపరుఁడగు నక్కాకవిభుఁడు
గలచోటి కరిగె; నా ఘనపర్వతమ్ము
కనుఁగొన్నమాత్రానఁ గ్రక్కున నతని
మోహాంధ్య మది వీడిపోవఁదొడఁగె;
ఆ సరోవరమునయందు స్నానమ్ము
గావించి నీరము కడుపారఁ గ్రోలి
యేఁగి యొక్కెడ వటవృక్షముక్రిందఁ
గూర్చుండె; శ్రీరామగుణకీర్తనమ్ము
నాలింప వృద్ధవిహగములు బెక్కు
చనుదెంచియుండెను; స్వామి సత్కథను
గాకభుశుండి యింకన్ వినిపింప
నాయత్తపడుచున్నయవసరమందు
నచటికిఁ బక్షీంద్రుఁ డరుదెంచె; నతని
వీక్షించి సకలము విహగకులమ్ము
హర్షించి యప్పుడత్యాదరమొప్ప
స్వాగతమ్మొసఁగి కుశలముల నడిగి
యొక్కమహాసన మొసఁగిన, గాక
వర్యుఁడు ఖగనాథు భక్తి బూజించి,
"నాథ! మీదగుదర్శనమ్మునఁజేసి
యే గృతార్థుఁడనైతి నిఁక మీర లేమి
యానతి దయసేతు రది సేయువాఁడ
స్వయముగా మీరలే చనుదెంచినట్టి
కార్య మెట్టిదొ?" యనంగాఁ బక్షిరాజు
వినమితుఁడై, "కాకవేష! మహాత్మ!
ఆ మహాదేవునియంతటివాఁడు
నిజవదనమ్మున నిన్నుఁ గీర్తింప
నీవుకృతార్థుఁడవేసుమీ సతత;
మెదికోరి నే నిట కేతెంచియుంటి

నది యిటకరుదెంచినంతనఁ దీఱె;
నిన్ను దర్శించితి నీదుపవిత్ర
సుందరాశ్రమమును జూచినయంత
మామకీనమ్మ్ము సంశయము వైదొలఁగె;
మోహమ్మ్మునశియించెఁ; బోయెను భ్రమము;
పావనమ్మ్మును దుఃఖపటలవారకము
సుఖదము దివ్యము సుందరమైన
శ్రీరఘునాథచరిత్రము నాకు
వినిపింపవే శ్రవఃపేయమ్మ్మగాఁగ"
నని పల్క నా వినయసరళసుఖద
పావనసుందరవాక్కు లాలించి
కాకనాథుఁడు మనఃకంజ ముప్పొంగ
నుత్సాహమున శ్రీరఘూత్తముదివ్య
కథలెల్లఁ గీర్తింపఁగాసాఁగె భక్తిఁ;
భార్గవీ! యాతఁడు ప్రప్రథమమున
శ్రీరామదివ్యచరిత మానసము
తో నుపమించె; విధూతపాపుండు
తరువాత నా నారదర్షి మోహమ్మ్ము;
దశకంధరునియవతరణమ్మ్ము, రామ
దివ్యావతారము, దేవాధిదేవు
శ్రీరాము శైశవక్రీడలు, పిదప
సాకేతమునకువిశ్వామిత్రురాక,
శివధనుర్భంగము, సీతామతల్లి
శ్రీరామచంద్రులశ్రీవివాహమ్ము,
శ్రీరామపట్టాభిషేకయత్నమ్ము,
తద్భంగమును, విషాదమ్ము్మను, బౌర
విరహమ్ము్మ, రాముఁడు విపినమ్ము్మ చనుట,
గుహునిగాథయును, గంగోత్తరణమ్ము్మ,
పావనమ్ము్మప్రయాగవాసమ్ము్మ, పూజ్య
వామలూరుభవుండువచ్చుట, స్వామి
చిత్రకూటమ్ము్మ వేంచేయుట, మంత్రి
యగుసుమంత్రుం డయోధ్యను జేరుకొనుట,
దశరథమరణము, తరువాత భరతుఁ
డరుగుదెంచుటయును, నాతనిప్రేమ,
దశరథేశ్వరునియంత్యక్రియల్, పౌర
వరులు వెన్నంటిరా భరతుఁడు రామ
భద్రునిగాంచుట, పాదుకాదాన,
మా భరతుఁడు వెన్క కరుగుట, నంది
గ్రామవాసమ్ము్మ, లేఖర్షభసుతుని
నైచ్యము, రామచంద్రప్రభుండత్రిఁ
గనుట, విరాధునిగాథయు, నవల
నా శరభంగదేహత్యాగవృత్త
మును, సుతీక్ష్ణునిప్రేమమును, ఘటాత్మజుని
సత్సంగగాథయు, స్వామిరాఘవుఁడు
దండకాటవిఁ బునీత మొన్మనర్చుటయు,
గృధ్రేంద్రుతోడిమైత్రియుఁ, బంచవటిని
వసియించుటయు, మునివరులభయమ్ము్మ
వాపుట, లక్ష్మణస్వామికిఁబ్రీతి
నుపదేశమిచ్చుటయును, జుప్పనాతి
ముక్కుఁజెవుల్ గోసి పోద్రోలుటయును,
ఖరదూషణాదులు ఖండింపఁబడుట,
దశకంధరుం డీ కథల్ విని క్రుద్ధుఁ
డగుటయు, మారీచునాగమనమ్ము్మ,
నా రావణుండు మాయావిదేహజను
హరియించుటయుఁ, గోసలాధీశువిరహ,
మా జటాయువుగాథ, నటుపైఁ గబంధ
వధయును, శబరికిఁ బరమపదమ్ము్మ
నిచ్చుట, పంపకు నేతెంచుటయును,
నారదునాగమనమ్ము్మ, సమీర
సుతునితోఁ గలియుట, సుగ్రీవమైత్రి,
వాలిసంహరణము, వానరనేత
గా నార్కొ నభిషిక్తుఁగావించుటయును,
స్వామిప్రవర్షణ శైలవాసమ్ము్మ,
ప్రావృట్శరత్తులవర్ణన, ప్రభుని

కీశనాథునిమీఁదికినుక, సుగ్రీవు
భయమును, సుగ్రీవుపనువునఁ గపులు
సీతనన్వేషింపఁ జెలఁగి నల్దడల
కరుగుట, మార్గమునం దొక్క-చోట
బిలము సొచ్చుటయును, బిదప సంపాతిఁ
గనుట, యపార మగాధ మగమ్య
మతివేలమైన మహాంభోధి నశ్ర
మమ్మున నా పవమానసుతుండు
లంఘించి చనుటయు, లంకఁ జొచ్చుటయు,
వైదేహిఁ గాంచుట, వడి నశోకమును
గూఁకటివేళ్లతోఁ గూల్చుట, పగ్తి
వదనునిభూరిసభాప్రవేశమ్ము,
లంకన్ దహించి జలధి నుత్తరించి
కపులను దనవెంటఁ గైకొనివచ్చి
జననాథునకు మ్రొక్కి జానకికుశల
వార్తలు సెప్పుట, పయనమై చనుట,
ప్రభుఁడు వానరచమూపరివృతుండగుచు
జలధితీరమున విశ్రాంతిగైకొనుట,
శరణువేఁడఁగ విభీషణుఁడు వచ్చుటయు,
వారధి నిర్మించి వారిధి దాటి
యగచరానీకిని యావలిగట్టు
నందున విడియుట, యంగదరాయ
బారమ్ము, కీశక్రవ్యాదసైన్యముల
ఘోరసంగ్రామమ్ము, కుంభకర్ణేంద్ర
జిత్ప్రముఖులవధ, శ్రీరాముఁ దొడరి
పంక్తికంఠుఁడు బహుభంగులఁ బెనఁగి
తుదకు రామునిచే హతుండగుటయును,
మయసుత కడుదుఃఖమగ్నయై యేడ్చు;
ట విభీషణుని లంకాభిషేకమ్ము,
బుభువులు మునులు హర్షించుట, మాయ
జానకిచనుట, వైశ్వానరమూర్తి
సత్యజానకిఁ దెచ్చి స్వామి కిచ్చుటయు,

దేవత లెల్ల నుతించుట, పుష్ప
కారూఢులై యయోధ్యకు నెల్లవారు
చనుట, పురప్రవేశమ్ము, దయాబ్ధి
శ్రీరామపట్టాభిషేకమ్ము, రాజ
నీతియుఁ, బార్వతీ! నీకువిన్పించి
నట్టి రాఘవునిదివ్యావతారంపు
గాథలన్నియుఁ జెప్పెఁ గాకభుశుండి;
అఖిలమ్ము నీ కథ నాలించి పక్షి
నాథుఁడు తనదుమనమ్మునఁ బొంగి
"శ్రీరాఘవేంద్రచరిత్రమానసము
నాలింప నా సంశయమ్ములు దొలఁగెఁ;
గాకేంద్ర! త్వత్కృపకతమున రామ
భద్రదివ్యాంఘ్రిసద్భక్తి లభించె;
నాహవక్షేత్రమధ్యమ్మున నాగ
పాశబద్ధుం డగుప్రభుఁ గని సచ్చి
దానందరూపుఁ డై నట్టిరాఘవున
కీదశ యి ట్లేల యేర్పడె ననుచు
మోహసాగరమున మునిఁగితిఁ; బ్రభుఁడు
కేవలనరుఁడుగాఁ గ్రీడించుచుండ
నది తెలియక సందియమ్ము పొందితిని;
కాని నాపై ననుగ్రహమునఁ బ్రభుఁడు
మోహాబ్ధిలో ననుఁ ముంచె నటంచుఁ
దలపోతు ;నాతపత్రుఁడుగాక
జగతి నెవ్వఁడు తరుచ్ఛాయాసుఖమ్ము
గ్రహియించు? నటు మోహకంధి మునుంగ
కుండినఁ ద్వద్దర్శనోత్సవ మెట్లు
శక్యమ్ము? హరికథాశ్రవణమ్ము గలిగె.
వేదపురాణముల్ విన్పించు రామ
చంద్రునికృప లేక సజ్జనదర్శ
న మ్మశక్యమ్మని;నా భాగ్య మేమొ
మిముఁ జూడఁగంటిని మీచేత రామ

కథ వినఁగంటిని; గడచె నా భ్రమలు;
ధన్యుండ" ననుచు నత్యంతహర్ష మున
నాడిన ద్వికపతి హర్షాశ్రు లురలఁ
బులకితాంగుండయ్యె; బుద్ధిమదగ్ర
సరుఁడు సుశీలుఁడు స్వామి సత్కథలఁ

బ్రేమించువాఁడు పవిత్రుఁడునైన
శ్రోతలభించినచో నిఁక నెంత
గోపనీయమ్మేయగుంగాక పూని
సత్పురుషుండు నిస్సంశయబుద్ధి
నది వెల్లడియొనర్చు నత్యాదరమున.

శ్రీరామచరితమానసము

ఉత్తరకాండము

చతుర్థవిశ్రామము

V.R. MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

శ్రీవాడపల్లి మందిర!
పావనకృష్ణాభిషిక్తపాదసరోజా!
జీవాధారా! వీరా!
దేవా! శ్రీమట్టపల్లితీర్థనృసింహా!

కాకభుశుండి గరుడునకు హరిమాయా
ప్రభావము నెఱిగించుట

అభ్రగనాథుదిక్కై కాకనాథుఁ,
"ఆర్య! పూజ్యులరు మీ రన్నివిధాల
శ్రీరామచంద్రసత్కృపకుఁ బాత్రులరు
మోహమ్ము మి మ్మేల ముట్టు సందేహ
మేల జనించుఁ బక్షీంద్ర! నామీఁది
కరుణఁ బెంపునను నిక్కడ కిట్టిమిషను
బంపించె మిము రామభద్రుఁడు, నాథ!
మోహసంశయములు ముట్టిన వనుచుఁ
బలికితి రాశ్చర్యపడనేల, యాత్మ
తత్త్వవిదుల్ విధాతమహేశశక్ర
నారదసనకసనందనముఖ్య
లే వానఁ జిక్కి మహిం భ్రమింపంగఁ;
గామును గెల్చిన గ్రామణి యెవఁడు?
తృష్ణను దోలిన ధీరుఁ డెవ్వండు?
కోపమ్ము తనమదిఁ గొనని వాఁ డెవఁడు?
లోభమ్ము లేనట్టి లోకస్థుఁ డెవఁడు?

జ్ఞానుల్ తపోనిధుల్ కవులు పండితులు
శూరులు ధీరులు సుగుణులు నాత్మ
విదులు వీనికిఁ జిక్కి వెసఁ గుందుచుంద్రు.
శ్రీమదమ్మునఁజేసి చిక్కని దెవ్వఁ?
డధికారమదమున నలరనిదెవఁడు?
హరిణలోచనకటాక్షాంబకహతిని
ధైర్యమేదని యశోధనుఁడు వాఁ డెవఁడు?
మానమదమ్ములు మానిన దెవఁడు?
యౌవనజ్వరమున కడలని దెవఁడు?
మమతను జిక్కని మానిసి యెవఁడు?
మత్సరమ్మును ద్రెంచు మహితాత్ముఁ డెవఁడు?
శోకపవనమున స్రుక్కని దెవఁడు?
చింతాహిచేత భక్షితుఁడుకాఁ డెవఁడు?
మాయకు దొరకక మలసిన దెవఁడు?
దేహకాష్ఠమ్మునఁ దేఁకువ వాంఛ
యనుఘుణి తొలవనియట్టి వాఁ డెవఁడు?
తనయుండును బ్రతిష్ఠ ధనమును మూఁడు
వాంఛలు మదిలోన వరలని దెవ్వఁ?
డంతయు నిద్ది మాయాపరివార;
మిద్ది వర్ణింపఁగ నెవ్వఁడు శక్తుఁ?
డజుఁడు శంకరుఁడె భయంపడ నింకఁ
దక్కినజీవులఁ దలఁపఁగ నేల?-
మాయావరూథిని* మహిని వ్యాపించెఁ;

* వరూథిని = సైన్యము

గ్రోధకామాదుల్ వరూథినీపతులు;
దంభము కపటము దర్పము భటులు;
మాయ తా దాసి రామావనీశునకు;
గ్రహియించుచో నది కడుమిథ్య యగును;
బ్రభుదయ లేకున్న వదల దొకింత;
అఖిలవసుంధర నాడించునట్టి
దెవ్వరికిని సుంత యెఱుఁగరానట్టి
దీ మాయ; కోసలాధీశకటాక్ష
మాత్రసూచనమున మహి యను నాట్య
రంగాన వేషధారణముగావించి
పరివారముం గూడి పరఁగ నర్తించు;
రాముం డజుండు విరక్తుఁడు రూప
బలనిధానుండు సర్వవ్యాపకుండు
వ్యాప్యుఁ డఖండుఁ డనంతుఁ డమోఘుఁ
డక్షరుఁ డాద్యుఁడు నద్వితీయుండు
నిర్గుణుం డజరుఁడు నిర్దోషి నిర్వి
కారుఁడు గుణి నిరాకారుఁడు ఘనుఁడు
మమతావిదూరుండు మాయారహితుఁడు
సుఖరాశి నిత్యుఁడు సుందరుఁ డప్ర
మేయుఁడు ప్రభుఁడు సమిద్ధయశస్వి
యింద్రియాతీతుఁడు నీశుఁడు బ్రహ్మ
పూర్ణస్వరూపుండు భూతనాథుండు
భోగి యజేయుఁడు పుణ్యుఁ డమలుఁడు
ప్రకృతికీశ్వరుఁడు సర్వసమరుఁ డతని
మోహాదికమ్ములు ముట్టునే జగతి?
ఆంధ్యముల్ సేరునే హరిదశ్వకడకు?
భక్తావనుం డగుప్రభుఁడు భక్తాళిఁ
బ్రోచుటకై నరరూపధారియయి
భిన్నభిన్నమ్ములు వేషముల్ దాల్చి
వడిఁ దత్తదనురూపభావముల్ నటుఁడు
పోషించి నర్తించుపోలిక నిపుడు
సామాన్యజనునట్ల జగతి వర్తించి
బహువిధక్రీడలు పచరించుచుండె;
రాముని లీలలు రాక్షసమోహా
కారకమ్ములు భక్తకందముల్ నాథ!
విషయవశుల్ కామవివశులు మలిన
బుద్ధు లధములు ప్రభునియందు మోహా
మవని నారోపింతు, రా సుధాంగుండు
పచ్చనివాఁ డని పలుకు కామెర్ల
దవిలినవానివిధాన ఖగేశ!
దిగ్భ్రమ మ్మొంది ప్రతీచి నర్యముఁడు
జనియించు ననియెడుచందాన, నౌక
నెక్కినవాఁడు మహీస్థలి నడువఁ
దానచలుండయి తనరుట మదినిఁ
దలపోయు శేవను, ధరణి గుండ్రముగ
బాలుఁడు తిరిగి యీ వసుధయే తిరుగు
ననులీలఁ గామక్రోధాసత్యదుఃఖ
మదలోభరతులు దుర్మార్గులు కుజను
లాంధ్యకూపస్థు లత్యంతవిమూఢు;
లేగతి రాఘవు నెఱుఁగఁజాలెదరు;
అరయ నిర్గుణరూప మతిసులభంబు;
సగుణరూపమ్మె దుస్సాధమ్మ్ము దలప;
సుగమమైయగమమై శోభిలుచుండు-
శ్రీనాథువైవిధ్యలీల లాలించి
సన్మనుల్ సైతము సంభ్రమించెదరు;

కాకభుశుండి తన పూర్వజన్మ
కథలను దెల్పుట

మోహాంధ్యమున నేను మును జిక్కినట్టి
తెఱఁగు విన్పింతు సుధీనుత! వినుఁడు:
శ్రీరామపదకంజసేవకులైన
మీకడ లేదు సుమీ దాపరికము:
భవతరుమూలము బంధకారకము
క్లేశదాయకము మలీమసమయము

నైన గర్వమ్ము భక్తావళీలోన
నెసఁగినఁ బ్రభుఁడు సహింపఁడు మదిని;
బాలకాంగము విషవ్రణముచే దూషి
తమ్మైన జనని నిర్దయచి త్తయట్లు
ఖండించువిధమునఁ గరుణాబ్ధి భక్త
హృదయస్థగర్వము నేర్పడఁ గూల్చు;
మొదట బాలుఁడు దుఃఖమున మున్ని వ్రణము
తొలఁగినపిదప సంతోషించుపోల్కి
భక్తుఁడు మీఁదటఁ బడయు సంతసము;
వచియింతుఁ బ్రభునివాత్సల్యము నాదు
బుద్ధిహీనతయుఁ బ్రభూ! వినదగును;
నరరూపధారియై నారాయణుండు
సాకేతపురమున జన్మించినప్పు
డెల్ల నే నచ్చోటి కరుగుచునుందు;
నతనిశైశవలీల లనవరతమ్ము
గనుఁగొంచు నైదేండ్లు కాపురమ్ముంటి
సాకేతమం దొకసారి ఖగేంద్ర!
కామసహస్రసంకాశము రమ్య
మా రామచంద్రబాల్యాకృతి నాకు
నారాధ్య మత్యంతహర్షదాయకము;
వేమరు వదనారవిందము గాంచి
కాంచి లోచనములకఱవు వాసినది;
అపు డొక లఘువాయసాకృతిఁ దాల్చి
సతతము శ్రీరామచంద్రు వెన్నంటి
యతని శిశుక్రీడ లవి చూచుచుంటి;
సతత మాతని జుట్టి సంచరించితిని;
గ్రీడలు మది విస్మరించి పొంగితిని;
స్వామియెంగిలి చిక్క భక్తి మెక్కితిని
శ్రీరామచంద్రచరిత్ర రమ్యమ్ము.
సాకేతరాజప్రాసాదము స్వర్ణ
మయము దివ్యము లసన్మణిసనాథమ్ము
సత్యరూపమ్ము; ప్రాసాదాంగణంపు

వరశోభ నేమని వర్ణింపవచ్చు?
నందు భ్రాతలు నల్వు రనవరతమ్ము
తల్లులు లోచనోత్సవముగ వారి
క్రీడలు గాంచి హర్షించుచుండంగ
విహరించుచుందురు; విభునిసౌందర్య
గరిమ మేమని చెప్పఁగావచ్చు? దివ్య
మరకతరత్నసమానమనోజ్ఞ
హరితాభకోమలశ్యామదేహమ్ము;
ప్రత్యంగమునను సహస్రప్రదర్పకుల
ఛవి యెసలారెడు సన్మనుల్ పొగడ;
ముగ్ధరాజీవాభములు చరణమ్ము;
లత్యంతమును మనోహరు లంగుళులు;
కాంతినిర్జితవిధుల్ కమ్రనఖములు;
వజ్రాంకుశాంబుజధ్వజశంఖముఖ్య
చిహ్నముల్ పదములఁ జెలఁగుచునుండఁ;
గలనిస్స్వనంబులు గావించు స్వర్ణ
మయనూపురమ్ములు మలయుఁ బాదముల;
రత్నముల్ తాపిన రమ్యసౌవర్ణ
మేఖలాధ్వనులు సంప్రీతియొనర్చు;
నొప్పువళిత్రయ ముదరమ్మిమ్మీఁద!
నాభిగహ్వారము సుందరము; వక్షమ్ము
ప్యూఢమ్ము; నానావిధోజ్జ్వల బాల
కోచితాభరణతదుచితదుకూల
కలితమౌ; నరుణముల్ కరపల్లవములు;
విపులభుజమ్ములు విన్యస్తభూష,
లాస్యము శారదికామృతాంశునిభ;
మా చుబుకమ్ము రమ్యాతిరమ్యమ్ము;
సింహావలగ్నాభ్రశేష్ఠమధ్యమ్ము;
వచనమ్ములెల్ల నవ్యక్తమధురము;
లధరము బింబఫలాకృతి నొప్పు;
ధవళముల్ దీప్తిమంతములు రమ్యములు
దంతముల్ రెండు సుందరము లొప్పారు;

ముకురసన్నిభము కపోలము; నవ్య
తిలసుమప్రతిమము దీర్ఘము ముక్కు;
దరహాస మద్ది జ్యోత్స్నా తిరస్కారి;
భవహారకమ్ములు పరమరమ్యములు
నీలోత్పలాభముల్ నేత్రముల్ రెండు;
ఫాలతలమున నొప్పారు గోరోచ
నోదితసుతిలక మోంకారరూప;
మలకలు నీలమ్ము లతిసుందరములు;
శ్రవణముల్ వచ్చి భుజమ్ములఁ దాఁకు;-
నా దివ్యవిగ్రహుఁ డజధారుణీశ
పుత్త్రిసౌధాంగణభూమిని దనదు
నీడఁ బట్టికొనంగ నిక్కుచుఁ బడుచుఁ
బఱచుచుఁ గ్రీడలు పచరించుచుండె;-
నాతఁడు నాతోడ నాడినయాట
లేమని నీతోఁడ నిపుడు వర్ణింతుఁ?
గేకిసల్ గొట్టుచు గెంతుచు నన్నుఁ
బట్టుకొనంగ నా ప్రభుఁ డరుదెంచు;
నతనికిఁ జిక్కక నటు నేను బరవ
బహువిధమ్ములు రమ్యభక్ష్యముల్ చూపు;
నేను దగ్గఱి కేఁగ నిరతము నవ్వు;
నేడ్చు దూరమ్మున నేఁగిన యెడఁ;
బ్రభుచరణమ్ముల స్పర్శించు కొఱకు
నే సమీపించిన నిలువక తిరిగి
తిరిగి చూచుచుఁ బర్వుదీయు నొండెడకు;
సామాన్యబాలునిచందాన నిట్లు
శైశవక్రీడలు సలుపుచునుండ
నాథుఁడు సచ్చిదానందస్వరూపుఁ
డిదియేమియొకొ్క- తా నిట్లు వర్తించు
ననుచు నా యెద సందియ మ్మొప్పతిల్లెఁ;
దత్క్షణమే రఘూత్తమప్రేరితమ్ము
మాయ వ్యాపించె నాస్మాకీనహృదయ
మందు; రాముఁడు దరహాసమొనర్చె;

ఒక్క-రాఘవుఁడె తా నొప్పు నఖండ
జ్ఞానస్వరూపుఁడై జగతి;చరాచ
రాఖిల మ్మిద్ధి మాయామోహితమ్ము;
సకలజీవులు నిట్లె జ్ఞానవంతమ్ము
లైనచో నిఁక జెప్పవయ్య! జీవునకు
నీశ్వరునకు భేద మేమియొప్పినదఁ?
అభిమాని జీవి మాయానశంవదుఁడు;
త్రిగుణసనాథమై తేరెడు మాయ
భగవద్ధేయమై పరగుచునుండు;
జీవులు పెక్కులు శ్రీపతియొకఁడు;
జీవులు పరతంత్రజీవులు జగతి;
సర్వస్వతంత్రుఁడు సాకేతవిభుఁడు;
భగవద్భజనలేక పాయ దెన్నెన్ని
యుక్తులు గావించియును మాయ జనుల;
ఎంతవిజ్ఞానియై యెసఁగునుగాక
రామచంద్రునిపదరాజీవములను
గొలువక మోక్షమ్ము గోరెడువాఁడు
పుచ్ఛమ్ము శృంగముల్ వొరయని పశువు.
సరోవ్యాడుసంచయసహితుఁడై విధుఁడు
షోడశకళలతో శోభిల్లునేని,
సకలశిలోచ్చయసమితి దావాగ్ని
కీలలు పెక్కు రగిల్చినఁగాని,
పూర్వాద్రి భానుఁడు పొడసూపకున్న
యామిని దొలఁగనియట్లుగాఁ, బ్రభుని
పదతామరసములు భజియింపకున్న
జీవునిక్లేశముల్ చెదర వొక్కింత.
హరిభక్తున కవిద్య యంటదు; ప్రభుఁడు
ప్రేరేచుకతమున విద్య వరించు;
స్వామిభక్తునకు నాశములేదు; వాని
యందునఁ బెంపొందు నా భేదభక్తి;
మాయ నేఁ బడఁ గాంచి మందహాసమ్ము
ప్రభు వొనర్చె నటంచుఁ బలికితిఁ గాదె?

ఆ రహస్య మ్మట నాడెడు నతని
తమ్ములు నాతనితల్లులు గనరు;
శ్యామ దేహుండు కంజారుణపాణి
చరణపల్లవుఁడు మృషా బాలకుండు
నను బల్మి బట్టుకొనంగ నే తెంచి;
నప్పుడు పరచితి నందక దవ్వు;
నను బట్టుకొనఁగ మనమ్మున నెంచి
శ్రీరామచంద్రుఁడు చేతులు సాచె;
వాయ్వాధ్వమున నెంతవఱ కేను బఱచి
తంతదూరము హరిహ స్తముల్ గంటి;
బ్రహ్మలోకము దాఁక బరచి యచ్చోటఁ
దిరిగి చూతునుగదా దేవాధిదేవు
హ స్తముల్ నాకు రెండంగుళుల్ దూర
మందుండె; నంత సప్తావరణముల
భేదించుకొనిగతి వెలసెడుదాఁక
జని యట రామహ స్తమ్ములఁ జూచి
కడుభయమ్మంది నా కన్నులు గట్టి
గా మూసికొంటిని; గన్నులు దెరువ
సాకేతపురి నుంటి; స్వామి నన్జూచి
దరహాస మొనరించె; దాన నే నేఁగి
యాతనివదనగహ్వారము సొచ్చితిని;
చెచ్చెర నతని కుక్షిం జొచ్చి యచటఁ
బెక్కుబ్రహ్మాండముల్ వీక్షించినాఁడ;
ఒక్కటికన్న మఱొక్కటి మిన్న
యై యొప్పు లోకము లందుఁ గన్గొంటిఁ;
గోటిబ్రహ్మలను గంగో త్తమాంగులను
నగణితాదిత్యసుధాంగతారకల
నాశాధినాథుల యములఁ గాలురను
శైలకాననసరిత్సాగరమ్ములను
బహువిధఖగపశుప్రతతుల దేవ
దానవనాగవిద్యాధరసిద్ధ
సాధ్యకింపురుషయక్షాప్సరోభూత

గుహ్యకకిన్నరకోటుల జనుల
నండజోద్భిజ్జాదు లగుజీవతతుల
సకలచరాచరజంతుజాలముల
నెన్నఁడుఁ గని విని యెఱుఁగని వాని
నూహింపఁగానై ననోపనివాని
నట్టి యద్భుతసృష్టి నక్కడఁ గంటి;
నెట్లు వర్ణించి నీ కిది చెప్పువాఁడ?
ఒక్కబ్రహ్మాండమం దొక్కనూఱేండ్ల
వడువున నే సర్వబ్రహ్మాండములను
గాంచుచుఁ దిరిగితిఁ గడుసంభ్రమమున;
ఒక్కొక్కలోకాన కొక్కొక్కబ్రహ్మ
మాధవుండు శివుండు మనువు దిక్పతులు
మానవగంధర్వమనుజాదభూత
బేతాళకిన్నరభీకరనాగ
కిన్నరగుహ్యకకింపురుషాదు
లతివిచిత్రములు పశ్వాదుల్ రహింత్రు;
సకలముల్ జీవు లచ్చట నొప్పు మఱిల ;
శైలకాననసరిత్సాగరాద్యఖిల
సృష్టి వే ఱొకరీతిఁ జెలఁగు నచ్చోటఁ;
బ్రతియజాండమ్మునఁ బరికించినాఁడ
నేను నా రూపమ్ము నింకనొక్కండు;
ప్రతిలోకమందున భాసిల్లు వేఱు
సాకేతపురి వేఱుసరయువు ప్రజలు;
క్రమమున నట దశరథుఁడు కౌసల్య
భరతాదిసోదరుల్ బహురూపములను
వరలిరి; ప్రత్యేకబ్రహ్మాండమందు
రామావతారమ్ము రామునిదివ్య
శైశవలీలలు చాలఁ గన్గొంటి;
సర్వత్ర నట్టిదే శైశవ మట్టి
శోభయే, యా రఘుసుతుఁడె, చిత్రముగ;
ఆ రీతి నేను మోహానిలప్రేరి
తుండ్నై లోకముల్ దూరితిఁ బెక్కు;

లిట్లు బ్రహ్మాండము లెన్నేనిఁదిరుగ
నొకనూరుకల్పము లొయ్యననేఁగె;
నా రీతిఁ దిరుగుచు నాశ్రమమ్మునకుఁ
జనుదెంచి నిల్చి తచ్చటఁ గొన్ని నాళ్లు;
మఱల నయోధ్య జన్మముగాంచె రాముఁ
డన విని నేనుఁ బ్రేమార్ద్రచిత్తమున
బఱచితి నచటకుఁ; బఱచి నే మున్నుఁ
జెప్పినవిధమున శ్రీరామచంద్ర
జన్మోత్సవముగంటి; సకలలోకములు
రామచంద్రునియుదరమ్మునఁ గంటి:
నవ్వి దృశ్యములె వర్ణ్యములు కాఁజాల;
వాగతిఁ దిరిగి మాయానాథుఁడైన
శ్రీరామచంద్రు దర్శించితిఁ బ్రీతి;
మోహాఖ్యకర్దమమునఁ జిక్కియుండె
బుద్ధి యటంచు నే బొగిలితి నెడఁద;
గడియలు రెం డేఁగఁగా నన్నుఁ జూచి
మందహాసముసేసె మాయావిభుండు;
తత్క్షణమే నే నుదరమును బాసి
వెలికివచ్చితి; రామవిభుఁ డెప్పటట్ల
శైశవక్రీడలు సలిపె నాతోడ;
నేను నా మనము నెన్నెన్నివిధాలఁ
బట్టువరచియును బడయఁగలేని
పరమప్రశాంతి లభ్యమ్మయ్యె నాకు.
ఈ చరిత్రము గని యీ ప్రభావమ్ము
స్మరియించి నే దేహసంస్మృతి గోలు
పోయి, "యార్తావన! భోగిశయాన!
త్రాహిత్రాహి" యనిపదమ్ములఁ బడితి
గాద్గదిక్యమ్మునఁ గంఠమ్మురాని
ప్రేమవిహ్వలు ననుఁ వీక్షించి మాయ
నుపసంహరించె రఘూత్తముఁ డపుడు;
తనకరమ్ముల నాదు తలపైని నునిచి
హరియించె దుఃఖము లన్నియుఁ బ్రీతి
సేవకసుఖదుఁడు శ్రీరామవిభుఁడు;
కరుణామయుండు లోకావనశీలి
నన్నంటుమాయను నాశముసేసె;
అతనిదివ్యమాహాత్మ్యము దలఁచి
తలఁచి యెడంద ముదమ్ము గాంచితిని;
జననాథుభక్తవాత్సల్యమ్ము గాంచి;
ప్రేమాతిశయమున హృదయ ముప్పొంగఁ
గనుల నానందాశ్రుకణములు దొలఁకఁ
బులకించి నేఁ గరమ్ములు మోడ్చి పెక్కు-
విధముల రాముని వినుతిసేసితిని;
అప్పుడు సుఖుఁడౌ నా రాఘవుండు
గంభీరమధురవాక్యముల, "భుశుండి!
సతము నీదెస నేఁ బ్రసన్నచిత్తుండ,
నేదేని వరము నీ వింకఁ గోరుకొనవె-
అణిమాదిసిద్ధులో యా బుద్ధులొక్కొ?-
సకలసుఖములో మోక్షమొ? మునీంద్ర!
జనదుర్లభములైన జ్ఞానవివేక
విజ్ఞానవైరాగ్యవేదవిదిత్వ
ముఖ్యమ్ము లగు గుణమ్ములో, యట్లుకాక
యీ సమస్తమ్ము నన్నిమ్మన్న నిత్తు;
నేది నీ మనమున కించు నద్దానిఁ
గోరుకొ మ్మింక సంకోచము మాని"-
యనఁ బ్రభువచనము లాలించి నేను
ప్రేమమగ్నుఁడనయి పిదపఁ జిత్తమున,
"రాముఁడు నాకు సర్వమ్మిత్తు ననుచుఁ
బలికె, నట్లయ్యును భక్తి కన్పడదు;
భక్తిలేకున్న సర్వగుణమ్ము లివ్వి
లవణమ్ములేని కూరలచంద మగును;
భజనమ్ములేని యీ బహుసుఖ మ్మేల?"
యని విచారించి "దయామహాంభోధి!
అట్లు ప్రసన్నుఁడవై వర మొసఁగఁ
దలఁచినచోఁ గోరెదను దోఁచినట్టి;

దింగితజ్ఞుడవు స్వామీ! యుదారుఁడవు
శ్రుతిపురాణాదికస్తుత్యము యోగి
మునిగణప్రార్థ్యము ముఖ్యాతిముఖ్య
మవిరళమ్ము విశుద్ధ మగు భవదీయ
పాదాంబురుహలసద్భ క్తి నొసంగు;
మగణితసుఖద! దయాకర! భ క్త
సంఘకల్పద్రుమ! శాశ్వత! పరమ!
ఆ ర్తజనావన! ఆద్యంతరహిత!"
యన నప్పు, "దేవమ" స్తని రఘూద్వహుఁడు
"కాకమ! సద్బుద్ధిగలవాఁడవయ్య!
యిదిగాక వే ఱొకఁ డెట్లు కోరెదవు?
సకలసుఖద మగు చరణాబ్జభ క్తి
కావలె నంటివి; కలఁడె లోకమున
ధన్యుండు నీకంటెఁ? దాపసుల్ యోగ
వీతిహోత్రజ్వాలవేల్చి దేహములు
కోటియత్నమ్ము లకుంఠితనిష్ఠఁ
గావించియును బొందఁగాలేని భ క్తి
వాంఛించితివి; భవద్భ క్తికి మిగుల
మదిని మెచ్చితిని; సమ స్తసద్గుణము
లింక వసించు నీ హృదయమ్మునందు;
భ క్తి యోగజ్ఞానవైరాగ్యములును
సకలమ్ము నాడగుసత్కృపవలన
సమకూరు నిఁక నీకు సాధనయందుఁ
గష్ట మొక్కింతయుఁ గలుగఁగఁబోదు;
మాయాభవమ్ము భ్రమమ్ము ని న్నంట;
దజుఁ డనాది యగుణుఁ డగుబ్రహ్మమనుచు
న న్నెఱుంగుము; కాక! నాకు సతమ్ము
భ క్తులపైఁ బ్రీతి పఱఁగుట యెఱిఁగి
భజియింపు నా పాదపంకేరుహములు;
సూన్నృతనిర్మలసుగమమద్వాక్య
వితతిని గడుశ్రద్ధవినుము; నీ కిపుడు
చెచ్చెర నా నిజసిద్ధాంత మమల

మానందదము తురీయప్రద మ్మింక
వినిపింతు నద్దాని వేడ్క నెడంద
ధరియించి సర్వము త్యజియించి నన్ను
భజియింపు మత్యంతభ క్తి సంతతము.
ఈ ప్రపంచ మ్మిదియెల్ల నా మాయ
వలన జనించెను వాయసనాథ!
నానావిధమ్మ్మలై నా కింపుగూర్చి
చెలఁగుఁ జరాచరజీవము లిందు;
అందు మానవుఁడు నా కధికప్రియుండు;
మనుజులయందు బ్రాహ్మణులు; బ్రాహ్మణుల
యందును వేదధర్మానుసారులును;
వారలలోఁగూడ వైరాగ్యయుతులు,
వారిలో జ్ఞానులు, వారిలోఁ గూడ
విజ్ఞాను, లెంతయుఁ బ్రియమునేకూర్తు;
రందున మఱియు సత్యము వచియింతు
నన్యాశ్రయముమీడి యనవరతమ్ము
పరమగతిగ నన్నె భావించు కొలుచు
దాసు లనంగ నెంతయుఁ బ్రాణమిత్తు;-
భ క్తిహీనుండగు బ్రహ్మయేగాని-
యన్నిజీవులలోన నాతఁ డొక్కండు;
భ క్తియు క్తము నీచప్రాణియాఁగాక
నా ప్రాణములకంటె నాకుఁ బ్రియమ్ము;
ఒక్కతండ్రికిఁ బుత్త్రులందురు పెక్కు
రొక్కొక్కరుం డందు నొక్కొక్కరీతి;
ఒకఁడు పండితుఁడగు నొకఁడువిజ్ఞాని
యొక్కరుండు తపస్వి యొక్కఁడు ధనికుఁ
డొక్కండు శూరుఁ డింకొక్కఁడుదారుఁ
డొకఁడు ధర్మప్రియుఁ డొకఁడు సర్వజ్ఞుఁ,
డందఱిపైఁ దండ్రి కలరును బ్రేమ;
అట్లయ్యు నా పుత్త్రులందఱిలోనఁ
ద్రికరణమ్ములను దండ్రినిభజియించు
తనయుఁ డుండినవేళ తండ్రి యాతనిని

మూర్ఖుఁడేయగుఁగాక మునుకొని తనదు
ప్రాణాలకన్న గొప్పగఁ జూచుఁగాదె?
ఆగతి నీ జగమ్మఖిలమ్ము దేవ
రాక్షసమనుజతిర్యక్సమేతమ్ము
సృజియించితిని నేను; బ్రేమింతు వీని
నన్నిటి సమముగా; నయ్యాను మదము
వదలి మాయజయించి వాఙ్మనఃకాయ
ములచేత నా పాదములఁ గొల్చునట్టి
యెంతనీచప్రాణినేనిఁ బ్రేమింతు;
ఖగకులాభరణ! నిక్కమ్ము వచింతు
నాకు సేవకులు ప్రాణాధికుల్ జగతిఁ;
గానఁ గొల్వుము నన్నుఁ, గాలము నిన్ను
బాధింప" దనఁగ నా ప్రభువచనముల
నాలించి తృప్తుఁడనై గగుర్పొడువఁ
గను లరమోడ్చి యక్కడ నిలుచుంటి;
ఆ సుఖ మ్మెంతటి దగునొ కర్ణములు
చిత్త మ్మెఱుంగును జిహ్వ నచింపఁ
జాల; దా లోకేశసర్వాతిశాయి
శోభాసుఖమ్ము నఱు లెఱుంగుఁ గాని
వాక్కులే దవి యెట్లు వర్ణింపఁగలవు?
తదనంతరము స్వామి దశరథసుతుఁడు
ప్రాకృతజనునట్లు వర్తింపఁదొడఁగె;
అక్షియుగ్మకమున నశ్రువుల్ నించి
కనుఁగొనం దల్లిని గౌసల్య పరుగు
పరుగున వచ్చి యబ్బాలుని తనదు
నక్కునఁగదియించి యలకలు పుడికి
చుబుకమ్ము ముద్దాడి చొక్కి పాలిచ్చె;
ఆగతి సాకేతమందుఁ గొన్నాళ్ళు
వసియించి శ్రీరామభద్రునిబాల్య
చేష్టలు కన్గొని చెచ్చెర సతని
పాదకంజములకుఁ బ్రణమిల్లి భక్తి
నరుగుదెంచితిని నిజాశ్రమమ్మునకు.

వైనతేయ! నిజానుభవము విన్పింతుఁ
గ్లేశముల్ ప్రభుసేవలేకున్నఁ బోవు;
రామునికృపలేక రామప్రాభవము
నెఱుఁగంగ దుష్కర మ్మేరికిఁగాని;
మాహాత్మ్యమెఱుఁగక మదిని విశ్వాస
మొదవదు; విశ్వాస మొదవక ప్రీతి
యేర్పడ; దా ప్రీతి యేర్పడకున్న
భక్తి జనింప; దా భక్తిజలంపు
చిక్కదనమువోలె స్థిరముగాఁబోదు;
గురుఁడు విరక్తి లేకున్న జ్ఞానమ్ము
కలుగునే యటులె యాగమపురాణములు
భక్తి లేకున్నచో వరలదు సుఖ మ
టంచు ఘోషించు, మహాత్మ! నరుండు
స్వాభావికమ్ముగ సంతోషిగాక
యెందేగి శాంతి గ్రహింపఁగ నోపు;
యుక్తు లెన్ని పొనర్చియును నీరు లేక
యేఁగునొకో నౌక; తృప్తి లేకున్నఁ
గోర్కెల్ నశించునే? కోర్కెలు గలుగఁ
గలనైనఁ గలదె సుఖ మ్మేరికైన?
శ్రీరాముభజనముసేయక కోర్కె
లడఁగనేరవు, భూమియాధార మింత
కలుగక భూజముల్ కలుగునే యెందు?
విజ్ఞాన మది లేక వెలయదు సమత;
యవకాశమున్న దే యభ్రము లేక?
శ్రద్ధలేకున్న ధర్మము లేదు; పృథ్వి
లేకున్న గంధము లేనివిధాన:
జలము లేకున్న రసమ్ము లేనట్లు-
సాగక తపము తేజ మ్మిల లేదు;
శీలమ్ము లేదు సత్సేవ లేకున్న;
నగ్నిత్వము లేక యలరదు రూప;
మాత్మసుఖము లేక యంతరంగమ్ము
స్థిరమౌనె? వాయుసంస్థితి లేక స్పర్శ

కలుగనిచందాన, ఖగకులనాథ!
విశ్వాస మదిలేక వెలయదు సిద్ధి;
హరి భజింపకయ భవాబ్ధి తరించు
టది దుశ్శకమ్ము రుద్రాదులకైన;
అవనిని విశ్వాస మలరక భ క్తి
యేర్పడ, నా భ క్తియేర్పడకున్న
విభుఁడు రాఘవుఁడు ద్రవింపఁడు; వాని
కృపలేక కలలయందేని సుఖమ్ము
కల దనియెడుమాట కలలోనిమాట;
కావున నీ కుతర్కములు త్యజించి
సంశయమ్ములు వీడి స్వామిని సుఖదుఁ
గరుణాబ్ధిఁ గొలుచుట కార్యమ్ము సుమ్ము;
పక్షీంద్ర! ప్రభునిప్రాభవము నత్యుక్తి
గాఁ జెప్పలేదు; నే గనులారఁ గాంచి
యున్నట్టిదాని నీ కొనరఁ జెప్పితిని;
రామునిమహిమలు రామనామములు
రాముగుణమ్ములు రామురూపములు
రాముప్రాభవములు రామునికథలు
ధర నపారము లనంతములు; రాముండె
తా ననంతుండు, వేదానంతరుద్ర
శారదాశార దేశ్వరులె తత్పార
మెఱుఁగ రొకింత; మునీంద్రులు స్వీయ
బుద్ధ్యనుసారమ్ము భూషించుచుంద్రు;
ఖగపథమ్మున మశకముదొట్టి నీవు
పర్యంతము చరింత్రు పక్షీంద్ర! దాని
పారము గన్నొన వలఁతులే? చెపుడ;
కరుణాబ్ధిమహిమ మగాధము దాని
గాంభీర్య మెవఁడు జగమ్మున నెఱుఁగు?
శతకోటికందర్పసన్నిభసుంద
రాపఘనుఁడు కోసలావనీంద్రుండు,
శతకోటిశతమన్యుసంకాశభోగి,
శతకోటిపవమానసంకాశబలుఁడు,
శతకోటిపతగాధ్వసన్నిభానంత
దివ్యావకాశుండు ధీవిశారదుఁడు,
శతకోటిభాస్కరసంకాశకాంతి
మంతుఁడు, కరుణాబ్ధి, మహిమాన్వితుండు,
శతకోటిశీతాంశుసంకాశశీత
లోజ్జ్వలదీ ప్తి సంయుతుఁడు, గుణాబ్ధి,
కాలకోటిసమదుర్గముఁడు, దురంతుఁ,
డర్బుదధూమ కేత్వతిశాయి, దివ్య
ఘోరదుర్ధర్షుఁ, డక్రూరుఁ, డాద్యుండు,
పాతాళశతసన్నిభాగాధమూ ర్తి,
కోటిపరేత రాట్పూజ్యుఁ, డాభీలుఁ,
డమితతీర్థమ్ములయంతపావనుఁడు,
పాపముల్ చెండెడు పావనాభిదుఁడు,
శతకోటిహిమశైలసన్నిభాచలుఁడు,
శతకోటిసాగరసన్నిభాగాధుఁ,
డమరధేనుసహస్రమట్లు కామితము
లిచ్చెడువాఁడు, మహేశసన్నుతుఁడు,
శతకోటిశారదాసమచతురుండు,
కోట్యజసమసృష్టికుశలుఁడు, కోటి
వైకుంఠులట్టులఁ బాలించువాఁడు,
కోటిరుద్రులవలెఁ గ్రూరసంహార
కార్యదక్షుఁడు, జగత్కల్యాణకాంక్షి,
ధనదకోటులకంటె ధనికుఁడు, కోటి
పన్నగేంద్రులకంటె భారవాహకుఁడు,
జగదీశ్వరుఁడు, రామచంద్రుఁ డనాది,
యాద్యుఁడు, నిరుపముఁ, డప్రమేయుండు;
రాముఁ డాతనిసాటి రాముఁడే యనుచు
వేదపురాణముల్ వేర్కొనుచుండు;
శతకోటిఖద్యోతసంకాశకాంతి
సంయుతుం డీ యహస్కరుఁ డని సతము
పలుకు టాతనిఁ గించపరచుటకాదె?

అపరిమితుండు ననంతుఁ డసీముఁ
డైన శ్రీహరిని మహర్షులు తమదు
బుద్ధికొలందిగాఁ బొగడుచునుండ
భావమొక్కఁడు గొని ప్రభుఁడు కృపాబ్ధి
కడుదయ వారలఁ గాపాడుచుండు.
ప్రభుఁడు శ్రీరాముఁ డపారగుణాబ్ధి
ఆ యగాధు నెఱుంగ నగునె శక్యమ్మా?
పెద్దలు చెప్పఁగా విన్నది నీకు
విన్పించితిని గొంత వెట్టినై యిపుడు;
సుఖఖని కరుణాబ్ధి శోభాకరుండు
నైన రాముని మమతాభిమానములు
విడి భజియింపుము ప్రీతి సంతతము!

శ్రీరామచరితమానసము

ఉత్తరకాండము

పంచమవిశ్రామము

నందిగ్రామాశ్రమస
న్మందిర! సౌందర్యవిజితమన్మథ! యోగా
నందప్రసన్నముఖగో
విందా! శ్రీమట్టపల్లి విభు! నరసింహా!

అనఁగ భుశుండివాక్యమ్ముల కలరి
కన్నులందు ముదశ్రుకణములు జార
మేనెల్లఁ బులకింప మిన్నక నిలిచి
పక్షినాథుఁ డనాదిబ్రహ్మయౌ రాము
మానవుం డని తనమది నెంచుపూర్వ
మోహమ్మునకుఁ గడుఁ బొగిలి భుశుండి
వరుని రాముని యంతవాఁ డని పాద
పద్మద్వయమునకుఁ బ్రణమిల్లి భక్తి,
"నజశంకరాదులకైన సద్గురుఁడు
లేక సంసారవార్నిధి దుస్తరమ్ము;
తండ్రి! నే సందేహదర్వీకరమ్ము
చేత దష్టుండనై చిక్కి కుతర్క
మూర్ఛలనే బాధ పొందితి మిగుల;
తావకీనమ్ము సందర్శన మనెడి
గారుడశక్తిచేఁ గరుణాబ్ధి నన్ను
బ్రదికించుకొనియెను; ద్వత్కృపవలన
నా మోహ మిదియెల్ల నశియించె; రామ
భద్రుని యనుపమపరమరహస్య
మెఱుఁగఁజాలితి" నని యెంతయుఁ బొగడి
వినతశిరస్కుఁడై వెసఁ గేలుమోడ్చి,
"స్వామి! నా మూఢ్య మిప్పట్టున వెలుఁగ
నడిగెద మిముఁ గరుణాబ్ధి! నేనొకటి;
దాసునిగా నన్నుఁ దలఁచి నాప్రశ్న
కాదరమ్మున బదు లయ్య! యీవలయు;
సర్వజ్ఞుఁడవు సర్వసారవిదుండ
వుత్తమచరితుఁడ వున్నతమతివి
జ్ఞానవైరాగ్యవిజ్ఞానధాముఁడవు
శ్రీరామచంద్రునిసేవకోత్తముఁడ
వట్టి నీ కిట్టికాకాకృతి యేల
కలిగెనో విన్నింపఁగదె ఖగశ్రేష్ఠ!
శ్రీరామచంద్రచరిత్రమానసము
వినఁగంటి, నిపుడిదివిన నెంతుఁ; బూర్వ
మవితథవచనుఁడై నట్టిశివుండు
కల్పాంతమందైనఁగాని భుశుండి
నాశమ్ముకాఁ డని నాకు వచించె;
నిది కడువింతయై యెసఁగు నా మదికి;
నాగమనుష్యకిన్నరదేవముఖ్య
మైనచరాచర మ్మఖిలజీవాళి
కాలమ్మునకు నొక్కకబళమై యెసఁగు;
పెక్కుజాండమ్ముల విదళించునట్టి
దనివార్య మీ కాలమతికరాళమ్ము;
స్వామి! దీనికి నేమిచందాన మీరు
లోఁబడకున్నారలో విచిత్రమ్ము

జ్ఞానబలమ్మో యోగప్రభావమ్మో?
ఆశ్రమమ్మునయందు నడుగిడినంత
భ్రమమును మోహము పరువిడిపోయె
నెందులకో వచియింపరే-"యనిన
నాలించి తనమది హర్షించి ప్రేమ
విహ్వలుండగుచు నా ద్వికవరుఁ డనియె;
"భుజగారి! భవదీయబుద్ధి ధన్యమ్ము;
నాకు నీప్రశ్న లానందప్రదములు;
ప్రేమార్ద్రములు మనఃప్రీతిదమ్ములగు
ప్రశ్నముల్ విన నాకుబహుజన్మగాథ
లవి తలంపునఁ బొరె నయ్య!; నా కథలు
విన్నవించెదను సవిస్తరమ్ముగను;
జపతపోదానయజ్ఞవివేకయోగ
శమదమశీలవిజ్ఞానవైరాగ్య
వ్రతములన్నింటికి ఫలము శ్రీరామ
పాదకంజములపైఁ బొయనిప్రేమ
యేర్పడుటొక్కటియే సుమీ,జగతి;
నిదిలేక కల్యాణ మింక లేదుజీవి;
కీ శరీరముతోన యేను శ్రీరామ
చరణకంజములపై సడలనిభక్తి
యార్జించితినిసుమీ యీ కారణమున
నెక్కువమక్కువ యిద్దానిమీఁద;
స్వార్థమ్ముగలచోట జనుఁ డెవ్వఁడేని
జగతిఁ బ్రేమించుట సహజమకాదె?
సన్ననిమేల్పట్టొసంగుటఁజేసి
యతినీచమైనట్టి యీ పుర్వు దెచ్చి
ప్రాణాధికమ్ముగఁ బాలింపరొక్కొ?
త్రికరణశుద్ధిగా శ్రీరామచరణ
పద్మాలపై భక్తి బాయకుండుటను
సకలజీవులుకడుస్వార్థతఁగోరు,
ప్రభుపదభక్తిసంపాదించుకాయ
మదియ సుందరము మహాపవిత్రమ్ము;

అజసన్నిభమ్ము దేహమ్ము పొందినను
శ్రీరామచరణరాజీవసద్భక్తి
కలుగక పండితుల్ గైకోరుదాని;
మన్మరణ మ్మది మదధీనమయ్యె
నీ శరీరము త్యజియింపను నేను;
భజనమ్ము సలుపఁగవలె నన్నఁ గాయ
మవసరమని కదా యాడు వేదములు;
పెక్కు-జన్మమ్ముల విహరించి యోగ
జపతపోదానయజ్ఞాదికర్మములు
పెక్కులుసేసితి; విహగాధినాథ!
ఏను బుట్టనియోనియే లేదు సృష్టి;
నఖిలకర్మమ్ముల నాచరించితిని;
గాని నా కింతసుఖమ్ము లే దెపుడు;
శివునికృపాదృష్టి చెలఁగెడుకతన
మోహవిభ్రాంతమైపోదు నా బుద్ధి;
కావున బహుజన్మగాథలు సతము
తవిలియుండును నా హృదయమునయందు;
తొలిజన్మకథ చెప్పదును ఖగనాథ!
ఇదిగాక బహుపూర్వ మింకొకకల్ప
మం దొక్కకలియుగ మలరుచునుండు;
నందలిజను లధర్మావలంబకులు
వేదవిరోధు లవిదితశాస్త్రార్థు;
లా కలియుగమునయందు సాకేత
పురి శూద్రయోనిని బుట్టితి నేను;
సతతము భక్తి ధూర్జటి సన్నుతించి
తదితర దేవతాతతులనిందించు
పరమమాహేశ్వరవ్రతపరాయణుఁడ!
ధనమదాంధుఁడను గుతర్కావలంబి
నుగ్రబుద్ధిని, శ్రీరఘూత్తమురాజ
ధానివసించియు దాంభికుండనయి
యెఱుఁగ నే నతనిమహిమ మొకింతేని;
సాకేతపురమున జన్మించినట్టి

వాఁ డెట్టిఁడును రామభక్తుఁడౌ ననుచు
వేదశాస్త్రాదులు పేర్కొ–నుమాట
లేనియు నా మది కింపుగా వనఘ!

కాకభుశుండి గరుడునకు
కలియుగప్రభావము నెఱింగించుట

ఆ కలియుగము మహాఘోరయుగము;
అఖిలధర్మములఁ గల్యఘము గ్రసించె;
సర్వసద్గ్రంథసంచయము లోపించె;
దాంభికుల్ కొంద ఱుద్భవమంది సూత
కలిపురాణాదులు గావించి రొగిని;
జనులెల్ల మోహపాశమ్మునఁ బడిరి;
శుభకర్మములనెల్ల స్రుక్కించె లోభ;
మో జ్ఞాననిధి! విహగో త్తమ! యిపుడు
* కలిధర్మములను వేడ్క–ను వినిపింతు;
వర్ణధర్మమ్ములు వరలవు; నాలు
గాశ్రమమ్ములునులే; వాగమవైర
మఖిలజనులహృదయమ్ములఁ బుట్టు;
వేదవిక్రేతలు విప్రపుంగవులు;
క్షత్రియుల్ సకలప్రజాభక్షకాళి;
వేదశాసనమును వినఁ డొక్కఁ డేని;
ఎవ్వానియెడఁదకు నే డింపుగూర్చు
నా మార్గమునఁ బడి యాతఁడు పోవు;
కాఱులు ప్రేలెడు ఘనుఁడు పండితుఁడు;
దంభనిరతుఁడు మిథ్యారంభకర్త
సజ్జనలోకాగ్రసరుఁ డనంబడును;
దాంభికుం డిలను సదాచారవంతుఁ;
డన్యస్వాహారకుఁ డతిబుద్ధిశాలి;
పరులహేళనసేయువాఁడు నసత్య
వాదియుఁ గడుగుణవంతులు సుజను;
లాచారహీను లత్యంతవిరక్తు;
లనవరతమ్ము జటావళి గోళ్లు
పెంచినట్టిఁడె తపస్వియు మహాన్నతుఁడు;
అప్రాచ్యవేషభూషాదుల మీఁద
నెంతయుఁ గోరిక యెసగును జనుల;
కదిభక్ష్య మిది యభక్ష్య మ్మని యనక
చిక్కినవెల్ల భక్షింతురు తెచ్చి;
వారలె యోగులు వారె సిద్ధులును
వారె పూజ్యులు కలిప్రబలినకొలఁది;
పరులకు నహితమ్ము పచరించువాఁడు
సన్మానయోగ్యుఁడు సభలలోఁగూడ;
త్రికరణశుద్ధిగాఁ దెలిసి యసత్య

---

* ఇక్కడకలికాలమున సర్వసాధారణముగ లోకములో జరుగువిషయములు తెలుపబడినవి. ఈ ఘట్టమును పఠించి కలిలోనిజనులందఱు ధర్మచ్యుతులే యని భావింపరాదు. సర్వసామాన్యజనసమాజవ్యవస్థ యట్లుండు నని మాత్రమే గ్రహింపవలసియున్నది. ఉదాహరణమునకు–త్యాగరాజువంటి బ్రాహ్మణు లొకవైపు కొలదిగనున్నను, బ్రాహ్మణ బ్రువులే యెక్కువమందియుందురు. శివాజీ ప్రతాపసింహులవంటి క్షత్రియులున్నను, క్షుద్రప్రభువులే యెక్కువమంది యుందురు. గాంధిజీవంటి వైశ్యులున్నను, దురాశాపీడితులగువైశ్యులె యధికముగ నుందురు. నాగ మహాశయునివంటి శూద్రులున్నను, అవినయ శూద్రులే యెక్కువగనుందురు. శ్రీశంకరవివేకానందాదిమహామతధర్మ సౌధస్థాపకులగునాదర్శసన్న్యాసులున్నను ధర్మమనుపేర, స్వోదరపోషణనిమిత్తము ధనమార్జనజేసి భోగలాలసులై యుండు సన్న్యాసులే యసంఖ్యాకముగ నుందురు. దిగంబరులై యున్మత్తులై బ్రహ్మోన్మాదులైన త్రైలింగస్వాముల వంటి యవధూతలున్నను, గడ్డములు మీసములు గోళ్ళు పెంచుకొని నటించు గంజాయిసాధువులే యెక్కువగా నుందురు. శ్రీశారదామణీదేవివంటి సాధ్వీమణు లున్నను నీచస్త్రీలే యధికముగ నుందురు. ఉప్పుకప్పురములవెలుపలి పోలికచూపించి, రెండును యొకటిగానెంచినట్లు యందఱను నొకగాటఁ గట్టివేయఁ గూడదు. శ్రీతులసీదాసుల వారుకలియందలి సర్వసామాన్యసమాజ వాతావరణమును మాత్రమే వర్ణించియున్నారు. ఇది గమనీయము.

మాడినదౌర్భాగ్యుఁడల్పుఁడే వక్త;
ఐంద్రజాలికుఁడు మహానంద మొప్ప
మర్కటమ్మాడించుమాడ్కి స్త్రైణమ్ము
పురుషపుంగవులము భోగుల మనుచు
బుట్టి లూపుచు మీసముల్ మెలివెట్టి
విజ్రుంభీఁగుచు మహి విహరించువారి
ముకుఁద్రాడుసంధించి మొనసి యాడింతు;
రందఱు ప్రజలు తా రరిషట్కమునకు
బానిసల్, దేవవిప్రాగమ్మైరు;
లతివలు పతి విడనాడి యన్యులను
దగులుకొందురు సంతతమ్ము ప్రేమమున;
ఐదువల్ కాంక్షింప రాభరణములు:
విధవలు శృంగారవేషముల్ నిత్య
నవ్యముల్ దమదుమనములఁ గాంక్షింత్రు;
గురుశిష్యులకుఁ బొత్తుగుదుర దేనాఁడు;
శిష్యువిత్తమ్ము ప్రుచ్చిలి వాని శోక
మడపని గురునకు నగు నరక మని
వేదపురాణముల్ పేర్కొనుఁ గాని
శిష్యుని గురువులు చెఱుపఁ దలంతు;
రఖిలప్రజాళి బ్రహ్మజ్ఞానమనెడి
పదమును బట్టుక ప్రాఁకులాడెదరు;
కాసుకై పాఱులఁ గసిమసంగెదరు;
పాదజుల్ బ్రాహ్మణవరుల నెదిర్చి
యెవఁడు బ్రహ్మజ్ఞాన మెఱుఁగునో వాఁడె
విప్రుఁడు, మీ రేటివిప్రు? లటంచు
వారికన్నులు విప్పి వర్తింతు రెలమి;
పరనారిఁ గోరెడు పాతకుల్, కపట
కుశలులు, దుష్టులు కపటవర్తనులు,
మోహబంధితులు తపోవిభూతకులు
పేఁచెత్తిపోదు రభేదవాదులని;
శ్వపచుఁడు కుమ్మరి చాఁకలి తైల
కారుఁడు భిల్లుఁడు కాంస్యకరుండు

భార్యచచ్చినవాఁడు భాగ్యమ్మునెల్లఁ
గోలుపోయినవాఁడు గొఱిగించుకొనియు
సన్న్యాసులౌదు రసంశయవృత్తి;
బ్రాహ్మణుల్ లోభులపండితుల్ కాము
లాచారవిరహితు లాగమవైరు
లతినీచులయి తారు వ్యభిచారిణులను
గట్టుకొందురు; జనుల్ కలియుగమందు
నతిశయించెదరు మర్యాదలన్నిటిని;
వర్ణసాంకర్యము వఱలును; జనులు
పాపులౌచు వియోగభయరోగశోక
సంతతు లార్జింత్రు; జ్ఞానవైరాగ్య
యుక్తము సకలాగమోక్తమానట్టి
హరిపదభక్తి నత్యంతమాధ్యమున
ధిక్కార మొనరింత్రు తెగువయొనర్చి;
పెక్కుమార్గములు కల్పింత్రు నవ్యములు;
సన్న్యాసులే ద్రవ్యసంపాదనమ్ము
గావించి సౌధముల్ గట్టెద రెలమి.
విషయలాలసత వివేకవైరాగ్య
విజ్ఞానములఁ దోఁచి వేదన పెంచుఁ;
దాపసులగువారు ధనికులై యొప్ప
గృహమేధులెల్ల దరిద్రు లయ్యెదరు;
కులవతి రూపసి గుణవతియైన
యర్ధాంగిఁ దనదుగృహము వెడలించి
కులటయు నతిహీనకులజాత దాసి
యగుదానిఁ గొని తెచ్చి యాదరించెదరు;
తనయులు తమతలిదండ్రుల, భార్య
మొగము చూచినవెక్కమొగమె త్తి కనరు;
భార్యచెప్పినమాట పంచమవేద;
మన్నదమ్ములు తన కమితశత్రువులు;
విత్తముగలవాఁడె విభుఁడు సత్కులజుఁ;
డవనీసురు లనంగ నాధార మొక్క
జండెము తనమెడ సంతరించుటయె;

పరమనగ్నత నిరా బారి లక్షణము;
వేదపురాణముల్ వినని కైకొనని
వా రొప్పుదురు హరిభ క్తులనంగ;
కవియన్న నింటి కొక్కరుఁడు జనించు;
కవిపోషకుండు జగాన లేఁ డొకఁడు;
పరులతప్పుల నెన్నువా రొకకోటి;
తప్పులేనట్టిడు ధరణిని బూజ్య;
'మో' యన్నచోఁ గఱ 'వో' యని పలుకు
అన్నము దొరకక యలమటించెదరు;
కపటము దంభము గర్వము హఠము
కామము మోహము కార్పణ్యబుద్ధి
విశ్వావిశ్వమున వ్యాపించు నల్లడల;
జపతపోదానయజ్ఞవ్రతధర్మ
తతు లాచరింతురు తామసబుద్ధి;
అదనున వర్షింప వంభోధరములు;
విత్తినపంటలు వెసఁ జేతి కంద;
వంగనాజనముల కాభరణమ్ము
ధమ్మిల్ల; మధికభూధా ర్తులు వారు,
ధనముకంటెను వారితలలోని కోర్కు
లధికమాటను దుఃఖ మగ్గలమ్మగును;
పాశవికసుఖమ్ము వాంఛింత్రు వారు;
నరులు రుజా ర్తు; లేనాఁడు భోగములఁ
గానరు కనుల; నిష్కా రణావైర
మది పెంచెదరు; షోడశాబ్దములైని
వాఁడు కల్పాంతముబ్రదికెడుపగిదిఁ
గన్నులు తలకెక్కఁగా నిక్కి తిరుగు;
అగుదురు కలిజను లవ్యవస్థితులు;
సకలజాతులును భిక్షు మ్మెత్తఁదొడఁగు;
నడఁగు సోదరియు నిజాత్మజ యనుట;
సమత నశించు; మాత్సర్యాదిలౌల్య
పారుష్యములు మించు; వర్ణాశ్రమాది
ధర్మము లవి వఱదం బడిపోవు;

ఇన్నిదుర్గుణముల కిది ఖని యయ్యె
నీ కలియుగమున నెసఁగెడు నొక్క
సద్గుణ మ్మోఖగేశ్వర! భవబంధ
ముక్తి నశ్రమమునఁ బొందఁగవచ్చు;
సత్యయుగమ్మున జనులు విజ్ఞాను
లగుటచే శ్రీహరి ధ్యానించి ఘోర
భవబంధములనుండి పడసిరి ముక్తి;
పెక్కుయజ్ఞములు గావించి కర్మములు
భగవదర్పిత మని భవబంధములను
ద్రెంచిరి జనములు త్రేతాయుగమున;
ద్వాపరమ్మున రఘువరుపాదములను
సేవించి భవమును జెండాడినారు;
కలియుగమ్మున హరిగాథ లత్యంత
భక్తిఁ గీర్తించిన భవమహాజలధి
నశ్రమమ్మున దాఁటనగు నేర్కైన;
కలియుగమ్మందు యోగమ్ము యజ్ఞమ్ము
జ్ఞాన మ్మొకింతయుఁ గలుగదు- రామ
గుణకీర్తనమ్ము లోకులకు నాధార;
మందుచే సర్వాశ్రయమ్ములు వీడి
శ్రీరామచంద్రుఁ గీర్తించినవాఁడు
భవము దాఁటంగ విప్రతిపత్తి లేదు;
ఈ కలియుగమున నెసఁగుఁ బ్రత్యక్ష
మగుచును నామమాహాత్మ్యమ్మె మిగుల;
నమ్మినయట్టిజనమ్ముల కిలను
గలియుగమ్మట్టి జగ మొండులేదు.
రామునిదివ్యనిర్మలగుణమ్ములను
భక్తియుక్తుండయి ప్రస్తుతిసేయ
నశ్రమమ్మునను భవాంబుధి దాఁటు.
ధర్మపాదములు సత్యము దయ తపము
దాన మనఁగ నాల్గు దనరును; వాని
యందునఁ దుదిది తా నలరు నీ యుగము
నం దున్నతమ్మయి; యట్లగుకతన

నల్పదానమును శుభావహమగును;
శ్రీరామచందు్రని చిన్మాయవలన
జనహృదయాంతరస్థలముల సకల
యుగధర్ములును సముద్భూత మగును;
సత్త్వమ్ము శుద్ధము సమత మనఃప్ర
సన్నత శాంతి విజ్ఞానము ననెడు
నివి కృతధగ్మము లేపారుచుండు;
సత్త్వగుణమ్ము రజఃప్రాప్తి నెనసి
కర్మప్రీతియును సుఖాతిశయమ్ము
నిద్ది త్రేతాధర్మ మెసఁగుచునుండు;
సత్త్వమ్ముకొంత రాజస మధికమ్ము
నా తమోగుణయుక్తమై యజస్రమ్ము
భయము హర్షము మనఃఫలకమ్మునందుఁ
బరిఢవిల్లుటయ ద్వాపరలక్షణమ్ము;
ఆ తమోగుణము సహస్రాధికమయి
రాజసగుణ మదిరాజిల్లి నాల్గు
వైపులఁ గడుశౌత్రవము విజృంభించు
టది కలియుగధర్మ మనుట నిజమ్ము;
ఈ యుగధర్మము లెఱిఁగి పండితులు
వీడి యధర్మము ప్రీతి ధర్మమున
పాదుకొల్పెదరు సుపర్ణ! మహాత్మ!
ఇంద్రజాలము గని యెల్లయు భ్రాంత
చిత్తులై వెఱఁగంది చెచ్చెర నిలువ,
నైంద్రజాలికముఖ్యుననుచరుఁ డింత
భ్రాంతి నొందక నిలువంబడినట్లు
ప్రభుపాదపద్మముల్ భజియించువారి
నేమియుఁ జేయలే దీ కాలధర్మ;
మా హరికృతమ్ములై యలరెడునట్టి
గుణదోషములు హరిఁ గొలువకయున్నఁ
జన వట్లుకావున సర్వకామనలు
వీడి రామపదారవిందద్వయమ్ము
భక్తి భావమ్మున భజియించుటొప్పు;
ఆ కలియుగమునయందు సాకేత
పురిఁ బెద్దకాలము పొలిచితి నేను :
ఇట్లుండ నతిఘోర మెసఁగె దుర్భిక్ష;
మా వరపునఁ బడి యతికృశుండనయి
కాండిశీకుఁడనయి కదలిపోయితిని
బ్రదుకుటకోసమై పరదేశములకు;
ఈగతి నే భాగ్యహీనుఁడ దీనుఁ
డతిదరిద్రుండ నత్యంతదుఃఖితుఁడ
నై యుజ్జయిని కేఁగి యచటఁ గొన్నాళ్ళ
కార్జించిధనము పురారిని భక్తి
తోడ నారాధింపఁదొడఁగితి మఱల.

శ్రీరామచరితవాచస్పతి

ఉత్తరకాండము

షష్ఠవిశ్రామము

సమస్తతీర్థనివాసా!
శమితాఖిలతాపభవ్యచరితోపేతా!
శమదమముఖ్యగుణప్రద!
ప్రమదాకరః మట్టపల్లివాస! నృసింహా!

కాకభుశుండి యొకజన్మమున గురుధిక్కార
మొనరించి శివశాపగ్రస్తుఁ డగుట
అచ్చట నొకవిప్రుఁ డాగమవిధిని
నిష్కామియై హరుని భజించుచుండుఁ;
బరమార్థవేత్తయుఁ బరమసజ్జనుఁడు
హరి నింత నిందసేయఁడు కలనైన;
ఆతనికడఁ జేరి యత్యంతభక్తి
కడుసపర్యలుసేయఁ గరుణించి యతఁడు
బాహ్యానవ్రతఁ గని బ్రమిసి యెడంద
సుతునట్లు మన్నించి చొక్కి యనేక
శాస్త్రములు చదివించి శంభుమంత్రముల
నొసఁగి యనేకశుభోపదేశముల
నిచ్చిన నుప్పొంగి యే నహర్నిశల
నరిగి శివాలయ మచట జపింతు;
అపుడు నాయెడఁద నహంకారదంభ
ముఖ్యదుర్గుణము లుద్భూతములయ్యె;
ఖలుఁడ దుర్మతిని లోకవిఖ్యాతకుండ
నై మోహమునఁ జిక్కి హరిభక్తులన్న
ద్విజులన్నఁ జులపట్టి విష్ణుద్రోహమ్ము
గావించు; నా పనుల్ గనుఁగొని గురుఁడు
బహువిధమ్ముల నీతివాక్యములు పలుక
నాలింప కవి క్రోధినై చనుచుంటి;
ఒకసారి మా గురుఁ డొయ్యన నన్నుఁ
బిలిచి విన్పించెను బెక్కునీతులను:
"శివుని సద్భక్తి భజించిన ఫలము
శ్రీరామపాదరాజీవములందుఁ
బాయని ప్రేమము వఱలుటగాదె?
తండ్రి! శివుండును ధాతయు రామ
పాదపద్మముల భక్తి సేవింప
మానవమాత్రుల మాట యింకేల?
బ్రహ్మరుద్రాదు లెవ్వనిపాదములను
సేవింతు రట్టి యీ శ్రీహరిమీఁదఁ
బగఁగొన్న సుఖములు పడయుదువొకొ్క?
హరుఁడు సంతతము శ్రీహరిసేవకుండె"
యనవుడు నా హృదయమ్ము జ్వలించె;-
పాలు ద్రావిన కోడెపాము'విధాన
నధముఁ డవిద్యచే నహ మెక్కిపోవు;
దుష్టుండనై గురుద్రోహముసేయఁ
గాఁ గృపాళుఁడు దానిఁ గైకోక నాకు
సదుపదేశమ్ము లజస్ర మొసంగుఁ;
దన్నుద్ధరించిన ధర్మాత్ము మెట్ట
మొదట నాశముసేయఁబూను నీచుండు;
అగ్నిచే జనియించినట్టి యీ ధూమ

మంబుదమై మీఁద నగ్నిఁ జల్లార్చు,
పడియుండి దారిలోఁ బదుగురు త్రొక్క-
గజిబిజియగుదుమ్ము గాలిచే మీఁది
కెగిరి యాపై గాలినే చెడగొట్టి
చక్రవర్తుల భూరిచారుహీరమయ
సత్కిరీటములపైఁ జయ్యన నిలిచి
యది చాల కట్టులయందును బడును;
కాన రసజ్ఞు లో ఖగనాథ! నీచు
లగువారితోఁ గలియరు; నీచులైన
జనులతోఁ గలహాముసంగతి చనవు;
వారితోడఁ దటస్థభావము లెస్స;
కుజను నజస్రము కుక్కచందానఁ
ద్యజియింపవలయును ధార్మికుం డెపుడు;
ఒక్కనాఁ డతినిష్ఠ నుగ్రలాటు
నాలయమ్మున కేఁగి యచ్చట శివుని
జపియించుచుండ నచ్చటకు గురుండు
వచ్చిన లేచి నే వందన మిడక
యభిమానమున నుంటి; నందుల కాతఁ
డెడఁదయందునఁ గోప మిసుమంత గొనఁడు;
అట్టి గురుద్రోహ మను మహాఘమ్ము
హృదయమునందు సహింప కుగ్రుఁ డయి
యుగ్రుఁ డుగ్రాననుఁ డుగ్రలోచనుఁడు
భయదమా నాకాశవాణియై "మూర్ఖ!
హతభాగ్య! దుర్జన! అభిమానవశుఁడ!
కరుణాకరుండు సుజ్ఞానియౌకతన
నీ దోషములను మన్నించె నీ గురుఁడు;
కాని నా కది దుశ్శకమ్ము సహింప;
నీతివిరోధము నే నోర్వలేను;
శిక్షింపకున్నచోఁ జెఱుతువు సకల
వేదధర్మమ్ముల వెంగలి వగుచు;
గురుని ద్వేషించినఁ గోటియుగాలు
రౌరవమునఁబడి క్రాగి పోయెదరు;
పిదపఁ దిర్యగ్యోని వెసఁ బుట్టి వేయి
జన్మముల్ దుఃఖాన సంతపించెదరు;
పాపి! గురుండు దా వచ్చినఁగూడ
నజగరమ్మువిధాన నల్లె కూర్చుంటి
వందుచే నధమ! నీ వా యథోగతికి
నేఁగి దుష్టుఁడ; మహావృక్షకోటరము
నందు వసింపు" మటంచు శపించె;
అదిగని గురుఁడు హాహాయని యార్చి
కంపించు ననుఁగని కడు జాలిబొంది
భవునకు దండవత్ప్రణతి యొనర్చి
మద్భయానకగతి మది నెరియింపఁ
గంఠము గాద్గదిక్యమ్మును బొంద
నీ రీతి శివు నుతియించె సద్భక్తి:

రుద్రాష్టకము

సత మీశు నీశాను నిర్వాణరూపు
విభున్ వ్యాపకున్ బ్రహ్మ వేదస్వరూపున్
నిజున్ నిర్గుణున్ నిర్వికల్పున్ నిరీహున్
జిదాకాశ నాకాశవాసున్ భజింతున్.

నిరాకారు నోంకారమూలున్ దురీయున్
గిరాజ్ఞానగోఽతీతు నీశున్ గిరీశున్
గరాళున్ మహాకాలకాలున్ గృపాళున్
గుణాగారు సంసారపారు న్నతింతున్.

తుషారాద్రిసంకాశగౌరున్ గభీరున్
మనోభూతకోటిప్రభాశ్రీశరీరున్
స్ఫురన్మౌళికల్లోలినీచారుగాంగున్
లసద్భాలబాలేందు, కంఠేభుజంగున్.

చలత్కుండలున్ భ్రూసునేత్రున్ విశాలున్
ప్రసన్నాననున్ నీలకంఠున్ దయాళున్
మృగాధీశచర్మాంబరున్ ముండమాలున్
ప్రియున్ శంకరున్ సర్వనాథున్ భజింతున్.

ప్రచండున్ బ్రకృష్టున్ బ్రగల్భున్ బరేశున్
అఖండు న్నజున్ భానుకోటిప్రకాశున్
త్రయఃశూలనిర్మూలనున్ శూలపాణిన్
భజింతున్ భవానీపతిన్ భావగమ్యున్.

కళాతీత! కల్యాణ! కల్పాంతకారీ!
సదాసజ్జనానందదాతా! పురారీ!
చిదానందసందోహ! మోహాపహారీ!
ప్రసన్నుండవై కావు మో మన్మథారీ!

ఉమానాథపాదాబ్జముల్ గొల్వకున్నన్
బరమ్మం దిహమ్మందు సౌఖ్యమ్ము శూన్య
మ్మిఁకన్ శాంతి సంతాపనాశమ్ములున్ లే
వజా! కావవే సర్వభూతాధివాసా!

ఎఱుంగన్ జపమ్మేని యోగమ్ము పూజల్;
నుతింతున్ సదా సర్వదా శంభు నిన్నున్
జరాజన్మదుఃఖౌఘతాతప్యమానున్
ప్రభూ! ఆపదన్ బాపుమీ గొల్తు శంభూ!

ఆ॥ వె॥ రుద్రప్రీతికొఱకు రుద్రాష్టకము దీని
బ్రాహ్మణుండు సదివె భక్తియుక్తి
మనుజుఁ డెవ్వఁడేని మాపు జేపుఁ బఠింప
సకలకామితములు శంభుఁ డిచ్చు.

గురువు కాకభుశుండిని క్షమింప
శివుని ప్రార్థించుట

స్వారజ్జుఁ డిదివిని చాల హర్షించె
నప్పు డా యాలయమందుండి "యోయి
విప్ర! యొక్కవరమ్ము వేడు" మటంచు
నతిసంభ్రమముగ వియద్వాణి వినిచె;
అది యాలకించి ధరామరవరుఁడు
"స్వామి! నామీఁదఁ బ్రసన్నుఁడవైన
నీ దీనజనునిపై నెంతయు స్నేహ
మెసఁగినచో నాకు నిమ్ము నీ పాద

కంజాతములమీఁద గాఢానురక్తి,
బ్రప్రథమమున; నాపయి వేఱువరము
దయసేయు మో యుమాధవ! భవదీయ
మాయను జిక్కి యీ మానిసి సతత
మభినూనవశమున నటునిటు దిరిగెఁ;
గరుణాబ్ధి! నీ వది గైకొక కోప
ముపసంహరించుట యొప్పు; మహేశ!
దీనమందారమ! దేవాధిదేవ!
కామితదాయక! కరుణించి వీని
కిపుడు శాపవిముక్తి నీఁగదె స్వామి!
యీతని కిప్పుడు హితము సేయు" మన
"నేవమ" స్తనియె నయ్యెడ నభోవాణి.

గురు ప్రార్థితుఁడై శివుఁడు కాకభుశుండి
ననుగ్రహించుట

"విప్రపుంగవ! నేను వీని గర్వమ్ము
గాంచి క్రుద్ధుండనై కడువడి శాప
మిచ్చియుభవదీయ మీ విన్నపమ్ము
మన్నించి వీనిని మన్నింతు నిపుడు;
ఉర్వీశుమాశీలయును బరహితము
గోరువాఁడును నాకుఁ గోసలాధీశు
వలెఁ బూజనీయులు; బ్రాహ్మణ! నాదు
శాప మమోఘము; జన్మసహస్ర
మీతనికిన్ దప్ప దిఁక జనించుటయుఁ
జచ్చుట యనెడి దుస్సహదుఃఖ మింత
యేనియుఁ బీడింప దిది నిక్కువమ్ము;
జ్ఞానమ్ము దొలఁగ దే జన్మానఁగాని;
ఓయిపాదజుఁడ! అయోధ్యాపురమ్ము
నందు జన్మించి నా యంఘ్రులమీఁద
హృదయము నిల్పితి, వీ కారణమునఁ
బ్రభుని పాదములపై భక్తి జనించు;
విప్రుల సేవింప విభుఁడు హర్షించుఁ;

బాఱుల నవమానపఱుపకు మయ్య!
సాధుల విభులతో సములని తలఁపు;
మింద్రుని ద్రోహిని యీ నా త్రిశూల
మా కాలదండము హరిసుదర్శనము
నను వీనిచేఁ జావనట్టిఁడుకూడ
బ్రాహ్మణద్రోహాగ్ని భస్మమైపోవు
ననుమాట మఱువకు మంతరంగమున.
వసుధ నీ కొకదుర్లభమ్ము లేకుండు;
నిం కొకయాశిష మిచ్చెద నీకు
నప్రతిహతగతి యలరెడుఁగాత"
మనుశివవాక్యము లాలించి గురుఁడు
నన్ను మిక్కిలి యనునయమొనరించి
నరిగె నామోఁద నిజావసథమ్మ.

కాకభుశుండియొక్క తదనంతరకథ

తదనంతరమ్మ వింధ్యాచలమందుఁ
గాలప్రేరితుఁడనై కాలభుజంగ
మై పుట్టి కొన్నాళ్ళ కా శరీరమ్మ
నశ్రమమ్మునఁ బరిత్యాగముసేసి
పొందితి వేఱొకపుట్టు; వీ రీతి
నెన్నిజన్మమ్ముల నెత్తినఁగాని
యన్నిటి విడిచితి నశ్రమమ్మునను-
మాసినపుట్టము మనుజుఁడు విడిచి
నవ్యముల్ ధరియించునట్టివితాన;
ఆగమమర్యాద నభవుఁడు కాచె
నయ్యో శ్లేశముపొందనైతిని సుంత;
ఇ శ్లేన్నిజన్మము లేఁగినఁగాని
నా జ్ఞాన మింతయు నశియింపదయ్యె;
ఆగతి నేను దిర్యగ్దేవమనుజ
యోనులలో జన్మమొందియు రామ
భజనము మఱువను; బోధించు నన్ను
నాగతి సజ్జనుఁడైన మద్గురున
కవమతిసేసిన యట్టివ్రణమ్ము;
చరమజన్మమునఁ జయ్యన నొక్క-
విప్రగృహమ్మున వెస జనించితిని;
అపుడు శైశవమున నాడుచు రాముఁ
డాచరించినలీల లాచరించితిని;
పంచశరద్వయప్రారంభమందుఁ
జదువఁగఁ బనిచెను జనకుఁడు నన్నుఁ;
దలపోసి యాలించి తగ విచారించి
యేమిచేసియుఁ జదువే నచ్చదయ్యె-
నా మనమ్మున వాసనలు నశియించి
రామదివ్యపదానురక్తి కల్గుటను;
ఖగనాథ! చెప్ప మీ కామధేనువును
బోనాడి రాసభమును గొల్చునెవఁడు?
ప్రేమమగ్నుడనయి వెలసెడు నాకుఁ
దదితరమ్ముల ననాదరముజనించెఁ;
జదివించి చదివించి జనకుఁడు మిగుల
డప్పెను విద్య యొంటంబట్టదయ్యె;
మాత్రపితలుగూడ మరణింపఁ బిదప
రక్షకుఁడైన శ్రీరాముని భక్తి
భజియింప నడవులుపట్టి పోయితిని.
అందుఁ గన్పించు ఋష్యాశ్రమమ్ములకుఁ
జని వారిపదముల సాష్టాంగపడుదు;
శ్రీరామకథలు ప్రశ్నింతు; వచింప
నాలింతు నత్యంతహర్ష మేపార;
అభవునికరుణ నవ్యాహతగమన
మబ్బినకతమున నట్లు శ్రీహరిని
సతము భజించుచు సంచరించితిని;
ఎంతయు గాఢము లీషణత్రయము
లవి నశియించె నా యంతరంగమున;
శ్రీరామచంద్రునిశ్రీపాదకంజ
దర్శనభాగ్యము దనరు నేనాఁడు?
సఫలమ్మగావింతు జన్మ మేనా? డ

టంచు నొకేయూశ యలరె నజస్ర;
మే మునీశునికడ కేగి ప్రశ్నింప
'సర్వభూతమయుండు స్వామి' యం చాడు;
ఇట్టి నిర్గుణత త్త్వ మేమియు నాకు
సై ఁపదు హృదయాన; సగుణమనంగ
యెక్కు-వ మక్కు-వ యెసఁగు; మద్గురుని
వచనముల్ స్మరియించి ప్రభుఁ డగురామ
భద్రలసత్పాదపంకేరుహముల
నెడఁదయందు ధరించి యెంతయుఁ బ్రీతి
నందందుఁ దిరుగుచు నట నొక్క-నాఁడు-

లోమశమహర్షి కాకభుశుండిని కాకజన్మము
నందుమని శపించి, పిదప యనుగ్ర
హించుట

కనకభూమీధ్రశిఖరిమీఁద నొక్క-
వటతరుచ్ఛాయను వసియించునట్టి
లోమశాఖ్యర్షి నాలోకించి యతని
పాదమ్ములకు భ క్తిఁ బ్రణమిల్లి దీనుఁ
డై వేడుకొనఁగ మహర్షియు, "విప్ర!
యేకార్యమున కిట కేతెంచి" తనినఁ
బ్రణమిల్లి మఱుల, "కృపానిధి! నీవు
సర్వజ్ఞుఁడవు మహాజ్ఞానివి నాకు
నతిప్రీతితో సగుణారాధనావి
ధ మ్మెఱిఁగించి సంతాపము వాప
వే?" యన నప్పుడు మునీంద్రుఁడు రాము
కథలు పెక్కు-లు సెప్పి కడపట నన్ను
యోగ్యునిగా నెంచి యుపదేశ మొసఁగ
సాగెను, "బ్రహ్మ మజమ్ము నద్వైత
మగుణ మఖిలహృదయాంతరవ ర్తి
యనుభవగమ్య మనాది యనంత
మనుపమ మజితము నపరిమిత మ్మ
నీహ మనామ మనేకసురూప
మింద్రియాతీత మహీనము నిర్వి
కార మఖండ మక్షరము నిర్మలము
నిరవధికమ్మును నిశ్చల మ్మాద్య;
మాగమమ్ములు త త్త్వమసి యని పొగడు;
జలబిందువునకును జలబిందువునకు
మధ్య భేదము లేనిమాడ్కి- దానికిని
నీకును భేదము నెగడ దొకింత"
యనుచు నిర్గుణత త్త్వ మతివిశదముగ;
అయ్యా నా మనమున కది యెక్క-దయ్యె;
అంతట నే ముని కంజలిసేసి,
"యో స్వామి! సగుణబ్రహ్మోపాసనావి
ధమ్ము సెప్పంగ దే దయతోడ నాకు;
రామభ క్తి యనుజలమ్మున దిరుగు
నస్మదీయమహృదయ మ్మనుఱుషము-
జలము లేకున్న మత్స్య మ్మెట్లు బ్రదుకు?
కనులార శ్రీరాముఁ గంజాయతాక్షుఁ
గమనీయరూపునిఁ గనుఁగొనఁజాలు
విధ మున్నఁ జెప్పుము; విభుని సాకేత
ధవుని నా కనులార దర్శించి పిదప
నెట్టినిర్గుణత త్త్వమేని యాలింతు"-
నని విని లోమశుఁ డల్లన నవ్వి
పెక్కు-శ్రీహరికథల్ పేరొక్కా-ని సగుణ
మతమును ఖండించి, మఱుల నిర్గుణము
స్థాపించె; నేనును దాని ఖండించి
సగుణమ్ము నిలిపితిఁ; జయ్యన నిట్లు
వాదోపవాదముల్ వరలె; మునీంద్రు
కను లెఱ్ఱవారెను, గంపించె దేహ :
మభ్రగేశ్వర! యూర కవమతిసేయఁ
గలుగుఁ గోప మ్మెంతజ్ఞానికిఁగాని;
తరువంగఁ దరువఁ జందనకాష్ఠమందు
జనియింపదొక్కొ- వైశ్వానరజ్వాల;
తదనంతరమ్ము క్రోధమున లోమశుఁడు

జ్ఞానవాదము నిల్పఁ గడఁగె నాయెదుట;
నవ్వోళ నా హృదయమ్మునఁ బెక్కు
లనుమానములు నడయాడఁ దొడంగె.
"ద్వైతభావమ్మునఁ గ్రోధ మ్మెట్లు కలుగు?
నజ్ఞాన మే రీతి నగు ద్వైతబుద్ధి?
మాయావశుండును మఱి పరిచ్ఛిన్నుఁ
డగుజడజీవుఁ డె ట్లగు నీశసముఁడు?
సకలహితాకాంక్షఁ జనునెడ దుఃఖ
మెట్లు కలుగ నేర్చు? నెవ్వనియొద్ద
స్పర్శవేది యెసఁగు వానికి నెందుఁ
గలదె దారిద్ర్యము? ఖగనాథ! వసుధఁ
బరులను జెఱచెడువాఁడు నిర్భయుఁడె?
అకలంకుఁడే కామి? యన్యాయ మెదుగు
నా బ్రాహ్మణద్రోహ మాచరింపంగ?
జగతి నెఱుంగ నిజస్వరూపమ్ము
నెసఁగునే కర్మము లెండైన? దుష్ట
సాంగత్య మొనరింప సద్బుద్ధి గలదె?
పరసతీగామి సత్పదమును గొనునె?
పరమాత్మ నెఱిఁగిన భవము సైకొనునె?
ద్వైవనిందకునకుఁ దనరునే సుఖము?
నీతివిరహితమై నెగడునే రాజ్య
మా హరి చరితము నత్యంతభక్తి
వర్ణించువానికిఁ బాపముగలదె?
పావనసత్కీర్తి వరలునేపుణ్య
హీనున? కపకీర్తి యెందుఁ బాపమ్ము
సేయక కలుగునే? శ్రీహరిభక్తి
వేదపురాణాదివిఖ్యాతముగద,
తత్తుల్యలాభ మి ద్ధరణి నింకేది?
నష్టము కలదొకో నరజన్మమెత్తి
ప్రభుఁడగు శ్రీరామభద్రునిపాద
పంకజభక్తిని బాయుటకంటెఁ?
బైశున్యమునకంటెఁ బాపము కలదె?

దయకన్న మిక్కిలి ధర్మము కలదె?
యని తలపోయుచు నత్యాదరమున
మునిచెప్పు నుపదేశమును వినినైతి;
సగుణవాద మ్మేను స్థాపింపఁ జూచి
మునివరేణ్యుఁడు కోపమున, "నోరి మూర్ఖ!
యెంతటియుపదేశ మిచ్చినఁగాని
పూర్వపక్ష మొనర్చి పోనాడి యిట్లు
రాద్ధాంత మొసరింతురా! నాదు సత్య
వచనములందు విశ్వాసము లేదె?
కాకివిధమ్మునఁ గాఱులు ప్రేలు
చున్నావు, మిక్కిలియోర్మి వచింప
వినవు, మూర్ఖపుపట్టు విడువవు, కాన
నట్టి చండాలవిహంగమ వగుము
పో" మ్మనవుడు సుంత పొగులక యెడఁదఁ
జెచ్చెర శాపము శిరసావహించి
యానందమున గాక మైతిని; నన్ను
ద్వైన్యభయమ్ములు దరిసేరవయ్యె;
అపుడు మునీంద్రునియంఘ్రుల కెరఁగి
రఘుకులాభరణుని రామావనీంద్రు
నెడఁదఁ గీర్తించుచు నెగిరిపోయితిని;
శ్రీరామచరణముల్ సేవించువారు
కామము క్రోధము గర్వము గొనరు;
జగతి నెలెడ రామచంద్రుఁడే నిండ
నెవ్వరితోఁ వైర మింకఁ బెంచుకొంద్రు;
తప్పపట్టగ రాదు తాపసు నిందు;
ననుఁ బరీక్షింప మనమ్మున నెంచి
సకలప్రేరకుఁ డగుస్వామి మునీంద్రు
బుద్ధి నీ విధమున మోహింపఁజేసెఁ;
బరమభక్తిని మనోవాక్కాయములను
దన్ను సేవించుట దలఁచి రాఘవుఁడు
మునివర్య మునుపటిబుద్ధి మఱల్చె;
అంత నా సద్బుద్ధి కలరి లోమశుఁడు

తనదుపూర్వప్రవ ర్తనకు సిగ్గిల్లి
కడువిచారించి యక్కడ కాదరమునఁ
బిలిపించి సంతోషపెట్టి శ్రీరామ
పావనమంత్ర ముపాస్య మొసంగె;
బాలరాఘవుధ్యానపద్ధతిఁ దెలిపె;
నన్ను నచ్చటనె కొన్నా ళ్ళుండఁబనిచి
శ్రీరామచంద్రచరిత్రమానసము
పావనమ్మును భవభయహారకమ్ము
కలిమలప్రధ్వంసకమ్మును వినిచెఁ;
దదనంతరమ్ము సాదరమున నతఁడు,
"తండ్రి! సుందరము గుప్తము నిర్మలమ్ము
శ్రీరామచంద్రచరిత్రమానసము
పొందితి నేను శంభునికృపవలన;
నీవు శ్రీరాముని నిజభక్తుఁడ వని
విశదభంగిని నిటు వినిపించినాఁడ;
ఎవ్వని మది వసియింపఁ డోరాముఁ
డతనికిఁ జెప్పకు మయ్య! యీ గాథ"
నని సముదాయింప నత్యంతప్రేమఁ,
జరణకంజములకు సాగిలపడితి,
అమ్మునియును దనహస్తమువలన
నన్ను స్పృశించి సంతసమున నాకు
నాశీస్సులొసఁగి "యో యయ్య! నాకరుణఁ
దప్పక నీ యెడందను గాధరామ
భక్తి జనించుతఁ; బ్రభునకు మిగుల
నిష్టుఁడ వయ్యెద; వీప్సితమ్ము లగు;
అభిమానరహితుఁడ వమలసుజ్ఞాన
వైరాగ్యనిధివి శుభంకరగుణుఁడ
వగుము; నీ కోరెడునందాఁకఁ జెనక
నోడును నిన్ను మృత్యువుసైత మవని;
ఇంతియ కాదు సుమీ; భగవాను
స్మరియించుకొనుచు నాశ్రమమునయందు
వసియించుచో నలువైపుల నాల్గు
కోసులమేర నెకొన్కానబో దవిద్య;
అంటవు ని న్నెట్టియాఘము లేని;
ఆగమశాస్త్రాదులందు గుప్తమ్ము
లై యొప్పు రామరహస్యములెల్ల
గ్రహియింతుగాత మ్రహ్మమున నీవు;
భవదీయమనమున భావింతు వేది
తత్సిద్ధి శ్రీహరిదయచేత సులభ
తర మయ్యెడుంగావుత" మటంచుఁ బలుక
నవ్వేళ గంభీరమగుచు నాకాశ
పథమున నొక బ్రహ్మవాణి విన్పించె–
"నవితథవచనుఁడ వగుము మునీంద్ర!
త్రికరణమ్ముల నన్నుఁ బ్రేమించు నితఁ" డ
టంచు;నయ్యదివిననతిహర్ష మొదవెఁ;
బిదప మహర్షిని వినుతించి యతని
యనుమతి గైకొని యంత్రముల కెరఁగి
యా యాశ్రమమ్మున కేఁగు దెంచితిని;
రామునికరుణ దుర్లభమైనవరము
పొంది యా యాశ్రమమున నివసింపఁ
గడఁగి ముప్పదియేడుకల్పముల్ గడచె;
సతము శ్రీరాముని సద్గుణమ్ములను
గీర్తించుచుందుఁ బక్షిగణమ్ము వినఁగ;
నరరూపధారియై నారాయణుండు
రావణవైరి శ్రీరామచంద్రుండు
భక్తసంరక్షణభారము పూని
సాకేతపురమున జన్మించినప్పు
డెల్ల నే నచ్చోటి కరుగుచునుందు;
నతనిశైశవలీల లారసి నాదు
హృదయమందున సుఖమ్మేఁ బొందుచుందు;
శ్రీరామచంద్రుని శిశురూప మెడఁదఁ
బూని నే నాశ్రమమున కరుదెంతు;
నియ్యది సుమి విహగేంద్ర! నే కాక
దేహమ్ము పొందిన తెఱఁగు; నీ సకల

ప్రశ్నమ్ములకు నుత్తరమ్ము లిచ్చితిని;
ఆహహా! భ క్తిమాహాత్మ్య మే మనుచుఁ
బొగడంగ నగును? ప్రభూ! కాక దేహ
మందె శ్రీరామునియంఘ్రులభ క్తి
లభియించె; నీ శరీరముతోనఁ ప్రభునిఁ
దర్శింపఁగంటిని, ధన్యుఁడ నైతి;
నా సందియమ్ములు నశియించె సకల,
మందుచే నీ దేహమన్నచోఁ బ్రీతి;
భ క్తిపథము గొని వాదించుకతన
శాప మిచ్చెను లోమశమహర్షి నాకు;
భ క్తిప్రభావమువలన నా శాప
మే తుట్టతుదకు మునీంద్రదుర్ల భము
భవహారక మ్మగువరముగా మారె;

భ క్తి యింతటిసులభ మ్మని యెఱిఁగి
కూడ దానిని వీడి కూళయై యురక
జ్ఞానమ్ముకోసమై శ్రమియించువాఁడు
పెరటిలో సురగవి విడనాడి పాల
కనుచు జిల్లెడుమొక్క కన్వేషణమ్ము
గావించునట్టిఁడు కాఁడె? ఖగేశ!
హరిభ క్తి విడనాడి యన్యసాధనల
భవము దాఁటఁగఁగోరువాఁ డొకనాక
యేనియుఁ గైకోక యీఁది సాగరము
దాఁటఁగఁ దనమదిఁ దలపోయునట్టి
వాఁ" డటంచు భుశుండి పలుక, విహంగ
నాథుఁడు తనదు మనమ్మునఁ బొంగె.

శ్రీరామచరితమానసము

ఉత్తరకాండము

సప్తమవిశ్రామము

శ్రీమత్కాశవతీర్థ
స్వామిసమాలంకృతోరుభాగ! కృపాబ్ధీ!
దామోదర! నారాయణ!
సోమస్తుత! మట్టపల్లి సుందర నృహరీ!

కాకభుశుండి భక్తిజ్ఞానములయొక్క
అభేదమును భేదమును నిర్వచించుట

"త్వత్ప్రసాదమున హృదయమునయందు
సందేహభయశోకసంభ్రమమోహ
సంచయమ్ము లడంగె: స్వామి! మీకరుణ
రామచంద్రునిపవిత్రగుణౌఘములను
వినఁగంటి, శాంతి లభించె నెంతయును;
కడుభక్తి మిమ్ము నొక్కఁ డడిగెదను
వివరింపఁగదె నాకు; వేదపురాణ
శాస్త్రాదులన్నియు జ్ఞాన మత్యంత
దుర్లభ మని పల్కఁ; దొలుత లోమశుఁడు
చయ్యన మీకడ స్థాపించెఁ గాని
దానిని మీరు హృదయమునఁ గొనక
భక్తిముందటఁ దీసి పాఱవైచితిరి;
కరుణాబ్ధి! భక్తికి జ్ఞానమ్మునకును
గలభేద మే నెఱుంగఁగ నిచ్చగింతు"-
నని విహంగేశ్వరుఁ డడుగ నాలించి
కాకభుశుండి యఖండాదరమున,
"ఖగనాథ! భక్తికి జ్ఞానమ్మునకును
నావంతయును భేద మనునది లేదు;
భవభేదముల నవి వారించు రెండుఁ;
గాని వానినడుమఁ గలవు భేదమ్ము
లని మును లందు రయ్యది వినిపింతు
సావధానుండవై యాలింపవలయు;
వైనతేయా! జ్ఞానవైరాగ్యయోగ
విజ్ఞానముఖ్యముల్ వెసఁ బురుషాళి;
స్వాభావికమ్ముగఁ బ్రబలురు పురుషు;
లంగనల్ నిర్బలు లత్యంతజడులు;
కడకవిరక్తులు కడుధీరబుద్ధు
లగుపురుషులు స్త్రీని ద్యజియింపఁగలరు;
విషయలోలురు రఘువీరపదాబ్జ
విముఖులు కాములు వీడఁగలేరు;
జ్ఞాననిధాను లౌసన్మునీంద్రులును
హరిణలోచనల ముఖారవిందములఁ
గనుఁగొని వివశులై క్రాలరె వసుధ?
విహగకులేశ్వర! విష్ణునిమాయ
యంగనయగుచుఁ దా సవతరించినది;
పక్షపాతముగొని పలుకుట గాదు
వేదశాస్త్రాదులు వినిచిన పలుకు;
లింతిని వేఱొకయింతి మోహించు
టెఱుఁగుదుమొక్కొ మహీస్థలమందు;
మాయయు భక్తియు మగువ లటంచు
నెల్ల టెఱుంగుదు; రిందు సద్భక్తి

యన్న చో రామున కమితప్రేమమ్ము;
కేవల మొక్కన ర్తకియె మాయ నాథ!
ఆ రాఘవుఁడు భ క్తి కనుకూలుఁడగుట
చే మాయ యతనిఁ జూచిన వెఱఁగొందు;
నిరుపమ మ్మమలము నిరుపాధికమ్ము
నతినిరాటంకము నగు రామభ క్తి
యెవ్వనిహృదయమం దెసఁగునో వానిఁ
గనుఁగొన్న చో మాయ కంపించిపోవు;
నాధిపత్యము సెల్ల దాతనివీఁద;
నని విచారించి మహర్షులు సతము
శాంతికారకమును సౌఖ్యప్రదమ్ము
భవనాశకము నగుభ క్తి వాంఛింతు;
రీ రాఘవురహస్య మెవ్వఁడుగాని
కనుగొనలేదు శీఘ్రమ్ముగ; రాము
కరుణచే దీనినిఁ గనుఁగొన్నవాని
మోహము కలనైన ముట్టగఁలేదు;
ఖగరాజ! భ క్తికి జ్ఞానమ్మునకును
నడుమ గలట్టియంతరమ్ములు పెక్కు
లవి విన్న చో రామునంఘ్రులమీఁదఁ
జెలఁగు సత మ్మవిచ్ఛిన్నానురాగ ;
మకథనీయమ్మయ్యు నవి వినిపింతు;
భావగమ్యమ్ము లవర్ణ్యము లవ్వి;
జీవుఁ డీశ్వరునియంశ మ్మవినాశి
యమలుఁడు చేతనుం డాద్యుఁ డనాది
సహజసుఖాబ్ధి ప్రశాంతుఁడు నయ్యె

మాయకువశుఁడయి *మర్కటమ్మట్లు
శుకముచందమ్మునఁ జొక్కి తనంత
బంధితుఁడయ్యె; నిప్పగిదిని గ్రంథి
జడచేతనములకు సరగునఁ గలిగె;
నా గ్రంథి కడుమిథ్యయయ్యుఁ దచ్ఛేద
నమ్ము మిక్కిలికఠినమ్మయి యొప్పె;
అదిసుత సంసారి యయ్యెను జీవుఁ
డా గ్రంథి వీడక యతనికి సుఖము
గలుగదు సుంత; నిగమపురాణాదు
లెన్నేని యుక్తుల నెఱుఁగంగఁ జెప్పుఁ
గాని వీడ దొకింతగ్రంథి; నానాఁటి
కథికాధికమ్ముగ నది బిగియించు;-
అజ్ఞాన మనియెడునాంధ్యము జీవు
హృదయమం దధికమై యెసఁగెడుకతన
నా గ్రంథిఁ గనుటయే యతికష్ట మైన
నిఁక నది వీడుట యెక్కడిమాట?
ఎపుడేని సంయోగ మీశుఁడు దాని
కొనరఁజేసిన నది యూడునుగాక;
హరికృపచే హృదయ మ్మను గృహము
నందు సాత్వికశ్రద్ధ యనెడు మాహాయి
వేదశాస్త్రపురాణవిఖ్యాతమైన
జపతపోవ్రతయోగశమదమముఖ్య
సద్ధర్మము లనెడు సస్యము మేసి,
యాస్తికభావాఖ్య మగు తర్ణకమ్ము
నీన, నివృత్తినా నెసఁగెడు పాద

---

* మర్కటములును శుకములును బంధింపఁబడు విధాన మతి విచిత్రము. ఒకకట్టను పాతి దాని కొక చక్ర మేర్పాటుచేయబడును. దానిపై చిలుక వచ్చి వాలగనే, ఆ బరువుచే తేలికగు నా చక్రము గిట్టునఁ దిరుగ నారంభిం చును. ఆ పరిభ్రమణమునఁ దాను బంధింపబడినట్లు విభ్రాంతయై, చిలుక ఎగిరిపోవ నవకాశమున్నను ఎగిరిపోవక బంధింపఁబడును. కోతియో కొన్నిగింజలు పోయబడిన కూజాలో జేయి పెట్టి గింజలు పిడికిలితో పట్టుకొని, పారిపోఁ జూచును. కాని పిడికిలి, కూజామూతినుండి వెలికిఁ బట్టదు, గింజలు లోన వదలి యది పోవచ్చును. కానీ, గింజలుగల పిడికిలి తెఱచుసదుపాయమును మఱచి అది యట్లే ఎవరో బంధించినట్లు పెనుగులాడి బంధింపఁ బడును. జీవుడును విభ్రాంతిచే నిట్లుబద్ధుఁడగుచున్నాడు.

బంధనమ్మున దాని బంధించి, యమల
స్వవశచి త్త మను గోపాలుఁడు, పరమ
ధర్మదుగ్ధమ్ములఁ, దవిలి విశ్వాస
మనెడు పాత్రములోని కప్పుడు పిదికి,
నిష్కామభావ మ్మనెడు నగ్నిమీఁదఁ
దొలుఁదొ ల్తఁ గాఁచి, సంతోషము తీమము
ననెడు వాయువులచే నవలఁ జల్లార్చి,
శమతక్రమును జేర్చి, సరగునఁ దోడు
వెట్టి యదంతయుఁ బెరుగైనపిదప,
వడి ప్రమోద మ్మను భాండమునందుఁ
బోసి, దమ స్తంభమునకును, సత్య
భాషణరజ్జువుల్ బంధించి, వేడ్కఁ
ద త్త్వవిచారమంథానముచేత
నదియెల్లఁ జిలికి, యత్యంతపావనము
నమలము సుందరమైన వైరాగ్య
మను నవనీతము నందుండితీసి,
యోగనామకవీతిహోత్రునియందు,
నఖిలకర్మములశుభాశుభమ్ము లను
నింధనమ్ముల వైచి, యేర్పడఁ గాఁచి,
మమకార మనియెడు మలమును దొలఁచి,
జ్ఞానఘృతమ్మును, గడువడి నిశ్చ
యాత్మికబుద్ధినా నలరు వాయువునఁ
జల్లవఱచియు, విజ్ఞానాభిదమ్మ
నమలఘృత మొనర్చి యద్దాని సమత
యను ప్రమిదను బోసి, యతిప్రయత్నమున
మూఁడౌనవస్థలు మూఁడుగుణమ్ము
లను ప్రత్తిలోఁ, దురీయావస్థ యనెడు
గింజను మును దొలఁగించియుఁ, బేఁడి,
చిత్త మ్మనెడి దివ్వెఁ జేసి, యుజ్జ్వలము
విజ్ఞానదీపము వెలిఁగింపఁ, 'సోహ
మస్మి'నా నలరెడునట్టి యఖండ
వృత్తియన్ జ్యోతిని వీక్షించి, బ్రమిసి,
దంభమదాదిపతంగసంచయము
భస్మమా, నాత్మానుభవసుఖ మ్మనెడు
సౌమ్యసుందరప్రకాశమ్మ వ్యాపించు;
నప్పుడు భవమూలమా భేద మనెడు
భ్రమము నశించును; బదపడి జగతి
నత్యంతబలయుతమ్మైన యవిద్య
పరివారమై ధరఁ బరగు మోహాది
సకలాంధకారసంచయములు దొలఁగు;
బుద్ధి ప్రకాశముబొంది యవ్వేళ
హృదయగృహమ్మున నెసలారునట్టి
జడచేతనగ్రంథి సడలించివైచు;
గ్రంథిని సడలింపఁగన్నచో జీవుఁ
డతికృతార్థుండగు; నయ్యెను మాయ
గ్రంథి తా సడలుట ఖగనాథ! యెఱిఁగి
పెక్కువిష్ణుమ్ముల విరచింపఁగడఁగు;
బుద్ధిసిద్ధ్యాదుల నెన్నేనిఁ బంపఁ
గపటభావమున దగ్గఱ కవి వచ్చి
యంచలవాయుప్రహతిచేత జ్ఞాన
దీపమ్ము నార్పును: దెలివిగలట్టి
దైనచో బుద్ధియు నహితకారు లసి
యా వైపు గన్నెత్తియైనను గనదు;
మాయాకృతమ్ములై మలయువిష్ణుముల
నధిగమించినయెడ నమరులు గూడి
బుద్ధి *ఉపాధులు పూని చేసెదరు;
హృదయగృహమునకు నింద్రియము లను
పెక్కుజాలకములు వెలయును; వాని
యందున దేవత లవసథమ్ములను
గావించుకొని యుండ్రు; కడువడి విషయ

---

* ఉపాధి = విష్ణువు (తులసీ)

వాయుప్రసరణమ్ము పరికించి బుద్ధి
పూర్వకమ్ముగఁ దలుపులు దీసివైతు;
రంతట నా వాయుహతిని విజ్ఞాన
దీపము కొండెక్కుఁ; దిన్నఁగ గ్రంథి
సడలదయ్యెను బ్రకాశమ్మును బోయె;
విషయపవనహతి వెస బుద్ధికూడ
వ్యాకులితమ్ముగు నభ్రగనాథ!
విషయభోగములపైఁ బ్రీతి యనంత
మై యెసంగుట నింద్రియములకు వాని
యధిదేవతలకు సుంతైన జ్ఞానమ్ము
నచ్చదు; బుద్ధి నున్మత్తముసేయు
విషయసమీరము; పిదప నెవ్వండు
జ్ఞానదీపమ్ము ప్రకాశింపఁజేయు?
జ్ఞానదీపమ్ముపోఁగా ననేకములు
సంసృతిక్లేశముల్ చలపట్టు జీవు;
లభ్రగకులనాథ! హరిమాయ నెన్న
నత్యంతదుస్తరమ్మై పొలువొందు;
చెప్పుట యెఱుఁగుట చెచ్చెర దాని
సాధన కష్టము జ్ఞానమార్గమున;
జ్ఞాన మయ్యది ఘుణాక్షరమార్గమునను
గలిగియుఁ బెక్కువిఘ్నమ్ము లేర్పడును;
జ్ఞానపథ మ్మనఁ గత్తిపై సాము;
పతనము కడుసులభమ్ము; నిర్విఘ్న
ముగ నెవ్వఁ డీమార్గమునఁ బయనించు
నతనికి మోక్షము హస్తామలకము;
వేదశాస్త్రపురాణవితతులు సతము
కైవల్యపదప్రాప్తి కడుదుర్లభ మ్మ
టంచుఁ బేరొక్కనుచుండు; నయ్యును రామ
చంద్రునిపదపంకజమ్ములు భక్తి
భజియించుచోఁ బట్టుపట్టి తనంత
నన పేక్షితమ్ముగ నది వరియించు;
జల మెప్పుడును స్థలాశ్రయము లేకున్న
వఱలనిగతి హరిపదభక్తి లేక
కోటియుక్తులుపన్నిగూడ సాధింపఁ
గా దుశ్శకమ్ముగుఁ గైవల్యపదము;
కావున హరిభక్తగణము సద్భక్తి
వాంఛసేసెదరు;కైవల్యమునేని
లక్ష్యింప రంతఃకరణములయందు;
భక్తిచే సంసారబంధముగూర్చు
నట్టియవిద్య ప్రయత్నము లేక
యశ్రమమ్మున నష్టమైపోవఁగలదు;
మనవంతు భుజియించుమాత్రమె, పిదప
నది జీర్ణమగుచెల్ల నా జఠరాగ్ని
తానయి చేయక తప్పు;దా రీతి
సులభము మిక్కిలిసుఖదమునైన
హరిపదాంభోజములందలిభక్తి
యే నొల్ల నను మూర్ఖుఁ డెవ్వఁడు జగతి?
భవసాగరము దాఁట వశమొక్కో సేవ్య
సేవకభావము చెలఁగకయున్న?
కావున హరిపాదకంజముల్ భక్తి
యుక్తిని సేవింపు మో యురగారి!
జడముఁ జేతనముగ జడముగఁ జేత
నము సేయఁగాఁ జాలినట్టి (శ్రీ)రామ
భద్రలసత్పాదపద్మముల్ భక్తి
భజియించుజీవుఁడే పడయు ధన్యతను;
ఇది జ్ఞానసిద్ధాంత మిఁక భక్తి యనెడు
మణిప్రాభవము గరుత్మంత! విన్పింతుఁ;
జింతామణియె సుమి (శ్రీ)రామభక్తి;
యెవ్వనిహృదయం దేపారు నిద్ది
వాని కహర్నిశల్ పరమప్రకాశ
మొప్పుచుండును; నేయియును వత్తి దీప
మను నివి యాతని కనవసరములు;
మోహదారిద్ర్యము ముట్టఁగలేదు;
లోభవాయువునకు లోఁబడఁబోవ;

దడఁగు నెంతయు నవిద్యాంధకారమ్ము;
సాగవు మదముఖ్యశలభచేష్టితము;
లెవ్వనిహృదయమం దెసఁగునో భ క్తి
కామాదిశత్రువర్గమ్ము డగ్గఁబడు;
గరళము సుధయగు, ఖలుఁడు మిత్రుఁడగు;
న మ్మణిలేక లే దవనియందు సుఖ;
మఖిల జీవులను దుఃఖా ర్తులఁజేయు
నాధియు వ్యాధియు నంటవు వాని;
భ క్తి నామకమణి పరగుచో మదిని
గలనైన లేదు దుఃఖము లవలేశ;
మా భ క్తిమణికయి యత్నముల్ సేయు
నట్టివాఁడే భువి నతికుశలుండు;
ఆ మణి ప్రత్యక్షమయ్యు శ్రీరాము
కరుణకల్గక దుశ్శకమ్ము పొందంగ;
దానిని బొందు టత్యంతము సులభ
మయ్యును నిర్భాగ్యులై తాము దాని
నతితుచ్ఛమని యెంతు రంతరంగముల;
వేదశాస్త్రపురాణవితతి పునీత
గాథలు పర్వతకమనీయసాను
భాగముల్; సాధులు పరమమార్మికులు;
జ్ఞానవైరాగ్యముల్ కన్ను లా రెండు;
తతబుద్ధి యనెడు కుద్దాలకమ్ముఁ గొని
ప్రేమతో దానిని వెదకిన వాఁడు
పరమసుఖద మయి పఱగెడు భ క్తి
సన్మణిఁ బొందఁగాఁజాలు ఖగేశ!
రాముని దాసులు రామునికన్న
నధికు లం చెంతు నిజాంతరంగమున;
రామచంద్రుఁడు సాగరమ్మైనయెడల
సజ్జనుల్ ధీరులు జలధరమాల;
యఖిలసాధనలకు హరిభ క్తియ ఫల;
మది యసజ్జనులకు నంద దుశ్శకము;
సాధుసుర‌ల్ *బ్రహ్మజలరాశి, జ్ఞాన
మందరాచలముచే మథియించి రామ
భ క్తిమాధుర్యసంభరితమై యెసఁగు
హరికథాపీయూష మందగల్గెదరు.
వైరాగ్య మను డాలువలన రక్షించు
కొనుచు జ్ఞాన మ్మను క్రూరనిస్త్రింశ
ధారచే మదలోభదంభమోహాది
శత్రువర్గమ్మును జంపినయెడల
హరిభ క్తి యను విజయమ్ము ప్రా ప్తించు."

* బ్రహ్మము = వేదము (తులసీ).

శ్రీరావుచరితమానవసము

ఉత్తర కాండము

అష్టమవిశ్రామము

శ్రీరామతీర్థసేవో
దారాశ్రమ సింహపీఠధామా ! జగదా
ధార మహిమాభిరామా !
మారమణా ! మట్టపల్లి మందిర నృహరీ !

గరుడుఁడు కాకభుశుండిని నేడు ప్రశ్న
లడుగుటు; కాకభుశుండి సమాధానములు
అన నాలకించి కాకాధీశుమోమునఁ
గనుఁగొని సద్భక్తి గరుఁడుఁ డిట్లనియెఁ:
"గరుణాబ్ధి! నాపయిఁ గడుఁబ్రేమ నెసఁగు
వారలు మీరు! సేవకుఁడను నేను;
స్వామి! మి మ్మేడు ప్రశ్నము లడిగెదను;
దగునుత్తరమ్ము లీఁ దగును మహాత్మ!
అతిదుర్లభ మగు దేహ మ్మేది జగతి?
నన్నిటికంటెను నతిదుఃఖ మేది?
యన్నిటికన్నఁ దా నతిసుఖ మ్మేది?
సాధుపుంగవుల యసాధు లౌవారి
సహజస్వభావముల్, స్వామి! యెట్లుండు?
నఖిలశ్రుతిప్రసిద్ధ మగు పుణ్యమేది?
యతిభయంకర మైనయఘ మది యేది?
మానసరుజ లేవి? మానక చెప్పుఁ"
డనిన భుశుండి యత్యాదర మొప్పఁ,
"దండ్రి! సంగ్రహముగఁ దగ వినిపింతు;
మనుజ దేహముతో సమానమౌ దేహ
మవనిలే; దఖిల చరాచరప్రాణి
తతులు యాచించును దాని; స్వర్నరక
మోక్షమ్ములకు నిది మొనయు నిశ్రేణి;
కల్యాణకారకజ్ఞానవైరాగ్య
భక్తిప్రదము; దానిఁ బడసియు రామ
పదములు గొలువక పరమమందుఁడయి
విషయానురక్తఁ బృథివిఁ జరించు
వాఁడు గాజునకునై భ్రమియించి స్వర్ణ
వేది దూరమ్మ్మగ విసరెఁడు వెడఁగు;
సాధుసంగతితోడ సమ మగు సుఖము,
దారిద్ర్యమునకన్న ధరణిని దుఃఖ,
మింకను వే ఱొక చేదియు లేదు;
వాఙ్మనఃకాయాలఁ బరహిత మ్మొపుడు
సలుపుట సజ్జనసహజస్వభావ;
మండజకులనాథ! యనవరతమ్ము
పరులహితమ్మును వాంఛించి సాధు
జనులు దుఃఖమ్ముల సహాయింపఁ బరుల
కపకృతిసేసి దుఃఖముపాలుసేయ
నెంచి యసజ్జను లెదురుచూచెదరు;
సాధులు భూర్జవృక్షమ్ముచందమునఁ
బరహిత మ్మొదఁ గోరి పై కొనునట్టి
యాపదల్ సహాయింతు రతిధీరబుద్ధి;
జనుముచందమున నసజ్జనుల్ పరుల
బంధింపఁ జూతురు; వారిచర్మమ్ము

నొలుతురు లోకు లో యురగవిపక్ష ! వక్షమున్ నిరతము జ్వలియింపఁజేయు;
వర్షోపలమ్ములు పంటపొలమ్ము నీ సోదరత్రయ మెప్పుడు కలిసి
పాడొనరించి యాపైఁ దారుఁ గరుగుఁ; వర్తింతురో సన్నిపాత మవ్వేళఁ
బరులసంపదలను బొడుకావించి గడుదుఃఖదము పుట్టి కారించు జనులఁ;
దుర్జను లిల నశింతురు తారుదారె; బేర్పైనఁ దెలియని విషయమనోర
దుష్టాభ్యుదయము కేతూదయమ్ము గతి ధాళియే చెలఁగెడు నఖిలశూలలగు;
జగదరిష్టకరమ్ము; సాధుప్రవరుల మహితయే తామర; మతి యీర్ష్య గజ్జి;
యభ్యుదయ మ్మార్యమామృతకిరణ హర్షవిషాదాదు లవి కంఠరుజలు;
భవ్యోదయమువలె బహుసుఖదమ్ము; పరసుఖమ్మార్ష్వమి పరగు ఋయార్తి;
పలుకు నహింసయే పరమధర్మమ్ము దౌష్ట్యకాపట్యముల్ ధరణిఁ గుష్ఠు వగు;
పరనింద మిక్కిలి పాప మటంచు- నా యహంకార మె యగుఁ గీలువాపు;
నాగమసంఘము లతివిశదముగ; మదమును దంభము మానము నాసి
హరగురునిందకుఁడై నజనుండు కారుజల్; తృష్ణయె కడుజలోదరము;
దర్దురవరరూపధారియై వేయి మూఁడీషణమ్ములు మూన్నాళ్లజ్వరము;
జన్మము లెత్తును; సద్బ్రాహ్మణులను ఖగనాథ! దుష్టరోగముల నెందాఁకఁ
నిందించునట్టిఁడు నిరయముల్ బెక్కు- బేర్కొననగు నయ్య? విను మొకరోగ
భోగించి కాకమై పుట్టును బిదప; మే చాలు ప్రమందింప; నిఁక నిన్నియైన
అభిమానియై నిర్జరాగమనింద మనుజున కింక *సమాధి యెక్కడిది?
సేయు రౌరవమును జెందు నరుండు; జపతపోజ్ఞానయజ్ఞాచారధర్మ
సాధునింద యొనర్చు జనుఁడు దివాంధ దానాదు లోషధుల్ దనరును గోట్లు;
జన్మము గైకొని జ్ఞానభాస్కరుఁడు వానిచే నీ రుజల్ వసుధను జనవు;
మునిఁగినపిమ్మట మోహానక్తమున ఇట్లు జగమ్మున నెసఁగెడు జీవు
విహరించుచుండును వెడఁగయి; సకల లందఱు దారు రుజార్తులు; శోక
జనులనిందించుదుర్జనుఁడు గబ్బిలము హర్షభయాదు లత్యంతదుఃఖములు
గాఁ బుట్టు జగమున ఖగకులనాథ! పైపెచ్చు వారిని బట్టి పీడించు;
ఇంకమనోరుజ లెఱిఁగింతు వినుము; నాగతి దారు రుజార్తు లటంచు
మోహమ్మ్ము వీనికి మూలము;వీని నెఱుఁగువా రే యొకరిద్దఱో జగతి;
చే బహుశూలలు చెలరేగుచుండు; ఇవ్వి గుర్తించినయెడల నొక్కింత
కామము వాతమ్ము, కఫము లోభమ్ము, తగ్గెడు ననుమాట తథ్యము కాని
పిత్తము క్రోధము, వెస నివి మూఁడు పూర్తిగ నాశము పొందెడు ననుట

---

* సమాధి = శాంతి (తులసీ)

గలలోని మాట, జగమ్మున విషయ
వాంఛాకుపథ్యము వరలిన యెడల
మునిజనమ్మలమనమ్మల నంకురింప,
మానవమాత్రులమాట యిఁకేల?
సా కేతనాథుని సత్కృపవలన
సద్గురుఁ డనెడు భిషగ్వచనముల
విశ్వాసము న్నిల్పి విషయవాంఛలను
వదలుట యనియెడు పథ్యమువట్టి
రామచంద్రుని పదరాజీవభ క్తి
యనెడు సంజీవని నప్పుడు తెచ్చి
శ్రద్ధాసనాథము సద్బుద్ధి యనెడు
ననుపానమునఁ జేర్చి యద్ది సేవింప
నీ రోగములు నశియించునుగాక,
శతకోటియత్నముల్ సలిపినఁగాని
యారోగ్యవంతుఁడై యలరుట కల్ల!
అంతరంగమ్మునయందు వైరాగ్య
బల మదిపై కొని వరలుసద్బుద్ధి
యను తూత్తు నానాఁటి కధికమై, విషయ
దౌర్బల్యము నశింపఁ, దగ నంతరంగ
మారోగ్యవంతమై న ల్లెలుంగనగు;
నిర్మలజ్ఞానమన్ నీట స్నానమ్ము
గావింప నంతరంగమ్మునయందుఁ
బ్రభుపాదసద్భ క్తి వ్యాపింపఁగలదు;
బ్రహ్మత త్త్వవిచారపరులగు ద్రుహిణ
శంకరశుక దేవసనక శాండిల్య
వైధాత్రనారదప్రముఖులమతము
నందు శ్రీరామునియంఘ్రులభ క్తి
కన్న వేఱొక్కమార్గ మ్మిక లేదు;
వేదశాస్త్రపురాణవితతులు భ క్తి
లేకున్న సుఖ మింక లే దని పలుకుఁ;
గమఠపృష్ఠమ్ము పైఁ గడకఁ గేశాళి
పుట్టఁగవచ్చు, నభోవీథియందుఁ
బ్రసవముల్ పూయఁగవచ్చు, గొడ్రాలి
కొడు కొక్కపదుగురఁ గూల్పఁగవచ్చుఁ,
గుందేటితలపైన గొమ్ము పుట్టంగ
వచ్చు, మరీచిక వారిచే దప్పి
దరుమఁగావచ్చును, ధ్వాంతసంఘములు
చండమయూఖుని జదుమఁగవచ్చుఁ,
బ్రాలేయమున వహ్ని వరలఁగవచ్చుఁ,
గాని శ్రీహరివిముఖమ్మయి జీవి
కాంచు సుఖ మ్మనఁ గలలోనిమాట;
నీరు మథించి నూనియఁ దీయవచ్చు;
వాలుకన్ దైలము వడిఁ బిండవచ్చు;
శ్రీరామచంద్రు భజింపకయున్న
భవసాగరము దాఁటఁబడదు, నిశ్చయము!
మశకమున్ జేయు బ్రహ్మగ, మశకముగ
బ్రహ్మను జేసెడు ప్రభుఁ డని యెఱిఁగి –
యఖిలసందేహముల్ త్యజియించి కుశలు
లా రామచంద్రునియడుగు లెంచెదరు;
శ్రీహరియనుపమశ్రీచరిత్రమ్ము
నొకచోట సంక్షేప మొకట విస్తరము
గాఁజేసి యావశ్యకమ్మగునట్లు
నా బుద్ధిమేఱకు నాథ! చెప్పితిని;
మఱచి సమస్తకామమ్ములు రాము
భజియింపు మనుచుఁ బ్రౌఢబలుకులు చెప్ప.
అండజేశ్వర! చూడ వయ్య, నావంటి
యధముని మూర్ఖుని ననవరతమ్ము
ప్రేమించుచున్నట్టి శ్రీరామచంద్రుఁ
బాసి యెవ్వరి నిఁక భజింయిపవలయు;
విజ్ఞానమూర్తివి విహగేశ! మోహ
మేరీతిఁ జెనకెడు నిఁక నిన్ను; నన్ను
ధన్యునిఁగావింప దయచేసి యిట్లు
శంకరశుక దేవసనకాదులకును
గడుఁబ్రీతియగు రామగాథ విన్పింపు

మనుచుఁ గోరితి, వంతకంటెను గలదె
సద్భాగ్య మింక? సంసారమునందు
గడియసేపో కాక కనుమూయునంత
సేపొ సత్సంగతిసేయుట దుర్ల
భమ్మాట; మనమునఁ బక్షీంద్ర! సుంత
యీరసి చూడుమీ, యీ రామభద్రు
సంఘులు గొలువఁగ నధికారి నొక్కొ?
తనవాఁ డనుచు నన్నుఁ దలపోసి ప్రీతి
సజ్జనసంగతి సమకూర్చి యిట్టు
లండజతతులయం దపవిత్రు నన్నుఁ
బ్రభుఁ డొనర్చెను జగత్పావనుగాఁగ;
నత్యంతహీనుని నతిధన్యుఁ జేసె;
నాబుద్ధికొలఁది సుంతయు దాచకుండఁ
జెప్పితినేగాని శ్రీరామగాథ
యత్యగాధమ్మగునట్టిసాగరము;
దాని గాధ మ్మెన్నఁ దరమె యెవ్వరికి?"
ననుచుఁ బల్కు భుశుండి యతులప్రతాపుఁ
డతులసమర్థుఁ డత్యంతబలుండు
నిగమసంతతి 'నేతి నేతి' యటంచు
వర్ణింప నొప్పెడు ప్రభుఁ డగునట్టి
శ్రీరాముగుణముల్ స్మరించి స్మరించి
పులకితుఁడై హర్షముం బట్టలేక,
"పక్షీంద్ర! శంకర బ్రహ్మేంద్ర
వందితచరణుఁడు ప్రభుఁడు రాఘవుఁడు
సాకేతనాథుఁడు సత్కృపఁ గనుట
భక్తవత్సలతకుఁ బరమచిహ్నమ్ము;
ఇట్టిస్వభావము నెందును గాన,
నెందు నాలింప, నిం కెవరిఁ దత్తుల్య
గాఁ దలపోసెద ఖగనాథ! చెపుమ!
సిద్ధులు కవు లుదాసీనులు కర్మ
విదులు సన్న్యాసులు వీరులు శూర
వరులు సాధకులు జీవన్ముక్త లమల

మతులు కోవిదులు ధర్మపరాయణులును
జ్ఞానుల్ తపస్వులు ఘను లెవ్వఁ డైనిఁ
సతము మాస్వామిని జానకీధవుని
సాకేతనాథు లక్ష్మణజాంబవంత
హనుమదంగదసేవితాంఘ్రిసరోజు
దశకంఠభంజకు దశరథతనయు
శరశరాసనధృతచారుహస్తాబ్జు
నఖిలగుణాధారు నమలచారిత్రుఁ
గల్యాణగాత్రునిఁ గంజాయతాక్షుఁ
గాలాబ్దసంకాశకాయుని వరదు
ధ్యేయమహోరస్కు నుత్తుంగభుజుని
శరణాగతత్రాణచణు నతిధీరు
భక్తజనావనుఁ బావననాముఁ
బ్రబలుఁ బ్రగల్భుని బ్రౌఢుఁ బ్రకృష్టు
నిర్గుణు నిరుపము నిజుని నిజేశు
నక్షరు నజితుని నాద్యు ననాది
నవిదితు ననఘు ననంతు నపారు
నప్రమేయు నఖండు నమలు నసీము
విశ్వ విశ్వాధికు విశ్వేశు విశ్వ
నాముని స్వామి ననాముని హరిని
దేవాధిదేవుని దీనమందారు
భవదావపావకవారిదపటలు
రఘువంశజలధిశారదికరాకాహి
మాంశునిఁ బ్రభుని లోకైకవిఖ్యాతుఁ
జందనశీతలుఁ జండమయూఖ
సంకాశదీప్తుఁ గౌసల్యాకుమారుఁ
బొగడక తరియింపఁబోలు నెవ్వనికి?
నా రామచంద్రునియంఘ్రిపద్మములఁ
జెందుత నా నమస్కృతు లహర్నిశము!
శరణొంది యెవ్వని సతతము ననుఁ
బోలు పాపాత్ములు పుణ్యులు శుద్ధు
లై విలసిల్లెద రా యవినాశి

యగు రామచంద్రున కంజలిసేతు;
భవరుగౌషధుఁ డతిభయదతాపత్ర
యాపహారకుఁడు దయాబ్ధి రాఘవుఁడు
సతము నామీఁదఁ బ్రసన్నుఁ డౌగాత"-
మనుచుభుశుండి మహాత్ముఁడు పలుక
నతనిసద్వాక్యమ్ము లాలించి రాము
నంఘ్రులమీఁదిప్రేమాతిశయమ్ము
పొడఁగని సందేహాముక్తుఁడై ప్రీతి
బక్తివల్లభుఁ డిట్లు పలికె: "మహాత్మ!
రామచరణభక్తిరసభరితమ్ము
లైన మీవాక్యము లాలించి మిగుల
గృతకృత్యుఁడైతిని; శ్రీరామచంద్ర
పదములపై నూత్నభక్తి యేర్పడియె;
మాయాభవమ్ములై మలయు నాపదలు
సకలము చనె; మోహసాగరమందు
మునిఁగెడు ననున్ను సముద్ధరించితిరి;
నాపాలిటికి నొక నౌకయై స్వామి!
యెంతటిసుఖ మిపు డిచ్చితిరయ్య!
ప్రత్యుపకార మెప్పగిది నొనర్తుఁ?
జరణాబ్జములకడ సాష్టాంగపడుదుఁ;
బూర్ణకాములు, కడుఁబూజ్యులు, రామ
భక్తులు, మిముఁబోలుభాగ్యవంతు లిఁక
నెవ్వరు? సాధులు వృక్షమహార్య
సరిదవనులవలె సకలహితమ్ము
సేయుచు వర్తింత్రు; చెచ్చెర కవులు
సాధులహృదయము జగతిని వెన్న
వంటి దటంచు నౌపమ్యరహస్య
మెఱుఁగక పలుకుదు రిల; వెన్న తాను
దప్తమై కరఁగును; దాపము పరుల
కైనచోఁ బరికించి యీ సాధుజనుల
హృదయము ద్రవియించు; నిది స్వభావమ్ము;
నా జీవనమ్ము జన్మమ్ము ధన్యతను
గాంచెను దత్కృపకతన, సందేహ
సంచయ మడఁగెను; సతతము మీఁదు
దాసుఁడ నని ననుఁ దలపఁగవలయు"-
ననుచు బ్రేమార్ద్రవాక్యములఁ బులకి
తాంగుఁడై యూడి కాకాధీశుచరణ
కంజమ్ములకు మ్రొక్కి కడువడిఁ దనదు
హృదయమందున గోసలేంద్రు నెక్కొలిపి
వైకుంఠమున కేఁగె బతగనాథుండు.

శ్రీరామచరితమానసము

ఉత్తరకాండము

నవమవిశ్రామము

కేశవ యతిరాట్ తిమ్మక
వీశస్తు త్యాంఘ్రియుగళ ! విమలప్రేమా
వేశా ! శాబరలక్ష్మీ
కైశిక సంస్కరణ హస్తకమల ! నృసింహా !

భక్తిప్రభావము

శాంభవీ! సత్సంగసమ మగు లాభ
మవనిని లే; దది హరికృపలేక
కలుగ దం చాడు నాగమపురాణమ్ము;
లీ నావచించిన యితిహాస మమల
మతిపావనము; విన్నయట్టివారలకు
భవపాశము నశించుఁ; బ్రణతకల్పుఁ డగు
ప్రభుపాదములమీఁద భక్తి జనించుఁ;
బాపసంచయములు పరిహృతమగును;
బహుకర్మసంయమవై రాగ్యదాన
జపతపోయోగయజ్ఞాచారవినయ
విద్యాదయాధర్మవిజ్ఞానతీర్థ
యాత్రావివేకదమాదిసాధనల
వలనిఫలము హరిపదభక్తి గాదె?
రామునికృపలేక రామునిపాద
రాజీవములభక్తి రా దను శ్రుతులు.
నమ్మి యీ గాథ సంతతము విన్నట్టి
యతఁ డశ్రమమ్మున హరిభక్తుఁ డగును;
రామదివ్యపదానురక్తుఁడౌ వాఁడె
సర్వజ్ఞుఁడు వివేకి జ్ఞాని పండితుఁడు
మహిమండనుఁడు జగన్మాన్యుఁడు దాని
కులదీపకుండు సద్గుణవిరాజితుఁడు
ధీమంతుఁడును రణధీరుఁడు సుకవి;
జాహ్నవిపారు దేశమ్ము ధన్యమ్ము;
పరమపతివ్రత వనిత తా ధన్య;
న్యాయరక్షకుఁడు భూనాథుఁడు ధన్యుఁ;
డాచారపరుఁడు బ్రాహ్మణుఁడు ధన్యుండు;
దాన మెసంగిన ధనము ధన్యమ్ము;
పుణ్యప్రవృత్తమౌబుద్ధి ధన్యమ్ము;
జానకీధవునిఁ గౌసల్యాకుమారు
జగదభివంద్యుని సాకేతపతిని
గొలుచునట్టిఁడుపుట్టుకులము ధన్యమ్ము;
దాశరథీ! మున్ను దాఁచితిఁ గాని
భవదీయమనమునఁ బఱఁగు ప్రేమాతి
శయమును గన్గొని సకలము రామ
కథ బుద్ధికొలదిఁ జక్కఁగఁ జెప్పినాఁడ;
హరికిని శరునకు హరిలీలవినఁగఁ
దలఁపనివానికి దంభికిఁ గ్రోధి
కథమునకును బాపి కా రామభద్రు
పదపంకజమ్ములు భజియింపనట్టి
యతనికిఁ బురుహూతునంతటియధికుఁ
డైశ్వర్యవంతుఁడే యైనగానిమ్ము
వెడఁగుగాఁ దలపోసి వినిపింపరాదు;

సాధుసంగతి పుది సతతము గోరు
నట్టివాఁడే విన నర్హుఁడు దీని;
గురుసేవకుఁడు నీతికోవిదుం డమలుఁ
డవనీసురార్చకుఁ డర్హుఁడు వినఁగఁ;
బ్రాణతుల్యమ్ముగా రాముఁ బ్రేమించు
వాని కీ కథ సుధాభాండము తలఁప;
రామచంద్రునిపాదరాజీవభక్తిఁ
గైవల్యపదమును గాంక్షించువాఁడు
ప్రేమతో నిక్కథాపీయూషధారఁ
గొని కర్ణపుటములఁ గ్రోలెడుఁగాత!
గల్మషప్రధ్వంసకమ్ము రమ్యమ్ము
రామునికథను బార్వతి! చెప్పినాఁడ;
సతతము భవరోగసంజీవని యని
వేదపురాణముల్ పేర్కొను దీని;
రఘునాథపదభక్తి ప్రాపింపఁ జేయు
నేడుసోపానము లీ మార్గమందుఁ;
బ్రభువరుకరుణకుఁ బాత్రుఁడౌ వాఁడె
యీ మార్గమునఁ బయనింపఁగఁజాలు;
కపటమ్ము మాని యిక్కథను గీర్తింప
నభిమతఫలముల నన్నిటిఁ బొందు;
నీ కథ చెప్పిన నీ కథ విన్న
నీ కథఁ బొగడిన నెవ్వఁడేగాని
యశ్రమమ్ముగను గవాంఘ్రిచందమున
నతిదుస్తరమ్ము భవాబ్ధిని దాఁటు;
ననినఁ బార్వతి హృదయమ్మునఁ బొంగి
"స్వామి! మీ కరుణ నా సంశయవితతి
నశియించెఁ, గోసలనాథపదాబ్జ
భక్తి జనించె, సర్వములు క్లేశములు
నశియించె, నో విశ్వనాథ! కృతార్థ
నైతి" నంచును బల్కి యంఘ్రుల కెరఁగె.
పార్వతీశంభుసంవాదము సకల
కల్యాణకారి సుఖప్రద మ్మమల
మతి పావనమ్ము భక్తానందకరము.
ఈ కలిఁగమున నిఁక యోగయజ్ఞ
జపతపోదానపూజాదులవలన
నేమిప్రయోజన మెసఁగును? భక్తి
శ్రీరామచంద్రు స్మరించినఁ జాలు;
శ్రీరాముగుణము కీర్తించినఁ జాలుఁ;
బతితపావనసుస్వభావుఁ డటంచు
సకలశాస్త్రమ్ములు స్వామిఁగీర్తించు,
వెడఁగుమానసమ! నీ విది విచారించి
త్యజియించి కుటిలత భవుని భజింపు;
రాముని గొలిచి పరమగతిఁ బొంద
నట్టివాఁ డెవ్వఁ డీ యవనీస్థలమున?
గణికయు వ్యాధుఁడు గజ మజామిళుఁడు
గృధ్రము శబరి తరించుట వినమె?
ఆభీరచండాలయవనకిరాత
ప్రభృతులౌ మిక్కిలి పాపులే యొక్కొ-
సారి యీ నామము జపియించి పరమ
పావనులై భరఁ బరగుదు; రట్టి
శ్రీరామునకు నమస్కృతులు గావింతు;
రఘుకులాలంకారు రామునిగాథ
విన్నఁ బొడినను జెప్పిన నశ్రమమునఁ
గల్మషమ్మును ద్రోచి కడపట రామ
పదసన్నిధానము వడయు జనుండు;
ఐదేడుద్వీపదల నతిభక్తి నెడఁద
ధరియించుచో నవిద్యాభవమ్ము లగు
నైదువికారముల్ హరియించుఁ బ్రభుఁడు;
కరుణాబ్ధి సుఖరాశి కామితదాత
నాకవందితుఁడు ననాథనాథుండు
రామావనీంద్రుఁ డీ ప్రభుఁడు కాకున్న
నట్ల హైతుకముగ నన్యహితమ్ము
గావించువాఁడు మోక్షమ్మిచ్చువాఁడు
వసుధయం దింక నెవ్వండు గలండు?

ఆతని దివ్యకటాక్షము వడసి
మందబుద్ధులును నమాయికులైన
యీ తులసీదాసుఁ డీ కిశోరుండు
పరమశాంతిని గాంచ బ్రభుఁ డెవ్వఁ డింక
నా రామచంద్రుని కంటె జగాన?
రఘుకులజలనిధిరాకాహిమాంశు!
జానకీనాథ! కౌసల్యాకుమార!
నాకంటె దీనుఁ డున్నాఁడె లోకమున?
దీనమందారుఁడు దేవాధిదేవ!
యెవ్వఁడు నీకంటె నింక వచింపు;
కావున నాపయిఁ గడుదయ నెఱపి
యీభీలభవదుఃఖ మయ్యా! హరింపు;
తరుణి కాముకునకు ధనము లోభికిని
బ్రియమైనగతి నాకుఁ బ్రియుఁడవు గమ్మ!
మున్ను దుర్గమమయి పొలుపొందునట్టి
మానసదివ్యరామాయణగాథ
రామభద్రునిపదరాజీనభక్తి
ప్రాప్తించుకొఱకయి పరమహర్షమున
సుకవీంద్రుఁడైన త్రిశులాయుధుండు
రచియించె; నా దివ్యరామాయణమ్మ
నంతరంగమ్మున నలరు చీకటులఁ
జెండ నెంచిన తులసీదాస సుకవి
తన భాషయందునఁ దగ విరచించె.

శ్రీరామచరిత మానస ఫలశ్రుతి

శ్రీరామచంద్రచరిత్రమానసము
పరమనిర్మలప్రేమవారిపూరితము;
పుణ్యస్వరూపము మోహనాశకము
భక్తిప్రదమ్మ్ము శుభంకర మమల
మఘహారకమ్మ్ము కల్యాణకారకము;
మాపును రేపు నీ మానసమందుఁ
జాలభక్తిని మున్ను జనుఁడు సంసార
చండమయూఖునిచండాంశుతతుల
వలన నొకింతయు జ్వలియింపఁబోఁడు.
ఇది గుణసాగరుఁ డీశపదాబ్జ
పుష్పంధయుండును బూజ్యపాదుండు
పరమవదాన్యుండు పాపభీరుండు
విమలయశోనిధి విశ్వకల్యాణ
కాంక్షి మహాత్ముఁ డంకంపల్లివాసి
పాటీలువంశాబ్ధిపార్వణవిధుఁడు
ధర్మస్వరూపుఁడు ధాతృతుల్యుండు
జగదభివంద్యుఁడు సజ్జనుఁడైన
గోవిందరెడ్డికిఁ గూరిమిసుతుఁడు
విశ్వనాథమహాకవీంద్రుల శిష్యుఁ
డైన తిమ్మారెడ్డి యాంధ్రీకరించు
కలిమలప్రధ్వంసకమ్మ్ము నిర్మలము
శ్రీరామచంద్రచరిత్రమానసము
నందున వెలయు నేడవది సోపాన
మిద్ది యుత్తరకాండ మిఁక సమాప్తమ్ము.
జయ మగుఁగాకఁ గౌసల్యాత్మజునకు!
జయ మగుఁగావుత జానకీపతికి!
మంగళమయునకు మంగళ మగుత!
మహనీయగుణునకు మంగళ మగుత!
స్వామి! లోకైకరక్షక! పాహి!పాహి!
శ్రీరఘునాథ! హరీ! త్రాహి! త్రాహి!

శ్లో॥ ఇదం శ్రీరామచరిత
మానసం తులసీ కృతమ్ ।
కృతమాంధ్రం గీయమానం
భుశుండి గిరిశాదిభిః॥

శ్లో॥ యదక్షర పదభ్రష్టం
మాత్రాహీనంతుయద్భవేత్ ।
తత్సర్వం క్షమ్యతాందేవ !
నారాయణ ! నమోస్తుతే॥

ఓం: తత్సత్

శ్రీ మట్టపల్లి లక్ష్మీ నృసింహ పరబ్రహ్మార్పణ మస్తు !

ఓమ్

శ్రీ హనుమత్ స్తవమండలమ్

[శ్రీ తులసీకృత హనుమాన్ చాలీసాకు ఆంధ్రానువాదము]

అను : శ్రీ కేశవతీర్థస్వామి

గీ. శ్రీగురుచరణ పద్మపరాగ కణము
మన్మనోముకురమును నిర్మల మొనర్ప-
ఫలచతుష్క ప్రదాయియై వెలుఁగు లీను
రఘుకులో త్తంసుకీర్తి వర్ణన మొనర్తు.

గీ. కాయ మొనఁగూడె నజ్ఞాన కారణమున-
అని గ్రహించి స్మరింతు నాయనిలతనయు;
ఆమహాత్ముఁడు నన్ దయ నరయుఁ గాక!-
బుద్ధిబలవిద్య లొసఁగి ప్రబుద్ధుఁజేసి
షడ్వికార బాధావళి సమయఁజేసి.

గేయం :

జయ జయ హనుమా! జ్ఞాననివేశా!
జయ జయ కపీశ! జగత్ప్రకాశా! ॥జయ॥

రామదూత! అతులితబలధామా!
అంజనాపుత్ర! పావని నామా! ॥జయ॥

మహావీరవిక్రమ! వజ్రాంగా!
దుర్జనవిభంగ! సజ్జనసంగా! ॥జయ॥

కాంచనవర్ణ విరాజిసువేషా!
కర్ణసుకుండల! కుంచితకేశా! ॥జయ॥

వజ్రధ్వజరాజితహస్తాబ్జా!
మౌంజీయజ్ఞోపవీతసుభుజా! ॥జయ॥

శంకరాంశభవ! కేసరితనయా!
తతతేజోబల! నతజగత్త్రయా! ॥జయ॥

విద్వన్మణి! సుగుణా! అతిచతురా!
రామకార్యనిర్వహణాత్యాతుర! ॥జయ॥

రామకథాశ్రవణైకరసజ్ఞా!
హృద్స్థితసీతారామలక్ష్మణా! ॥జయ॥

సూక్ష్మరూపమున సీతకు దోచవె,
వికటరూపమున లంక గాల్పవే! ॥జయ॥

భీష్మరూపమున దైత్యుల గూల్పవె
రామకార్యమును నిర్వహింపవే! ॥జయ॥

సంజీవనితో లక్ష్మణు మనుపవె
మోదితరామాలింగన మొందవె! ॥జయ॥

రఘుపతి నిను ఘనముగ గీర్తింపడె
సోదర భరతసమానుఁడ వనఁడే! ॥జయ॥

వేయినోళ్ళ నీ యశము బొడుచుచు
కొగిలించె నిను రాము డుబ్బుచున్ ॥జయ॥

యమకుబేర దిక్పాల కవీశుల్
శారద నారదముని భుజగేశుల్ ॥జయ॥

సనకాదిమునీశులు బ్రహ్మాదుల్
నీయశంబు బొడగ నసమర్థుల్ ॥జయ॥

సుగ్రీవున కుపకారము జేయవె
రాము గలిపి రాజ్యం బిప్పింపవె! ॥జయ॥

నీదగు హితోపదేశపు కలిమిన్
విభీషణుడు లంక నేలె నెలమిన్ ॥జయ॥

యుగసహస్రయోజనగతభానున్
లీల గొనవె ఫలమని యసమానున్ ॥జయ॥
నోట రామముద్రిక వెలుగొందన్
వనధిదాటి తనవింతను బొందక ॥జయ॥
ఎంతటిదుర్గమకార్యమె కానీ!
సుగమ మాను నీదయ, విజ్ఞానీ! ॥జయ॥
రామద్వారము గాచు మహాత్మా!
నీఆజ్ఞనుగొన కడుగిడ తరమా! ॥జయ॥
నిఖిలసుఖాల్ నిను శరణన గలుగున్
నిఖిలభయాల్ నిను కొలచిన తొలగున్ ॥జయ॥
నీప్రభ వెలుగొందును గనరాకన్
వణకు జగత్త్రయి విని నీకేకన ॥జయ॥
మహావీర! నీనామము వినుచో
భూతపిశాచాల్ చేరరా వహో! ॥జయ॥
వీరహనుమ! ని న్నెవడు జపించున్
వానిరోగపీడ లుపశమించున్ ॥జయ॥
త్రికరణముల నిను ధ్యానముసేయన్
నరుడు శాంతి గను బాధలు వాయన్ ॥జయ॥
రాజశిరోమణి రాముడు హనుమా!
ఆతనికింకరమణి వీవ సుమా ॥జయ॥
భక్తులయాప్తముల కనురీతిన్
ఫలముల నిత్తువు తృప్తిగ బ్రీతిన్ ॥జయ॥
నిఖిలయుగంబుల నీశౌర్యమునన్
జగతి సముజ్జ్వల మైనది లీలన్ ॥జయ॥
సాధుసజ్జనావనచణ! హనుమా!
అసురాంతక! రామప్రియధనమా! ॥జయ॥

అష్టసిద్ధినవనిధిప్రదునిగన
వర మిడె నీ కవనీసుత బాగన ॥జయ॥
రామనామదివ్యామృతకలశా!
రామచంద్రసద్భటలోకేశా! ॥జయ॥
నీ స్మరణము శ్రీరామప్రియమా!
నీ భజనము బహుభవభయహరమా ॥జయ॥
జనుడు తలంచిన నిను మదియందున్
అంత్యమందు రఘుపతిపురి జెందున్ ॥జయ॥
నిన్ను తదేకసమాహిత భక్తిన్
కొలచిన స్మార్తువు తరుగని ముక్తిన్ ॥జయ॥
మహావీరు స్మరియించిన మదిలో
సర్వకష్టములు విడు నీయిలలో ॥జయ॥
జైజైజై హనుమా! గురుదేవా!
కరుణింపుము కరుణామయభావా! ॥జయ॥
ఈ నుతి జదివిన శతవారంబుల్
ఘనసుఖ మొదవును, విడు బంధంబుల్ ॥జయ॥
ఈ హనుమత్ స్తవ మెవడు పఠించున్
శివసాక్షిగ హరికృప దా గాంచున ॥జయ॥
ఈ తులసీ నిరతము హరిదాసే!
నిలుపుము నాహృది నీ నిధ్యాసే ॥జయ॥
పవమానతనయ! సంకటహరణా!
మంగళస్వరూప! కృపాభరణా!
సీతాలక్ష్మణ రామయుతముగా
సర్వదేవతా జనసహితముగా
నాహృత్పద్మమున వసింపుమా!
జయ! హనుమా! హనుమా! జయ! హనుమా!

శ్రీ హనుమత్ స్తవమండలమ్ సంపూర్ణమ్.



నీ రా జ న ము

శ్రీ కేశవతీర్థ కృతము

ఛందస్సు : సుగంధివృత్తము

శ్రీనివాస! వాసుదేవ! శేషశాయి! కేశవా!
మౌనిమానసాలయా! రమాప్రియా! దయామయా!
దానవాంతకా! ముకుంద! ధర్మరక్షణక్షమా!
శ్రీనృసింహ! మట్టపల్లిక్షేత్రవాస! మంగళమ్!

దంభదైత్యరాడ్గదాయుధప్రఘట్టితోన్నత
స్తంభసంభవప్రచండశౌర్యవహ్నివిగ్రహా!
కుంభినీభయాపహా! అకుంఠవజ్రదంష్ట్ర! వి
శ్వంభరా! నృసింహ! మట్టపల్లివాస! మంగళమ్!

క్రూర ఘోరదైత్యగర్భగోళభేదనాగ్రహా!
ధీరదైత్యబాలపాల! దీనలోకవత్సలా!
నీరజాక్ష! నీలవర్ణ! నిత్య! నిర్వికార! దు
ర్వార! నారసింహ! మట్టపల్లివాస! మంగళమ్!

నారదాదిగీయమాననామకోటిదీపితా!
నీరజాసనాదిచిత్తనీరజాసనా! పితా!
సారసాక్ష! భక్తసుప్రసన్నమంగళాకృతీ!
నారసింహ! మట్టపల్లినాథ! శౌరి! మంగళమ్!

ఆదిదేవ! మాధవా! శ్రియఃపతీ! జనార్దనా!
వేదవేద్య! విప్రవంద్య! విశ్వబాంధవా! హరీ!
వేదపర్వతాగ్రధామ! వీర! భీషణా! కృపో
న్మాద! మట్టపల్లివాస! నారసింహ! మంగళమ్!

ఒక్కచేత శంఖమున్, మఱొక్కచేత జక్రమున్,
ఒక్కచేతిలో గదన్, మఱొక్కచేత బద్మమున్,
జక్కదాల్చియు న్గృహన్ బ్రశాంతరీతి వెల్గు మా
చక్కనయ్య! మట్టపల్లిస్వామి! నిత్యమంగళమ్!

ఓం తత్ సత్

శ్రీ మట్టపల్లి లక్ష్మీనృసింహ పరబ్రహ్మార్పణమస్తు!

శ్రీ రా మ చ రి త మా న స ము

స వ ర ణ లు

పీ ఠి కా దు లు

పేజీ	వరుస	పంక్తి	తప్పు	ఒప్పు
6	1	22	అరాంగి	అర్ధాంగి
11	1	10	ఖేద	భేద
32	2	29	యేనా	యేన
33	1	3	సామ్రాట్	సమ్రాట్
36	1	21	విభుద్ధ	విశుద్ధ
42	1	10	జిత్తబు	జిత్తంబు
42	2	9	తిరి	తురి
48	1	21	అ	ఆ
56	2	12	శ్రి	(శ్రీ)
82	2	4	మందిర	మందిరము
88	2	2	వార్థ	వార్ధి
96	2	25	రామపద్మ	రామపదపద్మ

బా ల కాం డ ము

48	1	31	వృత్తాతంబు	వృత్తాంతంబు
74	2	17	శిర్షండై	శీర్షండై
81	1	33	పెంపర	పెంపార
89	2	23	పాదాంభోజా	పదాంభోజా
94	1	26	ప్రియిసఖీ	ప్రియసఖీ
97	1	9	వివిథ	వివిధ
,,	2	8	నీపు	నీవు
98	2	20	క్రోణీద్ర	క్రోణీంద్ర
130	1	20	నఖాంథ్య	నఖాథ్య
139	1	10	బొనర్బు	బొనర్చు
141	2	7	ద్రాతపు	ద్రాతవు
149	1	32	మెందుచు	మొందుచు

పేజీ	వరుస	పంక్తి	తప్పు	ఒప్పు
151	1	15	గైకొవి	గైకొని
,,	1	25	చెసెడి	చేసెడి
,,	1	27	గముదముల్	గుముదముల్
164	1	8	సలిపి లెలరును	సలిపి రెలరును
174	1	3	వృక్షొపదుత	వృక్షొపధుత
184	1	29	యమత	యమిత
,,	2	4	మహా	మహీ
190	2	16	విభు	"విభు !
191	1	17	గానరాక	గనరాక
,,	2	10	అనృపు	ఆనృపు
195	2	19	ననాన్మన	సన్మాన
208	2	23	వుత్రికల	పుత్రికల
217	2	3	దశరథేఁడొసంగ	దశరథేశుఁ డొసంగ
218	1	29	కాపాడ	కాపాడె,
,,	2	32	నిశీధంబు	నిశీథంబు

అ యో ధ్యా కా ం డ ము

229	1	13	శ్రద్ధ	శ్రద్ధ
245	2	18	కుతారవి	కుతారివి
250	1	10	మ్పదు	మృదు
269	2	12	లక్షణులు	లక్ష్మణులు
271	1	14	గమనమువకు	గమనమునకు
292	1	6	జానకి	జానకీ
300	2	17	నెగెగెడు	నెసగెడు
313	2	23	వారాసి	వారాశి
314	2	14	పిత్మహృచేతకా	పిత్మహృచ్చేతకా
319	2	11	కుళ	కుల
326	2	25	విశ్వసింపుడు	విశ్వసింపుడు
329	1	7	శ్రీహరి	శ్రీవారి
332	2	17	పోయినా	పోయివా
333	పాదసూచిక 3వ పంక్తిలో		సిగ్రార్	సింగ్రార్

పేజీ	వరుస	పంక్తి	తప్పు	ఒప్పు
333	పాదసూచిక 4వ పంక్తిలో		నవ్యకృత	నవ్యాకృత
339	1	28	కతఁడు	కాతఁడు
339	2	25	నెంచెను	బెంచెను
340	1	22	చిత్తములు	చిత్తమును
341	2	3	పద్మముంబుల	పద్మంబుల
344	1	26	గాఁట	దాఁట
344	2	25	వర్ష్య	మర్ష్య
349	2	31	వారి	వారిధి
352	1	6	వార్థి	వారిధి
359	2	11	గరుఁడ!	గరుడ!
360	పాదసూచిక 1వ పంక్తి		చిలకల	చిలుకల
362	2	25	దద్వార	దద్వర
372	2వ పాదసూచికలో	5 పం.	తపశ్శక్తి	తపశ్శక్తి
375	2	29	గుపితుఁడౌఁటను	గుపితుఁడౌఁటను
376	1	26	మగాథ	మగాధ
393	2	12	చింతించెఁ	వచించెఁ
398	1	30	సాథు	సాధు
400	2	33	ధనదరా	ధనధరా
403	2	20	యగాథ	యగాధ
406	1	17	సర్వజ్ఞుడపు	సర్వజ్ఞుఁడవు
413	2	17	జనార్థనా!	జనార్దనా!

ఆరణ్యకాండము

433	2	17	అతిభయంకరముతో	అతిభయంకరములా
437	2	6	వధఁజేసిఁద్రుటిని	వధఁజేసెద్రుటిని
438	2	8	కుత్తుకంబంటి	కుత్తుకబంటి
441	2	17	మొంద	మొందె
442	1	30	యెక్కడి	యెక్కడి
448	1	19	ఘనతరాగాథ	ఘనతరాగాధ
452	2	15	పద్మము	పద్మమ్ము
455	2	8	కడుగజ	కడుఘన

కిష్కింధాకాండము

484	2	29	దోడడ్పు	దోడ్పడు

సుందరకాండము

పేజీ	వరుస	పంక్తి	తప్పు	ఒప్పు
510	1	7	లాజ్య	రాజ్య
518	1	29	మూషకమ్మున	మూషరమ్మున
518	1	26	క్రోథి	క్రోధి

లంకాకాండము

533	2	33	నివ్వి	నవ్వి
546	2	5	డిక్క	డిఁక్క
550	1	17	పవవ	పవన
555	2	2	ఘూరంటకృతి	ఘూరటంకృతి
559	1	12	నిఁక	నింక
560	2	2	కుద్ధులై	క్రుద్ధులై
568	1	25	ప్పుసై	సెప్పు
580	2	9	వులకితా	పులకితా
584	2	22	బ్రతిష్టించి	బ్రతిష్ఠించి

ఉత్తరకాండము

591	2	27	తరంగణి	తరంగిణి
595	1	21	దనుపమ	డనుపమ
600	2	18	నిచట	నిచ్చట
603	2	29	వీథీయందు	వీథియందు
609	1	25	ప్రాప్తి	ప్రాప్తి
,,	1	29	ద్దైవమ్మున్మిూఁదను	ద్దైవమ్మున్మిూఁద
611	1	28	గురుత్వమొ	గురుత్వమొన్మ
612	1	11	పరికింవఁ	పరికింపఁ
619	1	3	పనువున	పనుపునఁ
623	2	26	విస్వస్త	విన్వస్త
632	1	12	తలంవున	తలంపున
641	2	12	బ్రహ్మోపనా	బ్రిహ్మోపాసనా
645	2	2	భవభేదముల	భవఖేదముల
648	2	28	యెవ్వనిహృదయం	యెవ్వనిహృనయమం

ఓం

జయ జయ శ్రీనారసింహ

ప్రస్తుతము లభించు శ్రీరామతీర్థసేవాశ్రమ ప్రచురణలు :

మీ జన్మహేతుకమైన బ్రహ్మానందశ్రీని అనుభవించుటకు ఈ దివ్యగ్రంథములను పఠించండి.

1. వేదాంతదర్శనము (శ్రీరామతీర్థస్వామివారు అమెరికా దేశమున ప్రసాదించిన మహోపన్యాసములు)	2-50
2. మతము (శ్రీరామతీర్థస్వామివారు ప్రాచ్యపాశ్చాత్య ఖండములం దిచ్చిన మహోపన్యాసములు)	2-00
3. శ్రీరామతీర్థజీవితోపదేశములు (శ్రీకేశవతీర్థస్వామివారి రచన- 500 పేజీలు ఫుల్ క్యాలికోబైండు)	5-00
4. గీతాదర్శనము (భగవద్గీతనుగూర్చిన శ్రీరామతీర్థ ముఖ్యశిష్యులగు శ్రీనారాయణపరమహంసలవారి విపులాద్భుత వివేచనము) ఫుల్ క్యాలికోబైండు 600 పేజీలు	5-00
5. భక్తియోగము (శ్రీరామతీర్థస్వామికృతము)	1-50
6. తులసీదాసకృత శ్రీరామచరితమానసము (బాలకాండ, శ్రీకేశవతీర్థస్వామివారిచే మూలమునకు సరియైన ఆంధ్రానువాదము - ద్విపదకావ్యము)	5-00
7. భక్త నరసింహమెహతా జీవితకథ	1-50
8. భక్త పోతనామాత్య (హరికథ)	0-50
9. భక్త కన్నప్ప (హరికథ)	0-50
10. భక్త ప్రహ్లాదవిజయము (బుట్టకథ)	0-50
11. హరిజనజ్యోతి భక్త నందనార్ (బుట్టకథ)	0-50
12. ధ్రువవిజయము (బుట్టకథ)	0-50
13. శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రము (శ్రీశంకరభాష్యానువాద సమేతము)	2-00
14. నారద భక్తిసూత్రములు (ప్రేమదర్శనము) శ్రీహనుమాన్ ప్రసాద్ పోద్దార్ గారి హిందీ వ్యాఖ్యానమునకు చక్కని ఆంధ్రానువాదము	2-50
15. భగవన్నామ సంకీర్తనము	1-00
16. మనస్సునుజయించు మార్గములు	0-50
17. గోమాహాత్మ్యము	0-25

పాకెట్‌సైజు అమూల్యగ్రంథాలు

18. శ్రీశంకరాచార్య సదుపదేశాలు	0-50
19. శ్రీమద్రామాయణోపదేశాలు	0-25
20. రామగీత (శ్రీరామతీర్థ పరవశ వేదాంతగీతాలు)	1-25
21. శ్రీనృసింహోపాసనం (స్తోత్రం)	0-25
22. భోళాలింగ శతకం	0-25
23. రామానుజదర్శనం	0-75

24. మహాత్ముని మాటలు (గాంధీజీ సూక్తులు)	0-75
25. శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రమ్	0-15
26. శ్రీ హనుమ స్తవ మండలమ్	0-20
27. Thus Spake Rama Tirtha (Pocket size, English Boko, very beautiful edition)	0-87

చిత్రపటములు

1.	శ్రీరామతీర్థస్వామివారి చిన్నసైజు సాదాఫోటోలు (3 రకాలు)		0-25
2.	,,	,, త్రివర్ణచిత్రము (చిన్నది)	0-25
3.	,,	,, త్రివర్ణచిత్రము 7″ × 10″ (పెద్దది)	0-50
4.	,,	,, తలవంకుగల సాదాఫోటో	0-13
5.	శ్రీమట్టపల్లి నరసింహస్వామివారి సాదాఫోటో		0-06
6.	శ్రీకేశవతీర్థస్వామివారి ఫోటో		0-06

[కేవలము ఫోటోలు డజనుకు తక్కువ వి. పి. గా పంపబడవు. ఏసైజుఅయిన ఆసైజు డజను ఆర్డరీయవలెను.]

"రామదర్శనం" ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇది శ్రీరామతీర్థ సేవాశ్రమ స్థాపకాధ్యక్షులు - సర్వతంత్ర స్వతంత్రాధిపతులగు పూజ్యశ్రీ పరమహంస పరివ్రాజకాచార్య కేశవతీర్థస్వాములవారి సంపాదకత్వమున 14 సంవత్సరములనుండి అనుష్ఠానవేదాంతసందేశ ప్రసారార్థము నడుపబడుచున్న ఆధ్యాత్మిక మాసపత్రిక. సంవత్సరచందా రు 3-00 లు మాత్రమే. ప్రతి సం॥ జనవరి నెల పత్రిక ప్రారంభం. సం॥లో ఎప్పుడు చందాదారులుగా చేరినా ఆ సంవత్సరము జనవరినుంచి సంచికలు పంపబడును. తగుగైన సంచికలకు సంచిక 1 కి రు 0-25 న. పై. తగ్గింపబడును. యం. ఓ. ఫారములో తమ అడ్రసు వివరముగా తెలుపవలెను. ప్రతినెల 1వ తేదీ ఈపత్రిక వెలువడును. వి. పి పద్ధతి లేదు. చందా ముందుగాపంపవలెను.

ముఖ్య గమనిక :- (1) పై వెలలో పోస్టేజీ చేరలేదు. పోస్టేజీ మొదలైనవి ప్రత్యేకం. (2) రు 2 లకు లోపు వెలగలపుస్తకాలు వి. పి. గా పంపబడవు. వాని ఖరీదుతోపాటు తగు తపాలాబిళ్ళలు పంపవలెను. (3) ఉత్తర ప్రత్యుత్తరములకు తగు తపాలాబిళ్ళలు పంపవలెను. (4) రు 10 లకు మించిన ఆర్డర్లకు తప్పక ముందుగా పుస్తకముల వెలవరకు అడ్వాన్సుగా యం. ఓ. చేయవలెను. (5) రైల్వేపార్శిలుగా పంపగోరువారు ఆవిషయము సూచిస్తూ, తమ రైల్వేస్టేషను అడ్రసు, వివరములు తప్పక తెలుపవలెను. (6) తమపేరు, అడ్రసు సంపూర్ణవివరములతో పెద్ద అక్షరములతో వ్రాయవలెను. (7) వి. పి. లు సకాలమున తీసికొనవలెను.

తగ్గింపురేట్లు :- రు 25 నుండి రు 50ల వరకుగల ఆర్డరులను 12½%, రు 51 నుండి రు 100ల వరకు రు 25%, రు 100 ను మించిన ఆర్డరులకు 33⅓% తగ్గింపు యివ్వబడును.

గమనిక :- శ్రీరామతీర్థ సంపూర్ణవేదాంతసారస్వతము 8 భాగములు. శ్రీరామతీర్థ సంపూర్ణజీవితము Thus Spake Sankara మొదలైన ఆశ్రమ పూర్వప్రచురణములన్నియు పునర్ముద్రణ చేయు ప్రయత్నములు జరుగుచున్నవి. త్వరలో వెలువడగలవు.

కార్యదర్శి, శ్రీరామతీర్థ సేవాశ్రమం,
పిడుగురాల (పోస్టు), గుంటూరుజిల్లా, ఆంధ్రప్రదేశ్.

The English books listed below, now available in Sri Rama Tirtha Sevashrama

1.	The complete works of Swami Rama Tirtha "In woods of God-Realization" (The complete set of 10 volumes)	22–00
2.	,. ,, Library Edition in 3 Volumes.	24–00
3.	Rama Tirtha : His Life and Legacy by Sri Brijnath Sharga	6–00
4.	The story of Swami Rama Tirtha by Sri Puran Singh	5–00
5.	Practical Vedanta of Swami Rama Tirtha	1–00
6.	Parables of Rama Tirtha	4–00
7.	Various Aspects of Rama Tirtha	1–00
8.	Heart of Rama Tirtha (Pocket size)	1–00
9.	Poems of Rama Tirtha	1–00
10.	Thus spake Rama Tirtha (Pocket Size)	0–87
11.	Swami Rama's Religion	0–19

(Hindi works of Swami Rama Tirtha also are available)

PHOTOS OF SWAMI RAMA TIRTHA.

1.	Small size of ordinary Photos 3 kinds	4 As.
2.	Small size Tri-coloured, each	4 As.
3.	Big size Tri-coloured (7″ × 10″) each	8 As.
4.	Bust Photo - Ordinary	2 As.
5.	Photo of Sri Swami Kesava Tirtha	1 As.
6.	Photo of Sri Mattapalli Narasimha swami	1 As.

[If for photos only - orders must be placed not for less than 12 photos at a time. Orders must be separate for small and big sizes.]

NOTE :– Postage or Railway charges etc. extra for all the above. Please write your complete address clearly in block letters. For the orders as Railway parcles please write the nearest Railway Station. Postage stamps must be sent for all communications. Soliciting you to accept the V. P. deliveries in time. Books worth less than Rs. 2/– will not be sent by V.P.P. For the orders above Rs. 10/– the cost of the books must be sent by M. O. in advance. Discount Rates - Rs. 25 to Rs. 50 — 6¼%, Rs. 51 to 100 - 12½%, For all the orders above Rs. 100 – 25%.

SECRETARY : SRI RAMA TIRTHA SEVASHRAM
Piduguralla [P. O.] Guntur Dt. Andhra, S. India.

b

BCL

AQUACOLB149



ক্রমিক নম্বর	AOUA104B149
রেজিস্ট্রেশন নম্বর	ইসলামিক ইউনিভার্সিটি
পরীক্ষা	31 December 2025
বিষয় কোড	৭৫৪
বিষয়	807
তারিখ	৩১/১২/২০২৫
সময়	১২:৩০ থেকে ২:৩০
পূর্ণমান	৭৫
প্রাপ্ত নম্বর	৩৮
পরীক্ষকের স্বাক্ষর	SARANYA
পরীক্ষকের নাম	
মন্তব্য	